తెలుగు భాషాపరిణామాన్ని స్వరూపదృష్టితోను, ప్రయోగదృష్టితోను పరిశీలించవచ్చు. స్వరూపదృష్టి అంటే ఈనాడు మనం వాడే భాష పూర్వయుగాల్లో ఎలా ఉండేదో, ఏయే మార్పుల వల్ల నేటి తెలుగు ఏర్పడ్డదో గుర్తించటం. ప్రయోగదృష్టి అంటే తెలుగువాడుక ఏయే రంగాల్లో మొదటి నుంచి వర్ధిల్లిందో చారిత్రకంగా పరిశీలించటం.

తెలుగు భాషాపరిణామం - స్వరూపదృష్టి

ఈ దృష్టితో తెలుగుభాషాచరిత్రలో నాలుగు దశలు గుర్తించవచ్చు. (1) క్రీ.పూ. 200 - క్రీ.శ. 500, (2) క్రీ.శ. 500 - 1100, (3) క్రీ.శ. 1100 - 1400, (4) క్రీ.శ. 1400 - 1900. మొదటిదశలో ప్రాకృత సంస్కృత శాసనాల్లో తెలుగు ఊళ్ళ పేర్లు, వ్యక్తుల పేర్లు మాత్రమే కన్పిస్తాయి. 6వ శతాబ్దికి చెందిన తొలి తెలుగుశాసనం కడప జిల్లాలో దొరికింది. అప్పటికే ప్రాకృత, సంస్కృతాల ప్రభావం, బౌద్ధజైన మతాల ప్రభావం తెలుగు మీద ప్రసరించింది. బహుశా క్రీ.శ. 5, 6 శతాబ్దుల కాలంలోనే పండితుల వ్యవహారం ఆధారంగా తెలుగులో సాహిత్యభాష ఏర్పడి ఉంటుంది. నన్నయ్యకు పూర్వశాసనాల్లో (కందుకూరు, కొఱవి, అద్దంకి శాసనాల్లో) కావ్యభాషా శైలి కన్పిస్తుంది. నన్నయ కాలానికే కావ్యభాష వాడుకభాషకు దూరమవుతున్నట్లు నాటి శాసనాల్లో ఉన్న ఇస్తిమి, ఏంభయ్ వంటి రూపాల్ని బట్టి తెలుసుకోవచ్చు. ఈనాడు మనం ఆధునికం అనుకొనే భాషకు పరిణామబీజాలు 11-14 శతాబ్దుల మధ్యనే ఏర్పడ్డాయి. వస్తాడు, తెస్తాడు అనే రూపాలు 13వ శతాబ్దిలోనే వాడుకలో ఉన్నట్లు కేతన పద్యం వల్ల తెలుస్తుంది. క్రావళ్ళు క్రమంగా 13వ శతాబ్దికే పోయి క్రొత్త, ప్రాత అనే శబ్దాలకు కొత్త, పాత అన్న రూపాలు ఏర్పడ్డాయి. రక్తము, వనము మొదలైన వాటిని రక్తం, వనం అనటం శాసన భాషలో 11, 12 శతాబ్దుల్లోనే కనిపిస్తుంది. అందువల్లనే బహువచనంలో కరణములు, కుంచములు మొదలైనవి కరణాలు, కుంచాలుగా మారాయి. సంస్కృత ఋకారాన్ని ఆనాటి ప్రజలు రు/రిగా ఉచ్చరించే వారు. ఇరవయ్, ముప్పయ్, నలభయ్, తొంభయ్- ఈ రూపంలో సంఖ్యావాచకాలు 11, 14 శతాబ్దుల మధ్యకాలంలోనే వాడుకలో ఉండేవి. ఇచ్చినవాడు, వచ్చినవాడు మొదలైనవి ఇచ్చినాడు, వచ్చినాడుగా మారాయి. వచ్చెడును, వచ్చెదరు వంటి వర్తమానభవిష్యద్రూపాలు వచ్చేను, వచ్చేరుగా ఈ కాలంలో మారినట్టు శాసనాల్ని బట్టి, అన్నమాచార్యుల కీర్తనల భాషను బట్టి తెలుస్తుంది. 14వ శతాబ్ది తర్వాత వచ్చినాడు సమాపకక్రియ అయింది. వచ్చేది, చేసేది, వస్తూ, పాలిస్తూ

మొదలైన రూపాలు 16, 17 శతాబ్దుల్లో రూఢమైనాయి. చేసికొను చేసుకగా మారింది. రాయలసీమలో వస్తా, చేస్తా అని, కోస్తా జిల్లాల్లో వస్తూ, చేస్తూ అని మాండలిక భేదాలు 17వ శతాబ్దికే ఏర్పడ్డాయి. దీర్ఘం మీద సున్నకు ఉచ్చారణ పోయి వాఁడు, తోఁట అని రాసే శబ్దాలను వాడు, తోటగా ఉచ్చరించేవారు. చేస్తున్నారు వంటివి 17వ శతాబ్దికి బాగా వ్యాప్తిలోకి వచ్చాయి. చేసినాడుకు వ్యతిరేక రూపంగా చేయలేదు వంటి రూపం క్రీ.శ. 1600 నాటికే ఏర్పడింది. చూద్దాం, వెదకుదాం వంటి క్రియలు, నుంచి విభక్తి, అలాగు, ఈలాగు, చాలా వంటి అవ్యయాలు 16, 17 శతాబ్దుల్లో వచ్చిన కావ్యాల్లో కూడా కొల్లలుగా కన్పిస్తాయి.

తెలుగు భాషాపరిణామం - ప్రయోగదృష్టి

19వ శతాబ్దిలో అచ్చు యంత్రం, ఆంగ్ల విద్యావిధానం వచ్చేదాకా తెలుగు వాడుక నాలుగు రంగాల్లోనే ఉండేది. అవి: (1) కావ్యసాహిత్యం, (2) శాసనరచన, (3) జానపదసాహిత్యం, (4) సామాన్యజనవ్యవహారం.

సామాన్యజనవ్యవహారమే శాసనభాషకు, జానపదసాహిత్యానికి ఆధారం. కవిత్రయం వారి వాడుక కావ్య సాహిత్యానికి ఒరవడై కావ్యభాష ప్రజల భాషకు దూరమవుతూ వచ్చింది. 16వ శతాబ్ది దాకా వచ్చిన కావ్య సాహిత్యంలో వ్యవహారభాషాప్రభావం తక్కువగా కన్పిస్తుంది. జన సామాన్యానికి ఉద్దేశించిన సాహిత్యప్రక్రియల్లో వాడుకభాష ఎక్కువగా చొరవ చేసుకొన్నట్టు 12వ శతాబ్ది నుంచి తెలుస్తున్నది. తిక్కన వచ్చినాడు, చేసినాడు వంటి రూపాల్ని ప్రయోగించాడు. శివకవులు వైరి సమాసాల్ని ధారాళంగా వాడారు. శ్రీనాథుడికన్నా పోతనలో కావ్యభాషాలక్షణానికి సరిపడని ప్రయోగాలు ఎక్కువగా కన్పిస్తాయి. అన్నమాచార్యుల కీర్తనలు, యక్షగానాలు, క్షేత్రయ్య, త్యాగరాజుల భక్తిగీతాల్లోనూ, 16వ శతాబ్ది తర్వాత రాసిన ప్రబంధాల్లోనూ నాటి వాడుకభాష కావ్యభాషలో మరింతగా కలిసి నట్టు తెలుస్తుంది. 19వ శతాబ్దిదాకా వచనసాహిత్యం తెలుగులో పెరగ లేదు. విజయనగరకాలం నుంచి తయారైన కైఫీయత్తులు, స్థలచరిత్రల్లో మాత్రం వచనరచన కనిపిస్తుంది. రాయవాచకం, అనంతపురచరిత్రలను బట్టి 16వ శతాబ్ది శిష్టభాషావ్యవహారం మనకు తెలుస్తుంది. 1850కి ముందు వచ్చిన పాఠ్యగ్రంథాల రచన శిష్టభాషలోనే ఉండేది. పాఠ్యపఠనాల్లో వాడుక భాషే ఉన్నట్లు బాలసరస్వతీయం మొదలైన వ్యాకరణాలకు రాసిన వ్యాఖ్యానాల వల్ల తెలుస్తుంది. ఆంగ్ల పాలన విధానం పాతుకొని, ఆంగ్ల విద్యావిధానం అమల్లోకి వచ్చింతర్వాత కూడా అన్ని రకాల ఉత్తరప్రత్యుత్త రాలూ తెలుగులోనే జరిగేవి. ఆనాడు తెలుగు అధికారభాషగా ఉండేదని గుర్తించవచ్చు. ఆంగ్ల పరిపాలకులకు కూడా తెలుగు నేర్చుకోవాల్సి వచ్చేది. ఆంగ్లోద్యోగులు తెలుగు నేర్చుకోవటానికి విలియం బ్రౌన్, కాంప్‌బెల్, సి.పి. బ్రౌన్ మొదలైనవాళ్ళు తెలుగుభాషకు వ్యాకరణాలు, కోశాలు రాశారు. 1862లో ఒక తహశీల్దారు జిల్లా కలెక్టరుగారికి రాసిన ఉత్తరం నకలు ఈ కింద మచ్చుకు ఇస్తున్నాను. తెలుగువాక్యాల్లో అన్యదేశ్యాలు కలిసిన ద్విభాషా శైలి ఇందులో కన్పిస్తుంది.

కడప జిల్లా... కలెక్టరు మేష్టరు మక్వే దొరగారి సముఖానకు బద్దెవోలు తాలుకా తహిశ్శీలుదారు కొప్పరపు వెంకటక్రిష్ణయ్య వ్రాసుకొన్న అర్జి.

గడిచిన ఫిబ్రవరి నెల తేది 24 దిన సాదరు చేయించిన నెం. 24 రు ముకుములో గొడ్డవీడు గ్రామానకు సాలు గుజిస్తాలో 4-0-0 ప్రకారం పన్ను అచ్చుతూ ఉన్న కొందరి ఇనాములకు మిక్కిలి హీనంగా వక రూపాయి వంతు లైసెన్‌సు ట్యాకుసు పన్ను దాఖలు చేయడముకు కారణం వుండ్డదు గన్క తిరిగి విమర్శలో తెచ్చి తెలపవలశినదిగా నమూదు వున్నది. మవుతజే మజుకూరు పయిసలాతి కాలమందు యీ వయినముల సంగతి బాగా విచారించి కేవలం బీదస్తితిలో వున్నట్టు తెలియబడినందుకు వక రూపాయి ప్రకారం శిఫారసు చేశినాను. రెండు రూపాయల కంటె యెక్కువ చెల్లించడముకు యంత మాత్రం అర్హులు కారు. గుగ్గిళ్ళు అమ్ముకోవడమే జీవనంగా గల అయిదుగురికి రెండు రూపాయల వంత్తున దాఖల్ చెయ్యవలశినదిగా ఇప్పుడు శిఫారసు చేస్తూ ఆ గ్రామ లెక్కలను యిందుతో పంపించ్చినాను. గనుక చిత్తగించి మంజూరు పుర్మాయించవలెను.

యిదిగాక యిప్పుడు మూడు గ్రామాల లైసన్‌సు ట్యాక్సు లెఖ్ఖలు పెహరీస్తు ప్రకారం - యిందువల్ల పంపించుకున్నాను. చిత్తగించి మంజూరు వుత్తర్వు దయ చేయించవలెనని కోరుతున్నాను. యింత్తటితో తాలుకా యావత్తు గ్రామాల పయిమాయిషి వారి ఝూడా అయినది. యిది మంజూరు అయి వాపసు వచ్చిన వెంటనే బేరీజు లెఖ్ఖలు పంపించు కొంటున్నాను.

తమ విధేయుడు

౧౮౬౨ సంవత్సరం *కొ. వెంకటక్రిష్ణయ్య*

ది. ౧౬ మార్చి *తహశ్శీలుదారు*

(T.G.M. Lane, *A Collection of Official Documents in the Telugu Language,* పుటలు 126-128, Madras, 1868)

1853లో చిన్నయసూరి రాసిన నీతిచంద్రిక, 1858లో బాల వ్యాకరణం అచ్చయినాయి. వీటివల్ల కావ్యభాషావ్యాకరణాన్ని వచనభాషకు కూడా ప్రవర్తింపజేయాలనే సాంప్రదాయిక పండితులకు గట్టి మద్దతు గలిగింది. పండితులు తాము మాట్లాడే భాషనే భ్రష్టం, గ్రామ్యం అని నిరసించారు. అది పుస్తకాల్లో రాయగూడదన్నారు. ఆధునిక విజ్ఞాన వ్యాప్తి సమకాలీన ప్రజల భాషలోనే తప్ప ప్రాచీన కావ్యభాషలో సాధ్యం కాదని గురజాడ, గిడుగులు వ్యావహారిక భాషోద్యమానికి పట్టుగొమ్మలైనారు. గ్రాంథిక వ్యావహారిక వాదాలు 1909లో మొదలై 1915తో ముగిశాయి. విద్యావిధానంలో గ్రాంథికమే నిల్చింది. ఆ తర్వాత 25 ఏళ్ళకు, అంటే 1940 మొదలు ఆధునిక భాషకు వార్తాపత్రికలవల్ల, మేధావులైన రచయితల రచనలవల్ల పెద్దపెట్టున ప్రాపకం వచ్చింది. తెలుగులో సహజమైన వచన రచనాశైలి చిన్నయసూరి అనుయాయుల ప్రభావం నుంచి బయట పడటానికి 90 ఏళ్ళు పట్టింది. జరిగిన 60, 70 ఏళ్ళుగా వ్యాపించిన వచన సాహిత్యం - (నవల, కథానిక, వ్యాసం, ఏకాంకిక), రేడియో, సినిమాలు, వార్తా పత్రికలు - వీటి మూలంగా మాండలికాలకు అతీతమైన ఆధునిక భాష ప్రామాణికమైంది. ప్రభుత్వంవారు, విశ్వవిద్యాలయాలు, నిర్ణయించే పుస్తకాలలోనే కావ్యభాష సరళ గ్రాంథిక రూపంలో నిల్చిపోయింది.

1964లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారి యాజమాన్యాన తిరుపతిలో ఒక గోష్ఠి జరిగింది. అక్కడ మాతృభాషేతర పాఠ్యపుస్తకాలన్నీ ఆధునిక భాషలోనే ఉండాలని నిర్ణయించారు. ఈ రెండో నిర్ణయం ప్రకారం

గవర్నమెంటువారు రాయించిన పాఠ్యపుస్తకాలను ఏ కారణాల వల్లనో ఎవరో అచ్చుగాకుండా ఆపేశారు. 1966లో తెలుగు అధికారభాష అయింది. 1968లో ఏర్పడ్డ తెలుగుఅకాడమీ రాయించిన గ్రంథాల్లో చాలావరకు ఆధునిక భాషే అమల్లోకి వచ్చింది. 1969 నుంచి ఉన్నత విద్య తెలుగులో బోధించటం మొదలైంది. 1973లో ఆంధ్రవిశ్వవిద్యాలయంవారు ఆధునిక భాషలో యూనివర్సిటీ పరీక్షలు రాయవచ్చునని తీర్మానించారు. అంతకు ముందే శ్రీవెంకటేశ్వరయూనివర్సిటీవారు తెలుగు పిహెచ్.డి.కి రాసే సిద్ధాంత వ్యాసాలు ఆధునికభాషలో ఉండవచ్చునన్నారు. ఈ మార్పులను బట్టి తెలుగు బహుముఖంగా వర్ధిల్లటానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని తెలుసుకోవచ్చు.

ఇంతదాకా చూసింది తెలుగు భాషా పరిణామానికి సంగ్రహ సమీక్ష.

తెలుగుభాష : కర్తవ్యం

ఏ భాష అయినా ఆధునిక అవసరాలకు యోగ్యంగా రూపొందాలంటే దానికి మూడు లక్షణాలుండాలి. అవి: (1) సమగ్రమైన లిపి, (2) మాండలికాలకు అతీతమైన ప్రామాణిక భాష, (3) ఆధునికశాస్త్రవిజ్ఞానాన్ని వ్యాపింపజేయటానికి అనువైన పదజాలం, రచనా విధానం.

(1) తెలుగు లిపి చాలా సమగ్రమైంది. మన భాషలో ఉచ్చారణకు, లిపికి మధ్య ఆట్టే తేడాల్లేవు. రెండు మూడు ఉచ్చారణలకు ఒకే గుర్తుండటం, రెండు మూడు గుర్తులకు ఒకే ఉచ్చారణ ఉండటం వల్ల స్పెల్లింగ్ సమస్యలు ఏర్పడతాయి. ఆ చిక్కులు అంతగా తెలుగులో లేవు.

(2) ప్రమాణ భాషా లక్షణాలివి: 1. ఎక్కువమంది వ్యవహర్తలకు సమ్మతం కావటం, 2. వివిధ రంగాల్లో ఉపయోగించబడటం, 3. ప్రమాణ భాషను నేర్చుకోటమే విద్యావంతులుగా గుర్తించబడటానికి లక్షణం కావటం, 4. ఆధునిక వచన సాహిత్యం ఆ భాషలోనే ఉండటం, 5. ఒక భాష మాట్లాడేవాళ్ళ సంస్కృతి వికాసానికి అది సంకేతం కావటం. ఈ లక్షణాలన్నీ నేటి తెలుగు రచనల్లో వచ్చే భాషలో కన్పిస్తున్నాయి. ఈనాడు విజ్ఞాన ప్రచార సాధనాలు అన్నిటిలో వాడుతున్న భాష ఆధునిక ప్రమాణ భాషగా గుర్తించవచ్చు. దీంట్లో కొంత మాండలిక వైవిధ్యమున్నా అర్థబోధకు ఆటంకంగా లేదు.

ప్రమాణభాషను గూర్చి ఈ కింది సూచనలు గుర్తుంచుకోవాలి.

I. ప్రమాణభాష మాండలికాలకు దూరమై కావ్యభాషలాగా మారిపోకూడదు. ఈనాడు తమిళంలో జరుగుతున్న అతి తమిళీకరణం, హిందీలో జరుగుతున్న అతి సంస్కృతీకరణాలవల్ల ప్రమాణభాష కూడా చదువుకున్న వాళ్ళ కొద్దిమంది సొత్తే అవుతున్నది. రూఢమైన అన్యదేశ్యాలను, చివరకు మనుష్యులపేర్లను కూడా తమిళీకరణం చేస్తున్నారు. ఉదా: *telephone,* తొలైవేచి అని, వాడుకలో రూఢంగా ఉన్న అక్కిరాసినర్, పరీక్షై, పిరాణ వాయు, చర్వకళాచాలై, *express bus, నమస్కారం, photographer* - ల బదులు తలైవర్ (= President), తేర్వు (= examination), ఉయిర్ కాట్టు (= oxygen), పల్కలైకషకమ్ (= university), తురితవంటి (= express bus), వణక్కమ్ (= నమస్కారం), నిషల్‌పటమ్ (= photography) మొదలైనవి.

ఇలాగే హిందీలో కవ్‌డా, ఆంఖ్, కేబాద్, బొర్, హవా, దవాఖానా, తారీఖ్, ఖేతీ, బుఖార్, గుస్సా మొదలైన వాడుకలో నలిగిన పదాలకు బదులు వస్త్ర, నేత్ర, పశ్చాత్, ఏవం, వాయు, చికిత్సాలయ్, దినాంక్, కృషి, జ్వర్, క్రోధ్ మొదలైన సంస్కృత పదాలను కృత్రిమంగా తెచ్చిపెట్టారు.

II. సాధ్యమైనంత వరకు అభిప్రాయాన్ని తేలికమాటల్లో చెప్పే ప్రయత్నం రచయితలంతా చేయాలి. భాషను సులభం చెయ్యటం అంటే పలచన చెయ్యటం అనుకోకూడదు. ఇప్పుడు అమెరికాలో నీగ్రోలకు వారి మాండలికంలోనే ప్రాథమిక విద్య బోధించాలని ఒక ఉద్యమం బయలుదేరింది. మనదేశంలో కూడా వయోజనవిద్య ఆయా ప్రాంతాల మాండలికంలో జరగటం విద్యావ్యాప్తి దృష్ట్యా మంచిదిగా తోస్తుంది. అక్షరాస్యత ఏర్పడ్డ తర్వాత ప్రమాణభాష నేర్పవచ్చు. 1972-74లో 'Council of Social Sciences Research' వాళ్ళు మహబూబ్‌నగర్‌లో గర్భిణీస్త్రీలకు, చంటిపిల్లల తల్లులకు, పిల్లల పెంపకాన్ని గురించి, ఆరోగ్యసూత్రాల్ని గురించి నేర్పటానికి విద్యాకేంద్రాలు ఏర్పాటు చేశారు. మొదటిదశలో తయారుచేసిన పాఠ్యాల్లో మొదటి పాఠం కమల చూలాలు అన్న వాక్యం. తీరా ఫీల్టుకు వెళ్ళి ఈ పాఠాన్ని మొదలుపెడితే చూలాలు అన్న మాట అక్కడ ఎవరి వాడుకలోనూ లేదని తెలిసింది. ఆ అర్థంలో అక్కడ నిండు మనిసి, గర్భిని, పొట్టతో ఉంది అంటారు. రెండోదశలో పాఠాలన్నీ వాళ్ళ మాండలికంలోనే తయారుచేసి చెప్పటం వల్ల చాలామందికి చదవటం, రాయటం వచ్చింది. పాడిపంటల గూర్చిన ఆకాశవాణి ప్రసారాలు, గ్రామస్తుల కార్యక్రమాలు కొంతకాలం దాకా మాండలికాల్లోనే ప్రసారం కావటం మంచిది. దీనిక్కావలసిన స్క్రిప్టు ఆయా మాండలికాలకు చెందిన రచయితల చేత రాయించవచ్చు.

III. భాషాభివృద్ధికి ఏం చెయ్యాలి అనటం కంటె, ప్రమాణీకరణం పేరుతో ఏం చెయ్యగూడదో తెలుసుకోవటం ముఖ్యం. భాషను ఇదివరకు వాడని ఏయే రంగాల్లో ఇక ముందు వాడాలో శాసించవచ్చుగాని, ఆ భాష ఎట్లా ఉండాలో ఏ రకమైన పదాలు ఏ రంగాల్లో వాడాలో ప్రభుత్వం కానీ విద్యాసంస్థలు కానీ, అకాడమీలు కానీ శాసించగూడదు. భాషా స్వరూపాన్ని గూర్చి చేసిన శాసనాలవల్ల సహజమైన సృజనాత్మక శక్తి రచయితల్లో దెబ్బతింటుంది. సంస్కృతం వ్యవహారంలో జారిపోయి ప్రజలు వాడే ప్రాకృత భాషలు నేటి ఔత్తరాహభాషలు కావటానికి ఇదే కారణం. గ్రాంథిక భాషాప్రాబల్యం వల్ల తొంభైఏళ్ళుగా తెలుగులో సహజ వచనరచన, కాల్పనిక సాహిత్యం పైకి రాలేదు. అధికారభాషగా తెలుగు వ్యాపించాలంటే అన్ని శాఖల్లోనూ వెంటనే తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపాలి అని ఆదేశిస్తే చాలు. ఆ తెలుగు రచన ఎలా ఉండాలో, ఏ పదాలు వాడాలో నిర్ణయించటం ఇప్పుడు కర్తవ్యం కాదు. నిర్బంధం లేనప్పుడు ప్రతివ్యక్తీ పదజాలనిర్మాణంలోనూ, రచనాసృష్టిలోనూ భాగస్వామి అవుతాడు.

'Central Technical Terms Commission' వాళ్ళు సృష్టించిన మాటలనే ఉపయోగించి తెలుగుదేశపు చట్టాలు అనువాదం చెయ్యాలి అనే నిర్ణయం వల్ల ఈమధ్య తెలుగులో వచ్చిన చట్టాలు తెలుగువాళ్ళకే అర్థం గాకుండా పోయినాయి. మాటల సంగతి అటుంచి వాక్యాలు కూడా తెలుగు వాక్యాల్లా కన్పించకుండా పోయినాయి. ఉదాహరణకు, 'సంద ర్భము అన్యథా కోరిననే తప్ప,' అనేది 'unless context otherwise requires' అనేదానికి అనువాదం. సందర్భం కోరటం తెలుగు నుడికారం కాదు.

IV. దేశమంతటికీ ఒకే రకమైన పారిభాషిక పదజాలం సృష్టించు కోవాలని కొందరి వాదం. దీని ఫలితంగా బండి, కారు, అద్దెకారు అనే మాటలను వాహనం, శకటం, వాహిక అని రాయమంటారు. పన్ను బదులు రాజస్వం అనాలిట. రూఢపదాలను భాషలో నుంచి తప్పించటం మంచిపని కాదు, సాధ్యమూ కాదు. సంస్కృతం నుంచి రెండు మూడు మాటల కలయికతో గూర్చిన పదాలు తెలుగులో అతకవచ్చు, దీర్ఘసమాసాలు ఇమడవు. ఉదా.: 'రూపాంతరప్రాప్తావస్థ (metamorphic phase), ఉదాసీన వక్రరేఖావిశ్లేషణ (indifference curve analysis) మొదలనవి కుప్ప తిప్పలుగా తెలుగు అకాడమీ పుస్తకాల్లో వేస్తున్నారు. ఏ సందర్భంలోను అర్థంకానీ, రూపంకానీ మారకుండా ఉండేవి (రసాయన శాస్త్రంలో వచ్చేవి) ఇంగ్లీషు నుంచి ఎరువు తెచ్చుకోటం మంచిది. సందర్భాన్ని బట్టి అర్థం మారే మాటలను వివరణాత్మకంగా తెలుగులోకి తెచ్చుకోవాలి. కొత్త భావాలు తెలుగువారి ఆలోచనావిధానంలో కలిసిపోతే కొత్తమాటల కూర్పు సహజంగా ఏర్పడుతుంది. మాటల కంటే 'concept' అర్థం చేసుకోటం ప్రధానమైంది.

V. పరిపాలనలోను, న్యాయస్థానాల్లోను తెలుగును ప్రవేశపెట్టాలంటే ద్విభాషా శైలి వాడటం మొదటి మెట్టు. అంటే ఇంగ్లీషు మాటలు, పద బంధాలు అవసరమైనచోట కలిపి తెలుగు వాక్యాల్లో మాట్లాడటం. క్రమంగా తెలుగులో ఆలోచించి రాయటం సాధ్యపడ్డప్పుడు అన్యదేశ్యాల స్థానంలో దేశ్యశబ్దాలు వస్తాయి, లేదా అన్యదేశ్యాలు మన భాషలో కలిసిపోతాయి. న్యాయస్థానంలో వాదోపవాదాలు మిశ్రశైలిలో జరిగినా నిర్ణయాలు కొంత కాలం ఆంగ్లంలోనే ఉండవచ్చు. మరో ఇరవై ఏళ్ళలో తెలుగులో చట్టాలు, న్యాయసూత్రాలు నిక్కచ్చిగా రాయటం సాధ్యమవుతుంది.

జాతీయ అంతర్జాతీయ రంగాల్లో తెలుగు

భారతీయభాషల్లో తెలుగుది ద్వితీయ స్థానం. భాష తెలీకుండా సంస్కృతిని ఎవరూ అర్థంచేసుకోలేరు. తెలుగులో వచ్చిన ఉత్తమ సాహిత్యాన్ని అనువాదరూపంలో ఇతర ప్రాంతాలవారికి అందించి తెలుగు నేర్చుకొనే కుతూహలం కలగజెయ్యాలి. ఇతర రాష్ట్రాల్లో ఉన్న విశ్వవిద్యా లయాల్లో తెలుగుకు ఆచార్యపీఠాలు కల్పించాలి. తెలుగుదేశంలో కూడా ఇతర రాష్ట్రాల వారికి తెలుగుభాష, సంస్కృతి, చరిత్రల్ని గురించి శిక్షణ ఇచ్చే ఏర్పాటు చెయ్యాలి. ప్రభుత్వం స్థాపించదలచుకొన్న అంతర్జాతీయ తెలుగుసంస్థ మొదట జాతీయ సంస్థగా రూపొందాలి. నాకు తోచినంత వరకు ఈ సంస్థ పనులు నాలుగు: (1) ఇతర భారతీయ భాషల్లో వెలువడ్డ ఉత్తమ సాహిత్యాన్ని, శాస్త్రవిజ్ఞానాన్ని తెలుగువారికందించటం, (2) తెలుగు వారికి ఇతరభారతీయభాషల్లోనూ, ఇతరభాషావ్యవహర్తలకు తెలుగులోను, శాస్త్రీయపద్ధతిలో, స్వల్పకాలంలో శిక్షణనివ్వటం, (3) తెలుగుభాష చరిత్ర, సంస్కృతులకు సంబంధించిన మహోన్నత గ్రంథాలయం స్థాపించటం, (4) భాషాభివృద్ధిని గూర్చిన సమీక్షలు, గోష్ఠులు తరచుగా జరపటం.

అంతర్జాతీయసంస్థగా తెలుగు సంస్కృతి, భాష మొదలైన వాటిలో కృషి చేసే ఇతర దేశ విద్వాంసులకు అనువైన ఉనికి, వసతులు కల్పించటం, అంతర్జాతీయభాషల్లో (ఫ్రెంచి, జర్మన్, రష్యన్, చైనీస్, జపనీస్ మొదలై నవి) తెలుగువారికి శిక్షణ నేర్పాటు చేసే అనువాదశాఖను స్థాపించటం, దాని ద్వారా ఆధునిక విజ్ఞానంలో ఇతర దేశాల్లో అచ్చయిన వ్యాసాలను, గ్రంథాలను, సంగ్రహరూపంలో అనువదించి తెలుగు శాస్త్రజ్ఞులకు అందిం చటం, తెలుగులో వచ్చిన ఉన్నతసాహిత్యం, శాస్త్రవిజ్ఞానాలను ఇతర భాషల్లోకి అనువాదం చెయ్యటం, ఇతరదేశాలకు విద్యావాణిజ్యసందర్భాల్లో వెళ్ళే తెలుగువారికి మన భాషాసంస్కృతుల్ని గూర్చి ఓరియంటేషన్ కోర్సులు ఇవ్వటం.

తెలుగు రచనల్లో సాహిత్యమైనా, శాస్త్రమైనా అంతర్జాతీయ స్థాయికి రాదగిన గుణం ఉంటేనే తెలుగు అంతర్జాతీయభాష అవుతుంది. అందుకు కావాల్సిన ప్రోత్సాహం, స్వేచ్ఛ భాషకూ రచయితలకూ కల్గించటమే ప్రభుత్వమూ, విద్యాసంస్థలూ చేయవలసిన పని.

ముగింపు

తెలుగు ఆధునిక భాషగా పెరగటానికి ఈ కింది సూచనలు అమలు జరగాలి.

(1) పారిభాషికపదాలను వీలైనంతవరకు తెలుగుమాటలతోనే కల్పించుకొనే ప్రయత్నం జరగాలి. అవసరమైనప్పుడు ఇంగ్లీషు నుంచి ఎరువు తెచ్చుకోటం, రెండు మూడు పదాలకు మించని సంస్కృతాను వాదం వాడటం, కొత్త భావాల అవగాహన, కొత్త మాటలను సృష్టించటం కన్నా ప్రాథమికం. వాడుక లేని పొడి మాటల సృష్టివల్ల భాష పెరగదు.

(2) ప్రమాణభాషను మాండలికాలకు దగ్గరగా తెచ్చి వీలైనంత తేలిక మాటలతో అభిప్రాయాలు చెప్పుకునే అలవాటు రచనలో ఏర్పడేట్టు రచయితలు, భాషాధ్యాపకులు కృషి చెయ్యాలి.

(3) రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాల్లోను, విద్యా బోధనలలోను, అనువాదం సాధ్యం కాని చోట్ల ఇంగ్లీషు మాటలు కలిసిన తెలుగువాక్యాలతో ద్విభాషా శైలిని సహించాలి, ప్రోత్సహించాలి.

(4) శాస్త్ర విషయాలను గురించి స్వతంత్ర రచనలను ప్రోత్స హించాలి.

(5) భిన్నశాస్త్రాల్లో పరిశోధన పత్రికలు నడపాలి.

(6) మాతృభాషా బోధన ఆమూలాగ్రంగా సంస్కరించాలి.

(7) శాస్త్రీయమైన అనువాద విధానంలో విశ్వవిద్యాలయాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పరచాలి.

(8) ఆధునిక భాషకు సమగ్రమైన వ్యాకరణం, కోశం సమర్థులైన వాళ్ళచేత రాయించాలి.

(9) తెలుగు విద్యాసాధనంగా పట్టభద్రులైన వాళ్ళకు ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇవ్వాలి.

(10) తెలుగు శైలిని గురించికాని, పారిభాషిక పదాలను గురించి కాని, కట్టుబాట్లు, నిర్బంధాలు చెయ్యకుండా ఉండాలి.

(11) తెలుగు లిపి చిహ్నాల సంఖ్య తగ్గించటానికనువైన కొద్దిపాటి సంస్కరణలు చెయ్యాలి.

భాష ఉపకరణంగా మన విజ్ఞానం ఎంత పెరిగితే భాష అంత పెరుగుతుంది. భాషనెవ్వరూ చెడగొట్టలేరు. కాని, ప్రయోజనంలేని కట్టుబాట్ల వల్ల దాని పెరుగుదల వేగం తగ్గిపోవచ్చు. విద్యాసంస్థలు, రచయితలు, ప్రభుత్వం, అన్యోన్యసహకారంతో సక్రమప్రణాళికతో భాషాభివృద్ధికి పూనుకుంటే భాష పెరుగుతుంది. *

ఈ వ్యాసం భద్రిరాజు కృష్ణమూర్తి భాష, సమాజం, సంస్కృతి (2000) అనే పుస్తకం నుంచి పునర్ముద్రితం (పుటలు 161-171).

సంస్కృతి అంటే...

కె.కె. రంగనాథాచార్యులు

ఒక ప్రత్యేక దశలో, ప్రత్యేక ప్రాంతంలోని ప్రత్యేక మానవ సమూహాల ప్రత్యేక లక్షణాలు సంస్కృతి అన్నమాట. అంటే సమకాలీన భౌతిక జీవన పరిస్థితులే ఆనాటి సంస్కృతి అని అర్థం.



సంస్కృతిని గురించి ఏకరూపత కలిగిన నిర్వచనం ఇంతవరకు కనిపించదు. భావ, భౌతికవాద తాత్త్విక ధోరణులను బట్టి సంస్కృతి స్వరూపాన్ని అనేక రకాలుగా నిర్వచించటం కనిపిస్తుంది. కొందరు సంస్కృతిని అమూర్త (abstract) భావ పదార్థంగా పరిచయం చేశారు. అంటే సంస్కృతిని స్పష్టమైన నిత్యజీవిత విధానానికి సంబంధంలేని ఒక అమూర్త అతీత అంశంగా నిర్వచించిన వారున్నారు. నాగరికతలో భాగంగా మానవ నిర్మాణాలు, సృజనాత్మక కళల సమాహారంగా సంస్కృతిని కొందరు వివరిస్తారు. మానవుని ప్రవర్తన విధానపరంగా కూడా సంస్కృతిని కొందరు విశ్లేషించారు. కొందరు సంస్కృతిని అమూర్తరూపంలోని భావంగా నిర్వచించి, మూర్తరూపంలో దాన్ని ప్రదర్శించే ప్రయత్నం చేశారు. ఒక సంప్రదాయవాది సంస్కృతిని అనేక రూపాలలో భావపదార్థంగా నిర్వచించి, దానికి ఉదాహరణగా తెలుగు సాహిత్యచరిత్రను సంగ్రహించాడు. భారతీయ సంస్కృతి స్వరూప, స్వభావాలను వివరించేప్పుడు అనేక వైరుధ్యాలు కొట్టవచ్చినట్టు కనిపిస్తాయి. వేదకాలం నుంచి భారతదేశ చరిత్రను, నాగరికత సృజనాత్మక నిర్మాణాల చరిత్రను ఒక వరుసలో చెప్పి వాటి మధ్య పూసలలో దారంలాగా కనిపించే ఏకసూత్రత భారతీయ సంస్కృతి అనగానే చాలామందికి మతపరమైన విశ్వాసాలు, ఆచార వ్యవహారాలు, కర్మకాండలు జ్ఞాపకం వస్తాయి. సంప్రదాయాన్నే సంస్కృతిగా భావించే సంప్రదాయం కూడా ఉంది. భారతీయ సంస్కృతి అనగానే ఆధ్యాత్మిక సంస్కృతి చాలామందికి జ్ఞాపకం వస్తుంది. భారతదేశంలోని తత్త్వం, చట్టం, సంగీతం, సాహిత్యం, ఇతర కళలు - అన్నీ ఆధ్యాత్మిక సంస్కృతినే ప్రతిబింబిస్తాయన్న భావం కూడా చాలామందిలో ఉంది. కొంతమందికి సంస్కృతి మేధావుల సృష్టి, పాలకుల ఆస్తి. సంస్కృతి అంటే ఉత్తముల ఆదర్శప్రాయమైన నడవడిక, గత ప్రాభవస్మృతి, సనాతన వ్యవస్థ. స్థిరత్వం, సంతతత్వం, శాశ్వతత్వం సంస్కృతికి ప్రతీకలు. ఆ మాటకు వస్తే సంస్కృతమే సంస్కృతి. ఆమధ్య ఒక ఇంగ్లీషు ప్రొఫెసర్‌గారు "Sanskrit is language of silence", సంస్కృతం మౌన లేక నిశ్శబ్ద భాష అని అభివర్ణించాడు. భక్తి, విశ్వాసాల సంస్కృతిలో భాగంగా భక్తిశ్రద్ధలతో చెప్పిన మాట ఇది. సంస్కృతం భారతీయ సంస్కృతికి ప్రతిబింబం. సంస్కృతం అనగానే మనకు ఆ భాషలోని విజ్ఞానం, శాస్త్ర విషయాలు, భౌతిక జీవన పరంపర జ్ఞాపకం రావు. మునులు, మౌనులు, ఋషులు జ్ఞాపకం వస్తారు.

భారతదేశానికి సంబంధించి సర్వసాధారణ సంస్కృతిని గురించి మాట్లాడేవారు భారత, రామాయణాలను పేర్కొంటుంటారు. భారత రామాయణాల ప్రభావం పై వర్గం నుంచి కింది వర్గం వరకు భారతీయు లందరిపైన ఉందని, అందులోని పాత్రలు, ఆదర్శాలు భారతీయులందరికి ఏకైక ప్రేరణ అని వాదిస్తుంటారు. అవి అన్ని ప్రాంతాల, వర్గాల జన జీవనంలో పెనవేసుకొని పోయాయని, అదే భారతీయ సర్వసాధారణ సంస్కృతికి తార్కాణమని వారి అభిప్రాయం. కాని భారత, రామాయణ కథలను అర్థం చేసుకునే పద్ధతిలో, ఆదర్శీకరించుకొనే విధానంలో, తమ జీవితానికి సమన్వయం చేసుకోవటంలో భిన్నవర్గాల మధ్య చాలా తేడాలు కనిపిస్తాయి. సంస్కృత భారత, రామాయణాలు, వాటి ఆధారంగా వచ్చిన కావ్యనాటకాలతో పోలిస్తే జానపద సాహిత్యంలో కనిపించే భారత, రామాయణ గాథలు భిన్నంగా ఉంటాయి. చాతుర్వర్ణ్య విధానం, అగ్రవర్ణాల ఆధిక్యత వీటితో సంబంధం లేకుండా జనజీవితానికి, సాధారణ మనస్తత్వానికి దగ్గరగా ఉండే విధంగా రామాయణ, భారతాలలోని పాత్రలు వాళ్ళ సంప్రదాయంలో కనిపిస్తాయి. అది భిన్నవర్గాల సంస్కృతిలో ఉండే భేదాన్ని సూచిస్తుంది. ఈ కథలే, ఈ పాత్రలే ఒకే వర్గంలో చరిత్ర పరిణామంలో వ్యవస్థలు మారినప్పుడు కొత్త రూపాలను సంతరించుకోవటం చూడవచ్చు. పురాణేతిహాసాలలోని రాముడు, దుష్యంతుడు మధ్య యుగంనాటి కావ్య, నాటకాలలోని రాముడు, దుష్యంతుడు భిన్నంగా కనిపిస్తారు. వైవిధ్యంలో ఏకత్వం భారతీయ సంస్కృతికి సంబంధించిన మరొక ప్రధాన లక్షణంగా చెప్తుంటారు. ప్రాంతీయ భేదాలు ఉన్నా పై వర్గంలో, ముఖ్యంగా పాలక వర్గంగా వారి ప్రయోజనాలలోని సామ్యం దృష్ట్యా సమాన లక్షణాలు, ఏకత్వం కనిపించవచ్చు. కాని అది సర్వవర్గ సమాన సంస్కృతిగా భావించటానికి ఎంతవరకు వీలుంటుందో చెప్పటం కష్టమే.

ఇటీవల ఒక హైకోర్టు జడ్జిగారు ఒక సాహిత్య సమావేశంలో మాట్లాడుతూ దేశభక్తి, సమాజం వీటిని గురించి మన వాళ్ళెప్పుడూ ఆలోచించలేదని, ఆత్మచింతన, ఆత్మశక్తి, ముక్తిని గురించే వారు ఆలోచించేవారని అదే మన సంస్కృతి అని సగర్వంగా చాటి చెప్పారు. ఆ మాటకు వస్తే సంస్కృతి అన్న పదమే ప్రస్తుతం మనం వాడుతున్న అర్థంలో, భావంలో కల్చర్ అన్న ఇంగ్లీషు పదానికి సమానార్థకంగా భాషలో కొత్తగా ప్రవేశించింది. కల్చర్ అంటే వ్యవసాయం, కృషి, సేద్యం, సాగుబడి, పశుపోషణ మొదలగు అర్థాలే బ్రౌన్ నిఘంటువులో కనిపిస్తాయి. సంస్కృతి అంటే 'సమ్యక్ కరణం,' 'శుద్ధి' అన్న అర్థాలే సంస్కృత నిఘంటువుల్లో కనిపిస్తాయి. జాతి, సంస్కృతి అన్న పదాలు పూర్వార్థాలను కోల్పోయి ఒక ప్రత్యేకార్థంలో ఈరోజు మాత్రమే కనిపిస్తున్నాయి. ఏ ప్రాచీన గ్రంథాల్లోను, కావ్యాల్లోను జాతి అన్నది ప్రస్తుతం తెలుగులో కనిపిస్తున్న అర్థంలో కనిపించదు. తిక్కన భారతంలో ఇది సంస్కారం అన్న అర్థంలో కనిపిస్తుంది. మౌసల పర్వంలో బలరామకృష్ణులు మరణించినప్పుడు అర్జునుడు, భూసురకోటి "కావున వేగమగ్నియును గాష్ఠములున్ సమ కూర్చి సద్విధి, శ్రీవిలసిల్లఁగృష్ణుని శరీరము సంస్కృతిఁ గూర్చి క్రమ్మరం బోవుట బుద్ధియంచు..." అనుకుంటారు. ఇక్కడ సంస్కృతి అన్న పదం దహన సంస్కారం అన్న అర్థంలో ఉంది. చౌలోపనయానాది సంస్కారా లకు సంస్కృతి అన్నది మరో పేరు అయి ఉంటుంది. ఆధునిక యుగం లోనే అది ప్రత్యేక భావాన్ని సంతరించుకుంది. అలాంటప్పుడు 'సంస్కృతి' అంటే జాతికి సంక్రమించిన సామాజిక వారసత్వంగా, శాశ్వతమైందిగా, సర్వకాలాలకు, సర్వజనులకు సంబంధించిన అతీత లక్షణంగా ఎలా కొనసాగుతుంది? నా జాతి తరతరాల సంస్కృతి అనుకోవటం సంప్ర దాయం గురించే. పదార్థం నుంచి, భౌతిక సత్యం నుంచి భావం, చైతన్యం పుడ్తుంది. భౌతిక జీవిత విధానాలలో వచ్చే మార్పులను బట్టి సంస్కృతి స్వరూప స్వభావాలు మారుతుంటాయి. ఒకప్పుడు ఆర్థికవ్యవస్థకు మూలా ధారమైన ఉత్పత్తి కార్యక్రమాన్ని సూచించే కల్చర్ అన్న పదం, ఆర్థిక వ్యవస్థ పునాదిగా గల సామాజిక పరిస్థితుల భావ ప్రతిబింబాన్ని సూచించే పదంగా స్థిరపడింది. దానికి సమాన భావాన్నిచ్చే పదంగా 'సంస్కృతి' వాడుకలోకి వచ్చింది.

మనది భౌతిక సంస్కృతి కాదు, అది ఆధ్యాత్మిక సంస్కృతి, అది సనాతనం, నిత్యం, సత్యం, అమేయం, అనవద్యం, అవ్యక్తం, అచింత్యం, అవికార్యం అన్న భావం మౌలికంగా మనకున్నది. అలా అని పదిహేడు, పద్దెనిమిది శతాబ్దాల వరకు ఎవరూ చెప్పలేదు. విశ్రాంతి వర్గం మేధస్సు నుంచి పుట్టిన ఒక తత్వంగా జగన్మిథ్య, ఆత్మనిత్యం, బ్రహ్మసత్యం అన్న భావాలు కింది వర్గాలను కూడా ఏదో ఒక రూపంలో ప్రభావితం చేసిన మాట నిజమే కాని అదే ప్రధాన జీవన విధానంగా జనసామాన్యం ఎప్పుడూ భావించినట్టు కనిపించదు. ఆధ్యాత్మిక సంస్కృతి ఆధిక్యతా భావాన్ని వలస పాలనకాలంలో బాగా ఎరువు వేసి పెంచినట్టు కనిపిస్తుంది. అది ఈరోజుకూ మన మెదళ్ళను, మనస్సులను పాలిస్తున్నది. ఆధునిక పారిశ్రామిక నాగరికతకు ఫలితమైన సంస్కృతిలో దారితప్పిన కొందరు పాశ్చాత్య మేధావులకు ఉపనిషద్భావాలు, జగన్మిథ్యాతత్వం, అతీత జగద్వాదం కొత్తగా అనిపించాయి. వారి మనస్సులలోని శూన్యాన్ని మాయా, శూన్యవాదాలు ఊరించాయి. అది ఆ కాలంలో వ్యాపిస్తున్న కాల్పనిక ధోరణులలో భాగం.

భారతదేశాన్ని గురించి పాశ్చాత్యులు చాలా కాల్పనికంగా ఆలో చించారు. భారతదేశం గొప్ప ఆధ్యాత్మిక దేశమని, ఉన్నత ప్రాచీన సంస్కృతి గల దేశమని అభివర్ణించారు. మాక్స్‌ముల్లర్ విద్యార్థిగా ఉన్నప్పుడు తన నోటు పుస్తకం అట్టపైన ఉన్న బనారస్ దృశ్యాన్ని చూచి కలలు కన్నాడు. భారతదేశాన్ని గురించి కాల్పనికమైన ఆలోచనలతో చాలా చెప్పాడు, రాశాడు. కాని ఆయన భారతదేశాన్ని ఎప్పుడూ చూడలేదు. ఒకసారి ఆయనను బనారస్‌కు రమ్మని ఆహ్వానిస్తే ఆయన అన్న మాటలివి. "I do not desire to see the geographical Benaras with my physical eyes. My idea of that city is so high that I cannot risk a disillusionment." దీన్ని అర్థం చేసుకుంటే భారతదేశాన్ని గురించి ఆయన ఆలోచనలు ఎంత కాల్పనికమైనవో తెలుస్తుంది.

తమకు అనుకూలం కానిచోట పాశ్చాత్యుల భావాలను, ప్రభావాన్ని ఖండించే సంప్రదాయవాదులు, పాశ్చాత్యులు ప్రశంసించారన్న కారణంగానే ఆధ్యాత్మిక సంస్కృతి పేరిట మక్కువ పెంచుకున్నారు, పెంచారు. దీనివల్ల సంప్రదాయంపైన ఇంతకు ముందెన్నడూ లేని గర్వం, వివేచనలేని దురభి మానం పెరిగింది. అది నేటికీ కొనసాగుతూ రోజురోజుకు పెరుగుతున్నది. ఈ దురభిమానమే స్వాధిక్యతా భావానికి, క్రియా శూన్యతకు, ఉదాసీన వేదాంతానికి దారి తీస్తుంది, తీసింది కూడా. సంస్కృత భాషాధ్యయన, పరిశోధనల ద్వారా ఆర్య సంస్కృతి ప్రాచీనతా వైభవాలు తలకెక్కటం, జర్మనులే నిజమైన ఆర్యులనీ, ఇతరులంతా 'బార్బేరియన్స్' అని హిట్లర్ చెప్పటం ప్రపంచ చరిత్ర తెలిసిన వారందరికీ తెలిసిందే. బహుశా జర్మనులు మనదేశం నుంచి విజ్ఞానం అంతా ఎత్తుకు పోయి లాభపడ్డారంటే ఇదేనేమో? సుమారుగా సుదీర్ఘ చరిత్ర కలిగిన ప్రతి జాతిలోను గతౌన్నత్యం మీద అభిమానం, సంప్రదాయం మీద మమకారం, తమ మతమే సత్యం చెప్తుందన్న విశ్వాసం కనిపిస్తుంది. వారికి గతమే ఆదర్శం అవుతుంది. సంప్రదాయ జీవిత విధానమే ఆశయం గా మారుతుంది. మారిన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులలో ఈ ఆశయాలు, ఆదర్శాలు ఆచరణా త్మకం కాలేవు. దీనివల్ల ఆశయానికి, ఆచరణకు వైరుధ్యం ఏర్పడుతుంది. ఈ వైరుధ్యాలు అరాచక సంస్కృతికి దారితీస్తాయి.

భారతదేశ చరిత్రలో భిన్న చారిత్రక దశలలోని తాత్త్విక భావాలు కలగాపులగమై వైరుధ్యాలు కనిపించే మాట నిజమే. కాని ఆధ్యాత్మిక సంస్కృతి పేరిట ఆధిక్యతా భావన ప్రాచీన భారతీయ చరిత్రను, సాహిత్యాలను అధ్యయనం చేస్తే చాలా తక్కువగానే కనిపిస్తుంది. బౌద్ధం, జైనం, వైష్ణవం, వీరశైవం మొదలైన మతాలు, భక్తి ఉద్యమాలు భారతదేశ చరిత్రలో ఎన్నో వచ్చాయి. ఈ మతాలన్నీ మొదట ఆయా చారిత్రక దశలలోని వైరుధ్యాలలో జీవన విధానాన్ని, వ్యవహార విధానాన్ని నిర్దేశించే కట్టుబాట్లుగా ప్రారంభమై మతరూపాన్ని పొందాయి. ఈ మతాలన్నీ ఆయా సందర్భాలలో చాతుర్వర్ణ్య ప్రధానమైన సామాజిక వ్యవస్థను వ్యతిరేకిస్తూ వచ్చాయి. కాని పరిణామ క్రమంలో ఆ మతాలన్నీ వర్ణ విభజనకు సంబంధించిన వ్యవస్థతో రాజీపడ్డాయి. వైదిక మతం అని చాలామంది

అంటున్నది చాతుర్వర్ణ్య విధానానికి, శ్రమవిభజనకు సంబంధించిన సామాజిక వ్యవస్థే కాని మరొకటి కాదు. పై మతాలు కాని, చాతుర్వర్ణ్య వ్యవస్థ కాని భౌతిక జీవన విధానానికి సంబంధించినవే మౌలికంగా. ప్రతి దశలోను ఆ మతాలకు సంబంధించిన ఇతివృత్తాలతో సృజనాత్మక సాహిత్యం వచ్చింది. ఆధ్యాత్మిక భావాలకు సంబంధించిన సృజనాత్మక సాహిత్యం చాలా తక్కువగా కనిపిస్తుంది. అదొక తత్వంగా విస్తరించిందే గాని భౌతిక జీవనానికై వైముఖ్యాన్ని కలుగజేసే శక్తిగా ఎదగలేదు. కాకపోతే కింది వర్గాలు తమ బాధలకు, కష్టాలకు భ్రమాత్మకమైన ఓదార్పును కలిగించే సాధనంగా అది ఉపయోగించింది.

తెలుగు సాహిత్యచరిత్రను పరిశీలిస్తే కనీసం భౌతిక జగత్తు అస్తిత్వాన్ని నిరాకరించే శంకరుని అద్వైతానికి ప్రాధాన్యం ఇచ్చిన ఆ తత్వాన్ని ఆధారం చేసుకున్న ప్రసిద్ధ కావ్యాలుగాని, ప్రబంధాలుగాని కనిపించక పోవటం చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వచ్చిన సాహిత్యం వర్గ సాహిత్యం అని చెప్పవచ్చుగాని ఆధ్యాత్మిక సాహిత్యం మాత్రం కాదు. దైవభావన, భక్తి ఉన్నాయి. కాని జగన్మిథ్యా తత్వం కనిపించదు. ప్రత్యేకంగా అద్వైత కావ్యాలు కొన్ని వచ్చాయి. కాని అవి అంత ప్రచారంలో లేవు. ఆధ్యాత్మిక సంస్కృతే హిందూ సంస్కృతి సర్వస్వం అన్న భావం వలసపాలనతోనే ప్రారంభమైంది. కొందరు పాశ్చాత్య మేధావులు హిందువులలో నాటిన ఆధ్యాత్మిక సంస్కృతి ఔన్నత్యభావాన్ని బ్రిటిష్ పాలకులు బాగా ఉపయోగించుకున్నారు. ఆ భావాలు మరింత బలపడటానికి కావలసిన వాతావరణాన్ని కల్పించటం ద్వారా దాన్ని ఆర్థిక దోపిడికి సాధనంగా వినియోగించుకున్నారు. భౌతిక జీవనానికి అతీతమైన ఉన్నతమైన ఆధ్యాత్మిక సంస్కృతీ సంపన్నులమన్న భ్రమ భారతీయులు తమలో తాము కుంచించుకుపోవటానికి దారి తీసింది. కర్మ సిద్ధాంతం, మాయావాద తాత్వికత ఏదో ఒక రూపంలో మొదటి నుంచీ కొనసాగుతున్న మాట నిజమే కాని అదే సర్వస్వంగా గర్వించటానికి కావలసిన పరిస్థితుల్ని సృష్టించారు వలస పాలకులు. ఆర్థికప్రగతి పైన, దేశ ఆర్థిక వ్యవస్థపైన దృష్టి లేకుండా చేయటం ద్వారా ఆర్థిక దోపిడీ చేయటానికి వలస పాలకులకు ఇది చక్కగా, చల్లగా ఉపయోగపడింది. చరిత్రను ఆర్థిక, రాజకీయ వ్యవస్థలను బట్టి కాకుండా, దేశాన్ని పాలించిన పాలకుల మతాలను బట్టి విభజించటం విభిన్న మతాలవారి మధ్య విభేదాలు పెరగటానికి దోహదం చేసింది. దీనివల్ల స్వాతంత్ర్యోద్యమ కాలంలో మతాలతో ప్రసక్తిలేని ఒక జాతిగా భారతీయులు ఎదగటానికి, మతాలతో ప్రసక్తిలేని సమానమైన సమకాలీన సంస్కృతి ఏర్పడటానికి తగిన అవసరం ఉండి కూడా దానికి తగిన వాతావరణం ఏర్పడలేదు. వలస పాలకులు తమ విధానాల ద్వారా ప్రాచీన భారతీయ సంస్కృతిగా, ఆధ్యాత్మిక సంస్కృతిగా హిందూ సంస్కృతి ఔన్నత్యాన్ని చాటి చెప్తూనే రాజకీయంగా మతం పేరుతో భారతీయ సమాజం ముక్కలు కావటానికి దోహదం చేశారు. మనలో పునరుద్ధరణవాద ధోరణులు పెరగటానికి కూడా కారణం వలస పాలన, వారి ఆర్థిక విధానాలు. స్వాతంత్ర్యానంతరం కూడా ఇదే విధానాలు కొనసాగుతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చి ముప్పయ్యేడు సంవత్సరాల తర్వాత కూడా ఈ వలస సంస్కృతి ప్రభావం ఇంకా కొనసాగుతూనే ఉంది. సామ్రాజ్యవాదం ఆర్థిక పెత్తనం చేస్తూ ఇంకా తన ప్రభావాన్ని చూపుతూనే ఉంది. ప్రస్తుత పరిపాలన ఆధ్యాత్మిక సంస్కృతి పేరిట భూస్వామ్య సంస్కృతిని రక్షిస్తూనే ఉంది. దేశంలోని రాజకీయాలు కూడా వలస పాలన నాటి కంటే భిన్నంగా లేవు. అల్ప సంఖ్యాక వర్గాల వారిని బుజ్జగిస్తూనే, అధిక సంఖ్యాకుల మద్దతును, బలాన్ని జాగ్రత్తగా సేకరించు కోవటం, ఉపయోగించుకోవటం మరచిపోని రాజకీయ సంస్కృతి రోజు రోజుకు పెరుగుతున్నది. స్వతంత్రమైన, స్వతస్సిద్ధమైన, సామ్యవాద ఆర్థిక విధానాన్ని రూపొందించుకోవటం ద్వారా వర్తమాన భౌతిక పునాదుల పైన మతంతో సంబంధంలేని సాధారణ భారతీయ ఆధునిక సంస్కృతి పెరగటానికి వీలులేని విధానాలను పాలకవర్గాలు అనుసరిస్తున్నాయి. 'సహనమే సంస్కృతి' అన్న అధికార వర్గ తత్వవేత్తల నిర్వచనం నినాదంగా మాత్రమే మిగిలి ఆచరణలో వైరుధ్యాలకు దారి తీస్తున్నది. అందుకే కాబోలు సహనం గాడిద లక్షణం అంటున్నారు విప్లవకారులు.

సంస్కృతి మార్పులేని స్థిర పదార్థమో, ఆద్యంతరహితమైన బ్రహ్మ పదార్థమో కాదు. ఈరోజు ఆదిమ సంస్కృతి, జానపద సంస్కృతి, సనాతన సంస్కృతి, సంప్రదాయ సంస్కృతి, భూస్వామ్య సంస్కృతి, భౌతిక సంస్కృతి, ఆధ్యాత్మిక సంస్కృతి, వలస సంస్కృతి, ఎరువు సంస్కృతి, సామ్రాజ్యవాద సంస్కృతి, ప్రజాస్వామ్య సంస్కృతి, బూర్జువా సంస్కృతి, ఆధునిక సంస్కృతి, ధనస్వామ్య సంస్కృతి, వ్యాపార సంస్కృతి, పాలకవర్గ సంస్కృతి, రాజకీయ సంస్కృతి, జాతీయ సంస్కృతి, నూతన ప్రజా స్వామిక సంస్కృతి, శ్రామికవర్గ సంస్కృతి, సామ్యవాద సంస్కృతి, విప్లవ సంస్కృతి, అంతర్జాతీయ సంస్కృతి మొదలైన రకరకాల సంస్కృతుల పేర్లు వినవస్తున్నాయి. వీటిలో కొన్ని చరిత్రలోని విభిన్న దశలను సూచిస్తున్నాయి. కొన్ని ఒకే దశలోని భిన్నవర్గాలను సూచిస్తున్నాయి. మరికొన్ని ఆర్థిక వ్యవస్థలను సూచిస్తున్నాయి. రాజకీయ పార్టీల పేరుతో కాంగీ సంస్కృతి, తెలుగుదేశం సంస్కృతి మొదలైనవి వినిపిస్తున్నాయి. కొంత హాలీవుడ్ నుంచి దిగుమతి అయి, దేశంలోని బందిపోటు దొంగల జీవితాల ఇతివృత్తాలతో కలిసి సినిమా సంస్కృతిగా వ్యాపిస్తున్న ప్రతీకార సంస్కృతి culture of revenge లంపెన్ వర్గాన్ని బాగా పాలిస్తున్నది. దీన్నిబట్టి సంస్కృతి స్వరూప స్వభావాలు స్థిరమైనవి, మార్పు లేనివి, సర్వజన సాధారణమైనవి కావని తెలుస్తుంది. ఆర్థిక పరిస్థితులను బట్టి ఏర్పడే వర్గాలు, సామాజిక, రాజకీయ వ్యవస్థలు, వాటిల్లోని వైరుధ్యాలు సంస్కృతి స్వరూప స్వభావాలను నిర్ణయిస్తాయని, వర్గవిభక్త సమాజంలో సర్వవర్గ సమాన సంస్కృతి, విభిన్న వ్యవస్థలకు అతీతమై అన్ని వ్యవస్థలలో సమానంగా అన్వయించే సంస్కృతి సాధ్యం కాదని తేలుతుంది.

ఇంతకీ సంస్కృతి అంటే ఏమిటి?

కళలు, సాహిత్యం, విజ్ఞానం, మానవ సంబంధాలు, పరస్పర ప్రవర్తన - ఇవి సంస్కృతికి చిహ్నాలని, అందులో ఎంత ఔన్నత్యాన్ని సాధిస్తే ఆ సంస్కృతి అంత ఉన్నతమైంది అవుతుందని, ఆ ఔన్నత్యంపైన వ్యక్తిగాని, సమాజంగాని ప్రత్యేక శ్రద్ధని చూపిస్తే అది ఆ వ్యక్తి సంస్కృతి అవుతుందని కొందరి అభిప్రాయం. విద్యా, విజ్ఞాన శిక్షణల వల్ల మానసిక వికాసం చెందటం సంస్కృతి అని మరొక నిర్వచనం. సంస్కృతి అంటే కొన్ని

సామాజిక సమూహాలను గుర్తింపజేసే లక్షణం అని మరికొందరంటున్నారు. ప్రత్యేక చారిత్రక సంస్కృతి అని, అది సమకాలీన ప్రత్యేకతలను ప్రతిబింబిస్తుందని ఇంకొక అభిప్రాయం. ప్రాచీన సంస్కృతి, నాగరికతలను తవ్వి తీయటం అంటే పురావస్తు తవ్వకాలలోని భౌతిక వస్తు సంపద, నిర్మాణం ఆధారంగా ఆనాటి జీవన విధానాలను, సమకాలీన లక్షణాలను బయటికి తీయటం అన్నమాట. ఒక ప్రత్యేక దశలో, ప్రత్యేక ప్రాంతంలోని ప్రత్యేక మానవ సమూహాల ప్రత్యేక లక్షణాలు సంస్కృతి అన్నమాట. అంటే సమకాలీన భౌతిక జీవన పరిస్థితులే ఆనాటి సంస్కృతి అని అర్థం. భావాలు, నమ్మకాలు, వ్యవస్థా నిర్మాణం, కళాసృజన, ఆచార వ్యవహారాలు, వివాహాది విధానాలు, ప్రత్యేకంగా గుర్తింపదగిన మానవుల ప్రవర్తన విధానం - ఇవి సంస్కృతిలో భాగాలయితే, వీటి స్వరూప స్వభావాలను నిర్ణయించేది సమకాలీన ఉత్పత్తి విధానం.

సమాజంలో, మానవ సమూహంలో ఒక తరం నుండి మరొక తరానికి సంక్రమించిన జీవన విధానమే సంస్కృతి అని, అది జాతికి సంక్రమించిన సామాజిక వారసత్వమని అవిచ్ఛిన్నత, సంతతత్వం సంస్కృతి ప్రధాన లక్షణమని కొందరంటారు. కాని ఈరోజుకీ మత పరంగా వచ్చిన కర్మకాండలను, వివాహాది విధులను కొన్ని ప్రత్యేక సందర్భాలలో నామమాత్రంగా, యాంత్రికంగా అనుసరిస్తున్నా, విశ్వాసాలు గా కొన్ని కొనసాగుతున్నా సాధారణ జీవన విధానంలో ఎన్నో మార్పులు కనిపిస్తాయి. భూస్వామ్య వ్యవస్థ నాటి ఉమ్మడి కుటుంబ జీవనం ఇప్పుడు పోయింది. బాల్య వివాహాలు పోయాయి. విధవా వివాహాలు జరుగు తున్నాయి. స్త్రీలు చదువుకొని, ఉద్యోగాలు చేసుకోవటానికి అవకాశాలు ఏర్పడ్డాయి. మానవ సంబంధాలలో ఎన్నో మార్పులు వచ్చాయి. మొత్తం మీద ఏ సంస్కృతీ దేశకాలాలతో నిమిత్తం లేకుండా, ఆర్థిక, సామాజిక వ్యవస్థలతో సంబంధం లేకుండా ఉండదు. ఉత్పత్తి సంబంధాలు సమాజ స్వరూపాన్ని, రాజకీయ స్వరూపాన్ని నిర్ణయిస్తాయి. అవి మానవ సంబంధాలను, విలువలను, నీతులను నిర్దేశిస్తాయి. వాటి వ్యక్తరూపమే మానవుని ప్రవర్తన విధానాలు. కళానిర్మాణాలు వాటినే ప్రతిబింబిస్తాయి. సమాజాన్ని గురించి శాస్త్రీయమైన అవగాహన సంస్కారవంతుని లక్షణం అయితే, తదనుగుణమైన వ్యక్తికి సంబంధించిన ప్రవర్తన ఆ వ్యక్తి సంస్కృతి. ఒక సమాజానికి ఆధారమైన మానవ సంబంధాలు ఆ సమాజానికి సంబంధించిన సంస్కృతి.

ఒక్కొక్కసారి భౌగోళిక, నైసర్గిక పరిస్థితులు కూడా సంస్కృతిలో భాగంగా చెప్పుకుంటున్న ఆచార వ్యవహారాలను నిర్ణయిస్తాయి. అవి మతంలో భాగమైనప్పుడు విశ్వాసంగా మారి భౌతిక పరిస్థితులు మారినా, భిన్న భౌగోళిక పరిసరాల్లో కూడా సంప్రదాయంగా కొనసాగుతాయి. మహమ్మదీయులు శవాలను ఖననం చేయటం, వారి స్నానపానాదులు మహమ్మదీయ మతం పుట్టినచోట భౌగోళిక పరిస్థితులను బట్టి ఏర్పడ్డ అలవాట్లు. ఖురాన్‌లో చెప్పిన షరియత్ చట్టం మొదలైనవి ఒక ప్రత్యేక చారిత్రిక పరిస్థితులలో ఏర్పడ్డాయి. ఇవన్నీ మతాచారాలుగా వేరే దేశాలలో, వేరే కాలాలలో కూడా అట్లాగే కొనసాగుతున్నాయి. వ్యవసాయ జీవితం ఆధారంగా రూపొందిన వివాహాది కర్మకాండలు మారిన ఆర్థిక పరిస్థితుల్లో నేటికీ అట్లాగే కొనసాగటం చూడవచ్చు. దీన్నిబట్టే తరతరాలుగా సంక్రమించే సంప్రదాయమే సంస్కృతి అన్న అభిప్రాయం ఏర్పడి ఉంటుంది. ఆమధ్య మన రాష్ట్ర రాజధానిలోని ఒక ఉన్నత విద్యాపీఠాధిపతి విద్యార్థులను ఉన్నత సంస్కృతీపరులుగా తీర్చిదిద్దటం తన ధ్యేయం అని ప్రకటించాడు. ఆయన ఉద్దేశించింది తాను విద్యార్థిగా ఉన్నప్పుడు కనీసం వలసపాలనలోని ఆధునికతకు కూడా నోచుకోని ఫ్యూడల్ సంస్థానంలోని ఒక వర్గానికి సంబంధించిన సంస్కృతి అయి ఉండాలి. ప్రస్తుతం విద్యార్థుల ప్రవర్తనకు సమకాలీన అరాచక సామాజిక, రాజకీయ పరిస్థితులతో సంవదించుకోవటం తెలియక, విద్యార్థుల ప్రవర్తనను తను విద్యార్థిగా ఉన్ననాటి పరిస్థితులతో పోల్చుకొని ఆయన ఖంగు తిని ఉంటాడు. విభిన్న ఆర్థిక, సామాజిక, రాజకీయ వ్యవస్థలలో పుట్టిన మానవ సంబంధాలు, సంస్కృతి విభేదాలు ప్రత్యేక తెలంగాణా, ఆంధ్ర ఉద్యమాలకు దారి తీశాయి. పైకి అవి మానసికమైనవిగా కనిపించినా వాటి పునాది ఆర్థికమైనది. మతపరమైన సంస్కృతి పేర, ద్విజాతి సిద్ధాంతం పేర పాకిస్తాన్ అవతరించినా పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లుగా ఆ దేశం చీలక తప్పలేదు. బంగ్లాదేశ్ ఏర్పడటానికి కారణం పైకి ప్రత్యేక భాషా, సంస్కృతులుగా కనిపించినా, అక్కడి ఆర్థిక పరిస్థితుల వల్ల పుట్టిన అసంతృప్తిని రెచ్చగొట్టటానికి అవి సాధనాలు మాత్రమే అయ్యాయి. ఇరాన్‌లో షా అనుసరించిన వలస ఆర్థిక విధానానికి వ్యతిరేకంగా చేసిన పోరాటానిక మతశక్తులు దోహదం చేశాయి. సరియైన ఆర్థిక విధానంలేని ఆ శక్తులు అధికారానికి వచ్చిన తరువాత ప్రజల దృష్టిని తమ సమస్యల నుండి మళ్ళించటానికి స్వమతానికే చెందిన ఇరాక్‌తో కొన్ని సంవత్సరాలుగా యుద్ధం కొనసాగిస్తూనే ఉన్నాయి. యుద్ధం మొదలైన రోజులలో ఆర్యజాతికి, ఆర్య సంస్కృతికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నామని ఇరాక్, అరబ్బులకు వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నామని ఇరాన్ పరస్పరం ప్రకటించుకొన్నాయి. కాని ఆ దేశాలను పాలించేవారి ఆర్థిక విధానాల వైఫల్యాలే ఆ యుద్ధాలకు ప్రధాన కారణం. తమ వర్గ ప్రయోజనాలను కాపాడుకోవడానికి మతాన్ని సాధనంగా వాడుకోవటం ఈమధ్య పెరుగుతున్నది. కారంచేడు బాధితులైన హరిజనులు క్రైస్తవులు. వాళ్ళంతా ఐక్యంగా నిలిచి భూస్వాములను ఎదిరించి నిలవటంతో భూస్వామ్యవర్గం 'హిందూమత రక్షణ', 'క్రైస్తవుల దాడి నుంచి హిందువులకు రక్షణ' అన్న నినాదాలను చేపట్టింది. గోవాలో కొంకణి, మరాఠీ భాషావాదం కేథలిక్‌లకు, హిందువులకు మధ్య చీలికగా పరిణామం చెందుతున్నది.

సమకాలీన ఆర్థిక, సామాజిక, రాజకీయ వ్యవస్థల భావ ప్రతిబింబం, ప్రవర్తన సరళి, జీవన విధానం సంస్కృతి అయితే ఆర్థిక విధానాలలోని, పాలనవ్యవస్థలోని వైరుధ్యాలు సంస్కృతిలోనూ ప్రతిబింబిస్తాయి. అధికారంలో ఉన్నవారు ఈ వైరుధ్యాలను తమ అస్తిత్వం కోసం పెంచి పోషిస్తూనే ఉంటారు. జాతీయ సంస్కృతిగా ఈరోజు చెప్తున్నది నూతన ఆర్థికవ్యవస్థ పునాదిగా ఏర్పడ్డ సమకాలీన సర్వసాధారణ సంస్కృతి కాదు. సంప్రదాయ సంస్కృతి పేరిట భూస్వామ్య సంస్కృతి, దేశ ఆర్థిక వ్యవస్థపైన పెత్తనం చేస్తున్న సామ్రాజ్యవాద సంస్కృతులకు పుట్టిన వింత శిశువు అది. విరుద్ధ ఆర్థిక విధానాల ఫలితమైన రాజకీయ సంస్కృతి అది. సాంస్కృతిక ప్రదర్శనల పేరిట జరిగే మత ఉత్సవాలలో, ఊరేగింపు లలో,

కళలలో ఈ సంస్కృతి ప్రతిఫలిస్తున్నది. బొంబాయిలాంటి నగరా లలో ఏ మతానికి సంబంధించిన ఊరేగింపుల్లోనయినా స్మగ్లర్లు, బ్లాక్ మార్కటీర్ల పాత్ర తెలియనిది కాదు. తమ అస్తిత్వం కోసం ఈ మేలాలలో పాల్గొన టానికి రాజకీయ నాయకులు పడే పాట్లూ తెలియనివి కావు. సాంస్కృతిక కార్యక్రమాల పేరిట జరిగే ప్రదర్శనలలో కూడా ఈ వైరుధ్యాలు కొట్టవచ్చి నట్టు కనిపిస్తాయి.

ఆర్థిక అసమానతలు, ఆర్థిక విధానాలలోని వైరుధ్యాలు, జాతీయత పేరిట భూస్వామ్య యుగంనాటి భావాలు, ఆధునికత పేరిట పాశ్చాత్యీ కరింపబడుతున్న పైవర్గం జీవన విధానం, స్వాతంత్ర్యానికి ముందు వలసవాదం నాటిపోయిన భ్రమాత్మకమైన సాంస్కృతిక ఆధిక్యతా భావన, ఆలోచనలు, మధ్యయుగంనాటి స్త్రీ పురుష సంబంధాలను నేటికీ ఆదర్శంగా చూపే కౌటుంబిక గాథలతో వస్తున్న సినిమాలు, సినిమాలే పెంచుతున్న ప్రతీకార సంస్కృతి, విభిన్న సంస్కృతులు దేనికదే వేరువేరుగా గుర్తింపును పెంచుకోవటానికి దోహదం చేస్తూ కృత్రిమ ఐక్యతను ప్రచారం చేయటానికి ఉపయోగిస్తున్న ఆధునిక ప్రసార సాధనాలు, ఎంత ఎక్కువగా లాభం చేకూర్చిపెడితే అంత గొప్పదిగా చలామణీ అయ్యే వ్యాపార సంస్కృతి, తదనుగుణంగా పెరుగుతున్న మానవ సంబంధాలు, వ్యక్తుల ప్రవర్తన విధానాలు అరాచక సంస్కృతిని పెంచి పోషిస్తున్నాయి. గత సంస్కృతిలోని ఉత్తమ లక్షణాలను కాక అవలక్షణాలనే ప్రస్తుత సంస్కృతి పుణికి పుచ్చు కుంటున్నది. క్రౌర్యం పక్కనే కొనసాగిన భూస్వామ్య సంస్కృతిలోని మంచి లక్షణాలైన మానవ సంబంధాలను వదలి దానికి సంబంధించిన భావజాల సంస్కృతే సంస్కృతిగా చెలామణీ అవుతున్నది. ప్రజాస్వామ్య సంస్కృతి లోని స్వేచ్ఛాభావాలు వ్యక్తి ప్రాధాన్యవాదంగా మిగిలిపోయాయి.

మధ్యయుగంలో కళలు, మతాలు దేవాలయాల చుట్టూ తిరిగేవి. అప్పటి ఆర్థికవ్యవస్థ కూడా అంతే. ఉత్పత్తి పంపకం దేవాలయాలపైన, దేవభోగాలపైన ఆధారపడి ఉండేది. అందుకే దేవాలయాలు కళలకు కూడా కేంద్రాలయ్యాయి. ఆ రూపంలోని కళల పునరుద్ధరణను ఆధునిక వినోద సాధనాలైన సినిమాలు ప్రచారం చేస్తున్నాయి. ధర్మశాస్త్రాలను, వర్ణాశ్రమ వ్యవస్థను సృష్టించిన అగ్రవర్ణాల వారే వాటిని ఛేదించగల సమర్థులన్న అభిప్రాయాన్ని కలిగించే సినిమాలూ వస్తున్నాయి. వాటిని ప్రభుత్వాలు ఆదరిస్తున్నాయి. నిన్నటితరంలోని సామాన్యుల కళా నిర్మాణాలను కాపాడుకోవలసిన అవసరం ఉన్న మాట నిజమే కాని వాటినే ఆ రూపంలోనే పునరుద్ధరించాలనటం సమకాలీన వాస్తవాలను గుర్తించకపోవటమే. నిజమైన జాతీయ సంస్కృతి అంటే పూర్తిగా పాత సంస్కృతిగానీ, దిగుమతి సంస్కృతి గానీ కాదు. అలాగే ఉత్పత్తి సాధనాల మీద అధికారం గల పాలకవర్గ సంస్కృతి అంతకంటే కాదు. ప్రజా బాహుళ్య సంస్కృతే జాతీయ సంస్కృతి. సమకాలీన జీవిత వాస్తవాలను ప్రతిబింబించే సంస్కృతే నిజమైన జాతీయ సంస్కృతి, పాత సంస్కృతిలోని సామాజికాంశం గల ఉత్తమ లక్షణాలను మాత్రమే అది స్వీకరిస్తుంది. ప్రస్తుతం అరాచక సంస్కృతి వ్యాపించి ఉన్న దశలో ఈ నూతన సంస్కృతిని నిర్మించటానికి ప్రయత్న పూర్వకంగా కృషి చేయవలసి ఉంటుంది. అందు కోసం దానికి తగిన ఆర్థిక రాజకీయవ్యవస్థను రూపొందించుకోవాలి. ❋

Our Best Compliments From

KUNDAN JEWELLERS AND EXPORTS

Exchange this for a

Free Pearl Earring

at our Booth #22
at TANA 2005 in Detroit.

No purchase necessary, offer valid till stocks last.
For Ladies only and please limit one per person

KUNDAN JEWELLERS AND EXPORTS
Babukhan Estate, Basheerbagh,
Hyderabad - 500 001. India
Tel: 23235767, 23240919
Email: sat_29@yahoo.com

నా లోకం - నా రచనలు

కాసిరెడ్డి సీతాదేవి

చిన్న వయసులో, ఒంటరిగా
స్వతంత్రంగా, జీవితం
ప్రారంభించిన నన్ను
ఈ సమాజం బాధ పెట్టలేదు.
పైగా ఈ సమాజం నుంచి
బోలెడంత గౌరవం, ఆదరణ,
ప్రేమను పొందాను.
నేను ఏనాడూ ఈ సమాజం
నాకేమిచ్చిందని ఆక్రోశించలేదు.



నా ఈ సుదీర్ఘ ఒంటరి ప్రయాణంలో నా లోకాన్ని గురించిన జ్ఞాపకాలు ఎన్నెన్నో! ఈ మెదడే ఒక జ్ఞాపకాల పాతర. ఎంత తవ్వి తీసినా తరగని జ్ఞాపకాలు. 'వేసిన దారి వెంట వెళ్ళడం సులభం. పైగా పదిలం,' అన్నాడు మహాకవి శ్రీశ్రీ. నేను నడిచిన దారి నూటికి తొంభైతొమ్మిది మంది నడిచి చదును చేసిన దారి కాదు. నా బాటను నేనే వేసుకొన్నాను. ఆ దారిలో ముళ్ళ కంపలూ, గులకరాళ్ళూ, ఎత్తుపల్లాలూ లేకపోలేదు. ఎత్తు ఎక్కడం కష్టమైనా, పల్లాల్లో పడి లేచినా, ముళ్ళకంచెలు పాదాలను గాయపరిచినా వేసిన అడుగు వెనక్కు తీసుకోలేదు. ముందుకే నడిచాను. నా ముందు ఎవర్నీ నడవనివ్వలేదు. నా వెనకా ఎవర్నీ రానివ్వలేదు. ఒక చెయ్యి ఆసరాగా ఉంటే బాగుండు అనే ఆలోచనే రాలేదు.

ఆత్మవిశ్వాసంతో, దృఢ సంకల్పంతో, ఆత్మగౌరవాన్ని కాపాడుకొంటూ, నిర్భయంగా నేను కోరుకున్న మార్గంలో ముందుకే నడిచాను. నేను నమ్ముకున్న లక్ష్యసాధన కోసం నా ఈ యాత్రలో చేదు అనుభవాలు కోకొల్లలు. కాని వాటి తాలుకు చేదు నా మనసును తాకలేకపోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే నా జీవిత యాత్రా, నా సాహితీ యాత్రా వేరువేరు కావు. ప్రశ్న నుంచే నా జీవితం ప్రారంభం అయింది. ప్రశ్న నుంచే నా సాహితీ జీవితం జన్మించింది. అయినా మీ ముందు నా సాహితీ జీవితం గురించి మాత్రమే చెప్తాను.

రచయితల్ని చాలామంది 'మీ తొలి రచన ఎప్పుడు చేశారు, దానికి ప్రేరణ ఏమిటి?' అంటూ ప్రశ్నిస్తూంటారు. రచయితలు కూడా ఫలానా సంవత్సరం అనో, దానికి ఫలానా ప్రేరణ అనో ఠక్కున సమాధానం చెప్తారు. అలాంటి ప్రశ్న నాకు ఎదురైనప్పుడు సమాధానం చెప్పకుండా తప్పించుకోవడానికి ప్రయత్నిస్తాను. కారణం - నేను తొలిరచన ఎప్పుడు చేశానో నాకే తెలియదు. ఏడేళ్ళ వయసులోనే చేశాననుకుంటాను. లేక అంతకంటే ముందే కావచ్చు.

ఏమిటీ అతిశయోక్తులు అనుకుంటున్నారు కదూ? ఇవి నిజాలు. ఎలాగంటే...

నా చుట్టూ ఉన్న ప్రకృతినీ, జీవితాన్నీ చూసి కుతూహలంతో ప్రశ్నల మీద ప్రశ్నలు వేసి, పెద్దగా చదువుకోని మా అమ్మను విసిగించి దెబ్బలు తిన్నప్పుడు రాశాను - ఆరుబయట మంచం మీద పడుకొని ఆకాశం కేసి చూస్తుంటే, నా చిన్నబుర్రల్లో చందమామ గురించీ, నక్షత్రాల గురించీ, నీలాకాశం గురించీ ఎన్నెన్నో ప్రశ్నలు అల్లరిచేసినప్పుడు రాశాను. అమ్మలాటలూ, బొమ్మలాటలూ ఆడవలసిన నేను మగపిల్లలతో గోళీలూ, బచ్చాలూ ఆడి దెబ్బలు తిన్నందుకు కాక 'ఆడముండవు మగపిల్లలతో ఆ ఆటలేమిటి? బొమ్మలాటలు ఆడుకు పో,' అని శాసించినప్పుడు, నాలోపల ఏదో తిరగబడ్డట్టయి రాశాను. కోనేట్లో ఎప్పుడూ ఆడవాళ్ళ శవాలే ఎందుకు తేలతాయి? మగవాళ్ళ శవాలు ఎందుకు తేలవనే ప్రశ్నకు సమాధానం ఇచ్చేవాళ్ళు లేక మథనపడి రాశాను. వీధిబడిలో ఐదవ తరగతి పాసవ్వగానే ఇంట్లో కూర్చోబెట్టినందుకు రాశాను. పదేళ్ళు నిండిన నన్ను రోడ్డు దాటి మిడిల్ స్కూలుకు వెళ్ళకూడని ఆంక్ష విధించినప్పుడు ప్రతిఘటిస్తూ రాశాను. నా చుట్టూ ఉన్న జీవితం గురించిన ప్రశ్నలు. సమాధానాలు దొరకని ప్రశ్నలు... ఆ ప్రశ్నలకు నాకు నేనే ఇచ్చుకున్న తెలిసీ తెలియని సమాధానాలు నా మస్తిష్కం అనే కాగితం మీద, నా ఆలోచనల కలంతో రాశాను. ఈ ప్రశ్నలు నన్ను నాతోటి ఆడపిల్లల్లా, అమాయకపు బాల్యంలోని ఆనందానికి దూరం చేశాయి. 'ఆలోచిస్తూ, పరిశీలిస్తూ, నడుస్తూ, అనుభూతి చెందుతూ చదువుతూ కూడా రచయిత రచనా వ్యాసంగంలో ఉన్నట్టే,' అంటాడు సోమర్‌సెట్ మామ్.

నా ఆలోచనలను అక్షరాల్లో బంధించి అర్ధ శతాబ్దం దాటిపోయింది. నా పద్దెనిమిదో ఏట నేను మద్రాసు వెళ్ళిపోయాను. అంత సంప్రదాయబద్ధమైన కుటుంబం నుంచి ఎలా వెళ్ళానో చెప్పాలంటే చాలా ఉంది. కేవలం నా రచనల గురించి మాత్రమే చెబుతాను.

నా మొదటి రచన జీవితం అంటే? అనే ప్రశ్నలో నుంచి వచ్చింది. మద్రాసు వెళ్ళిన మరు సంవత్సరంలో నాకు డబుల్ టైఫాయిడ్ వచ్చింది. నాకు అనిపించింది - నేను మృత్యువుకు దగ్గిరగా జరుగుతున్నానని? నేను చచ్చిపోతాను. చచ్చి ఎక్కడకు పోతాను? చావు అంటే ఏమిటి?

బతుకులో ఉన్నదీ, చావులో లేనిదీ ఏమిటి? అసలు నేను అంటే నాలోని చైతన్యమా లేక శరీరమా? ఇదేం ప్రశ్న. పిచ్చి ప్రశ్న. రెండూ కలిసే నేను. ఆత్మ అంటే ఏమిటి? దాన్ని ఎవరైనా ఎప్పుడైనా చూసి చెప్పారా లేక కేవలం ఊహలేనా? అసలు సృష్టితత్వం ఏమిటి? దీని అస్థిత్వం ఏమిటి? మనిషి మరణం అంటే ఎందుకు భయపడతాడు? మంచం పక్కనే దిగులుగా కూర్చుని ఉన్న మా అమ్మమ్మను చూశాను. పక్కవాటాలో ఉండే కూర్మా బాయి పిల్లవాడిని ఎత్తికొని నాకేసి జాలిగా చూడడాన్ని చూశాను. నా చుట్టూ ఉన్నవాళ్ళందరూ ఉంటారు. నా వస్తువులన్నీ ఎక్కడివక్కడే ఉంటాయి, నేను మాత్రం అకస్మాత్తుగా మాయం అయిపోతాను అనే ఆలోచనలతో తలబద్దలైతున్నది. తను లేని ఈ ప్రపంచాన్ని ఊహించుకోవడం వల్లనే మనిషిని మృత్యుభయం వెంటాడుతుంది. ఇలా పిచ్చిపిచ్చి ఆలోనలు. పెద్దగా చదువు కూడా లేని నా బుర్రలో ఆనాడే ఈ ఆలోచనలు క్యాన్సర్ వ్యాధిలా ఎటుబడితే అటు అల్లుకుపోయాయి.

నా బుర్రను, చీమలబారులా తొలిచేస్తున్న ఈ ప్రశ్నలన్నింటినీ అక్షరబద్ధం చేస్తే కాని, నాకు ఈ వ్యధ నుంచి విముక్తి లభించదు అనిపించింది. మంచం మీదే దిండును ఆసరాగా పెట్టుకు కూర్చుని మొదటిసారిగా నా ఆలోచనలను అక్షరాలలో బంధించాను. దానికి శీర్షిక కూడా *జీవితం అంటే?* అనే ప్రశ్నే!

నాకు జబ్బు చేసిందని తెలుసుకున్న కిన్నెర మాసపత్రిక ఎడిటర్, పందిరి మల్లికార్జునరావు తన సతీమణితో కలిసి వచ్చారు. నా మంచం మీద ఉన్న కాగితాలు తీసుకొని తలెత్తకుండా చదివారు. పూర్తిచేసి నా ముఖంలోకి ఆశ్చర్యంగా, జాలిగా చూస్తూ, 'ఇది రాసింది నువ్వేనా?' అన్నారు.

ఆ తెల్లవారే మద్రాసు జనరల్ ఆసుపత్రిలో నన్ను చేర్పించారు. దాదాపు 25 రోజుల తర్వాత, ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన నాకు మా అమ్మమ్మ కిన్నెర పత్రిక అందించింది. ఆ చిన్న రచన (అది కథ కాదు, వ్యాసం కూడా కాదు)ను, పెద్ద పెద్ద అక్షరాల్లో చూసుకొని థ్రిల్లింగ్‌గా ఫీలయ్యాను. నా బుర్రను నిరంతరం తొలిచే ప్రశ్నల నుంచి, పుట్టుకొచ్చిన నా మొదటి రచన ఇదే. దానిని చాలామంది పెద్ద రచయితలు మెచ్చుకున్నారని ఎడిటర్ చెప్పారు.

నా జీవితయాత్ర కూడా, నన్ను నిల్చున్నచోట నిలవనివ్వని ప్రశ్నలకు సమాధానాలను వెదుక్కొనే ప్రయత్నంలో నుంచే ఆరంభం అయింది. అడపా దడపా, నూటికి ఏ ఒకరిద్దరో ఎంచుకొనే అరుదైన మార్గంలో సాగించిన, నా ఈ ఒంటరి ప్రయాణం, వీధిబడిలోని ఐదో క్లాసు చదువుతో, హిందీ విశారద సర్టిఫికెట్‌తో, మద్రాసు మహానగరంలో, 18 ఏళ్ళ వయసులో అడుగుపెట్టడంతో ప్రారంభం అయింది. ఆ మార్గంలో, ఆనాటి నుంచి, ఈనాటి వరకు, నన్ను ఒక్కక్షణం కూడా విడిచి పెట్టకుండా, నాకు తోడు నీడగా నిలిచింది - నాలోని జిజ్ఞాస-పట్టుదల, ఇచ్ఛాశక్తి-ఆత్మవిశ్వాసం, నాకు ఊహ తెలిసినప్పట్నుంచీ నన్ను వెంటాడిన ప్రశ్నల పరంపరలే.

జీవితం అంటే అన్న రచన కథ కాదు. వ్యాసం కాదు. అందుకే నా మొదటి కథ సాంబయ్య పెళ్ళి అంటాను. నా చిన్నప్పుడు మా ఊళ్ళో, సాంబయ్య అనే ఒక అనాకారి యువకుడు ఉండేవాడు. అతడ్ని పిల్లలందరూ గేలిచేస్తూ ఏడిపిస్తూ ఉండేవాళ్ళు. ఒకరోజు అకస్మాత్తుగా, నేను మద్రాసులో హిందీ ప్రచారసభ హాస్టల్లో ఉన్నప్పుడు, ఆ సాంబయ్య నా బుర్రలో దూరి 'నా గురించి చెప్పు, చెప్పు,' అని ఒత్తిడి చేసినప్పుడు, అతడ్ని గురించి చెప్పకుండా ఉండలేక సాంబయ్య పెళ్ళి కథ రాశాను. అందుకేనేమో 50 ఏళ్ళ క్రితం రాసిన నా మొదటి కథ చాలామందికి ఈనాటికీ గుర్తుండడం, దానిని గురించి మాట్లాడడం నాకు ఆశ్చర్యాన్నీ, సంతృప్తినీ కలిగిస్తుంది. నా మొదటి కథ ఆంధ్రప్రభ వారపత్రికలో ప్రచురించబడింది. ఆ ప్రోత్సాహంతో ఇక వెనక్కు తిరిగి చూడకుండా, వరసగా కథలు రాసి ఆంధ్రప్రభకూ, ఆంధ్రపత్రికకూ పంపించేదాన్ని. ఎప్పుడూ నా ఏ ఒక్క రచనా తిరిగి రాలేదు. ఆ రోజుల్లో కథకు పదిరూపాయలు పారితోషికం ఇచ్చేవారు. 1954 డిసెంబరులో నా మొదటి పుస్తకం - కథల పుస్తకం విజయవాడ పబ్లిషర్స్ ప్రచురించారు.

'సాహిత్యానికి మనిషిని మార్చే శక్తి ఉందా?' అనే ప్రశ్న ఈనాటికీ వేస్తూనే ఉంటారు. చాలమంది లేదనే చెప్తారు. కాని, నాకు మాత్రం సాహిత్యం కొందరినైనా ఆలోచింప చేస్తుందనీ, ఆ ఆలోచనల ప్రభావం వారి జీవితాల్లో కొంతవరకైనా మార్పు తెస్తుందనీ నా నమ్మకం. అందుకు నా అనుభవాల్ని కొన్నింటిని మీ ముందు ఉంచుతాను.

అది 1954వ సంవత్సరం. అప్పుడు నేను హిందీ ప్రచారసభలో, హిందీ లెక్చరర్‌గా పనిచేస్తున్నాను. లేని కష్టాలను ఊహించుకుంటూ, తన చుట్టూ ఉన్నవాళ్ళు శత్రువుల్లా పని కట్టుకొని తనను వేధిస్తున్నారని భ్రమపడుతూ, తను బాధపడి ఎదుటివారిని హింసించే ఒక స్త్రీ పాత్ర చుట్టూ అల్లిన కథ రత్తమ్మ కష్టాలు. రత్తమ్మకు కష్టాలున్నయ్యో లేవో కాని నాకు మాత్రం ఆ కథ కష్టాలను తెచ్చి పెట్టింది. ఆ కథ హిందీ ప్రచారసభలో ఉద్యోగులందరూ విరగబడి చదివారని తర్వాత నాకు తెలిసింది. తెలుగువాళ్ళు చదవడమే కాకుండా, అక్కడ పనిచేసే ఇతర భాషల వాళ్ళకు కూడా వాక్యం వాక్యం తర్జుమా చేసి వినిపించారని కూడా తెలిసింది. నవంబరులో కథ అచ్చయింది. డిసెంబరులో నా సర్వీసెస్ ఇక మీద అక్కర్లేదని శ్రీముఖం అందుకున్నాను. ఒకరకంగా షాక్ అయ్యాను. అసలు సంగతి తర్వాత నాకు తెలిసింది. ఆ కథ నేను హిందీ ప్రచారసభ ప్రధాన అధికారి భార్య గురించి రాశానని ప్రచారం జరిగిందట. అక్కడ పనిచేసే ఏ ఒక్కరికీ ఆమె అంటే గౌరవం లేదు. చచ్చేంత భయం ఉండేది. అందుకే అందరూ ఉత్సాహంగా ఆ కథ చదివారు. నేను కేవలం ఆమెను దృష్టిలో పెట్టుకొని రాయలేదు. నేను కూడా పరోక్షంగా ఆమె హింసకు గురి అయి ఉన్నాను కనుక బహుశా ఆమె పాత్రే నా కథకు, నాకు తెలియకుండానే ప్రేరణ అయి ఉంటుంది.

అలా నా ఉద్యోగం పోయినందుకు కొంత బాధపడ్డాను. దీనివలన సాహిత్యానికి ఉన్న శక్తి ఎటువంటిదో నాకు అర్థం అయింది. ఒక కథ చదివి ఒక వ్యక్తి ఉడుక్కున్నాడంటే, తనను గురించి తను తెలుసుకున్నాడన్న మాటేగా? అలా తెలుసుకున్నవాడు తనను గురించి ఆలోచిస్తాడు. తనలోని లోపాలను తెలుసుకొంటాడు. ఆరోజు నుంచే సాహిత్యానికి ఒక ప్రయోజనం ఉందనే నమ్మకం నాకు ఏర్పడింది. అప్పటి నుంచి, నేను ఎందుకు రాస్తున్నాను? ఎవరి కోసం రాస్తున్నాను? ఎవరి గురించి రాస్తున్నాను? అని నన్ను నేను ప్రశ్నించుకొని కాని ఒక విషయం మీద రాయడానికి

ప్రయత్నించను. ఒక కథ ఒక రచయిత ఉద్యోగం పీకించిం దంటే, సాహిత్య ప్రభావం సమాజం మీద ఎంత ఉంటుందో ఆలోచించండి. ఇలా ఎన్నో అనుభవాలు ఉన్నాయి నాకు.

సమత నా రెండో నవల. 1969-70లలో సీరియల్‌గా వచ్చింది. అది సీరియల్‌గా వస్తున్నప్పుడు, రాజకీయ వర్గాలలో, ప్రభుత్వ ఉద్యోగుల్లో పెద్ద సంచలనాన్నే సృష్టించింది. ఒకనాడు లేచిపోయిన మనిషి అని ఈసడించుకున్న సమాజమే ఆమె చేతిలో పవర్ ఉందని తెలిసి, ఆమె చుట్టూ రాజకీయ నాయకులూ, పెద్దపెద్ద ఉద్యోగస్తులు చేరి, పాద నమస్కారాలు చేసి ఎలా పబ్బం గడుపుకున్నారో తెలియజేసేదే సమత నవల. సమతలోని స్త్రీమూర్తి నా బుర్రను రాత్రింబవళ్ళు తొలిచేసింది. ఈ నవల రాశాకకాని నాలోని అలజడి, తపన తగ్గలేదు. ఆ రోజుల్లో చాలామంది తమ పిల్లలకు సమత అని పేర్లు పెట్టుకున్నారు. ఇదే నవల సినిమాగా తీస్తే, సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ తిరస్కరించింది. తెలుగు సినీఫీల్డే కాక, బొంబాయి సినీఫీల్డ్ కూడా దీని మీద పెద్ద అలజడి తెచ్చింది. ఆనాటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ కూడా దీనిని గురించి వాకబు చేశారు. ఆ సినిమా పేరు ప్రజా నాయకుడు.

'నేషనల్ బుక్‌ట్రస్ట్ ఆఫ్ ఇండియా, న్యూఢిల్లీ'వారు ప్రచురించిన మాస్టర్ పీసెస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్ అనే ఎన్‌సైక్లోపీడియాలో, మొదటి నుంచి, ఈనాటివరకు (10 ఏళ్ళ క్రితం వరకు) వచ్చిన వేల నవలల్లో ఐదో, ఆరో నవలల్ని తెలుగులో మాస్టర్ పీసెస్‌గా గుర్తించారు. అందులో నేను రచించిన మట్టిమనిషి ఒకటి. దాన్ని వారు అన్ని ఇండియన్ లాంగ్వేజస్‌లోకి అనువదిస్తున్నారు. హిందీలో మిట్టి కె ఆద్మీ అనే పేరుతో పబ్లిష్ అయింది. దానిని, హిందీ పత్రికలలో హిందీ సాహితీవేత్తలు రివ్యూ చేస్తూ, మహా రచయిత ప్రేమ్‌చంద్ నవల గోదాన్‌తో పోల్చారు. ఇంతకంటే గొప్ప అవార్డు మరొకటి లేదనిపించింది నాకు. మట్టిమనిషి నా నాలుగో నవల. 70-71లలో ఆంధ్రప్రభ దినపత్రికలో సీరియల్‌గా వచ్చింది. భూస్వామ్య వ్యవస్థ శిథిలావస్థకు చేరుకుంటూ ఉండగా, పెట్టుబడిదారీ విధానం వేగంగా దూసుకొస్తూ ఉంది. ఆ సంధి యుగంలో గ్రామీణుల్లో పట్టణ జీవితం పట్ల వ్యామోహం పెరగసాగింది. రైతు కుటుంబాల నుంచి, ముఖ్యంగా స్త్రీలు, పట్టణాలలో కాపురాలు పెట్టి పెద్దలు సంపాదించిన ఆస్తుల్ని ఎలా నాశనం చేసుకున్నారో నా చిన్నతనంలో నేను చూశాను. విన్నాను. కష్టం చేసే రైతు కడగళ్ళ పాలైతే, మధ్యవర్తులు (దళారులు) ఎలా బాగుపడ్డారో (నియో రిచ్ వర్గంగా తయారయ్యారు) ఈ నవల చెబుతుంది. ఈ దోపిడీ వ్యవస్థ మారాలంటే ఏం చెయ్యాలో రవి చేత సూచనప్రాయంగా చెప్పించడం జరిగింది.

మట్టిమనిషి నవల ఉస్మానియా యూనివర్సిటీలో తెలుగు ఎం.ఏ. ఫైనల్‌కు ఐదు సంవత్సరాల పాటు పాఠ్యగ్రంథంగా ఉంది.

మరీచిక నిషేధం గురించి అందరికీ తెలిసిన విషయమే. ఈ వ్యవస్థ పట్ల అసంతృప్తికి గురైన యువతరం రెండు ఎక్స్‌ట్రిమిటీస్ వైపుకు మొగ్గింది. ఒకటి హిప్పీ కల్చర్ ప్రభావంతో మత్తుమందులకు అలవాటు పడడం. రెండు ఈ వ్యవస్థను మార్చడానికి సాగించిన నక్సలైట్ ఉద్యమం వైపు మొగ్గు చూపడం. ఇప్పుడు 35-45 సంవత్సరాల వయసులో ఉన్న యువకులు 'విద్యార్థి దశలో మీ మరీచిక చదివి ఉండకపోతే, నేను ఈనాడు ఇలా ఉండేవాణ్ణి కాదు,' అని ఎందరో నాతో అంటూ ఉంటారు. వారి పేర్లతో సహా చెప్పడానికి ఈ చిన్న వ్యాసంలో అవకాశం లేదు.

అవి, నేను స్త్రీ సంక్షేమశాఖలో రీజినల్ డైరెక్టరుగా పనిచేస్తున్న రోజులు. (1969-74) పంచాయితీరాజ్య వ్యవస్థలో పనిచేసే గ్రామసేవికలూ, ముఖ్య సేవికలూ, ఇతర లేడీ ఆఫీసర్లు - పురుషుల అధికార హింసకూ, సామాజిక హింసకూ ఎంత దారుణంగా గురి అవుతున్నారో స్వయంగా చూశాను. వారి బాధల గాథలు విన్నాను, ఆ వస్తువులే తీసుకొని రాబందులూ-రామచిలకలూ అనే పేరుతో నవల రాశాను. ఆ నవల చలనచిత్ర అనే పత్రికలో సీరియల్ అవుతున్న సమయంలో వరంగల్ టూర్ వెళ్ళాను. వరంగల్ జడ్పి ఛైర్మన్ జనార్థన్‌రెడ్డిగారు నన్ను డిన్నర్‌కు ఆహ్వానించారు. సమితి ప్రెసిడెంట్లూ, సర్పంచులూ, బి.డి.ఓ.లూ మొదలైన వారు ఆ డిన్నర్‌కు హాజరయ్యారు. డిన్నర్ ముగిసింది. అకేషన్ ఏమిటని జడ్జి ఛైర్మన్‌ను అడిగాను. 'మీరు రావడమే అకేషన్,' అన్నారు. ఆశ్చర్యంలో తలమునకలైపోతూ, 'ఎగతాళి చేస్తున్నారా?' అన్నాను.

'కాదు తల్లీ. నిజమే. ఈ డిన్నర్ మీ కోసం ఏర్పాటు చేసిందే. మిమ్మల్ని కలవాలని మావాళ్ళు కోరారు. మీరు మమ్మల్నందర్నీ రాబందుల్ని చేశారుగా? అందుకే,' నవ్వుతూ అన్నారు జనార్థన్ రెడ్డి. ఆయన కంఠంలో కినుక లేదు, ఫిర్యాదు లేదు. 'మాలోనూ కొందరు మంచివాళ్ళున్నారనీ, మీ రామచిలకల్లో కూడా రాబందుల్నే తన్నుకెళ్ళే వాళ్ళున్నారనీ రాస్తే సంతోషిస్తాం,' అన్నాడు ఒక సమితి ప్రెసిడెంటు నవ్వుతూ. ఇదే నవల చదివి, పటాన్‌చెరువు ప్రెసిడెంటు, 24 నాలుగేళ్ళ యువకుడు, తన పదవికి రాజీనామా చేసి సంగారెడ్డి కోర్టులో లాయర్‌గా ప్రాక్టీసు చేశారు. నేను సంగారెడ్డి వెళ్ళి ఆయనను కలిశాను. మా సంభాషణ గురించిన పూర్తి వివరాల్లోకి వెళ్తే 20 పేజీలు రాయొచ్చు. ఈ నవల, వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో బి.ఏ.కు పాఠ్యాంశంగా మూడు సంవత్సరాలు ఉంది.

మృగతృష్ణ అనే నా నవల చదివాక తనలో ఎలాంటి మార్పు వచ్చిందో, ఇటీవలే డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్‌గా పనిచేసి రిటైర్ అయిన డా॥ సరోజినీదేవి చెప్పారు. ఇప్పుడు కాదు ఇరవై సంవత్సరాల క్రితం చెప్పారు.

ఇలాంటివి ఎన్నెన్నో అనుభవాలు. ఎన్నని చెప్పను? నేను సాహిత్య సృష్టి ఒక సామాజిక బాధ్యతగా భావిస్తాను. నేను మొత్తం 66 పుస్తకాలు ప్రచురించాను. అందులో నవలలు 40, కథలు మూట పాతిక దాకా ఉంటాయి.

నేను నమ్మిందే చెప్పాను. నేను చెప్పిందే రాశాను. నా రచనలు చదివి ఎందరో ప్రభావితులు కావడానికి కారణం ఇదేనని నేను భావిస్తున్నాను.

ఇక నా గురించి - కాదు నా జీవితయాత్ర గురించి రెండు మాటలు చెప్తాను.

ఒక్కసారి మీరు అర్ధశతాబ్దం వెనక్కు వెళ్ళి సమాజాన్ని చూడండి. ఆనాటి స్త్రీ జీవిత పరిధినీ, చైతన్యస్థాయినీ ఈనాటి స్త్రీతో పోల్చి చూసుకోండి.

ఆనాడు - అంటే అర్ధశతాబ్దం క్రితం పద్దెనిమిదేళ్ళ నిండని ఒక ఆడపిల్ల, తను పుట్టి పెరిగిన ఆ పల్లెటూరు తప్ప, పక్కనే ఉన్న గుంటూరు కూడా చూడని ఆడపిల్ల వీధిబడిలో ఐదో క్లాసు మాత్రమే చదివి, విశారద అనే ఒక చిన్న సర్టిఫికెట్‌తో (ఇంగ్లీషు రాదు, తమిళం రాదు) మద్రాసు సెంట్రల్ స్టేషన్‌లో అడుగుపెట్టిన ఒక అమాయకపు ఆడపిల్ల ఎలాంటి మానసిక స్థితికి గురి అయి ఉంటుందో ఒక్కసారి ఆలోచించండి.

చిన్న వయసులో, ప్రపంచజ్ఞానం బొత్తిగా లేని నేను, మద్రాసు వంటి మహానగరం నడిబొడ్డున ఒంటరిగా నిలిచాను. అంత చిన్న వయసులో, ఒంటరిగా స్వతంత్రంగా, జీవితం ప్రారంభించిన నన్ను ఈ సమాజం బాధ పెట్టలేదు. పైగా ఈ సమాజం నుంచి బోలెడంత గౌరవం, ఆదరణ, ప్రేమను పొందాను. నేను ఏనాడూ ఈ సమాజం నాకేమిచ్చిందని ఆక్రోశించ లేదు. ఈ జీవితాన్ని ఇచ్చిన ఈ సమాజానికి నేను ఏమి ఇవ్వగలనని మాత్రమే ఆలోచించాను. ఈ సమాజానికి నేను ఇచ్చిన దానికంటే, ఈ సమాజం నాకు ఎక్కువే ఇచ్చిందని భావించాను, భావిస్తున్నాను. ఈ పురుషాధిక్య సమాజంలో ఏ మగవాడూ, ఎప్పుడూ నన్ను అవమానించలేదు, బాధించలేదు. అందుకు కారణం మగవాడిలోని సంస్కారం అని నేను అనుకోవడం లేదు. కారణం నాలోని అంతులేని ఆత్మవిశ్వాసాన్ని దృఢంగా, నిటారుగా నిలిచిన నా వ్యక్తిత్వాన్ని చూస్తూ, ఏ మగవాడికీ నన్ను కించపర్చే, లేక అవమానించే సాహసం లేకపోవడమేనని, ఆత్మగౌరవమే ఆస్తిగా భావించి జీవితయాత్రను సాగించిన నేను సగర్వంగా చెబుతున్నాను.

ఈనాడు, పెద్ద చదువులు చదివి, ఎంతో ప్రాపంచిక జ్ఞానాన్ని కలిగి ఉన్న లాయర్లూ, డాక్టర్లూ కూడా తమను, తమ చుట్టూ ఉన్న పురుషులు, వెలికిమాటలతో హింసిస్తున్నారని ఆత్మహత్యలు చేసుకోవడం చూస్తుంటే, నాకు ఏమనాలో అర్థం కాదు. ఆ ఆత్మహత్యలు చేసుకున్నవారి మీద సానుభూతి కలగదు. కోపం వస్తుంది. నేనెందుకిలా అంటున్నానో మీరు సహృదయంతో అర్థం చేసుకోగలరని భావిస్తున్నాను.

తమసోమా జ్యోతిర్గమయ అన్నారు మన పూర్వీకులు. నేను అవిద్య, అమాయకత్వం, అజ్ఞానం అనే తమస్సు నుంచి నాదే అయిన మార్గంలో పయనించి ఎంతోకొంత వెలుగులోకి వచ్చాననీ, ఆ వెలుగును చాలా కొద్దిగానైనా, నా రచనలద్వారా సమాజానికి పంచాననీ అనుకుంటున్నాను. నా ఈ సుదీర్ఘ ఒంటరి ప్రయాణంలో నేను అనుకొన్నదే చేశాను, నేను నమ్మిందే రాశాను. ఊహ తెలిసినప్పట్నించి నన్ను వేధించిన ప్రశ్నలకు సమాధానాల అన్వేషణలోనే నా జీవితయాత్రా, నా సాహిత్యయాత్రా సాగుతూ వచ్చాయి. అన్వేషణే నా ఊపిరి. నా అన్వేషణ ఆగినరోజు నేనూ ఆగిపోతాను. *

(తానా సమావేశాల్లోని సాహితీ సదస్సులో చదివిన ప్రసంగవ్యాసం)

www.PASSPORTinAday.com

www.VISAinAday.com

Traveling soon?? Need passport/visa???
Yes, we are the right answer.

WE EXPEDITE U.S.A and INDIA PASSPORTS AND FOREIGN VISAS

Keeping in mind, the anxiety of our clients while making a last minute trip, our experience guides you step by step, untying all the procedures in a simple and straight forward manner.

Committed towards excellent service, we are here for you since 1999.
*We offer a GUARANTEED service in EXPEDITING passports and visas in a day(24 hours)**



PASSPORT AND VISA SERVICE
TEL (972) 596-7288
FAX (972) 692-6844
Email: contact@passportnvisa.com

* required proof of expediting

ఈనాటి తెలుగు సినిమా

అట్లూరి శ్రీనివాస్
జంపాల చౌదరి

ప్రేమ లేక పగ అనే రెండు అంశాలే సినిమాలకు ముఖ్యం ఇప్పుడు. హీరోయిన్ ఒట్టి అందాలబొమ్మ మాత్రమే. స్వంతంగా డైలాగులు చెప్పే హీరోయిన్‌లను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు.



తెలుగు సినిమా
తీసేవారికి పరిశ్రమ
చూసేవారికి శ్రమ
-మల్లాది రామకృష్ణ శాస్త్రి

తెలుగునాట ప్రజలకు అందుబాట్లో ఉన్న వినోదాలలో ప్రముఖమైనది సినిమా. గత పదేళ్లుగా ప్రబలమైన ప్రైవేట్ టెలివిజన్ ఛానెళ్లు తమ ప్రోగ్రాముల కోసం చాలా వరకు తెలుగు సినిమాలపైనే ఆధారపడుతున్నాయి.

ఒకరకంగా చూస్తే గత పాతికేళ్లలో తెలుగు సినిమారంగం చాలా అభివృద్ధి చెందింది. ఇంతకు ముందెన్నడూ లేనంత సాంకేతిక నైపుణ్యం ఇప్పుడు తెలుగు సినిమాల్లో కనిపిస్తుంది. ఛాయాగ్రహణం, సంగీతం, రికార్డింగ్, ఎడిటింగ్, సెట్ నిర్మాణం, స్పెషల్ ఎఫెక్ట్స్ వంటి రంగాలలో అద్భుతమైన ప్రగతి కనిపిస్తుంది. పాటలు, ఫైట్లు కావాల్సిన విధంగా రావటానికి కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి మరీ తీస్తున్నారు. ఈమధ్య విడుదలైన కొన్ని సినిమాల బడ్జెట్లు పదిహేను కోట్లు దాటాయని చెప్పు కొంటున్నారు. అలాగే కొత్త సినిమాలకు మార్కెటు కూడా బాగా పెరిగింది. ఆంధ్రప్రదేశ్‌లో ఒక్కసారిగా మూడు, నాలుగు వందల థియేటర్లలో విడు దల అవటమేకాక, అదే సమయంలో రాష్ట్రాంతరాల్లోనూ, దేశాంతరాల్లోనూ విడుదలవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో విడుదలైన రోజునే అమెరికాలోనూ అదే సినిమా చూసే అవకాశం ఇప్పుడు ఉంది.

ఐనా, ప్రేక్షకుల్లోనూ, సినిమారంగంవారిలోనూ, తీవ్రమైన అసంతృప్తి కనిపిస్తుంది. ప్రేక్షకులకు ఆనందాన్ని, పరిశ్రమకు లాభాల్ని తెచ్చే సినిమాలు చాలా తక్కువగా ఉంటున్నాయి. అభిరుచిగల ప్రేక్షకుల, విమర్శకుల గోడు చెప్పనే అక్కర్లేదు. ఎవర్ని కదిలించినా, తెలుగు చిత్ర పరిశ్రమ సంక్షోభంలో ఉంది అనేవారే! ఇండియా టుడే పత్రిక అంచనాల ప్రకారం *అంజి, ఆంధ్రావాలా, నాని, అర్జున్, గుడుంబా శంకర్, శ్రీ ఆంజనేయం* వంటి భారీ చిత్రాలు (ఏడు నుంచి ఇరవై కోట్ల వరకూ బడ్జెట్), కొడుకు, నేను వంటి చిన్న చిత్రాలు (రెండు మూడు కోట్ల లోపు బడ్జెట్) దెబ్బతినటంతో 2004 సంవత్సరంలో చిత్ర పరిశ్రమ దాదాపు 120 కోట్ల పెట్టుబడి నష్టపోయిందట.

1980లో

పాతికేళ్ల క్రితం, అంటే, 1980లోకి ఒక్కసారి తొంగి చూద్దాం (సినిమా పరిభాషలో ఫ్లాష్‌బ్యాక్ అన్నమాట). ఆ సంవత్సరంలోనే కె. విశ్వనాధ్ దర్శకత్వంలో శంకరాభరణం, గౌతంఘోష్ దర్శకత్వంలో మాభూమి విడుదలయ్యాయి. ఈ సినిమాల ఘనవిజయం తెలుగు సినీమార్గాన్ని ఒక కొత్త మలుపు తిప్పుతుందని అందరూ ఆశించారు. అప్పట్లో పెద్ద హీరోల భారీ బడ్జెట్ (20-25 లక్షల బడ్జెట్) సినిమాలతో పాటు, కొన్ని ప్రయోగాత్మక చిత్రాలు, మరిన్ని చిన్న నిర్మాతల చిత్రాలు (2-6 లక్షల బడ్జెట్) ఉండేవి. సినిమా కథలు చాలా వరకు గ్రామీణ లేక మధ్యతరగతి సంసారాల చుట్టూ తిరుగుతూ ఉండేవి.

సినిమాలో హీరోతోపాటు హీరోయిన్‌కూ ప్రాముఖ్యం ఉండేది. ఎవరో ఒకరిద్దరు పర రాష్ట్రీయులు తప్ప నటీనటులు తమ సొంత గొంతుకలతో మాట్లాడేవారు. అప్పటికింకా టీవీలు, వీడియో క్యాసెట్లు లేవు. సినిమాల పెట్టుబడి, పంపిణీ, ప్రదర్శనలను డిస్ట్రిబ్యూటర్లు శాసిస్తూ ఉండేవారు. జిల్లాల, ప్రాంతాలవారీగా సినిమాలను కొనుక్కుని ప్రదర్శించటం అప్పుడే పెరుగుతుంది. మరీ చిన్న బడ్జెట్ ప్రయోగాత్మక సినిమాలు 11 గంటల ఆటలు (మార్నింగ్ షోలు)గా విడుదలవుతూ ఉండేవి. రాష్ట్ర ప్రభుత్వం, టికెట్‌కింత అని వినోదపు పన్ను వసూలు చేసేది. తొంభై శాతం తెలుగు సినిమాలు మద్రాసులోనే నిర్మించబడేవి.

మారిపోయిన చిత్ర పరిశ్రమ

ఫ్లాష్‌బ్యాక్‌లోంచి ప్రస్తుతానికి వస్తే పరిస్థితి చాలా మారింది. తెలుగు చిత్ర పరిశ్రమ దాదాపుగా మొత్తం హైదరాబాదు తరలి వచ్చేసింది. ప్రేమ లేక పగ అనే రెండు అంశాలే సినిమాలకు



ముఖ్యం ఇప్పుడు. హీరోయిన్ ఒట్టి అందాలబొమ్మ మాత్రమే. స్వంతంగా డైలాగులు చెప్పే హీరోయిన్‌లను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. డిస్ట్రిబ్యూటర్ వ్యవస్థ మాయమయ్యింది. చిన్న బడ్జెట్ సినిమాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ప్రయోగాత్మక సినిమాలు కరువైపోయాయి.

ఈ పరిణామాల వెనుక ఉన్న శక్తులు, పరిస్థితులు అనేకం. ప్రభుత్వ వినోద పన్ను విధానాలు, దెబ్బతిన్న పంపిణీవ్యవస్థ, కథ కన్నా నాయకుడి పైనే పూర్తిగా ఆధారపడటం, నాయిక ప్రాముఖ్యత తగ్గడం, దర్శకుడే కథకుడి అవతారం ఎత్తడం, పరభాషా చిత్రాల కథలపైన, నాయికలపైన ఆధారపడటం, సడలిన సెన్సార్ నిబంధనలు, ఆకాశాన్నంటుతున్న పారితోషికాలు, సామాన్యుడికి భారమైన వినోదం, ఇతర వినోద మాధ్యమాల నుంచి పోటీ వంటి అనేక విషయాల పరస్పర ప్రభావం వల్ల ఈనాటి తెలుగు సినిమా ఇలా తయారయింది.

ఇరవయ్యేళ్ళ క్రితం వరకూ తెలుగు చిత్రాలకు ఒక పటిష్టమైన పంపిణీ వ్యవస్థ ఉండేది. సినిమా నిర్మాణ సమయంలోనే డిస్ట్రిబ్యూటర్లు సినిమాకు పెట్టుబడి పెట్టి, తమకు అనుబంధంగా ఉన్న థియేటర్లలో సినిమాలు విడుదల చేసేవారు. సినిమా బాగా ఆడితే నిర్మాత, డిస్ట్రిబ్యూటర్, థియేటర్ యజమాని ముగ్గురూ లాభాలు పంచుకొనేవారు; నష్టం వస్తే ముగ్గురికీ దెబ్బ తగిలేది. 1970లలో, సినిమాలను జిల్లాల వారీగా, ప్రాంతాలవారీగా అమ్మటాలు, కొనుక్కొన్న వాళ్ళు థియేటర్లను రెంటుకు తీసుకోవటాలు మొదలుపెట్టాక, డిస్ట్రిబ్యూటర్ల పాత్ర నెమ్మదిగా తగ్గుతూ వచ్చి, పాత పంపిణీ సంస్థలు దాదాపుగా కనుమరుగయ్యాయి. సినిమా పూర్తయిన తరువాత దాన్ని అమ్ముకొన్న నిర్మాతకు ఆ అమ్మకం లో వచ్చిన లాభనష్టాలు తప్ప సినిమా విజయ, పరాజయాలతో ఇక సంబంధం లేదు. అలగే అద్దెకిచ్చిన థియేటరు యాజమాన్యానికి కూడా. లాభమూ, నష్టమూ రెండూ కొనుక్కున్న వాళ్ళవే. సినిమాని అమ్ముకోలేక పోతే మాత్రం నిర్మాతలు స్వయంగానే విడుదల చేసుకోవాలి లేదా ఫిలిం డబ్బాలను ఆఫీసులో పెట్టుకుని బయ్యర్ల కోసం ఎదురు చూస్తూ నష్టాన్ని భరించాలి.

1983లో ఎన్.టి. రామారావు ముఖ్యమంత్రి అయిన తరువాత, అంతకు ముందు ఉన్న వినోదపు పన్ను స్థానంలో శ్లాబ్ పద్ధతి ప్రవేశ పెట్టారు. వినోదపు పన్ను సేకరణలో అక్రమాలను నిరోధించటం ప్రభుత్వానికి ప్రధానమయితే, హిట్టు సినిమాల రాబడి పెంచుకోవచ్చని చిత్ర పరిశ్రమ భావించింది. ఈ పద్ధతిలో థియేటర్‌లో ఉన్న సీట్ల సంఖ్యను బట్టి వారాని కింత అని పన్ను ఉంటుంది; సినిమా హౌస్‌ఫుల్ అయినా, హాలు ఖాళీగా ఉన్నా పన్ను ఒక్కటే.

ఈ పరిస్థితిలో సినిమా హిట్టయినప్పుడు విపరీతమైన లాభాలు వచ్చినా, ఒకమాదిరిగా ఉంటే మాత్రం టికెట్ల ద్వారా వచ్చే రాబడి వినోదపు పన్ను కట్టటానికి కూడా సరిపోకపోవచ్చు. ఈ పద్ధతి భారీ ఓపెనింగ్స్ వచ్చే పెద్ద హీరోల చిత్రాల ప్రదర్శనలకూ, పంపిణీదారులకూ మంచి లాభదాయకంగా ఉంది కానీ, విడుదలయిన కొన్నాళ్ళకు నెమ్మదిగా ప్రేక్షకుల నోటిమాటపై పుంజుకునే చిన్న చిత్రాలు ప్రదర్శించటం రిస్క్‌గా మారింది.

ఈ కాలంలోనే సినిమా టికెట్ల ఖరీదుపై పూర్వం ఉన్న నియంత్రణ పోయింది. థియేటర్ యాజమాన్యం టికెట్లను తమ ఇష్టానుసారంగా నిర్ణయించుకోవచ్చు. దీనితో కొత్త సినిమాలకు, హిట్టు సినిమాలకు టికెట్ ఖరీదు చాలా ఎక్కువగా పెట్టేయవచ్చు. ఈ విధానంలో, సినిమా హిట్ అయితే వచ్చే రాబడి ఇదివరకు కంటే చాలా ఎక్కువ.

పెరిగిన నాయక పాత్ర

సినిమా మొదటి నుంచీ స్పెక్యులేషన్ వ్యవహారమే. గెలిస్తే జాక్‌పాట్ కొట్టేయచ్చు. ఈ ఆశతోనూ, సినిమావాళ్ళతో భుజాలు రాసుకుంటూ తిరగవచ్చు అన్న సరదాతోనూ, ఈరంగంలోకి రోజూ కొత్త ఆటగాళ్ళు డబ్బు సంచులతో దిగుతూ ఉంటారు. వీరిలో చాలామందికి సినిమాలు వ్యాపారం కన్నా వ్యామోహమే. పెద్ద హీరోల సినామాలు హిట్టయినప్పుడు కనకవర్షాలు కురిపిస్తాయి కనక వీరంతా ఆ హీరోలతో సినిమా తీయడానికి మోజు పడుతుంటారు. పెద్ద హీరోలు తమ సినిమాల తాలూకు అన్ని వ్యవహారాలనూ, తారాగణం, కథ, సాంకేతిక నిపుణులతో సహా, నియంత్రిస్తూ ఉంటారు. దర్శకుడు సినిమాని హీరో ఇష్టానుసారంగా తీయా ల్సిందే. హీరోలు సినిమా నిర్మాణంలో జోక్యం కల్గించుకోవటం పాత రోజుల్లో కూడా ఉన్నా, ఇప్పుడు ఉన్న విస్తృతితో పోల్చుకొంటే, అదేమంత చెప్పుకోదగ్గది కాదు. నిర్మాత, దర్శకులు కథను తయారు చేసుకున్నాక తారల ఒప్పందం పొందటం పూర్వపు విధానమయితే, ముందు నాయకుడు దర్శకుణ్ణి నిర్ణయించి, తన ఇమేజ్‌ని పెంచే కథాంశానికి ఓకే చెప్పి, సంగీత దర్శకుణ్ణీ, సహ తారలనూ నిర్ణయిస్తే గానీ సినిమా నిర్మాణం మొదలవదు. దృష్టంతా నాయకుడి మీదే ఉండడంతో మంచి సినిమాకి ఉండాల్సిన మిగతా లక్షణాలను గురించి ఎవరూ పట్టించుకుంటున్నట్లు లేదు.

తెలుగు చిత్రాలలో చిరంజీవి రాక ఒక నూతన అధ్యాయానికి దారి తీసింది అనేది నిస్సందేహం. అప్పటిదాకా ఉన్న నృత్యాలకి, పోరాటాలకి

మరింత వేగాన్ని తెచ్చిన నటుడు చిరంజీవి. ఆయన నటన, నృత్యాలు యువతరానికి కావలసిన అంశాలు బాగా ఉన్న చిత్రాలను ఎన్నుకోవడంలో బావగారి (అల్లు అరవింద్) సహాయం ఆయన్ని అగ్రశ్రేణి కథానాయకుల్లో ప్రథముడిగా నిలబెట్టాయి. మెల్లమెల్లగా కథ మొత్తం కథానాయకుడిపైనే తిరగడం, నాయకుడి వీరోచిత విన్యాసాలు, నృత్యాలు పెరగడం, మిగిలిన సహ నటుల పాత్ర కూరలో కరివేపాకు చందంగా తయారు అవ్వడం మొదలయ్యింది. నాయకుల చుట్టూ తిరిగే చిత్రాలు విజయవంతం అవ్వడం వల్ల ప్రతి చిత్రానికి అంచనాలు పెరిగిపోవడం, పెద్ద హీరోలందరూ పారితోషికాలు భారీగా తీసుకొంటూ సంవత్సరానికి ఒకటి రెండు చిత్రాలకు పరిమితమవ్వటంతో రానురాను చిత్రాల సంఖ్య తగ్గుతూ వచ్చింది. పెద్ద హీరోలు, వారితో సినిమా తీసేవారు పెరిగిన బడ్జెట్ల కారణంగా రిస్క్ తీసుకోలేకపోవటంతో ఫార్ములా చట్రం నుంచి వారు బయటకు రాలేక పోతున్నారు.

పాత్ర, దుస్తులు తగ్గిన నాయిక

తెలుగు చిత్రాల్లో మొదట్లో తెలుగు నటీమణులే ఎక్కువ ఉండే వారు. అడపాదడపా ఇక్కడ నుంచి హిందీకి కూడా వెళ్ళేవారు. అయితే గత దశాబ్దంలో తెలుగు సినిమాలలో తెలుగు రాని నటీమణుల ప్రాముఖ్యం, వారి దుస్తుల పరిమాణం కూడా తగ్గిపోతూ వస్తున్నాయి. అప్పుడప్పుడూ సౌందర్యలాంటి నటీమణులు ఉన్నా వారి సంఖ్య తక్కువే. ముఖ్య కారణం నాయక పాత్ర ప్రాముఖ్యం పెరగడం, నాయిక పాత్ర గ్లామర్ బొమ్మకే పరిమతమవడం. అలాంటి పాత్రకి నటన అక్కరలేకుండా అందంగా కనిపిస్తే చాలు.

ఉత్తరాదిలో మాడల్స్‌నో, సినిమాలలో సరైన అవకాశాలు లేకుండా ఉన్నవారినో తీసుకొస్తే వారు ఎక్స్పోజింగ్‌కు అభ్యంతరం చెప్పరనీ, అశ్లీలమైన డైలాగులు వారికి అర్థం కావు కాబట్టి అడ్డు చెప్పకుండా చెప్పేస్తారని ప్రోడ్యూసర్లు నమ్మటంతో, హిందీ నాయికలు ఎక్కువ అయ్యారు. ఇప్పుడు తెలుగు సినిమా తీసే ప్రతివారు ముందుగా నాయిక కోసం ముంబై వెళ్ళి ఒక వారం ఉండి ఒక కొత్త మొహాన్ని వెతుక్కుని వస్తారు. ఖర్మకాలి ఆ సినిమా కనుక హిట్ అయితే, ఆమె ఇంకో రెండు సినిమాలకి 40 లక్షలు దాకా వసూలు చేస్తుంది. అప్పటికి ఆమె పాతబడి పోయిందని మళ్ళీ కొత్తముఖం కోసం వేట.

ఈ మధ్య అమృతారావ్ అనే నటీమణి చెల్లెలిని ఒక తెలుగు సినిమాకి అడిగారు. ఆ అమ్మాయి ఒక్క సినిమా కూడా విడుదల కాకుండానే 25 లక్షలు అడిగిందట. కత్రినా కైఫ్ అనే మోడల్‌కి (ఆమె అంతకు ముందు ఒక సెకండ్ రేట్ ప్లాప్ హిందీ సినిమాలో ముగ్గురు హీరోయిన్‌లలో ఒకరిగా నటించింది) ఎనభై లక్షలు పారితోషికమిచ్చారుట మల్లీశ్వరి అనే సినిమాలో హీరోయిన్‌గా నటించటానికి. ప్రస్తుతం ఒక్కో సినిమాకి సోనాలి బింద్రే, త్రిష 80 లక్షలు, శ్రియ 50 లక్షలు, జెనీలియా 40 లక్షలు తీసుకుంటున్నారట. తన నటనతో మూడు నంది అవార్డులు గెల్చుకున్న అందమైన తెలుగు అమ్మాయి లయలాంటి వాళ్ళకి 5 లక్షలు ఇవ్వడానికి కూడా ప్రొడ్యూసర్లకు వీలు కావడం లేదు పాపం. తెలుగులో పేరు రావాలంటే ఇప్పుడు ముఖ్యంగా కావాల్సింది తెలుగు రాకపోవడం, హిందీ అమ్మాయి అయి ఉండటం, నిర్మాత దర్శకులు అడిగినంతగా అందాలని తెర మీద ఆరబోయడం.

తెలుగు మాట్లాడ్డం సరిగా రాని (వచ్చినా వాచికం బాగుండదని) నటీనటుల పుణ్యమా అని డబ్బింగ్ ఆర్టిస్టుల పని బ్రహ్మాండంగా ఉంది. కళ్ళు మూసుకొని వింటే హీరోలందరూ ఒకే గొంతుతోనూ, హీరోయిన్ లందరూ అవే రెండు మూడు గొంతులతోనూ మాట్లాడుతూ ఉంటారు. టైటిల్స్‌లో డబ్బింగ్ ఆర్టిస్టుల పేరు వెయ్యటం, వారికి అవార్డులివ్వడం ఇప్పుడు మామూలైపోయింది. డబ్బింగ్‌లో కూడా తెలుగు రానట్లు మాట్లాడ్డం ఈమధ్య కనిపిస్తున్న మరో కొత్త ధోరణి.

తెలుగు కథలేని తెలుగు సినిమా

మిగతా భాషల్లో హిట్ అయిన సినిమాలని తిరిగి తీయడం మొదట్నించీ ఉన్నదే. అయినా, చాలావరకు తెలుగు చిత్రాల కథలు ఇక్కడే తయారు అయేవి. మొదట్లో పురాణ కథల్ని, కాంభోజరాజు కథల్ని, ఆ తర్వాత, ఇంగ్లీషు, బెంగాలీ నవలల్ని సినిమాకి సరిపడా మార్చుకొనేవారు డాక్టర్ చక్రవర్తి సినిమా నుంచి తెలుగు నవలల్ని, కథల్ని సినిమాలుగా తీయడం మొదలైంది. ఇలా 1980వ దశకం చివరి వరకు జరిగింది. గత పదేళ్ళలో తెలుగు సాహిత్యాన్ని సినిమాగా మలచిన ప్రయత్నాలు దాదాపుగా లేవనే చెప్పవచ్చు. ఇదే సమయంలో, మంచి సాంకేతిక విలువలతో తీసిన కొన్ని తమిళ సినిమాలు తెలుగులో డబ్బింగ్ చిత్రాలైనా ఘన విజయాలు సాధించాయి. గ్యారంటీ హిట్ ఫార్ములాల అన్వేషణలో ఉన్న దర్శక నిర్మాతలు దీనితో పరభాషలో, ముఖ్యంగా తమిళంలో హిట్ అయిన సినిమాల కథలను (ఈ మధ్య ఇంకా నిర్మాణంలోనే ఉన్న సినిమాల కథలను కూడా) పెద్ద మొత్తాలిచ్చి కొనడం మొదలెట్టారు. పెద్ద హీరోలు కూడా ఈ పరభాషా కథలపట్ల మోజు చూపటంతో ఈ ధోరణి ఇలాగే కొనసాగుతుంది. ఒకోసారి ఈ పరభాషా కథల్లో కనిపించే సంస్కృతి, కట్టుబాట్లు మన ప్రాంతాలకు ఎబ్బెట్టుగా అనిపించినా నిర్మాత దర్శకులు వాటిని మనకు అనువుగా మార్చే ప్రయత్నం కూడా చేయటం లేదు.

దీనికితోడు ఈ మధ్య తరచుగా వినిపిస్తున్న మాట ఏమిటంటే కథ కన్నా కథనం ముఖ్యం అని. అంటే కథ గురించి మరీ ఎక్కువగా ఆలోచించడం అనవసరం, దర్శకుడు డిఫరెంట్‌గా ట్రీట్‌మెంట్ ఇస్తే చాలు అని అర్థం అట. పూర్వం తెలుగు సినిమాలకు కథ స్క్రీన్‌ప్లేలు రాయటానికి రచయితలు వేరుగా ఉండేవారు. కథ, స్క్రీన్‌ప్లేలపై కనీసం ఇద్దరి మధ్య అయినా చర్చ జరిగేది. అసంగతాలను తగ్గించుకొని, పూర్తి స్క్రిప్టుతో షూటింగ్ మొదలుపెట్టేవారు. ఇప్పుడు చాలా సినిమాలకు దర్శకుడే రచయిత. అప్పుడప్పుడూ కొందరు దర్శకులు మంచి కథల్ని రూపొందించినా, చాలావరకూ వీరు ఒకటి రెండు లైనుల కథాంశాన్ని తీసుకుని హిట్‌ఫార్ములాల రెసిపీలతో వండటానికి ప్రయత్నిస్తుండటంతో వింత పదార్థాలు ప్రేక్షకుల ముందుకు వస్తున్నాయి. వ్యక్తి పూజ వ్యవస్థీకృతమైన ఈ రంగంలో స్టార్‌వేల్యూ ఉన్న హీరోలకూ, దర్శకులకూ వారి కథల్లో ఉన్న అసంబద్ధత గురించి చెప్పే ధైర్యం చేసేవారు చాలా తక్కువ.

పెరుగుతున్న నిర్మాణ వ్యయం

తెలుగు సినిమా నిర్మాణ వ్యయం అమితంగా పెరిగిపోయింది. ప్రముఖ నటుల, దర్శకుల, సాంకేతిక నిపుణుల పారితోషికాలు విపరీతంగా పెరిగిపోయాయి. పెద్ద హీరోలు తీసుకొనే పారితోషికం తెలుగు కన్నా చాలా పెద్ద మార్కెట్ ఉన్న హిందీ సినిమా నటులతో సమానంగా ఉంటోంది. వ్యాపార వర్గాల కథనాల ప్రకారం, *శంకర్ దాదా ఎంబిబిఎస్* సినిమాకు చిరంజీవి పారితోషికం దాదాపు 8 కోట్లట. ఒక్కో చిత్రానికి నాగార్జున 4 కోట్లు, వెంకటేష్, బాలకృష్ణ, పవన్‌కళ్యాణ్, ఎన్‌టిఆర్, మహేష్ బాబు మూడేసి కోట్లకు అటూ ఇటూగా తీసుకొంటున్నారని చెపుతారు. నాయికల పారితోషికాల గురించి ఇంతకు ముందే చెప్పుకున్నాం.

దర్శకుల పారితోషికాలు కూడా చుక్కల్లోనే ఉన్నాయి. వరసగా మూడు విజయవంతమైన చిత్రాలు తీసిన దర్శకుడు రాజమౌళి పారితోషికం 3 కోట్లట. కృష్ణవంశీ 3 కోట్లు, వినాయక్ 2 కోట్లు ఇలా ఉన్నాయి దర్శకుల రేట్లు. ఇదేవిధంగా సంగీత దర్శకులు, కెమేరామన్ వంటి ఇతర సాంకేతిక నిపుణుల రేట్లు కూడా. ఇంతింత మొత్తాలు తీసుకొంటున్నప్పుడు ఒక చిత్రం ఫ్లాప్ అయితే, దర్శకుడికి అవకాశాలు లేకుండా పోతున్నాయి. ఆ భయంతో, సినిమాని ఎలాగైనా హిట్ చేయాలనే తపనతో దర్శకులు నిర్మాణ వ్యయం బాగా పెంచేస్తున్నారు. ఇంతకు ముందు 60 రోజుల షూటింగ్ అంటే ఎక్కువ అనుకునేవారు. ఇప్పుడు 150 రోజుల దాకా షూటింగులు జరుపుకొంటున్న సినిమాలు ఉన్నాయి. ఒక మోస్తరు బడ్జెట్ సినిమా అయితే ఫారిన్‌లో పాటలు తప్పనిసరి. పాటల్లో పక్క డాన్సర్లు ఎంత ఎక్కువమంది ఉంటే సినిమా అంత రిచ్‌గా తీసినట్టు. అర్జున్ చిత్రానికి ఒక సెట్ వేయడానికి నాలుగు కోట్లు ఖర్చు పెట్టారని వినికిడి. చిత్ర నిర్మాణపు ఖర్చులు పెరగడానికి ఇంకో ముఖ్యకారణం పరభాషా నటులు, గాయకులు, సాంకేతిక నిపుణులపై మోజు. తెలుగు ఉచ్చరించటం సరిగారాని హిందీ గాయకుల కోసం, హిందీ రంగంలోని దుష్ట పాత్రధారుల కోసం పారితోషికాలు, వసతి సౌకర్యాల కోసం విపరీతంగా డబ్బు వెచ్చిస్తున్నారు.

ప్రచార ఆర్భాటాలు

ఈ వ్యయం సినిమా నిర్మాణంతోనే ఆగిపోవటం లేదు. ఒక చిత్రాన్ని విజయవంతం చెయ్యాలి అంటే సామదాన బేధోపాయాలు ఆలోచిస్తున్నారు మన నిర్మాత, దర్శకులు. ఒక చిత్రం ప్రచారానికి హీరో (జగపతి బాబు) థియేటర్లో టికెట్లు అమ్మాడట. ఇంకో సినిమా (పెళ్ళి సందడి) విడుదల అయిన వారానికే విజయయాత్ర పేరుతో నటవర్గమంతా అన్ని ఊళ్ళు తిరిగారు. ఆ దెబ్బకి ఆ చిత్రం విజయవంతం కాగానే మిగిలిన వాళ్ళు ఆ బాట పట్టారు. సినిమా పాటల ఆడియో విడుదల పేరిట పెద్ద హడావిడితో సినిమా విడుదల ప్రయత్నాలు మొదలవుతాయి. ఆ తరువాత, టీవీ చానెళ్ళలో ప్రకటనలూ, ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి. ఆపైన, సినిమా విడుదల అయిన మూడో రోజో, నాలుగో రోజో, విజయోత్సవ సభలు, యాత్రలు మొదలవుతాయి. రెండో వారంలో ఆడియో ప్లాటినం డిస్క్ సభ, మూడో వారంలో నిర్మాత దర్శకుల అభినందన సభ - ఇలా అనంతంగా సాగుతూ ఉంటుంది, నిర్మాత ధన శక్తిని సముదాయాలని బట్టి. నటులు, దర్శకులు ప్రచార మాధ్యమాల్లో (ముఖ్యంగా టీవీలో) వచ్చి, ఫ్లాప్ అయిందని ఖచ్చితంగా తెలిసిన సినిమాని కూడా గొప్ప సినిమా అని జనాలకి నచ్చచెప్పాలనుకోవడం విడ్డూరమే. వీటికి తోడు ప్రత్యేక బహుమతులు. ఈ మధ్య శ్రావణమాసం అనే ఫ్లాప్ సినిమాకు అరకేజీ బంగారం లాటరీ ఆశ పెట్టారు ప్రేక్షకులను థియేటరుకు రప్పించటానికి.

దిక్కుదోచని చిన్న బడ్జెట్ సినిమాలు

ఇప్పటిదాకా చెప్పుకున్న కారణాల వల్ల, చిన్న బడ్జెట్ అనుకునే చిత్రానికి కూడా విడుదలయ్యేసరికి కొన్ని పెద్ద ఖర్చులు తప్పటం లేదు. వీటికి తోడు శ్లాబ్ విధానం వల్ల ఈ చిత్రాల విడుదల రిస్క్‌గా మారింది. కొన్నేళ్ల క్రితం చిన్న బడ్జెట్‌తో, నూతన తారాగణంతో తీసిన చిత్రం, నువ్వేకావాలి సినిమాలు భారీ విజయం సాధించటంతో చాలా చిన్న చిత్రాలు నిర్మాణమయ్యాయి. వాటిలో దాదాపు 250 చిత్రాలు విడుదలకు నోచుకోక ఆగిపోయాయని అంచనా. జంధ్యాల తీసిన ఆరోగ్యవంతమైన హాస్య చిత్రాలు, బాపు, విశ్వనాథ్ లాంటి వాళ్ళు తీసిన సంసారపక్షమైన కళాత్మక చిత్రాలు నిర్మించటానికి పరిస్థితులు అనుకూలంగా లేవు. ఒకవేళ తీసినా, విడుదల చేయటం, ఆర్థిక విజయం సాధించటం ఇంకా కష్టం. బాగా పెరిగిపోయిన టికెట్ ధరలు, కాలక్షేపానికి అందుబాటులో ఉన్న టీవీ మధ్యతరగతి ప్రేక్షకులను థియేటర్‌కి రాకుండా ఆపేస్తున్నాయి. వీటికితోడు బాగా పెరిగిపోయిన వీడియో పైరసీ. అయినా ఈ అడ్డంకుల్ని దాటుకుని *ఐతే, ఆనంద్, ఆ నలుగురు* లాంటి ప్రయోగాత్మక చిత్రాలు విజయవంతమవడం అనేక విధాలుగా హర్షించాల్సిన పరిణామం.

వారసత్వాలు

ఇప్పుడు తెలుగు సినిమాలో కొట్టొచ్చినట్టు కనపడే ఇంకో ధోరణి వారసత్వం. నాగేశ్వరరావు, రామారావుల కుమారులు హీరోలుగా విజయవంతమవ్వడంతో, ప్రముఖ నటులు, నిర్మాతలు కోట్లు ఖర్చు పెట్టయినా తమ కుమారుల్ని (కుమార్తెలకు ప్రవేశం లేదు మళ్లీ) హీరోలుగా





ప్రవేశపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. అవసరమైతే మళ్ళీ, మళ్ళీ సినిమాలు తీస్తూనే ఉన్నారు. ఈ వారసత్వాల మధ్య బయటి నుంచి వచ్చే ప్రతిభకు అవకాశాలు దొరకడం బహుకష్టం అవుతోంది. వారసత్వపు పునాది లేకుండా విజయవంతమైన యువ నాయకుల్ని వెదికి లెక్క పెట్టుకోవాల్సిందే. ఒకటి, రెండు సినిమాలు ఫ్లాప్ అయితే వీరికి ఇంకో సినిమా దొరకటం కష్టం.

తెలుగు సినిమా రంగాన్ని ఐదు కుటుంబాలు శాసిస్తున్నాయని ఈ మధ్య ఇండియా టుడే మాసపత్రిక వ్యాఖ్యానించింది. నిర్మాతలుగా, హీరోలుగా విజయం పొందిన నాగేశ్వరరావు, రామారావు, కృష్ణ, చిరంజీవి, వెంకటేష్/రామానాయుడు కుటుంబాల వారసులు నటన, నిర్మాణం, స్టూడియో, పంపిణీ వ్యవస్థల్లో బలంగా వేళ్ళు దించుకున్నారు. చిత్రపరిశ్రమ వారసత్వపు హీరోల చుట్టూ ఎంత కేంద్రీకృతమయిందో చెప్పటానికి ఇది ఒక ఉదాహరణ.

సడలిన సెన్సార్ విధానాలు

సెన్సార్ కోడ్ పెద్దగా మారకపోయినా, సెన్సార్ విధానాలు చాలా మారాయి. చిత్రాల్లో హింసాత్మక దృశ్యాలు, అశ్లీల సంభాషణలు, నాయికల అంగాంగ ప్రదర్శనలు పూర్వపు హద్దుల్ని ఎప్పుడో దాటేశాయి. సెన్సార్ అధికారులు సినిమాలో మార్పులు చేస్తే నిర్మాత ఏమైపోతాడో అని నిర్మాతపరంగా ఆలోచిస్తూ, ప్రేక్షకుల పట్ల, సమాజం పట్ల వారికి ఉన్న బాధ్యతను పట్టించుకోవటం లేదని ఒక ఆరోపణ. చిన్న పిల్లలు చూడడానికి అనువైన యు (యూనివర్సల్) సర్టిఫికెట్ ఉన్న సినిమాల్లో ఉండే శృంగారం, హింసలు చిన్నారి మనసులపై ఎలాంటి ప్రభావాన్ని చూపిస్తాయో ఎవరూ పట్టించుకొంటున్నట్లు లేదు. టీవీ పిల్లల కందుబాటులో ఉండే సమయాల్లో అమెరికన్ వ్యవస్థ చూపే నియంత్రణ ఇండియాలో అమలులో లేకపోవటంతో ఈ శృంగార (బూతు?), హింసాత్మక సన్నివేశాలను అన్నివేళలా టీవీ చానెళ్ళలో ఎట్టి కట్టుబాట్లు లేకుండా చూపుతున్నారు. ఈ విశృంఖలత్వం సమాజ భవిష్యత్తుని ఎంత విషపూరితం చేయబోతుందో తలచుకోవటానికే భయం వేసే పరిస్థితి.

చివరగా...

తెలుగులో మంచి (వస్తుపరంగా కానీ, వినోదపరంగా కానీ) చిత్రాలు రావడం లేదు అని కాదు కాని వాటి సంఖ్య చాలా తక్కువ. ప్రేక్షకులు చూస్తున్నారు కాబట్టి మేం తీస్తున్నాం అని నిర్మాత దర్శకులు, హీరోలు బుకాయిస్తున్నా, చెత్తగా తీసిన భారీ చిత్రాలు దారుణంగా దెబ్బతినటం, కథపైనా, సాంకేతిక విలువలపైనా శ్రద్ధ పెట్టి తీసిన ఐతే, ఆనంద్ లాంటి చిత్రాలు విజయవంతమవడం ఈ మాటల్లో ఉన్న బోలు తనాన్ని నిరూపిస్తున్నాయి. వైవిధ్యమూ, వినోదమూ, విలువలూ ఉన్న సినిమాలని ప్రేక్షకులు ఆదరిస్తూనే ఉన్నారు. తెలుగు సినిమా నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న చాలామందికి సినిమా ఒక కళాత్మకమైన వ్యాపారంగా కాక ఒట్టి వ్యాపారంగానూ, ఒకోసారి జూదంగానూ మారటం శోచనీయం. చిత్రరంగాన్ని శాసిస్తున్న పెద్ద హీరోలు, నిర్మాతలు, దర్శకులు విలువల పట్ల తమకున్న బాధ్యతను ఏమాత్రం పట్టించుకోవటం లేదు. గత దశాబ్దపు జాతీయ అవార్డుల్లో తెలుగు సినిమాలు దాదాపుగా మృగ్యమవడానికి ఇదే కారణం. శేఖర్ కమ్ముల, చంద్రశేఖర్, నీలకంఠ, చంద్ర సిద్ధార్థ వంటి కొత్త దర్శకులు, గుణ్ణం గంగరాజు వంటి అభిరుచి ఉన్న నిర్మాతలు ఈ పరిస్థితిని మారుస్తారని ఆశిద్దాం.

కొసమెరుపు

మార్చి నెల ఆఖరివారంలో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య పట్టణాలలో స్లాబ్ పద్ధతిని రద్దు చేయడానికి నిర్ణయం తీసుకొని, అదే సమయంలో టికెట్ ధరలకు గరిష్ట పరిమితిని (బాల్కనీ రూ.40) విధించింది. ఈ నిర్ణయాన్ని చిన్న చిత్రాల నిర్మాతలు, థియేటర్ యజమానులు ఆహ్వానించగా, పెద్ద చిత్రాల నిర్మాతలు అసంతృప్తిగా ఉన్నారు. ఈ నిర్ణయాలు తెలుగు సినిమాపై సంచలనాత్మకమైన ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది. ఇది మంచికే దారి తీస్తుందని కోరుకుందాం.

*

ఆత్మకథని రాయటమా? మానటమా?

వేమూరి వెంకటేశ్వరరావు

ఆ రాత్రి బాపిరాజుగారి రచనలలో రైలుబండి ప్రసక్తి పునరావృత మౌతూ పదేపదే (ఇంగ్లీషులో చెప్పాలంటే, రైలుబండి మోటివ్) ఎక్కువగా కనిపించింది. నారాయణరావు నవల రైలుబండి ప్రయాణంతోటే మొద లవుతుంది. గుడ్డిపిల్ల కథ కూడ రైలుబండి ప్రయాణంతోటే మొదలవుతుంది.



నా జీవితచరిత్ర రాసుకుంటే ఎలా ఉంటుందో అని అప్పుడప్పుడు అనిపించేది. సామాన్యుడి జీవితంలో చెప్పుకోదగ్గ విషయాలు ఏముంటాయి? 'అయినా సరే స్వీయచరిత్ర రాయటంలో కొంత సొగసుంది. కనీసం దినచర్యలాగో, జర్నల్‌లాగో కొద్ది పేజీలు రాసి చూడండి,' అన్నారు శ్రీ పెమ్మరాజు వేణుగోపాలరావు. 'ఇంగ్లీషులో రాయండి. మన పిల్లలు పెద్దవాళ్ళయిన తర్వాత చదువుకుంటారు.' ఈ సలహా నా బుర్రకి ఎక్కలేదు.

అవి శ్రీ రాచకొండ విశ్వనాథ శాస్త్రి పరమపదించిన కొత్త రోజులు. అప్పట్లో బతికున్న తెలుగు రచయితలలో విశ్వనాథశాస్త్రి అగ్రగణ్యుడని చందూరి మురళి ఎన్నోసార్లు అనటంతో ఇప్పుడేనా ఆయన రాసిన రాతలు చదవకపోతే పరువు పోతుందని భయపడుతున్న రోజులవి. విశ్వనాథశాస్త్రి అంత కొమ్ములు తిరిగినవాడని అంతవరకు నాకు తెలియదు. నేను అమెరికా రాక పూర్వం ఆయన కథలు చూసిన జ్ఞాపకం లేదు.

ఈ సందర్భంలోనే విశ్వనాథశాస్త్రి తన చిన్నతనంలో రాసుకున్న దినచర్యని కొన్నాళ్ళు రచన పత్రికలో ప్రచురించేరు. ఈ అవకాశం జార విడవకూడదని ఆ దినచర్యని చదవటం మొదలుపెట్టేను - పువ్వు పరిమళించే ముందు ఎలా ఉంటుందో చూడాలన్న కుతూహలంతో. దరిమిలా శాస్త్రి వారసులు కోర్టు నోటీసు ఇచ్చి ఆ ప్రచురణని ఆపు చేయించేరు. ఇంతకీ చెప్పొచ్చే విషయం ఏమిటంటే ఆ దినచర్యని చదువుతున్నంతసేపూ ఆ రోజులలో సమాజం ఎలా ఉండేదో, ఒక కుటుం బంలో ఆర్థిక పరిస్థితులు ఎలా ఉండేవో కొంచెం అవగాహన అయింది. కనుక దినచర్యలకి, జీవితచరిత్రలకి ఓ స్థానం ఉందన్న మాటే కదా!

చరిత్ర పుస్తకాలు చదువుతూ ఉంటే పూర్వకాలంలో రాజులు ఏమిటి చేసేరో తెలుస్తుంది కాని, సామాన్యులు ఎలా బతికేవారో అర్థం కాదు. ఎక్కడో శ్రీనాథుడిలాంటి కవులు సామాన్యుల గురించి రాసేరు తప్ప, మిగిలిన చరిత్ర అంతా పాలకవర్గానిదే.

నా జీవితంలో చెప్పుకోదగ్గ సంఘటనలు లేకపోయినా నేను కలిసిన వ్యక్తులు ప్రసిద్ధులు కావచ్చు, చూసిన సంఘటనలు చారిత్రాత్మకం కావచ్చు, గడిపిన రోజులు గడ్డు రోజులు కావచ్చు. అందుకని ఆత్మకథ రాసి చూద్దామనే నిశ్చయానికే వచ్చేను. కాని కీబోర్డు మీద వేళ్ళు కదనం చెయ్యలేదు.

ఈ ఆలోచనలన్నీ 1995 నాటివి. ఆ ఏడు శ్రీ విశ్వనాథ సత్యనారాయణ శత జయంతి. అందుకని ప్రపంచవ్యాప్తంగా, తెలుగు వాళ్ళున్న అన్ని దేశాల్లోనూ, చంద్రుడికో నూలుపోగులా, కవిసామ్రాట్టు గురించి ఎవరికి తోచిన విధంగా వారు మననం చేసుకుంటున్నారు.

శ్రీ సత్యనారాయణగారి శతజయంతితో పాటు శ్రీ అడవి బాపిరాజు శత జయంతి కూడ కలిపి, రెండూ ఒకేసారి దశమ తానా సభలలో, 4 జులై 1995న షికాగోలో జరిపేరు. ఆ సభకి నేను వెళ్ళటం తటస్థపడింది. శ్రీ బాపిరాజు గురించి నాలుగు ముక్కలు చెప్పమని ద్రోణంరాజు రామ కృష్ణ, జొన్నలగడ్డ మల్లేశ్వరశర్మ ఆదేశించారు. నాకు సత్యనారాయణగారి గురించి బహు కొద్దిగా తెలుసు. భిలాయిలో ఉన్నప్పుడు, వేయిపడగలు చదివినట్లు లీలగా జ్ఞాపకం ఉంది. బాపిరాజుగారి గురించి ఆ మాత్రం కూడ తెలియదు. నారాయణరావుని చదివిన జ్ఞాపకమే లేదు!

అవి నేను బందరు హిందూ కాలేజీలో ఇంటరు చదువుతున్న రోజులు. పాఠ్యభాగాలని ముక్కున పట్టి పరీక్షాపత్రాలని నింపడమే తప్ప తెలుగు సాహిత్యంతో పరిచయం అంతంత మాత్రమే అయిన డింభక దశలో ఉన్న నాకు తోటి విద్యార్థి, సూరపనేని వెంకటరామయ్యతో పరిచయం అయింది. అతను పదహారేళ్ళప్పుడే తెలుగు పద్యాలు రాసేవాడు! గుర్రం జాషువా గబ్బిలాన్ని నాకు పరిచయం చేసి, నాచేత ఆ పుస్తకం చదివించేడు. అర్థం కాలేదు కాని చదివేను. త్రిపురనేని రామస్వామి చౌదరి పేరు ఇతను చెప్పగ నేను మొట్టమొదట విన్నాను. గొడుగుపేటలో ఉన్న శంకరమఠంలో సత్యనారాయణగారు శ్రీమద్రామాయణ కల్పవృక్షంలో పద్యాలు చదివి వినిపిస్తారని విని అతనే నన్ను లాక్కెళ్ళాడు.

చిన్న సభామందిరం పెద్దలతో కిటకిటలాడిపోయి ఉంది. నేను, వెంకటరామయ్య - మేమిద్దరమే చిన్నవయస్సు వాళ్ళం! సత్యనారాయణ గారు పద్యాలు పాడుతూ ఉంటే శ్రవణానందమే! వాటి అర్థం ఆయన విడమరిచి చెబుతూ ఉంటే ఆహా అనిపించింది. నారికేళ పాకం అనిపించనే లేదు. నేను సత్యనారాయణగారిని శంకరమఠంలో మొదటిసారి చూసి నప్పుడు ఒక దినచర్య పొత్తంలో నా అనుభవాలు రాసుకుని ఉండుంటే ఆ అనుభవాలు జ్ఞాపకాలుగా మారి ఎంత బాగా ఉపయోగపడేవో కదా అని అనుకున్నాను.

కాని ప్రస్తుతం నా భుజాల మీద ఉన్నది బాపిరాజుగారి గురించి మాట్లాడే బాధ్యత. ఆయన రాసిన *రాగమాలిక* అనే కథానికల సంకలనం ఒకటీ, *నారాయణరావు* ప్రతి ఒకటీ నా చేతిలో పెట్టి ఆ రాత్రికి రాత్రి ఆ రెండు పుస్తకాలూ చదివి మర్నాడు ఉపన్యాసం ఇమ్మన్నారు.

మరి తప్పింది కాదు. రాత్రి తెల్లవార్లూ మేలుకుని ఆ రెండు పుస్తకాలూ వీలైనంత మట్టుకు చదివేను. చదువుతున్నంతసేపూ నా మనస్సు పరిపరివిధాల బందరు వైపు పరిగెడుతూనే ఉంది.

నేను చదువుకి బందరు వెళ్ళిన కొత్తలోనే అడవి బాపిరాజు స్వర్గస్తులయ్యారు. అప్పటికే శ్రీ శివకామయ్య ఆంధ్ర జాతీయ కళాశాలకి ప్రిన్సిపాలు పదవిలో ఉన్నారు. ఆ స్థానంలో బాపిరాజు ఉండేవారు కనుక ఆయన మరణం ఆ కాలేజీలో పెద్ద వార్త. ఇలా ఆ అర్ధరాత్రి జ్ఞాపకాల దొంతరలు తరుముకొస్తూ ఉండగా *రాగమాలిక, నారాయణరావు* చదివేను. *రాగమాలికలో గుడ్డిపిల్ల కథ* నన్ను బాగా ఆకర్షించింది. ఆ కథలో ఒక కుంటివాడు రైలు బండిలో బిచ్చమెత్తుకుంటూ ఒక గుడ్డిపిల్లని కలుసుకుంటాడు. తర్వాత ఆ పిల్లనే పెళ్ళి చేసుకుంటాడు. ఆ కథ చదువుతూ ఉన్నంతసేపూ బందరులో నంజప్ప హోటలుకి ఎదురుగా ఉన్న రాబర్ట్‌సన్ పార్కు గేటు పక్కన ఒంటికాలి మీద నిలబడి *శాంతమూర్తివని భ్రాంతి చెందితిని, కోపమేల శ్రీరామా!* అన్న పాట పాడుతూ ఉండే ఒక కుంటివాడు నా కళ్ళకి కట్టినట్లు అలా కనిపిస్తూనే ఉన్నాడు. గుండెలని కరిగించే ఆ పాట ఇప్పటికీ నాకు చెవులలో వినిపిస్తూనే ఉంటుంది. అతని పక్కనే ఒక గుడ్డిమనిషి కూర్చుని ఉండేది. బాపిరాజు గారి కథలోని కుంటివాడు, గుడ్డిపిల్ల వీళ్ళేనా అన్న అనుమానం ఆ రాత్రి నా మనస్సులో మెదిలిన మాట వాస్తవం. నా చిన్నతనంలోనే ఆ గుడ్డిపిల్ల కథ చదివి ఉంటే, ఆ తర్వాత ఆ ముష్టిపిల్లని చూసుంటే, చిన్నక్కతో ఆంధ్రజాతీయ కళాశాలకి వెళ్ళినప్పుడు బాపిరాజుగారిని కలుసుకునే అవకాశం దొరికి ఉంటే, అప్పుడు నా నోట్లో తడి ఆరిపోకుండా ఉండి ఉంటే, ఈ విషయం ఆయననే అడిగి ఉండేవాడినేమో!

ఆ రాత్రి బాపిరాజుగారి రచనలలో రైలుబండి ప్రసక్తి పునరావృత మౌతూ పదేపదే (ఇంగ్లీషులో చెప్పాలంటే, రైలుబండి మోటివ్) ఎక్కువగా కనిపించింది. నారాయణరావు నవల రైలుబండి ప్రయాణంతోటే మొద లవుతుంది. గుడ్డిపిల్ల కథ కూడ రైలుబండి ప్రయాణంతోటే మొదలవు తుంది. ఈ సంగతులే షికాగో సమావేశంలో చెప్పాను. ఒక సభలో నిలబడి తెలుగులో ప్రసంగించడం నాకు అదే మొదటిసారి.

ఈ సమావేశంలో నా ఉపన్యాసం అయిపోయిన తర్వాత బయటికి వస్తూ ఉంటే ఎవరో ఇండియా నుండి మొదటిసారిగా అమెరికా వచ్చిన వ్యక్తిలా ఒకాయన కనిపించేరు. ఆ బట్ట, ఆ కట్టూ, ఆ తీరూ, ఆ చూపూ... అన్నీ కూడా ఆయన ఎవరై ఉంటారో కొట్టొచ్చినట్లు చెప్పక చెబుతున్నాయి. ఎవరో రైతు అనుకున్నాను. కాకపోతే ఏ పల్లెటూరి బైతో అయుంటాడులే అనుకుంటూ, 'మన దేశం నుండి వచ్చిన వ్యక్తిలా ఉన్నాడు, పోనీ పలకరిస్తే ఏమి పోయిందిలే,' అనుకుంటూ పలకరించి ఆయన బ్యాడ్జి మీద పేరు చూశాను.

మదురాంతకం రాజారాం!

గతుక్కుమన్నాను. కాని ఏమీ తొణక్కుండా మాట్లాడుతున్నాను. ఆహా, ఓహోలు ఎంతసేపని? ఏదో విషయం ప్రస్తావించాలిగా! ఈ మాటా ఆ మాటా చెబుతూ ఆయన రాసిన కథ ఏదైనా గుర్తుకు వస్తుందేమో అని మస్తిష్కంలో శోధన యంత్రాన్ని నడపటం మొదలుపెట్టేను.

"మీరు రాసిన కథ ఒకటి ఎప్పుడో చిన్నప్పుడు చదివాను. ఇప్పటికీ నాకు అంతా వివరంగా జ్ఞాపకం ఉంది," అంటూ ఆ కథ యొక్క నఖ చిత్రం ఆయనకి చెప్పేను.

"నేనెప్పుడు అటువంటి కథ రాయలేదే."

అప్పుడు గుర్తుకు వచ్చింది. నేను అనుకుంటున్న కథ రాసినది శ్రీ రావూరి భరద్వాజ అని. నేను మెదలకుండా సంభాషణని మరోపక్కకి మళ్ళించేను.

అప్పుడు ఆయన నా పేరేమిటంటూ నా బ్యాడ్జి చూసేరు.

"ఈమధ్య మీరు రాసిన కథ ఒకటి ఆంధ్రప్రభలో చదివేను. సైన్సు అర్థంకాలేదు కాని, కథ మాత్రం విలక్షణంగా ఉంది," అన్నారు.

ఆయనకి విలక్షణంగా కనిపించిన కథ ఆర్థర్ సి. క్లార్క్ రాసిన ఒక కథని ఆధారంగా తీసుకుని నేను తిరగరాసిన కథ. పేరు *కాకతాళీయం.* కథ బాగుందనో, బాగులేదనో అనుంటే బాగుండిపోయేది. ఎటూ తేల్చకుండా, తుని తగవులా, విలక్షణంగా ఉందంటే ఎలా?

2

పైన రాసిన విషయాలన్నీ ఆత్మకథ నిజంగా రాద్దామన్న కోరికతో రాసినవి కావు, పోతన ఫాంట్లతో ప్రయోగం చేసి చూద్దామనే ఉద్దేశంతో రాసినవి.

ఇంగ్లీషులో వర్డ్ ప్రాసెసర్లు 1985 ప్రాంతాలనాటికి బహుళ ప్రచారం లోకి రాకపోయినా ఆఫీసు వాతావరణంలో కంప్యూటర్లతో పనిచేసేవారికి అందుబాటులోకి వచ్చాయి. ఇంగ్లీషు అక్షరాలనే వాడి ముగ్గులు వెయ్యటం, దీపావళి శుభాకాంక్షలు అంటూ దీపం బొమ్మలు వెయ్యటం లాంటి ప్రక్రియలతో పాటు తెలుగు అక్షరాలని కూడ ముగ్గు వేసినట్లు అమర్చి ప్రయోగాలు చేసేవారు, ఉత్సాహవంతులు. ఈ సందర్భంలో తెలుగులో వర్డ్ ప్రాసెసర్ నిర్మాణానికి ప్రథమ ప్రయత్నం చేసినవారు శ్రీ పెమ్మరాజు శ్రీరామరావు, కీ.శే. గోటేటి బాలకృష్ణమూర్తి. వీరు చేసిన పనిని నేను సంపాదకత్వం వహించిన *తానా సావనీర్*లో సమీక్షించేను.

తర్వాత, 1986 ప్రాంతాలలో, కాలిఫోర్నియా యూనివర్సిటీ, బర్క్లీ లోని దక్షిణ ఆసియా విభాగంలో పనిచేస్తున్న ప్రొఫెసర్ హార్ట్ అనే ఆసామి దగ్గర తెలుగు ఫాంట్లు ఉన్నాయని తెలిసి, పాతిక డాలర్లు పెట్టి ఆ ఫాంట్లు

కొన్నాను. ఆ ఫాంట్ల వాడకం నేర్చుకోవడానికి పిల్లలమర్రి రామకృష్ణ విపరీతంగా సహాయం చేశాడు. ఏతావాతా, ఈ బర్ల్కీ ఫాంటు వాడటంలో బాగా ప్రావీణ్యత సంపాదించాను. సాధన చేస్తేనేకదా దేంట్లోనైనా ప్రావీణ్యత వచ్చేది. సాధన చెయ్యడానికి నాకు తయారుగా ఒక పని దొరికింది. అదేమిటంటే...?

1968 నాటికే నాకు సైన్సు తెలుగులో రాయటం ఒక వ్యసనంగా తయారైంది. అప్పట్లో నా దగ్గర నిఘంటువు ఏదీలేదు. నాకు అవసరమైన మాటలన్నీ చిన్న కాగితాల మీద రాసుకుని, ఆ కాగితాలని చెప్పులతో వచ్చిన అట్టపెట్టెలో పెట్టి దాచుకునేవాడిని. వాటన్నిటినీ ఎలాగైనా అకారాది క్రమంలో అమర్చి కంప్యూటర్లో దాచుకుంటే అవసరం వెంబడి వెతుక్కుని తీసుకోవచ్చు కదా అనే ఊహ ఒకటి ఉండేది. అందుకని నా దగ్గర ఉన్న మాటలన్నిటిని అకారాది క్రమంలో కంప్యూటర్‌లోనికి ఎక్కించే పని మొదలుపెట్టాను. బర్క్‌లీ ఫాంటుతో నే చేసిన ఈ ప్రయోగమే చివరికి నిఘంటువు రూపం దాల్చింది.

నేను వాడుతున్న బర్ల్కీ ఫాంటు అందంగా లేదని కొందరు గొణగటం మొదలుపెట్టారు. పోతన ఫాంటు బాగున్నదనీ, దానిని వాడమనీ ఒత్తిడి చేశారు. ఈ కొత్త ఫాంట్లతో చేసిన ప్రయోగమే ఆత్మకథ అన్న సాకుతో ఇలా అవతరించింది.

రాసింది చాలు. పోతన ఫాంట్లు అలవాటయ్యాయి కనుక ఇక ఆపేద్దామనే తరుణంలో రీడర్స్ డైజెస్ట్ మాసపత్రికలో కాలగమనం మీద ఒక వ్యాసం చూశాను. ఆ వ్యాసకర్త అనేదేమిటంటే, మనకి వయస్సు వస్తున్నకొద్దీ రోజులు రెక్కలు కట్టుకున్న పిట్టల్లా జోరుగా వెళ్ళిపోతున్నట్లు అనిపిస్తుందిట. భగవంతుడు ఇచ్చిన ఆయుర్దాయం మించి ఎవ్వరూ బతకలేరు కానీ, కనీసం రోజులు అంత జోరుగా గడచిపోకుండా ఉండటానికి అతనొక చిట్కా చెప్పాడు. ఏభయ్యో పడి దాటిన తర్వాత రోజుకి నాలుగైదు పేజీల చొప్పున ఆత్మకథ రాసుకోమన్నాడు. కనీసం అలాగైనా మరుపు దొంతరల మరుగున పడిపోయిన మధుర స్మృతులని జ్ఞప్తికి తెచ్చుకుంటూ ఉంటే కాలగమనం మందగించినట్లయి మిగిలిన



జీవితాన్ని ఆనందించవచ్చని అంటాడు ఆ ఆసామి. కనుక జీవితచరిత్ర రాయడంలో కొన్ని లాభాలు లేకపోలేదు.

పోనీలే, అలాగే రాద్దాం అనుకుంటూ ఉండగా శ్రీ అక్కిరాజు రమాపతిరావు నాచేత శ్రీ తిరుమల రామచంద్ర రాసిన హంపీ నుండి హరప్పా దాకా కొనిపించారు. అది చదివిన తర్వాత నేను సగం సగం రాసిన ఆత్మకథని అక్కడికక్కడే ఆపేద్దామన్న కోరిక పుట్టింది. రామచంద్ర 'నాకు ఏమీ తెలియదు. నేను చేతకానివాడిని' అంటూనే బ్రహ్మాండమైన స్వీయచరిత్ర రాసి పారేసారు. రాస్తే అలా రాయాలి. తగుదునమ్మా అంటూ నేను జీవితచరిత్ర రాయడమేమిటి? మనస్సు ఊగిసలాడుతోంది.

3

ఈ తటపటాయింపులతో దరిదాపు ఏడేళ్ళు కదిలిపోయాయి. రాసుకుంటున్నవాడిని రాసుకుంటూ కూర్చోకుండా 'నేను నా ఆత్మకథని రాసుకుంటున్నానర్రోయ్' అని అడిగినవాళ్ళకి, అడగని వాళ్ళకి టముకు వేసి చెప్పే స్వభావం నాది. ఇలా టముకు వేసుకుంటూన్న సందర్భంలో ఇంద్రగంటి పద్మ, శర్మలు - 'అయ్యా, తెలుగులో ఉన్న జీవితచరిత్రలలో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథ మీరు తప్పక చదివి తీరాలి,' అని ఎన్నోసార్లు అన్నారు. కాని వారి ప్రతి ఎవరో అరువు తీసుకెళ్ళారుట. ఎప్పుడైనా మీరు మళ్ళా మా ఊరు వచ్చినప్పుడు ఇస్తాంలెండి అన్నారు. అరువిచ్చిన పుస్తకం తిరిగి రాదని వారికి ఇంకా తెలియని అమాయకపు భ్రమలో ఉన్నారు. అయినా ఆశగా రెండేళ్ళు ఎదురు చూశాను. ఆ పుస్తకం మళ్ళా వాళ్ళ గడప తొక్కలేదు.

జులై 2002లో ఇండియా వెళ్ళినప్పుడు హైదరాబాదులో పద్మ చెల్లెలు మాధవిని చూడటానికి వెళ్ళాను. వెళ్ళినప్పుడు శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి జీవితచరిత్ర ఊళ్ళో ఎక్కడ దొరుకుతుందని అడిగాను.

"మా ఇంట్లో ఉంది, పట్టికెళ్ళండి," అన్నారు.

"పుస్తకం, వనిత విత్తం - ఈ మూడు పరహస్తం గతం గత: అంటారు. పైగా నేను పరాయిదేశం వాడిని. కనుక నా పుస్తకం నేను కొనుక్కుంటాను," అన్నాను.

"ఈ పుస్తకం మీరు మళ్ళా తిరిగి మాకు ఇవ్వనక్కరలేదు. ఇది ఇటుపైన మీదే," అంటూ నా చేతిలో పెట్టారు.

శాస్త్రిగారి అనుభవాలు-జ్ఞాపకాలు చదివిన తర్వాత నాకు నా కథ రాయటానికి ఒకరకం భయం పట్టుకుంది. అలాగని మానేనా? లేదే! ఎందుకంటారేమో? శాస్త్రి ఉద్దండుడని ఒప్పుకుంటాను. కాని ఆయన రాసిన అనుభవాలూ-జ్ఞాపకాలులో, నా దృష్టిలో అనుగుణ్యత లోపించింది. తెలుగుని ఒకపక్క అందలం ఎక్కిస్తూనే పుస్తకం నిండా సంస్కృత పదాలు గుప్పించి ముంచెత్తారు. నాలుగు నిఘంటువులు వెతికినా దొరకని మాటలు ఆ పుస్తకం నిండా!

షరా: నిజానికి తెలుగులో ఆత్మకథలకి కొదువలేదు. పారనంది లక్ష్మీనరసింహం రచ్చబండలో ప్రచురించిన జాబితాలో దరిదాపు ఎనభై ఉన్నాయి. అన్నీ ప్రాచుర్యంలో లేకపోవచ్చు కాని, ఉండటం ఉన్నాయి.

కనుక ఇప్పటికీ ఇంకా ఆలోచిస్తున్నాను, రాయటమా? మానటమా? అని!

*

కవిత్వాన్ని తూచే తూనికరాళ్ళు

నందివాడ ఉదయభాస్కర్

ఎంత ప్రతిభ ఉన్న కవికైనా అన్ని కవితల్లోనూ, నిజాయితీని నిలుపుకుంటూ మంచి నడకనీ, చిక్కదనాన్నీ తుదికంటా సాధించడం కష్టమే. అందుకే ఒక సంకలనం మొత్తం తిరగేస్తే అందులో బహుశా రెండో మూడో గుర్తుండే కవితలు ఉంటాయి.



'కవిత్వాన్ని తూచే తూనికరాళ్లు నా దగ్గర లేవం'టూనే, మహాప్రస్థానానికి దీటైన యోగ్యతా పత్రాన్ని రాసాడు చలం. ఆ యోగ్యతా పత్రంలో కొన్ని వివాదాస్పద ప్రతిపాదనలు కూడా చేసాడు. 'తనకీ ప్రపంచానికీ సామరస్యం కుదిరేదాకా కవి చేసే అంతర్ బహిర్ యుద్ధా రావమే కవిత్వ'మన్నాడు. 'నెత్తురూ, కన్నీళ్ళూ తడిపి తయారుచేసిన కొత్త కవిత్వ'మన్నాడు. 'కొత్త రక్తాన్ని కదను తొక్కించే సంగీతం కవిత్వ'మన్నాడు. కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికి చలం చేసిన ఈ సూత్రీకరణ లేవీ లాక్షణిక గ్రంథాలలో మనకి కనబడకపోవచ్చు. ఐతే, శ్రీశ్రీ మహా ప్రస్థానం ఏవిధంగానైతే ఆధునిక వచన కవిత్వానికి ఒక కొత్త మార్గాన్ని చూపించిందో, అదే విధంగా చలం యోగ్యతాపత్రం ఆధునిక కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికి ఒక కొత్త మార్గాన్ని చూపించింది.

చలం ప్రతిపాదించిన సూత్రాలని ఒప్పుకోకపోయినా, కవిత్వాన్ని తూచేందుకు ప్రతి పాఠకుడు conscious గానో, sub-conscious గానో ఏవో కొన్ని ప్రమాణాలను ఎంచుకుంటాడు. కవిత్వాన్ని ఆషామాషీగా చదివే పాఠకులకి కూడా ఏది మంచి కవిత, ఏది కాదు అన్న విషయంపట్ల నిర్దిష్టమైన అభిప్రాయాలుంటాయి. కవితలోని శిల్పం కొందరినాకర్షిస్తే, అందులోని భావ సాంద్రత కొందరినాకర్షిస్తుంది. కొందరికి చెప్పిన పద్ధతి కన్నా చెప్పిన వస్తువు ఎక్కువ ముఖ్యమనిపిస్తుంది. కొందరికి కవితలోని లయ, పదాల ఎంపిక నచ్చుతాయి. ఇవన్నీ ఏదో ఒక స్థాయిలో మంచి కవిత కుండవలసిన లక్షణాలే. ఐతే, ఈ లక్షణాలన్నీ సమపాళ్ళలో ఉన్న ఆధునిక వచన కవితలు అరుదుగా కానీ మనకి కనబడవు. అందువల్ల ఎవరి అభిరుచిని బట్టి వాళ్ళ ప్రమాణాలు ఎంచుకుని ఆధునిక కవిత్వాన్ని విశ్లేషించుకోవలసిందే. సాంప్రదాయిక కవిత్వం విషయంలో కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికి లాక్షణీకులు అనేక సూత్రీకరణలు చేశారు. వాక్యాల్లో ఇమిడి ఉన్న రసాలనీ, వాటి అంతర్గత భావాన్నీ, సౌందర్యాన్నీ అర్థం చేసుకునేందుకు వీలుగా అనేక గ్రంథాలు రాశారు. ఐతే, ఆధునిక కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికి నాకు తెలిసినంతవరకూ అటువంటి లాక్షణిక గ్రంథాలు అందుబాటులో లేవు. ఆ లోటుని తీర్చే సామర్థ్యం నాకు లేకపోయినా, ఆధునిక వచన కవిత్వాన్ని అభిమానించే ఒక పాఠకుడిగా, కవిత్వాన్ని, ముఖ్యంగా ఆధునిక కవిత్వాన్ని-తూచేందుకు నేను ఎంచుకున్న తూనికరాళ్ళని ఈ వ్యాసం ద్వారా విశదీకరించే ప్రయత్నం చేస్తాను. యోగ్యతపత్రంలో చలం చెప్పిన అంతర్ బహిర్ యుద్ధారావాన్నీ, నెత్తురూ, కన్నీళ్ళూ తడిపి చేసిన టానిక్‌నీ, కొత్త రక్తాన్ని కదను తొక్కించే సంగీతాన్నీ, నాకర్థమైనంత వరకూ ఆధునిక కవిత్వానికి అన్వయించే ప్రయత్నం కూడా చేస్తాను.

కవిత్వాన్ని తూచేటప్పుడు నే వాడే మొదటి రాయి నిజాయితీ. నా మటుకు నాకు పదాల కూర్పు పట్ల శ్రద్ధ ఎంత ముఖ్యమో, చెప్పదలుచు కున్న విషయం పట్ల కవికున్న నిజాయితీ అంతే ముఖ్యమని నమ్మకం. చలం చెప్పిన అంతర్ బహిర్ యుద్ధారావంలో నెగ్గితే కవి నిజాయితీని ప్రదర్శిస్తాడు. ఓడినప్పుడు ఆ నిజాయితీ కొరవడుతుంది. ఎందుకంటే, తనకూ, ప్రపంచానికీ సామరస్యం కుదరాలన్న ఉద్దేశంతో కవిత రాసినప్పుడు, ఆ కవిత చాలా స్పష్టంగా, కవి తాను ఎంచుకున్న పాఠకులకి సూటిగా అందే విధంగా ఉంటుంది. అలా కాకుండా, పాఠకులని ముగ్ధులను చేసే ఉద్దేశంతో సందర్భానికి సరిపడని ప్రతీకలనీ, పద చిత్రాలనీ వాడినప్పుడు కవిత చేరవలసిన పాఠకులకి చేరదు.

నిజాయితీ ఉన్న కవి తన కవితలో చెప్పదలుచుకున్న విషయాన్ని బట్టి కవిత రూపాన్నీ, శిల్పాన్నీ ఎంచుకుంటాడు. శిల్ప సౌందర్యం కోసం భావాన్ని బలహీనపరచడు. అలాగే, తన పాండిత్యాన్ని చూపించు కునేందుకు చెప్పదలుచుకున్న విషయాన్ని పదేపదే చెప్పి కవిత్వాన్ని పలచ బారనివ్వడు. అన్నిటికీ మించి తాను ఏం చెప్పదలుచుకున్నదీ, ఎవరికి చెప్పదలుచుకున్నదీ, అన్న విషయంపట్ల చాలా స్పష్టమైన అగాహన కలిగి ఉంటాడు. అటువంటి అవగాహన ఉన్నప్పుడు కవి తన పాఠకులపట్ల ఎంతో వినమ్రతతో వ్యవహరిస్తాడు. 'నా కవిత అర్థం కాకపోతే అది మీ ఖర్మ' అనే అహంకారాన్ని ప్రదర్శించడు.

యాకూబ్ రాసిన దూదిపింజ కవితలో నాకీ నిజాయితీ కనిపిస్తుంది.

సత్యం ఎప్పుడూ తెల్లగానే ఉంటుంది
పగిలిన జీవితంలాంటి కాయల్లా
కాపు కాసే కాఠిన్యంలా ఎదురు చూస్తుంటుంది!
బొడిపెలు తేలిన పంట
బొడిపెల్లానే ప్రాణాలు కోరుకుంటుంది!
పత్తికాయల బొడిపెలు జననమరణాల సరిహద్దులు
నకిలీ మందులు, నకిలీ దిగుబడి కలలు
పంట పురుగుకు పోషణాహారం,
రైతుకు మరణశాసనం!
కళ్ళు తిరిగే అప్పు పత్రాల్తో
తెల్లని దూదిపింజె
ఒయ్యారాలు పోతుంది!
అసత్యం కూడా ఇప్పుడు తెల్లగానే ఉంది

కర్నూడి చావుకున్నట్లు పత్తి రైతుల ఆత్మహత్యలకి వెయ్యి కారణాలున్నాయి. ఆ కారణాలని పదమూడు పంక్తుల కవితలో ఇంత స్పష్టంగా, ఇంత కవితాత్మకంగా చెప్పడానికి కవికి పదాల మీద ఎంత పట్టుండాలో, అంతకు మించి గొప్ప దృష్టి, నిజాయితీ ఉండాలి. దూదిపింజె ఒయ్యారాలు పోవడంలో కొంత కవిత్వ పైత్యం ముదిరినా, మొత్తానికి నా దృష్టిలో ఇది మంచి కవిత.

ఈ నిజాయితీ లేనప్పుడు కవిత ఎన్ని పదచిత్రాలనూ, ప్రతీకలనూ వాడినా, పాఠకుడిని చేరుకోలేదు. చలం చెప్పినట్లు, తను చెప్పదలుచుకున్నది తనకే స్పష్టంగా తెలీనప్పుడు తన చేతగానితనాన్నీ, అర్థ అస్పష్టతనీ ఛందస్సు చరల వెనకా, అలంకారాల మధ్యా, కఠినపదాల బురఖాలలోనూ దాచి మోసగించాలని చూస్తాడు కవి. ముఖ్యంగా సహజ సౌందర్యం తక్కువైనప్పుడు. ఐతే, ఒక్కొక్కసారి తను చెప్పదలుచుకున్న విషయం స్పష్టంగా తెలిసిన కవి కూడా, తన సందేశాన్ని పాఠకుడికి అందివ్వడంలో విఫలమవుతాడు. దానికి కవి చేతగానితనం కన్నా, పాపినేని శివశంకర్ చెప్పినట్లు 'కవి, పాఠకులూ కలుసుకునే సమాన క్షేత్రం అదృశ్యమవ్వడం' ఎక్కువ కారణమవుతుంది. కవి తను చూసిన ప్రపంచాన్ని పాఠకులతో పంచుకోవడానికి అనేక అవరోధాలుంటాయి. కవికున్న ప్రపంచానుభవం, విస్తృతమైన అవగాహనా, పాఠకులకి కూడా ఉండాలనే నియమమేం లేదు కానీ, అలా ఉండకపోవచ్చన్న స్పృహ కవికి ఉండడం ముఖ్యం. జ్వాలాముఖి రాసిన శక పురుషుడు కవితలో ఇలా అంటాడు-

వచ్చినవాడు ఫల్గుణుడు కాదు
సభ బొచ్చిన బోడు
సాలభంజికల శేష ప్రశ్నలకు
కనీస సమాధానం కూడా కాదు
వచ్చినవాడు ఫల్గుణుడు కాదు

ఆ సాలభంజికల శేష ప్రశ్నల వైనమేమిటో, ఫల్గుణుడికి ఆ ప్రశ్నలకి ఉన్న సంబంధమేమిటో, ఈ ప్రతీకలు 80 ల్లోని రాజకీయాలకి ఎలా వర్తిస్తాయో ఆయన స్పష్టం చెయ్యలేదు. ఆ కథలన్నీ తెలిసిన వాళ్లకి కానీ, ఈ కవిత చెబుతున్నదేవిటో అర్థం కాదు. మరి ఒకప్పటి దిగంబర కవిగా, ఆ తదుపరి విరసంలోనూ, జనసాహితిలోనూ క్రియాశీల కార్యకర్త గా పనిచేసిన ఈ కవి తన కవితని అటువంటి కథలు తెలిసిన వాళ్ళనే ఉద్దేశించి రాసి ఉంటాడనుకోను. కవికి తన పాండిత్యం మీద మమకారమైనా ఎక్కువై ఉండాలి, లేదా పాఠకుల అవగాహనా శక్తిని ఈయన ఎక్కువగా అంచనా వేసుకునైనా ఉండాలి.

నా దృష్టిలో నిజాయితీలేని మరొక కవిత ప్రముఖ కవి గుంటూరు శేషేంద్ర శర్మ రాసిన నేను మానవ సూర్యుణ్ణి. ఆ కవితలో ఆయన ఇలా అంటాడు.

నీ కలని రెండు చేతుల్తో పుచ్చుకుని ఎక్కడ జారి
పడుతుందో అని
ఎందుకలా ఎదకు హత్తుకొని నడుస్తావ్;
ప్రవహించే కాలంలో పరుగెత్తే రంగుల చేప, జీవితం,
కన్నీళ్ల వలలో పడదు, కలల గాలానికి తగలదు-
రెక్క కొమ్మల్లో ఇరుక్కోకుండా
ఎగిరిపోయే పక్షిదే సుఖం...
అరే! బాధ చూచి నా కళ్ళు కన్నీళ్ళు కారుస్తున్నాయి,
నేను మనిషినన్న స్పృహ ఇచ్చే తృప్తి
మరేదీ నాకివ్వదు

జీవితం కన్నీళ్ల వలలో పడదనీ, కొమ్మల్లో ఇరుక్కోకుండా ఎగిరిపోమనీ పాఠకుడిని ఒకవైపు గదమాయిస్తూ, మళ్లీ వెంటనే బాధ చూచి తన కళ్లు కన్నీళ్ళు కారుస్తున్నాయనీ, ఆ కన్నీళ్ళే తనకి మనిషినన్న స్పృహ నిస్తున్నాయని అంటాడు. బాధా, కన్నీళ్ళూ తనని మానవ సూర్యుణ్ణి చేస్తున్నప్పుడు, పాఠకులని కలని ఎదకు హత్తుకుని నడవద్దని హెచ్చరించడం ఎందుకు?

కవిత్వాన్ని తూచడానికి నేనెంచుకున్న రెండవ రాయి చిక్కదనం. కవితలో గుండెల్లోకి సూటిగా దూసుకుపోయే బాణంలాంటి పదును ఉండాలి. కవిత ఎంత చిక్కగా ఉంటే పాఠకుడికి అంతగా గుర్తుండిపోతుంది. సందర్భమొచ్చినప్పుడు అప్రయత్నంగానే గుర్తుకొస్తుంది. చిక్కదనం ఉన్న కవిత చదవగానే గుండెల్లో ఒక అలజడి మొదలవుతుంది. కళ్ళల్లో ఒక చెమ్మ మిగిలిపోతుంది. ఆ కవిత ప్రేమ గురించయినా, స్త్రీ విముక్తి గురించయినా, యుద్ధంలో మరణించిన వీరుడి సంస్మరణయినా, ఒక్కొక్క అక్షరమూ చెవుల్లో దుందుభిలా మనసు నిండా మార్మోగుతుంది. చలం చెప్పిన నెత్తురూ, కన్నీళ్ళూ కలిపి చేసిన కవిత్వంలో ఈ చిక్కదనం ఉండి తీరుతుంది.

సతీష్‌చందర్ రాసిన కలవని కనుపాపలు కవితలో ఇలా అంటాడు-

మాదీ మావాళ్లదీ
ఒకరినొకరు చూసుకోలేని
కనుపాపల సహజీవనం
కన్నీళ్ళలా తోడే కొద్దీ ఉబికే బావి నీళ్ళు
రెంటికీ ఒకటే జల
అదే హృదయం కాబోలు

మధ్యలో ఎగనామం పెట్టుకున్న రోడ్డు
ఎవడో నిష్టాగరిష్టుడు
వాడి చేత కూడా మడి కట్టించాడు
అయినవాళ్లకి ఆకుల్లో
పిండాలు పెట్టించాడు
మాదీ మావాళ్లదీ
ఉరిపడ్డ ఖైదీలు పెట్టుకున్న
ఉచ్ఛ నీచాల వివాదం
పగిలిన కొబ్బరి చెక్కల్లా రెండు బావులు
అంతరంగమంతా ఒకటే తెలుపు
మధ్యలో తలంటుకున్న రోడ్డు

దళిత వర్గాల్లో మాలలకీ మాదిగలకీ మధ్య నీటికోసం జరిగే వివాదాల మీద రాసిన ఈ కవిత గుండెల్ని కకావికలం చేస్తుంది. కన్నీళ్ళలా తోడే కొద్దీ ఉబికే బావి నీళ్ళు, ఈ తగాదాల వల్ల పగిలిన కొబ్బరి చెక్కల్లా రెండు బావులవ్వడం, ఒకళ్ల బావికి మరొకళ్ళు పోకుండా నిషేధం, మాలవాడకీ, మాదిగ వాడకీ మధ్య ఎగనామం పెట్టుకున్న రోడ్డు. కలవని కనుపాపల విషాదం ఇలాగే ఉంటుంది.

పాటిబండ్ల రజని రాసిన అబార్షన్ స్టేట్మెంట్‌లో ఆవిడ తప్పనిసరి పరిస్థితుల్లో గర్భస్రావం చేయించుకున్న తల్లి ఆవేదనను ఇలా వ్యక్తం చేస్తారు.

అనుమతి లేకుండా అస్థిత్వం పొందిన నీ నేరానికి-
నా టెంపరరీ ఉద్యోగమూ, ఆరోగ్యమూ
నీకు మరణ శిక్షను ఖాయం చేస్తే
తల్లడిల్లుతూనే,
తప్పొప్పుల మధ్య తడబడతూనే
తలారివై బల్లెక్కి
రబ్బరు చేతుల ముసుగు నీ ముఖంపై కప్పి,
అభిమన్యుని శరాల కప్పజెప్పి
నిస్సహాయులైన పాండవుల్లా రోదిస్తూ,
పెథిడిన్ సెడేషన్‌లో నిన్ను పోగొట్టుకుని,
పగిలిన జిల్లేడు తాలూకు పింజనై సోలిపోతూ
నాలోని అమ్మని పాతిపెట్టుకుని
చెరుకుపిప్పినై పాలిపోతూ
కంసుడి కత్తిలాంటి ప్లాస్టిక్ బక్కెట్ మింగిన
ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ముద్దలాంటి నిన్ను చూసి-
మళ్లీ నా పాత్తిళ్లలో పాదువుకోవాలనీ,
పాలకై తడుపుకునే పెదవులుగా
అమ్మకై వెతుక్కునే చూపులుగా చెక్కుకోవాలనీ,
ఛిద్ర కలశాన్ని పూర్ణ శిల్పంగా దిద్దుకోవాలనీ,
ఇంత సుఖంగా నిన్ను చంపుకునే మార్గం కనిపెట్టిన వీళ్ళ ముఖాలపై
ఉమ్మ నీళ్లతో ఉమ్మేయ్యాలనీ, వెర్రి ఆవేశంగానూ-
కడుపు చించుకుంటే,
మనసు గాయం అయ్యి,
కడివెడు కన్నీళ్ల దు:ఖంగానూ ఉందిరా
అయ్యో!
పాలింకిపోవడానికున్నట్లు
మనసింకిపోవడానికి
మాత్రలుంటే ఎంత బావుండు!

ఈ చిక్కదనం లేనప్పుడు కవితలో సందర్భానికి తగని పద చిత్రాలూ, అనవసరపు పాండిత్య ప్రకర్ష కనబడతాయి. ఎంత మంచి అంశం ఎంచుకున్నా, అందులో కవిత్వం పలచబారుతుంది. ఉదాహరణకి ఇంత మంచి కవిత రాసిన రజని గారే ఊరడింపుకో ఉగాది కవితలో ఇలా అంటారు.

ఎన్ని ప్రభవంలు అక్షయల్దాకా గడిచినా ఈ
మాయా గమనంలోనే నడుస్తుంటాం మనం!
శ్రీముఖ వచ్చిందనగానే కొత్త ముఖం
వచ్చిందేమోనని ఆశగా అద్దంలో చూస్తాం!
భవా అంటే హమ్మయ్య! ఇక
అంతా సద్భావనే అని సంబరపడతాం!
ఈ ఊరడింపుల కోసమేనేమో ఉగాదులు

ఉగాది కవి సమ్మేళనానికి పిలిస్తే మొహమాటానికి రాసిన కవితలా ఉందిది. శ్రీశ్రీ నించి పాటిబండ్ల రజని వరకూ ప్రతిభ ఉన్న ఎందరో మంచి కవులు ఇటువంటి పనికిరాని ఉపమానాలతో ఉగాది కవిత్వం రాయడం బహుశా మన తెలుగు వాళ్ళకే పట్టిన దురదృష్టమనుకుంటాను.

కవిత్వాన్ని తూచేందుకు నేనెంచుకున్న మూడో రాయి నడక. దీన్ని నిర్వచించడం కొంచెం కష్టం. కవిత అంటే పదిమందికి వినిపించగలగాలి. బిగ్గరగా చదవడానికి అనువుగా ఉండాలి. వాక్యానికీ వాక్యానికీ మధ్య మైత్రి ఉండాలి. చదువుతున్నంతసేపూ ఎవరో మన చెవులో ఆ కవిత చెబుతున్నట్లనిపించాలి. లయ వల్లో, పద చిత్రాల కూర్పు వల్లో, పదానికీ పదానికీ మధ్య రాపిడి ద్వారా పుట్టే నిప్పురవ్వల వల్లో, కవిత మన దృష్టి నాకట్టుకోగలగాలి. అలా ఉన్నప్పుడు చలం చెప్పినట్లు కవితలో కొత్త రక్తాన్ని కదను తొక్కించే సంగీతం వినబడుతుంది.

ఆ నడక పతితులారా! భ్రష్టులారా! బాధాసర్పదష్టులారా! అన్న పంక్తిలో ఉన్న వేగమే కానక్కరలేదు. అలిశెట్టి ప్రభాకర్ కవితలో ఉన్న తూగు గమనించండి-

కత్తి అంచుమీద తడితడిగా
నెత్తుటి బొట్టు తచ్చాడుతున్న వేళ
కనుకొలుకుల్లోని అశ్రుబిందువే
అగ్నికణమై కురిసేందుకు
సంసిద్ధమవుతున్న సమయం
ఆయుధాన్ని అధ్యయనం చెయ్యి

శివసాగర్ కవిత్వంలో నడకకి ప్రత్యేక పాత్ర ఉంటుంది. ఉదాహరణకి

ఉరితీయబడ్డ పాట నుండి, చెరపడ్డ జలపాతం నుండి
గాయపడ్డ కాలిబాట నుండి
ప్రాణవాయువు నుండి, వాయులీనం నుండి
తిరిగి వస్తాను
తిరిగి లేస్తాను
నా కోసం ఎదురు చూడు
నా కోసం వేచి చూడు

ఎంత ప్రతిభ ఉన్న కవికైనా అన్ని కవితల్లోనూ, నిజాయితీని నిలుపుకుంటూ మంచి నడకనీ, చిక్కదనాన్నీ తుదికంటా సాధించడం కష్టమే. అందుకే ఒక సంకలనం మొత్తం తిరగేస్తే అందులో బహుశా రెండో మూడో గుర్తుండే కవితలు ఉంటాయి. మిగిలిన వాటిలో కూడా మంచి కవిత్వ ముండవచ్చు. ఐతే అక్కడక్కడ పునరుక్తి వల్లో, వ్యక్తీకరణలో అస్పష్టత వల్లో, కొత్తగా చెప్పాలనే పాండిత్య ప్రకర్ష వల్లో, కవిత్వం దెబ్బ తింటుంది.

అన్ని రాళ్లకీ సమంగా తూగే కవితలు మాత్రం ఒకసారి చదవగానే జీవితాంతం గుర్తుండిపోతాయి. స్పందించగలిగిన హృదయానికి అటువంటి కవితలు ఎటువంటి పరిస్థితైనా ఎదుర్కోగల ధైర్యాన్నిస్తాయి. శ్రీశ్రీ రాసిన కవితా! ఓ కవితా కవి కాదలుచుకున్న ప్రతి ఒక్కరికీ మార్గ దర్శకమైన కవిత. అందులో నేను చెప్పిన మూడు గుణాలూ పుష్కలంగా ఉన్నాయి. కవి కావడానికి తను పడిన కష్టాలని ఎంతో నిజాయితీగా చిత్రించాడు శ్రీశ్రీ. ఈ కవితలోని చిక్కదనం, నడకా కూడా అనితర సాధ్యమనిపించే రీతిలో ఉంటాయి. ఎంతో ఓర్పుతోటీ, నేర్పుతోటీ, ఏర్చి కూర్చిన పద బంధాల్లో ఎక్కడా చటులాలంకారముల మటుమాయలు కనపడవు. కవిత్వమంటే నా దృష్టిలో అదే.

ఈ రాళ్లకి సరితూగితేనే కవిత్వమవుతుందని కాదు కానీ, కవిత్వాన్ని -ముఖ్యంగా ఆధునిక వచన కవిత్వాన్ని అంచనా వెయ్యడానికి నాకు ఈ మూడు ప్రమాణాలు చాలా ఉపయోగపడ్డాయి. కవిత్వానికి ప్రమాణాలు నిర్వచించడం కష్టమనీ, కవిత్వమొక అల్కెమీ అని అనుకునేవాళ్ళు నా మాటలని కొట్టివెయ్యవచ్చు. లేదా, నేను చెప్పిన ప్రమాణాలతోనే, నాకు నచ్చాయన్న కవితలని విశ్లేషించి వాటిలో ఆ ప్రమాణాలకి తూగే శక్తి లేదని నిరూపించవచ్చు. అభిరుచి అంతిమంగా ఎవరి దృక్పథాన్ని బట్టి వాళ్లు నిర్ణయించుకోవలసిన విషయం కాబట్టి ఒకవేళ అలా ఎవరికైనా అనిపిస్తే నాకేమీ అభ్యంతరం లేదు కూడా.

కానీ, ఇవో, ఇలాంటివే మరి నాలుగో, తూనిక రాళ్లు మాత్రం ప్రతి పాఠకుడికీ ఉంటాయనీ, ఉండాలనీ, నా నమ్మకం. కవిత్వాన్ని బేరీజు వేసుకోవడానికి ఏవో కొన్ని ప్రమాణాలుండటం పాఠకుడికి ఎంతైనా అవసరం. అటువంటి ప్రమాణాలుంటాయనీ, ఆ తూనిక రాళ్లకి తమ కవిత్వం నిలవగలగాలనీ కవులకీ స్పృహ ఉండడం మరీ అవసరం. ✻

జీవితానికి పర్యాయపదం కవిత్వం...

నేనెప్పుడూ ఇతరుల్ని సంతోషపెట్టటానికో, సంతృప్తి పరచటానికో, లేదూ వాళ్ళ చేత మెప్పు పొందటానికో రాయలేదు. నన్ను నేను చీల్చుకుని, దహించుకుని, పుటం పెట్టి పరీక్షించుకొని, అదొక పవిత్ర ధర్మంలానే రాశాను. నిజాయితీ లేకుండా గాఢంగా నమ్మకుండా ఒక అక్షరం కూడా రాయలేదు. తరచి తరచి, శోధించి ఆచరణలో పరీక్షించుకొని అడుగు ముందుకేశాను. కవిత్వం నాకు సర్వస్వమయింది. నన్ను నడిపించే శక్తి అయింది. నాకు ప్రాణమయింది. నన్ను మనిషిని చేసిందీ అదే! నా సర్వభ్రమల్ని తొలగించి, సర్వ భయాల్ని కూలదోసి, నా వర్గ జాడ్యాల్నుంచి నన్ను రక్షించి, అగ్నిపునీతుణ్ణి చేసింది. నన్ను నేను తెలుసుకునేట్టు చేయటమే గాకుండా, ప్రపంచాన్ని తెలుసుకునేట్టు చేసింది. నాకు కొత్త కళ్ళిచ్చింది. కొత్త జీవితాన్నిచ్చింది. అది నన్ను పోరాటవీరుణ్ణి చేసింది. అది నాకు తల్లయింది, తండ్రయింది, స్నేహితుడయింది, కరదీపికయింది, కరవాలమయింది, మూడో నేత్రమయింది. కవిత్వం లేకపోతే నేను లేను, నేను లేకపోతే నా కవిత్వం లేదు. నా జీవితానికి పర్యాయపదం నా కవిత్వం! నేను జీవించే కాలానికి పర్యాయపదం నా జీవితం.

✻

సమూహం సముద్రం, సమూహం అరణ్యం, సమూహం విజయపరంపరలకి సంకేతం. మనిషి ప్రవాహం, మనిషి మార్పు, మనిషి మలుపు. సమూహంలో మనిషి తన్ను తాను శోధిస్తాడు, దర్శిస్తాడు, కనుక్కుంటాడు. మనిషి బతుక్కి అర్థం సమూహంలోనే, అతని అనుభవ సంపన్నతా సమూహంలోనే. బహుశా ఈ దృక్పథం, మనిషి పట్ల నాకున్న అపారమైన నమ్మకం, ప్రేమా, నా కవిత్వానికి ఒక కొత్త జీవశక్తిని ప్రసాదించాయని నమ్ముతాను. నా కవిత్వం ఆయా సామాజిక మార్పుల కనుగుణంగా అనేక మార్పులకు లోనై, పరిణామం చెందుతూ ప్రవహిస్తుంది. ఒక్కొక్క కవి – అంతర్జాతీయ కవీ, రచయితా ఒక్కొక్క నూత్నాంశాన్ని అందిస్తాడు. ఒక్కొక్క సంఘటన, మలుపు ఒక గుణపాఠాన్ని చెబుతుంది. నేను అన్నిరకాల కవుల్నించీ, రచయితల్నుంచీ నేర్చుకున్నాను, నేర్చుకుంటున్నాను. చాలా చిన్నకవి నుంచి చాలా పెద్ద కవి వరకూ అందర్నుంచీ నేర్చుకున్నాను. నేర్చుకోవాలన్న జిజ్ఞాస అవసరం! కవికి చాలా ప్రమాదకరమైందీ, వినాశకరమైందీ దురహంకారం.

– కె. శివారెడ్డి

ప్రముఖ కవి, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత

తెలుగు పుస్తక ప్రచురణ ఒక పరిశీలన

నరోదయ రామ్మోహనరావు

పుస్తకంలేని ప్రపంచం రాబోతోందనేది వాస్తవం కాదు. పుస్తకం మరణం లేనిది, పుస్తకానికి ప్రత్యామ్నాయం లేదు, ఉండబోదు!



దేశ భాషలందు తెలుగులెస్స అని శ్రీకృష్ణదేవరాయలు, సుందర తెలుంగు అని సుబ్రహ్మణ్య భారతి, తెలుగు ఈజ్ ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని మరొకరు మన తెలుగు భాషను ప్రస్తుతించారు. ఇలా పలువురి ప్రశంసలు పొందిన మన తెలుగుభాష మన దేశంలో హిందీ తర్వాత ఎక్కువమది మాట్లాడేదీ, చదివేదీ కావడం మనందరికీ గర్వకారణం.

మన భాష, మన వాఙ్మయం చాలాకాలం రాచరికపు పరిధులలో, తాళపత్రాలలో, బూర్జర పత్రాలలో మగ్గిపోయింది. అలాంటి పరిస్థితి నుంచి మహత్తర గ్రంథాలను తెలుగుజాతికి అందించి ప్రచురణ రంగం చాలా కృషి చేసింది.

ఈ కృషిలో అనేకమంది త్యాగఫలం, పట్టుదల, సమాజానికి మేలు చేయాలన్న తపన, అంకితభావం ఇమిడి ఉన్నాయి. నాడు తెలుగుభాషను సుసంపన్నం చేయడానికి - గ్రాంథిక, వ్యావహారిక భాషా వివాదాలను ప్రక్కనపెడితే - కవులూ, కళాకారులూ ఎన్నో ఆటుపోట్లకు తట్టుకుని ఎదురీదారు. ఇందుకు నాటి రాజరిక, జమీందారీ వ్యవస్థలూ తమ వంతు సహకారం అందించారు. కొన్ని సందర్భాల్లో కవులే ప్రచురణ సంస్థలను స్థాపించి ప్రజా బాహుళ్యంలోకి పుస్తకాన్ని తీసుకువెళ్ళగలిగారు. విచిత్రం ఏమిటంటే, విదేశీయులు సైతం తెలుగుభాష పట్ల, తెలుగు పుస్తక ప్రచురణ పట్ల మక్కువ చూపి, తమ వంతు సహకారాన్ని అందించడం!

ఇందరి సహకారంతో సుసంపన్నమైన తెలుగుభాషను, 'తెలుగు పుస్తకాని'కి దోహదపడిన నర్సపూర్ ప్రెస్, వావిళ్ళ ప్రెస్, ఎన్.వి. గోపాల్ అండ్ కో, ఆంధ్ర సారస్వత పరిషత్, ఆంధ్ర ప్రచారిణీ గ్రంథ నిలయం, విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి, ఆంధ్ర భాషాభివర్ధినీ గ్రంథమండలి, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘం, వేగుచుక్క గ్రంథమాల, ప్రజాశక్తి ప్రచురణాలయం (తర్వాత విశాలాంధ్ర ప్రచురణాలయంగా పేరు మార్చారు), ఆదర్శ గ్రంథమండలి, దేశికవితా మండలి, కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్సు, బాలసరస్వతీ బుక్‌డిపో, వెంకట్రామా అండ్ కో, ఎం. శేషాచలం అండ్ కో మొదలైన సంస్థలను స్మరించుకొనడం ఎంతైనా అవసరం. వీటికితోడు తెలుగు పుస్తకాలను ప్రజలలోకి తీసుకువెళ్ళడంలో ఇంకా అనేక కవితా సమితులు, సాహిత్య సమితులు ఎంతగానో దోహదం చేశాయి, చేస్తున్నాయి..

బెంజిమన్ షూల్జి (1689-1760) అనే జర్మన్ ఫాదర్ క్రైస్తవ మతప్రచారం కొరకు భారత దేశానికి వచ్చి తెలుగు నేర్చుకున్న తొలి యూరోపియన్. 'గ్రమాటిక్ తెలుగిక'ను 8 అధ్యాయాలు వ్రాసి అందులోని తెలుగు పదాలకు తెలుగులిపిని వాడాడు. తాను ఇంగ్లీషు నుండి కాక లాటిన్ నుండి అనువాదం చేయటం వల్ల తన తెలుగు పుస్తకాలకు లాటిన్ టైటిల్స్ ఇచ్చాడు. వాటిని జర్మనీ దేశంలో అచ్చువేశాడు. మొట్టమొదటి తెలుగు పుస్తకం జర్మనీలో హేలీ అనేచోట అచ్చయింది.

భారతదేశంలో మొదటి తెలుగు పుస్తకాలను ప్రచురించిన గౌరవం శ్రీరాంపూర్ మిషనరీలకు దక్కుతుంది. వీరు 1807లో ఇంగ్లండు నుండి తెలుగు అక్షరాలను దిగుమతి చేసుకున్నారు. తర్వాత తెలుగు పుస్తకాల ప్రచురణ తెలుగుభాష ప్రాచుర్యంగల ప్రాంతాల నుండి జరిగితే బావుంటుందనే ఆలోచనతో తెలుగు పుస్తకాలను అచ్చువేసే బాధ్యతను మద్రాసులోని 'బైబిల్ సొసైటీ'కి వప్పగించారు. 1812లో మొదటి ప్రింటింగ్ ప్రెస్ మద్రాసులో పెట్టారు. తెలుగు బైబిల్ అచ్చువేశారు.

దక్షిణ భారతదేశంలో ప్రాంతీయ భాషలో పుస్తక ప్రచురణ ఎక్కువగా మిషనరీలు చేపట్టాయి. సెయింట్ జార్జి పోర్టులో కాలేజీని స్థాపించిన తర్వాత తమ విద్యార్థులకు పాఠ్యగ్రంథాల ప్రచురణ ప్రారంభించారు. రావిపాటి గురుమూర్తి రచించిన విక్రమార్కుని కథలను 1819లో కాలేజి ప్రెస్ ప్రచురించింది. ఆయనే మరో 15 సంత్సరముల తర్వాత 1834లో పంచతంత్ర కథలు ప్రచురించారు. మధ్యకాలంలో కాలేజి బోర్డువారు కొన్ని కథలను అనువాదం చేయించి ప్రచురించారు. అప్పట్లో అదాలత్ అనువాదకునిగానూ, వ్యాఖ్యాతగానూ (దుబాసీ) పనిచేసిన వెన్నెలకంటి సుబ్బారావుగారు ప్లీజింగ్ టేల్స్ అనే ఇంగ్లీషు పుస్తకాన్ని 1828లో తెనిగించారు.

1831లో స్థాపించిన ప్రభుత్వ ప్రెస్ మహాభారతం, వైద్యగ్రంథం సుశ్రుత, కాశ్మీర చరిత్ర రాజతరంగిణి మొదలైన పుస్తకాలు ప్రచురించింది. 1838లో యేనుగుల వీరాస్వామి కాశీయాత్రా చరిత్ర అప్పట్లో అచ్చయిన వాటిలో చెప్పుకోదగింది. 18.5.1830వ తేదీన ప్రారంభించిన ఆయన యాత్ర విశేషాలు ఆనాటి సాంఘిక పరిస్థితులకు అద్దం పడతాయి.

ప్రసిద్ధ పండితుడు పురాణం హయగ్రీవశాస్త్రి తెలుగు, సంస్కృతాలలో ప్రామాణికమైన గ్రంథాలను ప్రచురించారు. 1847 తర్వాత మద్రాసు ఉపయుక్త గ్రంథకారణ సభ ప్రాంతీయ భాషలలో ప్రాథమికవిద్య కోసం పుస్తకాలు ప్రచురించింది. లెక్కలు, భౌగోళికశాస్త్రం, భారతదేశ చరిత్ర, ఇంగ్లండు చరిత్ర, అమెరికా డిస్కవరి వంటివి వీటిలో కొన్ని.

నర్సపూర్ ప్రెస్

నర్సపూర్ ప్రెస్ అన్నింటిలోకి చురుకుగా ఉండి ప్రాథమిక విద్యకుపకరించే పుస్తకాలతో పాటు తెలుగులో పత్రికలను కూడా ప్రచురించింది. బళ్ళారిలో మిషన్ ప్రెస్ ఎక్కువగా మత సంబంధ మైన పుస్తకాలతోబాటు కొన్ని సాధారణ గ్రంథాలను కూడా ప్రచురించింది. మద్రాసులోని వేపేరి Spck ప్రెస్ రాష్ట్రంలో ఉన్న ఆఫీసర్ల వినియోగం కొరకు 1858లో తెలుగు పుస్తకాలను ప్రచురించింది.

అదే సమయంలో సి.పి. బ్రౌన్ నిఘంటువులు, వైద్యశాస్త్ర గ్రంథాలు, వ్యాకరణాలు చాలా ప్రచురించారు. కాలక్షేపం పుస్తకాలకు ప్రోత్సాహమిచ్చారు. రామకృష్ణశాస్త్రిగారిని అరేబియన్ నైట్స్ అనువదించేందుకు ప్రోత్సహించి రెండు సంపుటాలుగానూ, శ్రీ శంకరాచార్యుల వారి ఆత్మబోధ ప్రకాశికను పురాణం కృష్ణశాస్త్రులుగారితో అనువాదం చేయించి 1840లో ప్రచురించారు. బ్రౌన్‌తో పాటు జేమ్స్‌వాట్, ఛార్లెస్ వైట్, సర్‌థామస్ మన్రో, విలియం బ్రౌన్, కాంప్‌బెల్, ఫ్రాన్సిస్‌వైట్ తెలుగులో పుస్తకాలు ప్రచురించడంలో ఆసక్తి కనపరిచారు. విశాఖపట్నంలోని లిండన్ మిషన్ ప్రెస్ 1856లో రైల్వేలు, ఆవిరి యంత్రం, టెలిగ్రాఫ్, విద్యుత్ వంటి సమాచారంతో కూడిన 18 పుటల చిన్నచిన్న పుస్తకాలను ప్రచురించింది.

వావిళ్ళ ప్రెస్

తెలుగు పుస్తకాల ప్రచురణ అనగానే ముందుగా ఎవరికైనా స్ఫురణకు వచ్చేది వావిళ్ళ సంస్థ.

ముద్రణ తొలిరోజుల్లో పుస్తకాలు సంతృప్తికరంగా ఉండేవి కావు. పీచు కాగితం ముట్టుకుంటే చినిగిపోయేటట్లు ఉండేది. పదాల నడుమ ఖాళీ లేకుండా ముద్రించేవారు. ఒక్క అక్షరం పట్టే స్థలం కూడా వదిలేవారు కాదు. ఇలా తయారైన పుస్తకాలు నిర్దుష్టంగా ఉండేవి కావు. అందువల్ల పాఠకులు శ్రమపడవలసి వచ్చేది.

ఈ పరిస్థితుల నుండి తెలుగువారిని కాపాడిన మహనీయుడు వావిళ్ళ రామస్వామిశాస్త్రిగారు. తన సోదరుల మామగారైన వెంకటాచల శాస్త్రిగారితో కలిసి వివేకరత్నాకర ముద్రాక్షరశాల అనే ముద్రణాలయాన్ని స్థాపించారు. అది సక్రమంగా సాగకపోవడంతో మిత్రుల వద్ద రుణం తీసుకుని హిందూభాషా సంజీవనీ అనే ముద్రాక్షరశాలను స్థాపించారు. అన్నగారు ఉద్యోగం రావడంతో మైసూరు వెళ్ళిపోయారు. దానితో అది



కూడా మూతపడింది. మిత్రులు సరస్వతి తిరువెంకటాచార్యుల ప్రోత్సాహంతో సరస్వతీ నిలయ ముద్రాక్షరశాలను స్థాపించారు. మిత్రులు నెల్లూరు వెళ్ళడంతో అది కూడా ఆగిపోయింది.

రామశాస్త్రిగారు పట్టువదలని విక్రమార్కుల వలె చివరకు మద్రాసులోని తాండియార్పేటలోని తమ ఇంటిలోనే ఆది సరస్వతి ముద్రాక్షరశాలను స్థాపించి గ్రంథ ముద్రణ కొనసాగించారు. రామస్వామిగారి మరణానంతరం వారి కుమారుడు వెంకటేశ్వర శాస్త్రి ముద్రణ కార్యక్రమాన్ని చేపట్టి ఆది సరస్వతీ నిలయాన్ని వావిళ్ళ ప్రెస్‌గా మార్చి పురాణాలు, ప్రబంధాలు, శాస్త్రాలు, శతకాల నుండి బంకింబాబు అనువాదాలతో పాటు, ఆధునిక రచనలెన్నింటినో అందించారు. వీరి ప్రథమ ముద్రణ 1854లో వెలువడింది. అప్పటి నుండి 40 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా ముద్రాపకులుగా, ప్రచురణ కర్తగా, గ్రంథ సంపాదకులుగా తమ ఆశయాన్ని నెరవేర్చుకున్నారు. రామాయణ భారతాలే కాకుండా జ్యోతిష్య గ్రంథాలు, శతపత్రసుందరి లాంటి పాటల పుస్తకాలు కూడా ప్రచురించారు.

అప్పటివరకు తెలుగులో ఆసక్తి ఉన్న రచయితలు తమ రచనలను తామే తిప్పలు పడి ప్రచురించుకుని తామే అమ్ముకుని, అమ్ముకోలేనపుడు ఉచితంగా పంచి పెట్టేస్తుండేవారు. ఈ పరిస్థితి ఇప్పటికీ అక్కడక్కడ కనిపిస్తున్నా, వావిళ్ళ ప్రెస్ స్థాపనతో ప్రచురణ సంస్థలు లాభనష్టాల భారాన్ని చాలావరకు తమ నెత్తికి ఎత్తుకునే సంప్రదాయం ప్రారంభమయింది.

మద్రాసు కేంద్రంగా...

ఇదే సమయంలో మద్రాసులో వెలసిన మరొక ప్రచురణ సంస్థ ఎన్.వి. గోపాల్ అండ్ కో, వావిళ్ళవారి ప్రచురణలకు భిన్నమైన ప్రచురణలుగా మర్యాదరామన్న కథలు, మదనకామరాజు కథలు, భట్టి విక్రమార్కుల కథలు మొదలైన కథా సంపుటాలు, సహస్ర శిరచ్ఛేధ అపూర్వ చింతామణి వంటి జానపద నవలలు, పెద్దబాలశిక్ష లాంటి ప్రామాణిక గ్రంథాలు ఎన్నో ప్రచురించారు.

తెలుగు ప్రచురణలకు 19వ శతాబ్దంలో చాలావరకు మద్రాస్ కేంద్రంగా ఉండేది. సరస్వతి తిరువెంకటాచార్యులు, పాలపర్తి నాగేశ్వరరావు, బి.వి. రంగయ్యశ్రేష్టి, వంకాయల కృష్ణస్వామి శెట్టి, పిడుగు వెంకటకృష్ణారావు, వేదం వెంకటరాయశాస్త్రిగార్లు మద్రాసులో పుస్తక ప్రచురణ రంగానికి ఆద్యులు అని చెప్పుకోవచ్చు. ప్రాచీన గ్రంథాలు ప్రచురించిన జ్యోతిష్మతీ ముద్రణా లయం, వనప్పాకం అనంతాచార్యులు స్థాపించిన వైజయంతీ ముద్రాక్షర శాల, రెంటాల వెంకటసుబ్బారావుగారి విక్టోరియా డిపోలే కాక వివిధ సంస్కృత గ్రంథాలు ప్రచురించిన మానపల్లి రామకృష్ణ కవి, వైష్ణవ సంప్ర దాయ గ్రంథాలు ప్రచురించిన కందాళ శేషాచార్యులు మద్రాసులో తెలుగు ప్రచురణ రంగానికి తమ వంతు కృషిచేసిన వారిలో ప్రత్యేకంగా చెప్పుకో దగ్గవారు.

అప్పట్లో కందుకూరి వీరేశలింగం, వావిలకొలను సుబ్బారావుగార్లు మద్రాసులోనే ఉద్యోగాలు చేస్తుండేవారు. పిఠాపురం రాజా, జయంతి రామయ్య పంతులుగార్లు మద్రాసు కేంద్రంగా ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించి విశేషకృషి చేశారు. వెస్ట్‌వర్డ్ కంపెనీ, అమెరికన్ డైమెండ్ ప్రెస్, వాచకాలు, వ్యాకరణాలు, ప్రబంధాలు, భారత భాగవత రామాయణాలు ప్రచురించిన వెంకటేశ్వర అండ్ కో, ఆనంద ప్రెస్ మొదలైన కంపెనీలే కాక కవిత్రయ భారతాన్ని ప్రచురించిన నాతా నమ్మయ్యశెట్టి, ఆయుర్వేద గ్రంథాలు ప్రచురించిన డి. గోపాలాచార్యులు, ఆర్యభారతీ గ్రంథమాల - ఆదినారాయణశాస్త్రిగార్ల కృషి గత శతాబ్దాంతంలో చెప్పుకోదగ్గది.



ఇదే కాలంలో బ్రిటిషు ప్రచురణ సంస్థలు మాక్మిలన్, ఓరియంట్ లాజ్మన్, ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్‌లు వ్యాపారదృష్టితో మద్రాస్ కేంద్రంగా మనదేశంలో ప్రచురణలు ప్రారంభించాయి. పెరుగుతున్న విద్యా కాంక్షను దృష్టిలో ఉంచుకుని వారు బొమ్మలతో పాఠ్యపుస్తకాలను ప్రచురించారు. ఈ పుస్తకాలను మార్సడన్ అను ఆంగ్లేయుడు వీరేశలింగం సహకారంతో తయారుచేశాడు. అదే సమయంలో ఆనంద ప్రెస్, క్రిష్టియన్ లిటరేచర్ సొసైటీలు కూడా ప్రచురణరంగంలోకి దిగాయి.

చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి రామచంద్ర విజయం, అహల్యా బాయి, కందుకూరి వీరేశలింగంగారి అభిజ్ఞాన శాకుంతలము, హాస్య సంజీవిని, ఆంధ్ర కవుల చరిత్ర, బహుజనపల్లి సీతారామాచార్యులుగారి శబ్ద రత్నాకరము, గురజాడ శ్రీరామమూర్తిగారి కవి జీవితములు, మధిర సుబ్బన్న దీక్షితులుగారి కాశీమజిలీ కథలు, వడ్డాది సుబ్బారాయుడుగారి భక్తి చింతామణి, గురజాడ అప్పారావుగారి కన్యాశుల్కము, యనమండ్ర వెంకటరామయ్యగారి పురాణనామ చంద్రికలు గత శతాబ్దాంతంలో వెలువడిన కొన్ని ఉత్తమ ప్రచురణలు. ఆ శతాబ్దాంతంలో సాహిత్యపోషణ పేరిట పుస్తక ప్రచురణ ఎక్కువ రాజుల ప్రాపకంలో జరిగేది. వీరిలో బొబ్బిలి, పిఠాపురం, ముక్త్యాల, పానుగల్లు, పాల్వంచ, కార్వేటినగరం, సాలూరు, చల్లపల్లి, నూజీవీడు రాజులు ముఖ్యులు.

ఆంధ్ర ప్రచారిణీ గ్రంథ నిలయం

వావిళ్ళ ప్రెస్ తర్వాత తెలుగునాట ప్రధానంగా యువ పాఠకులకు, గృహిణులకు పఠనాభిలాషను వృద్ధి చేసిన గౌరవం ఆంధ్ర ప్రచారిణీ గ్రంథ నిలయానికి దక్కుతుంది.

తణుకులో 1903 ప్రాంతాల్లో బి.వి. రావు అండ్ బ్రదర్స్ పేరుతో ప్రచురణ సంస్థ సాహిత్యసేవ ప్రధాన ఆశయంగా వెంకట పార్వతీశ జంట కవులలో మొదటివారైన బాలాంత్రపు వెంకటరావు గారిచే స్థాపించబడింది. దానిని 1911లో ఆంధ్ర ప్రచారిణీ గ్రంథ నిలయంగా పేరు మార్చారు. ప్రతి రెండు నెలలకు ఒక నవల ప్రచురించాలని సంస్థ నిర్ణయం. వ్యాపార సౌలభ్యం కోసం కార్యస్థానాన్ని తణుకు నుండి నిడదవోలు, అక్కడ నుండి రాజమండ్రి మార్చుతూ వచ్చారు.

వసుమతీ వసంతం, ప్రమదావనం అనువాద నవలలు. బంకించంద్ర ఛటర్జీ, రవీంద్రనాథ్ ఠాగూర్‌లు రచించిన సాంఘిక నవలలు, పాంచ్ కడీదేవ్ అనే వంగ రచయిత రచించిన అపరాధ పరిశోధక నవలలను అనువదించి ప్రచురించారు. తమ 20వ నవలగా వెలువడిన మాతృమందిరం వెంకట పార్వతీశ కవుల స్వతంత్ర రచన. ఈ పుస్తకానికి ప్రసిద్ధ చరిత్ర పరిశోధకుడు కొమర్రాజు లక్ష్మణరావుగారు పీఠిక వ్రాశారు. ఈ సంస్థకు పిఠాపురం మహారాజు ఒక ముద్రణ యంత్రాన్ని బహూకరించటంతో 1924లో కాకినాడకు, 1925లో పిఠాపురానికి కార్యస్థానం మార్చవలసి వచ్చింది.

పురాణ గ్రంథమాలిక అనే పేర శివపురాణం, బ్రహ్మపురాణం, వామన పురాణం మంచి శైలితో ప్రచురించారు. వెంకట పార్వతీశ కవులు స్వయంగా రచించిన హారావళి (రెండు భాగాలు), కావ్యకుసుమావళి (మూడు భాగాలు), ఏకాంతసేవ, బృందగానం, భావసంకీర్తనం అనే కవితా సంపుటాలను ఆంధ్ర ప్రచారిణి పేరుతో ప్రచురించారు. విక్టర్ హ్యూగో రచన *Les Miserables* అనువాదం చేసి దురదృష్టవంతుడు పేరుతో ప్రచురించారు.

విజ్ఞానం - వినోదం

1905లో కొమర్రాజు లక్ష్మణరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, రావిచెట్టు రంగారావు, అయ్యదేవర కాళేశ్వరరావు, రాజానాయని వెంకట రంగారావు స్థాపించిన విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి ఈ రంగంలో ఒక

నూతన శకానికి నాంది పలికింది. ఉన్నత ఆశయాలతో వారు ప్రచురించిన గ్రంథాలు నేటికీ ప్రత్యేకస్థానాన్ని కలిగి ఉన్నాయి. అబ్రహాం లింకన్, బెంజిమన్ ఫ్రాంక్లిన్‌ల జీవితచరిత్రలు, ఆంధ్రుల చరిత్ర, శివాజీ చరిత్ర, రసాయనశాస్త్ర పదార్థ విజ్ఞానశాస్త్రం, అర్థశాస్త్రం, ఆరోగ్య సంబంధమైన పుస్తకాలెన్నింటినో ఈ సంస్థ ప్రచురించింది. దక్షిణ భారతదేశంలోని మొదటి విజ్ఞాన సర్వస్వాన్ని ప్రచురించిన ఘనత ఈ సంస్థదే. వీరు నిర్వహించిన చారిత్రక నవలల పోటీలో దుగ్గిరాల రాఘవచంద్రయ్య సచ్ఛాస్త్రి గారి విజయనగర సామ్రాజ్యము పుస్తకానికి ప్రథమ బహుమతి ఇచ్చారు. వీరు 1916 వరకు సుమారు 30 పుస్తకాలు ప్రచురించి మొదటి ప్రపంచ యుద్ధం కాలంలో సంస్థను తాత్కాలికంగా ఆపివేశారు. తిరిగి 1924లో పునరుద్ధరణ ప్రయత్నాలు జరిగాయి కాని సఫలం కాలేదు.

ఈ దశాబ్దంలో వెలువడిన గ్రంథాలలో పానుగంటి లక్ష్మీనరసింహారావుగారి రాధాకృష్ణ, తిరుపతి వెంకటకవుల పాండవ జననము, పాండవ విజయము, దాసు నారాయణరావుగారి పాదుకా పట్టాభిషేకము, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి బొబ్బిలి యుద్ధం, ఉన్నవ లక్ష్మీనారాయణగారి అక్బరు చరిత్ర, భండారు అచ్చమాంబగారి అబలాసచ్చరిత్ర రత్నమాల, చిలకమర్తి వారి సౌందర్యతిలక, ముడంబై అలివేలు మంగతాయారుగారి స్త్రీజన కల్పవల్లి, చాగంటి శేషయ్య, చిల్లంగి శ్రీనివాసరావు వగైరాలు అనువదించి ప్రచురించిన బెంగాలీ నవలలు రాధారాణి, కృష్ణకాంతుని మరణ శాసనం, గురజాడ అప్పారావుగారి నీలగిరి పాటలు, ముత్యాల సరాలు, దిద్దుబాటు, రాయప్రోలు సుబ్బారావుగారి తృణకంకణము, వేటూరి ప్రభాకరశాస్త్రిగారి కనకాభిషేకము మున్నగునవి పేర్కొనదగినవి.

1908వ సంవత్సరం బందరులో ఆంధ్రభాషాభివర్ధిని గ్రంథమాలను స్థాపించారు. 1911లో పిఠాపురం మహారాజు, జయంతి రామయ్యపంతులు, వేదం వెంకటరాయశాస్త్రిగార్లు ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించి గ్రాంధిక భాషా ప్రచారానికి తీవ్రంగా కృషి చేశారు. అదే సమయంలో వారికి పోటీగా గురజాడ అప్పారావు, గిడుగు రామమూర్తి పంతులుగార్ల వ్యవహారిక భాషా ఉద్యమం సాగింది. తాపీ ధర్మారావుగారి ఆధ్వర్యంలో బరంపురం కేంద్రంగా వేగుచుక్క గ్రంథమాల స్థాపించబడింది. 1919 నాటికి 11 నవలలు ప్రచురించి సంవత్సరానికి నాలుగు నవలలు ప్రచురించాలని తలపెట్టారు. వారు ప్రచురించిన వాటిలో కొవ్వూరాళ్ళు అనేది మొదటి డిటెక్టివ్ నవలగా ప్రసిద్ధి పొందింది. మిగిలినవాటిలో వాడేవీడు, నేనే, కాలూరాయి ప్రసిద్ధి చెందినవి.

1914లో కృష్ణాజిల్లాలో పటమట కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘాన్ని స్థాపించారు. కట్టమంచి రామలింగారెడ్డిగారి ముసలమ్మ మరణం లాంటి పుస్తకాలనెన్నింటినో ప్రచురించిన ఈ సంస్థ నడిపిన గ్రంథాల యోద్యమం దేశవ్యాప్త ఖ్యాతిని సంపాదించుకుంది. చెన్నపురి ఆంధ్ర మహాసభ 1916 నుంచి ప్రచురణలు ప్రారంభించింది. తెనాలిలో తల్లావర్జుల శివశంకరశాస్త్రి ఆధ్వర్యంలో 1918లో ఏర్పడిన సాహితీ సమితి ఎన్నో ఖండకావ్యాలను ప్రచురించింది. 1918లో స్థాపించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం కొన్ని రచనలను ప్రోత్సహించి ప్రచురించింది. ఈ దశాబ్దంలో రాయప్రోలు రామకృష్ణాచార్యులుగారి సారంగధర, గురజాడ శ్రీరామమూర్తిగారి తిమ్మరుసు చరిత్ర, కాళ్ళకూరి నారాయణరావుగారి పద్మవ్యూహం, చిలకమర్తిగారి రాజరత్నము, పానుగంటి లక్ష్మీనరసింహంగారి ఆధునిక కవి జీవితములు, దువ్వూరి రామిరెడ్డిగారి కృషీవలుడు, దీపాల పిచ్చయ్యశాస్త్రిగారి చాటుపద్య రత్నాకరము చెప్పుకోదగ్గవి.

ఇప్పటివరకు ఎందరో ప్రచురణకర్తలు, రచయితలు తెలుగు వాఙ్మయానికి తమ సేవలందిస్తూ వచ్చారు. ప్రచురణ రంగం వ్యాపారంలో ఒక భాగమైనప్పటికీ మిగిలిన వ్యాపార రంగాలకు భిన్నంగా మేధోపరమైనదిగా, సాహితీసేవ ఒక ఉపాంగంగా ప్రసిద్ధి పొందింది.

వ్యాపారదృష్టి

1920 తరువాత సమిష్టిగా తప్ప ఈ రంగంలోకి అడుగిడేందుకు సాహసించని కాలం పోయి, చాలామంది ప్రచురణకర్తలు, పుస్తక విక్రేతలు పుస్తక ప్రపంచంలో ఉత్సాహంగా ప్రవేశించారు. 1920లో మారుతీ రామా అండ్ కో, విజయవాడ, 1923లో యం. శేషాచలం అండ్ కో, బందరు, సరస్వతీ గ్రంథమండలి, అద్దేపల్లి లక్ష్మణస్వామి అండ్ కో, రాజమండ్రి, 1925లో ది ఓరియంట్ పబ్లిషింగ్ కంపెనీ, తెనాలి, 1928లో బాలసరస్వతి బుక్‌డిపో, కర్నూలు, 1930లో రాయల్ అండ్ కంపెనీ, కడప, జయా నికేతన్, తాడేపల్లిగూడెంలో ప్రచురణరంగంలో ఉప్పెన సృష్టించాయి. ఆ దశాబ్దంలో పుస్తక విక్రేతలు ప్రచురణలకు మంచి ఊతమిచ్చారని చెప్పుకోవచ్చు. రాజమండ్రిలో శృంగార గ్రంథమాల, అభినవాంధ్ర గ్రంథమాలలు, నల్లగొండ జిల్లా సూర్యాపేటలో కృషి ప్రచారిణీ గ్రంథమాలలు విశేషకృషి సలిపాయి. ఆంధ్రపత్రిక తరపున శ్రీ కాశీనాధుని నాగశ్వరరావు స్థాపించిన ఆంధ్రగ్రంథమాల వారు భగవద్గీత, బసవ పురాణం, పండితారాధ్య చరిత్రలు ప్రచురించారు. వద్దిరాజు సీతారామచంద్రరావు, రాఘవరావు సోదరులు మొదట ఇనుగుర్తిలో స్థాపించి తరువాత కరీంనగర్ జిల్లా నెమలికొండకు తరలించిన విజ్ఞానప్రచారిణీ గ్రంథమాల 1932 వరకు 21 గ్రంథాలను ప్రచురించింది.

1930 తరువాత స్వాతంత్ర్య పోరాటం ఉధృతం కావడంతోపాటు విజ్ఞాన పిపాస కూడా పెరిగి ప్రచురణ సంస్థలు, పుస్తక విక్రేతల సంఖ్య గణనీయంగా పెరిగాయి. పాలకొల్లు కేంద్రంగా ఆంధ్ర శేషగిరిరావు విజాపురీ గ్రంథమాల స్థాపించారు. పురిపండా అప్పలస్వామి, శ్రీశ్రీ, తదితరులు విశాఖపట్నంలో కవితా సమితి స్థాపించి రచయితలను, ప్రచురణలను ప్రోత్సహించారు. 1931లో బళ్ళారిలో శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల, మద్రాసులో దోమా వెంకటస్వామి గుప్తగారి వాఙ్మయ వినోదినీ గ్రంథమాల, 1935లో ముంగండలో విశ్వసాహిత్యమాల, 1936లో మద్రాసులో కవితిలక గ్రంథమాల వంటి సంస్థలు ఎన్నో పుస్తకాలు ప్రచురించాయి.

అణా గ్రంథమాల

నిజాం పాలనలో తెలుగు చదవడం, రాయడం దాదాపు నిషిద్ధమైన తెలంగాణలో 1938లో హైదరాబాదులో కె.సి. గుప్త అణా గ్రంథమాల ప్రారంభించారు. హైదరాబాద్‌లోని ట్రూప్‌బజార్‌లోని ఒక హోటల్‌లో దోసె అణా, ఇడ్లీ అణా, ఒక పుస్తకం అణా అని బోర్డు పెట్టించి మరీ పుస్తకాలు అమ్మారు గుప్తాగారు. వీరు ప్రచురించిన రైతు, సుభాష్‌చంద్రబోస్ పుస్తకాలు

నిజాం నిషేధానికి గురయ్యాయి. కాళోజి కథలు ప్రచురించారు. 1938లోనే వట్టికోట ఆళ్వారుస్వామిగారి దేశోద్ధారక గ్రంథమాల స్థాపించి, దేశభక్తిని ప్రోత్సహించే పుస్తకాలు ప్రచురిస్తూ వచ్చారు. తెలంగాణ రచయితల నుంచి కథలు సేకరించి పరిసరాలు పేరుతో రెండు కథా సంకలనాలు ప్రచురించారు. ఈ రెండూ తెలంగాణ ప్రాంతంలో చైతన్యాన్ని ప్రబోధించిన పుస్తక ప్రచురణ సంస్థలు.

1939లో గుండవరపు హనుమంతరావుగారి ఆంధ్రకేసరి గ్రంథమాల, హైదరాబాదు, మొదలైన సంస్థలు సలిపిన సాహిత్యసేవ గణనీయమైనది. వీటిలో శ్రీకృష్ణదేవరాయ గ్రంథమాల స్థాపకులు ఉద్యోగరీత్యా గ్రామాంతరాలు వెళుతూ ఉండటంతో ఆ సంస్థ అనంతపురం, హిందూపురాలకు మారుతూ ఉండేది. ఇప్పటికీ హిందూపురం కేంద్రంగా పనిచేస్తూనే ఉంది.

ఆదర్శ గ్రంథమండలి

కృష్ణాజిల్లా ఎలమర్రులో గద్దె లింగయ్యగారు 1941లో స్థాపించిన ఆదర్శ గ్రంథమండలి 1950లో విజయవాడకు తరలించారు. వారు ప్రాసిన విప్లవవీరులు, విప్లవ యుగము పుస్తకాలు నిషేధానికి గురయ్యాయి. లింగయ్యగారు పడవలపై అచ్చు యంత్రాలను అమర్చి రహస్యంగా పుస్తకాలు, కరపత్రాలు ప్రచురించి స్వాతంత్రోద్యమానికి ఎంతగానో సహకరించారు. గోర్కీ ప్రాసిన అమ్మ నవలను కొవ్విడి లింగరాజుగారితో అనువాదం చేయించి ప్రచురించారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రతివారూ ఆ పుస్తకం చదివి ఉత్తేజితులయ్యారు. ఆయన అనేక ఉత్కృష్ట మైన గ్రంథాలు ఎక్కువ భాగం దేశభక్తిని ప్రోత్సహించేవి ప్రచురిం చారు. ప్రచురించిన వాటిలో నెహ్రూ రచనలు భారత దర్శనం, నెహ్రూ ఆత్మకథ, నెహ్రూ లేఖలు, హోవర్డ్‌ఫాస్ట్, స్వేచ్ఛాపథం, రోమారోలా మానవుడు మొదలైనవి ఉన్నాయి.



కృష్ణాజిల్లా పెడసనగల్లులోని నవయుగ ప్రచురణాలయం నార్ల వెంకటేశ్వరరావు రచనలు రష్యన్ గాథల అనువాదాలను, స్వదేశీ సంస్థానాలు, గోపీచంద్ అసమర్థుని జీవయాత్ర ప్రచురించారు. యువ బుక్స్ తెనాలివారి కొడవటిగంటి కుటుంబరావు, చక్రపాణి రచనలు, శతర్ అనువాదాలు కూడా ఇప్పటివే. గ్రంధాల యోద్యమం, స్వాతంత్ర్యోద్యమాలు ముమ్మరంగా సాగి తమతోపాటు ప్రచురణరంగానికి కూడా తీరిక లేకుండా చేశాయి. 1940లో కల్చరల్ బుక్స్ లిమిటెడ్, మద్రాస్, సరస్వతీ బుక్ డిపో, విజయవాడ, 1943లో ఆంధ్ర సారస్వత పరిషత్తు, హైదరాబాదు, 1945లో త్రివేణీ పబ్లిషర్స్, మచిలీపట్నం స్థాపించబడి విశేషకృషి చేశాయి.

కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్స్, రాజమండ్రి

1940 ప్రాంతాల రాజమండ్రిలో స్థాపించిన కొండపల్లి వీరవెంకయ్య అండ్ సన్స్ గురజాడ కన్యాశుల్కం, భమిడిపాటి కామేశ్వరరావు, ముని మాణిక్యం నరసింహారావు, ఎన్.ఆర్. చందూర్, కొర్రపాటి గంగాధరరావు నాటకాలు, మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి రచనలు సత్యహరిశ్చంద్ర లాంటి స్టేజి నాటకాలు ప్రచురించారు.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో ప్రభుత్వం సైనికుల కాలక్షేపం కోసం పుస్తకాలను విరివిగా కొనేది. ఆ కాలంలో నవలలు చదవడం తప్పుగా భావించేవారు. రహస్యంగా చదివేవారు. కొవ్వలి, జంపన, కృత్తివెంటి, మానాపురం, వంటెత్తు ఈ అయిదుగురూ ప్రాసిన నవలలు స్లాట్‌ఫారం సాహిత్యం గా చలామణీ అయ్యేవి. కొవ్వలి రోజుకొక నవల ప్రాసేవాడని ప్రతీతి. కొవ్వలి నవలలు కొమ్మదాసరి, చర్చిబెల్, సినిమాపిచ్చి, వారెవా, ముద్దుల మొగుడు, ఇంతి చామంతి పూబంతి, గంగ యమున లాంటి పేర్లతో ఉండేవి. ఒక్కొక్క పుస్తకం వెల పావలా, రూపాయికి ఐదు. డజను నవలలు రెండు రూపాయలు వుండేవి. ప్రతి నవలలోనూ ఒక సామాజిక సమస్య, అనుకోని మలుపులు, సున్నితమైన హాస్యం, సజీవ వ్యావహారిక శైలితో పాఠకులను మురిపించేవి.

దేశి కవితామండలి, విజయవాడ

1942లో విజయవాడలో బొందలపాటి శివరామకృష్ణయ్య, శకుంతలా దేవి దంపతులచే ప్రారంభించబడిన సంస్థ దేశి కవితామండలి. వారు కొన్ని వందల పుస్తకాలు ప్రచురించి ఎంతోమంది రచయితలను పరిచయం చేశారు. వారు ప్రచురించిన శరత్ రచనల అనువాదాలు తెలుగునాట ప్రతి ఇంటికీ అలంకరణలు. తెలుగు సాహిత్యాన్ని పాఠకులకు అందించడంలో ఈ దంపతులు కృషి వెలకట్టలేనిది.

వెంకట్రామ అండ్ కో, ఏలూరు

ఈదర వెంకట్రావు, వెంకట్రామయ్యగార్లు ప్రారంభించిన వెంకట్రామా అండ్ కో, ఏలూరు పాఠ్యపుస్తకాల ప్రచురణతో ప్రారంభించి, సర్కారు, రాయలసీమ జిల్లాలలో ప్రతి ముఖ్యమైన పట్టణంలోనూ తమ బ్రాంచీలు ప్రారంభించి సాహిత్యాన్ని మారుమూల గ్రామాలకు కూడా విస్తరింపజేశారు. వీరు పుస్తక ప్రచురణలతోపాటు వివిధ ప్రచురణ సంస్థలు ప్రచురించిన పుస్తకముల పంపిణీ కూడా చేపట్టి ఒక కొత్త వరవడిని సృష్టించారు.

స్వాతంత్ర్యానంతర కాలంలో 1947లో తెలుగుభాషా సమితి మద్రాస్, ప్రగతి ప్రచురణాలయం, నిడమర్రు, బి.వి. అండ్ సన్స్, కాకినాడ, నాస్తిక కేంద్రం, జనతా ప్రచురణాలయం, విజయవాడ 1950లో పశ్చిమ

గోదావరి జిల్లా నత్తరామేశ్వరంలో కాలచక్రం ప్రచురణలు ప్రారంభించి పుస్తక ప్రచురణను విస్తృత పరిచారు.

తరువాతి దశాబ్దంలో స్థాపించిన ప్రచురణ సంస్థలలో చందా నారాయణశ్రేష్టి, దాచేపల్లి కిష్టయ్య అండ్ సన్స్, శ్రీరామా బుక్‌డిపో, యువభారతి, సికింద్రాబాద్, నవోదయ పబ్లిషర్స్, జయంతి పబ్లికేషన్స్, ప్రేమ్‌చంద్ పబ్లికేషన్స్, విజయవాడ, కరుణశ్రీ కావ్యమాల, గుంటూరు, కళాభివర్ధినీ పరిషత్తు, కాళహస్తి తమ్మారావు అండ్ సన్స్, రాజమండ్రి, సాహితీ పబ్లికేషన్స్, విజయవాడ, నవయుగ పబ్లిషింగ్ హౌస్, నగారా పబ్లికేషన్స్, గుంటూరు చెప్పుకోతగినవి.

విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ

1942లో ప్రజాశక్తి ప్రచురణాలయంగా ప్రారంబించబడి 1948లో ప్రభుత్వ నిర్బంధ విధానం వల్ల మూసివేయబడి తిరిగి 1952లో ప్రారంభించి నపుడు విశాలాంధ్ర ప్రచురణాలయంగా పేరు మార్చారు. సంవత్సరాని కొకసారి సాహిత్యవారాల పేరుతో కార్యకర్తల ద్వారా పుస్తకాల అమ్మకాలు ఒక ఉద్యమంలాగా నిర్వహించేవారు. 955 తర్వాత వచ్చిన రాజకీయ పరిణామాల దృష్ట్యా సాహిత్యవారాలు మానివేసి ప్రతి ముఖ్యమైన నగరంలోనూ, పట్టణంలోనూ బ్రాంచీలు ప్రారంభించి పాఠకుల అభిరుచికి అనుకూలమైన ప్రచురణలు చేసి వ్యాన్‌ల ద్వారా, పుస్తక ప్రదర్శనల ద్వారా ప్రజలకు అందుబాటులోకి తీసుకువెళ్ళారు. తమ సంస్థ ప్రచురణలే కాక మిగిలిన ప్రచురణ సంస్థల ప్రచురణలు కూడా పంపిణీ చేసి గణనీయమైన సాహిత్య సేవ చేస్తున్నారు.

1957 సంవత్సరంలో ప్రభుత్వం స్థాపించిన ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రముఖ గ్రంథాలు ప్రచురించడమే కాకుండా వాటిని సామాన్య పాఠకునికి అందుబాటులో ఉండే ధరలలో అందించారు. తర్వాత ఈ సంస్థను తెలుగు విశ్వవిద్యాలయంలో లీనం చేశారు.

1960 తర్వాత ప్రారంభించిన ప్రచురణ సంస్థలలో ప్రతిమా బుక్స్, మద్రాస్, గుండిమెడాస్, ఏలూరు, వి.యస్.యన్. అండ్ సన్స్, విజయవాడ, హితకారిణి సమాజం, రాజమండ్రి, కవికోకిల పబ్లికేషన్స, నెల్లూరు, నవభారత్ బుక్‌హౌస్, నవోదయ పబ్లిషర్స్, నవజ్యోతి పబ్లికేషన్స్, స్టూడెంట్స్ బుక్‌సెంటర్, అరుణా పబ్లిషింగ్ హౌస్, మహలక్ష్మి బుక్ ఎంటర్‌ప్రైజెస్, క్వాలిటీ పబ్లిషర్స్, ప్రేమ్‌చంద్ పబ్లికేషన్స్, నవరత్న బుక్‌హౌస్, విజయవాడ, విశాఖ సాహితి (విశాఖపట్నం) సంస్థలు చెప్పుకోదగ్గవి.

ఆంధ్రప్రభ వారపత్రిక రంగనాయకమ్మగారి కృష్ణవేణి, కోడూరి కౌసల్యాదేవిగారి చక్రభ్రమణం, జ్యోతి మాసపత్రిక యద్దనపూడి సులోచనా రాణిగారి సెక్రటరీ నవలలు ప్రచురించడంతో ఒక కొత్త శకం ప్రారంభమైన ట్లుగా చెప్పుకోవచ్చు. సుమారు ఓ రెండు దశాబ్దాలపాటు రచయిత్రుల నవలా వెల్లువతో ప్రచురణరంగం అనేక ప్రయోగాలు చేసింది. ఆ పరిస్థితి ఎందరినో ప్రచురణ రంగం దిశకు ఆకర్షించింది. 1965 నుంచి 1980 వరకు ప్రముఖ రచయిత్రుల నవలలు ముద్రించి చాలా సంస్థలు భారీ వ్యాపారం చేశాయి.

స్థూలంగా పరిశీలిస్తే ఈ సమయంలో మూడు అంశాలను ప్రముఖంగా చెప్పుకోవాల్సి ఉంటుంది. హింద్ ప్యాకెట్ బుక్స్, ఢిల్లీ వారి ప్రేరణతో ఎమ్. శేషాచలం కంపెనీ ప్రవేశపెట్టిన ఇంటింటా గ్రంథాలయం, ఎమెస్కో పాకెట్ బుక్స్, సాహిత్యసంస్థగా గుర్తింపు పొంది వంద పుస్తకాల పైగా ప్రచురించిన యువభారతి సంస్థ, సికింద్రాబాద్, నేషనల్ బుక్‌ట్రస్ట్ వారు ఏర్పాటు చేస్తున్న పుస్తక ప్రదర్శనలు పాఠకులను బాగా ఆకర్షించాయి. 1965-80 సంవత్సరాల మధ్యకాలంలో ప్రచురణరంగానికి స్వర్ణయుగమని చెప్పవచ్చు. ఈ సమయంలో అనేక నూతన సంస్థలు తమ మనుగడ సాగించాయి.

ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, సికింద్రాబాద్

1923లో బందరులో ఎం. శేషాచలం అండ్ కంపెనీ స్థాపించిన శేషాచలంగారి వార్ధక్యంలో వారి పెద్ద కుమారుడు యం. నరసింహారావు (యం.యన్.రావుగా ఎక్కువమందికి తెలుసు) ఫోర్డ్ ఫౌండేషన్ తరపున 1962 ప్రాంతాల మద్రాసులో స్థాపించబడిన దక్షిణ భాషా పుస్తక సంస్థ సలహాదారుగా వచ్చిన ఆర్డర్ యీజన్‌బర్గ్‌తో పరిచయమైన తర్వాత వారి సలహాలతో తెలుగు ప్రచురణలలో ఒక సంచలనం సృష్టించారు.

అప్పటివరకూ పాఠ్యపుస్తకాల ప్రచురణపై ఆధారపడుతున్న సంస్థ పాఠ్యపుస్తకాలు జాతీయం చేయటంతో ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ పేరుతో సికింద్రాబాద్ కేంద్రంగా పుస్తకాల పంపిణీ సంస్థను ప్రారంభించారు. ఆయన ప్రతి పనీ శాస్త్రయుక్తంగా సర్వే చేసి ప్రణాళికలు సిద్ధం చేసి ముందుకు అడుగు వేసేవారు.

ఢిల్లీలోని హిందీ పాకెట్ బుక్స్‌వారు నిర్వహిస్తున్న హోమ్ లైబ్రరీ ప్రణాళికను పోలిన ఇంటింటి గ్రంథాలయాన్ని రాష్ట్రంలో స్థాపించి కొన్ని వేలమంది పాఠకులను సభ్యులుగా చేర్చి చనిపోయే వరకూ నిరాఘాటంగా నిర్వహించారు యం.యన్.రావుగారు. హింద్ పాకెట్ బుక్స్, ఢిల్లీ వారిని అనుకరించి ఎమెస్కో పాకెట్ బుక్స్ పేరుతో ప్రతినెలా నాలుగు పుస్తకాలు ప్రచురించే కార్యక్రమం చేపట్టారు. ఒక్కో పుస్తకం వెల రు. 2.00 లకే పరిమితం చేసి రాష్ట్రంలో పుస్తక ప్రచురణలో ఒక విప్లవం తీసుకువచ్చారు.

యం.యన్. రావుగారి తదనంతరం ఆ సంస్థను ఖరీదు చేసిన వారు కూడా ఆ సంస్థ వన్నె తరగకుండా ప్రచురణలను కొనసాగిస్తున్నారు. వారు ప్రచురించిన నాలుగు వేదాలు తెలుగు ప్రచురణ రంగంలో సంచలనం తీసుకువచ్చాయి. టీవి ప్రభావం వల్ల పుస్తకాలకు ఆదరణ తగ్గుతోందన్న దశలో వీరు ప్రచురించిన నాలుగు వేదాలు జాను తెనుగులో దాశరధి రంగాచార్యగారితో వ్రాయించి ప్రచురించారు. రు. 2,250/-ల విలువ కలిగిన ఈ పుస్తకాల సెట్ కొన్నివేల ప్రతులు అమ్ముడుపోయాయి. పుస్తక ప్రచురణకు కొత్త ఆశలు కలిగించాయి.



విశ్వనాథ సత్యనారాయణ తిరుపతి వెంకటకవులు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి మొదలైన రచ

యితలు కొద్ది పుస్తకములు ప్రచురణకర్తల ద్వారా ప్రచురించినా ఎక్కువభాగం పుస్తకాలు తామే ప్రచురించుకొనేవారు.

ఏషియన్ ఎడ్యుకేషన్ సర్వీసెస్, న్యూఢిల్లీ

ఒక ఆంధ్రేతరుడు ప్రారంభించిన సంస్థ. న్యూఢిల్లీ కేంద్రంగా సి.పి. బ్రౌన్ డిక్షనరీలతో ప్రారంభించి అప్పట్లో ప్రచురితమైన వేమన పద్యములు, జిల్లా మాన్యుయల్స్, అమరకోశం, త్యాగరాజుచరిత్ర లాంటి ప్రామాణిక గ్రంథములు ప్రచురించి అమోఘమైన సాహిత్యసేవ చేస్తున్నారు.

ఆధ్యాత్మిక పుస్తకాల ప్రచురణలో అగ్రగణ్యంగా నిలిచిన తిరుమల తిరుపతి దేవస్థానం చాలా పుస్తకాలు ప్రచురించి ధరలు సామాన్యునికి అందుబాటులో ఉంచాయి. స్వాతంత్ర్యపోరాటంలో అగ్రగామిగా నిలబడ్డ గ్రంథాలయోద్యమ ప్రభావం వల్ల ఎన్నికైన ప్రజా ప్రభుత్వాలు గ్రంథాలయాలకు నిధులు విరివిగా ఇవ్వటంతో ప్రచురణ రంగానికి మంచి ప్రోత్సాహం లభించింది. ప్రభుత్వం సంపూర్ణ అక్షరాస్యత, ఆపరేషన్ బ్లాక్‌బోర్డ్‌లాంటి స్కీములతో పుస్తకాలు కొనటం వల్ల ప్రచురణరంగం ఎక్కువగా పుస్తకాలు వెలువరించగలిగింది.

రచయిత్రుల నవలలపై మోజు మళ్ళుతున్న దశలో యండమూరి వీరేంద్రనాథ్ తులసి, తులసీదళం నవలలతో విజృంభించి పుంఖాను పుంఖాలుగా రచనలు చేశారు. నవభారత్ బుక్‌హౌస్, నవసాహితి బుక్‌హౌస్ వారు వీటిని ప్రచురించారు. టీవీ సీరియల్స్ వల్ల నవలలకు ఆదరణ తగ్గిన సందర్భంలో సి. నరసింహారావు (రేవు) వ్రాసిన వ్యక్తిత్వ వికాసం, జీవన వికాసం, యండమూరి వీరేంద్రనాథ్ వ్రాసిన విజయానికి అయిదు మెట్లు, విజయంలో భాగస్వామ్యం లాంటి పుస్తకాలు వేలసంఖ్యలో అమ్ముడు పోయాయి.

1980వ సంవత్సరంలో రాజకీయ అనుబంధ సంస్థగా ప్రారంభించిన ప్రజాశక్తి బుక్‌హౌస్ దినదిన ప్రవర్ధమానమై రాష్ట్రంలో వివిధ పట్టణాలలో దాదాపు 10 బ్రాంచీలు ప్రారంభించి ప్రచురణలను కూడా గణనీయంగా పెంచింది.

రాజకీయ పార్టీలకు అనుబంధ సంస్థలుగా ప్రారంభించబడిన విశాలాంధ్ర ప్రచురణాలయం, ప్రజాశక్తి బుక్‌హౌస్‌లతో పాటు జనసాహితి, విప్లవ రచయితల సంఘం తమ రాజకీయాలకు అనుకూలంగా ఉండే ప్రచురణలతో పాటు ఇతర అంశాలపై కూడ ప్రచురణలు చేశారు. జన విజ్ఞాన వేదిక పేరుతో వెలువరుస్తున్న పుస్తకాలు పాఠకులకు విజ్ఞానదాయకంగా ఉంటున్నాయి. అలాగే వాటి ధరలు కూడా అందుబాటులో ఉంచుతున్నారు. హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురణ సంస్థ అనువాద సాహిత్యాలతో పాటు మౌలికమైన ప్రచురణలు చాలా ప్రచురిస్తోంది. ఇటీవలే ప్రారంభమైన పీకాక్ క్లాసిక్స్ అనే సంస్థ అనువాద గ్రంథాల ప్రచురణతో ప్రత్యేక గుర్తింపు కోసం ప్రయత్నిస్తోంది.

ప్రాచీ ప్రచురణాలయం హైదరాబాద్ వారు ప్రచురిస్తున్న అరుదైన పుస్తకాలు పాఠకుల ఆదరణను చూరగొంటున్నాయి. కథాసాహితి ప్రచురిస్తున్న కథా సంపుటాలు, తర్వాత సంవత్సరాలలో ప్రచురణ ప్రారంభించిన కథావాహిని, కథావార్షిక ప్రచురణలు పాఠకులను చదివిస్తున్నాయి. ఎవికె ఫౌండేషన్‌వారు ప్రచురిస్తున్న పుస్తకాలు పాఠకుల ఆదరణను పొందుతున్నాయి. రచయితలు తామే స్వయంగా ప్రచురించుకుంటున్న పుస్తకాలు కూడ గణనీయంగానే ఉంటున్నాయి. 21వ శతాబ్దం ప్రారంభంలో జెపి పబ్లికేషన్స్, ఋషి పబ్లికేషన్స్, సరస్వతీ పబ్లికేషన్స్, అలకనంద ప్రచురణల వారు విరివిగా ప్రచురణలు చేస్తున్నారు.

రోహిణి పబ్లికేషన్స్, మోహన్ పబ్లికేషన్స్, గొల్లపూడి వీరాస్వామి అండ్ సన్స్, రాజమండ్రి నుండి ఎక్కువగా ప్రచురణలు వెలువడుతున్నాయి. ఆంధ్ర, వెంకటేశ్వర, ఉస్మానియా యూనివర్సిటీలవారు ప్రచురించిన పుస్తకాలు మార్కెటింగ్ సౌకర్యాలు లేక గోడౌన్లలో మూలుగుతూ ఉంటున్నా సాహిత్య అకాడమి, నేషనల్ బుక్‌ట్రస్ట్, పబ్లికేషన్స్ డివిజన్, తెలుగు అకాడమి సంస్థల ప్రచురణలు ప్రజలకు అందుబాటు ధరలలో ఉంటాయి.

టి.వి. సీరియల్స్ వల్ల ప్రచురణల సంఖ్య తగ్గటం, నవలల ప్రభావం తగ్గి, వ్యక్తిత్వ వికాసం మీద ప్రచురణలు ఎక్కువగా ప్రచురితమౌతున్నాయి.

కంప్యూటర్ విప్లవం వచ్చినంత మాత్రాన పుస్తకంలేని ప్రపంచం రాబోతోందనేది వాస్తవం కాదు. చదువుకొందామనే పాఠకులు కొద్దిగా తగ్గినప్పటికీ పుస్తకం మరణం లేనిది, పుస్తకానికి ప్రత్యామ్నాయం లేదు, ఉండబోదు!

*

ఈ వ్యాసకర్త రామమోహనరావుగారి ఇంటి పేరు అట్లూరి. కాని తన ప్రచురణ సంస్థ నవోదయ పేరు మీదుగా ఆయన నవోదయ రామ్మోహనరావుగా ప్రసిద్ధులు. ఆంధ్రదేశం గర్వించదగ్గ ఎన్నో పుస్తకాలను నవోదయ సంస్థ ప్రచురించింది. వీటిల్లో రష్యన్ అనువాద గ్రంథాలు మొదలుకొని మల్లాదివారి కథలు, ముళ్ళపూడివారి రచనలు, నండూరి రామ్మోహనరావుగారి తాత్విక వ్యాసాలు ప్రచురించిన ఘనత ఈ సంస్థది. నవలల ప్రాచుర్యంతో పుస్తక ప్రచురణ వ్యాపారం ముమ్మరంగా సాగుతున్న రోజుల్లో దానికి భిన్నంగా సత్యం శంకరమంచి అమరావతి కథలు, నండూరి వారి విశ్వరూపం, నరావతారం వంటి సీరియస్ రచనల్ని కూడా ప్రచురించి వ్యాపారం చేయవచ్చని రుజువు చేసిన సంస్థ నవోదయ. ఆరోజుల్లో నవోదయ తమ పుస్తకం ప్రచురిస్తే బాగుండు అని అనుకోని రచయిత లేరంటే అతిశయోక్తి కాదు. విజయవాడ ఏలూరు రోడ్డులోని నవోదయ ప్రచురణ సంస్థ రెండు దశాబ్దాల పాటు సాహితీ కేంద్రంగా భాసిల్లింది.

నిజానికి ఈ వివరాలన్నీ పై వ్యాసంలో చోటు చేసుకోవలసి ఉండగా, అందుకు వ్యాసకర్త విముఖత వ్యక్తం చేయటంతో సంపాదకుడిగా ఈ విషయాలు పాఠకుల ముందు పెట్టడానికి నేను సాహసించాల్సి వచ్చింది.

- సంపాదకుడు

గ్లోబలైజేషన్
గ్రామీణ జీవితం, తెలుగు కథ

కొఱ్ఱగడ్డ దయానంద్

గ్రామీణ జీవితంలో వీస్తున్న మార్పుల్ని పట్టుకున్నట్లే, తెలుగు సమాజంలో మిగతా పార్శ్వాలను ముఖ్యంగా స్త్రీల పెనుగులాటల్ని, బహుళజాతి సంస్థలు చేతివృత్తుల పనితనాన్ని వాడుకుంటూ మార్కెట్లను శాసించడాన్ని కథా రచయితలు అక్షరీకరిస్తున్నారు.



నిజానికి ఇవాళ గ్రామాల్లో ఏం జరుగుతోంది? అన్న ప్రశ్న వేసుకుంటే, ఆంధ్రదేశంలో గ్రామాలు బతికున్నాయా అనే ప్రశ్న కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది. అవును. పల్లెలు పల్లెల్లా ఉన్నాయా? రైతు రైతుగా బతుకుతున్నాడా? పల్లెల్లో మనుషులు మనుషులుగా బతుకుతున్నారా?

తెలుగు నేల మీద వందల సంఖ్యలో అన్నదాతలు బలవన్మరణాల పాలవుతున్నారు. లేదూ రైతుగా చచ్చిపోయి కూలీలుగా రూపాంతరం చెంది పల్లెల్ని ఖాళీ చేసి పట్నాలకు వలసపోతున్నారు. కులవృత్తులు ధ్వంసమై వ్యవసాయరంగాన్ని నమ్ముకున్న కమ్మరి, కుమ్మరి, చేనేత రంగాలవారికి పల్లెల్లో పట్టెడన్నం దొరక్క వాళ్ళూ చచ్చిపోవడమో, లేదూ వలసలు పోవడమో జరుగుతోంది. ఒక దశాబ్ది కాలంగా తెలుగునేల మీద పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. ముఖ్యంగా పల్లెల్లో మృత్యువాసన వీస్తోంది.

"ఒకప్పుడది అందమైన చెరువే. పొద్దున్నే ఒక హరిదాసు అక్కడ కూర్చుని నామాలు దిద్దుకుంటుంటే, కావిళ్ళు వేసుకుని మగవాళ్ళు నీళ్ళ కోసం వస్తుంటే, పూజల కోసం వచ్చే ఆడవాళ్ళు, పొద్దుటిపూట బస్సు కోసం ఆగిన జనం, అమ్మకానికొచ్చిన నారుమళ్ళను తడుపుతూ తూర్పు నుంచి వచ్చిన జనం, చిడతలు వాయిస్తూ హరిదాసు బయల్దేరడం," అంతా కళ్ళకు కట్టినట్టు కన్పిస్తుంది అంటాడు డా॥ వి. చంద్రశేఖరరావు *(నీటిపిట్టల కథలు)*. ఇది రెండు దశాబ్దాల కిందటి పల్లె ముఖచిత్రం.

"ఇప్పుడా చెరువులో నీళ్ళు లేవు. హరిదాసులు, జంగంవాళ్ళు ఇప్పుడా ఊరికి రావడంలేదు. చెరువుగట్టు గొడవ గొడవగా ఉంది. సంత ఒకవైపు, మందలు మందలుగా పశువులు, కాస్త దూరంలో రెండు టాటా సుమోలు, తెనాలికి చెందిన సేట్‌లు రెడీ క్యాష్‌తో సూట్‌కేస్‌లు పట్టుకుని అక్కడ నుంచున్నారు. అమ్మకానికైనా అప్పుకైనా రెడీ. లక్షా యాభైవేలు పలికే పాలం యాభైవేలకయితే అక్కడికక్కడే బేరం ఖరారు. లేదా పాలం తాకట్టుపై పదిరూపాయల వడ్డీ - వడ్డీ బదులు గింజలు కొలవాలి. అయిదు నిముషాల్లోనే డబ్బు. డబ్బే కాదు పశువులకు పచ్చగడ్డి కావాలన్నా, వానలపై ఆశలు చావని వాళ్ళకు విత్తనాలు, మందులు కూడా సిద్ధం." *(నీటిపిట్టల కథలు)*

ఇదీ ఇవాళ్టి కోస్తా ప్రాంతంలో ఉన్న ఒకానొక పల్లె పరిస్థితి. ఆ పల్లెలో ఉండే ఒకానొక సేద్యగాడు మనోహరం కథ వింటే గుండె ఎవరో మెలిపెట్టినట్లుంటుంది. కడుపులో దేవినట్లుంటుంది. కరువు వాతపడి నాలుగు ఆదివారాల్నుంచి బొడ్డులో పాలం కాగితాలు పెట్టుకుని సంతలో తచ్చాడుతూ ఆఖరుకు తెగించి తండ్రి వేలిముద్రలూ, తన వేలిముద్రలూ తనే వేసి ఆ డబ్బు తీసుకొని హైద్రాబాద్ వెళ్ళి మొదట్లో హోటలనీ, బంజారాహిల్స్‌లో పెద్ద మేడనీ, తర్వాత లోన్లూ, బ్యాంకులూ వడ్డీలు అంటూ దిగులు కబుర్లు - తండ్రి చావు పట్టని కొడుకుగా మారి ఆఖరికి కూలిపన్ల కెళ్ళి ఇటుకలు మోస్తూ మేడపై నుండి జారిపడి మెదడులో రక్తనాళాలు చిట్లిన మనోహరం పిచ్చివాడై, "మా ఊరు వెళ్ళిపోయి, కొత్తది వల ఒకటి కొనుక్కుని గవర్నమెంటు ఒడ్డున కూర్చుని చేపలు పట్టు కోవాలి," అని ఒకసారి, "కాస్త వర్షాలు పడితే ట్రాక్టరు అద్దెకు తెచ్చుకుని గవర్నమెంటును దున్నాలయ్యా! రెండు లక్షల ఖరీదుచేసే హోటల్ని గవర్నమెంటు లాక్కుపోయింది," అంటూ విలపించడం ఇవాళ్టి గ్రామీణ విషాదం.

రాయలసీమలోని వేపమాన్ల పల్లె - దుక్కిదున్నడానికి విత్తనాల పెట్టుబడికీ ఫాస్పేటు మూటలకీ కలుపులకీ అన్నీ లెక్కేసుకుంటే యాడాదికి తొమ్మిదివేలు పెట్టుబడి పెట్టి, కుసుమలు పండిస్తే ఆరెకరాల్లో నలభై కేజీల పంట పండి చేతికొచ్చిన అయిదు నూర్ల నలభై రూపాయలు చూసుకొని ఉప్పర గురప్ప ఏమంటున్నాడో విందాం.

"పెద్ద కులం లేదు, చిన్న కులం లేదు. అంతా ఒక దారే. నలభై ఎకరాలుండే కాపోల్ల పిల్లోడు వస్తా ఉండాడు. ముప్పై ఎకరాలుండే కమ్మోళ్ళ పిల్లోడూ వస్తా ఉండాడు. అట్లాగే పదైదెకరాలుండే గొల్లోల్లూ - రెండు కాలాల్లోనూ సిమెంటు ఫ్యాక్టరీ పనికి వస్తా ఉండారు. భూమిలేని కొదమోల్ల సంగతా." (విరూపం - కేతు విశ్వనాథ రెడ్డి).

ఆరెకరాల్లో పత్తి వేసి పెట్టుబడి ఎంతైనా తెగించి పెట్టి పురుగు పట్టకుండా చూచి విరగబూచిన పత్తికి రేటు ఉండుద్దో ఉండదో అనుమానం కలిగి, 'అనంతపురం రైతుల మాదిరి నేను పురుగు మందు తాగి మాత్తరం సచ్చిపోను. అంత దరిద్రం నెత్తి మీద కూకుంటె అప్పులు తీర్చలేకపోతే ఒక పని చెయ్యడమే. సిమెంటు రాయి కంకర, బొగ్గు, ఎర్రమట్టి - అన్నిటితోపాటు మిషనులోకి దూకడమే. ఏమవుద్దా? ఉడికి ఉడికి చచ్చి సున్నమై సిమెంటును కావడమే. పెండ్లాం పిల్లోల్లు గతి ఏమంటావా? చచ్చినాక నాకు తెలిసేదేముంది,' అనుకుంటాడు. వ్యవసాయంతో పాటు సిమెంటు ఫ్యాక్టరీ కూలిపనికెళ్ళే ఆరెకరాల ఉప్పర గురప్ప విరూపం కథలో.

తెలంగాణా పల్లెల్లో వ్యవసాయమూ, తరతరాలుగా నమ్ముకున్న చేనేత వృత్తీ బతుకుతెరువు కాలేకపోవడం - అక్కడి జీవితాన్నీ ఒకసారి చూద్దాం.

హైబ్రీడు విత్తనాలని డబ్బుల్దగలేసి నానబోసి సేద్యం చెయ్యబోతే మొలక రాకపోవడం, షావుకార్ని బతిమలాడి అప్పు కింద విత్తనాల ఒడ్లు తెచ్చి మళ్ళీ నానబోసి మొలక గట్టి చేలో చల్లితే తర్వాత అరకొర నీళ్ళతో ఇబ్బందులు పడటం, దొర అమానుషత్వం, కరంటాఫీసు లైన్‌మెన్ దౌష్ట్యం, ఆఖరుకు నానా అగచాట్లు పడి ఆరుగాలం కష్టపడి కళ్ళంలో పంటను తూర్పారబట్టే సమయానికి విత్తనాల డబ్బిచ్చిన షావుకారి ఒక్క గంటలోనే కొల్లగొట్టుకపోవడం - దుర్గయ్య పట్నానికి వలస వెళ్ళి కూలిగా మారి అక్కడ దుర్మరణం చెందడం ఒక పక్క - మరోపక్క దుర్గయ్య అన్న నారాయణ -

"వయసు మీద బడమట్టె. కాలం సూడబోతె కటపిటగా ఉంది. జనం మునుపటిలెక్క మగ్గం మీద నేసిన గుడ్డలు కడ్తలేరు. మిల్లు బట్టొచ్చి మన కడుపులు కొట్టె. దానికి తోడు నూలుపై ఎక్కువ సుంకం వసూలు చెయ్యబట్టిరి. రంగుల ధరలు చూడబోతె ఆకాశాన్ని ఎగిరే. మిల్లు బట్ట లెక్క నేతబట్ట నునుపులేదని జనం పట్నంబోయి కొనుక్కొచ్చుకుంటుండ్రి. మిల్లు బట్టలెక్క డిజైన్లు ఎయ్యటం మగ్గం మీద అయిద్దా. పొద్దస్తమానం తిర్గి తిర్గి కాళ్ళు నొప్పి పుట్టబట్టె. ఒక్క బట్ట అమ్మడు పోదాయె," అని తరచి తరచి సూరత్‌కు వలసపోయి అక్కడ మతకలహాల సుడిలో చిక్కుకుని బతికి బట్టకట్టి మళ్ళీ ఊరు వచ్చి ఉరి పెట్టుకోవడాన్ని చిత్రించిన కథ యెన్నం ఉపేందర్ రాసిన చకోర జీవితాలు.

ఇవ్వాళ తెలుగునేల మీద ఏ గాలి వీస్తుందో, ఇక్కడి పల్లెల జీవితాల్ని, ఘటనల్నీ, ఒడుదుడుకులనూ కథకులు ఎట్లా చిత్రిస్తున్నారో, ఈ మూడు కథల్లో అత్యంత వాస్తవికంగా కళ్ళకు కట్టిన రైతుల జీవన విషాదం వెనుక ఉన్న మూలాలేమిటో మాంత్రిక వాస్తవిక కథనంగా నీటిపిట్టల కథలులో డా. వి. చంద్రశేఖరరావు, జర్నలిస్టిక్ వార్తా కథనంగా విరూపం కథను కేతు విశ్వనాథరెడ్డి, వాస్తవిక కథన పద్ధతిలో యెన్నం ఉపేందర్ చకోర జీవితాలులో దృశ్యమానం చేశారు.

గడిచిన రెండు దశాబ్దాలుగా పల్లెల సామాజిక, జీవన, ఆర్థిక ముఖ చిత్రంలో పెనుమార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రతి ఏటా సుమారు అరవై ఐదువేల మంది రైతులు చితికిపోయి కూలీలుగా రూపాంతరం చెందుతున్నారు. ఇరవై ఏళ్ళ క్రితం రైతులు, రైతుకూలీల నిష్పత్తి నూటికి 47:53గా ఉంటే ఇప్పుడది 36:64గా మారిపోయింది. ఈ ఇరవై ఏళ్ళలో పదమూడు లక్షలమంది రైతులు కూలీలుగా మారడమో, పల్లెల నుంచి వలసలు పోవడమో జరిగిందని అర్ధగణాంక శాఖ లెక్కల్లో తేలింది.

నిజానికి రైతుల ఆత్మహత్యలకు, వలసలు పోవడానికి కారణాలను అన్వేషిస్తే సవాలక్ష కారణాలు కన్పిస్తాయి. నకిలీ విత్తనాలు, కల్తీ మందులు, అదునులో ప్రకృతి కన్నెర్ర చెయ్యడం, పండిన పంటకు మార్కెట్ లేకపోవడం - ఇవన్నీ 1987 నాటికే ప్రకాశం జిల్లా పత్తిరైతులు ఆత్మహత్యల దిశగా పరుగులు పెట్టడానికి కారణాలయ్యాయి. అప్పుడప్పుడే మొదలైన ప్రభుత్వ ఆర్థిక సరళీకృత విధానాలు, గాట్ ఒప్పందాలు, ఆక్వాలాంటి వ్యాపార పంటలవైపు రైతును మళ్ళించడం, గిట్టుబాటు ధర కోసం బజారున పడ్డ పొగాకు రైతుల్ని టంగుటూరులోను, ఆ తర్వాత కాల్దరి లోనూ కాల్చి చంపడం - ఇవన్నీ కూడా అటు తెలంగాణా లో పత్తి రైతులనూ, ఇటు రాయలసీమ వేరుశనగ రైతులనూ మృత్యువుకు దగ్గర చెయ్యడానికి దోహదపడ్డాయి. అంతే కాకుండా, పాలక వర్గాలకు సంక్షేమ భావన కొరవడి వ్యవసాయ రంగంలో సబ్సిడీలు ఎత్తివేయడం, ప్రభుత్వరంగ సంస్థల్ని మూసివేయడం లేదా ప్రైవేటుపరం చేయడం, విద్య, వైద్యరంగాల్ని ప్రజలు కొనుక్కునే పరిస్థితుల్ని కల్పించడం - ఇవన్నీ కూడా ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ నిర్దేశాలకు అనుగుణంగా చెయ్యడంతో రెండు, మూడెకరాల సన్నకారు రైతులు ఆర్థికభారాన్ని మొయ్యలేక, వ్యవసాయం గిట్టుబాటు కాక, చెయ్యందించే ఆసరా లేక అటు మృత్యువు ఒడిలోకో, ఇటు పట్నం దరికో చేరాల్సిన పరిస్థితులొచ్చాయి.

కోస్తా ప్రాంతంలోని భూముల్ని సాగు చేసుకుంటున్న సన్న, చిన్న కారు రైతులు సేద్యంతో బతకలేక నేలతల్లిని వదిలి పట్నాల బాట పడుతుంటే, పట్నాల్లో ఉండాల్సిన కార్పొరేట్ సంస్థలు మెల్లిమెల్లిగా పల్లెల మీద ఉక్కుపాదం మోపాయి. వందల ఎకరాల్ని కార్పొరేట్ కమతాలు చేసి కోస్తా ప్రాంత భూముల్ని ఉప్పునీటి రొయ్యల చెరువులు చేశాయి. పల్లెల్లో ఉప్పునీటి చెరువుల ధాటికి మంచినీళ్ళ వనరులన్నీ ఉప్పునీరుగా మారిపోయి తాగడానికి నీళ్ళు దొరకని పరిస్థితులొక పక్క పాడి మీద బతికే కుటుంబాలు కూడా పశువులకు గడ్డి దొరక్క, నీళ్ళు దొరక్క ఒక విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. రొయ్యల చెరువుల్లోని ఉప్పు నీటి ధాటికి పక్కనున్న పంట పొలాలు సైతం నిలువునా ఎండిపోవడం, పంటలు పండని పరిస్థితి దాపురించడం, క్రమేణా ఆ భూముల్ని కార్పొరేట్ సంస్థలకే ఏదో ఒక ధరకు అమ్మి భూమితో తెగతెంపులు చేసుకోవడం - లేదూ

కడుపు మండిన రైతులు కార్పొరేట్ సంస్థల్ని ఎదిరిస్తే వాళ్ళ మీద మాఫియా రౌడీల్తో దాడి చెయ్యడం - ఇదీ ఇవ్వాళ కోస్తా ప్రాంత రైతు దుస్థితి. తెలంగాణాలో పరిస్థితి కూడా ఇంతకంటే భిన్నంగా లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అక్కడ కూడా వందల ఎకరాల్లో ఔషధోపయోగిక చెట్లను పెంచడం, గులాబీతోటల్ని సాగు చెయ్యడం ద్వారా కార్పొరేట్ వ్యవసాయ సంస్థలు భూమి మీద తమ ఆధిపత్యాన్ని చూపించడం మొదలైంది. ఒకప్పుడు పెద్ద రైతుల, దొరల చేతుల్లో ఉన్న భూమి క్రమేణా జీతగాళ్ళ, చిన్నరైతుల చేతుల్లోకి వస్తే ఒక దశాబ్ద కాలంగా ఆ భూములన్నీ వారి దగ్గర్నుంచి కార్పొరేట్ సంస్థల గుప్పెట్లోకి వెళ్ళడం తెలుగు నేల మీద జరుగుతున్న విషాదం.

ఈ మార్పులన్నింటినీ తెలుగు కథకుడు సమగ్రంగానే చిత్రించాడు. జీవితంలోని సమస్యల్ని, దుర్భర అనుభవాల్ని పల్లె జీవితం నుంచి వచ్చిన కథకులు అద్భుతంగానే పట్టుకున్నారు. ఉత్తరాంధ్ర నుంచి అప్పల్నాయుడు, సువర్ణముఖి, గొరునాయుడు గ్రామీణ జీవితంలోని సామాజిక, ఆర్థిక పరిణామాల్ని చిత్రించారు. తెలంగాణా పల్లె ప్రాంత వెతల్ని అల్లం రాజయ్య, రఘోత్తమరెడ్డి, బి.ఎస్. రాములు, కాలువ మల్లయ్యలు అద్భుతంగా ఆవిష్కరిస్తే పెద్దింటి అశోక్‌కుమార్ తన సునిశిత చూపుతో గ్రామీణ జీవితంలో వచ్చిన అనేకానేక మార్పుల్ని తన కథల సూక్ష్మదర్శిని లో బంధించాడు. రాయలసీమను కమ్ముకున్న కరువు కారు మేఘాల గురించి కేతు విశ్వనాథరెడ్డి, స్వామి, సింగమనేని, శాంతినారాయణ, సన్నపురెడ్డి లాంటి కథకులు విశ్లేషిస్తున్నారు. దక్షిణ కోస్తాలో వ్యవసాయ రంగంలో వచ్చిన పెనుమార్పుల్నీ, రైతుల జీవితాలలోని కడగండ్లను, వారి దుర్భర జీవితాల్నీ పాపినేని శివశంకర్, నల్లూరి రుక్మిణి, కాత్రగడ్డ దయానంద్, చంద్రలత, ప్రతిమ, మొలకలపల్లి కోటేశ్వరరావులు చిత్రిస్తుంటే డా॥ వి. చంద్రశేఖరరావు తనదైన శైలిలో, మాంత్రిక కథనంతో ఇక్కడి రైతు కథల్ని అందిస్తున్నాడు.

రొయ్యల చెరువులకు తనకున్న కొద్దిపాటి పొలాన్ని అమ్ముకుని నేలతల్లికి దూరం కాలేక, చిరకాలం నుంచి తన పొలంలో రాశులు రాశులుగా పండించిన కూరగాయల స్వప్నాన్ని వదులుకోలేక, చిట్ట చివరికి ఒకానొక విధ్వంసంలోకి నెట్టబడి వ్యవసాయ మాఫియా ముఠా చేతుల్లో రక్త మోడుతున్న గుండ్లకమ్మ రైతు వెంకటేశ్వర్లు తన మానసిక యాతనను కొడుకుతో ఇలా వ్యక్తపరుస్తాడు.

"ఒరే అయ్యా! ఏళ్ళ తరబడి మన కంచంలోకి కూడుబెట్టిన చేనురా అది. ఆ చేను మన సొంతం కావడానికి ఎన్ని తరాలు, ఎంతకాలం బ్రామ్మలకి ఊడిగం చేశామో, దాసోహమయ్యామో మీకేం తెలుసుద్దిరా! మా నాయన బ్రామ్మల దగ్గర జీతాలకుండి, ఆ తర్వాత మగతాకు చేసి ఆకరకు రేటు కట్టి ఆ మట్టిని మన పరం చేసుకున్నామయ్యా! ఇయ్యాల వాళ్ళు ఎకరాలకెకరాలు కొనేస్తన్నారు గాని కష్టం చెయ్యనోడి చేతుల్లో భూమాత ఎన్నాళ్ళు నిల్సుద్దిరా? నేనూ, మీ యమ్మా ఆ పొలాన్నే నమ్ముకుని బతుకుతున్నాం, నువ్వెన్నయినా చెప్పు. నేను కడదేరిందాకా ఆ భూమిని నిలుపుకోవాలనే చూస్తామయ్యా (*గుండ్లకమ్మ తీరాన...*, కాత్రగడ్డ దయానంద్).

ఎద్దులు మాయమై, బండి మాయమై, పేడదిబ్బ మాయమై, పండించిన వడ్లబస్తాలు మాయమై, పెళ్ళాం మెడలో తాళిబొట్టు మాయమై, గాండ్ల వెంకటేశులు గానుగ మాయమై, కుమ్మరి తిప్పన్న సారె మాయమై, వడ్డెర రాములు సమ్మెట గడారు మాయమై, నేత మునెయ్య మగ్గం మాయమై, ఆఖరుకు తినబోయే అన్నం ముద్ద మాయమై-

"ఈ ఊరికేదో మాయదారి రోగం వచ్చింది. ఎప్పుడు ఏం మాయమై పోతుందో తెలీదు. మనుషులకు మనుషులే మాయమైపోతున్నారు," అని నిట్టూర్పు విడిచిన రాయలసీమ రైతు పాతన్న, ఈ మాయదారి రోగానికి సముద్రాల అవతల నుంచి ఎగిరొచ్చిన తెల్లదయ్యం, దానికి వత్తాసు పలికే పెద్దిరెడ్డి కారణమని తెలిసి తెల్లదెయ్యం కోసం యాట కొడవలి పట్టుకుని వెదుకుతుంటె, తెల్లదెయ్యం భూమిని జుట్టు పట్టుకొని కొరడాల్తో కొట్టి నఖాగ్రాలతో చీల్చి లొంగదీసుకో జూస్తుంది. కయ్యల్లోని కూరగాయల పాదులూ, వరిపైరూ ధ్వంసం చేసి దయ్యాలు తినే తిండి కోసమూ, దయ్యాలకొచ్చే జబ్బుల ఔషధాల కోసమూ వ్యాపారంలో మంత్రించిన రహస్యపు నల్లని విత్తనాలు జల్లుతోంది. ఆకలయిందేమో బహుశా, ఒక ఆవూ... మూడు గేదెలూ పిండిన బిందెడు పాలను చప్పరించి మింగింది. ఆ పాడి పశువుల నుంచి కోసుకుని తెచ్చుకున్న నాలుగు పాల పొదుగుల్ని పచ్చిపచ్చిగా నమిలి తింటూ కూర్చున్న తెల్లదయ్యాన్ని పోతన్న జుగుప్సతో 'ఈ భూమి నాది,' అంటూ యాడకొడవలితో తెల్ల దయ్యాన్ని నరకడాన్ని అద్భుత మాంత్రిక వాస్తవికతతో కథనం చేసిన స్వామి కథ తెల్లదెయ్యం తెలుగు నేల మీద జరుగుతున్న కల్లోలాన్ని చిత్రించింది.

తెలంగాణ పల్లెల్లో ముసురుకున్న ముప్పును, రైతులు కూలీలుగా మారడాన్ని దార్ల రామచంద్ర *గద్దొచ్చె* - కోడిపిల్ల కథలోనూ, పెద్దింటి అశోక్ కుమార్ కీలుబొమ్మలు కథలోనూ ఎలా చిత్రించారో గమనిస్తే -

"గాల్లెవరో గా పరదేశం నుంచి మా ఊరికొచ్చి మా భూములన్నీ కొన్నరు. మా ఊరి భూములు వెయ్యి ఎకరాలు - ఊర్లె ఒక్కడంటె ఒక్కని భూమి సుత లేకుండా తీస్కున్నరు. ట్రాక్టర్లతోని భూములన్నీ సదును చేసి మొత్తం కలిపిండ్రు. మొదట మా భూములని అమ్మనన్నం. గాని గా సర్కారోల్లు మాకు మాయమాటలు చెప్పిండ్రు. మీ భూముల్లో కరువుల వల్ల పంటలు సరిగా పండించటం లేదు గదా! మీరు గీల్లకి అమ్మితె మీకు బొచ్చెడు డబ్బు అత్తది అని ఆశ జూపిండ్రు. తీరా అమ్మకానికి సిద్ధమైనంకా అగ్వకు గుంజుకున్నరు. మా భూముల్లో మేము కూలీలుగా కైకిలు పని చెయ్యవలసొచ్చె." *(గద్దొచ్చె - కోడిపిల్ల).*

కూరగాయలు పండించడానికి ఫ్రాన్స్ కంపెనీలు, గులాబీలు పూయించడానికి డచ్ కంపెనీలు వచ్చి వేలకు వేల ఎకరాల్ని తక్కువ ధరకు కొని తెలంగాణ ప్రాంతంలో వాతావరణ కాలుష్యాన్ని, నీటి కాలుష్యాన్ని కలుగజేస్తూ, రైతులు తాము అమ్మిన పొలాల్లోనే కూలీపని చేయాల్సిన పరిస్థితుల్ని పెద్దింటి అశోక్‌కుమార్ కీలుబొమ్మలు కథలో

చిత్రించిన తీరు ఇవాళ్టి తెలంగాణ గ్రామీణ జీవితానికి అద్దం పడుతోంది. నాలుగైదు కిలోమీటర్ల పొడవుండే గులాబీతోటల్ని దాటాలంటే మాస్క్ తెచ్చుకోవాలి. లేదంటే పురుగుమందుల కాలుష్యానికి మనిషి మాత్రుడు స్పృహతప్పి పడిపోవాల్సిందే. అక్కడి గులాబీతోటల్లో పూలున్నా సీతాకోక చిలుకల జాడ ఉండదు. తుమ్మెదల ఘీంకారం ఉండదు. సువాసన లేదు. అంతటా ఘాటైన పురుగుల మందు వాసనే.

సేద్యం చేసే రైతుల పరిస్థితులు ఇలా ఉంటే రైతును నమ్ముకుని, సేద్యాన్ని నమ్ముకున్న ఇతర చేతివృత్తుల వారు పైతం గ్రామాల్లో ఎన్నో కడగండ్లను ఎదుర్కొంటున్నారు. చేద్దామంటే పనిలేక, పస్తులుండలేక రెక్కల్ని నమ్ముకుని పట్టణాలకు తరలి వస్తున్నారు. వ్యవసాయ పని ముట్లను తయారుచేసే కంపాలి బత్తులు ట్రాక్టర్లు వచ్చాక, కట్టెకోత మిషన్లు వచ్చాక పడే అవస్థలను ప్రతీకాత్మకంగా అన్నంగుడ్డ కథలో సుంకోజి దేవేంద్రాచారి కథనీకరించారు. అలాగే వస్త్ర ప్రపంచంలోకి కార్పొరేటు రెడీమేడ్ సంస్థలొచ్చాక చిన్నచిన్న కుట్టుమిషన్లు మూలనబడి, అద్భుతమైన పనివాడితనమంతా ఆ సంస్థలకు కూలీలుగా వలసపోవడాన్ని ఖదీర్‌బాబు న్యూబాంబే టైలర్స్‌లో అత్యద్భుతమైన కథనంతో ఆవిష్కరించారు.

వాస్తవంగా గ్రామీణ జీవనంలో ప్రపంచీకరణ ప్రభావాన్ని పట్టుకోవడం కాస్త కష్టమనిపించినా, గ్రామీణులు పడే యాతనంతా వాన కురవకపోవడం వల్లనో ప్రకృతి వైపరీత్యం వల్లనో, కరువు కాటు వల్లనో, కారణాలుగా పైపైన కనిపించినా, గత రెండు దశాబ్దాల గ్రామీణ జీవితాన్ని పరిశీలించినట్లయితే ఇప్పుడు జరుగుతున్న మార్పులన్నీ ప్రధానంగా ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వలనో, వారిని నడిపిస్తున్న మార్కెట్ శక్తుల వలనో అనేది స్పష్టమవుతుంది. అది స్పష్టమవడానికి పైన ఉదహరించిన కథా వ్యాఖ్యానాలను ఉదహరించవలసి వచ్చింది.

తెలుగు కథకుడు సామాజిక మూలాల్ని పట్టుకోవడం వల్లనే తెలుగు నేలమీద వీస్తున్న గాలుల్ని కథల్లో అక్షరబద్ధం చేస్తున్నాడు. గ్రామీణ జీవితంలో వీస్తున్న మార్పుల్ని పట్టుకున్నట్లే, తెలుగు సమాజంలో మిగతా పార్శ్వాలను ముఖ్యంగా స్త్రీల పెనుగులాటల్ని ఓల్గా, గీతాంజలి, కుప్పిలి పద్మ, బహుళజాతి సంస్థలు చేతివృత్తుల పనితనాన్ని వాడుకుంటూ మార్కెట్లను శాసించడాన్ని ఖదీర్‌బాబు, బమ్మిడి జగదీశ్వరరావులాంటి ప్రజ్ఞావంతులైన కథా రచయితలు అక్షరీకరిస్తున్నారు.

ప్రభుత్వరంగ సంస్థల్ని అర్ధాంతరంగా మూసేస్తే రోడ్డునపడ్డ ఉద్యోగుల యాతనల్ని గొరుసు జగదీశ్వరరెడ్డి *గజ ఈతరాలు*, *చీడ* కథల్లో చిత్రించాడు. అద్భుతమైన పనితనం కలిగి, తను పనిచేసే ఫ్యాక్టరీని సమున్నత స్థానంలో నిలబెట్టాలని, దాని చివరిరోజుల్లోనూ బతికించాలని అహరహం శ్రమించి, అది సాధ్యం కాదని తెలిసి శిథిలమైపోయిన వ్యక్తి కథే సురేష్ *టైటానిక్*.

మొత్తంమీద ఇవ్వాళ్టి తెలుగుకథను చదివినట్లయితే తెలుగునేల మీద నడుస్తున్న చరిత్రను చదివినట్టే. కథకులు చరిత్రకారులు కావడమే కాదు. సామాజిక కార్యకర్తలు కూడా అయి అనంతపురం జిల్లాలో రైతులను ఆత్మహత్యల బారి నుంచి తప్పించడానికి, వాళ్ళకు ధైర్యం నూరిపొయ్యడానికి "ఆత్మహత్య మీ ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదు. ధైర్యం తెచ్చుకోండి. లేదా మొండిగానైనా బతకండి. ఆత్మహత్యలు చేసుకోకండి," అంటూ పల్లెపల్లె తిరిగి ప్రచారం చేస్తున్నారు. ఇదొక సామాజిక అవసరం. కథకుల బాధ్యత. ఈ విషయాన్ని చెబుతూ కరువు పీల్చిన మనుషులు కథలో పి. రామకృష్ణ కరువులో ఉన్న విషాదాన్ని చర్చకు పెట్టారు.

చివరగా కీలుబొమ్మలు కథలో పెద్దింటి అశోక్‌కుమార్ చెప్పిన మాటల్ని చూస్తే ఇవాళ మనమెక్కడున్నామో, మన పల్లెలు ఏమయ్యాయో, మన స్థానం ఎక్కడో అర్థమవుతుంది.

"పోరాటాలు, ధర్నాలు చివరికి ఆత్మహత్యలు కూడ నిర్ణయాలు మార్చలేవని ప్రజలకు తెల్సిపోయింది. ఒకప్పుడైతే ఆయుధాలతో యుద్ధాలు చేసి దేశాలను ఆక్రమించుకునేవారు. ఇప్పుడా పద్ధతి మారిపోయింది. వ్యాపారంతో దేశ ఆర్థికవ్యవస్థను నాశనం చేసి బానిసలుగా మార్చుకుంటున్నారు. మనమెప్పుడో ఆక్రమింపబడ్డాం." *

(తానా సమావేశాల్లోని సాహితీ సదస్సులో చదివిన ప్రసంగవ్యాసం)



తొలితరం తెలంగాణా కథల పునర్నిర్మాణం

ముదిగంటి సుజాతారెడ్డి

తెలంగాణ కథల్లో జీవకళ ఉట్టిపడ్తుంది. తెలంగాణ తొలితరం కథలు రెండు భాగాల్లో ఉన్నాయి. తెలుగు కథా సాహిత్యంలో కొత్త అధ్యాయాన్ని సృష్టించి తెలుగుకథ గరిమను నిలిపే కథలుగా కథా సాహిత్య చరిత్రకారులు గుర్తిస్తారు.



ఇది తెలంగాణాకు పునర్వికాస యుగం. 1990 దశకం నుంచి యువత ఉద్రేకం, ఆవేశాలతో పనిచేయటం లేదు. ఆలోచించి సాహిత్యం, సంస్కృతి, చరిత్రల పునర్నిర్మాణం జరుగాలను కుంటున్నారు. దానికోసం కృషి చేస్తున్నారు. ఆ దిశలోనే కె. శ్రీనివాస్, సంగిశెట్టి శ్రీనివాస్‌లు కవిలె అనే పేరుతో తెలంగాణ సాహిత్యం చరిత్రల పరిశోధనా కేంద్రాన్ని నడుపుతున్నారు. తెలంగాణ ప్రాంతంలో సాహిత్య పురస్కారాలు తక్కువ, అసలు శూన్యమనే చెప్పాలో యేమో. అటువంటప్పుడు విశాల సాహితీ పురస్కారాల పేరుతో బి.ఎస్. రాములు పురస్కారాల ప్రదానాన్ని నడుపుతున్నాడు. కరీంనగర్ జిల్లాలో జగిత్యాల ప్రాంతంలో చాలామంది యువకులను కథలు వ్రాయమని ప్రోత్సహించటమే కాక కరీంనగర్ జిల్లా కథలు పేరుతో ఆ జిల్లా ఆధునిక కథకుల కథలను సంకలనాలుగా తెచ్చాడు. ఇంకా పరిశోధనలు పునర్నిర్మాణం జరుగవలసింది ఎంతో ఉంది. ఆ మార్గంలో నడుస్తూ తెలంగాణ సాహిత్యానికి గుర్తింపును తేవలసిన అవసరం చాలా ఉంది. ఈ సందర్భంలోనే నేను 1956కి పూర్వం తెలంగాణలో ఉన్న కథా సాహిత్యం ఏమిటి? కథకులు ఎవరు? అని కొంత పరిశోధన, సేకరణలు చేశాను. దాని ఫలితంగానే తెలంగాణ తొలితరం కథలు పేరుతో 2002లో 35 కథలను వెలికితీసి ప్రచురించాను. 2004లో సంగిశెట్టి శ్రీనివాస్ 1912-56 మధ్యకాలంలో వచ్చిన తెలంగాణ కథల పట్టికను తాను పాత పత్రికల నుంచి సేకరించిన వాటిని *దస్త్రమ్* పేరుతో ప్రచురించాడు. తెలంగాణ తొలితరం కథలు సంకలనంలో చేరని ఉత్తమ కథకులు ఇంకా ఉన్నారని నాకు ఆ పుస్తకం ప్రచురణకాలంలో చేసిన పరిశోధనను బట్టి తెలిసింది. ఆ ఉత్తమ కథకుల కథలను సంపాదించి మరో పుస్తకంగా వేయాలనే ప్రయత్నంలో ఉన్నాను. సంగిశెట్టి శ్రీనివాస్ కొన్ని కథలను, సమాచారాన్ని సేకరించాడని నాకు తెలిసింది. దాంతో ఇద్దరం కలిసి ఇంకా కొన్ని కథలను సేకరించి ఎంచుకొని తొలినాటి కతలు పేరుతో తెలంగాణ తొలితరం కతలు రెండో భాగాన్ని అచ్చువేశాం. దీనిలో 46 కథలున్నాయి. దాంతో ఎనభై ఒక్క కథకుల కథలు, వాళ్ళను గురించి సమాచారాలను పాఠకులకు, పరిశోధకులకు, కథా జిజ్ఞాసువులకు అందించాం.

ఈ ఎనభైమంది కథకుల్లో మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, వట్టికోట ఆళ్వారుస్వామి, పొట్లపల్లి రామారావు, మంద రామారెడ్డి, కాళోజి, నందగిరి వెంకట్రావు, నందగిరి ఇందిరాదేవి, బూర్గుల రంగనాథరావు, నెల్లూరి కేశవస్వామి, అయోధ్యా రామకవి, పర్చా దుర్గాప్రసాదరావు, వెంకటేశ్వరరావు, ఆవుల పిచ్చయ్య, పి.వి. నరసింహారావు, కాంచనపల్లి చిన వెంకటరామారావు, చెరుకుపల్లి రఘోత్తమరావు, చెరుకుపల్లి హరికిషన్‌రావు, ఒద్దిరాజు సోదరులు, ఊటుకూరు రంగారావు, హీరాలాల్ వంటి ఉత్తమ కథకులెందరో ఉన్నారు. కాల్పనికవాదం చేత ప్రభావితం అయిన కొందరు రచయితలను తప్పిస్తే మిగతా రచయితలందరూ ఉద్యమాలతో ఎదిగినవాళ్ళే! ఉద్యమాల ప్రభావం గల రచయితలు తమ కథలకు ఆధారంగా సత్యసంఘటనలను తీసుకున్నారు. ప్రజల నోళ్ళల్లో ఆడే భాషను, నుడికారాలను తీసుకున్నారు. దానిచేత వాళ్ళ కథల్లో మౌలికత కన్పిస్తుంది! కొత్తదనం గుబాళిస్తుంది! శిల్పంలో, కథనంలో వైవిధ్యం అగుపడుతుంది! వీటన్నిటితో తెలంగాణ కథ ప్రధాన రహదారి నుంచి వైదొలగిన ఏవాన్ గార్డ్ (Avant Garde) లక్షణంతో, అపురూపంగా అద్వితీయంగా ఉంటున్నది. తెలంగాణ కథలు వాస్తవికత పేరుతో చేంతాడంత కథనంతో కథలు నడపటం ఉండదు. సుదీర్ఘమైన అనవసరమైన వర్ణనలుండవు. పాఠకుల మెదడుకు పనిపెడ్తూ ధ్వన్యాత్మకంగా ఉంటాయి. వస్తుధ్వనిని పాటించారు. కథ అంటే కవిత్వంలో లాగా పాఠకుల ఊహకు పనేదీ ఉండదనే శిల్పానికి అలవాటుపడే వాళ్ళకు వస్తుధ్వనితో కూడిన తెలంగాణ కథలు అసంపూర్ణంగా శిల్పం లోపించినట్లుగా కనపడవచ్చును. కాని తెలంగాణ కథల్లో జీవకళ ఉట్టిపడ్తుంది. తెలంగాణ తొలితరం కథలు రెండు భాగాల్లో ఉన్నాయి. తెలుగు కథా సాహిత్యంలో కొత్త అధ్యాయాన్ని సృష్టించి తెలుగుకథ గరిమను నిలిపే కథలుగా కథా సాహిత్య చరిత్రకారులు గుర్తిస్తారు.

సంగిశెట్టి శ్రీనివాస్ సేకరించి కూర్చిన *దస్త్రమ్*ను బట్టి దాదాపు 40 ఏండ్ల కాలంలో తెలంగాణ నుంచి సుమారుగా 200 మంది కథకులున్నట్లు తెలుస్తున్నది. ఈ 200 మందిలో

కొందరు కేవలం విద్యార్థి దశలో స్కూలు, కాలేజీల నుంచి వెలువడిన పత్రికల్లో వ్రాసినవాళ్ళు. కొందరు ఏదో సందర్భాన్ని పురస్కరించుకొని ఒక్క కథ మాత్రం వ్రాసి కనుమరుగైన వాళ్ళు. వాళ్ళల్లో ప్రసిద్ధ కవులు దాశరథి, సి. నారాయణరెడ్డి వంటివాళ్ళు, బిరుదురాజు రామరాజు వంటి ఆచార్యులు, పరిశోధకులు ఉన్నారు. ఆ విధంగా కొంతమందిని ఏరివేస్తే నిజంగా కథా రచనను ప్రయోగాలను, ప్రయోజనాలను తెలిసి కథా రచనకు కట్టుబడిన వాళ్ళు వందకు లోపుగానే ఉంటారు. రెండు భాగాల్లో ఉన్న తెలంగాణ తొలితరం కథలు పుస్తకాల్లో ఎనభై ఒక్కమంది కథకుల కథలు ఉన్నాయి. ప్రసిద్ధమైన కథారచన కోసం తాపత్రయపడి కథారచన ప్రక్రియను తెలిసిన కథకుల కథలు ఈ సంపుటాల్లో దాదాపు పూర్తిగా వచ్చాయనే అనుకుంటున్నాను. అయినా నా అంచనా పూర్తిగా నిజమే అని కూడా నేను అనుకోవటం లేదు! కాని తెలంగాణాలోని గ్రంథాల యోద్యమం, ఆంధ్రోద్యమం, విమోచనోద్యమం, భూమి పోరాటం, పత్రికల ప్రచురణలు మొదలైన సామాజిక రాజకీయ సాహిత్యోద్యమాల్లో పనిచేసిన వాళ్ళు ఆరోజుల్లో తెలంగాణా నుంచి కథలు రాసారు. వాళ్ళల్లో జె. వనాంబ, నందగిరి ఇందిరాదేవి, ఇల్లిందల సరస్వతి దేవి, ఎల్లాప్రెగడ సీతాకుమారి, యశోదారెడ్డి వంటి స్త్రీలు కూడా ఉన్నారు. నిజాం రాజ్యంలోని తెలుగు మాట్లాడే తెలంగాణా ప్రాంతంలో తెలుగు తెలిసిన అక్షరాస్యులు ఒక శాతం మాత్రమే ఉంటారు. అంత తక్కువ అక్షరాస్యత కలిగిన ప్రాంతంలో రెండువందల దాకా కథకులున్నారంటే ఆరోజుల్లో రచయితలు గాని, పాఠకులుగా గాని కథా ప్రక్రియ మీద ఎంత అభిమానం చూపారో తెలుస్తున్నది. ఆరోజుల్లో కథలు వ్రాసిన తెలంగాణ కథకుల కథలు - *ఆంధ్రభారతి, హితబోధిని, నీలగిరి, మీజాన్, సుజాత, ఆంధ్రాభ్యుదయం, దక్కన్ కేసరి, గోలకొండ, భారతి, గృహలక్ష్మి*, తెలుగు స్వతంత్ర మొదలైన పత్రికల్లో అచ్చయ్యాయి, పాఠకుల ఆదరణను పొందాయి. అట్లా ఉద్యమాల నుంచి అభ్యుదయ భావాలతో పుట్టిన తెలంగాణ కథలు 1956 తర్వాత మరుగున పడిపోయాయి. తెలంగాణా కథకులు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయారు. మళ్ళా విప్లవోద్యమం ప్రభావంతోనే తెలంగాణలో కథ పుంజుకొని విజృంభించింది. ఎంతగా విజృంభించిందంటే అంతకు ముందు తెలంగాణలో కథలే లేవన్నంత భ్రమను కలిగించాయి ఈ కథలు. 1956 తర్వాత తెలంగాణ కథకులు అజ్ఞాతంలోకి వెళ్ళిపోయి మౌనధారణ చేయటం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది.

ప్రామాణిక భాష పేరుతో ప్రాంతీయభాషల నుడికారాన్ని ఆదరించక పోవటం చేతనే జీవద్భాష ప్రజలభాషలో వ్రాసే తెలంగాణ కథకులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది. ఉర్దూ, మరాఠీ భాషల నుడికార ప్రభావం తోనేగాక, ప్రాచీన తెలుగు భాషా ఛాయలతో పదాల నుడికారాలను భద్రపరచుకొని పారుగు తెలుగు ప్రజలతో ఆదానప్రదానం కోల్పోయి తనకు తానే ద్వీపంగా మిగిలిపోయిన తెలంగాణ ప్రజల రచయితల భాష ఇతర ప్రాంతాలవారికి వింతగా కన్పించింది. అన్నిరోజులు తమిళ, ఇంగ్లీషు ప్రభావంతో కొత్త పోకడలను సంతరించుకొన్నవారి పరాయికరణానికి తెలంగాణ నుడికారం గురి అయింది. దాంతో తెలంగాణ రచయితలు తమ సృజనాత్మకతను కోల్పోయి మౌనంగా ఉండే పరిస్థితులేర్పడినాయి. తిరిగి మాండలిక భాషలకు ఆదరణ లభించిన కాలంలో 1970ల నాటి నక్సలైట్ విప్లవోద్యమ కాలంలోనే తెలంగాణ కథ పునర్ ప్రారంభమైంది. 1970 నాటి కథకుల తెలంగాణ తొలితరం కథకుల కథల వారసత్వాన్ని తెలుసుకోలేకపోయారు. కాని 1970ల నాటి రచయితల్లోనూ తెలంగాణ భాష నుడికారాల మీద మమకారం, ఉద్యమస్ఫూర్తి తొలితరం కథకుల్లో వలెనే వీళ్ళలోనూ కన్పిస్తున్నది. తొలితరం కథకుల్లో వలెనే ఇతివృత్తం, కథనం, శిల్పంలో 1970ల్లోనూ తెలంగాణ కథ విలక్షణంగానే ఉంది. నేనింతకు ముందు చెప్పినట్లుగానే ప్రాంతేతరులను 1970ల నాటి తెలంగాణ కథ కూడా కొంత పరాయీకరణకు గురి చేసింది. ఇప్పటికీ చేస్తూనే ఉంది. దానికి ప్రాంతీయేతరులు ఇక్కడి జీవితాన్ని, చరిత్ర నేపథ్యాన్ని, సంస్కృతిని, సాహిత్య సామాజిక స్వరూపాలను అర్థం చేసుకోవటానికి ప్రయత్నించకపోవటమే కారణం. కొందరు సానుభూతిపరులే ఈ పరాయీకరణం నుంచి బయటపడి తెలంగాణ కథలను చదువుతున్నారు. దానిలోని గరిమను తెలుసుకోగల్గుతున్నారు. ఇప్పుడిప్పుడు ఈ సానుభూతిపరుల సంఖ్య పెరుగుతూ ఉన్నది. ఇంకా తెలంగాణ పునర్వికాసం యుగంలో పునర్నిర్మాణ ప్రయత్నంతో ఈ సానుభూతిపరులు విస్తరిస్తారు. తెలంగాణ కథలను చదివి సాధారణీకరణం (మమేకం కావటం) చెందే పాఠకులు బాగా విస్తరిస్తారు. అందులో ఏ సందేహం లేదు!

*



జ్యోతిషం శాస్త్రమా? సైన్సా?

బచ్చోటి శ్రీధరరావు

సైన్సు నిరూపించలేనివీ,
లేదా యింత వరకూ
నిరూపించనివీ అసత్యాలూ
అసంభవాలూ కాదు.
సైన్సుకి ఉన్న హద్దులు
సైన్సు అభ్యసించిన
వారందరికీ తెలుసు.



ఈ రోజుల్లో జ్యోతిషమంటే నమ్మకమున్నవారు చాలా తక్కువ అని చెప్పుకోవాలి. కానీ, జ్యోతిషమంటే ఏమిటో అసలు తెలియని వారు ఇంచుమించు ఎవరూ లేరని చెప్పవచ్చు. మత సంబంధమైన విషయాలు కానీ, దైవసంబంధమైన విషయాలు కానీ వాటికి సంబంధించిన కార్యాచరణ విధానాలు కానీ మన జీవితంతో ఏవిధంగా ముడిపడి ఉన్నాయో అదేవిధంగా జ్యోతిష సంబంధమైన ఆచారాలు కూడా మన జీవితంతో అంతోఇంతో ముడిపడి ఉన్నాయి. మంచి రోజు చూసుకుని పనులు ప్రారంభించడం, శుభకార్యాలకి ముహూర్తాలు చూసుకోవడం, చాలా సందర్భాలలో తిథివార నక్షత్రాలు పాటించడం మనకి అలవాటే. పాటించే ప్రతి ఆచారంలోనూ ఏ శాస్త్రనిబద్ధమైన గూడార్థాలు దాగి ఉన్నాయో వెతికి బయటకు తీసి చూపించడానికి కూడా మనం ప్రయత్నిస్తూ ఉంటాం. ఇలా మన ఆచారాలని సైన్సు ద్వారా నిరూపించడానికి, సమర్థించడానికి చేసే ప్రయత్నం జ్యోతిషం విషయంలో పరాకాష్టతకి చేరింది.

జ్యోతిషం సైన్సు అని నిరూపించడానికి ఎప్పుడూ ఎవరో ఒకరు విశ్వప్రయత్నం చేస్తూనే ఉంటారు. జ్యోతిషం ఒక శాస్త్రం అన్న మాటకి సైన్సు (ప్రయోగపరమైన శాస్త్రం) అని ఒక అర్థమూ విద్యావిషయమని ఒక అర్థమూ ఉన్నాయి. మనుధర్మ శాస్త్రమూ, అర్థశాస్త్రమూ మొదలైనవి విద్యావిషయికమైన శాస్త్రాలు. అంతేకాక మతసంబంధమైన వేదోపనిషత్తులు, న్యాయ, వైశేషిక, సాంఖ్య, వేదాంతాదులని కూడా శాస్త్రాలని వ్యవహరించడం ఉంది. శాస్త్రం అన్న మాటకి యిన్ని అర్థాలు ఉండడం కొంచెం కష్టకారణమే కాబట్టి ప్రయోగపరమైన శాస్త్రానికి సైన్సు అన్న మాటే సౌకర్యంగా ఉంటుంది.

జ్యోతిషం సైన్సేనని సమర్థించబూనడానికి ముఖ్యమైన కారణాలు రెండు. మొదటిది జ్యోతిషంలో చెప్పే గ్రహస్థితులు సైన్సు ద్వారా నిరూపణకు అందేవి కాబట్టి జ్యోతిషానికి సంబంధించిన సమస్త విషయాలూ సైన్సు అనుకోవడం. రెండవది సైన్సు అన్న ఆమోదముద్ర పడితే జ్యోతిషానికి గౌరవం వస్తుందన్న అభిప్రాయం.

జ్యోతిషానికీ ఖగోళ శాస్త్రానికీ చాలా దగ్గర సంబంధం ఉంది. రెండూ కూడా గ్రహస్థితులకు సంబంధించినవే. కానీ ఆ గ్రహస్థితుల వల్ల మన మనుగడలలో కలిగే ఫలితాలని గూర్చి చెప్పేది జ్యోతిషం. ఖగోళశాస్త్రం ఆ పని చెయ్యదు. ఖగోళ శాస్త్రంలో జరిగే పరిశోధన అంతా మనం నేర్చుకున్న సైన్సు సూత్రాలకు కట్టుబడి ఉంటుంది. ప్రతిపాదించిన సిద్ధాంతాలు కూడా సైన్సు ద్వారా నిరూపణ అయ్యే వరకు సిద్ధాంతాలుగానే ఉంటాయి. ఖగోళ శాస్త్రంతో ముడిపడి ఉన్నది కాబట్టీ, ఖగోళంలోని గ్రహస్థితులన్నీ సైన్సు ద్వారా నిర్ధారించగలిగినవే కాబట్టి, జ్యోతిషం శాస్త్ర సమ్మతమని, అంటే సైన్సు ద్వారా నిరూపించగలిగినదని జ్యోతిషం నేర్చుకున్నవారు తమ విద్యావిషయాన్ని (సబ్జక్టుని) సైన్సుగా సమర్థిస్తారు. గ్రహాలు నిజం. గ్రహాల స్థితులు, గతులు నిజం. రెండూ సైన్సు సమ్మతాలే. మరి వాటి ఫలితాలు సైన్సు కాదా అంటే కాదు. మొదటి భాగం సైన్సు. రెండవ భాగం సైన్సు కాదు. ఖగోళంలోని గ్రహస్థితులు మన దైనందిన జీవితం మీద ప్రభావం చూపించడం సైన్సు ద్వారా నిరూపించగలిగినది కాదు. కాబట్టి సైన్సు పద్ధతులకు సంబంధించినంత వరకూ జ్యోతిషం 'నిరూపించబడిన సత్యం' కాదు. అంటే సైన్సు కాదు.

జ్యోతిషంలో ఎంతో పాండిత్యం సంపాదించిన వారు జ్యోతిషం ఎందువల్ల సైన్సు అవుతుందో చాలా కష్టపడి విశదీకరిస్తూ ఉంటారు. గ్రహాల నుంచి ప్రసరించే భౌతిక కిరణాలు మనపై ఏ విధంగా ప్రసరించి మనల్ని ప్రభావితం చేస్తాయో చెపుతూ ఉంటారు. కొంతమంది ఇంకొంత దూరం వెళ్ళి మన శాస్త్రజ్ఞులు ప్రయోగించే ఉపగ్రహాలు ఈ ప్రభావాలని యెలా మారుస్తాయో కూడా చెప్పడానికి ప్రయత్నిస్తారు. అందరికీ ఆమోదయోగ్యమైన సైన్సు పేరుతో జ్యోతిషానికి ఒక గౌరవం తెచ్చిపెడదా మన్న తపనే వారిని అంత దూరం తీసుకువెడుతుంది. నిజానికి ఈ ప్రయత్నంవల్ల వృథా ప్రయాస, అపహాస్యంపాలు కావడం తప్ప జ్యోతిషానికి కలిగే ప్రయోజనమూ లేదు, వచ్చే గౌరవమూ లేదు.

జ్యోతిషంలో గ్రహాల స్థితులు మనపై చూపించే ప్రభావం ఒకటే కాక సైన్సుతో సంబంధంలేని విషయాలు ఇంకా చాలా ఉన్నాయి. గ్రహాల సమ, మిత్ర, శత్రుత్వాలూ, గ్రహాల స్వభావాలు, రాశుల స్వభావాలు, గ్రహాల స్వస్థానాలు, బలాబలాలు మొదలైనవి అనేకం ఉన్నాయి. ఇవి యేవీ కూడా సైన్సు ద్వారా వివరించగలిగినవి కావు. మరి వీటన్నిటినీ కూడా సైన్సు ద్వారా నిరూపించడానికి

బయలుదేరితే ఇటు జ్యోతిషం, అటు సైన్సూ కూడా సమగ్రంగా అవగాహన కాలేదని అర్థం.

ఈ సైన్సు అనే పదంలో నిబిడీకృతమై ఉన్న ప్రయోగపరమైన సత్యాన్వేషణ, కనిపెట్టబడిన సత్యానికి స్థిరత్వం, వ్యక్తిగతమైన అభిప్రాయాలకి అతీతమైన విశ్లేషణ పద్ధతి, నిరూపణ మొదలైన లక్షణాలన్నీ ఎంతో కొంత సైన్సు అభ్యసించిన వారందరికీ తెలుసు. శాస్త్రమంటే యీ సైన్సు గురించే మాట్లాడుతున్నాము అనుకున్నప్పుడు, శకున శాస్త్రం శాస్త్రమా అంటే కాదు అని నిస్సంశయంగా చెప్పగలరు చాలామంది. కానీ అలా చెప్పగలిగినవారే జ్యోతిషం సైన్సేనా అని అడిగితే కాదు అని చెప్పడానికి తటపటాయిస్తారు. సైన్సు కాకపోతే జ్యోతిషాన్ని విస్మరించాలి కదా అన్న సందేహం దీనికి కారణం కావచ్చు.

సైన్సు నిరూపించలేనివీ, లేదా యింత వరకూ నిరూపించనివీ అసత్యాలూ అసంభవాలూ కాదు. సైన్సుకి ఉన్న హద్దులు సైన్సు అభ్యసించిన వారందరికీ తెలుసు. సైన్సు నిరూపంచలేనివి లేనట్టే అంటే సైన్సు ఈపాటికే పరిపూర్ణత చెందినదని అర్థం. కానీ అభివృద్ధి చెంద వలసిన సైన్సు ఇంకా చాలా ఉంది. సైన్సు నిరూపించని విషయాలు ఇంకా అనేకం ఉన్నాయి. భౌతిక ప్రపంచంలోనే.

శాస్త్రజ్ఞులు (సైంటిస్టులు) జ్యోతిషంలో సైన్సులేదని చెప్పడంలో అర్థం ఉంది. కాని ఆ కారణంగా జ్యోతిషాన్ని అర్థంపర్థంలేదని కొట్టిపారేసే ప్రయత్నంలో అనుకోకుండా జరిగేదేమిటంటే "సైన్సు కాకపోతే జ్యోతిషం లేదు"అని ప్రతిపాదించడం. ఈ భావనలోనే సైన్సు కూడా ఒప్పుకోని ఒక అంతర్వైరుధ్యం ఉంది. అదేమిటంటే, తెలియని విషయాల గురించి పరిశోధన చేసి ఆ పరిశోధనాఫలితాల ద్వారా మాత్రమే ఆ తెలియని విషయాల గురించిగానీ వాటి ఉనికిని గురించిగానీ నిశ్చితమైన అభిప్రాయానికి వచ్చేది సైన్సు. కేవలం విశ్వాసం వల్ల కాదు. కాబట్టి జ్యోతిషం గురించి ఆలోచిచేటప్పుడు, కనీసం ఆ కాస్సేపయినా సైన్సు గురించి మరిచిపోవాలి.

సైన్సు ఒక్కొక్క విషయాన్నే కనిపెడుతూ పురోభివృద్ధి చెందుతుంది. ఒక విషయంలోని రహస్యాన్ని ఛేదించడానికి, ఒక సమస్యని పరిష్కరించడానికి సైన్సుకి సమయం, డబ్బూ, శ్రమా అన్నీ కావాలి. అంతేకానీ, అన్ని రహస్యాలూ క్షణాలలో ఛేదించగలిగే సర్వసామర్థ్యం సైన్సుకి లేదు. అలా అని అన్ని రహస్యాలూ ఇప్పటికే తెలుసుకుని సమాధానాలు సిద్ధంగా ఉంచుకున్న పరిపూర్ణతా సైన్సుకి లేదు. కానీ ఇక్కడ గుర్తుంచుకోవలసిన విషయం యేమిటంటే జ్యోతిషం సైన్సు అయినా కాకపోయినా సైన్సుకి వచ్చిన నష్టమేమీ లేదు. కాబట్టి జ్యోతిషం, ఆస్తికత వంటి విషయాలలో సైన్సు గురించి చర్చించడం సైంటిస్టులకి కూడా వృధాప్రయాసే.

సైన్సు ద్వారా వెంటనే తేల్చలేని కొన్ని సమస్యలని గణాంక శాస్త్రం ద్వారా పరిష్కరించవచ్చు. కాబట్టి జ్యోతిషాన్ని ఈ పద్ధతుల ద్వారా పరీక్షించాలని అనడం కూడా మనకి వినపడుతూ ఉంటుంది. కొన్ని గ్రహస్థితుల ఫలితాలను ఈ విధంగా పరిశీలించవచ్చు, గణనీయమైన సంఖ్యలో ఉదాహరణలు లభిస్తే. కానీ మొత్తం జ్యోతిశ్శాస్త్రాన్ని ఈవిధంగా పరిశీలించడం కష్టం. ఒక జ్యోతిష్కుని విజయాలని, లేదా విజయవంతంగా చెప్పగలిగిన జ్యోతిష్కుల శాతాన్ని నిర్ణయించడంతో ఇదమిద్ధమైన నిర్ణయానికి రాలేము. పైపై విమర్శలే కానీ జ్యోతిషాన్ని పరీక్షించడానికి విస్తృతమైన ప్రణాళిక సైన్సులో కానీ గణాంక శాస్త్రంలో కానీ ఎవరూ చేపట్టడం కూడా కనపడదు.

జ్యోతిషాన్ని సైన్సు ద్వారా నిరూపించదల్చుకున్నవారి కన్నా ఆస్తికత్వాన్ని సైన్సు ద్వారా నిరూపించదలిచేవారు చాలా తక్కువ. దైవాన్ని నమ్మేవారు తమ నమ్మకాన్ని ఏ మాత్రం సడలనివ్వకుండా స్థిరంగా అట్టేపెట్టుకుంటారు. కానీ దైవాన్ని సైన్సు ద్వారా నిరూపించవచ్చని ప్రతిరోజూ మన చెవిలో ఇల్లుకట్టుకుని పోరరు. పోనీ దైవాన్ని నమ్మేవారు సైన్సుని నమ్మరా అంటే అదేం లేదు. దేనిదారి దానిదే. ఆస్తికులు సైన్సుని గౌరవించినా దైవాన్ని తృణీకరించలేరు. సైన్సుని నమ్మే చాలామంది కూడా సైన్సు నిరూపించలేని దైవాన్ని తృణీకరించలేదు. జ్యోతిషానికీ ఖగోళ శాస్త్రానికీ దగ్గర సంబంధమున్నట్లుగానే, జ్యోతిషానికీ ఆస్తికత్వానికీ కూడా దగ్గర సంబంధం ఉంది. రెండూ కేవలం విశ్వాసం మీద ఆధారపడ్డ విషయాలు.

జ్యోతిషం అనాదిగా వస్తున్న ఒక విద్యావిషయం. ఇది చాలా క్లిష్టతరమైన విషయం కూడా. ప్రపంచంలో అందరినీ రాశుల ప్రకారం పన్నెండు విధాలుగా విభజించవచ్చనీ, వాళ్ళ భవిష్యత్తుని కూడా పన్నెండు విధాలుగా విభజించవచ్చనీ అనుకోవడం జ్యోతిషాన్ని గురించి సమగ్రంగా తెలియని వారు చేసేపని. పన్నెండు రాశులూ, ఇరవయ్యేడు నక్షత్రాలే కాక జ్యోతిషంలో అధ్యయనం చేయవలసిన విషయాలూ, విభిన్న దృక్పథాలూ, పరిశీలనా పద్ధతులూ ఎన్నో ఉన్నాయి. జ్యోతిషం వల్ల భవిష్యత్తుని ముందే తెలుసుకోవడం సాధ్యమని నిరూపించబూనడం ఈ వ్యాసం ఉద్దేశం కాదు. జ్యోతిషం బాగా నేర్చుకున్న వాళ్ళకి కూడా అది అంత తేలికైన విషయం కాదు. అన్ని విద్యావిషయాలలోలాగే జ్యోతిషంలో కూడా పరిష్కరించవలసిన సమస్యలూ చాలా ఉన్నాయి. అర్థంకాని అపరిపూర్ణతలూ ఉన్నాయి. సైన్సు ఏవిధంగా అయితే ఇంకా పరిపూర్ణత చెందలేదో, అదేవిధంగా జ్యోతిషం కూడా ఒక పరిపూర్ణత చెందని శాస్త్రం. జ్యోతిషానికి అందని విషయాలు కూడా అనేకం ఉన్నాయి.

సైన్సు ద్వారా జ్యోతిషాన్ని నిరూపించడం కానీ నిరాకరించడం కానీ ప్రస్తుత పరిస్థితులలో సాధ్యపడదు. కాబట్టి మనకి ఉన్న మార్గాలు రెండే. ఒకటి- సైన్సు యొక్క అపరిపూర్ణతని అర్థం చేసుకుని, సైన్సుకు అందని విషయాలని సైన్సుద్వారా నిరూపించడానికి ప్రయత్నించకపోవడం. రెండు - సైన్సు ఆధిక్యతని అంగీకరించి సైన్సు నిరూపించలేని ఏ విషయాన్నైనా సరే పూర్తిగా విస్మరించడం. అంతేకానీ సైన్సు ద్వారా మన విశ్వాసాలని నిరూపించడం అస్తమానం సాధ్యంకాదు. ఈ విషయాన్ని ముఖ్యంగా జ్యోతిషాన్ని అభ్యసించే వారు, నమ్మేవారు గుర్తుంచుకోవాలి.

మరి సైన్సు కానిదీ, సైన్సు నిరూపించలేనిదీ అయిన జ్యోతిషాన్ని మనం తిరస్కరించవద్దా? సైన్సుకాని ప్రతి విషయాన్నీ మనం తిరస్కరించాలి. జ్యోతిషంలో గ్రహాలకుండే దైవత్వాలనీ, ఆస్తికత్వాన్నీ కూడా తిరస్కరించాలి. జ్యోతిషమే కాక ఎన్నో మత సంబంధమైన విషయాలూ, కట్టుబాట్లూ, సంప్రదాయాలూ మన జీవితాలతో ముడిపడి ఉన్నాయి. వాటిని కూడా సైన్సు దృక్పథంతో అంచనా వేసి తిరస్కరించగలిగినవారు జ్యోతిషాన్ని కూడా తిరస్కరించవచ్చు. కానీ ఆ తిరస్కారం వారికి మాత్రమే పరిమితమౌతుంది. ఎందుకంటే ఇవన్నీ విశ్వాసంపై ఆధారపడ్డ విషయాలు కాబట్టి. మనకి నచ్చినా నచ్చకపోయినా కొన్నివేల సంవత్సరాలుగా మన జీవితాలతో ముడివేసుకుపోయిన ఈ జ్యోతిషం ఎక్కడికీ పోదు. తరతరాల వరకూ మనతోనే ఉంటుంది. *

తెలుగునాట చదివే అలవాటు పెంచిన గ్రంథాలయోద్యమం

డాక్టర్ తెలగా వెంకటప్పయ్య

ఒకనాడు తెలుగుజాతిని ప్రభావితం చేసిన గ్రంథాలయరంగం నేడు ప్రభుత్వ, విజ్ఞుల ఉపేక్షాభావం వలన పతనదిశలో పయనిస్తూ ఉంది.


GRANDHALAYA SARVASVAM

Published in four parts every year

ON BEHALF OF

The Andhra Desa Library Association,

BEZWADA.

గ్రంథాలయ సర్వస్వము.

కార్యస్థానము: బెజవాడ.

1915—1316

PRINTED AT THE VANI PRESS, BEZVADA.

యూరపులో వికసించిన పునరుజ్జీవన వికాస యుగం ఒక మహోజ్వల అధ్యాయమైనట్లుగానే, భారతదేశ చరిత్రలో గత శతాబ్దిలో వెలసిన ఉద్యమాలు నవజీవనానికి నాంది పలికాయి. అభివృద్ధి చెందిన దేశాల నుంచి నేర్చుకొన్న విజ్ఞానంతో, కొత్త ఆలోచనలతో భారతీయ యువత దాస్యం తమస్సు నుంచి అనేక ఉద్యమాలపరంగా భారతీయ ప్రతిభాలతకు మారాకు హత్తింది. నిరక్షరాస్యతా ఫలితంగా జాతి జీవన స్రవంతిని ఇంకిపోయేట్లు చేసి, కరుడు గట్టిన సంప్రదాయాలకు, ప్రజోపయోగం లేని పరిపాలనకు నాడు వెలసిన కొన్ని ఉద్యమాలు అడ్డుకట్టవేసి జాతి ప్రభావితం కావడానికి తోడ్పడ్డాయి. గ్రంథాలయోద్యమ విషయానికి వస్తే- తెలుగువారు ఆవేశపరులు, ఆరంభశూరులు-మాత్రమే కాదు. కార్యదక్షులు, కార్యశూరులు అనే విషయం గ్రంథాలయోద్యమం ద్వారా రుజువు చేసుకున్నారు. గత శతాబ్ది కాలంలో తెలుగుదేశంలో వెలసిన అనేక ఉద్యమాలు మొలకప్రాయంలోనే కాలగర్భంలో కలసిపోగా, అనేక ఆటుపోటులకు తట్టుకొని నేటికీ నిలబడిన ఉద్యమాలలో గ్రంథాలయోద్యమం ప్రముఖమైనది, ప్రబలమైనదీనూ. ఈ ఉద్యమం యీ గడ్డ మీద జయప్రదం కావడానికి కారణం తెలుగువారి మనస్తత్వానికి గ్రంథాలయోద్యమానికీ అవినాభావ సంబంధం ఉండడమే.

ఆంగ్లేయ భాషా సంస్కారం, ఆంగ్లేయ సంప్రదాయ సంపర్కం ఏమాత్రం లేని వ్యగ్రోత్సాహులైన కొందరు యువకుల వలెనే యీ ఉద్యమం ఆంధ్రదేశంలో వ్యాపించింది. అందుకే దీన్ని స్వయంభువు అన్నారు. తనకుతానే ఆవిర్భవించింది అని భావం. ఇతర దేశాలలో వెలసిన గ్రంథాలయోద్యమం వ్యక్తిలో సంపూర్ణ మానవత్వం వ్యక్తీకరించడానికి తగిన సాధన సామగ్రినంతనూ సమకూర్చుకొనియున్నది. అందుచేతే యీ ఉద్యమం తెలుగుజాతి జీవనసరళికి సరిపడి, నిలబడగలిగింది. దేశాభ్యుదయానికి దోహదం చేసింది. గ్రామీణ వ్యవస్థకు మూలకేంద్రంగా నిలబడింది.

వాస్తవానికి ఈ ఉద్యమానికి బరోడాలో వలె గయక్వార్ వంటి రాజాదరణ లేదు. అయినా గ్రామ ప్రజల ఆదరాభిమానాలే కొండంత అండగా ఈ ఉద్యమం వెలసిల్లింది. తాను బాగుపడి ఇతరులను బాగుపరచాలనే పవిత్ర సంకల్పంతో యీ ఉద్యమం నడచింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమంగా వ్యాపించింది. అనేక సదుద్యమాలకు బాసటగా నిలిచింది.

ఉద్యమ ప్రగతికి దోహదాలు

తెలుగుదేశంలో గ్రంథాలయోద్యమం వ్యాపించినంత బాగా వాడవాడలకు మరే ఉద్యమం విస్తరించలేదని చెప్పాలి. తెలుగులో పుస్తకాల ముద్రణ, ఇంగ్లీషు చదువులు, ప్రాథమిక విద్యా వ్యాప్తికి ప్రభుత్వం చేసిన కృషికి తోడుగా, 1905లో జరిగిన బెంగాల్ విభజన దేశంలో రాజకీయ చైతన్యాన్ని కలిగించింది. యువకులలో కొత్త ఆలోచనలు రేకెత్తించింది. విద్యా బుద్ధులు పెంపొందించుకుని విదేశీపాలనను విరగడ చేసుకోవాలనే కంకణం కట్టుకునేట్లుచేసింది. దీనికి ఊతగా బరోడాలో ప్రారంభమైన గ్రంథాలయ విధానం-వీరేశలింగం సంఘసంస్కరణ ఉద్యమం, గిడుగువారి వ్యావహారిక భాషావాదం, నాగరిక ప్రభావంలో పెరిగిన రవాణా, తంతి తపాలా సౌకర్యాలు, ఉత్పత్తులలో వచ్చిన మార్పులు-కొత్త ఉద్యమాలకు కొత్త ఆలోచనా విధానానికి, జీవన విధానానికీ బాటలు వేశాయి. ఈ అనుకూల వాతావరణంలో అయ్యంకి వెంకటరమణయ్య ప్రభృతులు 1914లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘాన్ని స్థాపించి-గాలి, నీరు, వెలుతురూ ఎంత ఉచితంగా ప్రకృతి ప్రసాదిస్తున్నదో అంత ఉచితంగా గ్రంథాలయ సేవను అందించాలనే 'కళాప్రపూర్ణ' చిలకమర్తివారి గ్రంథాలయ వేద ప్రవచనాన్ని వాడవాడలా ప్రచారం చేశారు. తత్ఫలితంగా 1920 నాటికే వందల సంఖ్యలో ఆంధ్రప్రాంతంలో గ్రంథాలయాలు వెలిశాయి. ఆ తర్వాత జరిగిన ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ మహాసభలు, జిల్లా, తాలూకా స్థాయి సభలు, గ్రంథాలయ వార్షికోత్సవాలు, గ్రంథాలయ కార్యకర్తల శిక్షణ తరగతులు, గ్రంథాలయ సర్వస్వము పత్రిక వందలాది కార్యకర్తలు ఉద్యమంలోకి ఉరికేట్లు చేశాయి. గ్రంథాలయాల స్థాపన, నిర్వహణ

పటిష్టం చేశాయి. ప్రభుత్వ గుర్తింపు, విరాళం సాధించాయి. ఉన్నవ లక్ష్మీనారాయణగారి మాలపల్లి నవల, దామరాజువారి నాటకాలను ప్రభుత్వం నిషేధించినపుడు యీ ఉద్యమం తీవ్రంగా ప్రతిఘటించింది. నాటి గ్రామీణ గ్రంథాలయాలు నాటకాలను, కళలను ప్రోత్సహించాయి. స్త్రీ విద్యకు నిర్విరామంగా కృషి చేసి ప్రజలను ఆదుకున్నాయి. గ్రంథాలయోద్యమం తనంత తాను పెరుగుతూ స్వాతంత్రోద్యమం, ఆంధ్రోద్యమం, సహకారోద్యమం, స్వదేశీ ఉద్యమం, వయోజన విద్యా ప్రచారోద్యమం మొదలైన అనేక ఉద్యమాల మనుగడకు ఇతోధికంగా దోహదం చేసింది. ఈ ఉద్యమం బాగా సాగుతున్న దినాలలో పాతూరి నాగభూషణం, వావిలాల గోపాలకృష్ణయ్య, అడుసుమిల్లి శ్రీనివాసరావు ప్రభృతులు గణనీయమైన కృషి చేశారు.



అడుసుమిల్లి శ్రీనివాసరావు

తెలుగుభాషను నిలిపిన తెలంగాణ గ్రంథాలయాలు

మహాకవి దాశరధిగారిచే కోటి రత్నాల వీణగా చిత్రించిన తెలంగాణా ప్రాంతంలో గ్రంథాలయోద్యమం తెలుగు భాష, ఉనికిని, తెలుగువారి గౌరవాన్ని నిలబెట్టడానికి తోడ్పడింది. తెలుగు సంస్కృతిని పరిరక్షించుకోడానికి కృషి చేసింది. కొమర్రాజు లక్ష్మణరావుగారి ప్రోత్సాహంతో రావిచెట్టు రంగారావుగారి ఆదరణ ఫలితంగా 1901లో హైదరాబాదులో శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషానిలయం స్థాపనతో తెలంగాణాలో గ్రంథాలయోద్యమానికి అంకురార్పణ జరిగిందని చెప్పవచ్చు. ఈ గ్రంథాలయ ప్రారంభం, విజ్ఞానచంద్రికాగ్రంథమండలి స్థాపన తెలంగాణ యువజనులలో నవ చైతన్యం మోసులెత్తడానికి, అనేక గ్రామాలలో గ్రంథాలయాలు స్థాపించడానికి తోడ్పడింది. అయితే యీ ఉద్యమానికి ప్రభుత్వం ఆదరణ బొత్తిగా లేదు. పైపెచ్చు తీవ్రమైన వ్యతిరేక భావన ఉంది. గ్రంథాలయాలు యువ శక్తిని కూడగడుతున్నాయనే అనుమానంతో నిజాం ప్రభుత్వం గ్రంథాలయ స్థాపనను నిరోధిస్తూ వచ్చింది. ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావుగారి నాయకత్వంలో 1921లో ఏర్పడిన ఆంధ్ర జన కేంద్ర సంఘం గ్రంథాలయాలను స్థాపించడం, పఠన మందిరాలను, పాఠశాలలను స్థాపించడం ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని ప్రభుత్వపు ప్రజా వ్యతిరేక ధోరణులను తీవ్రంగా నిరసిస్తూ వచ్చింది. అయినప్పటికీ అనేక ప్రతిబంధకాలను అధిగమించి గ్రంథాలయాల స్థాపన జరుపుతూనే వచ్చింది.



అయ్యంకి వెంకటరమణయ్య

గస్తీ నిషాన్ 53

ఈ ఆందోళనకర దినాలలో నిజాం ప్రభుత్వం-తన అనుమతి లేనిదే గ్రంథాలయ వార్షికోత్సవాలు, సభలు, సమావేశాలు గ్రంథాలయాలలో జరుపరాదని గస్తీ నిషాన్-53 అనే కొత్త ఉత్తర్వును అమలులో ఉంచింది. ఈ ఉత్తర్వు నిజాం రాష్ట్రంలోని తెలుగు ప్రజల జన్మ సిద్ధమగు స్వాతంత్ర్యాన్ని హరించివేసింది. ఈ ఉత్తర్వులపై గోలకొండ పత్రిక సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డిగారు 'మన రాష్ట్రంలోని అధికారులకు గ్రంథాయలముల పైన అభిమానము బొత్తిగా లేదు. లేకున్న నేమాయె వారు గ్రంథాలయముల విషయమై కష్టించు ప్రజలను ప్రోత్సహింపనైన బ్రోత్సహింపరు. గ్రంథాలయముల వార్షికోత్సవములను గూడ జేసికొనుటకై భగీరధ ప్రయత్నములో చేయవలసి వచ్చును. పోలీసు అమీను నుంచి మొదలుకొని ఒక్కొక్కమారు బాబెహుకుమతు వరకు వ్యవహారం జరుపవలసి వచ్చును. గస్తీ నిషాన్-53 అవతరించిన నాటి నుంచి యిబ్బందులింకను హెచ్చయినవి''అని ఎంతగానో బాధపడ్డారు.

గ్రంథాలయాలు విప్లవ కేంద్రాలుగా వర్ధిల్లుతున్నాయని భావించిన నిజాం ప్రభుత్వం గ్రంథాలయ సభలను సమావేశాలను నిషేధించింది. 1935 ఫసలీలో సూర్యాపేటలో జరగవలసిన ఆంధ్ర జన కేంద్ర సంఘ సమావేశం ద్వితీయ గ్రంథాలయ మహాసభ నల్గొండలో జరుగవలసిన మరికొన్ని సభలు జరుగకుండా ప్రభుత్వం నిషేధించింది. అందుకు కారణం రాజకీయంగా అవాంఛనీయ పరిస్థితులు ఏర్పడగలవనే అనుమానం ప్రభుత్వానికి కలగటమే. అందుపై సభా నిర్వాహకులు ఫర్మాను ప్రకారం రాజకీయ ఫలితాలు కలుగగలవనే ఊహించి సభలను ఆపగల అధికారం ప్రభుత్వానికి లేదని హైోర్టులో వ్యాజ్యం వేసి గెలిచారు. 1937వ ఫసలీలో తీవ్ర ప్రయత్నంతో సూర్యాపేటలో తిరిగి సభలు జరిగినవి. అదే సందర్భంలో దేశభక్త వామన నాయక్ అధ్యక్షతన రెండవ గ్రంథాలయ మహాసభ జరిగింది. ఈ మహాసభలో నిజాం ప్రభుత్వ ఉత్తర్వు 'గస్తీ నిషాన్' 53 రద్దు కావాలని, లోకల్ ఫండు నిధి నుంచి గ్రంథాలయాలకు విరాళాలివ్వాలని, స్టేట్ లైబ్రరీలో దేశ భాషా గ్రంథాలుంచాలనే తీర్మానాలు జరిగాయి. ఆ తర్వాత కూడా ప్రభుత్వానుమతి లేనిదే ఏ సభలూ జరుపుకోరాదని ప్రభుత్వం మరల ఉత్తర్వులు జారీ చేసింది. ఈవిధంగా నిర్బంధ విధానం విలయతాండవం చేసింది. ఐనప్పటికీ యువజనులలో ఉత్సాహం

తగ్గలేదు. వారిలో నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించి కూడా ఈ సభల అనంతరం సామాన్య ప్రజానీకంలో గ్రంథాలయాలు ఏర్పరచుకొని నిర్వహించుకోగలమనే ధైర్యం వచ్చింది. 1920-30లో చాలా గ్రంథాలయాలు వెలిశాయి. 1935-40లో మరల నిజాం పుర్రెలో పురుగు తొలిచింది. కొన్ని గ్రంథాలయాల స్థాపన నిరోధించడం, కొన్ని గ్రంథాలయాల నుంచి పుస్తకాలను స్వాధీనం చేసుకోవడం మొదలైనవి. నిర్బంధ విధానాలు హెచ్చయినాయి. ఈ తరుణంలో తెలంగాణాలో నూతన గ్రంథాలయాల స్థాపన కొంత వెనుకంజవేసింది.

కొత్త మలుపు

అయితే 1935లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ స్థాపన తెలంగాణ ప్రజల్లో నవచైతన్యాన్ని కలిగించింది. 1940నుంచి మరల నూతన గ్రంథాలయాల స్థాపన రాజకీయ కార్యక్రమాలలో ఒక భాగంగా జరిగింది. గ్రంథాలయ వార్షికోత్సవాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ సమరస వాతావరణంలో 1944లో ఖమ్మంలో జరిగిన విజ్ఞాన నికేతన వార్షికోత్సవం కార్యకర్తలను ఎంతో ఉత్సాహపరిచింది. ఆ తర్వాత సింగరేణి కాలరీస్‌లో 1945లోను , క్యాతూరులో 1946లోనూ, 1953లో జనగామలోనూ జరిగిన ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ మహా సభలు తెలుగువారి కీర్తి బావుటాను తెలంగాణాపై ఎగురవేశాయి. ఈ సభలు జయప్రదం కావడానికి కోదాటి నారాయణరావు గారి పాత్ర ఎంతో ఉంది.

శాసనపరంగా పెరిగిన వసతులు

గ్రంథాలయ శాసనం అమలు చేయడం వలన బ్రిటన్‌లో పౌరులు పొందుతున్న ప్రయోజనాలను గమనించి, ఆ ఛాయలలోనే మద్రాసు పౌర గ్రంథాలయ చట్టం 1948లో రూపొందించబడి, 1950 నుంచి అవిభక్త మద్రాసు రాష్ట్రంలో అమలు చేయబడింది. ఈ విషయంలో డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్ కృషి అపూర్వమైనది. మద్రాసు చట్టాన్ని అనుసరించే 1955లో హైదరాబాదు పౌర గ్రంథాలయ చట్టం వ్యాప్తిలోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డాక యీ రెండు చట్టాలూ విలీనం చేసి 1960 నుంచి ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ చట్టం రాష్ట్ర వ్యాప్తంగా అమలులోకి వచ్చింది. ఈ చట్టం వలన జిల్లా కేంద్రంలో జిల్లా కేంద్ర గ్రంథాలయం, పట్నాలలో, ప్రధాన గ్రామాలలో శాఖా గ్రంథాలయాలు, వాటికి అనుబంధంగా గ్రామీణ గ్రంథాలయాలు, పుస్తక పంపిణీ కేంద్రాలు, సంచార గ్రంథాలయాలు అమలులోకి వచ్చాయి. వీటికి తోడుగా కొన్ని పంచాయితీలు, స్వచ్ఛంద సంస్థలు పౌర గ్రంథాలయాలను నిర్వహిస్తూనే ఉన్నాయి. మొత్తం మీద ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 2005నాటికి సుమారు నాలుగువేల పైగా గ్రంథాలయాలు అధికారికంగా పనిచేస్తున్నాయి.

చదివే అలవాటు ద్వారా సామాన్య ప్రజానీకం విద్యాబుద్ధులు పెంపొందించుకోడానికి, స్వావలంబన జీవనానికి, తీరిక సమయం సద్వినియోగానికి గ్రంథాలయాలు బాగా వినియోగపడుతున్నాయి. బ్రెయిలీ సాహిత్యాన్ని అందించి అంధులకు జ్ఞాన నేత్రాలను ప్రసాదించి, వికలాంగ లోపాన్ని మరచిపోయేట్లు చేస్తున్నాయి. సాధారణ చదువరులను ప్రయోజనకరమైన పాఠకులుగా తీర్చిదిద్దడానికి కూడా అనేక ప్రయోగాలు చేశారు. చదువరులను గ్రంథాలయాలవైపు మళ్ళించడంలో రీడర్సు ఫోరమ్స్ ద్వారా పశ్చిమ గోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ గణనీయమైన కృషి చేసింది. దానికిముందుగా తాడేపల్లిగూడెం వారు ముందుకు వచ్చి అక్కడ రీడర్సు ఫోరమ్ స్థాపించి జిల్లా అంతట కూడా అన్ని శాఖా గ్రంథాలయాలలో రీడర్స్ ఫోరమ్స్ ఏర్పాటు చేశారు. దాని ప్రతినిధులతో గత సంవత్సరం జిల్లా మహాసభ నిర్వహించటం జరిగింది. భవానలను నిర్మించడం గాని, పుస్తకాలను సేకరించడంగాని, ఈ రీడర్సు ఫోరమ్ వల్ల జరిగింది. అంతేగాకుండా గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని అందించడమేగాక అనేక సాహిత్య కార్యక్రమాలను ఏర్పాటు చేసి ప్రజలను గ్రంథాలయాల వైపు రప్పించేందుకు ఈ రీడర్సు ఫోరమ్స్ ఎంతో ఉపయోగపడుతున్నవి. నెలకొక సమావేశమైనా జరిపి ఒక్కో విషయం మీద ఒక్కో ప్రముఖునిచే ఉపన్యాసం ఇప్పించడం జరుగుతున్నది. ఈ తీరుగా మరికొన్ని జిల్లాలలో చదువరుల సమావేశాలు జరుగుతున్నాయి.



సారస్వత నికేతనం, వేటపాలెం

రెండు ఉదాహరణలు

ఒక్కసారి వెనక్కు వెళ్ళి స్వాతంత్రోద్యమ దినాలలో గ్రామీణ ప్రాంతాలలో స్థాపించబడిన గ్రంథాలయాలు ఎంతటి ప్రయోజనాన్ని సాధించాయో,

ఎంతటి ప్రభావాన్ని చూర గొన్నాయో రెండు ఉదాహ రణలను చూస్తే తెలుస్తుంది. పశ్చిమ గోదావరి జిల్లాలో కుముదవల్లి అనే గ్రామంలో గ్రంథాలయ భీష్మ భూపతి రాజు తిరుపతిరాజుగారి ఆధ్వ ర్యంలోనిర్వహించబడిన శ్రీ వీరేశలింగకవి సమాజ గ్రంథా లయము సమాజవరమైన చక్కని కార్యక్రమాలు ఎన్ని నిర్వహించిందో చూద్దాం: ఈ గ్రంథాలయం తరపున వయో జన విద్యా తరగతుల నిర్వ హణ, స్త్రీలలో విద్యావ్యాప్తి, అస్పృశ్యతా నివారణ, ఉచిత వైద్య సహాయం, సహకార సంఘ నిర్వహణ, సంఘ సంస్కరణ, తపాలా సౌకర్యం, ప్రార్థనా సమాజం స్థాపన, హిందీ ప్రచారం, సభలు-సమావేశాలు మొదలైన అనేక కార్య క్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ విధంగా కృషి చేసిన గ్రంథాలయాలు తెలుగుదేశంలో వందల సంఖ్యలో లేకపోలేదు. తెనాలి తాలూకా అనంతవరం గ్రామంలో కుప్పా శ్రీరామశర్మగారు అనే గ్రంథాలయ కార్యకర్త తమ గ్రామంలో గల గ్రంథాలయ ప్రభావాన్ని గురించి యిలా రాస్తున్నారు. "మా పల్లెటూరి గ్రంథాలయం మూలమున ప్రజలు విద్యావంతులైరి. అందు ముఖ్యంగా స్త్రీలు భాగవత భారతాదులను స్వయముగా చదువుకొని యానందమునందుచున్నారు. ఆత్మగౌరవము, ఆత్మవిశ్వాసము, స్వతంత్రేచ్ఛ ప్రజల యందు తీవ్రముగా వ్యాపించినది. ఇందుకు ఫలితంగా (గాంధీ మహాత్ముని అసహాయోద్యమమున పాల్గొని) 23మంది గ్రామస్థులు ఖైదుకు వెళ్ళియున్నారు. ఇంకను వెళ్ళుటకు సంసిద్ధులుగా నున్నారు. మా గ్రామము నుండి కోర్టులకు వెళ్ళు వ్యాజ్య ములు చాలా తక్కువైనవి. బాలురకు బాలికలకు గ్రామస్థులే పాఠశాలల నేర్పరిచి. ఈ తీరుగా ఎందరో కార్యకర్తల అనుభవాలు మెండుగా కలవు. ఈవిధంగా ఆంధ్రదేశంలో గ్రంథాలయోద్యమం ఈ గడ్డమీద వెలసిన అన్ని ఉద్యమాలకు జీవం పోసింది. జాతిని చైతన్యవంతం చేసినది.



సి.పి. బ్రౌన్ గ్రంథాలయం, కడప

చెప్పుకోదగిన గ్రంథాలయాలు

నూరేళ్ళ సుదీర్ఘ చరిత్రలో తెలుగునాట కనీసం నూరు పౌర గ్రంథాలయినా లేకపోవటం బాధాకరం. ఇంతో అంతో సేవలందిస్తున్న కొన్ని గ్రంథాలయాల పేర్లు తెలుసుకుందాం.

1. సారస్వత నికేతనం, వేటపాలెం, ప్రకాశం జిల్లా
2. సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాదు
3. శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్రభాషా నిలయం, హైదరాబాదు
4. హైదరాబాదు నగర కేంద్ర గ్రంథాలయం, హైదరాబాదు
5. ప్రభుత్వ గౌతమి గ్రంథాలయం, రాజమండ్రి
6. సి.పి.బ్రౌను గ్రంథాలయం, కడప
7. కథా నిలయం, శ్రీకాకుళం

ఇలా వుండగా లంకా సూర్యనారాయణ (గుంటూరు) అనే వ్యక్తి దాదాపు 50వేల తెలుగు గ్రంథాలు, లక్షల సంఖ్యలో పత్రిక ల కత్తిరింపులు సేకరించి అందించే సమాచారం నిరుపమానం.

నాడు - నేడు

ఒకప్పుడు తెలుగువారి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలకు, తెలుగువారి అభ్యున్నతికి, తెలుగు భాషా వికాసానికి తోడ్పడిన గ్రంథాలయోద్యమం గ్రంథాలయ శాసన అనంతరం గ్రంథాలయాల స్థాపన, నిర్వహణ క్రమబద్ధం చేసి, ముఖ్యంగా ప్రజాస్వామ్య పరిరక్షణకు, సాంఘిక, ఆర్థిక ప్రగతికి, వినోదకర పఠన సామాగ్రి అందజేయడంలో జరగవలసిన కృషి మాత్రం క్రమంగా తగ్గిపోతోంది. దాదాపు నిర్వీర్యస్థాయికి చేరింది.

ప్రజల, ప్రభుత్వ ఉపేక్ష ఫలితం - గ్రంథాలయరంగ పతనం

ఉ॥ సారపు ధర్మమున్ విమల సత్యము బాపముచేత బొంకుచేఁ
భారము బొందలేక చెడఁబాటినదైన యవస్థ దక్షు లె
వ్వార లుపేక్ష సేసిరది వారలచే టగుఁగాని ధర్మని
స్తారక మయ్య సత్యశుభదాయక మయ్యును దైవముండెడున్

సమాజంలో సత్యం, ధర్మం దారుణంగా పతనమౌతూ ఉంటే, దానిని నిరోధించే శక్తి కలిగి ఉండి, ఉపేక్ష చేస్తే, ఆ ఉపేక్ష ఫలితం తమ పతనానికి, సర్వ అనర్థాలకు కారణం అవుతుందని మహాకవి తిక్కన ఆంధ్ర మహా భారతంలో ఏనాడో హెచ్చరించారు. ఒకనాడు తెలుగుజాతిని ప్రభావితం చేసిన గ్రంథాలయ రంగం నేడు ప్రభుత్వ, విజ్ఞుల ఉపేక్షా భావం వలన పతనదిశలో పయనిస్తూ ఉంది. దీనిపై స్థూలంగా కొన్ని అంశాలను పరిశీలిద్దాం.

1) చట్టసభ ఒక శాసనం ద్వారా జిల్లా గ్రంథాలయ సంస్థలకు ఇచ్చిన కార్పొరేట్ ప్రతిపత్తిని క్రమేణా ప్రభుత్వం హరించి వేసినందున, జిల్లా

గ్రంథాలయ సంస్థలు స్వతంత్రంగా ఎలాంటి కార్యకలాపాలు, విస్తరణ పథకాలు నిర్వహించలేక నిర్వీర్యమైపోయాయి. చట్టం కల్పించిన విధులను సంస్థలు నిర్వర్తించలేకున్నాయి. పలు అధికారాలు గల నామినేటెడ్ పదవులు నామమాత్రమై పోయాయి. యునెస్కో పబ్లిక్ లైబ్రరీ మానిఫెస్టో నిర్దేశించిన పౌర గ్రంథాలయ విధులు అనగా విద్య, సమాచారం, సంస్కృతి - అంశాలకు న్యాయం చేయలేకున్నాయి.

2) చట్ట ప్రకారం డైరెక్టరు కార్యాలయం గ్రంథాలయ సంస్థలకు దారి చూపాలి. పర్యవేక్షణ చేయాలి. నియంత్రించాలి. ఈ విధులను పక్కన ఉంచి డైరెక్టరు కార్యాలయం చట్టపరిధిని అతిక్రమించి సంస్థ కార్య నిర్వహణకు పూనుకొంది. దీంతో సంస్థలు కాంతి విహీనమైపోయాయి.

3) నూతన గ్రంథాలయాల స్థాపన, కొత్త సిబ్బంది నియామకాలపై గల ఆంక్షలు, పదవీ విరమణ చేసిన, సర్వీసు మధ్యలో చనిపోయిన సిబ్బంది ఖాళీలను భర్తీ చేయకపోవడం వలన సంస్థల ఎదుగుదల స్తంభించిపోయింది. వందల గ్రంథాలయాలు సిబ్బంది కొరత వలన అన్ని సేవలు అందించ లేకున్నాయి. కొన్ని గ్రంథాలయాలను వాచ్‌మన్‌లే నిర్వహిస్తున్నారు.

4) గ్రంథాలయ నిర్వహణ కోసం ప్రజల నుంచి చట్టపరంగా వసూలు చేసిన గ్రంథాలయ సెస్సును స్థానిక సంస్థలు వసూలు చేసి, గ్రంథాలయ సంస్థలకు సకాలంలో చెల్లించనందున గ్రంథాలయ సంస్థలు తగిన సేవలను నిర్వహింపలేకున్నాయి. వసూలు చేసిన లైబ్రరీ సెస్సులో పైసా కూడ ఖర్చు చేసే అధికారం స్థానిక సంస్థలకు లేకపోయినా యథేచ్ఛగా తమ అవసరాలకు అక్రమ మార్గంలో ఖర్చు చేసుకుంటున్నారు. ఇలా దాదాపు 30-40 కోట్ల రూపాయలు రాష్ట్రవ్యాప్తంగా నిలచిపోయినా, ప్రభుత్వం పదేపదే పంపే ఉత్తర్వులను స్థానిక సంస్థలు ఖాతరు చేయకపోవడం విచిత్రంగా ఉంది. స్థానిక సంస్థలు ప్రభుత్వంలో భాగం కాదా? అవి స్వతంత్ర రాజ్యాలా? అనే సందేహం కలుగుతుంది. ఈ అక్రమచర్య వలన సంస్థలు నష్టపోయిన మొత్తం వడ్డీ కలుపుకుంటే వంద కోట్లు పైగా ఉండవచ్చు.

5) ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ అమలులోకి రాగానే పుస్తకాల ఎంపిక, కొనుగోలు విషయంలో ఒక విధానం ప్రకటించవలసి ఉంది. ఈ విషయం పరిషత్తు ఈనాటికీ పట్టించుకోలేదు. అందువలన చదువరుల అవసరాలకు పుస్తకాల సేకరణకు అంతరం ఏర్పడింది. చదువరుల అవసరాలు తెలుసుకునే ప్రయత్నమే జరుగలేదు. విడుదలైన వెంటనే ఉత్తమ గ్రంథం గ్రంథాలయాలకు చేరే మార్గం గురించి ఎవరూ ఆలోచించడం లేదు. అంతేగాక వినియోగానికి పనికిరాని పుస్తకాలు, పాత పత్రికలు రద్దుకు ఒక విధానం లేనందున, విలువైన పుస్తకాలు, గ్రంథాలయాల నుండి కనుమరుగైపోతున్నాయి. ఏ పరిస్థితిలోనూ తొలగించకూడని గ్రంథాలు, పత్రికల విషయం ఎవరికీ పట్టలేదు.

6) గత యాభై సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో అన్ని జిల్లాలలో పనిచేసే సిబ్బంది సకాలంలో జీతాలు తీసుకోలేదు. గ్రాంట్-ఇన్-ఎయిడ్ పద్ధతిలోని లోటుపాట్లే ఇందుకు కారణం. ప్రభుత్వ సిబ్బంది విధిగా ఒకటవ తేదీనే ఠంచన్‌గా జీతాలు తీసుకోవడం సాధ్యమైనప్పుడు, మిగతా సిబ్బందికి సాధ్యం కాదా? దీనిపై సానుకూల దశలో ఆలోచించేందుకు ఎవరికీ తీరిక లేదా! ఒకటి మాత్రం నిజం - సిబ్బందికి సకాలంలో జీతభత్యాలు చెల్లింపకపోతే, వాటికోసం పడిగాపులు కాస్తూ, ఎపుడు జీతాలు వస్తాయో తెలియని అనిశ్చిత పరిస్థితిలో, తమ విధులకు హాజరౌతారనీ, హాజరైతే చిత్తశుద్ధితో పని చేస్తారని నమ్మకం లేదు. ఇది అనుభవైకవేద్యం.

7) స్వాతంత్ర్యం రాక పూర్వం ప్రజలకు స్వావలంబన శక్తి, తమ సంస్థల ఎడ ఆదరణ భావం ఎక్కువగా ఉండేది. ప్రజలలో స్వతంత్ర భావం ఎక్కువగా ఉండేది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించాక ప్రజలలో స్వావలంబన, స్వతంత్రతా భావం తగ్గి, అభద్రతా భావం పెరిగి ప్రతి చిన్న పనికీ ప్రభుత్వం పైనే ఆధారపడే స్వభావం పెరిగింది. ఒకప్పుడు గ్రంథాలయాలకు ప్రాణప్రదంగా పోషించిన కార్యకర్తలు, ఉదారులు గ్రంథాలయ చట్టం వచ్చాక గ్రంథాలయాలను పట్టించుకోవడం మానివేశారు. పలు పరిమితులకు లోబడి గ్రంథాలయ సంస్థలు పని చేయవలసి వచ్చినందున, వాటి ఉనికినే అవి కాపాడుకోలేని అనిశ్చిత పరిస్థితిలో పడిపోయాయి. గ్రంథాలయాలు నిత్య కల్యాణం పచ్చ తోరణంగా కొనసాగాలంటే స్థానికుల స్నేహహస్తం, సిబ్బంది చేయూత కావాలనేది నిర్వివాదాంశం.

8) ఆంధ్ర ప్రాంతం జిల్లా గ్రంథాలయ సంస్థలు ఏర్పడి 2000 సంవత్సరం నాటికి 50 సంవత్సరాల కాలం పూర్తయింది. ఆర్థిక బలం, అంగబలం గల ఈ సంస్థలు స్వర్ణోత్సవాలు వైభవంగా నిర్వహించి సిబ్బందిలో నూతనోత్సాహం ప్రజలలో గ్రంథాలయ స్పృహ పెంచాలనే విషయం ఇంకా ఆలోచించడం లేదు. ఈ విషయంలో డైరెక్టరు కార్యాలయం నుండి ఉత్సవాలు జరుపమని ఆదేశాలు వచ్చినా సంస్థలు పట్టించుకోకపోవడం దురదృష్టకరం.

9) గ్రంథాలయ చట్టం 1950 నుంచి అమలు జరుగుతూ ఉంది. అప్పట్నుంచి అన్ని గ్రామాలలో గ్రంథాలయ సెస్సు వసూలు చేస్తూ, అతి కొద్ది గ్రామాలలో మాత్రం గ్రంథాలయ సేవలు అందిస్తున్నారు. సెస్సు చెల్లిస్తూ, గ్రంథాలయ సేవలు అందని గ్రామాల వారికి చాలా అసంతృప్తి ఉంది. దీన్ని నివృత్తి చేయవలసి ఉంది. అంతేగాక వసూలైన గ్రంథాలయ సెస్సుకు సరిపోను సేవలందించడం న్యాయం కాదు. విద్యా సెస్సుకు విద్యావ్యాప్తికి సంబంధం లేనట్లే, గ్రంథాలయ సెస్సుకు గ్రంథాలయ సేవలకు సంబంధం ఉండరాదు. సెస్సు ఒక ఆధారం మాత్రమే. గ్రంథాలయ సెస్సు ఏపాటి వచ్చినా, రాకపోయినా అన్ని గ్రామాలకు గ్రంథాలయ సేవలు అందించవలసి ఉంది. సమాజంలో అన్ని తరగతుల వారికి, బడుగువర్గాల వారికి తోడ్పడేది గ్రంథాలయం ఒక్కటే అనే మౌలికాంశం విస్మరించరాదు.

10) గ్రంథాలయ ఉద్యమాన్ని చైతన్యపరచవలసిన గ్రంథాలయ సంఘాలు నిద్రావస్థలో ఉన్నాయి. ఈ దుస్థితి వారికేం పట్టటంలేదు. తిరగబడలేని జాతి బతకలేదు అని లెనిన్ ఏనాడో చెప్పిన సూక్తి ఇచట వర్తిస్తుందో లేదో చెప్పలేను. కాని మనం చెల్లించే గ్రంథాలయ సెస్సు చివరి పైసా వరకు వినియోగం కాకపోతే, ఈ విషయం ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ దృష్టికి తీసుకు వెళ్ళవలసి ఉంది. ప్రజా ప్రభుత్వం ప్రజల గోడు పట్టించుకునే దాకా ఉద్యమించడం ప్రతి పౌరుని బాధ్యత. ఈ విషయంలో ఇంకా ఉపేక్షిస్తే పౌర గ్రంథాలయ రంగం మరింత పతనం కావడం కళ్ళారా చూస్తాం. మరిన్ని అనర్థాలను స్వయంగా చూస్తాం. తిక్కన చెప్పింది సూక్తిని మరొకసారి గుర్తు చేసుకొని మసలుకోవలసిన అవసరం ఉంది. *

గ్రామీణ జీవితంలో తెలుగు పద్యనాటకం

ఎఱ్ఱ జానకిరామశాస్త్రి

వీధులలోను, పొలాలలోను, రచ్చబండలలోను కూర్చునే జనావళి నాటకములందున్న సామెతలు, నానుడులు, నెమరు వేసుకుంటూ సత్యం, ధర్మం, న్యాయములతో జనులు నడుచుకునేటట్లు చూసేవారు.



ఆ॥వె॥ *తెలుగదేలయన్న దేశంబు తెలు గేను*
తెలుగు వల్లభుండ తెలు గొ కండ
యెల్ల నృపులు గొలువ నెరుగవే బాసాడి
దేశభాషలందు తెలుగులెస్స

అన్న శ్రీకృష్ణ దేవరాయల నానుడి, సుందరమైన భాష అని తమిళ ప్రఖ్యాత కవి భారతియార్, మరియు ది ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్ అని అనేకమంది పండిత ప్రకాండులచే పొగడబడి, ఆచరణలోయున్న మన తెలుగు భాషయందు అనేక కావ్యములు, పద్యములు, పురాణములు, సూక్తులు, పాటలు, మొదలుగా లేనివి లేవనే చెప్పుటలో అతిశయోక్తి లేదని నా అభిప్రాయం.

ఈ తెలుగుభాష త్రిలింగదేశ వ్యవహారిక సిద్ధవ ద్రాక్షారామము, శ్రీకాళహస్తి, శ్రీశైల మద్యస్థమునందు ముఖ్యంగా సరళశైలిలో యున్న తెలుగుభాష యున్నది. మహా కవీశ్వరులు, మహా పండితులు, అనాది నుండి తెలుగులో ఏదో రూపేణా రచనలు చేస్తూ, భారత, భాగవత, రామాయణాది పురాణములు, తెలుగు పంచకావ్యములు, సంగీత సాహి త్యాలకు ఆలవాలమై తెలుగుతల్లి సర్వాలంకార శోభాయమానమై అనేక శతాబ్దాల నుండి దివ్యజ్యోతిగా ప్రజ్వరిల్లుచు *జ్యోతిర్మయం వాఙ్మయం* అనే సంస్కృత సూక్తిని ప్రత్యక్షరంలోనూ ప్రత్యక్షం అయ్యేటట్టు వెలుగొందుతూ వస్తోంది. అట్టి తెలుగుతల్లి బిడ్డలమైన మనమూ తెలుగును ఆదరించి, గౌరవించి, పూజించి, పఠించి, ఆత్మీయతా భావముతో మన రాబోయే తెలుగు పిల్లలకు నేర్పించవలసిన బాధ్యత మనమీద యున్నది. అందరూ శక్తివంచన లేకుండానే ప్రయత్నిస్తున్నారు.

ఈ తెలుగుభాషలో పూర్వకాలం నుండి గ్రామీణ ప్రాంతములలో పౌరాణిక నాటక ప్రదర్శనలు చాలా అందంగానూ, కనుల కింపుగా, సంగీత సాహిత్య ప్రధానంగా యుండి, అనేకమంది జీవితాలను సుగమమైన మార్గాలలో యుంచాయి. అసలు చెప్పవలసి వస్తే నాటకములలో రంగస్థల ప్రవేశం లేకపోతే ఆ రోజులలో చలనచిత్రములలో ప్రవేశం దొరికేదే కాదుట. మన చలనచిత్రరంగంలో యున్న పేరు ప్రఖ్యాతలు పొంది ఆనాటి మహామహులంతా పౌరాణిక, సాంఘిక నాటకములలో నటించి, తరువాత చలనచిత్ర పరిశ్రమ ప్రవేశం చేశారని, కొంతమంది చెప్పారు.

ఈ పౌరాణిక నాటకములు పండుగలు, జాతరలు, గ్రామదేవత ఉత్సవములు వచ్చినపుడు రోజుకొకటి, రెండు చొప్పున వేయించి, ఆనందించేవారు. మహాపండితులైన తెలుగు కవులే ఈ పౌరాణిక నాటకములను సుమధురంగా రచించి చాలా పకడ్బందీగా దాన్ని రంగస్థల నటులచే ఆడించేవారు. ఛందోబద్ధము, సత్కథామిళితము, సంగీతయుక్తము, నవరసభరితములుగా ఆ నాటకములను పూర్వకాలంలో వేసేవారు. చూసేవారికి ఆధ్యాత్మికత, ఆనందం, ఇత్యాదులు కలిగేవి అనుటలోనూ అతిశయోక్తి లేదు.

కావ్యములు మూడు రకములు. 1) గద్య కావ్యములు 2) పద్య కావ్యములు 3) చంపూ కావ్యములు. ఇవి మళ్ళీ రెండుగా అంటే దృశ్య కావ్యములు, శ్రవ్య కావ్యములుగా విభజించబడ్డాయి. అందు విని ఆనందించేవి శ్రవ్య కావ్యములు. కాళిదాస మహాకవి *రఘువంశము, కుమార సంభవము* ఇత్యాదులు. దృశ్య కావ్యములు, చూచి ఆనందిస్తూ, వినుట కింపుగా ఉండేవి. *గద్య పద్యోభయ మిశ్రితం చంపూరిత్యబధీయతే* అని చంపూకావ్య ప్రమాణము, గద్యము పద్యము రెండూ యుండి, నాటకీయత కనుగుణముగా సంతరించుకొన్న కార్యములు భాగవత మహాపురాణము, ఆంధ్రము నందు శ్రీ బమ్మెరపోతనామాత్యులు రచించినా అందు సంభాషణాదులు అంతగా నాటకీయ పరంగా లేవు.

అందుచే అందులోని ఘట్టములను మరలా తీసుకొని, దానికి సంభాషణాదులను చేర్చి, నాయికా, నాయకులకు ఇత్యాది నటన కనుగుణముగా వేరే పౌరాణిక రంగస్థల నాటకరూపమున మరలా కొంతమంది మహా కవులు రచించినారు. అవి పాత్రలు, ఆ పాత్రలు అత్యద్భుతమైన నవరసభరితమైన ఛందోబద్ధమైన తెలుగు నానుడులతోను, తెలుగు నుడికారములతోను, తత్త్వమును తెలియజేస్తూ జన మనోరంజకముగా యుంటాయి. తరువాత, తరువాత కొన్ని సాంఘిక, రాజకీయ కథలను కూడా తీసుకొని అధునాతన కవిశేఖరులు చాలా అందంగా కొన్ని పౌరాణిక నాటక రచనలను కూడా గావించారు.

సనాతన కథలను తీసుకొని పౌరాణిక నాటకములు రచించిన కవులలో కింకవీంద్ర పంచాఘంటాననులు, శతావధానులైన శ్రీ తిరుపతి వేంకట కవులు *పాండవోద్యోగ విజయము, కురుక్షేత్రము* చాలా ముఖ్యమైనవి. అలాగే, *గయోపాఖ్యానం, శ్రీ రామాంజనేయ యుద్ధం.* ఇలాగున అన్ని పురాణాలను పౌరాణిక ఫక్కీలో రచించారు. అధునాతన కవులైన పండితశ్రేష్ఠులలో శ్రీ బలిజేపల్లి లక్ష్మీకాంత కవిగారి *సత్య హరిశ్చంద్రియము* మిగిలిన కవులు రచించిన *పల్నాటియుద్ధం, చింతా మణి, బాలనాగమ్మ, వీరపాండ్య కట్టబ్రహ్మన్న, రుద్రమదేవి,* ఇత్యాదులు చాలా ప్రఖ్యాతి నొందిన నాటకములు.

ఇంచుమించు ఆరు నుండి ఏడుగంటల పాటు అనేక సంగీత విద్వాంసుల పాత్రధారణలలో ఈ నాటకములు రాత్రంతా జరుగుతూ యుండేవి. ఇప్పటికీ జరుగుతున్నాయి. ఇపుడైతే అనేక విద్యుచ్ఛక్తి దీపముల కాంతిలో, అధునాతన వస్త్రాభరణాదులతో ఆయా పాత్రధారులు చాలా కష్టపడి, ఎంతో శ్రమకు ఓర్చి, తమ తమ పాత్రలకు ఎంతో న్యాయం చేస్తూ ఉంటారు. నాటకరంగాలంకరణ, నాందీవాక్యము, కథా ప్రశంస, నాటకము, ఋతువర్ణన, భరత వాక్యములతో పూర్తి అయే ఈ ఆంధ్ర దేశ పౌరాణిక నాటకములు ఎంతో గుర్తు చేసుకొని పోషించవలయునని నా ఆకాంక్ష.

ఈ పౌరాణిక నాటకముల ద్వారా సాంఘిక, రాజకీయ పరిస్థితులలో ఎన్నో మార్పులు వస్తూ ఉండేవి. నాటకములు మన సంస్కృతిని తెలియజేస్తూ సంఘమునకు సంస్కారమును నేర్పి చదువురాని వారి వద్ద నుండి పండితులైన వారి వరకూ కూడా చాలా సహాయకారిగా ఉండేవి. వీధులలోను, పొలాలలోను, రచ్చబండలలోను కూర్చునే జనావళి ఆయా నాటకములందున్న సామెతలు, నానుడులు, నెమరు వేసుకుంటూ సత్యము, ధర్మము, న్యాయములతో జనులు నడుచుకునేటట్లు చూసేవారు.

సత్యహరిశ్చంద్ర నాటకమునందలి ప్రతీ అంకము నందు ధర్మ సూక్ష్మములు నిండియున్నవి. సత్యవాక్య పరిపాలనాదక్షుడైన హరిశ్చంద్ర భూపాలుడు అన్నీ అమ్ముకొని, తాను కూడా కాటికాపరిగా మారినా భరతమాత కీర్తిప్రతిష్ఠలను నిలుపుట కోసమై జీవితాన్ని సత్యదేవతకు అంకితం చేసి గెలుపును పొందినాడన్న విషయము ఆనాటి రోజులలో ఎంతోమందిని, వారి జీవితాలలో మార్పు తీసుకు వచ్చిందనటంలో సందేహముండదు.

అలాగే ధర్మాధర్మముల మధ్య యుద్ధమే కురుక్షేత్ర సంగ్రామమని, వ్యసనలోలుడైనా, అసూయాద్వేషములకు ఆలవాలుడైనా మనిషి గెలుపు నొందడని సుయోధనుని చరిత్ర, ధర్మమును ఎల్లవేళలా రక్షించే భగవానుని అండ *ధర్మోరక్షతి రక్షిత:* అన్నట్లు చిత్రీకరించిన తిరుపతి వేంకట కవులు రచించిన *పాండవోద్యోగ విజయం నాటకం సత్యమేవ జయతే* అనే మన భారతదేశపు మువ్వన్నెల పతాకపు ప్రతిజ్ఞను తెలియజేస్తూ అనేక ధర్మాలను బోధిస్తూ, సంఘమును తీర్చిదిద్దినదనుటలో అతిశయోక్తి లేదు.

చింతామణి అనే పౌరాణిక నాటకములో బిల్వమంగళుని పాత్ర అత్యంత పాండితీప్రకర్షను తెలియజేస్తూ, ఎంత పండితుడైనా మనస్సుని నిగ్రహింపజేసుకోలేకపోతే అధోగతి తప్పదు అనే ధర్మసూక్ష్మమును తెలియజేస్తూ, నవరసభరితంగా సాగుతుంది. పూర్వం అందరూ సంస్కృతంలో పండితులే అన్న నిజాన్ని ఈ నాటకంలో కవి ఎంతో అందంగా చిత్రీకరిస్తాడు. నిజంగా మన పూర్వీకులు, తాతముత్తాతలు, సంస్కృతాంధ్రముల యందు ఆరితేరినవారే. ఏ నాటకంలో పద్యం చదివినా వారికి వెంటనే దానియందలి భావం, కవి హృదయం, రసం వెంటనే అర్థమై పోయేవి. ఈ *చింతామణి* నాటకంలో చింతామణి కృష్ణభక్తి పరిపూర్ణురాలు. అయితే జన్మత: వేశ్యాకులము నందు జన్మించుటచే ఆ వృత్తి చేస్తూ భక్తితో యుండి, సంస్కృతజ్ఞాన సంపన్నురాలై, పండిత శ్రేష్ఠుడైన బిల్వమంగళునే ప్రశ్నించి అతని మన్ననలను అందుకొన్న దిట్ట. ఈ నాటకం ఎంత ఆస్తిపాస్తులున్నా *కాంతా కనకములే మానవుని ఎంతకైనా దిగజారుస్తవి* అనే సత్యాన్ని నాటకీయతతో అత్యద్భుతంగా చిత్రించింది.

ఇంక *శ్రీరామాంజనేయ యుద్ధం.* ఈ కథ నిజంగా పురాణాలలో లేదు. కానీ *రవి గాంచనిది కవి కాంచగలడు* అనే ఆర్యోక్తి, *నానృషి: కురుతే కావ్యం* అన్నట్లు ఈ కథను సృష్టించి కవి, ప్రపంచానికి భగవంతుని కన్నా, భక్తుడు మిన్న, సత్సాంగత్యము, భగవద్భక్తుల సేవ చేయటం ఎంత మంచిదో తెలియజేయటం, భగవంతుని కన్నా, భగవన్నామము గొప్పదని చాటటం ఈ నాటకం యొక్క ప్రత్యేకత. వశిష్ఠుడు, విశ్వామిత్రుడు, వీరిద్దరు ఋషులు ఎప్పుడూ అన్ని పౌరాణిక నాటకాలలోను ఉంటారు. వారి వాగ్వివాదాలలో ఇద్దరికీ మాటా మాటా వస్తుంది. దాంతో విశ్వామిత్రుడు ఒక పన్నాగం పన్నటం, భూలోకంలో ఓ రాజ కుటుంబాన్ని పట్టుకొనటం దానితో నాటకం జరగటం - ఇలా నాందిగా చాలా నాటకాలు వ్రాశారు. ఈ రామాంజనేయ యుద్ధం కూడా అంతే. కానీ మంచి మంచి హృద్యమైన పద్యాలతో శ్రీరామచంద్రునకు, హనుమంతునకు మధ్య ఘర్షణ, వాదన, సాత్విక దృష్టితో రచించటం చాలా గొప్ప విషయం. చివరకు అన్ని నాటకాలు సుఖాంతమే అవుతాయి. యయాతి మహారాజు ఈ నాటకంలో ప్రత్యేక నాయకుడు.

భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ రజ, స్తమో గుణాలు మంచివి కావు, సత్త్వగుణ సంపన్నత, తత్సంధానతయే గొప్ప విషయం అని అర్జునునితో ఉపదేశ పూర్వకంగా అంటాడు. అర్జునుడంటే ఎవరో కాదు మనం అందరమూ, ఆ గీత మనకు ఉపదేశం. అటువంటి కృష్ణ పరమాత్మ కూడా అవతారమెత్తటం చేత అహంకార, మమకారాలు కాలానుగుణంగా వచ్చేస్తాయి అని చెప్పినట్లుగా *గయోపాఖ్యానం* నాటకం జరుగుతుంది. అంతట శ్రీకృష్ణ పరమాత్మ కూడా నదీతీరంలో సూర్య నమస్కార, అర్ఘ్య ప్రధాన నిమగ్నుడై యున్నపుడు, గయ గంధర్వుని నిష్ఠీవనం దోసెట్లో పడగానే ఉగ్రుడై శపించుట జరిగినది. ఈ కథను *గయోపాఖ్యానంలో* అనేకమైన శబ్దాలంకారములతో కవి రచిస్తాడు.

ఇలాంటి పౌరాణిక నాటకాలు ఎన్నెన్నో అనేక కవులచే రచింపబడి ఆరోజులలోను, ఈరోజులలోనూ కూడా మానవాళికి ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోయున్న జనావళికి నిజజీవితములలో సహకరిస్తూ, వారిని ప్రగతిపథంలో, ముఖ్యంగా మానసిక స్థైర్యము, శాంతిని, ఇస్తూ ఉన్నాయని చెప్పవచ్చును.

అనాది నుండి ఆంధ్రమాత గళము నందలి హారములోని మణిపూసలలో నాటకం కూడా ఒక మణిపూస. అట్టి నాటకకళను మనమెంతైనా అభిమానించి, ఆదరించి మనకు తోచినంత చేయూతనిస్తే దగద్ధగాయ మానముగా వెలుగొందుతూ, భావితరముల వారికి శుభప్రదములనే ఇచ్చునని నా అభిప్రాయము.

ఏదో కొంత నాటక కళ యందలి అభిమానముతో మాత్రమే నాకు తోచిన ముక్కలు వ్రాసినాను. ఎందరో మహా పండితులున్నారు. దీనిని సహృదయంతో గ్రహియింతురు గాక.

కావ్యేషు నాటకం రమ్యం

(తానా సమావేశాల్లోని సాహితీ సదస్సులో చదివిన ప్రసంగవ్యాసం)

రెండవ తరంవారికి తెలుగు నేర్పడంలోని సాధక బాధకాలు

డా. కందాళ శ్రీనివాసాచార్య

భాషాబోధనలో అనేక పద్ధతులున్నాయి. అన్నీ అనుసరణీయమైనవే. అయితే, ఒక భాషను నేర్పేందుకు లేదా నేర్చుకునేందుకు వాటన్నింటినీ అనుసరించాల్సిన పనిలేదు.



ఒక తరంవారు తమ భాషా సంస్కృతులు, ఆచార వ్యవహారాలకు దూరంగా ఉంటే, రెండవ తరంవారు వాటికి మరింత దూరం అవుతారు. ఈ పరిస్థితి ఆ భాషా సంస్కృతులు, ఆచార వ్యవహారాల ఉనికికే ప్రమాదం. ఇది మన తెలుగు జాతికి, ముఖ్యంగా భాషకూ దాపురి స్తోందని పలువురు ఆందోళన చెందుతున్నారు. అమెరికాకు ఆహ్వానింపబడ్డ ప్రతి ప్రముఖ తెలుగు వ్యక్తి ఈ సంగతిని ఏకరవుపెట్టి మనల్ని మరింత భయాందోళనకు గురి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అనేకమంది తమకు తోచిన విధంగా తెలుగు భాషా సంస్కృతులను కాపాడే ప్రయత్నమూ చేస్తున్నారు.

అమెరికాలో ఉన్న రెండవతరం తెలుగు వారిని స్థూలంగా రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. ఇక్కడే పుట్టి పెరిగిన వారు, ఆంధ్రాలో పుట్టి కాస్త తెలుగు వాసనను పట్టించుకుని పిన్న వయస్సులోనే ఇక్కడికి వచ్చి పట్టించుకున్న ఆ కాస్త వాసననూ పోగొట్టుకొన్నవారు. ఇందులో మరో రెండు వర్గాలు ఉన్నాయి. ఒక వర్గంవారికి తెలుగు బొత్తిగా తెలీదు. మరో వర్గం వారికి తెలుగు కొద్దిగా అర్థం అవుతుంది, కానీ వారికి మాట్లాడడం, చదవడం రాదు. అలాగే వీరిలో ప్రాథమిక, ఉన్నత పాఠశాల, కళాశాలల స్థాయిల వారున్నారు. వీళ్ళందరికీ తెలుగు ఎలా నేర్పాలన్నదే మనముందున్న సమస్య. అలాగే వీరిలో భాషా విషయ అవగాహనలోను, నేర్చుకునే విధానంలోను తేడాలున్నందువల్ల అందరికీ ఒకేలా నేర్పేందు కవదు. అందుకే వారివారి స్థాయిలకు అనుగుణంగా నేర్పే విధానం ఉండాలి.

ప్రస్తుత వ్యాసం, వీరికి తెలుగు నేర్పడంలో గల సాధకబాధకాలను ప్రస్తావించడంతోపాటు, అందుబాటులో ఉన్న ఆధునిక బోధనా పద్ధతులను ఉపయోగించుకుంటూ మన బోధనా పద్ధతుల్ని మెరుగుపరచుకునే అవకాశాలను సూచనప్రాయంగా చర్చిస్తుంది.

అమెరికాలో తెలుగు బోధన

విశ్వవిద్యాలయ స్థాయిలో షికాగొ విశ్వవిద్యాలయం (షికాగో), విస్కాన్సిన్ విశ్వ విద్యాలయం (మాడిసన్), మిషిగన్ విశ్వవిద్యాలయం (అన్న్ అర్బోర్-2003 సెప్టెంబరు నుంచి), పెన్సిల్వేనియా (ఫిలడెల్ఫియా) వంటి విశ్వవిద్యాలయాల్లో ప్రతి విద్యా సంవత్సరం తెలుగు బోధన జరుగుతోంది. విస్కాన్సిన్‌లో వేసవి కాలంలో కూడ తెలుగు తరగతులు నిర్వహిస్తున్నారు. అలాగే కేలిఫోర్నియా (శాందియాగొ, డేవిన్‌లలో), హైవై (హైవై, మిన్నెసోట విశ్వవిద్యాలయం) వంటి విశ్వవిద్యాలయాలలో ఔత్సాహికంగా తెలుగు బోధన జరుగుతోంది. ఇవే కాకుండా స్థానిక తెలుగువారి ఆదరణతోను, ఔత్సాహిక బోధకులతోనూ హైస్కూలు, ప్రాథమిక పాఠశాలల స్థాయిలోని పిల్లలకు ప్రత్యేకంగా తెలుగు బోధన జరుగుతోంది. అలాగే పెన్సిల్వేనియా విశ్వవిద్యాలయం, మాడిసన్ భాషా పరిశోధన కేంద్రాలలో తెలుగు బోధనా సామగ్రిని తయారు చేస్తున్నారు. అధికారికంగా తెలుగు బోధిస్తున్న వారితోపాటు ఔత్సాహికంగా తమ అమూల్యమైన సమయంలో కొంత సమయాన్ని పిల్లలకు తెలుగు నేర్పేందుకు వినియోగిస్తున్న వారందరూ ఎంతో ప్రశంసనీయులు. అలాగే ఇందుకు ప్రోద్బలంగా ఉంటున్న తానా, ఆటా వంటి ప్రముఖ తెలుగు సంఘాలు, స్థానిక సంస్థలు అన్నీ కొనియాడ తగినవి.

బోధనా ఉద్దేశ్యం, లక్ష్యాలు

బోధనా ఉద్దేశ్యం ప్రధానంగా ఇక్కడి రెండవ తరం తెలుగువారికి, తెలుగేతరులకు తెలుగు భాష పట్ల సముచిత అవగాహన కల్పిస్తూ తెలుగు భాషా సంస్కృతులు, ఆచార వ్యవహారాలను క్షుణ్ణంగా నేర్పించడం. ఇందుకు లక్ష్యంగా శాస్త్రీయ సరళ పద్ధతుల సాంకేతిక బోధనా పరికరాలు ఉపయోగిస్తూ తెలుగును బోధించడం.

భాషాబోధనలో రకాలు, తేడాలు

భాషాబోధనలో ప్రథమ, ద్వితీయ, తృతీయ అని మూడు రకాలున్నా, ప్రధానంగా ప్రథమ, ద్వితీయ భాషాబోధనల మధ్య ఉన్నంత అంతరం ద్వితీయ, తృతీయ భాషాబోధనల మధ్య లేనందున ఆ మొదటి రెండింటి గురించి తెలుసుకుందాం.

ప్రథమ భాష

ప్రథమ భాష అంటే, పిల్లలు పుట్టిన దగ్గర్నుంచీ ఇంట్లో మాట్లాడే భాష, ఇంటి వెలుపల వ్యవహరించే భాష, స్కూల్లో చదువుకునే భాషా ఒకటే అయితే అదే ప్రథమ భాష, ఆ భాషలో జరిగే బోధనే ప్రథమ భాషా బోధన అవుతుంది. ఇదే ఒక విధంగా మాతృభాష అవుతుంది. అయితే తల్లి మాట్లాడే భాషనే మనం మాతృభాష అని అంటాం కదా? దీని గురించి మరో సందర్భంలో చర్చించుకుందాం. అలాగే ఇదే భాష ఒకటి రెండు స్థాయిల వరకు లేక అన్ని స్థాయిల్లోనూ బోధనా మాధ్యమం గానూ ఉంటుంది. ఉదాహరణకు అమెరికాలో ఇంగ్లీషు ప్రథమ భాష గాను, అన్ని స్థాయిల్లోనూ బోధనా మాధ్యమంగానూ ఉంది. అదే ఆంధ్రాలో తెలుగు బోధనా మాధ్యమంగా గల స్కూళ్లలో ప్రాథమిక, హైస్కూలు లేదా ఇంటర్ స్థాయిల వరకు మాత్రం తెలుగు ప్రథమ భాషగా ఉంది.

అమెరికాలోలా ఇంగ్లీసుకున్నంత పూర్తి భాషా వాతావరణం, ఆంధ్ర రాష్ట్ర భాషైన తెలుగుకు లేదు. బహుశ ఈ పరిస్థితే తెలుగును తెరమరుగు చేసేందుకు ఒక కారణమవుతోంది.

ప్రథమ భాషాబోధన, బడిలో చేరే ముందే విద్యార్థికి ఆ భాషలో మాట్లాడటం, అర్థం చేసుకోవడం సహజంగా తెలిసి ఉంటుంది కాబట్టి, విషయ ప్రాధాన్యత ఆధారితమైవుంటుంది. అంటే సాంప్రదాయకంగా ఉంటుంది.

ఉదాహరణకు, తెలుగు అక్షరాలను గుర్తుపట్టేందుకు వీలుగా అ అంటే అమ్మ, అని, ఆ అంటే ఆవు అని నేర్పుతారు. గుణింతాలను నేరుగా క కు దీర్ఘమిస్తే కా, క కు గుడి ఇస్తే కి అని నేర్పుతారు. పదాలను, పద్యాలను వల్లె వేయిస్తారు. పాఠ్యపుస్తకాలు అలాగే ఉంటాయి. ఇది మనకు తెలిసిన సంగతే. అయితే ఇక్కడి పిల్లలకు చాలా మటుకు ఇంగ్లీషు సహజంగా వచ్చి వుంటుంది కాబట్టి, వాళ్లకు తెలుగును ద్వితీయ భాషగా నేర్పించాలి.

ద్వితీయ భాష

ప్రథమ భాష కానిదీ, కేవలం ఇంటికే పరిమితమైందీ ద్వితీయ భాష. ప్రథమ భాషా వాతావరణంలో ద్వితీయ భాషలో బోధనా మాధ్యమం ఉండదు. కాగా ద్వితీయ భాషాబోధన ప్రథమ భాషాబోధనా మాధ్యమంగా సాగుతుంది. అయితే ద్వితీయ భాష మాతృభాషగానూ ఉంటుంది. దీన్నే అల్పసంఖ్యాక భాష అని కూడా అంటారు.

ఉదాహరణకు అమెరికాలో తెలుగును ఒక ద్వితీయ భాషగాను లేదా ఒక విదేశీ (విశ్వవిద్యాలయాల్లో) భాషగాను ఇంగ్లీషు మాధ్యమం ద్వారా నేర్చుకోవలసి ఉంటుంది. అలాగే స్పానిష్, చైనీస్, జపనీస్ వంటి అమెరికేతర భాషలు మాట్లాడేవారు ఇంగ్లీషును ద్వితీయ భాషగా నేర్చుకుంటారు.

ద్వితీయ భాషా బోధన సాధారణంగా సాంప్రదాయేతర విధానంలో ఉంటుంది. అంటే విషయ ప్రాధాన్యతకన్నా క్రమపద్ధతి నియమాన్ని పాటించవలసి ఉంటుంది. అంటే, ప్రథమ భాషా బోధనలోలా అ అంటే అమ్మ అని నేర్పకూడదన్న నియమం ఉంటుంది. అమ్మ పదంలో మ తరువాత మ వత్తులను నేర్చుకునే దాకా అమ్మ పదం వాడేందుకవదు. శబ్దాలను దగ్గరి ఉచ్చారణ లేక అదే ఉచ్చారణగల ఇంగ్లీషు పదాల ద్వారా గుర్తింపజేయాలి. దీన్నే మనం ఎక్కువగా అనుసరించాలి. కావున తక్కిన విషయాలన్నీ ఈ బోధనపైనే చర్చించుకుందాం.

వివిధ బోధనా పద్ధతులు

భాషాబోధనలో అనేక పద్ధతులున్నాయి. అన్నీ అనుసరణీయ మైనవే. అయితే, ఒక భాషను నేర్పేందుకు లేదా నేర్చుకునేందుకు వాటన్నింటినీ అనుసరించాల్సిన పనిలేదు. ఒక భాష ఆ వాతావరణానికి అనుగుణమైనది లేక విద్యార్థులు నేర్చుకునే భాష పట్లగల అవగాహనా నేపథ్యాలను బట్టి కొన్నింటిని అనుసరించవచ్చు. వాటిలో ముఖ్యంగా నాలుగు పద్ధతులు, వ్యాకరణ అనువాద పద్ధతి, ప్రత్యక్ష పద్ధతి, విషయ లేక వస్తు ఆధారిత పద్ధతి, ఆరోహణ క్రమ పద్ధతుల గురించి తెలుసు కుందాం. ప్రస్తుత భాషాబోధనలో ఈ నాలుగు పద్ధతులను మిళితం చేసి ఆధునిక భాషా పరికరాలను, కౌశలాలను అనుసరించటం వల్ల త్వరితగతిన అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చు. అలాగే నేర్చుకున్న భాష శాశ్వతంగా నిలిచే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇందుకు బోధకుని సామర్థ్యంతోపాటు విద్యార్థుల ఆసక్తి, ప్రయత్నాలు కూడా ఎంతో అవసరం.

1) వ్యాకరణ అనువాద పద్ధతి

వ్యాకరణ అనువాద పద్ధతి అంటే భాషాశాస్త్ర పరంగా శబ్దాలలో మార్పులు, పదాల కలయిక, పలికేటప్పుడు పాటించవలసిన నియమాలు, పదాంశాలు, అర్థ వివరణ, వాక్య నిర్మాణం, అభ్యాసాలతోపాటు అను వాదాలు (తెలిసిన భాష (ఇంగ్లీషు) నుంచి నేర్చుకునే భాష (తెలుగు)లోకి, నేర్చుకునే భాష నుంచి తెలిసిన భాషలోకి అనువదించటం) మొదలగు అంశాలతో నేర్పటం.

ఈ పద్ధతిలో ఇటు బోధకుడు అటు విద్యార్థి అధికంగా శ్రమించాల్సి ఉంటుంది. అంటే బోధకుడు ఎంతో సమయాన్ని వెచ్చించి ప్రణాళికా బద్ధంగా పాఠాలను అన్ని అంశాలతో సిద్ధపరచుకోవాలి. అలాగే విద్యార్థి ఎప్పటికప్పుడు బోధించిన అంశాలను అభ్యసిస్తుండాలి. కొంచెం బద్ధకిస్తే విద్యార్థి ఎక్కువ ఒత్తిడికి గురయ్యే ప్రమాదముంది.

2) ప్రత్యక్ష పద్ధతి

ప్రత్యక్ష పద్ధతిలో మౌఖిక లేక వ్యవహార భాషకే ప్రాధాన్యత ఉంటుంది. బోధన అంతా విద్యార్థి నేర్చుకునే భాషలో, అంటే తెలుగులోనే జరపాలి. ఏ విషయాన్నీ విద్యార్థికి తెలసిన భాష (ఇంగ్లీషు)లోకి అనువదించ కూడదు. చదవటం, రాయటం ముందే నేర్పించాలి. మిగిలిన రెండు భాషా కౌశలాలు- మాట్లాడటం, వినటం- కూడా బోధించాలి. వ్యాకరణాన్నీ సందర్భోచితంగా బోధించాలి. ఈ పద్ధతిలో నాలుగు భాషా కౌశలాలను తగు రీతిన ఉపయోగించుకునే వీలుంది.

ఈ పద్ధతిలో చదవటం, రాయటం సరిగ్గా నేర్చుకోకపోతే, విద్యార్థి ఎంతో ఇబ్బంది పడటమేకాక, నేర్చుకునే భాషపై విముఖత చెందే అవకాశముంది.

3) విషయ ఆధారిత పద్ధతి

ఈ పద్ధతిలో అధికంగా వస్తు ప్రాధాన్యత ఉంటుంది. అంటే భాషపై కన్నా విషయభావాల పైనే పాఠాలు, బోధనా కేంద్రీకృతమై ఉంటాయి.

పాఠ్య ప్రణాళిక చరిత్ర, విజ్ఞాన శాస్త్రాల వంటి విషయాలపై ఉంటుంది. ఈ పద్ధతి ప్రథమ భాషా బోధనా పరిధిలోకి వచ్చినా, దీన్ని ద్వితీయ భాషా బోధనలో కూడా ఉపయోగించవచ్చు. అంటే సంభాషణల పాఠాలను సందర్భానికి, అవసరానికి తగినట్లుగా రూపొందించుకుని బోధించాలి. ఇది విద్యార్థిలో మాట్లాడే కౌశలాన్ని పెంపొందింపజేస్తుంది.

4) ఆరోహణ క్రమ పద్ధతి

ఆరోహణ క్రమ పద్ధతి అంటే సరళ విషయాల నుంచి మొదలు పెట్టి క్రమంగా పరుష విషయాలను నేర్పటం. ఈ పద్ధతిలో విద్యార్థి పాఠ్యాంశాలను క్రమంగా సులభంగా ఒకదాని తర్వాత మరొక అంశాన్ని గుర్తుపెట్టుకుంటే నేర్చుకునే వీలుంది.

భాషా కౌశలాలు

నాలుగు కౌశలాలు అంటే వినటం, మాట్లాడటం, చదవటం, రాయటం. వీటిని క్రమ పద్ధతిలో నేర్చుకున్నప్పుడే భాష బాగా పట్టుబడు తుంది.

1) వినటం

'వినటం అన్నది ఒక కళ' అని మనం వినే ఉంటాం. పిల్లలు పుట్టిన దగ్గర్నుంచీ వినటం లేక ఆలకించటం వల్లనే భాషను అర్థం చేసుకోవటంతో పాటు అనేక విషయాలను కూడా ఆకళింపు చేసుకుంటారు. అందుకే నాలుగు భాషా కౌశలాలలో, ఇది అత్యంత ప్రాధాన్యతను సంతరించు కుంది.

ఈ పద్ధతిలో విషయ బోధనకన్న వినటానికే ఎక్కువ ప్రాముఖ్యత ఇవ్వాలి. పాఠాన్ని బోధకుడు విద్యార్థులకు ముందుగా చదివి వినిపించాలి.

2) మాట్లాడటం

'మాట్లాడటం తక్కువ వినటం ఎక్కువ చేయాలి' అని అనుకోవటం మంచి పద్ధతే. అయినా బాగా మాట్లాడగలిగితేనే కాని భాష పట్టుబడదు, మరొకరికి మన మనోభావాలను తెలిపేందుకవదు. అలాగే భాషా అవ గాహనకై బాగా వినాలి. బాగా వింటేనేగాని మాట్లాడటాని కవదు. త్వరితగతిన నేర్పే విద్యలో (రాపిడెక్స్, ఇంటెన్సివ్ వంటి కోర్సులు) మాటలనే బోధిస్తారు.

4) రాయటం

ఆధునిక బోధనా పద్ధతులతో, కౌశలాల ప్రావీణ్యతతో నేర్చుకున్న భాష స్థిరపడాలంటే అక్షరాల అభ్యాసం ఎంతో అవసరం. మాట్లాడే భాష విద్యలో రాతకు అంత ప్రాముఖ్యం ఇవ్వరు. వినటం, మాట్లాడటం, చదవటం నేర్పుతూ, భాషా రూపం తెలుసుకునేందుకో లేక ఏ భాషను నేర్చుకుంటున్నామన్నందుకు నిదర్శనంగానో (కొన్ని చోట్ల అదీ లేదు) వర్ణమాలను (తెలుగుకు సంబంధించిన వత్తులు, గుణింతాలు వగైరా) టూకీగా పరిచయం చేస్తారు. అంటే తెలుగు లిపి జోలికి పోకుండా ఇంగ్లీషు లిపి (లిప్యంతరీకరణ) తోనే తెలుగును బోధిస్తారు. ఒక విధంగా ఇది భాషను అసంపూర్ణంగా నేర్చుకోవటమే గాక 'తెలుగులో నిశాని శాల్తీ అవటమే'అవుతుంది. అలా విద్యార్థి బోధనా పాఠాలను మాత్రమే చదవ గలడు. తెలుగు పుస్తకాలను చదవలేడు. ఈ పరిస్థితి భాషాభివృద్ధికి తోడ్పడదు.

బోధనా పరికరాలు, వాటి ప్రాముఖ్యత

బోధనా పరికరాలు భాషా వాతావరణాన్ని తరగతి గదిలోకి తీసుకుని వచ్చేందుకు ఉపయోగిస్తాయి. ముఖ్యంగా ద్వితీయ భాషా బోధనకు ఎంతో ఊతమిస్తాయి. బోధకుని సామర్థ్యాన్ని పెంపొందింప జేస్తాయి. విద్యార్థులలో భాష పట్ల ఆసక్తినీ, అనురక్తినీ కలిగిస్తాయి. వినే కౌశలాన్ని పెంపొందిస్తాయి. మాట్లాట్టం ఎలాగో తెలుపుతాయి. భాషా సంస్కృతులను, ఆచార వ్యవహారాలను, మాటల్లో చెప్పలేని ఎన్నో సంగతులను ఒక చిత్రం చెబుతుందన్నట్లు పాఠాల్లో చెప్పగలిగినా, చూపించలేనివి, ఇలా అనేక విషయాలను చక్కగా తెలుకునేటట్లు చేస్తాయి.

1) దృశ్య, శ్రవణ పరికరాలు

భాషా ప్రయోగశాల, టెలివిజన్, కంప్యూటర్, పోర్టబుల్ డివిడి ప్లేయరు, విసిపి, రేడియో వంటి సాధనాలు భాషా బోధనలో ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. ఇక్కడ తెలుగుకు రేడియో అందుబాటులో లేకపోయినా, ప్రత్యామ్నాయంగా ప్రసంగాలను రికార్డు చేసి తరగతి గదిలో వినిపించవచ్చును. వివిధ విషయాలపై ప్రసంగ వ్యాసాలను, కథలను టేప్ రికార్డరు ద్వారా వినిపించవచ్చును. ఇంటర్నెట్ అందుబాటులో ఉండి, బోధకుడు విద్యార్థుల మధ్య భాషా విషయక అనుసంధానాన్ని చేస్తుంది. అలాగే కంప్యూటర్ ద్వారా భాషా సంబంధిత సాఫ్ట్‌వేర్లను ఉపయోగించి బోధించడం మనందరికీ తెలిసిందే.

2) కార్డులు

అక్షరాలు, పదాలు, వాటి అర్థాలు, చిత్రాలు వంటి విషయాలను కార్డుల ద్వారా మార్పులు చేర్పులు అంటే అక్షరాలు, వత్తులు చేర్చే విధానం, పదాలను కూర్చటం, వాటి అర్థాలను, చిత్రాలను మార్చిమార్చి చూపించ వచ్చును. వీటిని ఫ్లాష్ కార్డులంటారు.

3) చిత్రపదకోశాలు వగైరా

చిత్ర పదకోశాలు విద్యార్థులలో భాషా పదజాలాన్ని పెంపొం దిస్తాయి. పదాలు బాగా తెలిసివుంటే, వాక్య నిర్మాణం చేయటానికి, మాట్లాడటానికి వీలౌతుంది.

తెలుగును ఎలా నేర్పాలి?

ఇంతవరకు చర్చించిన విషయాలలో కొంత తెలుగులో బోధన గురించి సందర్భోచితంగా ప్రస్తావించాం. మరికొంత ఇక్కడ చర్చించు దాం.

మాట్లాడేందుకు సులువుగాను, అవతలి వాళ్లకు సరిగా అర్థమ య్యేందుకు వీలుగా భాషలో కొన్ని మార్పులు చేర్పులు జరుగుతాయి. వీటిని గుర్తించిన పండితులు తగురీతిన వ్యాకరణ సూత్రాలను రూపొం దించారు. ప్రథమ భాషగా తెలుగును నేర్పేటప్పుడు ఈ సూత్రాలను బోధకులు బాగా గుర్తుండేందుకు బట్టీ పట్టిస్తారు. అదే ద్వితీయ భాషగా తెలుగును నేర్పేటప్పుడు ఈ సూత్రాలు అన్వయింపబడే సందర్భాలను,

షరతులను విద్యార్థులకు సులభరీతిలో అర్థమయ్యేలా భాషాశాస్త్ర పరంగా నేర్పాలి.

తెలుగులో ఇంగ్లీషుకన్న అక్షరాలు ఎక్కువ ఉన్నాయి. రాసే తీరూ క్లిష్టమైందే. అందువల్ల సులువుగా రాసే పద్ధతిని బోధిస్తూ, శబ్దానికి అక్షరానికీ మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని వివరించాలి. తెలుగులో ముఖ్యంగా ద్విత్వాక్షరాలు, సంయుక్తాక్షరాలను రాసే పద్ధతి ఒకటి, పలికే విధం మరొకటి. దీన్ని విద్యార్థులకు స్పష్టం చేయాలి. అంటే సగం హల్లుకు తలకట్టు తగిలించే దగ్గర్నుంచి జరిగే అన్ని మార్పులు చేర్పులను వివరించాలి.

ఉదాహరణకు, అక్క అని రాసి అక్క అని పలుకుతాం. అంటే సగం హల్లుని పూర్ణ హల్లుగా రాసి పూర్ణ హల్లుని ఒత్తుగా రాస్తాం. అలాగే స్త్రీ అనే సంయుక్తాక్షర పదంలో మూడు అసంపూర్ణ హల్లులు స్, త్, ర్, ఒక అచ్చు రీ (ఈ ప్రతిరూపం) ఉన్నాయి. ఇలా పలికి అలా రాస్తాం. ఇదే పదాన్ని ఇంగ్లీషులో రాసినప్పుడు అన్నింటిని పక్కపక్కనే రాస్తాం. (ఇంగ్లీషు లిప్యంతరీకరణలో ఎస్ టి (త్) ఆర్ ఇఇ (ఐ అంటాం) అని రాస్తాం.) దీన్ని పలికేటప్పుడు స్త్రీ చేస్తారు.

వీటి గురించి ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తిగారు (ఎ గ్రామర్ ఆఫ్ మోడరన్ తెలుగు, 1985) ఆచార్య వేమూరి వేంకటేశ్వరరావుగారు (ఇంగ్లీషు/తెలుగు - తెలుగు/ఇంగ్లీషు నిఘంటువు, 2002 ముందు పేజీలు) వివరంగా తెలిపారు. అలాగే తెలుగు ఉచ్చారణ గురించి కూడా స్పష్టంగా వివరించాలి. కోదండం అని అనమంటే కోడండం అంటారు. తాతను టాట అంటారు. వీటిని సరిజెయ్యాలి. చిన్నప్పట్నించీ ఇంగ్లీషు వాతావరణంలో మసలిన వారు, అంటే ఇంగ్లీషు మూర్ధన్యాలు అలవాటై నందున, తెలుగు దంత్యాలను పలకటం కోసం కాస్త కష్టపడాల్సి వస్తుంది. ఇంగ్లీషుకు, తెలుగుకు వాక్యనిర్మాణంలో గల తేడాలు, అంటే ఇంగ్లీషులో వాక్యం కర్త, క్రియ, కర్మ వరసలో ఉంటే, తెలుగులో కర్త, కర్మ క్రియ వరుసలో ఉంటుంది, కూడా వివరించాలి.

బోధకుడూ విద్యార్థులూ పరస్పరం పాలు పంచుకుని బోధనా అభ్యాసాలనుచేసేలా నేటి బోధనా పద్ధతి ప్రేరేపిస్తుంది.

తెలుగును ఎలా నిలుపుకోవాలి

మాతృభాష అంటే తల్లి మాట్లాడే భాష అని ఇంతకు ముందే అనుకున్నాం కదా. అసలు తల్లి భాష ఎలా అవుతుందో కాస్త వివరాల్లోకి వెళితే -పదహారు వారాల (నాలుగో నెల) గర్భస్థ శిశువుకు అంటే పంచేంద్రియాలు రూపొందుతున్న దశలో, తల్లి మాట్లాడే భాష ఆమె శరీర ప్రకంపనల ద్వారా శిశువుకు చేరుతుంది. అలా చేరిన భాష (శబ్దాల పరంపర)ను ఆ దశ నుంచే శిశువు తన మస్తిష్కంలో ప్రక్షిప్తం చేసు కుంటుంది. పుట్టింతర్వాత శిశువు, తల్లి మాట్లాడే భాషను ఆమె పెదవుల కదలికలను గుమనించి తను ప్రక్షిప్తం చేసుకున్న భాషతో అనుసంధానించి అర్థం చేసుకుంటుంది. ఆ భాషా ఈ భాష ఒకటే అయితే శిశువుకు తల్లి మాట్లాడే భాష అతి సులువుగా పట్టుబడుతుంది. ఈ సందర్భంలో తల్లి మాట్లాడే భాష తెలుగైతే, శిశువు మాతృభాష తెలుగవుతుంది. ఆమె తెలుగింటి ఆడపడుచైనా ఇంగ్లీషు మాట్లాడుతుంటే, ఆ శిశువు మాతృభాష ఇంగ్లీషవుతుంది. అలాగే, ఇంట్లో అందరూ ఇంగ్లీషు మాట్లాడే వాతావరణం వుంటే, అలా తెలుగు తరతరాలకు దూరమవుతుంది.

కృతయుగంలో ప్రహ్లాదుడు తల్లి (లీలావతి) గర్భంలో ఉన్నప్పుడే విష్ణువు గురించి నారదముని ద్వారా తెలుసుకుని, పుట్టిం తర్వాత విష్ణు భక్తుడు అయిన సంగతి, ద్వాపరయుగంలో అభిమన్యుడు, తల్లి (సుభద్ర) గర్భంలో ఉన్నప్పుడే తండ్రి (అర్జునుని) ద్వారా పద్మ వ్యూహ ప్రవేశం గురించి తెలుసుకుని, పుట్టిన తర్వాత కురుక్షేత్ర యుద్ధంలో పద్మ వ్యూహ ప్రవేశం చేసిన సంగతి (భాగవత, మహాభారతాల ద్వారా) మనకు తెలిసినదే.

అందుకే గర్భిణీ స్త్రీలు నాలుగో నెల నుంచే ఇంట్లో తెలుగులో మాట్లాడాలి. పిల్లలు పుట్టిన తర్వాత వాళ్లతో తెలుగులోనే మాట్లాడాలి. కథలు చెప్పాలి. నిజానికి ఇవన్నీ పిల్లలకు ఉమ్మడి కుటుంబాలలో అయితే నాన్నమ్మల తాతయ్యల ద్వారా అప్రయత్నంగా సహజంగా వచ్చేవే. అయితే ఇప్పటి చిన్న కుటుంబాల హయాంలో పిల్లలు వీటిని కోల్పోతున్నారు. కాబట్టే పిల్లలు తెలుగు నేర్చుకోవటంలో తల్లిదండ్రుల సహాయ సహకారాలు ఎంతో అవసరం. ఇంట్లో సాధ్యమైనంతవరకు పెద్దలు తెలుగు మాట్లాడటం చేయాలి. భోజనాల బల్లపద్ద అందరూ కలిసి భోంచేస్తూ తెలుగులో ముచ్చటించుకోవటం, పెద్దలు తమ చిన్ననాటి విశేషాలు, బంధువుల సంగతులు చెప్పటం, ఇంటికి తెలుగు స్నేహితులు వచ్చి నప్పుడు పిల్లలను కాస్సేపు కలుపుకుని తెలుగులో మాట్లాడటం చేస్తూ ఇంట్లో తెలుగు వాతావరణాన్ని కలిగించాలి.

తెలుగు మాట్లాడితే పిల్లలకు ఇంగ్లీషు రాదేమోనని భయపడటం అనవసరం. ఎందుకంటే, పిల్లలకు అనుకరణ శక్తి ఎక్కువ. వారు దానితోనే అన్ని విషయాలను నేర్చుకుంటారన్న సంగతి మనకు తెలిసిందే. అలాగే వారు ఒకేసారి రెండు మూడు భాషలు నేర్చుకోగలరు. అయితే వచ్చిన చిక్కల్లా, చిన్నప్పుడు నేర్చుకున్న కొన్ని విషయాలను ఎక్కువ కాలం వాడకపోతే, పిల్లలు (పదీ పన్నెండు సంవత్సరాల వయసులో) (తమ మెదడులో మరోచోటకు మార్చుకుని మరీ మరచిపోతారుట. (సిఎన్ఎన్, డాక్టర్ సంజయ్ గుప్తా) అంటే, డెస్క్‌టాప్‌పై కొంతకాలంపాటు వాడని ఫైళ్ళను, ఫోల్డర్లను తీసేయమంటారా? అని అడిగి కంప్యూటర్ (మనం ఒప్పుకోగానే) వాటిని 'నిరుపయుక్త ఒరలోకి' మారుస్తుంది కదా! అలా అన్నమాట. ఇలా జరక్కుండా ఉండాలంటే, ఇంట్లో ఎప్పుడూ తెలుగును మాట్లాడుతూండాలి.

పండగలకు పబ్బాలకూ జరిగే తెలుగు సమావేశాలు, సాంస్కృతిక, సారస్వత సభలు, పదవిజ్ఞాన పోటీలు వంటి కార్యక్రమాలు తెలుగు భాషాభి వృద్ధికి ఎంతగానో తోడ్పడుతున్నాయి. అలాగే, తెలుగు పత్రికలు, తెలుగు టీవీ కార్యక్రమాలు, తెలుగు సినిమాలు అన్నీ ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా నేర్చుకున్న తెలుగును మరచిపోకుండా అభివృద్ధి చేసుకోవచ్చును.

ఈ భూగోళంలో మనకంటూ ఒక గుర్తింపును కలిగించిన మన మాతృభాషను పరిరక్షించుకోవడం, దాన్ని ముందు తరాల వారికి అందించడం మనందరి కర్తవ్యం కదా!

చివరగా...

బోధన అన్నది ఒక కళ, ఒక వృత్తి. ఆ వ్యాపకంలో ఉన్నవారు పరిపూర్ణత కోసం నిరంతరం సాధన చెయ్యాల్సిందే. బోధకుడు (బోధకుడు /బోధకురాలు) ఎంత నేర్చుకుంటే అంత బాగా బోధించగలడు. ఆ కళలో రాణించగలడు. ఈ వ్యాసంలో చెప్పిన విషయాలు ముందే పేర్కొన్నట్టుగా, బోధన గురించి పరిచయం మాత్రమే. దీని పరిధి పరిమితమైనందున ఒక్కో విషయాన్ని విపులంగా చర్చించే అవకాశం లేదు. అలాగే, భాషా శాస్త్ర పద్ధతిలో ద్వితీయ భాషా బోధన చేస్తున్న వారికి ఈ వ్యాసంలో ప్రస్తావించిన విషయాలు కొత్తగా అనిపించకపోవచ్చు. కానీ, మిగతా వారికి ఇది మార్గదర్శకంగా ఉపయోగపడితే ఆశించిన ఉద్దేశ్యం ఫలించినట్లే.

కొసమెరుపు

ఈ వ్యాసాన్ని పూర్తి చేస్తున్న సమయంలో 'ఇంగ్లీష్ ఛానల్ ఈదాల్సిందే' (ఈనాడు ఆదివారం, 03.06.05) వెబ్‌లో ఒక వ్యాసం ప్రచురితమైంది. ఇంగ్లీషు రాకపోతే, ఎంత చిన్నచూపో? ఎంత వెనకబడ తామో? ఎంత నష్టమో? సోదాహరణంగా ఇందులో రచయిత (శ్రీ వంగీపురం శ్రీనాథాచారి) వివరించారు. అలాగే, ఆంధ్రజ్యోతి (03.10.05) లో 'అయ్యో... తెలుగు-సంస్కృతాన్ని ఆశ్రయిస్తున్న తెలుగు విద్యార్థులు' అన్న ఆన్‌లైన్ వ్యాసం వచ్చింది. ఇందులో ఇంటర్ చదువుతున్న విద్యార్థులలో 50 శాతం మందికి పైగా తెలుగు చదవటమే రాదు. వారిలో చాలా మందికి తెలుగు పలకటం సరిగా రాదు. సంస్కృతానికి పెద్దపీట వేస్తున్నారంటూ ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షల సందర్భంగా ఒక సర్వే నిర్వహించి ఆ నివేదికను ప్రచురించారు. వీటిని చదివింతర్వాత ఇలా అనిపించింది-

ఇక్కడ అమెరికాలో మనం
తెలుగు నెలా నిలుపుకోవాలాని తపన పడుతుంటే!
అక్కడ ఆంధ్రలో మనవారు
ఆంగ్లాన్నెలా ఆపుకోవాలాని ఆందోళన పడుతున్నారు
తెలుగు విద్యార్థులేమో సంస్కృతం చదివితే
నూటికి నూరు మార్కులంటూ ఆరాటపడుతున్నారు.
అంటే ఇక అమెరికాకి
తెలుగు తల్లి కూడా వలస వస్తుందా!!?
జై! తెలుగు తల్లి!!

ఆచార్య పేర్వారం జగన్నాథంగారి అభిప్రాయంలో మాతృభాష అంటే "భాష పరస్పరం ఒకరి భావాలు మరొకరికి తెలుపడం కోసం సమాజం ఏర్పరచుకున్న ఒక వ్యవస్థ. ప్రతి జాతికీ తమ ప్రాకృతిక, సామాజిక, సాంస్కృతిక నేపథ్యం నుంచి ఒక ప్రత్యేకమైన భాష ఏర్పడుతుంది. అది వాళ్ల మాతృభాష అవుతుంది. అది వాళ్ళ సాంస్కృతిక చిహ్నమవుతుంది. భాష ఒక జాతి ఉనికిని కాపాడే ఊపిరివంటిది. అది లేకపోతే సంస్కృతిలేదు. జాతిలేదు. భాషకింతటి ప్రాముఖ్యముంటుంది కనుకనే దాన్ని కాపాడుకోవడానికి జాతులు పోరాడుతాయి." (మాతృభాష కోసం మహోద్యమం, ఆంధ్రజ్యోతి 02.22.05 మాతృభాషా దినోత్సవం సందర్భంగా). *

(తానా సమావేశాల్లోని సాహితీ సదస్సులో చదివిన ప్రసంగవ్యాసం)

Our Best Compliments to the 15th **TANA** *Conference*

From the Office of

SRINIVASA KODALI, M.D.

SRIDEVI KODALI, M.D.

CHALAKUDY V. RAMAKRISHNA, M.D.

THERESA, SRILATHA & SCHAUM

15645, Farmington Road
Livonia, MI 48154
Phone: (734) 422-4748
Fax: (734) 422-5076

అమెరికా తెలుగుదనానికి కథన రూపం

అఫ్సర్

అమెరికా తెలుగు కథల్లో ప్రధానంగా రెండు రకాల తేడాలున్నాయి. ఒకటి - అమెరికాలో ఉన్న తెలుగు రచయితలు రాసిన కథలు. రెండు - అమెరికా తెలుగు జీవితాన్ని గురించి రాసిన కథలు. మొదటిరకం రచయితలు భౌతికంగా అమెరికాలో ఉన్నా, కథల్లో ఆ అమెరికాతనం కనిపించనివ్వరు.



ఇల్లు ఇల్లనియేవు
నీ ఇల్లు ఏది తుమ్మెదా?

అన్న తత్వం ఎప్పుడో వినే ఉంటాం. అందులో చాలా తత్వం ఉందని ప్రవాసంలో ఉంటేనే కానీ అనుభవంలోకి రాదు, బోధపడదు. ప్రవాస భావనలో ఇల్లు అంటే మాతృభూమి అని విడమరచి చెప్పక్కర్లేదనుకుంటాను. సొంత దేశంలో ఉన్నప్పుడు ఇల్లు కేవలం ఒక భావన కాదు, అనుదిన అనుభవాల కేంద్ర బిందువు. సమిష్టి కుటుంబాలు ఎంతగా చెదిరిపోయినా, అక్కడ ఇల్లు అంటే భార్యాభర్తలు, పిల్లలు మాత్రమే కాదు. ఇద్దరివైపులా చుట్టాలు, కుటుంబ స్నేహితులతో ఒక కలకలం. ఒకే ఇంట్లో ఉండే కాలంపోయినా, ఒకే ఊళ్ళోనో, వేరే ఊళ్ళోనో కాదంటే ఒకే దేశంలోనో ఉన్నామన్న దగ్గిరతనం అనుభూతిస్తాం. ప్రవాసజీవితంలో మొట్టమొదటి గా చెల్లాచెదురయ్యేది ఈ ప్రాథమిక భావనే. ప్రవాసంలో ఇల్లు సకల సౌకర్యాలతో నిండి, భౌతికంగా నిండుగా కనిపిస్తుంది. కాని, ఒక మానసికమైన ఖాళీతనం ఏదో ఎప్పుడూ మిగిలి పోతుంది.

ఈ ఖాళీని నింపుకునే ప్రయత్నంలో ప్రవాసులు ఒక ఊహాత్మకమైన సామూహికతనీ, సాంస్కృతికతనీ, సృష్టించుకుంటారు. సొంత దేశంలో మిగిలిన కుటుంబసభ్యుల రాకపోకలూ, కలబోతలు, పండగ హడావుళ్ళు, ఇతర సాంస్కృతికమైన కలకలాన్నంతా భర్తీ చేయడానికి ఇక్కడ ఊహలే ఆసరా. ఈ ప్రవాస ప్రపంచంలో ఇంటర్నెట్, టెలిఫోన్, కాస్త తెలుగువాళ్ళు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వేళావిశేషం తప్పి జరుపుకునే ఉగాదులూ, సంక్రాంతులూ, దీపావళులు వ్యక్తిగతంగా మనం అనే తృప్తినిస్తాయి. ఇది ఇంకాస్త విస్తృతరూపంలో ఇంటర్నెట్ (రచ్చబండ)గా మారుతుంది. నలుగురూ కలుసుకునే లిటరరీ క్లబ్‌లు, ఇంకా విస్తృతరూపంలో ఈమాట.కామ్, తెలుగుపీపుల్.కామ్, సుజనరంజని ఈ-పత్రికలుగా మారుతాయి. ఇక అచ్చు రూపంలో అప్పుడప్పుడూ వెలువడే అమెరికా తెలుగు పత్రికలు, ఇటీవల నెలనెలా వెలువడుతున్న తెలుగునాడి ఈ విధమైన సాంస్కృతికమైన వాతావరణాన్ని కల్పిస్తాయి. ఏడాదికోసారి జరిగే తెలుగుసభలు పాపులర్ సాంస్కృతికతని నిలబెడతాయి. వీటన్నిటిలోనూ బలంగా కనిపించే/వినిపించే వేదన ఇంటికి సంబంధించిందే కావడం చాలా సహజం. తెలుగుదేశంలో ఇప్పుడు చాలా బలంగా ఉన్న కథాధోరణికీ, అమెరికా తెలుగుకథకీ తేడా ఈ భావన నుంచే మొదలవు తుంది.

ఏ భావనా ఒక స్థిరబిందువు కాదు. అలాగే సంస్కృతి కూడా. అమెరికాలో మొదటితరం తెలుగువాళ్ళు అడుగుపెట్టిన తర్వాత అమెరికా ఎంతమారిందో, తెలుగుదేశం కూడా అంతగా మారింది. మొదటితరం తెలుగువాళ్ళు ఇప్పుడు తెలుగుదేశం వెళ్తే, వాళ్ళు మాట్లాడే భాష నుంచి ఈ మార్పు మొదలవుతుంది. మార్పుని సూచించే మొదటి సంకేతం భాష. మొదటితరం అమెరికా తెలుగువాళ్ళు మాట్లాడే తెలుగు ఇప్పుడు తెలుగుదేశంలో లేదు. కనీసం సంప్రదాయ కుటుంబాలు కూడా ఆ తెలుగు మాట్లాడవు. ఇక దూరదర్శన్‌లు, చానెళ్ళ సంగతి చెప్పక్కర్లేదు. మితిమీరిన ఇంగ్లీషు పదాల వాడకం, అసలు తెలుగువాక్యం నిర్మాణమే మారిపోయిన తీరు మొదటితరం అమెరికా తెలుగువాళ్ళకి ఆశ్చర్యం కలిగిస్తాయి. ఇప్పుడు తెలుగుకథల్లో వాడుతున్న తెలుగుభాషనీ, చెరుకూరి రమాదేవి, పెమ్మరాజు వేణుగోపాలరావు, చిమటా కమలలాంటి ముందుతరం అమెరికా తెలుగు కథకులు వాడుతున్న భాషని గమనిస్తే ఈ తేడా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. పోల్చి చూస్తే, మొదటితరం అమెరికా తెలుగు కథకులు తక్కువ ఇంగ్లీషు వాడుతున్నారని మనకు ఇట్టే తెలిసిపోతుంది. జాగ్రత్తగా గమనిస్తే,ఈ కథకులు అప్పటి వాళ్ళ ఇంటి భాషని తమ కథల్లో వాడుతున్నారని కూడా మనకు అర్థమవుతుంది. కాని, ఆ ఇల్లు వాళ్ళు అమెరికా రాకముందు ఇల్లు. ఇప్పటి ఇల్లు అలా లేదన్న వాస్తవికతను అమెరికా తెలుగు కథకులు గుర్తిస్తున్నారా? గుర్తిస్తే, ఈ తేడాల్ని వాళ్ళు ఎంతవరకు కథల్లోకి తీసుకు వస్తున్నారు? ఇన్ని తరాల అమెరికన్ సాంస్కృతిక సాహచర్యం తర్వాత అమెరికా తెలుగుదనం అంటూ

విడిగా ఏమైనా ఏర్పడిందా? బయటి అమెరికన్ ప్రపంచానికీ, ఇక్కడి తెలుగింటికి మధ్య ప్రభావాలు ఎలా పనిచేస్తాయి? మొదటి ప్రశ్నకి సమాధానం వెతుక్కుంటున్న సమయంలోనే అక్కిరాజు భట్టిప్రోలు కొత్త కథ అంటుకొమ్మ ఈ ఏడాది మార్చి తెలుగునాడి సంచికలో పునర్ముద్రిత మైంది. ఈ కథలో మారిపోతున్న ఊరి వాతావరణం అద్దం పట్టినట్టుగా చూపించారు. వాటి మీద వివిధ తరాల ప్రతిస్పందనల్నీ, వ్యాఖ్యల్ని కూడా కథానుగుణంగా ఒదిగేట్టు ఇమిడ్చారు. ఈ మార్పు అక్కడి వాళ్ళకీ, ఇక్కడి వాళ్ళకీ ఎలా అనిపిస్తోందో, కనిపిస్తోందో కూడా కథలో మనం పరిశీలించ వచ్చు. చాలా సాదాసీదా దృశ్యాలు, సంభాషణల మధ్య మారిపోతున్న ఊళ్ళకి సంబంధించిన చాలా సున్నితమైన అంశాల్ని ఈ కథ చర్చిస్తుంది. అందులో వ్యవసాయం మొదలుకొని మత సమస్య దాకా వస్తాయి. ఇలాంటి కథలు రెండు ప్రాంతాల మధ్య మారుతున్న పరిస్థితుల్ని గురించి ఒక వాస్తవికమైన కోణాన్ని పాఠకుడి ముందు ఉంచుతాయి. అయితే, ఇంత వాస్తవికతని కథల్లోకి తీసుకురావడానికి అమెరికా తెలుగుకథ చాలా దూరాలు దాటి రావాల్సి వచ్చింది.

అమెరికా తెలుగు కథలన్నిటినీ ఒక వరసలో చదివితే, 1980ల నుంచి ఎక్కువమంది కథవైపు దృష్టి సారించినట్టు కనిపిస్తుంది. లేదా 80లకి అటూ ఇటూగా అమెరికాలో అడుగుపెట్టిన తరం కథలో బలంగా కనిపి స్తుంది. 1970ల నాటి రచయితలు ఇంకా ఒక విధమైన సాంస్కృతిక దిగ్భ్రమలో ఉండగానే, భారతదేశంలో చాలా మార్పులు వచ్చాయి. ముఖ్యంగా ఇందిరాగాంధి హయాంలో విధించిన ఎమర్జెన్సీ అనేక విధాలుగా కనువిప్పు కలిగించిందనుకోవాలి. పెరిగిపోతున్న నిరుద్యోగం, ఆర్థిక అవ్యవస్థ, రాజకీయ అవినీతి, అభివృద్ధిలోని అసమానతలు... ఇలాంటి బయటి పరిస్థితులు డయాస్పోరా జీవితాన్ని ప్రభావితం చేశాయి. ఇలాంటి వ్యత్యాసాలు చాలా ఆలస్యంగా కానీ సాహిత్యంలో ప్రతిఫలించలేదు. మొదటితరం కథలకీ, 80లకి కాస్త ముందూ, ఆ తర్వాతి తరం కథకులకీ వ్యత్యాసాలు కూడా ఎక్కువ. అమెరికా తెలుగుకథ పరిధి బాగా విస్తరించింది కూడా ఈ తరం రాయడం మొదలెట్టిన తర్వాతనే! అంతకుముందు తరాల రచయితలు కథలోనూ, కథనంలోనూ ఇంటివైపు ఎక్కువ దృష్టి పెట్టారు. ఈ తరం రచయితలు ఇంటి పరిధిని దాటి, ప్రపంచమార్గాన్ని అనుసరించారు. ఆ ప్రయత్నంలో ఈ కథ ప్రయోగాత్మకతనీ, కొత్త రాజకీయ ప్రాధాన్యాన్ని కూడా అందుకుంది. ఈ కోణానికి సంబంధించిన పరిణత రూపం సెప్టెంబరు 2001 తర్వాత వచ్చిన కథల్లో బలంగా కనిపి స్తుంది. ఈ పరిశీలనలో నేను ప్రధానంగా ఈ అయిదారేళ్ళ కథల్నే తీసు కుంటున్నాను. అంతకుముందు తరాల కథల్ని కూడా ఈ అయిదారేళ్ళ కథలు తీసుకువచ్చిన మార్పుల నేపథ్యంలోనే పరిశీలిస్తాను. అంతకు ముందు కథా సంప్రదాయం కొనసాగింపు ఎంత పరిమితంగా ఉందో చెప్పడానికే ఆ పాత ఉదాహరణలు.

అమెరికా తెలుగు కథల్లో ప్రధానంగా రెండు రకాల తేడాలున్నాయి. ఒకటి - అమెరికాలో ఉన్న తెలుగు రచయితలు రాసిన కథలు. రెండు - అమెరికా తెలుగు జీవితాన్ని గురించి రాసిన కథలు. మొదటిరకం రచయితలు భౌతికంగా అమెరికాలో ఉన్నా, కథల్లో ఆ అమెరికాతనం కనిపించనివ్వరు. ఉదాహరణకి విశ్వనాథ అచ్యుతదేవరాయలు, దామరాజు సచ్చిదానందమూర్తి లాంటి రచయితలురాసిన వ్యాకరణము వారు, మా బాబాయి ముచ్చట్లు. ఈ కథల్లో కొత్తరకం కథనం ఉంది. కాని, కొత్తబతుకు కనిపించదు. వ్యాకరణమువారు కథ అచ్చంగా తెలుగు కథ. ఆ మాటకొస్తే, అది కాశీ కథ. కాశీలో ఆనాటిచదువులు అలా ఉండేవని చక్కగా అర్థమవు తుంది. కొత్త ప్రదేశంలో చదువుల కోసం ఈ కథలో శాస్త్రి పడే తపనని ఎంతో కొంత వేరే ప్రదేశాలకు వర్తించుకోవచ్చు. అయితే, ప్రవాసాంధ్ర కథగా దీన్ని చెప్పుకోవచ్చు. (అమెరికా తెలుగుకథ మొదటి సంకలనంలో ముందుమాటలో వంగూరి చిట్టెన్ రాజు చేసిన ప్రవాసాంధ్రుల వర్గీకరణ ప్రకారం ఈ కథ రెండో వర్గంలోకి వస్తుంది. అంటే భారతదేశంలో ఇతర రాష్ట్రాల్లో నివసిస్తున్న తెలుగువారి గురించి అన్నమాట.) ఈ తరహా కథలు మనం ఒకసారి గతంలోకి వెళ్ళి రావడానికి, ఒక్కోసారి రావడానికి ఇష్టపడని తనాన్ని అలవాటు చేస్తాయి. వ్యాకరణమువారి కాశీ విజయాలు చదువు తుంటే, పోయిన శతాబ్దాల మీద కాసేపు మనసు మళ్ళుతుంది. అయితే, దీని కథనం మాత్రం ఈ కాలంలో నిలబడుతుంది. ఆద్యంతం చదివించే గుణం, పాత్రల వ్యక్తిత్వంలోని సున్నితత్వాలు, అంతరంగ సంఘర్షణ ఇందులో కొత్త లక్షణాలు.

రెండో కథ మా బాబాయి ముచ్చట్లు. పూర్తిగా తెలుగు కథ. ఆ కథకీ, రచయిత అమెరికన్ అస్తిత్వానికీ సంబంధం లేదు. ఆ కథ అమెరికన్ తెలుగు పాఠకుడికి కొత్తగా చెప్పేదేమీ లేదు. కాకపోతే, ఇక్కడి కంటే ఇంట్లో అంటే తెలుగుదేశంలో ఆ కథ బాగా గెలుస్తుంది.

ఈ రెండు రకాల కథలకు పాఠకులు కేవలం మొదటితరం అమెరికన్ తెలుగువాళ్ళే. ఈ తరం (అంటే కనీసం 70ల తర్వాతి) పాఠకులకు ఇంత నాస్తాల్జియా ఉందని నేను అనుకోవడం లేదు. అంటే, ఇంటికి సంబంధించి ముందు తరం అమెరికన్ తెలుగువాళ్ళకీ, 80ల తర్వాతి తరంవాళ్ళకీ ఆలోచనల్లో వచ్చిన మార్పు చిన్నదేమీ కాదు. ఈ మార్పుకి అనేక కారణాలున్నాయి. మొదటి కారణం - స్వదేశీ, జాతీయత దేశభక్తి అన్న వాటికి అర్థాలు మారిపోవడం. వాటికి పాలకులు ఇచ్చిన నిర్వచనాల్ని పాలితులు నిరాకరించడం. ముఖ్యంగా ఎమర్జెన్సీ తర్వాత ఈ భావనలన్నీ మారిపోయాయి. ప్రభుత్వాలు నూరిపోసే దేశభక్తి మీద నమ్మకం పోయింది. అయితే, ముందే అమెరికా చేరుకున్న తెలుగువాళ్ళలో ఇంకా ఆ పాత భావనలు గడ్డ కట్టుకునే ఉన్నాయి. నిజానికి ఇంటి పట్టాన ఉన్న తెలుగువాళ్ళ కంటే, ఇల్లు దాటిన తెలుగువాళ్ళకి దేశభక్తి, దైవభక్తీ రెండూ కాస్త ఎక్కువే. అలాగే, కుటుంబాన్ని గురించిన భావన కూడా! ఈ మార్పుల్ని అర్థం చేసుకోలేకపోతే, 80ల తర్వాతి అమెరికా తెలుగు కథకులు కథల్లో చూపిస్తున్న జీవితం మనకు అర్థమయ్యే అవకాశం లేదు. అయితే, అంతమాత్రాన అంతకుముందు తరం కథల గౌరవాన్ని తగ్గించడం కాదు. వాటి పరిమితుల్ని గుర్తించడం అవసరం అని చెప్పడం మాత్రమే.

ఉదాహరణకు అమెరికా తెలుగుకథ మొదటి సంకలనంలోని నోరి రాధిక పొరుగింటి పుల్లకూర ఉత్తరం రూపంలో ఉన్న కథ. ఈ కథ ఒక భ్రమనీ, ఒక వాస్తవాన్నీ పక్కపక్కనే చూపిస్తుంది. సాధారణంగా మనలో

ఏర్పడే భావనని కూల్చేసి, దానికి ప్రత్యామ్నాయంగా ఇంకో ఆలోచనని నిర్మిస్తుంది. అయితే, ఈ విధమైన కథనశిల్పాన్ని తర్వాతి కథకులు బాగా పరిణిత స్థాయికి తీసుకువెళ్ళారు. ఇదే విధమైన శైలిలో సాగే ఆరి సీతా రామయ్య కథ *రెండువారాల శలవు* (1997) దీనికి ఉదాహరణ. రాధిక కథలోని రెండు పాత్రలు భిన్నమైన వాస్తవికల్ని పాఠకుడికి చూపిస్తాయి. అమెరికా తెలుగుదనంలో వస్తున్న మార్పు ఈ కథలో బలంగా వ్యక్తమైంది. తన తరానికీ, తన కూతురి తరానికీ మధ్య ఎంత వ్యత్యాసం ఉందో, దాని సంఘర్షణ ఎలా రొటీన్ అయిపోయిందో ఈ కథలో ప్రతిఫలించింది.

'మావారు పోనీ ఈ రకం జీవితానికి అలవాటు పడ్డారు. కనీసం బేబీనైనా మన సంప్రదాయాల ప్రకారం పెంచుదామన్న నా ఆశ అడియాస లాగానే ఉండిపోయింది...

'ఏ నిమిషంలో ఏ వార్త వినాల్సి వస్తుందో, ఏ ఘడియలో ఏ బురదలో కాలు వేస్తుందో ఏ క్షణంలో ఏ ఆపద మీద పడుతుందో అన్న భయంతో దినదినగండం నూరేళ్ళు ఆయువులాగా రోజులు గడిపేస్తున్నాను.'

ఇలా సాగుతుంటాయి సత్య ఆలోచనలు. తెలుగుదేశంలో పరిస్థితులు ఏమీ మారలేదన్న అమాయకత్వంలో ఉంటుంది సత్య. తన కాలం మాదిరిగానే ఉందనుకుంటుంది. ఇంటికి సంబంధించిన అలాంటి అమాయకమైన ఆలోచనల్ని బద్దలు కొడుతుంది ఇంటి నుంచి వచ్చిన నిత్య ఉత్తరం.

'ఈ పల్లెటూరిలో ఏం మిగిలింది? పనీపాటా లేని అమ్మలక్కల కబుర్లు, ఇరుగుపొరుగుల చాడీలు, ఇంట్లో, పొలంలో చాకిరీ, చదువుసంధ్య ల్లేని పిల్లలు, ఎదుగుబొదుగులేని సంపాదన, సమస్యల సుడిగుండాల్లో చిక్కుపడిన జీవితాలు తప్ప ఏం సుఖం మిగిలిందని?...' అని రాస్తుంది నిత్య.

రెండో కథ *రెండు వారాల శలవులో* ఈ కుటుంబజీవితం ఇంకాస్త సంక్లిష్టం కావడం కనిపిస్తుంది. రాధిక కథలో సత్య ఇంకా తెలుగుదనం చట్రంలో ఉండిపోతే, ఈ కథలో సుమతి అమెరికన్ జీవితంలోనే తన కుటుంబ సమస్యకి ఒక పరిష్కారాన్ని వెతుక్కుంటుంది. అయితే, ఇద్దరి జీవిత పరిస్థితుల్లో చాలా తేడా ఉంది. అంతకంటే పెద్ద తేడా ఇద్దరి ఆలోచనల్లో ఉంది. సుమతి స్పష్టంగా 80ల తర్వాతి పాత్ర. వాస్తవికతని ఇంకా బాగా అర్థం చేసుకోగలిగిన వ్యక్తిత్వం ఆమెది. ముఖ్యంగా కుటుంబ విషయమై స్త్రీల ఆలోచనలు ఎంతగా మారిపోయాయో ఈ రెండు పాత్రల్ని చూస్తే అర్థమవుతుంది. ఈ రెండు కథలు ఉత్తరం రూపంలో ఉండడం రచయితల కథన వ్యూహంలో భాగం. దూరాన్ని మరిచిపోయే ప్రయత్నానికి భౌతిక రూపం ఉత్తరం. సంభాషణల్లో దాచినంత తేలికగా ఉత్తరాల్లో నిజాల్ని దాచలేం. అది ఒక నిర్మొహమాటమైన అంతర్ముఖాముఖి. రాధిక శాస్త్రి *జీవనవాహిని* అనే కథలో చెప్పినట్టు 'ఇంత సుదీర్ఘమైన ఉత్తరం రాస్తున్నా నెందుకో అని ఆశ్చర్యంతో పాటు కొంచెం కలవరంగా కూడా ఉందేమో కదూ! నిజమే నీ ఊహ. నా మనస్సాగరంలో కలిగే తరంగాల ఉధృతాన్ని అరికట్టలేను కానీ నీతో చెప్పుకుంటే కొంత ప్రశాంతత ఏర్పడవచ్చు.' అలా ఒక దూరాన్ని ప్రయత్నపూర్వకంగా చెరిపే చర్య ఉత్తరం రాయడం.

ప్రవాస జీవితంలో కుటుంబవ్యవస్థలో వచ్చే మార్పులు చాలామంది కథకులకి ఆసక్తికరమైన ఇతివృత్తాలు. యార్లగడ్డ కిమీర కథ *వీడిన నీడలు* రెండు విభిన్న సంస్కృతలు మధ్య పొసగనితనం కాపురాన్ని ఎలా ఛిద్రం చేస్తుందో చెబుతుంది. ఈ సమస్యకి సంబంధించిన భిన్నకోణాలు చిమట కమల *అమెరికా ఇల్లాలు*, మాచిరాజు వెంకటరత్నం *అమ్మ*, సుధేష్ణ *మొగుడు కావాలా?*, నిడదవోలు మాలతి *చివురుకొమ్మ చేవ*, పూడిపెద్ది శేషుశర్మ *అగాధం*, రాధికశాస్త్రి *జీవనవాహిని*, ఎర్రమిల్లి దుర్గ *జీవితచక్రం*, మాచిరాజు సావిత్రి *బొచ్చుక్కు* కథల్లో కనిపిస్తాయి.

బయటి ప్రపంచం

వచ్చింది ఉద్యోగరీత్యా కాబట్టి, చాలామందికి బయటి సంబంధాలు వృత్తిపరంగా చాలా ముఖ్యమైనవి. అందులోనూ, పెట్టుబడిదారీ వ్యవస్థ వృత్తి సంబంధాల్నీ, వ్యక్తిగత సంబంధాల్ని రెండింటినీ వ్యాపారంతో ముడి పెడుతుంది. ఆ రకంగా ఆర్థిక సంబంధాలకూ, వ్యక్తిగత సంస్కారం, సంస్కృతికి సంబంధించిన అంశాలకూ మధ్య సంఘర్షణ కూడా తప్పనిసరి అవుతుంది. అమెరికా తెలుగుదనాన్ని ప్రభావితం చేసే అంశాల్లో ఇక్కడి బయటి ప్రపంచం చాలా ముఖ్యమైంది. ఎవరి గదుల్లో వాళ్ళు భద్రంగా ఉన్నట్టే ఉంటుంది కానీ, బయటి ప్రభావాలు బలంగా ఆ గదుల్లోకి జొరబడుతుంటాయి. ముందే చెప్పినట్టు ఈ విషయం కూడా ముందు తరం కథల్లో కంటే ఈ తరం కథల్లో ఎక్కువగా వ్యక్తమవుతుంది. దీనికి సంబంధించిన పరిణత రూపం 9/11 తర్వాతి కథల్లో గాఢంగా చూడవచ్చు. ముఖ్యంగా మత రాజకీయాలు ఈ ధోరణి కథల్లో బాగా కనిపిస్తాయి.

మతం చాలా సున్నితమైన విషయం కాబట్టి, అమెరికా తెలుగు కథకులు చాలా కాలం దాని జోలికి వెళ్ళినట్టు కనిపించదు. 2001కి ముందు మందపాటి సత్యం 1995లో *మతమా, నీ విలువెంత?* అనే కథ రాశారు. ఈ కథలో భిన్నమతాల పెద్దలు వాళ్ళ వాళ్ళ మతాల వ్యాప్తికి పడే పాట్లతో పాటు, మనుషుల నిజమైన అవసరాల్ని గుర్తించకపోవడాన్ని రచయిత చెప్పుకొస్తారు. కిరస్తానీ, ఇస్లాం ఎంత తీవ్రంగా ఈ మతప్రచారం సాగిస్తాయో రెండు పాత్రల ద్వారా చూపిస్తారు. క్రైస్తవం మీద ఈ మాత్రం విమర్శ పెట్టిన కథలు పెద్దగా కనిపించలేదు. అలాగే, మత రాజకీయాల మీద నిశితంగా వ్యాఖ్య చేసే కథ ఇది.

రెండో ముఖ్యమైన విషయం ఉద్యోగ సంబంధాలు, ఆర్థిక ప్రపంచం. ఈ రెండిటి అస్థిరత కథల్లో ఇతివృత్తంగా మారింది. ఆ అస్థిరత స్వభావం లోనూ రెండు తరాల కథల్లో తేడా కనిపిస్తుంది. ముందు తరం రచయితలు సాంస్కృతిక అంశాలకు ఇచ్చినంత ప్రాధాన్యం ఆర్థిక అంశాలకు ఇవ్వలేదనే చెప్పాలి. దానికి కారణం వీసాల పరిస్థితి నిర్దుష్టంగా ఉండడం, ఉద్యోగాల మార్కెట్‌లో పెద్ద పోటీ ఉండకపోవడం కావచ్చు. పోనుపోనూ ఉద్యోగాల మార్కెట్ మారిపోయింది. ఈ స్థితిని బాగా చిత్రించిన కథలు కె.వి.యస్. రామారావు *అదృష్టవంతుడు*, నారాయణస్వామి *తుపాకి*, తాడికొండ శివకుమార్‌శర్మ *విదేశగమనే విద్యాపరదాదేవతా*. రామారావు కథలో వర్ణించిన తరహా అదృష్టవంతులు అరుదుగా ఉన్నా, ఉద్యోగవ్యవస్థ ఎలా ఉందో చెప్పడానికి కొన్ని దాఖలాలు దొరుకుతాయి. రెండో కథ *తుపాకిలో* పోటా పోటీ వ్యవస్థ ఎంత వికృతంగా మారుతుందో ప్రతిబింబిస్తుంది. మూడో కథ *విదేశగమనే*... మరీ ఈమధ్యది కాబట్టి, అందులో ఆ సంక్లిష్టత మరింత స్పష్టంగా రూపుకడుతుంది.

బయటి సంస్కృతి కొందరి జీవితాల్ని విపరీతంగా ఆకర్షిస్తుంది. అప్పటిదాకా తెలుగు సంస్కృతి గురించి సాంప్రదాయకంగా ఆలోచిస్తూ ఉండిపోయిన వ్యక్తి మెటమార్ఫాసిస్‌కి గురవుతాడు వేలూరి కథలో రంగనాథంలా. బిక్కుబిక్కుమంటూ అమెరికాలోకి అడుగుపెట్టిన రంగ నాథం రెండేళ్ళు తిరిగేసరికి 'చచ్చినా గుర్తుపట్టలేరు. అందాకా ఎందుకు? వాళ్ళ అమ్మే గుర్తుపట్టలేదు. జుట్టు బాగా పెంచాడు. పేరు కత్తిరించాడు. 'రేన్గ్' అని. కాల్విన్‌క్లయిన్, బిల్‌బ్లాస్ తప్ప ఇంకేం తొడగడు. పెద్ద విమానం లాంటి కారు అతి చాకచక్యంగా తోలేస్తాడు... పళ్ళ కింద పైపు బిగించి కాఫీమగ్గు చేత్తో పట్టుకుని, అద్దంలో చూసుకు 'రెడ్‌ఫోర్డు'లా ఉన్నానని మురిసిపోతుంటాడు.' ఈ వర్ణన చాలు రంగనాథం భౌతికంగా ఎంత మారిపోయాడో చెప్పడానికి! ఇక మానసికంగా 'రాక్ స్టార్లందరి పేరు వీడికి కంఠతా. వాళ్ళంతా వీడికేదో దగ్గిర బంధువులయి నట్టు మాట్లాడుతాడు. ఇండియాలో పావర్టీ గురించీ, అమెరికాలో పులిట్జర్ ప్రైజు గురించీ చాలా క్రిటికల్‌గా మాట్లాడడం నేర్చుకున్నాడు.' బాహ్య ప్రపంచం తీసుకువచ్చిన ఈ మార్పులు చిన్నాచితకా కాదు. రంగనాథం కొంత విడ్డూరంగా అనిపిం చినా, అలాంటి మార్పు ఎంతో కొంత శాతం వాస్తవమే!

ఈ విధమైన జీవనసరళిని విమర్శనాత్మకంగా వ్యాఖ్యానించడం ముఖ్యంగా ఇక్కడి హాస్యవ్యంగ్య కథల్లో కనిపిస్తుంది. వంగూరి చిట్టెన్‌రాజు కథ అమెరికా మజిలీ, వాహనయోగం. ఆంధ్రలో బోడబ్బాయి అమెరికా రాకకీ, మార్కెట్ ఎకానమీకి ముడిపెట్టి చెప్పిన కథ. ఈ కథలకి నవ్వు నరాలు ఎక్కువ. ఒక్కోసారి అవి ఫట్‌న తెగి, బతుకు విషాదాన్ని చెప్పక చెబుతాయి. హాస్యవ్యంగ్య రచనలు ఇటీవలి కాలంలో విస్తృతంగానే వస్తున్నాయి. వాస్తవికతని వ్యాఖ్యానించడానికి ఇంతకంటే పదునైన రూపం ఇంకోటేదీ లేదు. ఆవిధంగా, అమెరికన్ సంస్కృతినీ, అమెరికా తెలుగు సంస్కృతినీ విమర్శనాత్మకంగా చూడడానికి తెలుగు రచయితలు ప్రయత్నిస్తున్నారు. కంప్యూటరే లోకమవుతున్న సాంకేతిక మాయాజాలంలో సాహిత్యం ఉనికి ఏమిటన్న ప్రశ్నకి సమాధానం వెతికే కథ పెమ్మరాజు వేణుగోపాలరావు మహాస్వప్నం. పురాణ, జానపద కథల పున:కథనం ఈ సందర్భంలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన మరో కథనశైలి. మందపాటి సత్యం తెమీనచా-నమీనచా, వేమూరి వెంకటేశ్వరరావు కుందేలూ-తాబేలూ, పుచ్చా వసంతలక్ష్మి ఆవగింజ ఆంతర్యం దీనికి ఉదాహరణలు.

విప్లవ్ కథలు మరో ముఖ్యమైన కోణాన్ని ఆవిష్కరిస్తున్నాయి. కథనంలో ప్రయోగాత్మకత, దృక్పథంలో కొత్తదనం, అమెరికన్ సంస్కృతిలో కలగలిసిపోయిన పాత్రల సృష్టి విప్లవ్ కథలకి కొత్త వాతావరణాన్ని కల్పి స్తాయి. ఒక్కోసారి అమెరికన్ పాత్రలకీ, తెలుగు పాత్రలకీ మధ్య ప్రవర్తనలో, ప్రతిస్పందనల్లో తేడా గుర్తించడం కూడా కష్టమవుతుంది.

9/11

తారీఖులూ, దస్తావేజులు సాహిత్యం అవుతాయో కాదో కాని, కొన్ని తారీఖులు బతుకు మీద గాఢమైన ముద్ర వేస్తాయి. 9/11 అలాంటి అంకె. అమెరికన్ సాహిత్యంలో అటు పాపులర్ ఫిక్షన్‌లోనూ, ఇటు సీరియస్ ఫిక్షన్ లోనూ దీని చుట్టూ చాలా కథనాలు వచ్చాయి. తెలుగు రచయితలతో పాటు (సింగమనేని నారాయణ ఫిరంగిలో జ్వరం), అమెరికా తెలుగు రచయితలు ఈ సంఘనటకి అటూ ఇటూ జీవనకోణాల్ని ప్రతిబింబించే కథలు రాశారు. ఇలాంటి కథల్లో దూరం ఒక బలమైన ప్రభావం. కచ్చితంగా సంఘటన జరిగే ప్రదేశాల్లోంచి వచ్చిన కథలకూ, సంఘటన పరోక్ష ప్రభావం మాత్రమే పడిన ప్రదేశాల నుంచి వచ్చిన కథలకూ తేడా ఉంటుంది. కన్నెగంటి చంద్ర బతుకు, కె.వి.యన్. రామారావు *9/11*, ఆరి సీతారామయ్య జీతగాళ్ళు. ఈ మూడు కథలూ మూడు దూరాల నుంచి ఆ సంఘటన ప్రభావాన్ని చెబుతాయి. ఇందులో సీతారామయ్య కథనం ఇంటివైపు మళ్ళుతుంది. ఈ మూడు కథల్నీ, సింగమనేని నారాయణ కథని సునిశితంగా పరిశీలిస్తే, ఒక గ్లోబల్ సంఘటనకి ఉండే నాలుగు ముఖాలు కనిపిస్తాయి. ఇది ఇక్కడికి అంటే అమెరికాకి, అక్కడికి అంటే తెలుగు నేలకి ఏర్పడుతున్న కొత్తరకం సంబంధాల్ని (కనెక్టివిటి) చెబుతాయి. 2001 తర్వాతి అమెరికా తెలుగు కథల్లో చాలామటుకు ఈ అనుసంధానం కొత్త రూపాల్లో వ్యక్తమవుతుంది. ఇటీవలి కాలంలో తెలుగు కథల్లో చాలామటుకు అమెరికా గురించిన ప్రస్తావనలు పెరగడం కూడా ఈ సందర్భంలో మనం గుర్తించవచ్చు. అయితే, తెలుగు జీవితంలో ఇప్పుడు అమెరికా కేవలం ఒక ప్రస్తావన మాత్రంగా మిగలడం లేదు. అమెరికా అనేది ఇప్పుడొక భౌగోళికమైన ప్రదేశం కాదు. ఒక కొత్త నాగరికతకి సంకేతం. అదొక గ్లోబల్ అస్తిత్వ భావన. ఇల్లు అనే భావన ఇప్పుడు ఇదివరకంత స్వచ్ఛంగా లేదనడానికి ఇదొక ఉదాహరణ. ఇప్పుడు ఆ ఇంట్లో హారిపోటర్‌ని అభిమానించే పిల్లలు, జెన్నిఫర్ లోపెజ్‌ని ఊహించుకునే యువకులు, డాలర్ల కలల్లో తేలిపోయే కెరీర్ జీవులు, పిజ్జాఘర్‌కి వారానికోసారి అయినా వెళ్ళి రావాలనుకునే దంపతులు... ఇవి ఎంతో కొంత మామూలైపోయాయి. గ్లోబలైజేషన్ గురించి రాసే కథల్లో, కవిత్వంలో అమెరికన్ సంస్కృతినీ, పెట్టుబడి వ్యాపారకాంక్షనీ ఎత్తిపొడిచే రచయితలు, సాంస్కృతిక ప్రతినిధులు కూడా డాలర్ స్వర్గం కోసం తపించిపోవడం అసహజమేమీ కాదు. ఈ నేపథ్యంలో అమెరికా చేరుకునే తరం మొదటితరం తెలుగువాళ్ళలాంటిది కాదు. ఈ తరం ముందే ఒక విధమైన అమెరికనైజ్డ్ వ్యక్తిత్వం ఉంది. ఆహారపుటలవాట్ల నుంచి వేషభాషల దాకా, ఇష్టానిష్టాల నుంచి సంస్కృతి దాకా అమెరికా అనే భావనలో బతుకుతున్న తరం ఇది. 'మేం తెలుగువాళ్ళం... మాది తెలుగు సంస్కృతి' అనే గాఢమైన భావం మొదటితరం వాళ్ళకి ఉండడం ఎంత సహజమో, ఆ పరిమితులు దాటిన ప్రపంచ దృక్పథం ఈ తరం వాళ్ళకి ఉండడం అంతే సహజం. ఇక్కడే పుట్టి పెరిగిన తెలుగుతరానికి అమెరికన్ సంస్కృతికి అలవాటు కావడం అంతే సహజం. ఇక్కడ పుట్టి పెరిగిన తరాన్ని 'ఏబిసిడి' (అమెరికన్ బార్న్‌డ్ కన్‌ఫ్యూజ్డ్ దేశి) అని వెటకారం చేయడం వింటూంటాం. అమెరికాలో పుట్టకపోయినా 'కన్‌ఫ్యూజ్డ్ దేశి' అన్న స్థితికి దగ్గరగా ఉంటోంది ఇంటి పట్టున ఉన్న యువతరం. ఆ తరం నుంచి వచ్చే కథ ఎలా ఉంటుందా అన్నది నా ప్రశ్న.

ఇది ఇంతకుముందులాంటి అనుబంధం కాదనీ, దీని ప్రభావం అక్కడి సాహిత్య సాంస్కృతికతని ప్రభావితం చేస్తోందనీ విడిగా చెప్పక్కర్లేదు. ఈ నేపథ్యంలో తెలుగు కథ, అమెరికా తెలుగు కథ ఏ దిశగా ఈ ప్రయాణం సాగిస్తాయన్నది ఇంకా అచ్చులో చూడాల్సిందే, వెబ్‌సైట్లలో వెతకాల్సిందే! *

(తానా సమావేశాల్లోని సాహితీ సదస్సులో చదివిన ప్రసంగవ్యాసం)

ఛందస్సులో గణిత సౌందర్యం

జొజ్జాల కృష్ణమోహనరావు

ఛందస్సు ఒక అనంతమైన, అపారమైన, అద్భుతమైన, గంభీరమైన మహా సముద్రం. మనం ఈ సముద్రపు ఉపరితలముపై మాత్రమే ఈదుచున్నాము.



పరిచయం

నేను ఉద్యోగరీత్యా ఒక స్ఫటిక శాస్త్రజ్ఞుడిని. ఇందులో సౌష్టవమును (symmetry) ప్రతి దినము చూచుట వాడుక. Shubnikov, Kopstik రచించిన Symmetry in Science and Art అను ఒక పుస్తకం నన్ను ఆకర్షించినది. పద్యములలో సౌష్టవపు పాత్రను గురించిన అందులోని కొన్ని పుటలు నా దృష్టిని తెలుగు ఛందస్సువైపు త్రిప్పినవి. దీనితో పాటు ఛందస్సులోని గణిత శాస్త్రాంశములు కూడ నన్ను చకితుడిని చేసినవి.

ఛందస్సు ఆరు వేదాంగములలో నొకటి. అది వేదపురుషుని పాదములను సూచించును. వేదభాషను కూడ ఛందస్సు అనెదరు. తెలుగు ఛందస్సులో సంస్కృత ఛందస్సు యొక్క సిద్ధాంతములు కూడ మిళితమైనవి గనుక, సంస్కృత ఛందస్సులోని కొన్ని అంశములను పరిశీలించుట యుక్తమే. వేదములలోని ఛందస్సు వైదిక ఛందస్సు, కావ్య నాటకములలో ప్రయోగించబడిన ఛందస్సు లౌకిక ఛందస్సు. సూర్యునికి సప్తాశ్వుడని ఒక పేరున్నది. అతని సప్తాశ్వములు ప్రతి పాదములో క్రమముగా ఆరు నుండి పండ్రెండు అక్షరములు గల ఈ ఏడు ఛందస్సులట - గాయత్రి, ఉష్ణిక్, అనుష్టుప్, బృహతి, పంక్తి, త్రిష్టుప్, జగతి. సంస్కృతములోని కొన్ని వృత్తముల లక్షణములు అగ్ని పురాణము లో గలవు. భరతముని కూడ తన నాట్యశాస్త్రములో ఛందస్సును గురించి ప్రస్తావించెను. ఛందో గ్రంథములలో ప్రసిద్ధి కెక్కినవి పింగళుని ఛంద: శాస్త్రము, కేదారభట్టు వృత్తరత్నాకరము. పింగళుని ఛంద:శాస్త్రమునకు ఒక కథ ఉన్నది. అదేమనగా - శివుడు పార్వతికి ఛందస్సు పైని అంశము లను విశదీకరించెనట, దానిని దగ్గరనున్న నందీశ్వరుడు వినెనట. నంది ద్వారా పింగళుడు విన్నాడట. అనగా పింగళుని వాక్కులు దైవవాక్కునకు సమానమని అర్థము.

తెలుగు ఛందో వికాసము

తెలుగులో మొట్టమొదటి ఛందో గ్రంథము కవిజనాశ్రయము. దీని రచయిత మల్లియ రేచన. ఇతడు నన్నయభట్టునకు తరువాతి వాడని చాలామంది పండితుల అభిప్రాయము. కాని కొందరు ఇతడు నన్నయకు పూర్వుడని కూడ తలతురు. ఈ జైనకవి అప్పటివరకు వాడుకలో నున్న పద్యముల లక్షణములను సేకరించి ఈ గ్రంథములో వ్రాసెను. ఆదికవి నన్నయకు ముందుగా పద్యములు లేవని మనము తలచరాదు. నన్నయకు ముందు శిలా శాసనములలో చెక్కబడిన పద్యములనేకములు గలవు. తాళపత్ర గ్రంథములు కొన్ని వందల సంవత్సరములకు శిథిలమగును గనుక, వాటిపై రచించబడిన పద్యములు నన్నయకు పూర్వమింకెన్ని యుండెనో! శిలాశాసన పద్యములలో అతి పురాతనమైనది ఒక తరువోజ. తరువోజకు పిదప అక్కరలు, కందము, సీసము, ఆ పిదప మాలా వృత్తములు శిలలపై చెక్కబడినవి. ఈ శిలా శాసనములు తెలుగు భాష, ఛందస్సు, చరిత్రలను గురించి మనకు పలు పాఠములను నేర్పును. తెలుగు లక్షణకారులు, కవులు, సంస్కృతం నుండి, కన్నడం నుండి విరివిగా సిద్ధాంతములను తెలుగులోనికి తెచ్చుకొని వారికి ఒక క్రొత్త తెలుగుదనాన్ని కలిగించిరి. తెలుగు ఛందస్సు కన్నడ, సంస్కృత, దేశి ఛందో తరంగిణుల ఒక త్రివేణీ సంగమం అనుటలో అతిశయోక్తి లేదు.

సంస్కృతంలో వలె కాక తెలుగులో ప్రాస కలదు. ద్వితీయాక్షరమైన ప్రాసను ఇతర ద్రావిడ భాషల వలె తెలుగు కూడ అనుకరించినది. ప్రాస అన్ని వృత్తములలోని పాదములలో ఒకే హల్లుతో కూడి ఉండవలయును. తెలుగు ఛందస్సు యొక్క పరాకాష్ట యతి నిర్ణయం. సంస్కృతంలో యతి విరామస్థానం మాత్రమే. కన్నడంలో ఇది ఐచ్ఛికం, సామాన్యంగా పాటించబడదు. తెలుగులో వడి నియతము. ప్రతి పాదంలోని మొదటి అక్షరము అదే పాదంలోని మరొక అక్షరంతో లేక ఇక కొన్ని అక్షరములతో స్వరవ్యంజన సంబంధమును కలిగించుకొనుట వడి యగును. వడి అను పదము వళి (అనగా ముడుత) నుండి వచ్చినది. కాలక్రమేణ వాడుకలో యతికి వడికి భేదము నశించి వడి అను అర్థములో యతిని ఉపయోగించుట వాడుకయైనది. పద్యపు రామణీయతను యతి అధికము చేయును. ఇది దీని ప్రయోజనము. కాని ఊత

పదములను, అనవసర పదములను యతికై ఉపయోగించుట దీనికి నష్టము. ఇట్టి ప్రయోగము పద్యపు అందమును తక్కువ చేయును. లాభమైనగాని, నష్టమైనగాని, నన్నయ నుండి విశ్వనాథ సత్యనారాయణ, జాషువాల వరకు కవులందరు యతిని వాడిరి. అది పద్యములను ఎక్కువగా సౌందర్య వంతము చేసినదనియే చెప్పవచ్చును.

ఛందస్సులోని కొన్ని గణిత శాస్త్రాంశములు

1) తెలుగులో ప్రతి అక్షరము ఒక గురువు లేక లఘువు. ఒక రెప్పపాటు కాలమునకు మాత్ర అని పేరు. ఒక మాత్రాకాల పర్యంతము లఘువు (I), రెండు మాత్రల కాలము ఒక గురువు (U) . రెంటి కన్న ఎక్కువ మాత్రలకు ప్లుతము అని పేరు. పద్యములు సామాన్యముగా చతుష్పదులు. పద్యాక్షర ములన్నియు గురులఘువులే. [1]If a line consists of n letters, there are only 2^n ways of obtaining this line in terms of gurus and laghus. The number of mAtras in this line lies between n and 2n. The number of lines that have a particular number of gurus and laghus is given by the binomial coefficient in the expansion[2] $(g+l)^n$, where g is a guru and l is a laghu. The concept of binomial theorem seems to be evident to prosodists during the time of Pingala and others. In the simple case, when n = 3, the coefficient of g^3 and l^3 are 1, corresponding to one with all gurus (UUU - మ) and one with all laghus (III - న), the coefficient of g^2l and gl^2 are 3 giving rise to (IUU - య, UIU - ర, UUI - త) and (UII - భ, IUI - జ, IIU - స). The total number of possibilities with n = 3 is thus eight (2^3). 2) పైన ఇచ్చిన ఎనిమిది మూడు అక్షరముల గణములను సౌలభ్యమునకై పింగళుడు ఛందస్సులో ప్రవేశపెట్టెను. మూడు అను సంఖ్య చిన్న సంఖ్యలలో పెద్దది, పెద్ద సంఖ్యలలో చిన్నది. (సంస్కృత బహువచనములో మూడు చాలా చిన్న సంఖ్య) అందువలన ఈ ఎనిమిది గణములను జ్ఞాపకము పెట్టుకొనుటకు వీలగును. య - మా - తా - రా - జ - భా - న - స - ల - గం అనునది ప్రపంచంలో అతి ప్రాచీనమైన ఒక జ్ఞాపక సూత్రము. The number of vRttas for n syllables in a line is 2^n. సంస్కృత, తెలుగు ఛందస్సులలో పాదాక్షరముల సంఖ్య ఇరువది యారింటికి మాత్రమే పరిమితం. ఒకటి నుండి ఇరువదియారు అక్షరముల వరకు గల అన్ని వృత్తముల మొత్తం సంఖ్య 134, 217, 726. మనం ఊహించగల పద్యపు నడకలు, లయలన్నియు ఈ సంఖ్యలో గలవు. ఈ సంఖ్య గల అక్షరములతో కొత్త వృత్తములను కనుగొనలేము, మనం వానికి పేరు పెట్టి ఉదాహరణలను మాత్రమే ఇవ్వ వీలగును. కొత్త వృత్తములు, కొత్త నడకలు, కొత్త లయలు, కొత్త సంగీతము మనలను సదా ఆహ్వానించు చున్నవి. సాధ్యమైన వృత్తములు పది లక్షలలో ఒక వంతు కూడ మనం ఉపయోగించుట లేదు.

పింగళుని తరువాత కొన్ని శతాబ్దములకు, హలాయుధుడు పైన చెప్పిన binomial coefficientsను త్రిభుజాకారంలో అమరించెను. భారతీయ పురాణేతిహాసములలో మేరుపర్వతము చాలా పవిత్రమైనది కావున ఇట్టి అమరికకు మేరు ప్రస్తారము అని పేరు. ఇప్పటి గణిత శాస్త్రజ్ఞులు హలాయుధుని ఈ త్రిభుజమును ప్యాస్కల్ త్రిభుజము (Pascal's triangle) అని పిలిచెదరు. ఉదాహరణకు ఆరవ ఛందము వరకు అమరించదగు మేరు ప్రస్తారమును ఈ త్రిభుజ చిత్రములో చూడ వీలగును. ఆరవ ఛందములో అన్ని లఘువులు గల వృత్తములు ఒకటి, ఒక గురువుగల వృత్తముల సంఖ్య ఆరు, రెండు గురువులు గల వృత్తములు పదునైదు, మూడు గురువులు గల వృత్తములు పదునైదు, నాలుగు గురువులు గల వృత్తములు ఇరువది, ఇట్లే మిగిలినవి. ఈ ఛందములోని మొత్తం వృత్తముల సంఖ్య అరవైనాలుగు. మన ఛందో లాక్షణికులకు వేయి సంవత్సరములకు ముందుగనే binary arithmetic, binomial theorem, Pascal Triangle మున్నగు భావములు కలవు.

1 1
1 2 1
1 3 3 1
1 4 6 4 1
1 5 10 10 5 1
1 6 15 20 15 6 1

నేను ఈ భావములను ఇంకను ముందుకు తీసికొనపోవదలచి, వివిధ సంఖ్యా మాత్రలను ఎన్ని విధములుగా అమర్చవచ్చునో అను విషయమును పరిశీలించితిని. 1, 2, 3, 4, 5, 6, 7, 8, ..., మాత్రలు గురులఘువులతో 1, 2, 3, 5, 8, 13, 21, 34, ... విధములుగ లభించును ఉదాహరణకు ఐదు మాత్రా గణములు ఈ ఎనిమిది విధములుగా లభించును - - IIIII, IIIU, IIUI, IUII, UIII, UUI, UIU, IUU. ఈ సంఖ్యలకు గణిత శాస్త్రములో ఫిబొనాచ్చి సంఖ్యలు[3] (Fibonacci numbers) అని పేరు. ఇది కనుగొన్న తరువాత పుస్తకములను, వ్యాసములను పరిశీలించగా, హేమచంద్రుడను గూర్జర దేశస్థుడు (ఇప్పటి గుజరాత్) సుమారు వేయి సంవత్సరములకు ముందు ఇట్టి అమరికను కనుగొన్నట్లు తెలిసినది. ఈ అమరిక పరిచితమైనను, దీని ప్రభావమును మనం జాగ్రత్తగా పరిశీలించ వలయును. ఛందస్సుకు మాత్రమే కాదు, శబ్దము, ధ్వని, తాళములకు కూడ ఇవి ఎంతయో ఆవశ్యము. Wherever there are patterns of growth and expansion, the Fibonacci sequence makes its appearance. Be it the arrangement of seeds in a sun-flower, the waves in the ocean, the growth of a cyclone, or an icosahedron that some viruses prefer to assume as their shape, this series is present in a latent fashion. Such a symmetry is known as dynamic symmetry.

తెలుగు ఛందస్సులో సంస్కృతము నుండి కొన్ని వృత్తములు, కన్నడము ద్వారా మరికొన్ని వృత్తములు అమలులోనికి వచ్చినవి. ఇవిగాక జాతులకు, ఉపజాతులకు చెందిన పద్యములు మాత్రాగణములతో, అంశ

1. All mathematical and scientific information will be presented in English.
2. $(g+l)^n=g^n+ng^{n-1}l+(n(n-1)/1.2)g^{n-2}l^2+(n(n-1)(n-2)/1.2.3)g^{n-3}l^3+...+ngl^{n-1}+l^n$.

[3] The numbers 1, 1, 2, 3, 5, 8, 13, 21, 34, 55, 89, 144, 233, ... form the Fibonacci sequence. Each number in this series is the sum of previous two numbers. The ratio of two successive numbers in the limit is the irrational number $\phi = 1.6180339887...$

లేక ఉప గణములైన సూర్యేంద్ర చంద్రగణములతో రచించబడునవి. ఇవి ప్రాస నిబద్ధములు. ఉపజాతులకు చెందిన సీసము, గీతుల వంటి పద్యములు ప్రాసలేక సూర్యేంద్రచంద్ర గణ శోభితములు. ఈ గణములు కన్నడములోని బ్రహ్మ-విష్ణు-రుద్ర గణములకు వారసులని చెప్పవచ్చును. గణితశాస్త్రరీత్యా అంశ గణములైన సూర్య, ఇంద్ర, చంద్ర గణములను కూడ విశదీకరించ వీలగును. కాని స్థలాభావము వలన ఈ ప్రయత్నమును చేయదలచుకొనలేదు. కంద పద్యార్ధమును 12,800 విధములుగా వ్రాయ వచ్చును. ద్వితీయార్ధమును కూడ కొన్ని వేల రీతులలో రచించవచ్చును. కావున కందపద్యపు ప్రత్యేక విధములు కొన్ని లక్షలు. వేమన ప్రసిద్ధి చేసిన ఆటవెలదిని 840 లక్షల కన్న అధికమైన విధములుగా వ్రాయవచ్చును. నేను ఈ విషయములను ఎందుకు సంఖ్యలలో చెప్పుచున్నాననగా ఇది మన ఛందస్సు యొక్క వైవిధ్యమును తెలుపును. ఒక్క ఆటవెలది సంపూర్ణ సౌందర్యమును గమనించుటకు ఒక జీవితకాలము చాలదు.

చిత్ర కవిత్వము

కవిత్వము నాలుగు విధములు. ఆశు, మధుర, చిత్ర, విస్తార కవిత్వ ములు. అవధానులు చేయు చమత్కార కవితలన్నియు ఆశువులే. ఉదాహ రణలు, అష్టకములు మొదలగునవి మధుర కవిత్వమునకు చెందినవి. గర్భ బంధాదులు చిత్రకవితలు. అష్టాదశ వర్ణనలతో వ్రాయబడిన ప్రబంధ కావ్యములు విస్తర కవితలు. ఛందస్సులో నా ఆసక్తి రెండు విధములు. అవి చిత్ర కవిత్వము, శాస్త్రీయ రీత్యా నూతన చందములను లయలను కనుగొని ఉదాహరించుట. నా అనుభవములను క్లుప్తముగా విశదీ కరించెదను.

మనుజునికి ఆహారము ఆవశ్యము. క్షుద్బాధ తీరిన పిదప రసన రుచికరమైన, ఆప్యాయమైన వంటకములను కోరును. అదే విధంగా కవికి చిత్రకవిత్వము కూడ. పద్యములకు ఉండవలసిన సామాన్య నియమములైన గణయతిప్రాసలతో పాటు అదనముగా కొన్ని నియమముల నుంచుకొని పద్యములను వ్రాయుట చిత్రకవిత్వమగును. ఈ నియమములు ఎన్నియో విధములు. మచ్చునకు కొన్ని - సర్వలఘువులను, సర్వ గురువులను, ఓష్ఠ్యములను, నిరోష్ఠ్యములను, తలకట్లను మాత్రమే వాడి పద్యములను వ్రాయుట, సర్ప, చక్రాదుల రూప చిత్రములలో పద్యమును బంధించి వ్రాయుట, ఒకే పద్యములో వివిధ లక్షణములు గల పద్యములను గర్భితము చేయుట, ఇత్యాదులు. పదునేడవ శతాబ్దములో దక్షిణ దేశములో నివసించిన గణపవరపు వేంకట కవి రచించిన శ్రీ ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసము ఇట్టి చిత్ర కవితలకు ఒక నిఘంటువు లేక విజ్ఞాన సర్వస్వము అని చెప్పవచ్చును. నేను గర్భ కవిత్వ, బంధ కవిత్వములపై నా దృష్టిని ప్రసరించి కొన్ని పరిశోధనలను సలిపినాను. గర్భ కవిత్వములో ఒకే పద్యములో వివిధ పద్యముల లక్షణములను (గణయతిప్రాసలను) పొందుపరచవలయును. It is trying to compare the sequence of gurus and laghus in two types of poems and see under what conditions we can have them identical. This exercise is similar to the comparison of two DNA or two protein sequences in the field of biological sciences.

నేను ఇంతవరకు రెండు వందలకు పైగా గర్భకవితలను ఉదాహ రించితిని. ఇది ఒక కొనసాగుతున్న ప్రయత్నము.

క్రింద ఒక ఉదాహరణ:

వనరుహ - మ-స-భ-భ-న-న-న-న-గ, యతి (1, 11, 19)

నిన్నే కోరితి నే నీ యిలపై నిలిచితి దలచుచు నిరతము సదయా
సన్నాయయ్యెను సంగీతముతో సలలిత స్వరముల సముదిత హృదయా
కన్నయ్యా మది కౌతూహలయై, కలలిక నిజమగు కలతలు తొలగున్
నన్నీవేళ కనన్ రా వరదా నలినము బ్రదుకగు నగుచును వెలుగున్

కౌతూహల - మ-స-భ-గ యతి (1, 6)

నిన్నే కోరితి నే నీ యిలపై
సన్నాయయ్యెను సంగీతముతో
కన్నయ్యా మది కౌతూహలయై
నన్నీవేళ కనన్ రా వరదా

మణిగణ నికరము - న-న-న-న-స, యతి (1, 9)

మధురగతి రగడ - చ-చ-చ-చ యతి (1.1, 3.1)

నిలిచితి దలచుచు నిరతము సదయా
సలలిత స్వరముల సముదిత హృదయా
కల లిక నిజమగు కలతలు తొలగున్
నలినము బ్రదుకగు నగుచును వెలుగున్

బంధ కవిత్వములో ఒక పద్యమును సర్పము, కత్తి, చక్రము, ఇత్యా దుల చిత్రములలో పొందుపరచుట. ఒకే అక్షరము రెండు చోటులలో వచ్చునట్లు వ్రాయుట ఇందులోని విశేషము. అప్పకవి వంటి లాక్షణికులు ఉదాహరణలను ఇచ్చిరి. నేను కొన్నిటిని గణితశాస్త్ర రీత్యా పరిశీలించు



కుండలినీ నాగబంధము, వృత్తము మణిమాల

Degree of difficulty
= 100 X No. of common letters / No. of letters used
= 31.25

చున్నాను. బంధ కవితలు కవి యొక్క భాషా పటిమకు, చాకచక్యమునకు, సౌందర్యకాంక్షకు నిదర్శనములు. క్రింద ఒక ఉదాహరణ:

మణిమాల - స-జ-స-జ-స-జ-స యతి (1, 11)

సరసాల వేళ, విరసాలు చాలు,
మది పాడె రాగ మురళిన్,
సురగాన మందు ధర తూలె
సోలె, నిట తాళ మాయె హృది, నే
చెరుపంగ జాల, చిర మిత్ర,
చిత్రముల నిందు, కాల మిట దు-
ర్భర మాయె, నేడె హరుసాన
రా, నవ రసాల దీన యలరన్

ఛందస్సు - సంగీతము

ఛందస్సుతో నా సంపర్కపు ముఖ్యమైన ఆశయము సంగీతమునకు పద్యమునకు గల బాంధవ్యమును అవగాహన చేసికొనుట. కవిత్వములో సంగీతము ఎట్లు ఇమిడి యున్నది, ఏయే వృత్తములు ఇట్టి కార్యమునకు దోహదమగును అన్న విషయము నన్ను ఎల్లప్పుడు ప్రశ్నించుచుండును. ఏయే అక్షర, మాత్రా, అంశ గణములు సంగీతమునకు సహాయకారి యగును అనునది మరొక ప్రశ్న. వృత్తములను పరిశీలించి అందులోని లయను కనుగొని క్రొత్త పద్యములను సృష్టించవలయునను భావన దీనికి నాందియైనది. పద్యముల గతి, గమనము, లయలను కవుల, సంగీతకారుల పద్యములలో పాటలలో గమనించి కొత్త నమూనాలను అప్పుడప్పుడు సృష్టించుచున్నాను. లయవృత్తముల నమూనాతో సృష్టించిన వీణానాదము నకు క్రింద ఉదాహరణ:

వీణానాదము - ఏడు పంచమాత్రలు, గుర్వంతమైన చతుర్మాత్ర,
ఒకటి, మూడు, ఐదు, ఏడు గణములకు ప్రాసయతి -

నాదమను నదిలోన నీద రారండోయి మేధస్సు వికసించ మేదినిని వీణా-
నాదమును వినరండి శ్రీదమగు స్వరములను వేదముల తల్లి కడు
హ్లాదమున మీటన్
నాదముల బిందు వది యాది ప్రణవమ్మునకు లేదు సరిలేదు వేరేదియును
లయకున్
నాద మది విజ్ఞాన సాధనకు మార్గమగు ఖేదములు తొలగు నిల
మోదములు గల్గున్

ఇట్టి పద్యములు చదువుకొనుటకు మాత్రమే కాదు, పాడుకొనుటకు కూడా అనువైనవి.

ఉపసంహారము

ఆధునిక కవులు ఛందస్సు కవిత్వమునకు ఒక గుది బండయని, శృంఖలములని తలతురు. వారు తమ ఆధునిక భావములను ఆధునిక ఛందస్సులో రచించిరి. అందులో కొన్ని అంత ఆధునికమైనవేమియు కావు. అవి కూడ ఛందో నియమములను పాటించునవే. వానికి కూడ లక్షణ గ్రంథములలో నమూనాలు గలవు. శ్రీశ్రీ, సిరివెన్నెల వంటి కవుల పాటలకు, పద్యములకు, కవితలకు కొన్ని ఛందోరీతులు గలవు. క్రొత్తదనం కొన్ని భావములలో ఇంతకు ముందు ఉపయోగించిన ఛందస్సులో కనబడును. బహుశా ఏ నియమములు లేని కవితలు వచన కవితలని చెప్పవచ్చును. కాని ఇందులో కూడ పదే పదే మారుచుండు ఒక లయ కనబడుచుండును.

ఛందస్సు ఒక అనంతమైన, అపారమైన, అద్భుతమైన, గంభీరమైన మహా సముద్రం. మనం ఈ సముద్రపు ఉపరితలముపై మాత్రమే ఈదుచున్నాము. కాని ఈ సముద్రగర్భంలో వెలలేని మణి ప్రవాళములు, ఆణిముత్యాలు, శిలలు, సైకత రేణువులు మనకై ఎదురు చూచుచున్నవి. మన మాట ఛందస్సే, మన పాట ఛందస్సే, మన పద్యము ఛందస్సే, మన తాళము ఛందస్సే. భగవంతుని నామస్మరణ గానము సేయునప్పుడు, పరవశించి ప్రకృతి గానము సలుపునప్పుడు, పిల్లలను నిద్రబుచ్చుచు జోల పాడునప్పుడు, ప్రియతమను పిలుచునప్పుడు, శోక బాధలతో సతమత మగుచున్నప్పుడు ఉద్భవించు భావములను స్పష్టీకరించు భాష ఛందస్సే.

ఈ వ్యాసమునుచదివి సూచనల నిచ్చిన పరిశీలకులకు నా కృతజ్ఞతాపూర్వక వందనముల నర్పించుచున్నాను.

REFERENCES

Some useful basic literature to understand more about Telugu prosody and other concepts mentioned in this essay are given below. This is neither exhaustive nor unique.

1. సులక్షణసారము - లింగమగుంట తిమ్మకవి - పరిష్కరణ రావూరి దొరసామి శర్మ - మదరాసు, వావిళ్ళ రామస్వాశాస్త్రులు అండ్ సన్స్, 1950; See also http://www.andhrabharati.com/bh/AshhaChaMdassu/sulakShanasAramu/index.html.
2. ఛందోదర్పణము - అనంతామాత్యుడు - వ్యాఖ్యానము చిర్రావూరి శ్రీరామశర్మ - రాజమండ్రి, రోహిణీ పబ్లికేషన్స్, 1998; http://www.andhrabharati.com/bhAshha/ChaMdassu/ChaMdOdarpaNamu/index.html.
3. ఛంద:పదకోశము - కోవెల సంపత్కుమారాచార్య - పరిష్కరణ దువ్వూరి వేంకటరమణ శాస్త్రి - హైదరాబాదు, తెలుగు అకాడెమీ, 1977.
4. ఛంద:శాస్త్రమ్ - పింగళనాగ - సంపాదకత్వము పండిత కేదారనాథ - ఢిల్లీ, పరిమళ్ పబ్లికేషన్స్, 1994; See also for a downloadable version at http://www.archive.org/details/ChandasSastram.
5. వృత్తరత్నాకర: - కేదారభట్ట - వ్యాఖ్యానము భట్టనారాయణ భట్ట, వారణాసి, చౌఖంభా సంస్కృత సంస్థాన, 1955; See also for a different downloadable version at http://www.archive.org/details/Vritharatnakaram.
6. Symmetry in science and art - A.V. Shubnikov and V.A. Kopstik, Ed. D Harker, translator G.D. Archard, New York, Plenum Press, 1974.
7. The Divine proportion - A study in mathematical beauty - H E Huntley, New York, Dover Publications, 1970.

Note: Numerous examples for chitra kavitva and new metres are explained with examples in the public archives of the Yahoo! Newsgroups Chandassu and racchabanda at
http://groups.yahoo.com/group/Chandassu
http://groups.yahoo.com/group/racchabanda
For questions, comments and suggestions, please contact jkmrao@yahoo.com ✻

రూపం కోల్పోతున్న జానపద కళలు

ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావు

ప్రజల్లో భాగమైన కళలు ప్రదర్శనలకే పరిమితం అవుతున్నాయి. జానపద కళ ప్రభుత్వం ప్రోత్సహిస్తేనో, అవార్డులిస్తేనో, ఉత్సవాలు నిర్వహిస్తేనో బతికేది కాదు. ప్రజల ఆచార సంప్రదాయాల్లోనే దాని ప్రాణం ఉంది.



తెలుగుదనాన్ని పట్టి నిలుపుతున్నది జానపద కళ. ప్రజల సంస్కృతీ, సంప్రదాయాల ప్రతిబింబం ఇది. సామాజిక, ఆర్థిక మార్పుల ప్రభావం జానపద కళల మీద తీవ్రంగానే ఉంది. కొన్ని కనుమరుగయ్యాయి. కొన్ని అంతర్ధానమవుతూ ఉన్నాయి. స్వరూపాలనీ, స్వభావాలనీ మార్చుకుని కొన్ని కళలు ప్రాణాలు కాపాడుకుంటున్నాయి. పెనుగాలిని తట్టుకునో, తలవంచో నిలబడుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని మూల లక్షణాలని అవి కోల్పోతున్నాయి. కాలంతోపాటు కళా రూపాల్లో మార్పులూ, చేర్పులూ సహజమే. అయితే కళ మాయమై రూపం మాత్రమే మిగిలిన సందర్భం బాధనే మిగులుస్తుంది. అయినా సరే అవి కళాకారుడి కడుపు నింపుతున్నాయి.

షోకేసులోకి కళలు

వేసవి రాత్రుళ్ళు తెలుగు పల్లెలు జానపద కళాప్రదర్శనలతో వెలిగిపోయేవి. గ్రామకూడళ్ళలో బుర్రకథలూ, భాగోతాలు, యక్షగానాలూ, నాటకాల ప్రదర్శనలూ సాగేవి. ఊరు ఊరంతా తూగుతూ, తుళ్ళుతూ, నవ్వుతూ, దుఃఖిస్తూ వీటిని ఆనందించేది. ఇళ్ళలో శుభకార్యాలకూ, అశుభ కార్యాలకూ కళాప్రదర్శనలు ఏర్పాటు చేయడం ఒక ఆనవాయితీగా ఉండేది. రాజులు పోషిస్తే బతికిన కళలు కావు ఇవి. దిగువ, మధ్యతరగతి ప్రజలే వీటి పోషకులు. ప్రజల నమ్మకాలు, ఆచార సంప్రదాయాలే వీటిని కాపాడాయి. సంక్రాంతి రోజుల్లో తెల్లవారకముందే ప్రతి గడప ముందూ వినిపించే బుడబుక్కల గానం... చలివెచ్చని ఎండలో గంగిరెద్దు విన్యాసాలూ... హరిదాసు కీర్తనలూ... కాటిపాపలూ, మోడివాళ్ళ టక్కుటమార కనికట్టు విద్యలూ... చీకటిపడ్డాక తెరమీద ఆడే తోలుబొమ్మలూ, ఒగ్గు కథలూ, భారతాలు, కొయ్య బొమ్మలాటలు, యానాది పల్లెల్ని ఊపేసే డుబ్బుంకుల ఆటలూ ఇవన్నీ జ్ఞాపకాలుగా మరిచిపోవడమే విషాదం. వీటిలో కొన్ని సంగీత సాహిత్యాలను కోల్పోయి రూపాలుగా మాత్రం మిగిలి ఉన్నాయి.

తోలుబొమ్మలాట రాయలసీమ చరిత్రకూ, జీవనశైలికీ అద్దం పట్టేది. పశువుల చర్మాన్ని శుభ్రం చేసి, కత్తిరించి బొమ్మలు చేసుకుంటారు. సంప్రదాయ రంగులతో పురాణ పాత్రలు తోలుబొమ్మలుగా దర్శన మిస్తాయి. బొమ్మ కాళ్ళూ, చేతులకీ, ముఖానికీ దారాలు కట్టి వాటిని చేతివేళ్ళకు తగిలించు కుంటారు. వేళ్ళ కదలికలు బొమ్మకు ప్రాణం పోస్తాయి. ఈ కదలికలతోనే బొమ్మలో హావభావాలు పలికిస్తారు. కథాగానం చేస్తూ తోలుబొమ్మలు ఆడిస్తారు. బొమ్మా, బొమ్మను ఆడించేవాళ్ళూ తెర వెనుక ఉంటారు. తెరమీద బొమ్మల నీడలు ప్రేక్షకులని ఆటపాటలతో అలరిస్తాయి. కథాగానానికి సంప్రదాయ వాయిదాలు జత కలుస్తాయి. రాయలసీమ పల్లెల్లో ఎక్కడా ఇప్పుడు తోలుబొమ్మలాటలు లేవు. కానీ తోలుబొమ్మలు మాత్రం ఉన్నాయి. తోలుబొమ్మలాటను వినోదించే ప్రజలు కరువయ్యారు. కళాకారులకు భుక్తి కరువయ్యింది. తోలుబొమ్మలాటనే కులంగా, కూడుగా మార్చుకున్న కళాకారులు ఇప్పుడు ఆటనూ, పాటనూ వదిలేశారు. బొమ్మలు మాత్రం వదల్లేదు. అవే చర్మాలతో, అదే పద్ధతిలో అవే బొమ్మలను తయారుచేస్తున్నారు. వాటిని అమ్ము తున్నారు. శిల్పారామం, అర్బన్ హాట్, లేపాక్షి షోరూంలు వీటి అమ్మకం కేంద్రాలు. పల్లె ప్రజల్లో సంగీత సాహిత్య





కళారూపంగా అలరారిన తోలుబొమ్మ లాటలో ఆట అంతరించింది. బొమ్మ మాత్రం నగరాల్లో, పట్టణాల్లో సంపన్న గృహాల్లో అలకరణగా మారింది. ఈ ఆధునిక ఫ్యాషనే ఈ కళాకారుల కడుపు నింపుతోంది.

చిత్తూరు జిల్లా సంతవేలూరు కొయ్యబొమ్మలాట పరిస్థితి ఇదే. కొయ్యబొమ్మలు అమ్ముకో డానికే గానీ ఆటకి పనికిరావడంలేదు. దేవాలయాల్లో, మందిరాల్లో వేలాడిన కలంకారీ వస్త్రచిత్రాలు ఇప్పుడు దిండు గలీబులుగా, ఫోటోఫ్రేమ్‌లుగా, లుంగీలుగా, చుడీదార్‌లు, గ్రీటింగ్ కార్డులుగా మారాయి. చిత్రరచనలో సంప్రదాయ పద్ధతి కొనసాగుతున్నా, చిత్ర కథాంశంలో మార్పు వచ్చింది. పురాణ పాత్రల స్థానంలో వర్తమాన సమాజాన్ని కలంకారీ చిత్రాలు ప్రతిబింబిస్తున్నాయి. ఈ మార్పే వేలాదిమంది కళాకారులకు ఉపాధి చూపుతోంది. రాగాలు పలికే వీణ మరుగుజ్జుగా మారి అద్దాలపట్టెలో బందీ అయి డ్రాయింగ్‌రూమ్‌ను అలంకరించింది. బొబ్బిలి కళాకారులకు ఇప్పుడు అది ప్రధాన ఉపాధి.

జానపద కళాకారుల సంప్రదాయ వాయిద్యాలు కూడా కనుమరుగవుతున్నాయి. ఆట పాటల మీద సినిమా ప్రభావం కనిపిస్తోంది. యానాదుల డుబ్బుంకుల ఆటలో దాదాపుగా సొంత సాహిత్యం కనిపించడం లేదు. సినిమా పాటలకే వారు ఆడి వినోదిస్తున్నారు. గొంతెత్తి పాడడమూ అంతరించి రికార్డింగ్ డాన్సులు చేస్తున్నారు. ఇంకా అడవిదాటని గిరిజన ప్రాంతాల్లో తప్ప మైదాన ప్రాంతాల్లో జానపద కళలు జనంలో లేవు. రాజకీయ సభల్లోనూ ర్యాలీల్లోనూ కనిపిస్తున్నాయి. అక్కడా అక్కడా నిర్వహించే జానపద కళోత్సవాల్లో వేదికల మీద మాత్రమే వీటికి స్థానం లభిస్తోంది. ప్రజల్లో భాగమైన కళలు ప్రదర్శనలకే పరిమితం అవుతున్నాయి. జానపద కళ ప్రభుత్వం ప్రోత్సహిస్తేనో, అవార్డులిస్తేనో, ఉత్సవాలు నిర్వహిస్తేనో బతికేది కాదు. ప్రజల ఆచార సంప్రదాయాల్లోనే దాని ప్రాణం ఉంది. ప్రజల జీవనశైలిలో వచ్చిన మార్పుల ప్రభావం కళ మీదా ప్రతి ఫలిస్తుంది. ఆ మార్పు కళను మింగేయడమే బాధాకరం. *



గణపతి పజిల్

కొచ్చెర్లకోట బాపారావు

సాధారణంగా ఏ సాహిత్యంలోనైనా ముఖ్యపాత్రలో తగినంత మానవత్వం చేర్చి, సగటు ప్రేక్షకుడు ఆ పాత్రతో కొద్దిగానైనా మమేకం కాగలిగేలాగా రచిస్తారు. అలా చెయ్యని పక్షంలో రచన విఫలమై దిక్కుమాలుతుంది.



ప్రవాసం వచ్చేసి దశాబ్దాలు గడిచిపోయినా చిన్ననాడు పరిచయం అయిన కథలు, వాటిల్లో పాత్రలు కొన్ని మనల్ని హత్తుకునే ఉంటాయి. వాటిల్లో కొన్ని ఎంత గింజుకున్నా తెగని పజిల్ మాదిరిగా ఎన్నాళ్ళయినా పీకుతూ ఉంటాయి. చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారి *గణపతి* అలాంటిది.

1930ల్లోనో, ఇంకా ముందేనో సృజింపబడ్డ కృతి గణపతి. కథాకాలం 19వ శతాబ్ది ఉత్తరార్థం అయి ఉండాలి. ఒకానొక తరానికీ, కోవకీ చెందిన తెలుగువాళ్ళకి గణపతిని వేరే పరిచయం చేయనక్కర్లేదు. 1960ల ఉత్తరార్థంలో కాబోలు మొదలయ్యి, చాలా ఏళ్ళపాటు ప్రతియేటా, ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంవాళ్ళు వారి వార్షిక రేడియో నాటక సప్తాహం సందర్భంగా, గణపతి కథని రేడియో నాటకంగా మార్చి ప్రసారం చేస్తూ ఉండేవాళ్ళు. కేబుల్ టీవీ మాట అటుంచి, రేడియోలోనే ఒకటి, మహా అయితే రెండు స్టేషన్లు వచ్చే రోజులవి. అందుచేత సార్వజనీన వినోదరూపేణా అప్పట్లో చాలామందికి గణపతి తెలిసే ఉంటుంది.

మరి వినోదం అంటే అది అల్లాంటిల్లాంటిది కాదు. గణపతి చాలా విలక్షణమైన పాత్ర. అతడికి రూపం, ధనం, మేధ, గుణం, సామర్థ్యం, అన్నీ లుప్తమే. పుష్కలంగా ఉన్నవి కోరికలు, వాటిని ఎలాగైనా తీర్చేసుకోవాలన్న దుగ్ధ. ఆ ప్రయత్నంలో అతగాడు పోయే పోకడలు ఒకదాని వెంబడి ఒకటి హాస్య సన్నివేశాలకి దారి తీస్తాయి. ఒకసారి గుర్రం ఎక్కాలనిపించి, ఆ తాహతు లేక, బ్రాహ్మల కుర్రాడైన తనకది తగదని ఎవళ్ళు చెప్పినా లెక్కచెయ్యక, గాడిదనెక్కి స్వారీ చేసేస్తాడు.

మరోసారి, ఇంచుమించు, నిరక్షరకుక్షి అయ్యుండి, పొరుగూరి వాళ్ళని బూటకపు రికమెండేషనుతో ఒప్పించి, వీధి బడిపంతులుగా కుదురుతాడు. వీలైనంతవరకూ ఉపాధ్యాయ విధుల్ని కాస్త చదువు వచ్చిన సీనియర్ పిల్లలకి తెలివిగా అప్పగించేసి బండి లాగించేద్దామని చూస్తాడు. కానీ, ఒకసారి తప్పక, సంస్కృత శ్లోకం ఒకదానికి అర్థం చెప్పాల్సి వస్తుంది. ఆ తరుణంలో ఈ ప్రబుద్ధుడు చెప్పిన పెడర్థాలు భలే నవ్వు పుట్టిస్తాయి.

అలాగే ఇంకోసారి వంటబ్రాహ్మడిగా కుదిరి, గరిటె లేకపోతే, అన్నం వేపపుల్లతో కలియబెట్టి యజమానికి వడ్డిస్తాడు. కొబ్బరి చెట్టుకున్న కాయలమీద ఎలకలు దాడి చేస్తున్నాయంటే, అందుకు ప్రతిక్రియగా ఆ చెట్టుకో పిల్లిని వేళ్ళాడదీసి దాని చావుకి కారకుడవుతాడు. ఇలా ఉంటాయి, మూర్ఖత్వం, బుద్ధిహీనత, పేరాశా మేళవించిన గణపతి ఆగడాలు.

దర్శకత్వం, నటన, ప్రొడక్షనూ, అన్నీ అనన్య ప్రతిభతో నిర్వహించారు ఆలిండియా రేడియో గణపతి నాటకబృందం వాళ్ళు. చిలకమర్తి శుద్ధ గ్రాంధికంలో చేసిన రచనకి గోదావరి జిల్లాల బ్రాహ్మణ మాండలీక వ్యావహారికంలో ఎక్కడా పొల్లు పోకుండా ఆకాశవాణి వాళ్ళు చేసిన పరిచాలన ఒక ముఖ్యకారణం అయి ఉండవచ్చు. ఈ కృతి జనాదరణ ఆధునిక తెలుగు సాహిత్యంలో గురజాడ కన్యాశుల్కానికి సమ ఉజ్జీగా కాలపరీక్షకి తట్టుకుని నిలబడటానికి, 1992లో వచ్చిన వాహినీ వారి శ్రీమానస పబ్లికేషన్స్ వారు తీసుకొచ్చిన గణపతి పుస్తకం అట్టమీద *వినోదం కలిగించడంలో విదేశీ కామిక్కులకు దీటైన స్వదేశీ వరవడి రచన* అని ప్రశంసా వాక్యం కనబడుతుంది.

ఒక అరడజనుసార్లు కిమ్మనకుండా నవ్వమన్న చోట్లల్లా నవ్వుతూ ఈ నాటకాన్ని విన్న పిదప నెమ్మదిగా శంకలు బయలుదేరుతాయి. మామూలు తరహాలో కథానాయకుడూ ఇతర ఉదాత్త పాత్రలూ ఉన్న తెలుగు కథల్లో విదూషకుడి పాత్రలో బఫూనరీకి మించి వేరే సత్తువేమీ కనపడకపోవడం కద్దు. (బహుశా కథానాయకుడి గొప్పకి ఇంకెవరూ ప్రేక్షకుల దృష్టిలో పోటీకి రాకూడదని అలా చేస్తారేమో.) కానీ గణపతి కథలో కథానాయకుడూ, నాయికా, ప్రతినాయకుడూ, విదూషకుడూ అన్నీ గణపతే. అయినా ఫ్లడ్‌లైటు వేసి మైక్రోస్కోపుతో గాలించాన చిలకమర్తి చేసిన చిరంజీవిలో ఆకర్షణీయమైన గుణం ఒక్కటీ కనబడదు. దుర్యోధన రావణాడి దుష్టపాత్రల్లో

కొన్నందాల ఒకానొక నిండుతనం, గాంభీర్యతా కనబడి, ఎంత నీచుడయినా వీడిలోనూ మంచితనం ఉంది, అనిపిస్తుంది.

కానీ, గణపతి మాటకొస్తే, తన కోరికలు నెరవేర్చుకునే తమకంలో అతగాడు చేసే చేష్టలు చదువరులకీ, శ్రోతలకీ జుగుప్స కలగించేటట్టు ఉంటాయి. రెండేళ్ళ పసిపిల్ల అయిన తన మరదలిని బలవంతంగా ఎత్తుకుపోయి గుళ్ళో దొంగతనంగా పెళ్ళి చేసేసుకుంటాడు. బూటకపు బడిపంతులు అవతారంలో పిల్లలని ఉత్తి పుణ్యానికి అతి కౄరంగా రక్తాలు కారి సొమ్మసిల్లేటట్టు కొడుతూ ఉంటాడు. లోకంలో తనని నిర్వ్యాజంగా అభిమానించే ఒక్కగానొక్క వ్యక్తి అయిన తన తల్లి సింగమ్మని సైతం, తన మాటకి ఎదురు చెప్పిందని నిర్దాక్షిణ్యంగా తిడతాడు, కొడతాడు.

రేడియో నాటకం తొలిసీన్లో, గణపతిని బడిలో వెయ్యడానికి తల్లి సింగమ్మ వెంటబెట్టుకొచ్చినప్పుడు, అతడి భావి సహాధ్యాయులు దూరాన్నుంచి అతని అవతారాన్ని చూసి మనిషి కాదు, జంతువు అనుకుని, అది ఎలుగుబంటా, కోతా, కొండముచ్చా అని పందేలు వేసుకుంటూంటారు. ఆ సూచనకి అనుగుణంగానే రచయిత గణపతి పాత్రని మానవస్పృహ మృగ్యమైన పశువో, పిశాచమో అన్నట్టు కల్పించాడు. నవలలో గణపతి పుట్టుక సన్నివేశంలో ఆ పుట్టిన పసికందు అచ్చం పిల్లపిశాచం మాదిరిగా ఉన్నాడు, అన్న కథకుడి వ్యాఖ్యతోనే చిలకమర్తి గణపతి గురించి చెప్ప దలుచుకున్న విషయం స్పష్టమైపోతుంది.

సాధారణంగా ఏ సాహిత్యంలోనైనా ముఖ్యపాత్రలో తగినంత మానవత్వం చేర్చి, సగటు ప్రేక్షకుడు ఆ పాత్రతో కొద్దిగానైనా మమేకం కాగలిగేలాగా రచిస్తారు. అలా చెయ్యని పక్షంలో రచన విఫలమై దిక్కు మాలుతుంది. ఒకవేళ ఏదైనా పాత్రని అమానుషంగా చిత్రీకరించినా, ఆ పాత్ర, కథ పురోగతికీ, మానవతకీ ప్రతిరూపమైన నాయక పాత్రలు పరస్పరం ప్రతిద్వంద్వులుగా నెలకొంటారు. మరైతే ఏకైక ముఖ్యపాత్ర అని చెప్పదగ్గ గణపతికి విలక్షణమైన ప్రతిద్వంద్వి ఎవరూ కనబడరు. తనని తాను గణపతి స్థానంలో ఊహించుకోవడానికి ఏ ప్రేక్షకుడూ, పాఠకుడూ ఇష్ట పడడు. అటువంటి గణపతి పాత్ర, రచన, తెలుగువాళ్ళని నవ్వించి, వాళ్ళ ఆదరణని ఎలా చూరగొనగలిగాయి? ఇది గణపతి పజిల్. ఈ పజిల్ విడదీయాలంటే ఎంతో కొంత విమర్శనాత్మక అధ్యయనం తప్పదు.

గణపతి, కన్యాశుల్కం వంటి రచనలు ఒకవైపు నుంచి చూస్తే జనరంజకమైన కథలు. మరోరకంగా చూస్తే పండితాధ్యయన యోగ్యమైన శిష్ట సాహిత్యకృతులు కూడాను. ఇంగ్లీషు సాహిత్యంలో మార్క్‌ట్వెయిన్ రచించిన టాంసాయర్, హక్ల్‌బెరీఫిన్ నవలలు ఈ కోవకి చెందుతాయి. ఈ చెప్పబడ్డ ఇంగ్లీషు రచనలు ఆంగ్లసాహిత్య పండిత ప్రపంచంలో ఎంతో విమర్శనాత్మక అధ్యయనానికి గురి అయి ఉన్నాయి. హైస్కూళ్ళలోనూ, కాలేజీల్లోనూ విద్యార్థుల చేత వీటిని చదివిస్తారు. ఆ ప్రకారం విద్యావంతులైన జనసామాన్యంలో టాంసాయర్, హక్ల్‌బెరీ ఫిన్ పాత్రల గురించీ, వాటి సృష్టి వెనకాల రచయిత ఆంతర్యం గురించీ, అవగాహన కొద్దో గొప్పో ప్రచారంలో ఉండటం కద్దు. సాహితీ విమర్శలో ప్రవేశమూ, ఆసక్తీ ఎక్కువగా లేని పాఠకుడైనా, ఆ పుస్తకాలకి పండితులు రాసిపెట్టిన పీఠికలు చదివి, కథ, పాత్రల అంతరార్థాల గురించి కలిగే సందేహాలు కొంతవరకైనా నివృత్తి చేసుకోగలుగుతాడు.

కొంతవరకూ కన్యాశుల్కానికి ఇటువంటి ఉపయుక్తాలైన పీఠికలు లభిస్తాయి. కానీ, దాంతో పోల్చగల సాహితీస్థాయి కలిగున్న గణపతి విషయానికొచ్చేసరికి, ఇది కేవలం నవ్వు పుట్టించడానికి ఉద్దేశించబడిన ప్రహసనం, కాబట్టి అధ్యయనార్హం కాదు అన్న అభిప్రాయమే ప్రబలినట్టు తోస్తుంది. పైన ఉదహరించిన వాహినీవారి ఎడిషన్ అట్టమీది విదేశీ కామిక్ బుక్కులతో తేబడిన పోలిక చూస్తే, కామిక్ బుక్కులు, గణపతి రెండున్నూ సమతుల్యాలైన తేలికపాటి సరదా రచనలు మాత్రమే అన్న భావమే తప్ప కళాత్మకంగా గణపతికి ఒక స్థానం ఉండచ్చన్న ఊహ స్ఫురించదు.

ఇలా ఉండటంచేత, గణపతిని ఒక సాహితీ ప్రహేళికగా ఎంచి, దాన్ని విడదీసే జిగీషతో అవస్థపడే పాఠకుడికి స్వయంగా తానే ఆ యత్నానికి అవసరమైన పరిజ్ఞానమూ, శిక్షణా తనలో లోపించినా సరే ఆ కథని నిశితంగా, విమర్శనాత్మకంగా చదివి, తన సందేహాలు తీర్చుకోవాల్సి రావడం అనివార్యం అవుతుంది. (అనగా పాఠకుడు తన తిప్పలు తనే పడాలని సారాంశం.)

ప్రథమపురుషలో, సర్వద్రష్ట అయిన కథకుడి గళంతో (first person, omniscient narrator's voice) చెప్పబడ్డ కథ గణపతి. రాత్రివేళ పెళ్ళి భోజనం సందర్భంలో తరవాతి అధరువు వడ్డించడంలో జాగు జరిగి, ఆకలి తీరని స్థితిలో, వడ్డించని విస్తరి ముందు కూచునే కథకుడు కునుకు తీస్తాడు. కలలో గణపతి దర్శనమిచ్చి, తన కథ చెప్పి నిగర్వమైన దాన్ని గ్రంథస్థం చేయమని నిర్దేశిస్తాడు. ఆశించిన అధరువు వేడిచారు రూపంలో, క్షుత్శాంతినీ బాధనూ ఏకకాలంలో సూచించే విధంగా చేతిమీద పడి చుర్రుమంటుంది. కథకుడు మేలుకుని (భోజనంతో పాటు) కథనానికి ఉపక్రమిస్తాడు.

కథ గణపతి పూర్వీకులు, ప్రత్యేకించి తాతగారైన పప్పుభొట్ల పాపయ్య వృత్తాంతంతో మొదలవుతుంది. అక్కడి నుంచి కథ గణపతి తండ్రి గంగాధరం చరిత్ర, ఆ మీదట కథానాయకుడు గణపతి వృత్తాంతం లోకి దిగుతుంది.

సగటు తెలుగు కథలకి మల్లేనే ఇది ప్రధానంగా మొగాళ్ళ కథే. స్త్రీలు అనుబంధ పాత్రలు మాత్రమే. గణపతి వంశం పురుషుల్ని ఒక రకమైన దిగజారిన వైదిక బ్రాహ్మణులుగా అనుకోవచ్చు. ఆస్తిపాస్తులూ, వేదవిద్యా, పాండిత్యం, ఇవేవీ వాళ్ళ దగ్గిర ఉండవు. విద్యాతృష్ణ కూడా మృగ్యమే. పుష్కలంగా ఉన్నది దారిద్ర్యం, బ్రాహ్మల్లో కన్యాశుల్కం పాడిగా ఉన్న ఆ రోజుల్లో దరిద్రుడికి డబ్బిచ్చి భార్యని కొనుక్కునే అవకాశం ఆకాశ దీపమే. దైహిక సుఖాల మాట అటుంచి, ఎక్కడికక్కడ వంశమే అంతరించి పోతుందేమోనన్న పరిస్థితి పప్పుభొట్టవారిది. ఆది నుంచి తుది దాకా స్త్రీ, తద్వారా వంశాంకురాన్నీ పొందాలన్న తాపత్రయమూ, పొందలేని ఆర్థిక దౌర్బల్యమూ, అశక్తతా, ఇవి కలిసి కథకి ప్రధాన ఇతివృత్తంగా ఏర్పడతాయి.

వీళ్ళ దారిద్ర్యం నుంచి విడదీయలేని 'యిన్-యాంగ్' తీరులో, వీళ్ళు ముగ్గురికీ (తాత పాపయ్య, తండ్రి గంగాధరం, నాయకుడు గణపతి) ఆరని మంటలాంటి పేరాశ, లేకితనమూను. వాటికి భౌతిక ప్రతీకల్లాంటి

బానపొట్టా, భగ్గున మండే జఠరాగ్నీ సహజాతాలుగా ఉంటాయి. ఇవి మరీ దరిద్రదేవత తోబుట్టువు లక్ష్మీదేవి అంశలు కాకపోయినా, మూడు తరాల వాళ్ళనీ జీవిత సమరంలో కిందామీదా పడుతూనైనా ముందుకు నడిపించే శక్తులు మటుకు అవును.

ఆశ, దరిద్రం, ఈ రెండింటి మధ్యా పెనుగులాటే గణపతి చరిత్ర. తాత పాపయ్య వధుక్రయం కోసం డబ్బు సంపాదించడానికిగాను పునహా (నేటి పుణే) వెళ్ళి అక్కడ సమాజపు ఉచ్చనీచాల విలువలని ధిక్కరించి శవాలు మోసీ, అపరకర్మల్లో దానాలు పట్టీ, ఒకంత దుండగీడుతనం చేసి, మొత్తం మీద కృతకృత్యుడయ్యి, స్వగ్రామం మందవల్లి (శనైశ్చరుడి పేరున్న గోదావరి డెల్టా గ్రామం) చేరి, చంటిపిల్ల పిచ్చమ్మని కన్యాశుల్కమిచ్చి వివాహమాడి, వయసు మీదపడిపోయాక గంగాధరానికి తండ్రి అవుతాడు. వంశం నిలబెట్టుకోడం కోసం సాగించిన పోరాటంతో జీవశక్తి ఉడిగి, కొడుకు నెలల పిల్లాడుగా ఉండగానే చనిపోతాడు.

భర్త పోగుచేసిన కొద్దిపాటి డబ్బూ స్వయానా తన తండ్రి అప్పన్న మోసగించి కాజెయ్యడంతో పిచ్చమ్మనీ, గంగాధరాన్నీ సంపూర్ణ దారిద్ర్యం మరోసారి ఆవహిస్తుంది. విశాలమైన కొడుకు పొట్ట గడవటానికి నానా తిప్పలూ పడ్డ పిచ్చమ్మ పిల్లవాడికి వయసు రాగానే ఉపనయనం చేయించి భిక్షుకవృత్తిలోకి దింపుతుంది.

గంగాధరమూ ఒక వయసొచ్చాక, తండ్రి అడుగుజాడల్లో వెళ్ళాడా అన్నట్టు కాకినాడ చేరి, నీళ్ళు మోసే బ్రాహ్మడుగా కాయకష్టం చేసి, ఇంకా ఇతర తిప్పలు పడి, తన వ్యసనాలకి పోనూ, కొంత డబ్బు వెనకేసుకుని, నలభయ్యో ఏట మందపల్లికి తిరిగొచ్చి, రెండేళ్ళ వయసున్న సింగమ్మని కన్యాశుల్కమిచ్చి వివాహమాడతాడు. మరో దశాబ్దానికి కథానాయకుడు గణపతికి తండ్రి అవుతాడు. కొడుకు దారిద్ర్యంతో సమరాన్ని గడిచి ఉద్యోగస్థుల కోవలో చేరగలడని (కలకటేరో, కనిష్టిపో) చెదురుమదురుగా కల కంటాడు.

కానీ, పిల్లాడికి నాలుగేళ్ళయినా నిండకముందే, జబ్బు చేసి గంగాధరం చనిపోతాడు. ఆ మీదట ఉన్న డబ్బంతా ఖర్చయిపోయి, గణపతి, తల్లి సింగమ్మ, గడిచిన తరం మాదిరిగానే బికారులుగా సిద్ధం అవుతారు. సింగమ్మ అన్నగారు నాగన్న, వదినె గంగమ్మా వీళ్ళకి ఆశ్రయం ఇస్తారు. వాళ్ళదీ బొటాబొటి సంసారమే.

ఉద్యోగస్తుడి రూపేణా ఆనాటి ఆధునిక ఆర్థికవ్యవస్థలో కొడుకు పాలు పంచుకోవాలనే ఆశ సమసిపోకనేమో, చదువు సంధ్యలయెడ సహజ ప్రతిభ ఎంతమాత్రమూ లేని గణపతి ఆ ఊరి వీధిబడిలో చేర్చబడతాడు. ఆ బడిపంతులు చదువు చెప్పడం, కట్టడి చేయడం పేరుతో పిల్లలని దారుణంగా చితకబాది హింసిస్తూ బడి, చదువూ అంటే ఎవరికైనా విపరీతమైన భయం, అసహ్యం కలిగించడానికి శాయశక్తులా శ్రమిస్తూ ఉంటాడు. ఆ పంతులు బారి నుంచి తప్పించుకుని, బడి ఎగ్గొట్టి, తన్ని బడికి లాక్కెళ్ళజూసే పెద్దవాళ్ళ ప్రయత్నాల్ని సునాయాసంగా ప్రతిఘటించి, అల్లరి కుర్రమూకతో ఊళ్ళోనూ, పొలాలంటా, తుంటరిచేష్టలూ, చిల్లర దొంగతనాలతో భీభత్సం సృష్టిస్తాడు గణపతి. తరువాతి జీవితంలో తను ఉపాధ్యాయుడుగా అవతారమెత్తినప్పుడు పిల్లల పట్ల అవలంబించాల్సిన వైఖరికి ఆ బడిపంతులు గణపతికి ఆదర్శమవుతాడు. దాంతోపాటు, ఉన్నపాటి మేధస్సునీ శక్తిసామర్థ్యాలనీ కేవలం తనకి ప్రతికూలంగా తోచిన వ్యవస్థని వంచి వంచించి తన తత్కాలపు వాంఛలని నెరవేర్చుకోవడానికి ఉపయోగించుకోవడంలో గణపతి స్వాధ్యయనం కూడా ఈ దశలోనే మొదలవుతుంది.

ఈ కోణం నుంచి పరికించినట్లయితే గణపతి తదుపరి చేష్టలన్నిటినీ వ్యవస్థలో ఇమిడి వృద్ధిలోకి రాగలిగే స్తోమతా, సామర్థ్యం కొరవడినటువంటి వాడు ఆ వ్యవస్థని అధిగమించి, తనలోని జీవశక్తి తోసి తెచ్చే ఆకళ్ళని- నాయకుడిలో లంబోదరంగా, లేకితనంగా ప్రస్ఫుటమయ్యేవాటిని- తీర్చుకోవడానికి పడే పాట్లుగా, ఆడే ఆటలుగా అర్థం చేసుకోవచ్చు. వ్యవస్థని ఎదిరించి పెకలించడం గణపతి ఉద్దేశ్యం కానేకాదు. (ఉన్న వ్యవస్థని పీకేసినా దాని స్థానంలో ఏదో ఒక వ్యవస్థ వచ్చి నిలబడక మానదు కదా!) నైతిక విలువలని ఉద్ధరించడం, ఋజువర్తనని కలిగి ఉండటం, ఇటువంటి సంగతలున్నీ ఈ జీవి ప్రయాసలకి అప్రస్తుతాలే. ఉన్నదల్లా కామితార్థసిద్ధి.

కోరింది పొందడానికి వ్యవస్థ అనుకూలించిన పక్షంలో నిరభ్యంతరంగా లబ్ధి పొందవచ్చు. వర్ణస్పృహ ప్రబలి ఉన్న సమాజపు నేపథ్యంలో తన బ్రాహ్మణ పుటకని పణంగా పెట్టి గాడిద మీద ఎక్కించమని చాకలిని బలవంతపెట్టి లొంగదీసుకుంటాడు మన ప్రబుద్ధుడు. బండిపంతులుగా వ్యాపారం పెట్టడానికి పాటి కులస్థుల సంఘీభావం, ఆశ్రయం పొందటానికని అనాథ అయిన తల్లి దయనీయ స్థితి పట్ల సానుభూతీ - ఇటువంటివన్నీ ఇతడికి మారకద్రవ్యాలు.

వ్యవస్థ విధించే నియమాలకొచ్చేసరికి మటుకు గణపతివి అన్నీ దాగుడుమూతలే. బడిపంతులుకి ఉండవలసిన అర్హతలు తనకి లేక పోయినా, అసలు తనకి ఏమీ రాకపోయినా కూడా, ఇబ్బంది లేదు. ఏదో రకంగా దొంగ సిఫార్సులతో, మాటలగారడీతో పని గడిపేయచ్చు. వంట బ్రాహ్మడి అవతారంలో గరిటె తెచ్చుకోక, చేతికందిన వేపపుల్లతో అన్నం కలియబెట్టి యజమాని భోజనం చెడగొట్టడం, పిల్లిని కొబ్బరిచెట్టుకి వేళ్ళాడదీసి అమాయక ప్రాణాన్ని బలిగొనడం - ఇవి గణపతిలో మూర్తీభవించిన అవిద్యా, అవకాశవాదం, సంఘానికి వాటి వల్ల వాటిల్లే దుష్పరిణామాలూ - వీటిని చిత్రించే ఉత్ప్రేక్షలు.

వ్యవస్థతో చెడుగుడాడటం విషయంలో గణపతి తన పూర్వతరాలతో పోలిస్తే పెళ్ళి దగ్గరికొచ్చేసరికి ఋజుమార్గాన్ని పూర్తిగా విడనాడాడని చెప్పాలి. తండ్రి, తాతా, కన్యాశుల్క వ్యవస్థకి తల ఒగ్గి, శ్రమించి డబ్బు సంపాయించి భార్యలని కొనుక్కున్నారు. గణపతి ఈ శ్రమకి ఆమడదూరం. పెళ్ళి మాత్రం కావాలి. అంచేత మొదట రెండేళ్ళ మేనమరదల్ని దొంగతనంగా ఎత్తుకుపోయి, సాటి బ్రాహ్మలు కొందరి సహకారంతో గుళ్ళో పుస్తె కట్టేస్తాడు. మేనమామ లక్ష్యపెట్టక, ఆ పుస్తె తెంపేసి, పిల్లని మరో వరుడికి ఇచ్చి చేసేయడంతో ఆ ప్రయత్నం అంతమవుతుంది.

ఇంకోసారి ఆ ప్రాంతానికి భామాకలాపం నాటకం ఆడటానికి వచ్చిన గరుడాచలం అనే వేశ్య బృందంలో పని సంపాయించి, ఆమె తీసిపారేసిన పూలచెండ్లు చేతికి చుట్టుకుని, తను గరుడాచలం మొగుణ్ణని దర్పంగా చెప్పుకుంటూ తిరుగుతాడు. గణపతి తెలివితక్కువనీ, అవిద్యనూ

భరించలేక గరుడాచలం అతడ్ని సాగనంపడంతో ఆ పగటికల కాస్తా ముగుస్తుంది. మరోసారి ఉండబట్టక, తనొక్కడే వరుడి వేషంలో పల్లకీలో (వినోదార్థులైన ఊరివాళ్ళ ఆర్థిక సహకారంతో) ఉత్తుత్తి పెళ్ళి ఊరేగింపులో ఊరేగుతాడు. కథ చివరికి ప్రాలుమాలి, మోసగాడైన భైరవశాస్త్రి అనే బ్రాహ్మడి తాలూకు పిల్లని, అదివరకే మరొకడితో పెళ్ళియినదాన్ని మోసపోయి పెళ్ళి చేసుకుని, పోలీసుల దృష్టిలో పడి, ఆ భయంతో కథ నుంచి అంతర్ధానం అవుతాడు. అంతటితో కథ ముగుస్తుంది.

గణపతి తాతా, తండ్రీ మహా సద్వర్తనులేం కారు. పొట్ట నింపుకోవడం కోసం నోటి దురుసుకీ, దౌర్జన్యానికీ ఇద్దరూ ఒడిగడతారు. మోసాలకీ, బెదిరింపులకీ వెనకాడినవారు కాదు. కానీ, ఇరువురి వద్దా కాయకష్టం అనే మారకద్రవ్యం నిస్సందేహంగా ఉంది. ఒకడు శవాల్ని మోస్తే, ఇంకోడు నీళ్ళు మోసాడు. తన తరుణం వచ్చేసరికి, వారేర్పరిచిన స్వల్ప ప్రమాణాలకి కూడా గణపతి అతీతుడుగా రూపొందుతాడు. గణపతే కాదు, అతడినంటి ఉన్న పాత్రలెవరికీ తత్కాలస్ఫూర్తీ, కుక్షింభరత్వమూ తప్పితే ఋజువర్తన యడలా, వ్యవస్థ విధించే నీతినియమాల యడలా, నిజమైన భక్తి ప్రపత్తులు ఉన్నట్టు తోచదు. గణపతి తల్లి సింగమ్మ తనకాశ్రయమిచ్చిన అన్నగారి ఇంట్లో వస్తువులు దొంగిలించడానికి కొడుక్కు సాయపడుతుంది. గణపతికీ, తల్లికీ ఆశ్రయమిచ్చిన మహాదేవశాస్త్రి ఎక్కడాలేని పిల్లి ప్రాయశ్చిత్తాన్ని కల్పించి, వారిద్దరి అమాయకత్వాన్నీ ఆసరాగా తీసుకుని, అసలే బికారులైన వాళ్ళ దగ్గిర తగు మాత్రం సొమ్ము మోసంతో కాజేస్తాడు. మేనమామ నాగన్న పుస్తెతాడు పవిత్రతని (ఆపద్ధర్మ పరిస్థితిలోనే కానీయండి) తోసిపుచ్చి, కూతురికి మరో పెళ్ళి చేస్తాడు.

సమాజం పైకి బోధించే ధర్మపన్నాలకీ, వాస్తవ జీవితంలో మనుగడ కోసం అందలి వ్యక్తులు అవలంబించే విధానాలకీ, చాలా అంతరం ఉంటుంది. ప్రత్యేకించి, సదరు ధర్మపన్నాలకి లోబడి ఉండమని సమాజం లోని దరిద్రుల మీదా, నిమ్నవర్గాల మీదా, స్త్రీల మీదా, వత్తిడి విపరీతంగా ఉంటుంది. మతం పేరిటో, మరో పేరిటో, భాగ్యవంతులతో సమంగా తామూ సంపత్తిని ఆశించడం తగదని పదేపదే వాళ్ళకి నూరి పోస్తుంటుంది సమాజం. ఏ సమాజంలోనైనా, అందరికీ ఏదోలా గోచరిస్తున్నప్పటికీ, పైకి మాత్రం చెప్పకూడని చిదంబర రహస్యం ఇది.

అలా ఉండటం చేసి, సమాజం బోధల్ని అసలేం పట్టించుకోకుండా తనక్కావల్సిన దానికోసం అర్రులు చాస్తూ, పరిగెత్తే కథానాయకుడి పట్ల ప్రతి పాఠకుడికీ ఏదో స్థాయిలో సహానుభూతి ఉండి తీరుతుంది. ఉందని మనము అంగీకరించకపోవచ్చునుగాక. మనలో మనకే చెప్పుకోలేనివి ఎన్నో కోరికలు ఉంటాయి. వాటిల్లో కొన్ని సంస్కారవంతులమనుకునేవాళ్ళకి వెగటు పట్టించేటటువంటివి కావచ్చు, లేదా ఇతరుల ఎగతాళికి గురి చేసేలాంటివి కావచ్చు. ఈ అవ్యక్తనీయాలని వ్యక్తీకరించే సాహసానికి ప్రతీక కావటాన్న గణపతి పాత్రకి గల ఆదరణకి పునాది పడుతుంది.

కోరికలని విశృంఖలంగా వెల్లడించుకుని, వాటిని నెరవేర్చుకోబోవడం అనేదానికి మరో పార్శ్వం ఉంది. అవతలివాళ్ళు వాళ్ళక్కావల్సినవన్నీ కట్టు తెంచుకుని దక్కించేసుకుంటే తటస్థంగా ఊరుకున్న మనం అసూయతో బాధపడవలసి రావచ్చు, అంతకంటే ప్రమాదం, ఆ దక్కించుకోవడంలో



మన సొత్తే నష్టపెట్టవచ్చు. ఎలా ఉన్నా, కోరికలు తీర్చుకోకుండా (ఆ మాట కొస్తే చెప్పుకోను కూడా చెప్పుకోకుండా) స్తబ్ధంగా ఉండిపోయి నష్టపోతున్నా మన్న భావం వల్ల కలిగే వెత మనల్ని పట్టి పీకగలదు.

కోరికల ఊసు రేకెత్తి ఊరించి కలవరపెట్టిన గణపతి పాత్రే, ఆ కారణంగా బయలుదేరే మనోవైకల్యాన్ని కూడా పరిష్కరిస్తుంది. ఎప్పటికప్పుడు ఆశావాదియై కోరికలని త్యజింప నిరాకరించే గణపతి పాపం, ఎప్పటికప్పుడు భంగపడుతూనే వస్తాడు. ఆ భంగపాటే, కథలో ఊరివాళ్ళకీ, కథ బయట పాఠకులకీ వినోదదాయకం అవుతుంది. ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకునే పాటి అంతర్దృష్టి లేని గణపతి మామూలు మనుషుల్లా పరిస్థితులతో సమాధానపడడు. అలా గుడ్డిగా కావల్సిన దానిమీద ఆపేక్ష వదులుకోనందుకు గణపతి చాలా పెద్ద శిక్షే పొందుతాడు. ఉపాధిమార్గాలు ఒకటొకటే చేజారిపోతాయి. తనని అవ్యాజంగా ప్రేమించే తల్లిని తిట్టి, కొట్టి, ఆమెతో మొహం చూసుకోని వైరం పెట్టుకుంటాడు.

భార్యని పొందే ప్రయత్నాలు విఫలమై, ఉనికీలేముల మధ్య ఊగిస లాడిన తన వంశంతో సహా తానూ నాస్తిత్వమనే అగాధంలో పడిపోతాడు. పిశాచంలాంటి వికృతరూపంతో పుట్టి, అల్లరి పిశాచంగా బతికి, మనిషిగా మిగలలేక, మానవ ప్రపంచం నుంచి నగుబాటు తప్ప మరేమీ పొందలేక పోతాడు గణపతి.

గణపతికి పట్టిన ఈ దుర్గతే పాఠకులకి విముక్తిని ప్రసాదిస్తుంది. హద్దులు దాటి కోరికల వెంట తగులుకుంటే పిశాచావస్థ తప్పదన్న సందేశం అవ్యక్తనీయవాంఛల గడబిడతో సతమతమవుతున్న పాఠకుడికి ఊరట కలిగించక తప్పదు. తన్నుమాలిన కోరికలుంటే అందరూ నవ్వుతారన్న ప్పుడు, ఆ కోరికల జోలికి వెళ్ళనవసరమూ లేదు, వాటివల్ల సంభవించే బాధలూ, అంతకుమించి నగుబాటూ తప్పుతాయి. కోరికల ఆరాటమూ, వాటి బాధా, తదుపరి నిరర్థకత్వమూ, నగుబాటూ, ఏకకాలంలో మేళవించిన గణపతి అవ్యక్తాలైన మన భయాల్ని ఓ పాపాలభైరవుడులా తనలో మూర్తీ భవించుకుంటాడు. ఆ పాపాలభైరవుడికి నగుబాటూ, అంతర్ధానమూ అనే అంతిమ శిక్షలు పడటాన్ని మనకి భయాల్నించి విముక్తి కలుగుతుంది, హాయిగా నవ్వుకుంటాము. *

కొత్త సరిహద్దుల్లో స్త్రీవాద కథ

కల్పనా రెంటాల

స్త్రీల సమస్యలు, స్త్రీ పురుష సంబంధాలు, వివాహవ్యవస్థలోని లొసుగులు వీటన్నింటి గురించి విస్తృతంగా చర్చించిన స్త్రీవాదులు ఇప్పుడు సమాజంతో పాటు కొత్తరూపు తీసుకుంటున్న సమస్యల గురించి మాట్లాడుతున్నారు.



'అసలు బిడ్డలకు పలెనే కథలకు కూడా మాతృత్వం మాది,' అంటుంది కనుపర్తి వరలక్ష్మమ్మగారి కథలోని రాజేశ్వరి *(కథ ఎట్లా ఉండాలి?)*. దాదాపు 75, 80 ఏళ్ళ క్రితమే స్త్రీవాదం అన్న పేరు కూడా వినిపించని కాలంలో కథ చెప్పటం మా జన్మహక్కు అని ఆమె సగర్వంగా ప్రకటించింది.

అనగనగా అంటూ అమ్మమ్మ చెప్పిన కథతో స్త్రీల కథ మొదలైందని చెప్పవచ్చు. రాక్షసుడ్ని చంపేసిన రాజకుమారుడి చుట్టూ అల్లుకున్న రాకుమారి అందమైన ఊహల కథ. ఏ రాకుమారుడో వచ్చి యావనరెక్కల మీద ఎగరేసుకుపోతాడన్న ఊహల నుంచి రాకుమారుడ్ని పెళ్ళి చేసుకోకుండానే వారసుల్ని కనగలిగే స్థాయికి ఎదిగింది నేటి కథల్లోని కథానాయిక. సైద్ధాంతిక పరంగా ఈ మార్పుని స్త్రీవాద కథాపరిణామక్రమంగా చెప్పుకోవచ్చు.

సామాజిక చరిత్రకు సాహిత్యం దర్పణం లాంటిది. మానవ జీవనానికి కథ ప్రతిబింబం లాంటిది. సమాజ పరిణామాలను విమర్శనాత్మకంగా చూసినప్పుడు దాని తాలూకూ ప్రతిబింబం మనకు సాహిత్యరూపాల్లో కనిపిస్తుంది. సాహిత్యానికి, సమాజానికి మధ్య ఉన్న ప్రతిఫలనం అవగాహన చేసుకున్నప్పుడు స్త్రీవాద సాహిత్యం కూడా సరిగ్గా అర్థమవుతుంది.

తెలుగు సాహిత్యంలో స్త్రీవాద సాహిత్యం తీవ్ర సంచలనాన్ని రేకెత్తించి అనేక వాదవివాదాలకు కారణమైన సంగతి అందరికీ తెలిసిందే. 1980ల్లో స్త్రీవాద రచయిత్రులు తమదైన స్వరంతో, భావవ్యక్తీకరణలతో, కొత్త ఇతివృత్తాలతో, సరికొత్త భాషతో, పదచిత్రాలతో తిరుగుబాటు ప్రకటించారు. పితృస్వామ్యం, స్త్రీ, పురుష లైంగిక వివక్ష, స్త్రీల అణచివేత, ఇంటిచాకిరీ మొదలైన విషయాల్ని స్త్రీవాదం చర్చల్లోకి తీసుకువచ్చింది. స్త్రీగా పుట్టడం వేరు, స్త్రీగా తయారుచేయబడటం వేరు అన్న సంగతిని స్త్రీలు గుర్తించగలిగారు. తరతరాల సమాజం కోటానుకోట్లమంది స్త్రీలను తయారుచేసి వారిని ఆ విధంగా అదుపుచేయటాన్ని స్త్రీవాదులు నిలదీశారు. స్త్రీ, పురుష వివక్ష గురించి స్త్రీవాద రచయిత్రులు చైతన్యవంతులై ప్రశ్నించారు. ఆ విధమైన ఆత్మచైతన్యాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని ప్రతిబింబింపజేసే కథ, కవిత, నవలా సాహిత్యాన్ని స్త్రీవాదులు సృజించారు.

మొదటిదశలో రచయిత్రులకు, అతి కొద్దిమంది రచయితలకు పరిమితమైన స్త్రీవాదం క్రమంగా మొత్తం సమాజవాదంగా మారింది. ఇవాళ స్త్రీవాదం కేవలం స్త్రీలవాదమే కాదు. సమాజంలోని అన్ని వర్గాలవారిది. స్త్రీ చైతన్యాన్ని, వ్యక్తిత్వాన్ని గౌరవించే స్త్రీ, పురుష పాత్రల్ని జండర్ భేదం లేకుండా అందరూ తమ రచనల్లో చిత్రిస్తున్నారు. దీన్ని స్త్రీవాదం సాధించిన విజయంగా చెప్పుకోవచ్చు. అయితే ఈ మార్పు సమాజంలో ఆశించిన రీతిలో లేకపోయినప్పటికీ సాహిత్యంలో మాత్రం కనిపిస్తుంది. అయితే ఈ వ్యాసంలో ప్రధానంగా స్త్రీవాద రచయిత్రుల కథల్ని మాత్రమే చర్చకు తీసుకోవడం జరిగింది.

స్త్రీల జీవితాల గురించి, సమాజంలో స్త్రీల భాగస్వామ్యాన్ని గురించి రచయిత్రులు మొదటి నుంచీ కథలు రాస్తూనే ఉన్నారు. తమలోని స్త్రీత్వాన్ని నిర్వచించుకుంటూ రచయిత్రులు రాసిన కథలూ ఉన్నాయి. అయితే స్త్రీవాద కథ అన్నది మాత్రం '80ల తర్వాత మాత్రమే కనిపించే భావన. ఇది ప్రధానంగా సైద్ధాంతికపరమైన వ్యత్యాసాన్ని తీసుకువచ్చింది. 1902లో వెలువడ్డ భండారు అచ్చమాంబ స్త్రీవిద్య కథ నుండి మొదలుపెడితే మొదట స్త్రీవిద్యతోనే రచయిత్రుల కథ మొదలైంది. భర్త కోసం చదువుకుంది అచ్చమాంబ కథానాయిక. ఆ కథ ఇతివృత్తం అప్పటి సమాజ పరిస్థితులకు తగినట్టు ఉంది. చదువుకోవడంతో మొదలైన స్త్రీ చైతన్యం నెమ్మదిగా ఆర్థిక స్వాతంత్ర్యం, ఆత్మగౌరవం, స్వాభిమానం, కుటుంబంలో, సమాజంలో సమానస్థానం, సమానహక్కుల గురించి మాట్లాడటం వరకూ వచ్చింది. సామాజికంగా స్త్రీలలో క్రమక్రమంగా వచ్చిన ఈ చైతన్యానికి రచయిత్రుల సాహిత్యం దర్పణం పట్టింది.

మొదటిదశలో రచయిత్రుల కథల్లో కుటుంబంలో, సమాజంలో స్త్రీ, పురుషుల మధ్య అంతరాల్ని, వివక్షను అతి సహజవిషయంగా భావించగా స్త్రీవాద కథ ఆ వివక్షను పురుషాధిపత్య రాజకీయంగా కథలకు, స్త్రీవాద కథలకు ఉన్న అంతరం సైద్ధాంతికపరమైంది. ఆ సైద్ధాంతికత

సమాజంలో అణచివేతకు గురైన అన్నివర్గాల స్త్రీలకు ప్రాతినిధ్యం వహించింది.

స్త్రీల సమస్యలు, స్త్రీ పురుష సంబంధాలు, వివాహవ్యవస్థలోని లొసుగులు వీటన్నింటి గురించి విస్తృతంగా చర్చించిన స్త్రీవాదులు ఇప్పుడు సమాజంతో పాటు కొత్తరూపు తీసుకుంటున్న సమస్యల గురించి మాట్లాడు తున్నారు. గ్లోబలైజేషన్ ప్రభావంతో స్త్రీల జీవితాల్లో వస్తున్న మార్పుల్ని సునిశిత పరిశీలనతో చర్చకు పెడుతున్నారు. మారుతున్న పల్లెలు, పట్టణ స్వరూపాలు, కరవు రక్కసి కాటుకు గురై ఛిద్రమవుతున్న మానవ సంబంధాలు, అంతరిస్తున్న కులవృత్తులు, జూదంగా మారిన వ్యవసాయం, రాజకీయరంగాల్లో స్త్రీలపై కొనసాగే అణచివేత, స్త్రీలు ఎంచుకుంటున్న కొత్త కెరియర్స్‌లోని మానసిక, శారీరక ఒత్తిడులు, మత విద్వేషాలు, ప్రవాస జీవితంలోని సంఘర్షణ... ఇలా సమాజ విశ్వరూపాన్ని తమ కథల ద్వారా చర్చకు పెడుతున్నారు స్త్రీవాదులు.

ఓల్గా, కుప్పిలి పద్మ, గీతాంజలి, నల్లూరు రుక్మిణి, పి. సత్యవతి, వి. ప్రతిమ, కొండవీటి సత్యవతి, ముదిగంటి సుజాతారెడ్డి, సుభద్ర, ఎస్. జయ, సుభాషిణి, చంద్రలత, కె. వరలక్ష్మి, షాజహానా, పుట్ల హేమలత, సి. సుజాత, నిర్మలారాణి, ఇంద్రగంటి జానకీబాల లాంటివాళ్ళు ఇటీవల రాస్తున్న కథల్ని చదివినప్పుడు, వారి కథల్లోని ఇతివృత్త వైవిధ్యాన్ని, శిల్ప పరిణితినీ పరిశీలిస్తే మనకు ఈ విషయం స్పష్టమవుతుంది.

మొదట్లో శరీర రాజకీయాల గురించి మాట్లాడిన స్త్రీవాదులు ఇవాళ రాజకీయ, రాజ్యవ్యవస్థల గురించి మాట్లాడుతున్నారు. ప్రతిమ *రాచపుండు, గంగజాతర,* కొండవీటి సత్యవతి *ముందడుగు* లాంటి కథలు రాజకీయ రంగంలో స్త్రీలు పావులవుతున్న వైనాన్ని ప్రశ్నించగా, కుప్పిలి పద్మ *కుబుసం,* పి. సత్యవతి *మంత్రనగరి,* ప్రతిమ *సాలెగూడు,* సుభాషిణి *కొత్తకోర్సు* లొస్తున్నాయి *జాగ్రత్త* లాంటి కథలు గ్లోబలైజేషన్ వికృత స్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నాయి. కొత్త కొత్త కెరియర్స్‌లో స్త్రీలపై మానసిక, శారీరక ఒత్తిడి ఎక్కువవటమే కాకుండా వారి వ్యక్తిత్వాలు ప్రశ్నార్థకమవుతున్న తీరును సునిశితంగా ఎత్తి చూపిస్తాయి చంద్రలత *ఆవర్జా,* కుప్పిలిపద్మ *సాలభంజిక* కథలు. వైవాహికేతర సంబంధాల్లో స్త్రీలు పడే మాసిక సంఘర్షణను, పల్లె జీవితంలోని వైరుధ్యాలను నల్లూరి రుక్మిణి కథలు చిత్రిస్తే, కరవు, ఫ్యాక్షనిజం భూతాల నోట్లో చిక్కుకున్న స్త్రీల బతుకుల్లోని వేదనను చిత్రిస్తాయి నిర్మలారాణి, రంగనాయకిల కథలు. స్త్రీలు మత పరమైన అణచివేతల్లో కూరుకుపోతున్న విధానాన్ని షాజహానా, గీతాంజలి కథలు ఆగ్రహంతో ప్రశ్నిస్తుండగా, ఓల్గా రాసిన *సమాగమం* లాంటి కథలు పురాణ స్త్రీల మనోభావాలకు సరికొత్త వ్యాఖ్యానం చేస్తాయి. ప్రవాస జీవితంలో స్త్రీలు పడే సంఘర్షణను చిత్రించే కథల్ని స్త్రీవాద కథల్లో ఓ భాగంగా చూడవచ్చు. ప్రవాసాంధ్ర రచయిత్రుల్లో చాలామంది తమని తాము స్త్రీవాదులుగా ప్రకటించుకోకపోయినా వారి కథల్లోని స్త్రీ పాత్రల సంఘర్షణ, ప్రవాస జీవితంలోని వైరుధ్యాలను వారు చిత్రిస్తున్న తీరు స్త్రీవాదానికి ఓ మంచి కొనసాగింపుగా చెప్పుకోవచ్చు. నిడదవోలు మాలతి *చివురుకొమ్మ చేవ, నిజానికి ఫెమినిజానాకీ మధ్య, డాలర్‌కో గుప్పెడు రూకలు, శేషుశర్మ అన్వేషణ, అగాథం,* చిమటా కమల అమెరికా ఇల్లాలు, ఉపాధ్యాయుల సూర్యకుమారి *అమ్మపెళ్ళి,* చెరుకూరి రమాదేవి *యాదృచ్ఛికం* మొదలైనవాళ్ళ కథలు ప్రత్యేకంగా స్త్రీవాద ముద్రతో లేక పోయినప్పటికీ 21వ శతాబ్దంలో స్త్రీల జీవన విధానాన్ని అవి ప్రతిబింబిస్తున్న కారణంగా వాటిని స్త్రీవాద కథలుగా గుర్తించడం సముచితమే. ఈ విధంగా స్త్రీవాద రచయిత్రుల కలం నుండి వస్తున్న అనేకానేక కథలు సమాజంలో స్థూలంగానే కాకుండా సూక్ష్మంగా జరుగుతున్న మార్పుల్ని మన కళ్ళకు కట్టినట్టు చూపిస్తున్నాయి. సామాజిక బాధ్యతతో వీరు రాస్తున్న కొత్త కథలు పాఠకులకు దిశానిర్దేశం చేస్తున్నాయి.

అయితే స్త్రీవాదం చల్లబడిపోయిందని, స్త్రీవాద కథలు ఇతివృత్త లోపంతో మూసధోరణికి వెళ్తున్నాయని, స్త్రీవాద కథల చిత్రణ అంతా నగర, పట్టణవాసాలకు సంబంధించినది మాత్రమే ఉంటోందన్న విమర్శ లను మాటలతోనో, వ్యాసాలతోనో కాకుండా పదునైన తమ సాహిత్యం ద్వారా స్త్రీవాదులు తిప్పికొడుతున్నారనటానికి పైన పేర్కొన్న కథలే మంచి ఉదాహరణ. అయితే ఇక్కడ మనం అంగీకరించాల్సిన సత్యం మరొకటి ఉంది. ఏ వాదానికైనా కొన్ని పరిమితులుంటాయి. అలాంటి పరిమితులు అస్తిత్వవాదాలన్నింటికి ఉన్నట్టుగానే స్త్రీవాదానికి కూడా ఉన్నాయి. స్త్రీవాద కథలు మూసధోరణిలోకి వెళ్ళడం లేదన్నది వాస్తవమైన ప్పటికీ ఒక వాదంగా స్త్రీవాద సాహిత్యం కొన్ని పరిమితులకు లోబడి మాట్లాడుతోందన్నది మాత్రం నిరాకరించలేని సత్యం. "స్త్రీల శరీర ధర్మా లను హీనపరిచే పితృస్వామ్య సంస్కృతిని ఎదిరించే క్రమంలో కొన్నిసార్లు స్త్రీవాద సాహిత్యం స్త్రీల శరీరాల చుట్టూ కొన్ని కొత్త మిత్‌లను కల్పించింది. స్త్రీల ప్రత్యేకతలను ఆధిక్యాలుగా ప్రకటించింది. స్త్రీల శరీర ధర్మాలను, పునరుత్పత్తి శక్తిని *సంపూర్ణ స్త్రీత్వంగా* నిర్వచించిన సాహిత్యం వచ్చింది. ఆ మేరకు అవి శారీరక లోపాలున్న స్త్రీలను గొడ్రాళ్ళుగా, మాచకమ్మలుగా వెక్కిరించిన పురుషాధిపత్యానికి జవాబుచెప్పే శక్తిని కోల్పోయాయి," అన్న కాత్యాయని మాటల్లోని వాస్తవాన్ని గుర్తించి స్త్రీవాద రచయిత్రులు ఆత్మ పరిశీలన చేసుకోవడం కూడా ఈ సందర్భంలో అవసరమే.

మూసచరిత్ర - పాక్షిక విమర్శ

స్త్రీల సాహిత్యాన్ని, వారి సాహిత్యకృషిని మొదటినుండి పురుష నిర్మిత విమర్శనా పనిముట్లతోనే పరామర్శిస్తూ స్త్రీలు ఇతర స్త్రీల కోసం రాసుకుంటున్నవాటిగానే చూస్తున్నారు తప్ప వారి సాహిత్యానికి ప్రధాన స్రవంతి చరిత్రలో సరైన ప్రాతినిధ్యం ఇవ్వలేదన్నది నిష్ఠూరసత్యం. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యచరిత్రలో ఓ మొల్ల, మరో తిమ్మక్క అంటూ వేళ్ళ మీద లెక్కించడమే తప్ప స్త్రీల సాహిత్యకృషిని సరిగ్గా అంచనా వేసే ప్రయత్నమేదీ జరలేదు. ప్రధాన స్రవంతి సాహిత్యచరిత్రలో స్త్రీల సాహిత్యాన్ని ఓ పాయగా మాత్రమే ఇన్నేళ్ళు చూపించారు. సాహిత్యచరిత్ర రచనా విధానంలోనూ, సాహిత్య విమర్శలోనూ ఇన్నాళ్ళు పురుషస్వామ్యమే రాజ్యమేలింది. మూస పోసిన పురుషస్వామ్య చరిత్ర రచనా విధానాన్ని ప్రశ్నించి దాన్ని తిరగరాసే ప్రయత్నాన్ని స్త్రీవాదులు మొదలెట్టారు. ఆ క్రమంలో వచ్చిన మనకు

తెలియని మనచరిత్ర, మహిళావరణం, నల్లపొద్దు లాంటి పుస్తకాలు సాహిత్య, సామాజికరంగాల్లో స్త్రీశక్తిని సరిగ్గా అంచనాకట్టే ప్రయత్నాలు. సాహిత్యవిమర్శ విషయానికి వస్తే మొదటినుంచి కూడా స్త్రీల సాహిత్యానికి తగినట్టు విమర్శ రాలేదు. ముఖ్యంగా స్త్రీవాద సాహిత్యవిమర్శ ఆశించిన స్థాయిలో రాకపోవటానికి ప్రధాన కారణం అందుకు అనువైన భాషను, విమర్శనా సూత్రాల్ని సంపూర్ణంగా నిర్మించుకోకపోవడం. ఓల్గా, జయప్రభ, కాత్యాయని, కాత్యాయని విద్మహే, మృణాళిని, అబ్బూరి ఛాయాదేవి, ఎన్. జయలాంటివాళ్ళు కొంతమేరకు దీనిపై కృషి చేసినా ఇంకా చేయాల్సింది చాలానే ఉందని చెప్పుకోవాలి. స్త్రీవిద్య మొదలుకొని స్త్రీల సమగ్ర సాహిత్యచరిత్ర, విమర్శ వచ్చినప్పుడే సమాజాన్ని వారి సాహిత్యం ప్రభావితం చేసిన తీరు స్పష్టమౌతుంది.

స్త్రీల సాహిత్యంపై మొదటినుండి మనకు పాక్షిక విమర్శలు మాత్రమే ఉన్నాయన్నది ఇప్పటి స్త్రీవాదుల ఆరోపణ మాత్రమే కాదు. కనుపర్తి వరలక్ష్మమ్మ కాలంనాటికే ఇది ఉంది. రచయితల సాహిత్యంపై విమర్శ ఆరోపణ మాత్రమే కాదు. కనుపర్తి వరలక్ష్మమ్మ కాలం నాటికే ఇది ఉంది. రచయితల సాహిత్యంపై విమర్శ ఎలా సాగుతుందో ఆమె తన కథ కథ ఎట్లా ఉండాలె?లో చెప్పే సాహసం చేశారు. రచయితల కథల్ని వాళ్ళల్లో వాళ్ళే ప్రశ్నించుకొని దాన్నే సద్విమర్శగా చెలామణి చేసుకునే విధానాన్ని వ్యంగ్యంగా ఆమె ఎత్తిపొడుస్తారు. ఇప్పటికీ ఆ కథ నిత్యనూతనమే.

గురజాడ దిద్దుబాటు తొలి తెలుగుకథగా మొదలైన కథాచరిత్రలో తొలితరం రచయిత్రులకున్న ప్రాధాన్యత అతి స్వల్పం. కథాసాహిత్య చరిత్రలో రచయితలకు ఇచ్చిన స్థానం రచయిత్రులకు ఇవ్వలేదు. స్త్రీవాద సాహిత్యం 1980ల్లో మొదలైనా, బండారు అచ్చమాంబ, కనుపర్తి వరలక్ష్మమ్మ మొదలుకొని అనేకమంది రచయిత్రులు స్త్రీ చైతన్యం, స్త్రీ వ్యక్తిత్వంలాంటి అంశాల్ని 1900నాటికే అప్పటి కాలమాన పరిస్థితులకు తగ్గట్టు తమ రచనల్లో ప్రస్తావించారు, చర్చించారు. అచ్చమాంబ, వరలక్ష్మమ్మ, ఇల్లిందల సరస్వతిదేవి, పి. శ్రీదేవి, శివరాజు సుబ్బలక్ష్మి మొదలైన రచయిత్రుల కథల గురించి ఎవరూ ఎక్కడా చర్చించిన దాఖలాలు మనకు కథాసాహిత్యచరిత్రలో కనిపించవు. కథకు సంబంధించిన చర్చలన్నింటిలోనూ '50ల నాటి రచయిత్రుల ప్రస్తావనలు నామమాత్రంగానే కనిపించడం విషాదకరం. తెలుగుకథ మీద ఇప్పటివరకూ వచ్చిన పుస్తకాలు, వ్యాసాలు అనేకం పరిశీలించినప్పుడు ఓ ముగ్గురు, నలుగురు రచయిత్రుల పేర్లతో... ఫలానావారు రాసేవారు అంటూ ఏకవాక్యానికే పరిమితం కావడం కనిపిస్తుంటుంది. రచయిత్రుల కథల గురించి, వారి శైలి, కథనం గురించి సీరియస్‌గా ఎవరూ చర్చించినట్టు కనిపించదు. గురజాడ దిద్దుబాటుని, అచ్చమాంబ స్త్రీవిద్య, ఖనా లాంటి కథల్ని పక్కన పెట్టి చేసినప్పుడు దిద్దుబాటు కంటే స్త్రీవిద్య, ఖనా కథలు ఏరకంగానూ తీసిపోవన్న సత్యం బోధపడుతుంది. విక్రమాదిత్యుని ఆస్థానంలోని జ్యోతిశ్శాస్త్రవేత్త మిహిరుని భార్య ఖనాకు ఎలాంటి దుర్గతి పట్టిందో చెపుతూ అచ్చమాంబ రాసిన కథ స్త్రీలు అప్పటికే సమాజంలో తమ స్థితిగతుల్ని గుర్తించడం మొదలుపెట్టారనడానికి నిదర్శనం. అలాగే ఐరోపా మహా సంగ్రామా నంతర దుస్థితిని, మాంచెస్టర్ నూలుమిల్లులు వచ్చి దేశీయ పరిశ్రమలు దెబ్బతీసిన వైనాన్ని కనుపర్తి వరలక్ష్మమ్మ కుటీరలక్ష్మి (1924) కథలో చిత్రించారు. ప్రపంచీకరణ తొలిరూపాలు సృష్టించబోయే విధ్వంసానికి మూలాల్ని మనం ఈ కథలో చూడవచ్చు. ఇలాంటి మంచి కథల్ని, రచయిత్రుల్ని పట్టించుకున్నవారు తక్కువ.

స్త్రీల సాహిత్యాన్ని చర్చించకుండా అసలు గుర్తించనట్టు మౌనంగా పక్కన పెట్టడం ఒకరకమైన వివక్ష అయితే, దాన్ని కేవలం సిద్ధాంతపరిధిలో మాత్రమే విమర్శించడం మరో రకమైన వివక్షగా పేర్కొనవచ్చు. ఇప్పటికీ మనకు పత్రికల్లో కొట్టొచ్చినట్టు కనిపించే అంశం - స్త్రీల రచనల్ని, వారి పుస్తకాల్ని సాధారణంగా స్త్రీలే సమీక్షించుకోవడం.

స్త్రీవాద రచయిత్రులు రాసిన కథల్ని విమర్శించే విధానానికి, స్త్రీవాద రచయితలు రాసే కథల్ని విమర్శించే విధానానికి ఉన్న తేడా విమర్శకులకున్న పక్షపాతధోరణిని తేటతెల్లం చేస్తుంది. రచయిత్రుల కథల్ని స్త్రీవాద సిద్ధాంత పరిధిలో ఉన్నాయని విమర్శించే విమర్శకులు రచయితల కథల్ని స్త్రీవాద దృక్పథంతో ఉన్నాయని గొప్ప చేసి చూపించడం అలాంటిదే. ఉదాహరణకు అత్యాచారం ఇతివృత్తింగా ఓ రచయిత్రి రాసిన కథ, ఓ రచయిత రాసిన కథ తీసుకుంటే వాటిని విమర్శకులు ఎలా విమర్శించారో చూస్తే...

వివినమూర్తి కథ నేరం, నిర్మలారాణి కథ మలుపు తీసుకుంటే నిర్మలారాణి కథలో మోతుబరి చేతిలో అత్యాచారానికి గురైన సునీత అతనితో పెళ్ళికి ఒప్పుకోదు. కానీ అత్యాచారం వల్ల కలగబోయే బిడ్డకు మాత్రం అతని ఆస్తిలో వారసత్వం అడుగుతుంది. ఇందులో గందరగోళ మేమీ లేదు. బలవంతంగా అత్యాచారం చేశాడు కాబట్టి దాన్ని పెళ్ళి అనే సాంఘిక లైసెన్స్‌తో సమాజ అంగీకారానికి తీసుకురావాల్సిన పనిలేదు. ఇక అత్యాచారం వల్ల కలగబోయే బిడ్డ ఆ చర్యకు ప్రతిఫలం కాబట్టి బిడ్డను పెంచడానికి అందుకు బాధ్యుడైన వాడి వద్ద నుండి అతని ఆస్తిలో వాటా అడగడం సమంజసం. ఈ కథను విమర్శించిన కోడూరి శ్రీరామమూర్తి సునీత నిర్ణయం గందరగోళంగా ఉందని వ్యాఖ్యానించారు.

వివినమూర్తి రాసిన నేరం కథ చూస్తే, విప్లవ జీవితం నుండి తండ్రి రమ్మంటే బైటకు వచ్చి పెళ్ళి చేసుకుని అమెరికా వెళుతుంది వైష్ణవ్య. అక్కడ కొన్నాళ్ళున్నాక మళ్ళీ తిరిగి వెనక్కివచ్చి కార్పొరేట్ ఆస్పత్రి కట్టిస్తారు భార్యభర్తలు వైష్ణవ్య, రాఘవలు. ఇంట్లో పనులు చూసుకోవడానికి పెట్టుకున్న పనివాడు భిక్షను పనివాడిలాగా కాకుండా విప్లవభావజాల ప్రభావంతో తమతో సమానంగా చూస్తారు ఆ భార్యాభర్తలు. భిక్షం వైప్లవ మంచితనం (?) అర్థం చేసుకోకుండా ఆమెపై అత్యాచారం చేసి చివరకు పశ్చాత్తాప పడతాడు. అప్పటివరకూ భార్య మాటకు ఎదురుచెప్పని రాఘవ అత్యాచార సంఘటనతో వైప్లవ్యకు విడాకులిస్తాడు. అత్యాచారం సంఘటనతో షాక్‌కు గురై ఆస్పత్రిలో ఉన్న వైప్లవ్య ఆ షాక్ నుండి కోలుకొని భిక్షం తప్పును క్షమించి తన కొడుకుగా దత్తత తీసుకుంటుంది. ఈ కథంతా విన్న శిష్యుడు 'ఎక్కడుంచాల్సిన వాళ్ళను అక్కడ ఉంచకపోతే ఇలాగే జరుగుతుందన్న' మాటలకు గురువు చెంపదెబ్బ కొట్టడంతో కథ ముగుస్తుంది. ఇలాంటి అతి సాధారణ వ్యాఖ్యలు చేసే మేధావులకు చెంపదెబ్బ కొట్టడంలాంటిది

ఇది అంటారు కోడూరి. ఈ కథలో కేవలం చివర్లో చూపిన పరిష్కారమే కాదు, మొదటి నుంచి చివరి వరకూ కథలో, కథనంలో అనేక లోపాలున్నాయి. అయితే కోడూరి దీన్ని గొప్ప కథగా చెప్పటమే కాకుండా ఇందులో స్త్రీవాద దృక్పథానికి మించిన పరిధి ఉందనటం విశేషం. అత్యాచారం అనే అంశాన్ని రచయితలిద్దరూ రెండు రకాలుగా చిత్రించారు. ఇందులో నిజానికి నిర్మలారాణి కథ స్త్రీవాదానికి దగ్గరగా అనడం కంటే జీవన వాస్తవికతకు దగ్గరగా ఉందని చెప్పాలి. కానీ వివినమూర్తి కథలోని ప్రధాన లోపం బలహీనమైన వ్యక్తిత్వమున్న వైప్లవ్య పాత్ర. విప్లవ జీవితం లోంచి తండ్రి పిలిపించేస్తే వచ్చేస్తుంది, చాలామందిలాగానే డబ్బున్నవాడిని పెళ్ళి చేసుకుని అమెరికా వెళ్ళిపోయి డబ్బు సంపాదించి తిరిగొస్తుంది. తిరిగొచ్చాక మంచి కార్పొరేట్ ఆస్పత్రి కట్టిస్తారు భార్యాభర్తలు. ఇలా అన్నీ తమకనుకూలంగా చేసుకుంటున్నా వైప్లవ్య అంతరంగంలో చాలా మథనపడుతోందని, అపరాధ భావనకు గురవుతోందని రచయిత వాచ్యంగా చెప్తారు. ఆ అపరాధ భావనతోనే పనివాడిని పనివాడిలా చూడాలనుకోవడం కాకుండా తమతో పాటు ఇంట్లో సమానహోదా కల్పిస్తారు. అంటే అపరాధ భావనకు ఇది సరైన పరిష్కారమా? ఆమెలో అపరాధ భావన కథలో బలంగా చిత్రితం కాకపోవడమన్న లోపాన్ని పక్కనపెడితే అత్యాచారం జరిగిన తర్వాత భర్త వైప్లవ్యను వదిలేస్తాడు. ఆమె షాక్‌కు గురై ఆస్పత్రిలో చేరుతుంది. అత్యాచారం అనేదాన్ని శీలం, పాతివ్రత్యం అనే భావనల నుండి కాకుండా దాన్ని శరీరంపై జరిగిన ఒక యాక్సిడెంట్‌గా పరిగణించి ఆమె ఆ చేదు అనుభవం నుండి బైటపడితే అది సహజత్వానికి దగ్గరగా ఉండి స్త్రీవాద కథ అయి ఉండేదేమో. అందుకోసం ఆమె తనను రేప్ చేసినవాడిని కొడుకుగా స్వీకరించి మాతృత్వభావనను ఎస్టాబ్లిష్ చేసుకోవాల్సిన అవసరం మనకు కథ రీత్యా కానీ, సమాజరీత్యా కానీ కనిపించదు. అత్యాచారంపై వచ్చిన కథల్లో వైప్లవ్య చేసినది ఓ విభిన్న పరిష్కారం. వివినమూర్తి కథకు వినూత్న ముగింపు ఇచ్చారు. అంతమాత్రాన అది స్త్రీవాద కథ అయిపోదు. అత్యాచారంలాంటి స్త్రీల సమస్యకు భిన్నమైన ముగింపు ఇచ్చిన వివినమూర్తి నేరం కథ ఆ ఏడాది వచ్చిన మంచి కథగా గుర్తింపు పొందితే ఇదే సమస్యకు మరో భిన్నమైన ముగింపు ఇచ్చిన నిర్మలారాణి కథ గందరగోళం ఉన్న కథగా విమర్శకుల వ్యాఖ్యానం పొందింది.

ఇలాంటి ఉదాహరణలు వెతుక్కుంటూపోతే కోకొల్లలుగా మనకు ఇటీవలి తెలుగు సాహిత్యంలో కనిపిస్తాయి. సద్విమర్శ అనేది సాహిత్యానికి ప్రాణవాయువులాంటిది. అలాంటి సద్విమర్శ రచనల మీద రావాలి. అంతే కానీ రచయిత్రుల వ్యక్తిగత జీవితాలపైనో, వారు నమ్ముతున్న సిద్ధాంత భావజాలం మీదనో కువిమర్శలు చేస్తూ, హాస్య, వ్యంగ్యాత్మకంగా కథలు రాయడం నీచసంస్కృతి. అలాంటి నీచసంస్కృతి తెలుగునాట మొదలైంది. నిజమైన సాహిత్యాభిలాషులెవరైనా దాన్ని ఖండించాల్సిందే. *

Our Best Compliments to the 15th **TANA** *Conference*

Genesys Hillside Center

for Behavioral Health

PURNA R. SURAPANENI, M.D.

Medical Director

2110, West Hill Road
Flint, MI 48507
Phone: (810) 239-2625
Fax: (810) 239-2625

అమెరికాలో పెళ్ళి సంబంధాలు

పప్పు సూర్యకాంతం

పూర్వకాలంలో మగ మహారాజు అనేవారు. పెళ్ళి సంబంధాలలో మగవాడు ఊ అనడమేగాని, ఆడపిల్ల ఉద్దేశాలు ఏమీ అడిగేవారు కాదు. నేను 39 ఏళ్ళ ప్రొఫెషనల్ పెళ్ళికొడుక్కి ఒక 34 ఏళ్ళ పెళ్ళికూతురిని చెబితే, ఆ కుర్రాడూ, వాళ్ళ తల్లిదండ్రులూ 28 ఏళ్ళ పైగా ఉన్న పెళ్ళి కూతుళ్ళని మాకు చెప్పకండీ అన్నారు.



నలభై ఏళ్ళ క్రితం, నాకు పెళ్ళయిన వెంటనే అమెరికాకి వచ్చినపుడు, అందరూ మా అమ్మని అడిగేవారు. 'మీ చిన్న పిల్లని ఎవరికి ఇచ్చారు? అమెరికా వెళ్తున్న అబ్బాయికి ఇచ్చారుట గదా!' అని. మా అమ్మాయికి పెళ్ళి అయిందనీ ఈరోజుల్లో నేను చెబితే, అందరూ అడిగే ప్రశ్న - 'మీ అమ్మాయి ఎవరిని చేసుకుందీ?' అని. ఈ వ్యాస సారాంశం ఈ నలభై ఏళ్ళలో అమెరికాలో నా అనుభవంలో జరిగిన మార్పులు.

1960ల్లో అమెరికా వచ్చిన కొత్తలో, మా యూనివర్సిటీలో ఒక అమ్మాయి చదువుకునేది. ఒకరోజు ఎవరితోనో మాట్లాడేటప్పుడు ఏదో సంబంధాల సంగతి వచ్చి, మా ఊరులో అమ్మాయి పెళ్ళికూతురనీ, చాలా మంచిపిల్ల అనీ చెప్పాను. అంతే, మా స్నేహితులు, అమ్మాయి తల్లిదండ్రులు మాట్లాడుకొని మూడు నెలలు తిరక్కుండా అమ్మాయికీ అబ్బాయికీ పెళ్ళి చేసేశారు. ఇలాగే మరొక సంబంధం గురించి చెబితే, ఆ సంబంధమూ కుదిరింది. ఈ రెండవ సంబంధం కుదిరేసరికి నాకు 'సంబంధాల సూర్యకాంతం' పేరు వచ్చింది (సిరివెన్నెల సీతారామశాస్త్రి గారిలాగా). నిజం చెప్పాలంటే, నేను చేసినదేమీ లేదు. నాకు తెలిసిన నలుగురు అబ్బాయిలూ, నలుగురు అమ్మాయిలను, వారి గురించి వీరికీ, వీరి గురించి వారికీ చెప్పడమే నేను చేసినదంతా.

1970ల్లో అమెరికాలో తెలుగువారి సంఖ్య (భారతీయులతో పాటు) పెరగడం ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా ఎందరో పెళ్ళి కొడుకులూ, పెళ్ళి కూతుళ్ళూ ఉన్నా, ఎవరెక్కడ ఉన్నారో తెలుసుకోవడం కష్టమైంది. 'ఇండియా అబ్రాడ్' పత్రికా ప్రచురణ ధర్మంగా అందులో 'మ్యాట్రిమో నియల్ కాలమ్స్' ద్వారా అర్హత ఉన్న పెళ్ళికొడుకులు/పెళ్ళి కూతుళ్ళ సంగతి అందరికీ తెలిసేది. ఆరోజుల్లో నేను ప్రతి వారం ఈ యాడ్స్‌ని శ్రద్ధగా చూసి, వధూవరుల జాబితా తయారుచేసి, ఎవరైనా ఫోన్ చేస్తే, 'ఇండియా అబ్రాడ్'లో ఒక అబ్బాయి/అమ్మాయి గురించి వచ్చింది, వారికి ఫోను చేయండి' అని సలహా ఇచ్చేదాన్ని. అప్పుడప్పుడు నేనే ఈ క్లాసిఫైడ్ యాడ్స్‌కి ఫోను చేసి వివరాలు సేకరించేదాన్ని.

1980ల్లో నాకు వచ్చే ఫోన్‌ల వృత్తాంతం మారింది. అప్పుడు అందరు తల్లిదండ్రులూ నాతో చెప్పేదేమిటంటే 'మా అమ్మాయి/అబ్బాయి వారి గురించి పేపరులో యాడ్స్ వేసామని తెలిస్తే మమ్మల్ని చంపేస్తారు. మేమేమైనా merchandise మా? పేపరులో యాడ్ వేసే వాళ్ళందరూ desperate people అంటున్నారు. అందుచేత, పేపరులో యాడ్ వేయని వారి గురించి మాకు చెప్పండి,'' అనేవారు. 1980లకి ముందు పెళ్ళి సంబంధాలు కుదర్చడం కష్టం అయిపోతోంది.

1990లకి ABCD Generation వచ్చేసింది. మన పిల్లలే కాదు, పెద్దవాళ్ళు కూడా ABCDs అయ్యారు. మన పిల్లలు American-Born Confused Desis అయితే, మన పెద్దవాళ్ళు American BRED Confused Desis! ఎంత కాదనుకున్నా, పిల్లలతో తల్లిదండ్రులు కూడా మారడం సహజం గదా. 1990ల నుండి పిల్లలూ, తల్లిదండ్రుల కన్‌ఫ్యూజన్ గురించి ఇంక వినండి.

ఒకమారు ఒకావిడ, ''మా అమ్మాయి ఎం.డి. పూర్తి చేసి రెసిడెన్సి ప్రారంభించుతుంది, ఏదైనా సంబంధం చెప్పండి,'' అని ప్రాధేయపడింది. అప్పుడు నేను ఎం.బి.ఏ చదివి, స్ఫురద్రూపి అయిన ఒక అబ్బాయి గురించి చెబితే వాళ్ళు తిరస్కరించారు. కారణమేమిటంటే, 'సమాన విద్యం, సమాన కద్యం అంటారు గదండీ, మా అమ్మాయికి నాన్ డాక్టర్ అయితే commonness ఏమీ ఉండదండీ' అన్నారు. నేను ఆవిడతో నా మనసు విప్పి అన్నాను గదా, 'ఈ పెళ్ళిళ్ళు అయిన వాళ్ళందరినీ చూస్తే ఎంతమంది ప్రొఫెసర్ల పెళ్ళాలు ప్రొఫెసర్లు, ఇంజనీర్ల పెళ్ళాలు ఇంజనీర్లూ? మీ అమ్మాయి అబ్బాయిని పెళ్ళి చేసుకుంటోంది గానీ, ఎం.డి. డిగ్రీని కాదు. మెడికల్ స్కూల్‌కి వెళ్ళిన మూలంగా ఒక ఎం.డి. డిగ్రీ ముడి ఆ కాలేజీ వారు వేశారు గదా,' అని. ఆ తరువాత ఆమె ఎప్పుడు ఫోను చేయలేదు. మరొకావిడ ఫోను చేసి మా అమ్మాయి బి.ఎ. ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ చేసింది. ఎవరైనా డాక్టరు చదివిన సంబంధం చూపించమంది. ఆవిడ

కారణం బ్రతకలేక బడిపంతులు అంటారు గదా, మా పిల్ల చదువుకి పెద్ద ఆదాయం రాదు, అందుచేత డాక్టరైతే వాళ్ళు ఆర్థికంగా అవస్థ పడక్కర్లేదు అన్నారు. ఈమధ్య మా చుట్టమే ఒకావిడ వెస్ట్ కోస్ట్ నుండి ఫోను చేసి మా అమ్మాయి చదువు అయింది, ఏదైనా సంబంధం చూడమని చెప్పింది. వాళ్ళమ్మాయి 5^1 పొడుగు. నా లిస్టులో 5^1-4 పొడుగు ఉన్నవాడూ, పెద్ద చదువు, స్థోమత అయిన కుటుంబం అతని గురించి చెప్పాను. ఆవిడ ఆ మర్నాడే ఫోను చేసి మా అమ్మాయి 6 అడుగులకి తక్కువ ఉన్న అబ్బాయిని పెళ్ళి చేసుకోను అని చెప్పి, ఎవరైనా పొడుగ్గా ఉన్న కుర్రాళ్ళ గురించి చెప్పమంది. ఆరు అడుగుల పొడుగున్న అబ్బాయి ఈ పొట్టి అమ్మాయిని ఎందుకు చేసుకుంటాడు అంటే మరి జవాబు లేదు. ఒక ఏడాది తర్వాత చెప్పింది - మొగుడూ, పెళ్ళాం ఇద్దరూ పొట్టిగా ఉంటే పిల్లలు కూడా పొట్టిగా ఉంటారని, ఈ సంబంధం మా అమ్మాయి తిరస్కరించిందని. ఇదేమి eugenics? అమెరికాలో మన పిల్లలు చాలామంది మనకంటే పొడుగ్గా ఉన్నారు గదా అని జవాబు చెప్పాను మా చుట్టాల అమ్మాయికి.

కాలంతోపాటు దృక్పథాలు కూడా మారతాయి. మరొక అమ్మాయి ఒక పెద్ద పట్టణంలో ఎం.బి.ఏ చేసి ఉద్యోగం చేస్తోంది. ఇండియాలో పుట్టి పెరిగి అమెరికాకి వచ్చింది. ఈ అమ్మాయి సర్దుకుపోయే స్వభావమనుకొని ఆమె తల్లిదండ్రులు ఫోను చేసిన వెంటనే మంచి సంబంధం చూపించాను. రెండు రోజుల తర్వాత ఆవిడ నాకు ఫోన్ చేసి "మా అమ్మాయి ఉద్యోగంలో స్థిరపడింది, రేపోమాపో ప్రమోషన్ కూడా వస్తుంది. చికాగో పిల్లాడిని పెళ్ళి చేసుకుంటే, ఈ ఉద్యోగం మానుకోవాలి. రెడ్డిగారొచ్చారు, హరికథని ప్రారంభించండి అన్నట్లు మళ్ళీ అన్నీ ప్రయత్నం చేసుకోవాలి. మా ఊరులో ఏమైనా సంబంధాలుచూపించండి" అని. వాళ్ళ ఊరిలో సంబంధాలు నాకెలా తెలుస్తాయి చెప్పండి! ఈ పిల్లలాంటిదే మరొక అమ్మాయి కచ్చితంగా చెప్పేసింది. 'నేను చేసుకొనే పెళ్ళికొడుకు నేను ఎక్కడికి ఉద్యోగానికి వెళితే అక్కడికే రావాలి. అలాగైతేనే నేను ఎవరినైనా కలుస్తాను,' అని.

పూర్వకాలంలో మగ మహారాజు అనేవారు. పెళ్ళి సంబంధాలలో మగవాడు ఊ అనడమేగాని, ఆడపిల్ల ఉద్దేశాలు ఏమీ అడిగేవారు కాదు. నేను 39 ఏళ్ళ ప్రొఫెషనల్ పెళ్ళికొడుక్కి ఒక 34 ఏళ్ళ పెళ్ళికూతురిని చెబితే, ఆ కుర్రాడూ, వాళ్ళ తల్లిదండ్రులూ 28 ఏళ్ళ సైగా ఉన్న పెళ్ళి కూతుళ్ళని మాకు చెప్పకండీ అన్నారు.

మన పూర్వ సంస్కృతిలో మల్లీశ్వరి లాంటి సినిమాలలో అబ్బాయి-అమ్మాయి, వాళ్ళ కుటుంబం-వీళ్ళ కుటుంబం చిన్నప్పటి నుంచీ తెలిసి, ఎంత సన్నిహితంగా ఉంటే వివాహాలకి అంత మంచిదనేవారు. అందు చేతనే మేనరికాలు సాధారణంగా చేసేవారు. అమెరికాలో మన యువతీ యువకులకి ఇది అసలు పనికిరాదు. పూర్వానుసరంగా వెళ్ళే, మన చుట్టాలు, పక్కాలు, స్నేహితులకి పెళ్ళి కావలసిన అబ్బాయిలూ, అమ్మాయిలూ ఉన్నారు. కానీ మన పిల్లలకి బాగా తెలిసిన సంబంధం చెబితే, ఆ అబ్బాయి/అమ్మాయిలతో అన్నదమ్ములు, అక్కచెల్లెళ్ళ భావన వస్తుందంటారు. ఏమీ తెలియని వాళ్ళ గురించి చెబితే బ్లయిండ్ డేట్స్



వద్దంటారు. తెలిసిన సంబంధాలు, తెలియని సంబంధాలు వద్దంటున్నారు.

2000 సంవత్సరం నుండి ఇంటర్నెట్ పుణ్యమా అని కొంతమంది పిల్లలు వాళ్ళంత వాళ్ళే తెలుగుమ్యాట్రిమోనియల్.కామ్, షాది.కామ్‌లో రిజిస్టరు చేయించుకొంటున్నారు. ఈమధ్య నా కొత్త అలవాటు ఈ ఇంటర్నెట్ సర్ఫింగ్. జాగ్రత్తగా చూస్తే అందరూ (అమెరికా) పిల్లలూ ఈ వాక్యంతో ప్రారంభిస్తారు. "I do not believe I will ever do this (i.e. register in an internet) but..." ఇది హాయిగా ఉందంటే నమ్మండి. తల్లిదండ్రులకి చెప్పలు అరిగేటట్లు తిరగడం పోయింది.

నా కథలు ఇప్పటివరకూ తల్లిదండ్రుల అవస్థలు గురించి రాశాను. చాలామంది అమ్మాయిలూ, అబ్బాయిలతో నేను మాట్లాడాను. అందరూ ఏకగ్రీవంగా చెప్పినదేమంటే వాళ్ళు ముఖ్యంగా చూసేది 'కెమిస్ట్రీ, ఫిజిక్స్, డైనమిక్స్.' నేను చెప్పిన సంబంధాలలో కొంతమంది అబ్బాయిలూ, అమ్మాయిలూ కలుసుకున్నారు. తరువాత నేను వాళ్ళకి ఫోను చేస్తే వాళ్ళ జవాబు ఏమిటంటే, 'ఆంటీ, మా ఇద్దరి మధ్యా కెమిస్ట్రీ లేదు,' అనిగానీ, 'మేమిద్దరం డిఫరెంట్ వేవ్‌లెంగ్త్స్ (ఫిజిక్స్),' అనిగానీ, 'మాకు క్లిక్ అవలేదు' అనిగానీ చెప్తారు. అన్నీ చూసి బ్రహ్మాండం మీద వాళ్ళని కలుపుతే, ఇదీ జవాబు. పోనీగదా ఏదైనా పార్టీలోగానీ, పిక్‌నిక్‌లో గానీ వాళ్ళని ఒక టేబిల్ దగ్గర కూర్చోబెట్టి చూస్తే ఇది సెటప్ అని తెగ తిడుతున్నారు.

అయిదు, పదేళ్ళలో, మన పిల్లలలో మారుతున్న దృక్పథాల మూలంగా నేను ఒక పెళ్ళి కూడా కుదర్చలేదు. అయినా నాకు ఫోన్లు వస్తూనే ఉంటాయి. వీటి సారాంశమేమిటంటే మా అమ్మాయి అమెరికన్‌నో, ఆఫ్రికన్‌నో డేట్ చేస్తోందనో, పెళ్ళి చేసుకుంటోందనో, అమెరికా రాకపోతే ఎంతో బాగుండేది అనో ఏవేవో చెప్పుకుంటారు. ఇవి అన్నీ విన్న తరువాత, తల్లిదండ్రులు పడుతున్న అవస్థలు వినడానికి 'మాచ్‌మేకింగ్' హాబీ నుండి 'కౌన్సిలింగ్' హాబీకి మారిపోయాను. నిరాశాపరులైన తల్లిదండ్రులని కూడగట్టి 'మ్యూచువల్ సపోర్ట్ (గ్రూప్స్)' చేయడం ప్రారంభిస్తున్నా.

ప్రవాహానికి ఎదురీదడం అసాధ్యం గదా! మా (పెళ్ళికాని) అబ్బాయి ఈమధ్య అన్నాడు నా 'అరేంజ్‌డ్ మ్యారేజ్' హాబీ 'డీరేంజ్‌డ్ మ్యారేజ్ కౌన్సిలింగ్' హాబీ అయిందనీ! *

ప్రాచీన సాహిత్యం భిన్న సామాజిక వర్గాల జీవితం

కాత్యాయనీ విద్మహే

కులవ్యవస్థలోని అంతస్థులవారీ సామాజిక స్థాయి పై దాడి చేశాడు పాల్కురికి సోమనాథుడు. అయినా కులవ్యవస్థ పునాదులను మాత్రం కదిలించలేకపోయాడు.



క్రొత్త చారిత్రక సందర్భాలలో భిన్న సామాజిక వర్గాల అస్తిత్వానికి సంబంధించిన చర్చ ఏదో ఒక రూపంలో ముందుకు వస్తుంది. ఒకప్పుడు దక్షిణ భారతదేశంలో శైవ, వైష్ణవ భక్తి ఉద్యమాలు ఆ రకమైన చర్చను ముందుకు తెచ్చాయి. ఇటీవలి కాలంలో భారతదేశం విద్యా, ఉద్యోగ రంగాలలో వెనకబడిన కులాలకివ్వవలసిన స్థానాల గురించి నిర్ణయించటానికి మండల్ కమీషన్ వేసిన సందర్భంలో రిజర్వేషన్ అనుకూల వ్యతిరేక శిబిరాల మధ్య జరిగిన వాదవివాదాలు మళ్ళీ భిన్న సామాజిక వర్గాల అస్తిత్వానికి సంబంధించిన చర్చను ముందుకు తెచ్చాయి. ఆంధ్రదేశంలో కారంచేడు (1985, జులై 17), చుండూరు (1990 ఆగస్టు 6) సంఘటనలు, సంఘర్షణలు మరింత పదునుగా, స్పష్టంగా ఈ చర్చను ప్రధానం చేశాయి. సామాజికంగా, ఆర్థికంగా, ఆధికారికంగా బలపడి ఉన్న సామాజికవర్గాలదే ప్రధాన ప్రవంతి చరిత్ర అయి తదితర సామాజికవర్గాల అస్తిత్వం అభావం చేయబడుతున్న పరిస్థితి పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఇది సాహిత్య సృజన విమర్శన రంగాలను బాగా ప్రభావితం చేసింది. సామాజికంగా, ఆర్థికంగా, ఆధికారికంగా బలపడి ఉన్న సామాజిక వర్గాల జీవితం, ఆకాంక్షలే సాహిత్యవస్తువై, ఆదర్శమై ప్రచారంలో ఉన్న స్థితిని మార్చటానికి ప్రయత్నం ఈ కాలంలో బలంగానే జరిగింది. ఇంతవరకు చివరి అంచులకు నెట్టివేయబడి ఉన్న భిన్న సామాజికవర్గాలు తమతమ స్వీయ జీవితానుభవాలతో, ఆకాంక్షలతో, ఆధిపత్యవర్గాలపై విమర్శతో సాహిత్యాన్ని విస్తరిస్తున్నాయి. శక్తిమంతం చేస్తున్నాయి.

సామాజిక అధికారంలో క్రిందిస్థానంలో ఉన్న వివిధ ప్రజా సమూహాలు తమ అధీనతాస్థితిని గురించిన స్పృహ పొందుతున్న కాలమిది. వాళ్ళు స్త్రీలు కావచ్చు, దళితులు కావచ్చు, వెనుకబడిన కులాలవారు కావచ్చు, అల్పసంఖ్యాక వర్గాలవారు కావచ్చు. ప్రాంతీయ అసమానతలు పెంచిన కేంద్రీకృత అభివృద్ధి వెలుగు క్రింద నీడలయి మిగిలినవాళ్ళూ కావచ్చు. సమాజపు అంచులకు నెట్టివేయబడిన వీళ్ళంతా ప్రధాన జీవన సంస్కృతి నిర్మాణంలో గుర్తింపుకు నోచుకోని, తరచు నిర్లక్ష్యానికి గురవుతున్న తమ భాగస్వామ్య కృషిని గురించి ఆందోళనకు లోనవుతూ అస్తిత్వాన్వేషణలో పడిన ఆధునిక చారిత్రక సందర్భం నుండే సామాజిక, సాహిత్య, సాంస్కృతిక రంగాలలో మహా కథనాల ప్రాధాన్యతను పక్కకు పెట్టి సమాజపు చివరి అంచులకు నెట్టివేయబడిన వాళ్ళ జీవిత కథనాల అధ్యయనానికి ప్రాముఖ్యత పెరిగింది. అందులో భాగంగానే తెలుగు సాహిత్యంలో స్త్రీల జీవితాలు, ప్రాంతీయ ప్రత్యేకతలతో కూడిన జనజీవితాలు ప్రత్యేకంగా, అధ్యయనం చేయబడుతున్నాయి. ఆ క్రమంలోనే నేనిప్పుడు ప్రాచీన తెలుగుసాహిత్యం - భిన్న సామాజికవర్గాల జీవితం అనే అంశంపై మాట్లాడదల్చుకొన్నాను.

1

భారతీయ సమాజం బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలుగా విడిపోయి ఉంది. ఈ చాతుర్వర్ణ వ్యవస్థకు వెలిగా మాలమాదిగలున్నారు. ఆటవిక, గిరిజన తెగలున్నాయి. వర్ణాన్నిబట్టి మానవులకు నిర్దేశిత ధర్మాలున్నాయి. మనుస్మృతి మొదలు ధర్మార్థ కళా సాంస్కృతిక శాస్త్రాలన్నీ వర్ణధర్మాన్నే ప్రతిపాదించాయి, ప్రచారం చేశాయి. ఏ వర్ణానికి ఆ వర్ణం చేయవలసిన పని ఒకటి ఉన్నదని, జీవించవలసిన పద్ధతి ఒకటి ఉన్నదని వాటిని ఎవరూ అతిక్రమించరాదని, అతిక్రమిస్తే వర్ణధర్మం తప్పినట్లేనని స్పష్టం చేశాయి. వర్ణధర్మం అతిక్రమించటం రాజ్యం సహించదని, అది శిక్షార్హమని ప్రకటించాయి. "బ్రాహ్మణులకు దపస్వాధ్యాయ సత్యశౌచ బ్రహ్మచర్యంబులును, రాజులకు దండనీతియు, వైశ్యులకుఁ గృషి పశుపాలన, వాణిజ్యంబులును, శూద్రులకు శుశ్రూషయు పరమ ధర్మము"మని భారతం అరణ్యపర్వంలో ధర్మవ్యాధుడి కథాసందర్భంగా కంఠోక్తిగా చెప్ప బడింది. రాజధర్మం అంటే సకలవర్ణ ధర్మ రక్షణం చేయటమేనని కూడా ఈ సందర్భంలోనే చెప్పబడింది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే నాలుగు జాతుల ప్రజలు తమకు నిర్దేశించ బడిన విధులను తప్పకుండా కాపాడే రాజధర్మ నిరతులుగా ఆదిపర్వంలో పరీక్షిత్తు, అరణ్యపర్వంలో జనకుడు ప్రస్తుతించబడ్డారు.

వర్ణవ్యవస్థలో ఆధిక్యత, అధికారం ప్రధానంగా బ్రాహ్మణులవి, క్షత్రియులవి. బ్రాహ్మణుడు ఏం చేసినా చెల్లుతుంది అని చ్యవనుడి కథా సందర్భంగా అగ్ని చేత చెప్పించాడు నన్నయ్య (ఆదిపర్వం - ప్రథమాశ్వాసం, 139). భృగువు తన భార్య పులోమ గురించి రాక్షసుడికి తెలిపి ఆమెకు ఆపద కలిగించాడని కోపించి, అగ్నికి సర్వభక్షకుడవు కమ్మని శాపం ఇచ్చినప్పుడు అగ్ని *అణచినఁ దిట్టినన్ మఱి మహాపరుషంబులు వల్కి యల్కతోఁబొడిచిన నుత్తమద్విజులు పూజ్యులు వారల కెగ్గు సేసినం జెడు నిహముం బరంబు...* (138) అని తాను భృగువు మీద ఆ కారణం చేతనే కోపించటం లేదని చెప్పాడు. విప్రులతో సంబంధం ఉన్న అపవిత్రులు కూడా పూజ్యులేనని గరుత్మంతుని కథా సందర్భంలో పేర్కొన్నాడు.

బ్రాహ్మణులు, క్షత్రియులు పరస్పర సంబంధాల్లో ప్రయోజనాలు పొందుతుంటారు. "రాజరక్షితులై కాదె మహామునులు ఘోర తపంబు సేయుచు మహాశక్తిమంతులయి యున్నవారు" అని శమీకుడు తన కొడుకు శృంగి పరీక్షిత్తును శపించినందుకు మందలించాడు. (ఆది-ద్వితీయ-175) తపతీ సంవరణోపాఖ్యానంలో "మహాత్ములయిన పురోహితులం బడసిన రాజుల కభీష్టంబులయిన శుభంబులగుట నిశ్చయంబ" (ఆది-సప్తమ-87) అని పేర్కొనబడింది. ఈ రెంటిని కలిపి చూచినప్పుడు బ్రాహ్మణులవి, క్షత్రియులవి పరస్పర ప్రయోజనాపేక్ష సంబంధాలని స్పష్టమవుతుంది. శూద్ర కులాలు హీనకులాలుగా పరిగణింపబడటం ఉంది. సూత కులంలో పుట్టటం న్యూనతా విషయం. న్యూనతను స్థిరీకరించటం, అభావం చేయటం, ఆపాదించటం ఏవైనా బ్రాహ్మణులకు, క్షత్రియులకు చేయగల కార్యాలు. కర్ణుడిని సూతపుత్రుడని, న్యూనపరచటం, దాశరాజు కూతురు సత్యవతిని మోహించిన పరాశరుడు 'వసురాజర్షి వీర్యంబున పుట్టినదానవు గానీ సూతకుల ప్రసూతవుకావని' ఆమెలోని న్యూనతను అభావం చేయటం, ఎవరిమీదనైనా కోపం వచ్చినప్పుడు శూద్రయోని యందు పుట్టమని శపించటం (మాండవ్య మహర్షి యముడికి ఇచ్చిన శాపం అదే. దాని ఫలితంగానే యముడు విదురుడుగా శూద్రయోని యందు పుట్టాడని భారత కథనం) - ఈ మొదలైన సందర్భాలు అందులో భాగమే. శూద్రత్వంలో ఈ ఆపాదిత హీనత్వం నీచత్వం సమాజంలో అట్టడుగు స్థాయికి కొన్ని ప్రజా సమూహాలను నెట్టివేయటానికి, వాళ్ళ మీద పెత్తనాన్ని స్థిరీకరించటానికి ఉపయోగపడింది. "గర్వంబు వదలి / త్రైవర్ణికుల యెడ భావంబు భక్తిమ/యంబుగా శుశ్రూష యాచరించి / శూద్రుడైహిక సుఖ సుగతులఁబడయు"నని (ఆనుశాసనిక పర్వం - తృతీయాధ్యాయయం, 276) శూద్రులకు విధేయత గుణంగా చేయబడిన వ్యవస్థలో వాళ్ళు బెరుకుబెరుకుగా బ్రతకవలసినవాళ్ళయ్యారు. ఆ బ్రతుకే వారికి 'బెరుకు కులము' అన్న ముద్ర (అరణ్యపర్వం-పంచమాశ్వాసం, 128) వేసింది.

ఈ విధంగా వర్ణవ్యవస్థను సమర్థించి నిలబెట్టటమే లక్ష్యంగా పదకొండవ శతాబ్దం నుండి తెలుగులో భారతరచనతో ప్రారంభించి సాగుతున్న సాహిత్య వ్యవసాయంలో బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాల జీవితమే ప్రధానమై తదితర సామాజిక వర్గాల జీవితం ఆనుషంగికం అయింది. సాహిత్యలక్షణాలను క్రోడీకరించి సూత్రీకరించిన అలంకారశాస్త్రాలు సాహిత్యంలో బ్రాహ్మణుల క్షత్రియుల జీవితం ప్రధానంగా ఉండాలని, వైశ్యుల జీవితం అయినా సాహిత్య వస్తువు కావచ్చని చెప్పిన విషయం పరిశీలిస్తే సాహిత్యం సమాజంలోని ప్రధాన స్రవంతి అధికార స్రవంతి జీవితాన్నే చిత్రించటానికి ప్రాముఖ్యత నిచ్చిందని శూద్రులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని స్పష్టమవుతుంది. ఇక వర్ణవ్యవస్థా పరిధిలోనికే రాకుండా సమాజం చివరి అంచులకు నెట్టివేయబడిన పంచముల సంగతి, గిరిజన తెగల సంగతి చెప్పనే అక్కర్లేదు.

అయితే సాహిత్యానికి ఒక ప్రత్యేకత ఉంది. అది సమాజంలోని బ్రాహ్మణ, క్షత్రియ వర్ణాలవారి జీవితాన్నే ప్రధాన వస్తువుగా చేసుకొన్నా, ఆ వర్ణాల ఆధిక్యతా అధికారాలను స్థాపించే క్రమంలో సాపేక్ష సంబంధంలో తదితర వర్ణాలవారి జీవితాన్ని ఏదో ఒక మేరకు ఇతివృత్తంలో భాగం చేయటం అనివార్యం అవుతుంది. అయితే ఇంతవరకు సాహిత్యంలో చర్చలు, విశ్లేషణలు, విమర్శలు ప్రధాన కథేతివృత్తాన్ని ఆశ్రయించే జరుగుతూ వచ్చాయి. ఇతిహాసపు చీకటి కోణం అట్టడుగున పడి కనిపించని కథలన్నీ కావాలిప్పుడు అన్న దృష్టితో పరిశీలిస్తే ప్రాచీన సాహిత్యంలో భిన్న, సామాజికవర్గాల జీవితం ఏ రకంగా ప్రతిఫలించిందో అర్థం అవుతుంది.

ఈ అధ్యయనం కొరకు భారత రామాయణాలు, భాగవతము, హరివంశము, ఆముక్తమాల్యద, మనుచరిత్ర, శ్రీకాళహస్తి మహాత్మ్యము, పాండురంగ మహాత్మ్యము, పల్నాటి వీరచరిత్ర, బసవపురాణం, పండితారాధ్య చరిత్రము, వాల్మీకి చరిత్రము, హంస వింశతి మొదలైన ప్రాచీన ఇతిహాస పురాణ కావ్యరచనల నుండి సమాచారాన్ని సేకరించటం జరిగింది.

2

జీవితం అంటే ప్రాణం అని అర్థం. అయితే 'ప్రాణం' కలిగి ఉండటం ఒక్కటే జీవితం కాదు. ప్రాణి ఇతర ప్రాణులతో ఏర్పరచుకొనే సంబంధాలు, సర్దుబాట్లు కలిసి నిరంతరం నవనవోన్మేషంగా రూపొందుతూ ఉండేది జీవితం. జంతువులు కూడా ప్రాణులే. కానీ వాటికి లేని జీవితం మనుషులకు ఉన్నదంటే దాని అర్థం అది కౌటుంబిక సామాజిక సంబంధాలలో రూపొందేది కావటం వల్లనే. కనుక సాహిత్యంలో భిన్న సామాజిక వర్గాల జీవితాన్ని కౌటుంబిక సామాజిక సంబంధాలనే రెండు కోణాల నుండి చూడాలి.

బ్రాహ్మణులకు కుటుంబజీవితం అంటే యజ్ఞకర్మలు చేయటం, ఎప్పుడూ వేదాధ్యయనం చేయించటంలోనే ఆసక్తి కలిగి ఉండటం, పెద్దలు కుదిర్చి చేసిన పెళ్ళి వలన లభించిన భార్యతో సౌఖ్యాలు పొందటం - అతిథి అభ్యాగతులను ఆదరించటం - మనుచరిత్రలో ప్రవరుడిది, ఆముక్తమాల్యదతో విష్ణుచిత్తుడిది ఇటువంటి ఉత్తమ గృహస్థ జీవితమే. ప్రవరుడు ఉదయమే శిష్యులతో కలిసి యేటి స్నానానికి వెళతాడు. స్నానం చేసి, సంధ్యావందనం చేసి సావిత్రి జపం చేసి, సూర్యనమస్కారాలు చేసి శిష్యులు పండ్లు, సమిథలు, దర్భలు, పూలు మొదలైన పదార్థాలు ఉదికిన మడి ధోవతులు తీసుకొని వెంటరాగా ఇంటికి వస్తాడు. (ప్రథమ-54) అగ్నికార్యం, దేవతార్చన, బ్రాహ్మణసేవ చేస్తాడు (ద్వితీయ-53). రాజులు మొదలైనవారు గౌరవించి పన్ను లేకుండా ఇచ్చిన వ్యవసాయ భూములు బాగా పండుతాయి. కనుక ఇల్లెప్పుడు పాడిపంటలతో సమృద్ధంగా ఉంటుంది. తల్లి

దండ్రుల క్షేమం, ఆకలిదప్పులు అతను పట్టించుకొంటాడు. కొడుకు ఒక్క క్షణం కనబడకపోతే తండ్రి ఊరంతా వెతుకుతాడు. తల్లి బాధపడుతుంది. ఇక ప్రవరుడి భార్య అన్నపూర్ణకు సమానమైన గృహిణి. అతిథి అభ్యాగతులకు వండి వడ్డించటానికి అర్ధరాత్రయినా సిద్ధమే ఆమె. అటువంటి కుటుంబం ప్రవరుడిది.

ఆముక్తమాల్యదలో విష్ణుచిత్తుడిది వైష్ణవభక్తిమయ కుటుంబ జీవితం. భగవత్పరిచర్య పరమ పురుషార్థమని నమ్మినవాడతను. అందులో భాగంగా వైష్ణవులను సేవిస్తాడు. 'న్యాయార్జిత విత్తం'తో వాళ్ళకు భోజనాలు పెడుతుంటాడు. ఆయన భార్య అనుకూలవతి. వర్షాకాలంలో, వేసవిలో, శీతాకాలంలో వాతావరణానికి తగిన వంటకాలు వండి పెడుతుంది. విష్ణుచిత్తుడు ఎవ్వరేమి కోరితే వారికవి పెడుతూ భాగవతులను సంతుష్టి పరుస్తుంటాడు.

పాండురంగ మహాత్మ్యములో నిగమశర్మ కథాసందర్భంలో బ్రాహ్మణుడి కుటుంబజీవితం ఉండవలసిన పద్ధతిలో ఉండకపోవటాన్ని చిత్రించాడు తెనాలి రామకృష్ణుడు. సంధ్యావార్చటం, వేదచర్చలలో పాల్గొనటం బ్రాహ్మణజీవితంలో భాగం. నిగమశర్మ అవేవీ చేయడు. వైదికాచార దూరప్రవర్తనమతనిది. అతను ఇల్లు పట్టక తిరుగుతుంటే అతని అక్క వచ్చి కుటుంబవ్యవహారాలు చక్కదిద్దింది. తల్లిదండ్రులను ఓదార్చింది. తగిన ఉపచారాలు చేసింది. ఇంట్లో దేవతార్చన, అతిథి సంతర్పణం నేర్పుగా నిర్వహించింది. తమ్ముడి దుర్వ్యసనాలకు ఖర్చయిపోగా మిగిలిన మూలధనం భద్రపరిచింది. పశు, శిశు, దాసదాసీ జనాల బాధ్యత స్వీకరించింది. గ్రంథాలయాన్ని ఉద్ధరించే బాధ్యత భర్త చేతికి అప్పగించింది. ఇంట్లో చదువు సంధ్యలు యథాపూర్వకంగా సాగేట్లు చేసింది. రాజానుగ్రహలబ్ధమైన భూములను స్వాధీనం చేసుకొన్నది. తమ్ముడు అమ్మగా మిగిలిపోయిన భూములు చెట్లు ఉన్న ప్రదేశాలు తెలుసుకొని కాపలా పెట్టింది (తృతీయ-24). అంటే ఇవన్నీ బ్రాహ్మణ గృహస్థు చేసుకొనవలసిన పనులు. ఈ రకమైన పనులతో కూడినదే బ్రాహ్మణ జీవితం. అలాంటి జీవితం జీవించలేదు కనుక నిగమశర్మ దు:ఖకారకు డయ్యాడు. ప్రవరుడు, విష్ణుచిత్తుడు, నిగమశర్మ ఈ ముగ్గురి ఉదంతాలు చూస్తే బ్రాహ్మణులది ప్రధానంగా గృహస్థధర్మ నిర్వహణమేనని స్పష్టపడుతుంది. వేద విద్య అధ్యయన అధ్యాపనాల ద్వారా సమాజంలో మేథో ప్రపంచంతోను అతిథి అభ్యాగతుల ఆదరణద్వారా సమాజంలో పండితులు, సన్యాసుల దగ్గర నుండి ఏ దిక్కు లేని మనుషులందరితోను సంబంధంలో ఉండే సామాజికవర్గం బ్రాహ్మణ వర్గం. ఉత్పత్తిరంగాలతో వారికి ప్రత్యక్ష సంబంధం లేదు.



క్షత్రియులది ప్రధానంగా శస్త్ర జీవితం. అస్త్రశస్త్ర విద్యలు నేర్చుకొనటం తద్వారా రాజ్యాధికారాన్ని స్థిరీకరించుకొనటం, విస్తరింపజేసుకోవటం వారి జీవితం. భారతంలో కౌరవ పాండవుల జీవితం అంతా ఆస్తుల కోసం, రాజ్యం కోసం సంఘర్షణ పడటమే. ఈ క్రమంలో వాళ్ళది కౌటుంబిక జీవితాన్ని మించిన రాజకీయ జీవితం అయింది. కుటుంబ సంబంధమైన విధులు, ధర్మాలు వాళ్ళకు ఏమున్నాయో కూడా తెలియదు. వాళ్ళు నిర్వర్తించాల్సింది రాజధర్మం మాత్రమే. వర్ణాశ్రమ ధర్మ పరిరక్షణే రాజధర్మం. యుద్ధం చేయటమే రాజధర్మం. అత్యంత శక్తిమంతమైన రాజ్యానికి ప్రతినిధిగా రాజు అధికుడు. 'మనుష్యులెల్ల భూమిదయితు కంటె తక్కువ' (శాంతిపర్వం - ద్వితీయ-251) అని రాజు ఆధిక్యతను భీష్ముడు నొక్కిచెప్పాడు. అందువల్లనే వీరోచిత కృత్యాలు, యుద్ధ నైపుణ్యాలు క్షత్రియుల జీవితం అంతా ఆక్రమించుకొని కనిపిస్తాయి. కావ్యానికి యుద్ధమే ప్రధాన వస్తువని అలంకార శాస్త్రాలు నిర్ధారించాయి కూడా. యుద్ధానికి యుద్ధానికి మధ్య విరామంలో సుఖభోగానుభవం రాజ లక్షణం. కనుకనే అలంకార శాస్త్రాలు కన్యావరణం, విప్రలంభం, వివాహం ప్రధానంగా ఉండే రాజజీవితాన్ని కావ్యవస్తుగా చేసుకోవచ్చునన్నాయి. ఆ క్రమంలోనే వీర శృంగార రసాలు కావ్యంలో గౌరవస్థానాన్నీ పొందాయి.

భారతంలోనే కాదు రామాయణంలోనూ క్షత్రియులది ప్రధానంగా శస్త్ర జీవితమే. శస్త్ర జీవితంతో పాటు క్షత్రియుల శృంగార జీవితాన్ని చూపటానికి భారతంలోని యయాతి కథ, దుష్యంతుడి కథ చక్కగా సరిపోతాయి. వసుచరిత్ర రాజుల శృంగార జీవితాన్ని ఏకదేశంగా నిరూపించింది. శృంగారనైషధం కూడా అందుకు ప్రబలోదాహరణమే.

ఇక వైశ్యుల జీవితం అయ్యలరాజు నారాయణామాత్యుడు రచించిన హంసవింశతిలో మాత్రమే కనిపిస్తుంది. చిత్రభోగుడనే రాజుకు వివాహిత అయిన హేమవతికి ఒకరిపట్ల ఒకరికి మోహం కలుగుతుంది. హేమవతి భర్త దూరదేశం వెళ్ళిన సమయంలో హేమవతి రాజు దగ్గరకు బయలుదేరుతుంది. పెంపుడు హంస ప్రతిరోజూ ఆమెను పోనీయక ఏదో ఒక కథ చెప్పి కాలక్షేపం చేసి ఇరవైరోజులు గడిపింది. అలా రోజుకొకటిగా చెప్పిన కథలు వైవాహికేతర సంబంధాలకు దిగిన స్త్రీల సమస్యలను వాటిని తప్పించుకునే చాకచక్యానికి సంబంధించినవి. హంస చెప్పిన కథలలో ఎనిమిదవ రాత్రి కథ కోమటి దంపతులది.

ఆ దంపతులు ధనచిత్తుడు, వసుమతి. ధనచిత్తుడి పాత్రను పరిచయం చేస్తూ అయ్యలరాజు నారాయణామాత్యుడు వాణిజ్యమే వైశ్యుల జీవితం కనుక జాజికాయ, జాపత్రి మొదలు అతను అంగడిలో అమ్మే సరుకుల జాబితా ఒకటి ఇచ్చాడు. అంతకు మించి వైశ్యుల జీవితం గురించిన వివరాలు లేవు.

3

అనుచరత్వమే ధర్మంగా (ఆనుశాసనిక పర్వం, తృతీయ-272) నిర్దేశించబడిన శూద్రుల జీవితం ప్రాచీన తెలుగు సాహిత్యంలో ఆసక్తికరంగా దర్శనమిస్తుంది. శూద్రులలో జాలరులు, గొల్లవారు, నేతగాళ్ళు, కంసాలులు, కుమ్మరులు, రెడ్లు, వెలమలు, చాకళ్ళు మొదలైన వృత్తుల

వాళ్ళున్నారు. మాలలున్నారు, ఎరుకలు ఉన్నారు. నిషాదులు, కిరాతులు అన్న పేర్లతో కూడా ఎరుకలు ప్రస్తావించబడ్డారు. వీరిలో కూడా ఎక్కువగా సాహిత్య వస్తువైంది గొల్లవారి జీవితం, ఎరుకుల వారి జీవితం.

శ్రీకృష్ణుడు నాయకుడుగా అతని చుట్టూ అల్లబడిన కథలతో ఉన్న భాగవత పురాణంలో, హరివంశంలో గొల్లవారి జీవితం అనివార్యంగా భాగమైంది. పశుపోషణ గొల్లవారి జీవితం. ఆర్థికవ్యవస్థను పటిష్టం చేయటంలో పశుపోషణ దశకు ప్రధాన స్థానం ఉంది. పశువులను పచ్చికబయళ్ళకు తీసుకొని వెళ్ళి మేపుకు రావటంతో ముడిపడి ఉన్న పురుషుల పని స్థిర వ్యవసాయ జీవితంవైపు మళ్ళుతున్న దశలో పశువుల పాలు తీయటం దగ్గర నుండి అనేక పనులు స్త్రీల ఇంటి పనిలో భాగం అవుతూ వచ్చాయి. పాలను కాచటం దగ్గర నుండి తోడేసి పెరుగు చేసి చిలికి వెన్నతీసి నెయ్యి కాచే వరకు ఉన్న పని క్రమంలో గొల్లవారింట స్త్రీల జీవితం ఎంత హడావుడిగా ఉంటుందో పోతన భాగవతంలో యశోద జీవితంలో చూపించాడు. కాగిన పాలకుండలు, పాలకుండలు పెట్టే ఉట్లు, మీగడ పెరుగు కుండలు, వెన్నకుండలు, నేతి కడవలు - ఇదంతా పశుపోషణ దశ యొక్క సంపద్వైభవమే. (దశమస్కంధం-306) చల్ల చిలికేందుకు కవ్వం నిలపటానికి తాడు కట్టిన నడిమింటి స్తంభాలు, కవ్వపుతాడు, కుదురు మీద పెట్టిన పాల కుండలు, పొయ్యి మీద కాగుతున్న పాలకుండలు ఇలా ఒక దృశ్యాన్ని కళ్ళ ముందు సాక్షాత్కరింపజేస్తాడు పోతన.

గొల్లవారి సంపద పాలూ పెరుగే. శ్రీకృష్ణుడు ఎవరింటా వాటిని మిగలనీయడు. తాను తాగినంత తాగుతాడు, తనతోటివాళ్ళకు పోస్తాడు. మిగిలినవి నేలపాలే. ఈ ఆగడాలు భరించలేకనే గోపికలు 'ఓయమ్మ నీ కుమారుడు, మా ఇండ్లను బాలుపెరుఁగు మననీడమ్మా' అని కృష్ణుడిపై ఫిర్యాదు చేశారు. 'పొయెదమెక్కడికైనను' అని నిష్ఠూరంగా మాట్లాడారు. వాళ్ళే కాదు... అందరూ కలిసి అక్కడి నుండి వెళ్ళాల్సే వచ్చింది. వాళ్ళున్నది బృహద్వనంలో. పూతన చన్నివ్వటం దగ్గర నుండి ప్రారంభమై ఎన్నో ఉత్పాతాలు, ఉపద్రవాలు ముంచుకురావటం, కృష్ణుడు వాటిని దాటించటం తలచుకొని నందుడు మొదలైన గోపవృద్ధులందరూ సమావేశమై అక్కడి నుండి మకాం మార్చాలన్న నిర్ణయానికి వచ్చారు.

కసవుగల దిరవు పశులకు లసదద్రి
నదీ మహీజ లతికావళిఁబెం
పెసఁగును గాఁపురమునకును
బొసఁగును బృందావనంబు పోదఁమచ్చటికిన్

(దశమస్కంధం-422)

ఆలమందలను నడిపించుకొంటూ వెళ్ళారు. గొల్లల జీవితంలో ప్రత్యేకత ఇది. ఒకచోట నుండి మరొకచోటికి గుంపుగుంపుగా మకాం మార్చటం పశుపాలక వ్యవస్థ లక్షణం. బృహద్వనం నుండి బృందావనానికి మారటానికి అసలు కారణం హరివంశంలో ఉంది.

ఉన్న ప్రాంతం వదిలి వెళ్ళాలన్న ఆలోచన వచ్చింది శ్రీకృష్ణుడికి. 'మనం పుట్టి బుద్ధి యెరిగింది మొదలు ఇక్కడే ఉన్నాం. ఇక ఇది మంచిది కాదు' అని శ్రీకృష్ణుడు బలరాముడితో తన అభిప్రాయం చెప్పాడు.

ఎరువు తిప్పలుగొని యెల్లమందలుఁగొనుజెక్కి మేపుడు చోటు
ద్రొక్కువడియెఁ
దరులోలి నరుక మొదళులు సిక్కంగ జొంపము లేని
జాడలు వడియెఁబొదలు
మడువులు పసులకాల్మడి బ్రుచ్చె దొరుగొండి వ్రంతలు పెను
రొంపి వ్రంతలయ్యెఁ
భూరి పంటలు చెడిపోయె రాలుడిఁగ్రంపలోనుగా
దవ్వులగాని లేదు
పులుఁగు పూరెడు పోపడి పొలములందు,
మెలఁగి వెదకిన బుట్టదు మెకములడఁగె
కూరగాయ కట్టియ విల్చి కొనగవలసి
యునికి వ్రేపల్లె వీటి పట్టునకు దొరఁగె

(హరివంశం పూర్వభాగం, షష్ఠాశ్వాసం-5)

పూతన, శకటాసురుడు మొదలైన రాక్షసుల రూపంలో ఉత్పాతాలు పుట్టాయి, పుడుతున్నాయి కనుక బృహద్వనం విడిచి వెడదామన్న నిర్ణయానికి రావటం కంటే పశువులకు అనువైన వాతావరణం అక్కడ లేకుండాపోయింది కనుక పశుపోషణే జీవితంగా ఉన్నవాళ్ళం కనుక, పశువుల కోసం మకాం మారుద్దామని కృష్ణుడు అన్న మాటలో లోకవాస్తవం ఉంది. పశువులు మేయటానికి పచ్చికబయళ్ళు సరిగా లేవు, పశువుల పెంటతో త్రొక్కుడు పడ్డాయి. నరికిన చెట్లకు చిగుర్లు దట్టంగా రావటం లేదు. పొదలు దట్టంగా లేవు. పలచబడ్డాయి. మడుగులు తొక్కిసలాటకు గురి అయ్యాయి. గండ్లు తెగి నీరు పారి అంతా బురద అయింది. ఇదంతా పశువులకు అవసరమైన గడ్డి కొరతను సూచిస్తుంది. కూరగాయలు, కట్టెలు కొనుక్కొనవలసిన స్థితి అంటే అది వనరుల తరుగుదలను సూచిస్తుంది. ఇటువంటి చోట నివసించటం దు:ఖావహం కనుక బృందావనానికి వెళ్దామని శ్రీకృష్ణుడే అన్నాడు. అక్కడ జీవించటానికి అలవాటు పడ్డ ముసలివాళ్ళు కదలటానికి ఇష్టపడరని గ్రహించి శ్రీకృష్ణుడు వాళ్ళను ఒప్పించటానికి అక్కడ క్రూరమృగాల భయం కలిగించాడు. చివరికి అందరూ బృందావనం తరలి వెళ్ళారు.

గోపబాలకులు పశువుల మందలను తోలుకొనిపోయి అడవిలో మేపటం, చద్దికావళ్ళు మోసుకొని పోవటం, ఒకరినొకరు కవ్వించుకొంటూ కేరింతలు కొడుతూ తిరగటం, ముట్టిచ్చుకొనే ఆట ఆడటం, చద్దులు ఆరగించటం మొదలైన బాల్యక్రీడలు (దశమ-453-465) భాగవతంలో చక్కగా చిత్రితమయ్యాయి. హరివంశంలో దేవకీదేవి వసుదేవులకు పుట్టిన శ్రీకృష్ణుడిని వసుదేవుని ఆజ్ఞ ప్రకారం నందుడు మధురాపురం నుండి వ్రేపల్లెకు తీసుకొని వెళ్ళిన కథాసందర్భంలో వ్రేపల్లె జీవితం ఒక వచనంలో వర్ణించబడింది. లేగదూడల ఉత్సాహ సంచారంతో, ఎదకొచ్చిన ఆవుల వెంబడిపడి ఒకదానికొకటి చేరనీయక రంకెలు పెట్టే ఎద్దులు చేష్టలతో, పాడి ఆవుల నోటినురుగు, చిన్నదూడల పేడ, పాలకుండల మసి తమకు సహజ ఆభరణాలు కాగా పాలు పిదికి పెద్దపెద్ద తాళ్ళు తలలకు చుట్టుకొని అటు ఇటూ తిరుగుతూ ఆవుల నుండి దూడలను వేరు చేస్తున్న గొల్లవారితో, ఒంటి మీది పైపంచలు వేసి లాగి కోడెదూడలను కిందపడవేసి

వర్తకులకు అప్పగించేవారితో, రోగాలతో బాధపడే పశువులకు చికిత్స చేసేవారితో, దూడలను దగ్గరకు చేరనివ్వని పాడి ఆవులను దూరంగా కట్టేసి పాలుచేపుకు రావటానికి రకరకాల మార్గాలు అనుసరిస్తున్న వారితో, కావళ్ళు కాసి కాయగాచిన భుజాలు వంగిపోయిన వీపులు పశువుల కొమ్ముల తాకిడికి గంట్లు కట్టిన అవయవాలు కలిగిన గొల్లవారితో, ఏటి నీళ్ళు మోసుకొని వస్తున్న స్త్రీలతో, మజ్జిగ చిలికే పనిలో నిమగ్నమైన స్త్రీలతో, నెయ్యి మజ్జిగ అమ్మే పనిలో, ఇంటిపనిలో, పిల్లలకు, కూలివాళ్ళకు అన్నాలు పెట్టే పనిలో, పిల్లలను సముదాయించే పనిలో అవస్థలు పడుతున్న స్త్రీలతో, నేయి, పాలు కాగుతున్న వాసనలు వ్యాపించిన ఒకనాటి ఉదయపు గొల్ల పల్లెజీవిత శ్రమైక జీవన సౌందర్యాన్ని ఎఱ్ఱాప్రెగడ హరివంశంలో అద్భుతంగా దృశ్యమానం చేశాడు. (అయిదవ ఆశ్వాసం-143).

హంసవింశతిలో అయిదవరాత్రి కథకు గొల్లచిన్నది కేంద్రం. ఆ నెపంగా కవి గొల్ల ఇంటిని వర్ణించాడు. కంబళి, తలగుడ్డ, కవ్వం, చిలుకుడు గుంట, మజ్జిగబాన, కావడి, ఉట్లు, చిక్కం, వెన్నపూస చట్టీ, పాలబుడిగెలు, చుట్టు చవికెలు - ఇట్లా ఎన్నో గొల్ల ఇళ్ళకు ప్రత్యేకమైన వస్తుజాలం (ద్వితీయ-75) పేర్కొనబడింది. ఎన్నిరకాల పేర్లతో పశువులను పిలవవచ్చో కూడా ఒక జాబితా ఇచ్చాడాయన.

స్త్రీ పురుషులిద్దరి భాగస్వామ్యంతో ఉత్పత్తి సంబంధాలతో ముడిపడి ఉన్న సమగ్ర జీవితంగా గొల్లవారి జీవితం కనబడుతుంది.

4

మహాభారతంలో ఏకలవ్యుడి ఉదంతం, ధర్మవ్యాధోపాఖ్యానం ఎరుకుల జీవితాన్ని చిత్రించిన సందర్భాలు. ఎరుకలు సాధారణంగా రాజ్యానికి అవతల అడవుల్లో ఉండేవారే. ధర్మవ్యాధుడిలాగా నగరంలో నివాసం ఉండేవారు ఏ ఒకరిద్దరో. ఎరుకలు అడవి మృగాల మధ్య జీవించాల్సిన వాళ్ళు కనుక ఆత్మరక్షణ అవసరంగా విలువిద్యవారికి నైసర్గిక విద్య అవుతుంది. ఆ విద్య వలన వాళ్ళు బలవంతులై ఉంటారు. రాజ్య సరిహద్దులలో ఉండే ఈ సహజవీరుల గురించిన భయం రాజులకు ఉంటుంది. శస్త్రజీవనం చేత వాళ్ళు తమకు దీటైన వాళ్ళుగా ఉంటే అది రాజ్యాధికారానికే ముప్పు. అందువల్ల ఏదో ఒకరకంగా వాళ్ళను అణిచి వేయటం, అధీనులను చేసుకొనటం రాజులకు కర్తవ్యం అవుతుంది. ఏకలవ్యుడి విషయంలో జరిగిందదే.

ఏకలవ్యుడు హిరణ్యధన్యుండు అనే ఎరుకరాజు కొడుకు. విలు విద్యను గురుముఖత: అభ్యసించి తన సహజవిద్యకు శాస్త్రీయమైన పదును సమకూర్చుకొనాలనుకొన్నాడు. ద్రోణుడిని తనను శిష్యుడిగా స్వీకరించమని కోరాడు. నిషాదపుత్రుడని ద్రోణుడు నిరాకరించాడు. ద్రోణుడినే గురువుగా సంభావించి అతని ప్రతిమ చేసి ఆ ప్రతిమ ముందు సంతతాభ్యాసం చేశాడు. అస్త్రవిద్యా రహస్యాలు తెలుసుకొన్నాడు. ప్రయోగంలో మెళకువలు తెలిసాయి. వేటకు వెళ్ళిన కురుపాండవుల కుక్క అడవిలోకి వేట జంతువు లను వెంట తరుముతూ వెళ్ళి ఏకలవ్యుడు ఒకేసారి వేసిన ఏడుబాణాలు గుచ్చుకోగా వెనుతిరిగి వచ్చింది. విలువిద్యలో లోకంలో తనకెవరూ ఎదురు లేకుండా చేస్తానని గురువు ఇచ్చిన మాట వాస్తవం కాకుండా పోతుందని అర్జునుడు ఆందోళన పడ్డాడు. ద్రోణుడికి చెప్పి అతనితో కలిసి వెళ్ళి ఏకలవ్యుడిని చూశాడు. అతని గురువు తన గురువేనని తెలిసి అర్జునుడు నాకంటే అధికుడైన శిష్యుడిని తయారుచేశారే అని ద్రోణుడితో నిష్కార మాడాడు. ఆ ప్రమాదం లేకుండా చేస్తానని ద్రోణుడు ఏకలవ్యుడిని గురుదక్షిణగా ఎడమచేతి బొటనవేలు అడిగాడు.

దక్షిణాంగుష్ఠమిచ్చిన దానఁజేసి, బాణసంధానలాఘవ భంగమయిన
నెఱుకు విలువిద్య కలిమికి హీనుడయ్యెఁబార్థునకు మనో
రుజయును బాసెనంత

(ఆదిపర్వం పంచమాశ్వాసం-244)

ఏకలవ్యుడి విలువిద్య కలిమి అర్జునుడికి మనోవ్యాధి కారణమైంది. విలువిద్య కలిమి వల్ల అధికారానికి ఎక్కడ పోటీ పడతాడోనన్న భయం నుండి పుట్టిన మనోరుజ అది. ఎడమచేతి బొటనవేలు లేకపోవటం వలన విలువిద్యకు అతను దూరుడు. జీవితంలో అతను తనకు పోటీగా రాలేడు. ఆ నమ్మకం ఇచ్చిన ధైర్యంవల్ల అర్జునుడి మనోవ్యధ తీరింది. క్షత్రియులకు రాజ్యాధికారాన్ని దఖలు పరచటంలో, స్థిరీకరించటంలో ప్రధానపాత్ర వహించిన బ్రాహ్మణవర్గం యొక్క స్వభావమే ఇక్కడ ద్రోణుడిలో వ్యక్త మైంది.

అర్జునుడు ఈ రకంగా ఏకలవ్యుడిని గురువు ద్వారా అదుపు చేసి తనకు పోటీ అనేది లేకుండా చేసుకొన్నాడు. కానీ అతి కొద్దికాలానికే కుమారాస్త్ర విద్యా ప్రదర్శన సందర్భంగా అతను కర్ణుడి నుండి గట్టి పోటీని ఎదుర్కొనవలసి వచ్చింది. సూతపుత్రుడివి నువ్వు పోటీ పడటానికి వీల్లేదని అతనిని కూడా పక్కకు నెట్టివేసే ప్రయత్నం జరిగింది. అయితే దుర్యోధనుడు అతన్ని అంగరాజ్యానికి అభిషిక్తుడ్ని చేసి ఆ ప్రయత్నాన్ని విఫలం చేశాడు.

నిషాదులను సరిహద్దులలోనే ఉంచి తమ కనుసన్నల్లో మెలుగుతూ సరిహద్దు రక్షకులుగా వాడుకొనటం అయినా జరిగింది. నగరంలోకి వచ్చిన వాళ్ళను బానిసలుగా రాజ్యకార్య నిర్వహణలో వాడుకొనటమూ జరిగింది. దుర్యోధనుడి కోరిక మీద లాక్షాగృహాన్ని తయారుచేసిన పురోచనుడు దహన పర్యంతం తాను చేపట్టిన పనిని సక్రమంగా పూర్తిచేయటానికి ఆ గృహంలో నివాసానికై ప్రవేశపెట్టబడిన పాండవుల కదలికలు తెలుసుకొనేందుకు ఐదుగురు కొడుకులతో సహా ఒక నిషాద వనితను దాసిగా ఏర్పరిచాడు. అధికార రాజకీయాల చదరంగంలో నిషాదులను పావులుగా కోవర్టులుగా వాడుకొనే పద్ధతికి ఇది సూచన.

అరణ్యపర్వంలో ధర్మవ్యాధుడి కథ ఉంది. అల్పమృగమాంస ఖండములు అంగడి పెట్టి అమ్మటం అతని జీవిక. కౌశికుడనే సంతతా ధ్యయనశీలి అయిన బ్రాహ్మణుడు ఒక పతివ్రతా స్త్రీ సూచన మేరకు ధర్మసూక్ష్మం తెలుసుకొనటానికి ధర్మవ్యాధుడి దగ్గరకు వచ్చాడు. అంత ధర్మసూక్ష్మాలు తెలిసినవాడు మాంసం అమ్మటమేమిటా అని ఆశ్చర్య పడ్డాడు. జీవహింస పాపం కదా ఎందుకీ ఘోరకర్మ చేస్తున్నారని అడిగాడు. చాతుర్వర్ణవ్యవస్థలో బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రులకు వేరువేరు ధర్మాలు న్నట్లే తమకు మృగమాంసోపజీవనం పరమ ధర్మమని చెప్పాడు ధర్మ వ్యాధుడు. విశేషించి ఇది వంశక్రమానుగతమైన ఆచారం అని కూడా

చెప్పాడు. నిషాదులు అడవిలో జీవించేవారు కనుక వేట, మాంసభక్షణ, మాంసాన్ని నగరవాసులకు చేరవేసి ఏదో ఒక ప్రతిఫలం పొందటం వాళ్ళకు సహజం. ధర్మవ్యాధుడు నగరంలోనే నివాసం ఏర్పరచుకొన్న నిషాదుడు కనుక వేటతో సంబంధం అతనికి పోయింది. ఇతరులు వేటాడి తెచ్చిన జంతువుల మాంసమే తాను అమ్ముతున్నానని అందువల్ల తనకు హింసా దోషం లేదని కూడా చెప్పుకొన్నాడు. తనకు సహజదర్మమైన వేటను హింసగా భావించి దానికి దూరుడైనాడంటే వర్ణదర్మ ప్రచారం అతని భావవ్యవస్థ నెంత ప్రభావితం చేసిందో స్పష్టమవుతున్నది.

అంతస్థులవారీ వర్ణవ్యవస్థలో పైనున్న వర్ణాలు కింది వర్ణాలను నీచమైనవి, హీనమైనవి అనుకొంటే అందులో వాళ్ళ ప్రయోజనాలున్నాయి. వాళ్ళ ప్రయోజనాల కోసం జరిగిన ప్రచారపుహోరులో శూద్రులు, మాలలు, నిషాదులు తమనుతాము నీచకులాల వాళ్ళమని నమ్మి ఒదిగిపోవటంలో ఉంది విషాదమంతా. ధర్మవ్యాధుడు తాను గురువులను, వృద్ధులను, అతిథులను, బ్రాహ్మణులను, దేవతలను పూజిస్తానని, ఉపవాసాలు, వ్రతాలు చేస్తానని, ఏకపత్నీ ప్రియుడనని తన గురించి చెప్పుకొన్నాడు. ఈ కారణాల వల్లనే "హీన యోనిజుండనయ్యును నిర్మలుండనైతిం" అని సగర్వంగా సంతృప్తిగా చెప్పుకొన్నాడు. కులానికి సంబంధించి ఆపాదింపబడిన హీనత్వాన్ని ఏ ప్రశ్నా లేకుండా ఆమోదించటం, బ్రాహ్మణ కులధర్మాలను పాటించటం ద్వారా ఆ హీనత్వం నుండి బయటపడ్డానని ఆనందపడటం రెండూ ఉన్నాయి ఇందులో.

ధర్మవ్యాధుడు నిషాదుడే అయినా అతని జీవితం బ్రాహ్మణీయ ధర్మంతో ముడిపడింది. ధర్మవ్యాధుడు ఆ నగరంలో సంపన్నవర్గానికి చెందినవాడే. ధర్మవ్యాధుడి నివాసం పెద్ద భవనం. అందులో ఆభ్యంతర గృహం, అందులో చతుశ్శాలతో కూడిన హార్మ్యం. అందులో ధర్మవ్యాధుడి జననీ జనకులు ఉన్నారు. వారికి శుశ్రూష చేయడం వల్లనే తనకీ వైదిక ధర్మజ్ఞానం కలిగిందని చెప్పాడు. ఆ జ్ఞానం వల్లనే అతడు కౌశికుడికి బ్రహ్మ విద్యా ప్రపంచం గురించి, సత్త్వరజస్తమోగుణ స్వభావాల గురించి చెప్పగలిగాడు. ఇదంతా విన్న తరువాత కౌశికుడు "నినునొక శూద్రుగా దలపనేర"నని చెప్పాడు. శస్త్రజీవనులు అటవీ వనరుల మీద ఆధిపత్యం కలిగినవాళ్ళు అయిన ఎరుకులను, నిషాదులను లొంగదీసుకొనటానికి వాళ్ళను నిరాయుధీకరించటం ఒక మార్గమైతే సంస్కృతీకరణ రెండవ మార్గం.

భాస్కర రామాయణంలో గుహుడు నిషాదనాథుడు. రంగనాథ రామాయణంలో చెంచురాజుగా చెప్పబడ్డాడు. 'మీ బంటుని' అని తనను తాను రాముడికి విధేయుడుగా ప్రకటించుకొన్నాడు. తన ప్రాంతంలో తాను అధికారే. కానీ రాజ్యసార్వభౌమత్వాన్ని అంగీకరించి దానికి లోబడి జీవిస్తున్నాడు.

మనుచరిత్రలో స్వరోచి విస్తారమైన అడవి జాతుల సైన్యం సేవిస్తుండగా రాజ్యం చేశాడు. అతని రాజ్యం అడవిని ఆనుకొని మంధర పర్వతం సమీపంలో ఉంది. ఎరుకరాజులను తనకు విధేయులుగా చేసుకొన్నాడు. అందువల్లనే వాళ్ళు కానుకల రూపంలో అటవీ సంపదను జంతువుల కోరలను, కొమ్ములను, జున్నును, తేనెను, చారపప్పును, స్థానికంగా



విశేషంగా తయారుచేయబడిన బాణాలను ధనుస్సును - రాజుకు చెల్లిస్తుంటారు. తాము సహజంగా వేటాడగలవాళ్ళయి ఉండీ ఎరుకలరాజు పందులవేటకు స్వరోచిని ఆహ్వానిస్తున్నాడంటే అడవిలో పశు సంపద మీద అధికారం రాజులకు దఖలు పరిచినట్లే. వేట వర్ణన సందర్భంగా ఎరుకుల సహజశౌర్య జీవితం చిత్రితమైంది. నడుములు బిగించి నల్లకాసె కోకలు కట్టి సెలకట్టె విల్లు చేబూని ఎర్రజుట్టును మెలిపెట్టి మొహం మీదికి పడేట్లు కట్టుకొని మొలకు ఉక్కు కత్తులు వేలాడుతుండగా నీలమేఘచ్ఛాయతో బాణాలతో వేటకు కదిలారు వాళ్ళు.

వేట స్వరోచిదన్న పేరేగానీ అందులో ప్రధాన భాగం పెద్ద భాగం ఎరుకలదే. వేటకు కావలసిన డేగలను పట్టుకొని కొందరు, కుక్కలను పట్టుకొని మరికొందరు, పందులను పట్టటానికి కావలసిన వలలు పట్టుకొని మరికొందరు బయలుదేరారు. వేటలో స్వరోచికి సహాయపడటానికి

గూనివీపులదుర గొణఁగి తిట్టుచు నేకుఁ
గఱచినట్టి కుక్కగండ్ల నంగ
మూతి నరప మీసముల బోయ ముదుసళ్ళు
పంది వలలు మోచి పఱిచిరప్పుడు

(మనుచరిత్ర, చతుర్థాశ్వాసము-36)

పంది వలలు మోస్తూ గూనివీపులు అదిరేట్లు వెడుతున్న బోయ ముదుసళ్ళు 'గొణగి తిట్టుచు' వెళ్ళటం ఎందుకు? వలలు మోసేది తాము, వల విసిరేది తాము, వలలో పడ్డ పందులను వీపున గూని వచ్చేంతగా మోసుకొచ్చేది తాము - అయినా వేట రాజుది, తాము అతని ఆజ్ఞాను వర్తులు. ఈ పరిస్థితిని గురించిన అశాంతి, అసంతృప్తి వాళ్ళనలా గొణుగుకొనేట్లు లోలోపల తిట్టుకొనేట్లు చేసి ఉంటాయనుకోవచ్చు. కాళ్ళు ఎత్తెత్తి వేస్తూ వెళ్ళి పెద్ద దున్నను, దాచిపెట్టిన దానిని పట్టుకు తెచ్చినంత సులభంగా తెచ్చిన ఎరుకలవాని వేట నైపుణ్యం, ముండ్లపందిని జాడబట్టి పోయి పొడిచి చంపిన చాతుర్యం మనుచరిత్రలో చక్కగా ప్రదర్శితమయ్యాయి.

శ్రీకాళహస్తి మహాత్మ్యములో తిన్నని కథా సందర్భంగా కిరాతుల జీవితం చిత్రితమైంది. రేగు, ఉసిరిగ, గురివెంద, గంధం మొదలైన వృక్ష జాతుల సంపద ముందు వాళ్ళకు అన్నీ తక్కువే. వీళ్ళు వ్యవసాయం కూడా నేర్చినవాళ్ళు. కొండలలో వ్యవసాయం అది. పండిన చేలలోకి పందులు రాకుండా ఏర్పాట్లు చేసుకొనటం, మంచెల మీదికెక్కి పంట మీద వాలే పక్షులను ఒడిసెలతో కొట్టటం ఇదంతా వాళ్ళ జీవితంలో భాగం. తిన్నడు పరిజనంతో కలిసి వేటకు వెళ్ళి అక్కడ ఆదమరిచి నిద్రించిన

సమయాన స్వప్నంలో సాక్షాత్కరించిన శివుడి జాడ వెతుకుతూ వెళ్ళి ఒక శివలింగాన్ని చూచి ఒంటరిగా ఉండటం ఎందుకు తనతో వచ్చెయ్యమని కోరిన సందర్భంలో తిన్నడు శివుడికి తమ దగ్గర లభించే వైవిధ్యపూరితమైన ఆహార సంపద గురించి ఆశ చూపాడు. వేట తమ సహజ జీవనం కనుక క్రొవ్విన పందులను, లేళ్ళను, దుప్పులను వేటాడి తెస్తే తమ చిన్నక్క పెద్దక్క అనేక రకలుగా వండి పెడతారని, పిట్టలను కూడా వండుతారని చెప్పాడు (తృతీయ-66). పాయసానికి తగిన పెంపుడు జంతువుల పాలు, నివ్వరి, వొడిపిళ్ళు, గునుకు, వెదురు మొదలైన ధాన్యవైవిధ్యం ఉన్నాయని చెప్పాడు. నేరేడు, అరటి, కొండమామిడి మొదలుగా 20కి పైగా రకాల పండ్లు చెంచుస్త్రీలు సేకరించుకొని తెచ్చిస్తారు రమ్మని ఆశ పెట్టాడు. సమృద్ధమైన అటవీ సంపద మీద సర్వాధికారాలను అనుభవిస్తున్న చెంచు జాతి ప్రతినిధిగా కనబడతాడిక్కడ తిన్నడు.

వేట ప్రధానంగా ఉన్న చెంచుల జీవితంలో వలలు, వేట సాధనాలు భద్రపరచుకొనటం, వేట కోసమే పోషిస్తూ వెంట తెచ్చుకొన్న పక్షులకు మేత, కుక్కలకు ఆహారం ఇయ్యటం, అడవిలో వేటాడిన జంతువులను ఒక దగ్గరకు చేర్చటం, చెడకుండా భద్రపరచటం - ఇవన్నీ వేట క్రమంలో భాగాలే.

రామాయణాన్ని సంస్కృతంలో రచించిన వాల్మీకి బోయవాడని ప్రసిద్ధి. అతని కథని వాల్మీకి చరిత్రము అనే మూడాశ్వాసాల కావ్యంగా వ్రాశాడు తంజావూరు నేలిన రఘునాథ నాయకుడు. ఇందులో ద్వితీయాశ్వాసం బోయకుల జీవిత విధానాన్ని వివరిస్తుంది. సప్తఋషులు తీర్థయాత్రలు చేస్తూ ఒకచోట త్రోవతప్పి అడవిలోని ఒక బోయపల్లెలోకి ప్రవేశించారు. ఉప్పు రాసి వీధులలో ఆరగట్టిన తోళ్ళ కోసం అక్కడక్కడ ఎగిరే పక్షుల రెక్కగాడ్పులకు ఎగురుతున్న పశువుల వెంట్రుకలతో, నాలుగు వైపుల ఆరేసిన మృగాల పచ్చితోళ్ళను పసికట్టి పండ్లతో వాటి మీది మాంసం పీకటానికి వచ్చిన కుక్కల అరుపులతో, ఆ అరుపులకు బెదిరి పారిపోయే పందుల మురికి కంపుతో ఉన్న బోయపల్లెను వాళ్ళు చూచారు. చండాల వాటిక కూడా ఇట్లా ఉండదు అని అక్కడ ఎముకలప్రోగులను చూచి వాళ్ళనుకొన్నారు. బోయవాడు వాళ్ళ ముందుకు వచ్చి ఉన్నదంతా ఇచ్చి పొమ్మన్నాడు. మర్యాదగా చెప్తే వినటం లేదని వాళ్ళందరినీ కలిపి కొట్టాడు. వయసు నీటిబుడగ లాంటిది, శరీరం అస్థిరం దీనికోసం ఏమాత్రం సందేహించక పాపం ఎందుకు చేస్తున్నావు, దుర్మార్గమే తపస్సని చేస్తున్నావు మంచిది కాదన్నారు. భార్యాపిల్లల కోసం విల్లు, అంపకోల పట్టిన తనకు పాపం రాదన్నాడు బోయ. నీ పాపం నీ భార్యాపిల్లలు పంచుకొంటారా అని అడిగితే కనుక్కొని వస్తానని వెళ్ళి వాళ్ళందుకు ఒప్పుకోకపోవటం వలన విరక్తుడై వచ్చి ఆ మునుల వల్ల ఉపదేశం పొంది తపస్సు చేసి రామాయణ రచనా సామర్థ్యం పొందాడు వాల్మీకి.

అడవి లోతట్టు ప్రాంతాలకు విస్తరించే క్రమంలో రాజ్యం, మైదాన ప్రాంత ప్రజలు అడవీప్రాంత ప్రజల జీవిత విధానాన్ని తప్పు పట్టి సవరించటానికి ప్రయత్నించటం ద్వారా తమ జీవన విధానానికి దగ్గరగా వాళ్ళను తీసుకొని వస్తారు. ఇది విస్తరణ ప్రయోజనాలను కాపాడే సాంస్కృతిక క్రమం. ఆ క్రమంలోనే ముందు బోయవాడి వేట, చచ్చిన జంతువులను ఆహారంగా తీసుకోగా మిగిలిన చర్మం, గోళ్ళు, కోరలు, కొమ్ములు మొదలైనవాటిని ప్రోది చేసి ఉపయోగించుకొనే తీరు న్యూనపరచ బడ్డాయి. సహజ జీవన క్రమం పాపకార్యంగా వ్యాఖ్యానించబడింది. దీనిని నమ్మి బోయ తన జీవన విధానాన్ని మార్చుకొనటానికి తపస్సు ప్రారంభించాడు. అతనిని తపస్సు నుండి మరల్చాలని భార్యాపిల్లలు వచ్చి ప్రయత్నాలు చేశారు. వలపన్ని వేటాడి తెచ్చిన గండభేరుండ పక్షులకు, సింహపు పిల్లలకు, పులిపిల్లలకు ఆహారమెవరిస్తారని పిల్లలు చిన్నవాళ్ళు కనుక ఆ పనులు చేయలేరని భార్య వాపోతుంది.

పిల్లలు తల్లిదండ్రుల నుంచి ఆశించేది మంచి తిండి, రక్షణ. రుచిగల పక్షులను, చుట్ట జున్నులను, తేనెను, చారపప్పును తెచ్చిపెడతాడు కదా అని తండ్రి వచ్చే దారికి కళ్ళప్పగించి చూచే పిల్లల గతేమిటని ఆమె వాల్మీకిని ప్రశ్నించింది. పక్షుల కాల్చిన మాంసం, మృగాల క్రొవ్వు వరుగులతో చేసే భోజనం ఎలా విస్మరిస్తావు అంటుంది. మన ఆహారం, మన జీవితం, మన అలవాట్లు వదిలేసి బ్రాహ్మణులను కూడి ఉండటం సమంజసమేనా అని ప్రశ్నిస్తుంది. బోయ జీవన విధానం మీద జరిగిన ఈ దాడి ఒక్క నెత్తురుబొట్టుతో కానీ, ఒకింత ఘర్షణతో కానీ పని లేకుండా అతనిని మొత్తంగా బ్రాహ్మణీయ సంస్కృతికి లోబరిచింది. దీనిలోని హింస అనుభవంలోకి వచ్చింది బోయవాని భార్యకు. అందుకే ఆమె ఆక్రోశించింది. అతను మాత్రం నాకు భార్యాపిల్లలు ఎవ్వరూ లేరు రాముడే తండ్రి, జానకే తల్లి అని ఒకే ఒక్కమాటతో బోయజాతి జీవన విధానం నుండి దూరమయ్యాడు.

చాతుర్వర్ణ వ్యవస్థకు బయట ఉన్న పంచముల జీవితాన్ని గురించిన కథ ప్రస్తుతానికి ఒకే ఒక్కటి లభించింది. అది ఆముక్తమాల్యదలోని మాల దాసరి కథ. మాల దాసరి ఇల్లువాకిలి, తిండితీరు ఎలా ఉంటాయో ఈ కథలో భాగం కాలేదు. అతను నివసించే మానవ సమాజం గురించిన వివరాలు కూడా ఏమీ లేవు. విష్ణుభక్తుడు, తనది పేర్కొనరాని కులమన్న స్పృహ ఉన్నవాడు. పుట్టుక వల్ల తనకు లభించిన కులం తనకే సామాజిక హోదాను ఇచ్చిందో ఆ సామాజిక హోదాను ఏ ప్రశ్నగానీ, ఆరోపణగానీ లేకుండా స్వీకరించినవాడు. 'జాత్యుచిత చరిత్ర'ను అనుసరించి శ్రీ మహావిష్ణువును గానంతో పూజిస్తాడు. పొద్దున్న లేవటం తయారవటం గుడికి నడిచిరావటం అపరాహ్ణవేళ వరకు పాడుతూ నాట్యం చేస్తూ ఎండనక వాననక ప్రాకారం బయట గడపటం అతని జీవిత విధానం. గర్భమంటపిఁ గడిగిన కలఁకజలము/లోని ఱాతొట్టి నిండి కాలువగఁ జూఁగి/గుడి వెడలి వచ్చునది శూద్రుఁడిగ... త్రాగుతాడతను. ప్రసాదం తీసుకొన్నాక వెళతాడు. చండాలుడే కానీ చండాలేతర శీలుడు అని అతనిని పేర్కొంటాడు శ్రీకృష్ణ దేవరాయలు విష్ణుముఖంగా.

ధర్మవ్యాధుడైనా, మాలదాసరైనా వాళ్ళు భౌతికంగా కులాల ప్రకారం నిర్దేశించబడిన సాంఘిక స్థాయిలోనే ఉండాలి. భావపరంగా, ఆధ్యాత్మికంగా ఆ కులాలవారి ప్రవర్తనకు, సంస్కారానికి అతీతంగా ఇతరంగా బ్రాహ్మణీయ మత సంస్కృతిలోకి ప్రవేశించారు కనుక ఆమోదించబడతారు.

5

ఇతర శూద్రకులాలలో జాలరుల ప్రస్తావన మొదటగా భారతంలో వచ్చింది. ఉపరిచర వసు మహారాజు వృత్తాంతంలో ఈ ప్రస్తావన ఉంది. గర్భవతి అయిన గిరికకు మృగమాంసం తెచ్చిపెట్టమని పితృదేవతలు ఆమె భర్త వసురాజుకు చెప్పారు. అడవికి వెళ్ళిన వసురాజు గిరికనే తలచుకొంటుండగా వీర్యస్ఖలనం అయింది. దానినతను ఒక ఆకుదొన్నెలో భద్రపరిచి డేగ మెడకు కట్టి గిరికకు ఇమ్మని పంపాడు. మధ్యలో మరొక డేగ అదేదో ఆహారమనుకొని డేగతో తలపడింది. అప్పుడు ఆకుదొప్ప నుండి తొణికిన వీర్యం గాలివాలుకు యమునానది వనమధ్యంలో పడింది. బ్రహ్మ శాప కారణంగా చేపరూపంలో ఆ నదిలో ఉన్న అద్రిక అనే అప్సరస ఆ వీర్యం మింగింది. గర్భం దాల్చింది. తెరలవల వైచిన జాలరికి ఆ చేప దొరికింది. చేప కడుపు కోస్తే అందులో ఒక ఆడపిల్ల, మగపిల్లవాడు ఉన్నారు. ఆ జాలరి ఆ శిశువులను తెచ్చి జాలరుల రాజు దాశరాజుకు ఇచ్చాడు. ఆడ శిశువు పెద్దదై తండ్రి నియోగించినట్లుగా పడవ నడుపుతుంటుంది. పరాశర మహర్షి ఆమెను చూచి మోహించాడు. ఆమెకు తన కోరిక తెలియ జేశాడు. ఒప్పుకోకపోతే అతను తనను శపిస్తాడేమోనని ఆమె భయపడింది. కులన్యూనతను చెప్పి తప్పుకోవాలనుకొన్నది. శరీరం చేపల వాసన వచ్చే జాలరిదాన్ని అని చెప్పింది. వసురాజర్షి వీర్యాన పుట్టావు కనుక సూతకుల ప్రసూతవు కావు అని ఆమె న్యూనతను పోగొట్టి ఆమెతో సుఖించాడు. అందువల్ల ఆమెకు పుట్టిన కొడుకే వ్యాసుడు.

హంసవింశతిలో పదునారవ రాత్రి కథలో జాలరి స్త్రీ చర్య ప్రధానం. ఆ నెపంతో జాలరి ఇల్లు, పనిముట్లు, సంపదలు వర్ణించబడ్డాయి. పడవలలో రకాలు పది, వలలో రకాలు ఆరేడు, పనికిరాని జలచరాలు, పనికివచ్చే కొర్రమీను మొదలైన రకరకాల చేపలు పేర్కొనబడ్డాయి. జాలరి కుల నాయకుడతను.

వ్యవసాయోప జీవనులు రెడ్లు. ఆముక్తమాల్యదలో వీరి ప్రస్తావన ఉంది. వర్షాకాల వర్ణన చేస్తూ రాయలు భిన్న సామాజిక వర్గాలపై దాని ప్రభావం ఎలా ఉందో చెప్పాడు. రెడ్లు గురుగు చెంచలి, తుమ్మి, లేత గరిసాకు, చింతచిగురు కలిపి చేసిన నూనెకూరలతో ఆవిర్లు వదిలే అన్నం తిని పశువులు పొలాలకు వెళ్ళగా ఆవుదూడలు తమ దగ్గరకు వచ్చి శరీరాలు నాకుతుంటే మేక ఎరువు కుంపటి వెచ్చదనానికై మంచం కింద పెట్టుకొని హాయిగా విశ్రాంతి తీసుకొంటున్న వైనం చెప్పాడు (ఆశ్వాసం ఎ-134).

హంసవింశతిలో పదిహేనవ రాత్రి కథ రెడ్డి సానికి సంబంధించినది. అది నెపంగా కృషీవలుని ఇల్లు ఎలా ఉంటుందో వర్ణించాడు కవి. దేవర చవికలు, పందిరి, కోళ్ళగూడులు, పశువుల కొట్టాలు, ప్రత్తిగూటం, బావి, పిడకల కుచ్చెల, పశువులను మేపే స్థలం ఇవన్నీ కృషీవలుని ఇంట్లో భాగాలు. జొన్నలు, కొర్రలు, చామలు, రాగి, సజ్జ, గోధుమ నువ్వు, కుసుమ, గోగు, జనుము, ఆముదము, మినుము, కంది, సెనగ, పెసర మొదలైన గింజ ధాన్యాలు పుట్ల కొలది ఇంట్లో ఉన్నాయని, వడ్లల్లో రకాలు వందకు పైనేనని అంటాడు. కాయగూరలు, గుమ్మళ్ళు, ఆకుకూరలు, పండ్లు, కాయలు



మొదలైనవి ఎన్నెన్ని రకాలు పండిస్తాడో జాబితాలు జాబితాలుగా ఇచ్చాడు కవి. ఇంత సంపదను సృష్టించే రెడ్లు ఎన్ని తెగలవాళ్ళున్నారో కూడా చెప్పాడు.

వెలమల ప్రస్తావన పలనాటి వీరచరిత్రలో ఉంది. ఆటపాటల వేడుక లలో ఉండి రాజ్యంలో ఏమి జరుగుతున్నదో తెలియకుండా ఉన్న బాల చంద్రుడు బొంగరాల ఆట ఆడుతుండగా బొంగరం కోమటి అన్నమ్మకు తగిలింది. నొప్పి వల్ల కలిగిన బాధతో మీ తండ్రి యుద్ధభూమి లో ఉంటే నీవు మదమెక్కిన గిత్తలాగా ఊరి మీద పడి తిరుగుతున్నావని మంద లించింది. దానితో రోషం వచ్చి బాలచంద్రుడు తల్లి దగ్గరకు వెళ్ళి యుద్ధ భూమి గురించి అడుగుతాడు. తానెన్ని నోములు నోచి అతనిని కన్నదో చెప్పి యుద్ధానికి పోకుండా ఆపాలనుకొంటుంది ఐతమ్మ. అతను వినడు.

చర్చింపనీ మూడు జాతులవారి
శుశ్రూషవుల జేసె శూద్రుల నెల్ల
సరవి నాలవ జాతి జననంబు మాకు
వెలమల మైతిమి వీరజీవనత...

అని తన కులధర్మం తనను పాటించనీయమని ఆమెను వేడు కొంటాడు బాలచంద్రుడు. 'మనువు బోధించిన మార్గమే యిదియు' అని దానిని గౌరవంతో ఆచరించటానికి సంసిద్ధుడవుతాడు. ఐతాంబ కొడుకు కోసం నోములు నోచిన సందర్భంలో విప్రుల భార్యలను పూజించిన స్త్రీయే. ఆ రకంగా వర్ణాశ్రమ వ్యవస్థలో తమకు నిర్దేశించబడిన జీవితాన్ని జీవించారు బాలచంద్రాదులు.

హంసవింశతిలో నాల్గవరాత్రి కథలో నేతగాళ్ళ జీవనంతో ముడిపడ్డ కుంచె మగ్గపుగుంత, గూటం, త్రొక్కుడుపట్టె, రంపె అచ్చులు, కొప్పెరలు, గోలెములు, నీలి కడవలు మొదలైన పని సాధనాలు పేర్కొనబడ్డాయి. ఏడవరాత్రి కథలో కంసాలి పరికరాలు కమటము, కట్లసంచి యొరగల్లు, కత్తెర, సుత్తి, శ్రావణం, మొలత్రాసు, పటకారు, మూస మొదలైనవి చెప్పబడ్డాయి. పదునేడవ కథలో కుమ్మరి పనిక్రమం వర్ణించబడింది.

ఆది వరాహంబు మేదిని నెత్తిన
మాడ్కి చొప్పడఁగ దామన్నుమోయుఁ
ప్రథమవేళల సృష్టి బ్రహ్మ చేసినయట్లు
ఘటకోటు లుత్సాహగరిమఁజేయు
విష్ణువు చక్రంబు వేడుకఁద్రిప్పెడు
చాడ్పునఁ బలుమాఱు సారెద్రిప్పు

బయలి పురంబులు భర్గుండు గాల్చిన
డంబు సూపట్టనావంబుఁగాల్చుఁ
గపివరుడు పర్వతంబులు గమిచి తెచ్చి
కుప్పలిడు రీతిఁ గుండలు కుప్పలెట్టు
నవి దివియు ధాత కాండంబు లడఁచు సరణి
సాధు పథ వర్తి ఘటకార చక్రవర్తి

(పంచమ-10)

అని కుమ్మరిని త్రిమూర్తులతో, ఆంజనేయస్వామితో పోల్చి చెప్పి చివరికి చక్రవర్తిని చేసి పని ఔన్నత్యాన్ని స్థాపించాడు నారాయణామాత్యుడు.

బసవ పురాణంలో మడివాలు మాచయ్య కథ ఉంది. బట్టలుతకటం అతని జీవితం. శైవమత ఉద్యమం వైదికంలోని కాఠిన్యాన్ని ధిక్కరించి మానవ సంబంధాలను సరళీకరించింది. ఆ క్రమంలో శూద్రకులాలకు ఆపాదించబడిన న్యూనతను నిరాకరించింది. ఆధిక్యతా హీనతలకు శివభక్తులు కావటం, కాకపోవటం అనేవి మాత్రమే గీటురాళ్ళు. కాయకాన్ని అంటే శరీర శ్రమను ఒక విలువగా ప్రవేశపెట్టి, కాయకం వల్ల వచ్చిన ఆదాయాలతో జంగమార్చన పరులై కీర్తికెక్కిన శివభక్తులను ఆదర్శంగా చూపింది శైవం. తత్ఫలితంగానే కాయకం చేసే స్త్రీ పురుషులనేకులకు శివభక్తులుగా బసవ పురాణంలో స్థానం లభించింది. కట్టెలు కొట్టేవాళ్ళు, బొంతలు కుట్టేవాళ్ళు ఇలా అనేకులున్నారు. కులవృత్తితోటి సంబంధంలో ఉన్న కథ మడివాలు మాచయ్యది. అతను సద్భక్త సంఘం వారి మాసిన బట్టలు మాత్రమే ఉతుకుతానని శపథం చేసినవాడు.

మాసిన వస్త్రముల్ మఱి మోసి కొనుచు
వేవుజామున నేఁగి వేఱొక్క రేవు
గావించి యుదుకుచు ఘట్టనల్ సేసి
శస్త్రసమేతుఁడై సద్భక్త వితతి
వస్త్రముల్ రజత పర్వత భాతిఁదాల్చి
పరిగొణి వచ్చుచోఁ బరవీధి భవులు
శరణుల వస్త్రముల్ సంధిల్లిరేని
నోడ జాఁబొడుతుఁజుండోయని ఘంట
నాడాడ వ్రేయుచుఁ గూడ జాటుచును
మఠమున కేతెంచి మణుగులన్నియును
కఠినములాకుండ ఘట్టించి మడువ
నట్టిచో జంగమంబరుదెంచి యడుగ
నెట్టి కట్టంబైన నిచ్చి మ్రొక్కుచును
నా వస్త్రముల వారలడగ వచ్చినను
లేవన కందిచ్చు లింగ సంపదను

(చతుర్థాశ్వాసం -82)

అటువంటి మడివేలు మాచయ్యను 'రజక జాత్యామృత ప్రత్యక్ష రుద్రుడు' అని సంబోధించాడు పాల్కురికి సోమన.

శివభక్తుల బట్టలు ముట్టుకొన్నాడని ఒక బాటసారిని మడివాలు మాచయ్య చంపాడు. కోకలుదుకు చాకికి ఇంత క్రొవ్వా అని రాజు అతనిని శిక్షింపదలిచాడు. అప్పుడు బసవయ్య అతన్ని వారిస్తూ -



జాకి చాకని యేల సందడించెదవు
చాకియె యతడు సాక్షాల్లింగమూర్తి
కులజుండు నతఁడె యకులజుండు నతడె
కులము లేకయునన్ని కులములు నతడె

అని శైవభక్తికి లోబరిచి కులవ్యవస్థలోని అంతస్థులవారీ సామాజిక స్థాయి పై దాడి చేశాడు పాల్కురికి సోమనాథుడు. కుల న్యూనతను శైవభక్తి ప్రమేయంతో అభావం చేయడానికి సర్వవిధాలా ప్రయత్నించాడు. అయినా కులవ్యవస్థ పునాదులను మాత్రం కదిలించలేకపోయాడు. సామాజికవర్గాల మధ్య అసమానతలు, వైరుధ్యాలు రోజురోజుకూ ఎక్కువవుతూనే ఉన్నాయి. వర్ణ ధర్మం అధర్మధర్మమన్న చైతన్యం విస్తరిస్తూ అస్తిత్వ ఉద్యమాలు అభివృద్ధి చెందుతున్నాయి.

ఈ అధ్యయనంలో స్పష్టపడిన మరొక ఆసక్తికరమైన అంశం - సామాజికవర్గాలు పురుషులవిగా ఉన్నాయి తప్ప స్త్రీలకు అందులో స్థానం లేదని. సమాజం పురుషులది కనుక భిన్న సామాజికవర్గాలకు చెందిన వాళ్ళుగా వాళ్ళకు భిన్నధర్మాలు, భిన్న ప్రయోజనాలు ఉన్నాయి. స్త్రీలు నేరుగా ఈ సామాజిక వర్గాలకు చెందినవాళ్ళుగా కాక, భిన్న సామాజిక వర్గాలకు చెందిన పురుషులకు సంబంధించిన వాళ్ళుగా ఉంటారు. అందు వల్ల పురుషులకు లాగా వాళ్ళకు సామాజికవర్గ చైతన్యం కానీ తద్వారా పొందే అధికారంలో భాగస్వామ్యం కానీ ఉండదు. మొత్తం మీద స్త్రీలంతా పురుషుల పట్ల, ప్రత్యేకించి భర్తల పట్ల వినయవిధేయతలతో పాతివ్రత్య ధర్మం నిర్వర్తించవలసిన వాళ్ళే. బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాది సామాజిక వర్గాలకు చెందిన ఏ స్త్రీలకయినా ఇంటిపని, భర్త సేవ, అత్తమామల సేవ, పిల్లల పోషణ బాధ్యత ప్రధాన కర్తవ్యాలు. ద్రౌపది, సావిత్రి వంటి క్షత్రియ స్త్రీలకు కూడా కీర్తిని తెచ్చిపెట్టగలిగినవి ఈ పనులేనని సాహిత్యం నిర్దేశిస్తున్నది. ఇంటికే సంబంధించిన బ్రతుకు తప్ప సామాజిక జీవితమే లేని స్త్రీలకు వాళ్ళు ఏ భిన్న సామాజికవర్గాలకు చెందుతారో దానిని బట్టి గాక స్త్రీలు కావటం వలన నిర్దేశితమైన స్త్రీ ధర్మమే ఉంటుంది. *

(తానా సమావేశాల్లోని సాహితీ సదస్సులో చదివిన ప్రసంగవ్యాసం)

వ్యావహారికాంధ్రభాషా సమరశూరుడు
గిడుగు రామమూర్తి

పారనంది లక్ష్మీనరసింహం

రామమూర్తిగారి బోధనాపద్ధతికి మూలము వారి అనన్య పాండిత్యం. రామమూర్తిగారి పట్టభద్ర పరీక్షలో చరిత్ర ప్రధాన శాస్త్రమైనా, వారికి పరిచయంలేని, ప్రావీణ్యత లేని శాస్త్రం లేదు. ఆంగ్లభాషా పారస్పతములలో కూడా రామమూర్తిగారికి మంచి పాండిత్యము కలదు.



*భా*షా ప్రయోగ విషయే విదుషాం సభాయాం
యస్యోపలబ్ధ వచనం గ్రహణీయ మాసేత్
తస్యాత్మజ:తదను శాసన శిక్షతోహం
ధ్యాయామితం గిడుగు వేంకట రామమూర్తిమ్

ఈ విధంగా కుమారుడు శ్రీ గిడుగు వేంకట సీతాపతి తన తండ్రిగారైన శ్రీ గిడుగు వేంకట రామమూర్తిని ధ్యానించినారు. ఆ విధంగానే నేను కూడా ఆ భాషాప్రయోగ దైవాన్ని ధ్యానిస్తూ ఆయన గురించి కొన్ని ముఖ్యమైన విషయములు గుర్తు తెచ్చుకుని, ఈ వ్యాసం వ్రాయుటకు ఉపక్రమిస్తున్నాను. ఇందలో అంశాలు చాలావరకూ వినికిడియే. కొన్ని విషయాలు నేను సంగ్రహించినవి మాత్రమే. నేను పర్లాకిమిడిలో పుట్టి పెరిగినవాడిని. నా పూర్వీకులైన పారనంది వంశస్థులు, గిడుగువారితో సన్నిహిత సంబంధం కలవారు. అందుమూలముగా ఈ వ్యాసమును వ్రాయుట ఎంతో ఉత్తేజమును కలిగిస్తున్నా, మరోప్రక్కన భయమును కూడా నాలో కలిగిస్తోంది. నూటానలభై రెండేండ్ల క్రితం వంశధారానది పడమటి తీరాన్న పర్వతాలపేట గ్రామమందు జన్మించిన శ్రీ రామమూర్తిగారు ఈనాటకీ తెలుగువారి హృదయాలలో ఓ దైవమూర్తిగా, తరతరాలుగా నిలిచియున్నారు. తండ్రి వీరరాజు పంతులుగారి వద్ద రామమూర్తిగారు రామాయణ, భారత, భాగవతములను నేర్చుకున్నారు. అమ్మగారైన వెంకమ్మగారి వద్ద పురాణ కథల్ని తెలుసుకున్నారు. గురువుగారు, శ్రీ వారణాసి గున్నయ్య పంతులుగారు శ్రీరామమూర్తికి సంస్కృతం, తెలుగు, గణితం నేర్పించారు. 1875లో తండ్రిగారైన వీరరాజుగారికి చోడవరం బదిలీ అయింది. సంసారం విజయనగరంలో ఉండేది. విజయనగరం మహారాజ కళాశాలలో రామమూర్తిగారు చేరారు. ఆ కళాశాలలోనే రామమూర్తిగారు మెట్రిక్యులేషన్ చదివారు. ఆరోజుల్లో శ్రీ గురజాడ అప్పారావుతో శ్రీ గిడుగు రామమూర్తిగారికి పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం, ఇద్దరి మధ్యా గౌరవం, ప్రేమలకు దారి తీశాయి. 1875లో తండ్రిగారు, శ్రీ వీరరాజుగారు మరణించారు. 1879లో శ్రీరామమూర్తి, అప్పారావులు ఒకేసారి మెట్రిక్యులేషన్ పాసయ్యారు. 1880లో పర్లాకిమిడి రాజావారి పాఠశాలలో అసిస్టెంట్ టీచరుగా నియమించబ్డారు శ్రీ రామమూర్తి గారు. 1887లో ఎఫ్.ఎ. పరీక్ష పాసయ్యారు. బి.ఎ. పరీక్షలో ఉత్తీర్ణులైన తరువాత, 1896లో, పర్లాకిమిడి రాజా కళాశాలలో అధ్యాపకుడిగా శ్రీ రామమూర్తిగారు నియమించబడ్డారు.

పర్లాకిమిడి పర్వత ప్రాంతాలలో నివసించే సవర జాతి గిరిజనులు రామమూర్తిగార్ని ఆకట్టు కున్నారు. సవరలతో రామమూర్తిగారు పరిచయం ఏర్పర్చుకున్నారు. ఆ సవర జాతి ప్రజల అమాయకత్వాన్ని, వెనుకబడినతనాన్ని చూసి, రామమూర్తిగారు ఆవేదన చెందారు. అందు మూలంగా, సవరభాషపై తీవ్రమైన కృషి చేశారు. రామమూర్తిగారి బోధనా పద్ధతి ప్రశస్తమైనది. రామమూర్తిగారి కాలములో ఉపాధ్యాయులను తయారుచేసే కళాశాలలు లేవు. రామమూర్తిగారు తన శిష్యులకు వారికి గల జ్ఞానమును అందించడంలో ప్రత్యేకమైన పద్ధతులను తనకుతానుగా రూపొందించుకున్నారు. ప్రారంభమున రామమూర్తిగారు చిన్న తరగతులలో బోధన చేసి యుండిరి. ఆ సమయమున గ్రహించిన పఠనతత్వములను ఉన్నతశ్రేణిలో విద్యార్థులకు పాఠములను చెప్పుటలో సరియైన పద్ధతుల్లో సంస్కరించి వినియోగించెడివారు. 'జ్ఞాన వివేషము పద్ధతుల కంటె అధికముగా ఉపయుక్తమైనదని,' రామమూర్తిగారు గ్రహించినవారు. గ్రీకుదేశ చరిత్రపై పాఠమును చెప్పునప్పుడు, గ్రీకుల నీతి, ఆధ్యాత్మికతత్వం, రాజ్యపాలన, సారస్పతం, వారి నాగరికత విద్యార్థులకు చక్కగా నచ్చినట్లు, అర్థమైనట్లు ఉండవలెనని ఆర్యుల ప్రాచీనచరిత్ర నుండి సామ్య బేధములను చూపించి విద్యార్థులను ఆకర్షిస్తూ ఉండేవారు రామమూర్తిగారు. ఆ సమయంలో ఆర్యుల ప్రాచీనచరిత్ర ఆ పాఠమునకు అప్రస్తుతమైనా, గ్రీకు ప్రజలు నాగరికతను విద్యార్థుల హృదయాలలో నాటుకొనుటకు చక్కగా ఉపయుక్తం అయినది. అదేకాకుండా, గ్రీకుల జ్యూపిటర్ నివాసమైన ఒలింపస్ పర్వత శిఖరమును ద్వైపితక్‌తో సరిపోల్చి, భాషలో, పదములలో గల సామ్యబేధములను వెదికి తీస్తూ ప్రొఫెసర్ మేక్స్‌ముల్లర్‌ను విద్యార్థులకు పరిచయం చేసేవారు రామమూర్తిగారు. రోమన్ దేశచరిత్రపై పాఠం చెప్పినపుడు, కుటుంబ విశ్వాసములలో తండ్రికి గల అసాధారణ అధికారమును ప్రాచీనార్యుల నాగరికతతో సరిపోల్చి చూపేవారు రామమూర్తిగారు.

ఆంగ్ల పద్య గమన మును సంస్కృత గణ నడకలతో సరిపోల్చి, రెండింటి మధ్యా తారతమ్య ములను వెల్లడి చేసేవారు రామమూర్తిగారు. ఆ విధంగా రామమూర్తిగారి పాఠముల ఉపన్యాసములు, తన విద్యార్థులయందు, రామమూర్తిగారికి దాపరికములుండెవి కావు. ఏ గ్రంథమును తాను చదివిననూ, చదువు చున్ననూ, వాటిని తన శిష్యులకు రామమూర్తిగారు పరిచయం చేసేవారు. 'ఉత్కృష్ట ఉపాధ్యాయుడు ఎవడంటే విశిష్ట విద్యార్థే,' అనే సూక్తికి రామమూర్తి గారు తగిన ఆదర్శప్రాయులు.

రామమూర్తిగారి బోధనాపద్ధతికి మూలము వారి అనన్య పాండిత్యం. రామమూర్తిగారి పట్టభద్ర పరీక్షలో చరిత్ర ప్రధాన శాస్త్రమైనా, వారికి పరిచయంలేని, ప్రావీణ్యత లేని శాస్త్రం లేదు. ఆంగ్లభాషా సారస్వతములలో కూడా రామమూర్తిగారికి మంచి పాండిత్యము కలదు. వీరు భాషాతత్వ శాస్త్రమును క్షుణ్ణముగా అభ్యసించిరి. ఈ సందర్భములో వారు అనేక భాషలతో సుపరిచయము కల్పించుకొనినారు. గురుముఖంగా సంస్కృత భాష రామమూర్తిగారు నేర్చుకోవటమేగాక, సాధారణ పట్టభద్రులవలె పట్టాలు పొందే పరీక్షలకేగాక, అతీతమైన పాండిత్యమును సంస్కృతభాష యందు వారు సంపాదించిరి. సంస్కృత కావ్య నాటకములను సమన్వ యించుకోగలిగిన శక్తిని వారు సంపాదించిరి. పిదప సవరభాషకు వ్యాకరణం, నిఘంటువు కల్పించి, సమకూర్చిన సమయమున, భాషాతత్వ శాస్త్రమును సాధించిన సందర్భమున గ్రీకు లాటిన్ వంటి ప్రాచీన భాషలతోనూ, ద్రావిడ భాషలతోనూ పరిచయము కల్గించుకొన్నారు రామమూర్తిగారు. మానవ కుటుంబంలో ఏ శ్రేణికి చెందినవారని నిర్ణయించినపుడు, సవరల ఆచార వ్యవహారములను పరీక్షిస్తూ, రామమూర్తిగారు మానవజాతి శాస్త్రమును అభ్యసించిరి. భాషలను పరీక్షిస్తూ ప్రాచీనాంధ్రము యొక్క స్వరూపమును తెలుసుకొనుటకు శాసనములను సమన్వయిస్తూ శిల్ప శాసనాశాస్త్రమును అభ్యసించిరి రామమూర్తిగారు. పర్లాకిమిడిలో వారు ఉద్యోగం చేస్తున్న కాలములో, దగ్గర్లో ఉన్న శ్రీ ముఖలింగక్షేత్రమున ఉన్న శాసనములను వ్యాఖ్యానించి, ప్రాచీన ఆంధ్రరాజుల చరిత్ర కరతలము చేసుకున్న భాషా చరిత్ర శాస్త్రవేత్త శ్రీరామమూర్తిగారు. ఈ జ్ఞానమునంతనూ వారు స్వయం కృషి వలననే గ్రహించిరి. పూర్వకాలపు పండితులవలె, రామమూర్తి గారి పాండిత్యము నూటికి నూరుశాతము ఇతిశ్రీ పాండిత్యము. వ్యావహారిక భాష శాస్త్రమని, శాస్త్ర సమ్మతమని శ్రీ మహామహోపాధ్యాయ తాతా సుబ్బ రాయశాస్త్రిగారితో రుజువుగా వాదించగలుగుటకు మహాభాష్య పీఠికను అచ్చు హల్లుల సంయోగ ప్రక్రియ మొదలైన కొన్ని అంశములను క్షుణ్ణము గా స్వాధీనపరచుకొని శాస్త్రిగారిని తన వాదమునకు సహాయులుగా చేసుకోగలిగిరి రామమూర్తిగారు.





ఇటువంటి బహు విషయకోవిదులు రామమూర్తిగారు. కావుననే ఆంధ్రభాషా మర్మములను మధించి సుభాషను కృత్రిమ భాష నుండి విడదీయగల సమర్థులు కాగలిగిరి. ఆంధ్రభాషలోనున్న ప్రతి పుస్తకమునూ అప్పటిలో వారు చర్చించిరి. తుదకు, అచ్చు పుస్తకములతోబాటు తాటాకు ప్రతులను కూడా వారి వాదమునకు రామమూర్తిగారు పరీక్షించిరి. అప్పటిలో లభించిన ఆంధ్ర మహాభారత ప్రతులన్నింటినీ పరీక్షించి కృతక భాషా స్వరూపమును వ్యక్తపరచిరి.

'వ్యావహారిక భాష సమ్మతమనేవారి వాదము కాదు, అదే సుభాష,' అని వారి సిద్ధాంతము. రామమూర్తిగారి ప్రాచీనాంధ్ర భాషాజ్ఞానములో వారు గెలువని సుప్రసిద్ధ పండితులు లేరు. ప్రాదెనుగు కమ్మవాసి వారికి ప్రాచీనాంధ్రము ఎట్లు స్వాధీనమైనదీ చాటించిరి. వారి గ్రంథములు నవ్యసాహిత్య పరిషత్తువారు స్వీకరించి అచ్చొత్తించినవి ఆంధ్రభాషాతత్వ శాస్త్రమునకు మూలసిద్ధాంత భాష్యములు. వారు ఉపయోగించిన శబ్దరత్నా కరము ప్రతిని వారు పొందుపరచిన టిప్పణములతో ఆంధ్ర భాషాభి మానులకు చేరవలసి ఉన్నది.

శ్రీరామమూర్తిగారి మిత్రులు విక్రమదేవ వర్మ, మామిడన్నం కుమారస్వామి, వెల్డ్‌మన్ వంటి ప్రముఖులు. వీరందరూ రామమూర్తిగారికి కొండంత అండ. రామమూర్తిగారు గురువుని మించిన శిష్యులను పెంచి, పెద్దజేసి, తన వ్యావహారిక సుభాషోద్యమమును వారి ద్వారా కొనసాగించిరి. వారిలో గిడుగు సీతాపతి (రామమూర్తిగారి కుమారుడు), బుర్రా శేషగిరి రావు, చిలుకూరి నారాయణరావు (తెలుగుభాషలో మొట్టమొదటి పిహెచ్.డి. పట్టం మద్రాసు విశ్వవిద్యాలయం నుండి పొందినవారు), వజ్ఝుల చిన సీతారామశాస్త్రి, పారనంది జగన్నాధస్వామి, తాపీ ధర్మారావు, టేకుమళ్ళ కామేశ్వరరావు ముఖ్యులు. రామమూర్తిగారి పోషణలో, ప్రోత్సాహంతో, వారి శిష్యుల తెలుగు వ్యావహారిక సుభాషా రథాన్ని ముందుకు సాగనెట్టారు. అటువంటి మహా పండితుడు, ఆంధ్రభాషా శాస్త్రవేత్త, గురు పితామహులు, శ్రీ రామమూర్తిగారికి ఆంధ్రులు, ఆంధ్ర భాషాభిమానులందరి తరపునా సాష్టాంగ నమస్సులు. *

(ఈ వ్యాసంలో అంశాలు కొన్ని వినికిడి. చాలావరకూ మా తాతగారు శ్రీ పారనంది జగన్నాధస్వామిగారు (శ్రీరామమూర్తిగారి శిష్యుడు) తన వ్యాసాల్లో, డైరీల్లో వ్రాసుకున్నవి. ముఖ్యంగా ప్రవంతి పత్రికలో జగన్నాధస్వామిగారి 'నా గురువులు మహాపండితులు-గిడుగు రామమూర్తి పంతులుగారు' అనే వ్యాసం నుండి యధాతథంగా కొన్ని వాక్యాలు ఈ వ్యాసంలో వాడుకొనవలసి వచ్చినది. ఇందులో ఫోటోలు శ్రీ మదన్ పరిగి తీసినవి.)

కవితార్ఘతి

గుండె తలుపులను తట్టే కవితా గానం



చిత్రం: మోహన్

ST. MARY MERCY HOSPITAL

Great doctors and nurses.
In your own backyard.

- 304-bed Acute Care Community Hospital
- 24-hour Emergency Care and Fast Track
- Cardiac Care
- Cancer Treatment
- Outpatient Diagnostic Center
- Family-centered Birthing Care
- Women's Health Programs
- Health and Wellness Programs
- Physical Medicine and Rehabilitation
- Behavioral Medicine

One Great Hospital.
Two National Awards.

- **Clinical Excellence**
- **Patient Safety**

HEALTHGRADES®
THE HEALTHCARE QUALITY EXPERTS®

ST. MARY MERCY HOSPITAL

36475 Five Mile Rd
Livonia, MI 48154

A MEMBER OF TRINITY HEALTH

For a physician call 1.888.464.WELL
or visit our web site at www.stmarymercy.org

కవితాఝరి

గుండె తలుపులను తట్టే కవితా గానం

1.	పడుకున్నప్పుడే...	- శివారెడ్డి	...	150
2.	జీవింతును నేడానందముగా	- జె.కె. మోహనరావు	...	151
3.	వినేదెప్పుడు	- గొడవర్తి హిమబిందు	...	151
4.	అఖండం	- పాపినేని శివశంకర్	...	152
5.	మన చెట్టు	- నాగులపల్లి శ్రీనివాస్	...	153
6.	వొక అనేకం	- కె.యస్. రమణ	...	154
7.	మేఘమల్హార్	- లైల	...	154
8.	చేయూత	- విన్నకోట రవిశంకర్	...	155
9.	నయన విన్యాసం	- కొత్త ఝాన్సీలక్ష్మి	...	155
10.	నిన్నటి రోజులు	- దర్భశయనం శ్రీనివాసాచార్య	...	156
11.	భావం	- పరిగి మదన్‌మోహన్	...	156
12.	చల్ల చలికెడు వేళ	- బచ్చోటి శ్రీధరరావు	...	157
13.	మినీ కవితలు	- నచకి	...	158
14.	మధుపాత్రలో వసంతం	- డా. వేద	...	159
15.	ఎదురుచూపు	- నారాయణస్వామి	...	160
16.	సర్వాంతర్యామి	- ఆశారాజు	...	161
17.	పత్తి తియ్యటం గురించి	- ఎమ్వీ రామిరెడ్డి	...	162
18.	నా 'కొలాజ్' ముఖాలు	- పద్మశ్రీ డా. ఎస్వీ రామారావు	...	163
19.	ఒంటరిదీపం	- బండ్ల మాధవరావు	...	164
20.	శ్రీనివాసుని సుందర నయనాలు	- చాకలకొండ రమాకాంత్ రావు	...	164
21.	దూరం	- సుజన సాలూరి	...	165
22.	చిలక	- లైల	...	166
23.	చెమ్మగా తగిలిన నాలుగక్షరాలు	- నందివాడ ఉదయభాస్కర్	...	167
24.	మనుషుల వేటకొచ్చిన సముద్రం	- దేవిప్రియ	...	168
25.	అరక్షితంగా, అభయంగా...	- గొడవర్తి సుబ్రహ్మణ్యం	...	169
26.	చూడు	- చంద్రుపట్ల తిరుపతిరెడ్డి	...	170
27.	పాఠాలు - గుణపాఠాలు	- పెన్నా శివరామకృష్ణ	...	171
28.	చుక్కల్లో సూర్యుడు	- కందుకూరి శ్రీరాములు	...	172
29.	నాలుగుపోయి ఐదు వచ్చే... (బుర్రకథ)	- డా. వేద	...	173
30.	I have know love	- Lakshmi Kaza	...	174

పడుకున్నప్పుడే...

శికొండ్డి



పడుకున్నప్పుడే
ఏనుగులు వెంటపడతాయి
గద్దలు మూగుతాయి
రాబందులు దాడిచేస్తాయి.

పడుకున్నప్పుడే
రోడ్లన్నీ నన్ను చుట్టుముట్టేస్తాయి
అనాధుడెవడో 'పాహిమాం, పాహిమాం' అంటూ
నా దేహం వద్ద సాగిలబడతాడు.

పడుకున్నప్పుడే
చనిపోయినవన్నీ లేచివస్తాయి
పారిపోయినవన్నీ తిరగబడతాయి
ఈషణ్మాత్రం
కనుమూద్దామనుకున్నప్పుడే
ఇల్లు తగలబడుతుంది
శరీరం రణస్థలి అవుతుంది

భూలాలు దిగినట్టు, గొంతు మీద
కాలేసి ఎవడో తొక్కుతున్నట్టు
నేననే స్పర్గం కూలుతున్నట్టు -

✤

కనులు మూయగానే
హాయిగా మనుషుల్లో కలిసిపోవాలి
సంబరం జరుపుకోవాలి
సాయంకాలం చెరువొడ్డున
పైపంచ తలకింద పెట్టుకుని
ఆకాశం కేసి చూస్తూ హాయిగా ఆనందించాలి -

కానీ
కనులు మూయగానే
ఏనుగులు వెంటబడతాయి -

జీవింతును నేడానందముగా

జె.కె. మోహనరావు

మోహన గానము జీవితమనునది
సాహితియో అనురాగరంజితము
సుమధుర గానము వినిపింతును గడు
విమలముగా నే వీనుల విందుగ

సలలిత నృత్యము జీవితమనునది
పలు భంగిమలను పలు రంగులతో
శ్రుతులను లయలను తప్పకను సదా
వృతులను జిందుచు నర్తించెద నేన్

చేవగు చెట్టగు జీవిత మనునది
తావు నొసంగును ఛాయ నొసంగును
పెంచుచు నే పోషించెద నెప్పుడు
మంచి పండ్లనుభవించి సుఖించెద

సురుచిర స్వప్నము జీవితమనునది
వర సురవనముల, నవభువనమ్ముల
రోదసికాంతుల, నింద్రధనుస్సుల
మోదము జూతును మనో నేత్రముల

కోమల కావ్యము జీవితమనునది
ప్రేమసుధలతో నింపెద ప్రతి పుట
ముదమున వ్రాసెద నాపక లేఖిని
పదముల నెన్నో పద్యములెన్నో

వేడుక ఆటయె జీవితమనునది
ఆడుటయే నా కర్తవ్యమ్మగు
జయమొందినచో గర్వము పడ నప
జయ మొందిన కన్నీళ్ళ రాల్చను



దిన యామినులే జీవిత మనునది
అనయము వెలుగుల నీడల వలయము
కలిమిలేములను, సుఖదు:ఖములను
దలతును నా మది సమముగ క్రమముగ

లోతగు సంద్రము జీవిత మనునది
ఆతతమగు రత్నాకర మయ్యది
పెనుపెను చేపలు పెను అలలెన్నో
చిన నావను నే నడిపి తరించెద

చిత్ర నాటకము జీవిత మనునది
సూత్రధారుడను పాత్రధారుడను
అంకములన్నిట నేనే గాదా
అంకిత మెవరికో యీ నాటకము

యాత్ర అనంతము జీవిత మనునది
మిత్రుల జూతును నిత్యము పథమున
రమణీయమ్మగు దృశ్యము గాంచెద
గమనము నాపను పిలిచెను గమ్యము

జనని జఠరమున జన్మించిన ప్రతి
మనుజుని కొక నాడరుదెంచును మృతి
పిదపేమగునో ఊహ కతీతము
బ్రదుకు లమూల్యము ఆశలపారము

నిన్నేమైనదొ తలచుట వ్యర్థము
ఎన్నగ నగునా రేపేమగునో
ఈ విఘడియ వొక యీవిగ నెంచుచు
జీవింతును నేడానందముగా

వినేదెప్పుడు

గొడుతి కొమబిందు

మనిషి వినును...
అమ్మ మాట పుట్టుకతో
గురువు మాట బాల్యంలో
మిత్రుని మాట యవ్వనంలో
భార్య మాట వైవాహిక జీవితంలో
అధికారి మాట ఉద్యోగ జీవితంలో
పుత్రుని మాట వృద్ధాప్యంలో
మరి
అంతరాత్మ మాట చివరి శ్వాసనైనా...?



అఖండం

పాపినేని శివశంకర్



ఆ ఖండంలో నువ్వున్నావు
ఈ ఖండంలో నేనున్నాను
ఏ అర్ణవం ఏ కలయికను అడ్డుకోగలదు?
నీకు ఈతవచ్చా రాదా అన్నదే ముఖ్యం
దూరాలు నిజానికి దూరాలు కావు
రెండు దిక్కుల్ని కలుపుతూ ఒక కిరణం -
నింగి నుంచి నేలను తాకుతూ వర్షధార -
నువ్వు కాంతిధార అవుతావా
వర్షాకిరణ మవుతావా అన్నదే ముఖ్యం

ఏ ఊరు ఒడి దూకి పొయ్యావో
వాగువంకలు దాటిపొయ్యావో
చిటారు కొమ్మెక్కి కూడా
ఏ చింతచిగురు కోసుకోకుండానే దూకి వెళ్ళావో
ఏ పసిమొక్కల్ని
ముదురెరుపు వాత్సల్యపు పళ్ళు నీ మీద రాల్చుతున్న
ముసలి మర్రిచెట్టును చెరువుగట్టు మీద వదిలివెళ్ళావో
నిన్ను ముట్టుకున్న ముద్దాడిన
ఎన్ని దేహాల్ని వీడివెళ్ళావో
అవేవీ అసహజం కాదు
మనిషికి రెక్కలుండటం దిక్కుల్ని అధిగమించటం
అపరాధమేమీ కాదు
ఆ ఊరి పోలేరమ్మ, ఆ వాగునీటి చేపలు
ఆ సాయంత్రం
పాలాల మీదుగా నీలోంచి వీచిన పచ్చని పైరగాలి
ఆ దేహాల సుఖదుఃఖ సంవాసన
నీ కలల్లో చేపల్లా కదలాడుతున్నాయా
అన్నదే ముఖ్యం

ఏ కాలవగట్ల పిల్లంగోవులో, పిల్లేరు గంతులో
ఏ తొలితొలి పరికిణీ కవ్వింతలో, కావలింతలో
ఏవో ఏవో నువ్వు మర్చిపోయుండొచ్చు
కానీ
సగం కొరికి వదిలేసిన పండులాగా
తియ్యని బాధేదో ఇక్కడ మర్చిపోయినట్టు
నీకు నిరంతరం గుర్తొస్తుందా అన్నదే ముఖ్యం
అంతరంగంలో ప్రాచీనపుటరణ్యాలు ఆకాశాలు
ఇంకా విస్తరిస్తున్నాయా అన్నదే ముఖ్యం

నువ్వు కోపానివా
ఏకాంత ద్వీపానివా
అనేకానేక అపురూప పూర్వ స్పర్శల రూపానివా
అన్నదే ముఖ్యం

ఎవడైనా
ఈ బీటలువారే నేల మీద
ఖండఖండాలు గాకుండా ఉంటం
తేలికేమీ గాదు
ఖండాలు అఖండం గావటమూ
కష్టమేమీ గాదు

మన చెట్టు

నాసుంపల్లి శ్రీనివాస్



చేతిలో ఇమిడేటి చిన్న విత్తనం
చెట్టంత మనిషికే నీడివ్వ ఎదుగు
ఆరవ శతాబ్దిలో ఆయువును పొంది
వెయ్యేళ్ళలో వేల వేళ్ళాని నిలిచె

కోట్లాది గుండెల్ల పాదుకొని మెలగె
తరతరాలకు పెద్దదిక్కుగా పెరిగె
ఎన్ని కొమ్మలు మొలచె ఎన్ని శాఖలు విరిసె
ఎన్ని ఆకులు తొడిగె ఎన్ని రంగులనద్దె
ఎన్ని పువ్వులు పూచె ఎన్ని పళ్ళను కాచె
ఎంత పరిమళమిచ్చె ఎంత తేనియనిచ్చె

ఎన్ని రుచులను చూపె ఎంత నీడను ఇచ్చె
ఎన్ని రీతుల ఎదిగె ఎంత సేవను సలిపె
మట్టి కాదది చూడ మనుషులందుండు
చెట్టు కానట్టి చెట్టు ఈ తెలుగు చెట్టు
ఆకులా కావు పలుకు నాలుకలు
యాసలా కావు మాటాడు గుండెలు
మాటలా కావు ముత్యాల మూటలు
మూటలా కావు చైతన్యబాటలు
వెతికి చూడగా విశ్వమంతయూ పాకె

తరచి చూడగా ఏదో తక్కువైనటు తోచె
కనిపించరావాయె కొమ్మలవి కొన్ని
పరిమళంబులు తగ్గె కొన్ని పువ్వులకు
మొగ్గ తొడుగుటలేవొ మానెననిపించె
అంతుపట్టని తీరు అగుపించుచుండె
నీరు పొందని మొక్క వెలుతురందని మొక్క
నిలువునా ఎండదు కుప్పుమని కూలదు
ఒక్కొక్క ఆకు పూర్తిగా ఎండు
ఒక్కొక్క రెమ్మ పూర్తిగా చచ్చు
ఒక్కొక్క భాగమే క్షీణించుచుండు
ఒక్కొక్క అంగమే అంతమగుచుండు
ఒక్కొక్క నిముషమే నిలువ ఆరాడు
ఒక్కొక్క దినము బతుక పోరాడు
ఎన్ని జానపదాలో ఎన్ని జోలపాటలో
ఎన్ని భావగీతికలో ఎన్ని రాగమాలికలో

ఎన్నెన్ని రూపాలో ఎన్నెన్ని అందాలో
ఎన్నెన్ని కళలో ఎన్ని ప్రక్రియలో
ఒక్కొక్కటె సన్నగిల్లుచు నుండె
ఒక్కొక్కటె సద్దుమణుగుచు నుండె
ఒక్కొక్కటె వణుకుతున్నట్లుండె
ఒక్కొక్కటె ఉనికి లేనట్లుండె
ఒక్కొక్క నిముషమవి నిలువ ఆరాడె
ఒక్కొక్క దినమవి బతుక పోరాడె
ఒక యాస తక్కువని ఇంకొకటి తలచె
ఒక చెట్టు బిడ్డలని ఇంకొకటి మరచె
నీడనిచ్చిన చెట్టు నిలువ ఆరాడె
సాయమిచ్చిన చెట్టు సాయంబు కోరె
చెట్టంత సాయంబు చేయ పనిలేదు
చిన్న విత్తుకు నీరివ్వ చిగురించి పెరుగు
పలుకులే దానికి పంచప్రాణాలు
వాడుకలే దానికి నిజమైన వేడుకలు
మాటలే దానికి మనమిచ్చు సేవలు
మన శ్వాసలే దానికి స్వచ్ఛ వాయువులు

వొక అనేకం

కె.యస్. రమ్య



వొంటరి పక్షులన్నీ వొక్కటే
ఆకాశాలే వేరువేరు

వారంటీలూ గారంటీలూ వస్తువులకే
నేను మనుష్యుల గురించి మాట్లాడుతున్నాను
జెండాల మాధ్యమం వొక్కటే
రాజకీయాలే వేరువేరు

సంధానాలూ అనుసంధానాలూ విశ్వవిపణులకే
నేను మనసుల గురించి ఆలోచిస్తున్నాను
అస్తిత్వ దు:ఖం వొక్కటే
సందర్భాలే వేరువేరు

స్వేచ్ఛా సౌభ్రాతృత్వాలు దోపిడీవ్యవస్థలకే
నేను దాస్యం గురించి చింతిస్తున్నాను
మౌలిక హింస వొక్కటే
స్వభావాలే వేరువేరు

పరిశోధనలూ పెట్టుబడులూ యుద్ధ క్షిపణులకే
నేను భావితరాల ఆకలిదప్పుల గురించి విచారిస్తున్నాను
మానవ రుధిర మూలం వొక్కటే
ఆనవాళ్ళే వేరువేరు

అందచందాల అంగడి సంరంభాలన్నీ శరీరాలకే
నేను సౌందర్యం గురించి చెబుతున్నాను
అమ్మకాల సంస్కృతి వొక్కటే
వ్యక్తీకరణలే వేరువేరు

శబ్దాలూ అర్థాలూ డాంబిక పదాలకే
నేను ఆదిమ సంభాషణ గురించి ఆరా తీస్తున్నాను
నిర్వాణమౌనం వొక్కటే
భాషలే వేరువేరు

వొంటరి పక్షులన్నీ వొక్కటే
ఆకాశాలే వేరువేరు

మేఘమల్హార్

నై



ప్రియా నీవు మేఘుడ
నేను పడతి ధరిత్రిని
త్రుళ్ళు నీ ప్రేమ ఒక పరి, నా
మేన చినుకుల చుంబనాలు
పరిపరి సఖా! నీ కానుకలు
చిరుచిరు జల్లుల ఆలింగనాలు
ఒకతరి ప్రాణేశ! హర్షాన
నీ వలపు వర్షాలు నా తనువు
గుదిగుచ్చు నీ కాంక్షా మహా

ధారా ప్రవాహాలు నను నిలువెల్ల
ముంచెత్తు, నా లోలోపలకు
జొచ్చు, ధరిత్రిని నేను
నీ పడతిని ప్రియా!
నీవు నా మేఘుడవు
సత్యమై, నిత్యమౌ మన ప్రణయ
సాంగత్యమున హరితమై, పుష్ప ఫల
భరితమై యెప్పుడు నేనీ ప్రకృతిని!

చేయూత

సిన్నకోట రవిశంకర్



ఎంత సంగీతంతో కడిగితే
ఈ ఆత్మదీపం
బాహ్య ప్రపంచపు మసి వదిలి
మళ్ళీ తళతళలాడుతుంది?

ఎన్ని స్వరాలతో మంత్రిస్తే
ఈ కోతి మనసు
పాము పడగై
ఏకాగ్రతతో నిలుస్తుంది?

అంతరంగపు చీకటిలో
అలమటిస్తున్న వాడికి
నీ వంతు సాయంగా
ఒక వెలుగు రెక్క తీశావు

అపశబ్దాల అరణ్యంలో
దారి తప్పినవాడికి
నీ పాటతో
ఒక కాలిబాట వేశావు

నీ ప్రయత్నం నీవు చేశావు

కాని, చివరికి
నన్ను నేనేగా రక్షించుకోవాలి

నయన విన్యాసం

కొత్త ఝాన్సీలక్ష్మి

ముఖమండల తేజోవిరాజితాలు
మన:ప్రేరిత భావచిత్రాలు
సైగతోనే మనసు దోచే ప్రయత్నాలు
మాట లేకనే మనసు విప్పే ప్రదర్శనాలు
ఈ నయనాలు
అర్ధ నిమీలితాలు కొన్ని
ఆర్ద్రభావాలు కొన్ని
ఆగ్రహించేవి కొన్ని
అనుగ్రహించేవి కొన్ని
అదలించేవి కొన్ని
ఆదరించేవి కొన్ని
అభ్యర్థించేవి కొన్ని
ఆరడి పెట్టేవి కొన్ని
కఠిన శిలలై కొన్ని
కరుణ కురిసేవి కొన్ని
వెక్కిరించేవి కొన్ని
వెలవెలబోయేవి కొన్ని
విరిసిన ప్రసూనాలు కొన్ని
ముగ్ధ మనోహరాలు కొన్ని
అధికార దర్పాలు కొన్ని
అపరాధ భావాలు కొన్ని
నిశిత శరాలు కొన్ని
నిశ్శబ్ద చిత్రాలు కొన్ని
సాగర గర్భాలు కొన్ని
సమున్నత శిఖరాలు కొన్ని
ఈ నయనజీవన ప్రదర్శన
అంతరంగపు వింత పొంగుల
హావభావ విన్యాస లహరి
నటన నాట్య కళాఝరి



నిన్నటి రోజులు

దర్భశయనం శ్రీనివాసాచార్య



ఏ రోజుకు వీడ్కోలు చెప్పాలన్నా
దిగులే -
దగ్గరికొచ్చి కౌగిలించుకున్న స్నేహితుడు
అమాంతంగా మాయమైనట్లు -
జీవితం నుంచి కొన్ని శ్వాసలేవో
ఆవిరవుతున్నట్లు
హృదయం నుంచి కొన్ని ఊహలేవో
ఎగిరిపోతున్నట్లు -

అలా గుంపులోకెళ్ళి
హఠాత్తుగా ఒంటరిగా వెనక్కి వచ్చినట్లు -
కొంచెం సూర్యుడూ, కొన్ని నీడలూ
కొంచెం చంద్రకాంతీ, ఒకింత మనిషి భాషా
అందినట్లే అంది అదృశ్యమైనట్లు -

అదృశ్యమైన రోజుల్లోకి
ఎట్లా వెళ్ళేది
ఇవాళ్టి హడావిడి ప్రయాణం నుంచి
ఓ కన్ను ఇవాళ మీద, మరో కన్ను రేపటి మీద,
నిన్నల కోసం కన్నేది

కానీ
బహుశా
గతించిన రోజుల్లోని
మిగిలిపోయిన ప్రాణాలేవో
నన్ను ఇవాళ్టికే పిలుస్తూనే ఉన్నాయేమో
పిలుపులు నన్ను తాకుతున్నాయా అని
ఒళ్ళంతా తడుముకుంటున్నాను
ఆశ్చర్యం! దేహం నిండా నిన్నటి సంగీతాలే!
ఏ రోజుకైనా వీడ్కోలు చెప్పలేదేమో
లోలోపలికి ఆహ్వానించాను తప్ప!
ఏరోజూ నా నుంచి జారిపోలేదేమో
సారాంశమై నాలోకి ఇంకిపోవడం తప్ప!

భావం

పఠిగి మదన్‌మోహన్



రంగు రూపుల సంరంభపు నాటకం
తెర పడిన తర్వాత
తృప్తి తుంపరలు కురిపిస్తూ

గాఢ నిదురలో మునిగిన నన్ను
వర్తమానంలోకి తేల్చిన కల
మెలకువలోనూ ఇంకా గుర్తొస్తూ

పర్జన్య గర్జనల కుంభవృష్టి సైన్యాన్ని
ఎదుర్కొని గెలిచిన హరివిల్లులా హసిస్తూ

అనాదిగా
నిముష నిముషాన్ని
అహర్నిశలు కలుపుతున్న కాలం
అనంతమైన గతాన్ని పుట్టిస్తూ

చంచల క్షణ భంగురంలో
అక్షరమైన భావం
గతానికి ప్రతిధ్వనియై
స్వగతానికి ప్రతినిధియై
సంఘానికి ప్రతిబింబమై
కవిత్వంగా భాసిల్లుతూ

చల్ల చిలికెడు వేళ

బచ్చోటి శ్రీధరరావు



కం. కొంగును నడుమున దోపుచు
బంగరు నిగ్గుల కరముల వడివడిగా రా
ధాంగన చెలికత్తె గలసి
సింగారము లొలుక చల్ల చిలికెడి వేళన్

ఉ. మానసమందు దోచెడు రమావిభుడుజ్జ్వల నవ్యదివ్య ప
ద్మాసనమూర్తియై మొగమునందళు కొత్తగ నవ్వు వెన్నెలల్
వీనుల విందుగా మధుర వేణురవంబు ఘటింప నింక నా
మానిని దేహవల్లికయు మానసమొక్కయెడన్ బరంగునే?

కం. అవ్వల యమునాతటిపై
మువ్వల నటియించు కృష్ణమూర్తిని తలపన్
నవ్వుల నధరమ్ము జిలుకు
కవ్వము పటు తప్పిపోవ గానదు భ్రమలో

కం. ఏమే రాధా! నీల
శ్యాముని లోదలచి దలచి యారాటముతో
మోమున తత్తరపాటది
యేమే? మేనును మరచెదవేలే చెలియా?

ఆ. సామి వచ్చి నిన్ను సాకునో సాకడో
తెలియజాల గాని తలిరుబోడి!
మధుర మధురమైన దధినెల్ల నీవిట్లు
నేలపాలు చేసితేలనమ్మ?

కం. మొన్న శుభాంగుని మనమున
నెన్నుచు త్రచ్చితివి కుండనేమియు లేకన్
నెన్నగబోడి! మరచితిని
మన్నికయగు పెరుగు నేడు మదనవశమునన్

కం. ఇంతటి పరవశమేలనె
యింతీ! యింత పరితాపమేలనె? దయతో
కంతుడు నిను నీ కాంతుని
చెంతకు శీఘ్రముగ నేడు చేర్చునులేవే

కం. అని పలికిన చెలి పలుకులు
విని మృదు కిసలయతర బహు విమల ప్రణయో
జ్జ్వలిత మసృణ లజ్జాభర
మున రాధాంగన నుడివెను ముగుదకునిట్లున్

తే. ఏమిసేయగ మందువే? హృదయమెల్ల
నాదు వశము తప్పినది - అనారతమ్ము
బాలగోపాలకృష్ణుని పంచజేరి
మరియుచున్నది భృశమగు పరవశమున

ఉ. ఆ యమునా తటీవనము నందు ననంగుని గెల్వజాలు ప
ద్మాయత నేత్రమూర్తి గనులారగ గాంచినయట్లు తోచె నా
హా! యికనేమి చెప్పెద నిహమ్ముపరమ్ము త్రుటిన్ ఫలించు గా
దే యది సత్యమైన, యిక నీ విషయమ్ములు గుర్తు వచ్చునే!

తే. సురవరుడు కొనగోట నా చుబుకమెత్తి
కరుణ యింపార నా మోము గాంచినంత
క్షణము పారవశ్యమున నా కనులు మూసి
మానసాధిపు చూచుటే మరచినాను

చం. మృదుమధురాయమాన రసమేళన నవ్యమరంద విస్ఫుర
ద్వదన సరోజరాజ విభవమ్మది వెల్లువ యౌచు నింపె నా
మదిని శరీరమెల్లనిక మాటలతో పనియేలనమ్మ నా
హృదయము కాన్క వెట్టితిని హృద్య వికస్వర సారసాక్షుకున్

మినీ కవితలు

నచికి

పాలు-నీళ్ళు

మనసు రాయంచ -
మంచి అనుభూతులను త్రాగి
మంచి, చెడు అనుభవాలని వదిలేస్తుంది...
మనసు లేని మనుషులు కాకులు -
ఆ నీళ్ళ కోసమే కొట్టుకుంటారు!

✣

భూమి గుండ్రంగా ఉంది!

శిఖరం అంచున ఉన్నా!
ఆకాశం నా తలపాగా!
కాలు కదిలింది...
పాతాళం నా పైనుంది!



✣

యుద్ధనీతి

శాంతికి చిహ్నం కపోతం
యుద్ధం చేసే గద్దలకి
అందుకే అదంటే చిన్నచూపు!

✣

ఇండియాకి ఫోన్‌కాల్

సత్తుగిన్నెలో సంకటి ముద్ద -
కడుపు నింపదు...
ఆకలిని గుర్తు చేస్తుంది!



✣

ఒంటరైన మనసు

అక్కడక్కడా మెతుకులతో
ఖాళీగా ఎంగిలాకు...
ఎవరి కడుపు నింపి
తాను బోసిపోయిందో...

✣

పెళ్ళి

బొమ్మాబొరుసుల మధ్య ఎడం
ఎంత దూరమైనా
ఆ రెంటినీ కలిపి ఉంచే
శక్తి ఆ అంచుకే ఉంది!



✣

మోహం

నీకోసం
ఏదైనా చెయ్యగలననిపిస్తుంది
కానీ అదేమిటో...
నువ్వు నాతో ఉన్నా, లేకున్నా
నిన్నే చూడాలనిపిస్తుంది, అంతే!

✣

అమ్మ

రెండేళ్ళ తరువాత ఇండియా వెళితే
వర్షాకాలపు సాయంత్రం
అమ్మ చేతి వేడివేడి పకోడీలు
చల్లగా అనిపించాయేం!?



✣



నాగరీకం

కన్నీరు కూడా
కార్పొరేషన్ నీళ్ళలాగే...
గమనించటానికెవరూ లేనప్పుడు
ఆగి ఆగి కొంతసేపే వస్తాయి!

✣



పెసిమిజమ్

తెల్లదనం
ఏడు రంగుల
శవంపైన కప్పిన దుప్పటి!

✣

అముద్రితం

మనస్సనే కవితల కార్ఖానాలో
కాళ్ళు విరిగిన
కూలీలెందరో!

మధుపాత్రలో వసంతం

డా. కేదా



ఆమని కొందరికిష్టం!
వారికి శరత్తయితే కష్టం!
చెట్టూ చేమా పల్లవించుకునే పచ్చదనం
కొమ్మారెమ్మా సంతరించుకుంటే పూలవనం
తెమ్మెరలెన్నో నిండి అలరించే సౌరభం
తుమ్మెదలన్నీ రమ్మని పిలిచే సౌందర్యం
ఇవన్నీ ప్రకృతి పుస్తకంలో వసంతపు సంతకం

శరదృతువు మరికొందరికానందం!
వారికి వసంతంలో వుండేది ఏమందం?
చెట్టూ చేమా పండి, వన్నెల రంగులెన్నో
కొమ్మారెమ్మా మోడై, రాసే భాష్యాలెన్నెన్నో
తెమ్మెరలుగా మొదలై గుండెలు నిండే మలయమారుతాలెన్నో
తుమ్మెదలన్నీ వెచ్చదనాన్ని వెతుక్కునే అవకాశాలింకెన్నో
ఇవి ప్రకృతి పుస్తకంలో పతాక సన్నివేశం

అట్లాంటాలో ఆమని - ఆస్ట్రేలియాలో ఆటమ్
అట్లాంటాలోనైనా, ఆస్ట్రేలియాలోనైనా
అందరికీ వసంతం, శరత్తూ వుండేవి సమకాలమే
ఇక్కడ కొంతకాలం, అక్కడ కొంతకాలం గడిపేస్తే?
ఎప్పుడూ వసంతమే!
కాకపోతే ఎప్పుడూ శరత్తే!
అంటే ఎప్పుడూ ఆనందమా?
లేక ఎప్పుడూ విషాదమా?

వారి మధుపాత్ర సగం నిండుదా? సగం ఖాళీదా?

ఎదురుచూపు

నారాయణ స్వామి



అప్పుడప్పుడు
కనుకొలకుల్లో
నిప్పుకణిక ఉబుతుతుంది

ఎప్పుడూ
శరీరాన్ని
చుట్టేస్తూ
జడివాన కాలుస్తుంటుంది

అప్పుడప్పుడూ
పెదవులకు
మౌనం వేళ్ళాడుతుంది

ఎప్పుడూ
గ్నాపకాల నొప్పి
గొంతుకు అడ్డంపడుతుంటుంది

అప్పుడప్పుడూ
నీ ఉత్తరాల్లో సువాసనలు
అక్షరాలౌతాయి

ఎప్పుడూ
మనం తడిసిన
మట్టి పరిమళాలు
అమ్మలా
తలలో వేళ్ళు పెట్టి నిమురుతాయి

జీవితం మనల్ని విసిరేసిందో
మనమే జీవితాల్ని ఒడిసిపట్టుకున్నామో

దిగంతానికి
అవతలి పక్క నువ్వు,
ఇవతలి పక్క నేను

బాధ మనల్ని ముంచేసిందో
మనమే గాయాల్ని కడుక్కుని బాధని ఆరేశామో

ఇంకిపోయిన కన్నీటి గీతకు
అటువైపు నువ్వు
ఇటువైపు నేను

స్మృతులు మనల్ని బూడిద చేశాయో
మనమే పూలరెమ్మల సన్నని జ్వాలల్ని
భాషగా మార్చుకున్నామో

ఊగుతున్న కాలానికి
ఇటు క్షణం నేను
అటు క్షణం నువ్వు

రాత్రులు మనల్ని ముక్కలు చేశాయో
పగళ్ళని మనమే ఉండలుగా చుట్టి పారేశామో

దుమ్ము పట్టిన ఆకాశం డైనింగ్ టేబుల్‌కి
అవతలి పక్క నువ్వా
ఇవతలి పక్క నేనూ

ఇద్దరి మధ్యా ఒక గతమూ
ఒక భవిష్యత్తూ
ఒక అర్ధ భూగోళం

పిడికిట్లోంచి జారిపోయేవి ఏడు సముద్రాల ఇసుకదిబ్బలో
చూపులని కమ్మేస్తున్నవి బూజుమబ్బుల కెరటాలో

ఎదిరిచూపుల దారాలకు
ఇటు చివర నేను
అటు చివర నువ్వా...

ఎప్పుడు మొదలవుతుందో
తెలియని తోలుబొమ్మలాట

సర్వాంతర్యామి

ఆశారాజు



చినుకులు పడుతుంటే
మంటలు వెంటపడ్తున్న కాలం
వెన్నెల చుట్టూ
కమురు ముసిరిన కాలం
సముద్రాల్ని
రాబందులు తన్నుకపోతున్న కాలం
పిచ్చిపట్టిన కాలం
భూగోళాన్ని
మట్టి తట్టలతో పూడ్చే ప్రయత్నం చేస్తున్న కాలం
వెర్రి కాలం
పగబట్టిన కాలం
అతని వెంటపడిన కాలం
అతని కోసం వేటాడుతున్న కాలం
కళ్ళు బైర్లు కమ్మిన కాలం
పచ్చకామెర్లు వచ్చిన కాలం
ఆకాశం ఎత్తు పెరిగిన టేకుచెట్టు అతడేనేమో
దెయ్యాల గుట్టమీది నల్లబండ అతడేనేమో
నక్కల వొర్రెలో పారే నీళ్ళు అతడేనేమో
నీటిచెలమ దగ్గర నిలబడ్డ పెద్దపులి అతడేనేమో
పాట పాడుతూ వెళ్తున్న పొట్టి తోకపిట్ట అతడేనేమో
నాట్యం చేస్తున్న మాయ పింఛాల నెమలి అతడేనేమో
వర్షం వెలిసిన తర్వాత పొడిచిన ఇంద్రధనుస్సు అతడేనేమో
గాలి వీస్తున్నప్పటి వింటినారి ప్రతిధ్వని అతడేనేమో

భ్రమలు కమ్మిన కాలం
లోయలో దిగుతున్న నెలవంకలో అతడుండొచ్చు
ఇప్ప చెట్ల మీద కురిసే వెన్నెల కుప్పల్లో అతడుండొచ్చు
ఆరిపోని దీపంలా వెలిగే వేగుచుక్కల్లో అతడుండొచ్చు
తెల్ల కుందేలు కుడికంటిలో అతడుండొచ్చు
సాయంకాలం పొడుగ్గా వాగే ఎర్రకొండ ఒంటెనీడలో అతడుండొచ్చు
అనుమానం ముళ్ళలా పెరిగిన కాలం
[illegible]డిన వాగులో గులకరాళ్ళు కదిలిస్తున్నారు
చిట్లిన మొర్రిపళ్ళ వాసన చూస్తున్నారు
మర్రి ఊడలకు భయపడి నరికి నిప్పు పెడ్తున్నారు
భయాన్నే బతుకుతున్న కాలం
భయపెడ్తున్న కాలం
అతని కోసం గాలిస్తున్నారు
రాలిన ఆకుల్ని ఎవరు తొక్కి ఉంటారు
చిత్తు కాగితాన్ని ఎవరు చించేసి ఉంటారు
సద్దిమూట తీసుకెళ్తున్న కర్రె కుర్రాడి మీద అనుమానం
రాళ్ళు కొడ్తున్న బోదకాలు ముసలాయన మీద అనుమానం
కట్టెలమోపు మోసుకొస్తున్న స్త్రీ నిజంగా స్త్రీయేనానన్న అనుమానం
నిద్రపట్టని కాలం
అతని కోసం గాలిస్తున్నారు
అంగుళం అంగుళం అన్వేషణ
అడుగడుగునా పరీక్ష
మలుపు దగ్గరా నిఘా కూడలి మధ్యనా నిఘా
అతని కోసం
అటు అడవుల్ని తగలబెడ్తుంటే
ఇటు
అతడు జనంలో వ్యాపిస్తున్నాడు
దినదినం మనందరిలో జీవిస్తున్నాడు

పత్తి తియ్యటం గురించి

ఎక్వీ రామిరెడ్డి

అయిదు వేళ్ళూ విప్పార్చి అందుకుంటే
పిడికిలి పట్టనంత పత్తి
గట్టు మీద నిలబడి చూస్తే
చూపుకు సమాంతరంగా కళ్ళు పట్టనంత పత్తి
చేనంతా దూది సువాసనలు
చెట్టుచెట్టుకీ తెల్లటి కొప్పులు
కొమ్మ కొమ్మకీ పత్తిపూల జడకుప్పెలు

జడకుప్పెలు విప్పటం ఓ విన్యాసం
పత్తి దియ్యటం ఒక కళ
నలుచదరపు గుడ్డ రెండు చెంగులూ నడుంకి బిగించి
ఒడుపుగా ఒడి కట్టుకోవాల
ఆడాళ్ళయితే భుజాల నించి వీపు మీదుగా
వాటంగా వంచె కట్టుకోవాల
మునుములో బిరబిరా ముందుక్కదుల్తూ
ఆపక్కా ఈపక్కా పగిలిన పత్తిగుల్లల్ని
విసవిసా అందుకోవాల
ఎగిరినంతసేపూ పక్షి తన రెక్కల్ని ఆడిస్తూనే ఉన్నట్లు
తీసే చేతికీ ఒడిలో వేసే చేతికీ
తెంపుండకూడదు
కింద నుంచీ పైదాకా
చెట్టును గుప్పిళ్ళతో ఒలుచుకుంటూ
వడివడిగా అడుగులెయ్యాలి

గుడ్డిగుల్లలుంటాయి
పనికిరావని వదలకూడదు
పగలదీసి పత్తి పదార్థాన్ని ఏరుకోవాల
కాన్పుగాని కాయలుంటాయి
పగలగొట్టి పాడుచెయ్యకూడదు
రెండో కాపు నాటికి అట్టిపెట్టుకోవాల



ఆకులచాటునో కొమ్మల మాటునో
పత్తిపొట్లాలు జారిపోకుండా
అంచెలంచెలుగా ఆవలిగట్టుకు చేరుకోవాల
ఒడ్డుకు చేరేలోగా తాపతాపకీ
ఒడి నిండి నడుం బరువెక్కాల
వంచె పొంగిపొర్లి భుజాలు పీక్కుపోవాల

మండుటెండలో మంచుగొడుగుల కింద
కంపలా ఎండిన పత్తికట్టె
ఆచ్ఛాదన లేని కాళ్ళను రక్కి పెడుతుంది
ఎండిన కొమ్మలకు గీసుకొని
ఎగిరే రెక్కలు గాయపడతాయి
పత్తిగుల్లల్ని ఒలిచీ ఒలిచీ
రెండు చేతుల వేళ్ళూ సలపరం పెడతాయి

ఒక్కో గోతామూ పత్తి ధనంతో నిండుతున్నప్పుడు
ఒంటిమీది గాయాలన్నీ గట్టుమీదే రాలిపోతాయి
ఖాళీ ఒడిని బిగించి కట్టుకుంటూ
మళ్ళీ పత్తికోత మొదలు
వొదులైన వంచెల్ని సరిజేసుకుంటూ
మళ్ళీ తెల్ల బంగారం తవ్వకం

✤

పడమటింటో పత్తిమండె
నిలువెత్తుకి ఎదగ్గానే
గిట్టుబాటు ధర జర్రున జారడమేందో అంతుబట్టదు
అన్నం దగ్గర కూచున్నా అదే ఆలోచన -
వేడివేడి అన్నంలో
ఎర్రటి పచ్చడి కలుపుకునేటప్పుడు
పత్తిగుల్లలు తగిలి గోళ్ళ చుట్టూ లేచిన చివుళ్ళలో
చురచురా మంటల్లేస్తాయి
అయిదు వేళ్ళూ విప్పార్చి అందుకుంటే
పిడికిట్లో ఏ మూలకూ అందని అన్నం

నా 'కొలాజ్' ముఖాలు

పద్మశ్రీ డా. యస్.వి. రామారావు



వేసవికాలపు రోజుల్లో
'పేలోన్ హిల్స్' ఊరిలో
సూర్యుడు అస్తమించబోయే ముందు,
చెట్ల మధ్య దాక్కొని
ఏకాంతంగా
చిన్నగా
కూనిరాగాలు తీస్తున్న కొలను గట్టున
కూర్చొని
బ్లైత్‌కి తెచ్చుకుంటున్నాను,
క్రితం తడవ
వచ్చినప్పుడు,
బోల్షోవాయ్ బాలరీనా లా
ఒంగి, వయ్యారంగా
సాగిపోతున్న,
నల్లటి హంసని.

చెల్లాచెదురుగ పడి ఉన్న
చిన్నిచిన్న పల్చటి రాళ్ళని
లేచి నిలబడి
ఓ యాంగిల్‌లో
ఒకదాని తర్వాత ఒకటిగా
నీటిపై విసురుతుంటే -
తెరచాప తెరిచిన పడవ
నీటిపై దూసుకుపోతున్నట్లుగా -
తగిలీ తగలకుండా
అక్కడక్కడ నీటిని తాకుతూ
చుయి, చుయి మని
తేలుతూ,
శరవేగాన పోతుంటే
తాకిన చోట్లా,
నీళ్ళలో చక్రాలు పుడుతున్నాయి,
విరబూసిన నక్షత్రాల్లా
అలల చక్రాల అంచులపై
చిన్నవి, పెద్దవిగా
కొన్ని వందల ముఖాలు,
వెదజల్లిన
రంగు రంగుల పూలరేకల్లా
తేలుతూ
నన్ను పిలుస్తున్నాయి.

ఎంత అందమైన ముఖం నాది -
రొమేరె బియర్డన్ చిత్రంలా
లిక్టెన్‌స్టైన్ పెయింటింగ్స్‌లోని
గుండ్రటి చుక్కల మొఖాలు కాదు -
'ఆవ్ ఆర్ట్'లోని వలయాకృత
రైలీ' వంకరగీతల చిత్రాల ముఖాలు -
నైజీరియన్' బెనిన్ శిల్పాల గీతల ముఖాలు

నే ఇంటికి వెళ్ళేటప్పుడు
నా ముఖాలన్నిటిని
ఏరుకొని వెళ్ళాలి.
ఒకవేళ
మర్చిపోయి
ఇంటికి వెళ్తే,
ఎవరూ లేరుగదా అని
కొలను వద్దకు వచ్చినవాళ్ళు,
నా అందాల ముఖాల కొలాజులను
తీసుకుపోతే?

ఒంటరి దీపం

బండ్ల మాధురావు

తూర్పు దిక్కుగా సాగే పయనం
ఉషోదయపు అంచుల దాకా సాగాలి
గుండెల్లో అలజడి కడలి అలల్లా సాగుతున్నా
మనసుమూలల్లో ఎక్కడో చిన్న ఆశ
సూర్యోదయం వైపు నడిపిస్తూ వుంటుంది
అలల అడుగుల్ని దృఢపరచుకోవాలి
కెరటాన్ని నావను చేసుకోవాలి
ఎప్పుడూ ఓ విషాదం
గుండె తలుపుల్ని తట్టి
తనను స్పష్టం చేసుకుంటూ వుంటుంది
తరచి చూస్తే ఎవరో ఏమిటో ఎందుకో
అస్పలు స్పష్టం కాదు
వెదుకులాటతోనే కాలం కరిగిపోతోంది
పత్రహరితాన్ని కోల్పోయిన ఆకులు
నేలరాలడం సహజమైతే కావచ్చేమో కాని
రెక్కలు తొడిగిన ప్రతి ఆశా పచ్చి ఆరకుండానే
నేల రాలడం అసహజమే
నిరాశాకాశంలో కదుల్తున్న



కన్నీటి మేఘాలు ఆవిరైపోతున్నాయి
మేఘాలు రాసుకున్న శబ్దాలు మాత్రమే మిగులుతున్నాయి
అక్కడొక ఒంటరిదీపం
మినుకు మినుకుమంటూ నిశ్శబ్దంగా
అప్పుడప్పుడూ కొన్ని రెక్కల పురుగులు
దాని చుట్టూ తిరుగుతూ
దీపపుకాంతి ఆకర్షిస్తోంది
వేడిమి రెక్కల్ని కాల్చుతోంది
ఎగురుతూ ఎగురుతూ నేలరాలడం
కిందపడి గిరికీలు కొట్టడం
ఎగరడం కోసం
అనేకానేక ప్రయత్నాల తర్వాత కూడా
విఫలమవ్వడం
ఇదంతా నిరంతర ప్రక్రియ
విఫలత్వంలోనూ ఓ రుచి వుంది
మళ్ళీ స్పష్ట పడటానికి ఇదో మెట్టు
ఒంటరి దీపపు కాంతి
పల్చపల్చగా, అస్పష్టంగా, అసంపూర్తిగా
అయినా అడుగులు రేపటి సూర్యోదయంవైపే

శ్రీనివాసుని సుందర నయనాలు

చొక్కకొండ రమాకాంతరావు



కనులు కావవని కరుణ కాంతులను కురిపేటి
కమనీయ కందువ కాల మేఘములు
నయనములు కావవి నిత్య వరదాయక
నర్మిలిత నిర్మల నయగారములు ॥కనులు॥

విబుధులు వరించి వర్ణించి భూషించు
వైరాగ్య ఊహల వనజరాజములు,
కవిరాజ కోవిదులు కలగని భావించి,
కవితలల్లెడి కదురు కైవల్య కుసుమములు ॥కనులు॥

అజ్ఞాన తిమిరముల అంబుదములను చీల్చు
అర్కకిరణ అమల ఆనంద దీపికలు
వేద వేదాంగముల విజ్ఞాన సామ్రాజ్య
విజయ విభ(వ) సౌధముల వైజయంతములు ॥కనులు॥

పద్మరాగప్రభ పుణ్యప్రేమప్రద
పరతత్వ బోధక పారిజాతములు
సతత మంగళకర సుజన సేవిత సులభ
శ్రీ వేంకటేశ్వరుని శృంగార నయనములు ॥కనులు॥

దూరం

సుజన పాలూరి



అవును... ఇండియాకి, అమెరికాకి ఎంత దూరం!!
అయినా... జన్మభూమిపై తీరని అభిమానం
అమ్మనీ, నాన్ననీ చూడాలనే మమకారం
వ్చ్... ఏం చేస్తాం, వీలు చిక్కని బిజీ ఉద్యోగం...

తప్పకుండా చేస్తాను అమ్మకి ఫోను ప్రతీ వారం
కొంతైనా స్వాంతన పొందాలనే తాపత్రయం

కానీ... ఎవరైనా రికార్డు చేస్తే మా మాటలు
అనుకుంటారు ఎప్పుడూ ఒకటే సంగతులు
అదే రొటీను పలకరింపులు
'మీరు బాగున్నారా, మేం బాగున్నాం,
వాన పడుతోందా, ఎండ కాస్తోందా,
పక్కింటి పిన్ని బాగుందా, కామాక్షి పెళ్ళి కుదిరిందా,'
అవే పైపై సంభాషణలు... కాలక్షేపపు కబుర్లు

కానీ... మనసు విప్పి ఒక్కసారైనా చెప్పను
ఇక్కడ పడే పాట్లు, ఈ రోజువారీ టెన్షన్లు
అనుకుంటారు... ఎందుకులే వర్రీ అవుతారు వాళ్ళు అని,
వాళ్ళూ అంతే... ఎప్పుడూ చెప్పలేదు ఆ నెల పెన్షన్ టైముకి అందక
చేసిన అప్పులు, సరిగ్గా కనపడని కళ్ళ సంగతులు
మొన్నొచ్చిన జ్వరంతో డాక్టరు చెప్పిన జాగ్రత్తలు
ఏమీ చెప్పరు... ఎందుకులే వర్రీ అవుతారు వాళ్ళు అని
అవును... నిజంగానే ఇండియాకీ అమెరికాకీ ఎంత దూరం...

ఛ... ఇక ఇలా కాదు...
ఓసారి ఎలాగైనా ఇండియా వెళ్ళొద్దామని
అమ్మతో, నాన్నతో మనసారా మాట్లాడాలని
ఎలాగో సంపాదించా నాలుగు వారాల సెలవుని
కొనేసా నాకూ, ఫామిలీకి టిక్కెట్లని
ఇక మిగిలింది ఒకటే... షాపింగ్ పని!

వారంరోజులు రాత్రి పన్నెండు దాకా తిరిగేసి
కొనేసా బీరకాయ పీచులందరికీ తలా ఒకటీ
ఏమి రిలీఫ్... ఎన్నాళ్ళకెన్నాళ్ళకు... మళ్ళీ నా దేశానికి...

ముప్పై ఆరుగంటల ప్రయాణంతో అయిపోయింది వళ్ళు హూనం,
అవును... నిజంగానే ఇండియాకీ, అమెరికాకీ ఎంత దూరం
ఇంటికి చేరాకా జెట్‌లాగ్‌తో నాలుగు రోజులు శయ్యా యోగం,
'ఏమిటో వీళ్ళు... వచ్చినప్పటి నుంచీ, ఈ ఊర్మిళా శయనం,'
నిట్టూర్చారు చూడ్డానికొచ్చిన స్వజనం,
మొత్తానికి వచ్చిన నాలుగురోజులకి పెట్టెలు తెరిచి
పంచడం మొదలెట్టా తెచ్చిన వస్తువులన్నీ
'ఇవి ఇక్కడా దొరుకుతున్నాయిరా...' అని దీర్ఘంగా
నిట్టూర్చాడు చిన్నాన్న
'కార్డులెస్సు ఫోనో, డివిడి ప్లేయరో తేలేకపోయావా...' సాగదీశాడు
వేలువిడిచిన మేనమామ
'ఒక్కడే ఎంతమందికి కొంటాడు, ఎన్నని కొంటాడు...' వెనకేసు
కొచ్చింది ఒక్కతే, మా అమ్మ
మొత్తానికి ముగిసింది బహుమతుల ప్రహసనం
ఇక మొదలు... పరంపరగా బంధువుల, స్నేహితుల ఆహ్వానం
తీరిగ్గా ఆరగిద్దామనుకుంటే అమ్మ చేతి ఆవకాయ అన్నం
ఏమిటో తప్పదు మరి ఈ ప్రారబ్ధం
ఇలాగే గడిచిపోయింది మరో వారం,
ఇంతవరకూ కుదరనేలేదు అమ్మతో, నాన్నతో కష్టసుఖాలు
మాట్లాడడం,
ఎదురుగానే ఉన్నా మా మధ్యలో ఎంతో దూరం...

అయిపోయింది అత్తవారింట్లో ఇంకో వారం
వాళ్ళూ చూడాలనుకుంటారుగా మమ్మల్ని పాపం
మరో మూడు రోజులు తిరుపతి ప్రయాణం
అంతే... మళ్ళీ మొదలు తిరుగు ప్రయాణానికి సన్నాహం...

మళ్ళీ షాపింగ్... షాపింగ్... షాపింగ్... చెప్పేదేముంది
ఇంటికి రోజూ వచ్చే జనం
'చికాగోలో ఉన్న మావాడికి ఒక్క కేజీయే,' అని ఒకరు
చింతపండు పంపమంది మా అమ్మాయని మరొకరు...
హు... నేననుకున్నది మాత్రం జరగలేదు... అదే...
అమ్మానాన్నతో నేను చెప్పాలనుకున్న సంగతులు
వినాలనుకున్న విషయాలు... దానికి మాత్రం చిక్కనే లేదు
సమయం
ఏమిటో ఎదురుగానే ఉన్నా మా మధ్య ఎంతో దూరం

ఇక ఆరోజే తిరుగు ప్రయాణం, నా మనసంతా ఎంతో భారం
కళ్ళనీళ్ళు నాకు కనపడకూడదని అటు తిప్పుకుంది అమ్మ ముఖం
పాస్పోర్టు అవీ పెట్టుకున్నావురా అని హడావిడి పడే నాన్న నైజం
ఎదురుగానే ఉన్నా మా మధ్య ఎంతో దూరం...
'నే వొస్తే ఇలాగే ఉంటుందీ హడావిడి
అందుకే ఈసారి మీరే రండి
మా లైఫు మీరూ చూడండి,' అని ఆహ్వానించి, చెప్పేసా వీడ్కోలు
చివరికి

అవును... నిజంగానే ఇండియాకీ అమెరికాకీ ఎంత దూరం
పిలిచానుగానీ నాకు తెలుసు, వచ్చినా వాళ్ళు ఆ దూరాభారం,
సర్దుకోలేక అవుతారు సతమతం
అక్కడికీ ఇక్కడికీ ఎంతో వ్యత్యాసం
ఇక్కడ ఇమడలేరు వాళ్ళు అది తథ్యం

వారానికోసారి వండి మైక్రోవేవు చేసుకునే మన కల్చరు
అర్థంకాదు వాళ్ళకి ఏనాటికీ మన బిజీ పిక్చరు
మనవలకి రాత్రిపూట పడుకో పెట్టుకు చెబుదామనుకుంటారు
తెలుగు కథలు
అర్థమే కావు వీళ్ళకి అసలు తెలుగు మాటలు!!

ఇక టబ్బు స్నానాలూ, బయట ఆరేసుకోలేని బట్టలూ,
సాగని ఆచారాలూ, పిల్లలని చేసే అతి గారాబాలూ,
వీకెండులో డ్రైవులూ, హోటళ్ళలో తినే పిజ్జాలూ, పిస్తాలూ,
ఇవన్నీ వాళ్ళకి మింగుడు పడని విషయాలు
ఏమిటో ఇక ఇంతేనేమో
ఈ తరాల మధ్య అంతరం
తప్పదు నాకీ అంతర్మథనం

నిజంగానే ఇండియాకీ అమెరికాకీ ఎంతో... దూరం
అయినా కన్నవారిపై తీరని మమకారం
అందుకే తప్పకుండా చేస్తాను ఫోను ప్రతి వారం
కొంతైనా స్వాంతన పొందాలనే నా తాపత్రయం

చిలక

లైలా

పంచవన్నెల చిలకొకటి పైపైకి ఎగిరిందీ
రెక్కలు రెండూ విప్పి చుక్కల లోకం చేరి
మక్కువతో నెలవంకపై ఉయ్యాలలూగిందీ,
మబ్బులపై తూగింది, వెన్నెలెంతో మెక్కిందీ,
మత్తిలి సురగంగా సైకతాల చిందులే వేసింది.
చిలకంటే చిలకా అది! రంగుల రాచిలక!

సుందర నందనవనిలో విరిసిన
అందమైన మందారాల మకరందం తాగిందీ,
చెట్టు చెట్టుకూ ఎగిరి, చిట్టీపొట్టీ పిట్టలతో
కులుకుచు చిలిపి మాటలాడిందీ
పుట్టతేనె కన్న తియ్యని పాటలే పాడింది
చిలకంటే చిలకా అది! జిలిబిలి పలుకుల చిలక!



ఎంచక్కగ ఊగి, తూగి, ఆడి, పాడి చక్కని
రాచిలక, దివి నుండీ భువికి తా దిగివచ్చే వేళలో
చూడలేదు బోయవాని, కానలేదు కరకు వలను
చివాలున చిన్ని చిలక చిక్కుకొనెను ఉచ్చులోన
రెక్కలు తపతపలాడెను, మిక్కిలి విలవిలలాడెను,
అమ్మో! బిగిసెను వల, అయ్యో! గిలగిలలాడెను చిలక

ముగిసెను తృటిలోన చిలక ముద్దులొలుకు పలుకు,
విసిరెను చీకటి పేటికలో మొరకు బోయ గొంతు నుసిమి,
కలిసెను నల్లని చీకటిలో చిటికెలోన మేని పసిమి,
చిలకంటే చిలకా అది! అయ్యో! పంచప్రాణాల చిలక!

చెమ్మగా తగిలిన నాలుగక్షరాలు

నండిూరు ఉదయభాస్కర్

చిన్నప్పుడే నయం
కారణాలు తెలీకపోయినా
కళ్ళల్లో కడవలు భళ్ళున పగిలేవి
పరిష్కారాలు తోచకపోయినా
అసహనంతో పిడికిళ్ళు గట్టిగా బిగిసేవి
కన్నీళ్ళలో తడిసిన
నాలుగక్షరాలు కనబడగానే
గుండెల్లో ఒక సన్నని అలజడి కలిగేది
గుర్తులు వెతుక్కునే పనిలేకుండా
అందులో కవిత్వం కనబడేది

ఇప్పుడంతా
నాగరికత మప్పిన సందేహాలే
అనువదించలేని అనుభూతులే
అక్షరాల జలపాతాల్లో
అలవోకగా స్నానం చెయ్యాలనే తపనే తప్ప
ఆక్రోశాల సుడిగుండాల్లో
కొట్టుకుపోగల ధైర్యం ఎక్కడ మిగిలింది?
సుతారంగా తేనీరులా కవిత్వాన్ని చప్పరించడమే తప్ప
ఆబగా ఆత్రంగా
వెతికి వెతికి చదివే ఆకలి యేమైపోయింది?
గ్రీటింగు కార్డు మీద పలికే చిలకపలుకులనే తప్ప
నడివీధిలో జనసముద్రాల్ని పోటెత్తించగల కవిత్వాన్ని
నాగరికత మెచ్చదు

ఎన్నాళ్ళకి మళ్ళీ ఇలా
గుండెల్లో గుచ్చుకునే అక్షరాలని చూశాను?
నిద్రపోతున్న చిన్నప్పటి నిజాయితీని
తట్టి లేపే స్నేహ హస్తాన్ని చూశాను?
అక్షరాలా ఇవాళ నేను నిజాన్ని చూశాను
నన్ను నిలువునా ముంచేస్తున్న
నిప్పురవ్వల కుంభవృష్టిని చూశాను
రాత్రి చీకటిని చీల్చే ఉల్కాపాతాన్ని చూశాను
ఆకుల గలగలలోంచి ఎగిరే
పక్షుల గుంపుని చూశాను
నన్ను అమాంతం కుదిపేసిన
కవితని చదివాను

నన్ను కవిని చేస్తున్న అక్షరాల్లారా!
పిడచకట్టిన నాలిక మీద
కురుస్తున్న కన్నీటి చుక్కల్లారా!
మీలాగ జీవించడం
కష్టం కానీ
బీడువారిన నేలని
చిత్తడి చెయ్యడం
కష్టం కానీ
చీకటి కమ్మిన కళ్ళల్లో
వత్తులు వెలిగించడం
కష్టం కానీ
మిమ్మల్ని ఆవాహన చేసుకుని
మనిషిగా మారడం యెంత పని?



మనుషుల వేటకొచ్చిన సముద్రం...

దేవిప్రియ

మనుషులు
సముద్రం మీదికి చేపలవేట కెళతారు
సముద్రం
మనుషుల వేటకి భూమి మీదికి వస్తుంది

✤

ఏడవకేడవకమ్మా సముద్రమా
ఎగిరెగిరి పడవడ్డే సముద్రమా
గుక్క తిప్పుకోమ్మా
కాళ్ళూ చేతులూ
అంత విసురుగా ఆడించవమ్మా
నెమ్మదించవమ్మా సముద్ర శిశువా
సరివితోటల శిరసు మీదికి
ఎగబాకబోకమ్మా కడలికూనా
జోజో సముద్రమా
జోజో జలధి గర్భమా
జోజో సునామీ సునామీ!

పిల్లవైనా తల్లివైనా
నువ్వే కదా వలల జాలర్లకి
సముద్రమా...

నువ్వు వేటకెళ్ళిన పడవల కోసం
తీరాన పాంచి ఉండే దళారుల దోస్తులూ,
సముద్రమా...

తాబేలులా పడకునేదానివి
తాచుపాములా లేచావేమిటి,
సముద్రమా...

ఎందుకు కసి ఎప్పటి కసి
నీ తెమ్మెర కెరటాన్నే ఇంత చించి
గోచీ పెట్టుకుని తిరిగే నురుగుబెస్తల మీద
తరంగ కరెంటు కొరడాలతో
ఎందుకు సముద్రమా విరుచుకుపడ్డావు
చందువా చేపపిల్లల మీద
రంపపు పళ్ళ సొరచేపలా...

రక్షకదళాలకే రక్షణ లేదనీ
పూజా పునస్కారాలకి నువ్వు
కరిగి కన్నీరై పోవనీ
పుణ్యసముద్ర స్నానాలతో
ధన్యమైపోయామనుకున్న మానవులని
పరిహసించావా-
అణ్వస్త్ర దేశాలని
అన్యాపదేశంగా నువ్వు చేసిన అవహేళనా ఇది
సముద్రమా...

సుమత్రా, అండమాన్, కార్ నికోబార్
నైరోబీ, థాయ్‌లాండ్, శ్రీలంక
ఇండియా...
ఇక్కడ మా బందరులో తలకిందులైంది
సముద్రమా
నీ నీటి అద్దంలో మబ్బుతునకల జుట్టు సవరించుకుంటూ
ఆకాశంలో వేలాడిన నెలవంక

ఉరుములు మెరుపులు లేవు
పిడుగుల పిడిగుద్దులు లేవు
చప్పుడు కాకుండా జలవాసుకిలా జరజరా
పాకివచ్చావు కరా ప్రళయ కళాప్రపూర్ణ పయోనిధీ...

ఫెళఫెళార్భటులతో
మహా ఝంఝూరావాలతో
విలయవర్ష శరాఘాతాలతో
ఊరేగుతూ తీరందాటి వచ్చే నువ్వు,
సముద్రమా,
ఇంటి మోసం ఎప్పుడు నేర్చావమ్మా...

ఎన్ని అనాథ విలాపాలు
ఎన్ని నిరాశ్రయ ప్రాణాల
శాపనార్థాలు
ఆకస్మికంగా ఆగిపోయిన
ఎన్ని బాలక్రీడల శ్వాసలు
జోజో సముద్రమా
జోజో భూకంప సముద్రగర్భమా
జోజో సునామీ సునామీ

ఇంకెందుకమ్మా సముద్రమా
అణుబాంబులు... ఇంకెందుకమ్మా
జీవరసాయన ఆయుధాలు...
ఇంకెందుకమ్మా
అమెరికాలో...
నువ్వు ఒక్కసారి
ఏడిస్తే చాలు కదమ్మా
ప్రపంచాన్ని సముద్రంలో పాతిపెట్టడానికి
కాసేపు
కళ్ళు తెరవకుండా పడుకోమ్మా
సముద్రమా...
జోజో సముద్రమా, జోజో!

అరక్షితంగా, అభయంగా...

గొడవర్తి సుబ్రహ్మణ్యం



గాలికి ఊగే గడ్డిపోచలా ఒకప్పుడు
మెత్తగా, సరళంగా బతికినట్టు గుర్తు
చిగురుల మెరుపుతో లలిత లలితంగా
ఉదయానికి ఆహ్వాన పద్యం రాసి
కొమ్మల స్వరవేటికలతో గొంతు కలుపుతూ
వెలుగులో చీకటిలో కలిసి
అరక్షితంగా అభయంగా బతికినట్టు గుర్తు

వానకాళ్ళ నడకల జాడలో
గుండెలో ప్రవాహం నింపుకున్నట్టు
మంచుని కరిగించిన కిరణాల్ని
ఒళ్ళంతా కప్పుకున్నట్టు
ఆకులన్నీ ఓడిపోయిన రావి కింద దిగులై
కొమ్మలు ఎగరేసిన జెండాల నీడలో
కుదుటపడ్డట్టు గుర్తు
మట్టి నుంచి బొడ్డు చేరు తెంచుకోక
మూలంలోంచి సారం పీల్చుకున్నట్టు గుర్తు

మాట మెత్తగా వంచి
మరో మనసులో అంటు తొక్కినట్టు
అస్పృశ్య వ్యక్తిత్వాన్ని వదిలేసి
స్పర్శతో అర్థం పూర్తి చేసినట్టు
సాంతానికి మనసేమీ దాచుకోనట్టు
ఎదుటి మాటని ముగిసిపోనివ్వక
అదే శ్రుతిలో కొనసాగించినట్టు గుర్తు

మరి ఇప్పుడు
ఏ మనసుకేసి కాసేపు వంగినా
నిర్మాణం ఎక్కడ కూలుతుందోనన్న భయం
పత్రహరిత సారం బెరడుకట్టి
చర్మం విద్యుద్ఘాతకం కాదు
మనస్సు యుద్ధవీరుడి కండరంలా మారింది
పైరగాలి పంటచేను ఊపినట్టు
వెచ్చటి శ్వాస నన్ను కదిలించదు
నా ఒంటిలోంచి ఆయుధం లేచి
నీ చూపుని ధ్వంసం చేసి తిరిగొచ్చి
నన్ను ధ్వంసిస్తోంది
అద్భుతం ఆనందం రెండు బిందువుల్లా
కళ్ళలోంచి జారిపోయాయి
దృశ్యంలో సారం అందటంలేదు
మట్టి నుంచి నేను దూరమయ్యాను
ఏం చేస్తే తప్పిన లయ కుదుట పడుతుంది

ఎప్పుడో నా అరక్షిత శరీరం
అయత్న నిరీక్షణలో
వాన చినుకుకి జల్లు మన్నప్పుడు
నాలో ఒక పరిమళం గుప్పుమంటుంది
ఈ ధాత్రీ హృదయం నాలో దాచిన మెత్తదనం
నన్ను బతికించుకుంటూ బయటపడి
నడిపించటం ప్రారంభిస్తుంది
అరక్షితంగా అభయంగా అయత్నంగా
అనాచ్ఛాదిత జీవన గమనం సాగుతుంది

చూడు

చంద్రుపట్ల తిరుపతిరెడ్డి



శరదృతువు
చేరగానే
చల్లగాలుల
నెదుర్కొనుటకు
ఆకురాల్చిన
చెట్టు చూడు

వసంతంలో
పూవు పూవున
తేనెటీగలు
ఏర్చికూర్చిన
జుంటితేనియ
తీపి చూడు

ఎండకాలం
మండుతుంటే
చెట్టు నీడన
తృప్తి నిండిన
నెమరువేసే
ఆవు చూడు

వర్షకాలము
వచ్చినంతనె
నీటికోసం
పరితపించే
కర్షకుని ఆ
మనసు చూడు

తమకులేని
భవిష్యత్తును
పిల్లలకు సమ
కూర్చుకొను ఆ
తల్లిదండ్రుల
తపన చూడు

గూటిలోని
పక్షికూతలు
తల్లి తెచ్చిన
తిండి కోసం
నోరు తెరిచిన
తీరు చూడు

కత్తికున్న
పదును చూడు
కలంరాత
బలం చూడు
మనసు దాచిన
మమత చూడు
మనిషి తలపుల
గెలుపు చూడు

చూడగలిగే
శక్తి నీలో
ఆగిపోయే
క్షణం వరకూ

ఋతువులోనూ
క్రతువులోనూ
చెట్టులోనూ
పుట్టలోనూ
పిట్ట కట్టిన
గూటిలోనూ
ఆసక్తితో
అనురక్తితో
చూడగలిగిన
వన్ని చూడు

పాఠాలు - గుణపాఠాలు

పెన్నా శివరామకృష్ణ



We read the world wrong and say that it deceives us

ఎందుకైనా మంచిది
ఈ పద్యానికి ముగింపు ముందే చెప్పేస్తాను
సామాన్యులు జీవితం నుంచి పాఠాలు నేర్చుకుంటారు
మేధావులు గుణపాఠాలు నేర్చుకుంటారు

ఏ కొమ్మా తాను మోయలేనంత బరువైన పూవును పూయదు
ఆధునిక వసుదేవుడు ట్రాఫిక్ యమున
దారి ఇస్తుందని వేచి ఉండడు
నదికి తానే దారి ఇస్తూ స్వప్నశిశువును ఆవలితీరం చేరుస్తాడు
రాయి విసిరితే దోసిట్లో రాలే పండు కాదు సూర్యుడు
శిలువలైన కలలన్నీ ద్రోహమూర్తులే

నీడలో నిల్చుని ఒకడు వెలుగును వెక్కిరిస్తుంటాడు
మరొకడు నీడల కొలతలు తీస్తూ వెలుగుకు వెల కడుతుంటాడు
వెలుగులోనే వ్యవసాయం చేసుకునే వాడికి
నీడలు గడియారపు ముళ్ళు

ఒకడికి అశ్రుబిందువు
ఎటు నుంచి చూడాలో తెలియని నైరూప్య చిత్రపటం
మరొకడు అశ్రువులో ఒకవైపునున్న సముద్రాన్ని
మరోవైపునున్న సప్తవర్ణ రంగవల్లిని ఒకేసారి చూస్తుంటాడు

గాయం బ్రతుకు ప్రియురాలు తీర్చిన గోరింట
వాంఛాపుష్పంలో ఉండేది వేదనా మకరందం
ఏకాంతం కన్నీట బృందగానాన్ని వినలేనివాడు
ఎత్తిన పిడికిళ్ళ ప్రవాహంలో రాలుతున్న
ఒంటరి కన్నీటి బిందువులోని
రోదసిని చూడలేడు
ఆకాశపు ఎడారిలో సూర్యుడు కూడా
నగ్నపాదాలతో నడిచే ఒంటరి బాటసారి

ఎన్ని గాయాలను అలంకరించుకొంటే
వెదురు వేణువయిందో
ఎన్ని యుగాలను దాచుకుంటే
ఆర్తనాదమే గానమయిందో
'కన్నీరొక చుక్కన్నచో
ఏ కష్టమైన భరియింతును,' అన్న గోరటి వెంకన్నకు
కోరస్‌గా మారుతారు
కనులున్నంత కాలం కన్నీరుంటుందనుకునేవారు

వారు క్షణంలో నడిచే నిలువెత్తు కన్నీటిచారికైపోతారు
మరుక్షణం కన్నీటి కొలనులో పదునెక్కి
కాంతి ధారల ఖడ్గాలై అవతరిస్తారు
స్వేదబిందువులను తుడుచుకున్నంత అప్రయత్నంగా
కపోలాల మీది రెండు జీవనదులను తుడిచేసుకుంటారు

ఇక ఉపోద్ఘాతాన్ని ఆపి పద్యాన్ని ప్రారంభిస్తాను
మేధావులకు తమ కలల చుట్టూ అల్లుకున్న సాలెగూడు
ఒక కాంతి పరివేషం
ఇతరులు తొలిపొద్దు లేలేత కిరణాల దువ్వెనతో
కనుల మీదికి జారుతున్న
కలం ముంగురులను సవరించుకొని
నిత్యనూతన సంగ్రామానికి సన్నద్ధమవుతారు

చుక్కల్లో సూర్యుడు

కందుకూరి శ్రీరాములు



పచ్చనిగడ్డి చిరునవ్వు
పిల్లగాలికి కదులుతుంది
మొగ్గలు విప్పుకున్నట్టు పెదాల్లోంచి మకరందపు జల్లు
గద్ద మేఘమొకటి ఆకాశం నిండా రెక్కలు చాచింది
దేహానికి అంటుకున్న చల్లదనం పోయి మెలమెల్లగా
మంచుపువ్వు మీద ఎండ కాస్తుంది
పర్వతం మీద నుండి దూకిన నది సింహం
దట్టమైన అడవిలో వేటకై బయల్దేరింది
చెట్లన్నీ ఆకాశం మీద పడకుండా వేర్లతో భూమిని పట్టుకున్నాయి

దిగిపోతూ దిగిపోతూ ఊపిన చెయ్యి
రైలుపట్టాల మీద సంగ్రామ గానం పాడుతుంది
దేహంలోంచి ప్రేమ జల పుట్టుకొస్తుంటే
రెండు చేతులు బార్లా చాచి
కాస్తున్న ఎండ రోడ్డును కౌగలించుకుంది
వెలుగు సౌందర్యం చీకటితెరలో దాక్కుంది
తడి నేల మీద విత్తనాలు జల్లినట్టు చినుకులు
పొద్దున్నే
నిగనిగలాడిన ముఖసౌందర్యం
నల్లని మేఘాలు కప్పేసిన ఆకాశంలో
దారి వెతుక్కుంటుంది
పక్షిరెక్క మీద తూనీగై కూచుని
చుక్కల్నీ చంద్రవంకల్నీ చూసొస్తే బాగుండు
మేఘాల్ని వడిపెడితే చినుకుల్ని ఏరుకోవచ్చు

చిటారుకొమ్మలకు కాసిన
నల్లరేగడి పళ్ళను ఎవరు కొట్టాలి
మూడు బొక్కల్లో ముత్యాలు రత్నాలు
దొరికినపుడు
అవి సముద్రాలు
గనులు
బంగారు పర్వతాలు ఎన్ని దొరుకుతాయి
దుమ్మంటకుండా ధూళి అంటకుండా
తిరిగే కాళ్ళకు
అన్నం మెతుకులు మట్టి బురదలోంచి
పుట్టల్లా గుట్టల్లా పుట్టుకొస్తాయని తెలియదు
తడి ఉన్నంతసేపు
పదాల పాదులు మొలుస్తూనే ఉంటాయి
గరికపోచలు పెదాల మీద నాట్యమాడుతూనే ఉంటాయి
ఆహ్లాద తీగెలకు అందాల పూలు పూస్తే
పందిరంతా నందనవనమౌతుంది
ఉన్న పదిపదాలు కవిత్వమైపోతే
రాసినవానికే అంతుచిక్కని సమస్యయిపోతుంది
భూమ్మీద
అక్కడక్కడ పచ్చని చేలున్నట్టు
కనిపిస్తుండాలి కవిత్వం
ఎండలో రోడ్డు మీద ప్రయాణించి ప్రయాణించి
పచ్చని నీడలో హాయిగా ఊపిరి తీసుకున్నట్టుంటుంది

నాలుగుపోయీ ఐదూ వచ్చే... (బుర్రకథ)

రేఁద

1. వినుము రెండువేల నాలుగు గాథా విధాత వ్రాసెనుగా! తందాన తానా॥
అనుము రెండువేల ఐదుకు స్వాగతమానందము కాగా। తందాన తానా॥

2. ఇరాకు యుద్ధము గెలుపురా... సై
ఇరుకున సద్దాము చిక్కెరా... సై
మిషను ఎకాంప్లిషుడంటరా... సై
బుష్‌కు హుషారెక్కువాయెరా... సై

వివాదాలు పెక్కు లేచెనోయ్... తీవ్రవాదులెక్కువైనారోయ్
రెండువేల నాలుగంటేనోయ్... కలగూరగంపా తంతేనోయ్
రెండువేల ఐదు వచ్చేనోయ్... మెండుగ కలలూ పండేనోయ్

భళానోయి భాయి తమ్ముడా, మేలు భళానోయి దాదానా!
తధికిట తద్ధిమితా!

3. అమెరికా దేశము అతి నెమ్మదిగా, తందానా, తాన తందనా!
ఆర్థిక బలమూ అలవరించగా, తందానా, తాన తందనా!
బుల్‌మార్కెట్టూ భల్లూకాలను, తందాన, తాన తందనా!
వాలుస్ట్రీటులో పారద్రోలగా, తందానా, తాన తందనా!
ఎన్నికలలో మరి మదుల నిండగా, తందానా, తాన తందనా!
ఎన్నికలందరి బుర్రలు తినగా, తందానా, తాన తందనా!
ఆశల గాలులు వీచెనోయ్... దేశమె రెండుగ చీలేనోయ్

రెండువేల నాలుగంటేనోయ్... కలగూరగంపా తంతేనోయ్
రెండువేల ఐదు వచ్చేనోయ్... మెండుగ కలలూ పండేనోయ్

భళానోయి భాయి తమ్ముడా, మేలుభళానోయి దాదానా!
తధికిట తద్ధిమితా।

4. ఇక్కడ ఇలా వుండగా అక్కడ కర్మభూమి సంగతేంటయ్యా అంటే...
ప్రజాస్వామ్యములోన చూడరా... భళిభళీ!
ప్రతీ యెన్నికలోన చూడరా... భళిభళీ!
ప్రభుత మార్చుటె మంచి మందురా... భళిభళీ!
పాతకుపోతేనె చిక్కురా... భళిభళీ!

ఓటరు దేవుడు పలికేనోయ్... ఓటమి గెలుపులు తేల్చేనోయ్
రెండువేల నాలుగంటేనోయ్... కలగూరగంపా తంతేనోయ్
రెండువేల ఐదు వచ్చేనోయ్... మెండుగ కలలూ పండేనోయ్

భళానోయి భాయి తమ్ముడా, మేలుభళానోయి దాదానా!
తధికిట తద్ధిమితా।

5. మరి యిక్కడో?
బుష్షు దృష్టిలో అమెరికా మెండూ, తందానా, తాన తందనా!
కెర్రీ జగానికి అమెరికా ఫ్రెండూ, తందానా, తాన తందనా!
బుష్షుకి యుద్ధం తారకమంత్రం, తందానా, తాన తందనా!
కెర్రీకి యుద్ధం ఆఖరి తంత్రం, తందానా, తాన తందనా!
మాటలతో కొట్టుకున్నారోయ్... మంత్రమె చివరికి గెలిచిందోయ్
రెండువేల నాలుగంటేనోయ్... కలగూరగంపా తంతేనోయ్
రెండువేల ఐదు వచ్చేనోయ్... మెండుగ కలలూ పండేనోయ్

భళానోయి భాయి తమ్ముడా, మేలుభళానోయి దాదానా!
తధికిట తద్ధిమితా।

6. ఇంకా... మహానుభావులు ఎందరో, చాలామందికి ప్రియతమైన
వారింకెందరో, మనల్ని వదిలి వెళ్ళారన్నా

సుప్రభాత మధురరాగకోకిలా, తందానా, తాన తందనా!
సుమతర హృదయపు సుబ్బులక్ష్మిరా, తందానా, తాన తందనా!
భారత ఆర్థిక నిర్మాతైనా, తందానా, తాన తందనా!
పాములపర్తి నారసింహుడూ, తందానా, తాన తందనా!
పరమాత్మ సన్నిధి చేరేరోయ్... పరమశాంతిపథమందేరోయ్

రెండువేల నాలుగంటేనోయ్... కలగూరగంపా తంతేనోయ్
రెండువేల ఐదు వచ్చేనోయ్... మెండుగ కలలూ పండేనోయ్

భళానోయి భాయి తమ్ముడా, మేలుభళానోయి దాదానా!
తధికిట తద్ధిమితా।

7. అక్కడితో ఆగలేదు విధిలీలలు...
సముద్రమ్ములో భూమిగర్భమున సంచలనము లయ్యో!
తందా....నా, తందానా దేవనందనాన!
కనివిని యెరుగని జలప్రళయమూ క్రమ్మివేసెనయ్యో!
తందా...నా, తందానా దేవనందనాన!
లక్షలాదిపై ఆ దేమునికీ కక్ష యెందుకయ్యో!
తందా...నా, తందానా దేవనందనాన!
వసుధంతా ఒక కుటుంబమై చేయూత నీయుడయ్యో...
వసుధంతా ఒక కుటుంబమై చేయూత నిచ్చిరయ్యా...
వసుధంతా ఒక కుటుంబమేనని నిరూపించిరయ్యా!

8. అయితే అన్నా, మరి మనవాళ్ళెందరో, మహానుభావులెందరో
మనల్ని విడిచిపోతున్నా, ఇంత కల్లోలమూ విధ్వంసమూ జరిగిపోతున్నా,
దేని గురించి యెదురుచూస్తూ బ్రతుకుతాం? ఆ విధాత
ఇంకేమి వినోదించబోతున్నాడో ఊహించాలన్నా భయంగా వుంటుందే!

అదికాదు తమ్ముడూ, కొంచెం ఆవేశం తగ్గించుకొని ఆలోచించి చూడు!
గీతలోన నీతి చూడరా... సై
కృష్ణభగవానుడె చెప్పెరా... సై
ఫలితాలతో పనే లేదురా... సై
పనియె దైవమ్మని పలికెరా... సై
గతము గూర్చి వెతలు మానరా... సై
స్థితప్రజ్ఞత నేర్చుకొమ్మురా... సై
కర్తవ్యమే కదా మిన్నరా... సై
భవితవ్యమే సదా యెన్నరా... సై
ధర్మమార్గము నమ్ము, కర్మయోగివి కమ్ము,
బ్రహ్మరాతను తిరిగి వ్రాయరా... సై

భళానోయి భాయి తమ్ముడా, మేలుభళానోయి దాదానా!
తధికిట తద్ధిమితా।

I HAVE KNOWN LOVE

Lakshmi Kaza



I have known love.
I have known love, as sweet as honey
Hidden deep in the flower.
My longing was like somersaults
Of a buzzing bee.

I picked ponnai pulu, weaved a fragrant garland.
I climbed pogada chettu, swung on its branches.
I saw Krishna flow incessant, tearing my tender heart.

"There is a place so beautiful, where He
Meets mother ocean: hamsaladivi." I heard
My mother say a thousand times.
Then she left alone, to meet the sea.

Orphaned now, I long to know
The taste and smell of love.
My thoughts are somersaults
Like a buzzing bee.

"There!" I see the river meeting the ocean,
And mother coming alive
Deep with in my heart.
I have known love.



అనగనగా...

సామాజిక సందర్భాన్ని అద్దంలో చూపించే కథల సమాహారం

చిత్రం: తోట వైకుంఠం

NRI Academy of Sciences
NRI Medical College &
NRI General Hospital

Congratulates

Telugu Association of North America



Our goals are similar, to make a difference in the lives of others and our community. We regard diversity, dignity and honesty as principles that guide us to serve.

'Mathru Bhoomi'

We send our best wishes now and in the future.

అనగనగా...

సామాజిక సందర్భాన్ని అద్దంలో చూపించే కథల సమాహారం

1.	పెళ్ళి సమ్మందం	- మంచికంటి వెంకటేశ్వర రెడ్డి	...	176
2.	ఖాండవవనం	- ఎస్. నారాయణస్వామి	...	181
3.	అనివార్యం	- జాతశ్రీ	...	187
4.	మౌనరాగం	- కె.వి. గిరిధరరావు	...	194
5.	ధైర్యం	- వి. రాజరామమోహనరావు	...	197
6.	చదువేనా?	- గంటి నరేష్	...	199
7.	గృహాంతర జీవులు	- డా॥ ఎల్.కె. సుధాకర్	...	205
8.	అవ్వా బువ్వా	- పుచ్చా అన్నపూర్ణ	...	211
9.	మట్టిగుర్రాలు	- వి. ప్రతిమ	...	215
10.	తప్పెక్కడుంది?	- జె.యు.బి.వి. ప్రసాద్	...	222
11.	జిగిరీ	- పెద్దింటి అశోక్‌కుమార్	...	229
12.	స్టిల్ ఫ్రెండ్స్	- ఉపాధ్యాయుల సూర్యకుమారి	...	235
13.	అవరోహణం - ఆరోహణం	- మందపాటి సత్యం	...	239
14.	నెమలినార	- బి. మురళీధర్	...	241
15.	సిగ్నిఫికెంట్ అదర్	- విప్లవ్	...	248
16.	దృశ్యాదృశ్యం	- జి. వెంకటకృష్ణ	...	252
17.	సిగ్గు	- మెట్టుపల్లి జయదేవ్ రెడ్డి	...	256
18.	మార్పు	- అర్నాద్	...	258
19.	జీవనది	- సాయిబ్రహ్మానందం గొర్తి	...	265
20.	రూపాంతరం	- సడ్లపల్లె చిదంబర రెడ్డి	...	269
21.	జ్ఞాపకాల తడిలో...	- కట్టా గోపాలకృష్ణమూర్తి	...	272
22.	అంతరం	- బిజివేముల రమణారెడ్డి	...	275
23.	గోడలు	- మూలా సుబ్రహ్మణ్యం	...	281
24.	... ఆ తరువాత నీ ఇష్టం	- నచకి	...	284
25.	ఎ టిపికల్ టీనేజర్	- జొన్నవిత్తుల శ్రీనాథ్	...	286

పెళ్ళి సమ్మందం

మంచికంటి వెంకటేశ్వరరెడ్డి

మసకచీకటి కటికచీకటిగా మారుతోంది. పక్షులు గూళ్ళకు చేరే సంతోషంలో గోలగోలగా అరుస్తున్నాయి. ఆకాశాన మేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నాయి. పొలాలకెళ్ళిన జంగిలి గొడ్లు దుమ్ము రేపుకుంటూ ఇళ్ళకు మళ్ళాయి.

కూలికి వెళ్ళి హడావుడిగా ఇంటికి తిరిగొచ్చిన లక్షుమ్మ, పొయ్యిలోకి పుల్లలు లేకపోవడంతో ఆ చీకట్లోనే హడావుడిగా అలుగులోకొచ్చి, తొడుగులో నుండి చిల్లమండలు లాక్కొని చిదుగులుగా కుందింది.

తాడు తీసుకుని కుందిన పుల్లల్ని దాని మీద వేసి మోపు కట్టడానికి తాడు రెండువైపులా కలిపి ముడివేసి, కాలు మోపు మీద పెట్టి గట్టిగా అదిమింది. కస్సున అరికాల్లో ముల్లు దిగడంతో గాయంలో నుండి బుస్సున చిమ్మిన రక్తం పుల్లల్ని ఎరుపురంగు లోనికి మార్చేసింది.

అబ్బా అంటూ కాలుని చేత్తో పట్టుకుని, గట్టిగా వొత్తి నోట్లో నుండి వేలితో ఉమ్మి తీసి గాయం మీద రాసి, చేత్తోనే తాడుని గట్టిగా లాగి మోపు కట్టుకొని ఎత్తి నెత్తి మీద పెట్టుకుని కాలు ఎగరేస్తా నడవసాగింది.

తలపై వేసుకున్న గుడ్డలో నుండి కూడా మాడుని గుచ్చుతున్న కత్తుల్లాంటి చిల్లముళ్ళ బాధ భరిస్తూ, దుమ్ము రేపుకుంటూ, ఒకదానిని ఒకటి పడదోసుకుపోతున్న బర్రెగొడ్లని అదిలించుకుంటూ తనకొచ్చిన అగచాట్లకి తిట్టుకుంటూ నడవసాగింది.

"ఏంది లచ్చుమ్మా! ఎవర్నీ తిట్టుకుంటున్నావు," అన్నాడు గొడ్లు వెంట నడుస్తున్న నరసారెడ్డి.

"ఎవుర్ని తిడితే ఎవురూరుకుంటారు నరస మామా? నా ఖర్మనీ గాశారాన్నీ తిట్టుకుంటున్నా. ఇచ్చినోడు మర్చిపోయినా, కట్టుకున్నోడికి కనికర ముంటే గదా! పొద్దునానంగా నారుమళ్ళల్లో కలుపుకి పోయి వొంచిన నడుం ఎత్తకుండా పాటుపడొస్తే



రవ్వంతసేపు నడుము వాల్చడానికి లేకుండా పోయింది,' ' అంది బాధపడుతూ.

"ఊరుకోయే ఎందుకంత బాధపడతావు. మనం పుట్టిందే వొళ్ళిరగ దీసుకోవటానికే గదంటే, పొద్దస్తమానం కష్టపడితేనే కదా నాలుగేళ్ళూ నోట్లోకి పోయేది. ఎవురికి దగ్గ కష్టాలు వాళ్ళకుంటయ్యిగానీ, బాధపడ బాక," అనునయంగా చెప్పాడు.

"అంతేలే మామా! ఏదో రకంగా ఎగదోసకపోవడమే," అని బాధపడుతూనే ఇంటికెళ్ళి, పొయ్యి దగ్గర పుల్లలమోపు ఎత్తేసింది.

ఆ శబ్దానికి కళ్ళు తెరిచిన సుబ్బయ్య, "చిన్నంగా యెయ్యరా దంటే," అన్నాడు లక్షుమ్మను చూస్తూ.

"సాల్లే మూసుకో నోరు. మాడులోకి దిగుతుండయ్యి. నీకేందెల్సు? పడేవోళ్ళగ్గదా తెలిసేది. రెండు నెలల్నుంచీ కొట్టుకోంగా కొట్టుకోంగా ఇదుగో అదుగో అని కొట్టకకొట్టక గజ్జికంప కొట్టుకోని వొస్తివి. యాడన్నా ఏలు బెట్టడానికి సందుందా," కసురుకుంది లక్షుమ్మ.

"పెందలాడే వొచ్చినోడివి బోరలా పడుకోకపోతే ఒక మోపు పుల్లలు కుందగూడదా! చీకట్లో కుందబోతే కాళ్ళనిండా చేతుల్నిండా ముళ్ళే," అంటూ కోపాన్ని వెళ్ళగక్కుతూ పొయ్యిలో నుండి ఎలుబూడిద చేటలోకి తోడసాగింది.

"యాణ్ణే గొర్రెలకాడ తిరిగీ తిరిగీ పిక్కలు పట్టుకుపోతుంటే," అంటూ రెండు చేతులతో రెండు కాళ్ళూ వొత్తుకోసాగాడు.

"సంపాయిచ్చింది కాస్తా చూసి చూసి ఎవుడో ఒకరి మొకాన పెడతావు. ఇంట్లో అటు పుల్ల తీసి ఇటు పెట్టవు. ఎట్టొచ్చిద్ది కంచాలు కంచాలు తింటానికి. కూసెమ్మ కూడబెడితే మాశమ్మ మాయం జేసినట్టుంది మన సంసారం," అని గయ్యిమని అరుస్తూ తొట్లో నీళ్ళు దెచ్చి పొంతలో పొయ్యసాగింది.

"అబ్బబ్బ మొదలుబెట్టావంటే. పొద్దుగూకులూ గొడ్లకాడ తిరిగొచ్చి కాసేపు నడుము వాలుద్దామంటే రోజూ మీ ఇద్దరిదీ గోగునసైపోయింది కదే!" ఆరుబయట మంచమ్మీద పడుకున్న పక్కింటి వీరమ్మ విసుక్కుంది.

"నీకు అట్నే ఉంటదిలే ఈరప్పా! పడేవోళ్ళగ్గదా పాట్లు తెలిసేది. ఈళ్ళు జేసే శాష్టాలు ఎవురికి కనబడతయ్యి. ఒక మొగమడిసన్నోడు చెప్పకముందే అన్ని పనులూ లంకిచ్చుకోని చెయ్యాల్సింది పోయి, ఎట్టా పొర్లుతుండాడో చూడు," అంటూ సుబ్బయ్యవైపు చూయించి వీరమ్మకు ఫిర్యాదు చేసింది.

"ఏరా అది చెప్పినా కానీ చెయ్యకపోతే ఎట్ట! మొగమణిసుండేది ఏమి అడకుతింటానికా," వీరమ్మ సంజాయిషీ అడిగింది సుబ్బయ్యను.

"అదిగాదప్పా ఆ నాయుడుగారి గొర్లు అటుదోలీ ఇటుదోలీ తిరగనే సరిపాయె. బుడ్డోడు కూడా నాగాలు పెట్టాడు. అతాలు అనిగిపోతుండయ్యంటే నమ్ము," అంటూ వీరమ్మకు సమాధానం చెప్పాడు.

"ఎహే మనిషికి పని మీద ధ్యాసుంటే గదంట. ఎప్పుడూ ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకోవడమే గదంట," అంటూ బియ్యం కడిగి దబర పొయ్యి మీద పెట్టి పాత పంచె చించుకోని, నిప్పుకోసం జాలమ్మగారింటికి వెళ్ళింది.

"ఎందుకు లచ్చుమమ్మా అసురసందేళ కళ్ళనీళ్ళు బెట్టుకుంటావు కానీ గుడ్డ కాలిపోతుంది ముందు నిప్పు ఎత్తుకొని పో! జరిగేది చూడ్డానికి ఈ కళ్ళకి రెప్పలు అడ్డమొస్తయ్యా! ఎవురికెట్ట రాసుంటే అట్ట జరుగుద్ది,"

నాగమ్మగారి ఇంటి దగ్గర ఆరుబయట మంచమ్మీద కూర్చుని ఉన్న సుబ్బారాయుడు లక్షుమ్మని చూడగానే, "ఏమే లచ్చుమ్మా కూతురికి పెళ్ళి మనుము వొచ్చిందంటగా, అల్లుడు ఆపీసరంటగదనే," తనకు చూచాయగా తెలిసిన విషయాన్ని అడిగాడు.

అతని మాటల్లోని వెటకారాన్ని గ్రహించి, "ఊళ్ళో పెళ్ళికి కుక్కల హడావుడని, ఇప్పుడు నా కూతురు మనుమే కావాల్సొచ్చింది ఊళ్ళో వాళ్ళందరికీ," వెటకారంగా సమాధానం చెప్పింది లక్షుమ్మ.

"ఓసి నియ్యబ్బడాల ఇప్పుడు నేనేమన్నానే! అంత లావున ఎగిరి పడుతుండావు," అన్నాడు సుబ్బారాయుడు బోటుకర్రతో నేలమీద కొడతా.

"ఎవురెట్ట మాట్టాడేదీ నాకు తెలవదా! నీకు నోరు మాట్టాడుతుంటే నొసలు ఎక్కిరిస్తయ్యన్న సంగతి తెలియదనుకోబాకు మామా," అంటూ పొయ్యిలో మండుతున్న కట్టెని తీసి, గుడ్డ పరిచి, దానిలో కట్టె నిప్పు విరగ్గొట్టుకొని గుడ్డలో చుట్టుకుంది.

"చూడమ్మాయ్ దీని ఆంకారమూ," అన్నాడు గొడ్లని కట్టేస్తున్న జాలమ్మతో.

"ఇదుగో నీ జోలికి రాలేదు, నీ ప్రస్తావనకి రాలేదు. లచ్చుమ్మ కూతురుకి మనుమొచ్చిందనే తలికి ఎంతమంది ఎన్ని రకాలుగా సెవులు కొరుక్కుంటుందీ నాకు తెలుసు. కూచ్చుంటే లేవలేనిదానికి, మూడు మూసి ఆరు అతికేదానికి ఆపీసరు అల్లుడు కావాల్సొచ్చేడా అని ఒక నాసవితంటే, ఆ బవుంతి జూసి నలకూబరుడొస్తాడని ఒక నాకొడుకంటే, ఆ.... ఇయ్యన్నీ ఎవురికి తెలియవనీ, ఎందుకింత లావున నా ఉసురు బోసుకుంటుండారు,' ' అంటూ బొటబొటా వొచ్చిన నీళ్ళని తుడుసుకుంది.

"ఎందుకు లచ్చుమమ్మా అసురసందేళ కళ్ళనీళ్ళు బెట్టుకుంటావు కానీ గుడ్డ కాలిపోతుంది ముందు నిప్పు ఎత్తుకొని పో! జరిగేది చూడ్డానికి ఈ కళ్ళకి రెప్పలు అడ్డమొస్తయ్యా! ఎవురికెట్ట రాసుంటే అట్ట జరుగుద్ది," అంటూ జాలమ్మ లక్షుమ్మను అనునయించింది.

"దీనికి మాట బగు దుడుకులేయే, అదుగో తోకంటే ఇదుగో పులంటది. ఏమ్మాయ్ అనటం ఆలిస్సెం అదుగదుగో గోడ సాటుకి రమ్మన్నాడు అన్నట్టుగా ఎగిరి మీద పడుద్ది," సుబ్బారాయుడు రెచ్చగొట్టే ధోరణిలో అన్నాడు.

పోయేపోయేదల్లా ఈ మాటలు చెవిన పడేసరికి, రెండడుగులు వెనక్కి వొచ్చి, "మడారిపోయిందాన్ని, తడారిపోయిందాన్ని ఇంకా నేనేం గోడసాటు కొస్తాగానీ, బాగ వొయిసులో ఉండోళ్ళని పిలుసుకో, పదహారేళ్ళ బాలాకుమారుడివి కదా! ఆ నరిసిన తలంతా బాల నరుపేనంటగదా!" అంటూ మళ్ళీ వొడ్డించింది.

"ఎహే నువ్వూరుకోవే పోయేదాన్నల్లా కదిలిస్తావు," జాలమ్మ సుబ్బారాయుడిని విదిలించింది.

"లేకుంటే చూడవే... మా పసేసకం నూకుతుండావు. సైనా బగమంతుడే ఉండాడు చూడ్డానికి,'' అనుకుంటూ ముక్కుసీది చేత్తో దూరంగా విసిరి ఇంటికి వెళ్ళింది. సుబ్బయ్య బజారుకి పోతూ కనిపించాడు. ఆయన్ని విసుక్కుంటూ పొయ్యి రాజేసి ఒక్కో పుల్లా విరిచి పొయ్యిలో పెడుతుంటే పొయ్యి రాజుకోని గణగణ మండసాగింది. చిన్న చిన్న పుల్లలు పెడుతూ మంట పెద్దది కావడంతో, రెండు కట్టెలు తగిలించి చీపురు తీసుకుంది కసువు చిమ్మడానికి.

కసువు చిమ్మి పెంటపోగు పేడతట్టలోనికి ఎత్తి, నయ్యి దిబ్బలో పోసొచ్చి, దీపం బుడ్డి కిరసనాయిలు సీసా బైటికి తెచ్చి, దీపం సైన గ్లాసుని ముగ్గుపిండితో రుద్ది, గబ్బు సమురు (కిరసనాయిలు) పోసి, గుడ్డతో తుడిపి, ఇంట్లో పెట్టొచ్చి అంట్ల ముందు కూర్చుంది.

"కంపినీకి పోయినోళ్ళు రాడం ఆలస్యమైందెందుకో ఇయ్యాల,'' నిద్రలేసి, తల ముడేసుకుంటూ అడిగింది వీరమ్మ.

"ఇయ్యాలెవురో వొస్తారనుకుంటన్నారప్పా, అందుకే గామాల సుజాత ఇంకా రాలేదు. అరుగో మాటల్లోనే వొస్తన్నారు,'' అంటూ కంపినీ నుండి వొస్తున్న వాళ్ళను చూస్తూ అంది లక్షుమ్మ.

"అబ్బా ఈళ్ళు వొచ్చారంటే చాలు గుమ్మున పొగాకు వాసన గొట్టుద్ది. పొద్దుగూకులూ సైనా కిందా పొగాకులోనే గదా దొర్లేది. నిలువెల్లా పొగాకు వాసనే,'' అంటూ ఇంట్లోకి వొస్తున్న సుజాతను చూస్తూ "ఏందే సుజాతా ఎవురు ఇయ్యాలొచ్చేరంట?'' వీరమ్మ అడిగింది.

"ఎవుడో ఆపీసరంట గన్నాయిగోడు. మనల్నేందో ఉద్దరిచ్చినట్టు మాట్టాడి పోయేడు. అంతా అయిపోయినాక వాళ్ళ ఆపీసురూములోనే మెక్కేది. వాడిచ్చిన గడ్డి మూటకట్టుకోని పోయేది. ఎవుడెన్ని జెప్పినా రెండు పుస్తకాలు రాయాల్సిందే. వాడు నూకేది నూకాల్సిందే,'' అంటూ సబ్బు తీసుకొని వొచ్చి చెంబుతో నీళ్ళు తీసుకోని చేతులు కడుక్కోసాగింది.

లక్షుమ్మ వీరమ్మవైపు చూసి, సుజాతవైపు చూయించి తలూపింది. అర్థమైనట్టు తలూపింది వీరమ్మ.

"ఏమే సుజాతా! ఏం జేసేవే మనుం సంగతి?'' తల ఎగరేస్తా, కింద పెదవిని పళ్ళతో కొరుకుతూ అడిగింది.

సుజాత వీరమ్మవైపు ఒక చూపు చూసి గమ్మున ఉండిపోయింది.

"అవతల మడిసి పిలుత్తుంటే మూగిమొద్దు లాగా మాట్టాడ వేందే,'' లక్షుమ్మ ముసిముసి నవ్వులు నవ్వుకుంటా అడిగింది.

"అబ్బా మంచినీళ్ళన్నా తాగనియ్యరా ఏంది! అవతల ఆమె కూసోని అడిగియ్యడం ఇవతల నువ్వడగడం బాగనే ఉందిలే సంబడం,'' విసురుకుంది సుజాత.

"ఓసి కదిలిస్తేనే కరిసేటట్టుండావు గదే నియ్యబ్బడాల పిల్లా,'' అని చీర సర్దుకుంటూ పైకి లేసింది వీరమ్మ.

"ఏందా పోసుకోలుమాటలు పెద్దంతరం చిన్నంతరం లేకుండా'' గదిమింది లక్షుమ్మ.

"ఏడేళ్ళగ్గదా తెలిసేది. వొడ్డున నుంచోని ఎన్ని రాళ్ళయినా నూకొచ్చు, అసలే మసుకులేసుంది ముందు నీళ్ళు తెచ్చుకోనియ్యండి'' అంటూ బిందె తీసుకుని విసురుగా అలుగులో బాయికి వెళ్ళింది సుజాత.

"ఇదమ్మా దీని తతంగం. ఆ ఇసురు జూడు. అబ్బ జూడబోతే అట్ట కూతురు జూడబోతే ఇట్ట. మజ్జెలో ఆ తిక్కల నా కొడుకు. ఎట్టీదాల ఈ సంసారాన్ని,'' అనుకుంటూ తోమిన అంట్లు ఇంట్లో పెట్టొచ్చి పొయ్యి ముందు కూర్చుంది లక్షుమ్మ.

తొట్టినిండా నీళ్ళు తెచ్చిపోసి, పొంతలో కాగిన నీళ్ళు తోడుకుని, తలంటి పోసుకోని వొచ్చి మంచమ్మీద కూర్చోని తల తుడుచుకోసాగింది సుజాత.

పొయ్యి మంటేస్తూ కూర్చున్న లక్షుమ్మ, "అదికాదమ్మాయ్,'' అంది సుజాత వైపు చూస్తూ.

"ఊ... ఏందో సేపి కానియ్,'' అంది సుజాత వెటకారంగా.

"సెతుర్లు నూక్కుండా చెప్పింది కాస్తె చెవిబెట్టి ఆలకించు,'' లక్షుమ్మ గదిమింది.

"ఏందో చెప్పవమ్మా సాగదియ్యకుండా,'' సుజాత కూడా కొద్దిగా పెద్దగానే అరిసింది.

వాళ్ళు మళ్ళీ మడిసిని పంపిచ్చేరు. ఏ సంగజ్జెబితే వాళ్ళింకో సమ్మందం చూసుకుంటామన్నారంట...'' అంటూ ఆగింది.

"అయితే ఏందంట చూసుకోమని చెప్పకపోయావా,'' నిర్లక్ష్యంగా చెప్పింది.

"వితణ్ణం నూకబాకు. మాలావు నీళ్ళ సెల్లాటంగా ఉందే పిల్లకి. మంచి ఉజ్జోగం, పెద్ద లంకంత ఇల్లూ, హాయిగా కాలు కింద పెట్టకుండా చూసుకుంటాడని గదంటే ఇంతగా చెబుతుంది.

"మనమిచ్చే కట్నకానికలకి యే మన్మథుడు యెతుక్కోని వొస్తాడమ్మా. యెతుక్కుంటా వొచ్చిన అదృష్టాన్ని చేతులారా కాజేసుకోవొద్దనేగా నీకు చెబుతుంది.

"ఏమి ఈరప్పా ఈ పిల్లకి చిలక్కి చెప్పినట్టు చెబుతుండా మనసు మార్చుకుంటదంటే, తెగ నీలుగుతుంది చూడు,'' అంది వీరమ్మతో.



"అబ్బా ఎన్ని జెప్పినా చెవిటోడి ముందు శంకం ఊదినట్టుగానే ఉందే!" అంటూ జాకెట్ విప్పదీసి దండెం మీద వేసి బక్కిటతో నీళ్ళు తోడుకొని దొడ్లోకి స్నానానికి వెళ్ళింది.

"నువ్వు చెప్పినయ్యి అన్నీ బాగానే ఉండయ్యమ్మా! ఒకవైపు చూస్తానే ఉండాం కదా! మాలక్షుమ్మ చేసుకుంది రొండో సమ్మందం మడిసినేగా! ఆ యమ్మాయి పక్కన నడుస్తుంటే ఆయనెవురు వాళ్ళ నాయనా! వాళ్ళ ఆయనా! అని ఊరు ఊరంతా నవ్వుతా ఉంటే, యెగతాలి చేస్తా ఉంటే చూస్తానే ఉంటిమే.

"ఆ యమ్మాయి అత్తగారింటో అనబగిచ్చే బోగబాగ్యాలు అందరికీ తెలిసినియ్యే గదా! పాపం బాగలేకపోయినా, నాలుగురోజులు గమ్మున కూచ్చోటానిక్కూడా లేదంట మొన్నొచ్చినప్పుడు చెప్పుకోని యాడవడమే సరిపోయింది. ఒక్కరోజు ఇంట్లో లేకపోతే వొచ్చేవాళ్ళకి పోయేవాళ్ళకి సైక్రాలు చూడ్డానికి, వొండి వార్చడానికి తెగ బాధపడతారంట. అందుకే ఒక్కరోజు కూడా యాడికీ పంపరంట.

"ఈయనకి మాత్రం తక్కువేం కాదంటలే. అన్నీ యిశారించేను. వొచ్చీ పోయీ నా అంత కొడుకులూ కూతుళ్ళూ ఉండారంట. వాళ్ళు నన్ను అమ్మా అమ్మా అనీ, పిన్నీ పిన్నీ అనీ పిలుస్తుంటే ఎట్టుంటది నాకు. రేపో మాపో వాళ్ళకీ పెళ్ళిళ్ళు పేరంటాలూ పురుళ్ళూ అన్నీ చెయ్యటానికి తప్ప నన్నెందుకు చేసుకుంటానంటన్నారో నాకు తెలియదా! కాకపోతే వాళ్ళ హోదాకి తగ్గట్టుగా ఎర్రంగా, బుర్రంగా కంటికి నదురుగా ఆనాల. అందుగ్గాకపోతే ఇంకెందుకంట పెళ్లి పెళ్లి," అంటూ వెక్కిరించి లేసి ఇంట్లోకి పోబోయింది.

"అదికాదమ్మాయ్ కూచ్చో చెబుతా," అంటూ చెయ్యి బట్టుకోని లాగి మంచమ్మీద కూర్చోబెట్టింది.

బలవంతంగా ముళ్ళ మీద కూర్చున్నట్టు కూర్చుని ఆకాశంలోకి చూడసాగింది. "అదికాదే నేనబగిచ్చిన నరకం కంటే ఇప్పుడు నువ్వు చెప్పే బాదరబందీ దిగదుడుపుక్కూడా పనికిరాదు.

"కొంప జూడవే ముందు. పందుల దొడ్డిలాగుంది. ఈ కొంప జూసి ఎవుడన్నా మన ఇంటివైపు కన్నెత్తి చూస్తారంటే! మూడు సవత్సరాల నుండీ తిరగ్గప్పిద్దామంటే నా వల్లగావడం లేదా! వానొస్తే ఇంట్లో చెంబులూ, సెరవలూ, కుండలూ, దబర్లూ అన్నీ వురిసే దగ్గర పెడితేనే గదా! లేకపోతే కురిసే వానంతా ఇంట్లోనే గదా ఉండేది," లక్షుమ్మ తన గోడు వినిపించింది.



"చూడమ్మా! ఎంత చెట్టుకు అంత గాలి. మెయ్యబోయి మెడకి తగిలిచ్చుకోవటమెందుకు? మొయ్యలేని బరువు నెత్తికెత్తుకొని నక్కిళ్ళు కదెబడి ఎందుకు చావాల! గంతకి తగ్గ బొంత మనకి తగ్గోడు మన కొస్తాడు.

"రెక్కలు ముక్కలు జేసుకుని కలో గంజో తాగినంత సంతోషం ఆ మిద్దెలూ, మేడల్లో రాదుగదా! మంచమున్నంత వరకే సర్దుకుపోతే పోలా!' ' అంటూ తన వాదన వినిపించింది సుజాత.

"ఇదుగో దేనికదే అడ్డం జెబుతావేందమ్మాయ్! నీకు సమాధానం చెప్పలేకపోతున్నాను," అంటూ అసహనం చచ్చిపోతున్న మనిషిలా లక్షుమ్మ లో నీరసం ఆవహించింది.

"పెద్ద పనిమనిషిగా ఆ ఇంటికి బోవడం నాకిష్టంలేదు. ఏ చిన్న తప్పు జరిగినా వాళ్ళకి మన దరిద్రమే గుర్తుకు వస్తది. వాళ్ళ దెప్పి పొడుపులూ, సతాయింపులూ పడటం నావల్ల కాదు. చిక్కి చికిలిచ్చే కంటే ఎల్లి ఎక్కిరియ్యమన్నారు," అంటూ తన ఇష్టాయిష్టాలనీ, తనకున్న అభిప్రాయాలనూ కుండబద్దలు కొట్టినట్టుగా ఖరాఖండిగా చెప్పేసింది.

"పిల్లని జూసి చేసుకుంటామన్నారుగానీ, లేకుంటే ఆ ఇంటి గడప తొక్కడానికైనా తల్లకిందులుగా తపస్సు జెయ్యాల నువ్వు. నువ్వింత సాగబీకుతుండావుగానీ, ఈ సమ్మందం కోసం ఎంతమంది దోటీ లేస్తండారను కున్నావు! అప్పుడే ఆ నరసయ్యగారి సుబ్బాయి మా పిల్లనిస్తాం చేసుకుంటారేమోనని కబురు కూడా పంపిందంట. వాళ్ళు మంచీ మర్యాదా తెలిసినోళ్ళు కాబట్టి మనమే సంగతీ తేల్చి చెప్పిందాకా ఏమీ మాట్టాడొద్దన్నారంట..."

"అమ్మా నువ్వెన్ని రకాలుగా జెప్పినా నాకు మనసుకు రాకపోతే నేనేం జేసేది చెప్పు," అంటూ లేసి ఇంట్లోకి వెళ్ళిపోయింది సుజాత.

"అదికాదే నేను జెప్పేది కూడా కాస్తె దూర్సుకోయే తల్లీ, ఎందుకు చెబుతున్నానో అర్థం జేసుకో. మీ అయ్య కాడికొచ్చి నేనెంత సుఖపడతన్నానో చూస్తన్నావు గదా!" అంటూ బొటబొటా కన్నీళ్ళు పెట్టుకుంది.

"పదిహేనో ఏడు నిండకముందే పసుపుతాడు మెళ్ళో పడింది. అప్పుణ్ణుంచీ ఎప్పుడేం జరిగినా నాకు తెలియకుండానే జరిగిపోయింది. నెలలు నిండకముందే నెత్తుట్లో పొర్లాడుతా వాడు పుట్టేడా! అందుకు వాడు అంత తెలివికల్లోడు అయ్యేడు. నువ్వు కడుపులో పడ్డప్పట్నుండి యాడేడ వైదగా లన్నీ జేయిస్తే గదా నువ్వు సక్కంగ బుట్టింది.

"అప్పుట్నుండి కదంటమ్మా నాకు నరకం మొదులయ్యింది. ఈ గుడ్డలిడిసే జబ్బుతో ఎంత యాతన పడుతున్నానో ఆ బగమంతుడికే తెలియాల. తెలుపయ్యేదానికి ఎన్ని గుడ్డలూ ఆగకపోతుండే! ఇంటింటికీ తిరిగి పాత పాశార కోకలూ, పాత పంచెలూ అడుక్కోవడమే సరిపోయెనే నా బతుకంతా.

"ఇది కనబడ్డ కాణ్ణుంచీ ఎన్ని దేవుళ్ళకి ముడుపులు ఎత్తి పెట్టుంటాను. అటు నందానపు బళ్ళారమ్మ కాడికి పోయేనే, రావూరి బళ్ళారమ్మ చుట్టూ తిరిగేనే, షోడారం పొమ్మంటే ఆడికీ పోయానే! యాడికి బోతే ఏముంది. ఆస్పత్రికి పోతే గర్భసంచీ తీసెయ్యాలన్నీరు. ఇయ్యన్నీ చేయిచ్చుకుంటా కూర్చుంటే నా అబ్బెనకోళ్ళు అమ్మెనకోళ్ళు ఎవురుండారు

చేసి పెట్టడానికి. అందుకే పంట బిగువున బాదలన్నీ దిగ మింగతా వుండాను.

"ఇట్టాంటి దరిద్రం పగోడిగ్గూడా వొద్దు తల్లీ. ఇయ్యెందుకు చెబుతున్నానంటే దరిద్రాన్ని మించిన జబ్బు లేదమ్మా,'' అంటూ దారిద్ర్యం యొక్క తీవ్రతను వివరించింది.

"అయితే ఇప్పుడేమి చెయ్యమంటావే తల్లీ! ఇంకా నీతో వాదించే ఓపిక లేదుగానీ, నీకొక దణ్ణం పెడతా వొదిలెయ్యమ్మా,'' అంటూ రెండు చేతులెత్తి దణ్ణం బెట్టింది సుజాత.

"మళ్ళీ మొదటికి రాబాకు. పెళ్ళి చేసుకోమని నిన్ను ఇంతిదిగా బలవంతపెడతంది నేనేదో జవురుకుని తిందామని కాదు. ఇంతకంటే దరిద్రాతి దరిద్రం యాడా ఉండదనీ, ఎట్టాంటి మాటలు బడ్డా ఈ నరకం అనబగించాలనీ ఏ తల్లీ కోరుకోదే!

"నా మాటినమ్మాయ్. ఎందుకు నన్నిట్ట అల్లాడిచ్చి ఆకులు మేపుతావు. ఈ జెల్మం ఎవుడికీ ఉండగూడదనే గదంటే నేను సెవినిల్లు గట్టుకోని పోరకాడతా వుంది,'' అంటూ ముక్కు చీదుకుంటూ పమిట చెంగుతోటి తుడుచుకుంటూ కళ్ళ వెంబడి కట్టిన చారికల్ని తుడుచు కుంటూ వెక్కివెక్కి ఏడవసాగింది.

అప్పుడే మేఘాలు గర్జనతోటి భూమండలం దద్దరిల్లిపోతోంది. చల్లటి వానగాలి వీచింది. ఒక వర్షపు చుక్క లక్షుమ్మ ముఖం మీద పడింది.

బజారుకెళ్ళిన సుబ్బయ్య ఇంకా ఇంటికి రాలేదు.

"అమ్మా నువ్వేడువు, పెదబొబ్బలు పెట్టు. కిందబడి దొర్లాడు. నా మనసుకి రాలా! ఎట్టా ఆలోశన జేసినా ఇష్టం పుట్టటంలా! ఇష్టం లేకుండా జేసుకోని జీవితాంతం కుమిలి కుమిలి చావడం నావల్లగాదు. ఎవుడో దారినపోయే దానయ్య ఇష్టమైనోడైతే కష్టాలో కన్నీళ్ళో గుక్కెడు తాగి గుడిసెలో ముడుక్కుంటే మనల్ని అడిగేవోడే లేడు,'' అని లేచి ఇంట్లోకెళ్ళి చెక్కమీద ఉన్న పళ్ళెం దీసుకొని, నీళ్ళు పోసి కడిగి తొలిప్పోసి, అన్నం పెట్టుకుని నట్టింట్లో కూర్చుంది.

"మనిషికింత రెటమతం పనికిరాదు,'' అంటూ లక్షుమ్మ కూడా ఇంట్లోకి వొచ్చింది.

"ఇదుగో చూడు. నీ మంచిగోరే చెబుతున్నా ఇనిపిచ్చుకో. ఈ అవకాశం బోతే ఇంక రమ్మన్నా రాదు. నీకు పెళ్ళి జెయ్యడం నావల్ల గాదు. కట్నాలూ కానికలూ ఇచ్చి నిన్ను సాగనంపలేను.'' ఆమె ఏడుపు రోదనగా మారింది.

బయట చినుకులూ మెండయ్యాయి.

"అమ్మా! ఇప్పుడు నాకు పెళ్ళి చెయ్యమని నేనేమీ అడగలేదు. నాకు తగినోడు ఎవుడో చేసుకుంటే సరే, లేకుంటే కూలీనాలీ జేసుకోని ఇక్కడే పడుంటా. ఇంక ఏడిసింది చాలు కానీ పొద్దుబోతంది కూడు తిందాం రా,'' అంటూ పిలిచింది.

"నువ్వీడ పడుంటే చూసేవోళ్ళంతా నా మొకాన ఉయ్యడానికనా నువ్వు చెప్పేది,'' రెట్టించింది లక్షుమ్మ.

"పెద్ద పనిమనిషిగా ఆ ఇంటికి బోవడం నాకిష్టం లేదు. ఏ చిన్న తప్పు జరిగినా వాళ్ళకి మన దరిద్రమే గుర్తుకు వస్తది. వాళ్ళ దెప్పిపొడుపులూ, సతాయింపులూ పడటం నావల్ల కాదు. చిక్కి చికిలిచ్చే కంటే ఎల్లి ఎక్కిరియ్యమన్నారు,"

"ఇంక చాల్లే కూడు తిందువు రా,'' మళ్ళీ పిలిచింది.

"ఇప్పుడు కుంబం పగలు కొట్టుకోవడమే నాకు కావాల్సింది. అందరం బాగుపడతామే. ఇట్టాంటి సమ్మందం మళ్లి ఇంక రమ్మన్నా రాదమ్మా అంటుంటే ఇనవేంది,'' అంటూ లక్షుమ్మ సుజాత దగ్గరగా వొచ్చి కూర్చుంది.

"మీరు సంతోసంగా ఉండడానికి నేను గుణ్ణంలో దూకలేనుగానీ నువ్వు కూడు దిను అరవకుండా,'' అంది సుజాత.

"కూడూ లేదూ కుమ్మూ లేదు. నేం జెప్పింది ఇనుకుంటావా! నన్నే నువ్యో గొయ్యో చూసుకోమంటావా! ఎంత జెప్పినా నీ బాణీ నీదేగానీ ఇవతలోళ్ళు చెప్పేది తలకెక్కదా ఏంది!

"ఇదో ఇదే ఆఖర్న చెబుతున్నా. చేసుకుంటావా! లేదా?'' పెద్దగా గదిమింది లక్షుమ్మ.

"నావల్ల కాదనేగదా నేను చెబుతుంది,'' అదే స్థాయిలో అరిచింది సుజాత.

ఆకాశంలో ఉరుములతో పాటు మెరుపులూ మొదలయ్యాయి. చినుకులు పెద్దవి కాసాగేయి.

"అమ్మాయ్ నేను చూస్తా చూస్తా అగ్గిలోనూ తొయ్యలేను, చూస్తా ఊరుకోనూ లేను. నేను జచ్చిన తెల్లారి నువ్వన్నా బాగుపడతా వేమో!'' అంటూ చివుక్కున మూలనున్న కిరసనాయిలు డబ్బా తీసుకో బోయింది.

అది చూసిన సుజాత అన్నం తినే చేతిని పళ్ళెంలో విదిలించుకొని, ఒక్క ఊపులో లక్షుమ్మ కంటే వొడుపుగా వెళ్ళి కిరసనాయిల్ డబ్బా అందు కోని, "నీకు చచ్చేంత పనెందుకమ్మా. ఇప్పుడు నేను గదా గుండెల మీద కుంపటిగా మండుతుంది. నేనే చస్తాలే,'' అంటూ కిరసనాయిలు డబ్బా పైకెత్తింది.

"అమ్మమ్మ...'' అంటూ ఆదరబాబదరాగా సుజాత చేతిలో ఉన్న కిరోసిన్ డబ్బా దూరంగా విసిరేసింది.

సుజాతను పట్టుకొని లక్షుమ్మ కూలబడింది. సుజాత కూడా ఆమె పక్కనే చతికిలబడింది. ఇద్దరూ ఒకర్నొకరు వాటేసుకుని భోరుమని యేడవసాగేరు. చినుకు చినుకు కలిసి జడివానగా మారింది.

"అదిగాదమ్మా... నువ్వన్నా సుఖపడతావని గదా!'' లక్షుమ్మ ఏడుస్తూనే పొడిపొడిగా అంది.

"నాకా సుఖం అక్కర్లేదమ్మా. సావనైనా సస్తానుగానీ,'' ఏడుపులో నుండి వెక్కిళ్ళ మధ్యన సుజాత చెప్పింది.

లక్షుమ్మ కళ్ళల్లో తుఫానులాంటి జల్లు.

ఇంట్లో టప్‌టప్‌మని వానచుక్కలు పై కప్పు నుండి పడసాగాయి. ఆ రాత్రి వానలో కీచురాళ్ళ రొద ఊరుని చుట్టుముట్టింది. చిమ్మ చీకట్లో తళుక్కున మెరుపు మెరిసి, అంతలోనే చీకటి ఆవరించింది. ఫెళఫెళా మంటూ ఉరుమురిమింది. దూరంగా ఎక్కడో పిడుగు పడింది. వర్షం జోరుగా కురుస్తూనే ఉంది.

*

ఖాండవ వనం

ఎస్. నారాయణస్వామి

మట్టి కొట్టుకున్న జిప్సీ ఒకటి హైదరాబాదు నుంచి శ్రీశైలం వెళ్ళే రోడ్డు మీద మన్ననూరు అటవీశాఖ చెక్‌పోస్టు దగ్గర ఆగింది. డ్రైవర్ చెక్‌పోస్టు ఆఫీసులోకెళ్ళాడు రిజిస్టర్లో సంతకం చెయ్యటానికి. పక్క సీట్లో చేరబడి కూర్చునున్న జగన్నెడ్డి కుతూహలంగా చుట్టు పక్కల కలయ చూస్తున్నాడు. వెనకసీట్లో యెంకట్రెడ్డి గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్టు చివరి దమ్ము పీల్చి కిటికీలోంచి బయటికి విసిరేశాడు. అతని పక్కన శతృఘ్ను తమ వెనకాల సామానుతో వర్కర్లతో వస్తున్న ట్రక్కు ఎంత దూరంలో ఉందా అని చూస్తున్నాడు.

డ్రైవర్ తిరిగొచ్చి బండి స్టార్ట్ చేశాడు. అతని వెనకాలే బయటికి వచ్చిన ఫారెస్టు గార్డు రోడ్డుకడ్డంగా కట్టివున్న గేటుని విడిపించాడు. గేటు పైకి లేచింది. జిప్సీ మెల్లగా గేటుని దాటుతుండగా గార్డు మడమలు గట్టిగా తాటించి జగన్నెడ్డికి సెల్యూట్ చేశాడు. ఈ సెల్యూటెందుకో అని అనుమానిస్తూనే జగన్ అసంకల్పితంగా బదులు సెల్యూట్‌చేశాడు. జిప్సీ స్పీడందుకుంది.

"ఐపోయింది, మన పనైపోయింది. యెంకటన్నా, నేనిక్కడ్నే మన్ననూర్లో దిగిపోతానే. ఈ జగన్‌గానెంబడి నేనైతే అడివిలో కొస్తలే. మీరెళ్ళండి కావాల్నంటే చెంచుగూడేనికే యెల్తారో యెమలోకానికే యెల్తారో," అనన్నాడు శతృఘ్ను ఒక అసహజమైన కీచు గొంతుతో.

యెంకట్రెడ్డి తీరిగ్గా ఇంకో గోల్డ్‌ఫ్లేక్ వెలిగించి పొగ వొదుల్తూ జగన్ కేసి తేరిపార చూస్తున్నాడు. శతృఘ్ను కామెంటుకీ, గార్డు తనకి సెల్యూట్ చెయ్యడానికి ఏదో సంబంధముందని ఊహించిన జగన్ వెనక్కి తిరిగాడు. యెంకట్రెడ్డి చూపు అతన్ని తీక్షణంగా నిలదీసింది.



ఖాళీ సిగరెట్‌పెట్టెలోకి నుసి రాలుస్తూ యెంకట్రెడ్డి అన్నాడు, "ఏం దిరా జగనా, ఆ క్రాపింగేందిరా? మనమె ల్లేటిది చెంచుగూడేనికిగదా, అంత అర్జెంటుగ క్రాపింగు చేపిచ్చుకోవల్నని యెట్టనిపిచ్చిందిరా నీకు?"

పొట్టిగా కత్తిరించి ఉన్న తన జుట్టుని తడుము కున్నాడు జగన్. గర్వంతో కూడిన చిరునవ్వు మొహంలో తొంగి చూస్తుంటే అన్నాడు, "నా క్రాపింగుకేమాయె? కొత్త సిన్మాల సల్మాన్‌లెక్కనుంది గదా. నాకు తెల్వదుగాని, మీ అడివిలో కెల్లాల్నంటె క్రాపింగు చేపిచ్చుకో గూడదా?"

"ఏందో ఇంజనీరింగు చదువుతున్నవ్‌గాని ఎరక్క బోయి నిన్ను రమ్మన్న ఈ ప్రాజెక్టులో జర హెల్పు గుంటవని. నువ్విట్ల బోయి క్రాపింగు చేపిస్తవనుకోలె."

"ఏందిది, మీరిద్దరు నా క్రాపింగు మీద లొల్లి చెయ్యబట్టిన్రు? ఈ శతృఘ్ను గాని లెక్క బట్టబుర్రుంటెగాని చెంచోల్లు మెచ్చరేంది? సర్లెగాని ఒక సిగరెట్టియ్యి."

జగన్ సిగరెట్ కాల్చుకుంటూ కిటికీలోంచి చూస్తూ కూర్చున్నాడు. అప్పటికే మన్ననూరు దాటి జీప్సీ కొండెక్కటం మొదలుపెట్టింది. ఘాట్ రోడ్డు మీద ఒక్కొక్క మలుపు తిరిగినప్పుడు ఆవిష్కృతమవుతున్న అడవి అందాలు అతన్ని మరి మాట్లాడకుండా చేసినై. కిటికీకి కళ్ళప్పగించేశాడు.

కొంత దూరం మెలికలు తిరుగుతున్న ఘాట్‌రోడ్డు కొండెక్కినాక బల్లపరుపుగా తిన్నగా ఉంది, అప్పుడప్పుడూ ఏదో ఒక మలుపు తప్ప. రోడ్డుకి రెండు పక్కలా దట్టమైన అడవి. రోడ్డుకడ్డంగా హడావుడిగా పరుగు తీసే చిన్న జంతువులు, జీప్సీ చప్పుడుకి పొదల్లోంచి గగ్గోలుగా ఎగిరిపోయే అడివి కోళ్ళు అక్కడక్కడా తారసపడుతున్నై.

ఒక వింత గమనించాడు జగన్. పహరా నిలబడ్డ జవాన్లలాగా రోడ్డు వెంబడి బారులు తీరి ఉన్న కరెంటు స్తంభాలు కొండ కింద ఉన్నట్టుగా కొండపైన లేవు. అసలు కొండెక్కాక రోడ్డు పక్క ఒక్క కరంటు స్తంభం కూడా చూసిన గుర్తు రాలేదతనికి.

"బాబయ్యా, కొండ కింద దాక కరెంటు లైను రోడ్డు సైడెంబడె వస్తుండె గదా, కొండపైన అవుపిస్తలేదేంది?" యెంకట్రెడ్డి శతృఘ్నుతో జరుపుతున్న చర్చ ఆపి బదులిచ్చాడు.

"మరి రిజర్వు ఫారెస్టంటె ఏందనుకున్నవ్ ఇది టైగర్ సాంక్చువరీ. అందుకని ఈ అడివిలో కరంటు గిరంటు జాన్తానై."

"ఈ అడివిలో పులులున్నయ్యా?" జగన్ కళ్ళింత చేసుకుని ఉత్సాహంగా అడిగాడు.

'ఉన్నయ్యిలె, ముప్పయ్యి నలబయ్యి."

"మనం చెంచు గూడేనికెల్లె దారెంబడి చూడొచ్చా?"

"ఔ, మన జగన్ దొరగారు సల్మాన్‌లెక్కన క్రాపింగు పెట్టుకొచ్చిండని పులులన్ని పూలదండల్తోని నిల్సుంటై. సెల్యూట్లు గూడ చేస్తయి," అన్నాడు శతృఘ్ను వెటకారంగా.

అక్కడ చెట్ల మధ్య లేళ్ళ గుంపు. రకరకాల సైజుల్లో. అరడజను దాకా ఉంటై. గోధుమ వన్నె చర్మం మీద మెరుస్తున్న తెల్ల మచ్చల్తో. అన్నిటికీ నాయకుడిగా ఉన్న మగలేడి, నెత్తిన బారెడు కొమ్ముల్తో తీవీగా నిలుచున్నది.

"చస్ నువ్వూకుండు. బాబయ్యా, అడివిల కరంటే రానియ్యరా? ఏం జేస్తరు కరంటు లేకుంటె?"

"రోడ్డెంబడి అక్కడక్కడ జనరేటర్లున్నై. అసలుకి మన ప్రాజెక్టు గందుకే గద!"

అక్కడితో సంభాషణ ముగిసినట్టు యెంకట్రెడ్డి బేగ్‌లోంచి ఏవో పేపర్లు తీసి చదువుకుంటున్నాడు.

మన్ననూరు దాటి సుమారు ముప్పై కిలోమీటర్లు పోయాక రోడ్డు ఉన్నట్టుండి ఎడమకి మళ్ళింది. ఆ మలుపులో రోడ్డు పక్కనే ఒక పెద్దపులి... బొమ్మ లైఫ్‌సైజులో. పక్కనే అటవీశాఖ బోర్డు. ఆ పక్కన అడవిలోకి పోయే మట్టిదారిని అడ్డగిస్తూ ఒక గేటు. యెంకట్రెడ్డి ఆజ్ఞ మీద సణు క్కుంటూ బండి దిగి జగన్ గేటు తెరిచాడు. జీప్సీ గేటు దాటాక, గేటు మూసి మళ్ళీ బండెక్కి కూర్చున్నాడు.

జీప్సీ మట్టిదారిలో వెళ్తుంటే అడవి బాగా దగ్గరికొచ్చినట్టుగా ఉంది. ఇలా దగ్గర్నించి చూస్తే మరీ అంత దట్టంగా లేదు. పెద్దపెద్ద చెట్లకి మధ్యన ఖాళీ బాగానే కనిపిస్తోంది. అక్కడక్కడా పొదలూ, తీగలూ దట్టంగా ఉన్నయ్యి. చాలాచోట్ల గడ్డి బాగా పెరిగి ఉంది, మనిషి నడుమెత్తు వరకూ. పచ్చగా కాక ఎండిపోయి ఉంది.

"ఒక్క నిప్పుల్ల అటు ఇసిరేస్తే అడివి మొత్తం మండిపోతదేమో!" జగన్ మనసులో అనుకోబోయిన మాట పైకే అనేశాడు.

"నీయమ్మ, పన్లేని హజామత్‌గాడంట... రెండేండ్లు వాన సరింగ పడక ఎండుకట్టె లెక్క ఎండున్నది. ఫారెస్టోల్లగ్గాని తెల్సిందంటె... ముందు నిన్ను, ఆ యెనక నిన్ను తీసుకచ్చిన పాపానికి మమ్మల్ని, అందర్ని పట్కబోయి బొక్కలేస్తరు," అన్నాడు శతృఘ్ను.

శతృఘ్ను తనని వెక్కిరించటానికి అన్నా, జగన్‌కి అతని మాటల్లో అడవి పట్ల ప్రేమా, ఆదుర్దా ధ్వనించాయి.

ఒక కిలోమీటరు పోయాక మట్టిరోడ్డు కూడ మాయమై దారిలో ఉత్తబండలు మిగిలినై. డ్రైవరు చాలా నేర్పుగా మొదటి గేర్లోనే ఆ బండల మీద నుంచి జీప్సీ నడిపిస్తున్నాడు. లోపలున్న వాళ్ళందరూ బంతుల్లా ఎగిరెగిరి పడుతున్నారు.

"ఇదేం రోడ్డురో నాయనో! ఎంత దూరమెల్లాలి ఈ బండ్ల మీద?" అడిగాడు జగన్.

శతృఘ్ను జగన్ అజ్ఞానానికి జాలి పడుతున్నట్టు నవ్వాడు.

"అప్పాపూరు చేరేదాక ఇదే మన హైవే, జగన్ దొరగారూ! ఇట్లనే పదైదు కిలోమీటర్లు పోవాలె. అడివికెల్లుడంటె ఏంది, పిక్కినిక్కను కున్నవా?" అన్నాడు హేళనగా.

హఠాత్తుగా యెంకట్రెడ్డి, "అరే జగనా, అటు రైటుకి చూడు" అన్నాడు.

అక్కడ చెట్ల మధ్య లేళ్ళ గుంపు. రకరకాల సైజుల్లో. అరడజను దాకా ఉంటై. గోధుమ వన్నె చర్మం మీద మెరుస్తున్న తెల్ల మచ్చల్తో. అన్నిటికీ నాయకుడిగా ఉన్న మగలేడి, నెత్తిన బారెడు కొమ్ముల్తో తీవీగా నిలుచున్నది. కాసేపు జీప్సీని ఆపి లేళ్ళని చూసి మళ్ళీ కదిలారు. దారిలో మరికొన్ని



జంతువుల్నీ, పక్షుల్నీ చూపించాడు యెంకట్రెడ్డి. రకరకాల చెట్లని కూడా పరిచయం చేశాడు.

అన్నటికంటే ఇప్పచెట్లు బాగా నచ్చాయి జగన్‌కి. ఆకాశంలోకి దూసుకుపోతున్నట్టు పొడుగ్గా. ఏ చెట్టుకీ ఒక్క ఆకన్నా లేదు అన్నీ పూలతో విరగబూసి ఉన్నాయి. కింద నించి చూస్తుంటే నీలాకాశపు తెర మీద గుత్తుల గుత్తుల ముదురు ఎరుపు పూలు జరీ కుట్టినట్టు ఉంది. మగ్గి నేలరాలిన పూలవాసన తియ్యగా మత్తెక్కిస్తోంది. జగన్ కాసిని పూలేరు కుందామను కున్నాడు గానీ, జీపు దిగద్దని వారించాడు యెంకట్రెడ్డి.

అక్కడక్కడా చెట్ల మధ్య డొంకదార్లు కనిపించినై. అవెక్కడి కెళ్తా యని జగన్ అడిగితే అవి చెంచులు ఉపయోగించే అడ్డతోవలని చెప్పాడు యెంకట్రెడ్డి.

"కలప స్మగ్లర్లు కూడ వాడుతుంటరు," అని కలగజేసుకున్నాడు శతఘ్ను.

"స్మగ్లర్లా? అంటే మీసాల ఈరప్పన్ లెక్కనా?"

"ఈడ బాడకోవులకంత సీనేం లేదులే... ఈ ఏరియాల ఒక సైడుకి నక్సలైట్ స్క్వాడ్లు జేరుతున్నరు. అటు సైడుకి పోలీసు కూంబింగులు. ఈ రెండుసైడ్ల మద్దెన... రెణ్ణెల్లయ్యిందా, నాయుడి మీద ఎటాకయ్యి? ఇంక రిజర్వు పోలీసు బెటాలియన్ బెటాలియన్లుగ దిగుతా ఉంది అడివిల. థూ దీనెమ్మ, స్మగ్లర్లేంది, ఫారెస్టోల్లె మెయిన్రోడ్డు దిగి అడివి లోపటి కెల్లల్నంటె జడుస్తున్ను," అన్నాడు శతఘ్ను.

ఈసారి అతని గొంతులో ఎవరి మీదో తెలియని కసి వినిపించింది జగన్‌కి.

✤

జీప్సీ ఒక రెండంతస్థుల బిల్డింగు ముందు ఆగింది. అడివిలో, ఇంత లోపల ఈ కాంక్రీటు బిల్డింగెలా కట్టారబ్బా అని ఆశ్చర్యపోయాడు జగన్. అది గిరిజనాభివృద్ధి శాఖ వారు కట్టించిన స్కూలు మరియు హాస్టలు బిల్డింగని యెంకట్రెడ్డి చెప్పాడు. అది చూడ్డానికి స్కూల్లాగానే ఉంది కానీ ఎక్కడా అలికిడి లేదు, మనిషి జాడే లేదు.

ఆ బిల్డింగు చుట్టూ సుమారు పదెకరాల ఖాళీ స్థలం. అక్కడక్కడా ఎండిపోయిన తుప్పలు తప్ప ఆ స్థలంలో మరో పచ్చటి మొక్కగానీ, చెట్టుగానీ లేదు. ఖాళీ స్థలానికి అవతల రెండు పరస్పరం లంబంగా ఉన్న వరుసల్లో చిన్నచిన్న సిమెంటు ఇళ్ళు. జగన్ మొత్తం పద్దెనిమిది లెక్కపెట్టాడు. ఒక్కొక్క ఇంట్లో రెండేసి గదులు. అంటే రెండేసి కుటుం బాలు అని చెప్పాడు యెంకట్రెడ్డి. ఆ సిమెంటు ఇళ్ళూ, ఈ కాంక్రీటు బిల్డింగూ పెద్దపులుల అభయారణ్యంలో ఆక్రమణదారుల్లాగా అసహజంగా ఉన్నాయి.

యెంకట్రెడ్డి, శతఘ్ను వర్కర్లతో ట్రక్కులో నించి ప్రాజెక్టు సామాను దింపిస్తున్నారు. చేసే పనిలేక ఎవరన్నా కనిపిస్తారేమోనని జగన్ ఒక వరస ఇళ్ళవేపుకి నడిచాడు. అతనికి చెంచుల్ని చూడాలని కుతూహలంగా ఉంది.

ఇళ్ళు ఇంకా యాభై గజాల దూరంలో ఉండగా రెండు ఇళ్ళ మధ్య ఖాళీజాగా గుండా ఇద్దరు యువకులు బయటికి వచ్చారు. వాళ్ళిద్దరూ నిక్కర్లూ, మాసిపోయిన బనీన్లు వేసుకుని నల్లగా, పొట్టిగా, బలంగా ఉన్నారు. జగన్‌కి వాళ్ళు తన వయసు వాళ్లే అయుంటారనిపించింది. చెయ్యూపి పిలుద్దామని అతను అనుకునే లోపల వాళ్ళు అతన్ని చూడనే చూశారు. క్షణంలో సగంసేపు బొమ్మల్లా స్తంభించిపోయి, మరుక్షణం మెరుపు కొట్టినట్టు వెనక్కి తిరిగి పరిగెత్తి ఆ ఇళ్ళ వెనక మాయమయ్యారు. జగన్ ఆశ్చర్యపోయి వెనక్కి తిరిగి చూశాడు. తన వెనక ఏమీలేదు వాళ్ళని భయ పెట్టేందుకు. ఒకవేళ వాళ్ళు తనని చూసి భయపడ్డారా? ఆ ఆలోచనకి అతనికే నవ్వొచ్చింది. జగన్ ఆ ఇళ్ళ వరుసని చేరేప్పటికి అక్కడ కూడా మనిషి జాడ లేదు. ఇళ్ళకి అవతల ఇంకో ఇరవై గజాల దూరంలో అడవి మొదలవుతోంది. ఇందాకటి యువకులిద్దరూ ఏమ య్యారో కనబళ్ళేదు.

జగన్ దగ్గర్లో ఉన్న ఇళ్ళని తనిఖీ చేశాడు. ఇళ్ళ ముందూ చుట్టూతా మెత్తటి బూడిద రంగు మట్టి. జగన్ అడుగుల వడికి అలలుగా దుమ్ము రేగుతోంది. జగన్ వేసుకున్న తెల్లటి టెన్నిస్ బూట్లు అప్పటికే బూడిద రంగుకి తిరిగాయి. కొన్ని ఇళ్ళకి అసలు తలుపులే లేవు. ఉన్నవి కూడా తీసే ఉన్నయ్యి మనుషులు లేకపోయినా. లోపలికి తొంగి చూస్తే కింద నేల గచ్చు చేసి లేదు - మట్టే, బండలూ. లోపలి గోడలు సిమెంటు పూతైనా లేక ఇటుకలు కనిపిస్తూ బోసిగా ఉన్నయ్యి. ఒక మూల రెండు రాళ్ళ పొయ్యి, కొన్ని సత్తుగిన్నెలు, దాని పక్కనే గోడలు నల్లగా పొగచూరి ఉన్నయ్యి. కొంచెం తేడాగా అతను చూసిన నాలుగిళ్ళూ అలాగే ఉన్నై.

బోరు కొట్టి జగన్ జీప్సీ దగ్గరికి తిరిగొచ్చేశాడు. యెంకట్రెడ్డి సామాను బాధ్యత శతఘ్నుకి అప్పగించి, జగన్ చెయ్యి పట్టుకుని రెండో వరస ఇళ్ళవేపుకి దారి తీశాడు.

వాళ్ళు ఆవరుస మలుపు తిరిగేటప్పటికి ఒక ఇంటి ముందు జనం గుంపుగా కనబడ్డారు. పిల్లలూ పెద్దలూ కలిసి ఇరవైమంది దాకా ఉంటారు. స్త్రీలూ, పిల్లలూ, వయసు మళ్ళిన మగవాళ్ళూ తప్ప జగన్‌కి వయసు కుర్రాళ్ళు ఎవరూ కనబడలేదు. వీళ్ళేనా చెంచులు అన్నట్టు ఆశ్చర్యంగా చూశాడు జగన్ వాళ్ళని. ఆడవాళ్ళు చవకరకం చీరలు కట్టుకుని, మగవాళ్ళు నిక్కరో, లేక మోకాళ్ళ కిందకి దిగని చిన్న పంచె కట్టుకుని - ఎక్కడా సినిమాల్లో చూపించే ఆదివాసుల్లాగా పూసల పేర్లూ, జుట్టులో ఈకలూ, మొహాలకి రంగులూ ఏవీ లేవు. మామూలుగానే ఉన్నారు.

గుంపుని సమీపించినప్పుడు - అప్పుడు కనిపించింది తేడా. వాళ్ళు నిజంగా మామూలు మనుషుల్లా లేరు. ఎండకి ఎండి కమిలిపోయినట్టున్న

నల్లటి ఒళ్ళు, భుజాల దగ్గిరా, మోచేతుల దగ్గిరా ఎముకలు పొడుచుకొస్తూ - అందరికీ కాళ్ళ నిండా, పిల్లలకైతే ఒంటి నిండా అదే బూడిద రంగు దుమ్ము - పుర్రె మీద చర్మాన్ని బిగదీసి తొడిగినట్టు ఏమాత్రం మాంసపుష్టి లేని మొహాలు - ఆ మొహాల్లో దైన్యం. తన ఊళ్ళోనే కరువునీ, పేదరికాన్నీ చూశాడు జగన్, అవి తనని ఎప్పుడూ అంటకపోయినా. కానీ ఇలాంటి దైన్యాన్ని ఎప్పుడూ చూళ్ళేదు. అందరూ ఇంచుమించు ఒకేలా ఉన్నారు. బాగా చిన్నపిల్లలు మాత్రం పత్తికాయల్లా మెరుస్తున్న కళ్ళతో ఈ కొత్త మనుషుల్ని ఆసక్తిగా చూస్తున్నారు.

ఆ గుంపులో నుంచి సుమారు పాతికేళ్ళ యువతి ఒకామె గబగబా ముందుకొచ్చి యెంకట్రెడ్డిని ఆప్యాయంగా పలకరించింది.

"ఏందే యెంకటన్నా, ఇంత పొద్దెక్కినంక కూడ మీరు రాకుంటె ఇక ఈ దినం వస్తలేరేమో అనుకున్నం!"

"వస్తమని చెప్పినంక రాకుంటెట్ల ఈదమ్మా, ఏంది అంత బాగేనా?"

ఆమె యెంకట్రెడ్డి చెయ్యి పట్టుకుని గుంపు దగ్గరికి తీసుకెళ్ళింది. ఇంకొందరు పెద్దవాళ్ళు యెంకట్రెడ్డిని పలకరించారు.

కొందరు జగన్ని యెగాదిగా చూస్తున్నారు. ఉన్నట్టుండి ఒక నడి వయసతను జగన్‌కేసి తల ఊపుతూ యెంకట్రెడ్డి నడిగాడు.

"ఈ సారెవ్వరు?"

"మా పోరడే. మా యన్న కొడుకు."

"అట్టనా? సార్ని జూసి పోలీసాయనేమో అనుకున్న. సారు కండలయి జూస్తె మరట్లనె అవుపిస్తున్నడు."

చెంచతను ఏదో జోక్ చేసినట్టు యెంకట్రెడ్డి విరగబడి నవ్వాడు.

"సర్లెగాని, పెదమల్లయ్య ఔపిస్తలేడేంది? మంచిగున్నడా?" అనడిగాడు యెంకట్రెడ్డి.

"ఆ, మంచిగనె ఉన్నడు. పూజ చేస్తున్నడు. ఇంకొక గంటైతదేమొ. నువ్వచ్చినవని పిల్సకచ్చేదాన్న?" అంది ఈదమ్మ.

"వొద్దొద్దు. పూజ కానియ్యిలె. మేం పని మొదలుపెట్టాల. చీకటయ్యె లోపట్నె పని పూర్తయిపోవాల కదా!" అని జగన్ వేపు తిరిగి అన్నాడు.

"జగనా, ట్రక్కు కాణ్ణించి ఇండ్ల సెటప్పులన్ని ఒక్కొక్క ఇంటికి ఒక్కొక్క సెట్టు చేర్పించాల. తక్కిన సామాను ఈ మర్రిచెట్టు కిందికి తెస్తే ఏదో కొంచెం నీడలో పని జేసుకోవచ్చు. నువ్వెల్లి శతఘ్నుతో కల్సి అరేంజిమెంట్ చూడు. హబ్బ, చైత్రం రాకపోయినా అప్పుడె యెండ మండుతాంది," అంటూ కర్చీఫ్ తీసి మొహం తుడుచుకున్నాడు.

✤

జగన్, శతఘ్ను ఇళ్ళకి సెట్ల పంపిణీ పూర్తిచేసి వచ్చేటప్పటికి మర్రి చెట్టు దగ్గిర పని జోరుగా సాగుతోంది. టెక్నీషియన్లు అరుగు పక్కన నీడలో పెద్ద సెట్లని అసెంబుల్ చెయ్యటంలో నిమగ్నమై ఉన్నారు. యెంకట్రెడ్డి, జీప్సీ డ్రైవరు అరుగు మీద కూర్చుని పెద్ద వైర్ల చుట్టల్లో నించి వైర్లని సరైన పొడుగు కొలిచి కత్తిరించే పని చేస్తున్నారు. విచిత్రంగా కనపడుతున్న నడివయసు మనిషి ఒకతను యెంకట్రెడ్డి పక్కన చెట్టు మొదలుకి చేరబడి కూర్చుని మాట్లాడుతున్నాడు.

"అతనే పెదమల్లయ్య. ఈ గూడేనికి పెద్ద," అని జగన్ చెవిలో ఊదాడు శతఘ్ను.

ఆ మనిషి ఆకారమూ బట్టలూ మిగిలిన చెంచుల్లాగే ఉన్నాయి కానీ మొహం విలక్షణంగా ఉంది. వయసు అరవై పైనే. నెరిసిన జుట్టూ, గడ్డమూ బాగా పొడుగ్గా పెంచాడు. జుట్టుని నడినెత్తిన సిగ చుట్టాడు. నుదుటి మీద వెడల్పుగా విబూదిరేఖల మధ్యలో పెద్ద కుంకుమ బొట్టు.

ఆ మనిషి ఆకారమూ బట్టలూ మిగిలిన చెంచుల్లాగే ఉన్నాయి కానీ మొహం విలక్షణంగా ఉంది. వయసు అరవై పైనే. నెరిసిన జుట్టూ, గడ్డమూ బాగా పొడుగ్గా పెంచాడు. జుట్టుని నడినెత్తిన సిగ చుట్టాడు. నుదుటి మీద వెడల్పుగా విబూదిరేఖల మధ్యలో పెద్ద కుంకుమ బొట్టు. మనిషి కూచున్న తీరులో ఒక రాజసం. ఆకుపచ్చ ఆకులో చుట్టి ఉన్న చుట్టని పంట నొక్కిపెట్టి గుప్పుగుప్పున పొగ వదుల్తున్నాడు.

యెంకట్రెడ్డి జగన్ని అతనికి పరిచయం చేశాడు. శతఘ్ను, జగన్ కూడా వైర్లు కత్తిరించే పనిలో చేరారు. పెదమల్లయ్య తన సంభాషణని కొనసాగించాడు, నోట్లో చుట్ట తియ్యకుండానే.

"అప్పుడైతే రాజయ్యసారు ఆపీసరుండె దినాల్లో, ఆయనొచ్చి మమ్మల్ని చూస్తాండె, ఇంక చిన్న ఆపీసర్లు గూడ వచ్చి చూస్తాండిరి, మంచి చెడ్డ అడుగుతాండిరి. ఆయనెల్లిపాయె, ఇంక మా మొగం చూసె టోడు లేడు. ఈ కోపరేటోల్లు (కో ఆపరేటివ్ వాళ్ళు) ఎప్పుడొస్తరో ఎందు కెల్తరో తెల్వదు. ఏరుకొచ్చిన గోందు (గమ్), కాయ గడ్డలన్ని... ఎంత కాలమని దాచాలె, ఇస్కూల్ల ఆల్లకొక గది..."

యెంకట్రెడ్డి అతని మాట కడ్డమొచ్చి అడిగాడు.

"సరెగాని మల్లయ్యా, ఇస్కూల్ల టీచర్లెవ్వరు ఔపడతలేరు, వస్తలేరా ఏంది? అసలు ఇద్దరు టీచర్లు ఎప్పుడూ ఇక్కణ్ణె ఉండాలె గద!"

"అయ్యొ సారూ, దినాలట్లున్నయ్యి గద. బతుకుడె కష్టంగుంటె ఇగ ఇస్కూలెవనికి బట్టె? అడివిల ఏమైతాంది నీకు తెల్వద? అడివి అల్లాడి పోతాంది గద. మూలమూల తెల్సిన మాకే అడివిలో కెల్లల్నంటే బయమైతాంది. ఆడదిగాని, మొగోడుగాని అడివిలో కెల్లినంటె మల్ల కల్లబడితేనె బతికున్నట్టు. ఏం జెప్పాలె - ఈ లొల్లి సందు జూసుకుని టీచర్లు రాకున్నరు. ఉన్నోల్లు గూడ ఎల్లిపోయిన్రు. ఆస్టలు పిలగాన్లని అట్లనె వొదిలి రాత్రికి రాత్రి ఎవ్వరికి తెల్వకుండ మాయమైన్రు. మా పాట్లలే నింపలేక మేం సస్తాంటె ఇంక ఆస్టలు పిలగాన్లని గూడ యెట్ల మేపాలె?..."

పెదమల్లయ్య మాట్లాడుతూనే ఉన్నాడు. పని జరిగిపోతూ ఉంది.

టైము పన్నెండు దాటింది. జగన్‌కి కడుపు కరకరలాడుతోంది. వైర్లు కట్ చేసి చేసి వేళ్ళు నొప్పెడుతున్నాయి. గంట గంటకీ చాయ్ చప్పరించే నాలిక ఉత్త మంచినీళ్ళతో తృప్తి పడలేకపోతోంది. యెంకట్రెడ్డి పుణ్యమాని గోల్డ్‌ఫ్లేకులు పుష్కలంగా ఉన్నై కానీ చాయ్ తోడు లేకుండా రెండు సిగరెట్లు కాల్చేటప్పటికీ జగన్ గొంతు మండింది.

ఒంటి గంటకి లంచ్ తినడానికి పని ఆపించాడు యెంకట్రెడ్డి.

రోడ్డు పైడున ఏదో పాకహోటల్ల పొట్లాలు కట్టించి తెచ్చుకున్న పూరీలు అప్పటికే తోలుముక్కల్లా తయారైనై. వాటినే గబగబా మింగారు అందరూ. తీరిగ్గా నమిలి తినే తీరిక ఇవ్వలేదు యెంకట్రెడ్డి. జల్దీ కానియ్యాల అంటూ తొందరపెడుతూనే ఉన్నాడు. పది నిమిషాల్లో మళ్ళీ పనిలో పడ్డారు.

యెంకట్రెడ్డి వాచీ చూసుకుంటూ, "జగనా, వైర్ల కటింగు చాలుగాని నువ్వూ, శతృఘ్నూ ఇండ్లల్ల సెటప్పులు చూడండి. టెక్నీషియన్లకి ఈ పెద్ద ఐటములోనే సరిపోతాంది. ఇట్లయితే చీకటయ్యే లోపట పని కాదు. జల్ది జల్ది కానియ్యాల," అన్నాడు.

ఒక టెక్నీషియన్ జగన్‌కీ, శతృఘ్నుకీ ఒక సెటప్ చేసి చూపించాడు. ఓసింతే గద, చిటికెలో చేసెయ్యొచ్చు. బాబయ్య ఊకె పరేషానైతుండు అనుకున్నాడు జగన్. టెక్నీషియన్ తన తోటి పనివాళ్ళ దగ్గరికి వెళ్ళి పోయాడు.

జగన్, శతృఘ్ను రెండో ఇంట్లో పని మొదలుపెట్టారు. శతృఘ్ను ఒక వైరు తీసి దాని చివర పోగుల్ని బ్యాటరీ టెర్మినల్సుకి కలిపాడు. జగన్ ఆ వైరుకి రెండో చివర అందుకోబోతుంటే వైరు రెండు పోగులు ఒకదానికొకటి రాసుకుని, చిన్న మెరుపు మెరిసి జగన్‌కి షాక్కొట్టింది. ఒక్కసారి గాలిలో కెగిరి, అరుస్తూ వైర్ని దూరంగా విసిరేసాడు.

జగన్ అవస్థ చూసి శతృఘ్ను ఆ మట్టినేల మీదే కూలబడి విరగబడి నవ్వుతున్నాడు. జగన్‌కి రోషమూ, కోపమూ బుస్సున పొంగాయి.

"తెలీనోడివి తెలీనట్టుండాల్నా, పెద్ద తెలిసినోడి మల్లె ఎందుకు చెయ్యి పెట్టాలె?" అని అరుస్తూ శతృఘ్ను మీద కలియబడటానికి వెళ్ళాడు.

"ఓయబ్బ, పెద్ద ఇంజనీరు బయల్దేరిండు. నా హెల్పు వొద్దనుకుంటె నువ్వే జేసుకో," అంటూ జగన్ పట్టు విడిపించుకుని శతృఘ్ను విసురుగా బయటికి వెళ్ళిపోయాడు.

శతృఘ్నుని తిట్టుకుంటూ జగన్ ఎదురుగా ఉన్న వస్తువులన్నిటినీ పరిశీలనగా చూశాడు. టెక్నీషియన్ మొదట ఏం చేశాడో గుర్తు చేసుకోవటానికి ప్రయత్నం చేశాడు.

✤

నాలుగు సెటప్పులు పూర్తి చేసేప్పటికి జగన్‌కి నడుము అలసటతో మూలుగుతోంది. అలవాటు లేని పని కావటంతో వైర్ల అంచులు వేళ్ళల్లో గుచ్చుకుని వేళ్ళు సలుపుతున్నయ్యి. జగన్‌కి ఒక్కసారిగా నీరసమొచ్చింది. యెంకట్రెడ్డి మీద కోపమొచ్చింది. ఏదో హెల్పు చెయ్యాలనంటె తను చెయ్యగలడు కాని, ఇట్ల పని మొత్తం తన నెత్తిన రుద్దితే... ఇక నా వల్ల గాదు. ఎల్లి ఒక సిగరెట్ కాల్చుకుని జిప్సీల పోయి పడుకుంటనిక అనుకుని బయటి కొచ్చాడు.

మర్రిచెట్టు దగ్గర ఆరేడుగురు యువకులు నించుని యెంకట్రెడ్డితో మాట్లాడుతున్నారు. ఆ గుంపులో పొద్దున తను చూస్తుండగానే మాయమైన ఇద్దరు యువకుల్నీ జగన్ గుర్తుపట్టాడు. కొత్త మనిషి రావటంతో యువకు లందరి దృష్టి అతని మీదికి తిరిగింది. యెంకట్రెడ్డి జగన్ రాక గమనించి అతనికేసి చెయ్యి ఊపుతూ, "మాయన్న కొడుకు. ఇంజనీరింగు చదువుతుండు. ప్రాజెక్టుకి హెల్పు చేస్తడని మాతో పిల్సుకొచ్చిన," అని జగన్‌తో, "ఏరా జగనా, ఎన్ని సెట్లు పూర్తయినై?" అనడిగాడు.

జగన్‌కి యెంకట్రెడ్డి ప్రశ్న వినబడినట్టు లేదు. శతృఘ్ను మీది కంప్ల యింట్లు కూడా మర్చిపోయినట్టున్నాడు. చెంచు యువకుల చూపులు అతన్ని ఇబ్బంది పెడుతున్నై. ఆ చూపులు అతన్ని కాలిబూట్ల నించీ తల క్రాపింగు దాకా కొలిచి చూస్తున్నట్లున్నై. గుండె లోతుల్ని తవ్వి అక్కడ దాగిన రహస్యమేదో కనిపెట్టాలని వెతుకుతున్నట్లున్నై. వాడిగా వేడిగా ఉన్నై. జగన్‌కి తన చుట్టూతా గాలి బిగుసుకున్నట్టు అనిపించింది.

యెంకట్రెడ్డి అదేం పట్టనట్టు, "జగనా, ఇతను చినమల్లయ్య, పెద మల్లయ్యకి చిన్నకొడుకు. ఇదుగో ఈడు మల్లేశ. ఈడు సిరిలింగం..." అంటూ చెంచు యువకులందర్నీ పేరుపేరునా పరిచయం చేశాడు. జగన్‌కి ఏం చెయ్యాలో తెలియలేదు. పలకరింపుగా చిన్న నవ్వు కూడా రాలేదు. వాళ్ళ చూపులు ఇంకా అలాగే దూసిన కత్తుల్లా ఉన్నై.

ఉన్నట్టుండి చినమల్లయ్య ఒకడుగు ముందుకు వేసి షేక్‌హాండ్ కోసమన్నట్టు కుడిచెయ్యి ముందుకు చాచి గంభీరంగా, "గుడ్‌మార్నింగు సారూ," అన్నాడు. జగన్ అప్రయత్నంగా అతనితో చెయ్యి కలిపాడు. ఆ కుర్రాడి చెయ్యి ఉక్కులా ఉంది.

జగన్ యెంకట్రెడ్డి దగ్గిర సిగరెట్ తీసుకుని ముట్టించుకుంటుంటే చెయ్యి వొణికింది.

చినమల్లయ్య యెంకట్రెడ్డి వేపు తిరిగి మాటలు కొనసాగించాడు.

"మీరొచ్చేది తెల్సింది గానైతె, కొత్త జీబు తెచ్చినము. ఆ జీబులున్నది మీరేనని మాకెట్ల తెలియాలె? మా జాగర్తల మేముండాలె గద సారు. పెద్ద బెటాలియన్లుగ దిగిన్రు అడివంత. అడివిల ఎటు తిరిగి చూసిన వాల్లె. మొన్న మొన్ననె అడివిల గోందేరుకుంటాంటె ఈ లింగన్ని ఎత్కపోయిన్లు, ఏడ కెత్కపోయిన్లో తెల్వదు. రాత్రి గూడేనికి తిరిగి రాకుంటె ఇగ వాని పెండ్లాము ఏడుపు. చీకట్ల ఎక్కడని ఎతకాలె. మర్రోజు సాయంత్రం వొల్లంత తట్లు దేలి కొసపానంతొని గూడెం చేరిండు. ఇగొ ఇప్పుడిప్పుడె మల్ల నడుస్తుండు. ఏదో స్కూడు గూడెం దిక్కొచ్చిందని ఆల్లకి ఇన్పరమేసనంట - ఈన్ని తీస్కెల్లి బొక్కలిరగ బొడిసిన్రు. చెంచో డంటె అందరికీ లోకువే గద. ఐన మమ్మల్ని ఇరగ బొడవల్నంటె ఆల్లకి కారణం గూడెందుకు? అడివంత కాల్సక తింట న్నరు, ఐన గాని ఆల్లకి చాలదు," అని ఖాండ్రించి దుమ్ములోకి ఊశాడు.

ఆ చూపులు అతన్ని కాలిబూట్ల నించీ తల క్రాపింగు దాకా కొలిచి చూస్తున్నట్లున్నై. గుండె లోతుల్ని తవ్వి అక్కడ దాగిన రహస్యమేదో కనిపెట్టాలని వెతుకుతున్నట్లున్నై. వాడిగా వేడిగా ఉన్నై.

యెంకట్రెడ్డి సానుభూతిగా తల వూయించాడు. ఆ కుర్రాడు కొనసా గించాడు. "అచ్చిన బండ్లు మియ్యే నని తెల్వగానె తిరిగొస్తమనుకున్నం. ఇంతట్లో ఈ

సాంబయ్య, ఈదయ్య ఉర్కెత్తుకొచ్చి గూడెంల పోలీసు లొచ్చిన్లని చెప్పిన్రు,' ' అని జగన్‌వేపు చూశాడు. పొద్దున తనని చూసి ఉడాయించిన సాంబయ్య, ఈదయ్యలు కూడా తన వేపే చూస్తున్నారు. ఆ చూపులు నిలదీస్తున్నై. జగన్ ఇక భరించలేక అక్కణ్ణించి కదిలి జీప్సీ వేపుకి వెళ్ళాడు.

పది నిమిషాల తరువాత జగన్ తిరిగి వచ్చేప్పటికి యెంకట్రెడ్డి ఆ కుర్రాళ్ళకి ప్రాజెక్టు గురించి చెబుతున్నాడు.

"... ఇంటున్నరా? నెలకొక్కసారైన ఈ బాట్రీలు చెక్ చేసుకోవాల. ఏదన్న బల్బు పాడైతె మండలాపీసులో చెబితే కొత్త దిస్తరు. కొన్ని బల్బులు స్పేరు మీకే ఇచ్చిపోతం. ఈ గాజు పలకల్ని దుమ్ముగిమ్ము పడకుండ సుబ్రంగుంచుకోవాల, ఏంది?"

"ఎందుకు చెయ్య సారు? మాకోసం గద మీరింత కష్టంజేసి ఇయన్ని తెచ్చిన్రు. మంచిగ చూస్కుంటం. మల్లొచ్చినప్పుడు నువ్వె చూస్తవ్‌గద. మరైతె రాత్రికుంటరు గద, రెండు కోళ్ళు కోయిచ్చి..."

అతనింకేదో అనబోతుంటే యెంకట్రెడ్డి అడ్డుపడ్డాడు.

"వొద్దొద్దు. ఈ సాయంత్రానికి పని పూర్తయిపోవాల. రాత్రికి తిరిగి మన్ననూరు చేరుకోవాల. నేనొక్కణ్ణయితె ఉండిపోతగాని, వర్కర్లు ఈల్లం దరు... మేం పని పూర్తి జేస్కాని ఎల్లిపోతెనె మంచిది..."

చినమల్లయ్య అర్థమైనట్టు గంభీరంగా తల ఊపాడు. మళ్ళీ ఎందుకో జగన్ వేపు చూశాడు.

యెంకట్రెడ్డి అన్నాడు, "ఏందిరా జగనా, ఎందాకొచ్చింది ఇండ్లల్ల సెటప్పు? ఏం మల్లయ్యా, మీ పోరగాల్లు గూడ ఒక చెయ్యేస్తే... జగనా, ఈల్లగ్గూడా సెటప్పు జూపించు. పని జల్ది పూర్తి కావాల, చీకటయ్యిం దంటె..."

అప్పటికే నాలుగైంది.

✤

యువకులంతా చాలా ఉత్సాహంగా పనిచేశారు. చదువురాని ఈ చెంచు యువకులు అంత తొందరగా నేర్చుకుని చకచకా పని చెయ్యటం జగన్‌కి చాలా ఆశ్చర్యం కలిగించింది. అయినా పని పూర్తయ్యే సరికి ఏడయింది. బాగా చీకటిపడింది.

టార్చిలైటు కాంతిలో చివరి సెటప్పు పూర్తి చేసి బయటికొచ్చిన జగన్ చుట్టూతా గూడెంలో కనిపిస్తున్న దృశ్యాన్ని చూసి నమ్మలేక బొమ్మయిపోయాడు. టెక్నీషియన్లు బిగించిన నాలుగు వీధి దీపాలు అప్పటికే సూర్యకాంతిని బేటరీల్లో పూర్తిగా నింపుకుని దేదీప్యమానంగా వెలుగు తున్నయ్యి. తను మొదట సెటప్ చేసిన ఇళ్ళల్లో కూడా ఫ్లోరసెంటు లాంపులు వెలుగుతున్నయ్యి. ఒక ఇంట్లోకి తొంగి చూశాడు. కొత్త సోలార్ కరంటు దీపం వెలుతురులో ఈదమ్మ వంట ప్రయత్నాలు చేస్తోంది. పొద్దునే ఆ ఇల్లు చూసి తను అసహ్యించుకున్న సంగతి జగన్‌కి గుర్తు రాలేదు. అతనికి ఆ దృశ్యం ఎంతో అందంగానూ, అద్భుతంగానూ కనబడుతోందిప్పుడు.

✤

సామాను దింపిన ట్రక్కు అప్పుడే తిరిగి వెళ్ళిపోయింది. వచ్చేప్పుడు దాన్లో వచ్చిన టెక్నీషియన్లు కూడా ఇప్పుడు జీప్సీ ఎక్కాల్సి వచ్చింది. అందరూ ఇరుక్కుని సర్దుకు కూర్చున్నారు. బండల మీద బండి పొయ్యే ప్పుడు ఎవ్వరూ బంతుల్లాగ ఎగిరి పడక్కర్లేదని శతృఘ్న జోక్ చేశాడు. పని సక్రమంగా పూర్తయిందన్న ఉత్సాహంతో అందరూ గోలగోలగా మాట్లాడుకుంటున్నారు. డ్రైవర్ మాత్రం ఆ చీకటిలో ఆ ఎగుడు దిగుడు దారి మీద జీప్సీని జాగ్రత్తగా నడిపించటంలో నిమగ్నమై ఉన్నాడు.

జీప్సీలో తన చుట్టూ మాటలు సాగుతూ ఉన్నా జగన్ తన ఆలోచనల్లో నిశ్శబ్దంగా ఉండిపోయాడు. దూరంగా మసక వెన్నెల్లో కనబడి కనబడనట్టుగా ఉన్న కొండ శిఖరాల మీద... వెలుగు. తన తోటి వాళ్ళెవరూ చూసినట్టు లేదు. డ్రైవరు కళ్ళు రోడ్డుని అంటిపెట్టుకునే ఉన్నయ్యి. జీప్సీలో మిగతావాళ్ళు కబుర్లలో లీనమై ఉన్నారు.

ఆ కొండ చరియల మీద దీపాలు... వరుసలుగా... వెలుగుచారిక ల్లాగా...

జగన్ మంత్రముగ్ధుడిలా ఆ వెలుగు చారికల్నే చూస్తున్నాడు.

కాదు, కాంతి నింపే దీపాలు కాదు, కాల్చేసే మంటలు అవి.

సజీవంగా ఉన్నట్టు మెలి తిరుగుతూ, పాములాగా వ్యాపిస్తూ, అడవిని ఆక్రమిస్తూ, జీవాన్ని కబళిస్తూ... మనుషులు రగిల్చిన మంటలు.

అడవి కాలిపోతోంది.

ఆరోజంతా తను చూసిన, విన్న, అనుభవించిన విషయాల సారమేదో ఆ మంటల్లో కాలిపోతున్నట్టు తోచింది జగన్‌కి. ఎందుకో చినమల్లయ్య గుర్తొచ్చాడు. జగన్ వెన్నులో ఏదో తెలియని జలదరింపు... ఒక అనుమానం... ఒక భయం.

మన్ననూరు చేరేదాకా తను మాట్లాడలేదు. శతృఘ్న వెక్కిరింపులకి కూడా జవాబివ్వలేదు.

ఫారెస్టు బంగ్లా వరండాలో రాత్రికి పడుకుని తెల్లారే లేచి హైదరా బాదు బయల్దేరాలని యెంకట్రెడ్డి అందరికీ చెబుతున్నాడు. జగన్ మెల్లగా అతని పక్కన చేరాడు.

"బాబయ్యా, నేనిక్కణ్ణించి శ్రీశైలమెళ్ళి రేపు రాత్రికి ఇంటికొస్తా."

యెంకట్రెడ్డి జగన్‌కేసి పరీక్షగా చూశాడు. జగన్ మొహం తిప్పేసు కుని అవతలికెళ్ళిపోయాడు.

✤

మర్నాడు సాయంత్రం భోజనాల టైముకి ఇల్లు చేరిన జగన్ని ఆశ్చర్యంగా చూస్తూ ఉండిపోయాడు యెంకట్రెడ్డి.

"ఏంది అట్ల చూస్తవ్ నువ్వు, ఆ శతృఘ్నుగాడు నిన్న ఓ ఒర్లిన్రుగా నా క్రాపింగు గురించి. శ్రీశైల మెల్లొచ్చిన. బాగుండ్లా?" అన్నాడు జగన్ నున్నటి గుండుని నిమురుకుంటూ.

యెంకట్రెడ్డి అర్థమైనట్టు చిన్నగా నవ్వి జగన్ భుజం తట్టాడు.

*

అనివార్యం

జాజుశ్రీ

ఇరవై దాకా గుడిసెలున్న ఆ పాకవీధికి ఓ అరగంట ముందే ఆరడుగుల పేము లాఠీలూపుతూ, అరడజను మంది స్పెషల్ పోలీసు లొచ్చి, పెద్ద వీరంగమాడి, పోతూ పోతూ... 'బతికుండాలనుకుంటే మీ కొడుకుల్ని బయట తిరగనీయకండి....' అని అర్థం వచ్చేలా ఏవేవో హెచ్చరికలు చేసిపోయారు.

అంతే!

పంచభూతాల ప్రళయాగ్నులకైనా బెదరని, చెదరని ఆ వీధి జనం పోలీసుల వీరంగాలకు విహ్వలులైపోయారు. నిముషాల్లో వీధి నిర్మానుష్యమై పోయింది. మెడలు సారించి, గూళ్ళలో దూరే కోడిపిల్లల్లా జనం గుట్టు చప్పుడు కాకుండా, తమ తమ గుడిసెల్లో దూరిపోయారు. కొందరైతే అప్పుడే తడికలో, తలుపులో బిగించేసుకొన్నారు.

ఉద్యోగం కోసం తిరిగి, తిరిగీ... విసిగి వేసారిన నిరుద్యోగి మొహంలా వెలుగు వెలవెలబోతున్న వేళ!

అన్నిరకాల నీతుల్ని తనలో విలీనం చేసుకొని, రాటుదేలిన అవినీతిలా, చీకటి నిస్సిగ్గుగా వయ్యారాల్ని వొలకబోస్తూంది.

వీధి చివరనున్న గుడిసె వసారాలో గోడకు చేరగిలబడి, భుజాలు గోక్కునే లాల్‌పాసి మొహంలో ఏ భావం కదలాడుతుందో తెలియడం లేదు. అతను గుండె చెదిరినట్లుగా కాకుండా, నిమ్మకు నీరెత్తినట్లుగా ఉన్నాడు.



లాల్‌పాసి భార్య తుల్సీబాయి మాత్రం అలా ఉండలేక, గుడిసెలోకీ, వీధిలోకీ కాలుగాలిన పిల్లికూనలా, అటూ ఇటూ తిరుగుతూంది. ఆమె మనో ప్రపంచంలో భయం బుడగలు కదులుతూ పగిలిపోతున్నాయి. కన్నుల్లో కలవరం పోటెత్తుతూంది. చీకటి చీల్చేందుకు కళ్ళు చిట్లిస్తూ, ఆమె దారి పొడవునా పదే పదే చూస్తుంది. పొద్దు పొద్దునే వరంగల్ పోయిన కొడుకు - యింకా రానందుకు, ఆమె అభద్రతా భావనలకు లోనై... అపశకునపు ఆలోచనల ఇరకాటంలో ఇరుక్కుపోతూంది.

"బువ్వన్న బుక్కలె కొడుకు, యాడ దిరుగు తుండో... ఆ మాయదారి ఉజ్జోగం అచ్చిందిగాదు, సచ్చింది గాదు! ఆ పేర్న పిలగాడు పిట్ట లెక్కన తిరుగుతాండు. పనుల్లేక బతకలేక పోతన్నవంటే, సెవిబెట్టేటోడు లేడు గానీ... గదే, పాణాలు కుమ్మేయడానికయితే, పుట్టగొడుగు ల్లాగ పుట్టకస్తరు.' ' లో స్వరంతో తనకు తానే చెప్పుకొని, బుజాలు గోక్కునే భర్త కేసి, కొరకాసులా చూస్తూ, "అట్ట మొద్దోలె కూకో కుంటే, కాత్త పిలగాడి జాడకు పోరాదూ?" అంది.

గోకుడాపి, గుడ్లెళ్ళబెడుతూ, "అడేవఁన్న పసిపోరడావె! ఎదురెళ్ళి ఎత్తకరాటానికి?... ఆడే అస్తడు, నువ్ గమ్మునుండు," అన్నాడు లాల్‌పాసి.

"గమ్మునుండక, నీ గొంతేవఁన్న గావు బడ్తన్ననా?"

"చత్, అరవక," లాల్‌పాసి ఈసడింపుగా కసిరాడు.

అలా కసరడాన్ని తుల్సీబాయి ససేమిరా అంగీకరించదు. మొహాన్ని కందగడ్డలా మార్చుకొని, "ఏందట్ల రెచ్చిపోతన్నవ్... నేనిప్పుడేవఁన్న, పిలగాడి జాడకి పొమ్మన్ననేగాని, అసిద్దవేఁదన్న ఊసిన్నా?... మాలావు అంటున్నవ్. నేనూ మన్సినే... సీవూఁ, నెత్తురున్నదాన్నే... కసిరి..."

"మమ్మగ అరవబాకే?"

"అరిత్తే వొరిగేదేందిలే తియ్, పోరణ్ణి పూరా పాడుజేస్తివిగా... ఆ మాయదారి సదువు పున్నేన ఆడి బతుకే బుగ్గిన బడ్డట్టయింది. ఆణ్ణి బడికి పంపవాఁకంటే యిని సత్తివా?... నా కొడుకు కలెకటేరయితడే ఎర్రిముండా... అని ఎగసికవాఁడ్తివి... యిప్పుడేవాఁయె!"

"ఆణ్ణి బడికి పంపటవేఁ బాడుకావు పనంటవ్?" లాల్‌పాసి.

"కాదేం మరి, అటు సిన్నపాటి ఉజ్జోగవఁన్నా దొరక్కపాయె! ఇటు కులం పనికీ కొరగాకుండయిపాయె... మూడేళ్ళాయె, కొడుకు కుడితిన బడ్డ ఎలకపిల్ల తీర్న కొట్టక సస్తాండు," తుల్సీబాయి.

"కులం పని జేసుకుంటనంటె, కాదన్న మాదర్చోడెవడు?"

"మళ్ళ గదే కూత!... ఎన్ని మాట్లు సెప్పాల, ఆడా పని సెయ్యనని మొరాయిస్తుంటే నీక్కాదూ?"

"సెయ్యక, గుటకాలు బొక్కుంట బజారు పొంటె బాగోతాలడ వఁను... ఉజ్జోగం పేర్జెప్పి, ఎన్నెన్ని రూపాయలు దెంకపోతాండో నీకెరకలే... మూడేళ్ళ సంది రికంగ తిరగటవేఁ తప్ప. నికరంగేదన్న పన్జేసి, 'ఇగ్గో పా... యీ పావలా...' అని, యిచ్చిండా? మీసాలు రాగనే మొగోడైపోడు. సింతాకంత పన్జేసి, పది రూపాయలు కళ్ళజూడాలె. అదీ తెలివున్నోడి వర్స... ఆఁ..." అన్నాడు లాల్‌పాసి.

ఎవరి కోణం వారిది! ఎవర్నీ తప్పు పట్టేందుకు లేదు. అధవా ఎవరేనీ తప్పు పట్టాలనుకొన్నా, ఆ దంపతులిద్దరూ ఏకమై ఒకే మాటగా పోటెత్తి విరుచుక పడతారని తెలియని వారు ఆ వీధికి కొత్త వాళ్ళో పసిపిల్లలో కావాలి!

"ఆడేం రికంగ తిరగటంలే... ఆ వరంగల్లాయన ఏడాది సంది మురిపిస్తాండు గాదూ... రేపురా, మాపురా... అంటుంటే, కొడుకు నమ్మి తిరుగుతాండు. తప్పా?... అయినా ఆడు కులంపని దప్ప యింకేదన్న పనికి 'సై' యన్నడు గాదె!"

"అంటే... ఉజ్జోగం ఊడిపడుద్దానె? ఉజ్జోగాలిచ్చోడు లేకనేగా పోరగాళ్ళు పోకిరెవారాలకీ, తప్పుడుపన్లకీ ఎగబడు తున్రు? ఆడికి సుత తెల్వదా?... అయినా... కులం పనంటే అంత సులకనేంది? తాతల్నుంచి సెయ్యటంలే?"

"పోనీలే... సదూకున్నోడాయె! సిన్నతనంగుం దేవోఁ... కాలం ఎనకటి తీర్నుందా... మార్లే?"

"అయితే, అవాఁలీ పనికి కుదుర్తడేవోఁ అడిగి సూడు."

"వామ్మో... ఆ బస్తాలు ఆడు మోస్తడా? ఆడికి మీసకట్టన్న సరిగ రాలె! లేత బొక్క. ఇర్సక పడ్డడో... కొడుకు సేతికందడు," అంది తుల్సీబాయి.

"తెరగదీ దొరకటం లేదులే... ఆ పనీ ఎలకెయిలు బెట్టి కొనాల్సొస్తుంది. పోనీ, సుతారి పనికి పోతడేవోఁ..."

"సాల్లే సంబడం... ఆడు సదివిన సదువేంది, నువ్ జెప్పే పనేంది?"

"నీత మా సికొస్తాందే... నిన్ను మెప్పియ్యడం నావల్ల గాదిక! ఇగ నే గమ్ముంటా. నీకెట్ట దోస్తే అట్ట గానియ్," అని వీధిలోకి లాల్‌పాసి అడుగేస్తుంటే తుల్సీబాయి మొహాన పేలాలేగిస్తూ,

"అగ్గో... జారుకుంటున్నవ? ఏదీ సివరంటా సాగనియ్యవుగా? కొడుక్కేదో దారి సూడాల్నా, లేదా?..." అంది.

"ఏంది సూసేది?... తల్లా, ఏ సుక్కపొద్దు పుట్టినవోగాని, వామ్మో... నిన్ను గన్నోడికి మొక్కాలె... నా ముచ్చటేందో యినకుంటనే మెల కేస్తవ్," అని వీధిలోకి నడిచాడు లాల్‌పాసి.

సమస్యనిలా మధ్యలో వదిలేసి జారుకోవటం లాల్‌పాసికి యివాళేం కొత్త కాదు. పెళ్ళయిన నాటి నుంచీ ఉన్నదే! చివరకు చూసీ చూసీ విసుగెత్తిన తుల్సీబాయి తనకు నచ్చిన రీతిలో సమస్యను పరిష్కరించుకోవడమూ పరిపాటే!

కుందేలుకు మూడున్నొక్క కాళ్ళని చెపితే, కాదని రెట్టించే మనిషితో ఎట్టేగాల్నో తెలీక తల గోక్కుంటూ లాల్‌పాసీ -

కుందేలుకు నాలుగు కాళ్ళని చెపితే నమ్మని మనిషితో యింతకాలం తానెలా నెట్టుకొచ్చాననే ఆశ్చర్యంతో తల గీక్కుంటూ తుల్సీబాయి-

ఎవరి కోణం వారిది! ఎవర్నీ తప్పు పట్టేందుకు లేదు. అధవా ఎవరేనీ తప్పు పట్టాలనుకొన్నా, ఆ దంపతులిద్దరూ ఏకమై ఒకే మాటగా పోటెత్తి విరుచుకపడతారని తెలియనివారు ఆ వీధికి కొత్తవాళ్ళో పసిపిల్లలో కావాలి!

వీధిలోకొచ్చిన లాల్‌పాసి చుట్టూ చూశాడు. చీకటి నిశ్శబ్దంగా

నిలుచుంది. మనిషి జాడ మచ్చుకయినా లేదు. అతని శరీరం జలదరించి నట్లనిపించింది. అనాలోచితంగా మదిలో కొడుకు నీడ కదలాడింది. అలలా హృదిలో ఓ అలజడి!

'నిజంగానే... ఈడింకా రాలేందబ్బా?' అనుకుంటూనే భయం కెలకేసింది. 'ఒకవేళ అలా...' గతంలో అనుభవానికొచ్చిన ఓ సంఘటన గుర్తొచ్చి, ఆదుర్దా పడిపోయాడు. అతని అడుగులు వీధి దాటి రోడ్‌పై సాగి, అంబేద్కర్ సెంటర్ మలుపున ఆగిపోయాయి.

రోడ్ పొడవునా విద్యుద్దీపాలు కిరోసిన్దీపాల్లా వెలుగుతున్నాయి. రోడ్ అస్పష్టంగా నిరుద్యోగి భవిష్యత్‌లా ఉంది. చీకటి వెలుగును ఎన్‌కౌంటర్ చేయాలని శతధా ప్రయత్నిస్తుంది. పక్కనే ఉన్న రాయి మీద నిల్చొని లాల్‌పాసి కళ్ళకడ్డంగా అరచేతి నుంచి, దూరంలో చూడసాగాడు. అడపా తడపా వస్తున్న వాళ్ళలో తన కొడుకు కనిపించక, అతని భావనా ప్రవంతి భయం వాకిళ్ళకేసి దూసుకపోతూంది. సైకిలొకటి మలుపు తిరిగి తనకేసి వస్తుంటే రాయి దిగి రెండడుగులేసి, "ఎవడ్రబ్బాయీ?" అన్నాడు కళ్ళు చిట్లిస్తూ.

"నేనే బాబాయ్," అతను సైకిల్ దిగాడు.

తమ యిళ్ళలో పిల్లోడే! కొద్దిగా చదువుకున్నాడు కూడా. గత రెండేళ్ళు ఓ కంట్రాక్టర్ దగ్గర వాచ్‌మన్‌గా ఉద్యోగం చేశాడు. మూడు నెలల క్రితం దొంగతనం జరిగిందనే నెపంతో జీతం యివ్వకుండానే వెళ్ళగొట్టారు. ప్రస్తుతం 'శ్రీ సాయిసుధా రెస్టారెంట్'లో వెయిటర్‌గా పనిచేస్తూ చాలీచాలని జీతానికి తోడు టిప్పులడుక్కొంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు.

"మావోడు కనబడ్డాడ్రా అబ్బాయ్."

అతను దగ్గరగా వచ్చి, స్వరం తగ్గించి, "తెల్వదా... మీవోడ్నీ, ఆ తలారయ్య మనవడు రామజోగినీ పోలీసోళ్ళు స్టేషన్‌ల కూచోబెట్టి స్రుగా...' ' అన్నాడు.

లాల్‌పాసి ఉలిక్కిపడి, "ఎందుకూ?" అన్నాడు బెరుగ్గా చూస్తూ.

"ఏవో మరి... స్టేషన్ దార్లె పోలీసోళ్ళు తుపాకులతో నిలబడి, వచ్చిపొయ్యే పడుచుపడుచోల్లందర్నీ ఆడమగా చూడకుండ ఆపుజేసి పేర్లు గట్ట రాస్కొని, వెల్లగొడ్తన్రు గాదూ?"

"చత్, పోరగాళ్ళు సదువులు సదివీ ఉజ్జోగాల్లేక, రోడ్లెంట పిచ్చికుక్క ల్లెక్కన తిరిగి సస్తాంటే పైపెచ్చు యిదోటా... మావోడేం జేసిందంట?"

"వరంగల్ పొయిండుగా!"

"వొరంగల్ పోతే... ఆడేదో బతుకు దెరువు పనికోసం పొయిండు గాని, దొంగతనాలకి పొయిండా?"

"వరంగల్ కాడ అన్నల సభ పెట్టలే... ఆ సభ కాడ పోలీసోళ్ళు పోటోలు తీస్తుంటే ఏదో గలాటా జరిగిందంట. దాంతో పోలీసోళ్ళకి తిక్క రేగింది.... ఊకుంటరేంది?" అని సైకిలెక్కాడతను.

లాల్‌పాసి తేలగుడ్లేసి పోతున్నతన్ని చూస్తుండిపోయాడు. మనసంతా గజిబిజిగా ఉంది. గుండె చలనం తడబడుతున్నట్టనిపించి, నిలుచున్న రాయి మీదనే కూలబడిపోయాడు. చాలాసేపటిగ్గానీ అతనిలో కదలిక రాలేదు. పరుగెత్తుకెళ్ళి భార్యకు చెప్పాలనిపించింది. రెండడుగులు వేశాడు కూడా. అంతలోనే ఆగి, భార్య వేసే తిరకాసు ప్రశ్నలకు జవాబులు చెప్పలేక,



చిరాకు పడితే... అది కాస్తా తగువుగా మారి తలబొప్పి కట్టిస్తుందనిపించి, వెనుదిరిగి సరాసరి స్టేషన్‌కేసి చెకచెకా అడుగులేశాడు.

అతని అడుగుల్లానే ఆలోచనలూ నడుస్తున్నాయి. కొడుకు బతుకు ఏ మలుపు తిరుగుతుందో అంతు చిక్కడం లేదు. ఆలోచనలూ ఆగడం లేదు.

తానెంత హీనంగా, దీనంగా, దరిద్రంగా బతికినా తన కొడుకయినా మంచి బతుకు దర్జాగా బతకాలని ఎంతగా ఆరాటపడ్డాడు? ఎందరు!... ఆఖరికి భార్య మాటనీ కాదని, దూరం పంపించి చదివించాడు. 'మరుగు కుప్పలెత్తి పారబోసే పాకోళ్ళ'కి చదువెందుకని వెక్కిరించిన వాళ్ళని లెక్క చేయకుండా ముందుకు నడిచాడు. కొడుకు ఉద్యోగం చేస్తూ మల్లె పూల్లాంటి గుడ్డలేసుకొని నలుగురిలో తిరుగుతూంటే... కులపోళ్ళందరూ తనను గొప్పోడిగా చూస్తారని ఊహించుకుంటూ, కష్టాల్ని కమ్మగా భరించాడు. కొడుకు అడిగీ అడగకముందే అప్పుజేసి మరీ డబ్బులిచ్చాడు. ఆ వడ్డీల కోసం తన జీతంలో సగం కోతపడినా, అదంతా ముందు ముందు తాననుభవించే సుఖాలకీ, గౌరవాలకీ పెట్టుబడిగా నమ్మి మురిసిపోయాడే తప్ప ఏనాడూ బాధపడిందీ, చిరాకు పడిందీ లేదు.

రాంపాసి బి.కాం పాసైన రోజు లాల్‌పాసికి పండుగలా అనిపించింది. తన బంధువుల్లోగానీ, కులపోళ్ళలోగానీ, ఆపాటి చదువు చదివన వారెవరూ లేనందున, తాను మాత్రమే గొప్ప కార్యాన్ని సాధించినట్టు, పాకీవాళ్ళ బతుకుల్ని మలుపు తిప్పినట్టు పొంగిపోయాడు. కొడుకు ఉద్యోగం చేస్తుంటే, దొరలా పొరచుట్ట తాక్కుంట బతకొచ్చని... తీయని అనుభూతి అతని అణువణువునా చేరి, ఆనందంతో ఉక్కిరిబిక్కిరి చేసింది.

అయితే -

రోజులు గడిచేకొలదీ తన అనుభూతికీ, వాస్తవానికీ మధ్య పూడ్చలేని అగాధమున్నట్టు, రెండేళ్ళ అనుభవాలతో తెలిసొచ్చాక, రాంపాసికి ఉద్యోగం దొరకదన్న నిశ్చయంతో నీరసపడి... ఏడాదిగా కనీసంగా బతకడానికి కులవృత్తినో, మరో వృత్తినో ఎంచుకోమని అతను రాంపాసి చెవిలో బాధపడు తూనే చెప్పక తప్పడంలేదు.

తుల్సీబాయి కూడా చాలారోజులుగా తల్లడిల్లిపోతోంది. పదుగురి లో తాను పలచనైనట్టు, న్యూనతా భావధోరణితో బతుకుతుందామె.

వీలయినప్పుడల్లా కొడుకును దగ్గరగా తీసుకొని, "కొడకా, ఎట్లా బతికేది ఎవరూ చూడరు. ఎట్టాగైనా బతుకుతున్రా, లేదా అనేదే చూస్తరు. ఏదన్న సింతాకంత పన్జాసుకో... ఏదన్న పని... మనవఁనకున్న యన్నీ అనుకున్నట్టే జరిగితే, మరా బగమంతుడనుకు నేయి ఏం గావాల?... ఏదైనా మన మంచికే అనుకుంటెనే మంచిగుంటది. దొరికిన పనేదో సేసుకుంట, ఉడకేసు కున్నదేదో తినుకుంట, గమ్మునుంటేసాలు..." అని పదే పదే చెప్పడంతో రాంపాసి కూడా ప్రభుత్వోద్యోగం మీద ఆశ చంపుకొని, వరంగల్‌లో ఏ ఫ్యాక్టరీలోనైనా ఏదైనా... మోటు పనైనా చేసేందుకు సిద్ధపడి తిరుగుతున్నాడు.

"ఏదన్న సింతాకంత పన్జాసుకో... ఏదన్న పని... మనవఁనకున్న యన్నీ అనుకున్నట్టే జరిగితే, మరా బగమంతుడనుకు నేయి ఏం గావాల?... ఏదైనా మన మంచికే అనుకుంటెనే మంచిగుంటది. దొరికిన పనేదో సేసుకుంట, ఉడకేసు కున్నదేదో తినుకుంట, గమ్మునుంటేసాలు..."

ఒకరిద్దరు నాయకుల్ని కలిసి అడిగితే, చిటికలేసి, ఊరించి... 'రేపురా, మాపురా,' అని తిప్పుకోవడమే తప్ప అసలు సంగతి వాళ్ళు చెప్పడమూ లేదు, రాంపాసి పసిగట్ట డమూ లేదు. ఓ పదివేలుంటే పనౌతుందని ఒకరిద్దరు చెప్పినా, అసలు నాయకుల నోటి నుంచి ఆ మాట రానం దుకు ప్రతిరోజూ వరంగల్ పోతూ, వస్తూ... నాయకుల చుట్టూ, ఫ్యాక్టరీల చుట్టూ తిరుగుతూ... ఎంత తిరిగినా, రాంపాసికి చిన్నపాటి పనంటూ దొరకలేదు. గాని రకరకాల అనుభవాలు, కొత్తకొత్త ఆలోచనలు, సరికొత్త పరిచయాలు దొరికాయి.

ఆ అనుభవాలు అతనికి వ్యవస్థ తీరుతెన్నుల్ని అవగతం చేశాయి!

ఆ ఆలోచనలు అతన్ని నూతన లక్ష్యాలవైపు నడిపించాయి!!

ఆ పరిచయాలు అతన్ని ఉన్నత సమాజ కోణాల కోసం పరితపిం చేలా మార్చాయి!!!

తానాశించిన, నిజమైన ప్రశాంత జీవితం తనకూ, తనలాటి పేదలకు అందుబాటులోకి రావడానికి ఉన్న అడ్డంకుల్ని గుర్తించిన కొలదీ... అతనికా అడ్డంకుల మీద కసి!

తననూ, తనలాటి నిరుద్యోగుల్ని మోసగిస్తున్న విధానాల మీద కసి!

రోజులు గడిచే కొలదీ అతనికందిన పుస్తకాల అధ్యయనం ద్వారా అతనిలో గూడు కట్టుకొన్న కసికి పిలకలూ, మొలకలూ పుట్టుకొస్తుంటే... రాంపాసి భావనా ప్రపంచంలో సాధారణ వ్యక్తులు ఊహించనంతగా మార్పులు!

భూమిని పిరికిడబట్టిన వాళ్ళనీ, డబ్బుకు నలుపు రంగేసిన వాళ్ళనీ, అవినీతి అందలంలో ఎక్కి నక్కిన వాళ్ళనీ... లాగి, కసికసిగా నలిపేయాల న్నంత కసి!

రాంపాసిలోని కసిని లాల్‌పాసి పసిగట్టలేకపోయాడు. అంతేకాదు, ఆ కసిని పోలీసులు పసిగట్టారనీ, పసిగట్టలేకపోయాడు!

"పా..."

తలొంచుక నడిచే లాల్‌పాసి ఉలిక్కిపడ్డాడు. తలెత్తి స్థాణువులా నిల్చుండిపోయాడు.

ఎదురొస్తూ... తలారయ్య మనుమడు రామజోగితో పాటు రాంపాసి!

"యాడికి పా, చీకట్లో..." రాంపాసి తండ్రిని, 'పా...' అని పిలుస్తాడు. చిన్నప్పుడు తమ ఇంటి పక్కనున్న పరదేశీ కుటుంబీకుల పిల్లల స్నేహంలో అబ్బిన అలవాటది.

"నీకోసమే... ఇంతాలిసెమైందేం?"

అందుకు జవాబివ్వకుండా, "పద, అమ్మ భయపడు తున్నాల," అన్నాడు రాంపాసి.

నింపాదిగా కొడుకును గమనించాడు లాల్‌పాసి. అతని నడక మామూలుగా లేదు. రాంపాసి పక్కన నడిచే రామజోగి నడకలోనూ ఆ నొప్పిని గుర్తించాడు.

"ఏమయింద్రా జోగీ?" వారి వెనుక నడుస్తూ లాల్‌పాసి, రామజోగి చేతిని తాకుతూ నెమ్మదిగా అడిగాడు.

రామజోగి వెంటనే నోరిప్పలేదు. ఉద్వేగంతో అతని లో ప్రపంచం ఉడికిపోతూంది.

"చెప్పవేంద్రా జోగీ, పోలీసోళ్ళు ఎందుకాపు జేసిన్రు... కొట్టిన్రు గదూ?"

రామజోగి అంతరంగంలో అసహనం కదలాడింది. ప్రక్కన నడిచే రాంపాసి చేతిని నొక్కి, లాల్‌పాసికేసి బాధగా చూస్తూ, "ఈ పోలీసోళ్ళు మమ్మల్ని బతకనియ్యరు మావాఁ... ఎవురికేదన్న సెప్పటవూఁ తప్పే! సెప్పేది యినటవూ తప్పేనా?... సిన్నపాటి ఉజ్జోగం దొరక్క అల్లల్లాడ తన్నవేఁ... మా మొరెవురింట్రున్రు... మా ఎంటబడి ఏడిపిస్తున్నే... మేవేం జేసినం? ఎవరి మీద గుండాయిజం సేసినం? ఎవురి కంచంల కూడు లాక్కొని తింటున్నం? ఏ తప్పు జేసినవని మమ్మల్నిలా కుల్లబొడుస్తున్నో తెల్వటంలేదు మావాఁ..." గాద్గద్యంగా అన్నాడు రామజోగి.

లాల్‌పాసి దగ్గర జవాబులేక నోరు పెగల్లేదు. రామజోగి బుజాన చెయ్యేస్తూ, దగ్గరగా తీసుకొన్నాడు.

రామజోగి గుండెల్లో పేరుకుపోయిన బాధను తగ్గించుకునేందుకు, మళ్ళీ "పడుసోడెవడైనా బజారు పొంటె కనబడితె పాపం... పనిలేక, ఆకలిని ఎలా చంపుకోవాలో తెలీక, అయినోళ్ళకి మొహం చూపలేక, బయట తిరుగుతవేఁ తప్ప, ఎవడ్నో ఏదో సెయ్యాలని కాదుగా! పిచ్చోడిలాగ తిరిగోడ్ని పట్టుకొని, 'యాడికి బోతన్నవ్? ఎందుకు బోతన్నవ్? యాడ్నుం చొస్తన్నవ్? పేరేంది, ఊరేంది?... అనటం... సెపుతున్నా యినకుంట తన్నుకుంట జీపులకి తోసెయ్యటం?... మాదేం బతుకు మావాఁ... పనిలేనోళ్ళవఁనేగా యీ పలచదన!... ఈ బతుకు బతికే కంటే..." అంటున్న రామజోగి చేతిని గట్టిగా నొక్కాడు రాంపాసి. లాల్‌పాసి గమనించలేదు.

పిల్లల్ని అకారణంగా హింసించినందుకు లాల్‌పాసి ఆవేశంతో ఊగి పోయాడు. పళ్ళు కరకరమన్నాయి. అతని ఆవేశం అదుపు దాటితే వణు కొస్తుంది. ఆ విషయం అతనికి తెలుసు! తన్నుతాను సంభాళించు కొంటూ, "కరమ రా జోగీ, కరమ... ఏ జల్మల మూటగట్టుకున్న పాపవోఁ యిలా ఎంటబడి ఏడిపిస్తాంది," రామజోగితో కాకుండా తనకు తానే చెప్పుకొ న్నట్టుగా గొణిగాడు.

పోలీస్ జీపుకటి హారన్ మోగిస్తూ, వాళ్ళ పక్కగా వచ్చి, క్షణం ఆగి, వికలాంగుల కాలనీ కేసి దూసుకపోయింది. దానిలో ఉన్న పోలీసులు నవ్వు కుంటున్నారు.

'వేటకి వేళయింది,' లోలో కసి పెంచిన విరక్తితో రాంపాసి.

'ఎవుడికి మూడిందో!' పైకి కాదు, లోలో అనుకున్నాడు రామజోగి.

రాంపాసి మౌనంగా నడుస్తున్నా, అతని మనసు మౌనంగా కాకుండా ఆవేశపు ప్రకంపనల సంక్షోభం వలన ఎగసిన ఆలోచనల సునామీలా ఉద్వేగపడిపోతూంది. పోలీసులు తమను స్టేషన్‌లో ఉంచినందుకు కాదు, లాఠీలు విరిగిందాకా హింసించినందుకూ కాదు. హింస మామూలే! ఎన్ కౌంటర్స్ అధికారపు వృత్తి, ప్రవృత్తిగా మారిన భయవిహ్వల వాతావరణంలో నవ్వుతూ, ప్రశాంతంగా జీవించే అవకాశాలు తగ్గిపోవడం సహజమే!

కాని ఎందుకిలా?...

అభద్రతా భావోద్వేగాలకు జనం బలైపోయే ధోరణి రూపొందిస్తున్న శక్తులు ఆశించేదేమిటి?

ఏ స్వార్థంతో, ఏ అర్థంలో యీ హింస!

బతుకులోని రంగూ, రుచీ అందకుండా జేసి, తలిదండ్రుల ఆకాంక్షల్ని తీర్చడానికి చిన్న ఆధారం కూడా కల్పించలేని విధానకర్తలకు మమ్ముల్ని శాసించే అధికారం ఎలా ఉంటుంది?

జాతి జీవనాడిగా అహింసను పేర్కొంటూ ఈ హింస ఏమిటి?

ఈ వైరుధ్యం ఎందుకు?

నిజాయితీగా బతికే అవకాశాలను తుడిచేసి, ప్రశాంతతను అశాంతికి లోనుచేసి, నియమరహితమైన విశృంఖలతవైపు యువతను బలవంతంగా నెట్టి, ఆయుధాన్ని ఎక్కు పెట్టి...!?

కన్నీళ్ళే మంచినీళ్ళుగా మార్చుకున్న నిరుద్యోగుల్ని మానసికంగా ముక్కలు చేసి, వారి ఆశల్నీ, అనుబంధాల్నీ, ఆరాటాల్నీ తొడగొట్టి పడగొట్టి ఆనందించే వైఖరిని నిరోధించకపోతే ఛస్తాం! నిరోధించితే చంపుతారు! ఎలానూ చావే... ఛస్తే ఏం మిగలదు. చంపబడితే కనీసం ప్రశ్న మిగులుతుంది. ప్రశ్న - చైతన్యమై చిగురిస్తుంది!!

నా బతుక్కి అతికిన మాట, నా మనసుకు నచ్చిన పాట, వినడమే నేరమైన చోట, దారిద్ర్యాన్ని దిగమింగుతూ కలతనిద్రలో నున్న నిస్సహాయ, నిరుద్యోగ యువతను అనుమానించి, అపహరించి, అవమానించి, మాయం చేసే ఆనవాయితీకి అభినందనలు లభిస్తున్న చోట...

ఆలోచనలు ఎగసినవాడు...

ఎగసిననాడు...

గుడిసె దగ్గరవుతూనే లాల్‌పాసి కొడుకుతో ఏదో చెప్పబోయాడు గాని, నోరు పెగల్లేదు.

రాంపాసి గమనించాడు. అల్లకల్లోంగా ఉన్న తన అంతరంగాన్ని అదుపులోకి తెచ్చుకుంటూ, తండ్రి చేతిని తన చేతుల్లోకి తీసుకొని ప్రేమగా నిమురుతూ, "ఏం కాలేదు పా... నాకేం కాలేదు. కాదు... నేనేం తప్పు చేయడంలే..." అన్నాడు.

అల్లంత దూరం నుంచే తుల్సీబాయి కొడుకును పోల్చుకుంది. అతన్ని పోలీస్‌స్టేషన్‌లో ఉంచారని ఆమెకు అంతకుముందే తెలిసి కంగారు పడి పోతూంది. ఎదురొచ్చి, తడుముతూ దగ్గరగా తీసుకొని, "కొడకా, యాడ బోయినవ్?" అని, లోలో కుములుతూ కూనిరాగం తీస్తూ, చేయి పట్టుకొని గుడిసెలోకి తీసుకపోయింది.

లాల్‌పాసి వసారాలోనే ఆగి, "జోతీ, అన్న ఉడుకునీళ్ళు పోసుకుంటడు. నీళ్ళసర్వ పాయ్యినుంచు," బిడ్డకు వినబడేలా అని, అదే స్థాయిలో, "నువ్ కాత్తె ఆ కూనిరాగం కట్టెయ్, జనంలేత్తే అదో పీకులాట," ఏడుస్తున్న భార్యను ఊరడిస్తున్నట్టుగా కాక, గదమాయిస్తున్నట్టుగా అని, గోడకు చేరగిలబడి, కునుకులోకి జారుకుందామని ప్రయత్నం చేశాడు. మౌనం అతని మనసును కుదుపుతూంది. ఎంత కాదనుకొన్నా... ఏవేవో ఆలోచనలు!

ఒకే వొక్క ఆశతో... తాను ఎన్నెన్ని రీతుల బాధలనో దిగ మింగుతూ, కొడుకును చదివించుకొన్నాడు. తాను చేస్తున్నట్టు పాకీపని కాకుండా వాడు నలుగురితో సమానంగా తిరిగే ఉద్యోగం చేస్తూ గొప్పగా బతకాలనే ఒకే ఒక్క ఆశతో...

తాను ఉదయాన్నే మలం బక్కీటులో చీపురుకట్టా, రేకుముక్కా ఉంచుకొని, ఇల్లిల్లూ తిరుగుతూ, మరుగుదొడ్లలోని మలంకుప్పల్ని రేకులో ఎత్తి, మలం బక్కీటులో వేసి, దాన్నో పక్క నుంచి, ఫినాయిల్‌తో దొడ్డిని కడిగి, ఈగలూ, పురుగులూ చేరకుండా, బూడిదో, ముగ్గో చల్లి, మలం బక్కీటును నెత్తి నుంచుకొని, ఊరికి దూరంగా పారబోసే వృత్తి చేస్తూ కూడా శక్తి లేకపోయినా, నలుగురు నవ్వినా, చదివించుకొన్నది ఆ ఒకే వొక్క ఆశతోనే గదా!

పాకీ వృత్తిలో మార్పులొచ్చి, మలాన్ని ఎత్తి పారబోసే పద్ధతి పోయి, రూపాంతరం చెందించే పద్ధతి (సెప్టిక్ టాంకుల పద్ధతి) వచ్చాక కూడా, అదే వృత్తిని కొనసాగిస్తూ, ఉదయాన్నే ఊరంతా తిరుగుతూ, మురుగు కాల్వల్ని శుభ్రం చేయడం, సెప్టిక్ టాంకు కాలువల్లో ఏ తట్టూ లేకుండా జంక్షన్‌ల దగ్గర సరిచెయ్యడం, నిండిపోయిన టాంకుల్లోని విసర్జితాన్ని ఎత్తి దూరంగా పోయడం... యిదంతా ఎవరి కోసం? వృత్తి ధర్మంగా తాను చేసిన పనులను బట్టి సమాజం తనను హీనంగా, అంటరానివానిగా చూడటం బాధాకరంగా అన్పించినా భరించిందెందుకోసం? చేసే వృత్తిని బట్టికాక, గుణాన్ని బట్టే మనిషికి ఆనందం మిగులుతుందని నమ్మి, పనిని గౌరవిస్తూ పడిన కష్టాలకు ఫలితం అందకపోవడంతో... అతనికి సమాజం మీద కాదు, తన మీద తనకే అసంతృప్తిగా ఉంది. తానాశించిన దానికి భిన్నంగా జరుగుతున్నందుకు, తన బతుకు వంకర తిరిగి తననే వెక్కిరిస్తున్నందుకు, అతని మనోలోకం కుదుపుల పాలై అతలాకుతలమై పోతూంది.

గుడిసెలో తుల్సీబాయి కూనిరాగం ఆగిపోయింది. భర్త ఆపమన్నాడని కాదు. కొడుకుకు ఉన్నదేదో వండి పెట్టుకొందామని ఆపి, ఆ పనిలో పడింది.

రాంపాసి బుజానున్న సంచి తీసి, మంచం కోడుకు తగిలించి, "జోతీ, మంచినీళ్ళు," అని మంచంలో వొరిగాడు.

నీళ్ళసర్వ పాయ్యి మీదుంచి, మంట రాజేస్తున్న జోతిబాయి లేచి, లోటాతో అన్నకు నీళ్ళందించి, అతను తాగాక, లోటా అందుకుంటూ, "ఆర్నెళ్ళ సంది సూస్తున్న, పోలీసోళ్ళు రోజూ నీజాడకొస్తరేంది?... నీ ఎనక పడ్డరెందుకూ?..." అంది అమాయకంగా చూస్తూ.

రాంపాసి జాలిగా చెల్లెలికేసి చూశాడు. విరక్తి నిండిన ఓ నవ్వుముక్క అతని పెదాలపై విరిగిపడింది. "నిరుద్యోగిని కదమ్మా... అందుకు,"

అన్నాడు.

"ఐతే..."

"నిరుద్యోగులకి ఆకలుండ కూడదు. కళ్ళుండకూడదు. నోరుండ కూడదు. ఉంటే... ఇదిగో... ఇలానే ఉంటది."

"తెల్వటంలే..."

"నీకిప్పుడిప్పుడే తెల్వదులే."

జోతిబాయికి తిక్కరేగింది. లోటా తిరగేసి, అన్న మొహం పగిలేలా ఈడ్చి కొట్టాలనిపించింది. 'ఎవరికైనా చెపితేనే గదా, తెలిసేది... దాటేసి తెల్వదంటే ఎలా?' లోలో గొణుక్కొని, "చత్, నువ్వెప్పుడూ యింతే. ఏదీ గుండె విప్పి చెప్పవుగా!..." నిష్ఠూరంగా చూస్తూ అని, పొయ్యి దగ్గర కెళ్ళింది.

తుల్సీబాయికి కొడుకు స్వరం కొత్తగా అన్పించింది. ఏదో... తెలీని భయంతో ఆమె మనసు ఊగిసలాడింది. "ఏంది కొడకా, భయ పడతన్నవా... కలేమై నొచ్చిందా?" వీపు నిమురుతూ, అమాయకంగా అడిగింది.

రాంపాసి స్నానం చేసి వచ్చాక, తుల్సీబాయి అన్నం కంచాన్ని అతని ముందుంచి దగ్గరగా కూచొని అదోలా చూసింది.

తల్లి అదోలా చూసిందంటే రాంపాసికి నక్కిళ్ళు పడతాయి. ఆ అదోలాలో ఉన్న ఆరాటమూ, ఆకాంక్షా అతనికి తెలుసు. ఆమెలో చాలా... చాలాకాలంగా కొనసాగుతున్న ఒకే వొక్క ఆశ!

ఎవరికైనా మంచి బతుకంటే ఆశ... బాధలంటే భయం సహజం!

"అన్నో... ఎంకటప్పయ్యని పోలీసులు పట్టకపోయిన్రు..." జోతిబాయి రాంపాసి దాపుగా వచ్చి, ఆనందంగా అంది.

"ఎప్పుడు?" రాంపాసి.

"పొద్గాలనే, నువ్వటు పోయిన కూసేపటికి."

ఎందుకో అతనికి తెలుసు. వెంకటప్పయ్య ఏడాది క్రితం, సింగరేణిలో కొలువిప్పిస్తానని ఆ వీధిలో ఉండే ఎనిమిదిమంది దగ్గర ముప్పయివేల చొప్పున తీసుకొన్నాడు. రేపూ, మాపూ అంటూ రోజులు గడుపుతుంటే, పదిరోజుల క్రితం బాధితులంతా చేరి, అంబేద్కర్ సెంటర్‌లో దొరికించుకొని హూనం చేశారు. వారంరోజుల్లో వడ్డీతో సహా చెల్లిస్తానని నోటు రాయించుకొన్నారు.

యువత అవసరాన్ని గుర్తించి, ఉద్యోగాల పేరుతో మోసగించే వెంకటప్పయ్యలాటి వ్యక్తులు ఊరూరా తిరుగుతూ, అమాయకుల్ని ప్రలోభాల పాల్జేసి పబ్బం గడుపుకొంటున్నారు. నిరుద్యోగుల్ని మాయమాటలతో నమ్మించి లక్షలార్జించి, ఉడాయించే ఏజన్సీలూ, కన్సల్టెన్సీలూ పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి.

"అయితె మాన్లె. నువ్ గమ్మునుండు. ఎవుడెట్ట సత్తె మనకెందుకు?" తుల్సీబాయి బిడ్డను గద్దింపు స్వరంతో మందలిస్తుంటే, రాంపాసి తల్లికేసి చూశాడు. ఆ చూపును అంది పుచ్చుకొని, "పయిటేల ఏవఁన్నా తిన్నవా కొడకా?" అందామె.

రాంపాసి తినలేదు. తల దించుకొని, తిన్నట్టుగా తలూపాడు.

వసారాలో ఉన్న లాల్‌పాసి, కొడుకు పని గురించి తల్లికి ఏం చెపుతాడో విందామని చెవులు రిక్కించి చూస్తున్నాడు. తుల్సీబాయి గొంతులో నొక్కిపట్టి ఉంచుకొన్న ప్రశ్నను రాంపాసి అన్నం తినేంతవరకు ఆగి, చేయి కడుక్కొంటుంటే సంధించింది.

"పనేవఁయినా లంకించుకొన్నవా కొడకా?"

"ప్చ్..."

రాంపాసి నుంచి వెలువడిన ఆ శబ్దం లాల్‌పాసి గుండెల్లో ప్రతిధ్వనించింది. అతని మొహం మాడిపోయి నట్టయింది. నిస్పృహగా నిట్టూర్చాడు. వెనక్కి, గోడకు చేరగిలబడి, 'ఉద్యోగాల్లేకా, పనులు దొరక్క ఈ కాలపు పిలగాళ్ళు బతికేదెట్టనో... పిచ్చిబుట్టి రోడ్లెంట తిరుగుతూ తెగించి పోతున్రు. తప్పుడుదారుల్లోకి, సీకటి ఎవారాలకీ ఎగబడుతున్రు... యిట్టయితెట్ట?' అలా... అలా... అతని ఆలోచనా స్రవంతి సాగుతూ, సాగుతూ... అలానే కునుకులోకి జారుకొన్నాడు.

గుడిసెలో ఉన్న తుల్సీబాయి కూడా కళ్ళు మూసుకుందే తప్ప, నిద్రపోవడం లేదు. కొడుకు బతుకెలా సాగుతుందో తెలీక, కలవరంతో కదిలిపోతుందామె. ఉద్యోగం కోసం వాడి బాధలేవో వాడు పడుతుంటే, గత ఆరునెలలుగా పోలీసులు ఏవేవో అనుమానాలతో వెన్నాడుతూ... అర్ధరాత్రీ, అపరాత్రీ లేకుండా వచ్చి, ఆరాతీస్తూ బెదిరిస్తున్నందున ఏరోజు ఏమవుతుందోననే ఆందోళనతో ఆవేదన పాలువుతందామె.

రాంపాసి కూడా కళ్ళు మూసుకున్నాడుగాని, అతని పరిస్థితీ అలానే ఉంది. గత నెలలుగా అతను వ్యవస్థ మీద ఏర్పరచుకొన్న అభిప్రాయాల్ని మూల్యాంకనం చేసుకొనే కొలది అతని కసి మరింతగా బలపడుతూంది. సమాజంతో ముడిపడిన వ్యక్తి జీవితం సమాజ ఉన్నతీకరణతోపాటు పుష్పిస్తుందే తప్ప, నాయకుల చుట్టో ఉద్యోగాల కొరకో తిరిగితే కాదని నిర్ణయానికొచ్చాడు. మంచంలోంచి లేచి తల్లినీ, చెల్లినీ గమనించాడు. గుడ్డిదీపపు వెలుగులో వారి మొహాల్లో కనిపించే పేదరికపు నీడలు చూస్తూ, అసహనంతో, ఏదో గుణించుకుంటూ అటూ ఇటూ తిరుగుతుంటే...

ఓరకంట గమనించిన తల్లి భయపడుతూ లేచి కూచొని, "ఏంది, కొడకా... నిద్ర పట్టడం లేదా?" అంది.

రాంపాసి తల్లి దాపుగా కూచొని, ఆమె వడిలో తల పెట్టి, "అమ్మా... అమ్మా..." అంటూ చేతులు పట్టుకొని గోముగా నిమురుతూ -

తుల్సీబాయికి కొడుకు స్వరం కొత్తగా అన్పించింది. ఏదో... తెలీని భయంతో ఆమె మనసు ఊగిసలాడింది. "ఏంది కొడకా, భయపడతన్నవా... కలేమైనొచ్చిందా?" వీపు నిమురుతూ, అమాయకంగా అడిగింది.

"నాకుద్యోగం దొరకదమ్మా... మీకింత తిండి పెట్టే భాగ్యం నాకు లేదమ్మా..."

తుల్సీబాయి గుండెల్ని పిరికిడబట్టి పిండుతున్నట్టుగా వణికిపోయింది. అయినా కొడుకు మరింత డీలా పడిపోతాడని, బయట పడకుండా, "లేదు కొడకా... ఉద్యోగం దొరుకుతుంది. తెల్లారగట్ట సీకటి సిక్కంగుంటదని నీకు సుత తెల్వదా..."

"తెలుసమ్మా... ఇంకా చాలా తెలుసు."

"అందుకే గుండె చెదరమాక."

"ఈ గుండె మొండిదైపోయిందమ్మా. ఇక చెదరదూ... బెదరదూ."

తుల్సీబాయి కొడుక్కేసి బాధగా, భయంగా చూసింది. "అట్లనకు కొడకా... ఎట్ట రాసుంటే అట్టనే జరుగుద్ది. లోకంల మనవొక్కళ్ళవేనా?... మనలా బాధలు పడేటోళ్ళు శానామందుండరు," అంది.

"ఉన్నారమ్మా... దేశం నిండా పేదలున్నారు. అయితే ఆ పేదలు పేదలుగానే ఉంటున్నారు గదమ్మా... అయితే..."

జీప్ హారన్!... కీచుమంటూ ఆగిన శబ్దం!...

రాంపాసి, దిగ్గున లేచి, "పోలీసులమ్మా..." అన్నాడు.

"అయితె మాన్లె... నువ్ గమ్మున పడుకో... నేనూ, మియ్య బయట అరుగు మీద కూకుంటం," అని, తలుపు తీసుకొని, "ఉన్నవా... ఏం జేస్తున్నవ్?" అంటూ బయటకొచ్చింది తుల్సీబాయి.

"దా... కూకో... ఇప్పుడే పోలీసోళ్ళ సందడికి తెలివొచ్చింది," అన్నాడు లాల్‌పాసి.

పోలీసులు లాఠీలతో చప్పుడు చేస్తూ ఇల్లిల్లూ గాలిస్తున్నారు. కొద్ది కాలంగా యిలా అర్ధరాత్రి వచ్చి నానా హంగామా చేసి పోవడం వారి వృత్తి ధర్మంగా మారిపోయింది.

"ఈ పోలీసోళ్ళకి నిద్రపట్టదా?... నడిజాము కాడ తిరుగుతుంటరు."

"వాళ్ళు సేసే పనే అది."

"ఏది, గుడిసెల్ల గుర్రుపెట్టే పోరళ్ళని గుంజకపోయి సావఁగొట్టటవా?"

"అందరి జోలికెందుకస్తరు? అనువాఁనవున్నోడ్నే."

"ఏందనువాఁనం? పనికోసం తిరిగొచ్చే పిలగాణ్ణి టేసన్‌ల కూకోబెట్టి, కీళ్ళు వాయగొట్టటవాఁ!... ఆడి కాళ్ళు వాసినయ్, సూసినవాఁ?..."

"ఆడి కాళ్ళే గాదు, ఏడ్సేడ్సి నా కళ్ళూ వాసినయ్. గమ్మునుండు, పోలీసోళ్ళు యిటొస్తన్రు."

"రానీ, ఏం బయవాఁ... కొడుకు పండిండుగాదూ!... కావాలంటే సూస్కొమ్మను," నెమ్మదిగా అని, దాపుగా వచ్చే పోలీసుల్ని చూస్తూ నిలుచుంది.

లాల్‌పాసి కూడా అరుగు దిగి నిల్చొని, దండం పెట్టాడు.

పోలీసులిద్దరూ దగ్గరగా వచ్చారు. రోజూ వచ్చేవాళ్ళే! "క్యా... లాల్‌పాసీ, బాగున్నవ్... ఉండా రాంపాసి?" అన్నాడో పోలీసు.

"ఉండక, ఎటుపోతడు దొరా... ఆర్నెల్ల సంది సూస్తన్న, రోజూ రావటం, ఆడి ఆరా తీయటం! ఎందుకు దొరా... ఆడేం జేసిండు?... ఆడేవన్న దొంగోడా... మీలాగనే సదివిండు. ఆడి కరమగాలి ఉజ్జోగం దొరకలె... లేకుంటెనా..." అన్నాడు లాల్‌పాసి.

"రేయ్, చుప్... శాన మాట్లాడ్తన్నవ్... మాకన్నీ తెలుసు... మీవోణ్ణి బయట తిరగొద్దను. సంయ్..." మరో పోలీస్ అని, లాఠీతో పందిరి గుంజను రెండుసార్లు కొట్టి వెనుదిరిగారిద్దరు.

జీప్ దగ్గర ముగ్గురు పోలీసులు హడావుడి చేస్తున్నారు. ఒకతను పక్క గుడిసెలో నిద్రపోతున్న మునెయ్య కొడుకుని బలవంతంగా నిద్రలేపి, జీప్ దగ్గరకు లాక్కుపోతూ, ఈడ్చి తన్నాడు.



తుల్సీబాయి గుండెలు బాధగా మూలిగాయి.

"ఏం జేస్తం. కాని కాలవఁయింది," అని, లాల్‌పాసి అరుగు మీదకు చేరి, "పో... పడుకో..." అన్నాడు భార్యతో.

తుల్సీబాయి గుడిసె తలుపు తీసి, గుడ్డిదీపపు వెలుగులో అటూ ఇటూ చూసింది. వెనుక తలుపు తెరిచి ఉంది.

మంచం ఖాళీగా ఉంది.

తుల్సీబాయి కంగారుగా గుడిసె వెనక చూసింది. ఆమెలో భయం బుడగేసింది. "ఏవఁయ్యోయ్... పిలగాడేడీ?" అంది.

"ఆఁ" అంటూ లాల్‌పాసి గుడిసెలోకి వచ్చాడు. జోతీబాయి తల్లి అరుపుకు దిగ్గున లేచింది. అంతా తలో ప్రక్క వెతికారు.

రాంపాసి కనిపించలేదు.

మంచంకోడుకు తగిలించిన సంచి లేదు... దండెం మీద ఉన్న రాంపాసి జత బట్టలూ లేవు!

దంపతులిద్దరూ తేలగుడ్లేసుక ఒకర్నొకరు చూసుకొన్నారు. జోతీబాయి నిశ్శబ్దంగా నిలుచుంది.

లాల్‌పాసికి దు:ఖం ఆగలేదు.

నేల మీద కూలబడి, గొంతు పెగలకుండా నోటిలో పవిటచెంగు కుక్కుకొని తల బాదుకుంటూ కుమిలి కుమిలి ఏడ్చే భార్య దగ్గరగా కూచొని, పెదాలు బిగబట్టి వెక్కివెక్కి ఏడవసాగాడు.

జోతీబాయి పాయ్యి ముందర కుప్పగా కన్పించిన కాగితం ముక్కల్ని తీసి చూసింది. అవన్నీ తన అన్న రాంపాసి విద్యా యోగ్యతా పత్రాలు! ఊహల ఉయ్యలపై అతన్ని ఊరించీ, ఊగించీ... ఊహ కందని రీతిలో బోల్తా కొట్టించిన సర్టిఫికెట్లు! లాల్‌పాసి రక్తమూ, కన్నీళ్ళూ కలగలిసిన ఫలాలు! ఎందుకూ ఉపయోగపడని రీతిలో ముక్కలు ముక్కలుగా పడి ఉన్నాయి!

జోతీబాయికి అంతా అవగతమైంది. అయినా నోరు విప్పలేదు.

చాలాసేపటికి, లాల్‌పాసి ఏడుపాపి, కళ్ళు తుడుచుకొని, భార్య కన్నీళ్ళూ తుడుస్తూ, "దార్లో ఆకలయితే ఏదైనా కొనుక్కోటానికి వాడి దగ్గర డబ్బేవఁయినా ఉందా?..." అన్నాడు నెమ్మదిగా.

తుల్సీబాయి తెలీదన్నట్టుగా పెదవి విరిచింది. బిడ్డకేసి చూసింది.

జోతీబాయి పెదవి విప్పలేదు.

*

మౌనరాగం

కె.వి. గిరిధరరావు

మళ్ళీ ఇలా ఇన్నాళ్ళ తర్వాత గుడికి వెళ్ళాల్సి వస్తుందని నేనూహించలేదు. ఇంత కష్టపడి వెళ్ళినా ఆమెతో నేననుకున్నవన్నీ మాట్లాడ గలనన్న నమ్మకంలేదు.

రోడ్డు మీద అంత రద్దీ లేదు. సాయం త్రానికి దగ్గరౌతున్నా ఎండ తీవ్రంగానే ఉంది. దూరంగా కొండలమీది గడ్డి ఎండిపోయి, ఎండలో బంగారంలా మెరుస్తోంది. కొంతమంది మోటారు బైకుల మీద వేగంగా వెళుతున్నారు. కిటికీ అద్దాలు మూసేశాక కారంతా నిశ్శబ్దంతో నిండిపోయింది. కారులో వెళ్తూ పాటలు వినడం, రేడియో వినడం నాకలవాటు లేదు. ఒక్క కారులో అనేముంది... ఇంట్లో కూడా అంతే. ఆలోచించుకుంటూ డ్రైవ్ చేయడం, ఆలోచించుకుంటూ ఒక్కణ్ణే కూర్చో వడం... ఒక్కోసారి ఏ ఆలోచనా లేకుండా ఇలా ఉన్నానేమిటాని అనుకోవడం! అంతసేపు 'ఏమాలో చిస్తావ్' అనడిగితే జవాబు చెప్పలేనేమో! అన్ని ఆలోచనలను స్పష్టంగా, నిజాయితీగా బయటకు చెప్పడం సాధ్యమేనా?!

ఇన్నేళ్ళ తర్వాత కలుస్తున్నప్పుడు ఆమెను ఏమని పిలవాలో! పరిచయస్తుడుగానా, పాత స్నేహితునిగానా లేక ఒకప్పటి భర్తగానా?! భౌతికం గా ఆమె వేరు నేను వేరు... అప్పటికీ, ఇప్పటికీ. కాని విచిత్రంగా మా ఇద్దరి మధ్య సంబంధాలు మాత్రం అనేకాలు... పరిచయస్తులు, స్నేహితులు, భార్యాభర్తలు!

ఆలోచనలు ఎక్కడో ఉన్నా కళ్ళు అలవాటు గా ఎదురుగా ఉన్న రోడ్డును చూస్తున్నాయి. చేతులు స్టీరింగ్‌ను, కాళ్ళు యాక్సిలరేటరును, బ్రేకును కంట్రోల్ చేస్తున్నాయి. మనతో సంప్రదిం చకుండానే శరీరంలో అవయవాలు... వాటితో అవి సంప్రదించుకుంటూ, వేటి విధులు అవి చేసు కుంటూ పోవడం నాకెంతో నచ్చిన, ఆశ్చర్యకరమైన విషయం.



వెనుక వస్తున్న ట్రక్కువాడు, గభాల్న ప్రక్క లైను లోకి మారడం, వేగంగా ముందుకు వెళ్ళిపోవడమూ అద్దంలోంచి కనిపించింది. కారు వేగం కాస్త పెంచాను.

మూడేళ్ళు కలిసి బ్రతికాక విడిపోయి బ్రతకడం కష్టమేనని అనుభవపూర్వకంగా తెలిసొచ్చింది.

విడిపోవడానికి దారితీసేంత బేధాభిప్రాయాలు మామధ్య ఉన్నట్లు ఇన్నేళ్ళలో నాకెప్పుడూ అనిపించలేదు. తనకేది కావాలని అడిగినా ఎప్పుడూ కాదనలేదు. ఎప్పుడూ ఏ విషయమ్మీదా వాదించుకున్న ఛాయలూ లేవు. అలాగని మా ఇద్దరి అభిప్రాయాలు, అభిరుచులు ఒక్కటి కాదు.

ఆమె కూడా నన్నెప్పుడూ నొప్పించిన జ్ఞాపకం లేదు. నా అవసరాలను కనిపెడుతూ కావలసినవన్నీ సమకూర్చేది.

పెద్దల బలవంతం మీద ఇష్టంలేని పెళ్ళి చేసుకుంద నుకోవడానికి ఆధారాలు లేవు. చుట్టాల వాళ్ళ అమ్మాయి. పెళ్ళికి ముందు ఇరు కుటుంబాల మధ్య సాన్నిహిత్యం ఉంది. అమ్మాయి తెలివిగలదని, చలాకీగా అందరితో కలివిడిగా ఉంటుందనీ, అయినా వంచిన తల ఎత్తదని, తన పని తను చేసుకుపోయే రకమని పేరు. పెళ్ళికి పూర్వం ప్రేమ వ్యాపకా లకు అవకాశం తక్కువే. అటు ఇటు పెద్దలు ముందుగా మాట్లాడుకున్నాక మా ఇద్దరినీ సంప్రదించి, మా సమ్మతితోనే సంబంధం ఖాయం చేసారు. పెళ్ళి రంగరంగ వైభవంగా జరిగిపోయింది.

అన్నీ సవ్యంగా ఉన్నా తనెందుకు విడిపోవాలనుకుంది?! ఎన్నిసార్లు ఆలోచించినా ఈ ముడి మాత్రం విడిపోవడం లేదు!

కేవలం సౌకర్యాలకనుగుణంగా అన్నీ సమకూరడం అందరికీ తృప్తి కలిగించే అంశం కాదేమో!?

ఆరోజు సాయంత్రం, టీ త్రాగి టీవీ చూస్తున్నప్పుడు, 'మనం విడి పోదాం,' అని తను అన్నప్పుడు, ఏం సమాధానం చెప్పాలో వెంటనే బోధపడ లేదు నాకు.

ఇద్దరం ఎన్నో ఏళ్ళుగా దెబ్బలాడుకొని, ఒకే కప్పు క్రింద శత్రువుల్లా పోరాడుకుని, ఎవరం గెలిచామో తేల్చుకోలేని స్థితిలో, సంధి మార్గంగా ఎవరికి వాళ్ళం విడిపోవడం అంటే అది వేరు. కానీ ఒకే రైల్లో ఎదురెదురు సీట్లలో ప్రయాణిస్తూ కలిసిన పరిచయస్తులు, దిగాల్సిన స్టేషన్ రాగానే మొహమాటానికి వీడ్కోలు చెప్పుకుని విడిపోయినట్లు విడిపోవడమే బాధా కరం.

ఇప్పటికీ నాకాశ్చర్యమేమిటంటే, ఆవిడ నన్నారోజు 'విడిపోదాం' అని అడిగినప్పుడు, కనీసం కారణం కూడా అడగలేదు. ఆమె నుంచి విడిపోదాం అన్న మాట కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్నట్లు చాలా మామూలుగా 'లాయర్‌ను కలుద్దామా' అని అడిగాను. ఆవేళ కారణంగానీ అడిగుంటే, అసలు విడిపోయేవాళ్ళమే కాదేమో!

నేనలా అడిగినప్పుడు ఆవిడ మొహంలో కూడా ఎలాంటి ఆశ్చర్యమూ కనిపించలేదు.

"రేపు వెళ్ళి కలుద్దాం. నేనాలెడీ మాట్లాడి అప్పాయింట్‌మెంట్ తీసు కున్నాను. సాయంత్రం నాలుగున్నరకు కలవాలి," చెప్పింది తను.

కానీ ఆ తతంగం జరుగుతున్నంతసేపు, మౌనంగా ఎలా కూర్చోగలిగానా అని ఇప్పటికీ నాకాశ్చర్యం! అంతా అలా జరిగిపోయింది.

ఆ రాత్రంతా ఆలోచనలు. ఎంత ఆలోచించినా తను నా నుండి విడిపోవడానికి కారణాలు కనిపించలేదు. అన్నీ సవ్యంగా జరుగుతూనే ఉన్నాయనిపించింది. నేనేమీ ఆవిడను రాచి రంపాన పెట్టడంలేదు. బహుశా వేరెవరినైనా పెళ్ళి చేసుకోబోతోందా? సమాధానం దొరకలేదు.

ఇద్దరం సమ్మతించి విడిపోతున్నాం కాబట్టి లాయరు కూడా ఎక్కువ ప్రశ్నలు వేయలేదు. అక్కడ పని త్వరగానే ముగిసింది. ఫారాల మీద పెట్టమన్నచోట సంతకాలు పెట్టడం తప్పించి నేనేమీ పెద్దగా శ్రోక్యం కలి గించుకోలేదు. అన్నీ ఆవిడే మాట్లాడింది.

కానీ ఆ తతంగం జరుగుతున్నంతసేపు, మౌనంగా ఎలా కూర్చోగలిగానా అని ఇప్పటికీ నాకాశ్చర్యం!

అంతా అలా జరిగిపోయింది.

లాయర్‌కు ఫీజు ఇచ్చేటప్పుడు గుర్తొచ్చింది. నా నుంచి విడిపోతే తనకు జీవనోపాధి ఎలా అని.

బయటకొచ్చి కారులో కూర్చున్నాక, "నీకు డబ్బెలా?" అడిగాను.

"నాకొక చిన్న ఉద్యోగం దొరికింది. వచ్చే జీతం నా అవసరాలకు సరిపోతుంది," చెప్పింది.

తనకు కూడా ఇలా విడిపోవడం అంత ఆనందకరంగా ఉన్నట్లు లేదు.

"డబ్బవసరమైతే ఫోన్ చెయ్యి," చెప్పాన్నేను.

అలాగేనన్నట్లు తలూపింది.

నా మొహంలో బాధ తన కళ్ళలో కనిపించింది. తల ప్రక్కకు తిప్పేసు కుంది.

ఆరోజు రాత్రి ఇద్దరం కలిసి బయట రెస్టారెంట్‌లో భోజనం చేసాం. మర్నాడు నేనాఫీసు నుంచి ఇంటికి వెళ్ళేటప్పటికి తను లేదు. తన అడ్రసు, ఫోను నెంబరు వ్రాసిన పేపరును ఎదురుగా కనిపించేలాగా బల్ల మీద ఉంచింది.

ఒక్కసారిగా ఇంట్లో చాలా వెలితి!

రోజులు గడిచేకొద్దీ తను లేని లోటు ప్రతిక్షణం తెలియడం మొదలుపెట్టింది.

తీగలు తెగిన వీణలా ఇల్లు. అక్షరాలను మోస్తున్న మూసిన పుస్తకంలా నేను.

విడాకుల వార్త స్నేహితుల్లోనూ, బంధువుల్లోనూ, కుటుంబంలోనూ పెద్ద కలవరమే రేపింది. పిలవని పేరంటంగా రెండువైపులా వకాల్తా తీసుకునే వాళ్ళనీ, ఒప్పించి మమ్మల్ని మళ్ళీ ఒకటి చెయ్యాలనుకునేవాళ్ళనీ చూస్తే నవ్వొచ్చేది. ఒప్పించాల్సింది ఎవర్ని?

రానురాను కలవడానికి ఒప్పించడం మానేసి మళ్ళీ పెళ్ళి చేసుకో మని పోరడం మొదలెట్టారు. వాళ్ళతో మాట్లాడ్డం చాలా వరకు తగ్గించాను.

ఒక్కణ్ణి ఒంటరిగా నాలో నేను మాట్లాడుకోవడంతో విసుగెత్తింది. తలుపులన్నీ మూసుకుని ఇంట్లో కూర్చోవడం రానురాను శిక్షగా అనిపించ సాగింది. నేరం చేసి, చట్టానికి దొరికిన ఖైదీలను జైలుగదుల్లో ఇలాగే ఉంచుతారేమో!



ఒక్కోసారి ఇంట్లోంచి దూరంగా... పారిపోవాలనిపించేది. ఆమె దగ్గరకు వెళితే... అలా అనుకోగానే ఫోనందుకునేవాణ్ణి. కానీ మాట్లాడేవాణ్ణి కాదు. క్రమేణా అదీ అలవాటైంది.

అప్పుడప్పుడూ ఆవిడ ఫోను చేసి యోగక్షేమాలడిగేది. తన ఉద్యోగం గురించి, అక్కడి వాతావరణం గురించీ మాట్లాడేది. అన్నింటికీ 'ఊ' కొడుతూ వినేవాణ్ణి. చివర్లో మాత్రం, 'డబ్బేమైనా కావాలా?' అని అడిగే వాణ్ణి. 'అవసరంలేదు,' అని చెప్పేది.

రెండ్రోజుల క్రితం ఫోను చేసి, లాంగ్ వీకెండ్‌కు నేనుండే ఊరుకు దగ్గరగా వస్తున్నానని, వీలైతే కలుద్దామని చెప్పింది. నాక్కూడా తనను చూడాలని, ఎన్నో విషయాలు మాట్లాడాలనీ అనిపించింది.

ఇన్నాళ్ళ నా ఒంటరితనాన్ని, వేదనను తనతో చెప్పుకుని భారం దించుకోవాలని, తన మూడ్ బాగుంటే నా నుంచి ఎందుకు విడిపోయిందో ఇప్పుడైనా అడుగుదామని అనిపించింది. ఇంకా తనెవ్వరినీ పెళ్ళి చేసుకోక పోతే తన దృష్టిలో వేరొకరు లేకపోతే, మళ్ళీ నన్ను పెళ్ళి చేసుకుంటుందేమో అడగాలనిపించింది. రెండ్రోజులుగా అద్దం ముందు నిలబడి, తనతో ఏమేం మాట్లాడాలో ఎన్నిసార్లు రిహార్సల్స్ వేసుకున్నానో నాకే లెక్కలేదు.

ఎక్సిట్ తీసుకొని, గుడివైపు రోడ్డు మీదకు మలుపు తిరిగాను.

కారు పార్క్ చేసి, గుళ్ళోకి వెళుతుంటే, "ఎక్స్యూజ్‌మీ... ఒక స్నాప్ తీసి పెడతారా?" అడిగిందొక అమ్మాయి.

'సరే'నని తలూపి కెమెరా తీసుకున్నాను. గుడి ఆవరణ ప్రశాంతంగా, అందంగా ఉంటుంది. గుడికి వచ్చినవాళ్ళు చాలామంది తమ ఆప్తులతో, స్నేహితులతో, బంధువులతో ఫోటోలు దిగుతుంటారు. నేను కూడా కెమెరా తెచ్చుకుంటే బావుండేదేమో!

ఆ అమ్మాయి వెళ్ళి గులాబీ మొక్క ప్రక్కన, తన భర్తనానుకుని నిల్చుంది. ఈమధ్యనే ఒకటయినట్లున్నారు.

"ఈ మొక్క, పువ్వూ వచ్చేలా తీయరూ?" అడిగింది.

తలూపి ఫోటో తీసి, కెమెరా ఆవిడకు ఇచ్చి గుళ్ళోకి అడుగుపెట్టాను.

పెద్దగా జనం లేరు. గుడి ఆవరణలో ఒక స్తంభానికి ఆనుకొని కూర్చొని ఉందామె. ప్రక్కనే హేండ్‌బేగ్. కాస్త చిక్కిపోయినట్లు కనిపించింది. మొహంలో కళ. నన్ను చూడగానే పలకరింపుగా నవ్వి, లేచి నుంచుంది.

నేనూ నవ్వాను. తదేకంగా ఆమెవైపే చూస్తుండడం గమనించి, "సన్న బడ్డాను కదూ?" అడిగింది.

'అవున'న్నట్లు తలూపాను.

"కాస్త దూరంగా అటువైపు వెళ్ళి కూర్చుందామా?" అంటూ ప్రక్కకు నడిచింది. నేను తనను అనుసరించాను.

ఇద్దరం కూర్చున్నాక, "మీరు కూడా బాగా చిక్కిపోయారు," అంది.

చిన్నగా నవ్వీనవ్వనట్లు నవ్వాను.

"మీ కబుర్లేమిటి?" అడిగింది.

"నువ్వెలా ఉన్నావ్?" అడిగాన్నేను.

నావైపే సూటిగా చూస్తూ రెండు నిమిషాలు తనేమీ మాట్లాడలేదు. ఆమె కళ్ళు మాట్లాడుతున్నట్లనిపించాయి. ఆమె చూపుల్లో భావాలను చదవడానికి భయమేసింది. తల వంచుకున్నాను.

"ఇదిగో ఇలా ఉన్నాను," అని నవ్వింది. ఆ నవ్వులో పెద్దగా ఆనందమూ లేదు... విషాదమూ లేదు.

ఫ్రెండ్స్ గురించి, మా పేరెంట్స్ గురించీ అడిగింది.

మళ్ళీ పెళ్ళి చేసుకోమంటున్నారని చెబుదామనుకుని, చెప్పలేక పోయాను.

"మీ ఉద్యోగమెలా ఉంది?" అడిగింది.

"మామూలే," చెప్పాన్నేను.

అన్నింటికీ పొడిగా సమాధానాలిస్తున్నాననిపించింది.

తన క్రొత్త ఫ్రెండ్స్ గురించీ, పేరెంట్స్ గురించీ చెప్పింది.

మధ్యమధ్యలో మౌనాన్ని కూడా కలుపుకుంటే ఒక గంటపైనే అయింది నేను గుడికి వచ్చి. నేనామెతో మాట్లాడాలనుకున్నవేమీ మాట్లాడలేదు. గుళ్ళో దేవుడికి దణ్ణం పెట్టుకుని బయటికొచ్చాం.

గుడి ముందు లాన్‌లోని గడ్డి పచ్చగా ఉంది. పూలమొక్కల దగ్గర ఎవరూ లేరు. అప్రయత్నంగా ఆవిడకు గులాబీలంటే ఇష్టమని గుర్తొచ్చింది.

"ఒక్కక్షణం..." అంటూ గులాబీ మొక్క దగ్గరకు వెళ్ళి పువ్వు తెంపాను. అలవాటులేని పని కదా... ముళ్ళు గుచ్చుకొన్నాయి. వెనక్కి తిరిగేటప్పుడు, చొక్కాను ముళ్ళు పట్టుకున్నాయి... బలంగా లాగేసరికి కొమ్మ విరిగింది.

తుంపిన పువ్వును ఆవిడకిచ్చి, ప్రక్కనున్న ఖాళీ కుండీలో మట్టిని కాస్త పెళ్ళగించి, విరిగిన కొమ్మను భద్రంగా అందులో గుచ్చి ఒక మగ్గుతో నీళ్ళు తెచ్చి పోశాను.

నేనేనా ఇదంతా చేస్తోంది అనుకుంటూండగానే "థాంక్స్," అందామె. ఆమె మొహంలో కొత్త వెలుగు!

"కెమెరా తెచ్చావా?" అడిగాను.

తెచ్చానన్నట్లు తలూపి, హేండ్ బేగ్‌లోంచి కెమెరా బయటకు తీసింది. ఆమె మొహంలో ఆశ్చర్యం!!

కెమెరా అందుకుని, అటుగా వెళ్తున్న పూజారిగారిని పిలిచి, "మాకొక ఫోటో తీయగలరా?" అడిగాను. *

ధైర్యం

వి. రాజారామమోహన రావు



అదో రకం పరుగు... ప్రత్యేకించి వీళ్ళతోటే పోటీ అనీ లేదు. కానీ, వెనకపడిపోతే ఎలా అన్న భయం... చేరాల్సిన గమ్యం ఇదీ అన్న నిర్ధారణా లేదు... అన్నీ తెలుస్తూనే ఉన్నాయి. 'అప్పుడే సంవత్సరం గడిచిపోయిందా?' అన్న ఆశ్చర్యం లతకి, కిరణ్‌కి.

కిందటి సంవత్సరం జూన్ ఇరవైన ఇద్దరికీ పెళ్ళి జరిగింది. ఈ సంవత్సరం జూన్ రెండోవారం చివరలో ఉన్నారు.

గడిచిన సంవత్సరాన్ని వెనక్కు తిరిగి చూసుకున్నప్పుడు రొటీన్‌గా జరిగినవే ఎక్కువ కనబడుతున్నాయి. ఉదయం ఇద్దరూకలిసి కూచుని కాఫీ తాగే పది నిమిషాలు... సాయంత్రం ఇల్లు చేరాక నిద్రపోయేలోపు, అదీ ఇద్దరూ మెళకువగా ఉండగలిగే ఓపిక ఉంటే కలిసి మాట్లాడుకునే ఓ గంట... మిగిలిన ఇద్దరి జీవితం ఫోన్‌లోనే. ఇద్దరూ ఒకే ఊళ్ళో ఉన్నా, ఒకే ఇంట్లో కాపురం చేస్తున్నా... అంతా పరుగే.

ఎంత హడావిడైనా, పని ఒత్తిడిలో ఉన్నా లతకి అప్పుడప్పుడూ గతం అలలు అలలుగా మనసులో మెదులుతూ ఉంటుంది. తనూ, కిరణ్ కలిసి ఎమ్.టెక్ చదుతుండగా ఏర్పడిన పరిచయం, ముందు చదువుకి, కెరియర్‌కి సంబంధించిన కబుర్లే చెప్పుకోవటం, ప్రపంచవ్యాప్తంగా ఎంతో త్వరితంగా జరుగుతున్న సాంకేతిక మార్పుల గురించి... ఉద్యోగావకాశాల గురించి... ఆ కబుర్లలోనే కలిసి బతకటం గురించి... ఇప్పటికీ తలుచుకుంటే లతకి చిరుసిగ్గుగా, మురిపెంగా ఉంటుంది. తమిద్దరినీ జీవితం అతి సహజంగా, సాఫీగా దగ్గర చెయ్యటం... ఎంత అదృష్టం అనుకుంటుంది.

సరదాగా కబుర్లు సాగుతున్నప్పుడు "మన పాత విషయాలు ఎప్పుడైనా గుర్తొస్తుంటాయా?" అని కిరణ్‌ని ఓసారి అడిగింది లత.

"ఎందుకు గుర్తు రావు... ఒకరి చేతిలో మరొకరి చెయ్యి... చీకటి పడీపడని సాయంత్రాల నడక... గంటలు గంటల కబుర్లు... కాపురం పెట్టగానే ఏం చెయ్యాలో, ఎలా ఉండాలో అన్న ఆలోచనలు..." అంటూ కిరణ్ చెబుతుంటే... ఆ చేరువలో... ఆ కొద్దిక్షణాల్లో ఎంతో తృప్తి లతకి.

రానురాను... ఎప్పుడు, ఎలా జరిగిందో... ఇప్పుడు ఆ క్షణాలు అసలు ఉండటం లేదు... విశ్రాంతి లేదు... ఖాళీ సమయం లేదు... అంతులేని శ్రమ.

'ఇద్దరూ ఉద్యోగాలు చేసుకుంటారు... ఆర్థికంగా ఇబ్బందు లుండవు... వారానికి కనీసం రెండుసార్లేనా సరదాగా ఎటో అటు వెళ్ళాలి... నగరంలో ఏ మూల ఏ మంచి ప్రోగ్రాం జరిగినా... ముఖ్యంగా మంచి సంగీతం వింటూ మైమరచిపోయేలా... ఏ చిన్న అవకాశం వదల కూడదు... జీవితాన్ని కళాత్మకంగా... నిండుగా... తమిద్దరి అభిరుచికి తగినట్టు గడపాలి...' ఎప్పుడూ ఇలాంటి కబుర్లే చెప్పుకునేవారు.

కాపురం పెట్టిన ఓ నెలరోజులు తప్ప, ఆ తర్వాత ఈ ఊహలేవీ ఫలించలేదు. పెళ్ళి అయ్యేటప్పటికే ఇద్దరికీ ఉద్యోగాలున్నాయి. కొత్తగా చేరిన ఆఫీసు వాతావరణం, పోటీ ప్రపంచంలో తమకి తాము సమర్థులుగా నిరూపించుకోటంలో ఇద్దరూ సర్వం మరిచిపోవాల్సి వచ్చింది.

ఇద్దరి ప్రాముఖ్యతా ఒక్కటే... ఉద్యోగం... సమర్థత... తల ఎత్తుకుని ధీమాగా బతకగలిగే కెరియర్... ఇద్దరికీ మంచి అవకాశాలే వచ్చాయి. ఒక్క సంవత్సరంలోపే.. టైము అన్న విషయాన్ని మరిచిపోయి, ఆఫీసు ఇల్లు ఒకటిగానే భావించి, అహర్నిశలు పనికే అంకితం అయిపోయి మంచి స్థాయికి, తోటివాళ్ళు గర్వంగా చూసే స్థాయికి చేరారు.

ఇంచుమించు ఇద్దరూ ఒకేసారి ఉద్యోగాలు మారారు. పెద్దస్థాయి విదేశీ సంస్థ ప్రారంభించిన బిజినెస్ ప్రాసెస్ ఆఫీసులో లత, సాఫ్ట్‌వేర్ కంపెనీలో టీమ్ మేనేజర్‌గా కిరణ్... ఆదాయానికి లోటులేదు. కానీ లోటల్లా టైమే... ఇద్దర్లో ఎవరు ఎప్పుడు ఇంటికి వస్తారో, ఎంతసేపు ఉండగలుగుతారో వాళ్ళకే తెలియదు.

ఉదయం లేస్తూనే మానసికంగా, శారీరకంగా ఉత్సాహాన్ని ఇంజెక్ట్ చేసుకుంటారు. బైటికి కదిలి రకరకాల సమస్యల్ని, ఒత్తిడిని భరించి రాత్రికి అణుమాత్రమేనా ఓపికలేనట్టు ఇల్లు చేరతారు. రోజంతా వారి ఆలోచనా, శ్రమ... అంతా ఉద్యోగానికే. వేరుగా తమ కోసం వారికి పట్టుమని పది నిమిషాలు సమయం కేటాయించుకున్నా అదొక బలవంతపు చర్యే...

లత, కిరణ్ పడిన శ్రమని, వారి ప్లానింగ్‌ని, వారు చేసిన పనుల్ని... తప్పని సర్వసాధారణంగా ఎవ్వరూ అనలేరు. ఇద్దరూ చెరో కారు కొనుక్కున్నారు. లేకపోతే టైము సరిపోదు.

బ్యాంక్ వాళ్ళు వాళ్ళంతగా వాళ్ళు వీరి దగ్గరికి వచ్చి లోన్ ఇచ్చారు. ఆ అవకాశం వదలుకోలేక లోన్ తీసుకుని త్రీబెడ్‌రూమ్ ఫ్లాట్ కొనుక్కున్నారు. కొత్త ఇంట్లోకి అవసరమైనవి, కొంచెం సౌఖ్యవంతంగా గడపటానికి అవసరమైన వస్తువులన్నీ తీసుకున్నారు. ఇన్‌కమ్‌టాక్స్, ఇన్‌స్టాల్‌మెంట్స్, లోన్స్, బిల్లులు పోను కొద్దిగా డబ్బు ఉంటుంది. గట్టిగా అవసరమైతే అప్పు తేలిగ్గా పుట్టే జీవనస్థాయిలోనే ఉన్నారు కాబట్టి ఇబ్బంది లేదు.

లతకి, కిరణ్‌కి తెలుస్తున్న ఇబ్బంది ఒక్కటే... విశ్రాంతికి సమయం లేని, శరీరం తట్టుకోలేని అలసట. అది వీరిద్దరికే పరిమితం కాదని తెలుసు. ఈ జీవన వేగం, అలసట... ప్రస్తుత జీవనవిధానంగా నమ్మి, అందులో ఇమిడిపోవాలని రకరకాలుగా ప్రయత్నిస్తున్న లక్షలకొద్దీజంటల్లో చాలా నగరాల్లో ఉన్నదనీ తెలుసు.

చాలా అరుదుగా దొరికే ఆదివారంనాడో, మరో శెలవురోజో ఇల్లు సర్దుకోవటంలాంటి పనులు చేస్తున్నప్పుడు మాత్రం ఒక్కోసారి లతకి విపరీతమైన విసుగ్గా ఉంటోంది.

ఏమిటీ జీవితం? ఇది ఇంతేనా? ఈ సద్దతే సరైందా? అన్న ప్రశ్నలు ముల్లులా పొడుస్తున్నాయి. కిరణ్‌కి విసుగు కలిగే సందర్భాలు లేకపోలేదు. భార్యాభర్తలిద్దరూ ఈ విషయం మాట్లాడుకున్నారు. ఈ రొటీన్ గురించి మార్పు కావాలని ఇద్దరూ బలంగా కోరుకున్నారు.

ఆఫీసు పని, ఒత్తిడి లేకుండా ఏకాంతంగా గడపాలన్నది కోరిక. ఇంట్లో ఏకాంతానికేం లోటు లేదు. కానీ వాతావరణం మార్పు కూడా ఉంటే బావుంటుందన్నది ఆలోచన. వారం పదిరోజులు శెలవు పెట్టటం ఇద్దరికీ తేలిగ్గా సాధ్యపడే విషయం కాదు. ఆదివారాలు, శెలవురోజులు కూడా ఆఫీసుకి వెళ్ళాల్సి వస్తోంది. మహా శెలవు దొరికితే రెండు మూడు రోజులు. ఆ సమయంలో ఏ ఊరేనా వెళ్ళాలంటే... మంచి, చెడు లెక్కలేసుకున్నారు. విశ్రాంతి కన్నా, శ్రమే ఎక్కువయ్యేలా ఉంది. మరీ విచ్చలవిడిగా ఖర్చుచేసే అవకాశం లేదు. కమిట్‌మెంట్స్ చాలానే ఉన్నాయి.

ఆలోచించి, ఆలోచించి చివరికి ఇద్దరూ ఓ నిర్ణయానికి వచ్చారు. జూన్ ఇరవై... మేరేజ్ డే...

ఆరోజంతా లతా, కిరణ్ ప్రతి నిమిషం తమదిగా గడపాలనుకున్నారు. చకచకా అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. ఇద్దరూ ఆరోజు శెలవు పెట్టారు. ముందుగానే షాపింగ్ పూర్తి చేశారు. అన్నీ అమర్చుకున్నాక... నవంబర్ ఇరవై పూర్తిగా ఇంటికి... విశ్రాంతికి... ఏకాంతానికి... ప్రశాంతంగా గడపటానికి కేటాయించారు.

✤

మొదటి సంవత్సరం పెళ్ళిరోజు ఇద్దరూ మామూలుగానే నిద్దర లేచారు. చిరు బద్దకం... ఏ హడావిడి లేని ప్రశాంతత... ఇద్దరి మనసులూ ఎంతో తేటగా ఉన్నాయి. ఏ పనికీ ఒత్తిడి, తొందర లేకుండా సమయం గడపాలన్నదే వాళ్ళిద్దరి ముఖ్యమైన కోరిక. అలాగే తమ ఆలోచనల్ని మనసుని సెట్ చేసుకున్నారు.

తాపీగా కాఫీ తాగారు. తీరుబడిగా గడుపుతూ తలారా స్నానాలు చేసి కొత్తబట్టలు కట్టుకున్నారు. లత టిఫిన్ చేసింది. తృప్తిగా తిన్నారు. లత వంట ప్రయత్నంలోకి వెళ్ళాలని లేచిన రెండు నిమిషాలకి ఫోన్.

తప్పించుకునే అవకాశం లేదు. హెడ్ ఆఫీసు నుంచి సి.ఇ.ఓ. పూర్తి టీమ్‌తో దిగాడట. ఆఫీస్‌కి అర్జంట్‌గా వెళ్ళాలి. నీరసపడిన లతకి కిరణ్ నచ్చజెప్పి మరీ పంపించాడు. గంటా, రెండు గంటల్లో బైటపడదామనుకున్న లతకి ఎంతమాత్రం వీలుకాలేదు.

ప్రతి నిమిషం నరకంలా ఉంది. చిన్న పని కూడా పెద్ద బరువులా ఉంది. ఇంత అస్వతంత్ర జీవితమా? ఇంట్లో కిరణ్ ఒక్కడూ ఎదురు చూస్తూ... భోజనం కూడా లేకుండా... పెళ్ళిరోజున...

లతకి కన్నీరు పెట్టుకునే అవకాశం కూడా లేదు. చుట్టూ జనం... అంతకీ పెల్లుబికి వచ్చిన ఒకటి రెండు కన్నీటి చుక్కల్ని కంట్లో ఏదో నలక పడినట్టు నటిస్తూ తుడుచుకుంది.

రాత్రి రెండు దాటాక ఆఫీసువాళ్ళు కూడా వచ్చి మరీ లతని ఇంటి దగ్గర దించి వెళ్ళారు. కిరణ్ వచ్చి తలుపు తీశాడు.

ఇద్దరికీ నిస్సత్తువ... ఒకర్ని మరొకరు చూసుకోలేనంత ఆశాభంగం.

"పది నిమిషాల్లో వంట చేసేస్తా..." అంది లతే ముందు తేరుకుని.

"ఇప్పుడేం వద్దులే... నేనే అన్నం వండి, సాంబారు చేశా... ఛండాలంగా ఉన్నా తినేయాలి..." అన్నాడు నవ్వుతూ. తెల్లారుఝామున అయిదింటికి కానీ ఇద్దరూ పూర్తిగా తేరుకోలేకపోయారు. దిగులుగా తలదించుకు కూచున్న లతని చూస్తూ...

"దేనికీ దిగులు పడకూడదు లతా... ఆవేశంలో ఉద్యోగం మానేస్తానంటున్నావు. అది సరికాదు. మానేస్తే మన కమిట్‌మెంట్స్‌తో మరింత కష్టపడతాం... మన చిన్నప్పటి సొసైటీ వేరు. ఇప్పుడు వేరు. ఇప్పటి జీవితం తీరు ఇదే... మనిద్దరమే కాదు. మనకన్నా నిరాశపడి... రకరకాలుగా నలిగిపోతున్న వారు లక్షల్లో ఉన్నారు. మేరేజ్‌డే అయిదింటికేనా... తెల్లారే లోపేనా... దగ్గరగా ఉండగలగటం ఎంత అదృష్టమో అది గమనించు..." అన్నాడు కిరణ్.

మరికొంచెంసేపు అలాంటి మాటలే చెప్పాడు కిరణ్. అవన్నీ లతకి తెలియనివేం కావు. కానీ కొత్తగా తెలుసుకుంటున్నట్టు విని, భర్త మాటలని సమర్థిస్తున్నట్టు తలూపింది. ఎప్పుడేనా లత అలా మాట్లాడినా కిరణ్ కూడా అలాగే సమర్థిస్తాడు. ఏ రకంగా కళ్ళు చెమర్చినా, ఏదో రకంగా ధైర్యంగా మార్చుకోకపోతే అసలు జీవితమే లేదు మరి. *

చదువేనా?

నరేష్ గంటి



పొద్దున్నే అలారం మోగింది. శీను లేచి లైటు వేసి కళ్ళనీ, మొహాన్నీ చల్లటినీళ్ళతో కడుక్కుని, కుర్చీలో కూర్చుని చదువుకోవడం మొదలుపెట్టాడు. శీను సెయింట్ ఏన్స్ ఇంగ్లీషు మీడియం కాన్వెంట్లో ఏడవ తరగతి చదువు తున్నాడు. చెల్లి శారద, తెలుగు మీడియం గవర్నమెంటు స్కూల్లో అయిదవ తరగతి చదువుతోంది. ఆడపిల్లకి ఇంగ్లీషు చదువెందుకని శీను తండ్రి ఉద్దేశ్యం. తండ్రి భయంతో శీను శ్రద్ధగా, బాగా చదువుతాడు. వాడు రోజూ పొద్దున్నే లేచి చదువుకుంటాడు. అలా చేస్తే చదువు బాగా ఒంటపడు తుందని వాళ్ళ నాన్న చెప్పాడు.

తల్లి అన్నపూర్ణ, తండ్రి రామ్మూర్తి. పిల్లల చదువు విషయంలో చాలా మూర్ఖంగా ఉంటాడు రామ్మూర్తి. పిల్లలకు చదువు తప్ప, ఆటలూ, పాటలూ వగైరా పనులు చేయడం శుద్ధ దండగ అని అతని అభిప్రాయం. పిల్లలకి తండ్రి అంటే భయం. ఇంక అన్నపూర్ణ భర్త చెప్పినట్టుగా మెలిగే ఇల్లాలు.

శారద ముక్కుతూ, "అన్నయ్యా, నాకు ఇంకా నిద్ర వస్తోందిరా! నేను పడుకుంటాను," అంది.

"లేవ్వే! నాన్నకి నువ్వు పొద్దున్నే లేచి చదవడం లేదు అని తెలిసిందంటే, ఇంకేమైనా ఉందా?" అన్నాడు శీను.

కళ్ళు నులుముకుంటూ నెమ్మదిగా లేచింది శారద. పిల్లలకీ, రామ్మూర్తికీ పొద్దున్నే భోజనం, మధ్యాహ్నానికి కేరేజీ రెడీ చెయ్యాలి అన్నపూర్ణ. తనే ఇంటెడు చాకిరీ చేసుకుంటుంది. వంట పూర్తిచేసి, పిల్లలకి అన్నాలు పెట్టి, కేరేజీలు సర్దింది అన్నపూర్ణ. శీనూ, శారదా తల్లికి టాటా చెప్పి స్కూలుకు వెళ్ళారు.

రామ్మూర్తి మంచం మీద నుంచి లేస్తూనే, "ఒసేవ్, ఎక్కడున్నావూ? నా బెడ్‌కాఫీ ఏదీ?" అని గట్టిగా అరిచాడు.

"వస్తున్నానండీ," అని మాసిన బట్టలని సర్ఫులో నానపెడుతున్నది కాస్తా ఆపి, పరుగున వంటింట్లోకి వెళ్ళింది అన్నపూర్ణ. 'అయ్యో, నా మతిమండ! నాకు రోజు రోజుకీ మతిమరుపు ఎక్కువవుతోంది. లేకపోతే రోజూ ఇచ్చే బెడ్‌కాఫీ ఇలా లేటు చేస్తానా!' అనుకుంది అన్నపూర్ణ. రాత్రి తీసిన డికాషనుతో కాఫీ చేసి తీసుకు వెళ్ళింది.

రోజూకన్నా బెడ్‌కాఫీ లేటుగా తెచ్చినందుకు కోపంగా చూస్తూ, "ఏమిటే ఇంతాలస్యం? రోజూ చేసే పనులు కొత్తగా చెప్పాలా? అయినా, ఏం చేస్తున్నావు? ఆ పక్కింటి వాళ్ళతో కబుర్లు చెప్తున్నావా?" అడిగాడు విసుగ్గా రామ్మూర్తి.

"అవునురా. మీ నాన్న ఎప్పుడూ అంతేరా! అందుకే మీ నాన్న ఇంట్లో ఉంటే, మీ ఇంటికి రావాలంటే నాకు చాలా భయం. మా నాన్న అయితే అస్సలు ఏమీ అనడు రా!"

"లేదండీ! వేరే పనుల్లో పడి మరిచాను," అంది అన్నపూర్ణ కొంచెం భయంగా.

"పిల్లలు స్కూలుకు వెళ్ళారా?" అడిగాడు రామ్మూర్తి.

"ఆ, వెళ్ళారండీ," చెప్పింది అన్నపూర్ణ.

"వాడు రోజూ పొద్దున్నే లేచి చదువుతున్నాడా? మొదటిసారి పబ్లిక్ పరీక్షలు రాస్తాడు ఈ సంవత్సరం. వాడిని లేపి గట్టిగా చదివించు. ఆ పిచ్చి ఆటలు మాని, ఇంటి పట్టునుండి చదవమను," అన్నాడు రామ్మూర్తి.

"ఆ, రోజూ పొద్దున్నే లేచి చదువుకుంటున్నాడండీ! శారద కూడా పొద్దున్నే లేస్తోంది," అని సమాధానం ఇచ్చింది అన్నపూర్ణ.

✤

స్కూల్లో శీను స్నేహితుడు రవి, శీను దగ్గరికి వచ్చాడు.

"రేపు ఆదివారం 'బీ' కాలనీ వాళ్ళ టీముకీ, మన కాలనీ టీముకి క్రికెట్ మేచ్ ఉందిరా!" అన్నాడు ఉత్సాహంగా రవి.

"అవునా! ఎక్కడ్రా మేచ్ జరిగేది?"

"మన కాలనీ గ్రౌండ్లోరా."

"ఎవరెవరు ఆడుతున్నార్రా మన టీమ్‌లో?"

"నువ్వూ, నేనూ, శేషూ, అరవిందూ, గోపీ," అని పేర్లు చెప్పు కుంటూ పోయాడు రవి.

"ఒరేయ్, నేను ఆరోజు ఆడటానికి రాలేనురా. ఆరోజు మా నాన్న ఇంట్లోనే ఉంటాడు. ఆడాను అని తెలిస్తే ఇంకేమైనా ఉందా! బాగా కొడతాడు," అన్నాడు శీను ఆడలేనన్న విచారంతో.

"ఏమీకాదురా! మీ అమ్మకి చెప్పి మీ నాన్నని ఎలాగైనా ఒప్పించమనరా! నువ్వు లేకపోతే మన టీమ్‌లో బాగా బాటింగ్ చేసే వాళ్ళు ఎవర్రా? అసలే మనం కిందటిసారి ఓడి, వాళ్ళకి బాలు కొనిచ్చాం అందరం డబ్బులు వేసుకొని. ఈసారి మనం ఎలాగైనా గెలవాలిరా శీనూ!" అన్నాడు పంతంగా రవి.

"అలాగే, చూద్దాంరా! మా అమ్మని అడిగి చూస్తాను. కానీ నేను రాకపోతే, ఆడడానికి వేరే ఎవరినైనా చూసుకోండిరా! నీకు తెలుసు కదరా నాకు క్రికెట్ అంటే ఎంత ప్రాణమో! కానీ మా నాన్నెప్పుడూ ఏ ఆటా ఆడద్దంటాడు. టీవీలో క్రికెట్ వస్తూ ఉంటే కూడా చూడనివ్వడు. ఎప్పుడూ చదువుకోమంటాడు. ఆటలు అన్నంపెట్టవు, బాగా చదువుకుంటేనే పెద్ద ఉద్యోగం వచ్చి డబ్బులు ఉండేదీ అంటాడు. నేను బాగానే చదువు తాను. అయినా, అంతేరా మా నాన్న!" అన్నాడు శీను.

"అవునురా. మీ నాన్న ఎప్పుడూ అంతేరా! అందుకే మీ నాన్న ఇంట్లో ఉంటే, మీ ఇంటికి రావాలంటే నాకు చాలా భయం. మా నాన్న అయితే అస్సలు ఏమీ అనడు రా!" అన్నాడు రవి.

పిల్లాడు ఎంత బాగా చదివినా రామ్మూర్తికి సంతృప్తిగా ఉండదు. పిల్లల కోరికలనీ, మనస్తత్వాలనీ అర్థం చేసుకోవడం ఆ తండ్రికి తెలియదు. రెండు నెలల క్రితం శీను సాయంత్రం ఆడుకోడానికి వెళ్ళి వచ్చాడని తెలిసి, బాగా తిట్టి, కొట్టినంత పనిచేశాడు.

ఆదివారం రానే వచ్చింది. ఉదయాన్నే లేచి, బుద్ధిగా హోమ్‌వర్క్ త్వరగా పూర్తిచేసి, తల్లి చెప్పిన ఇంటి పనులన్నీ చేశాడు శీను. హోమ్ వర్క్‌లన్నీ పూర్తి చేసుకుంటే తల్లి ఎలాగైనా ఒప్పుకొని ఆడుకోవడానికి వెళ్ళమంటుంది అని శీనుకి ఏమూలో ఒక ఆశ. ప్రతీ ఆదివారం లాగే మధ్యాహ్నం భోజనం చేశాక, రామ్మూర్తి బెడ్రూమ్‌లో పడుకున్నాడు. అన్నపూర్ణ హాల్లో పడుకుంది. ముందు గదిలో శారద కూర్చుని డ్రాయింగ్ వేసుకుంటోంది.

శీను మనసంతా సాయంత్రం జరగబోయే క్రికెట్ మేచ్ మీదే ఉంది. తను మేచ్‌లో బాగా బాటింగ్ చేసి ఎక్కువ పరుగులు చేసినట్టుగా ఊహించుకుని ఆనందపడుతున్నాడు. తల్లి ఆడుకోవడానికి వెళ్ళనిస్తుందో, లేదో అని పర్రీ అవుతున్నాడు.

కొద్దిసేపటికి అన్నపూర్ణ లేచింది. అప్పటిదాకా తల్లికోసం ఎదురు చూస్తున్న శీను, తల్లి దగ్గరికి వెళ్ళి నెమ్మదిగా, "అమ్మా, ఇవాళ మన కాలనీ వాళ్ళకీ, 'బీ' కాలనీ వాళ్ళకి క్రికెట్ మేచ్ ఉందమ్మా! నేను కూడా మన కాలనీ టీమ్‌లో ఉన్నాను. ఆడుకోవడానికి వెళ్తానమ్మా! నా ఫ్రెండ్స్ ఇందాక మన ఇంటికి వచ్చి రమ్మన్నారు. కానీ నువ్వు లేచాక అడిగి వస్తాను అని చెప్పాను వాళ్ళతో. వాళ్ళంతా ఇందాకే గ్రౌండ్‌కి వెళ్ళిపోయారు. కొద్దిసేపట్లో ఆట మొదలయిపోతుంది. నన్ను వెళ్ళనియ్యవూ?" బతిమాలాడు శీను.

"నాన్నకి తెలిస్తే తిడతార్రా! నాన్న గురించి నీకు తెలుసుగా! అయినా వెళ్తానంటున్నావా?" అడిగింది భయంగా అన్నపూర్ణ.

"హోమ్‌వర్క్‌లన్నీ పొద్దున్నే చేసుకున్నానమ్మా! మన ఇంటికి దగ్గరగా ఉన్న గ్రౌండ్‌లోనే జరుగుతోంది మేచ్. మళ్ళీ ఎప్పుడూ ఆడతాను అని అడగనమ్మా! నువ్వే నాన్నకి చెప్పమ్మా! ఆట అయిన వెంటనే త్వరగా వచ్చేస్తానమ్మా!" అంటూ అర్థించాడు శీను.

వాడి జాలిమొహం చూసిన అన్నపూర్ణ వెళ్ళొద్దని అనలేకపోయింది.

"సరే వెళ్ళు! కానీ త్వరగా వచ్చేయి చీకటి పడేలోపు," అంది.

తల్లి ఒప్పుకోవడమే ఆలస్యం, పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయాడు శీను. స్పీడుగా పరిగెత్తడం మూలాన ఆయాసపడుతూ ఉన్నా, ఎక్కడ నెమ్మదిగా వెళ్తే ఆట మొదలుపెట్టేస్తారో అనే భయంతో, రొప్పుతూ పరిగెత్తాడు శీను. దూరంగా శీను పరిగెత్తుకుంటూ రావడం చూసి, వాడి ఫ్రెండ్స్ ఆనందం పట్టలేకపోయారు.

"ఒరేయ్ మన శీనుగాడు వచ్చేస్తున్నాడ్రోయ్!" అని అరిచారంతా.

ఇంటి దగ్గర మొదలుపెట్టిన పరుగు గ్రౌండులోకి వచ్చాక ఆపాడు శీను. రొప్పుతూ తన జట్టు సభ్యుల దగ్గరికి నడిచాడు.

"నువ్వు రాకపోతే మన అరవిందుగాడి తమ్ముడు చింటూని ఆడిద్దామనుకున్నాంరా!" అన్నాడు రవి.

"అమ్మయ్య! నువ్వు వచ్చావు! మనందరం ఈసారైనా తప్పక వాళ్ళని ఓడించాల్రా!" అన్నాడు జట్టు కెప్టెన్ సతీష్.

అందరూ సంతోషంగా ఆట మొదలుపెట్టారు.

✤

నిద్ర లేచిన రామ్మూర్తి టిఫిన్ తిని, "బజారుకి వెళ్ళాల్సిన పనేమైనా ఉందా?" అని అడిగాడు భార్యని.

"ఆ, శీను హోంవర్కు చేసుకోవడానికి డబుల్‌రూళ్ళ నోట్‌బుక్సు కావాలని అడిగాడండీ! అలాగే, ఇంకా కొన్ని కూరలూ, సరుకులూ కూడా కావాలి ఇంటికి," అంది అన్నపూర్ణ.

"స్కూళ్ళు తెరిచి రెండు నెల్లయినా కాలేదు. స్కూలు తెరిచే ముందేకదా అన్ని నోట్‌బుక్కులూ కొన్నాను! పుస్తకాల్లో రాస్తున్నాడో, లేక చింపి ఆటలాడుతున్నాడో! అయినా ఏడీ వాడు? ఎక్కడా కనబడ్డేం?" అడిగాడు రామ్మూర్తి.

"వాడు ఇప్పుడే పక్కింటి మధు దగ్గర ఏదో బుక్కు తెచ్చుకోవ డానికి వెళ్ళాడండీ," కొంచెం తడబడుతూ అంది.

"వీడికి కాళ్ళూ చేతులూ నిలవ్వు. బుద్ధిగా చదువు కోరా అంటే ఆ వంకా, ఈ వంకా చెప్పి బయటికిపోయి ఆడుతున్నాడేమో!" అన్నాడు అనుమానంగా రామ్మూర్తి.

అప్పుడే, "ఆంటీ! శీను ఉన్నాడా?" అంటూ పక్కింటి మధూ వచ్చాడు.

"మావాడు మీ ఇంటికి రాలేదా?" ఆశ్చర్యంగా అడిగాడు రామ్మూర్తి.

"లేదంకుల్," బెరుగ్గా అన్నాడు మధు.

"ఏమేవ్ వాడేడీ? పక్కింటికి వెళ్ళాడన్నావు? చెప్పు! నిజంగా ఎక్కడికి వెళ్ళాడు?" మండిపడ్డాడు రామ్మూర్తి.

అంకుల్ అలా అరవడం చూసిన మధూ నెమ్మదిగా అక్కడి నుంచి జారుకున్నాడు.

"అటునుంచి కొద్దిసేపు ఆడుకోవడానికి వెళ్తానన్నా డండీ," చెప్పింది భయంగా అన్నపూర్ణ.

"మరా ముక్క ముందే ఎందుకు చెప్పేడవలేదూ? ఇద్దరికిద్దరూ తోడుదొంగలు. అయినా, అసలు వాడిని ఇలా పాడు చేస్తున్నందుకు నిన్ను తన్నాలి," అన్నాడు కోపంగా రామ్మూర్తి.

అన్నపూర్ణ మాట్లాడలేదు.

"వాణ్ణిరానీ చెప్తాను! బజారుకి వెళ్తున్నాను. వీధి తలుపులేసుకుని ఏడు," అంటూ విసురుగా వెళ్ళిపోయాడు రామ్మూర్తి.

✤

శీను జట్టు సభ్యులు చాలా ఆనందంగా ఉన్నారు. వాళ్ళు కొట్టిన నూటయాభై పరుగులకు జవాబుగా ప్రత్యర్థి జట్టు డెబ్భై పరుగులకే అందరూ అవుటయ్యారు. ఊకుమ్మడిగా ఒకర్నొకరు పట్టుకుని అభినందించు కున్నారు. ఇంతలో తల్లికిచ్చిన మాట గుర్తుకు వచ్చి, "ఇక నేను వెళ్ళాల్రా! మా అమ్మకి ఆట అయిన వెంటనే వస్తానని చెప్పాను. మా నాన్నకి నేను ఆడుకోవడానికి వచ్చానని తెలీదురా!" అన్నాడు శీను ఫ్రెండ్సుతో.

"అవున్రా బాబూ! మీ నాన్నకి తెలిస్తే చంపేస్తాడు. నువ్వు త్వరగా పోరా!" అన్నారు ఫ్రెండ్సంతా.

"రేపు అందర్నీ స్కూల్లో కలుస్తానురా!" అని చెప్పి, చేతులు గాలిలోకి తిప్పుతూ, నెగ్గిన సంతోషంతో ఇంటివైపు పరిగెత్తాడు శీను.

ఇంట్లోకి రాగానే శారద జాలిగా చూసింది శీను వైపు. శీను తల్లి దగ్గరకెళ్ళి, "మేం నెగ్గామమ్మా! నేను బాగా బేటింగ్ చేశాను కూడా!" అని మురిసిపోతూ చెప్పాడు.

"ఒరేయ్ అన్నా! నాన్న ఇందాక నీ గురించి అడిగార్రా. నువ్వు క్రికెట్ ఆడుకోడానికి వెళ్ళినట్టు తెలిసిపోయింది నాన్నకి," అంది శారద.

అప్పటిదాకా సంతోషంగా ఉన్న శీను బిక్కమొహం వేశాడు.

"అమ్మా! నాన్న నా గురించి ఏమన్నారు? బాగా తిట్టారా? కొడతా రేమో! భయంగా ఉందమ్మా."

జాలిగా చూసింది అన్నపూర్ణ.

"నువ్వు చెప్పినట్టు ఆట అయిపోయిన వెంటనే వచ్చేశాను కదమ్మా!" బెంగగా, బెరుకుగా అన్నాడు.

"నువ్వు స్నానం చేసి వెళ్ళి చదువుకో. నాన్న బజారు నుంచి వస్తారు," అంది అన్నపూర్ణ.

"అలాగేనమ్మా!" అంటూ, చదువుకుంటూ కన పడితే తిట్టరేమోననే ఆశతో లోపలికి వెళ్ళాడు శీను.

స్నానం చేసి, పుస్తకాలు ముందేసుకుని చదవాలని కూర్చున్న శీనుకి, ఒకపక్క ఆటలో తను బాగా బేటింగ్ చేసిన తీరు గుర్తుకు వచ్చి సంతోషం కలిగినా, మరోపక్క వాళ్ళ నాన్న తిడతాడేమో అనే భయం కూడా కలిగింది. ఇంతలో రామ్మూర్తి బజారు నుంచి ఇంటికి వచ్చాడు. అన్నపూర్ణ రామ్మూర్తి చేతిలోని సంచీ తీసుకుంది.

స్నానం చేసి, పుస్తకాలు ముందేసుకుని చదవాలని కూర్చున్న శీనుకి, ఒకపక్క ఆటలో తను బాగా బేటింగ్ చేసిన తీరు గుర్తుకు వచ్చి సంతోషం కలిగినా, మరోపక్క వాళ్ళ నాన్న తిడతాడేమో అనే భయం కూడా కలిగింది.

"ఏమే, వాడు ఇంటికి తగలడ్డాడా?" అడిగాడు రామ్మూర్తి.

"ఆ, వచ్చాడండీ! చాలాసేపైంది వచ్చి. లోపల గదిలో చదువు కుంటున్నాడు," నెమ్మదిగా అంది అన్నపూర్ణ.

"చాల్లే! వాడి చదువూ, నా చదువూ ఒక్కలాగే ఉంది," అన్నాడు రామ్మూర్తి చిరాగ్గా.

"భోజనాలు పెట్టమంటారా?" అడిగింది అన్నపూర్ణ.

"కాసేపుండు. టీవీలో ఏడున్నర న్యూసు అయ్యాక తిందాంలే!" అన్నాడు రామ్మూర్తి.

శారద బిక్కుబిక్కుమంటూ ఒకమూల కూర్చుని చదువుకుం టోంది. శీను పుస్తకం ముందేసుకుని ఆలోచిస్తున్నాడు, 'ఇప్పుడు నాన్న ఏమంటాడ్రా భగవంతుడా!' అని. వాడికి గుండెలో దడ మొదలయ్యింది. క్రికెట్ బాగా ఆడాననే సంతోషం అంతా ఎగిరిపోయింది. టీవీ న్యూసు అయిపోయింది.

"భోజనాలు వడ్డించు," అన్నాడు రామ్మూర్తి.

ఎప్పటిలాగా హాల్లో మూడు కంచాలు పెట్టి, గిన్నెలూ, గ్లాసులూ కావాల్సిన వస్తువులన్నీ తెచ్చిపెట్టి, "శారదా, శీనూ! భోజనాలకి రండి!" పిలిచింది అన్నపూర్ణ.

"అందులోంచి వాడి కంచం తీసేయ్!" అన్నాడు రామ్మూర్తి పీట మీద కూర్చుంటూ.

కోపంగా ఉన్న భర్తతో ఏమీ చెప్పలేక, భర్త వంక బాధగా చూసింది అన్నపూర్ణ. భారంగా వడ్డన పూర్తిచేసి వంటింట్లోకి వెళ్ళి ఏడ్చింది. 'వాడి తప్పేమీలేదండీ!' అని ఒక్కసారన్నా చెప్పాలనిపించింది అన్నపూర్ణకి.

రామ్మూర్తీ, శారదా కంచాల ముందు కూర్చున్నారు. శీను దూరంగా నుంచుని బాధగా చూస్తున్నాడు. వాడికి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఏడుపుని దిగమింగుకున్నాడు.

"ఇక్కడ గుడ్లప్పగించి చూస్తున్నావేం? పోయి చదువుకో! ఫో, వెధవా! ఆటలు వద్దూ, చదువుకోకపోతే అడుక్కుతినాల్సి వస్తుంది అని చెప్తే వినడం లేదు!" గట్టిగా అరిచాడు రామ్మూర్తి.

తనే తప్పు చేయకపోయినా, పడిన శిక్షకి ఏడుస్తూ, గదిలోకి వెళ్ళి పోయాడు శీను.

పుస్తకం ముందు కూర్చున్నాడన్నమాటేగానీ, చదువు మీద శ్రద్ధ పెట్టలేకపోయాడు. ఏడుపుని బలవంతం మీద ఆపుకున్నాడు కానీ, మౌనంగా కన్నీళ్ళు కారుస్తూ ఉన్నాడు.

'నాక్కూడా నా ఫ్రెండ్స్ నాన్నల్లాంటి నాన్న ఉంటే ఎంత బాగుండునో కదా!' మనస్సులో అనుకున్నాడు శీను.

రామ్మూర్తి ఏమీ పట్టనట్టుగా భోజనం చెయ్యడం అయ్యాక హాల్లో కుర్చీలో కూర్చుని టీవీ చూస్తున్నాడు.

కంచం ముందు కూర్చుందన్నమాటే గానీ, అన్నపూర్ణ మాతృ హృదయం తల్లడిల్లిపోయింది. భర్తకి చెప్పే ధైర్యం లేక తన బాధని దిగమింగుకుంది. కొంచెం కూడా తినలేకపోయింది. కంచంలోనే చేతులు కడుక్కుని గిన్నెలు వంటింట్లో సర్దసాగింది.

కొంచెంసేపు పోయాక రామ్మూర్తి టీవీ ఆర్పి శీను దగ్గరికి వచ్చాడు. శీను మొహం చూస్తూనే ఎక్కడలేని కోపం వచ్చింది.



"ఎవరెవరు ఆడారా నీతో ఇవాళ?" అడిగాడు రామ్మూర్తి.

"సతీష్, రవి, అరవింద్, గోపి," అని పేర్లు చెప్పాడు భయంగా శీను.

"ఆ సారధిగారి అబ్బాయి, ఎవడు వాడు? వాడు ఆడలేదా?" అడిగాడు రామ్మూర్తి.

"లేదు, వాడు ఆడలేదు," అన్నాడు శీను.

"వాడ్ని చూసి బుద్ధి తెచ్చుకో! సిగ్గులేదు నీకు, చదువుకోరా అంటే" అని పళ్ళు కొరుకుతూ శీను చెంప మీద కొట్టాడు రామ్మూర్తి.

"అమ్మా!" అని గట్టిగా ఏడవడం మొదలుపెట్టాడు శీను.

వంటింట్లో పనులు చేసుకుంటున్న అన్నపూర్ణ ఆ అరుపు విని, ఏమీ చెయ్యలేని నిస్సహాయ స్థితిలో కంటనీరు కార్చింది. రామ్మూర్తి ఆవేశంతో ఊగిపోయాడు. ఏడుస్తున్న శీను చేతులు పట్టుకుని లాక్కుంటూ తీసుకెళ్ళి, ఇంటి ముందు ఉన్న వీధి అరుగు మీద నించోమని చెప్పి వీధి తలుపు వేసేశాడు.

"రాత్రంతా అక్కడే ఉండు వెధవా!" అని అరచి, "ఏమేవ్! వాడ్ని రాత్రి ఇంట్లోకి రానివ్వకు," అని అన్నపూర్ణకి చెప్పి పడుకోడానికి వెళ్ళాడు.

భర్త మాటకి ఎదురుచెప్పే ధైర్యం లేక, మనస్సులో బాధపడుతూ, కుమిలిపోతోంది అన్నపూర్ణ.

వీధిలో చీకటిగా ఉంది. శీనుకి బాగా భయం వేసింది. అలా రెండు గంటలసేపు నించున్నాడు. కాళ్ళు లాగేస్తున్నాయి. ఆకలి బాధ చంపేస్తోంది. నిద్ర ముంచుకు వస్తోంది. 'ఎంత తప్పు చేశాను భగవంతుడా, ఆడుకో వడానికి వెళ్ళి!' అని బాధపడ్డాడు.

కొంచెంసేపయ్యాక, వాళ్ళమ్మ వచ్చి శీనుని లోపలికి తీసుకెళ్ళింది.

"నాన్న పడుకున్నారు. వెళ్ళి కాళ్ళూ, చేతులు కడుక్కో. అన్నం పెడ్తాను," అంది అన్నపూర్ణ శీనుతో.

తల్లిని గట్టిగా పట్టుకున్నాడు భయంతో శీను. తన చేత్తో శీనుకి అన్నం కలిపిపెట్టింది తల్లి. అన్నం తిన్నాక శీనుతో, "పోయి పడుకో! పొద్దున్నే స్కూలుకెళ్ళాలి. ఇప్పటికే చాలా లేటయింది," అంది అన్నపూర్ణ.

శీను వెళ్ళి పడుకున్నాడు. ఆ తరువాత శీను ఎప్పుడు ఆటలాడినా తండ్రికి తెలియకుండా శీను, వాడి తల్లి చాలా జాగ్రత్త పడేవారు.

✤

శీను ఇంటర్మీడియెట్‌కి వచ్చాడు. వాడితో పాటే చిన్నప్పట్నించీ చదువుకున్న సతీష్ కూడా వాడు చదివే కాలేజీలోనే చేరాడు. ఒకరోజు సతీష్, శీను వాళ్ళ కాలేజీ నోటీసు బోర్డులో ఇంటర్ కాలేజ్ క్రికెట్ టోర్నమెంటుకి టీమ్‌ని సెలక్ట్ చేస్తున్నారనీ, ఉత్సాహం ఉన్న స్టూడెంట్స్ వాళ్ళ పేర్లు ఇవ్వాలనీ ఉన్న నోటీస్ చూశారు.

"ఒరేయ్ శీనూ! మన పేర్లు ఇద్దాంరా!" అన్నాడు సతీష్.

"ఎందుకొచ్చిన గోలరా! మా నాన్న సంగతి నీకు తెలియని దేముంది? తనకి తెలిస్తే పెద్ద గొడవ చేస్తాడ్రా!' ' అన్నాడు శీను.

"ఏమీ కాదురా! నువ్వు కూడా పేరిస్తే బాగుంటుందిరా! నేను ఇద్దా మనుకుంటున్నాను. నీలా బాగా ఆడేవాడు టీమ్‌లో ఉంటే, మన కాలేజీకి తప్పక కప్పు వస్తుందిరా!" ఒప్పించడానికి ప్రయత్నించాడు సతీష్.

"వద్దురా! నాకు ఇష్టంలేదు. మా నాన్న పెట్టే బాధలకన్నా, నాకు ఇష్టమైన క్రికెట్ ఆటని వదులుకోవడం మంచిదిరా! ఈ విషయం గురించి నన్నింక బలవంతం చేయకురా!" అని తరువాత జరిగే క్లాసుకి వెళ్ళిపోయాడు శీను.

"వద్దురా! నాకు ఇష్టంలేదు. మా నాన్న పెట్టే బాధలకన్నా, నాకు ఇష్టమైన క్రికెట్ ఆటని వదులుకోవడం మంచిదిరా! ఈ విషయం గురించి నన్నింక బలవంతం చేయకురా!" అని తరువాత జరిగే క్లాసుకి వెళ్ళిపోయాడు శీను.

సతీష్ కాలేజి ఆఫీసుకి వెళ్ళి తన పేరు ఇచ్చాడు క్రికెట్ టీమ్ సెలక్షన్‌కి. చివరి నిముషంలో ధైర్యం చేసి, తిడితే తిట్టాడులే అని శీను పేరు కూడా ఇచ్చాడు. కానీ ఆ విషయం శీనుకి చెప్పలేదు.

ఆరోజు కాలేజీలో క్రికెట్ టీమ్ సెలక్షన్ జరుగుతోంది. లిస్టులో ఉన్న స్టూడెంట్సుని నాలుగు గ్రూపులుగా విడదీసి, ప్రతి గ్రూపుచేతా పది ఓవర్లు ఆడించి, వారిలో బాగా ఆడిన వాళ్ళతో ఫైనల్‌గా ఆడే టీమ్‌ని సెలక్ట్ చేస్తారు. సతీష్ ఆడుతున్నాడు కదా అని చూడ్డానికి శీను కూడా వెళ్ళాడు. అక్కడ తన పేరు కూడా చదవడం విని, చాలా ఆశ్చర్యంగా సతీష్‌వైపు చూశాడు శీను. 'నేనే నీ పేరు ఇచ్చాను,' అన్నట్టు చూశాడు సతీష్. తప్పేది లేక శీను కూడా సెలక్షన్‌లో పాల్గొన్నాడు. శీను, సతీష్ ఇద్దరూ కాలేజీ తరపున ఆడే జట్టుకి సెలక్ట్ అయ్యారు. ఏ విషయమైనా తన తల్లికి చెప్పకుండా ఉండని శీను, ఎప్పటిలాగే ఆరోజు కూడా ఇంటికి వచ్చాక కాలేజీలో జరిగిన విషయాల గురించి వివరంగా తల్లికి చెప్పాడు. వేరే కాలేజీలతో ఆడాలనీ, నెగ్గితే ఫైనల్సు ఆడాల్సి ఉంటుందనీ, ఈ విషయంలో తనే నాన్నకి ఏదో విధంగా సర్ది చెప్పాలని అన్నాడు.

'సరే, నేను అలాగే చెప్తాను," అని భయంగానే ఒప్పుకుంది అన్నపూర్ణ.

కాలేజీలతో జరిగిన లీగ్ మేచ్‌లలో ఆడారు శీను, సతీష్ వారి కాలేజీ జట్టు సభ్యులతో. అన్ని మేచ్‌లలో నెగ్గిన శీను కాలేజీ జట్టు ఫైనల్సుకి చేరింది. ఎక్కడో ఒక మూల శీనుకి ఎక్కడ తండ్రికి తెలుస్తుందో అనే బెంగ ఉంది. అయినా కోరికని చంపుకోలేక, ఒక రకమైన మొండిధైర్యం.

"ఒరేయ్ సతీష్! మా నాన్నకి నేను క్రికెట్ ఆడే విషయం తెలిసి పోతుందేమో అని భయంగా ఉందిరా!" అన్నాడు శీను.

"ఏమీ కాదులేరా. ఎవరు చెప్తారు మీ నాన్నకి నువ్వు ఆడుతున్నట్టు. అయినా ఈ విషయం మీ అమ్మకి తప్ప ఎవరికీ తెలీదు కదరా!" అన్నాడు సతీష్.

"అవుననుకో, కానీ ఎక్కడో కొంచెం భయంగా ఉంది!" అన్నాడు శీను.

ఆ ఫైనల్ మేచ్ ఆడే రోజు రానే వచ్చింది. పొద్దున్నే లేచి, తన పనులన్నీ చేసుకుని, తల్లి పెట్టిన టిఫిను తిని, మధ్యాహ్న భోజనానికి బాక్సు పట్టుకుని ముందు గదిలోకి వచ్చాడు శీను.

రామ్మూర్తి ముందు గదిలో ఉన్న పడక్కుర్చీలో కూర్చుని న్యూస్ పేపరు చదువుకుంటున్నాడు.

చేతిలో పుస్తకాలతో హడావుడిగా చెప్పులు వేసుకొని వెళ్తున్న శీనుని చూసి, రామ్మూర్తి, "ఎక్కడికిరా ఇంత పొద్దున్నే శలవురోజున పుస్తకాలు పట్టుకుని?" అడిగాడు.

"కోర్సులు త్వరగా పూర్తి చెయ్యడం కోసం మా బోటనీ లెక్చరరు స్పెషల్ క్లాసులు తీసుకుంటున్నారు నాన్నగారూ," చెప్పాడు శీను వినయంగా.

"ఎప్పటి వరకూ?" అడిగాడు అనుమానంగా రామ్మూర్తి.

"మధ్యాహ్నం వరకూ నాన్నగారూ! ఆ తర్వాత మా ఫ్రెండ్ దగ్గరికి వెళ్ళి, నాక్కావల్సిన బుక్సు తీసుకుని రావాలి."

"సరే, త్వరగా అన్ని పనులూ పూర్తి చేసుకుని ఇంటికి తగలడు. శలవురోజైనా ఇంటి పట్టున కూర్చుని శ్రద్ధగా చదువుకోవడం లేదు!" అన్నాడు రామ్మూర్తి.

'హమ్మయ్యా! గండం గడిచింది,' అనుకుంటూ, బిగపెట్టిన ఊపిరి తీసుకుంటూ, హుషారుగా అడుగులు వేశాడు శీను.

సతీష్ ఇంటికి వెళ్ళి, అక్కడ నుంచి ఇద్దరూ మేచ్ జరిగే గ్రౌండ్ చేరుకున్నారు. ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా, శీను వాళ్ళ కాలేజీ జట్టు ఫైనల్సులో నెగ్గి కప్పు అందుకుంది. శీను ఆనందంతో ఇంటికి చేరాడు. తల్లికీ, చెల్లికీ తన కాలేజీ జట్టు కప్పు గెలుచుకుందనీ, తను బాగా ఆడాననీ, బాగా ఆడినందుకు తనకి బహుమానం కూడా ఇచ్చారనీ, ప్రస్తుతం సతీష్ వాళ్ళ ఇంట్లో పెట్టానని, రేపు వీలు చూసుకుని తీసుకొస్తానని చెప్పాడు శీను.

"నాన్న నేను వెళ్ళాక ఏమైనా అన్నారా?" తల్లిని అడిగాడు శీను.

"నిజంగా ప్రైవేటుక్లాసుకే వెళ్ళాడా అని ఒకసారి అడిగారంతే! నేను అవునని చెప్పాను. అంతకన్నా ఏమీ అడగలేదు," చెప్పింది అన్నపూర్ణ.

శీను మనస్సు కుదుటపడింది.

మర్నాడుదయం రామ్మూర్తి సరుకులు తీసుకురావడానికి బజారుకి వెళ్ళాడు. అతనికి అక్కడ పక్కింటి కృష్ణారావు కలిశాడు. 'ఏమిటి విశేషాలు?' అని ఇద్దరూ కుశల ప్రశ్నలు వేసుకున్నారు. కృష్ణారావు రామ్మూర్తి పనిచేసే బ్యాంకులో ఉద్యోగి.

"మీ శీను వాళ్ళ కాలేజీకి క్రికెట్లో ఏదో కప్పు వచ్చింది. మీ అబ్బాయి కూడా ఆడాడని పేపర్లో వచ్చింది," అని చెప్పాడు కృష్ణారావు.

"మా అబ్బాయేమిటీ, క్రికెట్ ఆడటం ఏమిటీ? పొరబడుతున్నారు కృష్ణారావుగారూ! మా అబ్బాయి అసలు ఆటల జోలికే వెళ్ళడు. మీరు వేరే ఎవరో శీను పేరు చూసి మా అబ్బాయి అనుకుంటున్నారేమో!" అన్నాడు రామ్మూర్తి. పైకలా అన్నాడేగానీ, అతని బుర్రలో ఎన్నో ప్రశ్నలు. వీడే అయ్యుంటాడు! ఎంతకాలం నుంచి సాగుతోందో ఈ వ్యవహారం! వీడికి ఎన్నిసార్లు చెప్పినా బుద్ధి రావడం లేదు. ఈసారి గట్టిగా వ్యవహరించాలి! అయినా ఇన్ని విషయాలు జరుగుతూ ఉంటే అన్నపూర్ణకి తెలీకుండా ఉంటుందా? నాతో ఒక్క ముక్కైనా చెప్పలేదు. అవును, అమ్మా కొడుకూ తోడుదొంగలై నాకు చెప్పలేదేమో! ఇంటికెళ్ళాక వీళ్ళ పని పట్టాలి అని మనసులో అనుకున్నాడు.

"లేదు రామ్మూర్తిగారూ! మీ ఇంటి పేరుతో సహా మీ అబ్బాయి పేరు చాలా స్పష్టంగా రాశారు పేపర్లో. కావాలంటే మీరే చూడండి పేపరు!" అంటూ షాపు ముందు వేళ్ళాడుతున్న పేపరు తీసి, అందులో వచ్చిన న్యూస్ చూపించాడు కృష్ణారావు.

రామ్మూర్తి కళ్ళు ఆత్రంగా ఆ న్యూస్ చదివాయి. కృష్ణారావు చెప్పినట్టు, అదే పేరు. ఆవేశం, కోపం దిగమింగుకుని, కొంచెంసేపు మాట్లాడి, షాపతనికి మళ్ళీ వచ్చి సరుకులు తీసుకుంటాను, పాట్లాలు కట్టి పక్కన ఉంచమని చెప్పి, ఇంటికి వెళ్ళాడు.

"ఏమేవ్ ఎక్కడ చచ్చావూ!" అని గట్టిగా అరిచాడు రామ్మూర్తి.

పెరట్లో పనులు మధ్యలో ఆపి, "వస్తున్నానండీ!" అని వడివడిగా ఏం జరిగిందో అనే కంగారుతో వచ్చింది అన్నపూర్ణ.

"ఎంతకాలం నుంచీ సాగుతోందీ నాటకం?" అని మండిపడుతూ లెంపకాయ వేశాడు రామ్మూర్తి.

"ఏం నాటకమండీ?" అని చెంప రుద్దుకుంటూ, అవమానంతో నెమ్మదిగా అడిగింది అన్నపూర్ణ.

"అదే! నువ్వూ, నీ కొడుకూ సాగిస్తున్న నాటకాలు. వాడు నువ్వు వెనకేసుకుని రాబట్టే ఇలా తగలడ్డాడు. అసలు మిమ్మల్నిద్దర్నీ తన్ని తగలెయ్యాలి. కష్టపడి సంపాదిస్తుంటే విలువ లేకుండా పోతోంది. ఇంట్లో ఆడ పెత్తనాలు ఎక్కువయ్యాయి," అన్నాడు రామ్మూర్తి.

'శీను క్రికెట్ సంగతి తెలియలేదు కదా!' అనుకుంది భయంగా అన్నపూర్ణ.

"కాలేజీలో ఏదో క్రికెట్ పోటీల్లో పాల్గొన్నాడుట! కప్పు కూడా నెగ్గారుట. నాకెలా తెలిసిందని ఆశ్చర్యపోతున్నావా?" అని ఆవేశంతో ఊగిపోతూ గట్టిగా అరిచాడు రామ్మూర్తి.

పక్కగదిలో తల్లితండ్రుల సంభాషణ వింటున్న శీను గుండెలో రాయి పడింది.

'ఎలా తెలిసింది? సతీష్‌గానీ, మా కాలేజీలో వాళ్ళుగానీ ఎవరూ నాన్నకి చెప్పరే!' అని ఆశ్చర్యపోయాడు.

"మీ పిల్లాడి నిర్వాకం పేపరులో పడిందని మన పక్కింటి కృష్ణారావు చెప్పాడు. నేను కళ్ళారా చూశాను పేపర్లో," అన్నాడు రామ్మూర్తి.

మాట్లాడలేదు అన్నపూర్ణ.

"ఈ ఇంట్లో ఏం జరిగినా నాకు పల్లెత్తు మాటైనా చెప్పకుండా, యజమాని అనే గౌరవమైనా లేకుండా చేస్తున్నారు. నాకేమీ విలువ లేదు ఈ ఇంట్లో, కేవలం సంపాదించి తేవడం తప్ప. ఒరేయ్ శీను ఇలారా!" అరిచాడు రామ్మూర్తి.

"కాలేజీ మాని నువ్వు రోజూ చేస్తున్న నిర్వాకం ఇదా? ఆటలు తిండి పెట్టవని ఎన్నిసార్లు చెప్పానా? కొట్టాను కూడా. అయినా బుద్ధి రాలేదురా నీకు?" అరిచాడు.

"లేదు నాన్నగారూ! నేను రోజూ కాలేజీ మాని క్రికెట్ ఆడ్డంలేదు. మొన్నీమధ్య ఇంటర్ కాలేజీ ట్రోఫీలో మాత్రమే ఆడాను. అది కూడా కాలేజీలో క్లాసులు మానకుండా ఆడాను నాన్నగారూ!" చెప్పాడు భయంగా శీను.

"ఏం చేద్దామనుకుంటున్నావురా ఈ ఆటల్లో పడి? అయినా, నీకు ఆటల మీద మాత్రమే శ్రద్ధ ఉంటే, పోయి ఆటలే ఆడుకో. చదువెందుకు నీకు? శుద్ధ దండగ ఆ కాలేజీ ఫీజులూ, పుస్తకాలూ!" ఆవేశంగా కేకలు పెట్టాడు రామ్మూర్తి.

"నాకు చదువు మీద అశ్రద్ధ లేదు. మంచి మార్కులు కూడా వస్తున్నాయి. బాగా చదివి డాక్టరు అవాలని ఉంది," అన్నాడు శీను. ఎప్పుడూ లేని ధైర్యం ఎక్కడ నుంచి వచ్చిందో ఆరోజు వాడికి.

"నీ మాటల్ని ఏమాత్రం నమ్మను. ఇంక నీకు చదువు చెప్పించడం నావల్ల కాదు. ఇప్పుడే మీ కాలేజీ ప్రిన్సిపాల్ని కలిసి, నీ అడ్మిషను తీసెయ్యమని చెప్తాను," అని వీధి గదివైపు ఆవేశంగా నడిచాడు రామ్మూర్తి.

అప్పటివరకూ వాళ్ళ సంభాషణ విన్న అన్నపూర్ణకి చాలా బాధ కలిగింది.

"మేమందరం మీ మాట ఎన్నడూ జవదాటలేదు. భార్యగా మీరు చెప్పిన విధంగానే నడచుకుంటూ వస్తున్నాను. మీరు ఎంత చెప్తే అంతే! పిల్లలు చక్కగా చదువుతున్నారు. స్కూల్లో, కాలేజీలో మంచి మార్కులు తెచ్చుకుంటున్నారు. ఎంతసేపూ చదువూ, చదువూ అంటూ, పిల్లలకి ఆటలూ, పాటలూ వగైరా ఏమీ అక్కర్లేదు అనుకొంటే ఎలా? వాడి చదువు మానిపిస్తానంటే తల్లిగా నేనేమాత్రం సహించలేను. వాడి బతుకు నాశనం అవుతూ ఉన్నప్పుడు చూస్తూ ఊరుకుంటే తల్లిగా నేను బతికి ప్రయోజనం లేదు," అంది అన్నపూర్ణ ఖచ్చితంగా.

మున్నెన్నడూ తనతో అంత ధైర్యంగా మాట్లాడని భార్య మాటలకి రామ్మూర్తి నిర్ఘాంతపోయాడు. బయటికి వెళ్ళేవాడు కాస్తా అడుగు వెనక్కి వేసి, వీధి గదిలో ఉన్న వాలుకుర్చీలో చతికిలపడ్డాడు.

*

గృహాంతర జీవులు

డా॥ ఎన్.కె. సుధాకర్



అతడు నిద్ర లేవకుండానే ఆవిడ ఆఫీసు కెళ్ళిపోతుంది. అతడు లేచేటప్పటికి అతడి కూతురు హడావుడిగా తయారై కాలేజి కెళ్ళిపోతుంది. ఉన్నట్టుండి టైము చూసుకొని, తొమ్మిది దాటిపోవడం గమనించి, చదువు తున్న పేపరు పక్కన పడేసి, హడావుడిగా తయారైపోయి, తింటున్నదేం టిఫినో కూడా చూసుకోలేనంత తొందర తొందరగా హాట్‌పేక్ లోనిది తినేసి, అంతే హడావుడిగా ఫ్లాట్ తాళా లేసేసి ఆఫీసు డ్యూటీకెళ్ళిపోతా డతడు.

పల్లెటూళ్ళో తన వాళ్ళందరి కోసం ఆత్రంగా ఎదురుచూస్తోన్న ముసలి తల్లిలా ఫ్లాటు ముడుచుక్కూర్చొని రాత్రి దాకా ఒంటరిగా...

నా శ్రీమతి ఊరెళ్ళి రెండ్రోజులయింది.

చాలారోజుల్నించి రాయాలనుకొంటోన్న కథ తాలూకు ప్రారంభ వాక్యాల్ని యాదృచ్ఛి కంగా కాగితంమీద పెట్టానివ్వాళ. ఎప్పట్నుంచో నా అంతరాళాల్లో మెదులుతోన్న ఆ వాక్యాలకి ప్రేరణ మా ఎదుటి ఫ్లాట్ వాళ్ళని, నాలోని రచయిత నాక్కూడా తెలీనంతగా పరిశీలిస్తుం డడమే ననుకుంటా.

కాలింగ్‌బెల్ మ్రోగడంతో రాస్తోన్న వాక్యాల్ని ఆపేసి, లేచి తలుపు తీశాను.

ఎదురుగా ఇద్దరు పోలీసులు.

✤

"బి-సెవెన్ బార్‌టూ ఫ్లాటిదేనా?" అన్నాడు పెద్ద పోలీసు. బహుశా హెడ్డనుకుంటా. మా ఎదుటి ఫ్లాటది. తలుపు మీద నెంబరు కనిపించ డంలా? అన్నట్టు చిరాగ్గా చూశాను.

"అదేనండి. ఆ ఫ్లాట్ తాళాలేసి ఉంది. ఆ ఫ్లాట్‌లో వాళ్ళమ్మాయి హాస్పిటల్‌లో ఇంటెన్సివ్ కేర్‌లో ఉంది. కొంచెం మీరొచ్చి ఐడెంటిఫై చేస్తారని కుర్ర కానిస్టేబులు మొత్తం వివరించినట్టు చెప్పాడు. కంగారుగా లాల్చీ తొడుక్కొని ఫ్లాటు తాళం పెట్టి వాళ్ళతో బయల్దేరాను.

"సీరియస్సా!?"

"అవునండి!!"

"ఏక్సిడెంటా!?"

"కాదు. కత్తిపోట్లు."

ఠక్కున ఆగాను.

"అయినా ఫరవాలేదులెండి. ప్రాణానికేం ప్రమాదం లేదన్నారు." కుర్ర పోలీసు కొత్తగా వస్తోన్న పోలీసు వాక్యాన్ని అడ్డెకు తెచ్చుకొని మరీ చెప్పాడు.

చెపితే తప్ప డబ్భయి ఏళ్ళు దాటిన వాడ్నని తెలీనంత, చూడటానికి నలభై అయిదేళ్ళ వయసువాడిలా కనిపించే శరీర సౌష్ఠవం నాది. నేను రిటైర్ అయ్యానంటే అంత సులువుగా ఎవరూ నమ్మరు. మా పెద్దాడు అమెరికాలో ఉంటున్నాడు. ప్రవాసం వాడ్ని ప్రేమగా వాటేసుకుని మూడేళ్ళు దాటింది. రెండోవాడు లండనో, జర్మనీనో ఎగిరిపోయేందుకని ప్రస్తుతం ముంబైలో ఓ ప్రైవేటు కంపెనీలో పన్జేస్తూ రెక్కలు సవరించుకుంటున్నాడు.

నేనూ, ఆవిడ, నా రచనా వ్యాసంగాలూ - ఇదీ నా ప్రస్తుత ప్రపంచం.

నా రచనలు ఆంధ్రదేశాన్ని ఒకప్పుడు ఒక ఊపు ఊపాయి. ఇప్పటికీ సాహిత్యాభిమానులు నా ప్రసంగమన్నా అప్పుడప్పుడూ ప్రచురితమయ్యే నా కథలన్నా బోలెడంత ఇష్టంగా చదువుతుంటారు.

ఇంతకీ ఇంత వివరంగా నా గురించి ఎందుకు చెప్పాల్సి వస్తోందంటే వయసు దాచదగ్గ శరీరంతోనూ, వ్యక్తిత్వంతోనూ, సాహిత్యంతోనూ నేను మూడు తరాల్ని అతి దగ్గరగా పరిశీలించసాగాను. వాళ్ళలో వాడిగా కలిసి పోయాను. ఎప్పటికప్పుడు మార్పుల్ని అతి సున్నితంగా గమనించగలిగాను. ఇది కాకుండా మరో ముఖ్య కారణం, అనుకోకుండా ఈ కథలో ముఖ్య పాత్రనయ్యాను.

ఆలోచనల్లో ఉండగానే హాస్పిటల్ చేరుకున్నాం.

✤

గవర్నమెంట్ హాస్పిటల్.

ఇంటెన్సివ్ కేర్‌లో అపస్మారక స్థితిలో ఉందామ్మాయి. వాళ్ళ కుటుంబం మా ఎదుటి ఫ్లాట్‌లో కొచ్చిన రెణ్ణెళ్ళల్లోనూ ఓ పదిసార్లు చూసుం టానా అమ్మాయిని. అంతే. ఇరవై, ఇరవై రెండూ మధ్య వయసు. చిదిమి దీపం పెట్టుకోదగ్గ సౌందర్యమూ.

ఇంటెన్సివ్ కేర్‌లో అపస్మారక స్థితిలో ఉందామ్మాయి. వాళ్ళ కుటుంబం మా ఎదుటి ఫ్లాట్‌లో కొచ్చిన రెణ్ణెళ్ళల్లోనూ ఓ పదిసార్లు చూసుంటానా అమ్మాయిని. అంతే. ఇరవై, ఇరవై రెండూ మధ్య వయసు.

"పిల్ల పేరేంట్సార్?" హెడ్డడిగాడు.

"రుధిర," చెప్పాను. వాళ్ళింటో రుధీ అని పిలు స్తారు. అతడు నోట్ చేసుకున్నాడు.

వాళ్ళ తల్లిదండ్రులు?

ఊహూ తెలీదు. ఆయన పేరు డా॥ రావు. జాబే విటో తెలీదు. ఆవిడ కూడా ఉద్యోగస్థురాలే. ఎక్కడో తెలీదు. మొత్తంగా ఆ కుటుంబం విషయాలు నాకు తె...లీ...వు. హెడ్ కానిస్టేబుల్ ఆశ్చర్యపోలేదు. కానీ... నా మీద నాకే జాలిలాంటి భావన.

ఇంతలో అతడి సెల్ మోగింది. నెంబర్ చూడగానే అతడు అటెన్షన్‌లో కొచ్చాడు. అవతలెవరో నాకు వెంటనే అర్థమైంది.

"స్సార్! నమస్కారం సార్! ఫర్వాలేద్సార్! ప్రాణాని కేం కాద్సార్! బోయ్‌ఫ్రెండే సార్! ఇంటర్నెట్ పరిచయాలండి. ఇద్దరిదీ ఇదే సిటీ అని ఆర్నెళ్ళ తర్వాతత్తెల్సిందంటండి. తెల్వగానే కుర్రాడు ప్రపోజ్ చేసేడండి. పాపం! ఈ పిల్ల ఒప్పుకోలేదండి. కత్తిపోట్లండి. పొడిచి పారిపో యాడ్సార్! దొరికేస్తాడ్సార్ సాయంత్రానికల్లా... సారొచ్చేసేరండీ... నమ స్కారాలు చెప్పడ్సార్. నక్కలపాలెం ఫోర్ట్‌వంటీ అన్జెప్పండ్సార్. గుర్తట్టే స్తారండి. వచ్చాయా సార్! అదేంట్సార్! నేను కేజీన్నర చెప్పాన్సార్! ఆడు ఇంతకు ముందు కూడా అలానే చేసేడండి. కనీసం సైజయినా పెద్దగా ఉన్నాయాండీ... సార్. వచ్చేస్తున్నాయ్ సార్. కొర్రమీన్లూ, పీతలూ నైటుకండి. కాశీపతయ్యగారికి పీతలు మహా ఇష్టమండి. దర్శనం బాగా జరిగిందట్నా సార్! నేన్జూసుకొంటాన్సార్. పొద్దున్నే ఈ ఎదవకేసు తగిలిందండి. లేపోతే వొచ్చి దర్శనం చేసుకునేటోడ్నండి. తవరు చెప్పేయండ్సార్.

"స్సార్! సెటిల్ చేసేన్సార్! ఆ రేవ్ కేసోళ్ళు ఇద్దరూ విడివిడిగా తవర్ని కలుస్తానంటున్నార్సార్! వొద్దండొద్దు. మీర్రానవసరంలేద్సార్. చూయించే న్సార్ ఆడికి ఎయిడ్స్ లేదండి. కానీ ఈ రేపయిన పిల్లకుంటేనే నండి అసలుకథ," అంటూ నవ్వేడు. అది జోకో, సామాజిక స్పృహో అర్థం కాలేదు నాకు. విషయం రుధి దగ్గరికొచ్చింది మళ్ళీ.

"పిల్లకి సెల్ ఉందండి. వాళ్ళ డాడీకి చేసేనండి. వెంటనే కట్ అయిపోతోందండి. వాళ్ళ ఎదుటి ఫ్లాటాయన వొచ్చాడండి. డీటైల్స్ తెలీ వంటండి. మళ్ళీ ట్రై చేస్తాన్సార్. ఉంటాన్సార్. కాశీపతయ్యగార్నడిగేనన్జెం డ్సార్. నవస్కారం సార్!"

అతడు రెండు కేసుల గురించీ, రొయ్యలూ, పీతలూ అంటే పడి చచ్చిపోయే కాశీపతయ్యగారు, దైవదర్శనానికొచ్చి, దర్శనం కాగానే, ఆయన కోసం రెడీ చేయబడుతోన్న కేజీన్నర రొయ్యల వంటకాల గురించీ జమిలిగా మాట్లాడడం చూసి భలే తమాషాగా అనిపించింది నాకు. రిపోర్టు తయారు చేసి స్టేషన్‌కెళ్ళొస్తానని వెళ్ళిపోయాడు హెడ్డు. కొంచెం సంకో చిస్తూ, ఆలో చించి తప్పనిసరై సంతకం చేసాన్నేను. కూడా అతణ్ణనుసరిం చాడు కుర్ర కానిస్టేబులు. ఒంటరిగా నేను. లోపల రుధికి ఇప్పట్లో స్పృహ వచ్చేట్లు లేదు. నాలో ఆలోచనల రొదలు.



గ్లోబలైజేషన్... గ్లోబలైజేషన్... ప్రపంచమొక కుగ్రామమిప్పుడు. మనిషికీ మనిషికీ మధ్య మాత్రం అందుకోలేనంత దూరం. ఇంటర్నెట్ ఫ్రెండ్‌షిప్స్. ఆర్నెళ్ళయినా అవతలి వ్యక్తి ఎవ్వరో కనీసం అమ్మాయో అబ్బాయో తెలీదు. ఏ ఊరో తెలీదు. అసలెప్పటికీ తెలియనక్కర్లేదు. కొండొకచో తెల్సినచోట, ఇదిగో ఇదీ పరిణామం. ఈ అమ్మాయికిలా అయిన సంగతి అర నిమిషంలో నెట్‌లో ప్రపంచమంతా తెలిసిపోతుంది. కానీ ఈ పిల్ల తల్లిదండ్రులకీ, స్నేహితులకీ తెలియడానికెంత సమయమైనా పట్టొచ్చు. ఈ పిల్ల ఇంటి ఎదురింట్లో వాడికే వీళ్ళ గురించి తెలీదు. కనీసం పేర్లు కూడా. ఎటుపోతున్నాం ఇప్పుడు మనమంతా?...

మనసంతా జాలి... కసి. ఎవరి మీదో తెలీని కసి.

కుర్ర కానిస్టేబుల్ క్రిందికి కెళ్తూ నా ప్రక్కన వదిలేసిన ఆమె హాండ్ బేగ్‌లోంచి ఆమె సెల్ తీశాను. 'రుషి' అని పేరు దొరికింది. రింగ్ చేశాను. నాలుగు రింగుల తర్వాత లిఫ్ట్ చేశాడతను... ఫోన్ తియ్యడమే హడావుడి.

"హాయ్! ఈవెనింగ్ పబ్ కన్‌ఫర్మ్ అయింది. డైరెక్ట్‌గా కేఫ్ కొచ్చేయ్. పికప్ చేసుకుంటా!" గబగబా చెప్పేసి లైన్ కట్ చేశాడు. ఇక మళ్ళీ రింగిచ్చినా ఉపయోగం లేదని అర్థమైపోయింది.

'డాడ్' అని ఉన్న నెంబర్‌కే మళ్ళీ ట్రై చేశాను. వెంటనే లైన్లోకొచ్చాడాయన. "అమ్మా అర్జెంట్ మీటింగ్‌రా! డోన్ట్ డిస్టర్బ్ మీ! పదే పదే చేయొద్దు! మళ్ళీ మాట్లాడుతా! మీటింగ్ కదా ప్లీజ్!" లైన్ కట్. నేను హలో అనేలోగానే మొత్తం సమాచారం చెప్పేయడం. బిజీ బిజీ... ఫ్రండ్సంతా డిస్కోల్లోనూ, పేరంట్సంతా మీటింగుల్లోనూ.

ఈసారి సుమ నెంబర్‌కి రింగ్ చేశాను.

ఏడు రింగుల తర్వాత ఆ అమ్మాయి లిఫ్ట్ చేసి 'హాయ్' అంది.

నేను 'హలో!' అంటూ రిప్లయి ఇచ్చాను.

ఛార్జింగ్ పూర్తిగా డౌన్ అయిపోయి, సెల్ ఆగిపోయింది. అది లేటెస్ట్ ఫారిన్ సెల్‌ఫోన్. అయితే మాత్రం ఛార్జింగ్ లేదు కాబట్టి, రుధిరకి ప్రపంచంతో పూర్తిగా లింక్ తెగిపోయినట్టే. సో... రుధిర అనబడే మా ఎదుటి ఫ్లాటమ్మాయి, తన సెల్‌ఫోనును రెడీగా ఛార్జింగ్‌లో ఉంచుకోడాని క్కూడా వీల్లేనంత బిజీ అన్నమాట.

ఆ అమ్మాయి పర్సులో డైరీ దొరికింది. హెడ్ వివరించిందంతా విన్నాక పుట్టిన క్యూరియాసిటీ కావొచ్చు... ఆ డైరీ చూడాలనిపించింది. పైగా అంత కంటే నేను చేయగలిగింది కూడా ఏం లేదప్పటికి.

ఒక్కో పేజీ చదువుతోంటే ఆశ్చర్యం, ఆవేశం... కోపం... నిస్పృహ ఒకదాని వెంట మరొకటి. ఎవరి మీదా? ఈ వ్యవస్థ మీదా?... ప్రస్తుత కాలం మీదా... ఏమో?!

ప్రస్తుత వ్యవస్థని ఒక కోణంలో పుస్తకం చేస్తే ఆ అమ్మాయి డైరీ అవుతుంది. కెరీర్ కోసం జరిపే పోరాటం మరో కోణం అనుకొంటే, అక్కడక్కడా, అప్పుడప్పుడూ వ్రాయబడ్డ అంశాలన్నీ క్రోడీకరిస్తే ఏ కొండచిలువ నోటనో మింగపడుతున్నప్పుడు, మేకపిల్ల పడుతోన్న వేదనలా ఉంది.

✤

ఇంతలో కుర్ర కానిస్టేబుల్ చేతిలో పేకెట్లతో వస్తూ కనిపించాడు.

ఒక పొట్లం నా చేతిలో పెడుతూ... "వేడిగా వున్నాయ్ సార్. ఇడ్లీలు తీసుకోండి," అంటూ, నీళ్ళ పాకెట్ కూడా అందించాడు, ప్రక్కన కూర్చుంటూ. పేరు మూర్తిట.

"మీది అమలాపురమా?" అడిగాను.

"ఆయ్! రాజోలండి. న్యూ రిక్రూట్‌మెంట్," కోనసీమ తాలూకూ వినయంతో చెప్పాడు. సగటు పోలీసు తాలూకు లక్షణాలేవీ ఇంకా పూర్తిగా అలవడినట్టు లేవు. లేతగా ఉన్నాడు. నీళ్ళు కూడా త్రాగడం పూర్తయ్యాక,

"అసలిదంతా చూస్తోంటే విచిత్రంగా ఉంది కద్సార్," అన్నాడు.

ఏమిటన్నట్టు చూశాను.

"అదే ఈ పిల్లకి బాయ్‌ఫ్రెండ్ ద్వారా కత్తిపోట్లు... వాళ్ళమ్మా నాన్నా ఇక్కడే సిటీలో... కానీ ఎక్కడో తెలీదు. ఏం జరుగుతుందో చెప్పలేం. ఎదురింటో ఉన్న మీకే పూర్తిగా వాళ్ళ గురించేం తెలీకపోవడం. ఇంటర్నెట్ వచ్చి, సెల్ ఫోన్ విప్లవాలొచ్చి ఇంతగా కమ్యూనికేషన్లొచ్చి పొరుగువాళ్ళ గురించి మాత్రం తెలీదు. ఛ్ఛ! మహానగర జీవితాలు," అంటూ నిట్టూర్చాడు.

కొరిడార్లోంచి చూస్తే వాహనాల హడావుడి. పరుగో పరుగు... జీవితమంతా పరుగులు పెట్టకపోతే అర్థాంతరంగా ముగిసిపోతుందన్నంత కంగారు. పరుగు.

కొత్తగా ఉద్యోగ జీవితంలోకి అడుగుపెట్టిన ఈ పిల్లాడికి గ్లోబలైజేషన్ అంటే పూర్తిగా తెలీకపోవచ్చు. కానీ బలైపోతోన్న కోట్లమందిలో ఒక్కడు కదా. పైగా కాలుష్య మెరుగని పల్లె నుండి మహానగరానికొచ్చాడు. ఎందుకో అతణ్ణి చూస్తే ముచ్చటేసింది. కొంచెం మాట్లాడాలనిపించింది.

లోపల్లోపల ఏదో అలజడి సుడులు రేగుతోంది.

ఇక్కడెవరూ ఎవరితోనూ మాట్లాడుకోరు. ముఖ్యంగా సోకాల్డ్ మారుతోన్న విలువల గురించి అసలు మాట్లాడుకొనేందుకు టైమెక్కడిది?! మొత్తానికి అతడి నిట్టూర్పులాంటి ప్రశ్నకి సమాధానం చెప్పడం మొదలెట్టాను.

"విస్తరిస్తోన్న కమ్యూనికేషన్ల పుణ్యమా అని భూగోళాన్ని అరచేతిలో తెచ్చుకుంటూ... మనిషి తన పాటి మనిషికి దూరమైపోతున్నాడు. ప్రపంచానికి అతి దగ్గరైపోతూ... సమాజానికి దూరమైపోవడమన్నమాట."

అతడర్థం కానట్టు చూశాడు. అదే ఇప్పటి పరిస్థితి. ఏమీ అర్థం కాకపోవడం. అంతా కళ్ళముందే జరిగిపోతుండడం.

"నగర జీవితం అస్తవ్యస్తమై, కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమైపోతూ ఒక ఇంట్లో సభ్యులందరూ ఒకళ్ళనొకళ్ళు పదిరోజుల కొకసారైనా కలుసుకోకపోవడం, వారానికోసారయినా కలిసి భోజనం చేయలేకపోవడం, స్టేటస్ సింబల్‌గా పరిగణించబడ్తోందిప్పుడు.

"ఇంతా చేస్తే ప్రతీవాడి చేతిలోనూ సెల్‌ఫోనూ, ఆఫీసుల్లో, ఇళ్ళలో పర్సనల్ కంప్యూటర్లూనూ. ప్రస్తుత కేసే తీసుకో... కూతురి దగ్గర సెల్ ఉంది. తండ్రి దగ్గరా ఉంది. ప్రమాదం సంగతి తెలీదు. సాయంత్రం దాకా బహుశా తెలీకపోవచ్చు. ఒకప్పుడైతే ప్రమాదం జరగ్గానే టెలిగ్రాం ఇచ్చేవాళ్ళం. అది తప్పకుండా చేరుతుందన్న నమ్మకం ఉండేది. ఇప్పుడది లేదు. కానీ... సెల్‌ఫోన్ ఉంది.

"ఇంటర్నెట్... ఇద్దరు స్నేహితులు భూమికి అటొకరూ, ఇటొకరూ కావొచ్చు లేదా ప్రక్కప్రక్కనే కావొచ్చు. అమ్మాయినని అబ్బాయి అబద్ధ మాడి మరీ స్నేహం మొదలెట్టొచ్చు... ఇదీ కమ్యూనికేషన్ అభివృద్ధంటే. ఆర్నెల్లు స్నేహం కానిచ్చాక హఠాత్తుగా ఇద్దరిదీ ఇదే నగరమన్న నిజం తెలిశాక... ఆ స్నేహం స్వచ్ఛమే అయితే... అదింకా చిక్కబడాలి కదా. మరిలా కత్తిపోట్లకి గురికావడమేమిటి? ఎలా వివరించి చెప్తే ఈ డాట్‌కామ్ తరానికి స్నేహమంటే నిజమైన ఖచ్చితమైన నిర్వచనం అర్థమౌతుంది."

నా వాక్ప్రవాహానికి అడ్డొస్తూ చిన్న కలకలం రేగింది. స్ట్రెచర్ మీద ఓ కుర్రాడ్ని ఎమర్జెన్సీ వార్డులోకి తీసుకెళ్ళారు. క్షణాల్లో అక్కడి వాతావరణం హడావుడిగానూ, విషాదంగానూ మారిపోయింది. రెణ్నిమిషాల్లో కానిస్టేబుల్ మూర్తి వెళ్ళి విషయం కనుక్కొన్నాడు. కుర్రాడు ఇంజనీరింగ్ ఫస్టియర్. మూడు సబ్జెక్టులు ఫెయిలయ్యాడు. ఇంట్లో చెప్పే ధైర్యం లేక ఆత్మహత్య చేసుకోబోయి చావుతో పోరాడుతున్నాడు. ఇదీ సారాంశం.

"చూశావా! ఒకప్పుడు ఇంటర్మీడియట్‌లో మేథ్స్, సైన్స్ తీసుకొంటే వాళ్ళని చాలా మేధావుల్లాగా పరిగణించే వాళ్ళు. అదయ్యాక ప్రొఫెషనల్ కాలేజీలో సీటొస్తే వాణ్ణి తప్పకుండా మేధావిగా గుర్తించేవాళ్ళు. మరిప్పుడు పెరిగిపోయిన కాలేజీ సీట్లు, తెలివితేటల్నీ డామినేట్ చేసే డబ్బూ, డొనేషన్లూ, పిల్లల సున్నిత్వాన్ని చంపేసే తల్లి దండ్రుల పేరాశ వెరసి వ్యక్తిగత అభద్రత... ఆత్మహత్యా యత్నాల దాకా..."

దూరంగా బెడ్ మీద ఆ కుర్రాడు గిలగిలా కొట్టుకొంటున్నాడు. నర్సులు కంగారుగా తిరుగుతున్నారు.

రుధిర బెడ్ ఇన్‌ఛార్జి నర్సు బయటికొచ్చి మందుల చీటీ ఇచ్చింది అర్జంటని. నా జేబులో డబ్బుతో వెంటనే తేవడానికి వెళ్ళాడు మూర్తి. ఆ అమ్మాయింకా స్పృహలోకిరాలేదు. నేను ఒంటరిగా వార్డులో.

ఒకవేళ ఆ అమ్మాయి చచ్చిపోతే?

అవును. సాయంత్రంలోగా ఆ అమ్మాయిగాని చనిపోతే, నేను ఈ కేసులో అనుకోకుండా ప్రధాన సాక్షినవుతానా?! ఒకవేళ అదే జరిగితే ఏం చేయాలో తెలీని ఆలోచనలు?

మూర్తి మందులతోబాటు... కేసు కబురు కూడా తీసుకొచ్చాడు. ఈ అమ్మాయిని పొడిచి పారిపోయిన వాడి గురించి తెలిసిందంట. ఇప్పటికే రెండు కేసుల్లో నిందితుడట కూడా. అంతేకాదు ఏదో ప్రొఫెషనల్ కాలేజీ స్టూడెంటట. ఇందాక హెడ్డు వివరాలన్నీ రాసుకున్నాక సంతకం పెట్టమంటే జంకాను. ఆలోచించాను. ఇప్పుడు ఆ కుర్రాడి వివరాలన్నీ విన్నాక ఒక నిర్ణయానికొచ్చాను స్థిరంగా. రుధిర విషయంలో తోడుంటాను. ఆ కుర్రాడికి శిక్ష పడేదాకా.

✤

మూర్తి నిట్టూర్చి "మా ఊళ్ళో ఇప్పటికీ అందరికీ అందరూ తెలుస్తారు సార్! ఎవరికేం ప్రమాదం జరిగినా క్షణాల్లో తెలిసిపోతుందండి. ఇక్కడేంటి సార్. బై ద వే... మా ఊరికింకా టెలిఫోన్ సౌకర్యం కూడా లేదండి," అన్నాడు.

"అదే గ్లోబలైజేషన్ అంటే. ఈ అమ్మాయి గురించి ప్రపంచమంతా క్షణంలో తెలుస్తుంది. అయినవాళ్ళు దాన్నందుకోవడమే కష్టం," అంటూ నవ్వాన్నేను.

"ఓ ముప్పై ఏళ్ళ క్రితం సంతలుండేవి... వారానికోరోజు ఊళ్ళలో జరుగుతుండేవి," కొనసాగిస్తూ చెప్పాను.

"ఇప్పుడూ ఉన్నాయండి."

"ఇప్పటిలా కాదు. సంతలంటే కూరగాయలు కొనుక్కోవడం కోసం కాదు. అక్కడ పూసల నుండి ఆభరణాల దాకా, కూరగాయల నుండి బండి కాడి సామానుల దాకా ఒక్కటేమిటి, మొత్తం నిత్యావసరాలన్నీ అమ్మబడేవి. అయితే అంతర్లీనంగా విషయం మరోటుండేది. అదేమంటే ఒక ఊరు మరొక ఊరితో తమ సంస్కృతీ సంప్రదాయాల్నీ విశేషాల్నీ ఎక్సేంజీ చేసుకోవడం. నీకు తెలుసా! చాలావరకూ పెళ్ళి సంబంధాలు మొట్టమొదట సంతల్లోనే మాటల్లోకొచ్చేవి. ఎవరబ్బాయికి ఏం ఉద్యోగ మొచ్చింది, ఎవరమ్మాయికి ఎలాంటి వరుడ వసరంలాంటివన్నీ అక్కడ కలుసుకున్న పెద్దలే మాట్లాడుకొనేవాళ్ళు.

విస్తరిస్తోన్న కమ్యూనికేషన్ల పుణ్యమా అని భూగోళాన్ని అరచేతిలో తెచ్చుకుంటూ... మనిషి తన పాటి మనిషికి దూరమైపోతున్నాడు. ప్రపంచానికి అతి దగ్గరైపోతూ... సమాజానికి దూరమైపోవడమన్నమాట.

"ఇక సంతలకంటే పెద్దవి తిరునాళ్ళు."

"అవునండీ."

చిన్నగా నవ్వాను.

"దైవదర్శనాలూ, తిరునాళ్ళూ, సంతలూ, పండుగలప్పుడు బంధువుల సందడి ఇదంతా మోక్షం కోసమో,

మరోదాని కోసమో కాదు. ఆహ్లాద జీవితం కోసం. నాగరికత అంటే అదే. సంఘ జీవిగా మారిన మనిషి తానుంటున్న సమాజంలో తనన స్థానాన్ని పదిలపరుచుకుంటూ సమూహ జీవితాన్ని సుఖంగానూ, హాయిగానూ గడిపేందుకు చేసుకున్న ఏర్పాట్లవి.

"జనరేషన్ మారింది, ఐక్యూ పెరిగింది. తరం తర మంతా చాలా తెలివైనవాళ్ళసుమా! ఇలాంటి స్టేట్‌మెంట్‌లు వింటూంటే నవ్వొస్తుంటుంది... ఎందుకంటే నిజంగా ఈ తరం వాళ్ళు అందరూ మేధావులే అయితే... పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూటికి నూరు వచ్చినవాళ్ళు కొన్ని లక్షల మంది ఉండాలి. యంసెట్‌లో ఫస్టర్యాంకుల వాళ్ళు కొన్ని వేలమంది ఉండాలి. కానీ ఉండడంలేదే. ఫస్ట్ రాంకర్స్ ఎప్పుడయినా పదిమంది మాత్రమే ఉంటున్నారు."

"మరి కాంపిటీషన్ పెరిగిపోయింది కదండీ."

"ఆహా! పెరిగింది. ఎలాగంటే మార్కుల శాతం పెరిగింది. నూటికి అరవై రావడమే గొప్పగా ఉన్న రోజుల్నుండి నూటికి తొంభై రావడం మొదలైంది. అది కూడ కేవలం కాంక్రీటు జైళ్ళలా తయారైన విద్యాసంస్థల వల్ల. పిల్లాడు కేవలం బట్టీయం వేస్తుండడం వల్ల. లాజికల్‌గా ఆలోచించడమూ, ఆలోచించగలగడమా లేదా అన్నది పూర్తిగా వ్యక్తిగతమైపోతోంది. అలాంటి ఒంటరితనపు నిర్భందపు చదువులు భయాన్ని పెంచుతూ, ఇంటర్నెట్‌ని అవుట్‌లెట్‌గా చేసుకుని, చివరికి ప్రేమా, స్నేహం అన్నీ శారీరకమైపోయి... ఇలా... ఆ బెడ్ మీది అమ్మాయిలా...

"ఇంకో బెడ్ మీది ఇంజనీరింగ్ అబ్బాయిలా...

"అభద్రత!"

ఈసారి సంభాషణ టి.వి. మీదికి మళ్ళింది. టి.వి. ఒక పెనుభూతం లా ఎలా మెల్లమెల్లగా సున్నితమైన జీవిత పార్శ్వాలని మింగేస్తోందో చెప్పుకుంటూంటే ఏదో తెలియని భయం హృదయాల్ని ఆవహించింది.

ఒకప్పుడు చిత్రలహరి కార్యక్రమం కోసం ఆశగా ఎదురుచూడడం, దూరదర్శన్ నేషనల్ చానల్‌లో ఆ ఆదివారం ఏ పరభాషా చిత్రం ప్రదర్శిత మౌతుందోనని ఆత్రంగా చర్చించుకోవడం. రోజువారీ రొటీన్‌లో అతి తక్కువ సమయాన్నే వినోదానికి కేటాయించడం, అది కూడా నిజంగా వినోదభరితంగా ఉండడం గురించి చర్చించుకొన్నామిద్దరమూ.

సమాజం, సంఘ జీవనం ఓ నిరంతర ప్రవాహంలాంటిది.

ముఖ్యంగా మన సంప్రదాయ సమాజం సుగంధ జలపాతం.

ఏమీ తెలియని పిల్లకాల్వలమల్లే, నంగనాచుల్లాగా కొత్తకొత్త సంప్రదాయాలు ఈ ప్రవాహంలో కలిసిపోతున్నాయి. మురుగునీరు మరీ ఎక్కువ కావడానికి ఇంకా టైముంది. చెప్పానుగా మనది, పరిమళభరిత సమాజ గమనం. అంత తొందరగా మురుగువాసనతో మునిగిపోదు.

తల్లినీ, తండ్రినీ సంవత్సరానికోసారి గుర్తుకు తెచ్చుకోవాల్సిన అవసరం, 'అమ్మలదినం, 'నాన్నలదినం,' చేసుకోవాల్సిన అవసరం రావడం ఇలాంటి మురుగునీటి పిల్లకాల్వలే.

తల్లినీ, తండ్రినీ సంవత్సరానికోసారి గుర్తుకు తెచ్చుకోవాల్సిన అవసరం, 'అమ్మలదినం, 'నాన్నలదినం,' చేసుకోవాల్సిన అవసరం రావడం ఇలాంటి మురుగునీటి పిల్లకాల్వలే.

ఇప్పటి తరంవాళ్ళు మురుగునీటి పిల్లకాల్వల్లో కాయితప్పడవలల్లే కొట్టుకుపోతున్నారు.

మార్పు సహజం.

సముద్రతీరంలాంటి పరాయి సంప్రదాయం తీరం దాటనంతవరకే అందం, ఆనందమూనూ. అదే చెలియలి కట్ట దాటితే వ్యక్తిత్వాలు శవాలై తేలిపోతాయి.

"సాంస్కృతిక సునామీ," అన్నాడు మూర్తి. నవ్వాను.

కారణాలేమైనా ఒక సంస్కృతిని మొత్తంగా మరొక సంస్కృతి చాప కింద నీరులా మింగేస్తోంది. ఇది దారి తీయబోయే పరిస్థితుల్నెవరూ బహుశా పూర్తిగా ఇంకా ఆలోచించడంలేదు.

"అవున్సార్! అన్నింటి కంటే హీనం ఏంటో తెల్సాండీ! పసిపిల్లల చేత 'పెల్విక్ జర్క్'లు ఇప్పిస్తూ తల్లిదండ్రులు తెగ ఆనందపడిపోతోన్న డాన్స్ పాపా డాన్స్ ప్రోగ్రాంలు."

✤

రుధిర ఒకసారి కళ్ళు తెరిచి మళ్ళీ పడుకొంది.

ఆత్మహత్యా యత్నం కుర్రాడు ఇంకా కొట్టుకుంటూనే ఉన్నాడు. రేప్ కేసమ్మాయికి వాళ్ళమ్మ ఏపిల్ ముక్కలు తినిపిస్తోంది.

ఎక్కణ్ణుంచి వచ్చారో ఒకేసారి మహిళా సంఘాలవాళ్ళు హాస్పిటల్ గేటు ముందు గుమిగూడిపోయి రుధిరకు న్యాయం జరగాలంటూ టి.వి. వాళ్ళకి కనిపించేలా నినాదాలిస్తున్నారు.

"ఒకప్పుడు ఆది మానవుడు గుహాంతర జీవిగా ఉంటూ కేవలం తిండి కోసమే బయటికొచ్చేవాడు. ఇప్పుడూ అంతే. గృహాంతర జీవిగా మారిపోయి కేవలం డబ్బు కోసం, పేరు కోసం బయటికొస్తున్నాడు. అంటే తిరోగమనమే జాతి పురోగమనంగా పరిగణించబడ్తోందన్నమాట.

"అన్నట్టు నీకో విషయం చెప్పడం మర్చిపోయాను... ఇందాకా నువ్వు బయటికెళ్ళినప్పుడు రుధిర డైరీ చదివాన్నేను."

మూర్తి ఆసక్తిగా ముందుకి వంగాడు.

"ఆ డైరీలో నేను చదివిందంతా ఒకే ఒక్కమాటలో చెప్పాలంటే అద్దం ముందు యువతరంలా ఉంది. ఆ డైరీ సారాంశం ఒకేఒక్క పదంలో 'ప్రేమ రాహిత్యం.'

"అవును. ప్రేమ కోసం యువత స్నేహాలు చేస్తోంది. సెక్స్‌ని ప్రేమ రాహిత్యానికి అవుట్‌లెట్‌గా భావిస్తోంది. ఫలితం ఇలా ఉంటుంది. నిజానికి విదేశీ సంప్రదాయాల పట్ల ఏహ్యభావంగానీ, మరో కంప్లయింట్ గానీ నా దగ్గర లేవు. ఆ మాటకొస్తే మా అబ్బాయిలు అమెరికాలో ఒకడూ, విదేశాల కెళ్ళే ప్రయత్నాల్లో ఒకడూ ఉన్నారు.

"నా బాధల్లా మనవికాని మార్పులూ, చేర్పులూ మన ప్రమేయం ఏమంత లేకుండానే విస్తరించడం గురించి, మన నుంచి మన జీవితాల్ని వేరు చేస్తుండడం గురించీ."

"మరి ఈ స్థితికి మార్పు ఎప్పుడుంటుందంటార్సార్! అసలుం టుందా?" చిన్నగా నవ్వాను.

వృద్ధాప్యం తాలూకూ గడిచిన అనుభవాన్ని కొత్తతరం సూటిగా అడుగుతున్న ప్రశ్న అది. సమాధానం చెప్పాలి. తప్పదు. చెప్పాను.

"ఎప్పుడు తీసుకున్నా ఒక సమకాలీన సమాజం సంధియుగంలోనే ఉంటుంది. ఇది కాలచక్రం. తిరగక తప్పదు. మార్పు చెందకా తప్పదు. తప్పకుండా మార్చొస్తుంది," అన్నాను.

క్రింద మహిళా సంఘాల హడావుడి ఇంకా ఎక్కువైంది.

నేనెప్పిన వివరణ మూర్తికి అర్థం కాలేదన్నాడు.

రుధిర మరోసారి స్పృహలోకొచ్చి మళ్ళీ పడుకుంది.

వార్డులో కొంచెం స్టయిల్‌గా పోతోన్న కుర్ర డాక్టరుని చూపించి అతనేసుకున్న ప్యాంటు ఫ్యాషనేంటని అడిగాను మూర్తిని.

"పారలల్ బాగీ అండి," అన్నాడు ఠక్కున.

"నీకు తెలుసా! దాదాపు 50 ఏళ్ళ క్రితం వచ్చిన మిస్సమ్మ, గుండమ్మ కథ సినిమాల్లో హీరోలు వేసుకున్న పంట్లాంలు ఇదే ఫేషన్. కాలచక్రం తిరుగుతుండడమంటే ఇదే."

అప్పటికి అర్థమైందతడికి. నవ్వాడు.

రుధి పూర్తిగా స్పృహలోకొచ్చింది.

ఆత్మహత్యా యత్నం ఇంజనీరు బ్రతికేసినట్టేనన్నాడు కుర్ర డాక్టరు.

క్రింద ఉన్నట్టుండి మహిళా సంఘాలవాళ్ళ నినాదాల హోరు హెచ్చింది.

హడావుడిగా ఓ యువకుడ్ని వార్డులోకి తెస్తున్నారు. కూడా హెడ్ కానిస్టేబుల్. ఆ కుర్రాడే రుధిర కేసులో నిందితుడు. ఆ సంఘటన జరిగిన గంటకి భయంతో నిద్రమాత్రలు మింగి పడిపోతే పోలీసులు పట్టుకొని (?) అరెస్టు చేసి (?) ఇప్పుడు హాస్పిటల్‌కి తెచ్చారు.

ఆ కుర్రాడి ముఖం చూడగానే జాలి కలిగింది నాకు. చిత్రంగా కోపం రాలేదు.

కించిత్ అసహ్యం కలిగిందేమో కూడా.

క్రింద మహిళా సంఘాల వాళ్ళు అరుస్తూనే ఉన్నారు. బేనర్లూ, ప్లేకార్డులు తయారైపోయాయి.

✤

హెడ్ వాళ్ళ యస్పైకి ఫోన్ చేసి విషయమంతా వివరిస్తున్నాడు. ఆ కుర్రాడి తండ్రి ఓ చిన్న రాజకీయ నాయకుడు. అతడెంత రాజకీయవేత్త అంటే తన కొడుకుచేత తానే బలవంతంగా నాలుగు నిద్రమాత్రలు మింగించి, ఆనక ఈ కేసు నుండి బయటపడగల దారులు వెదగ్గలడు.

నేను క్రిందికి మహిళా సంఘాల వాళ్ళ దగ్గరికొచ్చాను. ప్రెసిడెంట్‌లా ఉన్నావిణ్ణి పిలిచాను. పెద్దరికానికి గౌరవమిస్తూ దగ్గరికొచ్చింది. ఎందుకరు స్తున్నారన్నాను. కోప్పడుతుందనుకున్నాను. లేదు.

"న్యాయం కోసం," అంది.

"ఎవరికీ?" అన్నాను వ్యంగ్యంగా.

నావైపు చూసి, "ఆ అమ్మాయికి," అంది.

"ఆ కుర్రాడెవరో తెలుసా?"

"ఎవరైనా సరే! న్యాయం జరగాల్సిందే," అంది. నేపథ్యంలో కేకలు వినిపిస్తూనే ఉన్నాయ్ ఆవేశంగా.

"ఆ కుర్రాడు జగదాంబగారి ఏకైక పుత్రరత్నం. అన్నట్టు జగదాంబ గారెవరంటే అచ్చం మీలాగే ఓ పేరొందిన మహిళా సంఘానికి అధ్యక్షురాలు. ఆనక మీ ఇష్టం." నాకెందుకో నవ్వొచ్చింది, జగదాంబ పేరు వినగానే ఆవిడ మొహం చూసి.

"నిజమా! అంత ఖచ్చితంగా తెలుసా మీకు," ఆశ్చర్యంగా అడిగింది.

"తెలుసు! జగదాంబ నా చెల్లెలు. లోపల అమ్మాయిని కత్తితో పొడిచిన వాడు స్వయాన నా మేనల్లుడు." జగదాంబ విషయం తెలియగానే నినాదాలు సన్నగిల్లాయి. నేను జగదాంబ వాళ్ళన్నయ్యనన్న వార్త సంచలన మయింది. అప్పుడు చెప్పానా మహిళా సంఘ ప్రెసిడెంట్‌కి, "మీరు పోరాటం శిక్ష వేయించడం గురించి చేస్తే పెద్ద గొప్ప విషయమని నేనను కోవడం లేదు. సంపూర్ణమైన మార్పు కోసం చేయండి. వాడికి శిక్షపడేలా చేసేందుకు బేనర్లూ, నినాదాలూ అక్కర్లేదు. నేనొక్కణ్ణి చాలు గట్టిగా నిలబడితే. నేను అమ్మాయి తరపున ఖచ్చితంగా నిలబడతాను. న్యాయం జరగాల్సింది ప్రస్తుతం రుధిరకి కాదు, మొత్తం యువతరానికి," అంటూ అక్కణ్ణుంచి వచ్చేశాను.

మూర్తి ఆశ్చర్యంలోంచి ఇంకా తేరుకోలేదు.

నేను చెప్పాను, "రుధిరలాగే ఈ యువకుడు కూడా ప్రేమ రాహిత్యానికి లోనైనవాడు. అపరిపక్వ వ్యక్తిత్వంతో ప్రమాదాలు తెచ్చిపెట్టి, తనకు తాను కొని తెచ్చుకుని... ఇలా..."

"ఇందాకణ్ణుంచీ అడుగుదామనుకుంటున్నాన్సార్. అసలు రుధిర అంటే అర్థం ఏంట్సార్. వెరైటీ పేరులా ఉంది," అన్నాడు మూర్తి.

అతడికి అర్థం చెప్పాను. వినగానే అతడి ముఖంలో నెత్తురుచుక్క లేదు. అలాంటి పేర్లు పెట్టి వెరైటీ అనెందుకనుకుంటున్నారో తెలీదు. ప్రద్యుమ్న్, విఘ్నేష్ అని వాళ్ళ పిల్లాడికి పేరు పెడదామనుకున్నాడట మూర్తి.

"ఇపుడే ఒక నిర్ణయం తీసుకున్నాన్సార్. మా పిల్లాడికి గణపతి అనే పేరు పెడతాను" అన్నాడు. సంధియుగంలోని కొత్త తరం పాత తరం తాలూకు కొత్తదనపు పరిమళాన్ని ఆస్వాదిస్తున్నట్టు రంగులీను తున్నాయ్ ఆ కుర్రాడి కళ్ళు.

మహిళా సంఘాలవాళ్ళు టి.వి. వాళ్ళు వెళ్ళిపోయాక వాళ్ళు కూడా వెళ్ళిపోయారు.

రుధిర చెప్పిన వాళ్ళ నాన్న అడ్రస్‌కి ఓ కానిస్టేబుల్ వెళ్ళాడు.

పరిస్థితి సీరియస్‌గానే ఉన్నా ఫర్వాలేదన్నారు డాక్టర్లు.

సమాజంలో రాబోయే అపురూపమైన, శుభప్రదమైన మార్పు కోసం ఎదురు చూస్తున్నట్టు, రాబోయే రుధిర వాళ్ళ తల్లిదండ్రుల కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను.

*

అవ్వా బువ్వా

పుచ్చా అన్నపూర్ణ

చేతిలోని న్యూస్‌పేపర్ టేబిల్ మీద పెట్టి లేచి నిలబడ్డాడు చంద్రకళాధర్. "అల్లుడికి ఏం చెప్తావు అనేకాక, తర్వాత నువ్వు బాధపడకుండా ఉండేలాగ చూసుకో," అని ఇంకోసారి గుర్తుచేసి, "స్నానం అదీ పూర్తి చేసుకుని వస్తాను. ఫోన్‌లో మాట్లాడటం కాగానే ఆఫీస్‌కి వెళ్ళవచ్చు," అంటూ వెళ్ళిపోయాడు.

కొద్దిక్షణాలు అక్కడే కూర్చుని, తర్వాత రెండు ఖాళీగ్లాసులూ తీసుకుని వంట ఇంటివైపు వెళ్ళింది కాత్యాయని.

పది నిమిషాల తర్వాత తిరిగి వచ్చాడు చంద్రకళాధర్.

"పనిమనిషి ఒక్కపూట రాకపోతే రెండోపూట వస్తుందా రాదా అని భయపడి చస్తున్నాను. అక్కడకు వెళితే నావల్ల ఏమీకాదని తెలుస్తూనే ఉన్నది కదా," భర్త వంక చూడకుండానే వివరించింది.

"కావాలంటే పనిమినిషిని పెడతారని యామిని అన్నదికదా," కళ్ళజోడు నీళ్ళతో తుడుస్తూ సమాధానం ఇచ్చాడు.

"నేనీమాట అన్నానని వాళ్ళారకంగా ఆలోచిస్తున్నారేకానీ... అదీనూ ఏదో వారానికోసారి వచ్చి వ్యాక్యూమ్ చేసి, బాత్‌రూమ్‌లు కడిగి వెళ్ళే మనిషే కదా," చేతులు కడుక్కుని పిండి తడిపి ఉంచిన గిన్నె గట్టుమీద పెట్టింది.

"అసలు నువ్వు రోజువారీ పనులేమీ చేయనక్కర్లేదనీ, ఆఫీస్‌కి వెళ్ళేముందో తిరిగి వచ్చాకో అవన్నీ వాళ్ళే చూసుకుంటారని అంటూనే ఉన్నారు కదా పాపం. నువ్వు కేవలం బేబీని చూసుకోవడమే," కళ్ళజోడు



ధరించాడు. భర్త గొంతులోని సానుభూతి కాత్యాయనికి కొద్దిగా నవ్వు తెప్పించింది కానీ, సమాధానం మాత్రం నవ్వ కుండానే చెప్పింది.

"కొన్నేళ్ళ కిందట ఈ పద్ధతి మొదలయినప్పుడు, ఇట్లా వెళ్ళిన తల్లులకి, అత్తగార్లకి అక్కడకు వెళ్ళాక కానీ పరిస్థితి తెలియదు కదా."

"యామిని అన్నట్లు నువ్వు 'హారర్ స్టోరీస్' మరీ ఎక్కువగా నమ్ముతున్నావు."

"మీ కూతుర్ని సమర్థించాలని అట్లా అనకండి," పూరీ వత్తటం మొదలుపెట్టింది.

"రెండు నెలలు శలవు పెట్టి రాగలరన్నందుకు ఇప్పటికే వాళ్ళకి మీరంటే ప్రేమ, నేను రానంటున్నానని నా మీద కోపం ఎక్కువవు తున్నాయి."

"కోపం కాదులే," అంటూ డైనింగ్ టేబిల్ దగ్గర కుర్చీలలో ఒకటి చేతుల్తో ఎత్తి వంటింటి తలుపు దగ్గర వేసుకుని, దానిమీద కూర్చున్నాడు.

"మరేమిటిట? మీ కూతురు అన్నమాట ఏమిటో మీకూ తెలుసు."

భార్య గొంతులో కొద్దిగా ధ్వనించిన బాధ చంద్రకళాధర్ గ్రహించక పోలేదు.

"శశాంక కూడా చదువు కోసమని వేరే ఊళ్ళో ఉంటున్నాడు కదా, ప్రస్తుతానికి నీకు ఇంట్లో పెద్ద బాధ్యతలు లేవుకదా అనుకుని ఉంటుంది అని చెప్పానుకదా," కాస్త అనునయంగా అన్నాడు. చురుగ్గా చూసింది కానీ, మాట్లాడలేదు కాత్యాయని.

"చిన్నపిల్ల. డెలివరీ టైమ్‌కి నువ్వు వెళ్ళి సహాయం చేయవనుకుంటే కాస్త భయం."

"నాకు మాత్రం అనిపించదని అనుకుంటున్నది," కొద్దిగా నిట్టూర్చి, వత్తిన చపాతీ పెనం మీద వేసింది. "అందుకేకదా స్వార్థం వాళ్ళదేనని నేను అనలేదు."

"వాళ్ళు అమెరికాలో ఉంటున్నారు కాబట్టి పిల్లల్ని పుట్టించుకోవడం స్వార్థం క్రింద లెక్క అని అనలేవు కదా."

"చదువుల కోసమో, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళ కోసమో అమెరికా వెళ్ళాలని అందరికీ మోజే. కారణాలు ఏమయినా కానీ, ఇద్దరూ ఉద్యోగాలు చేయటంవల్ల, పిల్లలు పుట్టేటైమ్‌కి ఇండియా నుండి పై జనరేషన్ ఆడవాళ్ళు సహాయానికి రావాలి. అట్లా కాకుండా ఆ ఆడవాళ్ళు కనీసం కొన్ని నెలలు ఉద్యోగం మానవచ్చు కదా అన్నానని కోపం. తననే కాకుండా వందలు వేలమంది అటువంటి ఆడవాళ్ళని ఆ మాటతో క్రిటిసైజ్ చేశానుట," గొంతు పెంచలేదు కానీ గట్టిగానే అన్నది కాత్యాయని. కూరతో సహా రెండు చపాతీలు పెట్టిన పళ్ళెం భర్తకు అందించింది. "అట్లా అని ఆ పసివాళ్ళని ఏ బేబీసిట్టర్‌కో, డేకేర్‌కో అప్పగించరు. సరిగ్గా చూడరనో, ఖర్చు మరీ ఎక్కువనో భయం," మంచినీళ్ళు నింపిన గ్లాసు కుర్చీ ప్రక్కగా నేల మీద ఉంచింది.

చదువుల కోసమో, ఉద్యోగాలు, పెళ్ళిళ్ళ కోసమో అమెరికా వెళ్ళాలని అందరికీ మోజే. కారణాలు ఏమయినా కానీ, ఇద్దరూ ఉద్యోగాలు చేయటంవల్ల, పిల్లలు పుట్టే టైమ్‌కి ఇండియా నుండి పై జనరేషన్ ఆడవాళ్ళు సహాయానికి రావాలి. అట్లా కాకుండా ఆ ఆడవాళ్ళు కనీసం కొన్ని నెలలు ఉద్యోగం మానవచ్చు కదా!

"మేం టికెట్ పెడతాం, అమెరికా చూపిస్తాం అంటే గొడవేమిటి అన్నట్లుగా అంతా ప్రవర్తిస్తున్నారని మనకి తెలుసు. నలుగురితో నారాయణా... మనకి వాళ్ళు టికెట్ కొనక్కర్లేదనుకో... కూర బావుంది... పిల్లల్ని బుద్ధిగా, మంచిగా పెంచటం, చదువుల్లో, పెళ్ళిళ్ళలో సెటిల్ చేయటం వరకే మన బాధ్యత అని నీ వాదన..."

"వాళ్ళ పిల్లలూ కొన్ని సందర్భాల్లో మన బాధ్యత కావచ్చుకానీ, ఇటువంటప్పుడు కాదు."

"డెలివరీ కూడా మన బాధ్యతేనని వియ్యపురాలు సాధించిందన్నావు కదా?"

"దూర ప్రయాణాలు, పని వత్తిడి పనికిరాదని ఈ డాక్టర్లు అనక పోతే, ఆవిడే వెళ్ళి కోడల్ని కూర్చోబెట్టి చేసిపెట్టేది అన్న సంగతి మర్చిపో కూడదు మనం."

ఇద్దరూ చిన్నగా నవ్వుకున్నారు.

"ఆ కోడల్ని ఇక్కడకే రమ్మని అన్నావని నువ్వూ చెప్పావు కదా."

"చెప్పినా అదేం లాభంలేదు. వాళ్ళకున్నంత మంచి మెడికల్ ఫెసిలిటీస్, పుట్టగానే అక్కడి సిటిజన్ అయ్యే అవకాశం ఇక్కడకు వస్తే ఉండవని భయం కదా. ఇంకో చపాతీ ఇస్తాను... అవ్వా కావాలి బువ్వా కావాలి అంటే ఇదే మరి."

"ఈ అవ్వ మాత్రం వెళ్ళదల్చుకోలేదు అంటావు?"

ఆ మాటల్ని పరిహాసంగా తీసుకోదల్చుకోని కాత్యాయని, 'నాకు యాభై కూడా లేవు,' అని అనలేదు.

"మనకైనా ఆ పుట్టే బేబీతో కొన్నాళ్ళు గడపడం బాగానే ఉంటుంది కదా," అని కాస్త ఆశగా చంద్రకళాధర్ మళ్ళీ అన్నాడు.

"అది నిజమే," అని నెమ్మదిగా అంటూ, స్టవ్ ఆఫ్ చేసి చేతులు కడుక్కుంది.

"కానీ కొన్ని నెలలు వాళ్ళని పెంచి తిరిగి వచ్చేప్పుడు వాళ్ళని ఏదో డేకేర్స్‌లాంటి చోట వదిలి రావటం అంటేనూ కష్టంగా అనిపిస్తుందని శారదగారే అన్నది కదా." ఇద్దరూ తిరిగి డైనింగ్ టేబిల్ దగ్గరకు వచ్చి కుర్చీల మీద కూర్చున్నారు. భర్త చేతి గడియారంలో టైమ్ చూసుకోవటం చూసి, "మీరు వెళ్ళే లోపల పిలుస్తారులే. మీరైతే నన్ను ఒప్పించగలరని వాళ్ళ ఆశ," అన్నది.

"ఆ ఆశ తీరదన్న భయం కూడాను."

వెంటనే ఏమీ మాట్లాడలేదు కాత్యాయని. అట్లా అని పూర్తిగా ఆ ప్రసక్తే వదిలేయదల్చుకోలేదు. అందుకే కాస్త సరదాకి, కాస్త కాలక్షేపానికి అన్నట్లుగా కొన్ని క్షణాల తర్వాత మళ్ళీ మొదలుపెట్టింది.

"మా శాంతక్కయ్య నాలుగేళ్ళ నుండి చెప్తున్న కథ మీరూ విన్నారుగా? వెళ్ళే ముందు గ్యాస్ సిలిండర్ ఒక్కత్తె ఎత్తి వంటింట్లో పడేసేదిట. ఆరునెలలు కూతురింట్లో ఉండి వచ్చాక ప్రెషర్‌కుకర్ ఎత్తే ఓపిక పోయిందిట."

భార్య తీసుకుంటున్న నిర్ణయం పూర్తిగా పని భయం వల్లనే కాదని

తెలిసిన చంద్రకళాధర్, తనూ అదే పద్ధతిలో సమాధానం ఇవ్వదల్చు కున్నాడు.

"ఆవిడే కదా అక్కడ పనివల్ల ఒళ్ళు తగ్గి, జాకెట్లు వదులై, చీరలు మానాల్సి వచ్చిందన్నది? కూతురు పంజాబీ డ్రెస్‌లు వేసుకుని తిరగవలసి వచ్చిందనీ?"

ఈసారి నవ్వింది కాత్యాయని. "అది మా శేషన్నయ్య వాళ్ళ వదినగారు. ఆవిడకి కాస్త డ్రామా ఎక్కువే అనుకోండి."

"నువ్వు ఆరునెలలు కాకపోతే మూడే నెలలు చాలని, క్షణంలో గడిచిపోతాయని అంటున్నారు కదా... నేను మాత్రం నిన్ను ఏమీ వత్తిడి చేయడంలేదు."

"తెలుసు," అంటూ మళ్ళీ కొద్ది క్షణాలు మౌనంగా కూర్చుంది. "ఈ పద్ధతి ఇప్పుడో సాంప్రదాయంలాగ అయి, ఎవరైనా ఆ పని చేయము అంటే, వాళ్ళ హక్కు ఏదో వాళ్ళకు దక్కటం లేదన్నట్లుగా అనుకునే వాళ్ళు కనిపిస్తున్నారిప్పుడు," కాస్త నిస్సహాయంగా అన్నది. "వెళ్ళదల్చు కోనివాళ్ళకి కారణాలు వెతుక్కునే పరిస్థితి వచ్చింది."

"వాళ్ళు రమ్మన్నప్పుడల్లా వీళ్ళు వెళ్తున్నప్పుడు వాళ్ళు అట్లా అను కుంటున్నారంటే తప్పు లేదులే. పైగా చిన్నవాళ్ళు పై తరం వాళ్ళ నుండి హక్కులు కోరటంలో కొత్త ఏముంది?"

"వాళ్ళ కాళ్ళ మీద వాళ్ళు నిలబడేవరకు మనం చేయాలనుకోవటం వాళ్ళ హక్కు కావచ్చును. కానీ ఇప్పుడు వాళ్ళ జీవితం వేరు. వాళ్ళిష్ట ప్రకారం గడుపుకుంటున్నారు. అందువల్ల మీ పిల్లల బాధ్యత మీదే అనలేకనే కదా జాగ్రత్తగా మాట్లాడుతున్నాను."

"అమెరికా చూపిస్తాం రమ్మంటే మరీ అంత అభిమానం చూపి స్తున్నావేమిటి అనుకుంటున్నారు. నీకు అభిమానం కాస్త ఎక్కువే అన్నాను కానీ, మిగిలినవాళ్ళకి అట్లా కాదా అని రోహిత్ అనడంతో ఆ ప్రసక్తి మానేశాను."

భర్త తనను అర్థం చేసుకున్న సంతోషంతో తనూ ఆ ప్రసక్తి పెంచలేదు కాత్యాయని.

"అమెరికా చూపించటానికైతే ఏళ్ళ తరబడి ఆగి, పిల్లలు పుట్టే ముందు రమ్మనటం ఎందుకని రోహిత్ వాళ్ళ దొడ్డమ్మే అన్నదిట. తొమ్మిదో నెలలో ఉన్న అమ్మా యిలతో తిరగలేరని ముందూ, పసిపిల్లలతో తిరగలేరని తర్వాత కూడా అమెరికా చూసిందేమీ లేదని రెండేళ్ళ తర్వాత కూడా ఆవిడ సణుక్కుంటూనే ఉన్నదిట."

టేబిల్ మీది పళ్ళబుట్టలోని కమలాపండు ఒకటి తీసుకొని తొక్క తీయసాగింది. "మీరేం పని చేయక్క ర్లేదు, బేబీని చూసుకోండి చాలు అని అందరూ నిజం గానే అంటున్నా, చూస్తూ చూస్తూ ఈ పెద్దవాళ్ళు ఎవరూ ఊరుకోలేరు కదా. అంతకన్నా పెద్ద సమస్య ఆవిడకి రోజంతా మనిషి కనిపించకుండా ఆ అపార్ట్‌మెంట్‌లోనో, ఇంట్లోనో ఆ బేబీతో ఒంటరిగా కూర్చోవటం అని చెప్పింది."

"వాళ్ళు రమ్మన్నప్పుడల్లా వీళ్ళు వెళ్తున్నప్పుడు వాళ్ళు అట్లా అను కుంటున్నారంటే తప్పు లేదులే. పైగా చిన్నవాళ్ళు పై తరం వాళ్ళ నుండి హక్కులు కోరటంలో కొత్త ఏముంది?"

తను కూడా ఒక పండు తీసుకొని తొక్క తీయసాగాడు. అప్పటి కప్పుడు తమ స్వంత విషయంలో తీసుకోవలసిన నిర్ణయానికి, పరాయి వాళ్ళ ఉదాహరణలు ఎక్కువగా ఏమీ ఉపయోగపడకపోయినా, అదే ప్రసక్తిని గురించి చర్చించుకోదగ్గ విషయాలు సిద్ధంగా ఉండటం ఇద్దరికీ కాస్త తృప్తి కలిగించింది. అందుకనే అప్పటికే ఒకటిరెండుసార్లు జరిగిన చర్చ, ఆలోచనలు, నిర్ణయాలు మళ్ళీ పైపైన స్పృశించి, సంభాషణగా వాడుకోవటం ఇద్దరికీ నచ్చింది.

"శశాంక ఫ్రెండ్ సమీర్ మేనత్త కూడా అదే అన్నదన్నావు కదా?"

మళ్ళీ నవ్వింది. "ఆవిడది కాస్త వేరు. వీకెండ్స్‌లో, శలవుల్లో నీకు అన్నీ చూడదగ్గ ప్రదేశాలూ చూపిస్తాం అని చెప్పిన కొడుకు, కోడలు పిల్లవాడు పుట్టాక వాడితో ఆ వీకెండ్ రెండు రోజులూ అయినా గడపక పోతే తమకి వాడితో 'బాండింగ్' ఉండదని చెప్పి ఆవిడ ఉన్నన్ని నెలలూ అట్లా గడిపారుట. ఏదో చూసి వెలగబెట్టాలన్న మోజు కన్న, ఇంకేమీ చేసేదిలేక పిచ్చెక్కినట్లు అయిందని, చివరి రెండు నెలలకని వచ్చిన వాళ్ళ ఆయనకైతే నిజంగానే పిచ్చి ఎక్కిందని చెప్పింది.

"ఆ మనవడికని వాళ్ళు కొన్న మాగ్నెటిక్ 'ఏబీసీడీ'లతో ఆడు కున్నాడు కదూ?"

మళ్ళీ నవ్వి తల ఊపింది కాత్యాయని. "ఫ్రిజ్ ముందు నేల మీద కూర్చుని, ఆ అక్షరాలన్నీ ఫ్రిజ్ మీద అంటిస్తూ, కొత్త ఇంగ్లీష్ మాటలు కనిబెడదామని చూస్తున్నాను అని చెప్పాడుట. ఆయనకు పిచ్చి ముదర కుండా ఇండియా లాక్కువచ్చేసరికి ఈవిడకి సగం ప్రాణమే మిగిలిందని చెప్పింది."

"నేను కూడా వస్తే నీకు తోచకపోవటం ఉండదు కదా అని వాళ్ళు అన్నప్పుడు నువ్వు ఇటువంటి ఉదాహరణలు ఇవ్వకుండా మామూలుగా మాట్లాడటం నాకు నచ్చింది." భర్త పొగడ్త కాత్యాయనికి కూడా నచ్చింది.

"నిజమే కదా! కనీసం ఆడవాళ్ళకి పని అయినా ఉంటుంది. మన తరం తెలుగు మగవాళ్ళు చాలామందికి ఏ ఇంటి పన్లు, పిల్లల పన్లు చేతకాక పోవటంతో ఇద్దరికీ కలిసి మతిపోతుంది. శాటిలైట్‌లో తెలుగు చానల్స్ ఎంతని చూస్తారు పాపం?"

భర్త మళ్ళీ చేతి గడియారం వంక చూసుకోవటం చూసి, "రోహిత్ ఇవాళ కాస్త ఆలస్యంగా వస్తున్నాడేమోలే. వాళ్ళు పిలుస్తారు అనే మనల్ని పిలవద్దు అన్నది కదా," అన్నది.

"పేచీ పెట్టుకున్నారేమో," సందేహంగా అన్నాడు.

తల అడ్డంగా ఊగించింది, కాదన్నట్లుగా. ఎవరు వలిచిన పండు తొనలు వారే తినసాగారు.

"ఒకవేళ పేచీలు పడ్డా, ఇక్కడ నుండి కలిసి వెళ్ళిన భార్యాభర్తల పేచీల కన్నా అవే నయం అని మా సరళక్క అంటూనే ఉంటుంది కదా. 'మన ఇంట్లో మనం పడి ఉంటే తిట్టుకున్నా, తిమ్ముకున్నా మన గోల మనది. అక్కడున్న ఆరునెలలు మేము హాయిగా పోట్లాడు

కోవటానికి కూడా వీలు లేకపోయింది. దానితో మాట్లాడుకోవటం కూడా తగ్గిపోయి చివరకు మా కాపురం కూలుతుందేమోనని భయం పుట్టింది,' అని చెప్పింది.''

"ప్రయాణాలు తేలికయినయ్యి, సంపాదనలు ఎక్కువయినయ్యి. రకరకాల కారణాల వల్ల దాదాపు అందరికీ సాగుతున్న భోగం తమకి సాగటంలేదు అంటే అది కాస్త వాళ్ళకి కష్టం అవుతుంది. మనకి డెలికేట్‌గా ప్రవర్తించవలసిన అవసరం వస్తుంది. అందుకనే ఈ కాస్తాకూస్తా నీతో చర్చించవలసి వచ్చింది. అంతేకానీ, నీ ఇష్టం వచ్చిన నిర్ణయం నువ్వు తీసుకోమని ఇదివరకే చెప్పాను కదా.''

తృప్తిగా ఊపిరి పీల్చుకుంది కాత్యాయని.

"డెలికేట్ విషయం కనుకనే అనుకున్నవి అనుకున్నట్లు కాకుండా, జాగ్రత్తగా చెప్తాను,'' అభయమిస్తున్నట్లుగా అన్నది. "నిజానికి మన తరం వాళ్ళు వేలకి వేలమంది అక్కడకు వెళ్ళారు కదా. దాదాపు అందరూ స్వంతంగానే, ఒంటరిగానే అన్నీ చేసుకున్నారు. చాలామంది ఆడవాళ్ళు ఉద్యోగాలు చేస్తూనే అన్నీ చేశారు అని మనకు తెలుసు,'' అంటూ ఆగి, భర్త మొహం చూసి, "ఈ రకంగా అనన్ని చెప్పాను కదా, కంగారు పడకండి. నా కూతురితో ఇట్లా మాట్లాడటం నాకూ సంతోషమైన సంగతేం కాదు,' ' అని నచ్చజెప్పింది.

"అమెరికా వెళ్ళి, మిగిలినవన్నీ చక్కగా సమర్ధించుకోగలుగుతున్న వాళ్ళకి ఈ బాధ్యత నిర్వర్తించుకోవటం ఏమీ కష్టం కాదులే అని ధైర్యంగా చెప్తాను. నా ఈ నిర్ణయం పని భయంతో, తోచదన్న భయం వల్ల కాదనీ చెప్తానులే.''

'మిగిలిన వాళ్ళకి వాళ్ళ పిల్లల మీద ఉన్న ఇష్టం మనకి మన పిల్ల మీద లేదని అనుకునే తెలివితక్కువాళ్ళు కాదులే,' అని తనూ ధైర్యం చెప్పుకున్నాడు.

'కొన్ని నెలలు శలవు పెట్టగలిగే ధైర్యం ఉంటే, ఇక్కడకు వచ్చి ఉండు, చక్కగా చేసి పెడతాను, అని మళ్ళీ ఇంకోసారి నచ్చచెప్తాము. ఎట్లాగో పుస్తకాలు చదివి ఆ రకంగా పిల్లల్ని పెంచటానికి ప్రయత్నిస్తున్నారు కదా అక్కడ అందరూను. పెద్దవాళ్ళ సలహాలు, అవసరం లేదని ఒప్పుకుంటారులే,' తనూ ధైర్యం చెప్పుకుంది.

ఫోన్ మ్రోగింది. *

SUGUNA PRASAD
REALTOR®, GRI, ABR

Are you considering buying a home?

Are you considering selling your home?

Are any of your friends or relatives thinking of buying or selling a home?

Are you relocating? I can assist you anywhere in the nation.



Prudential
Snyder & Company, Realtors®

Call Suguna for All of Your Real Estate Needs
Cell: 734-678-6164
Home: 734-665-6892
sugunaprasad@comcast.net

Serving the communities of: Washtenaw, Livingston, and Western Wayne Counties

©2004, An independently owned and operated member of the Prudential Real Estate Affiliates, Inc.
Prudential is a service mark of the Prudential Insurance Company of America. Equal Housing Opportunity.

మట్టిగుర్రాలు

వి. ప్రతిమ

ఒక పెద్ద భూగోళం వంటి గుండ్రటి ఆకారం తలగా... కళ్ళ స్థానంలో రెండు లోతైన గుంటలు... వాటిల్లో నుండి అగ్నిజ్వాలలూ... నోట్లో నుండి రెండు పొడవాటి కోరలూ... ఆ కోరల్లో నుండి అగ్నికీలలూ... ఏమిటా ఆకారం... ఏమయి వుంటుంది?...

వెన్నులో నుండి వొణుకు పుట్టి చప్పున కళ్ళు తెరిచాన్నేను...

ఇహైకస్థం జగత్కృత్స్నం పశ్చాత్య సచరాచరమే
మమదేహే గుడాకేశా యచ్చాన్యద్రష్టు మిచ్ఛసి

భగవద్గీత పెట్టినందుకు కాబోలు కండక్టరు మీద గయ్యిమంటూ లేచిన కుర్రాళ్ళు అదాపించి ఒక యాక్షన్ ఫిల్మ్‌ని టివి కెక్కించారు.

జివ్వుమంటూ దూసుకొస్తోన్న చలిగాలి కొంత ఉపశమనాన్ని ఇస్తున్నట్టుగా అన్పించి... నింపాదిగా వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాను. ఈ ఓల్వో బస్సుల్లో ఉండే సౌకర్యమిదే. శరీరాన్నయితే వాల్చాను కానీ మనసును నింపాదిగా ఉంచుకోవడం సాధ్యం కావడం లేదు.

ఇవ్వాళా, రేపూ సెలవుల కోసం నాయనమ్మల్ని, తాతయ్యల్ని చంపడం చాలా తేలికైతే అయ్యుండొచ్చు... నాకైతే ఈరోజు సెలవడగడం కోసం నాయనమ్మ నిజంగానే చచ్చిపోయిందని చెప్పాలంటే నోరాడలేదు.

"ఎందాకమ్మా?" ప్రక్కనావిడ ప్రశ్నతో బలవంతంగా కళ్ళు తెరిచాను. బరువుగా ఉన్నాయి కనురెప్పలు...

"నెల్లూరు," చెప్పాను.



"మేము కూడా నెల్లూరే... ఆడ దిగి వెనవర్తికి పోవాల... నా చిన్న కూతురుండాది... మనిషొచ్చుంటాడు... ఆరయిపోతాదంట నెల్లూరికి పొయ్యేలోపల..." అన్ని వివరాలూ చెప్పేసిందామె. తన పేరు మాత్రమే చెప్పలేదు. తనకి ఆవైపుగా కూర్చుని ఉన్నది పెద్ద కూతురని కూడ చెప్పింది.

"అలాగా," అన్నాను అనాసక్తంగానే.

ఇలా బస్సుల్లో కూర్చుని ప్రక్కవాళ్ళతోనో, వెనక వాళ్ళతోనో బాతాఖానీలు కొట్టడం నాకిష్టముండదు... నా చిన్నపుడు నాయినమ్మ బస్సు ప్రయాణాల్లో పక్కవాళ్ళతో లోతైన పరిచయాలు పెంచుకోవడం... వాళ్ళ కష్టసుఖాలు వినడం... తను చేస్తోన్న ప్రయాణపు కారణాలను వివరించడం... అప్పుడప్పుడూ వాళ్ళని ఇంటిదాకా తీసుకొచ్చి భోజనాలు పెట్టి పంపించడం కూడ కద్దు...

వెన్నెల రాత్రుళ్ళలోనూ, వాన వస్తోన్న పగళ్ళలోనూ నాయినమ్మ ఎన్నెన్నో కథలు చెప్పేది... ఏడుచేపల కథ నుండి ఎయిర్ హోస్టెస్‌ల అనుభవాల వరకూ నాయినమ్మకి తెలీని విషయమూ, రంగమూ వుండేవి కావు...

అయితే నేను పెద్దదాన్నయి బస్సుల్లో ప్రయాణించడం మొదలు పెట్టాక ఎవరూ పక్కవాళ్ళతో మాట్లాడడం లేదు. ఈ హైటెక్ బస్సుల్లో అయితే మరీను...

"కిటికీ తలుపేస్తాం... చలిగా ఉంది..." చెప్పిందామె.

'ఛ్ఛీ ఆ గాలితో నేను మాట్లాడుకుంటున్నాను... నా దుఃఖాన్ని పంచుకుంటున్నాను...' అనబోయి మళ్ళీ పిచ్చిదాన్ననుకుంటుందేమోనని మౌనంగా గాజు తలుపు లాగేశాను.

"ఉండేది నెల్లూర్లోనా?"

నేనెక్కడ కళ్ళు మూసుకుంటానోనని నాకా అవకాశమివ్వకుండా అడిగేసిందామె.

"కాదు బెంగుళూర్లోనే... ఉద్యోగం చేస్తున్నాను... మా నాయినమ్మ... చనిపోయిందని ఫోనొస్తే వెళ్తున్నాను. నెల్లూర్లో దిగి కొత్తపాళెం పోవాల," ఇంక నన్నేమీ ప్రశ్నించొద్దన్నట్టుగా చెప్పేశాను.

"చ్చొచ్చొచ్చొ... అయ్యో నాయినమ్మకి బాగలేకుండా వుణ్ణిందా?" వదల్లేదామె.

నేను మాట్లాడలేదు.

"ఎంత వయసుంటాది?"

"డెబ్భయిరెండు," చెప్పి మళ్ళీ వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాను...

నాయినమ్మ స్మృతుల్ని నెమరు వేసుకోనీయకుండా భలే కేసే దొరికింది... నాయినమ్మతో నా అనుబంధం అనిర్వచనీయమైంది... నా తర్వాత రెండుసార్లు వెంటవెంటనే గర్భస్రావం జరగడం... ఆ తర్వాత తమ్ముడు కడుపున పడ్డంతో అమ్మ ఎక్కువభాగం పుట్టింట్లోనే వుండేదట... నేను నాయినమ్మతోనే వుండేదాన్ని.

వెన్నెల రాత్రుళ్ళలోనూ, వాన వస్తోన్న పగళ్ళలోనూ నాయినమ్మ ఎన్నెన్నో కథలు చెప్పేది... ఏడుచేపల కథ నుండి ఎయిర్‌హోస్టెస్‌ల అనుభవాల వరకూ నాయినమ్మకి తెలీని విషయమూ, రంగమూ వుండేవి కావు... కథలే కాదు ఎన్నెన్నో ప్రపంచరీతుల్ని కూడ తెలిపిందామె మాకు. రామాయణంలోనూ, భాగవతంలోనూ, భగవద్గీతలోనూ ఎక్కడ ఏ చిన్న అనుమానమొచ్చినా నాయినమ్మనడిగితే చాలు, చాలా సవివరంగా తెలియజెప్పేది... అవన్నీ ఆమె నాలుక చివరనే వుండేవి... వయసు మీద పడిన తర్వాత కూడ జ్ఞాపకశక్తి తగ్గకపోవడం ఆమెలోని విశేషం...

ఆ రోజుల్లోనే నన్నూ, మా మేనత్త కూతుళ్ళనీ కూర్చోబెట్టుకుని అమ్మాయిలకు పెళ్ళే జీవిత పరమావధి కాదనీ... బాగా చదువుకుని మగపిల్లల్లాగే ఉద్యోగాలు చేయాలనీ బోధించింది...

ఒకటా, రెండా నాయినమ్మ జ్ఞాపకాలు...

అయితే నేను ఉద్యోగంలో చేరినప్పట్నుంచీ నా పెళ్ళి గురించి మధన పడేది...

ఎన్నో సమస్యలనీ, కష్టాలనీ చీల్చుకుని... మరెన్నో చుట్టుపక్కల జీవితాలకు ఆలంబనయి, మార్గదర్శకమై రాజసంగా, పరిపూర్ణంగా జీవించిన నాయినమ్మ నా పెళ్ళిని మాత్రం ఈ భూమ్మీద మిగుల్చుకుని వెళ్ళి పోయింది...

ఉన్న పళంగా పొంగుకొచ్చిన దుఃఖాన్ని తట్టుకోలేక నా ఒళ్ళో నేనే తల పెట్టుకుని ఏడవసాగాను...

"ఏడవబాకమ్మా... మనం మాత్రం ఇక్కడే ఉంటామా చెప్పు?... అందరం పోయేవాళ్ళమే... కాకుంటే కొంచెం ముందూ, వెనకా అంతే. ఏడవబాక తల్లీ... అయ్యో ఒంటిగా ప్రయాణం చేస్తుండావే..." నా వీపు మీద చేయి వేసి నిమురుతూ నాతోపాటు ఆమె కూడ కళ్ళనీళ్ళు పెట్టుకుంది... ఆవైపుగా కూర్చున్న ఆమె కూతురు కూడ ఏదో అంటోంది... వాళ్ళ ముందు అలా బయటపడ్డం ఇబ్బందిగా అన్పించి మెల్లిగా నన్ను నేను అదుపులోకి తెచ్చుకున్నాను.

ఇవన్నీ ఏమీ పట్టనట్టుగా బస్సు మాత్రం చీకటిని చీల్చుకుంటూ సన్నటి తారురోడ్డు మీద వేగంగా జారిపోతూంది... నాయనమ్మ ఆలోచనల్లో నుండి మెల్లిగా మగతలోకి జారుకున్నట్టున్నాను... చాలాసేపే గడిచినట్టుంది...

"కొంచెం యిట్టొస్తావా తల్లీ వాంతి కొచ్చేట్టుంది... బస్సులో ఎక్కానంటే యింతే తల్లీ కడుపులో తిప్పతాది..." అంటూ మళ్ళీ పిలిచిందామె. కిటికీ సీటు వదలడం ఇష్టం లేకపోయినప్పటికీ తప్పనిసరిగా జారిపోతున్న దుపట్టాని సరిచేసుకుంటూ అవతలికి మారాను... ఆమె కూతురు ఆమెతో పాటుగా మధ్యలోకి మారింది.

రెండో... రెండున్నరో అయినట్టుంది... అప్పటికి టి.వి. కట్టేసి కండక్టరు కూడ నిద్ర కొరిగినట్టున్నాడు... బస్సంతా గాఢనిద్రలో జోగుతోంది... మళ్ళీ ఆలోచనల్లోకి... అందులో నుండి మగతలోకి జారుకున్నాను... ఎంతసేపలా నిద్రావస్థలో ఉన్నానో తెలీదు...

"అమ్మా... అమా... అమా... అమ్మా," అంటూ ఆమె ఏడుపు విని బిర్ర బిగుసుకుపోయి కళ్ళు తెరిచాను.

ముందు మంద్రస్వరంతోనూ... ఆ తర్వాత బిగ్గరగానూ ఉన్న ఏడుపు విని బస్సంతా నిద్రలేచింది...

నేను విస్తుపోతూ ఆమె కేసి చూశాను.

కిటికీ సీట్లో మూలకానుకుని నిద్రపోతున్నట్టే ఉందామె.

అందరమూ ముందూ, వెనకా పోవల్సిన వాళ్ళమేనంటూ నిరూపించి నన్ను ఓదారుస్తున్నట్టుగానే ఉందామె.

ఆమె కూతురెందుకో ఏడుస్తోంది...

'హార్ట్ ఫెయిల్యూరై ఉంటుంది,' పక్కవాళ్ళెవరో అంటున్నారు. అప్పటికే డ్రైవరు బస్సాపడం, అంతా మా చుట్టూ గుమిగూడడం జరిగి పోయింది.

నా గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి.

దిగ్భ్రాంతితో నా శరీరమంతా అచలనమై పోయింది.

రాత్రంతా నన్నూ, నా ఆలోచనలకూ అంతరాయం కల్గించిందని నేను విసుక్కున్న ఈ అమ్మ ఇంక లేదా?...

అయ్యో ఎక్కడికెళ్ళిందీమె... ఏమైపోయిందింతలోనే...

మనిషి ఉండడానికీ, లేకుండా పోవడానికీ మధ్య ఇంత సన్నని విభజనరేఖ...?

శిరీష వాళ్ళ పక్కింట్లో ఉండే రేఖ వాకిట్లో పాపకి అన్నం తినిపిస్తూ తినిపిస్తూ లోపలికెళ్ళింది మంచినీళ్ళు తీసుకురావడానికి... గ్యాస్ పేలింది. కారణమేదయినా సరే... జీవితానికీ, మరణానికీ నడుమ గల సన్నని సాలె పట్టుదారాలు ఇంత పుటుక్కు, పుటుక్కున తెగిపోతాయని అప్పుడే అర్థ మయింది నాకు...

"ఎన్ని చెప్పావమ్మా నిన్న సాయంత్రం నుండీ... చెల్లిని చూడాలని ఎంత ఆతృతపడ్డావు... దానికిష్టమైనవన్నీ చేసి పెట్టాలన్నావే... చెల్లిని మనింటికి తీసుకుపోదామని వచ్చి... నువ్వెక్కడికెళ్ళిపోయావమ్మా...?" గుండెలు బాదుకుంటోందామె... మళ్ళీ అంతలోనే,

"అయ్యా డ్రైవర్... త్వరగాపోనీ... మా అమ్మ బతికే ఉంది... ఆస్పత్రిలో చూపిద్దాం... ఎంత ఖర్చయినా ఫర్వాలేదు..." అంటూ డ్రైవర్నీ, కండక్టర్నీ తొందర చేస్తోంది.

బస్సంతా నిరామయంగా చూస్తోంది తల్లీకూతుళ్ళని...

అప్పటికి బస్సు నెల్లూరు టౌనులోకి ప్రవేశించింది... మెల్లిగా.

✤

"మామయ్యకేమయింది?" ప్రశ్నించాన్నేను ఆశ్చర్యంగా...

రవణమామ అమ్మకి చిన్నమ్మ కొడుకు... మామయ్య కూతురు శిరీష నాకంటే రెండేళ్ళు చిన్నది. కొంచెం మందంగా ఉంటుంది... పెళ్ళయి రెండేళ్ళయింది.

"ఏమయిందంటే ఏం చెప్తాం?... శిరీషని కారణం లేకుండా తరిమేశారని రెండుమూడుసార్లు వెళ్ళి నిలదీశాడు వాళ్ళని... మూడోసారి వెళ్ళినపుడు మాటామాటా వచ్చి ఏమనుకున్నారో ఏమో... బాగా తన్ని పంపించారు... వెంటనే తీసుకెళ్ళి హాస్పిటల్లో చేర్చాము. అదిగో యిదిగో అని రెండు రోజులున్నాడంతే... శిరీషనే కలవరిస్తా ప్రాణం పోయింది హాస్పిట ల్లోనే... ప్చ్..." బొంగురు బొంగురుగా అమ్మ చెప్తోంటే రమేష్ కళ్ళనీళ్ళు పెట్టుకుంటున్నాడు.

"కొత్తగా ఉద్యోగంలో చేరావు కదా... సెలవు దొరుకుతుందో, దొరకదో ఎందుకులెమ్మని నీకు చెప్పలేదు..." చెప్పుకు పోతోంది అమ్మ.

రమేష్నే చూస్తున్నాను నేను.

కాలేజీ చదువులు ముగిసి ఇంకా పూర్తిగా ఇంటి కొచ్చాడో లేదో కుటుంబ భారమంతా నెత్తిన పడటంతో వడలిపోయి ఉన్నాడు రమేష్... ఉద్యోగాన్వేషణక్కూడ ఇంకా మనసు మళ్ళినట్టు లేదు.. అదే అడి గాన్నేను...

"అసలిప్పుడు శిరీష పరిస్థితేంది?... అమ్మ చూస్తే పైకి లేవడం లేదు... ఇదంతా ఇట్టుంటే శ్రీనాథ్ శిరీష భర్త మీదికి యుద్ధానికి పోదామంటాడు... వాడెప్పుడేం చేస్తాడో, ఏమయిపోతాడోనని భయంగా ఉంది... ఇంకా చదువు కూడా పూర్తికాలేదు..." గాద్గదిక మవుతోన్న గొంతుతో తమ్ముడి గురించి ఆందోళన పడ్డాడు రమేష్...

"ఎక్కడ బట్టినా ఇదే అయిపోయింది కక్షలూ, కార్పణ్యాలూ చిన్న మాట నువ్వన్నావంటే నేనన్నానని తిట్టుకోవడం... కొట్టుకోవడం... చంపుకోవడం కూడ చాలా తేలికయిపోయింది మనుషులకి. మన రంగమ్మ కొడుకు గురుకుల పాఠశాలలో చదువుతుండేవాడు చూడు 'మధు' అని... వాడ్నెవరో హాస్టలు నుండి తీసుకెళ్ళి క్షుద్రపూజల కోసం నరికి చెరుకు తోటలో పారేశారంట... రంగమ్మ మంచానికంటుకు పోయింది. పనికొచ్చి మూడునెలలయిపోయింది. చెప్తినే... చంపడం చాలా సులువైపోయింది మనుషులకి... ప్చ్," గుండె గొంతులో కొస్తుండగా చెప్పింది అమ్మ...

చాలాసేపు ఎవరమూ మాట్లాడుకోలేదు...

అందరిలోనూ ఏదో అలజడి... ఆందోళన... అశాంతి...

అసలే ఉడుకురక్తం... విద్యార్థి ఉత్సాహం... తండ్రి మరణించాడన్న ఉక్రోషం... శ్రీనాథ్ ఎప్పుడెళ్ళి శిరీష భర్తని ఏం చేస్తాడోనని ఇంటిల్లిపాదీ ఆందోళన చెందుతున్నట్లుగా అర్థమయింది. ఈ ఆందోళన అందరినీ నానమ్మ మరణం తాలూకు ఆలోచనలనీ, దు:ఖాన్నీ అధిగమించినట్లుగా వుంది...

నాయనమ్మని ఇంట్లో అంతా ఇంత త్వరగా ఎలా మరిచిపోగలిగిరా అంటూ లోలోపలే మధనపడుతూండిన నాకు సమాధానం దొరికినట్టయింది...

సాయంత్రం వెళ్ళి అత్తయ్యనీ, శిరీషనీ చూసి రావాలనుకున్నాను...

నాకంత వ్యవధినీ, స్థిమితాన్నీ ఇవ్వకుండానే రమేష్ జేబులోని సెల్ ఫోన్ మోగింది... ఏదో కొత్త ధ్వనితో...

✤

రెండు, మూడు తాటిమాన్ల నిలువున్న ఆ మనిషికి అనేక చేతులూ, అనేక కాళ్ళూ, అనేక తొడలూ, ఎన్నెన్నో కళ్ళూ, మరెన్నో నోళ్ళూ... లెక్కింప

"ఎన్ని చెప్పావమ్మా నిన్న సాయంత్రం నుండీ... చెల్లిని చూడాలని ఎంత ఆతృతపడ్డావు... దానికిష్టమైనవన్నీ చేసి పెట్టాలన్నావే... చెల్లిని మనింటికి తీసుకుపోదామని వచ్చి... నువ్వెక్కడికెళ్ళిపోయావమ్మా...?"

జాలనన్ని కోరలూ... కళ్ళలో నుండీ, నోళ్ళలో నుండీ బయటికొస్తోన్న అగ్నిజ్వాలలూ... ఆ భయంకరాకారాన్ని చూడ్డానికే సాధ్యంకాని పరిస్థితుల్లో చాలామంది నాకు తెలిసినవాళ్ళూ, తెలియనివాళ్ళూ... నేను రోజూ టీవీలో, పేపర్లలో చూస్తున్నవాళ్ళూ, చూడనివాళ్ళు ఎన్నెన్నో మానవాకారాలు ఆ నోళ్ళల్లో నుండి... ఆ మంటలు నిండిన నోళ్ళల్లో నుండి లోపలికి ప్రవేశిస్తున్నారు.

నాయినమ్మ, రవణమామ, కిటికీసీటామె... పక్కింటి రేఖ... రంగమ్మ కొడుకు... నా చిన్నప్పటి స్నేహితురాలు రాజేశ్వరి... కమల, నాగు, నళిని... ఇంకా రాజకీయ నాయకులెవరెవరో.. కర్నూలు లక్ష్మి... శ్రీశైలం... పుష్పక్క... పద్మ... పోలీసాఫీసరు తల్లి... అంతా... ష్‌ఁ అంతా ఆ నోళ్ళలో నుండి వెళ్ళిపోతూ ఉన్నారు.

మరికొందరు మనుషులు ఆ భయంకరాకారపు పండ్ల సందుల్లో చిక్కుకొని పొడిపొడయిన శరీరాలతో... హబ్బా‌ఁ చూడ్డానికే దారుణంగా ఉందా స్థితి... మరోవంక ఆ ఆకారం చుట్టూ అనేకమంది మనుషులు మోకరిల్లి ప్రార్థనలు చేస్తున్నారు.

"ఆదిమధ్యాన్తరహితుడవైన ఓ దేవదేవా... నువ్వెవరవు?... అశాంతితో రగిలిపోతున్న ఈ భూమ్మీది ప్రజలను కాపాడ్డానికే నువ్వొచ్చి ఉన్నట్టయితే... ఇంత భయంకరంగా మమ్మల్నంతా ఎందుకు భయపెడు తున్నావు? శాంతించు తండ్రీ శాంతించు..." అంటూ మా ఊరి పూజారి ఆ అగ్నిగోళం వంటి నోట్లోకి వెళ్ళి ఐక్యమైపోయాడు.

"దేవుడివో రాక్షసుడివో... పుట్టింది మొదలూ మట్టిని నమ్ముకున్న వాళ్ళం... ఆ మట్టి కూడ మమ్మల్ని మోసం చేస్తోంది... ఎరువులు కల్తీ... విత్తనాలు కల్తీ... మందులు కల్తీ... మనుషులు కల్తీ అయి చివరికి మట్టి కూడ కల్తీ అయిపోయి మాలో ముప్పాతిక వంతు రైతులు ఆత్మహత్యలు చేసుకోగా... వలసపోయిన వాళ్ళు పోగా... ఇంకెవరున్నారని ఉద్ధరించడాని కొచ్చావు..." బక్కపేగులూ, చింపిరిగడ్డాలతో ఉన్న వ్యక్తులు కొంతమంది పరుగు పరుగున ఆ నిప్పు నోళ్ళల్లోకి ప్రవేశిస్తున్నారు... వాళ్ళు అంతకు ముందే ఆత్మహత్య చేసుకోవడానికి నిర్ణయించుకున్నవారిలా ఉన్నారు...

అదిగో నాయనమ్మ... హై...

వాళ్ళని ఎదురొచ్చి ఆహ్వానించి తీసుకెళ్తోంది... నాయినమ్మకి రైతు లంటే చెప్పలేనంత అభిమానం... ఎందుకంటే ఆమె కూడ ఒక రైతే... తాతయ్య పోయిన్నాటి నుండీ మా పొలాన్నంతా ఆమె ఒక్క చేత్తో పండించి చక్రం తిప్పింది... నాలుగయిదేళ్ళుగా పంటలు పండడం లేదని మధన పడేది. రైతు బాగుంటేనే దేశం బాగుంటుందనేది. లోకానికి అన్నం పెట్టే రైతు చివరికి అన్నంముద్దకి కరువొచ్చి అంగలార్చడాన్ని ఆమె తట్టుకోలేక పోయేది.

ఋణబాధల్తో రైతులు ఆత్మహత్యలు చేసుకోవడాన్ని విని, చదివి కళ్ళనీళ్ళు పెట్టుకునేది... దేశానికి రైతు వెన్నెముక అన్న మహాత్ముడి మాటల్ని పదేపదే గుర్తు చేసేది... అందుకే కాబోలు ఆ రైతులందర్నీ నాయినమ్మ సాదరంగా ఆహ్వానించి తీసుకెళ్తోంది... వాళ్ళందరినీ ఆ అగ్నిజ్వాలలేవీ అంటుతున్నట్లుగా లేవు...

"ఓ మహాపురుషా‌ఁ... మనిషికి శీలం ముఖ్యమని నమ్మి... శీలాన్ని నిర్మించే విద్య కావాలని, 'వ్యక్తిశీల నిర్మాణం,' అన్న సబ్జెక్ట్‌ని కళాశాల విద్యార్థులకు పెట్టాలని ఎంతగానో ప్రయత్నించి విఫలమయ్యాను... పిల్లల మీద చదువుల భారం... ఒత్తిడి తగ్గించాలని చూశాను... నన్ను పిచ్చివాడిలా చూశారు... ఎండల్లో తరగతులేంది?... వేసవి సెలవుల్లేకుండా అన్నాను. నా గోడు ఎవరూ పట్టించుకోలేదు... శీలం లేకుండా పక్కదారులు పడ్తోన్న యువతను ఏ మాయల మరాఠీ వచ్చి రక్షించగలడు?..." మా ఊరి జూనియర్ కాలేజి ప్రిన్సిపాల్ విరక్తిగా ఆ అగ్నిగోళంలోకి వెళ్ళిపోయాడు నడుచుకుంటూ...

"మహానుభావా‌ఁ... మేము చాలాచాలా పాపాలు చేశాము... బీదా, బిక్కీ, పెద్దా, చిన్న లేకుండా అందరివద్దా లంచాలు తిన్నాం... ఎంతో డబ్బు ఒకేసారిగా సంపాదించేయాలని ఆరాటపడ్డాం... పేదలకు ఇళ్ళ స్థలాలు ఇచ్చే విషయంలో ఎంతో గోల్‌మాల్ చేశాం... ఇప్పుడు మొత్తం వదిలిపెట్టి వచ్చేస్తున్నాం..." మా ఊరి ఎమ్మార్వో... ఇంకా అతడితో పాటు అనేకమంది అధికారులూ వేగంగా వెళ్లి ఆ ఆకారపు పంటి సందుల్లో ఇరుక్కుపోయి లోపలికెళ్ళాలో, బయటికి రావాలో తెలీక తనకలాడు తున్నారు.

"ఆదిపురుషా‌ఁ... పేద దళితులు చిన్నచిన్న ఋణాలిప్పించమని వస్తే తన్ని తగలేసి, తిరిగి చెల్లించనటువంటి బడా వ్యాపారులకు లక్షలు లక్షలు లోన్లిప్పించాం ప్రభుత్వాన్నుండి... మమ్మల్ని మన్నించు..." అంటూ మా ఊరి బ్యాంకు మేనేజర్లిద్దరూ ఆ అగ్నిగోట్లోకి దూరిపోయారు.. మా ఊళ్ళో రెండే బ్యాంకులున్నాయి...

అప్పులివ్వడంలోనూ, ఇచ్చిన ఋణాలు వసూలు చేయడంలోనూ పేద రైతుల్ని నానా బాధలూ పెడ్తున్నారని బ్యాంక్ మేనేజర్లతో నాయినమ్మ ఎప్పుడూ గొడవ పడుతూ ఉండేది... 'ఈ అధికారులకంతా ఏనుగులు దూరిపోయే కంతలు కన్పడవు... ఇట్లా చిన్నచిన్న ఎలుకలు దూరే కంతల్ని మాత్రం పట్టుకుంటారు... రైతుల మీద, రైతు కూలీల మీద, పేదోళ్ళ ఇళ్ళ మీద మాత్రం ఋణాలు చెల్లించమని దాడులు చేసి... కుండా, గుడ్డా,



చట్టీ, గోచీ బయట పారేస్తారు...' అంటూ ఈ బ్యాంకోళ్ళని నాయినమ్మ అధిక్షేపించడం అనేకసార్లు వింది తను...

ఆ ఇద్దరు మేనేజర్లూ అగ్ని నోట్లోకి దూరి పోయారు.

"అవతారపురుషా! నేనీ ఊరికొచ్చి నాయకులు చెప్పినట్టల్లా ఆడాను... గత్యంతరం లేక అలా ప్రవర్తించానే తప్ప నాకూ అమాయక జనాల్తో ఆడుకోవాలని లేదు... మొదట్లో ఎంతో నిజాయితీగా పీడిత జన పక్షాన నిలబడ్డాను... నన్ను ఫుట్‌బాల్ ఆడుకున్నట్టు ఆడుకున్నారు మహానుభావా... నాయకులంతా... ఒకచోట స్థిమితంగా ఉండనిచ్చేవాళ్ళు కాదు... నేను బాగుంటేనే కదా ఎవరి పక్షానయినా నిలబడగలిగేది... అందుకే, నా బాగు నేను చూసుకున్నాను. మన్నించు తండ్రీ... మా ఊరి ఎస్.ఐ. ప్రాణాల మీది తీపితో తకబికలాడుతూనే ఆ నోట్లోకి మాయ మయ్యాడు...

విదేశీ కార్లకోసం... ప్రపంచబ్యాంకు ఆదేశాలతో వేసిన మా జిల్లా రోడ్లకి ధనదాహంతో పాటు రక్తదాహం కూడ ఎక్కువయిపోయింది.

ఇదిగో టవును దాకా వెళ్ళొస్తామంటూ స్నేహితుడితో కలిసి మోటర్ సైకిలు మీద వెళ్ళిన శ్రీనాథ్... ఉద్యోగధర్మం మీద వెళుతూ విలేఖరు లిద్దరూ... అత్తగారింటికెళ్తున్న కొత్త పెళ్ళికొడుకూ... తిరుపతి యాత్రకు వెళ్తూ వెళ్తూ అనేక దూరప్రాంతాల కార్లూ, వాహనాలూ మొత్తం అన్నీ కలిసి రక్తమోడుతూ ఆ రోడ్డు... కోట్లు ఖర్చుపెట్టి వేసిన కొండచిలువ లాంటి ఆ రోడ్డు... రోడ్డంతా మొత్తంగా కంప్యూటర్ గ్రాఫిక్స్ మాదిరి ఆ అగ్నిగోళాల్లోపలికి వెళ్ళిమాయమయిపోయింది.

టవును దాకా వెళ్ళొస్తామంటూ స్నేహితుడితో కలిసి మోటర్ సైకిలు మీద వెళ్ళిన శ్రీనాథ్... ఉద్యోగధర్మం మీద వెళుతూ విలేఖరు లిద్దరూ... అత్తగారింటికెళ్తున్న కొత్త పెళ్ళికొడుకూ... తిరుపతి యాత్రకు వెళ్తూ వెళ్తూ అనేక దూరప్రాంతాల కార్లూ, వాహనాలూ మొత్తం అన్నీ కలిసి రక్తమోడుతూ ఆ రోడ్డు... కోట్లు ఖర్చుపెట్టి వేసిన కొండచిలువ లాంటి ఆ రోడ్డు...

ఆ మంటల్లో నుండీ, ఆ నోళ్ళల్లో నుండీ రక్తం కారుతోంది వికృతంగా. అక్కడే నిల్చుని చూస్తోన్న నాయినమ్మ కళ్ళల్లో నుండి నీళ్ళు కారుతున్నాయి ధారాపాతంగా...

"మాకు పోలీసులు శత్రువులు కాదు... మిత్రులే... ప్రజాస్వామ్యమే లేని ప్రభుత్వం తరపున ఏజంట్లుగా ప్రవర్తిస్తున్నందుకే మా కోపం తప్ప మరేమీ కాదు... మేం చేస్తున్నది ప్రజా పోరాటం... రాజ్యపు అణచివేత స్వభావాన్ని ఎదుర్కోవడంలోనూ, బూటకపు ఎన్‌కౌంటర్లు, కూబింగులనూ ఆపడంకోసం తప్పనిసరిగా ఆయుధాలనుపయోగిస్తున్నామే తప్ప పోలీసులు మాకు శత్రువులు కాదు...

"ఉన్నతమై ప్రజాస్వామికవ్యవస్థ కోసం... విప్లవ ప్రతిహింసను మార్గంగా ఎంచుకున్న మా ప్రజావిముక్తి పోరాటాలను అణిచివేయాలని చూస్తోంది రాజ్యం... ప్రజాస్వామిక ప్రజా ప్రభుత్వాలను ఏర్పాటు చేసుకునే దాకా ఇది తప్పనిసరి... నువ్వే చెప్పావట కదా దుష్టశిష్టణ చేసి తీరాలని... ఆ క్రమంలో కొంతమంది అమాయకులు కూడ బలవక తప్పదు. సారీ..."

✤

"ఈ చంపుడు పందేల యాగంలో సమిధలై మనశ్శాంతి లేకుండా పరుగులు పెడుతోన్న మమ్మల్ని ఈ విధంగా కాపాడ్డానికొచ్చావా నాయినా?... ఒక వ్యక్తి యొక్క జీవించే హక్కుని హరించే హక్కు వీళ్ళకెవరిచ్చారు... పరస్పరం చంపుకుంటూ పోవడం మాత్రమే పరిష్కారమా? మేం ఒంటరిగా ఉన్నపుడో... మందితో ఉన్నపుడో... పక్కవాళ్ళతో కలిసో, కలవకో... పొట్ట కూటి కోసమో ఏదైనా తప్పులు చేసి ఉంటే మన్నించు తండ్రీ" అంటూ మామూలు మనుషులంతా మహదానందంగా వెళ్ళి ఆ మంటల్లోకి... ఆ మంటలొస్తోన్న నోళ్ళల్లోకి దూరిపోతున్నారు... అదిగో నాయినమ్మ మళ్ళీ వచ్చింది ఈ మామూలు మనుషుల్ని... పేదా సాదాని దగ్గరుండి ఆహ్వానించి తీసికెళ్ళిడానికి...

నాయినమ్మ తన కూతుళ్ళకీ, కోడలికీ... మన వళ్ళకీ, మనవరాళ్ళకీ... ఒక్కమాట చాలా గట్టిగా చెప్పేది. వాకిట ముందు కొచ్చి ఆకలి అన్న వ్యక్తికి గుప్పెడు మెతుకులు పెట్టడం ఖచ్చితంగా అలవాటు చేసుకొమ్మని... పనివాళ్ళని చాలా ఆదరంగా చూసేదామె... సేద్యగాళ్ళకి కడుపుచూపి వడ్డించేది... ఇంటికి కూరలు అమ్ముకోవడానికొచ్చిన వాళ్ళని కూడ ఊరికే పంపేదికాదు.

వేరుశెనగ పండితే పదిమూటలకి తక్కువ లేకుండా బంధుమిత్రులందరికీ పంచేది. 'పెట్టడం అనేది లచ్చిందేవమ్మ దగ్గిర నేర్చుకోవాలి. ఆమె చెయ్యే చెయ్యి...' అనుకునేవాళ్ళు ఊళ్ళో అంతా.

✤

"దేవదేవా... దేవాధిదేవా పాహిమాం... పాహిమాం..."

"మేము మొదటి నుండీ చెప్తూనే ఉన్నాము... అందరం సామరస్యంగా కూర్చుని చర్చిద్దాం... ఆయుధాలని ఒదిలిపెట్టిండి అని... లౌకిక ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఉద్యమాలెందుకు మహాపురుషా... ఇరుపక్షాల నడుమా అవగాహనారాహిత్యం మూలంగా ప్రజా బాహుళ్యానికీ... ప్రజా సమస్యల పరిష్కారానికీ ఆటంకం ఏర్పడిన మాట వాస్తవమే... ప్రజాస్వామిక ప్రభుత్వంలో ఉండి మా పోలీసుల దుందుడుకుతనాన్ని నియంత్రించడంలో మేము విఫలమైన మాట వాస్తవమే అధ్యక్షా... క్షమించు దేవా... మొన్నటి దాకా అసెంబ్లీ సమావేశాలు జరిగినందువల్ల ఈ అధ్యక్షా అనే మాట ఇంకా నాలుక మీదనే ఉండిపోయింది...

"ఏది ఏమైనా ఈ రాజ్యాన్నీ... ప్రభుత్వాన్ని సముద్ధరించడంలో... మేము తలమునకలై ఉన్నాం... ప్రస్తుతం మమ్మల్ని క్షమించి మాక్కొంచం సమయాన్నివ్వు దేవాధిదేవా..."

రాజకీయ నాయకులు ఆ విశ్వరూపం ముందు నిలబడి తాము చెప్పదలుచుకున్నదంతా చెప్పి, వెనక్కి వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నారు... ఏ అయస్కాంతపు ఒత్తిడో వాళ్ళని ఆ అగ్నికీలలు వెలువడుతోన్న నోళ్ళ వైపుగా సర్రున లాగుతున్నట్లుగా ఉంది.

నాయినమ్మ, నాయినమ్మతో పాటుగా అంతకుముందే లోపలికి వెళ్ళిన బక్కపేగుల రైతులంతా... చప్పట్లు చరుస్తూ నవ్వుతున్నారు రాజకీయ నాయకుల్ని చూసి... వాళ్ళ హైటెక్కు అభివృద్ధే వ్యవసాయాన్ని దెబ్బకొట్టిందని తెలీని వాళ్ళు లేరు...

"దేశంలోని గిరిజన, దళిత, ఆదివాసీ... మారుమూల ప్రాంతాలను ప్రభుత్వాలు దశాబ్దాల తరబడి నిర్లక్ష్యం చేయడం వల్లనే ఇవ్వాళ విప్లవపక్షం ఏర్పడి నక్సల్స్ సమస్య జటిలమయిందనీ, నిజానికి ఇది శాంతిభద్రతల సమస్య కాదనీ... సామాజిక ఆర్థిక సమస్యలతో ముడివడి ఉందనీ నివేదికలు సమర్పించాం... ఉత్పత్తి శక్తుల పెరుగుదలకూ, గొప్ప వనరులు పెరగడానికీ భూ సంస్కరణల అమలు ఎంత అవసరమో తెలియజెప్పాం... మొత్తుకున్నాం. మా మాటని ఇరుపక్షాలూ... ఆ మాటకొస్తే అసలే ప్రభుత్వమూ కూడ పట్టించుకోనేలేదు మహానుభావా... మా మేధస్సులు కాలరాయడానికే తప్ప... ఇక్కడ మేం చేయగల్గిందేమీ లేదు..." మేధావుల గుంపు ఒకటి తమతమ ఆలోచనలనూ, నివేదికలను సవివరంగా తెలియజేసి నిటారుగా ఒక్కొక్కరే అవతార పురుషుడి నోటిలోకి నడుచుకుంటూ వెళ్ళిపోయారు.

ప్రార్థనలు చేస్తున్నవాళ్ళు అతి కొద్దిమంది మాత్రమే.

అంతకు కొన్నివేల రెట్ల జనాలు మిడత లేవిధంగా అయితే వెతుక్కుంటూ వెళ్ళి అగ్నిలోకి ప్రవేశిస్తాయో ఆ విధంగా అమితమైన వేగంతో ఆ భయంకరాకారుడి నోటిలోకి... ఆ కీలాగ్నిజ్వాలల్లోకి వెతుకులాడుతూ వచ్చి దూరిపోతున్నారు.

మొత్తం ప్రపంచమంతా తపనతో వేగిపోతోంది...

పేదలకు వైద్యం చేయడానికి ముందుకురాని మా ఊరి డాక్టర్లూ, మా ఇంట్లోవాళ్ళూ... బయటివాళ్ళూ... ఎదురింటివాళ్ళూ, పక్కింటివాళ్ళూ ఒకరని లేదు... ఇళ్ళూ, వాకిళ్ళూ, చెట్టూ, పుట్టా అంతా ఆనోటిలోకి వెళ్ళిపోతున్నాయి వరుసగా...

ఎక్కడా ఒక చిన్నపిట్ట కూడా కన్పించడం లేదు...

మొత్తం మానవ సమూహాన్నంతా... ఈ సర్వ చరాచర ప్రపంచాన్నంతా లోపలికి తీసేసుకున్నాడా భయంకరాకారుడు...

నేను... నేను మాత్రమే ఎక్కడున్నాను... ఎలా చూడగల్గుతున్నాను?

ఆ విశ్వరూపుడు క్రమంగా మాటలన్నింటినీ లోపలికి తీసుకుని అనేక చేతుల్ని రెండుగా... అనేక నోళ్ళని ఒకటిగా... ఎన్నెన్నో కాళ్ళనీ, తొడలనీ రెండుగా మార్చుకొని... ఒక ప్రసన్నరూపం దాల్చాడు ప్రత్యేకమైన వర్చస్సుతో వెలిగిపోతోందతడి ముఖం...

ఇందాకటి భయంకరమైన అగ్నికీలల్తో నిండిన ఆ వికృత రూపానికీ... ఇప్పటి ఈ తేజోమయ కాంతి స్వరూపానికీ ఎక్కడా పోలికే లేదు...

ఇందాకట్నుంచీ అన్పించలేదుకానీ... ఇప్పుడెందుకో భయం భయంగా చూస్తున్నానతడి వంక...

హఠాత్తుగా అతడు మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

"కరుణ, ప్రేమ, దయ, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం... వ్యక్తిశీల నిర్మాణం... అన్ని నూతన విలువలతో కూడిన ఒక కొత్త సమాజ వినిర్మాణంలో... నేను... నేనే..."

ఈ వాక్యాన్ని అతడు మూడుసార్లు ఉచ్చరించి... ఎడమచేతిలోని ఒక స్వర్ణ కమండలంలో నుండి... బంగారువర్ణంలో మెరుస్తోన్న వెడల్పాటి అతడి కుడి అరచేతిలోనికి నీళ్ళు ఒంచుకుని... ఆ సువిశాలమైన మైదానం మీద చిలకరిస్తున్నాడు... అతడి పక్కనే శ్వేత అశ్వమొకటి ఉరకలు వేస్తోంది.

మళ్ళీ ఒకసారి కనుచూపుమేర తల తిప్పి చూశాను.

ఎక్కడా ఒక చెట్టూ, పుట్టా, పిట్టా... ఇల్లూ, వాకిలీ, మనిషీ, మానూ... ఏమీ లేవు. సినిమాల్లో చూసే థార్ ఎడారిలా ఉందా ప్రదేశం.

ఆ సువిశాలమైన నిర్మానుష్య మైదానంలో తన అస్తిత్వాన్ని వ్యక్తపరుస్తూ గాలి మాత్రమే చప్పుడు చేస్తోంది.

అకస్మాత్తుగా అతడు చిలకరించిన నీటిలో నుండి ఒక మానవాకారం రూపుదాల్చింది... స్త్రీయో, పురుషుడో తెలీనట్లుగా క్రమక్రమంగా స్వరూపాన్ని సంతరించుకుందా ఆకారం... థెరిస్సా... మదర్ థెరిస్సా... విస్తుపోయి చూస్తున్నాన్నేను...

మదర్ మెల్లిగా నడుచుకుంటూ వచ్చి పక్కకు నిలుచున్న తరువాత... మరో మానవకారాం... మరోటీ... మరోటీ... మరోటీ...

నైటింగేల్, మార్క్స్, మావో, అంబేద్కర్... మన్యంవీరుడు అల్లూరి... మహాత్ముడు... సుభాష్ చంద్రబోస్... మా నాయినమ్మ... నా చిన్నప్పటి మా ఊరి గవర్నమెంట్ డాక్టరు కృష్ణమూర్తీ... ఆయన్నంతా పేదల డాక్టరని పిలిచేవాళ్ళు... ఇంకా ఇంకా నాకు తెలీని నేను గుర్తుపట్టలేని మరికొందరు...

అర్థమయింది... మనుషుల పట్ల జాలి, దయ, ప్రేమ, కరుణ, స్నేహం... గల వ్యక్తులంతా మళ్ళీ ఒక్కక్కరే ఉద్భవిస్తున్నారు...

"నాయినమ్మా..." పెద్దగా అరిచాన్నేను...

మదర్ మెల్లిగా నడుచుకుంటూ వచ్చి పక్కకు నిలుచున్న తరువాత మరో మానవకారాం... మరోటీ... మరోటీ... మరోటీ... నైటింగేల్, మార్క్స్, మావో, అంబేద్కర్... మన్యంవీరుడు అల్లూరి... మహాత్ముడు... సుభాష్ చంద్రబోస్... మా నాయినమ్మ...

నా గొంతెవరికీ వినిపిస్తున్నట్లు లేదు... ఎవరూ పట్టించుకోలేదు... వాళ్ళంతో ఏదో 'మరో ప్రపంచాన్ని' నిర్మించడానికుద్యుక్తులై ఏకాగ్రతలో నిమగ్నులై ఉన్నారు...

హఠాత్తుగా నేను ఒంటరిగా ఉన్నానన్న విషయం గుర్తొచ్చింది.

అమ్మ గుర్తొచ్చింది... నాన్న గుర్తొచ్చాడు... తమ్ముడు గుర్తొచ్చాడు... ఇక వాళ్ళంతా మళ్ళీ పుట్టరా?... ఇల్లూ, ఇంటి ముందరి గులాబీపూలూ, ఇంకా ఏదేదో... జ్ఞాపకాలు... భ్రమలు...

ఆ భ్రమల్నుండి తేరుకోలేక...

బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టాన్నేను...

✤

"డాలీ... డాలీ... డాలీ తల్లీ..."

ఎక్కడ్నుంచో చాలా దూరం నుండి ఎవరో పిలుస్తున్నారు. ఇంకా ఎవరో మిగిలే ఉన్నట్టున్నారు... నా పేరు తెలిసిన ఎవరో మిగిలే ఉన్నారు...

నాకు ఏడుపాగడం లేదు... మరింత ఎక్కువయింది.

"ఏంటి తల్లీ ఇది చిన్నపిల్లలా... ఏదైనా కలొచ్చిందా?" బుజ్జగించి అడుగుతున్నాడు నాన్న.

అమ్మ ఇచ్చిన మంచినీళ్ళు గటగటా తాగేసి కళ్ళు తుడుచుకున్నాన్నేను.

నాన్న ఏదో చెప్పుకుపోతూనే ఉన్నాడు ధైర్యాన్నిస్తూ...

"మన వ్యక్తిగత, సామాజిక జీవితాలలోని ఎక్కువభాగం సమస్యలకూ... దు:ఖానికీ కారణం అనాదిగా వస్తోన్న మన విలువల్ని నిర్లక్ష్యం చేయడమే... మానవజాతి మనుగడకు సంబంధించిన మౌలిక విలువల్ని మనం క్రమక్రమంగా ధ్వంసం చేసేసుకుంటున్నాం... మనిషి దృష్టి 'మనీ' మీదికి మళ్లింది..."

ఏదో భయం, అభద్రతాభావం, ఆందోళన, అలజడి చుట్టుముట్టినట్లుగా ఉన్న నన్ను ఏవేవో అనునయ వాక్యాలతో, మంచి మాటలతో మామూలు మనిషిని చేయాలని చూస్తున్నాడు నాన్న...

"అమ్మా కలిపురుషుడెప్పుడొస్తాడమ్మా... ఎప్పుడొస్తాడో తెలుసా? నాయినమ్మ ఇంకా రాలేదా?..." ఉన్నట్టుండి ప్రశ్నించాన్నేను.

అమ్మ ఏడుస్తోంది.

ఇంటా, బయటా జరుగుతున్న వరుస సంఘటనలకు భయపడి కాదు... కూతురేమయిపోతుందోనన్న భయంతో...

విరక్తితో వేల జీతమొస్తోన్న ఉద్యోగాన్ని వొదిలి పెట్టేస్తానేమోనని నాన్న భయం...

మనుషులంతా రకరకాల భయాల పుట్టల్లో తిరుగాడుతున్నట్టున్నారు... మానవత్వం సిగ్గు వల్మీకంలో తలదాచుకున్నట్టుంది... ఎక్కడా కన్పించడంలేదు...

"నాన్నా కలిపురుషుడెప్పుడొస్తాడు నాన్నా... నీకూ తెలీదా?"

చెప్పలేనంత అశాంతి నా మెదడునీ, హృదయాన్నీ నములుతున్నట్లుగా ఉంది... నా కళ్ళు వర్షిస్తున్నాయి.

"నేనెవర్ని?... ఈ ప్రపంచంలో, లేదా ఈ సమాజంలో నా స్థానం ఏమిటి?... ఇంతటి అభద్రతా భావంతో ఎవరికైనా ఏమయినా చెప్పగలిగిన ప్రజ్ఞ నాకెక్కడిది... ఇక్కడ నా ఉనికే ప్రశ్నార్థకమైనపుడు, అస్థిరమైనపుడు నా మాటకు విలువేముంది..." నాన్న బహుశా ఇదే ఆలోచిస్తూ ఉండి ఉంటాడు... మాట్లాడలేదు...

"చెప్పు నాన్నా... అయ్యో నాయినమ్మయితే చెప్పి ఉండేదే... నాయినమ్మా... నువ్వు మళ్ళీ బతికావు కదా... వచ్చేయి మనింటికొచ్చేయి... నానమ్మా..." మారాం చేశాన్నేను.

అమ్మ మరింత బిగ్గరగా ఏడవసాగింది నెత్తి బాదుకుంటూ...

"హుఁ" దీర్ఘంగా నిట్టూర్చారు నాన్న... నాన్న వెనుకగా తలపక్కన నాయినమ్మ కన్పించీ, కన్పించకుండా నవ్వుతూ చూస్తోంది నావైపు...



"కలి పురుషడంటూ ఎవరో వచ్చి ప్రత్యేకంగా సమాజాన్ని మార్చేయరమ్మా... నాకు తెలిసినంతవరకూ మార్పు అనేది మనిషి నుండి మొదల వ్వాలి... మనుషులు... వ్యక్తులు... మనక్కావల్సింది వ్యక్తులు... మిగిలినవన్నీ వాటంతటవే సిద్ధమవుతాయి... మనలో ప్రతి ఒక్కరమూ ప్రక్క వ్యక్తి గురించి ఆలోచించాలి... ఆలోచించగలిగితే... ఈ ఒక్క వాక్యాన్ని మనం లోతుగా తీసుకున్నట్టయితే..."

నాయినమ్మే నాన్నతో మాట్లాడిస్తున్నట్లుగా ఉంది... నాకు ఏదో సూచిస్తున్నట్లుగా ఉంది...

ప్రగాఢ నిశ్శబ్దం... అలజడి, ఆందోళన అంతా తగ్గి వాతావరణం భయ గంభీరంగా ఉంది...

ఆలోచనలో పడ్డాన్నేను.

నిజమే! నాకొచ్చే వేల జీతంతో నేనేం చేయగలనో, ఏం చేయొచ్చో కొంత అర్థమయినట్లుగా ఉంది... నాయినమ్మ ఏదో చెప్తోంది... స్ఫూర్తి నిస్తోంది...

అమ్మ కిటికీలు తెరిచినట్టుంది...

అప్పటిదాకా గదిలో ఉన్న ఇన్‌డోర్ ప్లాంట్‌తో ఆడుకుంటున్న ఉడతల జంట ఒకటి హడావుడిగా కిటికీ అంతా పాకి బయటికి దూరి పోయాయి... మరోసారి నాతో ఏదో చెప్పి నవ్వుతూ నాయినమ్మ కూడ కిటికీలో నుండి బయటికి వెళ్ళిపోయింది.

జివ్వుమంటూ లోపలికి దూసుకొస్తోన్న చలిగాలి కొంత ఉపశమనాన్నిస్తున్నట్లుగా అన్పించింది. *

తప్పెక్కడుంది?

జె.యు.బి.వి. ప్రసాద్



డాన్సు స్కూల్లో ఒక క్లాసుకీ, ఇంకో క్లాసుకీ మధ్య ఒక గంట ఖాళీ ఉంది నాకు. అలా అంటే నేనేదో డాన్సు నేర్పించే టీచరు ననుకునేరు సుమా! కాదు, కాదు. నేను డాన్సు నేర్చుకునే వయోజన విద్యార్థిని. తొందరగా నేర్చుకోవడానికి ఒకేరోజున రెండు క్లాసులు తీసుకునేవాడిని. మూడేళ్ళుగా భరతనాట్యం నేర్చుకుంటున్నాను ఎంతో ఇష్టంతో. ఇంకో రెండు నెలల్లో మా డాన్సు స్కూలు వాళ్ళ నాట్య మహోత్సవం వస్తోంది.

ఆరోజు క్లాసులోకి వెళ్ళబోతుండగా మా స్కూలు పెద్ద టీచర్ కళ్యాణిగారు కనిపించారు చేతిలో ప్రోగ్రామ్ పేపర్లతో. కళ్యాణిగారు కొంత మంది చిన్న టీచర్లతో స్కూలు కీర్తికోసం గానీ, ధనం కోసం గానీ కాకుండా, కళ కోసం మాత్రమే నడుపుతూ ఉంటారు. ఆవిడ డాన్సు విషయంలో చాలా స్ట్రిక్టు. ఆవిడంటే నాకు ఒకటే భయం. భక్తితో కూడిన భయం. ఆవిడ అప్పుడప్పుడు మాకు క్లాసులు తీసుకుంటారు. ఎక్కువగా చిన్న టీచర్లకి డైరెక్షన్సు ఇచ్చి వాళ్ళ చేత నేర్పిస్తారు మొదటి నాలుగయిదేళ్ళు.

కళ్యాణిగారిని చిరునవ్వుతో చూసి, బుర్ర తిప్పుకుని క్లాసులోకి వెళ్ళబోతుండగా నా పేరు పిలిచారావిడ.

ఏమిటన్నట్టు చూశాను.

"మీ పేరుకు పుష్పాంజలి సోలో రాస్తున్నాను," అన్నారావిడ చేతిలో పేపర్లు వెరిపై చేస్తూ.

నాకు బొత్తిగా అర్థం కాలేదు.

"పుష్పాంజలి సోలో ఏమిటండీ?" అని అడిగాను అయోమయంగా.

"నాట్య మహోత్సవంలో విద్యార్థులందరూ వాళ్ళు నేర్చుకున్నది ప్రదర్శించాలి. మిమ్మల్ని మిగిలిన చిన్నపిల్లలతో కలపడం ఇష్టం లేదు. మీరు సోలో డాన్సు చెయ్యండి. పుష్పాంజలి డాన్సు పూర్తిగా గానీ, ఒక జతీ, రెండు స్వరాలతో జతిస్వరంగానీ చెయ్యండి. మీ ఇష్టం," అని వివరించారావిడ.

గుండెలు అదురుతుండగా, 'అలాగే,' అన్నట్టు బుర్ర ఊపుతూ నా క్లాసులోకి వెళ్ళాను.

ఆ క్లాసులో నలభై మూడేళ్ళ మగ స్టూడెంటు నేనొక్కడినే. ఇంకొక పదమూడేళ్ళ పిల్లాడు వేరే క్లాసులో చాలా ఏళ్ళ నుంచీ నేర్చుకుంటూ ఉన్నాడు. ఆ పిల్లాడిని లెక్కలోకి తీసుకోకపోతే, ఆ స్కూలంతటికీ నేనొక్కడినే మగస్టూడెంటును.

నా క్లాసులో మిగిలిన పిల్లలంతా ఏడు నుంచీ తొమ్మిదేళ్ళ లోపు ఆడపిల్లలు.

నేను క్లాసులోకి వెళ్ళేసరికి చిన్న టీచర్ శారదగారు అందరికీ చెప్తున్నారు.

"ఈసారి స్టూడెంట్ పెర్‌ఫార్మెన్స్‌లో మన క్లాసు వాళ్ళం అందరం జతి స్వరం చేయాలి. చివరలో ఈ ఐటమ్‌ని కొంచెం తగ్గిద్దాం," అని.

"ఆంటీ! నేను ఈ అంకుల్ పక్కన నుంచుని డాన్స్ చెయ్యను. అంకులు తన పెద్ద చేతులు చాచి, నన్ను కొట్టేస్తున్నారు జతి చేసేటప్పుడు," బుంగమూతి పెట్టుకుని కంప్లయింట్ చేసింది ఏడేళ్ళ సమీర.

క్లాసులో అందరూ నవ్వారు.

నిజమే! ఆ చిన్న క్లాసురూమ్‌లో ఎనిమిదిమంది డాన్సు నేర్చుకుంటాం. వాళ్ళంతా చిన్నపిల్లలు. ధిధితై చేసినప్పుడల్లా, నా చెయ్యి వెళ్ళి పక్కనున్న పిల్లకి తగలడం, ఆ పిల్ల కుయ్యో, మొర్రో మనడం జరుగుతూ ఉండేది. అందువల్ల ఆ పిల్లలు నన్ను చురచురా చూస్తూ, నాకు దూరంగా ఉండి డాన్సు చేసేవారు, ఎక్కువ చోటు నాకిచ్చి.

నా గుండెదడ వల్ల ప్రతిసారిలా అప్పుడు నవ్వలేదు నేను.

"మీరెవరూ వర్రీ కాకండి. అంకుల్ మీతో డాన్సు చెయ్యరు. అంకుల్ సోలో పీస్ చేస్తున్నారు స్పెషల్ ఐటంగా!" అన్నారు శారద.

"అదికాదు శారదా! కిందటి క్లాసులో మేమంతా కలిసే చేస్తామని అన్నారుగా మీరు. మరెందుకిలా మార్చేశారు?" దిగులుగా అడిగాను.

"ఒక పెద్ద మగమనిషి చిన్నపిల్లలతో కలిసి డాన్సు చేస్తుంటే, చూసేవాళ్ళందరూ ఆ మనిషినే చూస్తూ ఉంటారు. అది మిగిలిన చిన్నపిల్లలకి న్యాయం కాదు. అందుకే మీకు సోలో పెట్టారు," వివరించారు శారద.

అయినా నా దిగులు తగ్గలేదు.

"ఇప్పటివరకూ సోలో చెయ్యలేదు నేను. ఆరునెల్ల కిందట గుళ్ళో డాన్సు చేసినప్పుడు, గ్రూపంతటికీ నేర్పి, కలిసి చేయించారు కళ్యాణి టీచరు. ఇప్పుడు సోలో అంటే భయంగా ఉంది," నా సాద వెళ్ళబోసు కున్నాను.

"ఫరవాలేదండీ! మీ చేత నేను ప్రాక్టీసు చేయిస్తానుగా!" అంటూ భరోసా ఇచ్చారు శారద.

టీచరు కర్రముక్కతో వేస్తున్న నట్టువాంగానికి పిల్లలు అడవులకు వేస్తున్న అడుగులను చూస్తూ ఉంటే నా ఒళ్ళంతా ఒక రకమైన ఉద్వేగానికి లోనయ్యేది. ఏ క్షణాననన్నా లేచిపోయి ఆ పిల్లలతో కలిసి అడుగులేసేస్తానేమోనని నాకే భయంగా ఉండేది.

బలవంతంగా చిరునవ్వు నవ్వి ఊరుకున్నాను.

ఇంక క్లాసు హడావుడిలో ఆ విషయాలేవీ మాట్లాడు కోలేదు. కారులో ఇంటికి వెళ్ళేటప్పుడు గతాన్ని తలుచు కున్నాను.

✤

చిన్నప్పటి నుంచీ డాన్సు అంటే చాలా ఇష్టంగా ఉండేది. ఏ శ్రీరామనవమి పందిట్లో రికార్డింగు డాన్సులు చేసినా, వెళ్ళి కళ్ళార్పకుండా చూసేవాడిని. పక్కింటి వాళ్ళ రేడియోల్లోంచి ఏమన్నా సినిమా పాటలు వచ్చినా, పక్క సందులో వేసిన వినాయకచవితి పందిట్లోంచి సినిమా పాటలు లౌడ్‌స్పీకరులో వినబడినా ఇంటి బయట, రోడ్డు మీదే ఇష్టం వచ్చినట్టు డాన్సు చేసేవాడిని.

కొంచెం వయసొచ్చి, సిగ్గు తెలిసేసరికి ఆ పనులు మానేశానుగానీ, ఇంకా మనసులో ఇష్టం మాత్రం అలాగే ఉండిపోయింది. నేర్చుకొమ్మని ప్రోత్సహించిన వారూ లేరు, నేర్చుకోవడానికి ఆర్థికస్థోమతూ లేదు. అప్పుడో ప్రోగ్రాం, ఇప్పుడో ప్రోగ్రాం చూడ్డం తప్ప డాన్సు అనేది గగన కుసుమంగానే అయింది జీవితంలో.

కాలక్రమేణా చదువూ, ఉద్యోగం, పెళ్ళీ, పిల్లలూ క్రమం తప్పకుండా జరిగాయి నా జీవితంలో కూడా అందరకులాగే. పిల్లలు పుట్టిన కొన్నేళ్ళకి అమెరికా వలస వచ్చాం. అప్పటి నుంచీ జీవితంలో ఒక కొత్త అధ్యాయం మొదలైంది. మా అమ్మాయి, తన క్లాస్‌మేట్ నేర్చుకుంటోందని తనూ డాన్సు నేర్చుకుంటానంది ఏడేళ్ళ వయసులో.

ఎగిరి గంతేశాను సంతోషంతో.

ఆ మర్నాడే పిల్లల్ని తీసుకుని డాన్సు టీచర్ కళ్యాణిగారింటికి వెళ్ళాను. ఆవిడ మా అమ్మాయిని చూసి,

"పిల్ల మొహం చక్కగా ఉంది. డాన్సు బాగా నేర్చుకుంటే, ఇంకా ఎంతో బాగుంటుంది," అని ప్రోత్సహిస్తూ, పిల్లని దగ్గరికి తీసుకున్నారు.

నా పితృహృదయం ఆనందంతో పొంగిపోయింది.

అప్పటి నుంచీ ప్రతి మంగళవారం సాయంకాలం డాన్సు క్లాసు.

మొదటేడాదంతా అదే డాన్సు క్లాసులో ఉండే ఇంకో అమ్మాయి తల్లిదండ్రులు మా అమ్మాయిని తీసుకెళ్ళి, తీసుకొచ్చేవారు. ఇంక వాళ్ళకు కుదరదని చెప్పడం వల్ల రెండో యేడాదంతా వాళ్ళు దింపితే, నేను వాళ్ళిద్దరినీ ఇళ్ళకి తీసుకొచ్చేవాడిని. ఒక్కోసారి నేను వెళ్ళేసరికి క్లాసు అవకపోతే అక్కడే కూర్చునేవాడిని.

టీచరు కర్రముక్కతో వేస్తున్న నట్టువాంగానికి పిల్లలు అడవులకు వేస్తున్న అడుగులను చూస్తూ ఉంటే నా ఒళ్ళంతా ఒక రకమైన ఉద్వేగానికి లోనయ్యేది. ఏ క్షణాననన్నా లేచిపోయి ఆ పిల్లలతో కలిసి అడుగులేసేస్తానేమోనని నాకే భయంగా ఉండేది.

ఒకసారి ఒక పిల్ల తల్లి నన్ను చూసి నవ్వుతూ, "మీరు బాగా ఎమోషనల్‌గా ఫీలవుతున్నట్టున్నారు, లేచి మీరు కూడా డాన్సు చేస్తారా?" అంది.

నేను కాస్త సిగ్గుపడ్డాను.

"అలా కుదరదు. ఆయన పాంటూ, షర్టూ వేసుకున్నారు. ఆ బట్టలతో డాన్సు చెయ్యడానికి వీల్లేదు. కుర్తా, పైజామాలతో అయితే డాన్సు చేయచ్చు," అన్నారు కళ్యాణిగారు నవ్వుతూనే సీరియస్‌గా.

నేను మాట్లాడకుండా అప్పటికి ఊరుకున్నానుగానీ, ఆ మాటలు నన్ను భవిష్యత్తులో ఉద్వేగంగా ప్రవర్తించకుండా ఆపాయి.

ఆ ఏడాది తర్వాత మా అమ్మాయి స్నేహితురాలు డాన్సు మానెయ్యడమూ, మా ఆవిడకి డ్రైవింగ్ లైసెన్సు రావడమూ జరిగి నన్ను ఆ డాన్సు క్లాసుల నుంచి దూరంగా ఉంచాయి.

అప్పుడప్పుడు మా అమ్మాయి, ఇంటికి ఏవో కాగితాలు తెస్తూ ఉండేది. ఎవరికో డాన్సు అరంగేట్రాలకి, డాన్సు ప్రోగ్రాములకీ సంబంధించిన కరపత్రాలు అవి. ఎప్పుడూ పట్టించుకునేవాడిని కాదు.

"డాడీ, మా డాన్సు టీచరు ఈ డాన్సు ప్రోగ్రామ్ చూసి తీరాలన్నారు. తరువాత క్లాసులో ఆ ప్రోగ్రామ్ గురించి మాట్లాడుదామని చెప్పారు," అంది మా అమ్మాయి ఒకరోజు.

ఆ కరపత్రం చూశాను. గాంధీ గురించి డాన్సు ప్రోగ్రామ్. పిల్లల డాన్సు స్కూలు హోమ్‌వర్కు కోసమని ఇంటిల్లిపాదీ ఆ డాన్సు ప్రోగ్రామ్‌కి వెళ్ళాము.

ఆ ప్రోగ్రామ్ చూస్తున్నపుడు మంత్రముగ్ధుడినై కూర్చున్నాను. సంగీతమూ, డాన్సూ, ముఖ్యంగా కొరియోగ్రఫీ చాలా అద్భుతంగా ఉన్నాయి.

ప్రోగ్రామ్ అవగానే కళ్యాణిగారి దగ్గరకు వెళ్ళి, 'ప్రోగ్రామ్ అద్భుతంగా ఉందని,' అభినందించాను.

ఆవిడ నవ్వుతూ, "మీరెప్పుడూ ఈ డాన్సు ప్రోగ్రామ్‌లకి రారు కదా!" అన్నారు.

ఆ మాటలు నా మనసుకు షాక్ ఇచ్చాయి. ఆ తరువాత వారం రోజులూ ఆ మాటల గురించే ఆలోచిస్తూ ఉండిపోయాను. అవును! ఆవిడన్న మాటలు కరక్టే! నాకు డాన్సు అంటే ఇష్టం అని అనుకోవడం తప్ప డాన్సు కళకి నేనేం చేశాను? పిల్లని మాత్రం డాన్సు క్లాసులో జాయిన్ చేసి వదిలేశాను. ఆ పిల్ల ఏం నేర్చుకుంటోందో, ఏమిటో బొత్తిగా తెలియదు. ఏదో నేర్చుకుంటున్న డాన్సు ఐటం పేరు తెలియడం గురించి కాదు నేను అనేది.



ఒక కళ మీద ఇష్టం ఉంది అని అనుకున్నప్పుడు, ఆ కళకి సంబంధించిన కాసిని ప్రోగ్రామ్‌లతోనే ఆ ఇష్టం తీరిపోతుందా? ఆ కళతో ఆ మాత్రం సంబంధానికే మన మనసుకు తృప్తి వచ్చేస్తుందా?

అప్పటి నుంచీ ఆ డాన్సు స్కూలు వారి ప్రతి ప్రోగ్రామ్‌కీ వెళ్ళడమూ, ఆ డాన్సు స్కూలు పనుల్లో సాయం చేయడమూ మొదలు పెట్టాను. ఆ విధంగా డాన్సు స్కూల్లో చాలామంది పరిచయం అయ్యారు.

ఏమైతే అది అయిందని ఒకరోజు కళ్యాణిగారిని ఫోనులో ఏదో డాన్సు స్కూలు సంగతి మాట్లాడుతున్నప్పుడు అడిగాను.

"మీరు పిల్లలకే కాకుండా పెద్దవాళ్ళకి కూడా డాన్సు నేర్పుతారా?"

"నేర్పుతామండీ! మన డాన్సు స్కూల్లో కొంతమంది తల్లులు కూడా ఉన్నారు. ఎటొచ్చీ ఒకటి రెండేళ్ళలో వాళ్ళు డాన్సు నేర్చుకోవడం ఆపేస్తారు. వారికి రకరకాల పనులతో ఇంక కుదరదు లాగుంది."

కళ్యాణిగారు పక్కన లేరుగానీ, ఉంటే వెంటనే ఆవిడ కాళ్ళని కళ్ళ కద్దుకుందామనిపించింది ఆ మాటలకు.

"మరి నాకు డాన్సు నేర్పుతారా మీ స్కూల్లో?" ఆశగా అడిగాను.

కొన్ని సెకండ్లు మౌనం ఫోనులో. ఆవిడ నా నుంచి అటువంటి ప్రశ్న ఊహించినట్టు లేదు.

"స్కూల్లో చేరిన ప్రతి స్టూడెంటుకీ నేను డాన్సు నేర్పించలేను. కొత్తగా చేరినవారికి నేర్పించడానికి చిన్న టీచర్లూ, స్టూడెంట్ టీచర్లూ ఉన్నారు. ఈ ఏడాది రిజిస్ట్రేషన్ ప్రోగ్రామ్ ఇంకా పూర్తి కాలేదు. ఎంతమంది కొత్తగా చేరతారో, ఎన్ని కొత్త క్లాసులు మొదలుపెట్టాలో ఇంకా తేల్చుకోలేదు. తరువాత చూద్దాం ఈ విషయం," అని అన్నారు.

పెద్దగా ఆసక్తి చూపించలేదు కళ్యాణిగారు. నాకు చాలా నిరుత్సాహం కలిగింది. దాంతో పాటు గట్టి పట్టుదల కూడా కలిగింది.

కొన్ని రోజులకి డాన్సు స్కూలు మేనేజర్ ఫోను చేశారు. ఆవిడ నాకు బాగా పరిచయం.

"మిమ్మల్ని డాన్సు స్కూల్లో చేర్చుకుంటాంగానీ, మీరు మన స్కూలు ఫలానా కమిటీకి ఛైర్‌పర్సన్‌గా ఉంటారా?" నవ్వుతూ అడిగారు.

చాలా సంతోషం కలిగింది.

"ఛైర్ పర్సన్‌గా ఉండలేనుగానీ, ఆ కమిటీలో సభ్యుడిగా ఉండి ఎక్కువ పనిచేసి పెడతాను. పిల్లల చదువులతో ఛైర్‌పర్సన్‌గా పని చేయడానికి నాకు వీలవదు. ఇంతకీ నా క్లాసులు ఎప్పటి నుంచీ?" ఉత్సాహంగా అడిగాను.

"ఈ వారం చివర విజయదశమి పూజ ఉంది స్కూల్లో. ఆరోజు నుంచీ కొత్త స్టూడెంట్లకి కొత్త క్లాసులు మొదలుపెడతారు. మీరు ఆరోజు స్కూలుకి గజ్జెలతో రండి. ముందుగా నటరాజ విగ్రహానికి నమస్కారం చెయ్యాలి," అని చెప్పారావిడ వివరంగా.

నా ఆనందానికి హద్దుల్లేకుండా పోయాయి. ఆఖరికి నలభయ్యో ఏట డాన్సు నేర్చుకోగలిగే అవకాశం వచ్చింది. కాస్త సన్నిహితంగా ఉండే స్నేహితులతో చెప్పాను ముందరగా. ఒక్కళ్ళు కూడ నమ్మలేదు ముందర.

"అరవైలో ఇరవైలా? మీరు ఇప్పుడు నేర్చుకోవడం ఏమిటీ? మన కెందుకండీ? మన పిల్లలు నేర్చుకుంటే చాలదూ మనకి?" అన్నారు కొంతమంది.

వాళ్ళని నమ్మించేటప్పటికి నాకు తల ప్రాణం తోకకి వచ్చింది. కొంతమందైతే, "ఈ ఉత్సాహం ఆరంభంలోనే ఉంటుందిలెండి. కొన్నాళ్ళు పోయాక చల్లబడి, మీరే మానేస్తారు," అని అన్నారు.

కొంతమంది సంస్కారవంతంగా, "మంచిదండీ! మీ కిష్టమైనది వయసుతో నిమిత్తం లేకుండా నేర్చుకుంటున్నారు. చాలా మంచి విషయం," అని అన్నారు.

విజయదశమి రోజు గజ్జెలు తీసుకుని డాన్సు క్లాసుకి వెళ్ళాను. అక్కడున్న పిల్లల తల్లులు నావేపూ, నా చేతిలో గజ్జెలవేపూ ఆశ్చర్యంగా చూశారు ఒక స్ట్రెచ్ పాంటు తొడుక్కుని, దాని మీద పొడుగు చేతుల జుబ్బా తొడుక్కుని, జుబ్బా చేతులు మోచేతుల వరకు మడిచాను. ఒక మఫ్లరు తీసుకుని నడుం చుట్టూ కట్టాను. నెమ్మదిగా వెళ్ళి గజ్జెలు నటరాజ విగ్రహం దగ్గర పెట్టాను.

అందరి కళ్ళలోని ఆశ్చర్యాన్నీ చూశారు కళ్యాణిగారు.

"నేను ఈయన్ని స్టూడెంటుగా ఉండమనలేదు. ఈయన డాన్సు స్కూలుకి వాలంటీరుగా ఉండటమే ఇష్టం నాకు!" అన్నారు నవ్వుతూ.

బిక్కచచ్చిపోయాను ఒక్కసారిగా. మాట్లాడకుండా ఆవిడ మొహంలోకి చూశాను.

"డాన్సు నేర్చుకోవాలంటే నటరాజ విగ్రహానికి నమస్కరించి, తరువాత గురువుకి నమస్కరించాలి," అని అన్నారు సీరియస్‌గా.

నటరాజ విగ్రహానికి నమస్కరించి, ఆ తరువాత కళ్యాణిగారి పాదాలకు నమస్కరించాను. ఆవిడ గజ్జెలకి బొట్టుపెట్టి నా చేతిలో ఉంచారు. నెమ్మదిగా గజ్జెలు కట్టుకున్నాను కాళ్ళకి. దగ్గరలో మగ పురుగనేది లేదు. చుట్టూ ఉన్న తల్లులు ఇంకా విడ్డూరంగానే చూస్తున్నారు నావేపు.

అప్పుడు వచ్చారు చిన్న టీచరు శ్రీదేవిగారు. ఆవిడ నావేపు ప్రోత్సాహంగా చూశారు. చాలా సంతోషం వేసింది. చుట్టూ ఆరేడేళ్ళ పిల్లలు. వాళ్ళతోపాటు టీచరు చెప్పినట్టుగా అడుగులు వేయడం మొదలు పెట్టాను.

అప్పటివరకూ మనసులోనే ఇష్టం, పట్టుదలా. దానికీ, శరీరానికి సంబంధం లేదని వెంటనే అర్థమైంది.

కాళ్ళు అరమండిలో పెట్టి అడుగులు వేస్తుంటే శరీరమంతా మంటలూ, నొప్పులూ. చెమటలు విపరీతంగా కారిపోతున్నాయి. మిగతా పిల్లలు కూడా నొప్పిని భరిస్తున్నట్టు మొహాలు పెట్టినా పరిస్థితి నాలాగా లేదు వాళ్ళకి.

ఒక అరగంట అయ్యాక వాటర్ బ్రేక్ ఇచ్చారు శ్రీదేవి.

కదలనని మొండికేసిన కాళ్ళను ఈడ్చుకుంటూ మంచినీళ్ళ ఫౌంటేన్ దగ్గరికి వెళ్ళాను.

అక్కడ బాగా తెలుసున్న వాళ్ళమ్మాయి నన్ను చూసి, "ఏమయింది అంకుల్ అలా ఉన్నారూ?" అని అడిగింది.

సమాధానం చెప్పటానికి నోరు పెగలలేదు.

అక్కడే ఉన్న కళ్యాణిగారు, "అంకుల్‌కి బాగా ఎక్సర్‌సైజు చేసినట్లయింది క్లాసులో. అలిసిపోయారు," అని అన్నారు కాస్త జాలిగా.

మాట్లాడకుండా మంచినీళ్ళు తాగి మళ్ళీ క్లాసులోకి వెళ్ళాను. మంచినీళ్ళు అంత మధురంగా ఉంటాయని అప్పుడే తెలిసింది.

నాలో ఉన్న స్టామినా పెరగడానికి నాకు ఇంచుమించు ఒక ఏడాది పట్టింది. అప్పటికీ డాన్సు మొదలుపెట్టిన మూడు నిముషాలకే బాగా చెమటలు పడతాయి. ఎటొచ్చీ నొప్పి భరిస్తూ, డాన్సు చెయ్యటం అలవాటయింది కొన్నాళ్ళకి.

క్లాసులో ఉన్న చిన్నపిల్లల గ్రహణశక్తితోటీ, నేర్పుతోటీ నాకు పొత్తు కుదిరేది కాదు. ఎన్నో ప్రశ్నలు వచ్చేవి బుర్రలో. అసలు బుర్రలేకపోయినా ఫరవాలేదుగానీ, ఇలా సగం సగం బుర్ర ఉండకూడదు మరి.

టీచర్ క్లాసులో, "తై తై దిదితై ఎన్ని బీట్లూ?" అని అడిగారు.

నేను వేళ్ళతో లెక్కపెట్టి, "ఐదు," అని చెప్పాను. క్లాసులో ఇంకెవరూ మాట్లాడలేదు.

"ఐదు కాదు నాలుగు," అని చెప్పారా టీచరు.

మళ్ళీ ఎవరూ మాట్లాడలేదు. అడగాలంటే మొహమాటం. తరువాత క్లాసులో ఇంకో టీచర్‌ని అడిగాను ఆ ప్రశ్న. ఆ టీచర్‌తో కాస్త చనువు ఉంది. ఆ టీచర్ చెప్పింది ఒక్క ముక్క కూడా అర్థం కాలేదు.

ఆ రోజుల్లోనే ఇంకో సంఘటన జరిగింది. అప్పటికి డాన్సు నేర్చుకోవడం మొదలుపెట్టి యేడాదిన్నర అయ్యింది. ఆసరికి ఏదో తప్పుల తడకగా అలారిప్పు నేర్చేసుకుని పుష్పాంజలి మొదలుపెట్టాము మా క్లాసులో.

మా కంపెనీలో ఏదో పార్టీ ఏర్పాటు చేసి నన్ను డాన్సు చేస్తావా అని అడిగారు కొంతమంది.

నేనారోజు కళ్యాణిగారికి ఫోను చేసి చెప్పాను ఆ విషయం.

"ఏమిటీ? మీరప్పుడే పబ్లిక్ ప్రదర్శనలకి తయారైపోయారా?" ఆశ్చర్యంగా అడిగారావిడ.

"అలారిప్పు బాగానే వచ్చేసింది. అప్పుడప్పుడు కాస్త తప్పులొస్తాయంతే!" అన్నాను ధైర్యంగా.

"అలాగా! రేపు క్లాసులో నేను చూస్తాను మీకు ఎంతవరకూ వచ్చిందో!" అన్నారావిడ. నా గుండెల్లో రాయి పడింది.

"మీరంటే నాకు భయం. మీదగ్గర సరిగా చెయ్యలేను ఫ్రీగా!" చెప్పాను నెమ్మదిగా.

"ఎందుకు భయం? నేను ఒక టీచర్‌లా చూడను. బయట మనిషిలా చూస్తాను."

"సరే!" ఒప్పుకున్నాను చేసేదేమీలేక. ఆరోజు రాత్రి కంటి మీద కునుకే లేదు.

మర్నాడు నా క్లాసులో నేనుండగా, కళ్యాణిగారు వచ్చి నన్ను తన క్లాసుకి రమ్మన్నారు నా అలారిప్పు చూడటానికి.

అప్పటికే అక్కడ కొంతమంది సీనియర్ పిల్లలు అలారిప్పు చెయ్యడానికి రెడీగా ఉన్నారు.

బిక్క చచ్చిపోయాను భయంతో. కళ్యాణిగారు వయసులో నాకన్నా మూడేళ్ళు పెద్ద. దాంతో భయం ఇంకా పెరుగుతూ ఉంటుంది.

"రెడీ, వన్, టూ, త్రీ... తత్ తై తెయ్యుం, తత్ తాం కిటతక," అంటూ అలారిప్పు పాడటం మొదలుపెట్టారు కళ్యాణిగారు. అందరు పిల్లలూ డాన్సు మొదలుపెట్టారు.

ఆ క్షణంలో గొంతెండిపోయింది నాకు. కాలూ, చెయ్యీ ఒక్క అంగుళం కూడా కదలలేదు. అలాగే చేతులు చాచి పొజిషనులో ఉండిపోయాను. బిక్కుబిక్కుమంటూ కళ్యాణిగారి వేపు చూస్తూ ఉండిపోయాను.

ఏమయిందన్నట్టు చూశారు కళ్యాణిగారు.

అప్పటికి గొంతు పెగుల్చుకుని, "సారీ! నేను రెడీగా లేను. మళ్ళీ మొదలుపెట్టండి, ప్లీజ్!" అన్నాను ప్రాధేయపడుతూ.

కళ్యాణిగారు మళ్ళీ మొదటినుంచీ మొదలుపెట్టారు.

అప్పుడు నేను చేసిన అలారిప్పు డాన్సులో తప్పులొదిలేసి ఎక్కడన్నా రైట్లున్నాయేమో వెతుక్కోవాలి. నా డాన్సు చూస్తూ కళ్యాణిగారి మొహంలో వస్తున్న మార్పుల్ని గమనిస్తున్నకొద్దీ నేను చేస్తున్న తప్పులు పెరిగి పోయాయి. నా మొహం పాలిపోయింది. స్పృహ తప్పి పడిపోతానేమో ననిపించింది. ఎలాగో పూర్తి చేశాను.

అప్పుడు కళ్యాణిగారు నన్ను నా క్లాసుకి తీసుకెళ్ళి, క్లాసంతటినీ మళ్ళీ అలారిప్పు చెయ్యమన్నారు. చేస్తున్నంతసేపూ నేను చేసిన ప్రతి తప్పూ చెబుతూనే ఉన్నారు. ఒక్క సవరణ కూడా నా బుర్రలో కెక్కలేదు.

"మీకు అలారిప్పు బొత్తిగా రాలేదు. మీరు పబ్లిక్‌లో ప్రదర్శన లివ్వడానికి ఏమాత్రమూ రెడీగా లేరు," అని అన్నారావిడ.

"అలాగే," అన్నట్టు బుర్రూపాను.

ఆవిడ క్లాసులోంచి వెళ్ళగానే, బ్రతుకుజీవుడా అనుకుంటూ మళ్ళీ పబ్లిక్ ప్రదర్శన సంగతి ఎత్తలేదు ఇంకొక సంవత్సరం వరకూ. అప్పటి నుంచీ కళ్యాణిగారంటే పెద్ద హడలు నాకు.

వారంలో కనీసం నాలుగుసార్లన్నా ఇంటి దగ్గర డాన్సు ప్రాక్టీసు చేయకపోతే వళ్ళు స్వాధీనంలో ఉండేది కాదు డాన్సు క్లాసులో. ఆ పరిస్థితుల్లో వచ్చింది డాన్సు స్కూలు నాట్య మహోత్సవం.

✤

అబ్బా! చాలా పెద్ద గతమే తలుచుకున్నాను. ఆలోచనల్లోంచి బయట పడి చూస్తే, ఫ్రీవే మీద నేను తీసుకోవాల్సిన ఎగ్జిట్ వెళ్ళిపోయి ఒక గంట యింది అని అర్థం అయింది. ఉసూరుమంటూ వెనక్కి మళ్ళాను నెక్ట్ ఎగ్జిట్‌లో యూ టర్న్ తీసుకుని.

అంతకు ముందు అందరు పిల్లలతోనూ కలిసి వాళ్ళు చేస్తున్నట్టు చేశానుగానీ, సోలో అంటే చాలా భయం వేసింది. అయినా శారదగారు బాగా నేర్పిస్తారులే అనే ధైర్యం తో ఆ వారమంతా ప్రతిరోజూ ఇంట్లో ప్రాక్టీసు చేశాను.

బుర్రలో ఎప్పుడూ వర్రీగా ఉండేది. రిలాక్స్‌డ్‌గా అస్సలుండేది కాదు.

ఆరోజు క్లాసులోకి కళ్యాణిగారు వచ్చారు.

చిన్న టీచరుకు మిగిలిన పిల్లలతో సుబ్రహ్మణ్య కౌత్వం ప్రాక్టీసు చేయించమని చెప్పి, నా పుష్పాంజలి చెక్ చేస్తానంటూ నన్ను వేరే రూమ్‌లోకి తీసుకెళ్ళారు.

అక్కడ నుంచి పారిపోయి, కారెక్కి ఇంటికెళ్ళిపోదామని ఎంతగానో అనిపించింది. దానికీ ధైర్యం చాలలేదు.

'శారదగారు తను చేయిస్తానన్నారు కదా, మరి కళ్యాణిగారెందుకు వచ్చారు?' అనే ప్రశ్న బుర్ర తినేసింది. కళ్యాణిగారి దగ్గర అస్సలు కంఫర్ట బుల్‌గా ఉండలేను నేను. రామాయణంలోలాగా భూమి బద్దలైతే, సీతలాగా భూమిలోకి వెళ్ళిపోదామనే కోరిక విపరీతంగా కలిగింది.

గ్యారంటీగా తప్పులు చేస్తాననీ, కళ్యాణిగారు బాగా తిడతారనీ తెలిసి పోయింది. అలాగే బిక్కచచ్చిపోయి, యజ్ఞపశువులా వధ్యస్థలాని కెళ్ళాను. కళ్యాణిగారు పాడటం మొదలుపెట్టారు.

"తోం తోం తతక తకిట తోంత తక తకుందరి కిటతక కుకుందరీ."

కాళ్ళు కదిలితేగా! అలాగే నిలుచుండిపోయాను.

"ఏమయిందీ? రెడీగా లేరా?" అడిగారు.

మనసు దిటవు చేసుకున్నాను. "ఈసారి రెడీగా ఉంటాను," అని అంటూ రెండు అరచేతులూ పుష్పపుట ముద్రలో పెట్టి సిద్ధంగా నిలు చున్నాను. కళ్యాణిగారు మళ్ళీ పాడారు ఆ లైను. నాకు గుర్తున్నట్టు అడుగులు వేశాను. ఆవిడ ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవి చేసి పాట ఆపేశారు.

"అలా అడుగులేసారేమిటీ? అస్సలు రిథమ్ లేదు. ఎందుకనీ?" అడిగారు సీరియస్‌గా.

గొంతుక తడారిపోయింది. నోరు పెగలలేదు.

"మీకస్సలు లయ అనేదే లేదు డాన్సులో. మిగిలిన పిల్లలతో కలిసి ఏదో చేసేస్తున్నారుగానీ, మీకు బొత్తిగా రిథమ్ లేదు," అని అన్నారు నన్ను సునిశితంగా చూస్తూ. నేనేమీ మాట్లాడలేదు.

"మీకు ఈ పాట ఆదితాళం అనీ, వన్, టూ, త్రీ, వన్, టూ, త్రీ, వన్, టూ అనీ ఎందుకు తెలియడంలేదూ?" అడిగారు కోపంగా. అప్పటికీ నేనేమీ మాట్లాడలేదు.

"మీకు రిథమ్ ఎందుకు అస్సలు తెలియడం లేదూ?" మరింత రెట్టించి అడిగారు.

ఏదో సమాధానం చెబితేగానీ వదిలేటట్టు లేరు నన్ను.

"నేనెప్పుడూ సంగీతం నేర్చుకోలేదు. ఏదో సినిమా పాటలు ఎక్కువగా వినడమేగానీ కర్నాటక సంగీతం కూడా ఎక్కువగా వినలేదు. అందుకే రిథమ్ సరిగా తెలియడంలేదేమో నాకు," అని అన్నాను బెదురుగా.

ఆ క్షణంలో గొంతెండి పోయింది నాకు. కాలూ, చెయ్యీ ఒక్క అంగుళం కూడా కదలలేదు. అలాగే చేతులు చాచి పొజిషనులో ఉండిపోయాను. బిక్కుబిక్కుమంటూ కళ్యాణిగారి వేపు చూస్తూ ఉండిపోయాను.

కాస్సేపు ఆవిడ ఏమీ మాట్లాడలేదు. నన్నే చూస్తూ ఉండిపోయారు.

"సరే! మీకు వచ్చింది చేసి చూపించండి," అన్నారు ఒక నిశ్చయానికి వచ్చినట్టు.

'బ్రతుకుజీవుడా,' అనుకుంటూ నాకొచ్చిదంతా తప్పులు తడకలుగా, ఆగుతూ, ఆగుతూ చేసి చూపిం చాను.

"మీకు స్టెప్పులు బాగానే వచ్చాయి. ఎటొచ్చీ రిథమే సరిగా లేదు," అన్నారు.

నేను తలూపి, మిగిలిన పార్టు కూడా చూపించడం మొదలు పెట్టాను. ఆవిడ చూడ్డం మానేశారు. అప్పటికే నామీద ఆశలన్నీ వదిలేసుకున్నారు.

"చాలులెండి. మీ క్లాసుకు వెళ్ళి మిగిలిన పిల్లలతో ప్రాక్టీసు చెయ్యండి," అన్నారు రిజైన్డ్‌గా.

ఆ విషయం అర్థం అయింది నాకు. 'మహా అయితే నా సోలో కేన్సిల్ చేస్తారు. అంతేకదా!' అనుకుంటూ క్లాసులోకి వెళ్ళిపోయాను.

అయితే నేను అనుకున్నట్టుగా నా సోలో కేన్సిల్ చెయ్యలేదు. ఎటొచ్చీ మిగిలిన ప్రాక్టీసు చిన్న టీచర్లతో చేయించారు. కళ్యాణిగారికి నా డాన్సు చూసి చాలా నిరుత్సాహం కలిగిందని అర్థం అయింది.

ఇంత వయసొచ్చాక రిథమ్ అన్నది దానంతట అదే నాకు రావాలని ఆవిడ అనుకున్నట్టున్నారు. అదేదో నాకు రాలేదు. ఏదో అడుగులన్నీ నేర్చుకున్నానే గానీ, అవి ఒక పాటలోని సంగీతానికి లయతో అన్వయించడం తెలియలేదు. మిగిలిన చిన్నపిల్లల్లా దానంతట అదే ఆటోమాటిక్‌గా రాలేదు. ఎవరూ నేర్పలేదు నాకు. దానంతట అదీ రాలేదు.

అయినా పట్టు వదలకుండా ప్రాక్టీసు చేస్తూనే ఉన్నాను. మొత్తానికి ఆ పాటకి మాత్రం సరిగా డాన్సు చెయ్యడం అలవాటు చేసుకున్నాను.

అప్పుడొచ్చింది ఇంకో కష్టం.

ప్రదర్శన రోజు స్టేజి మీద ఒకసారి ప్రాక్టీసు చెయ్యమన్నారు కళ్యాణిగారు మేకప్, డ్రెస్సింగ్ పూర్తయ్యాక. స్టేజి సెంటరు మీదికి వచ్చాక నటరాజ విగ్రహం చాలా దూరంలో ఉంది. అక్కడవరకూ వెళ్ళి వెనక్కి రావడానికి నాకు రెండు లైన్లు సంగీతంలో కావాలి. నేను అప్పటివరకూ ప్రాక్టీసు చేసిన కేసెట్ సంగీతంలో ఒక లైనే వుంది. ఏం చెయ్యాలో తెలియక కళ్యాణిగారి వేపు చూశాను.

ఆవిడ ఒక్క లైనులోనే నటరాజ విగ్రహం వరకూ ఎలా వెళ్ళి రావాలో చూపించారు.

అసలే అంతమంది ప్రేక్షకుల ముందు సోలో చెయ్యాలనే భయంతో ఆ కొత్తరకంగా చెయ్యటానికి ఒప్పుకోలేదు.

"ఒద్దు కళ్యాణిగారూ! ఆఖరు క్షణంలో అలా కొత్తగా చెయ్యడం నాకు కంఫర్టబుల్‌గా లేదు," అన్నాను భయంగా.

కళ్యాణిగారు ఏమీ మాట్లాడకుండా ఊరుకున్నారు. నేను రిథమ్ ఫాలో అవకుండా నటరాజ విగ్రహం దగ్గర నుంచి వెనక్కి నడిచి వచ్చి చూపించాను శారదగారు సలహా ఇచ్చినట్టుగా. కళ్యాణిగారికి అది ఇష్టం లేకపోయినా ఊరుకున్నారు.

ఈ డ్రస్సూ, అలంకారాలతో ఇంకో పెద్ద బెడద ఉండేది నాకు.

జీవితంలో నేనెప్పుడూ చెవులు కుట్టించుకోలేదు. దాంతో చెవులకి క్లిప్పాన్స్ పెట్టుకునేవాడిని. డాన్సు చేసేటప్పుడు అవి ఊడిపోకుండా చాలా టైట్‌గా నొక్కేవాడిని. అవి చచ్చేంత నొప్పి పుట్టించేవి. అలాగే జబ్బలకీ, నడుంకీ కూడా ఆభరణాలు ఊడిపోకుండా గట్టిగా బిగించి, నొప్పేసేటట్టు కట్టేవాడిని. మెళ్ళో రాళ్ళ గొలుసు ముచ్చటగా గుచ్చుకుంటూ, నేనిక్కడే ఉన్నానోయ్ అని గుర్తు చేస్తూ ఉండేది. ఎటొచ్చీ చేతులకి తొడుక్కున్న కడియాలూ, కాళ్ళకి బిగించిన గజ్జెలు నొప్పి పుట్టించేవి కావు ఎక్కువగా.

అలంకారం వల్ల ఇంత నొప్పిని భరిస్తూ, శారీరక శ్రమ వల్ల వచ్చే నొప్పిని కూడా భరిస్తూ, డాన్సు నవ్వుతూ చేయాలి. లేకపోతే మొహంలో గ్రేస్ లేదంటారు. ఎంత నవ్వుతూ డాన్సు మొదలుపెట్టినా, ఒక నిముష మన్నా కాకుండా మొహం మీద నవ్వు ఎగిరిపోయేది.

కాలం ఎవరికోసమూ ఆగకుండా స్పీడుగా వెళ్ళిపోయింది.

నేను చేసే పుష్పాంజలి ఐటమ్ అనౌన్స్ చేసి, నా పేరు చెప్పేశారు. స్టేజి పక్కన రెడీగా ఉన్నాను.

టేప్ మ్యూజిక్ మొదలవగానే స్టేజి మీదకి వెళ్ళి డాన్సు మొదలు పెట్టాను. కళ్యాణిగారి ఆదేశం మీద ఒక చిన్న టీచరు నట్టువాంగ వాయిద్యం మొదలుపెట్టారు మైకులో నన్ను లయలో ఉంచడానికి. ఆ నట్టువాంగం నన్ను లయ తప్పకుండా ఉంచింది. రెండు, మూడు చోట్లకు మించి ఎక్కడా లయ తప్పలేదనిపించింది నాకు.

ప్రాక్టీసు చేసినప్పుడు కూడా ఆ నట్టువాంగం ఉంటే ఎంతో సుఖంగా ఉండేదనిపించింది నాకు.

మొత్తానికి డాన్సు పూర్తి చేశాను. ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. కొంతమంది స్నేహితులు నన్ను ప్రోత్సహిస్తూ, ఈలలూ, కేకలూ వేశారు. కానీ అవేమీ నన్ను సంతృప్తి పరచలేదు.

స్టేజి పక్కకి రాగానే అక్కడ ఉన్న కళ్యాణిగారి ముఖంలోకి చూశాను. ఆవిడ ఏమన్నా ఒక ముక్క అనడమో, ఏదైనా భావం మొహం మీద చూపించడమో చేస్తారని. ఆవిడ మొహం అభావంగా ఉంది.

నాకర్థం అయిపోయింది. నేను ఆవిడకి తృప్తి కలిగించేలా చెయ్యలేక పోయాను అని. చాలా నిరుత్సాహపడ్డాను. ఏముందీ చెయ్యడానికి ఇంక!

వేసవికాలంలో రోజూ ప్రాక్టీసు చెయ్యాలని మనసులో అనుకోవడమే గానీ, సరిగా చెయ్యగలిగేవాడిని కాదు. చాలాసార్లు నిరుత్సాహంగా ఉండేది. కొన్నిసార్లు ఆఫీసు పనులూ, కొన్నిసార్లు పిల్లల చదువులూ, కొన్నిసార్లు బద్ధకమూ, అయినా డాన్సు మీద ఉన్న ఇష్టంతో అప్పుడప్పుడు ప్రాక్టీసు చేసేవాడిని.

వేసవి సెలవుల తర్వాత డాన్సు స్కూలు తెరిచారు. నన్ను తరువాత లెవెల్ క్లాసులో వెయ్యలేదు. ఎటొచ్చీ మొదటేడాది నేర్పించిన చిన్న టీచరు శ్రీదేవిగారే కాలేజీ చదువు ముగించుకుని, మళ్ళీ నాకు నేర్పించడానికే అన్నట్టు వచ్చారు. ఆవిడ కమ్యూనిటీ కాలేజీలో రెండేళ్ళు చదవడం వల్ల, ఇంకో రెండేళ్ళకే కాలేజి చదువు అయిపోయింది. ఆవిడ దగ్గర నేను చాలా కంఫర్టబుల్‌గా ఫీలవుతాను.

'అమ్మయ్య, ఆవిడ దగ్గర బాగా నేర్చుకుందా'మని సంతోషపడ్డాను.

ఆరోజు డాన్సు క్లాసు అవగానే, "మీతో మాట్లాడాలి ఒకసారి. రేపు నేను ఫోను చేస్తాను," అన్నారు కళ్యాణిగారు.

మళ్ళీ గుండెల్లో రాయిపడింది. మాట్లాడకుండా తలూపాను. తరువాత ఇరవై నాలుగు గంటలూ బితుకు బితుకుమంటూ గడిపాను.

ఆరోజు మధ్యాహ్నం ఆఫీసుకు వచ్చింది కళ్యాణిగారి ఫోను.

"డాన్సు నేర్చుకోవడంలో మీ గోల్ ఏమిటీ?" అడిగారు సీరియస్‌గా.

"అంటే?" అర్థంకాక అడిగాను.

"ఎక్సర్‌సైజు కోసం నేర్చుకుంటున్నారా? లేక పబ్లిక్ ప్రదర్శన లిద్దామనా? అరంగేట్రం చేద్దామనా? ఏమిటీ మీ గోల్?"

నిజానికి నాకు పబ్లిక్ ప్రదర్శనలివ్వడమూ, అరంగేట్రం చెయ్య డమూ చాలా ఇష్టం. కాని అవే నా గోల్స్ అని చెబితే, కీర్తి పిచ్చి ఉందను కుంటారేమోనని భయం వేసింది.

"డాన్సు అంటే నాకు చాలా ఇష్టం. చిన్నప్పుడు నేర్చుకోలేక పోయాను. ఇప్పుడు బాగా నేర్చుకోవాలని కోరిక. పబ్లిక్ ప్రదర్శనలూ, అరంగేట్రం అంత ముఖ్యం కాదు," అని తప్పుల తడక జవాబు చెప్పాను.



"డాన్సులో రెండు విషయాలు ముఖ్యం. ఒకటి గ్రేస్. అది దేము డిచ్చేది. మనం ఏమీ చెయ్యలేము. రెండోది రిథమ్. అది కళను నేర్చుకునే వారి మీద ఆధారపడి ఉంటుంది. ఎంతో పెద్ద కళాకారులకి కూడా వందశాతం రిథమ్ ఉండదు. అది వారి సామర్థ్యం మీద ఆధారపడి ఉంటుంది."

"రిథమ్ అభివృద్ధి చేసుకోవాలంటే ఏం చెయ్యాలి?"

"అసలు రిథమ్ అనేది మొదట మనుషులకు ఉండాలి. ఆ తరువాత ఎక్కువ సాధనతో అభివృద్ధి చెందుతూ ఉంటుంది. మీకసలు రిథమ్ లేదు. అదీ అసలు సమస్య.

"నేను కష్టపడి సాధన చేసి రిథమ్ అభివృద్ధి చేసుకుంటాను."

"క్రమశిక్షణగానీ, వినయంగానీ, కఠినశ్రమగానీ మీ విషయంలో సమస్యలు కావు. మీ డెడికేషన్ నాకు అర్థం అయింది. అయినా మీరు మీ స్పీడులో నేర్చుకోవాలంటే మిగిలిన క్లాసు ఆగలేదు. మీకు నేర్పించే టీచరుకి కూడా ఫ్రస్ట్రేషన్ వస్తుంది. అందుకే మిమ్మల్ని వేరే క్లాసులో వేశాను. మన స్కూలుకి చిన్న టీచర్లు దొరకరు సులభంగా. వచ్చే ఏడాది మీకు నేర్పించ గలమో, లేదో తెలియదు. ఈ ఏడాది నేర్చుకోండి ముందర. మిగతాది తరువాత చూద్దాం. ఇంకో విషయం. మీరు పబ్లిక్ ప్రదర్శనలకి ఏమాత్రం రెడీగా లేరు. అందుకని మీరు నలుగురిలో డాన్సు చెయ్యడానికి ఒప్పుకోను. చిన్నపిల్లలు తప్పులు చెయ్యడం వేరూ, పెద్దవాళ్ళు తప్పుగా చెయ్యటం వేరూ!" అన్నారు సిన్సియర్‌గా.

నా గుండె బద్దలయిపోయింది. చాలా అవమానంగా కూడా అనిపించింది.

"అలాగే కళ్యాణిగారూ! ఈ ఏడాది చూసి, చివరలో నిర్ణయిద్దాం తరువాత ఏం చెయ్యాల్సిందీ!" ఒప్పుకున్నాను బాధగా.

"అలాగే," అంటూ ఫోను పెట్టేశారు కళ్యాణిగారు.

ఆఫీసులో పని మానేసి, కిటికీలోంచి రోడ్డు మీద పోతున్న వాహనాలను చూస్తూ కూర్చున్నాను. అన్నింటి మీదా ఆసక్తి చచ్చిపోయింది అకస్మాత్తుగా.

నా కోసం ఈ డాన్సు స్కూలు వాళ్ళని ఇంత కష్టపెడుతున్నాననే బాధ ఎక్కువగా కలిగింది. ఆ డాన్సు స్కూలు గనక లాభాల కోసం, వ్యాపారంగా నడుపుతూ ఉంటే, వేరేలా ఉండేది నా ఆలోచన.

నలభై ఏళ్ళ వయసులో ఒక వ్యక్తి నాట్యకళని మొదటినుంచీ నేర్చుకోవాలంటే ఇంత అసాధ్యంగా అయిపోయింది! ఇప్పుడు నలభై మూడేళ్ళు నిండిపోయాయి. ఇంకెప్పుడు ఆ కళ వస్తుంది నాకు? ఎవరు నా మీద ఎక్కువ టైం పెట్టి, నా కష్టాన్ని అర్థం చేసుకుని, నా లోపాల్ని సరిచెయ్యగలరు? ఒక వయోజన విద్యార్థి చిన్న పిల్లలతో కలిసి సమానంగా నేర్చుకోగలరా? మొదట్లో అడవులూ, హస్తముద్రలూ, శ్లోకాలూ, అర్థాలూ మిగిలిన చిన్నపిల్లల కన్నా చాలా తొందరగా నేర్చేసుకున్నాను. అవన్నీ కలిపి రిథమ్‌తో సంగీతానికి అన్వయించడానికి నాకు కష్టం వచ్చింది. ఇది నిజంగా సాధ్యం కాదా! నా మనస్సంతృప్తి కోసం వీళ్ళందర్నీ కష్టపెట్టాలా?

డాన్సు స్కూలు వారెవర్నీ నిందించగలిగే పరిస్థితిలో లేను. వారి తప్పెక్కడా కనబడలేదు నాకు. అలాగే నా తప్పేమిటో కూడా అర్థం కాలేదు. నాకు ఆ కళ చేతకాలేదని మాత్రం అర్థమయింది. మరి సాధనతో అన్నీ నేర్చుకోవచ్చుంటారే అందరూ? నేనెక్కడ ఫెయిల్ అయ్యాను?

ఆలోచనలతో తల వేడెక్కిపోయింది.

ఇక మీద ఇంకొకరిని నాకోసం కష్టపెట్టకూడదు. అవస్థ పడితే నేను పడాలిగానీ, ఇంకొకరిని అవస్థ పెట్టకూడదు. ఈ విషయం బాగా అర్థం అయింది.

వెంటనే కళ్యాణిగారికి ఈమెయిల్ పంపాను.

"బాగా ఆలోచించిన మీదట నేను డాన్సు క్లాసులు ఆపెయ్యటం ఉత్తమం అని అనిపించింది. ఇకమీదట నేను క్లాసులు తీసుకోను. ఇన్నాళ్ళూ నేర్పించినందుకు కృతజ్ఞతలు. మా అమ్మాయికి ఆ కళని నేర్పిస్తే మీకు రుణపడి ఉంటాను."

ఇంక ఆఫీసులో ఉండలేక ఇంటికి వెళ్ళిపోయాను. విచారంగా ఉన్న నన్ను చూసి, "ఏం డాడీ? విచారంగా ఉన్నావెందుకూ?" అడిగింది మా అమ్మాయి.

అంతే! నా దు:ఖం కట్టలు తెంచుకుంది.

గట్టిగా ఏడవడం మొదలుపెట్టాను మా అమ్మాయిని పట్టుకుని. అకస్మాత్తుగా నేను మొదలుపెట్టిన ఏడుపుకి మా అమ్మాయి బెంబేలు పడిపోయింది.

"ఏం జరిగింది డాడీ? ఎందుకేడుస్తున్నావూ? చెప్పు డాడీ, ఏం జరిగిందో చెప్పు. ఏడవకు ప్లీజ్!" అంది మా అమ్మాయి అల్లల్లాడిపోతూ.

వెక్కిళ్ళ మధ్య జరిగినదంతా చెప్పాను.

"పోనీలే డాడీ! రిథమ్ లేకపోతే పోయింది. డాన్సు కాకపోతే ఇంకోటి నేర్చుకుందువుగాని. ఏడవద్దు ప్లీజ్!" అంది మా అమ్మాయి కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా.

అది చూడగానే నా పితృహృదయం మూలిగింది. వెంటనే ఏడుపాపేశాను.

"సరే! అయిందేదో అయిందిలే! నేను స్నానం చేసి వస్తాను. టీవీ చూస్తూ అన్నాలు తిందాం, సరేనా?" అన్నాను చిరునవ్వుతో.

ఇంకొకసారైతే భోజనాలకి అన్ని సామాన్లూ తను పెట్టేది కాదు. ఈసారి మాత్రం అన్నీ తనే పెట్టడానికి లేచింది.

"సరే డాడీ! తొందరగా రా మరి! నాకు ఆకలేస్తోంది," అంటూ తేలికపడ్డ మనసుతో కిచెన్‌లోకి నడిచింది మా అమ్మాయి.

నేను బాత్‌రూమ్‌లోకి వెళ్ళి షవర్ కింద నిలబడ్డాను.

షవర్ నీళ్ళలో నా కన్నీళ్ళు కలిసిపోయి, నీళ్ళ చప్పుడుతో నా వెక్కిళ్ళు మిళితమైపోయి ఎవరికీ ఏమీ కనిపించలేదూ, వినిపించలేదూ! *

జిగిరీ

పెద్దింటి అశోక్‌కుమార్

"అగే అబ్బా..." చాంద్ కేక. వెంటనే "తెరిసువ్వర్ మారో... మల్లా వచ్చినవ్..." అన్న అరుపు.

ఇంకా మసుకు వీడలేదు. అప్పుడప్పుడే తెల్లారుతుంది. ఎండాకాలం. పొద్దంతా ఉడికిన భూమి సల్లరింది. సల్లారిన భూమి మీద నుంచి సల్లగాలి వీస్తుంది. సల్లగాలికి మత్తుగా నిద్రపోతున్న ఇమామ్ ఉలిక్కిపడి కండ్లు తెరిచిండు.

గిప్పడ గిప్పడ ఉరుకుతున్న చప్పుడు. తరుముతున్న చప్పుడు. ఆవేశంగా ఆయాసంగా చాంద్ వగరుస్తున్న చప్పుడు. మధ్య మధ్య కోపంగా మాటలు.

ఇమామ్‌కు నిద్ర పూర్తిగా ఎగిరిపోయింది. లేచి కూర్చున్నడు. చుట్టూ చూసిండు. కొడుకు మాటలతో కొంత అడుగుల చప్పుడు, అరుపులతో కొంత అర్థమైనా ఇప్పుడు షాదుల్‌ను చూసినంక పూర్తిగా అర్థమయింది.

"అరే... షాదుల్ ఆగయా..." అన్నాడు వణుకుతున్న పెదవులతో. షాదుల్ గుడ్డేలుగు. పద్దెనిమిదేండ్లు తన చేతుల మీదుగా పెరిగిన జంతువు. చూడగానే ఒక్కసారిగా మనసు ఆనందంగా ఉప్పొంగింది. వెంటనే భయం పుట్టింది. భయం ఆనందాన్ని కమ్మివేసింది.

రాత్రి నుండి తను ఆరాటపడ్డడు. బాధపడ్డడు. షాదుల్‌ను తలచు కుని వెక్కివెక్కి ఏడ్చిండు. అయినా బాధను బయటకు కనిపించనీయ లేదు. భార్యకు చెప్పలేదు. కొడుకుతో అనలేదు. మనసులోనే దాచు కున్నాడు. దాచుకున్న బాధను పసిగట్టినట్టు షాదుల్ వచ్చింది. పీక్కపోయిన మొఖంతో వడివడుతున్న కాళ్ళతో దుమ్ముకొట్టిన బూరుతో సాలు క్కుంటూ షాదుల్ వచ్చింది.



"తేరీ మాకూ... చోద్... బద్మాష్... మల్లా వచ్చినవ్... నువ్వు ఉంటే మాకు బదుకుదెరువు లేదు... పావు..." చాంద్ గుడ్డేలుగును గెదుము తున్నాడు. చేతుల రాళ్ళున్నయి. పరుగెత్తుతూ రాళ్ళను విసురుతున్నాడు. అవి గురి తప్ప కుండా తలకో, నడుముకో, కాళ్ళకో తలుగుతున్నయి.

దెబ్బదెబ్బకూ వంకర్లు తిరుగుతుంది గుడ్డేలుగు. మూతిని పైకెత్తి ఆయాసంగా అరుస్తుంది. అరుస్తూ పరుగులు తీస్తుంది. పక్కనే కంకర రోడ్డు. రోడ్డు వెంట పరుగు తీయలేదు. రెండడుగులు కిందికి దిగితే అడివి. అడివిలకు పరుగు తీయలేదు. అటుపక్క ఇటుపక్క వాకిలి సందు. సందులకు పరుగు తీయలేదు.

గుడిసె చుట్టూ పరుగు తీస్తుంది. తను ఇన్నిరోజులు నివాసమున్న పందిరి చుట్టూ, చుట్టూ ఉన్న రాళ్ళతెట్టి చుట్టూ పరుగులు తీస్తుంది. అప్పుడప్పుడు ఇమామ్ పండు కున్న కుక్కిమంచం చుట్టూ తిరుగుతుంది. భయం భయంగా మంచం కింద దూరుతుంది. తండ్రి కళ్ళలోని అసహా యతను, కొడుకు కండ్లలోని కోపాన్ని చూసి తన పందిరి కిందికి పోతుంది.

ఉరికీ ఉరికీ చాంద్‌కు ఆయాసమచ్చింది. వగరుస్తూ తండ్రి మంచం మీద కూర్చున్నడు. గుడ్డేలుగు తన పందిరి కిందికి పోయింది. రాళ్ళతెట్టె చాటున ఒక మూలకు నక్కింది. దెబ్బ తగిలిన కాలిని నాలికతో నాకుతుంది.

అలికిడికి గుడిసెలో పండుకున్న మైబమ్మ లేచింది. గెదరు వాసన తోనే గుడ్డేలుగు వచ్చినట్టు గుర్తుపట్టింది. ఆమెకు గుండె దడుక్కుమంది. 'అరే అల్లా... క్యాకరూమై,' అనుకుంటూ బయటకు వచ్చింది. గుడ్డేలుగూ... వెంట కొడుకూ... దారంతో కట్టెకు కట్టి గాలిలో తింపుతున్న బంతుల్లా గుడిసె చుట్టూ తిరుగుతూ కనిపించారు.

మైబమ్మకు కోపం వచ్చింది. చేతికందిన రాళ్ళతో తనూ ఇసిరి కొట్టింది. ఒకటి గుడ్డేలుగు కాలుకు తగిలింది. ఇంకొకటి గురి తప్పి పక్క నున్న రాయికి తగిలింది. ఇసిరిన రాయి మూడువక్కలయి అగ్గిరవ్వ చెక్కుమని మెరిసింది. గుడ్డేలుగు మూడు కాళ్ళతోనే ఉరుకుతుంది.

ఉరికీ ఉరికీ చాంద్‌కు ఆయాసమచ్చింది. వగరుస్తూ తండ్రి మంచం మీద కూర్చున్నడు. గుడ్డేలుగు తన పందిరి కిందికి పోయింది. రాళ్ళతెట్టె చాటున ఒక మూలకు నక్కింది. దెబ్బ తగిలిన కాలిని నాలికతో నాకు తుంది.

మైబమ్మ కొడుకు దగ్గరగా వచ్చింది. వెంట్రుకల్ని వడి తిప్పి ముడేసుకుంటూ, "ఓ సైతాన్ కబ్ ఆయారే..." అన్నది. చాంద్ వగరుస్తూ చెప్పలేదు. తెలువదన్నట్టు పెదవి విరిచిండు. ఇమామ్ కొడుకును, భార్యను, గుడ్డేలుగును మార్చి మార్చి చూస్తున్నడు.

గుడ్డేలుగు పందిరి కింద పతుకులాడుతుంది. ఇంతకుముందైతే ఒకపక్క మట్టిబోకె ఉండేది. బోకె నిండా సల్లగటుక ఉండేది. ఇంకోపక్క సిమెంటు గోళెం ఉండేది. గోళెం నిండా నీళ్ళుండేవి. కింద సొప్ప బెండ్లు ఉండేవి. దోసకాయ, బీరకాయ వక్కలుండేవి. ఇప్పుడు అవేవీ లేవు. పద్దెని మిదేండ్ల నుంచి అక్కడొక గుడ్డేలుగు ఉండేదనడానికి ఒక్క ఆనవాలు లేదు. రెండు మూడురోజుల్లోనే అంతా మాయం. గుడ్డేలుగు తన ఆనవాళ్ళ కోసం వెదుకులాడుతుంది.

"కైసా... అబ్ క్యాకరీంగే... వాళ్ళు వస్తరు. అవద్దమాడినట్టయి తది..." చేతులు పిసుక్కుంది మైబమ్మ. ఆమె కళ్ళల్లో గుడ్డేలుగు మీద కోపం కనిపిస్తుంది.

మొన్నమొన్నటి వరకూ ఆ కళ్ళల్లో ప్రేమ ఉండేది. అది ఇప్పుడు ద్వేషంగా మారింది.

"పోలీసులత్తరు. మనను లోపల వేత్తరు. మన గుడిసెకు అగ్గి వెడుతరు," భయంభయంగా అన్నడు చాంద్. ఇంకా ఆయాసంగా దమ్ము తీస్తూనే ఉన్నడు. ఛాతీ ఎగిరెగిరి పడుతుంది. ఏదో ఒకటి తేల్చుకోవా లన్నట్టు పట్టుదలగా ఉన్నాడు.

కప్పుకున్న బొంతను పక్కకు జరిపి మంచం దిగిండు ఇమామ్. ఇటుపక్క గుడిసె. అటుపక్క పందిరి. మధ్యలో పెద్దది యాపచెట్టు. చెట్టు కింద మంచం. చెట్టు ఆకుల్ని రాల్చుకుంది. కొత్త ఆకుల్ని తొడుక్కుంది. ఇమామ్ అనుబంధాన్ని రాల్చుకోలేకపోతున్నడు. భార్య లెక్క కొడుకులెక్క అనుబంధాన్ని తుడుచుకోలేక పోతున్నాడు.

"నేను అక్కడనే పెద్దమ్మ జంగల్‌ల ఇడిసిపెడుదామన్న. అక్కడ నీళ్ళ తావు లేదు. వద్దురా అంటివి. ఇప్పుడు సూడు. నీళ్ళ తావున ఇడిసి పెడితే ఉన్నదా...? తెల్లారేకల్లా ఇల్లు చేరె. ఇప్పుడు ఏంజేత్తవు," కోపంగా అన్నడు చాంద్.

కొడుకు మాటలు నిజమే అన్నట్టు చూసింది మైబమ్మ. తనూ కోపంగా చూస్తూ, "గోరుతో పోయేది గొడ్డలికచ్చె. అక్కడికి నేను చెప్పనే చెప్పిన. షాదుల్ ఇంటికి రావద్దు వస్తే బతుకుదెరువు లేదని," అన్నది.

ఇమామ్ నోరు మెదపలేదు. పెయ్యి విరిసిండు. బొక్కలు పలపల మన్నయి. వాయిలింపు తీసిండు. చుట్టూ చూసిండు. చూపులో భయ ముంది. ఆ భయానికే కారణం తెలుసుకున్నట్టు గుసగుసగా అన్నది మైబమ్మ.

'ఇంకా నయం. ఎవ్వలూ చూడలేదు. ఎవ్వలకూ తెలువకముందే మాయం జెయ్యాలె. ఒక్కలు చూసినా ఊరంత తెలిసిపోతది. పోలీసులకు చెప్పుతరు," వాళ్ళున్న గుడిసె ఇండ్లకు దూరంగా ఉంది.

పోలీసుల పేరు వినంగనే గుండెల దడ పుట్టింది ఇమామ్‌కు. ఇది యాసంగి కల్లాల దినం. పంట పండే ఊరికి గుడ్డేలుగుతో తండ్రికొడుకు లిద్దరు పోతరు. అట్లా ఈసారి గూడా సముద్ర లాంగాపురం పోయిండ్రు. కల్లాలు తిరుగుతున్నరు. గుడ్డేలుగును ఆడిస్తున్నరు. తాయితులు అమ్ము తున్నరు. జమ చేసిన వడ్లను సైకిల్ మీద తండ్రో, కొడుకో తెస్తున్నడు. ఒక్కొక్కసారి వడ్లు అమ్మి పైసలు తెస్తున్నరు.

వారం రోజుల కింద వడ్ల సంచితో ఇంటికి వచ్చిండు ఇమామ్. వెంటనే సుంకరి వచ్చిండు. ఎస్సై రమ్మన్నడని చెప్పిండు. ఇమామ్ భయపడుతూ స్టేషన్‌కు పోయిండు. ఎస్సై లేడు. ఏఎస్సై ఉన్నడు. "ఏదిరా గుడ్డేలుగు...?" అన్నడు.

అంతకు ముందే వన్యప్రాణి సంరక్షణ చట్టం వచ్చింది. చట్టం వచ్చీ రాగానే ఇమామ్ మీదనే అమలయింది. అప్పుడు ఎస్సై ఇమామ్‌ను పిలిపిం చిండు. ఎచ్చరించిండు. వదిలిపెట్టిండు. ఇమామ్ మాత్రం గుడ్డేలుగును వదలలేదు. దాన్ని వదిలితే బతుకుదెరువు లేదు. ఈ కల్లాల మీద ఆ కల్లాల మీద అని దొంగతనాన తిరిగిండు. వచ్చినప్పుడల్లా కానిస్టేబుల్ కింతా ఎస్సైకింతా తడిపిండు. అట్లా యాడాది గడిపిండు.

ఇప్పుడు ఎస్సై మారిండు. పోలీసులు మారింద్రు. కానూన్ మారింది. ఇమామ్‌కు పిలుపు అందింది. ఇమామ్ ఏఎస్సై ముందున్నడు. పాత ఎస్సై లెక్కనే సైసలు అడుగుతరనుకున్నడు.

"గుడ్డేలుగు ఏదిరా... సప్పుడు జెయ్యవు. నీమీద కేసు పెడుత," మళ్ళీ అడిగిండు ఏఎస్సై.

ఇమామ్ నోరు తెరిచిండు. కొద్దిసేపు ఆలోచించిండు. తర్వాత, "సచ్చిపోయింది సార్... మూన్నెల్లు దాటింది," అన్నడు.

"అరే బేకూ... నెలరోజుల కింద ఊర్లె తిరిగిందట. అయ్యకొడుకు లిద్దరూ తాయితులు అమ్మింద్రట. మూడు నెలలయిందంటవు...?" కన్నెర్ర జేసిండు ఏఎస్సై.

అది తనది కాదన్నడు ఇమామ్. బావమరిదిదన్నడు. కౌలుకు తెచ్చినన్నడు. బతిమిలాడుకున్నడు. కాళ్ళు మొక్కిండు.

ఏఎస్సై నమ్మలేదు. అయ్యకొడుకులిద్దరూ కల్లాల మీద ఉన్నరని తెలిసింది అతనికి.

"నీ కొడుకు ఏడిరా...?" అడిగిండు ఏఎస్సై.

"దొరా... బతుకవోయిండు," ఇమామ్ చెప్పిండు.

ఏఎస్సై కండ్లెర్ర జేసిండు. కోపంగా చూసిండు. "వీన్ని లోపల ఎయ్యిండ్రిరా... కొడుకు వత్తడు, గుడ్డేలుగత్తది," అన్నడు.

కానిస్టేబుల్ చెంప మీది నుంచి రెండు గుంజి సెల్‌లో ఏసిండు.

ఇంటి దగ్గర మైబమ్మకు తెలిసింది. ఇంట్ల ఉన్న గింజలమ్మింది. కొంత అప్పు జేసింది. నాలుగు వందలు జమచేసి సర్పంచ్ చేతుల పోసింది.

సర్పంచ్ స్టేషన్‌కు పోయిండు. అప్పటికే ఎస్సై వచ్చిండు. ఇమామ్‌ను చూసిండు. పేరు అడిగిండు. దగ్గరికి పిలిచిండు. "అరే ఇమామ్... నేను ఎంత మంచోన్నో అంత చెడ్డోన్ని. నీ దగ్గర గుడ్డేలుగుందా లేదా అన్నది అనవసరం. తప్పు ఎవలు చేసినా తప్పే. ఎమ్మార్వోకు చెప్పి కొంత భూమిని ఇప్పిస్త. దున్నుకుని బతుకు. మల్లా నీ దగ్గర గుడ్డేలుగు కనవడ్డదో... బతుకవు కొడుకా... మర్యాదగ చెప్పినప్పుడు మర్యాదగ మసులుకో," అన్నడు.

ఇమామ్ భయం భయంగా తలూపిండు. ఇంతకు ముందున్న ఎస్సై ఎంత గీరుదామా అని చూసిండు. ఈ ఎస్సై బదుకుదెరువు చెప్పిండు. వీళ్ళు ఇట్లాగే అంటరులే అని బయటకు వచ్చిండు. బయట సర్పంచ్ కలిసిండు. ఇద్దరు కలిసి ఇంటికి వచ్చింద్రు. సంగతి తెలుసుకుని సర్పంచ్‌ను పైసలడిగింది మైబమ్మ.

సర్పంచ్ గరానికచ్చిండు. "నీ మొగన్ని పుణ్యానికే ఇడిసింద్రా. మీద నాదో వంద ఖర్చయింది," అన్నడు.

తెల్లారి ఇమామ్ సైకిలి అందుకుని సముద్ర లాంగాపురం బయి లెల్లిండు. నెలరోజులు తండ్రీ కొడుకులిద్దరు ఎండనకా నీడనకా తిరిగిన కష్టం సర్పంచ్ పాలయినందుకు బాధగా ఉంది. ఈ విషయాన్ని కొడుక్కు చెప్పలేదు. వెళ్ళేసరికి మరో ముల్లెడు వడ్లు జమయినయి. వడ్లను అమ్మి గుడ్డేలుగు కొరకు జొన్నలు కొన్నడు. ఎస్సై మాటలు పూర్తిగా మరిచిపో యిండు ఇమామ్.

మూడురోజులు గడిచినయి. బస్తా వడ్లు జమయినయి.

"అబ్బా... మనం ఊరు చివర మడికట్టల్ల ఉంటున్నం. పొద్దంతా కల్లాలు తిరుగుతం. ఇక్కడ డేరాలో వడ్ల సంచి ఉంచితే ఎవడో ఎత్తుక పోతడు. దుమాల ఊర్లె ఎట్లయింది? వడ్లు ఎత్తుకపోయిరి... మన మీదనే దొంగతనం పెట్టిరి. సంచిని ఇంట్ల పెట్టి వస్త..." చాంద్ అన్నడు.

ఇల్లు గుర్తు చెయ్యగానే ఇమామ్‌కు ఎస్సై గుర్తుకచ్చిండు. "వద్దు రా," అన్నడు.

"అయితే వడ్లను అమ్ముదాం. సైసల్ని దాసుకోవచ్చు," చాంద్ అన్నడు.

అమ్ముడు అనగానే ఇంట్లో తిండి గాసమంతా అమ్మి సర్పంచ్ చేతుల పోసింది గుర్తుకచ్చింది. మళ్ళీ, "వద్దురా," అన్నడు.

చాంద్‌కు అర్థంకాలేదు. "అరే... అదీ వద్దంటవు. ఇదీ వద్దంటవు... ఇంతకు ముందు సంచి నిండకముందే పోవాలె... పోవాలె అందువు. ఇప్పుడు వద్దంటున్నవు. ఏందో..." అన్నడు కోపంగా. అన్న తర్వాత సంచిని ముల్లె గట్టిండు. వద్దన్నా వినకుండా సైకిల్ మీద వేసుకున్నడు. ఇంటి తొవ్వ పట్టిండు చాంద్.

ఆరోజు రాత్రి ఇమామ్ గుడ్డేలుగు పక్కలోనే పండుకున్నడు. 'షాదుల్,' అని ప్రేమగా పిలిచిండు. బూరంతా నిమిరిండు. అరికాళ్ళను గోకి చక్కిలిగిలి పెట్టిండు. మొఖంలో మొఖం పెట్టి ఆటాడుకున్నడు. చాంద్ ఇంటి నుంచి తిరిగి వచ్చేదాక ఒక్క కల్లం తిరుగలేదు. ఒక్క గింజ అడుగ లేదు. తన కడుపు మాడ్చుకున్నడు. దాని కడుపు నింపిండు. రెండు రోజుల గటుకను ఒక్కటే రోజులో వండి పెట్టిండు ఇమామ్.

"క్యా... పాగల్ హైతూ... డేరామే సోగయే... ఉన్నయన్ని ఠాణాల పోసినవు. నిన్న తీసుకపోయిన సంచి అమ్మిన. బాకీ తీరనే లేదు..." ఇంటి నుంచి వస్తూనే కోపానికి వచ్చిండు చాంద్.

ఇమామ్ మాట్లాడలేదు. ఎస్సై మాటలు గుర్తుకచ్చినయి.

"మామ ఫోన్ చేసిండట. గుర్రాల గొంది నుంచి తాత ఫోన్ చేసిం డట. మెదక్ నుంచి చిన్నాయిన గూడా... వాళ్ళు గుడ్డేలుగుల్ని అమ్ము తరట. కొనేదుంటే నిన్ను రమ్మన్నరట." చాంద్ చెప్పిండు.

మౌనంగా వింటూ కూర్చున్నడు ఇమామ్. అప్పుడు రాత్రయింది. ఇంటి నుంచి తెచ్చిన అన్నం ఇద్దరూ తిన్నరు. చాంద్ పడుకుని ఆకాశాన్ని చూస్తుండు. మసక వెలుగులో ఇమామ్ గుడ్డేలుగును చూస్తున్నడు. దాని గురకను వింటున్నడు.

"అబ్బా... షాదుల్ బుడా హోగయా... ఇంకో యాడాది బతుకు తదా... నా ఈడుదే గదా," చాంద్ అడిగాడు.

కొడుకు మాటలకు ఇమామ్‌లో ఉద్వేగం నిండింది. "పైరే... షాదులు పుట్టినంక దాని తల్లి సచ్చిపోయింది. అది నెలల గుడ్డు. నువ్వు గూడా. ఇద్దరినీ అమ్మినే పాలిచ్చి పెంచిందిరా... అదీ నీలాగనే ఎడమ రొమ్ముకు ఎగబడి ఎగబడి చీకేది. నీతోనే ఆడుకునేది. మన దాదీ ఉండేది చూడూ... దానికి నువ్వూ, షాదుల్ ఇద్దరూ మనుమలే. షాదుల్‌ను నీకంటే ప్రేమగా చూసుకునేది. ఏడాది దాకా మన షాదుల్ అమ్మి పక్కలోనే ఉండేది. నేనే దూరం తరిమేవాన్ని. దానికి ఆటలు నేర్పుతుంటే ఒకసారి నన్ను కరిచింది. నాకు కోపమచ్చి కట్టెతో కొడుతుంటే మన అమ్మి అడ్డం వచ్చింది. కట్టె దెబ్బ దాని భుజం మీద పడ్డది. ఆ మరుక ఇప్పటికీ ఉంది..." చెబుతున్నాడు ఇమామ్.

చాంద్ వింటూ ఊ కొడుతున్నడు. ఇమామ్ గొంతులో పరవశ ముంది. తన ముద్దు బిడ్డ ఆటపాటలను ఇతరులకు చెప్పుకునే తండ్రి మాటల్లోని మెత్తదనముంది. మురిపం ఉంది. చాంద్ గొంతులో మాత్రం విసుగు ఉంది.

"... షాదుల్ ఐదేండ్ల నుంచే ఆడటం మొదలుపెట్టిందిరా... కన్ను సైగ చేస్తే సైగతో తిరిగింది. మనందరికీ తిండి పెట్టింది..." ఇమామ్ చెప్పుకపోతున్నడు.

చాంద్ అడ్డు తగిలి, "అబ్బా..." అన్నడు. ఇమామ్ మాటల్ని ఆపి, "క్యారే..." అన్నడు.

"అబ్బా... ఇయ్యల్ల ఎమ్మార్వో రమ్మంటే పోయిన. కాయిదాల మీద సంతకం తీసుకున్నడు. నిన్ను రమ్మన్నడు. రెండకురాల పరంపోగు భూమి పట్టాలిత్తడట. వాగుల దొయ్యల్లనేనట. కొర్రగొట్టి సాపు చేసుకుంటే రెండు పంటలు తీసుకోవచ్చు. ఎస్సై మంచోడబ్బా... పేరు గఫూర్‌ఖానట. చాలాసేపు మాట్లాడిండు..."

ఇమామ్ ఆలోచనలు అక్కడనే ఆగిపోయినయి. దిగులు కమ్ముకుంది. బుగులు పుట్టింది. గొంతు ఎండిపోయింది. మాట పెకలలేదు. బలవంతంగా, "షాదుల్... షాదుల్ హై బోలే తూ..." ఆదుర్దా నిండిన గొంతుతో అడిగిండు.

చాంద్ చిన్నగా నవ్వి, "అట్లెందుకంట. నువ్వు చెప్పినట్టే చెప్పిన. నిన్ను జెట్టన రమ్మన్నడు. పట్టా యాకిదాలిత్తరట," అన్నడు.

బరువుగా నిట్టూర్పు విడిచిండు ఇమామ్. "షాదుల్... షాదుల్ హైనారే... క్యాకరీంగే..." అన్నడు బాధగా.

"క్యాకరీంగే... బూడా హోగయనా... చోడ్‌దేంగే..." అన్నడు చాంద్ తేలికగా.

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డడు ఇమామ్. కొడుకు అంత తేలికగా అంటడని ఎప్పుడూ అనుకోలేదు. మనసంతా బాధతో నిండిపోయింది. చాంద్ ఒకసారి జరంతో మంచాన పడ్డప్పుడు, జాతర్లో తప్పిపోయినప్పుడు ఇట్లనే బాధ కలిగింది.

తర్వాత ఇద్దరూ మాట్లాడుకోలేదు. రెండెకురాల భూమిపై కలలు కంటూ చాంద్ నిద్రపోయిండు. షాదుల్ దూరమవుతుందన్న బాధతో ఇమామ్ నిద్రపోలేదు.

తెల్లారి మబ్బుతోనే లేవదీసిండు చాంద్. గిన్నెలో అన్నం వండిండు. షాదుల్‌కు గటుక వండలేదు. తినే ముందు, 'షాదూల్,' అని పిలిచి బోకెలో అన్నం పెట్టిండు. గుడ్డేలుగు వచ్చి పసపసా అన్నం తింటుంది.

అది చూసి ఇమామ్ కోపానికి వచ్చిండు. "అరేయ్... అన్నం ఎందుకు పెట్టినవురా... నంజు రోగమత్తది," అంటూ ముందున్న బోకెను పైకెత్తిండు.

తండ్రి చేతిలోని బోకెను లాక్కుని గుడ్డేలుగు ముందు పెడుతూ, "చల్... రేపో మాపో పోతది. ఏది పెడితేంది...?" అంటూ మరింత అన్నం పెట్టిండు చాంద్.

ఇమామ్ అలాగ నిలబడిపోయాడు. ఎప్పుడో వాటం తప్పి ఇంట్లో జొన్నలు లేకుంటే ఒక్కపూట అన్నం పెడుదామంటే ఒప్పుకోని చాంద్... అప్పు చేసి అయినా సరే రోజు లీటరు పెరుగు చేసి జొన్న గటుకలో కలిపి తినిపించే చాంద్... మనం ఉపాసమున్నా సరే... షాదుల్‌కు కడుపు నిండా పెట్టాలనే చాంద్ ఇంత తొందరగా మారినందుకు ఇమామ్ బాధ పడ్డడు. పైకి మాత్రం నోరు తెరువలేదు.

ఆరోజు చాంద్ మామూలుగానే అన్నం తిన్నడు. షాదుల్ కొత్తగా అన్నం తిన్నది. ఇమామ్ ఖాళీ కడుపుతో వెంట నడిచిండు. మూతికి కట్టిన కట్టు పగ్గంతో ముందు చాంద్ నడుము షాదుల్ వెనుక ఇమామ్.

చాంద్ నడక తీరు గూడా మారింది. కొత్త వస్తువును కొన్నంక పాత వస్తువును వాడుతున్నంత నిర్లక్ష్యంగా గుడ్డేలుగును లాగుతున్నడు. ఇంతకు ముందు కుక్కలు ఎంటపడితే గెదిమేవాడు. పిల్లలు ఎంటబడి బూరు పీకుతుంటే అదిలించేవాడు. ఇప్పుడు ఏదీ లేదు. ఏదీ పట్టనట్టే ఉన్నడు.

ఆట ఆడేటప్పుడు చెప్పింది చెయ్యకుంటే అదిలించేవాడు. షాదుల్ నోట్లె తాయితు పెట్టి దూరంగా ఉమ్మించేటప్పుడు మెల్లెగా తల నిమిరేవాడు. మునివేళ్ళతో తలమీద తట్టేవాడు. ఇయ్యాల్ల ఏకంగా కట్టెనే పట్టుకున్నడు. టప్పటప్ప కొడుతండు చాంద్. నిన్నటి ప్రేమ లేదు ఇప్పుడు.

పొద్దుగూకింది. డేరాకు చేరిండ్రు. ఎప్పుడూ డేరా కింద షాదుల్‌ను జాగ్రత్తగా కట్టివేసే చాంద్ దానిని ముట్టనే లేదు. వట్టిగనే వదిలిపెట్టిండు. 'ఎందుకురా...?' అని ఇమామ్ అడిగితే, 'పోతేపోనీ. పీడాపాయె,' అన్నడు.

అప్పుడర్థమయింది ఇమామ్‌కు. కొడుకు ఇన్నిరోజులు షాదుల్ మీద పెంచుకున్నది ప్రేమ కాదని, పిడికెడు బువ్వను సంపాదించే అవసరాన్ని అని. ఉప్పుకప్పురం కలిసిపోయి కనిపించినా వానపడితే ఉప్పు కరిగిపోయి కర్పూరం మిగిలినట్టు ప్రేమ, అవసరం ఒక్కలాగ కనిపించినా పరిస్థితి మారితే అవసరం కరిగి ప్రేమ మిగులుతుంది. ఇప్పుడు చాంద్ అవసరం కరిగింది. ఇమామ్ ప్రేమ మిగిలింది.

"అరే పాగల్... ఐసాకైసా చోడ్తేరే..." అంటూ కోపంగా షాదుల్‌ను కట్టేశాడు ఇమామ్. ఆ రాత్రి గూడా అన్నం తినలేదు ఇమామ్.

"అబ్బా ఏమైది. జరమచ్చిందా తింటలేవు," అడిగిండు చాంద్.

ఇమామ్‌కు ఏం చెప్పాల్నో అర్థం కాలేదు. 'ఇన్నేండ్ల షాదుల్ సోపతినే అర్థం చేసుకోలేదు. తన బాధనేం అర్థం చేసుకుంటడు,' అనుకున్నడు. సమాధానం చెప్పకుండా మౌనంగా ఉన్నడు.

"అబ్బా... మీ తాతకుగానీ, తాత తాతకుగానీ నీ ఎరుకలో ఎవలకు గానీ మన వంశంల రెండెకురాల భూమి ఉందా...?" పడుకునే ముందు అడిగిండు చాంద్.

ఎడ తెరిపిలేని షాదుల్ ఆలోచనలు నిండుగా ఉన్న ఇమామ్, ఆలోచనల్లోనే కొట్టుకొని పోతూ, "ఎవలకూ లేదురా," అన్నడు.

"అదే... రేపు నాకు ఉంటది," గర్వంగా అన్నడు చాంద్.

గిరగిర తిరుగుతున్న ఆలోచనలన్నీ ఒకసారి ఆగిపోయినయి ఇమామ్‌కు. నిన్నటి నుంచీ ఆపుకున్న కోపం ఆగలేదు. పెద్దగా అరిచినట్టు,

"అరే మాదక్‌కోద్... ఎవడు ఇచ్చేదేందిరా... మనది మనం బతుకుదాం. ఇట్లనే ఎవలకంట పడకుండా తిరుగుదాం. ఇన్నిరోజుల్లాగే ఇప్పుడూ బతుకుదాం," అన్నడు.

చాంద్ గయ్యిమన్నడు. నాకంటే అదే ఎక్కువనా అన్నడు. నువ్వు ఎట్లనో బతికినవు. నేనెట్ల బతుకాలె నన్నడు. ఊర్లల్లో గుడ్డేలుగులను తింపుకుంట తిరిగే పరిస్థితి ఉందా అన్నడు. పోలీసులు బతుకనిత్తరా అన్నడు.

చాంద్ నడక తీరు గూడా మారింది. కొత్త వస్తువును కొన్నంక పాత వస్తువును వాడుతున్నంత నిర్లక్ష్యంగా గుడ్డేలుగును లాగుతున్నడు. ఇంతకు ముందు కుక్కలు ఎంటపడితే గెదిమేవాడు, అదిలించేవాడు. ఇప్పుడు ఏదీ లేదు.

ఇన్ని ఏండ్ల నుంచి కడుపునిండ తిండి తిన్నమా అన్నడు. ఇప్పుడు షాదుల్‌తో ఊర్లెకు ఎట్ల పోతం అన్నడు.

ఈ ప్రశ్నలన్నీ ఇమామ్ మనసులో మెదలనివి కావు. నిన్నటి నుంచీ సుడులు తిరుగుతున్నవే. అయినా వీటికి జవాబులు వెదుకాలని లేదు ఇమామ్‌కు. షాదుల్ మీదున్న ప్రేమ వీటిని మింగేస్తున్నది. ఇన్నేండ్ల నుంచి తనకు తిండి పెడుతుందన్న కృతజ్ఞతా భావనే కట్టి పడేస్తున్నది. చేతుల మీద పెరిగి కనుసైగలతో మెలిగిందన్న భావన ఇంకో ఆలోచనకు తావు ఇవ్వడం లేదు.

చివరగా చాంద్, "తోమై బాగ్‌జాతుం. తుమ్‌దోనో..." అంటూ ఆగి పోయిండు. కొడుకు ఏడుస్తున్నడని అర్థమయింది ఇమామ్‌కు. ఓదార్చాలని లేదు. తను కూడా ఏడ్వాలని ఉంది. బిగ్గరగా ఏడ్వాలని ఉంది. కండ్లల్లో నీళ్ళు ఊరినయి. ఇద్దరూ నిద్రలోకి జారుకున్నరు.

ఏ రాత్రిపూటనో చాంద్ లేచిండు. షాదుల్ కట్టు విప్పిండు. కొంత దూరం గెదిమిండు. వచ్చి పండుకున్నడు. షాదుల్ కొంత దూరం పరిగెత్తింది. వెనక్కి తిరిగింది. గుర్రుగుర్రుమని వచ్చింది. డేరా చుట్టూ తిరిగింది. తన జాగలనే పండుకున్నది.

తెల్లారి లేవగానే తండ్రిని ఫోన్ వద్దకు తీసుకపోయిండు చాంద్. ఊరికి ఫోన్ చేసి తల్లిని పిలిపించిండు. "అబ్బా నై సున్తే. తుమ్ బోల్," అన్నడు.

వణుకుతున్న చేతులతో ఫోన్ అందుకున్నడు ఇమామ్. కొడుకును ఒకెత్తు, షాదుల్‌ను ఒకెత్తు పాలిచ్చి పెంచిన భార్య అయినా తనలాగ ఆలోచిస్తుందనుకున్నడు. షాదుల్ మనకు ఎదిగి వచ్చిన కొడుకు అంటుందనుకున్నడు. షాదుల్‌ను విడుద్దని చెబుతుందనుకున్నడు. కరువును కాలాన్ని యాది చేస్తదనుకున్నడు.

ఆ ఆలోచనలేవీ లేవు ఆమె మాటల్లో. కట్టి ఇరిసినట్టు, కత్తెరతో కటుక్కుమని కత్తిరిచ్చినట్టు నాలుగే మాటలన్నది. ఆ మాటల్లో షాదుల్ పేరే లేదు. దాని కష్టానికి విలువనే లేదు.

"అరే... తూ పాగల్ హై... ఇన్నిరోజుల మన కష్టాన్ని పీల్సుక తిన్నోల్లే ఉన్నరు. మనకు బతుకుదెరువు సూపినోళ్ళు ఎవలూ లేరు. ఇప్పుడు ఇట్ల జేత్తే ఎట్ల. జెట్టన రాండ్రి. గుడ్డేలుగుంటే రెండెకురాలు రాదు. రెండుకు రాలుంటే వంద గుడ్డేలుగులత్తయి," అన్నది.

ఇమామ్ గోడలెక్కనే అయిండు. మాటలేదు, పలుకు లేదు, ఆలోచన లేదు, ఆవేశం లేదు. చాయ తాగుదామని హోటల్‌కు దారి తీసిండు చాంద్. నేను పోత. నువ్వు తాగిరా అన్నడు ఇమామ్. చెయ్యి పట్టి ఆపిండు చాంద్. హోటల్ దిక్కు గుంజుకుని పోయిండు.

ఇన్నేండ్ల జీవితంలో గుడ్డేలుగును ఒంటరిగా ఎప్పుడూ వదలలేదు. ఊరికుక్కలు చుట్టుకుంటే ఇడువయి. గుడ్డేలుగుకు మూతి కట్టు ఉంది కనుక అరువడానిక్కూడా వీలులేదు. ఇమామ్ పాణం తొక్కులాడుతుంది. చాంద్ కావాలనే లేటు చేస్తండు.

రెండు బుక్కల చాయ తాగి చాంద్ కొరకు ఎదురు చూడకుండా డెరా దిక్కు నడిచిండు ఇమామ్. షాదుల్ డేరా చుట్టు తిరుగుతుంది. భూమ్మీద మూతిని ఆనించి బస్సు బస్సుమని గాలి పీల్చుకుంటంది. భూమ్మీదున్న చీమలు, పురుగులు నోట్లోకి చేరినంక సప్పరిస్తంది. ఊర కుక్కలు మాటేసి ఉన్నయి. వాటిని అదిలించి గటుక ఎసరు పెట్టిండు ఇమామ్.

చాంద్ ఆలోచన వేరుగా ఉంది. ఈరోజే... ఇప్పుడే వెళ్ళిపోవాలని ఉంది. ముందుగా ఓ సంచెడు వడ్లను జమ చేసుకుని పోవాలనుకున్నడు. తండ్రి మాటలు విన్నంక ఎంత వీలైతే అంత తొందరగా పోవాలనుకుంటు న్నడు. బలవంతంగానైనా, బెదిరించి అయినా షాదుల్ పీడ వదిలించుకోవా లనుకుంటుండు.

"అబ్బా... ఆజ్ జాయింగే..." అన్నం తింటుండగా అడిగిండు చాంద్.

అన్నం ముద్ద గొంతుకు అడ్డం వచ్చింది ఇమామ్‌కు. సరానవడ్డది. గ్లాసులోని నీళ్ళను గడగడ తాగి కొడుకును చూస్తూ "ఎట్ల పోదాంరా... షాదుల్... షాదుల్ కిదర్ జాతేరే..." అన్నడు బాధగా.

చాంద్ తింటున్న సత్తుపళ్ళెంను ఇసిరికొట్టి, "తేరీ షాదుల్ మారో... షాదుల్... షాదుల్... నువ్వు షాదులే ఉండు. బంచోత్... నేను ఏ చెట్టుకన్నా ఉరివెట్టుకుని సత్త. మై మర్ జాతుం," కోపంగా అంటూ ఎంగిలి చేత్తోనే తాడును అందుకున్నడు. డేరాలోంచి బయటకు వచ్చిండు. చెట్లవైపు ఉరుకుతనే ఉన్నడు.

ఇమామ్‌కు భయం కమ్ముకుంది. గుండెలో దడ మొదలయింది. తిండి మీది నుంచి లేచి "అరె బెటా... నక్కోరే... తెరెపాం పడ్తురే... చాంద్... అరె చాంద్," అంటూ కొడుకు వెంటపడ్డడు.

షాదుల్ గుర్ గుర్ మంటూ డేరాల చుట్టు తిరుగుతుంది. చీమల్ని చప్పరిస్తుంది. తండ్రికొడుకుల ఎంగిలి పళ్ళాల దగ్గరికి వచ్చి కూర్చుంది.

ఇమామ్ కొడుకు చేతిని అందుకున్నడు. డేరాలకు తీసకవచ్చిండు. బుదురకిచ్చిండు. కాళ్ళు మొక్కిండు. బతిమిలాడిండు. చాంద్ మంకురు గాడు. అన్నంతపని చేస్తడని భయం.

చాంద్ కొద్దిగా తగ్గిండు. తండ్రి తన దారిలోనికి వచ్చినందుకు సంబురపడ్డడు. పైకి మాత్రం పట్టు సడలించకుండా, "షాదుల్ గావాల్నో... చాంద్ గావాల్నో... ఏకీ బాత్ బోలో," అన్నడు.

ఇమామ్ కొడుకు కాళ్ళ దగ్గర కూసున్నడు. షాదుల్ ఇమామ్ కాళ్ళ దగ్గర కూసున్నది. ఇమామ్ కండ్లల్ల నీళ్ళు తిరిగినయి. బొంగురు గొంతుతూ, "ఇది మనలను ఇన్నేండ్లు సాదిందిరా... ఇన్నేండ్లు మనకు తిండి పెట్టింది. నువ్వు... పద్దెనిమిదేండ్ల కొడుకువైనవు. నీ చేతులు నీ నోట్లెకు మర్రలేదు. రేపు నువ్వు కష్టం జేసుకున్నా... నీ పెండ్లాం... నువ్వు... నీ స్వార్థం..." షాదుల్ త్యాగాన్ని, అది దారవోసిన బతుకును చెప్ప బోయిండు.

చిర్రుమన్నడు చాంద్. "అరే పాగల్... మై క్యా బోల్‌రా... తూ క్యా బోల్‌రా..." కోపంగా అన్నడు. అంటూ తాడు అందుకున్నడు.

ఇమామ్ కళ్ళలోంచి రెండు కన్నీటిబొట్టు నేలకు రాలినయి. విరక్తిగా షాదుల్‌ను పక్కకు నెట్టిండు. కొడుకు చేతిని అందుకున్నడు. కొడుకు కండ్లలోకి ఆర్తిగా చూసిండు. చూస్తూ, "చాంద్... చాంద్ హోనారే ముజేకు... మేరా చాంద్," అంటూ బావురుమన్నడు.

ఆ ఏడ్పులో షాదుల్ దూరమైపోతున్నాడనే బాధ ఉంది. షాదుల్ గురించిన ఆర్తి ఉంది. ఆవేదన ఉంది. అది చాంద్‌కు అర్థం కాలేదు.

తండ్రిని కూసోబెట్టి, డేరా ఇప్పి ముల్లెగట్టిండు చాంద్. వండుకునే గిన్నెలను సంచిల సర్దిండు. షాదుల్ అన్నం తినే బోకే నీళ్ళు తాగే బోకే, పగ్గం, మీద కప్పే బార్‌దానీ... అక్కడనే విడిచిపెట్టిండు. విడిచిపెట్టిన



వస్తువులనే చూస్తుండు ఇమామ్. ముల్లెను సంచిని సైకిల్ మీద కట్టిండు చాంద్.

షాదుల్‌ను అక్కడనే వదిలి పెడుదామన్నడు చాంద్. ఊరు అంచు గదరా... ఊరకుక్కలు ఎంటబడి సంపుతయి. ఎక్కడన్న అడివిలో ఇడిసి పెడుదామన్నడు ఇమామ్.

చాంద్ సైకిల్‌ను పట్టుకుని, ఇమామ్ షాదుల్‌ను పట్టుకుని ఇంటిదారి పట్టిండ్రు. ఇమామ్‌కు కాళ్ళు ఆడుతలెవ్వు. అడుగ దుగుత లేదు. నూరెండ్ల ముసలితనం సైన పడినట్టుంది. అతడి కాళ్ళలోని నిస్సత్తువను గ్రహించినట్టు షాదుల్ మెల్లెగ నడుస్తుంది. చాంద్ మాత్రం తన వెంట ఎవరూ లేనట్టే నడుస్తున్నడు.

ముగ్గురూ గోరింటాల దాటి పెద్దమ్మ అడివిల కచ్చిండ్రు. అప్పటికి నెత్తి మీదికి పొద్దు వచ్చింది.

"అబ్బా... యా చోడ్‌దేంగే..." అన్నడు చాంద్ ఆగి.

"ఇది పెద్ద అడివి బిడ్డ... నీళ్ళు గూడ దొరుకయి. ఎక్కడన్నా నీళ్ళ తావున ఇడిసి పెడుదాం," అన్నడు ఇమామ్.

చాంద్ కోపంగా చూసిండు. లుంగీని ఎగజెక్కుకుంటూ, "అది ఊరాయె... ఇది అడివాయె... ఎట్లా...?" అన్నడు ఎక్కసంగా. కొడుకు మాటల్లోని ఇరుపును అర్థం చేసుకున్న ఇమామ్ నీరసంగా, "ఎట్లంటే ఎట్లరా... అడివిల పెరిగెదాన్ని ఊర్లె పెంచినం. మాంసం తినేదానికి గంజి గటుక పెట్టినం. జంతువుల్లో కలిసేదాన్ని మనుషులల్ల కలిపినం..." ఏదో చెబుతనే ఉన్నడు ఇమామ్.

చాంద్ వింటలేడు. సైకిల్ నూకుతూ గులుగుతండు. గులుగుతూ నడుత్తండు. పొద్దుగూకే జామున పలంచె అడివి చేరుకున్నరు. ఊరు ఇంకా పది పన్నెండు కిలోమీటర్లుంది. ఈసారి ఇమామే ఆగిండు. చాంద్ నోరు దెరుత్తలేడు. ఎక్కడ విడిచిపెడుతడో చూద్దామని ఓపికగా నడు త్తండు.

నీళ్ళ తావున గుడ్డేలుగును ఆపిండు ఇమామ్. ముల్లె విప్పిండు. గటుక వండిండు. కడుపునిండ పెట్టిండు. నీళ్ళు తాపిండు. అన్నీ ముల్లె గట్టిండు. సైకిల్ మీద పెట్టిండు. "చల్‌రే," అన్నడు.

చాంద్ మురిపెంగా సైకిలెక్కిండు. ఇమామ్ వెనుక క్యారీల్ మీద కూసున్నడు. సైకిల్ వేగమందుకుంది.

గుడ్డేలుగు తండ్రికొడుకులిద్దరినీ వింతగా చూస్తుంది. గొంతెత్తి గాండ్రుమంది. ఇమామ్ గిలగిల కొట్టుకున్నడు. అంతవరకూ ఉగ్గపట్టుకున్న దు:ఖం పొంగి వచ్చింది. కూసున్నోడు కూసున్నట్టే బావురుమన్నడు. చీకటిపడే వరకు తండ్రికొడుకులిద్దరూ ఇల్లు చేరిండ్రు.

నిన్న అట్లా వదిలివచ్చిన షాదుల్ తెల్లారేసరికి ఇంటి ముందుంది ఇప్పుడు.

"అరే... మీరు గడ్‌బడ్ చెయ్యకుండ్రి... నేను ఎట్లనో మాయం జేస్త,' ' అంటూ షాదుల్ దగ్గరికి నడిచిండు ఇమామ్.

భార్య విసిరిన రాయి బలంగానే తగిలినట్టుంది. కాలుకు రక్తం కారుతుంది. అడివిలోంచి ఏముండ్లను ఏ పొదలను దాటి వచ్చిందో! బూరు నిండా పల్లేరు గాయలున్నయి. మూతికి కాళ్ళకు గాట్లున్నయి. రక్తం గడ్డకట్టి ఉంది. మూలుగుతూ కాలును నొక్కుంటుంది. ఇమామ్‌ను చూడగానే భయంగా మరింతగా నక్కింది.

ఇమామ్ కండ్లల్ల నీళ్ళు తిరిగినయి. దాని వీపు నిమిరిండు. వెన్ను తట్టిండు. ఆ చేతి స్పర్శతో ఏ ఓదార్పు అందిందో... చనువుగా దగ్గరికి వచ్చింది షాదుల్. షాదుల్ కాలుకు ముల్లుగుచ్చినా హైరానా పడే తల్లీ కొడుకులు ఇప్పుడు ఇద్దరినీ విసుగ్గా చూస్తున్నరు.

"ఎవలకూ తెలువకముందే నేనే ఎక్కడన్నా విడిచిపెట్టి వత్త... మీరు తెలువనట్టే ఉండుండ్రి," తల్లీకొడుకులకు చెప్పి గుడ్డేలుగుకు పగ్గం బెట్టిండు ఇమామ్. 'చాయ్ పీకే జావో,' అన్నా వినకుండా అడివి వైపు నడిచి మసక చీకట్లో కలిసిపోయిండు.

చాంద్ ఒకసారి స్టేషన్ పోయిండు. రెండుసార్లు ఎమ్మార్వో ఆఫీసుకు పోయిండు. కార్యదర్శిని సర్పంచ్‌ను కలిసిండు. పొద్దంతా తిరిగిండు. పొద్దుగూకి ఇంటికి వచ్చిండు.

కూరుకు రాత్రయింది. ఇమామ్ కొరకు చూస్తుండ్రు. అందరూ పండుకున్నాక, ఇమామ్ వచ్చిండు. వెంట షాదుల్ ఉన్నది. నిన్న మొన్నటి వరకు అది వాళ్ళకు దేవుడిచ్చిన వరం. ఇప్పుడు శాపమయింది.

"సడే సాత్ గయేనయీ," మైబమ్మ పెదవి విరిచింది. ఇమామ్ ఏదో సర్ది చెప్పిండు. చాంద్ కోపానికి రాలేదు. నవ్విండు. నవ్వుతూ జేబులోంచి ఒక కవరును తీసిండు. తీసి తల్లికి ఇస్తూ, "అమ్మీ... ఆజ్‌రాత్ కతమ్... ఇది కుక్కల్ని సంపే మందు. గ్రామ పంచాయితిల నుంచి తెచ్చిన. గటుకల కలుపు గతికి సత్తది," అన్నడు.

ఇమామ్ పొట్లాన్ని బాధగా చూసిండు. మైబమ్మ సంతోషంగా అందుకుంది. రాత్రిపూటనే గటుకలో కలుపుతానంటే వద్దన్నడు ఇమామ్.

"ఇక్కడ పెట్టినమనుకో... రాత్రంతా కొట్టుకుంటుంది. అరుస్తుంది. అందరికీ తెలిసిపోతది. రేపు మబ్బుతోనే అడివికి తీసుకపోత. అక్కడ పెడుత. కొట్టుకున్నా మొత్తుకున్నా ఎవలకూ తెలువది," ఇమామ్ అన్నడు.

తల్లీకొడుకులిద్దరికీ నిజమే అనిపించింది. అట్లనే చెయ్యిమన్నరు.

మరునాడు మబ్బుతోనే లేచిండు ఇమామ్. భార్యను లేపిండు. మైబమ్మ లేచింది. గటుక వండింది. ముల్లె గట్టింది. ఇమామ్‌కు తొక్కుతో సర్ది గట్టింది. సద్దిని ముల్లెను చేతికిచ్చింది. అదే చేత్తో కుక్కల మందు కవరు గూడా ఇచ్చింది.

బంగీ ఎగజెక్కుకుని పగ్గం పట్టుకుని షాదుల్‌తో అడివి తొవ్వ వట్టిండు ఇమామ్.

పొద్దు గూకింది. తెల్లారింది. మల్లా పొద్దు గూకింది. తెల్లారింది. వారం గడిచింది. నెల గడిచింది.

ఇమామ్ ఇంటికి తిరిగి రాలేదు. చుట్టు పది ఊర్లు తిరిగినా దొరుకలేదు. *

స్టిల్ ఫ్రెండ్స్

ఉపాధ్యాయుల సూర్యకుమారి

"హియర్ వుయ్ ఆర్!" గర్వంగా, ఆనందంగా అంది స్వాతి.

"హియర్ వుయ్ ఆర్! ఫర్ అవర్ సక్సెస్" తనతో అంటూ చేతిలోని అయిస్ టీ సీసా గాలిలోకి ఎత్తాను.

ఇద్దరం ఉన్నది నయాగరా ఫాల్స్ ఎదురుగా. ఎదురుగా కనిపిస్తున్న అపారమైన ఆ నీటి ప్రవాహాన్ని చూస్తుంటే ఇద్దరి మనసుల్లోనూ ఇదీ అని చెప్పలేని ఉద్వేగం. ఎవరికి వాళ్ళం మేమేమిటీ... ఇక్కడ ఇలా నయాగరా ఫాల్స్ దగ్గర ఈ విధంగా నుంచుని మాట్లాడుకోవటమేమిటీ అనే సంభ్రమంలో వున్నాం. ఎక్కడి ద్రాక్షారామం... ఎక్కడి నయాగరా!?

ఎవరి ఆలోచనల్లో వాళ్ళం ఉండిపోయి, అలా క్రిందికి పడుతున్న నీటిని చూస్తూ ఉండిపోయాం కొద్ది నిమిషాలు.

"ఈ నీళ్ళని చూస్తుంటే ఏమనిపిస్తోంది?" ప్రశ్నించింది స్వాతి.

"నిజం చెప్పనా? దూకేయాలనిపిస్తోంది," జవాబిచ్చాను. ఏమిటో మరి నయాగరాకి వచ్చిన ప్రతిసారీ ఆ హోరుని చూస్తే దానిలో అలా లీనమైపోవాలి అనిపిస్తుంది.

ఏదో అనబోతున్న స్వాతిని మధ్యలోనే ఆపాను. "మళ్ళీ నావి అన్నీ పెసిమిస్టిక్ అయిడియాలు అంటూ నా బుర్ర తినకు. ఎందుకో ఆ నీటి వేగంతో అలా కొట్టుకుపోవాలని నీకు మాత్రం అనిపించటం లేదూ?" తన కళ్ళల్లోకి చూస్తూ అడిగాను.



"నిజమే... నాకు కూడా అలా ఆ నీటితోపాటు కొట్టుకుంటూ అనంత సాగరంలో కలిసిపోవాలని అనిపిస్తోంది," నెమ్మదిగా తలూపుతూ అంది.

ఆశ్చర్యం వేసింది. స్వాతికి ఈ తరహా మాటలు కానీ, ఆలోచనలు కానీ నచ్చవు. అలాంటిది స్వాతి ఏమిటీ... నయాగరాలో దూకేస్తాను అనటం ఏమిటీ? నాదంటే కొంచెం వెరైటీ మన:స్తత్వం అన్నీ ఇలాంటి ఆలోచనలు కానీ స్వాతి నోట ఈ తరహా మాటలు!??

"నీ తలకాయ్... నువ్వేంటీ... ఈ మాటలేంటి... ఇప్పుడు నీకు ఏం తక్కువైందని? నడునడు... కాటన్ కాండీ... అదే... మన పీచు మిఠాయి తిని ఎన్నాళ్ళయిందో... తిందాం" తనని అక్కడ నుండి లాక్కెళ్ళాను.

నయాగరా ఎదురుగా ఉన్న పచ్చికలో దుప్పటీ పరుచుకొని నడుములు వాల్చాము ఇద్దరమూ. చుట్టూ పిల్లలు రకరకాల ఆటలు ఆడటం చూసి మా కుక్కపిల్లతో మా పిల్లలూ, స్వాతి కొడుకూ ఫ్రిజ్‌బీ ఆడటం మొదలెట్టారు. పిల్లల గోల కొంచెంసేపైనా తప్పింది అని మేమిద్దరమూ హాయిగా మా ద్రాక్షారామం రోజుల్లోకి ఆనందంగా వెళ్ళాం.

జ్ఞాపకాలు! అవి ఒకోసారి మానిన గాయలని రేపుతాయి, ఒకోసారి మనుషుల్లో వచ్చిన మార్పులని చూపుతాయి. నాకూ, స్వాతికీ మధ్య జ్ఞాపకాలు ఎన్ని మధురమైనవి ఉన్నా నిండుకుండలో విషపుచుక్కల్లాంటి కొన్ని చేదు జ్ఞాపకాలు మా మధ్య దూరాన్ని పెంచాయి.

"మొన్న వింధ్య మెయిల్ ఇచ్చింది," మా ఇద్దరి మధ్య కొద్దిసేపు నెలకొన్న మౌనాన్ని భగ్నం చేస్తూ అన్నాను.

"రాజీవ్ ఎలా ఉన్నాడుట?" ఎదురుగా నయాగరా పైన కనిపిస్తున్న ఇంద్రధనుస్సుని చూస్తూ అడిగింది స్వాతి.

"తెలీదు. నువ్వు ఇంకా రాజీవ్‌ని మర్చిపోలేదా?" తనవైపు తిరుగుతూ ఆమె మొహంలో భావాలని చదవటానికి ప్రయత్నిస్తూ అడిగాను. ఏ భావం కోసం వెతుకుతున్నానో మరి!

"శ్రీని పెళ్ళి చేసుకొని మంచి పని చేసాను. కానీ ఒకోసారి రాజీవ్ గురించి ఆలోచించినప్పుడు, మా ఇంట్లో ఆరోజు ఆ విషయం తెలియకుండా ఉంటే నా లైఫ్ ఎలా ఉండేదా అని అనుకుంటూ ఉంటాను."

"ఏముందీ... ఇవాళ వింధ్య ఎలా ఉందీ? పగలంతా తనలా బ్యాంక్‌లో లేకపోతే ఏదో ఒక నౌఖరీలో గొడ్డుచాకిరీ చేసి సాయంత్రం అవగానే అత్తగారి సాధింపులు వింటూ, భర్తగారినీ పిల్లలనీ చక్కదిద్దు కుంటూ ఉండేదానివి," తన ఈ జీవితం వేయిరెట్లు మేలు అని చెప్పకనే చెప్పే ప్రయత్నం చేసాను.

"ఇక్కడ, ఇప్పుడు మాత్రం ఏం తేడాగా వుందీ నా బతుకు? పగలంతా బ్యాంకులో కాకపోతే మైక్రోసాఫ్ట్‌లో చాకిరీ చేస్తున్నాను. ఇంటికి వెళ్ళి ఇంట్లో చాకిరీ చేస్తున్నాను. ఒకోసారి అనిపిస్తూ ఉంటుంది తెలుసా... మా వాళ్ళకి తెలియకుండా నేను రాజీవ్‌తో వెళ్ళిపోయి తనని పెళ్ళి చేసుకొని ఉంటే మావాళ్ళు నన్ను వెలేసి ఉండేవాళ్ళు. ఇప్పుడు ఫిజికల్ దూరం వలన దూరంగా ఉన్నాను. అప్పుడు ఎమోషనల్ దూరం వలన దూరంగా ఉండేదాన్ని. ఎలాగైనా దూరం దూరమే కదా?"

"నీ తలకాయ్... నువ్వేంటీ... ఈ మాటలేంటి... ఇప్పుడు నీకు ఏం తక్కువైందని? నడునడు... కాటన్ కాండీ... అదే... మన పీచు మిఠాయి తిని ఎన్నాళ్ళయిందో... తిందాం"

తన మనసు మళ్లించడానికి ఏదో చెప్పి టాపిక్ మార్చాను కానీ నా మదిలో స్వాతి అన్న మాటలే మెదలసాగాయి. మేము తిరిగి మా ఇంటికి టొరంటో వచ్చేసాము. మా ఆయన సుధీర్‌కి లండన్‌లో పని. ఈ వారం ఇంటికి రావటం కుదరదన్నాడు. 'అన్నేళ్ళ తరువాత నీ ఫ్రెండ్ వస్తోంది. మీ ఇద్దరికీ మాట్లాడుకోవటానికి బోలెడు ఉంటాయి. పానకంలో పుడకలాగ నేను ఎందుకూ, మీరిద్దరూ ఎంజాయ్ చేయండి,' అని బహుచక్కగా తప్పించుకున్నాడు. వాళ్ళాయన ఇండియా వెళ్ళడంతో తను మా ఊరు వచ్చింది. ఇద్దరం కలుసుకోవటం ఏడేళ్ళ తరువాత! ఇన్నేళ్ళు ఎందుకు కలుసుకోలేదు అంటే నాలో గిల్టీ ఫీలింగో లేక తనకు నేను అప్పట్లో చేసిన ద్రోహం గ్రహించి కావాలని దూరంగా ఉందో తెలీదు మరి. ఆ విషయం గురించి ఆలోచించాలంటేనే ఇబ్బంది. తను అడిగేస్తే నేను జవాబివ్వగలనా అన్నది కూడా పెద్ద ప్రశ్నే నాకు.

✤

ఇద్దరం చిన్నప్పటి నుంచీ ఒకే స్కూలు, ఒకే కాలేజీలో చదివాము. మా ఊరు ద్రాక్షారామం, చిన్న ఊరు. జూనియర్ కాలేజీ చదువు అయ్యాక ఇద్దరికీ కాకినాడలో సీటు వచ్చింది. మంచి కాలేజీలో సీటు తెప్పించుకున్నా మన్న ముచ్చటతో మావాళ్ళు మమ్మల్ని అక్కడికి పంపటానికి ఒప్పుకున్నారు. ఇద్దరమూ కాలేజీకి దగ్గరగా ఓ ఇల్లు తీసుకొని ఉండటం మొదలెట్టాం. స్వాతి మంచి తెలివైనది. నేను గంటలు గంటలు బట్టీ పడితే కానీ రానివి తనకి ఒక్కసారి అలవోకగా చదివితే వచ్చేసేవి. దానితో తనకి ఒక్క చదువుకే కాక వేరే కల్చరల్ యాక్టివిటీస్‌కి కూడా టైము ఉండేది. నేను ఎంతసేపూ తనకన్నా ఎక్కువ కాకపోతే కనీసం సమానంగానైనా మార్కులు తెచ్చుకోవాలన్న పట్టుదలతో తలక్రిందులు అయ్యేదాన్ని.

ఎప్పుడూ ఉరకలేసే గోదారిలా ఉండే స్వాతి అంటే కాలేజీలో ఎంతోమంది మనసు పారేసుకున్నారు. వాళ్ళ గురించి తను ఒకింత గర్వంగా, నిర్లక్ష్యంగా చెప్తుంటే నా మనసు ఎక్కడో ఈర్ష్యతో మూలిగేది. ఆ టైములో నేను ప్రేమలో పడ్డాను. అబ్బాయిలతో మాట్లాడటమే భయంగా ఉండే నాకు మా ఊరు నుండే వచ్చిన ధన్వంతరి అంటే ఇష్టం మొదలైంది. మిగిలిన అబ్బాయిల్లా స్వాతి వెనకాల పరుగెత్తడు అనుకునేదాన్ని. ఎప్పుడన్నా కలిసినా స్వాతితో పాటే కలిసేదాన్ని. అందరిలా తనతో మాత్రమే మాట్లాడి నన్ను కంప్లీట్‌గా ఇగ్నోర్ చెయ్యక, నన్ను కూడా ఆ సంభాషణలోకి లాగేవాడు. నేను ఏవో ఆలోచనల్లో ఉన్నా కదిలించే వాడు.

సరిగ్గా అదే టైంలో నాకు సుధీర్ పెళ్ళి సంబంధం వచ్చింది. మా వాళ్ళకి సుధీర్ చాలా నచ్చటం చేత ఎప్పుడెప్పుడు తను అమెరికా నుండి చదువు ముగించుకొని వస్తాడా ఎంత త్వరగా మూడుముళ్ళూ వేయిం

చేద్దామా అన్నట్టు తయారయ్యారు. నాకు ఏం చెప్పాలో తెలీదు. పోనీ ధైర్యంచేసి చెప్దాం అంటే అసలు ధన్వంతరి నేనంటే ఇష్టపడుతున్నాడో లేదో తెలీదు. ధైర్యంచేసి అడుగుదాం అంటే భయం. మళ్ళీ తను 'అబ్బే లేదు నిన్ను జస్ట్ ఫ్రెండ్‌లాగా చూసానంతే!' అంటే తట్టుకోలేను. అన్నీ సవ్యంగా జరిగినా, మా ఇద్దరివీ వేరు వేరు కులాలు.

✣

భుజం మీద తట్టడంతో ఒక్కసారిగా ఉలిక్కిపడి "ఆ... ఏమిటే... ఏం కావాలి?" అడిగాను హెడ్‌ఫోన్స్ తీస్తూ.

"ఏంలేదు. హెడ్ ఫోన్స్ పెట్టుకొని వాల్యూమ్ మ్యూట్ చేసి టి.వి.లో ఏం చూస్తున్నావ్? ఆ హెడ్‌ఫోన్స్‌లో ఏం వింటున్నావ్?" చేతిలోని ఒక కాఫీ కప్ నాకు అందిస్తూ అడిగింది స్వాతి.

"ఏంలేదు ఏదో ఆలోచిస్తున్నా. నీకు ఇంకా ఇలా అర్ధరాత్రి లేచి కాఫీలు తాగే అలవాటు పోలేదా?" నాకు అలవాటు పోయినా ఎలాగూ కలిపింది కదా అని తాగటం మొదలెడుతూ అడిగాను.

"నాకూ ఏవో ఆలోచనలు! దానితో నిద్రపట్టలేదు. అలా చీకట్లో పక్క మీద దొర్లటం విసుగు. నువ్వు మెళకువగా ఉన్నావని నాకు తెలీదు. కాఫీ కోసం వచ్చేసరికి నిన్ను చూసాను. ఏదో పాటలు వింటున్నావనుకున్నా. నీ కిచెన్‌లో నీకు తెలీకుండా కాఫీ కలిపి నిన్ను సర్‌ప్రైజ్ చేద్దామని వచ్చాను,' ' ఎదురుగా వున్న లవ్‌సీట్‌లో సర్దుక్కూర్చుంటూ జవాబిచ్చింది.

ఏం మాట్లాడక కాఫీ తాగుతూ మౌనంగా ఉండిపోయాం కొద్దిసేపు.

"శ్రీకి మొన్న ఇండియాలో ధన్వంతరి కనపడ్డాడుట," ఉన్నట్టుండి అంది.

ఏం చెప్తుందో అని మౌనంగా వినసాగాను.

"ఇద్దరు పిల్లలుట. మా ఆడపడుచు వాళ్ళ పక్కింట్లో ఒక మూడు గదుల వాటాలో అద్దెకుంటున్నాడట," తన సలహా పాటించి నేను మంచి పనే చేసాను అని సమర్థించటానికి అన్నట్టు ధన్వంతరి పరిస్థితి వర్ణించ టానికి కొంచెం ఎక్కువే కష్టపడుతోంది.

"కలిసి చాలా రోజులైంది," సంభాషణ ఎటువైపు మళ్ళుతోందా అని ఆలోచిస్తూ అన్నాను.

"నువ్వు ఇంకా ధన్వంతరిని గుర్తు చేసుకుంటావా?"

"లేదు. ఇక్కడ ఖాళీ దొరికినప్పుడు ఎప్పుడన్నా, లేక ఏదైనా ఈ కాలంలో వచ్చే ఇమ్మెచ్యూర్ లవ్‌స్టోరీలు చూసినప్పుడూ గుర్తొస్తాడు."

"సుధీర్‌ని పెళ్ళి చేసుకొని తప్పు చేసాను అని ఎప్పుడన్నా అనిపిస్తుందా?"

"తప్పో, ఒప్పో చేసుకున్నది నా ఇష్టం మీద చేసుకున్నాను. ఇంక అది తప్పా ఒప్పా అని ఆలోచించటం వేస్ట్. అవన్నీ తీపి జ్ఞాపకాలు అయినా, ఇన్నాళ్ళు గుర్తు పెట్టుకొని, వాటి గురించే ఆలోచిస్తే, ప్రస్తుత జీవితం వెగటు పుడుతుంది," మళ్ళీ ఆ రోజుల తాలూకు జ్ఞాపకాలు ముసురు కుంటుండగా అన్నాను.

"తప్పో, ఒప్పో చేసుకున్నది నా ఇష్టం మీద చేసుకున్నాను. ఇంక అది తప్పా ఒప్పా అని ఆలోచించటం వేస్ట్. అవన్నీ తీపి జ్ఞాపకాలు అయినా, ఇన్నాళ్ళు గుర్తు పెట్టుకొని, వాటి గురించే ఆలోచిస్తే, ప్రస్తుత జీవితం వెగటు పుడుతుంది"

"కానీ నేను రాజీవ్‌ని మర్చిపోలేకపోతున్నాను. శ్రీ ఏదో తక్కువ చేస్తున్నాడని కాదు. అసలు శ్రీ నా జీవితం లోకి ఎందుకు రావాలి? నేను ఎందుకు కాంప్రమైజ్ అవ్వాల్సి వచ్చింది? ఇదంతా ఏదో దేవుడు కావాలని చేసాడేమో అనిపిస్తుంది ఒకోసారి."

✣

ధన్వంతరికి నా ప్రేమ గురించి చెప్పాలా వద్దా అని సందేహంతో నేను కొట్టుమిట్టాడుతుంటే నా తపన గ్రహించిన స్వాతి డైరెక్ట్‌గా నన్ను అడిగింది ఒకరోజు.

"ధన్వంతరిని లైక్ చేస్తున్నావ్ కదూ? అతని కోసమేనా సుధీర్ సంబంధం గురించి ఏ విషయం తేల్చక దాటేస్తున్నావ్?" సూటిగా అడిగింది.

నాకున్న ఒక్కగానొక్క బెస్ట్ ఫ్రెండ్ స్వాతి. తనకి కాక ఇంకెవరికి చెప్పుకోగలను నా బాధ? తనకి కూడా నా అంతట నేను చెప్పలేకపోయాను. కానీ తనే అడిగేసరికి ఇంక దాచలేదు. తనకైనా చెప్పటానికి ఏం చెప్తాను? ధన్వంతరి అంటే నాకు ఉన్నది ఒట్టి ఆకర్షణో లేక ఇంట్లో వాళ్ళనీ, ఊర్లో వాళ్ళనీ ఎదురించి కులాంతర వివాహం చేసుకునేంత ధైర్యం కల ప్రేమో నాకే తెలీదు!

నా స్నేహితురాలిగా నాలో ధైర్యం నూరిపోయాల్సిన స్వాతి ఆరోజు నన్ను నిరుత్సాహపరిచింది. సుధీర్‌ది ఎంత మంచి సంబంధమో రక రకాలుగా ఇద్దరినీ పోల్చి చూపించి చెప్పింది. ఒకవేళ అవన్నీ కాదని ధన్వంతరినే అనుకున్నా అతను నా మీద అంత ఇంట్రెస్ట్ చూపిస్తున్నట్టు లేదు అని చాలా బ్లంట్‌గా చెప్పింది. దానితో నేనూ పునరాలోచనలో పడ్డాను. ప్రేమిస్తున్నానేమో అని అనిపించింది క్రితం వారం. ఇవాళ ఆ ప్రేమ ఫలించే మార్గాలు ఎక్కడా లేవు అని తెలిసింది. అదీ ఒకందుకు మంచిదే. రోజులూ నెలలూ సందిగ్ధంలో గడపకుండా, ఇంట్లో ఎవరి మనసూ నొప్పించకుండా నేను కూడా అంతగా అటాచ్ అవలేదు కనుక తేలిగ్గా మర్చిపోయేలా త్వరగా ముగిసిపోయింది అని నాకు నేను సర్ది చెప్పుకొని సుధీర్‌తో పెళ్ళికి అంగీకరించాను.

ధన్వంతరి గురించి పెద్దగా ఆలోచించలేదు. దానికి కొంతవరకూ కారణం సుధీర్‌తో కొత్తగా పెళ్ళి అయిన రోజులు ఒక అందమైన కలలా గడిచిపోయేవి. డిగ్రీ మూడో సంవత్సరంలో నేను కాకినాడలో కాకుండా వైజాగ్‌లో చదివాను. సుధీర్ అక్కడ పనిచేసేవాడు. స్వాతి, ధన్వంతరి, మా మిగిలిన ఫ్రెండ్స్ మాత్రం కాకినాడలోనే చదువు కొనసాగించారు.

నేను మా పుష్యమిని కడుపుతో ఉన్నప్పుడు మావాళ్ళు నన్ను ద్రాక్షారామం తీసుకెళ్ళి గాజులు పెట్టించారు. స్వాతి కలిసింది అప్పుడు. ఎన్నో కబుర్లు చెప్పుకున్నాం. ఎందరో పాత స్నేహితుల గురించి మాట్లాడు కున్నాం. స్వాతి అప్పటికి రాజీవ్‌తో పీకలలోతు ప్రేమలో మునిగి ఉంది. రాజీవ్ వాళ్ళ కులం అతను కాడు. నాకు ధన్వంతరిని చేసుకోవద్దు అని హితబోధలు చేసిన స్వాతి మరి తనేం చేస్తుందో!? అనుకున్నాను. మాటల

మధ్య నేను ఇంక ధన్వంతరి గురించి విషయాలని పెద్ద సీరియస్‌గా తీసుకోను అనుకుందేమో అంది...

"తెలుసా అప్పట్లో నాకు ధన్వంతరి అంటే క్రష్ ఉండేది. నువ్వు తనని ఇష్టపడుతున్నానని చెప్పేసరికి తట్టుకోలేకపోయాను. నీ సంగతి నాకు తెలుసు కదా, నిర్ణయం తీసుకునే ధైర్యం లేదు. నీకు ఏది మంచిదో అదే సలహా చెప్పాను, ఆ విషయంలో నువ్వు నా సలహా అడిగినప్పుడు. నిజంగా మంచి పని చేసాను. చూడు సంవత్సరం తిరగలేదు అప్పుడే మీరు ప్రొడక్షన్ మొదలెట్టే సారు. ధన్వంతరి నాకు కూడా అందని ద్రాక్షే అయా డనుకో! స్టిల్, నో రిగ్రెట్స్! నాకు రాజీవ్ చాలు!"

నాకు ఒక్కక్షణం ఏమనాలో, ఏం చేయాలో అర్థం కాలేదు. తను నేను ఆ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకుంటానని లేశమాత్రం ఊహించినా ఆ మాట నాకు చెప్పేది కాదు. ఇవాళ నేను ఏమాత్రం సంతోషంగా ఉన్నా దాని క్రెడిట్ అంతా తను ఆరోజు చేసిన మోసం అని చెప్పి తన గిల్టీ ఫీలింగ్‌ని తగ్గించుకునే ప్రయత్నం చేస్తోంది.

కోపమో, సరైన అవకాశం కాదన్న వివేకమో మొత్తానికి ఏ కారణం వలన అయితేనేమీ అప్పుడు ఏమీ అనలేదు. నవ్వేసి ఆ విషయాన్ని తేలిగ్గా తీసుకున్నట్టు నటించాను. కానీ అప్పటి నుండి ఎందుకో నాకే తెలీదు. ధన్వంతరి గురించి ఎక్కువ ఆలోచించటం, ఆ ఆలోచన వచ్చినప్పుడల్లా స్వాతి మీద కోపం ఉవ్వెత్తున ఎగిసిపడటం మొదలైంది. నా జీవితంలో ప్రస్తుతం ధన్వంతరిని కోరుకోవటం లేదు. సుధీర్‌ని చేసుకొని నేను అన్నివిధాలా కాకపోయినా మ్యాగ్జిమమ్ సంతోషం, సంతృప్తితో ఉన్నాను. కానీ, స్వాతి తన స్వార్థం కోసం నన్నూ, నా ఎమోషన్స్‌ని మానిప్యులేట్ చేసింది అని కోపం.

తనకి నేను చేసినది తెలిసే అలా ఫిషింగ్ చేస్తోంది అని అర్థం అయిపోయింది. నా నోటి నుండి నేను చేసినది చెప్పిద్దామని ప్రయత్నిస్తోందా?! అసలు ఏడేళ్ళ తరువాత హఠాత్తుగా రావటం వెనుక ఉద్దేశం అదేనా?

✤

"మొన్నా మధ్య పిట్స్‌బర్గ్ వెళ్ళినప్పుడు మా అన్నయ్య ఫ్రెండ్ గణేష్ కనిపించాడు," మా మధ్య మౌనాన్ని భగ్నం చేస్తూ అంది స్వాతి.

తనకి నేను చేసినది తెలిసే అలా ఫిషింగ్ చేస్తోంది అని అర్థం అయిపోయింది. నా నోటి నుండి నేను చేసినది చెప్పిద్దామని ప్రయత్ని స్తోందా?! అసలు ఏడేళ్ళ తరువాత హఠాత్తుగా రావటం వెనుక ఉద్దేశం అదేనా?

"ఏమంటాడు?" అడిగాను.

"ఏముందీ... మామూలే, ఏవో పాత కబుర్లు చెప్పుకున్నాం. అయినా అతనితో ఇండియాలో ఉన్నన్నాళ్ళూ పెద్దగా మాట్లాడలేదు. వాడు మా అన్న నా మీద పెట్టిన స్పై అనుకునేవాళ్ళం గుర్తుందా? ఇంకా ఆ ఫీలింగ్‌తోనే అనుకుంటా పెద్దగా మాట్లాడలేదు."

"అబ్బా ఒంటిగంటన్నర!" టైము చూసి అప్రయత్నంగా సంభాషణ ఇక ముగిద్దాం అన్నట్టు అన్నాను.

"సరే, ఇంక పడుకుంటా, మళ్ళీ రేపు ఫ్లయిట్‌లో నిద్ర ఉండదు," నా పక్కన ఉన్న ఖాళీకప్పు తీస్తూ అంది స్వాతి.

✤

బాక్ యార్డ్‌లో పిల్లలు స్ప్రింక్లర్‌తో ఆడుకుంటున్నారు.

"రమా నీకో విషయం చెప్పాలి," డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చున్న స్వాతి అంది.

"చెప్పు," గిన్నెలు డిష్‌వాషర్‌లో లోడ్ చేయటం ఆపి అడిగాను. మనసులో 'అడిగేస్తోంది...' అనుకుంటూ.

"గణేష్‌ని నువ్వు ఆరోజు కలిసిన సంగతి మొన్నా మధ్య కనపడినప్పుడు చెప్పాడు... అదే నేనూ, రాజీవ్ పారి పోవాలని వేసుకున్న ప్లాన్ గురించి మా అన్నకి నీ ద్వారా తెలిసిందని చెప్పాడు."

గిల్టీ ఫీలింగ్‌తో అనుకుంటా నా కాళ్ళు ఒక్కసారిగా జావకారిపోయి నట్టు అయిపోయాయి. నుంచోటానికి శక్తి లేనట్టు ఆసరా కోసం చూస్తూ, కింద తెరచి ఉన్న డిష్‌వాషర్ తలుపు అడ్డుకొని ముందుకి తూలి పడ బోయాను. అంతలో సర్దుకొని, నెమ్మదిగా వెళ్ళి తన పక్కన ఉన్న కుర్చీలో కూలబడ్డాను.

"ఒక్కసారిగా కోపం వచ్చింది. అంతలోనే నీ గురించి ఆలోచించిన కొద్దీ నువ్వెందుకు అలా చేసి ఉంటావో అర్థం అయింది. నీవు నేర్పిన విద్యయే అన్నట్టు నాకు అనుభవం అయితేకానీ ఆ బాధ ఎలా ఉంటుందో అర్థం కాలేదు. నాకు ఎప్పుడూ నీ ద్వారానే ఆ విషయం మా అన్నకి తెలిసి ఉంటుంది అని అనుమానం ఉండేది. అదే నిజం అని తెలిసాక, ప్రస్తుతం నాకు లైఫ్‌లో ఏది ముఖ్యం అనేది ఆలోచించాను."

నాకు తెలీకుండానే నా కళ్ళు కన్నీటితో నిండిపోయాయి. "నువ్వు నాకు ఆ విషయం చెప్పినప్పటి నుంచీ తెలీని వెర్రి ఆవేశంతో ఊగి పోయాను. నీ విషయం లీక్ చేయటం ఏదో టిట్ ఫర్ టాట్ అనుకున్నాను. నువ్వు నాకు చెప్పినట్టే తర్వాత సరదాగా విషయం చెప్దామనుకున్నాను. కానీ, నేను చేసిన దానివలన నువ్వు ఫేస్ చేసిన సిట్యుయేషన్స్ చూసాక నేను చేసిన తప్పు తెలిసింది. నీ బాధ చూసాక, నేను చేసినది చెప్పే ధైర్యం చేయలేక పోయాను. అప్పుడు తెలిసింది నేను ఎంత ఫూలిష్‌గా బిహేవ్ చేసానో... ఆ గిల్టీ ఫీలింగ్‌తోనే, నీతో ఇన్నాళ్ళూ ముఖాముఖీ కలుసు కొనే ధైర్యం చేయలేకపోయాను," వెక్కిళ్ళ మధ్య చెప్పాను. ఉద్వేగమో, గిల్టీ ఫీలింగో, మరెందుకో వచ్చాయి అన్ని కన్నీళ్ళు.

"ఏమైనా, మంచికి చేసినా, కోపంతో చేసినా ఇద్దరికీ మంచే జరిగింది. ఇద్దరం తప్పు చేసాం. అందులో ఎవరిది పెద్ద తప్పు అన్న లెక్కలు ఇప్పుడు అనవసరం. నీతో మాట్లాడాక మనసు తేలిక అయింది. ఇప్పుడు నాకు ఎందుకు, ఎలా అనే ప్రశ్నలు లేవు. నిన్ను దులిపేద్దాం అని మొదట్లో అనిపించినా, మన ఫ్రెండ్‌షిప్ నా కోపం కన్నా గట్టిది... స్టిల్ ఫ్రెండ్స్... రైట్?!" కళ్ళు తుడుచుకుంటూ అడిగింది. ✱

అవరోహణం - ఆరోహణం

ముందుపాటి సత్యం



ఆరోజు రాత్రి భోజనం చేసి, టీవీ ముందు కూర్చున్న జగన్నాధంతో అంది సుగుణ, "ఇందాక కాలిఫోర్నియా నుంచి రాధ పిలిచింది," అని.

"ఆఁ! ఏమంది మా బంగారం," అడిగాడు జగన్నాధం. కూతురు దగ్గర్నించి ఫోన్‌కాల్ వచ్చిందంటే మహా సంతోషం జగన్నాధానికి. ఒక్కగానొక్క కూతురు కనుక, అతనికి రాధ మీద వల్లమాలిన ప్రేమ.

ఒక్కక్షణం తటపటాయించి, "ఇన్నాళ్ళనుంచీ నేను దేని గురించి భయపడుతున్నానో, అది వినాల్సి వచ్చింది ఇవాళ!" నెమ్మదిగా అంది సుగుణ.

జగన్నాధం తల పైకెత్తి అదోలా చూశాడు సుగుణని. "చెప్పు!" అన్నాడు.

"తను ఎవర్నో ప్రేమించిందిట, పెళ్ళి చేసుకుంటుందిట."

"దాంట్లో తప్పేముంది? దానికి నచ్చినవాడ్ని అదే ఎంచు కుంటున్నది. ఇంతకీ ఎవరతను?" అడిగాడు.

"అతను వాళ్ళ హాస్పిటల్లోనే, మనమ్మాయితోనే కలిసి పనిచేస్తున్న డాక్టర్‌ట. అంతకన్నా ఎక్కువ చెప్ప బోతుండగా, తను కాల్‌లో ఉన్నాననీ, సెల్‌ఫోన్ మోగు తున్నదనీ, తను ఆ ఎమర్జెన్సీ అటెండవాలనీ, మళ్ళీ పిలుస్తాననీ చెప్పి ఫోన్ పెట్టేసింది."

ఒక్కక్షణం ఆగి, "ఎవరతను? మనవాడేనా?" అడిగాడు జగన్నాధం.

"అదింకేం చెప్పలేదు," అంది సుగుణ నెమ్మదిగా.



"కనీసం తెలుగువాడేనా?"

సుగుణ మాట్లాడలేదు.

"ఏమీ తెలుసుకోకుండా నువ్వు ఫోన్‌లో మాట్లా డిందేమిటి మరి? అసలు ఇండియావాడేనా అని?" అసహనంగా అడిగాడు జగన్నాధం.

"చెప్పానుగా... వేరే వివరాలేమీ చెప్పలేదని... ఆఁ! మాటల మధ్యలో అతని పేరు చెప్పింది. ఆ అబ్బాయి పేరు బాబ్ అని కాబోలు చెప్పింది."

"అంటే విదేశీయుడన్నమాట. కనీసం అమెరికావాడేనా?"

తెలీదన్నట్టుగా తల ఊపింది సుగుణ.

"అసలు తెల్లవాడా?... నల్లవాడా?... ఇంకెవడైనానా..." గొణుగుతున్నాడు జగన్నాధం.

సుగుణ కూడా ఒకపక్క ఆరాటం, రెండోపక్క ఏవో ఆలోచనలూ ముసురుతుంటే, మనసులో ఒక విధమైన భయంతో మాట్లాడకుండా అతనివేపే చూస్తూ కూర్చున్నది.

జగన్నాధం కూడా ఆలోచనలో పడ్డాడు. తనూ, సుగుణా ఈ పెళ్ళికి ఇష్టపడ్డ పడకపోయినా, అమెరికాలోనే పుట్టి పెరిగిన రాధ, అందరు అమెరికన్ పిల్లల్లాగానే, తనకి తన భవిష్యత్తుకీ ఏది సరైనదనిపిస్తుందో అదే చేస్తుంది. తను కావాలని ఆ భావాలతోనే పెంచాడు మరి. అలాటిది తనకి ఈ ఆలోచన ఎందుకిప్పుడు?

అయినా జగన్నాధం ఆలోచనలు మాత్రం ఆగలేదు.

ఎన్నో ఏళ్ళుగా అమెరికాలో స్థిరపడిపోయిన భారతీయులు చాలా మంది అమెరికన్ సంస్కృతికీ, జీవనానికీ, మనుష్యులకీ అలవాటు పడిపోయినా, ఇలాంటి సంఘటనలని మిత్రుల అనుభవాల ద్వారా ఎప్పుడూ చూస్తూనే ఉన్నా, అది తమదాకా వచ్చేసరికి ఒక్కసారిగా డీలా పడిపోవటం సహజమే. కొంతమంది వెంటనే తేరుకుని తమని తామే సమర్ధించుకుని పిల్లల ఆనందం, భవిష్యత్తు దృష్ట్యా ముందుకు సాగిపోవటం కూడా సహజమే. మనవాడైతే బాగుంటుందన్న భావంతో మొదలైన ఆశ కనీసం తెలుగువాడైతే చాలనీ, పోనీ ఇండియన్ అయినా ఫరవాలేదు అన్న ఆలోచన దాకా పోతుంది. ఇక వేరే గత్యంతరం ఏమీ లేదని అనిపించినా తర్వాత మనిషి మనసు నేను, నా అనే ఒక ఇరుకైన భావన నుంచి కొంత విశాలమైన ఆలోచనలకి ఎలా పురులు విప్పు కుంటుందో చూపిస్తుంది.

ఇప్పుడు జగన్నాధం ఆలోచనలు కూడా ఆ అవరోహణ క్రమంలోనే నడుస్తున్నాయి. మనసులో ఇష్టం ఉన్నా లేకపోయినా, ఈ ఆలోచనాసరళిని నడిపించేది ఇక వేరే గత్యంతరం లేదనే భావన అవచ్చు. ఆ వ్యక్తుల మీద ఉండే ప్రేమానురాగాలు కావచ్చు. చాలారోజులు అమెరికాలో ఉండి ఆ విశాల దృక్పథం చూస్తున్న వాతావరణ విశేషాలు కావచ్చు. పిల్లల తల్లిదండ్రులకి, తమ పిల్లలు ఎవర్ని పెళ్ళి చేసుకున్నా ఆనందంగా ఉండి, చివరికి కథ సుఖాంతం అయితే అంతకన్నా కావలసిందేముంది.

ఒక గంట గడిచాక రాధ మళ్ళీ ఫోన్ చేసింది. ఈసారి జగన్నాధం, "మరీ కష్టపడి పనిచేస్తున్నావురా నువ్వు. మధ్యమధ్యలో కాస్త రెస్ట్ తీసుకుంటూ ఉండు. ఇందాక అమ్మతో ఏదో చెబుతున్నావుట..."

ఒక్కక్షణం ఆగి అన్నది, "అవును డాడీ! ఎప్పటినుంచో చెబుదామనుకున్నాను కానీ, అంతా నిర్ధారణ కాకుండా ఎందుకులే అని ఆగాను. ఇవాళ మధ్యాహ్నం లంచ్‌కి వెళ్ళినప్పుడు రెస్టారెంట్‌లో, అందరిముందూ నా కుర్చీ దగ్గర మోకాళ్ళ మీద కూర్చుని ప్రపోజ్ చేశాడు బాబ్, 'విల్ యు మేరీ మి?' అని. వెంటనే యస్ అనేశాను. అతనంటే నాకూ ఇష్టమే. చాల మంచి వాడు. అతనితో ఒక్కసారి మాట్లాడితే మీరూ ఎంతో లైక్ చేస్తారతన్ని. ఐ నో దట్!" అంది రాధ.

జాగ్రత్తగా వింటున్నాడు జగన్నాధం. అతనికి కూతురంటే వల్లమాలిన ప్రేమ అని ముందే అనుకున్నాం కదా. రాధతో ఆయనా, ఆయనతో రాధ తండ్రీ కూతర్లలాగా కాకుండా మనసు విప్పి ఎంతో దగ్గరి స్నేహితుల్లా మాట్లాడుకుంటారు కనుక, ఆ సంభాషణ ఒక క్రమపద్ధతిలో నడుస్తున్నది.

"అతనంటే నీకు చాలా చాలా ఇష్టమా? అతనితో నువ్వు జీవితాంతం సుఖంగా ఉండగలవని నీకు నమ్మకం ఉందా?" అడిగాడు జగన్నాధం.

నవ్వింది రాధ. "దాంట్లో ఏమీ అనుమానం లేదు డాడీ! వుయార్ మేడ్ ఫర్ ఈచ్ అదర్! ఇఫ్ యు సీ హిమ్, యు విల్ ఎగ్రీ విత్ మి," అంది.

"ఇంతకీ ఎవరే ఆ బాబ్... అదే ఆ అబ్బాయి అమెరికనా... తెల్లవాడా..." అడిగింది సుగుణ ఇక ఆగలేక.

"తెల్లవాడూ కాదూ, నల్లవాడూ కాదు," అంది రాధ నవ్వుతూ.

"మరెవరే... ఇండియనేనా..." అడిగింది సుగుణ.

"ఆహా! ఇండియనే..." అంది రాధ కవ్విస్తూ.

"తెలుగువాడేనా?..." అడిగింది సుగుణ కుతూహలంతో.

"అవును తెలుగువాడే... అమెరికాలో పుట్టిన తెలుగువాడు... నాలాగా సరిగ్గా తెలుగురాని తెలుగువాడు!" నవ్వింది రాధ.

"మనవాడేనా..." అడగలేక అడిగింది సుగుణ.

"ఎవరు? రాంబాబా..." పెద్దగా పడీపడీ నవ్వుతున్నది రాధ.

"నేను అతన్ని పెళ్ళి చేసుకుంటే, అతను మనవాడయిపోతాడు కదూ..." అంది ఇంకా పెద్దగా నవ్వుతూ.

ఎంత పెద్దగా నవ్వుతున్నదంటే, రిసీవర్ పట్టుకున్న సుగుణ జగన్నాధంల చెవుల్లో తుప్పు వదిలిపోయింది. *

నెమలినార

బి. మురళీధర్

"నీలాసంలో శివుడినే మెప్పించినవాడను! ఇంద్రలోకంలో ఇంద్రుడినే చెరపట్టినవాడను! ఈ ముల్లోకాల్లోనూ నాకెదురులేనివాడను! నువ్వా? నన్ను గెలుచువాడవు! హ్హా! హ్హాహ్హా! హ్హా!..." అని రావణుడు భయంకరంగా వికటాట్టహాసం చేశాడు.

"ఓరీ రావణా! పర సతిని చెరబట్టిన నాడే నీ గొప్పతనం తేటతెల్ల మయిందిరా! అబలను చెరబట్టిన నీవా గొప్ప వీరుడవి? మాయో పాయంతో నా ఆలిని ఎత్తుకొచ్చిన నువ్వూ ఒక శూరుడివా? చాలించు నీ వ్యర్థ ప్రేలాపన! కాచుకో ఇక నీ ప్రాణాలను!" రాముడు రావణుడిని హేళన చేశాడు.

శ్రీరామ పట్టాభిషేకం యక్షగానం మంచి ఊపు మీద ఉంది. రామ రావణుల సంవాదం. అప్పుడే పాటల రూపంలోనూ, కాస్సేపటికి మాటల రూపంలోనూ నడుస్తూ ఉంది. అప్పటికి రాత్రి రెండు గంటలవుతోంది! బ్రాహ్మీ ముహూర్తం దాకా రావణవధ, విభీషణుడి పట్టాభిషేకం, సీతమ్మ వారి అగ్నిప్రవేశం అయిపోతాయి. సరిగ్గా బ్రాహ్మీ ముహూర్తంలో శ్రీరామ పట్టాభిషేకం, మంగళహారతి జరుగుతాయి. అది నాటకమైనా - పట్టాభిషేకం, మంగళహారతి మంచి ముహూర్తంలో జరగవలసిందే!

స్టేజికి అటూ, ఇటూ వేలాడదీసిన రెండు పెట్రోమాక్సు లైట్లు కొంచెం మసకబారగానే, రావణుడు వెంటనే వాటిలో గాలి కొట్టాడు. లైట్లు మరింత వెలుగునిస్తున్నాయి. ఆ వెలుగులో రామ రావణుల భుజకీర్తులూ, కిరీటాలూ ధగధగా మెరిసిపోతున్నాయి.



ప్రేక్షకులకు ఈ యుద్ధఘట్టం ఎంతో ఇష్టమైనది. మద్దెల తాళాలు వీరరసాన్ని నిండా ఆవిష్కరిస్తున్నాయి. నాటకం చూసే పిల్లలు సరిగ్గా కనపడాలని మోకాళ్ళ మీద లేచి చూస్తున్నారు. రేపు మళ్ళీ తమ సావాసగాళ్ళతో ఈ సీనంతటినీ ఏ పశువులకొట్టంలోనో, ఏ గడ్డివాముల మధ్య నో అభినయించాల్సి ఉంది గనుక, వాళ్ళు కన్నార్పడం లేదు.

"ఒరేయ్ సిన్నోడా! లడాయి అచ్చినపుడు లేపమంటివి గదరా! అగో సూడు! లడాయి జేత్తున్నరు! లెయ్! లెయ్!" ఒక ముసలావిడ తన మనుమడిని నిద్ర వదిలించేందుకు ప్రయత్నిస్తోంది.

"లేపకపోతే మల్ల తిట్లు దిడతరు! లెవ్వండ్రిరా అంటే లేస్తలేరు! రావణుడి ఏషమచ్చింది లెండిరా!" మరో తాత మనుమలను లేపుతున్నాడు.

"రావణా! కాచుకో ఈ బ్రహ్మాస్త్రాన్ని!" అని రాముడనగానే మద్దెల, తాళాలు తమ హోరు తారాస్థాయి పెంచేశాయి. స్టేజీ మీద పిడుగులు పడే శబ్దాన్ని సృష్టించడానికి అవి శాయశక్తులా వాయించబడుతున్నాయి. ఆ చప్పుడుకి అంతదాకా మగతమగతగా జోగుతున్న వాళ్ళూ, ఇంకా లేవని వాళ్ళూ అందరూ చప్పున లేచి కూర్చున్నారు.

ఆ వాయిద్యాల హోరు నేపథ్యంలో రాముడు తళతళ మెరుస్తోన్న ఒక ప్రత్యేక బాణాన్ని తీశాడు. ప్రేక్షకులు సంభ్రమంగా ఆ బాణంవైపు చూస్తున్నారు. సీతమ్మవారిని అష్టకష్టాలు పెట్టిన ఈ దుష్ట రావణుడు ఈ బాణంతోనే ఛస్తాడు కాబోలు! అని ఎవరికివారే అనుకొని మరింత కళ్ళు విప్పార్చుకొని చూస్తున్నారు. ప్రేక్షకులు అరుపులూ, ఈలలతో కళాకారులకు ఉత్సాహాన్నిస్తున్నారు.

రాముడు బాణం ఎక్కుపెట్టాడు. అంతలోకే ఒక మనిషి స్టేజీ మీదకు వచ్చి రాముడి చెవిలో ఏదో చెప్పాడు. రాముడు వెంటనే రావణుడిని దగ్గరకు పిలిచి చెవిలో ఏదో చెప్పాడు. ఇద్దరూ కలిసి తెర వెనక్కి వెళ్ళిపోయారు. వాయిద్యాలూ ఆగిపోయాయి.

నాటకం రసవత్తర ఘట్టంలో ఆగిపోయింది. ప్రేక్షకులంతా నిశ్శబ్దమయిపోయారు! ఏమయింది? ఏం జరిగింది?

తెర వెనుక నుండి ఏవో మాటలు వినిపిస్తున్నాయి! కానీ స్పష్టత లేదు! మరి కాస్సేపటికి రాముడి పాత్రధారి రాముడి వేషంలోనే ఇందాక స్టేజీ మీదకు వచ్చిన మనిషితో బాటు వడివడిగా నడిచి వెళ్ళిపోతున్నాడు.

ఆ దృశ్యం చూస్తే రాయిలా మారి అడవిలో పడి ఉన్న అహల్యను మనిషిగా మార్చడానికి విశ్వామిత్రుని వెంట నడుస్తున్న రాముడు గుర్తుకు వస్తున్నాడు.

ఈ రాముడు అంత గొప్పవాడు కాకపోయినా, మృత్యుముఖంలో ఉన్న ఏ ప్రాణినో, బయటకు లాగడానికే అంత జరూరుగా ఆ మనిషి వెంట నడిచి వెళ్తున్నాడు.

మరి కాస్సేపటికే ప్రేక్షకులందరికీ విషయం తెలిసిపోయింది!

"కట్ల ఆశన్న దుక్కిటెద్దుకు నోట్లెకెళ్ళి నురగలు వస్తున్నయట! భూమ్మీద పడి కాళ్ళు తన్నుకుంటున్నదట!"

తెర వెనుక నుండి ఏవో మాటలు వినిపిస్తున్నాయి! కానీ స్పష్టత లేదు! మరి కాస్సేపటికి రాముడి పాత్రధారి రాముడి వేషంలోనే ఇందాక స్టేజీ మీదకు వచ్చిన మనిషితో బాటు వడివడిగా నడిచి వెళ్ళిపోతున్నాడు.

"నారాయణయ్య వెళ్ళాడుగదా! తక్కయిపోతది!" ఆ భరోసా మాటనే అందరి నోటా వినిపించింది!

అప్పుడు నాటకం కన్నా ఒక మూగజీవి ప్రాణమే గొప్పదని, తమ వినోదం కన్నా తమ దుక్కిటెద్దు చాలా గొప్పదని వారు చాలా సహజంగా అనుకోవడం వలన, రాముడు వచ్చేదాకా వేచి చూడడంలో ఏమాత్రం అసహనం కనబరచలేదు ఆ పల్లెవాసులు.

ఈలోగా జనాలను నవ్వించేందుకు 'బుడ్డరి భాన్' వేషం స్టేజీ మీదకు వచ్చింది. నాటకం ఆగిపోగానే, అలాగే నిద్రలోకి ఒరిగిన వాళ్ళందరూ మద్దెల మీద సరసమైన దరువు వినగానే, 'బుడ్డరి భాన్ అచ్చిండూ!' అని లేచి కూర్చున్నారు.

నాలుగు చరణాలు ఒక పేరడీ పాటను పాడిన బుడ్డరి భాన్ పాట ఆపేసి ప్రేక్షకులను పలకరిస్తున్నాడు.

"ఏంటికి గుసున్నరుబై మీరంతా! మా రావణ మామగాడు ఎట్ల జస్తడో సూద్దమని కూసున్నరా! వారెవ్వా!... మా రావణ మామగాడు ఎంత దుష్టుడైతే ఏంది! నాకు పిల్లనిస్తనన్నడు! సగం రాజ్యమిస్తనన్నడు గది సాలు మనకు! ఆడు ఎసుంటోడైతే నాకేందీ నాకైతే మంచోడే! ఏమన్న ఇస్తనన్న డంటే మీకూ మంచోడే అవుతాడు!..."

'అరేయ్ బుడ్డరిభాన్! గవన్నీ మల్ల! మీ రాముడెటు వొయిండు!' ఎవరో అరిచారు జనంలో నుండి.

"అయ్యో! పెద్దన్నా! నీకింకా చెప్పనే లేదా! రావణుడిని జంపె తందుకు ముహూర్తం మంచిగ లేదటనే! మంచి ముహూర్తం చూపియ్య తందుకు పంతులయ్య దగ్గరికి వొయిండు! ముహూర్తం ఎల్లంగనే అచ్చేస్తడు. అవుగానీ! నువ్వు లావులాకి జేస్తున్నవు! నీకెటువొయేదున్నదే! ఇంకా తెల్లారనే లేదు. అప్పుడే 'ఆస్త' మొదలయినాది. గందుకే ఆనలు సరిగ పడతలేవు! ఉలవలు సరిగ పండుతలేవు!" అందుకున్నాడు.

రాముడి వేషం కట్టిన నారాయణయ్య ఆ ఊరి జనాలకు నిజంగా అపర నారాయణుడే! తరతరాలుగా వారి తాతముత్తాతల కాలం నుండి సంక్రమించిన వైద్యజ్ఞానం అతని నరనరాన ఇమిడి ఉంది. మనుషులకు సుస్తీ జేసినా, పశువులకు జబ్బు వచ్చినా ముందుగా కబురు వెళ్ళేది నారాయణయ్యకే! 'ఆయనచేత మందు పడిందంటే, చావు కూడా వెనుకకు తిరిగి వెళ్ళిపోతుంది!' అనే నమ్మకాన్ని అనుభవపూర్వకంగా ఏర్పరచుకున్నారు ఆ ఊరి జనాలు.

నారాయణయ్య వద్దకు అర్ధరాత్రీ అపరాత్రీ లేకుండా బాధితులు వస్తూనే ఉంటారు. తన విద్యను పవిత్రమైనదిగా భావించిన నారా యణయ్య కూడా వచ్చినది మనిషైనా, పశువైనా విసుక్కోకుండా వైద్యం చేసి పంపిస్తాడు.

పశువుల వైద్యంలో నారాయణయ్యను మించిన వైద్యుడిని, ఆ చుట్టుపక్కల గ్రామాలలో మూడుతరాల నుండి ఎవరినీ చూడలేదంటారు వయోవృద్ధులు. మూగజీవాల బాధను కనిపెట్టి సరైన మందు వేస్తాడు. వాటికి వచ్చే రోగాల గురించి అతనికి చాలా తెలుసు. పశువు ఏ మొక్కను తింటే ఏ రోగమొస్తుందో, ఏ గడ్డి మేస్తే అజీర్ణమవుతుందో, ముల్లుగడ్డి

మేసిన పశువు ఎలా ప్రవర్తిస్తుందో... ఇలా అన్ని రోగలక్షణాలు తెలుసు.

అంతేకాదు! పశువులకు హాని చేసే మొక్కలు ఆ ఊరి శివారుల్లో ఏఏ దిక్కుల్లో పెరుగుతాయో తెలుసు. ఆ మొక్కలు ఏఏ నెలల్లో ఏపుగా పెరిగి హానికారకంగా మారతాయో తెలుసు. అందుకనే పశువులను, మేకలను ఫలానా నెలలో ఫలానా వైపుకి మేతకి తీసుకుపోవద్దు అని ముందుగానే ఆ ఊరి కామందులకు సలహాలు ఇచ్చేస్తాడు. నారా యణయ్య సలహాలను తప్పకుండా పాటిస్తారు. అయినా ఒక్కోసారి పశువులే కట్టు తెంచుకు పోయి, మంచిగడ్డి ఆశలో పడి చెడు మొక్కలనూ మేసి వస్తాయి.

కట్ల ఆశన్న దుక్కిటెద్దు కూడా ఏదో తినరాని మొక్కను తినేసి నట్లున్నది. అందుకే అర్ధరాత్రి ఎడాపెడా తన్నుకుంటున్నది.

నారాయణయ్య తన వైద్యానికి అవసరమయ్యే చాలా రకాల మొక్క లనూ, చెట్లనూ తన ఇంటి ఆవరణలోనే పెంచుకున్నాడు. మొత్తం అర ఎకరం విస్తీర్ణం కలిగిన పెరడులో రకరకాల అరుదైన మొక్కలూ ఎక్కడా కనిపించని తీగలూ, విచిత్రమైన ఆకారంలో పొడవైన కాయలు కాసే చెట్లూ ఎన్నో ఉన్నాయి. నారాయణయ్య ఎక్కడెక్కడి నుండో వాటిని సేకరించి తెచ్చాడు. ఆ పెరడులోని ఆయుర్వేద వనంలో వింతగా కనిపించి చూసేవారిని విస్మయానికి గురిచేసేవి 'వజ్రనుకలు.' (ఇవే బదనికలు!) ఇవి కేవలం వృక్షాల కొమ్మల మీద పెరిగే తీగల్లాంటి చిన్నపాదలు. రంగు రంగుల పూలగుత్తులూ, విచిత్రమైన ఆకారాలలోకి వంపులు తిరిగిన కొమ్మలూ, వజ్రనుక పాదల ప్రత్యేకత! ఆ వజ్రనుక పెరిగే వృక్షాన్ని బట్టి దాని ఔషధగుణం ఆధారపడి ఉంటుంది. వేపచెట్టు మీద పెరిగిన వజ్రనుక ఒక రోగానికి పనికి వస్తే, విప్పచెట్టు మీద పెరిగిన అదే వజ్రనుక మరొక రోగానికి పనికి వస్తుంది.

ఈ వజ్రనుకల వైద్య రహస్యం కేవలం నారాయణయ్యకు మాత్రమే తెలుసు!

ఉదయం లేవగానే పెరట్లోని చెట్లను పరిశీలించి, పాదులు తీసి చేదబావిలోంచి స్వయంగా నీళ్ళు తోడి పోయడం నారాయణయ్య దినచర్య.

నారాయణయ్య తను చేసిన వైద్యానికి ఎవ్వరినీ చేయి సాచి ఏమీ అడగడు. ప్రతిఫలం తీసుకుంటే తన వైద్యం పనిచేయదని చెప్తుంటాడు. అందుకని నారాయణయ్య కుటుంబ అవసరాలను ఊరి జనాలే కనిపెట్టి స్వయంగా తీరుస్తారు. ఆ ఊళ్ళో పండిన ప్రతి దినుసూ, కాసిన ప్రతి కాయా, పండూ, ఆయన ఇంటికి కావలసినదానికన్నా ఎక్కువే చేరవేస్తారు. నారాయణయ్య కుటుంబాన్ని పోషించు కోవడం, తమ కుటుంబాన్ని పోషించుకోవడమంత బాధ్యత గా భావిస్తారు ఆ ఊరి జనాలు!

అందుకనే నారాయణయ్య రాముడి వేషం కడితే, ఆయనలో సాక్షాత్తూ, ఆ రామచంద్రుడినే చూస్తున్నంతగా పరవశులవుతారు ప్రజలు.

చివరకు నారాయణయ్య దుక్కిటెద్దుకు వైద్యం చేసి తిరిగి రావడం, రావణ సంహారం గావించడమూ అయింది!

జామచెట్టు మీద గూడు కట్టుకున్న పిచ్చుకల జంట. తాము పెంచిన పిల్లలకి రెక్కలొచ్చినాయని గమనించి, గూడులోంచి పిల్లల్ని బయటికి తరిమేయాలని ప్రయత్నిస్తున్నాయి. కానీ తల్లిదండ్రులు అప్పనంగా తెచ్చి నోట్లో పెట్టే ఆహారానికి అలవాటు పడిన ఆ పిల్లలు ససేమిరా గూడు వదిలి రానంటున్నాయి.

బ్రాహ్మీ ముహూర్తంలోనే శ్రీరామ పట్టాభిషేకం, మంగళహారతి ఘనంగా జరిగి నాటకం ముగిసింది.

✤

యుగయుగాలుగా కొనసాగుతోన్న జగన్నాటకం ఇంకా ముగియ లేదు. ఈ నాటకంలో మరో కొత్త అంకానికి తెర లేచిపోయింది.

నారాయణయ్య ఉంటున్న ఊరు చాలా పెద్దగా పెరిగిపోయింది! ఊరుతోబాటు జనాలు పెరిగారు. వారితోబాటు నారాయణయ్య ముగ్గురు కొడుకులూ పెరిగి పెద్దవాళ్ళయిపోయారు. ఎవరి సంసారాలు వాళ్ళ కున్నాయి. ఎవరి సంపాదనా వాళ్ళకుంది. అయినా ఇన్నాళ్ళూ ఒకే ఇంట్లో ఉమ్మడిగా కలిసి ఉన్నారు. కానీ ఇక అలా ఉండలేని స్థితికి వచ్చేశారు.

సామాజిక పరిణామక్రమంలో, కుటుంబం - కుటుంబాలుగా విడిపోవడం అనివార్యమైన సహజ పరిణామం!

నారాయణయ్య పెరట్లో జామచెట్టు మీద గూడు కట్టుకున్న పిచ్చుకల జంట. తాము పెంచిన పిల్లలకి రెక్కలొచ్చినాయని గమనించి, గూడులోంచి పిల్లల్ని బయటికి తరిమేయాలని ప్రయత్నిస్తున్నాయి. కానీ తల్లిదండ్రులు అప్పనంగా తెచ్చి నోట్లో పెట్టే ఆహారానికి అలవాటు పడిన ఆ పిల్లలు ససేమిరా గూడు వదిలి రానంటున్నాయి. కాస్సేపు గారాం చేశాయి. మరి కాసేపు మారాం చేశాయి. చివరికి తల్లిదండ్రులు వాటిని తోక పట్టుకు ఈడ్చి అవతల పారవేసి, 'పొండి! ఈ లోకంలో ఎక్కడైనా బతకపోండి!' అని చెప్పేశాయి.

నారాయణయ్య అలా చెప్పలేకపోయాడు! రెక్కలొచ్చిన నారా యణయ్య పిల్లలు ఒక గూట్లో ఇమడలేక బయటకు పోలేక చివరకు గూడునే ముక్కలు చేసి పంచుకుందామనే ఆలోచన చేశారు.

ఇంటి ఆవరణ విశాలంగా ఉంది! ఇప్పుడు ఉంటున్న ఇల్లు తల్లిదండ్రులకు వదిలేసి, మిగతా స్థలాన్ని ముగ్గురూ చెరి సమానంగా పంచుకొని, ఎవరి గూడు వారు కట్టుకోవాలన్న నిర్ణయానికి వచ్చేశారు.

అదే మాట తండ్రితో చెప్పారు.

నారాయణయ్య మొదట నమ్మలేనట్లుగా చూశాడు. కొడుకులు స్పష్టంగా చెప్పేసరికి నమ్మక తప్పలేదు.

"కానీ, గిదెట్లా కుదురుతుందిరా! ఇదేమన్నా సాపు జాగానా! తాళ్ళేసి పంచుకునతందుకు. ఈ మందుల చెట్లన్నీ ఏమయిపోతయి. ఈ తీగలూ, గడ్డలూ అన్నీ ఏమయిపోతయి! అంతగా ఇదుంటే ఊర్ల యాడన్న జాగాలు కొనుక్కొని కట్టుకోండ్రి!" కొంచెం కటువుగానే అన్నాడు.

"బయట జాగాలుకొనతందుకు మన దగ్గర గన్ని పైసలు యాడున్నయి! ముందుగ జాగా గొనాల! మళ్ళ ఇళ్ళు గట్టాల! అయ్యే పనేనా అయ్యా."

"అదిగాదురా! ఈ చెట్టూ శామా పోతే దొరుకు తాయా మళ్ళా! ఇసుంటి వజ్రనుకలు ఈ చుట్టుపక్కల యాభైకోసుల దూరంలో గూడా యాడా లేవు!"

"ఇప్పుడు ఈ వజనుకలు, ఈ కాయ గసరు వైద్యం ఓళ్ళ కోసమే అయ్యా! పోనీ నువ్వన్నట్లే ఈ జాగ ఇట్లనే ఉంచినమనుకో! నువ్వు ఉన్నంతదాక ఈ మందులు వోస్తవు. మళ్ళీ నీ తర్వాత అవి ఓళ్ళు పోస్తరు. ఓళ్ళకస్తది ఆ విద్య!" పెద్దోడు అన్నాడు.

"ఓళ్ళో ఎందుకు మీ ముగ్గుట్లకెల్లి ఓళ్ళన్నా ఒక్కళ్ళు నేర్సుకోండ్రి! ఇన్నొద్దుల సంది స్తూనే ఉన్నరు. గాయింత విద్య చేతవట్టలేరా!"

"ఈ విద్య చేతవడ్తే కడుపు నింపుతదావే అయ్యా! నీ జమాన వేరు! ఆ మంది వేరు! ఆ బుద్దులు వేరు! ఇప్పుడు ఇసుంటి వైదికపు విద్యలు ఓళ్ళడుగుతున్నరు. మనింటికే మునుపటి మెరంగ మంది అస్తున్నరా! ముందు పొద్దు వొడక ముందు నుంచి ధారవ్తుండ్రి! ఇప్పుడు ఓళ్ళస్తున్నరని! ఓళ్ళ కోసం ఇంకా నువ్వు ఈ వనం ఉంచుత నంటవు?" మధ్య కొడుకు అన్నాడు.

'బావి పూడ్చేస్తారట,' అన్న మాట నారాయణయ్య చెవిన పడగానే తనను ఎవరో కాదు! కన్నకొడుకులే బతికుండగానే పూడ్చేస్తున్నంత భయం! అసహ్యం కలిగింది.

"నీ కొడుకులను గాదని మందికోసం గింత పెద్ద జాగాను ఉంచుత నంటే గిదెట్ల న్యాయమే అయ్యా! మరి ఇప్పుడు మనుషుల కోసం దవాఖానాలే ఉన్నయి. గోజల కోసం గోజల దవాఖానాలున్నయి. సర్కారు మందులు ఇయ్యతందుకు మనుషులున్నరు. ఇంకా ఎవరి కోసం ఇదంత?" చిన్నోడన్నాడు.

"ఓళ్ళ కోసమంటే ఏం జెప్పాలిరా! ఎన్ని దవాఖానాలు వచ్చినా, ఎన్ని మందులు వచ్చినా ఆ సర్కారు మనుషులంతా టైముల ప్రకారం డ్యూటీ చేస్తరు గదరా! రోగాలూ, నొప్పులూ ఆళ్ళ డ్యూటీ టైము జూసుకొని రావు గదరా? అందుకు అంటున్న! నా దగ్గరకు అచ్చినోళ్ళను వాపసు ఎట్ల పంపియ్యాల అనే బాధనే ఉన్నదిగని, మీ మీద ప్రేమ లేకకాదు!" నారాయణయ్య బాధగా అన్నాడు.

"కాలం మారిపోయిందే అయ్యా! దాంతోటి మనుషులు గూడా మారిపోయిండ్రు! ఆళ్ళతోని మనం గూడా మారిపోవాల! మారనంటే కుదరనే కుదరది!" పెద్దోడు అనునయంగా అన్నాడు.

"కాటికి కాళ్ళు జాపుకొని ఉన్నాము. గిప్పుడేం మారతాము. మీరు ఉంటరు గదా! మీరు మారిపొండ్రి! కాని కనీసం నేను బొంది ఇడిసిపోయే దాకనన్నా ఆగుండ్రి! నా కండ్ల ముందర నా సెట్లు వోంగ నేను సూడ లేను!"

"పైసలు పారేస్తే నీ సెట్ల మందులకన్నా మంచి మందులు దొరుకు తున్నయి గదనే అయ్యా! పైసలు లేనోళ్ళేగదా నీ దగ్గరకు అస్తున్నరు."

"మరి ఆ గరీబ్‌గాళ్ళకు ఓళ్ళన్నా సహాయం జెయ్యనే వడ్తది గదా!" చిన్నోడు సహనం కోల్పోయాడు. ఎంత జెప్పినా తండ్రి అదే మాట మాట్లాడుతున్నాడు.

"ఇగో అయ్యా! ఇంత జెప్పినం! ఇగ నీ ఇష్టం. నువ్వు గరీబ్‌గాళ్ళకు మందులు పోసుకుంటా ఉంటవో, నీ కొడుకులను గరీబ్‌గాళ్ళను జేస్తవో నీ ఇష్టం! విచారం జేసుకో! కాదూ పోదూ అంటే రేపటి సంది చిప్పలు వట్టి అడుక్కు తింటం. గదే గతి అవుతది మాకు!" అని చిన్నోడు నిష్కారంగా అన్నాడు.

రెండు రోజుల్లో విషయం ఊళ్లోని వాళ్ళందరకూ తెలిసింది. ఇద్దరు ముగ్గురు ఔత్సాహిక ధర్మనిపుణులు నారాయణయ్య ఇంటిదాకా పనిగట్టుకు వచ్చి మరీ ఉచిత తీర్పు చదివేశారు. వారి సారాంశమేమిటంటే-

"ఇగో! నారాయణయ్యా! పిలగాండ్లు అనే మాట గూడా సబబుగానే ఉన్నది. నీ జమాండ్ల నువ్వు ఏం జేసినా నడిచింది. అడగక ముందు మీ ఇంటికి పాలుగాసం నడిచి వచ్చేది. ఇప్పుడా కాలం ఉన్నదా! పనికిరాని చెట్లూ చేమల కోసం, కొడుకులను అన్యాయం జేస్తనంటే ఎట్లా? ఆళ్ళెటు వోవాల? ధర్మం తెలిసినోడివి! కొడుకులకు జాగా పంచియ్యనంటే అన్యాయం కాదా! మేమందరం లోకరీతిగ పంచియ్యలేదా! అంత ఓపికుంటే యాడన్నా ఇంకొక ఎకరం భూమి గొనుక్కొని అక్కడ చెట్లు పెంచుకో! అడివే పెంచుకో! కానీ గీ నడి ఊరెల్లె చెట్లు పెంచుతానంటే ఎట్లా! పంచి ఇయ్యడమే న్యాయం!"

అలా తీర్పు ఇచ్చేసిన వాళ్ళల్లో నారాయణయ్యతో అర్ధరాత్రిపూట అత్యవసర వైద్యం పొందినవాళ్ళు కూడా ఉండటం విశేషం.

ఆ రాత్రంతా కంటి మీద కునుకు లేకుండా గడిపిన నారాయణయ్య 'కాలగతిని తప్పించనెవ్వారి తరమూ...' అనే నిర్ణయానికి వచ్చేశాడు.

ఉదయాన్నే తన నిర్ణయం కోసం అడిగిన కొడుకులకు మౌనం వహించి తన అర్ధాంగీకారాన్ని తెలియజేశాడు. దానినే పూర్తి అంగీకారంగా అర్థం చేసుకున్న ఆ కొడుకులు కార్యాచరణలోకి దిగిపోయారు.

ఫలితంగా రెండు మూడు రోజులలో ఒకరిద్దరు పుర ప్రముఖుల సమక్షంలో ముగ్గురు ఆ స్థలాన్ని సమాన వాటాలుగా పంచేసుకున్నారు.

మర్నాడే మంచి ముహూర్తం ఉన్నదని ఎవరి వాటాలో వాళ్ళు స్థలాన్ని చదును చేయడం ప్రారంభించారు.

పెద్దోడి వాటాకు వచ్చిన స్థలంలో మంచినీళ్ళ బావి ఉంది. బావి చుట్టూతా విశాలమైన చట్టా. బట్టలుతికేందుకు వేరే స్థలం, స్నానం చేసేందుకు ఆ పక్కనే కట్టిన దడి! అన్నీ కలిపితే బావి చుట్టూతా బాగానే స్థలం ఉంటుంది. ఆ స్థలం ఉపయోగపడాలంటే బావి పూడ్చి వేయాలి! పెద్దోడి ఇంటికి బావి వాస్తు ప్రకారం గూడా దోషకారకమవుతుందని ఎవరో చెప్పారు!

చిన్నప్పటి నుండి అదే బావి నీళ్ళు తాగి పెరిగిన పెద్దోడు చివరకు ఆ బావిని పూడ్చేందుకు సిద్ధమయ్యాడు.

'బావి పూడ్చేస్తారట,' అన్న మాట నారాయణయ్య చెవిన పడగానే తనను ఎవరో కాదు! కన్నకొడుకులే బతికుండగానే పూడ్చేస్తున్నంత భయం! అసహ్యం కలిగింది. మొన్న పంపకాల రోజున పెద్దోడు అన్న మాటలు గుర్తుకు వచ్చాయి!

"మా కాలంల మేము బతకాలంటే నీ మెరంగ ఉంటే కుదరది! యాల్లవడితే ఎంతకన్నా తెగియ్యవడ్తది! మెత్తగ ఉంటే మొత్తిపోతుంది ఈ జమానా!"

యాల్లవడితే ఎంతకన్నా తెగిస్తారు! తల్లి రొమ్మునే తన్నినట్లు, తను తాగిన బావినే పూడుస్తారు! ఇదేనా ఈ కాలం వీళ్ళకు నేర్పుతున్నది?

లోకం తన మీద తనే మట్టి వోసుకొని పూడ్చుకునే కాలం అచ్చేసినట్లే అని అనిపించింది నారాయణయ్యకు!

మరో రోజు తడకల చాటుకు స్నానం బండ మీద స్నానం చేస్తున్నాడు నారాయణయ్య. గొడ్డలితో చెట్టు మాను మీద బలంగా కొట్టిన చప్పుడు వినిపించింది. వెంటనే తడి బట్టలతోనే బయటకు వచ్చి చూశాడు.

చిన్నోడు 'నెమలినార'ను నరుకుతున్నాడు.

నారాయణయ్య రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఆవేశం పొంగుకొచ్చింది. "ఒరేయ్ చిన్నోడా! ఆగు! ఆగరా! నెమలినారను ఎందుకు కొట్టేస్తున్నావురా! అదేమన్నదని నిన్ను!" అంటూ తడిబట్టలతోనే చిన్నోడి దగ్గరకు వచ్చి గొడ్డలి లాగేశాడు.

చిన్నోడి వాటాకు వచ్చిన స్థలంలో నెమలినార అనే అరుదైన చెట్టు ఉంది. దానిపక్కనే కానుగ చెట్టు ఉంది. కానుగ చెట్టు నీడలో పెరిగిన నెమలినార చెట్టులో ఔషధగుణం రెట్టింపు అవుతుందట! అందుకని రెండింటిని కలిపి ఒకే పాదులో పెంచాడు నారాయణయ్య!

నెమలినార చెట్టు అడవిలో కూడా చాలా తక్కువగా కనిపిస్తుంది. పశువులకు వచ్చే అనేక రోగాలకు నెమలినార ఆకుల కషాయం, రసం దివ్యమైన ఔషధంలా పనిచేస్తుంది. అనేక నొప్పులకూ, రోగాలకూ కూడా సత్వర ఉపశమనాన్ని కలుగజేయడం దాని ప్రత్యేకత! నారాయణయ్య దీనిని అప్పుడప్పుడు మనుషుల వైద్యంలో కూడా వాడతారు.

నెమలినార చివరి లేత కొమ్మలు నెమలి పింఛపు ఆకారంలో అర్ధ చంద్రాకారంగా వంగి ఉంటాయి. ఆ కొమ్మలపై ఆకుల అమరిక నెమలి పింఛానికి నెమలికన్నులు అమర్చినట్లుగా ఉంటాయి. ఆ చెట్టుకి నెమలి నార అని పేరు పెట్టినవారు గొప్ప కళాత్మక హృదయం, అంతకంటే గొప్ప సౌందర్యదృష్టి కలిగినవాళ్ళయి ఉంటారు.

"ఒరేయ్ చిన్నోడా! కనీసం ఈ నెమలినార చెట్టునైనా ఉంచరా! ఇది చాలా మంచి చెట్టురా! ఎసుంటి రోగాన్నైనా ఘడియల మీద తక్కువ జేస్తుందిరా! దీన్ని శానా దూరంకెల్లి దెచ్చి పెంచినారా! దీన్ని ఇడుస వెట్టురా!' ' బాధగా బతిమిలాడాడు.

"అయ్యా! నెమలినార నెమలినార అంటున్నవు. అగో పెద్దన్న జూడు! తన జాగంతా ఎట్ల సాపు జేసుకున్నడో! బావి గూడ్పేసిండు. కరివేప చెట్టూ, దానిమ్మ చెట్టూ ఇవన్నీ గొట్టేసిండు! నువ్వేమో నన్ను చెట్టు కొట్టద్దంటున్నవ్!"

"అదిగాదురా! దానిమ్మ, కరివేపా యాడంట ఆడ దొరుకుతయిరా! కానీ ఈ నెమలినార యాడ దొరుకది. ఇదొక్కటుంటే సాలు! సగం బలం నాకు! ఉంచురా!"

"ఇగో అయ్యా! ఇది ఉంచుతే రేపు పిలగాండ్లు ఈడ దిరుగుతరు. ఏదన్నా కొమ్మ ఇరిగి పడ్తే ఎట్ల! అదీగాక ఇది నా ఇంటి ముందరనే అస్తున్నది. నడీ దర్వాజలకు గింత ఎద్ద సెట్టు కనిపిస్తే మంచిగుంటదా! ఇగ నువ్వు అది గొట్టకు, ఇది గొట్టకు అని అడ్డమస్తే ఎట్లా? మస్తు దొరుకుతయి ఇసుంటి చెట్లు!" అని కిందపడిన గొడ్డలి తీసుకొని చెట్టు మీద మరి నాలుగు దెబ్బలు వేశాడు.

నారాయణయ్య చెప్తున్నా మాటలు వినన‌ట్లే నటిస్తూ నెమలినారను నేలకూల్చాడు చిన్నోడు.

అన్నేళ్ళుగా ఎన్నో మూగజీవాలకు ప్రాణం పోసిన నెమలినార! నారాయణయ్యకు ఎంతో ఇష్టమైన నెమలినార ఫెళఫెళమంటూ నేల కూలింది. ఇక కానుగచెట్టుదే తరువాయి వంతు!

విలవిలలాడిపోయాడు నారాయణయ్య! సాంప్రదాయంగా, ఈ చెట్టంతా నిటారుగా నిలబడిన తన విద్య, వైద్యం కూడా నిట్టనిలువునా కూలిపోయిన భావన ఒళ్ళంతా ఆవహించగా, ఇంట్లోకి వెళ్ళి తలుపేసు కొన్నాడు నారాయణయ్య.

నాలుగురోజుల్లో అర ఎకరంలో విస్తరించి ఉన్న నారాయణయ్య ఇంటి రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. ఎడారిదిబ్బలాగా మారిపోయిన తన ఇంటి పరిసరాలను చూసిన నారాయణయ్య గుండెల్లో కలుక్కు మంటోంది.

ఈ విషయాన్ని ఆ ఊరు ప్రజలు పెద్దగా పట్టించుకోలేదు. గతం మీద ఏమాత్రం అవగాహనా, భవిష్యత్తు మీద ఏమాత్రం ప్రణాళికా లేని ఆ ఊరి యువతరం గ్రామీణ క్రికెట్ పోటీలు నిర్వహించడంలో బిజీగా ఉంది.

కానీ కొందరు వయోవృద్ధులు మాత్రం చాలా బాధపడినారు. రాబోయే తరం ఎంతటి సంపదను కోల్పోయిందో వారికి తెలుసు! తమ ఊరికే గాకుండా, ఈ లోకానికే పతనం దాపురించిందని జోస్యం చెప్పేశారు.

నిజానికి, ఇప్పటికీ ఎంతటి మారుమూల కుగ్రామంలోనైనా నారాయణయ్యలాంటివారు ఒక్కరైనా ఉన్నారు. వారు తమ పారంపరిక జ్ఞానంతో, మృత్యుముఖంలో ఉన్న ఏ మనిషినైనా, పశువునైనా, ఏ ప్రాణినైనా బ్రతికించగల సమర్థులు. తమకు తెలిసిన చిన్న చిట్కాతో, చిటికెలో ఉపశమనాన్ని కలిగించగల సాంప్రదాయిక వైద్య విజ్ఞానం వారి సొంతం. వేల సంవత్సరాల నుండి కేవలం ముఖవాచ్యంగా కొనసాగుతూ వస్తోన్న



ఈ అద్భుత సాంప్రదాయిక పరంపరను, వారు ఎంతో నిష్ఠగా ఆచరించి, ఇప్పటిదాకా సజీవంగా ఉంచగలిగారు. ఏ గుర్తింపులకూ, కొలమానాలకు అందని ఘనత వారిది!

ఆ ఘనత మెల్లమెల్లగా మాయమైపోతోంది. ఈ సంధికాలం మరెందరు నారాయణయ్యలను మాయం చేస్తుందో?

✤

అర్ధరాత్రి దాటిపోయింది. చాలారోజులుగా కలతనిద్ర పోతున్న నారాయణయ్యకు తలుపు కొడుతున్న శబ్దం వినిపించి లేచి కూర్చున్నాడు.

"ఓళ్ళా! ఓళ్ళురా మీరు!"

"అయ్యా! లేసినావే! నేనే చిన్నోడ్ని!"

చిన్నోడి గొంతు విన్న నారాయణయ్య లేచి తలుపు తీశాడు.

"ఏమయిందిరా చిన్నోడా! ఇంత రాత్రిపూట అచ్చినవు ఏమ యిందిరా!"

"అయ్యా! పయ్యసుక్కెద్దు బాగా ఆగమాగం జేస్తున్నదే! ఏమ యిందో ఏమో!"

"గట్లనా! పోదాం పని! సూద్దాం!"

తండ్రీకొడుకులు కొట్టాలకు వచ్చి టార్చిలైట్‌లో సుక్కెద్దును చూశారు. గూటం మీద అటూ ఇటూ తిరుగుతున్నది.

నారాయణయ్యను చూడగానే బాధతో ఒక రకమైన అరుపు అరిచింది. ఆ అరుపు వినగానే నారాయణయ్యకు సగం బాధ తెలిసి పోయింది. వెనుకకు చూశాడు. బాగా పలుచటి పుర్రు వేస్తున్నది! నోటి నుండి సొల్లు గారుతున్నది. కళ్ళ నుండి నీళ్ళు గారుతున్నాయి.

"ఎన్ని రోజులాయెరా! మేత, నీళ్ళూ నడుస్తున్నయా?"

"నిన్నటిదాకా మంచిగనే ఉండెనే! ఇయ్యాళ మేపతందుకు గా ఆగవతల పడీతులకు కొట్టిచ్చిన! ఏం మేసిందో ఏమో!"

"వత్తుగడ్డి మేసే ఆస్తలవడి, పాము కూసం మేసినట్లున్నది! సూద్దాం ఇవతలకు ఇడుసకురా!"

పయ్యసుక్కెద్దును తెచ్చి వాకిట్లో కట్టేశాడు. అది నిలబడలేక కింద కూలబడింది. నిలువెత్తు దుక్కిటెద్దు అర్ధరాత్రి పూట అలా కూలేసరికి చిన్నోడూ లోపల లోపల కూలిపోయాడు. ఎద్దు ఏల మీద అటూ ఇటూ దొర్లుతున్నది. చిన్నోడి మనసూ అతలాకుతలం అయిపోతున్నది!

నారాయణయ్య ఇంట్లోకి వెళ్ళి ఏదో పాడి తీసుకువచ్చాడు. నీళ్ళల్లో కలిపి, వెదురుగొట్టంతో తాగించారు. బీరకాయపీచుతో ఎద్దు మూపు మీద తడుతూ ఉండమని చిన్నోడిని పురమాయించాడు.

అప్పుడే తెల్లవార వస్తున్నది.

"ఈ రోగంకు నెమలినార ఆకు బాగా గుణమిస్తుండె! నాలుగు పూటలు కషాయం దాపితే ఎద్దు ఎప్పటోల లేసి నిలబడుతుండె! ఇప్పుడెట్ల అదొక్క సెట్టు ఉంచుమంటే ఉంచకపోతివిరా చిన్నోడా!" బాధతో అన్నాడు నారాయణయ్య.

చిన్నోడు చెట్ల దగ్గర దగ్గరగా వచ్చాడు. నెమలినార!... నెమలినారనే! అవును. అదే... అదేనా... అవునా!... కాదా!... కాదు!... నెమలినార కానే కాదు! చిన్నోడి ఒంట్లో రక్తమంతా ఆవిరైనట్లనిపించింది.

ఈ అలికిడికి లేచి వచ్చిన పెద్దోడు కూడా పరిస్థితి చూశాడు. "ఇప్పుడనుకుంటే ఏం ఫాయిదా? అయింది అయిపోయింది. గని ఇప్పుడు ఎద్దు పాణంకే ఢోకా ఉన్నది గదా!" అన్నాడు పెద్దోడు.

"ఎట్లన్న జెయ్యే అయ్యా! మా నలుగురి ప్రాణాలు ఆ ఎడ్ల మీదనే పెట్టుకొని బతుకుతున్నం. అవి దున్నాల! మేం పండియ్యాల! దానికేమన్నా అయితే నా పెండ్లాం పోరగాండ్ల గతేమవుతది?'' చిన్నోడి కండ్లళ్ళ నీళ్ళు దిరిగినయి.

సాలు పాడవునా తిండి గింజల కోసం భూమి తల్లినీ, దుక్కిటెడ్లనూ నమ్ముకున్న వాడికి అవి రెండూ తన ప్రాణంతో సమానం.

చిన్నోడి బాధ జూసి పెద్దోడు అనునయించాడు.

"ఏంటికి నారాజవుతవురా! ఇప్పుడేమయిందని! రాజులగూడెం గుట్ట దడక పక్కకు జింకల ఒర్రె దగ్గర నెమలినార చెట్టు ఉండె! పాయి తీసుకస్తే అయిపాయ ఏమంటవే అయ్యా!"

"అది శెనొద్దుల కిందటి మాట! ఇప్పుడున్నదో పోయిందో! అయినా పోయిరాండ్రి! అంతకంటే వేరే తరీకల భరోసా లేదు!"

"నేనే పోయి అస్తనే అయ్యా! నేను నెమలినార దెచ్చేదాకా ఎట్లన్నా దీన్ని జూస్త ఉండు!" అన్నాడు చిన్నోడు.

"పోగానీ! గొంచెం సద్దన్నం గట్టుకొని పో! శానా దూరమున్నది. అప్పటిదాకా దీనికి గోరెచ్చటి బెల్లంనీళ్ళు దాపుండ్రి,'' అన్నాడు నారాయణయ్య.

✤

అఘమేఘాల మీద రాజులగూడెం చేరుకున్న చిన్నోడు, అక్కడి గూడెం వాసులను నెమలినార గురించి అడిగాడు. వారు తెలియదన్నారు. చిన్నోడు వెంటనే గుట్ట పక్క నుండి జింకలొర్రె లోయలోకి దిగిపోయాడు. ఒర్రెగట్టుకు పచ్చనిచెట్లు చాలా కనిపిస్తున్నాయి. కానీ నెమలినార చెట్టు కనిపించడంలేదు.

చిన్నోడికి నెమలినార చెట్టు బాగా తెలుసు. చిన్నప్పట్నుండీ దాని నీడలోనే కదా చిన్నోడు ఆడుకున్నది. పెరిగి 'మనిషి'గా మారిందీ ఆ చెట్టు నీడలోనే! చిన్నప్పట్నుండీ నీడనిచ్చిన చెట్టును నిర్దాక్షిణ్యంగా నరికి వేశాడు! ఈ 'మనిషే!'

ఒర్రెకు దూరంగా రెండు పచ్చనిచెట్లు జంటగా కనిపిస్తున్నాయి. అవి నెమలినార కావచ్చేమో! చిన్నోడు వేగంగా వాటివైపు పరిగెత్తాడు. అవి నెమలినార చెట్లే అయితే వెంటనే ఆకు దూసుకొని సంచీనిండా నింపుకొని ఇంటిదారి పట్టాలి. పయ్య సుక్కెద్దు ఎట్లున్నదో ఏమో!

చిన్నోడు చెట్ల దగ్గర దగ్గరగా వచ్చాడు. నెమలినార!... నెమలినారనే! అవును. అదే... అదేనా... అవునా!... కాదా!... కాదు!... నెమలినార కానే కాదు! చిన్నోడి ఒంట్లో రక్తమంతా ఆవిరైనట్లనిపించింది.

అవి రెండూ తెల్ల మద్దిచెట్లు. దూరం నుండి చూస్తే నెమలినార మెరంగనే అనిపిస్తయి.

గొడ్డలితో కోపంగా తెల్లమది చెట్లు మీద ఒక్క వేటు వేసి ముందుకు కదిలాడు చిన్నోడు.

అదిగో! మరొక పచ్చని చెట్టు! ఇది కావచ్చా! ఏమో! ఇక్కడైతే నెమలినార ఉన్నదని చెప్పాడు పెద్దోడు.

పచ్చగా కనిపించిన చెట్టునల్లా చూస్తూ, చూస్తూ... నడుస్తూ, నడుస్తూ చాలా దూరమే వెళ్ళిపోయాడు చిన్నోడు.

ఏ పచ్చని చెట్టును చూసినా నెమలినార చెట్టే అని భ్రమ పడుతున్నాడు. ఒక చెట్టు కింద కూలబడిపోయాడు చిన్నోడు. తెచ్చిన చద్దన్నం మూట అట్టగట్టుకుపోయింది. బోరుబుంగలోని నీళ్ళు మాత్రం తాగుతున్నాడు.

పయ్య సుక్కెద్దు కండ్లల్ల గనిపిస్తున్నది! దానికేమన్నా అయితే తన బతుకెట్లా! మొన్ననే మరికొంత భూమి కౌలుకు తీసుకొని అప్పు చేసి డబ్బులు చెల్లించాడు. ఈసారి బాగా పండిస్తానన్న ఆశతో ఉన్నాడు చిన్నోడు. కానీ చేయి విరిగినంత పనయింది! ఇప్పుడు మరో ఎద్దు కొనాలంటే మాటలా!

నెమలినార కొట్టేసిన తన చేతుల్ని నరికేసుకోవాలన్నంత కోపం వచ్చింది చిన్నోడికి!

నిరాశగా ఇంటిదారి పట్టాడు! మసక చీకటి పడబోతుండగా అలసి సొలసి ఇంటికి చేరాడు చిన్నోడు.

చిన్నోడి శరీరపు వాసననూ, అడుగుల కదలికలను దూరం నుండే గుర్తు పట్టిన పయ్య సుక్కోద్దు ఉలిక్కిపడి, లేచి కష్టం మీద నిలబడింది.

'నెమలినార దొరికిందా?' అని సుక్కెద్దు తన చూపుల్తోనే అడిగినట్లనిపించింది. దాని కళ్ళల్లో నుండి నీళ్ళు ఇంకా కారుతూనే ఉన్నాయి. చిన్నోడి గుండెల్లో కెలికినట్లనిపించింది.

"అచ్చేసినావురా చిన్నోడా! దొరికిందావురా నెమలినార!" ఆత్రుతగా అడిగాడు నారాయణయ్య.

"అయ్యా! దొరకలేదే! అడివంతా దిరిగిన! యాడ దొరకలేదు!"

"అయ్యో! దొరకలేదా! సూద్దాం మరి. ఇగ దాని కిస్మతు ఎట్లయితే గట్లయితది!"

ఆ మాట విన్న చిన్నోడు అక్కడే ఉన్న బండిగారెకు ఆనుకొని కూలబడిపోయాడు. పయ్య సుక్కెద్దు కూడా ఆశ వదులుకొని నిరాశగా చిన్నోడి వైపు చూస్తున్నట్లుంది!

చిన్నోడికి తను కూర్చున్న చోటి నుండి నెమలినార కొట్టేసిన స్థలం బోసిగా కనిపిస్తోంది. 'ఏ పోశమ్మ తల్లో తన తప్పు మన్నించి, తనపై దయ జూసి నెమలినారను మళ్ళీ ఎప్పటిలా పుట్టిస్తే ఎంత మంచిగుంటుండె!' చిన్నోడు చివరిగా తనకు తెలిసిన దేవతలందర్నీ ప్రార్థిస్తున్నాడు.

కానీ అంతటి మహిమ జరిగే కాలమా ఇది! తన పాపిష్టి చేతులతోనే కొట్టేశాడు. కొమ్మలు కొమ్మలుగా చెలిగి పొయ్యిలో పెట్టేశాడు. అక్కడే ఇంకా మిగిలిన నాలుగు మోపుల కట్టెలు పడి ఉన్నాయి. మసక చీకట్లో నెమలినార ఎండిన కట్టెలమోపు విషపు సర్పాలను కట్టగట్టి పెట్టినట్లుగా కనిపిస్తోంది చిన్నోడికి. ఆ మోపులను రేపు అవతల పారెయ్యాలి!

ఆ కట్టెల మోపుల చాటుకు ఏదో ఆకుపచ్చగా కనిపించింది చిన్నోడికి. మసక చీకట్లో అదేమిటో తెలియడం లేదు. కళ్ళు నులుముకుని చూస్తే నెమలినార ఆకుల్లా కనిపించాయి. పొద్దుట్నుంచీ నెమలినారను కళ్ళల్లో పెట్టుకొని వెదికినందుకేమో ఏది చూసినా నెమలినారలా కనిపిస్తున్నది అని తన భ్రమను తానే తిట్టుకున్నాడు.

కానీ పరీక్షగా చూస్తే అది భ్రమ కాదని అనిపించింది. పరుగున వెళ్ళి దగ్గర నుండి చూశాడు చిన్నోడు! అది... నెమలినార! లేతకాడ! దాని చివరన ఆకుపచ్చని ఆకుల గుత్తి!

కట్టెల మోపులను అటూ ఇటూ జరిపేసి చూశాడు చిన్నోడు. తను నరికివేసిన మాను పక్కల నుండి పొడుచుకు వచ్చిన మరి రెండు లేత కాడలు. వాటి చివరన నవనవలాడుతోన్న లేత చిగురుటాకులు!

సమాధి అయిపోయిందనుకున్న సాంప్రదాయ వైద్యవిద్య నేలను చీల్చుకొని పైకి వచ్చిన వేళ అది!

"అయ్యా! అయ్యోయ్! జెల్దిరా! జెల్దిరా! నెమలినార! నెమలినార!" చిన్నోడి అరుపులకు నారాయణయ్యతో సహా అందరూ పరిగెత్తుకొచ్చారు.

"అయ్యా! నెమలినార ఉన్నదే! అయ్యా బతికే ఉన్నదే! ఇగో సూడు ఎట్ల ఇగురేసిందో!" చిన్నోడి సంతోషం పట్టరాకుండా ఉంది.

నారాయణయ్య సంభ్రమంగా వచ్చి చూశాడు.

"చాలురా చిన్నోడా! ఇగ నీ సుక్కెద్దు బతికిందనుకో! నెమలినార చావలేదు. బతికే ఉంది!" ఆర్తితో అన్నాడు నారాయణయ్య.

నిజమే! నెమలినార చావలేదు. ఎవరో ఒకరు నరికేసినా, ఎప్పుడో ఒకప్పుడు భూమిని చీల్చుకొని పైకి పొడుచుకొని వస్తూనే ఉంది. వస్తూనే ఉంటుంది. ఎవరో ఒక నారాయణయ్య తన చేదబావిలోంచి నీళ్ళు పోసి దానిని పెంచి పెద్ద చేస్తూనే ఉంటాడు! *



సిగ్నిఫికెంట్ అదర్

స్లిప్

ఆ రోజే రాఘవ ఆఫీసులో క్రిస్మస్ పార్టీ. వారం నుంచీ ఎటూ తేల్చుకోలేకపోతున్న నీలిమకు ఏదో ఒక నిర్ణయం తీసుకోక ఇక తప్పేలా కనిపించట్లేదు. పార్టీకి వెళ్ళాలా వద్దా అనే డెసిషన్ పాయింటును దూరంగా నెట్టుకుంటూ వస్తున్నదల్లా ఇక సాయంత్రం దగ్గరికొచ్చేసరికి వచ్చిన నిస్సత్తువతో సోఫాలో నుండి లేచింది.

నీలిమకు రాత్రంతా నిద్రపట్టలేదు. ముందు రాత్రి చాలాసేపు టీవీ చూసి బాగా తెల్లవారాక అక్కడే సోఫాలో ఒక కునుకు తీసింది చివరికి. లేచాక కూడా ఎటూ తోచక కాఫీ మటుకు కానిచ్చింది. రాఘవ ప్రొద్దున్నే ఆఫీసుకు వెళ్ళినట్లున్నాడు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. మళ్ళీ టీవీయే పెట్టింది కానీ అసలు ప్రోగ్రాం మీద పెద్దగా మనసు నిలవడం లేదు. అది ఆఫ్ చేసి, విసుగ్గా రిమోట్ పక్కకు పెట్టి కార్డ్‌లెస్ ఫోనందుకుని నెంబరు కలపబోయేదల్లా ఒకసారి వాల్‌క్లాక్ చెక్‌చేసి మళ్ళీ ఆ ఫోను కూడా ఆఫ్ చేసింది. వింటరొస్తే రోజులు భారంగా గడిచినట్టుంటుంది, బయటకు వెళ్ళే అవకాశాలు తక్కువై. ఇల్లంతా చల్లగా అయితే టెంపరేచరు కంట్రోలు వద్దకెళ్ళి కొంచెం హెచ్చించి మళ్ళీ టీవీ ముందున్న సోఫావరకు, కొద్దిగా వేడెక్కగానే మళ్ళీ తక్కువ చెయ్యడం అట్లా ఆసు పోసినట్టు తిరగడం తప్ప తోచదు. సెలవలొచ్చాయని హాయిగా ఏ ఫ్లోరిడాకో వెళదామంటే అదీ కుదరలేదీ సారి. రాఘవొక్కడే చిక్కిపోయాడీ సారికి. అతని ఆఫీసులో మిగతా వాళ్ళంతా క్రిస్మస్ సెలవులు ముందే తీసుకున్నారు కనుక.



టీవీ ఆఫ్ చేస్తే ఇంట్లో ఆ చప్పుడు కూడా లేక మరీ ఈ నిశ్శబ్దం పిచ్చి లేపేలా ఉంది అనుకుని మళ్ళీ ఆన్ చేసింది మరికాసేపటికి.

నీలిమకూ, రాఘవకూ పెళ్ళయి ఆరేళ్ళు. ఇంకా పిల్లలు లేరు. ఇద్దరిళ్ళ నుంచీ, అంటే తల్లిదండ్రుల నుండి ఆ మటుకు పోరుకు తక్కువేం లేదు. అయినా కనేదీ పెంచేదీ వాళ్ళు కాదుకదా అని ఇండియాలో ఉన్న పెద్ద వాళ్ళను కసిరారు కూడా వాళ్ళు మళ్ళీ మాట్లాడకుండా. అసలు అమెరికాకొచ్చిన మొదటి మూడేళ్ళూ నీలిమకు చదవడానికే సరిపోయింది. ఆ తరువాత కొత్తగా వెదుక్కున్న ఉద్యోగమని చెప్పి మరో మూడు క్యాలెండర్లు మారిపోయాయి. ఇద్దరికీ ఒకే ఊళ్ళో ఉద్యోగమయినా చికాగో లాంటి సిటీలో ఇద్దరూ చెరోపక్కకూ వర్కుకు వెళ్ళి ఇల్లు చేరేసరికి రాత్రి ఏడవుతుందొక్కోసారి. ఎప్పుడైనా ఇద్దరిలో ఒకరికి ఏవైనా డెడ్‌లైను అని వచ్చిపడితే ఇక ఇల్లు చేరడానికి మధ్యరాత్రిళ్ళు అవుతుంది కూడా. ఇక పిల్లలంటూ వస్తే మళ్ళీ ఇండియాలో ఉన్న పెద్దవాళ్ళనే బ్రతిమాలు కోవాలి వచ్చి చూడడానికి.

క్రిస్మస్‌కు ముందు వారమంతా నీలిమ ఆఫ్ తీసేసుకుంది, ఆఫీసులో సెలవులు తీసుకోకపోతే మళ్ళీ వచ్చే ఏడుకు ఎట్లాగు ట్రాన్స్ఫర్ అవవు కనుక. రాఘవ ఆఫీసు కొద్దిగా నయం. అతనికి ఆఫీసూ, ఇల్లూ తప్ప మరేం పట్టవు పెద్దగా. క్లబ్బులంటూ వెళ్ళడు. వీకెండు పేకాట పార్టీలూ అంతగా పట్టవు. తనేంటో తన కంప్యూటరేంటో, అంతే. ఎన్నడైనా పార్టీలూ ఫ్రెండ్స్ అంటూ ఇంటికి పిలిచినా ఇద్దరూ పెద్దగా చొచ్చుకుపోయే వాళ్ళు కాకపోవడం చేత ఓ పది ఫామిలీలతోటే ఏ తంతైనా.

ఇటు ఇంట్లో చలీ, అటు బయట మంచూ, భర్త వర్కూ, ఇండియాలో పెద్దలూ ఇవేవీ ఆవిడ అసహనానికి కారణం కావు. చెప్పుకుంటే బాధ తగ్గుతుందంటారు అయినా ఇదెవరికైనా చెప్పుకునే విషయం కనుకనా. తల పేలిపోతోందనిపించి లేచి ఒక టైలినాల్ వేసుకొని ఒక కప్పు కాఫీ కలుపుకుని మళ్ళీ టీవీ ముందు కూర్చుంది. ఏ విషయం చెప్పుకోవాలన్నా దగ్గరి స్నేహితులు లేకపోడం వల్ల వచ్చిన తిప్పలేమో ఇవి అనుకునేది. కానీ ఇట్లాంటి విషయాలు అసలు ఎంత దగ్గరి స్నేహితులైతే మాత్రం చెప్పుకుంటారా అని తనకు తనే మళ్ళీ చెప్పుకుంది.

ఇటు ఇంట్లో చలీ, అటు బయట మంచూ, భర్త వర్కూ, ఇండియాలో పెద్దలూ ఇవేవీ ఆవిడ అసహనానికి కారణం కావు. చెప్పుకుంటే బాధ తగ్గుతుందంటారు అయినా ఇదెవరికైనా చెప్పుకునే విషయం కనుకనా.

అసలు సమస్యంతా జెన్నీతో వచ్చింది. అది గనుక తన జీవితం లోకి రాకపోయినట్లయితే ఎంత బావుండేది. తమ ఇద్దరి నిశ్శబ్దపు జీవితం లోకి ఎవరో వచ్చి ఏదో రాక్‌ఛానల్ హై వాల్యూంలో పెట్టినట్టు వచ్చిపడింది ఈ జెన్నీ, అసహాయంగా తిట్టుకుంది లోలోపలే.

రాఘవ ఆఫీసులో సరిగ్గా సంవత్సరం క్రితం జెన్నీ జాయినైంది. బాగా గుర్తే నీలిమకు క్రితం ఏడు క్రిస్మస్ పార్టీకి తామిద్దరూ వెళ్ళినప్పుడు రాఘవ ఈ కొత్త అమ్మాయి మొన్నే జాయినైంది అని చెప్పడం. అన్ని ఆఫీసుల్లోలాగే రాఘవ కంపెనీలో కూడా దాదాపు ఏభై శాతం ఆడవాళ్ళు మామూలే. పెద్దగా పట్టించుకోలేదు కానీ అందరిలోకీ కొద్దిగా చలాకీగానే కనిపించిందానాడు. తనకంటే రెండంగుళాలు పొడుగ్గా ఉండి పార్టీ డ్రెస్‌లో వచ్చిందేమో చాలామంది కళ్ళు ఆ అమ్మాయి మీదే ఉన్నాయని ఆ తరువాత గానీ తట్టలేదు. కార్లో ఇంటికొస్తూ రాఘవ అన్న మాటలు కూడా తర్వాత్తర్వాత చాలాసార్లే గుర్తొచ్చాయి. జెన్నీ జూలియా రాబర్ట్స్‌లాగా ఉంటుంది కదా అని పోల్చినప్పుడు నీలిమే వెక్కిరించింది జూలియా ఏం బాగుంటుందీ, మొగ రాయుడిలాగా అని.

ఆ తరువాత నెలకు ఏదో ఒక క్యాండిల్‌సెట్టు తీసుకొచ్చి ఇంట్లో పెడితే అడిగింది ఎవరిచ్చారని. జెన్నీ ఇచ్చిందని చెబితే, ఎందుకూ అనడిగింది.

"నాకేం తెలుసు, ఆమధ్య ఆవిడకు ఒక కంప్యూటర్ ప్రోగ్రాం మీద హెల్ప్ చేసానులే," అని ఊరుకున్నాడు రాఘవ. ఆర్నెల్ల క్రితం మళ్ళీ రాఘవ బర్త్‌డేకి ఏదో ఒక పెన్ను సెట్టిచ్చిందని చెప్పి ఆవిడతోటి ఆరోజు లంచ్‌కెళ్ళానని చెప్పినప్పటి నుండి ఇక నీలిమ పట్టించుకోవడం మొదలైంది.

"ఎందుకెళ్ళావూ?" అనడిగితే, "లంచ్ టైమ్‌లో మామూలుగా వెళ్ళే కెఫెటేరియాకు ఎవరు వెంట వస్తానన్నా వద్దంటామా, అయినా నువ్వు వెళ్ళలేదూ మొన్న బ్రయన్‌తో మీ ఆఫీసులో," అన్నాడు రాఘవ.

"అవును, కానీ బ్రయన్ నీకూ తెలుసు. ఆయనకు అయిదుగురు పిల్లలు, ఒకడు కాలేజీలో కూడా ఉన్నాడు. అయినా నీ సంగతి మాట్లాడుతుంటే నా గురించి అడుగుతావేం," ఇక గొడవ పెట్టుకోకపోతే చేతులు కాలే ప్రమాదముందని అనిపించి వచ్చే దుఃఖాన్ని నొక్కిపెట్టి సరిగ్గానే అడిగింది. ఇక మళ్ళీ జెన్నీ విషయాలు ఇంట్లో వినరాకూడదని వార్నింగ్ లాంటిదొకటి ఇచ్చేసింది కూడా.

అసలు మగాళ్ళంతా పిగ్స్, అని ఇరానియను ఫ్రెండొకావిడ చెప్పిన విషయం గుర్తొచ్చింది నీలిమకు. అప్పట్లో, 'మనం అలా లో ఎక్స్‌పెక్టేషన్ విలువలతో వాళ్ళను వదిలేస్తే అట్లానే తయారవుతారు,' అని వాదించింది. అదీకాక అంతా అలా ఉండరు అని కూడా చెప్పి చూసింది. ఇదంతా కుక్కతోక లాంటి మగబుద్ధితో వచ్చిన తిప్పలనిపిస్తూ ఉంది చివరికి. అందుకే మళ్ళీ అనుకుంది, 'నిజమే, మగాళ్ళంతా పిగ్స్,' అని కసిగా.

ఇవన్నీ అనుకోవడమే కాదు గట్టిగా రాఘవతో గొడవే పెట్టుకుంది కూడా. తనెంత అరిచినా, రాఘవ మాత్రం తల విదిలించి తనతోపాటే పనిచేసే ఫ్రెండొకడు మైక్ వెధవతో కలిసి క్లబ్బుకో సినిమాకో అత్తగారింట్లో అలిగి వెళ్ళినట్టు వెళ్ళడం తప్ప, అసలు మళ్ళీ ఈ పని చేయను, బుద్ధొచ్చింది అంటాడనుకుంటే అది అత్యాశే అవుతుందని తెలిసినా ఆశిస్తుంది. అక్కడే ఉందేమో తమ ఆడవాళ్ళ బలహీనత! రాఘవ రాత్రెప్పుడో వచ్చి, 'తప్పు చేయనప్పుడు నువ్వు మళ్ళీ తగవు పెట్టుకున్నావంటే ఊరుకోను,' అంటూ ఉంటే అంతకు మునుపు తను చెప్పిందంతా ఏమయిందో ఎక్కడికి వెళ్ళిందో అర్థమవలేదు నీలిమకు.

ఇక ఆ గొడవ తరువాత, వీకెండూ అయిపోయాక మళ్ళీ ఇక రాఘవ ఆ జెన్నీ విషయం ఎత్తడనే అనుకుంది.

నీలిమకు తన ఊహ తప్పని రెండువారాల్లోనే తేలింది. ఆఫీసులో ఏదో ఒక డెడ్‌లైన్ ఉందని రాత్రి పదిదాకా రాకపోతే ఆఫీసుకు ఫోను చేసింది. రాఘవ ఆఫీసులో ఫోనెత్తిన జెన్నీ గొంతు విని తల తిరిగిపోయింది. అప్పటికేం అనలేక రాఘవ వచ్చాక చెప్పింది, తనొక్కతే ఆ ఎండాకాలం ఇండియాకు వెళ్ళివస్తానని.

రాఘవ ఏం మాట్లాడకపోయేసరికి ఇంకా పిచ్చిలేచినట్టయి, "ఏం నువ్వొస్తానని అనవేం," అడిగింది.

"నేనేమంటే ఎటొస్తుందో నీతో ఈమధ్య అని ఊరుకున్నా," అన్నాడతను.

"అంటే తప్పంతా నాదేనంటావ్," ఇక ఆపుకోలేక అరిచింది నీలిమ.

"లేదులేదు, నాదే. అయినా నీలాంటి అనుమానం పెళ్ళాన్ని చేసుకున్నందుకు నన్ను నేను తిట్టుకోవాలి గానీ నిన్నంటే ఏమొస్తుందీ," తనేం తక్కువ కాదన్నట్టు చెప్పాడు రాఘవ.

ఇంకా ఎట్లా బుకాయిస్తున్నాడో అర్థంకాక, ఇహ లాభం లేదని ఒక నెలరోజులు సత్యాగ్రహం లాంటిది చేసింది కూడా.

ఒక నెల గడిచాక, రాఘవే మాటలు కలుపుతూ చెప్పాడు, "జెన్నీ విషయంలో నీపై అట్లా అరవడం తప్పే, అయినా ఆ జెన్నీ మీద ఎట్లాంటి ఇంట్రస్టూ లేదు. ఏదో ఆఫీసులో కాస్త చలాకీగా మాట్లాడుతూ కొత్తవి నేర్చుకోవాలని ఇంట్రస్టుతో వస్తే మాట్లాడమే," అని అతనే చెప్పాడు. "అదీకాక నువ్వు కూడా మంచివి ఒకటి రెండు డ్రెస్‌లు కొనుక్కుంటావని ఎప్పుడైనా జెన్నీ వేసుకునే డ్రెస్‌ల గురించి చెబుతానే తప్ప అంతకంటే ఆవిడ మీద ఏమీ ప్రత్యేక ఇష్టం లాంటివి లేవు," అని.

"అదెవతో డ్రెస్‌లు వేసుకొస్తుందని అట్లాంటివే నన్ను కొనుక్కో మనడమేంటి అయినా అసలు మగాళ్ళ బుద్ధి ఎట్లాంటిదో నాకు బాగా తెలుసు," అని విసిరికొట్టింది. నీలిమ కోపం మరింత ఎక్కువ ఎందుకైందో తెలియక రాఘవ తెల్లమొహం వేసుకుని మైక్‌కు కాల్ చేశాడు ఇక.

ఒక వారం పట్టింది ఇద్దరూ మళ్ళీ మామూలు అవడానికి. అప్పుడే ఒక నెల క్రితమే, నవంబరు నెల్లో, జెన్నీ థాంక్స్ గివింగ్‌కు ఇచ్చిందంటూ చాక్లెట్లూ, రాఘవకిష్టమైన కాఫీగింజలూ తెచ్చాడు ఆఫీసు నుండి. మిగతా ఎవరికీ ఇవ్వకుండా నీకొక్కడికే ఎందుకిచ్చిందంటే, ఆ అమ్మాయికే కాల్ చేసి అడగమన్నాడు విసిగినట్లు మొహం పెట్టి రాఘవ.

"నా ముందు ఆ అమ్మాయిని ఇదివరకు గొప్పగా చేసి మాట్లాడ్డమే కాక, ఆవిడకే డ్రెస్‌సెన్సు ఉందన్నట్టు మంచి డ్రెస్సులు వేసుకొస్తుందని చెప్పడం, ఆవిడతో మీ డిపార్టుమెంటు కాకపోయినా ఆఫీసులో గడపడం ఇవన్నీ చేసి ఏదో పెద్ద ఆపద్బాంధవుడు నువ్వే అన్నట్టు అందరి కన్నా ఆవిడకు ఎక్కువ హెల్ప్ అడిగినా, అడక్కపోయినా చేస్తూ, ఇట్లా ఇచ్చే చిన్నాచితక గిఫ్టులు తెచ్చుకుంటూ ఉంటే ఈ ప్రపంచంలో ఏ భార్య అయినా కళ్ళూ, చెవులూ అన్నిటికంటే ముఖ్యంగా నోరూ మూసుకు కూచోదు," అంటూ, "ఈసారితో తేలిపోవాల్సిందే, లేకపోతే జెన్నీకే కాల్ చేసి అడిగేస్తాను నాక్కానీ తిక్క రేగిందంటే," అని చెప్పింది నీలిమ.

ఇక నిన్నెవరూ బాగు చేయలేరన్నట్టు ఒకసారి నిరసనగా చూసి వెళ్ళిపోయాడు రాఘవ.

ఇది జరిగిన మూడు వారాలకే వాళ్ళ ఆఫీసులో క్రిస్మస్‌పార్టీకి వెళ్ళాలి అని డేట్ గుర్తు చేశాడు. "ఈసారి పార్టీకి రాను, అయినా మీ ఆఫీసు పార్టీకి ఇట్లా ఫ్యామిలీలను ఎందుకు పిలుస్తారు, అందరి ఆఫీసుల్లోనూ పిలవరు కదా, ఇట్లా పెళ్ళాలను కూడా పిలిచి వాళ్ళ ముందే వాళ్ళవాళ్ళ మొగుళ్ళు వేసే వెకిలి వేషాలు చూడమనా," మళ్ళీ గొడవకు తయారైపోతూ అడిగింది నీలిమ.

"అట్లా అనేంకాదు, మొగుళ్ళు పెళ్ళాలను తీసుకొచ్చినట్టే పెళ్ళాలు కూడా వాళ్ళ మొగుళ్ళను వెంట తీసుకొస్తారు కదా నువ్వు చూడలేదా అయినా అట్లా ఏం చెప్పరు, సిగ్నిఫికెంట్ అదర్ అంటే ఎవరినైనా తీసుకెళ్ళవచ్చు," మామూలుగా నచ్చజెప్పే ధోరణిలో చెప్పాడు రాఘవ.

"అవును మరి నీకిప్పుడు తోడు అక్కడే ఆఫీసులో ఉంది కదా, దాన్నే సిగ్నిఫికెంట్ అదర్ అని చెప్పి తీసుకెళ్ళు," కసిగా అంది నీలిమ.

"సర్లే, నీతో పెట్టుకుంటే అయ్యే పని కాదు. నీ ఇష్టం వస్తేరా. ప్రతిసారీ వస్తూనే ఉన్నావు కదా. ఈసారేమయింది, అంటారు తప్పితే నాకేం పెద్ద ఇబ్బంది లేదు," చెప్పాడు రాఘవ.

ఈ రూట్లో వస్తే మాత్రం తనెలా ఉంటుంది వెళ్ళక. రాత్రంతా నిద్రపట్టక, తల పేలిపోయేలా ఆలోచిస్తున్న విషయం.

రాఘవ బ్రతిమిలాడుతాడనే నమ్మకమెలాగూ లేదు. లేచి తయారయి వెళ్ళి ఈ పార్టీలోనే ఆ జెన్నీ ఎట్లా తన ముందే వచ్చి రాఘవతో మాట్లాడుతుందో చూస్తే పోతుంది కదా అనుకుంది. అవసరమైతే అక్కడే ఇద్దరినీ రెండు కడిగేయవచ్చు. పోతే రాఘవ ఉద్యోగం పోతుంది. ఇద్దర్లో ఎవరో ఒకరికి ఉంటే చాలు కొన్నాళ్ళు. అయినా రాఘవకు వేరే ఉద్యోగం దొరకడం కష్టం కాదు. తమ జీవితం కంటే పెద్ద విషయ మేం కాదు ఈ జీతం. ఇంకా ఏవేవో ఆలోచిస్తూ త్వర త్వరగా మొఖం కడిగేసుకుని తయారైంది.

"అట్లా అనేంకాదు, మొగుళ్ళు పెళ్ళాలను తీసుకొచ్చినట్టే పెళ్ళాలు కూడా వాళ్ళ మొగుళ్ళను వెంట తీసుకొస్తారు కదా నువ్వు చూడలేదా అయినా అట్లా ఏం చెప్పరు, సిగ్నిఫికెంట్ అదర్ అంటే ఎవరినైనా తీసుకెళ్ళవచ్చు,"

రాఘవ ఇంటికొచ్చి, పార్టీకి రెడీగా ఉన్న నీలిమను చూసి ఆశ్చర్యపోయాడు. "రానన్నావుగా," అడిగాడు.

"నువ్వే అన్నావుగా, ప్రతి ఏడూ వస్తున్నానని, ఈ సారి రాకపోతే వాళ్ళే అడుగుతారని," ఓడిపోవడం తనవంతు కాదన్నట్టు చెప్పింది నీలిమ.

అతను కూడా ఒక గంటలో రెడీ అయిపోయి పార్టీ జరుగుతున్న హోటల్ బాల్‌రూమ్‌కు వెళ్ళారు. రాఘవ రెడీ అవుతుంటే, "బాగా తయారై అక్కడెవరినీ ఉద్ధరించనక్కర్లేదు, త్వరగా బయల్దేరదాం," అంటూ ఇక యుద్ధానికి వెళ్ళడానికి ప్రిపేర్ అయి, నిండా మునిగాక చలేమిటన్నట్టు మాట్లాడింది నీలిమ.

"నాకు తెలుసు నువ్వొస్తావని. మైక్ అడిగాడు కూడా నిన్ను తప్పకుండా తీసుకురమ్మని," చెబుతూ కారు స్టార్ట్ చేశాడు రాఘవ.

ఇద్దరూ వెళ్ళేసరికి పార్టీ మొదలైపోయింది. డ్రింక్స్ కొందరు చేతుల్లో పట్టుకుని ఏవో ఆర్డర్స్ లాగిస్తున్నారు ఒకళ్ళనొకళ్ళు పలకరించు కొంటూ. నీలిమ రాఘవతో పాటుగా వెళ్ళి వాళ్ళ ప్రెసిడెంట్‌కు 'హాయ్ మెర్రీ క్రిస్మస్' అని చెప్పి, ఇక రాఘవ వాళ్ళ గ్రూపువైపు వెళ్ళారు.

అక్కడే జెన్నీ ఉంది, చూడగానే పోల్చుకుంది, చూసి సంవత్సర మైనా సరే, పోయినేడు జూలియా రాబర్ట్స్ కామెంటు గుర్తొచ్చి. అయినా ఈవిడదీ గ్రూపు కాదుగా అనుకుంది నీలిమ. రాఘవను చూడగానే ముందుకొచ్చి హాయ్ చెబుతూ నీలిమ పక్కగా నిలబడి, "హాయ్ నీలిమా ఐ హోంగ్ అవుట్ విత్ దిస్ గ్రూవ్. ఇట్ రియల్లీ ఈజ్ ది ఫన్ గ్రూవ్," అంటూ ఉంది జెన్నీ.

అవును నీకు ఫన్‌గానే ఉంటుందిలే అనుకుంటూ ఉంటే, జెన్నీ అంతవరకూ పక్కనే నిల్చున్న మరొక జీన్సు షర్టు వేసుకొన్న మరొక బ్లాండ్‌గరల్‌ను దగ్గరికి పిలిచి ఇదిగో ఇతడే రాఘవ నాకు వర్కులో బాగా హెల్ప్ చేస్తాడు, ఈవిడ అతని భార్య నీలిమ అంటూ పరిచయం చేసింది. ఆ అమ్మాయి పేరు క్యాథీ అట. వేరే ఎక్కడో పని చేస్తుందిట. జెన్నీతో పాటే పార్టీకి వచ్చిందని, తామిద్దరూ ఒకే కాలేజీలో చదివి ఒకేసారి ఈ కొత్త ఊళ్ళోకొచ్చి, ఒకే ఇంట్లో ఉంటున్నామని చెబుతోంది రాఘవకు.

జెన్నీ మరో రెండు డ్రింకులు తీసుకుని వస్తానంటూ అటువైపు వెళుతూ ఉంటే క్యాథీ ఆవిడతోపాటుగా వెళ్ళింది.

అదే అదనుకోసం ఎదురు చూస్తున్నట్టు అంతదాకా కొద్దిగా ఎడంగా ఉన్న మైక్ దగ్గరగా వచ్చి, "హే వాట్ డూ యూ నో, షి బ్రాట్ హర్ సిగ్నిఫికెంట్ అదర్. ముందే అనుకున్నా ఈవిడ గురించి, ఆఫీసులో ఏదో చిన్న రూమర్ మాత్రమే ఉండేది. ఇప్పుడు నిజమే అని తేలింది," చెబుతున్నాడతను. నమ్మలేక ఆశ్చర్యపోయినట్టు మొఖం పెట్టిన రాఘవను చూసి "నీకర్థం కాదులే, నేను సరిగ్గానే కనుక్కున్నాను. సరేనా?" అంటున్నాడు అప్పటికే మూడు డైవర్సులైన మైక్.

ఆ సంగతి తనకు ముందే తెలుసు అన్నట్టు, ఇందులో పెద్దగా ఇంట్రస్టు చూపకుండా పక్కకు తిరిగింది నీలిమ.

కార్లో ఇంటికి వస్తూ ఉంటే నీలిమే వెక్కిరించింది, "నువ్వు చెప్పినట్టు జెన్నీ జూలియా రాబర్ట్స్‌లాగా ఉండదు, ఎల్లెన్ డీజెనరస్‌లాగా ఉంటుంది,' ' అని.

రాఘవ మాత్రం, "మనకు ఈ ఏటికి పెళ్ళయి ఆరు సంవత్సరాలే కదూ, వచ్చే ఏడు మరి ఏడవది, అదెట్లా ఉంటుందో," అంటూ ఉంటే నవ్వుతూ నీలిమే చెప్పిందిక. "వచ్చే ఏడు మా ఆఫీసులో ఎవరో ఒకరు నాకూ దొరక్కపోరు, ప్రతిసారీ ఆడవాళ్ళే అనుమానాలతో బాధపడాలా, ఈసారి మీ వంతు."

"అది సరే, ఇక మనం పిల్లలకు ప్లాన్ చెయ్యాలి," సీరియస్‌గా అన్నాడు రాఘవ, ఒక్క అబద్ధం చెప్పి మైక్ చేసిన ఉపకారాన్నీ, వాడికి ఒక పార్టీకయ్యే ఖర్చునీ తల్చుకుంటూ.

*



దృశ్యాదృశ్యం

జి. వెంకటకృష్ణ

షేవింగ్ సెలూన్‌లో కూచున్న ఆనంద్‌కు మనసు మనసులో లేదు. షాప్ ఓనర్ రెండురోజుల కిందట వచ్చి, "ఇన్నిరోజులు బాడుగకు వున్నింది చాలు, యింగ చాలించుకోండ్రి, నెలరోజులు టైమిస్తా వేరేచోటు చూసుకోండ్రి,'' అన్నప్పుడు నోటిమాట రాలేదు. అప్పుడ్నుంచీ యిదే దిగులు.

"అదేంది రెడ్డీ అట్లా అంటారు. పదేండ్లుగా యిక్కడ్నే వున్నా, నా గిరాకీలన్నీ యీ చుట్టుపక్కలే వున్నాయి, యిప్పుడు దీన్ని వదిలితే కొత్తగా ఎక్కడని వెల్లాలా..'' అంటూ యిక్కడే వుంటానని అడుక్కున్నాడు.

"అందుకే చెబ్తున్నా చాలా ఏండ్లుగా వుంటున్నావు. వున్నింది చాలు. వేరేచోటు చూసుకో, దీన్లో నా అల్లుడు టీవీ షాప్ పెట్టాల్లంటాండాడు.'' ఎంత భంగపోయినా అదే సమాధానమిచ్చినాడు షాప్ ఓనర్ నారాయణ రెడ్డి.

అప్పట్నుంచీ దిగులు పట్టుకుంది ఆనంద్‌ను. ఎక్కడికి వెళ్ళాలని చూసినా అక్కడ తన కులంవాళ్ళు బంక్‌లో సెలూన్‌లు నడుపుతూ వున్నారు. తన గిరాకీలన్నీ యీ ఏరియాలోనే వున్నాయి. వీటిని వదులుకొని కొత్తగా ఎక్కడ షాప్ పెట్టాలాని చింత పట్టుకుంది. పదేండ్ల కిందట వూరు వొదిలి వచ్చినప్పటి వ్యథ యిప్పుడు యీ ఏరియాను వదలాల్సి నప్పుడూ కల్గుతోంది.

ఆలోచనల్లో వున్న ఆనంద్‌కు కార్లో వెళ్తున్న హనుమంతరెడ్డి కన్పించాడు. హనుమంతరెడ్డిని చూస్తే తన వూరిని చూసినట్టు ఆనంద్‌కు. యిద్దరూ ఒకేసారి వూరు వదిలి కర్నూలు చేరినవాళ్ళే.



హనుమంతరెడ్డి ఎదురుగా కట్టిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్‌లోకి వెళ్ళడం గమనించి అతన్ని కలుద్దామని వెళ్ళాడు ఆనంద్.

పదేండ్ల కిందట కూడా ఆనంద్ హనుమంతరెడ్డిని యిట్లాంటి విపత్కర పరిస్థితిలోనే కలిసి సాయం అడిగి నాడు. అది యిప్పటికీ గుర్తుంది ఆనంద్‌కు.

ఆరోజు వుదయం బంకు తెరిచిన కాస్సేపటికి చుట్టూ గలాటా మొదలైతే బయటికొచ్చాడు ఆనంద్. ఒంటి చేతి రాక్షసి హిటాచీ అనబడే యంత్రం రోడ్డు సైడున్న బంకులనన్నింటినీ తోసేస్తూ వస్తోంది, దాని వెంట మున్సిపల్ అధికారులు. ఆనంద్ అధికారుల కాళ్ళూ, కడుపులూ పట్టుకున్నాడు.

ఆరోజు వుదయం బంకు తెరిచిన కాస్సేపటికి చుట్టూ గలాటా మొదలైతే బయటికొచ్చాడు ఆనంద్. ఒంటి చేతి రాక్షసి హిటాచీ అనబడే యంత్రం రోడ్డు సైడున్న బంకులనన్నింటినీ తోసేస్తూ వస్తోంది, దాని వెంట మున్సిపల్ అధికారులు.

'నా బతుకు ఎట్లా అయ్యా' అంటూ అడుక్కున్నాడు. వాళ్ళేమో రోడ్డు వెడల్పు అనివార్యమనీ, యీ బంకులో ఎంతకాలముంటావు వేరే షాప్ బాడుగకు తీసుకొని షేవింగ్ సెలూన్ పెట్టుకోమన్నారు. అప్పుడు కలిశాడు హనుమంతరెడ్డిని, షాప్‌కు అడ్వాన్సు పదివేలు కట్టాల్సి వుండి, అప్పుగా అతనేమన్నా యిస్తాడేమోనని. ఒకే ఊరివాడనేది కూడా చూడ కుండా, 'లేదన్నాడు,' రెడ్డి.

ఇప్పుడు అదే హనుమంతరెడ్డి తనకేమైనా సహాయం చేస్తాడేమోనని ఆనంద్ వెళ్ళాడు.

ఆనంద్‌ను చూస్తూనే ముఖం చిట్లించి ఏమన్నట్లు తలెగరేశాడు హనుమంతరెడ్డి.

"రెడ్డీ మా ఓనర్ షాప్ వొదలమంటున్నాడు, అతనూ మీరూ స్నేహితులు గదా ఓ మాట చెప్పి సాయం,"జేయమన్నాడు ఆనంద్.

"ఆయన షాప్ ఆయనిష్టం. ఎవురికైనా ఇచ్చుకుంటాడు. యీడ్నే శాశ్వతంగా వుండాల్నంటే ఎట్లయితుంద,"న్నాడు రెడ్డి.

"పోనీ మీ షాపింగ్ కాంప్లెక్స్‌లో నాకొగ రూమ్ యిస్తావా," అంటూ అడిగాడు ఆనంద్.

ఆనంద్‌ను ఎగాదిగా చూసి, "లేదు, అన్నీ యిచ్చేసుకున్నాను," కఠినంగా బదులిచ్చాడు రెడ్డి.

అంత పుల్లవిరుపుగా మాట్లాడిన తరువాత అక్కడ నిల్చోబుద్ధి కాలేదు ఆనంద్‌కు. షాప్‌లో కొచ్చి కూలబడ్డాడు.

కస్టమర్ వస్తే బ్రష్ కడిగి, గిన్నెలో యిన్ని నీళ్ళు తీసుకొని, చైర్లో కూచున్నాయన గడ్డాన్నీ తడుపుతున్నాడేగానీ ఏవేవో ఆలోచనలు ముసురు కుంటున్నాయి, ఎప్పటివో బాల్య స్మృతులు మొదలుకొని సమీపగతానివి కలుపుకొని ఆనంద్‌లో చెప్పనలవి కాని ఆలోచనా దృశ్యాలు - పుట్టలో నుంచీ బయటికొస్తున్న వందలాది పాములు, కొన్ని బుసకొడుతూ, కొన్ని మెడనూ, కాళ్ళనూ చేతులనూ చుట్టుకుంటూ, కొన్ని మింగడానికి నోర్లు తెరుస్తూ, కొన్ని కాట్లు వేస్తూ...

శరీర కష్టం తప్ప మరే ఆస్తీపాస్తీ లేని ఆనంద్ కుటుంబాన్ని పదైదేండ్ల క్రితం వూరు మింగింది. పోనీ వూరు మాత్రం మిగిలిందా అంటే అదీ లేదు, వూరును ముంపు మింగింది. వూరును శ్రీశైలం డ్యాం ముంపు మింగితే మాత్రం హనుమంతరెడ్డిలాంటి వాళ్ళు బాగు పడ్లేదా, ముంపు ఒక అదృశ్య దృశ్యం. అది ఎవర్ని మింగిందో ఎవర్ని మిగిల్చిందో ఆనంద్‌కైతే అర్థం కాలేదు, అది అంత సులభంగా అర్థమయ్యేదీ కాదు.

"ఏమయ్యా బాబూ ఏదో పరధ్యానంలో వున్నట్లు న్నావే," షేవింగ్ చేయించుకుంటున్నతను అడుగు తూంటే,

"ఆఁ సార్, అదేంలేదు అదేంలేదు," అన్నాడు కానీ ఆనంద్ గొంతులో తొట్రుపాటు తెలిసిపోతూనే వుంది.

ఆనంద్ తన వృత్తిలో పరధ్యానంగా వుండడానికి వీల్లేదు. కత్తెర్లూ, షేవింగ్ బ్లేడ్లూ వాడే చేతులు పరధ్యానం లో తప్పులు చేస్తే కస్టమర్లు వస్తారా?... ఆనంద్ యిన్నేళ్ళ వృత్తిలో ఎన్నడూ అట్లా చేయలేదు కూడా.

షేవింగ్ కానిచ్చేసి బెంచి మీద కూర్చున్నాడు, ఎంత వద్దనుకున్నా హనుమంతరెడ్డి గుర్తొస్తాడు. ఎందుకు గుర్తురాడు, మునిగిపోయిన తన వూరితో వున్న అనుభూతులు ఎదురుగా తిరుగాడే హనుమంతరెడ్డిలో కన్పిస్తుంటే ఎట్లా గుర్తురాడు!

"నాయనా! కాలేజీ ఫీజు కట్టాలా..." ఆనంద్ కొడుకు రవి అప్పుడే షాప్‌లో కొస్తూ అడిగాడు.

"ఎప్పుడ్రా లాస్ట్ డేట్..."

"రేపే నాయనా వారం నుంచీ చెప్తానే వుండా..."

"సర్లేరా... ఆ బాక్స్‌లో వున్నాయి తీసుకో, ఈసారన్నా సక్రమంగా చదువు."

రవిది ఇంటర్ రెండు పేపర్లు పెండింగ్ వుండడంతో సెలూన్‌లో తండ్రికి తోడుగా వుంటూనే చదువుకుంటున్నాడు.

"ఈసారి కంప్లీట్ అయినా కాకున్నా నేను షాప్‌లోనే వుంటాను నాయనా, షాప్‌ను ఇంప్రూవ్ చేద్దాం, ఎన్ని దినాలని యీ పాత ఛైర్లూ, పాత సామాన్లూ. యిప్పుడు ఎక్కడ చూసినా హైటెక్ సెలూన్లు వొస్తూంటే మనం వెనుక పడిపోతాండాం..." రవి అన్నాడు.

యింతకు మునుపైతే, "క్షవరానికి ఏం హైటెక్‌రా, శుభ్రముండాలి గానీ," అనేవాడు ఆనంద్, అయితే ఆ మాట అనలేకపోయాడు.

"మనమెప్పుడో వెనకలబడిపోయినాం లేరా నాయనా. ఏం హైటెక్ కాలమో ఏమో కులవృత్తుల కడుపు మీద కొట్టే కాలమొచ్చింది," అని ఎవరో కస్టమర్ క్షౌరం కోసం వస్తే కొడుక్కు పని అప్పగించి టీ తాగుదామని రోడ్డు మీదికొచ్చాడు.

మళ్ళీ ఎదురుగా హనుమంతరెడ్డి కారులో వెళ్తూ...

పదేండ్ల కింద యిదే హనుమంతరెడ్డి యిదే రోడ్డుపై సైకిల్ మీద వెళ్ళేవాడు. వెనుక కూతురూ, ముందు రాడ్ మీద కొడుకూ స్కూల్ బాగుల్తో భారంగా తొక్కుతూ కదిలేవాడు.

ఇప్పుడు కారులో... పదైదేండ్లలో ఒకే ఊరికి చెందిన ఇద్దరిలో ఎంత అంతరం!

వేడి వేడి టీ గొంతులోకి ఎలా దిగుతోందో తెలియడం లేదు ఆనంద్‌కు. అతను పదైదేండ్లకు పైబడిన గతంలో తన వూరు అనగొండలో వున్నాడిప్పుడు.

✤

శ్రీశైలం డ్యాం కడుతున్నారు. నీళ్ళు నిలిచి ఏరు వూరును మింగు తుందని తెలిసిపోయి సంవత్సరమవుతూంది. అది ఖాయమని తెలిసిన తర్వాత పడే బాధను పక్కనపెట్టి బతుకుదెరువు కోసం ఎవరి ఏర్పాట్లలో వాళ్ళు. రైతులంతా కట్టగట్టుకొని ఎమ్మెల్యే చుట్టూ తిరుగుతూ భూములకు మంచిరేట్లు రాబట్టుకోవాలని ఆరాట పడుతూంటే, యిల్లూ భూములూ ఏమీ లేని నిరుపేదలు తమ బతుకుదెరువేమిటని ఆలోచిస్తున్న రోజులు.

"మీ రైతులకేమి రొడ్డీ మహరాజులు. యిండ్లూ, భూములూ వున్నందుకు గోర్నమెంటు అన్నింటికీ లెక్క కట్టిస్తుంది. మాలాంటి ఏమీ లేనోళ్ళ గతేంది," గంగిరెడ్డికి క్షౌరం చేస్తూ ఎల్లనాగన్న అన్నాడు.

"మీకేంలే, రెక్కల కష్టం మీద బతికేవాళ్ళు, యా వూరికి పోయినా ఏదో ఒక పని చేసుకొని బతకొచ్చు, మా రైతుల కష్టం చూడండి యీ భూములు మునిగిపోతే, వాళ్ళిచ్చే దుడ్లతోని వేరే వూర్లో యింత భూమి వొస్తుందా... అమ్మనీకి యా రైతు రెడీగుంటాడు చెప్పూ, అమ్మినా యింత అనువైన భూమి చిక్కుతుందా, మేము మీలెక్కన రెక్కల కష్టమూ చేయ లేమూ, భూమీ సంపాయించుకోలేము..." అంటూ యాష్ఠపోయే సమాధాన మిచ్చినాడు గంగిరెడ్డి.

"వున్నోళ్ళు ఏం మాట్లాడినా చెల్లుతుంది సామీ. అంతో యింతో వున్నోల్లది మీదే కష్టమూ, ఏమీలేని మాకు సుఖమా, ఏం చెప్తా వుండావు, యిన్నేండ్లుగా మా తాతల తరం నుంచీ యీడ్నే బతుకుతాండామే వేరే తావుకుపోయి ఎట్లా బతకాలా, మీ వూరితో వున్న ఋణాన్ని ఎట్లా తెంచు కోవాలా, యా గోర్నమెంటైతేనేమి తెంచుకుంటున్న బంధానికి ఎంత లెక్క కట్టిస్తారో కట్టీమనండి..." అన్నాడు ఎల్ల నాగన్న.

"నువ్వు ఏదారు చేసేదేంటికిరా ఆ యింటికి అంతో యింతో లెక్క కట్టిస్తారు నువ్వూ నీ కొడుకు ఆనందూ కర్నూలు చేరండి. ఆడబంకు ఏసుకుంటే జీవనం గడుస్తాది. మా రెండోవోడు హను మంతరెడ్డిని గూడా కర్నూలుకే అంపుతాండా, ముందు ముందు కాలాలు ఎట్లా వొస్తాయో ఏమో, టౌన్లో పిల్లొల్ల నన్నా చదివిచ్చుకోవచ్చు, నాలుగు ఎనుములు పెట్టుకుంటే, ఆ పాలుపోసిన దుడ్లతోనే జీవనం గడుస్తాది..." గంగిరెడ్డి తన మనసులోని మాట చెప్పినాడు.

ఆ తర్వాత రెండు నెలలకే ఆనంద్ కర్నూలు టౌను బయట నంద్యాల రోడ్ వెంబడి, అక్కడొకటి, అక్కడొకటి యిండ్లు వున్న ప్రాంతంలో అప్పటికది అడివిలాంటిదే - అక్కడే రోడ్డు పక్కన బంకులో తన వృత్తిని చేసుకుంటూ జీవనం సాగిస్తే.

హనుమంతరెడ్డి కూడా అదే ప్రాంతంలో, ఒక ఖాళీస్థలాన్ని లీజుకు తీసుకొని, కొట్టం వేసుకొని నాలుగు ఎనుములతో తనూ జత కలిసినాడు. అంతటితో ఆగకుండా తండ్రి యిచ్చిన (సలహాతో) పెట్టుబడితో, నంద్యాల రోడ్ వెంబడి వున్న ఖాళీ స్థలాలు కొనడం, అమ్మడంలో లావాదేవీలు నడపడం ప్రారంభించాడు.

గడిచిన పదేండ్లలో కర్నూలు టౌన్లో నంద్యాల రోడ్డెంబడి స్కూళ్ళూ, కాలేజీలూ ఏర్పడడంతోనూ, శ్రీశైలం ముంపులో డబ్బులు పొందిన రైతు జనాలు కర్నూలు చేరి యిండ్లు కట్టించుకోవడంతోనూ ఆ ప్రాంతమంతా జనసంచారం పెరిగి కర్నూలు టౌన్లో భాగమైపోయింది. ఇట్లా ఒక టౌన్ నగరంగా మారడం ఆనంద్ లాంటివాళ్ళకు జీవనోపాధి కల్పించింది అనుకునే కంటే, హనుమంతరెడ్డిలాంటి వాళ్ళ ఎదుగుదలకు అది సోపాన మైంది అంటేనే అది కరెక్టయిన మాట.

ఆనంద్ తను కాపురముంటున్న ముజఫర్‌నగర్ నుంచీ హంద్రీ నదిని దాటి సైకిల్ మీద నంద్యాల రోడ్లోని షాప్‌కొచ్చే కాలానికి, హనుమంత రెడ్డి స్కూటర్ నుంచీ హోండాకు మారి కాంట్రాక్టు పనులతో బిజీబిజీగా తిరిగేవాడు.

ఆనంద్ రోడ్డు సైడు బంకు నుంచీ షేవింగ్ సెలూన్‌లోకొచ్చే కాలానికి, హనుమంతరెడ్డి యిండ్లు కట్టిస్తూ, అమ్ముతూ సెకండ్ హాండ్ కార్లలో తిరిగేవాడు.

ఆనంద్ షేవింగ్ సెలూన్‌లో రేడియో స్థానంలో బ్లాక్ అండ్ వైట్ టీవీ, రివాల్వింగ్ ఛైర్లూ పెట్టుకునే కాలానికి, హనుమంతరెడ్డి పదిసెంట్ల స్థలంలో డూప్లెక్స్ కట్టించుకొని ఆర్భాటంగా గృహప్రవేశం చేశాడు.

ఆనంద్ తన కూతుర్ని సెలూన్‌లో కూలికి పనిచేసే మేనల్లుడికే ఇచ్చి పెళ్ళి చేస్తే, హనుమంతరెడ్డి కూతురికి అమెరికా అల్లుడ్నే తెచ్చుకో గలిగాడు.

కర్నూలు కొచ్చిన మొదట్లో ప్రతిరోజూ ఆనందూ, హనుమంతరెడ్డి పలకరించుకునేవాళ్ళు.

"ఏరా ఆనందూ మీ నాయన బాగున్నాడా?" అనో

"ఏరా ఆనందూ మీ అమ్మెకెట్లా ఉందిరా?" అనో

"ఏరా ఆనందూ గిరాకీలు బాగానే వొస్తాన్నాయా," అనో గడ్డానికీ, క్షౌవరానికీ ఆనంద్ బంకుకే వొచ్చి పలకరించేవాడు. ఆనంద్ కూడా హనుమంతరెడ్డిని చూస్తే స్వంతూరిని చూసినట్లు సంబర పడేవాడు. 'రెడ్డీ, రెడ్డీ,' అని పడిపడి మాట్లాడించేవాడు. గడ్డానికీ, క్షౌరానికీ డబ్బులే వద్దనేవాడు. బంకుకొచ్చే వాళ్ళందరికీ 'మా వూరి రెడ్డెబ్బా,' అని అదేదో గొప్ప అండ తనకు వున్నట్లు చెప్పుకునేవాడు.

గంగిరెడ్డి అప్పుడప్పుడూ చిన్న కొడుకైన హను మంతరెడ్డింటికి వచ్చినప్పుడంతా ఆనంద్ దగ్గరకూ వచ్చేవాడు. వూరును జ్ఞాపకం చేసేవాడు. ఎల్లనాగన్న తనకు చేసిన సేవను గుర్తు చేసుకునేవాడు.

"మీ నాయనలాగా వొయనంగా గడ్డం గీకేవోణ్ణీ, క్షౌరం చేసేటోణ్ణీ ఎవుణ్ణీ చూళ్ళా సూడ్రా, అంతేనా, తలకు చమురు అంటించి మాలిష్ చేస్తాంటే స్వర్గం కనబడ తాండా," అనో

"మీ రైతులకేమి రొడ్డీ మహరాజులు. యిండ్లూ, భూములూ వున్నందుకు గోర్నమెంటు అన్నింటికీ లెక్క కట్టిస్తుంది. మాలాంటి ఏమీ లేనోళ్ళ గతేంది," గంగిరెడ్డికి క్షౌరం చేస్తూ ఎల్లనాగన్న అన్నాడు.

"మంత్రసాని అంటే మీ అమ్మ సూడ్రా, మా హనుమంతరెడ్డికి పురుడు బోసింది మీ అమ్మేగదా, అడ్డం తిరిగిన బిడ్డను వొయనంగా బయటికి లాగి నా పెండ్లాన్నీ, నా కొడుకునూ కాపాడెగదరా, మీ అమ్మే లాకుంటే ఆ రాత్రి పొద్దు మా అగసాట్లు ఎట్లా వుంటాన్నో," అనో, అంటుంటే ఆ మాటలతో ఆనంద్ మనసును సంబరపరిచేవాడు. ఆ సంతృప్తిలో ఆనంద్, తన తలిదండ్రులు వూర్లో అంతో యింతో మంచి చేసినందుకే తనకు టౌన్లో యింత జీవనోపాధి జరుగుతూంది అనుకునే వాడు. వెర్రిగా...

అవన్నీ గడిచిపోయిన దినాలు. అవన్నీ ఆనంద్‌కు గుర్తున్నా హనుమంతరెడ్డికి గుర్తున్నట్లు లేవు. ఆనంద్‌నింకా పల్లెటూరితనం వదల్లేదుగానీ, హనుమంతరెడ్డిని ఎప్పుడో వదిలింది. అది వదిలినప్పట్నుంచీ అతని చుట్టూ సంపద పోగైనప్పట్నుంచీ, అతని మనసు నుంచీ ఆనంద్ కనుమరుగైనాడు.

అప్పుడప్పుడు రోడ్లో కన్పిస్తే ఆనంద్ పలకరించినా, చూసీ చూడనట్లు పోయే హనుమంతరెడ్డి వైఖరి ఆనంద్‌ను బాధపెడుతూ వుంటుంది.

"నాయనా... నాయనా..."

షాప్ దగ్గర్నుంచీ రవి గట్టిగా పిలుస్తూంటే, ఆలోచనల్లోంచి బయట పడి, టీ డబ్బులిచ్చి కదలినాడు.

లోపలికొస్తూనే, రవి ఆనంద్ చేతిలో ఒక పాంప్లెట్ పెట్టి, "ఎదురుగా కట్టిస్తాండే బిల్డింగ్‌లో పైన ఫ్లోర్లో ఆడవాళ్ళకు బ్యూటీపార్లర్ కింద మగాళ్ళకు జిమ్మూ, మెన్ బ్యూటీపార్లర్, బాడీ మసాజ్ సెంటర్ పెడ్తున్నారంట నాయనా, అదే యీ పాంప్లెట్," రవి చెప్తుంటే ఆనంద్ గుండెల్లో ఎక్కడో కలుక్కుమంది.

"అదేగాదు నాయనా, యీ షాప్ వదలమని మన ఓనర్ కూడా నోటీస్ యిచ్చినాడు. నెలరోజుల్లో వదలాల్లంట యిదిగో నోటీస్. ఆ రెడ్డీ, యీ ఓనరూ కూడబలుక్కున్నట్లున్నారు." తెలిసిన విషయమే అయినా రవి చెప్తుంటే ఆనంద్‌కు భూమిలోకి కుంగిపోతున్నట్లుంది.

చెట్ల వేళ్ళ మాదిరి దిగిన బంధాలు ఒక ఊరితో, ఒక ప్రాంతంలో తెంచుకొని వేరే చోటికి వెళ్ళాలంటే ఎంత యాతనో! తనకు పదైదేండ్లుగా తెలిసిన ప్రాంతం, తెలిసిన స్థిరమైన కష్టమర్లూ తనకు జీవనోపాధి కల్పిస్తున్న వాళ్ళు, వీళ్ళను వొదిలి వేరేచోటికి వెళ్ళాలి. వెళ్ళేలా చేస్తున్న దెవురు? తన నోటికాడి అన్నం ముద్దను లాగేస్తున్న దెవరు? ఆలోచించే కొద్దీ ఆనంద్ తల పగిలిపోతూ వుంది.

"ఇన్నేండ్లాయ నువ్వు కర్నూలొచ్చి రెండు సెంట్ల స్థలం యీ ఏరియాలో సంపాదించి స్వంతంగా చిన్న షాప్ కట్టించుకోగూడదేం నాయనా, యిప్పుడు మన బతుకు వీధిలో పడేట్లుంది."

రవి మాటలకు సమాధానం చెప్పలేని స్థితి.

పదైదేండ్లు కష్టపడితే తను సంపాదించిందంతా ఏ పూటకాపూట యిల్లు గడవడానికి సరిపోయింది. సైకిల్ స్థాయికి మించి ఎదగని తన స్థోమత, తలిదండ్రుల అనారోగ్యాలకూ, కూతురి పెళ్ళికీ, ముజఫర్‌నగర్ లాంటి మారుమూల ప్రాంతంలో చిన్న యింటికీ అప్పులు అవకుండా చూసుకోవడానికే సరిపోయింది. అసలు మొదట్నుంచీ యీ ఏరియాలో తనలాంటి వాడు స్థలం కొనేట్లుందా, అప్పుడు సెంటు పదిరవై వేలు వున్నింది. యిప్పుడు లక్షా, లక్షన్నరా వుంది. పెట్టుబడి వున్నోల్లకే కాలంగానీ అది లేనివాల్లకు ఎప్పుడూ కాలం కాదని రవికెట్లా చెప్పాలని, ఆనంద్ మనసు కుమిలిపోతోంది.

✤

నెలరోజుల తర్వాత...

ఆనంద్ తన షాప్ ఓనర్‌తో అన్నివిధాలా అడిగి భంగపడిన తర్వాత నగరానికి బయటి ప్రాంతమని చెప్పబడే చెక్‌పోస్ట్ ఏరియాకు షేవింగ్ సెలూన్ మార్చుతూ, సామాన్లు సర్దుకుంటున్న సమయానికి, ఎదురుగా...

హనుమంతరెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ ఓపెనింగ్ సెరిమనీ అట్టహాసంగా జరుగుతూంది.

'ఒక సైబర్ కేఫ్, ఒక పబ్ సెంటర్, ఒక జిమ్, హైటెక్ షేవింగ్ సెలూన్ కమ్ బాడీ మసాజ్ సెంటర్ వెరశీ యువతకు ఆధునిక స్వర్గ మొకటి ప్రారంభమవుతూ' ఉందని చెప్తూ ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి దానికి తలుపులు తెరుస్తున్నాడు.

అదంతా చూస్తున్న ఆనంద్‌కు కాలం సర్పమై తనను మింగిందా, లేక తనే పామును మింగాడా అర్థం కాకుండా వుంది. అర్థమైనా చేయ గలిగింది ఏమీ లేదని నిట్టూరుస్తూ, ఫంక్షన్‌లో హడావిడిగా తిరుగుతున్న హనుమంతరెడ్డిని చూస్తూ, అంతవరకూ తనలో సజీవంగా వుంచుకున్న తన వూరి చిత్రాన్ని బలవంతంగా చెరిపేసి, సామాన్లతో తరలిపోయాడు. ✱



సిగ్గు

మెట్టుపల్లి జయదేవ్ రెడ్డి



స్నోతో రోడ్లన్నీ భయంకరంగా ఉన్నాయి. ఎక్కడ స్కిడ్ అయిపోతుందో కారు అని భయం భయంగా డ్రైవ్ చేస్తున్నా. రాత్రంతా పడింది చాలక తెల్లవారిన తర్వాత కూడా స్నో పడుతూ ఉండడం చిరాగ్గా ఉంది. తెల్లవారినప్పటికీ సూర్యుడు ఇంకా పైకి రాలేదు.

స్నోలో కప్పుకుపోయిన రోడ్డు లేన్స్ సరిగ్గా కనిపించడం లేదు. నా ముందు ఏదైనా వెహికల్ ఉండి నేను దాని వెనకాల డ్రైవ్ చేయడం ఈ స్నోలో సులభం అనిపిస్తుంది నాకు. గుడ్డిగా ముందున్నవాణ్ణి ఫాలో అయిపోతూ ఉండొచ్చు. లేకపోతే రోడ్డు మీదున్నానో లేక దిగిపోయానో తెలిసి చావదు. రోజు 45 నిమిషాలు పట్టేది వర్క్‌కు. ఈరోజు గంటకు పైనే పట్టేటట్లుంది. నా ముందున్న కారు నాకు చుక్కానిలా ఉంది. ఆ కారు వెనుక నేను ధైర్యంగా నడుపుతున్నా. ఆ కారు బ్రేక్‌లైట్లు వెలగ్గానే ఆటోమాటిక్‌గా నా కాలు బ్రేక్ మీదికి వెళ్తోంది.

ఈ దేశానికి రాకమునుపు స్నో గురించి కథల్లో చదవటం, సినిమాల్లో చూడడం తప్ప నేరుగా చూసింది లేదు. ఆ కథల్లో, సినిమాల్లో ఎంత అందంగా ఉంటుంది. ప్రత్యక్షంగా చూడ్డానికి కూడ బాగానే ఉంటుంది, ఒక్క ఈ డ్రైవ్ చేసే బాధ లేకుంటే. ఏ ట్రైనులోనో, బస్సులోనో హాయిగా కూర్చొని వెడుతూ స్నో అందాలను బాగా ఆస్వాదించవచ్చు. నేను మాత్రం డ్రైవ్ చేస్తూ ఆనందించలేకున్నాను. ఆరుబయట మైదానాల్లో అంత అందంగా, దూదిలా తెల్లగా కనిపించే స్నో, రోడ్డు మీదసాల్ట్‌తో కలిసి, సగం కరిగి, బూడిదరంగులో అసహ్యంగా ఉంది. స్నో

కోసం ఎదురు చూడ్డం తీరా స్నో వచ్చేసరికి ఎప్పుడెప్పుడు పోతుందా అనిపిస్తుంది. సరిగ్గా అమె రికాకు బిడ్డల దగ్గరికి ఆశగా విజిట్‌కు వచ్చే తల్లి దండ్రులు మాదిరి. పాపం రావడం ఉత్సాహంగా కొన్ని నెలలైనా ఉందామనే వస్తారు. తీరా నెలైనా తిరక్క ముందే కేలండర్ వైపు చూస్తూ ఉంటారు. ఇక్కడ సొంత బిడ్డల దగ్గరే పట్టమని పదినెలలు ఎందుకు ఉండలేరో? బహుశా స్వేచ్ఛేమో! తల్లి, తండ్రి ప్రేమాను బంధాల కంటే మనిషి స్వేచ్ఛను ఎక్కువగా ప్రేమిస్తాడేమో! ఇక్కడికి రాగానే ఆ స్వేచ్ఛ పోతుంది. ఎక్కడికైనా వెళ్ళాలన్నా, ఎవరినైనా కలవాలన్నా వదులకొద్దీ మైళ్ళకొద్దీ దూరాలు పోవాలి కాబట్టి ఇంకొకరి సహాయం కావాలి. అందుకే ఈ పరిస్థితి నుంచి ఎంత త్వరగా బయటపడదామా అని ఎదురు చూస్తుంటారేమో!

అమెరికాకు బిడ్డల దగ్గరికి ఆశగా విజిట్‌కు వచ్చే తల్లిదండ్రులు రావడం ఉత్సాహంగా కొన్ని నెలలైనా ఉందామనే వస్తారు. తీరా నెలైనా తిరక్కముందే కేలండర్ వైపు చూస్తూ ఉంటారు. ఇక్కడ సొంత బిడ్డల దగ్గరే పట్టుమని పదినెలలు ఎందుకు ఉండలేరో? బహుశా స్వేచ్ఛేమో! తల్లి, తండ్రి ప్రేమాను బంధాలకంటే మనిషి స్వేచ్ఛను ఎక్కువగా ప్రేమిస్తాడేమో!

స్నో మీద విసుగుతో మొదలైన నా ఆలోచనలు ఎక్కడికో వెళుతున్నాయి. నా ముందున్న కారు టర్న్ తీసుకొని వెళ్ళింది. ఇక నేనే దారి చేసుకుంటూ వెళ్ళాలి. సిటీ దగ్గరకు వస్తున్నకొద్దీ ట్రాఫిక్ ఎక్కువ అవుతున్నట్లుంది. ప్రక్కన వెళ్ళే పెద్ద కార్లు నా కారుపైన సాల్ట్ స్నో కలగలిసిన స్లష్‌ను గుమ్మరించి మరీ వెళుతున్నాయి. విండ్‌షీల్డ్ ఫ్లూయిడ్ ఆగకుండా వాడుతున్నా. కొద్దిసేపటికి స్నో తగ్గిపోవడం గమనించా. ఇంకా అరగంటైనా డ్రైవ్ చేస్తేగాని వర్క్‌కు చేరలేను. సరే ఎందుకైనా మంచిది త్వరగా విండ్‌షీల్డ్ ఫ్లూయిడ్ నింపుకుంటే బాగుంటుందని గాస్‌స్టేషన్ కోసం చూస్తూ మెల్లిగా డ్రైవ్ చేస్తున్నా. దగ్గర్లో చిన్న షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. అందులో గాస్ స్టేషన్, కాఫీ షాప్ కూడా ఉన్నాయి. అక్కడ అన్నీ దొరుకుతాయి. వరుసగా రెండు రోజుల నుండి వదలకుండా పడుతున్న స్నో గుట్టలు గుట్టలుగా ఉండడంతో గాస్‌స్టేషన్లోకి దారి కనపడడం కూడా కష్టంగా ఉంది. పార్కింగ్‌లాట్‌లో స్నోతో కప్పబడిన కార్లు చాలా ఉన్నాయి. దగ్గరలో పార్కింగ్ దొరుకుతుందేమోనని ప్రయత్నించా. లాభంలేదు. అంతకుమునుపే పార్క్ చేసిన కార్లు చాలా ఉన్నాయి. రెండు మూడు రౌండ్లు తిరిగా. చివరకు దూరంగా ఉన్న స్పాట్ కనపడింది. రెండు కార్ల మధ్య ఖాళీ ఉంది. గట్టిగా ప్రయత్నిస్తే పార్క్ చేయగలననిపించింది. కొంచెం ముందుకెళ్ళి రివర్స్ చేసి లెఫ్ట్‌కు కట్‌చేసి కాస్త వెనక్కు వెళ్ళి మళ్ళీ స్టీరింగ్ స్టడీ చేసి ఖాళీ స్పాట్‌లోకి పోనిస్తూ గాస్ ఇచ్చా. అంతే సడన్‌గా నా కారు వెళ్ళి లెఫ్ట్‌సైడ్‌లో ఉన్న కారు డోరును గుద్దేసింది. బలంగానే కొట్టినట్లుంది. ఆ దెబ్బకు కారు మీదున్న స్నో దబ్బున రాలిపడింది. డోర్ మీద పెద్ద డెంట్ పడింది. నా గుండెల్లో ఆదుర్దా, భయం. ఏం చేయాలో తోచలేదు. కారులో నుంచి దిగలేదు. అటూ, ఇటూ చూశా. నా వెనకగాని ముందుగాని ఎవరూ లేరని నన్ను ఎవరూ గమనించలేదని రూఢి అయింది. ఇక ఒక్క క్షణం అక్కడ ఉండడం మంచిది కాదనుకున్నా. వెంటనే పార్కింగ్‌లాట్‌లో నుంచి బయటకు వచ్చా. విండ్‌షీల్డ్ ఫ్లూయిడ్ సంగతి తర్వాత చూసుకోవచ్చు. ముందు ఎవరూ చూడకముందే వెళ్ళిపోవడం మేలు. లేకపోతే పోలీస్ కంప్లయింట్, ఆ తర్వాత మూడేళ్ళ పాటు ఇన్సూరెన్సు ప్రీమియం పెరగడం అన్నీ సమస్యలే. కానీ ఆగకుండా వెళ్ళిపోతే హిట్ అండ్ రన్ కేసు అవుతుం దేమో అని భయం పట్టుకుంది. అయినా ఈ స్నోలో నా కారును, కారు నంబరును ఎవరూ గమనించి ఉండరనే నమ్మకం కుదిరింది. ఇక ఆగకుండా వర్క్‌కు వెళ్ళిపోయాను. మనసులో భయం, ఈపాటికి ఎవరైనా నామీద పోలీసు కంప్లయింట్ చేసి ఉంటారేమో? పోలీసులు నా కారు నంబరును పట్టుకొని మా ఇంటి దగ్గరికి వెళ్ళి ఉంటారేమో? ఇలాంటి కేసుల్లో పోలీసుల ప్రొసీజర్ ఏమిటో తెలియదు. వర్క్‌లో వాళ్ళను ఎవర్నైనా అడుగుదామా? అడిగితే అనుమానం రావచ్చు. రేడియో లో చెప్పే ఉంటారీపాటికి. మా ఆవిడకు చెబితే మంచి దనుకున్నా. తన వర్క్‌కు కాల్ చేసి జరిగిన సంగతి చెప్పాను. 'నీవు పోలీస్‌కు ఫోన్ చేసి ఉండుంటే పోయేది. ఇప్పుడు అనవసరంగా తలనొప్పి,' అని అంది. మధ్యాహ్నం దాటిపోయింది. ఏదో వర్క్‌లో ఉన్నానే గాని నా ఆలోచనలన్నీ పొద్దున జరిగిన యాక్సిడెంట్ మీదే ఉన్నాయి. పోలీసులు నా ఫోన్ నంబరు కనుక్కుని నాకేమైనా మెసేజ్ వదిలి ఉంటారేమో అని అనుమానమొచ్చింది. ఇంటికి కాల్‌చేసి మెసేజ్‌లు చెక్ చేసా. ఏమీ లేవు.

సాయంత్రం 5 అవగానే ఇంటికి బయల్దేరాను. ఇంటికొచ్చేసరికి 6 అయింది. అప్పటికే మా అబ్బాయి, మా ఆవిడ వచ్చినట్టున్నారు. రెండు కార్లూ గరాజ్‌లో కనబడుతున్నాయి. డ్రైవ్ వే మీద కనీసం మూడంగుళాల స్నో ఉంది. డ్రైవ్ వే మీదనే నా కారు పార్క్ చేసి లోపలికెళ్ళాను. అలవాటు ప్రకారం జాకెట్ సోఫా మీదికి విసిరేసి డైనింగ్ టేబుల్ దగ్గర కూర్చొని ఆరోజు వచ్చిన మెయిల్ చూస్తున్నా. ఆమె పైన బెడ్‌రూమ్‌లో ఉన్నట్లుంది. మా అబ్బాయి కంప్యూటర్ రూమ్‌లో నుంచి వస్తూ, "Dad some one hit my car and it left a big dent on the door," అన్నాడు.

పొద్దున గుద్దింది మావాడి కారునేనా? అని ఒక్కక్షణం ఆశ్చర్య పోయా. ఇంకా ఆ కన్‌ఫ్యూజన్ నుంచి తేరుకోక ముందే ఒక స్లిప్ తీసి ఇస్తూ, "I found this note on my windshield" అన్నాడు.

గబగబ స్లిప్ తీసుకొని చూశాను. అందులో I'm sorry for the accident. I was in a rush to see my father who had surgery last night. I hit your car while backing up my car. I looked for you but couldn't find you. Here is my phone number 815 555 5026. Please call me. I can bear the expenses to fix your car. Kathy Gommon.

సిగ్గుతో నా తల పట్టుకొని అలాగే కూర్చున్నా. *

మార్పు

అర్నాడ్



1982 డిసెంబర్ మూడవ తేది, సమయం రాత్రి ఎనిమిది గంటలు.

వీధి లైట్లు గుడ్డిగా వెలుగుతున్నాయి. చలి గాలులు వీస్తున్నాయి. రోడ్డుపై పలచబడిన జన సంచారం. రెండు మూడు సందులు దాటి నారాయణ ఇంటి ముందు ఆగిందొక స్కూటర్.

'ఈ మురికివాడలో ఎలా ఉండగల్గుతున్నావయ్యా నారాయణా!' అనుకున్నాడు జితేంద్ర స్కూటర్ స్టాండ్ వేస్తూ.

అతడు పొడవుగా, సన్నంగా ఉన్నాడు. వయసు ముప్పై మూడేళ్ళు. రంగు తెలుపు. తెల్లటి షర్ట్‌పై ఉలెన్ స్వెట్టర్, బ్లూ కలర్ ఉలెన్ ప్యాంటు, నల్లటి బూట్లు. ఒక పబ్లిక్ సెక్టార్‌లో ఎగ్జిక్యూటివ్ అతడు.

నారాయణ ఇంటికి అదురుతూ, బెదురుతూ ఒక దొంగలా వచ్చాడు. భయమో లేక చలి చేతో వణికే చేతులతో నారాయణ ఇంటి తలుపులు తట్టాడు జితేంద్ర.

తలుపులు తెరిచిన నారాయణ ఆశ్చర్యంతో, భక్తితో, గౌరవంతో తమ కంపెనీ మానేజర్ జితేంద్రని లోపలికి ఆహ్వానించాడు.

గోద్రేజ్ ఐరన్ ఛైర్‌పై కూర్చున్నాడు జితేంద్ర.

నారాయణ నల్లగా, పొట్టిగా, బలిష్టంగా ఉన్నాడు. వయసు ముప్పైయ్యేళ్ళు. అతని ఒంటిపై ముతక చొక్కా, లుంగీ పంచె. అతనికి చలి వేస్తున్నట్టు లేదు.

కార్మికుల్లో నారాయణ అంటే ఒక ప్రత్యేకమైన అభిమానం జితేంద్రకి.

నారాయణ లేకుండా వర్క్‌షాపుని ఊహించుకోవడం అతనికి చాతకాదు. ఒక ప్రొడక్ట్ తయారుచేయడానికి నిర్ణయించబడిన పనిగంటల కన్నా తక్కువ సమయంలోనే చక్కటి నైపుణ్యంతో, నాణ్యతతో చేస్తాడు పని. ఒళ్ళు దాచుకోకుండా చిత్తశుద్ధితో ఒక గొడ్డులా కష్టపడతాడు.

"రెండు రోజులు వరుసగా సెలవులొస్తే బోర్ కొట్టేస్తుందని గిజగిజలాడిపోతావ్. చేతిలో పని లేకపోతే పిచ్చెక్కిపోతుందంటావ్. అలాంటిది ఇదేంటయ్యా ఏకంగా నెలా పదిరోజులు ఏ పనీ పాట లేకుండా ఇంట్లో ఖాళీగా ఎలా ఉండగల్గుతున్నావ్?" అని అడిగాడు జితేంద్ర.

నిజమే. నారాయణకి ఇంట్లో పిచ్చెక్కిపోతోంది. సోమరితనం తెలియని ప్రాణం. వర్క్‌షాపులో అడుగు పెట్టేది ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్నాడు.

తను వచ్చేటప్పుడు ఏవైనా పళ్ళు, స్వీట్లు తీసుకురావాలనే ఆలోచన స్ఫురించనందుకు చింతించాడు జితేంద్ర. అయితే తను మర్చిపోకుండా భద్రంగా కంపెనీ కాగితం మాత్రం తీసుకువచ్చాడు, నారాయణ సంతకం కోసం.

ఎదురుచూడడం తప్పా తనేమీ చేయలేడు. ఎందుచేతంటే కంపెనీలో సమ్మె సాగుతోంది. నెలా పదిరోజులుగా వేతన సవరణ కోసం సమ్మె సాగుతోంది.

నారాయణ భార్య కమల టీ తీసుకువచ్చి జితేంద్రకు ఇచ్చింది. ఆమె వెనుక ఇద్దరు చిన్నపిల్లలు.

జితేంద్ర టీ కప్ తీసుకుంటూ, "పిల్లలు భోజనం చేశారా?" అని కమలని అడిగాడు.

జీతాలు లేవు. పెళ్ళాం పిల్లలని పస్తుల్లో పెట్టాడేమోనని అతడి అనుమానం.

పిల్లలు భోజనం చేశారని చెప్పింది కమల. అయినా జితేంద్ర అనుమానం తీరక ప్రత్యక్షంగా పిల్లలనే అడిగేశాడు. ఆ పసిపిల్లలు తిన్నామని తలలాడించారు. ఆ తర్వాత పిల్లలు తల్లితోపాటు లోపలి గదిలోకి వెళ్ళిపోయారు.

తను వచ్చేటప్పుడు ఏవైనా పళ్ళు, స్వీట్లు తీసుకురావాలనే ఆలోచన స్ఫురించనందుకు చింతించాడు జితేంద్ర. అయితే తను మర్చిపోకుండా భద్రంగా కంపెనీ కాగితం మాత్రం తీసుకువచ్చాడు, నారాయణ సంతకం కోసం.

అది హామీ పత్రం.

డిసెంబర్ ఆరో తేదీలోగా కార్మికులు డ్యూటీలకు హాజరు కావాలని హెచ్చరించింది కంపెనీ. ఆ తేదీలోగా హాజరుకాని కార్మికులు సర్వీస్ నుంచి తొలగింపబడతారని ప్రకటించింది. కంపెనీ లోపలికి వచ్చే ముందు హామీ పత్రంపై సంతకం చేయాలి. భవిష్యత్తులో ఇలాంటి సమ్మెలు, పోరాటాలు చేసి ఉత్పత్తికి విఘాతం కల్పించమని, కంపెనీ స్టాండింగ్ రూల్స్‌కి బద్దులై బుద్ధిగా పనిచేసుకుంటామని హామీ ఇవ్వాలి.

హామీ పత్రం పై సంతకం పెట్టనన్నాడు నారాయణ.

"నారాయణ! నా మాట దయచేసి విను. సమ్మెలు దేశ సౌభాగ్యానికి హాని చేస్తాయి తప్ప మేలు చేయవు. ఈ హామీపత్రంపై సంతకం పెట్టు. నీవు, నీ సహచరులు సమ్మె విరమించి సత్వరం కంపెనీలో అడుగు పెట్టండి. కంపెనీని చూస్తే నాకు ఏడుపొస్తున్న దయ్యా! ఎప్పుడు కళకళలాడే వర్క్‌షాపు స్మశానవాటికలా బావురుమంటోందయ్యా. ఉత్పత్తి స్తంభించి పోవడంతో ఒక ప్రొడక్షన్ మానేజర్‌గా కస్టమర్లకు సమాధానం చెప్పలేక పోతున్నాను. వాళ్ళు వర్క్ ఆర్డర్లు వెనక్కి తీసుకొని ఏ ప్రైవేటు కంపెనీకో ఇచ్చేస్తామని బెదిరిస్తున్నారు.

"పని చేయని సోమరులు గేటు బయట ఉన్నా ఫర్వా లేదు. నీలాంటి పనిచేయగల సమర్థులు ఈ కంపెనీకి కావాలి. ఈ దేశానికి కావాలి. ప్రభుత్వరంగ సంస్థలు దేశానికి వెన్నెముక. ఒక కంచుకోట. మన సంస్థలను మనం కాపాడుకోవాలిగాని నాశనం చేసుకోగూడదు. నేను ఎందుకు చెబుతున్నదీ అర్థం చేసుకో."

"సర్! అర్థం చేసుకోవలసింది మేము కాదు. యాజమాన్యం. మన కంపెనీ లాభాలతో నడుస్తోంది. జీతాలు పెంచడానికి యాజమాన్యానికి ఏమి తెగులు? నిజ వేతనాలు పడిపోతున్నాయి. అర్ధాకలితో ఏం పని చేస్తాం? పావలా జీతం పెరగడానికి మేము ఇలా రోడ్డునపడి పోరాటాలు చేయాలి. నా ప్రార్థన ఏమిటంటే మీరు, మీ ఆఫీసర్లు సమస్తం మా కార్మికుల తరపున నిలబడండి. వేతన సవరణకి యాజమాన్యంపై ఒత్తిడి చేసి ఒప్పించండి. ఒప్పుకోకుంటే మీరు కూడా సమ్మెలో పాల్గొని మాకు సహకరించండి," అని చేతులెత్తి దండం పెట్టి, "సర్ మీరిక్కడ ఎక్కువసేపు ఉంటే ప్రమాదం. శాంతియుతంగా మేము సాగిస్తున్న ఈ పోరాటాన్ని యాజమాన్యం హింసాత్మకంగా మారుస్తున్న విషయం మాకన్నా మీకు బాగా తెల్సు. అంచేత తమరు దయచేసి మరిక మాటాడకుండా వేగిరం, తక్షణం ఇక్కడ నుంచి బయటకు వెళ్ళిపోండి," అన్నాడు నారాయణ.

జితేంద్రకి ఒళ్ళు మండింది. నారాయణ వర్క్‌షాపులో తన మాట ఎంతో వినయంగా వినేవాడు. చెప్పింది చేసేవాడు. తన మాట ఇక్కడా విని చెప్పింది చేస్తాడనుకుంటే... తనకే పాఠాలు చెప్పి మర్యాదగా బయటకు వెళ్ళిపోమంటున్నాడు.

కుర్చీలోంచి భారంగా లేచాడు జితేంద్ర. లేచి జేబులోంచి రెండు వందలు రూపాయలు తీసి "నీ దగ్గర ఉంచు," అన్నాడు.

"నాకొద్దు సర్."

"సమ్మె విరమించమని నేనేమీ నీకు లంచం ఇవ్వడం లేదయ్యా! నీ పిల్లల కోసం ఇస్తున్నాను... పోనీ అప్పుగానే ఇస్తున్నానుకో. తర్వాత ఇచ్చేద్దువులే," అని బలవంతం చేసి డబ్బులు అతని జేబులో ఉంచాడు.

నారాయణ పైసలకి ఇబ్బంది పడుతున్న మాట వాస్తవం. అయినప్పటికీ మరొకరు ఇలా డబ్బు ఇచ్చి ఉంటే తీసుకోకుండా తిరగ్గొట్టేవాడు. అతడికి జితేంద్రపై గౌరవం ఉంది. కళ్ళు చెమర్చగా, కృతజ్ఞతలతో చేతులెత్తి నమస్కరించాడు నారాయణ.

జితేంద్ర అక్కడ నుంచి ఇంటికి కాదు, మరో కార్మికుడి ఇంటికి వెళ్ళే ప్రోగ్రాంలో ఉన్నాడు. హామీ పత్రాలు జేబులో దండిగా పెట్టుకున్నాడు.



మర్యాదపూర్వకంగా నారాయణ తనతోబాటు స్కూటర్ నిలిపి ఉన్న స్థలం వరకూ రాబోతుంటే వద్దని వారించాడు జితేంద్ర. భార్యాభర్తలు ఇంకా భోజనం చేయలేదనేది గ్రహించి వెంటనే భోంచేయమన్నాడు.

నారాయణ తలుపులు వేసుకుని కమలతో భోజనానికి కూర్చోబోతుండగా బయట పెద్ద చప్పుడు. పెనుకేకలు.

భూమి కంపించింది. ఆకాశం గర్జించింది. చలిపులి గాండ్రుమంది. వీధిలైట్లు బలుక్కుమని నెత్తుటి పెంకులు కక్కాయి. కమ్ముకున్న చీకటి త్రాచులా పడగ విప్పింది.

నారాయణ పరుగున బయటకు వచ్చేటప్పటికే...

జితేంద్ర స్కూటర్‌పై మంటలు లేచాయి. అతడిపై బాణాకర్రలు లేచాయి. పిడిగుద్దులు పడ్డాయి.

తల పగిలి రక్తపు మడుగులో నేల కొరగకుండా... నారాయణ గభాల్న వచ్చి అడ్డుకున్నాడు. కార్మికులకు చేతులెత్తి నమస్కారం పెట్టి, కొట్టింది చాలు వదిలేయమని ప్రార్థించాడు.

బతికి బయటపడ్డాడు జితేంద్ర. అతడిని సకాలంలో ఆసుపత్రికి తీసుకెళ్ళడానికి తనకి అప్పుగా ఇచ్చిన రెండువందలు ఉపయోగపడ్డాయి నారాయణకి.

✤

జితేంద్రను ఆసుపత్రిలో జాయిన్ చేసి... పరుగున వెళ్ళి సుజాతను తీసుకువచ్చాడు నారాయణ.

సుజాత జితేంద్ర భార్య. వాళ్ళది ప్రేమ వివాహం.

సమ్మెకు వ్యతిరేకంగా పనిచేస్తున్న జితేంద్రకి ప్రాణాపాయం పొంచి ఉందని, అంచేత అతణ్ణి కలుగజేసుకోవద్దని చెప్పమని ముందుగానే యూనియన్ సుజాతను హెచ్చరించింది.

ఆ విషయం సుజాత చెబితే లక్ష్యపెట్టలేదు జితేంద్ర.

అభ్యుదయ భావాలు గల కుటుంబం నుంచి వచ్చిన సుజాతకి ఈ ఆర్థిక వ్యవస్థలోని దివాళకోరు, దగాకోరు విధానాలు తెలియనివి కావు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి, పన్నులు పెరిగి, అది ఇది అని కాకుండా సమస్తం పెరిగి శ్రామికవర్గం నిజవేతనాలు పడిపోయాయి. వేతన సవరణకు కార్మికులు చేస్తున్న సమ్మె ఆమెకు న్యాయంగానే తోచింది.

సమ్మెకు వ్యతిరేకంగా జితేంద్ర యాజమాన్యంతో సహకరించడం ఎంతగానో బాధను కలిగించింది ఆమెకు.

"సుజాతా! నీవు బాధపడాల్సిన నీచమైన పని నేనేమీ చేయడం లేదు. వీళ్ళు సమ్మె చేస్తున్నది ఎవరి మీద? టాటా, బిర్లాల మీద కాదు. బహుళజాతి కంపెనీల మీద కాదు. ప్రజాధనంతో భారతజాతి సృష్టించు కున్న ఒక పబ్లిక్ సెక్టార్ మీద? అవునా? మరి నీకు ఈ సమ్మె ఎలా న్యాయంగా తోస్తోంది?

"నేను సమ్మెలకే కాదు, కంపెనీ విధించే లాకౌట్లకు కూడా తీవ్ర వ్యతిరేకిని. నేనే కాదు, దేశభక్తి గలవారు ఎవరైనా సరే... ప్రభుత్వరంగ సంస్థలను దేవాలయాలుగా భావిస్తారు. చెమట చినుకులతో ఉత్పత్తిని సృష్టించే శ్రామికులను దేవుళ్ళుగా పూజిస్తారు. ఎటువంటి అవరోధాలు, ఆటంకాలు లేకుండా సంస్థ ఎప్పుడూ పచ్చగా కళకళలాడుతూ వెలిగి పోతుండాలని నేను కోరుకుంటాను. అది నీవు గ్రహించు.

"అవును సుజాతా! నిజం. నాకు కంపెనీ సైరన్ శంఖారావంలా వినిపించి ఉత్తేజితుడిని చేస్తుంది. వర్క్‌షాపులో యంత్రాల చప్పుడుకి నా గుండె గజ్జెల నృత్యం చేస్తుంది. శ్రామికుల చెమట వాసన... నాకు పైరగాలిని తలపింపజేస్తుంది. నీకు నేను స్పష్టం చేస్తున్నది ఏమిటంటే... ఈ పబ్లిక్ సెక్టార్ నా కన్నతల్లి. ఇంజనీరింగ్ డిగ్రీతో నేను రోడ్డున పడకుండా ఆప్యాయంగా ఒడిలోకి తీసుకున్నదీ తల్లి. అంతేకాదు ట్రైనింగ్‌కి రెండుసార్లు జర్మనీ పంపి నన్నొక ప్రొడక్షన్ మేనేజర్ స్థాయికి పెంచింది ఈ తల్లి.

'నా తల్లి గుండెచప్పుడు ఆగిపోకూడదు. అవసరమైతే నా ప్రాణాలైనా ఇస్తాను,' అంటూ సమ్మెకు వ్యతిరేకంగా పనిచేసి ప్రాణం మీదకు తెచ్చు కున్నాడు జితేంద్ర. నారాయణ చక్రంలా అడ్డు నిలబడకపోతే ఏమయి ఉండేవాడు? సుజాత అదృష్టం అనాలి.

తనని చావుదెబ్బలు కొట్టి ఆసుపత్రి పాల్జేసిన కార్మికులపై ద్వేషం ప్రకటించలేదు జితేంద్ర. అతనిపై దాడిచేసిన కార్మికులపై కఠినచర్యలు తీసుకోవడానికి సిద్ధపడింది యాజమాన్యం. తనని కొట్టిన కార్మికులలో ఒకరిద్దరిని స్పష్టంగా గుర్తించగలిగినా... వాళ్ళ పేర్లు బయటకు తెలియ జేయలేదు జితేంద్ర. తన జేబులో డబ్బుకోసం ఎవరో దారినపోయే దుండగులు చేసిన దాడిగా బొంకాడు.

చివరికి తను ఆశించినట్టుగా సమ్మె విఫలమయింది. కంపెనీ మళ్ళీ కార్మికులతో కళకళలాడటం సంతోషాన్ని కలిగించింది జితేంద్రకి.

సమ్మె విఫలమయిందంటే ఒప్పుకోలేదు సుజాత. ఢిల్లీలో గత రెండేళ్ళుగా కదలని వేజ్ రివిజన్ ఫైల్‌కి చలనం వచ్చిందంటే కారణం సమ్మె వజ్రాయుధం. ఫైల్ బ్యూరోక్రసీ నుంచి బయటపడి చకచకా కదిలి సెక్రటరీల సంతకాలతో... చివరికి మంత్రిగారి ముద్రతో క్లియర్ కాబడిం దంటే నెలా పదిరోజుల సమ్మె అందుకు కారణం అన్నది సుజాత. యాజమాన్యం కుట్ర పన్ని సమ్మెను విచ్ఛన్నం చేసినా పరోక్షంగా విజయం కార్మికులదే అన్నది సుజాత.

సుజాత అన్న మాటను కొట్టి పారేయలేదు జితేంద్ర. సమ్మె 'విజయం' పొందడాన్ని ఏ యాజమాన్యం సహించదు. ఎట్టకేలకు వేజ్ రివిజన్ జరిగింది.

ఉత్పత్తి దిశగా కార్మికులంతా పునరంకితులై నడుం బిగించారు. యంత్రాలు పురి విప్పాయి. పొలాలనన్నీ హలాల దున్ని ఇలాతలం హిమం పండించినట్లుగా... కార్మికుల నెత్తుటి ఆవిర్లు, వెచ్చటి ఊపిర్లు, స్వేద బిందువులు... కర్మాగారాన్ని పూర్వ వైభవస్థితిని అందుకునేలా చేశాయి. ఆ తర్వాత ఆ ప్రభుత్వరంగ సంస్థ వెనుతిరిగి చూడలేదు. ఉత్పత్తిలో రికార్డులు బద్దలుకొడుతూ, లాభాల బాటలో ప్రగతిపథంలో పురోగమించ సాగింది.

అలాగే జితేంద్ర కూడా ఉన్నతస్థాయికి ఎదగసాగాడు.

✤

2002 డిసెంబర్ మూడవ తేది... సమయం ఉదయం పది గంటలు.

జితేంద్ర ఆఫీస్‌రూమ్‌లో అవసరం లేకున్నా ఏ.సి. మిషన్ ఆన్ చేయబడి మరింత చల్లదనాన్ని ఇస్తోంది. కాలంతో నిమిత్తం లేకుండా ఏ.సి.కి అలవాటు పడిపోయింది అతని ప్రాణం. కిటికీలు, తలుపు మూసి ఉండడంచేత పట్టపగలే రెండు ట్యూబ్‌లైట్లు ఆ గదిలో వెలుగుతున్నాయి. గోడకి వేలాడుతున్న బోర్డ్‌పై ఉత్పత్తి లక్ష్యాల గీతలు, లెక్కలు వ్రాయబడి ఉన్నాయి.

జితేంద్ర పాడవుగా, కాస్త లావుగా, నెరిసిన తలకు నల్లరంగుతో నిగనిగలాడుతున్నాడు. వయసు యాభైమూడు సంవత్సరాలు. రివాల్వింగ్ ఛెయిర్‌లో కూర్చొని ముందుకీ, వెనక్కీ సన్నగా ఊగుతున్నాడు.

నారాయణ చేతులు కట్టుకొని వినయంగా నిలుచున్నాడు. నల్లగా, పొట్టిగా వయసు యాభై ఏళ్ళు దాటినా అతని శరీరం ఉక్కులా నిగనిగ మెరిసిపోతోంది.

ఇద్దరి మధ్య పెద్ద టేబుల్ ఉంది. టేబుల్‌పై ఒక కాగితం ఉంది. కాగితంపై పేపర్ వెయిట్ ఉంది. పేపర్‌వెయిట్ అప్పుడప్పుడు జితేంద్ర చేతిలో బొంగరంలా తిరుగుతోంది.

''ఎందుకు సర్! పిలిచారు?'' అని అడిగాడు నారాయణ... తను వచ్చి రెండు నిమిషాలైనా జితేంద్ర ఏమీ మాటాడకపోవడంతో.

"నీవు పి.యఫ్. లోన్‌కి అప్లయ్ చేశావా?''

"అవున్సార్.''

"లోన్ అమ్మాయి పెళ్ళికి అవసరమని రాశావు... అందరూ రాసినట్లే! మీ అమ్మాయికి నిజంగానే పెళ్ళా!''

"అవున్సార్. నిజంగానే మా అమ్మాయి పెళ్ళి.''

"పెళ్ళికి నన్ను పిలుస్తావా?''

"అదేమిటి సార్? అలాగంటారు. మీరు వచ్చి అక్షింతలు వేయకుంటే ఎట్లా?''

"అది సరే... ఆడపిల్ల పెళ్ళంటే మాటలా! నీవు పెట్టిన లోను పెళ్ళికి ఏమూలకి సరిపోతుంది?''

చిన్నగా నవ్వేశాడు నారాయణ.

"నేను చెప్పిన పని ఒకటి చేయి... నీ సమస్యలన్నీ పరిష్కారమై పోతాయి.''

"ఏమిటి సర్.''

"ఇదిగో... ఈ కాగితంపై సంతకం పెట్టు... ఒక గంటలో నీ ముందు ఎనిమిది లక్షలు ప్రత్యక్షమౌతాయి.'' అని టేబుల్‌పై కాగితాన్ని నారాయణ చేతికి ఇచ్చాడు జితేంద్ర.

గతుక్కుమన్నాడు నారాయణ. చాలాసేపు నోటిమాట రాక స్తంభించి పోయాడు. ఆ కాగితంపై సంతకం పెట్టమనే బదులు జితేంద్ర తనను చాచిపెట్టి లెంపకాయ కొట్టినా అంతగా చలించేవాడుకాదు.

సంతకం పెట్టమన్న కాగితం... వాలంటరీ రిటైర్‌మెంట్ స్కీం!

"నారాయణ! ఇది చక్కని అవకాశం. నీవు కంపెనీలో పనిచేస్తే ఇచ్చే జీతం రూపాయి. నీవు ఏ పని చేయకుండా కంపెనీ వదిలి వెళిపోతే రూపాయిన్నర. నీ బేలన్స్ సర్వీస్‌కి ఎనిమిది లక్షలు వస్తుంది. అంత డబ్బు నీ జన్మలో చూసి ఉండవు. అవునా! అమ్మాయి పెళ్ళే కాదు... సమస్త కష్టాలు తొలగిపోయే మార్గం ఇదే... వేగిరం సంతకం పెట్టి డబ్బు తీసుకో!' ' అని సంతకానికి తొందర చేశాడు జితేంద్ర.

స్థాణువులా నిలుచుండిపోయిన నారాయణ ఆ కాగితంపై సంతకం పెట్టలేదు. అతనికెందుకో దు:ఖం, కోపం ఎగిసి వస్తోంది.

"నారాయణ! మరేం ఆలోచించకు. నీ మంచి కోరే చెబుతున్నాను. సంతకం పెట్టు.''

"ఇంతకాలం మీరు నా మంచికోరే వారిగా భావించాను సర్! కాని ఈరోజు మీరు నాకు కొత్తగా, విచిత్రంగా కన్పిస్తున్నారు. మీకు గుర్తుందో లేదో... సరిగ్గా ఇదే రోజున ఇరవయ్యేళ్ళ కిందట మీరు మా ఇంటికి వచ్చారు. అవి మేము సమ్మె చేస్తున్న రోజులు.

"ఆ రోజు మీరేమి అన్నారో తెల్సా! నాకు బాగా గుర్తుంది. నారాయణ లేకుండా వర్క్‌షాప్‌ని ఊహించు కోవడం కష్టం అన్నారు. రెండు రోజులు సెలవొస్తే ఇంటి దగ్గర బోర్ కొట్టేస్తుందని గిజగిజలాడిపోతావ్. చేతిలో పని లేకపోతే పిచ్చెక్కిపోతావ్. అలాంటిది నెలా పది రోజులు ఏ పనీపాటు లేకుండా ఎలా ఉండగలుగుతున్నా వని ఆశ్చర్యపోయారు.

"ఆరోజు మీరు నన్ను సమ్మెను విరమించి పనిలోకి రమ్మని హామీ పత్రం ఇచ్చారు. ఈరోజు కంపెనీ వదిలి బయటకు పొమ్మని విఆర్ఎస్ పత్రం ఇస్తున్నారు. ఎంత విచిత్రం!

"నాకింకా పదేళ్ళ సర్వీస్ ఉంది సార్! నాది కష్టపడే తత్వం. మీరు నా మంచికోరి రోడ్డెక్కమంటున్నారు. మీ మంచితనాన్ని భరించడం నాకు సాధ్యమయ్యేపని కాదు సర్.

గతుక్కుమన్నాడు నారాయణ. చాలాసేపు నోటిమాట రాక స్తంభించి పోయాడు. ఆ కాగితంపై సంతకం పెట్టమనే బదులు జితేంద్ర తనను చాచిపెట్టి లెంపకాయ కొట్టినా అంతగా చలించేవాడుకాదు. సంతకం పెట్టమన్న కాగితం...

"క్షమించండి. నాకు విఆర్ఎస్ వద్దు. నాకు పియఫ్ లోను శాంక్షన్ చేయండి చాలు. చేయలేనంటారా... ఫర్వాలేదు. మా అమ్మాయి పెళ్ళి ఆగిపోదు. పెళ్ళికోసం నేను ఉద్యోగం వదులుకోవడాన్ని మా అమ్మాయి ఒప్పుకోదు. నా భార్య ఒప్పుకోదు. నా అంతరాత్మ ఒప్పుకోదు.

"ఉద్యోగం చేస్తూనే... మా అమ్మాయి పెళ్ళి చేసి... మిమ్మల్ని పెళ్ళికి పిలుస్తాను.

"నేను చేసే పనిలో లోపం ఏదైనా ఉంటే చెప్పండి సర్! సరిదిద్దుకుంటాను. అంతే తప్ప నన్ను విఆర్ఎస్ తీసుకుని బయటకు పొమ్మన కండి. నేను మీరు ఇచ్చే లక్షలకి అమ్ముడుపోలేను సర్. నేను నమ్ముకునేది శ్రమని, కాయకష్టాన్నే సర్. కష్టించి అరవయ్యేళ్ళు పనిచేసిన తర్వాతే... నేను ఈ తల్లిని వదలి వెళ్తాను సర్. అంతవరకు సెలవ్! వస్తాను సర్," అంటూ చేతులెత్తి దండం పెట్టి కళ్ళనీళ్ళతో ఆ గది నుంచి బయటకు వచ్చేశాడు నారాయణ.

వెళ్ళిపోతున్న నారాయణని ఆపి మరోసారి కౌన్సిలింగ్ చేసే శక్తి కోల్పోయాడు జితేంద్ర. నారాయణ గతాన్ని గుర్తు చేస్తుంటే నోరు పెగల్లేదు తనకి. చిరాగ్గా సిగరెట్ తీసి వెలిగించాడు. ఇరవై ఏళ్ళ కిందట తన నుదుటిపై తగిలిన దెబ్బను తడుముకున్నాడు. జితేంద్ర ఇప్పుడు ఆ ప్రభుత్వరంగ సంస్థకి జనరల్ మానేజర్!

"నేడు ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ వ్యవస్థ నన్ను అమితంగా ఆకట్టుకుంది. ఫాలో అవుతున్నాను. రేపు మరేదో కొత్త వ్యవస్థీకరణ వస్తే అటువైపు. అయస్కాంతంలా ఆకర్షింపబడతాను. అందులో సందేహం లేదు"

✤

జితేంద్ర రేయింబవళ్ళు కంపెనీ వ్యవహారాల్లో తల మునకలై రెస్ట్‌లెస్‌గా జీవితం సాగిస్తుంటే... అతని భార్య సుజాత సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని తృప్తిగా కాలం వెళ్ళదీస్తోంది. వాళ్ళకి ఒక్కడే కొడుకు. అతడు ఇక్కడ లేడు. అమెరికాలో యమ్.యస్. చదువుతున్నాడు.

జితేంద్రతో సంసారనావ ఆమెకు సాఫీగా సాగిపోతున్నా... ఒక కంపెనీ ఎగ్జిక్యూటివ్‌గా అధికారపు మెట్లు ఎక్కుతున్న కొలది అతనిలో కనిపిస్తున్న మార్పు ఆమెను కాస్త కలవరపెడుతున్నది.

తను ఒక ముఖ్య అధికారి అయ్యాక... సరళీకృత, నూతన పారిశ్రామిక, ఆర్థిక విధానాలకు ఒక ఏజంట్ పాత్ర వహించడం లేదు కదా అని ఆమెకు అనుమానం కలుగుతోంది.

తను చూస్తుండగానే మనిషిలో ఏమిటి ఇంత మార్పు?

అదే ఆమె అడిగితే మారుతున్న ప్రపంచంతో బాటు మనమూ మారక తప్పదు అని తేలిగ్గా అనేస్తాడు జితేంద్ర. ఏం మనిషి?

నూతన పారిశ్రామిక ఆర్థిక విధానాల తాకిడికి దేశంలో పబ్లిక్ సెక్టార్ పునాదులు ఒకటీ ఒకటీ కదిలి ధ్వంసమవుతున్న ప్రమాద స్థితిలో... మన కంపెనీని మనం కాపాడుకోవాలి. నిలబెట్టుకోవాలి. అనే త్యాగభావన, దేశభక్తి అతనిలో కన్పించకపోవడం ఆమెకు ఆందోళన కలిగిస్తోంది.

"ఒకప్పుడు మీరు పబ్లిక్ సెక్టార్‌ని తల్లి అన్నారు, ఆధునిక దేవాలయం అన్నారు గుర్తుందా," అని ఆమె అంటే -

"గుర్తుంది. అయితే నేనలా అన్నది ఇప్పుడు కాదు, ఒకప్పుడు. ఆ రోజులు వేరు. అనగా మన ఆర్థికవ్యవస్థే పబ్లిక్‌సెక్టార్‌లను కొమ్ముకాసే రోజులు. ఆనాటి సామాజిక, ఆర్థిక పరిస్థితులు నన్ను ఆ విధంగా ఫీల్ అయ్యేలా, స్పందించేలా చేశాయి. అంచేత అప్పుడు నేను అన్నది రైటే... అలాగే నేడు కూడా నేను రైటే.

"నేడు ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ వ్యవస్థ నన్ను అమితంగా ఆకట్టుకుంది. ఫాలో అవుతున్నాను. రేపు మరేదో కొత్త వ్యవస్థీకరణ వస్తే అటువైపు. అయస్కాంతంలా ఆకర్షింపబడతాను. అందులో సందేహం లేదు. అంచేత నేను చెప్పేదేమంటే - ఏవీ మన చేతుల్లో లేదు. మనం మాత్రం మార్పు వైపు దూసుకుపోతున్న సమాజపు చేతుల్లో ఉన్నాం. మార్పుని ఆహ్వానించడం అనివార్యం," అని తేల్చేశాడు జితేంద్ర.

"అంటే మీరు ఆహ్వానించే మార్పు మంచికా, చెడుకా? ఎవరి ప్రయోజనాల కోసం? అనేది మీకు పట్టదన్నమాట."

"నాకు మంచిగా తోచిన విషయం నీకు చెడుగా కన్పించవచ్చు. ఇది చాలా చిక్కు ప్రశ్న. ప్రపంచమంతా ముక్కలుగా జాతులుగా విడిపోయింది ఇక్కడే. అంచేత మనం అనవసరంగా వాదనలకు దిగి మన బుర్రలు పాడు చేసుకోవద్దు. పద ప్రశాంతంగా భోజనం చేసి పడుకుందాం," అంటూ సుజాతను మరిక మాటాడనీయడు జితేంద్ర.

అతని ముందు ఎంతటి సీరియస్ విషయం ఎత్తినా... అర్ధాంతరంగా పలచబడిపోతుంది. చివరికి చల్లబడిపోతుంది.

నారాయణ విషయం జితేంద్ర వద్ద కదపాలని చూస్తోంది ఆమె.

గంట క్రితం ఆమె వద్దకు నారాయణ వచ్చి కన్నీళ్ళు పెట్టుకున్నాడు.

ఇంతకాలం తన పనితనాన్ని గొప్పగా మెచ్చుకునే అయ్యగారు నిర్దాక్షిణ్యంగా విఆర్ఎస్ తీసుకుని బయటకు పొమ్మన్నారనే విషయం చెప్పి ఎంతగానో బాధపడ్డాడు.

ఏం చేయగలదు తను? తన మాట వింటాడా?

ఆమె మాట ఆమె మొగుడు జితేంద్ర వినడు. జితేంద్ర మాట ఎమ్.డి. మొగుడు వినడు. ఎమ్.డి. మాట ప్రభుత్వం మొగుడు వినడు. ప్రభుత్వం మాట ప్రపంచబ్యాంక్ మొగుడు వినడు... నవ్వుకుంది సుజాత.

అయిదు వేలమంది ఉద్యోగుల్లో... పదిహేను వందల మందిని విఆర్ఎస్‌పై విజయవంతంగా పంపించేయగలిగాడు జితేంద్ర. అయితే ప్రభుత్వం అంతటితో తృప్తి పడకుండా మరో వెయ్యిమందిని బయటకు పంపించేయమని ఆదేశించింది. విఆర్ఎస్ గాలానికి చేపలు మరిక పడటం లేదని చెబితే... కనీసం అయిదువందల మందినైనా కంపెనీ గేటు బయటకు తోసేయమని ఒత్తిడి చేస్తోంది ప్రభుత్వం.

ఎంతగా ఒత్తిడి చేస్తున్నా, ఎన్ని తాయిలాలు ఆశ పెడుతున్నా మిగిలిన ఉద్యోగులు విఆర్ఎస్‌పై ఉత్సాహం, సుముఖత చూపడం లేదు.

దీనికి యూనియన్ వ్యతిరేకత కూడా కొంత కారణం.

విఆర్ఎస్‌పై కొంతమంది కార్మికులు బయటకు వెళ్ళిపోయాక కళ్ళు తెరిచింది యూనియన్. మిగిలిన కార్మికులను కాపాడుకునే యత్నంలో పడింది.

'కార్మికులారా! విఆర్ఎస్‌ను తిరస్కరించండి,' అంటూ వివరంగా ఒక కరపత్రం వేసింది.

ఆ కరపత్రం సుజాతకి నారాయణ ఇచ్చాడు.

ఆమె చదివింది.

విఆర్ఎస్ వల్ల అటు ఉద్యోగి, ఇటు పబ్లిక్ సెక్టార్ ఎంతగా నష్టపోయేది వివరాలు తెలియజేసింది యూనియన్ ఆ కరపత్రంలో.

"ప్రపంచబ్యాంక్‌కి, ప్రభుత్వానికి పుట్టిన అక్రమ సంతానం ఈ విఆర్ఎస్. దేశంలోనున్న మొత్తం ప్రభుత్వరంగ సంస్థల్లో ఇరవైరెండు లక్షలమంది ఉద్యోగులను విఆర్ఎస్ పేరిట బయటకు వెళ్ళగొట్టాలని ప్రపంచబ్యాంక్ ఆదేశం. అందులో మన కంపెనీ టార్గెట్ రెండువేల అయిదు వందలమంది.

"పాము పిల్లల్ని పామే తినేసినట్టు ప్రభుత్వమే ప్రభుత్వరంగ సంస్థలను ధ్వంసం చేస్తోంది. విఆర్ఎస్‌తో ఉద్యోగుల సంఖ్య విపరీతంగా తగ్గించి ఏ బహుళజాతి సంస్థకో లాభాలలో ఉన్న మన కంపెనీని కారు చౌకగా అమ్మేయాలనేది ఢిల్లీ అధికారుల కుట్ర. అంచేత మనం విఆర్ఎస్‌ను తిరస్కరిద్దాం. మన పరిశ్రమను ఏ విదేశీ తిమింగలాలు మింగేయకుండా, ఏ ప్రైవేట్ రాకాసిబల్లులు కబళించకుండా కాపాడుకుందాం. అందుకు అవసరమైతే ఎటువంటి పోరాటాలకైనా మనం సిద్ధపడదాం..." అని ఉంది కరపత్రం చివర్లో.

సుజాత చదివి, "మీ యూనియన్ గట్టిదే. పోరాటాలు చేయగల శక్తి గలదే అని విన్నాను. నిజమేనా?" అనడిగింది.

"అవును మేడమ్! మా యూనియన్ గట్టిది. పటిష్టమైనది. యాజమాన్యంతో మిలాఖత్ అయి కార్మికులకి ద్రోహం చేసే దుర్మార్గపు యూనియన్ కాదు. మా యూనియన్‌ది యువక రక్తం. ఒక ఉజ్వలశక్తి. ఒక ప్రభంజనం. ప్రైవేటైజేషన్‌కి వ్యతిరేకంగా ఇప్పటికే ఉధృతంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తోంది. రోజూ కంపెనీ గేటు వద్ద నినాదాలు, వారం వారం ఊరేగింపులు, రిలే నిరాహారదీక్షలు, బహిరంగసభలు... ఒక యజ్ఞంలా నిరంతరం ఆందోళన చేస్తూనే ఉంది," అన్నాడు గర్వంగా నారాయణ.

"అవునవును. నేనూ విన్నాను... నారాయణ! మీకు కొండంత అండగా యూనియన్ ఉండగా నిన్ను అయ్యగారు ఏదో అనేశారని కన్నీళ్ళు పెట్టుకుంటావేం?" అంది సుజాత.

నిజమే. నారాయణకి కన్నీళ్ళు ఆగడంలేదు. అతని గుండె గాయం అయింది. గత రాత్రంతా నిద్ర పట్టనేలేదు. గోడకి వేలాడుతున్న 'ఉత్తమ కార్మికుడు' బంగారు పతకం, ప్రశంసా పత్రాలు అతన్ని చూసి నవ్వుతూ, ఎగతాళి పట్టిస్తున్నట్టు అనిపించింది. పిచ్చెక్కినట్టు వాటిని ధ్వంసం చేశాడు.



తనను అభిమానించే అధికారి విఆర్ఎస్‌పై బయటకు పొమ్మనడం... ఒక ప్రియమైన తండ్రి అల్లారుముద్దు కొడుకుని ఇంట్లోంచి గెంటి వేస్తున్నట్టుగా తల్లడిల్లిపోయాడు. తెల్లవారాక డ్యూటీకి వెళ్ళకుండా ఇంట్లోనే జ్వరం వచ్చిన రోగిలా ఉండిపోయాడు. సాయంత్రం జితేంద్రను ఇంటివద్ద కలిసి, 'నన్నెందుకు అంత మాటన్నారు,' అని నిలదీద్దామని వెళ్ళాడు. జితేంద్ర ఆఫీసు నుంచి ఇంకా రాకపోవడంతో సుజాతతో తన గోడు చెప్పుకొని బావురుమన్నాడు నారాయణ.

"నీపై ఉన్న అభిమానం ఆయనకి చెదిరిపోయిందని నేననుకోను. ఏదో కారణంగా అందరితోబాటు నిన్ను కూడా విఆర్ఎస్ తీసుకొమ్మని ఒత్తిడి చేసి ఉంటారు. నారాయణ! నువ్వేం బాధపడకు. ఆయన వచ్చాక విషయం నేను కనుక్కుంటాను... ఆయన రేపు నిన్ను కలిసి... జరిగింది పీడకలగా మర్చిపొమ్మంటారని నేను అనుకుంటున్నాను," అంది సుజాత.

"మీరేదో అంటున్నారుగాని... నాకు ఆ నమ్మకం లేదమ్మా! అయ్య గారు పూర్తిగా మారిపోయారు. కంపెనీని, కార్మికులని ఒకప్పుడు ఎంత ప్రేమగా చూసుకునేవారో... ఇపుడు అంతకంటే ఇంకెంతగానో దూరమై పోతున్నారనిపిస్తోంది. అయితే ఒకటి మేడమ్! ఒక అధికారి మాకు దూర మైనా ఫర్లేదు. కాని మా కన్నతల్లి... కంపెనీని మాకు దూరం చేయకుంటే చాలు... వస్తానమ్మా," అని నమస్కరించి వెళ్ళిపోయాడు నారాయణ.

అతని మాటకు సుజాత గుండె బరువైంది.

ఆఫీసు నుంచి రాత్రి ఎనిమిదిన్నర గంటలకి ఇంటికి చేరిన జితేంద్రకి మాటల మధ్యలో నారాయణ వచ్చి వెళ్లిన విషయం తెలియ జేసింది.

నొసలు చిట్లించాడు జితేంద్ర.

"అతన్ని మీరు విఆర్ఎస్ కౌన్సిలింగ్ చేయకుండా ఉండాల్సింది. పాపం చాలా బాధపడుతున్నాడు."

"బాధెందుకు? కౌన్సిలింగ్ ఎవరికీ మినహాయింపు కాదు. నాకూ బాధలున్నాయి. నేనెవరికి చెప్పుకోను?"

"ఏమిటీ?"

"విఆర్ఎస్ స్కోరింగ్ రేటు ఈమధ్య ఏమాత్రం పెరగకపోవడంతో నాకు బిపి పెరిగిపోతోంది. ఢిల్లీ అధికారుల ఒత్తిడికి నా రక్తనాళాలు చిట్లిపోతాయనిపిస్తోంది. ఏం చెప్పమంటావు మా బాధలు?

"తొలుత కొందరిని ఏ విధంగా విఆర్ఎస్‌పై బయటకు పంప గలిగినా రాను రాను కష్టతరమవుతోంది. స్వచ్ఛంద పదవీ విరమణని నిర్బంధంగా అమలు చేయడానికి పథకాలు వేయక తప్పలేదు. ఉద్యోగుల పాత రికార్డులు (అటెండెన్స్, యల్.టి.సి. క్లెయిమ్‌లలోని అవకతవకలు వగైరా) బయటకు తీసి భయపెట్టడాలు, బదిలీల బెదిరింపులు, ఉద్యోగి కుటుంబ ఆర్థిక పరిస్థితులపై దాడిచేసి మానసిక ఒత్తిడి కలిగించడాలు సాగిస్తుంటే... యూనియన్ పక్కలో బల్లెమై ప్రతిఘటిస్తోంది.

"నారాయణ పియఫ్ లోనుకి అప్లయి చేయడంతో అతనిపై విఆర్ఎస్ అస్త్రం ప్రయోగించడం జరిగింది."

"నారాయణ పనితనాన్ని గొప్పగా ఆకాశానికెత్తే మీరు... అతణ్ణి విఆర్ఎస్‌పై బయటకు పొమ్మనడం విడ్డూరంగా ఉంది. అతనిలాంటి పనిమంతులు లేకపోతే ప్రొడక్షన్ దెబ్బతినదా? కంపెనీ నష్టాల్లోకి కూరుకుపోదా," అని అడిగింది సుజాత.

గట్టిగా నవ్వేశాడు జితేంద్ర.

"నాకిప్పుడు పనిచేసే నారాయణకి పనిచేయని పుల్లారావుకి తేడా లేదు. అందరూ ఒకటే. రేపు ఈ కంపెనీ ప్రైవెటైజ్ అయ్యాక చచ్చినట్టు అందరూ కష్టపడి పనిచేస్తారు. అంతేకాదు హైర్ అండ్ ఫైర్ సిస్టంలో... ఎంత గొప్ప పనిమంతుడైనా సరే అవసరం లేనప్పుడు నిర్దాక్షిణ్యంగా బయటకు తోసివేయబడతాడు. ఇక ఉత్పత్తి అంటావా? అది రేపు ఈ కంపెనీని కొనేవాడు చూసుకుంటాడు. ప్రస్తుతం నా గోల్ అది కాదు. ఉద్యోగులను ఎంతవరకు తగ్గించగలమో అంతవరకు తగ్గించి... ఈ కంపెనీని అమ్మకానికి సింగారించి సిద్ధం చేయడమే."

"కార్మికులు ప్రైవేటైజేషన్‌కి వ్యతిరేకంగా వివిధ రూపాల్లో ఆందోళన చేయడం మీరు చూస్తున్నారు. వాళ్ళ ఆక్రందనని పట్టించుకోరా."

జితేంద్ర మళ్ళీ నవ్వి, "ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు కంపెనీ అమ్మకాన్ని ఏమాత్రం ఆపలేవు. ఈరోజు పేపర్లో వార్త చూడు," అంటూ తనతో ఆఫీసు నుంచి తీసుకు వచ్చిన ఎకనమిక్స్ టైమ్స్ పేపరును ఆమెకు చూపించాడు.

చూసి... చదివి... నిశ్చేష్టురాలైంది సుజాత.

ఆ పబ్లిక్ సెక్టార్‌ని ప్రైవేటీకరించబోతున్నట్టు డిపార్టుమెంట్ ఆఫ్ డిజిన్వెస్ట్‌మెంట్ మంత్రిగారు స్పష్టంగా ప్రకటించారు. అందుకు సంబంధించి బిడ్స్ సేకరణ, నెగోషియేషన్స్, తదితర ఫార్మాలిటీస్ అన్నీ గవ్‌చువ్‌గా, గోప్యంగా, వేగంగా, సవ్యంగా సాగిపోతున్న వైనం పేపర్లో వివరించబడింది.

"ఇపుడేమంటావ్?" అంటూ వికవిక నవ్వాడు జితేంద్ర.

ఆ నవ్వుకి ప్రతిధ్వనిగా యుద్ధభేరి మోగినట్టు అనిపించింది ఆమెకు.

బాధతో, కోపంతో, కసితో, ఆత్మగౌరవంతో, త్యాగభావనతో, దేశ భక్తితో, తపనతో కార్మికులు ఒక పోరాటానికి సమాయత్తం కాబోతున్నట్టు అనిపించింది.

"శ్రామికులకు మంచిరోజులు తప్పక వస్తాయి," అన్నది సుజాత.

చైఎత్తి జైకొట్టు తెలుగోడా !
గతమెంతో ఘనమైన కీర్తి కలవోడా !!

1977 లో ప్రారంభమై

తెలుగు భాషా సంస్కృతి అభివృద్ధికి
అపారమైన కృషి సలిపి

ప్రపంచ తెలుగు జాతి గర్వించదగ్గ సంస్థగా
ఎదిగింది తానా



1977 లో ప్రారంభమై

తెలుగు భాషా సంస్కృతి అభివృద్ధికి
అపారమైన కృషి సలిపి

అమెరికా తెలుగు జాతి గర్వించదగ్గ సంస్థగా
ఎదిగింది డి.టి.ఎ

ఈ రెంటి సమ్మేళనంలో జరిగే అద్భుతమే
ఈ నాటి 15వ తానా సంబరాలు

విచ్చేసిన మీ అందరికీ స్వాగతం, సుస్వాగతం
తానా, డి.టి.ఎ సంస్థలకు శుభాకాంక్షలు
శ్రమించిన కార్యకర్తలకు అభినందనలు

సునిల్ కోనేరు

జీవనది

సాయిబ్రహ్మానందం గొర్తి

మళ్ళీ నాకు హైదరాబాద్ ప్రయాణం పడింది. ఇంటికి ఫోన్ చేసి నా భార్య హరితతో చెప్పాను, నా ప్రయాణానికి బట్టలు సిద్ధం చేయమని. రాత్రి ఫ్లయిట్‌కి బయల్దేరాల్సి వస్తుంది. అదీ టిక్కెట్టు కన్‌ఫర్మ్ అయితేనే ఈ ప్రయాణం ఉంటుంది. నా కొలీగ్ డాక్టర్ రాజన్ వాళ్ళ అల్లుడు ఎయిర్‌పోర్ట్ డ్యూటీ ఆఫీసరు. టిక్కెట్టు ఖచ్చితంగా దొరుకు తుందని రాజన్ హామీ ఇచ్చాడు. ఈలోగా నాకు మెడినోవా హాస్పిటల్ నుండి వంద కాల్స్ వచ్చాయి, 'నేను బయల్దేరి వస్తున్నానా, లేదా?' అని.

నేను రేపు ఉదయం మెడినోవాలో నేదునూరి రఘురాంకి బైపాస్ సర్జనరీ చేయాల్సి ఉంది. నేదునూరి రఘురాం అంటే ప్రముఖ తెలుగు సినీ రచయిత. నేటి యువతరాన్ని ఉర్రూతలూగిస్తున్న మహాకవి. తెలుగు చిత్రాలకి పాటల దగ్గర్నుంచి, మాటలు, స్క్రీన్‌ప్లే వరకు అన్ని విభాగాల్లోనూ ఆయనకి విపరీతమైన పేరు ఉంది. అదీ కాకుండా తెలుగు చలనచిత్ర సీమలో ఈ కవిగారి చేత మాటలు, పాటలు రాయిస్తే సినిమా ఖచ్చితంగా వందరోజులాడుతుందన్న సెంటిమెంటు కూడా సినీ పరిశ్రమలో బలంగా నాటుకుపోయింది. ప్రస్తుతం ఈ కవిగారి హవా బాగానే ఉంది! ఈ మహాకవి రఘురాంగారితో పరిచయం నాకు నెల్లాళ్ళ క్రిందట హైద్రాబాదు లో కార్డ్‌యాలజిస్టుల కాన్ఫరెన్సు కెళ్ళినప్పుడు నా స్నేహితుడు ఒకాయన, మెడినోవాలో డాక్టర్ ద్వారా పరిచయం.

సినీకవి రఘురాం రెగ్యులర్ చెకప్‌కని మెడినోవాకి వస్తే హార్ట్‌బీట్ తేడా ఉందని ఇసిజిలో బయటపడింది. డాక్టర్లకి అనుమానం వచ్చి మరిన్ని టెస్ట్‌లు చేస్తే రఘురాంకి ఎంత తొందర్లో బైపాస్ సర్జరీ చేస్తే అంత మంచిదని డాక్టర్లు చెప్పారు. సరిగ్గా అదే సమయానికి నేను హైద్రాబాదు వెళ్ళడం, నా స్నేహితుడు నేనొక



ప్రముఖ కార్డియాలజిస్టునని రఘురాంకి పరిచయం చేయడం జరిగింది. నేనే ఇంతకుముందు మాజీ మంత్రి ఒకాయనకి బైపాస్ చేశానని, నా హస్తవాసి చాలా మంచిదని నా స్నేహితుడు రఘురాం కవిగారికి చెప్పాడు. అసలే సినిమావాళ్ళకి ఇలాంటి సెంటిమెంట్లు ఎక్కువని చదివాను. నా విషయం తెలిశాక రఘురాం నన్ను జలగలాగ పట్టుకున్నాడు. నేనే ఆయనకు బైపాస్ చెయ్యాలని పట్టుబట్టి మరీ హైద్రాబాదుకు రప్పించుకుంటున్నాడు. ముందుగా నేను ఈ సర్జరీ చేయడానికి తటపటాయించినా, నా స్నేహితుని బలవంతం మీద ఒప్పుకున్నాను. కానీ ఈలోగా ఓ చిన్న హార్ట్ ప్రాబ్లం వస్తే రఘురాం హాస్పిటల్‌లో జాయినయ్యాడు. నా స్నేహితుడు బైపాస్ వెంటనే చేయాలని చెబితే ఉన్నట్లుండి ప్రయాణం కట్టాను.

ఏం చెయ్యాలో తోచక పక్కనే ఉన్న స్టాల్లోకి అడుగుపెట్టాను, ఏమైనా పుస్తకాలు కొందామని. ఇండియా టుడే కొత్త సంచిక వచ్చింది. అక్కడే తెలుగు ఇండియా టుడే కూడా నా కంటపడింది. నాకు తెలుగు పుస్తకాల మీద అభిమానం కొద్దీ అవే శీర్షికలు అయినా కొన్నాను.

హాస్పిటల్‌లో త్వరగా పేషంట్లని చూడడం ముగించుకొని ప్రయాణానికి సిద్ధం అవుతుండగా, నా బాల్య స్నేహితుడు రాజు ఫోన్ చేశాడని, నన్ను తిరిగి ఫోన్ చెయ్యమన్నాడని హరిత చెప్పింది. రాజు నా మిత్రుడు. మేమిద్దరం అమలాపురంలో పదో తరగతి వరకూ కలిసి చదువుకున్నాం.

ఎయిర్‌పోర్ట్‌కొచ్చి చెకిన్ చేశాను. ఫ్లయిట్ గంట ఆలస్యంగా బయల్దేరుతుందని తెలిసింది. ఈలోగా హైద్రాబాదు ఫోన్ చేసి విషయం చెప్పాను.

ఏం చెయ్యాలో తోచక పక్కనే ఉన్న స్టాల్లోకి అడుగుపెట్టాను, ఏమైనా పుస్తకాలు కొందామని. ఇండియా టుడే కొత్త సంచిక వచ్చింది. అక్కడే తెలుగు ఇండియా టుడే కూడా నా కంటపడింది. నాకు తెలుగు పుస్తకాల మీద అభిమానం కొద్దీ అవే శీర్షికలు అయినా కొన్నాను.

ఏముందా అని తిరగేస్తుంటే అపరిచితులు అనే కథ నా దృష్టిలో పడింది. రచయిత ఎవరా అని చూస్తే నాగరాజు భాష్యం అని ఉంది. నాగరాజంటే నా స్నేహితుడు రాజే. కథ వెనుక రచయిత పరిచయం చూసేక మా రాజు అనే తేలింది. నాకు చాలా సంతోషం వేసింది. కథ చదివాను. చాలా బాగా రాశాడు.

పరీక్ష తప్పితే ఆత్మహత్య చేసుకుందామనుకున్న ఒక అమ్మాయికి మరలా జీవితం మీద అవగాహన కలిగించే సంఘటన మీద రాసిన కథ. కథలో శిల్పం, శైలి నన్ను హత్తుకున్నాయి. రాజు ఓ మంచి రచయిత. తెలుగు భాష అన్నా, సాహిత్యం అన్నా చెవి కోసుకుంటాడు. మేం పదో తరగతిలో ఉండగానే కంద పద్యాలు అవీ రాసేవాడు. మా తెలుగు మాష్టారి అభిమాన శిష్యుడు రాజు. నాకు పుస్తకాలు చదివే అలవాటు ఉండడం వల్ల మా స్నేహం మరింతగా పెరిగింది. నేను మెడిసిన్ చదవడానికి వైజాగ్ వచ్చేశాను. రాజు మాత్రం భాషా ప్రవీణ చేసి తెలుగు మాష్టారుగా అల్లవరంలో స్థిరపడిపోయాడు. రాజు పేరు చూడగానే ఉదయం ఫోన్ చేశాడని హరిత చెప్పిన విషయం గుర్తుకొచ్చింది. వెంటనే సెల్‌ఫోన్ తీసి రాజుకి కాల్ చేశాను.

"రాజూ! నేనురా రవిని!"

"ఓ నువ్వా! ఉదయం ఫోన్ చేస్తే హరితగారు చెప్పారు, నువ్వు సెల్ ఇంట్లో మర్చిపోయి హాస్పిటల్‌కి వెళ్ళావని. ఎలా ఉన్నావు?"

"బాగానే ఉన్నా. ఒరేయ్ నీ అపరిచితులు కథ చదివాను. చాలా బాగుంది. చూశావా, నువ్వు తప్ప ఇంత బాగా ఎవరు రాయగలరు చెప్పు?" నవ్వుతూ అన్నాను.

"నీకు నేనంటే ఉన్న అభిమానం అటువంటిది. ఇండియా టుడేలో కథ వచ్చింది, చదువు అని చెప్పడానికే ఈ ఉదయం కాల్ చేశాను. అంతకు మించి ప్రత్యేకించి ఏంలేదు.

"అభిమానం కాదు. నేనూ పుస్తకాలు చదువుతాను. నీలా కథలు రాసేవాళ్ళు చాలా తక్కువమంది ఉన్నారు. ఇదే నువ్వు ఏ ఇంగ్లీషులోనైనా రాస్తే నీకు మంచి ఆదరణ, కీర్తి లభించేవి."

"నాలా రాసేవాళ్ళు అనేకమంది ఈ ఆంధ్ర దేశంలో ఉన్నారు. కేవలం బద్ధకమో లేక రాయాలన్న తపన లేకో రాయడం లేదంతే! నేను కూడా, దాదాపు ఇరవై ఏళ్ళ తర్వాత మరలా రాయడం మొదలుపెట్టాను. అదీ నీ ప్రేరణ వల్లే! ఇరవై ఏళ్ళ తర్వాత మరలా నీ దర్శనంతో అంతా మారిపోయింది. నీతో మాట్లాడిన తరువాత నేనేం కోల్పోయానో తెలిసింది. మరలా సాహిత్య తీరాలు దర్శించడం నీ వల్లే జరిగింది. ఒక రకంగా నా సాహిత్య పున: ప్రవేశానికి నాంది పలికింది నువ్వే. అందుకే ఇరవై ఏళ్ళ తర్వాత మొదటి కథ అచ్చులో పడితే థాంక్స్ చెబుదామనే కాల్ చేశాను. థాంక్స్ ఫర్ యువర్ ఇన్‌స్పిరేషన్!"

"నాదేముంది! రాసింది నువ్వు. ఒక్కోసారి మన శక్తి మనకు తెలియదు. కష్టాలు, సమస్యలు, బంధాలు, బాధ్యతలు ఎక్కువై, సంసార వలయంలో చిక్కుకున్నప్పుడు, నిరాశలో మనం మనకున్న కొన్ని ప్రత్యేకమైన అభిరుచులు, ఇష్టాలు వదిలేసుకుంటాం! నీ విషయంలో ఇదే జరిగిందని నా అభిప్రాయం. అయినా నీలాంటి వాళ్ళ అవసరం సమాజానికి ఎంతో ఉంది."

"సమాజానికి నీలాంటి డాక్టర్ల సేవలు అవసరం కానీ నా లాంటి రచయితల అవసరం ఉందని అనుకోమంటావా?" ప్రశ్నించాడు రాజు.

"మా అవసరం ఆరోగ్యం వరకే. కానీ నీలాంటివాళ్ళ రచనల ప్రభావం మనిషి మీద, ఈ సమాజం మీద చాలా ఉంటుంది."

"చదివితే కదా ప్రభావం ఉండేది. ఈ ఆంధ్రదేశంలో సగానికి పైగా జనాలకి తెలుగు చదవడం రాదు. చదివినా నాలాంటి వాళ్ళ రచన్లు చదివే తీరికా, ఆసక్తి లేనేలేవు. అలాంటప్పుడు నాలాంటి వాళ్ళు రచనలు చేసినా చేయకపోయినా సమాజానికి అంత తేడా ఉండదు."

"ఇది నేనొప్పుకోను. రాస్తేనే కదా ప్రజలు చదివేది. రాయకుండా చదవలేదనుకోవడం అన్యాయం. నా దృష్టిలో తేడా కొంతైనా ఉంటుంది.

"అసలు ఈ ఆంధ్రదేశంలో సినిమాలు తప్ప పుస్తకాలు చదివే అలవాటు పోయింది. ఒకవేళ చదివినా, సినిమా కబుర్లు లేదా విజ్ఞానం పేరుతో సెక్స్ శీర్షికలు చదివేవాళ్ళే ఎక్కువ. సగంమందికి పైగా తెలుగు రాయలేరు, చదవలేరు. రాసే కొద్దిమందీ తప్పులు తడకలతో రాస్తున్నారు. ఈ మధ్యనే ఒక పత్రికలో సాహితీ వైద్యం అని ఒక శీర్షిక చదివాను.చదివితే నవ్వొచ్చింది. నిజంగా తెలుగు సాహిత్యానికి జబ్బు చేసిందనిపించింది." ఈ మాటల్లో కొంత బాధ, వేదన కనిపించాయి నాకు.

"సాహితీ వైద్యమా! బాగుందే. మనుషుల్లా సాహిత్యానిక్కూడా రోగాలు వస్తాయన్నమాట," నవ్వుతూ అన్నాను. అవతలివైపు నుండి రాజు నవ్వు చిన్నగా వినిపించింది.

"సాహిత్యానికి అనారోగ్యం కాదు. మనకి, మన మనసులకి, మనసులో పుట్టి ఊహల్లోంచి ఉద్భవించేదే కదా కవిత్వం! ఎప్పుడైతే అన్నీ తెలుసు అనుకోవడం ప్రారంభించామో అప్పుడే మన పతనానికి మనమే మెట్లు కట్టుకుంటున్నామన్నమాట. ఆలోచనల్లకి ఏ రంగు పులిమితే ఆ రంగులోనే మన భావాలూ బయటకొస్తాయి. నేటి తెలుగు భాషకి లభిస్తున్న ఆదరణ చూస్తే బాధ కలుగుతుంది రవీ!"

"నీలాంటి కళాకారులు బాధపడాలి రాజూ! బాధలోంచే అమృతం పుట్టచ్చు. గొప్ప సాహిత్యం రావచ్చు. ఆరోజు త్వరలోనే వస్తుందని ఆశిద్దాం!'

'

"ఒరేయ్! రవీ చెప్పడం మర్చిపోయా. మన పక్కింట్లో ఉండే డాన్స్ మాస్టారు, అదేరా తెలుగు మాస్టారి భార్య పోయిందిరా!"

అమలాపురంలో మా పక్కింట్లో తెలుగు మాస్టారు ఉండేవారు. ఆయనకి కూచిపూడి నాట్యంలో మంచి ప్రావీణ్యత ఉండేది.

"అయ్యో పాపం! నీకు గుర్తుందా డాన్స్ మాస్టారి కథ రాస్తాను అనేవాడివి. రాశావా?"

"లేదురా! నే పోయేలోగా ఆయన కథ ఎప్పటికైనా ఒక నవలగా రాయాలన్నదే నా కోరిక. నా దృష్టిలో అది కథ కాదు. జీవిత పరిణామాల మధ్య అంతర్లీనంగా ప్రవహించే ఓ ఆత్మకథ! నిన్నంతా ఆయనే గుర్తు కొచ్చారు. బాధేసింది..." రాజు కంఠం మారింది.

మా తెలుగు మాస్టారు చనిపోయి దాదాపు ఏడేళ్ళు దాటింది. ఆయన భార్య కూడా చనిపోయిందన్న విషయం తెలిసి బాధ కల్గింది.

ఈలోగా చెకిన్ అనౌన్స్‌మెంట్ చేయడంతో రాజుకి బై చెప్పి చెకిన్ ద్వారం వైపు నడిచాను.

✤

నేదునూరి రఘురాం బైపాస్ సర్జరీ విజయవంతంగా అయ్యింది. రఘురాంకి స్పృహ వచ్చాక కృతజ్ఞతాపూర్వకంగా నావైపు చూశాడు. ఆయన కళ్ళ నుండి కన్నీళ్ళు కారడం గమనించాను. నా చేతులు పట్టుకున్నాడు. నాకివన్నీ అలవాటే! అంతగా కంగారు పడవలసిందేమీ లేదని నేను హైద్రాబాదులో ఇంకో నాలుగు రోజులు ఉంటానని చెప్పాను. నా మాటలు విని ఆయనకి కాస్త ధైర్యం వచ్చినట్లనిపించింది. నా స్నేహితుడు ఆపరేషన్ సక్సెస్ అయ్యాక కవి రఘురాం ఎదుట నన్ను పొగడడం మొదలుపెట్టాడు. నాకిలాంటివి అంతగా నచ్చవు. నా వృత్తి ధర్మం నేను నిర్వర్తించానంతే అనిపిస్తుంది.

రెండు రోజుల తర్వాత కవి రఘురాం బాగా కోలుకున్నాడు. ఆయన్ని పరామర్శించడానికి చాలామంది సినిమావాళ్ళు క్యూ కట్టారు. రఘురాంకి ముందుగానే హెచ్చరించాను. ఆయనకి రెస్టు బాగా కావాలనీ, ఇక ఈ విజిటర్స్‌ని కాస్త అడ్డుకోమనీ, ఆయన సెక్రటరీకి చెప్పాను. మూడోరోజు నుండి రఘురాం మాట్లాడడం మొదలుపెట్టాడు. ఇక నా ప్రయాణం దగ్గర పడుతోందని, రేపు రాత్రి ఫ్లయిట్‌కి నేను ఢిల్లీ వెళు తున్నానని చెప్పాను.

నేను వెళుతున్నానని చెప్పగానే, "నాకోసం ప్రత్యేకంగా ఢిల్లీ నుండి వచ్చి ఈ ఆపరేషన్ చేసినందుకు నేను మీకు రుణపడి ఉంటాను. మీకు ఎప్పుడు ఏ సహాయం కావాలన్నా అడగండి. తప్పకుండా చేస్తాను..."

ఇక మాట్లాడవద్దన్నట్లు సంజ్ఞ చేశాను. పక్కనే ఉన్న కవి రఘురాం సెక్రటరీ, "చూశారు కదా! మా సార్ ఇమేజ్! మొత్తం సినీ పరిశ్రమ అంతా కదలి వచ్చింది. మా కవిగారంటే మాటలా? ప్రస్తుతం ఈ ఏడాది అయిదు సూపర్‌హిట్ సినిమాలు ఈయన రాసినవే!" పొగడ్తల పుస్తకం తీశాడు.

వస్తానని చెబుతూ బయటకు వస్తుండగా ఎందుకో నాకు రాజు గుర్తుకొచ్చాడు. రాజు కూడా మంచి రచయితే. కానీ రఘురాంగారికున్న ప్రజాదరణ మామూలు రచయితలకి లేదు. ఆయన కేవలం సినిమాలకే పరిమితం. రాజులాంటి వాళ్ళు తెలుగు సినిమా పరిశ్రమకి వస్తే - ఎంతో పేరు, గుర్తింపు వచ్చే అవకాశం ఉంది. ఈ ఆలోచన తట్టగానే వెనక్కి వాలాను.

నేను మరలా వెనక్కి తిరిగి రావడం చూసి నేనేమైనా మర్చిపోయానా అన్నట్లుగా చూశారు కవి రఘురాం, ఆయన సెక్రటరీ.

నా స్నేహితుడు రాజు గురించి, అతని రచనల గురించి వివరంగా చెప్పాను.

✤

నేను అనుకున్నట్లుగా ఢిల్లీ వెళ్ళలేదు. నా ప్రయాణం కాన్సిల్ చేసుకున్నాను. రాజు ఈ సాయంత్రం హైద్రాబాదు వస్తున్నాడు. ఓ అరుదైన అవకాశం అతని ముందు వాలిందన్న కబురు పంపాను.

సాయంత్రం కారు తీసుకొని రైల్వే స్టేషన్‌కి వెళ్ళి రాజుని రిసీవ్ చేసుకున్నాను. నన్ను చూడగానే ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నాడు రాజు. కారులో హోటలికి వస్తుండగా నేను విషయం చెప్పడం మొదలు పెట్టాను.

"రాజూ! నాకు ప్రముఖ సినీకవి నేదునూరి రఘురాం బాగా తెలుసు. వారం క్రితం నేనాయనకి బైపాస్ సర్జరీ చేయడం కోసం హైద్రాబాదు వచ్చాను. నీ గురించి నాకు పూర్తిగా తెలుసు. డబ్బులేక ఎన్ని కష్టాలు పడ్డావో, మీ నాన్నగారు పోయాక చెల్లెళ్ళ పెళ్ళి బాధ్యతలే కాదు, నీ తమ్ముళ్ళని మంచి ప్రయోజనకులుగా చేయడంలో నువ్వెంత అలసి పోయావో తెలుసు. మీ పెద్దమ్మాయికి మెడిసిన్ సీటు వచ్చినా ఆర్థిక ఇబ్బందుల వల్ల చదివించలేనంటే, మీ పెద్దమ్మాయి చేసిన ఆత్మహత్యా ప్రయత్నం గురించీ నాకు తెలుసు. అంతేకాదు, బాధ్యతలు, బంధాల మధ్య నువ్వెంత నలిగిపోయావో అంతా తెలుసు. నేదునూరి రఘురాం పేరున్న రచయిత. నువ్వు ఆయన దగ్గర అసిస్టెంట్‌గా పని చేయాలి. అసిస్టెంట్ అంటే ఆయన పనిచేసే సినిమాలకి మాటలు రాయడం, సీన్లు రాయడం వగైరా పనులుంటాయి. కానీ, ఆయనకి కొన్ని నియమాలున్నాయి. నువ్వు ఆయనతో కాంట్రాక్ట్ సైన్ చెయ్యాలి. ఇంకెవ్వరి దగ్గరా పని చేయనని..."

కాంట్రాక్ట్ అనగానే రాజు మధ్యలో అడ్డుకున్నాడు. "అంటే, ఈ కాంట్రాక్ట్ ఎన్నేళ్ళు?"

"ఆయనకి సినిమాలు రెండు చేతులా ఉన్నంతవరకూ! ఆయన ఈ సినిమా పరిశ్రమ వదులుతాడని నేననుకోను. అంటే జీవితాంతం అన్నమాట..."

"జీవితాంతమా? అయినా ఈ కాంట్రాక్ట్ లేమిటి... మనిషి మీద నమ్మకం ఉండాలి కానీ..."

"ఈ తెలుగు సినిమా పరిశ్రమ ఇంతే! నువ్వు ఎవరికైనా కథ చెప్పావనుకో, బాగుంటే నీకు తెలియకుండా షూటింగ్ కూడా పూర్తి

చేసేస్తారు. ఇక్కడ ఇలాంటివి సర్వ సాధారణం. అందుకే సినిమా రిలీజు అయ్యేవరకూ అంతా సీక్రెట్‌గానే ఉంటుంది వ్యవహారం. అయినా నువ్వు కాంట్రాక్ట్ రాయడానికి నీకున్న అభ్యంతరం ఏమిటి?''

నేను సూటిగా అడిగేసరికి రాజు ఏం చెప్పలేక తలదించుకున్నాడు రాజు. ''అభ్యంతరమంటూ ఏమీలేదు. ఒక రచయితని ఇలా కాంట్రాక్ట్ లో కట్టేయడమన్న ఆలోచనే జీర్ణించుకోలేకపోతున్నాను. ఇందులో నా పనికి దీనికీ ఉన్న లింకు, దాని పరిణామాలు ఏమిటా అన్నదే ఆలోచన...''

''అంతగా ఆలోచన దేనికి? నువ్వు కథలు, మాటలు అందిస్తావు. కాని తెర మీద నేదునూరి రఘురాం పేరుంటుంది. నువ్వు పాటలు రాస్తే, రఘురాంగారి పేరు మీదుగా రాగాలు అల్లుకుంటుంది... నీకు మాత్రం చేసిన పనిని బట్టి ప్రతి పనికి డబ్బు ముట్టజెబుతారు...'' వివరాలు చెప్పాను.

''అంటే - నా పేరు ఎక్కడా ఉండదా? నే రాయడమేమిటి, ఇంకోరి పేరు మీద ప్రజలకు అందించడమేమిటి? ఇలా చేస్తే రచయితగా నన్ను నేను చంపుకున్నట్లే కదా?''

''చంపుకోవడం ఎలా అవుతుంది? ఇంకొకరికి రాసిస్తున్నావంతే. నాకు తెలిసి చాలామంది పేరున్న రచయితలు ఇలాగే పని చేస్తారు. అంతెందుకు, అంతర్జాతీయంగా తన కథకి పేరొచ్చిన ఓ ప్రముఖ రచయిత ఇంకో ప్రముఖ దర్శక శిఖామణి గారికి ఘోస్ట్ రైటర్! అయినా నువ్వు కథలు రాస్తే పారితోషికం తీసుకోవడం లేదు? అదీ ఇలాంటిదే అనుకో!'' సర్దుకోలుగా చెప్పాను.

రాజు ఈ కాంట్రాక్ట్‌కి ఎక్కడ తిరస్కరిస్తాడోనని నా భయం.

''రవీ! ఎందుకో నాకు భయంగా ఉందిరా! రాయడం మానేసి మరలా మొదలుపెడితే ఇలా ఘోస్ట్ రైటర్‌గా మిగులుతున్నానా అని పిస్తోంది.''

''నాకు తెలుసు రాజూ నీ సంశయాలు! అయినా తప్పదు. నీ అవసరాలు అటువంటివి. ఈ కాంట్రాక్ట్ చేయడం వల్ల మీ అమ్మాయి మెడిసిన్ చదివే అవకాశం ఉంది. మీ అబ్బాయిలిద్దరూ మంచి చదువు చదివే సావకాశం ఉంది. వదులుకోకు. ఎవర్నీ నేను సహాయం అర్థించను. నీ కోసం నోరు విడిచి అడిగాను. పాపం రఘురాంగారు కూడా సరే నన్నారు.''

రాజు సెంటిమెంట్‌పై చిన్నగా తట్టాను. నాకేసి బాధగా చూశాడు.

''కాదనకు రాజూ! ఇదొక మహత్తర అవకాశం. మరలా మరలా రాదు. రచయితగా విలువలు, ఆత్మాభిమానాలు పక్కన బెట్టు. నా మాట కాదనకు!'' ప్రాధేయపడుతున్నట్లుగా అడిగాను.

రాజు నా చేతి మీద చేయి వేశాడు సరేనన్నట్లుగా!

✤

తరువాత నాకు హైద్రాబాదు వెళ్ళే అవకాశమే రాలేదు. రాజు అల్లవరం నుండి హైద్రాబాదు మకాం మార్చేశాడు. మేమిద్దరం తరచు ఫోన్‌లో మాట్లాడుకునేవాళ్ళం. మొదట్లో సినిమా సంస్కృతి అర్థం కాక పోయినా నెమ్మది నెమ్మదిగా లోతులు తెలిశాయి రాజుకి. 'ఎవరెలా ఉన్నా నీ కనవసరం నీ పని నువ్వు చేసుకుపో! ఆఫీసు కెళుతున్నట్లే అనుకో' అని చెప్పాను.

రాజుని కలవడం ఈమధ్య కాలంలో కుదర్లేదు. నేను లండన్ వెళ్ళాను ఓ ఆర్నెల్లు. రాజు కూడా తెర వెనుక బిజీ అయ్యాడు. మామధ్య మాటలు తగ్గాయి. లండన్ నుండి వచ్చాక ఊపిరి సలపనంత పని ఉండేది. కొత్తగా కేంబ్రిడ్జి యూనివర్సిటీలో నేను విజిటింగ్ ప్రొఫెసర్‌గా ఎన్నుకో బడ్డాక కాస్త పని పెరిగింది.

ఓరోజు నేను హాస్పిటల్‌కి వెళ్ళినప్పుడు మా కొలీగ్ ఒకాయన నా దగ్గరకొచ్చి, ''డాక్టర్ రవీ! ప్రస్తుతం ఢిల్లీలో అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ జరుగుతోంది. నా దగ్గర మూడు టిక్కెట్లున్నాయి. నాకు ఒక సర్జరీ ఉంది. మీకు కుదిరితే వెళ్ళండి,'' అంటూ టిక్కెట్లు చేతిలో పెట్టాడు.

హరితకి ఫోన్ చేస్తే వెళదాం, పని త్వరగా ముగించుకొని వెంటనే రమ్మనమంది. ఆ సాయంత్రమే ఆఖరి రోజని వెళ్ళాక తెలిసింది. ఏ సినిమాలు ఉన్నాయో అని లిస్ట్ చూస్తే, అందులో జీవనది అనే తెలుగు సినిమా కూడా ఉంది.

'బెడ్డూ జాం, బెడ్డూ జాం' అంటూ ద్వందార్థాల నుండి బయటపడి ఈ అంతర్జాతీయ సినిమావైపు మన తెలుగు సినిమా ఎప్పుడు ప్రవేశించిందా అనిపించింది. మేం వెళ్ళేసరికి ఆలస్యం అయింది. గబగబా హాల్లో దూరాం. అప్పటికే టైటిల్స్ అయిపోయాయి. సినిమా మొదలయ్యింది.

వేగం పెరిగిన జీవితాల మధ్య ఇమడలేక, వంశపారంపర్యంగా వచ్చిన నాట్యాన్ని వదులుకోలేక, గుర్తింపు లేని కళాకారుడి జీవిత గాధే ఈ జీవనది. ఈ కథ చూస్తే, నాకూ, మా రాజుకీ తెలిసిన, మా పక్కింట్లో నాట్యం నేర్పే తెలుగు మాష్టారు గుర్తొచ్చారు. రాజు ఆయన జీవిత చరిత్ర నవలగా రాస్తానని అనేవాడు.

కొంపతీసి ఈ కథ నేదునూరి రఘురాంగారికి ఇచ్చేశాడా? గబగబా బయటకొచ్చి సినిమా పోస్టర్ చూశాను. అనుకున్నంతా అయింది. స్క్రీన్ ప్లే దగ్గర నేదునూరి రఘురాం అన్న నల్లటి అక్షరాల అడుగున రాజు పేరు భూస్థాపితం అయినట్లనిపించింది నాకు.

జీవనది సినిమాకి అంతర్జాతీయ అవార్డ్ వచ్చిందని అప్పుడే తెలిసింది. నా మనసెందుకో రోదించింది. ఈ అవార్డ్ నిజానికి మా రాజుకి దక్కాల్సింది. రాజు సెల్‌కి కాల్ చేస్తే మెసేజ్‌కి వెళిపోతోంది.

ఇంటికి బయల్దేరి వస్తుండగా హరిత అంది.

''ఈ సినిమా చూస్తే మీ ఊళ్ళో మీ పక్కింటి తెలుగు మాష్టారి కథలా అనిపించింది నాకు. ఈ సినిమాకి నేదునూరి రఘురాంకి అవార్డు ఇచ్చారు. మీ ఫ్రెండ్ ఆయన దగ్గర పని చేస్తున్నాడని చెప్పారుకదా! బహుశా రాజుగారే ఈ కథ ఆయనకి అమ్మేసి ఉంటారు. అసలు ఈ అవార్డు మీ ఫ్రెండ్ రాజుకి దక్కాల్సింది. ఆత్మాభిమానం చంపుకొని, ఆయన ఈ కథ ఇంకోరి పేరు మీద ప్రపంచానికి అందేలా చేసి ఆయన లోని రచయితని చంపేశారు మీ ఫ్రెండ్ రాజు. ఈ పని చేసినందుకు ఆయన సిగ్గుపడాలి.''

''అంతగా ఆలోచన దేనికి? నువ్వు కథలు, మాటలు అందిస్తావు. కాని తెర మీద నేదునూరి రఘురాం పేరుంటుంది. నువ్వు పాటలు రాస్తే, రఘురాంగారి పేరు మీదుగా రాగాలు అల్లుకుంటుంది... నీకు మాత్రం చేసిన పనిని బట్టి ప్రతి పనికి డబ్బు ముట్టజెబుతారు...''

హరితకి తెలుసు, మా పక్కింటి తెలుగు మాష్టారి కథ. గతంలో నేనే చెప్పాను. మాటలు ముల్లుల్లా గుచ్చుకున్నాయి మనసుకి.

'రాజులో రచయితని చంపింది నేనే హరితా! సిగ్గుపడాల్సింది వాడు కాదు, నేను!' మనసు మౌనంగా రోదించింది.

*

రూపాంతరం

సడ్లపల్లె చిదంబర రెడ్డి

అనగా అనగా పూర్వానికి పూర్వం, కాలం మొదలైన ఆదికాల మంట! ఆ కాలంలో జనాలు సొంతంగ ఆలోశనసేసి బతికే తత్వం కానే కాదంట. తల్లి ఆవులు అడవికి పోతే ఏం సేసేదీ శాతగాక గోడల కింద కొమ్మల కింద గుంపులు గుంపులు సేరి దూడపెయ్యలు యట్ల ఎదురు సూస్తా వుంటావో అట్ల ఎవురో ఒచ్చి ఏదేదో సేస్తారంటాని ఎదురు సూసే రకం జనాలంట వాళ్ళు.

ఇట్లా జనాలు ఒగసారి అఖండమైన ఆర్తనాదాలు సేసుకొంట అన్నమూ నీళ్ళు యిడిసిపెట్టి, రాతిరనేది పగలనేది మరిసి భగమంతుని కోసరము ప్రార్థనలు సేసిరంట. శాన్నాళ్ళు సేసినంక సివరాకరికి ఒగనాడు దేవుడు ప్రత్యక్షమాయనంట.

అయ్యిందవుతూనే జనాల మింద కండ్లకొద్దీ కోపం సేసుకోని "ఏం జనాలు మీరు. ఇంకా మీరు మనుష్యులయ్యి బతికేది యాపొద్దు నేర్సు కొంటారు? పనులు సేసేకి సేతులిచ్చిండాను, ఆలోశన సేసేకి తలకాయి చ్చిండాను. ముందుకు సాగిపొయ్యేకి కాళ్ళిచ్చిండాను. కావలసింది తయారుసేసుకొనేకి బంగారట్లా బూమి తల్లినిచ్చిండాను... ఇట్ల ఒగటి గాదు రెండుగాదు మీరడిగినపుడల్లా ఏదో ఒగటి ఇచ్చీ ఇచ్చీ బేజారై పొయ్యింది. ఎవరో సేసే దయాదాక్షిణ్యాల మింద మీరు యంతకాలం బతుకుతారు? బతికినా అది మీ బతుకెట్లవుతుంది? ఇంక నుంచయినా మీ అంతకు మీరు బదికేది నేర్సుకొండి," అని అరిసి జడబీకి నేలకేసి కొట్టి మాయమయ్యేదానికి పాయనంట.



అపుడు జనాలు దేవుని కాళ్ళూ సేతులూ గడ్డమూ పట్టుకోని, "స్వామీ మాన్నభావా! ఇంక మీద ఏమీ కోరుకోము. ఇదే సివరి కోరిక. దీన్ని గనక మీరు పెద్ద మనసు సేసి తీర్సకుంటే ఈ భూమ్మీద మా మానవజాతే అంత రించిపోతుంది. యాలంటే ఈడ మాతోపాటే ఇంగొగు జాతిని పుట్టిచ్చిండావు. వాళ్ళు పనులు సేసిగాని, ఆకులూ, అలుములు తినిగాని బతికే రకం కాదు.

సింగరేణి బొగ్గులు మాదిరి గట్టి కండలు తిరిగిన శరీరము. సింత నిప్పుల మాదిరి యర్రగా ఉండే కండ్లు. ఎదురు బొంగులు నరికే ఉక్కు కొడవళ్ళ మాదిరి కోర పండ్లు. ఇనుపదూలాల మాదిరి తబ్బుల కందని కాళ్ళూ సేతుల్తో నల్లగ అడవి ఎనుప్పోతుల మాదిరి ఉండే రాక్షసులు వాళ్ళు.

"స్వామీ మాన్నభావా! ఇంక మీద ఏమీ కోరుకోము. ఇదే సివరి కోరిక. దీన్ని గనక మీరు పెద్ద మనసు సేసి తీర్సకుంటే ఈ భూమ్మీద మా మానవజాతే అంత రించిపోతుంది.

వాళ్ళు మా జోలికి యాపొద్దూ ఒస్తా వుండ్లేదు. గడ్డిమేసి బతికే జింకలు, దుప్పిలు, మేకలు, కుందేళ్ళు... ఇట్లా జంతువుల్ని సంపి తిని బతుకుతా వుండ్రి. వాళ్ళ బతుకును యా పొద్దూ మేము ఏలెత్తి సూపి ఎరగము. 'శివుని ఆజ్ఞ లేకుండ సీమ కూడా కరిసెల్లేదు,' అని మీరు యా జీవి యట్ల బతకల్లో, యట్ల సాయల్లో ముందే నిర్ధారణ సేసింటాడు అనుకోని ఊరికే వుంటిమి.

అయితే ఈ నడుమ పెద్ద అవాంతరం ముంచుకోనొచ్చింది. భూమ్మీదుండే జంతుజాలాన్నంతా వాళ్ళు తినేసి భూమిని నిర్జీవం సేసిండారు. ఇపుడు కనపడిన మా నరజాతిని పట్టుకోని సంపి కొరుక్కోని తింటా వుండారు. ఇది ఇట్లే సాగిపోతే మా జాతి కలికానిక్కూడ కనిపించుకుండ అయ్యి, ఆ రాక్షసజాతి పెరిగిపోతుంది. దయసేసి మా జాతి బతికి బట్టకట్టేదానికి ఒగ వరం ఇచ్చిపోండి స్వామీ," అని ఏడ్సుకొంట మొండికేశరంట.

దేవుడు అపుడు రవ్వంత శాంతపడి, "ఆ జీవులు ఈ జీవుల్ని తినగూడదు. ఈ జీవులు ఫలానా జీవుల్ని మాత్రమే తినల్ల. మేమే అందరి కన్న బాగా బతకల్ల. ఈళ్ళు ఇట్లే వుండల్ల అని గీతలు గీస్తా వుండారంటే ఈ సృష్టి రహస్యం మీకు సీమంత కూడా అర్థం కాలేదనిపిస్తుంది. అది అర్థం సేసుకొన్నపుడే మీరు నిజమైన మనుషులు మాదిరి బతుకుతారు. అది వేరే కత గాని... మీరు కోరినట్ల మీ జాతి జనాన్ని రాక్షసజాతి నాశనం సేయకుండ, అంతకు మించి మిమ్మల్ని సంపి తిన్నా కూడా మీ మాంసం వాళ్ళ శరీరాలకి ఒంటకుండ వాంతులూ బేదులూ అయ్యి వాళ్ళు సచ్చి పోతారు," అని సెప్పి దేవుడు మాయమైపాయనంట.

హమ్మయ్య మా జాతికింక భయంలేదని హాయిగా ఊపిరి పీల్సు కొనిరంట జనాలొగపక్క. ఇంగొగుపక్క జంతువులు సిక్కక జనలని తినే రాక్షసజాతి వాంతులూ విరేశనాలూ అయ్యి వరసబెట్టి సచ్చేది మొదలు పెట్టెనంట.

ఇట్లయితే అయ్యేల్లేదని సెప్పి వాళ్ళు గూడ దేవున్ని ప్రార్థన సేసేకి మొదలు పెట్రంట. మళ్ళట్ల ప్రార్థన సేసేకి మొదలు పెట్టిరో లేదో ఇట్ల దేవుడు టకీమని ప్రత్యక్షమాయనంట. యాలంటే వాళ్ళు యంత రాక్షస జాతయినా ఇంతవరకూ యాపొద్దూ నోరు తెరిసి దేవున్ని ఒగ కోరిక గూడ కోరుకోలేదంట. అందుకే ఆయప్ప వాళ్ళకి అంత బిరన ప్రత్యక్ష మాయనంట.

దేవుడు వాళ్ళముందర కనిపిస్తూనే అడవిలో ఒంటిగా సిక్కిన జింకని సుట్టుకొన్న సీడకుక్కల మాదిరి, అంతా ఒగసారి తగులుకొన్రంట. "ఏడిది స్వామీ మీ యవ్వారం ఏమీ బాగాలేదు. అది యావిదో లోకంలో మామూలు జనాలు గూడా తిండిపెట్టి పెంచేకి శాతకాక ఊరకేయాల కనల్లలే అని బిడ్డల్ని కూడ కనకుండ, 'విరోదులో నిరోదులో,' అడ్డమేసుకోని బతుకు సాగిస్తా వుండారంట. మీరు ఇంత లాము దేవుడయ్యా గూడ మాకు బతికే దానికి ఆధారం సూపిచ్చకుండ ఈ పాడు జన్మ ఎందుకిచ్చిండారు?

"అంతకుమించి మా జాతి మింద మీకేమైనా సన్నసూపుంటే మేమంతా ఒగేసారి సచ్చిపోయేటట్ల ఏడిదైనా శాపం పెట్టండి. లేకుంటె ఆకలి కాకుండ వుండేదానికి మంత్రమన్నా నేర్పిచ్చండి. అంతేగాని మీరిచ్చిన జన్మని కాపాడుకొనేదానికి ఆరాటపడుకొంట ఆకలయినపుడు కనిపించిన జీవిని తింటే అది అరగకుండ తిన్నోళ్ళు తిన్నట్లే వాంతులూ బేదులూ అయ్యి సచ్చిపోతా వుండాము. ఇంత మాత్రానికి మాకు ఈ పాడు బతుకులు యాల? మేమంతా మీ ముందరే నాలుకలు పటుక్కున పీక్కొని సస్తాము," అని సన్నసన్నగ దులిప్పారేసిరంట.

ఎపుడు వీళ్ళు దేవున్ని ముద్దాయిని సేసి నోరెత్తేకి అవకాశమివ్వ కుండ మాటల్ని తూటాల మాదిరి పేల్సబట్రో అపుడు స్వామికి నోట్లో మాట్లు రాకుండ అయి, ముఖమంత శమట్లు బట్నంట. ఇపుడు ఏమి సేయల్లప్పా అని అనుకొంట వున్నట్లే - ముందు యుగంలో కృష్ణ పరమాత్ముని అవతారం ఎత్తినపుడు - కష్టానికి కుంగకుండ, సుఖానికి పొంగకుండ స్థితప్రజ్ఞత అలవాటు సేసుకొండని జనాలకి ఊదరగొట్టి సెప్పిన యేదాంతం మాట్లు గుర్తుకు తెచ్చుకోని, రవ్వంత ధైర్యం నూరి పోసుకోని నాలుక పెదవులు తడువుకోని -

"ముంతడు నీళ్ళకే ముక్కు మూసుకొంటె కడవడు నీళ్ళు మీ తాత పోసుకొంటాడా? అనే సామెత పల్లెటూరి జనాలు అనుకొంట వుంటారు. అది మీకు తెలుసునో తెలీదో - ఈ బతుకు కూడ అంతే శానా బరువైంది, లోతైంది, పొడవైంది. ఎవ్వరికీ అంతేబట్టదు. ఈడ ఇంగొగ యిస్త్రత మేమంటే, 'ఇంకా మనుషులే పుట్టలేదు. అసలైన బతుకులు ఇంకా మొదలే కాలేదు,' అనే మర్మం శానామందికి తెలీదు. 'సావు సస్తేగాని బతుకు బతకదు! బతుకు బాగుండల్లంటే సావును బతకనీగూడదు,' అని సెప్పినంట.

దానికి వాళ్ళు, "మాకు అర్థంకాని తెలివికూతలు కూసి తికమక పెట్టేసి ఏమీ అడగనీకుండ మాయమైపోదామని అనుకోనుండావేమో? ఆ మాంసం ముక్కలు మా దగ్గర వుడకవుగాని, ఒగ కంటికి యన్న ఒగ కంటికి సున్నం పూసుకోని సూసే నీ యవ్వారం ఏమీ బాగాలేదు. యనకాటికి మా రాక్షసజనాలు యట్ట బతికిండారోకాని మా ఆకారాలు, మేం తినే

తిండి తలుసుకొంటూనే అసహ్యమైతుంది. ఇట్ల నీచమైన బతుకు మాకొద్దు. ఈ భూమ్మీద బతికేకి ఆ మనుషులకి యంత అధికారమూ, అవకాశమూ వుందో మాకూ అంతే వుండల్లకదా!? మా ఆకారాలు సూసి నల్లగ వుండారని, రాక్షసులంటాని, శడ్డొల్లంటాని దూరం దూరం వుంచుతా వుండారు. ఇంగ దీన్ని మేమెప్పుకోము. వాళ్ళ మధ్య కలిసిపొయ్యి బతికేదానికి మాగ్గూడ ఏర్పాట్లు సేయండి,'' అని ఒగటే పట్టు పట్రంట.

దానికి దేవుడు సన్నగ దరహాసం సేసి, "మానవులంటాని, రాక్షసు లంటాని, నల్లోల్లంటాని, తెల్లోల్లంటాని నేను రెండు రకాల జీవున్ని ఈ భూమ్మీద పుట్టించలేదు. మీరు తినే తిండ్రి, సేసే పన్లు, ఉండే బుద్దిని బట్టి రకరకాల ఆకారాలొస్తాయి. అంతేకాని మీరంతా మనుషులుగా వుండల్లంటే మీ నెత్తి మింద కొమ్ములేవు, కోరపండ్లు లేవు. మీ శరీరాలు నల్లగా గూడా లేవు. అవన్నీ మీ భ్రమలు మాత్రమే! కావలసింటే అద్దంలో ఒగసారి సూసుకోండి,'' అని సెప్పి వాళ్ళ సేతులకి ఒగొగు అద్దం అందిచ్చె నంట.

అద్దంలో వాళ్ళ ఆకారాలు సూసుకొన్న వాళ్ళకే ఆశ్చర్యమాయనంట. ఇంకా నమ్మకం కుదరక ఒగర్నొగరు సూసుకొంట, సేతుల్తో తడుము కొంట ఎర్రోళ్ళ మాదిరి నిలబడి బిక్కమొగాలేసిరంట.

రవంతసేపటికి కురుక్షేత్రం సినిమాలో కృష్ణ పరమాత్ముని ఇశ్వ రూపం సూసి కలవరపోయి తేరుకొన్న అర్జునుని మాదిరి ముఖాలు పెట్టి, "స్వామీ మాన్నభావా, ఇన్నాళ్ళూ మా కండ్లలో మమ్ము మేము సూసుకో నుండే వికారమంతా అబద్దమేనా? అందరూ మమ్మల్ని రాక్షసులంటాని గేలిసేసింది, మేము సంపితిన్న జనాలు జంతువులు ముమ్మాటికీ సత్యం గాదా?'' అని సేతులు జోడించి యినయంగ అడిగిరంట.

దానికి దేవుడు, "అంత పెద్ద ప్రశ్నలడిగి జవాబులు తెల్సుకొంటె జీవితం నీటిబుడగంటాని, బతుకు మిధ్యంటాని, తంబూరా వాయిచ్చు కొంట గడ్డం మీసాలు పెంచుకోని పిచ్చోళ్ళ మాదిరి తయారవుతారు. బతికేవాళ్ళని బతూనీకుండ నిరాశల్లో నింపి వాళ్ళ బతుకుల్ను ముంచు తారు.

"యాపకాయంత మూర్ఖత్వమో, కానుగ్గింజంత తెలీనితనమో అలవాటు సేసుకోని మనుషుల్ని కాకుండ వాళ్ళ కష్టాన్ని తినేది నేర్సుకొండి. భూమ్మీద సుఖంగ బతుకుతారు.

"ఎదురుగా ఉండేవాళ్ళు ఏమీ అనుకొంటారో అనే యదవ ఆలోశన యిడిసిపెట్టి, ఆలోశన సేసేకి వాళ్ళకి అవకాశమే ఇవ్వకుండ మీ పన్లు మీరు సేయండి. సేసింది శడ్డ పనైనా శానా గొప్పదంటాని ఊదరబెట్టి అదరగొట్టండి. అపుడు మీ ఏటుకు ఎదురే వుండల్లేదు,'' అని సెప్పి గబుక్కున మాయమాయనంట.

✤

మనుషులు యక్కడ ఎదురుపడితే, అక్కడ సంపుకు తినే రాక్షసులు కనపడకుండ అయ్యిందానికి జనాలకి శానా ఆనందమయి పాయనంట. అంతా సంత మాదిరి ఒగ తావు కలిసి ఇండ్ల ముందర పేడనీళ్ళు, మనుషుల మింద వసంతాలు సల్లుకోని రాక్షసుల పీడ తీరిన సందర్భంలో పెద్ద పండగసేయల్ల అని చర్చలు జరుపుతా వుండ్రంట.



ఆ సమయానికి ఒగే రకమైన బట్టలు కట్టుకోని కొంత మందొచ్చి రంట. వాళ్ళలో ఒగాయప్ప గొంతు సవరించుకోని "ఇల్లలుకుతూనే పండగ కాదు, టెంకాయ కొడుతూనే పూజ కాదు. ఉన్న సోటే వుంటే రాయిగూడ దుమ్ముపట్టి పోతుంది. ముందుకు దొర్లితే రాటుతేలి నునుపు తిరుగు తుంది. అట్లే మీరు కూడా వున్న సోటే వుండి వెలుగు సూపే వాళ్ళు లేక అజ్ఞానంలో కూరుకుపొయ్యిండారు. సెయ్యెత్తి జై అనుకొంట నా యనకాల్నే రండి. మీకందరికీ అరసేతిలో స్వర్గం సూపిస్తాను,'' అని అందరి సేతులకి గీతల జండాలు పట్టిచ్చి, "పోదాం పోదాం పైనికి పైనికి స్వర్గ లోకం లోపలికి,' ' అని పాటలు పాడిచ్చుకొంట కదిలిపాయనంట.

ఆ యప్ప మాటలకి ఎవురూ ఎదురు సెప్పకుండ సేస్తా వుండే పన్లన్నీ యిడిసిపెట్టి పాడుకొంట, గీతల జండాల కోసరము పోటీలు పడి నూకలాడుకొంట కొట్టుకొంట సంపుకొనేదంకా పాయరంట.

అదే టయానికి ఇంగొగురకం బట్టలేసుకోనుండే జనాలు కొంత మందొచ్చిరంట. వాళ్ళలో ఒగాయప్ప సేతులెత్తి జనాలకంతా పెద్ద నమస్కారం సేసి, "బురికీలు తొడిగినంత మాత్రాన ఎనుంపోతు గంగి రెద్దయ్యెల్లేదు. అట్లే జండా పట్టిచ్చినోడంతా జనానికి నాయకుడయ్యెల్లేదు. కుక్కతోక పట్టుకోని గోదావరి యీదొచ్చునేమోగాని ఆ గీతలు జండాలు పట్టుకోని మాత్రం మీరు స్వర్గానికి పోలేరు. దయసేసి మీరంతా మంచి జనాల మాదిరి వుండారు. బాగా ఆలోశన సేయండి!! మీరంతా సుఖంగా వుండేదానికి బంగారురాజ్యం ఏర్పాటు సేయల్ల అని నా రగతమంతా దారపోసి కొత్త రకం సుక్కల జండాని తయారు సేసిండాను. ఈ జండాలు పట్టుకోండి మీ కష్టాలన్నీ తీరుతాయి,'' అని ఉపన్యాసం సేసి 'జనాల బతుకులు బంగారాయ - జండా గాలికి రెపరెపలాడె,' అని ఎలుగెత్తి పాడుకొంట ఒగపక్కకి కదిలిపాయనంట.

గీతల జండాలు అందని జనాలంతా పడేదీ లేసేదీ తెలీకుండ ఉరకెత్తుకోనొచ్చిరంట సుక్కల జండాల కోసరము.

వాళ్ళ కథ అట్లయిడిసిపెట్టి - కొమ్ములు, కోరలు మాయం సేసుకోని జనాన్ని సంపేది ఇడిసిపెట్టిన రాక్షసి జీవులు ఇపుడు యట్ల రూపాంతరం సెందిండివో మీరన్నా కాసంత ఆలోశన సేయండి!! ✱

జ్ఞాపకాల తడిలో...

కట్టా గోపాలకృష్ణ మూర్తి

నేను 1936లో చీరాలకు 8 మైళ్ళ దూరంలో ఉన్న పందిళ్ళపల్లి గ్రామంలో పుట్టాను. నా బాల్యమంతా పెద్దగా అభివృద్ధి చెందని చిన్నచిన్న గ్రామీణ ప్రాంతాల్లోనే గడిచింది. అప్పుడు ఈ ప్రాంతంలో వృక్ష, జంతుజాల సంపదలు సమృద్ధిగా ఉండేవి. అందువల్ల ప్రకృతిని అన్వేషించ డానికీ, దాని సౌందర్యం తిలకించి ఆనందించడానికీ నాకు చాలా అవకాశాలు లభించాయి. వాటిని పూర్తిగా సద్వినియోగం చేసుకొని బాల్యం ఎంతో హాయిగా గడిపాను. ఇప్పుడు పరిస్థితులు తారుమారు అయ్యాయి. చెట్లూ, పొదలూ ఇప్పుడు ఎక్కువగా కనిపించవు. అభివృద్ధి పేరున ఖాళీస్థలం అంతా భవనాలు, రాస్తాలు, రైలుపట్టాలు, బస్సు డిపోలూ మొదలైనవాటితో నింపబడింది. అనాది నుంచీ ఉన్న ప్రకృతి ఈ ప్రాంతాలలో అంతరించిపోయింది. దీనివల్ల ఈ కాలం పిల్లలకూ, పెద్దవారికీ ప్రకృతి సౌందర్యానుభవం దుర్లభం అయిపోయింది.

పందిళ్ళపల్లిలో నా అనుభవాలు

తెల్లటి ఇసుకతిన్నెలతోనూ, జీడి, మామిడి, తమలపాకు, సరిగ, మిరపతోటలతోనూ, పెద్దపెద్ద మర్రి, అత్తి, మద్ది, నేరేడు, చింత, సీమచింత, వేప, పున్నాగమల్లి, నక్కేరు, ఈత, తాటి వగైరా చెట్లతోనూ, పందిళ్ళపల్లి చాలా బావుండేది. ఎత్తైన ఇసకతిన్నెల మధ్య లోయల్లో చిన్న వాగులు ప్రవహిస్తుండేవి. ప్రతి వాగు పొడుగూతా ఒకవైపు దట్టంగా పెరిగిన మొగలితోపులు వాగుని తమ నీడతో రక్షించుతూ ఉండేవి. ఆ నీడ రక్షణ లేకపోతే తీక్షణంగా ఉండే ఎండకు వాగులు ఎండిపోయి ఉండేవేమో.



వాగు వెడల్పు 5, 6 అడుగుల లోపు, నీటిలోతు 2, 3 అడుగుల లోపు ఉండేవి. నీటికి దగ్గర్లో పొన్నదంటి, కొయ్య తోటకూర మొక్కలు దట్టంగా పాకి నేలంతా కప్పివేసి ఉండేవి. ఈ మొక్కల రెమ్మలతో పప్పు, పుల్లకూర చేసేవారు మా అమ్మమ్మలు. నేను తరచు వాగుకి వెళ్ళి ఈ మొక్కల రెమ్మలు కోసుకొచ్చి మా అమ్మమ్మలకు వండడానికి ఇచ్చేవాణ్ణి. కోస్తున్నప్పుడు వాగులో ఈదుతున్న చిన్ని చేపలూ, తాబేళ్ళూ కనిపించేవి. మొగలి పువ్వుల సువాసన గుప్పుమంటూ తగిలేది.

మొగలి చిగురు పాలరంగు తెలుపుతో, మత్తెక్కించే సువాసన కలిగి ఉంటుంది. దాన్నే మొగలిపువ్వు అంటారు. కొన్నిరోజుల్లో ఆకు ముదిరి ఆ తెలుపు ఆకుపచ్చగా మారుతుంది.

ఊరు చుట్టూరా గుబురుగా ఎదిగిన జీడిచెట్ల తోటలుండేవి. జీడిచెట్లకు ఇసకనేల చాలా ఇష్టమనుకుంటా. మండిపోతున్న నడివేసవి ఎండల్లో కూడా క్రింద నుంచి పై వరకూ దట్టంగా ఆకుపచ్చటి ఆకులతో నిండి మెరిసిపోతుండేవి ఆ చెట్లు.

కొత్తగా పెళ్ళి అయిన కన్యను మొదటిరాత్రి పడకగదిలోకి పంపించే ముందు జడ పాడుగుతా మొగలిపువ్వుతో కుట్టడం ఒక ఆచారంగా ఉండేది ఆ కాలంలో. మొగలి సువాసన వెదజల్లుతూ తెల్లటి మొగలిపువ్వు కాంతిలో ధగధగా మెరిసిపోతూ చాలా ఆకర్షణీయంగా ఉండేవారు నూతన వధువులు ఆరోజుల్లో.

ఊరు చుట్టూరా గుబురుగా ఎదిగిన జీడిచెట్ల తోటలుండేవి. జీడిచెట్లకు ఇసకనేల చాలా ఇష్టమనుకుంటా. మండిపోతున్న నడివేసవి ఎండల్లో కూడా క్రింద నుంచి పై వరకూ దట్టంగా ఆకుపచ్చటి ఆకులతో నిండి మెరిసిపోతుండేవి ఆ చెట్లు. ఆ ఎండలో చెట్టు క్రింద దూరితే చల్లగా హాయిగా ఉండేది. వేసవికాలం చెట్టునిండా జీడిపళ్ళు కాస్తాయి. జీడిపప్పు అన్ని పప్పుల్లోకీ రుచికరమైనది. మా ఊరిలో పండించిన జీడిపప్పు ప్రపంచం నలుమూలలకూ ఎగుమతి చేసేవారు. వేసవికాలంలో జీడిపళ్ళు ఉన్నన్నాళ్ళూ రోజూ ఎన్నో పళ్ళు తిని ఆనందించేవాణ్ణి నేను.

ఊరులో చిన్న ఎలిమెంటరీ స్కూలుండేది. అక్కడ ముఖ్యంగా అక్షరాలు, అంకెలు నేర్పించి, ఎక్కాలు బట్టీ పట్టించి, తెలుగు పద్యాలూ, ప్రార్థనలూ నేర్పేవారు. పై తరగతులకు, రెండు మైళ్ళ దూరంలో ఉన్న వేటపాలెం స్కూలుకి వెళ్ళాలి. పందిళ్ళపల్లి నుంచి పిల్లలంతా కలిసి ఆ స్కూలుకి నడిచే వెళ్ళి వచ్చేవాళ్ళం. బాటకు రెండువైపులా ఉన్న చెట్లనీడలో కథలు చెప్పుకుంటూ, కేరింతలు కొడుతూ, పాటలు పాడుకుంటూ వెళ్ళేవాళ్ళం. అందుకనే స్కూలుకి వెళ్ళడం నాకు చాలా ఇష్టంగా ఉండేది.

ఆ బాటలో చూసిన చెట్లన్నిటిలోకీ పెద్ద అత్తి చెట్లు నాకు బాగా గుర్తున్నాయి. అవి ప్రతి కొమ్మ నుండీ, కాండం నుండి కూడా గుత్తులు గుత్తులుగా రేగిపండ్లంత కాయలు కాసేవి. స్కూలు నుంచి తిరిగి వచ్చేటప్పుడు అత్తికాయలు కోసుకెళ్ళి మా అమ్మమ్మల చేత వండించుకొని తినేవాణ్ణి నేను.

గడిచిన 50 సంవత్సరాలలో మా ఊరి జనాభా పెరిగిపోయి బాగా అభివృద్ధి చెందింది. ఖాళీగా ఉండే భూముల మీదంతా ఇళ్ళు వచ్చేశాయి. వాటిని కట్టడానికి శతాబ్దాల నుంచి పెరుగుతున్న జీడిచెట్లు చాలా కొట్టి వేశారు. ఇంకా కొన్ని జీడితోటలు ఉన్నాయి కానీ, యజమానులు తెలిసిన వారిని తప్పించి ఇంకెవ్వరినీ లోనికి రానివ్వడం లేదు. బాటలు రోడ్లయ్యి, వాటి కిరువైపులా ఉండే చెట్లు అదృశ్యమైపోయాయి. మొగలితోపులు చాలా వరకూ ధ్వంసం చేయబడ్డాయి. ఇప్పుడు నూతన వధువుల జడలు కుట్టడానికి మొగలిపువ్వులు లేవు. ప్రకృతిని జయించి మా ఊరు అభివృద్ధి చెందిన చిన్న పట్టణం అయ్యింది.

బందరులో...

ఉద్యోగరీత్యా మా నాన్నగారు బందరు, కైకలూరు, విజయవాడ, గుంటూర్లలో ఉన్నారు. అందువల్ల నాకు 16వ సంవత్సరం నిండేంతవరకూ నేను ప్రకాశం, కృష్ణా, గుంటూరు జిల్లాల్లోనే గడిపాను.

ఉద్యోగరీత్యా బందరు వచ్చినప్పుడు మా నాన్నగారు నగరానికి దూరంగా తయారవుతున్న నక్కలతోట అనే పేటలో స్థలం కొని సొంత ఇల్లు కట్టించారు. ఆ ప్రాంతంలో మేం మొదటి మానవ నివాసులం. ప్రతి రాత్రీ నక్కలు మా ఇంటి ప్రాంతానికి తినడానికి ఏమైనా దొరుకుతుందేమో వెతుక్కుంటూ వచ్చేవి. అందుకనే చీకటిపడ్డాక తలుపులు, కిటికీలు మూసేసుకొని ఇంటి లోపలనే గడిపేవాళ్ళం. ప్రతి ఉదయం పెద్దవాళ్ళు నక్కలు చేసిన గొడవలను గురించి చిలువలు పలువలుగా చర్చించేవాళ్ళు.

మా ఇంటిప్రక్కనంతా మేపాళం మొక్కలూ, జిల్లేడు పొదలూ, గానుగ, వేప, సరిగ, నేరేడు, సీమచింత, మల్బరీ, ఈత, తాటిచెట్లు పెరుగుతుండేవి. మా స్థలం సరిహద్దు మీద నేను మేపాళం, గన్నేరు కొమ్మలు పాతి రోజూ నీరు పోసేవాడ్ని. కొన్నాళ్ళకి అవి ఎదిగి మా స్థలానికి ప్రహరీగా తయారయ్యాయి. ప్రతి ఉదయం ఒక మేపాళం కొమ్మ తుంచుకొని దానితో పళ్ళు తోముకునేవాళ్ళం. పుల్ల అంచుని కొద్దిగా నమిలితే బ్రష్షులాగా అయ్యేది. దాని మీద మేపాళం ఆకు తుంచగా కారే రసాన్ని పడనిస్తే, అది నురగలా అయ్యి పళ్ళను బాగా శుభ్రపరిచేది.

బందరులో తాటిముంజెలూ, తేగలూ విరివిగా లభించేవి. తేగ అంటే ఈ కాలంలో చాలామందికి తెలియకపోవచ్చు. కొత్త తాటినారుని త్రవ్వగా వచ్చేదే తేగ. అడుగు పొడవు, అంగుళం వెడల్పుతో కాడలా ఉంటుంది. దానిని నీటిలో ఉడకబెడితే లోపలి బీజం పిండిలాగా మారుతుంది. ముసలమ్మలు గంపల్లో తేగలను ఇళ్ళకు తెచ్చి అమ్మేవారు. తేగలూ, తాటిముంజెలూ తినడం మరపురాని బాల్యపు మధురస్మృతి నాకు. ఇవేకాక నేరేడు, సీమచింత, మల్బరీ, రేగిపళ్ళను తరచుగా తినేవాళ్ళం.

కోసెడు దూరంలో ఉన్న చిలకలపూడి పాండురంగడి గుడికి నేను, నా స్నేహితులు తరచూ నడిచి వెళ్ళేవాళ్ళం. వెళ్ళే రోడ్డు కిరువైపులా బంజరు భూములుండేవి. వాటి మీద పేము పొదలు, ఎన్నోరకాల చెట్లు ఉండేవి. పేమునే ఇంగ్లీషులో కేన్ అనేవారు. పేము కొమ్మలతో సోఫాలు, కుర్చీలు చేసేవారు. ఆ కాలంలో పేము ఫర్నిచర్‌కి గొప్ప పేరుండేది. గుడి నుంచి

తిరిగి వచ్చేటప్పుడు ఆ ప్రాంతాన్ని అన్వేషించేవాళ్ళం. కొన్ని పొదలు మంచి సువాసన గల పువ్వులతోనూ, రేగికాయ సైజు పుల్లటి కాయలతోనూ (బహుశా వాక్కాయలేమో) ఉండేవి. నాకు నచ్చిన పొదల కొమ్మలు విరిచి తెచ్చి మా దొడ్డిలో నాటేవాడ్ని. 17వ ఏట పై చదువులకని నేను మద్రాసు వెళ్ళేటప్పటికి ఇలా నాటిన రకరకాల పొదలు, చెట్లు, తీగలతో మా దొడ్డి ఎంతో ఆహ్లాదంగా తయారయ్యింది.

ఇప్పుడు బందరు పెద్ద నగరమైపోయింది. చిలకలపూడి, నక్కల తోటల మధ్యంతా ఇళ్ళు వచ్చేసి, ఆ చెట్లూ, పొదలూ మాయమైపోయాయి. ఇప్పుడు పేము పొద ఆంధ్రాలో ఎక్కడా కనిపించడం లేదు. బహుశా అదృశ్యమైపోయి ఉండవచ్చు. ఇప్పుడు బందరులో కూడా తేగలు దొరకడం చాలా అరుదు.

ముందు తరాల పిల్లలు ప్రకృతి సౌందర్యాన్ని చూసి ఆనందించే అవకాశం ఉండాలంటే మనం చెట్లు నాటాలి. పూలమొక్కలు విరివిగా పెంచాలి. ఇప్పటికైనా మనం మేలుకోకపోతే జరగబోయే విచ్ఛిత్తికి దోహదం చేసినవాళ్ళమే అవుతాం. ఎందుకింకా ఆలస్యం?

కైకలూరులో...

కైకలూరులో చాలా చెరువులుండేవి. ఆంధ్రాలో ప్రసిద్ధి చెందిన కొల్లేరు సరస్సు కైకలూరుకి దగ్గర్లో ఉండేది. 1940ల్లో మా కుటుంబమంతా కొల్లేరు సరస్సు మీద పడవ ప్రయాణం చేయడం నేను ఎప్పటికీ మరువలేని అద్భుతమైన అనుభవం. తెడ్లతో నడిపించే పెద్ద పడవ మీద సరస్సు మధ్య ఒక చిన్నద్వీపంపై ఉన్న కొల్లేరు దేవత గుడికి వెళ్ళాం. ఆ ద్వీపం చేరడానికి 2 రోజులపైనే పట్టింది, మళ్ళీ తిరుగు ప్రయాణం ఇంకో రెండు రోజులు. దారి పొడుగూతా ఏపుగా ఎదుగుతున్న నీటిగడ్డి దుబ్బులూ, నీటిలో పెరిగే బెండు వృక్షాలూ కనపడ్డాయి. గడ్డిదుబ్బుల్లో గూళ్ళు కట్టుకున్న ఎన్నోరకాల ఇంద్రధనస్సు రంగుల నీటిబాతులూ, వాటి పిల్లలూ సరస్సులో ఈదుతూ మాకు ఎదురయ్యాయి. వాటికి మా పడవ దగ్గరగా వెళితే అవి రెక్కలు రెపరెపలాడించుకుంటూ ఎగిరిపోయేవి. అప్పుడు వాటి ఈకలు కొన్ని సరస్సు నీళ్ళలో పడి తేలుతుండేవి. పొడుగాటి చేతులున్న పడవ సరంగు సహాయంతో పడిపోయిన ఈకలు కొన్ని నేను సేకరించి పదిలంగా దాచుకున్నాను.

బెండు వృక్షాలు బహు పెళుసు. పెళుసు మూలాన వాటి కొమ్మలతో ఇతరులను ఎంత గట్టిగా బాదినా వాళ్ళకు నొప్పి కలగదు. ఆ కొమ్మలను ఆయుధాలుగా వాడి పిల్లలం తెగ కోట్లాడుకొని ఆనందించేవాళ్ళం.

ఈమధ్య ఒకసారి కొల్లేరు సరస్సు చూడ్డానికి వెళ్ళాను. అక్కడ సరస్సు మాయమైపోయింది. నీటిని డ్రైన్ చేసేసి ఆ స్థలాన్నంతా పంటభూమిగానూ, ఇళ్ళస్థలాలుగానూ మార్చేశారు. నీటిబాతులూ, బెండు చెట్లూ అంతరించిపోయాయి. ఈ జీవుల నివాస స్థలాన్ని మానవులు ఆక్రమించేసుకొని వాటికి అంతిమశ్వాస కలిగించారు. పాపం కొల్లేరు దేవత తన సరస్సునూ, దాంట్లో తను సృష్టించిన అద్భుత సాధు జీవులనూ మానవుల బారి నుండి రక్షించుకోలేకపోయింది.

విజయవాడలో...

నా చిన్నప్పుడు ఏలూరురోడ్డు ఇరువైపులా చింత చెట్లతో ఎంతో ఆహ్లాదకరంగా ఉండేది. ఆ చెట్లు బాటసారులను తమ నీడతో రక్షించేవి. వాటి మీద ఎన్నో పిట్టలు నివసించేవి. పిట్టల కిచకిచలు వింటూ ఆ చెట్ల నీడలో నడవడం నాకెంతో ఇష్టంగా ఉండేది. వసంత కాలంలో ఈ చింతచెట్లు విరివిగా చిగురించేవి. చింత చిగురు పుల్లగా చాలా కమ్మగా ఉంటుంది. దాంతో చేసిన పప్పు రుచి అద్భుతం. ప్రతి చింతచెట్టు పై కొమ్మల మీద కొండ మీద కోతుల్లా కూర్చుని గంపల్లోకి చిగురు కోస్తుండే మనుష్యులను చూసేవాణ్ణి. దయాదాక్షిణ్యం లేకుండా చెట్టుకి వచ్చిన ప్రతి చిగుర్ని వీళ్ళు ఇలా తుంచేస్తుంటే చెట్లు బ్రతగ్గలవా అనే అనుమానం నన్ను పీడించేది.

నేను భయపడినట్లే ఇప్పుడు ఏలూరురోడ్డు కిరువైపులా ఉండే చింతమానులన్నీ మాయమైపోయాయి. ఇప్పుడు విజయవాడ దగ్గర్లో భూతద్దం పెట్టి వెదికినా ఒక్క చింతమొక్క కూడా కనిపించదు.

✤

మార్పు సహజమే. అభివృద్ధికి అవసరం కూడా. కానీ మార్పు కేవలం మార్పు కోసమే కాకూడదు. మార్పు మన చుట్టూ ఉన్న ప్రకృతిలో అసమతుల్యాన్ని కలిగించకూడదు. ఈ విచ్ఛిన్నానికి కారణమూ మనమే, దాన్ని పరిష్కరించవలసిందీ మనమే.

ముందు తరాల పిల్లలు ప్రకృతి సౌందర్యాన్ని చూసి ఆనందించే అవకాశం ఉండాలంటే మనం చెట్లు నాటాలి. పూలమొక్కలు విరివిగా పెంచాలి. ఇప్పటికైనా మనం మేలుకోకపోతే జరగబోయే విచ్ఛిత్తికి దోహదం చేసినవాళ్ళమే అవుతాం. ఎందుకింకా ఆలస్యం? ✱

సరదాగా...

పరిభాష పూర్తిగా తెలియకపోతే కొంచెం ఇబ్బందే ఏ వృత్తిలో అయినా. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ముగియగానే ఒక ప్రజా ప్రముఖుడు "అసెంబ్లీ ఎన్ని రోజులు జరిగిందన్నది కాదు ముఖ్యం. ఎంత బిజినెస్ జరిగిందనేది ముఖ్యం," అన్నాడు.

అది విన్న ఒక అసెంబ్లీ సభ్యుడు, "ఏమిటండీ ముఖం మీద ఈయన ఇట్లా మాట్లాడతాడు. ఈ సమావేశాల్లో మనవి రెండు టెండర్లు ఖాయం అయినాయి. అంతా సవ్యంగా జరిగితే అయిదు లకారాలు మిగుల్తాయి. మేనకోడలుకు వీసా వచ్చింది. బామ్మరిదికి బెయిల్ శాంక్షన్ అయింది. ఇంతకంటే ఇంకేం బిజినెస్ జరగాల..." అని వాపోయాడు.

అంతరం

బిజిపేముల రమ్మారెడ్డి

తొలిచుక్క పొడిచే జామయ్యింది. కొక్కొరొకో అంటూ... పడమటి వీధి నుండి కోడికూత వినపడుతోంది. పక్కకొట్టంలో వున్న చెన్నారెడ్డి గాట్లో గడ్డివేసి ట...ట అంటూ ఎద్దులను లేపడం వినపడుతోంది. అప్పుడే లేచిన ఒకరిద్దరు వీధి చివరి బోరింగును టక... టకమంటూ చప్పుడు చేస్తున్నారు.

ఇంటి ముందు వున్న పాత సపారంలో... కుక్కి మంచంలో పండు కున్న నారాయణమ్మ కుడిపక్కన వున్న మంచంకోడును ఆసరా చేసుకొని చిన్నగా లేచి కూర్చున్నది. వర్షాకాలం, పైగా మంచుకురిసే రోజులు. తెల్లవారుఝాము కావడంతో మంచుతో కలిసిన ఈదురుగాలి తెరలు, తెరలుగా వచ్చి సెవుల్లో దూరి వడుకు పుట్టిస్తా వుంది. చలికి తట్టుకోలేక పయిట సెరుగున వున్న వక్కాకు మూటవిప్పి చక్కమొద్దు నోట్లో పెట్టుకుంది నారాయణమ్మ. చలి మరీ ఎక్కువ అనిపించడంతో చిరిగిపోయిన పాత కంబడిని తలమీదుగా గొంతు కిందకు తీసుకొని మంచంలో వదిగి కూర్చుంది.

డెబ్భై ఏండ్ల వయసున్న నారాయణమ్మ నిన్న పొద్దుటి నుంచీ... పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టుకోలేదు. కడిగేసిన బానలా ఖాళీ అయ్యింది కడుపు. అన్నానికి పుట్టిన ప్రాణం తట్టుకోలేక పోతోంది. కడుపులో బాధ, కళ్ళు తిరుగుతున్నాయి, తిండి తినకుంటే శరీరానికి కష్టంగా ఉంది. తిందామంటే మనస్సుకు కష్టంగా వుంది.



నిన్న జరిగిన సంఘటన కళ్ళ ముందు మెదిలింది. చీకట్లోనే వెళ్ళి గడ్డి కోసుకొని వచ్చింది నారాయణమ్మ. నరసాపురం చేలల్లోకి పొయ్యి వచ్చే సరికి పెద్ద అంబలి పొద్దయింది. అప్పటికే కడుపులో ఎలకలు పరిగెడుతున్నాయి. ముసలి ప్రాణం. మోపు ఇంటి ముందేసి మొత్తనున్న గూట్లో బొగ్గు తీసి నోట్లో వేసుకొని పళ్ళు తోముకుంటూ... దొడ్లో కెళ్ళింది.

"జేయా...! జేయా...!" అంటూ పది సంవత్సరాల వయసున్న మనవరాలు లావణ్య దొడ్లోకి వచ్చింది. తాను కట్టుకున్న కొత్త బట్టలు చూపించి...

"జేయా... ఇయ్యాల నా పుట్టినరోజు. మా నాయన కొత్త సొక్కా తెచ్చిండు బాగుంద్యా..." అంటూ చూపించింది.

"బాగుందమ్మా," అంది నారాయణమ్మ.

"మాయమ్మ పరమాన్నం జేసింది, బువ్వ జేసింది, నేను తిన్య, నువ్వూ తిను పో జేయా...!" లొడలొడా చెప్పి వెళ్ళిపోయింది.

ముఖం కడుక్కొని ఇంట్లోకి వచ్చింది నారాయణమ్మ. ఎక్కడా పరమాన్నంగానీ, అన్నం కానీ కనపడలేదు. రాత్రి అన్నం వండిన కుండే వుంది. దాంట్లో చూస్తే నీళ్ళు పోసిన సద్దిబువ్వ వుంది. అదే రొవ్వంత తెల్లెలో పెట్టుకొని సపారంలోకి వచ్చి కూర్చొని తిందామని తెల్లెలో చెయ్యి పెట్టింది. అన్నం పిసపిసా అంటూ... పాసిపోయినట్లనిపించింది. రొవన్ని మెతుకులు నోట్లో పెట్టుకుంది. వాసనకు కక్కొచ్చినట్లయి తినలేక ఆలోచిస్తూ కూర్చుంది.

"ముసల్దానా ఒక్క సెక్క మొద్దియ్యి," అంటూ పొరిగింటి లక్షుమ్మ వచ్చింది. తెల్లెలో వున్న బువ్వను చూసి...

"ఏంది ముసల్దానా! ఈ బువ్వ తింటండవ్. తొందరగా సచ్చవ్. పారబొయ్యి పో... మనవరాలు పుట్టిండ్రోజు జేసి పొద్దన్నే బువ్వ, పరమాన్నం జేసిందే! కోడలు!" చెప్పింది లక్షుమ్మ.

"ఇంట్లో యాడా కనపల్యామ్మే...! ఆడికే సూసిన," అంది నారాయణమ్మ.

ఇంతలో కోడలు వచ్చింది.

"లచ్చిందేవీ... నువ్వు పొద్దన్నే బువ్వ జేసిన్యా...! కనపరాలేదని ముసల్ది పాసిపోయిన బువ్వ చెట్టు కొనింటే...!" అంది లక్షుమ్మ.

ఆ మాటకు కోడలు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. బరబర ఇంట్లోకి పొయ్యి బిరబిర బయటకు వచ్చింది. లక్షుమ్మ చెయ్యి పట్టుకొన ఇంట్లోకి ఈడ్చుకొని వెళ్ళింది.

"ముసల్ది కావాలని, మమ్మల్ని ఈధి కీడ్చాలని, ఈపన్జేసింది. సూడూ... ఇది బువ్వగాదూ..., ఇది పరమాన్నం గాదూ...!, ఇది బెట్టు కోకుండా సద్దిబువ్వ బెట్టుకొని బజార్లోకొచ్చి మమ్మల్ని అల్లరి పాల్జేయాలని దాని పట్టు," అంటూ వాపోయింది.

ముఖం కడుక్కొని ఇంట్లోకి వచ్చింది నారాయణమ్మ. ఎక్కడా పరమాన్నంగానీ, అన్నం కానీ కనపడలేదు. రాత్రి అన్నం వండిన కుండే వుంది. దాంట్లో చూస్తే నీళ్ళు పోసిన సద్దిబువ్వ వుంది. అదే రొవ్వంత తెల్లెలో పెట్టుకొని సపారంలోకి వచ్చి కూర్చొని తిందామని తెల్లెలో చెయ్యి పెట్టింది.

లక్షుమ్మకు అర్థం కాలేదు. ముసల్ది కనుక్కోలేక పెట్టుకోలేదేమో ననుకొంది.

"ముసల్దానా... బువ్వ కిందనే వుందే...!" అంది లక్షుమ్మ.

"లేదమ్మా...! ఇల్లంతా జూసిన. కనపల్యా, అందుకే ఇది బెట్టుకున్య," సంజాయిషీగా చెప్పింది నారాయణమ్మ.

ఆ మాటలు విని కయ్యిమంటూ లేచింది కోడలు.

"సద్దిబువ్వ తినకుంటే రోజూ ఉడకు బువ్వ చ్చద్యా...! ఏం... పొచ్చ రాలు జంపాయిచ్చి బెట్టినవే...?! నువ్వు జేసేపనికి తిండెట్టొచ్చది. నాలుగు గడ్డి పోసలు దెచ్చానే అన్నీ వచ్చయా?!" అంటూ నారాయణమ్మ పై విరుచుకపడింది.

"మేమందరం స్టోర్ బియ్యం బువ్వ దిన్యా, లోగడ సొద్దబువ్వ దినంగ లేద్ది. ఇప్పుడు స్టోర్ బువ్వ దిన్లేవు," అంటూ రంకెలు వేసింది.

నారాయణమ్మకు నోట మాట రాలేదు.

కోడలు అరుపులతో వీధిలోని ఆడమ్మగారంతా తోడయ్యారు. అందరినీ పిలిచి చేతులు పట్టుకొని లాక్కెళ్ళి పరమాణ్ణం, బువ్వ చూపించి తనను కావాలనే ముసల్ది అల్లరి పట్టిచ్చాండని వలవలా ఏడ్చింది.

'కూతురికి కొత్త సొక్కా ఏసి పుటిండ్రోజు సేయడం జూసి కండ్లు కుట్టి ఇంతా చేసింద'ని కేకలు పెట్టి అరిచింది.

నారాయణమ్మ నిచ్చేస్థురాలయ్యింది. మనవరాలు వచ్చి... జేయా.. పరమాన్నం జేసిందని చెపితే... ముసలి ప్రాణం నాలిక పీకింది. ఇంట్లో నిదానంగానే ఎతికింది. అప్పుడు ఇయేమీ కనిపించలేదు. అంటే...! వాటిని తనకు కనపడకుండా దాచి, గొదవయ్యినాంక మల్లీ అక్కడ పెట్టింది. ఎంత జాణతనం...! ఆలోచిస్తూ మొత్తన కూర్చుంది నారాయణమ్మ.

ఇంతలో వీధిలోంచి లావణ్య వచ్చింది. వచ్చీ రాగానే లావణ్య వేసుకున్న కొత్తచొక్కాను వంటి మీదనే బరబరా చింపి వేసింది లక్ష్మీదేవి. ఆ పిల్ల లబోదిబోమంటూ ఏడుపు లంకించుకుంది.

"కొత్త సొక్కా యేసుకొని పండగ జేసుకున్నెవని దాని కండ్లు కుట్టినయి. నువ్వు సచ్చింటే దాని కండ్లు సల్లబడు," అంటూ కూతుర్ని దబదబ బాదుతూ... సోకనార్థాలు పెట్టింది లక్ష్మీదేవి.

అప్పుడే రామిరెడ్డి చేని వద్ద నుండి ఇంటికి వచ్చాడు. వీధిలో వంటిపై చొక్కా లేకుండా దొర్లుతున్న కూతుర్ని, గుమ్మం ముందు కూర్చొని శోకాలు పెడుతున్న భార్యను చూశాడు.

"దీని ముందు ఇంగ మేం బతకలేం, పిల్లను జంపి నేనూ జచ్చ. అప్పుడుగానీ దాని కండ్లు సల్లబడవ్," భర్తను చూసి మరింత రెచ్చి పోయింది లక్ష్మీదేవి. కూతురంటే ప్రాణం రామిరెడ్డికి. వంటిపైన దెబ్బలతో ఏడుస్తున్న కూతుర్ని చూసేసరికి, అదీ... పుట్టినరోజు నాడు బాధ కలిగింది. మరోపక్క

మౌనంగా కూర్చొని వున్న తల్లిని చూసి అనుమానమొచ్చింది. దీనికి కారణం తల్లే అయి వుంటుందనుకొన్నాడు.

"ఏం జరిగిందే...?" అంటూ భార్యను దబాయించాడు.

"పిల్లకు పుట్టిండ్రోజు జేసినమని కొట్లాట బెట్టుకున్నది. సద్దిబువ్వ బెట్టుకొని ఇంటింటికి బొయ్యి సెప్పి అందర్నీ ఇంటి మీందికి తోలకొచ్చి అల్లరి బట్టిచ్చింది. దీని ముందర నేను సంసారం జెయ్యలేను. పిల్లన్ జంపి నేన్ జచ్చ. మీరే ఏలుకోండి," అంటూ భర్త వాలకాన్ని గమనించి మరింత రెచ్చగొట్టింది.

రామిరెడ్డి ఆగ్రహం కట్టలు తెంచుకొంది. ఆవేశంగా తల్లి దగ్గరకు వెళ్ళాడు.

"ఎందుకే గబ్బుదానా...! ఇంగా బతికుండవ్, నువ్వు సచ్చింటే మేం బాగా బతుకుదుము. నువ్వు తల్లివా...?! మమ్మల్ని అల్లరి బట్టిచ్చుండవ్. పసిపిల్ల మీదెందుకే అంత కసి. తూ..." అంటూ తల్లిపై ఉమ్మివేసి...

"ఇంగ ఇంట్లో కొచ్చే వప్పుకోను. వక్కపిడ్డ గూడా బెయ్యను, ఏడన్నా దూకి సావు," అంటూ ఆగ్రహంతో వెళ్ళిపోయాడు.

ఏం జరుగుతుందో నారాయణమ్మకు అర్థం కాలేదు. కొడుకు మాటలు శూలాల్లా గుచ్చుకుంటున్నాయి. ఆ మాటలు చెవుల్లో మళ్ళీ, మళ్ళీ మారుమోగుతున్నాయి. మనసు కల్లోలమైంది. తనను శాశ్వతంగా వదిలించుకొనేందుకు కోడలు ఆడిన నాటకం కళ్ళ ముందు కదలాడుతునే వుంది. అందుకు బాధపడ్డం లేదు. తన తలరాత అంతే అనుకొంది. కానీ... తన మీద కొడుకుకు అసహ్యం కలిగించేందుకు తను ఆప్యాయంగా చూసుకొనే పసిపిల్లను పావుగా వాడడాన్ని తట్టుకోలేకపోతోంది.

నారాయణమ్మ కళ్లలో తడి. కొడుక్కు పెళ్ళి చేసింది. ఆనాటి నుండే కష్టాలు మొదలయ్యాయి. ఏనాడూ ప్రేమతో కడుపుకింత తిండి పెట్టలేదు. వర్షాకాలం ఇంట్లో పండుకుంటుంటే... వక్కాకు మూసి ఇండ్లు పాడుజేస్తున్నావంటూ బయటకు తరిమిండ్రు. ఆరోజు నుండి వానొచ్చినా, గాలొచ్చినా పాత సపారం, కుక్కి మంచమే గతయ్యింది.

తనను నీచంగా చూసినా ఎవ్వరికీ చెప్పుకోలేదు. కన్నకొడుకు పరాయి వారి ముందు చులకన కాకూడదనే అన్నీ దిగమింగుకుంది. కానీ ఈరోజు 'నువ్వు సచ్చిండే బాగా బతుకుదుము,' అంటూ కన్న కొడుకు ముఖాన ఉమ్మి వేయడంతో నారాయణమ్మ ప్రాణం సచ్చిపోయింది.

✤

"రేయ్ సిన్నోడా రేత్తిరంతా నిద్దరబోయింది సాల్లే లేచ్చావు. తెల్లారింది. ఎద్దులకు నీళ్ళు తాపి కాడి గట్టాల, ఇత్తనం రోజన్నా పొద్దుగలగ లెయ్యిరా," అంటూ ముసలి చెన్నారెడ్డి కొట్టంలో నిద్దురపోతున్న కొడుకును లేపేందుకు కేకలు వేయడంతో ఆలోచనల నుండి బయటపడింది నారాయణమ్మ.

అప్పటికే తెల్లవారింది. కప్పుకున్న దుప్పటి మంచం మీద వేసి, లేచి దొడ్లోకి వెళ్ళి సెరవలో వున్న నీళ్ళతో ముఖం ముడుచుకుంది. రొవన్ని నీళ్ళు నోట్లో పోసుకొని పుక్కిలించింది. బయటకు వచ్చి గడ్డి బుట్టి తీసుకొని బయలుదేరింది.

"జేయా... యాడికి," మనవరాలు ప్రశ్నించింది.

"సేను జూసొచ్చమ్మా..." అని చేనికి దారి పట్టింది. నిన్న పొద్దుటి నుండీ తిండి పోకపోవడంతో కడుపులో బాధగా ఉంది. కళ్ళు తిరుగుతున్నాయి. రెండుసార్లు దారిలో కూర్చొని ఫర్లాంగు దూరంలో వున్న రేగడి చేనుకు చేరుకొంది.

గరిక దండిగా వున్న గెనెం వద్ద గంప కిందవేసి కూర్చొంది. మనస్సు నిండా తన బతుక్కు సంబంధించిన ఆలోచనలే సుడులు తిరుగుతున్నాయి. నోరు ఎండిపోతున్నట్లు అనిపించడంతో పైట సెరుగున వున్న మూటెవిప్పి వక్కాకు నోట్లో పెట్టుకుంది. నిన్నటి నుండి అన్నం లేని నారాయణమ్మకు ఇప్పుడు వక్కాకే కడుపులోకి సారం పంపే సాధనం. మూటె బిగించి నిలువు పార తీసుకొని గడ్డి దోకడం మొదలుపెట్టింది.

గడ్డి దోకుతుందనే కానీ మనస్సు మనస్సులో లేదు. కన్నకొడుకును సాకిన తీరు ఆమె మదిని వీడిపోలేదు. మరిచి పోదామన్నా మరపు రాలేదు. కొడుకు కోసం ఎన్ని కష్టాలు పడింది.

పాత జ్ఞాపకాలలోకి వెళ్ళిపోయింది నారాయణమ్మ.

కొడుకు రామిరెడ్డికి పది సంవత్సరాల వయస్సు. తెల్లెలో సొద్దన్నం పెట్టుకొని, పచ్చి మిరపకాయల పచ్చడి వేసుకొని కొడుకుతో కలిసి అన్నం తింటున్నది నారాయణమ్మ.

"అవ్వా కూరాకెయవ్వా," అంటూ గొల్లోల ఓబులేశు కూటిపల్లెంతో వచ్చాడు. వాడి తెల్లెవైపు చూసింది. తెల్లెలో తెల్లగా ఆ బువ్వ. పచ్చడి వేయడానికి లేస్తూ కొడుకు వైపు చూసింది నారాయణమ్మ.

ఓబులేశు ఆ బువ్వ తెల్లెవైపు ఆబగా చూస్తున్నాడు కొడుకు. మనస్సు చలించింది ఆమెకు. ఆదరాబాదరగా ఇంట్లోకి వెళ్ళి పచ్చడి తెచ్చి ఓబులేశు తెల్లెలో యేసి పంపించింది. కొడుకు వైపు చూసింది. తలొంచుకొని సొద్దబువ్వలో వేళ్ళు పెట్టి కెలుకు తున్నాడు.

"బువ్వ తిను," చెప్పింది నారాయణమ్మ.

"నాకు కాబట్నా," అని వాకిట్లోకి వెళ్ళి చెయ్యి కడిగాడు. నారాయణమ్మ మనస్సు వికలమైంది. ఆలోచిస్తూ అలాగే కూర్చున్నది.

"అమ్మా... మనమూ ఆ బువ్వ చేను కుందామమ్మా," దీనంగా అడిగాడు.

"ఆ," అంటూ తలూపింది. కొడుకు సంతోషం కోసం తలూపింది. కానీ తరువాత ఆలోచనలో పడింది.

పెళ్ళి కాకముందు తల్లిగారింట్లో తిన్న వరి

"పిల్లకు పుట్టిండ్రోజు జేసినమని కొట్లాట బెట్టుకున్నది. సద్దిబువ్వ బెట్టుకొని ఇంటింటికి బొయ్యి సెప్పి అందర్నీ ఇంటి మీందికి తోలకొచ్చి అల్లరి బట్టిచ్చింది. దీని ముందర నేను సంసారం జెయ్యలేను. పిల్లన్ జంపి నేన్ జచ్చ. మీరే ఏలుకోండి,"

బువ్వే. అత్తగారింటికి వచ్చింది... వరిబువ్వ మరిచి పోయింది. ఇక్కడంతా మెట్టభూమి. వరి పండదు.

నారాయణమ్మ ఆ ఊరికొచ్చినాంక రెండు మూడుసార్లే వరి పండింది. అదే గొప్ప. ఇప్పుడు వానల్యాడ కురుస్తా వుండయ్. అంతో ఇంతో కురిసినా సొద్దో, రాగో వేస్తారు. మెట్టభూముల్లో బరిగ, కొర్ర, ఆరిక, జొన్న పండిస్తారు. అవే తినడం అలవాట య్యింది. వరిబువ్వ కావాలంటే పోరుమామిళ్ళ చెరువు కిందకు వరికోత కెళ్ళాల్సిందే...! కూలికెల్లినోల్లకే వరిబువ్వ. లేకుంటే సొద్ద బువ్వ.

నారాయణమ్మ యేరోజూ కూలికెల్లింది కాదు. భర్త హఠాన్మ రణంతో కష్టాలొచ్చాయి తప్ప కూలి కెళ్ళాల్సిన స్థితి రాలేదు. తమకున్న పొలాన్నే సాగు చేసుకుంటూ బతుకు సాగతీస్తున్నది.

'అమ్మా! ఆ బువ్వ,' అన్న కొడుకు మాటలు పదేపదే గుర్తుకు వస్తుంటే వరుసగా నాలుగు రోజులపాటు వరికోతకు వెళ్ళింది నారాయణమ్మ. అలవాటు లేని పని, సన్నని సలుపులతో ప్రారంభమైన ఒళ్ళు నొప్పులు జ్వరంగా మారి మంచాన పడింది.

ఎప్పుడూ అడగని కొడుకు ఆ బువ్వమ్మాంటూ దీనంగా అడగడం నారాయణమ్మను కదిలించింది. కొద్దిసేపు ఆలోచించింది.

అప్పటికే పోరుమామిళ్ళ చెరువు కింద వరికోతలు జోరుగా సాగు తున్నాయి. కోతలకు కూల్లోల్లను తీసుకపోతున్న గురవయ్యను కలిసింది.

"గుర్రయ్యా నేనూ... వరికోత కొచ్చ...!" అంది. ఆశ్చర్యంతో నోటి మీద చెయ్యి పెట్టుకున్నాడు.

"అంతదూరం నువ్వేడొచ్చవు లేమ్మా...! సలికి సగిర పొద్దప్పుడే బోవాల. పిక్కల్లోతు నీళ్ళల్లో వరిగొయ్యాల కట్టంగా వుంటదమ్మా...!" ఎప్పుడూ కూలికెల్లని నారాయణమ్మను తీసుకవెళ్ళడం ఇష్టంలేక సర్ది చెప్పబోయాడు.

"లేదన్నా నేనొచ్చా... రాత్రికి బువ్వ జేసుకుంట," అని చెప్పి వెళ్ళిపోయింది.

పోరుమామిళ్ళ చెరువు కింద వరికోత కష్టమైన పనే. అర్ధరేత్రి సలికి లేసి నడుమల లోతు నీళ్ళలో సగిలేరులో దిగి పోవాల, బురదనీళ్ళలో పొద్దస్తమానం వరికోసం కట్టలు కట్టి కల్లానికి మోసి చెత్త కొట్టాల. ఇంటి కొచ్చేసరికి మధ్యాహ్నం అవుతుంది. ఇంత కష్టం చేస్తే ఇచ్చేది అయిదుసేర్లు వడ్లు.

'అమ్మా! ఆ బువ్వ,' అన్న కొడుకు మాటలు పదేపదే గుర్తుకు వస్తుంటే వరుసగా నాలుగు రోజులపాటు వరికోతకు వెళ్ళింది నారాయణమ్మ. అలవాటు లేని పని, సన్నని సలుపులతో ప్రారంభమైన ఒళ్ళు నొప్పులు జ్వరంగా మారి మంచాన పడింది.

ఒకరోజు ఓపిక చేసుకొని రొవన్ని వడ్లు రోట్లో పోసి ముక్కుతూ, మూలుగుతూ దంచి బియ్యం చేసేసరికి ప్రాణం మీదకొచ్చింది. అయినా కొడుకు కోరిక తీరుస్తున్నానన్న సంతోషం కలిగింది. బియ్యం సెరవలో పోసి బువ్వ వండి, కొడుక్కు ఆప్యాయంగా వడ్డించింది.

ఎప్పుడూ లేనిది తెల్లెల్లో తెల్లగా పెట్టిన బువ్వను చూసి కొడుకు ముఖంలో ఆనందానికి హద్దులు లేవు. ఆబగా తింటూ... "అమ్మా... ఆ బువ్వ బాగుందమ్మా," అంటూ కొడుకు అన్నం తినడం చూసి నారాయణమ్మ ముఖంలో కోటి కాంతులు. కొడుకు కోరిక తీర్చడానికి నాలుగు రోజుల పాటు పడిన కష్టాన్ని ఆ తల్లి వక్క క్షణంలో మరిచి పోయింది.

ఆరోజునుండి కొడుకు కోసం నారాయణమ్మ కూలీగా మారింది.

గడ్డి దోకుతున్న పార అదుపు తప్పి ఎడమచేతి వేలిపై పడడంతో "అబ్బా...!" అంటూ కొడుకు జ్ఞాప కాల నుండి బయటపడింది నారాయణమ్మ.

కొడుకును ఎట్ట సాకింది...! చిన్న కష్టం కూడా చేయకుండా సదివి చ్చింది. పెద్దోన్ని చేసింది. ఇప్పుడు కాటికి కాళ్ళు సాపిన తనకు కడుపుకు పిడికెడు అన్నం పెట్టడానికి మనస్సు రాలేదు వానికి.

నారాయణమ్మ కళ్ళ నుండి కన్నీళ్ళు టపటప రాలాయి. పయిట చెరుగుతో కళ్ళు పత్తుకొని గడ్డి దోకే ఓపిక నశించడంతో పార పక్కనేసి కొద్దిసేపు కూర్చుంది. అప్పటికే శరీరాన్ని నీరసం ఆవహించింది. ఇంతసేపూ వక్కాకు నోరును తడిచేస్తూ వుంది. లేకపోతే నాలుక పీక్కపోయేది.

కళ్ళు తిరుగుతున్నాయి. సోస వస్తోంది. చిన్నగా బయలుదేరాలి అనుకుంటూ... దోకిన గడ్డిని గంపకు పెట్టింది. చుట్టూ చూసింది. పక్క నున్న మిరపచేలో ఓబుల్‌రెడ్డి సేద్యం చేస్తున్నాడు. భూమికి చేతులు ఆన్చి చిన్నగా లేచి,

"ఓబుల్‌రెడ్డీ," అంటూ కేక వేసింది.

"ఏం పెద్దమ్మా."

"నాయనా.. ఈ బుట్టెత్తి నెత్తిన బెట్టి పోరా...! చిన్నగా ఇంటికి పోత,' ' అంది.

"ఇంత పొద్దన్నే గడ్డికి రాకుంటే ఏం బోతాంది. కోడలు దోక్కచ్చు కోలేదూ. నువ్వే తూగుతండవ్, గడ్డి ఇంటిక్యాడెతకపోతవ్," అంటూ బుట్టి నెత్తిన పెట్టాడు.

"సిన్నగా పోతాలే నాయినా," అని ఎముకల గూడులా వున్న శరీరంతో తూలుతూ బయలుదేరింది నారాయణమ్మ.

కొద్దిదూరం నడిచింది. తప్పటడుగులు పడడం అధికమైంది. శరీరం అదుపు తప్పుతోంది. నాలుగడుగులు వేసేసరికి కళ్ళు బైర్లు కమ్మాయి. తనకు తెలియకుండానే నెత్తి మీద వున్న బుట్టితో సహా కిందపడిపోయింది.

నారాయణమ్మ కింద పడడాన్ని దారి పక్కనే సేద్యం చేస్తున్న సుబ్బారెడ్డి చూశాడు.

"అరెరె...! ముసల్ది పడిపోయిందే...! అని పరిగెత్తుకుంటూ వచ్చాడు. పిలిస్తే నారాయణమ్మ పలకలేదు. మళ్ళీ చేలోకి పరిగెత్తి తనకోసం తెచ్చు కున్న మంచినీళ్ళు తెచ్చి ముసలామె ముఖాన చల్లి కూర్చోబెట్టాడు. నీళ్ళు పడడంతో మెల్లగా కళ్ళు తెరిచింది. రొవన్ని నీళ్ళు తాపాడు. కొంచెం తేరుకొంది.

"నాయనా..." అంటూ సుబ్బారెడ్డి వైపు చూసింది.

"ఊరక సచ్చాంటివే ముసల్దానా! ఇంత పొద్దన్నే సేనికాడికి సావ కుంటే... ఇంటికాడ సచ్చేమి. నువ్వు గడ్డి దోక్కపోతే ఏం బోయిందీ, ఈ పాయాన నీకెందుకే ఈ అగసాట్లు. కొడుకు బాగా సంపాయిచ్చండు తిని కూర్చోక," అంటూ నారాయణమ్మను దబాయించాడు.

"సేను జూజ్జామని వచ్చిన్నాయనా, ఊరక బోలేక రొవ్వంత దోక్కున్న," అంది. కడుపులోకి నీళ్ళు పోవడంతో ప్రాణం సల్లబడినట్లని పించింది. రొవ్వంత ఉశారొచ్చింది. మరికొన్ని నీళ్ళు తాగి,

"నాయనా సిన్నగా బోత బుట్టెత్తి నెత్తిన బెట్టు," అని మెల్లగా లేచింది నారాయణమ్మ.

"నువ్వు ఎతకపోలేవు పో, కోడలొచ్చి ఎతకపోద్ది, గంప ఈన్నేబెట్టి పో యాడికి బోదు," చెప్పాడు.

"సిన్నగా పోతాలే నాయనా..." అంటూ బుట్టి ఎత్తిచ్చుకొని తూలుతూ ఇల్లు చేరింది నారాయణమ్మ.

ఇంటి ముందర బుట్టి పడేసింది. అప్పటికే శరీరం అదుపు తప్పు తోంది. సపారంలోకి వెళ్ళి కుక్కిమంచంలో కూలబడింది. అప్పటికే మధ్యాహ్నమైంది.

"జేయా సంగటి తిందురా," పిలిచింది మనవరాలు.

"నాకొద్దమ్మా, కాబట్యా. నువ్వు తిన్నెవా?" అంటూ రెండు అరచేతు లతో మనవరాలి దవడలను ఆప్యాయంగా పట్టుకొని నిమురుతూ అడిగింది.

"ఆ... తిన్య. నువ్వు తిందురా జేయా," అంటూ చేతులు పట్టుకొని లాగింది.

"ఇప్పుడే వద్దమ్మా. వక్కాకేసుకున్య, మల్లొచ్చి తింటలే... నువ్వు ఆడుకో పో," అని మనవరాలిని పంపించి వేసింది నారాయణమ్మ.

నిన్నగాక మొన్న పుట్టిన పసిపిల్ల బువ్వ దిన్ను పిలుచ్చాంది. కని, పెంచిన కొడుక్కు ఆ ప్రేమ లేకపాయ. నారాయణమ్మ కళ్ళల్లో కన్నీళ్ళు సుడులు తిరుగుతున్నాయి. మూటె విప్పి వక్కాకు నోట్లో పెట్టుకొని కుక్కి మంచంలో వదిగి కళ్ళు మూసుకుంది.

సాయంత్రం మెలకువ వచ్చింది నారా యణమ్మకు. శరీరాన్ని పూర్తిగా నీరసం ఆవహించింది. కళ్ళు వాలిపోతున్నాయి. మంచం పక్కనే ఆడు కుంటున్న మనవరాలిని సైగచేసి పిలిచింది.

"రొవ్వన్ని మంచినీళ్ళు తెచ్చవామ్మా," అంటూ చిన్నగా గొనిగింది.

పరుగెత్తుకెళ్ళి నీళ్ళు తెచ్చిచ్చింది. తాగి మనవ రాలి వైపు చూసింది. మనస్సు ఆర్ద్రమైంది. మనవరాలి తలపై చేయివేసి నిమిరింది. కనుకొనల్లో నుండి రెండు కన్నీటి బొట్లు రాలాయి.

"జేయా! ఎందుకేడుచ్చండవ్," అమాయకంగా ప్రశ్నించింది మనవ రాలు.

లేదన్నట్లుగా తలూపింది. మనవరాలు ఇంట్లోకి పాయ్యింది. నీరసం తో కళ్ళు మూసుకుంది నారాయణమ్మ.

✤

సాయంత్రం ఆరుగంటలకే ఆకాశం మబ్బులతో నిండుకుంది. చూస్తుండగానే సన్నని జల్లులతో వర్షం ప్రారంభమైంది. అప్పటికే సూర్యుడు పడమటి కొండల్లోకి జొరబడడంతో చీకట్లు ముసురుకున్నాయి. చిన్నగా మొదలైన వాన పోనుపోనూ ఎక్కువ అయ్యింది. ఈసగాలి కూడా మొద లైంది. వళ్ళు గగుర్పొడిచే సలి. ఇరువైపులా అడ్డుగోడలు లేకపోవడంతో చినుకులు వచ్చి సపారంలో పడుతున్నాయి. పాత సపారం కావడంతో పై నుంచి చినుకులు ఎలుస్తూ నారాయణమ్మ పండుకున్న మంచంపై బొట్లు బొట్లుగా పడుతున్నాయి. సలికి శరీరం గడ్డకడుతున్న ట్లుగా వుంది. తట్టుకోలేక చినిగిపోయిన పాత కంబడిని చుట్టుకొని ముడుచుకొని పడు కుంది నారాయణమ్మ.

రెండు రోజులుగా అన్నం లేక ఆమె శరీరం అచేతనావస్థకు చేరు కొంటున్నది.

వాన ఉధృతంగా మారింది. సంపారం పైకప్పు పూర్తిగా తడిసి చినుకులు కురుస్తున్నాయి. పాత కంబడితో సహా నారాయణమ్మ బట్టలు పూర్తిగా తడిసిపోయాయి. నీకు తీసిపోనన్నట్లుగా వానతోపాటు ఈదురు గాలి ఎక్కువైంది. ఉరుములు, మెరుపులు ఫెళఫెళ మంటున్నాయి. ఎదురుగ్గా వున్న వేపచెట్లు గాలిదెబ్బకు వంగి నేలను కరచుకొన్నట్లు ఊగు తున్నాయి. దభదభమంటూ ఎక్కడో పాత మిద్దె గోడలు కూలిన శబ్దం. కుండపోతగా వాన. వీధులలో వర్షం నీరు పొంగి పొర్లుతున్నది. నారా యణమ్మ ఎప్పుడో తడిసి ముద్దయిపోయింది. వాన కురుస్తానే వుంది. కురుస్తానే వుంది.

సాయంత్రం ఆరుగంటలకే ఆకాశం మబ్బులతో నిండుకుంది. చూస్తుండగానే సన్నని జల్లులతో వర్షం ప్రారంభమైంది. అప్పటికే సూర్యుడు పడమటి కొండల్లోకి జొరబడడంతో చీకట్లు ముసురుకున్నాయి. చిన్నగా మొదలైన వాన పోనుపోనూ ఎక్కువ అయ్యింది.

ఇంతలో యాభైకి పైగా వున్న గొర్రెల మంద ఊర్లోకి పరుగెత్తు కొచ్చాయి. పాలంలో వానకు తట్టు కోలేక వచ్చినట్టున్నాయి. అన్నీ... నారాయణమ్మ పండుకున్న సపారంలో దూరాయి. నిలుచొను తావు లేక వకదాన్నొకటి తోసుకుంటూ... కొన్ని మంచంపైకి ఎక్కాయి. బ్యా... బ్యా... అంటూ అరుస్తున్నాయి. ఉచ్చ పోస్తున్నాయి. పెంటికలు పెడుతున్నాయి. ఒకటే రొద.

పో... తొలిచుక్క పొడిచే జాముకు వాన రొవ్వంత తెరిపిచ్చింది. సన్నగా చినుకులు పడు తున్నాయి. వానదెబ్బకు అంతదాకా ఇంట్లో వడు క్కున్న గొల్ల ఓబులేశు ప్లాస్టిక్ పట్ట కప్పుకొని, చార్జింగ్ లైటు తీసుకొని, గొర్రెలు ఎతుక్కుంటూ... నారా యణమ్మ సపారం వద్దకు వచ్చాడు.

సపారంలో గొర్రెలు చూసి మనస్సు కుదుట పడింది. అన్నీ వుండయో, లేదోనని మరోసారి లైటు వేసి చూశారు. గొర్రెలన్నీ వున్నట్లే వుంది, అనుకుంటుండగా... మంచం కోళ్ళు కనిపించాయి. ఆదరాబాదరాగా సపారంలోకి వెళ్ళి గొర్రెలను పక్కకు తోసి చూశాడు. మంచంలో కంబడి కప్పుకొని పడుకున్న ఆకారం కనిపించింది.

'అరె...! నారాయణమ్మవ్వ...! ఈన్నే పండు కొనుందే...! ఇంత సలిలో ఎట్ట బండుకున్నెదబ్బా...! ఏమైనా అవ్వ గట్టి ముసల్దే...! ఇంత వానకీడ బండుకున్నెదంటే... సలికి తట్టుకోలేకుండా వుండ అవ్వనడిగి సెక్కమొద్దు ఇప్పించుకొని నోట్లో బెట్టుకోవాల,' అనుకుంటూ...

"అవ్వా..." పిలిచాడు ఓబులేశు. నారాయణమ్మ పలకలేదు.

"నారాయణవ్వా..." మళ్ళీ పిలిచాడు. అయినా పలకలేదు.

ఓబులేశుకు అనుమానమొచ్చింది. చీమ చిటక్కిమంటే పడుకొనే మనిషి కాదు నారాయణవ్వ. అట్టాంటామె పిల్చినా పలక్కపోడమా...! ఏందబ్బా...! అనుకుంటూ మంచం మీదుగా వంగి,

"నారాయణవ్వా... నారాయణవ్వా..." అంటూ బిగ్గరగా పిలిచాడు ఓబులేశు. నారాయణమ్మలో ఎటువంటి చలనం లేదు. ఆదుర్దాగా తల పట్టుకొని కదిలించాడు. తల వాలిపోయింది.

ఓబులేశుకు భయమేసింది. అంత చలిలోనూ చమటలు పట్టాయి. ఆతృతగా పక్కనున్న మిద్దెవైపు పరుగులు తీశాడు.

"రెడ్డీ... లచ్చిందేవక్కా...." అంటూ కేకలు వేశాడు.

గట్టి మిద్దెలో వెచ్చంగా పండుకున్న రామిరెడ్డి లేచి వాకిలి తీస్తూ...

"ఏం, ఈ జామున ఏం కొంపలు మునిగాయి," అంటూ విసుగ్గా ఓబులేశును ప్రశ్నించాడు.

"రెడ్డీ... మీయమ్మ పలకడంల్యా...! సపారంలో వుంది. సూజ్జు రాండీ," అని మళ్ళీ సపారంలోకి పరుగులు తీశాడు.

కొడుకూ, కోడలూ సపారంలోకి వచ్చి చూశారు.

అప్పటికే నారాయణమ్మ అచేతనంగా పడి వుంది. సలికి బిగుసుక పోయి వుంది.

✤

నారాయణమ్మ చనిపోయిన సంగతి తెలిసి పుట్టింటి వారితోపాటు బంధువులందరూ వచ్చారు. అందరూ కన్నీళ్ళు పెట్టుకున్నారు. పుట్టింట్లో ఆమె బతికిన తీరును ఏకరువు పెట్టారు. నారాయణమ్మ కష్టపడి సంసారాన్ని ఈదిన తీరును, చివరిరోజుల్లో నారాయణమ్మ పడ్డ అగచాట్లను గుర్తు చేసుకొని గ్రామస్తులు గుసగుసలాడుకున్నారు.

"ఏమని ఈ ముండాకొడుకును గన్నెదో... అప్పట్నుంచీ కట్టాలే దానికి. వాన్నెట్ట సాకిందని...! కడాకు కూడుబెట్టక సంపిండు ముండానా కొడుకు. నాకంటే సిన్నదే! వక్కపూట ఇంత తిండి పడేసినా ఇంగ పదేల్లు బతుకు. బతికుండగా వక్కపిడ్సెయ్య లేదుగానీ, అది సచ్చినాంక హరిశ్చంద్ర నాటకమంట.

ఎట్టకేలకు తల్లికి తలకొరివి పెట్టి అంత్య క్రియల తంతు ముగిం చాడు రామిరెడ్డి.

ఆరోజు నారాయణమ్మ పెద్ద కర్మ. రాత్రి హరిశ్చంద్ర నాటకం. బంధువులతో పాటు చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు కుప్పలు తెప్పలుగా వచ్చారు. మారుమూల పల్లెల్లో జనానికి నాటకాలంటే అంత ప్రాణం. వచ్చిన వాళ్ళందరికీ విందు భోజనాలు పెట్టాడు రామిరెడ్డి. భోజనాల తంతు ముగిసింది.

నాటకం ప్రారంభమైంది. హరిశ్చంద్ర పాత్రధారి మైకు ముందుకు వచ్చాడు. అందరికీ నమస్కారాలు... తల్లి ఆత్మకు శాంతి చేకూరాలని కొడుకు వేలాదిమందికి భోజనాలు పెట్టి నాటకం వేయించడం ఆనందంగా వుంది. పెండ్లామొస్తానే తల్లులను మరిచిపోయే కొడుకులు, అత్తగారింట్లో అడుగిడి పసుపు, కుంకాలు ఆరకముందే అత్తలను తన్ని తరిమే కోడళ్ళున్న ఈరోజుల్లో నారాయణమ్మకు ఇలాంటి కొడుకూ, కోడలూ ఉండడం నిజంగా వింతే...! ఇలాంటి కొడుకును కన్న నారాయణమ్మ జన్మ ధన్యమైంది. ప్రతి తల్లికీ ఇలాంటి కొడుకు వక్కడుంటే ఆమె జీవితం సాఫల్యమైనట్లే. అందరూ వీరిని ఆదర్శంగా తీసుకోవాలి. అప్పుడే భగవంతుడు చల్లగా చూస్తాడు... కళాకారుడి పాగడ్తలు మైకులో మారుమ్రోగుతూనే వున్నాయి.

బ్రతికుండగా నెలరోజుల పాటు తల్లి రెక్కల కష్టమే పెట్టుబడి. రామిరెడ్డి దంపతుల్లో లక్ష్యం నెరవేరిందన్న ఆనందం ఉప్పొంగింది. పొగడ్తలు వినపడుతూనే వున్నాయి.

నాటకం దగ్గర నుండి ఇంటికి బయలుదేరారు రామిరెడ్డి దంపతులు. చెన్నారెడ్డి ఎద్దుల కొట్టం దగ్గరకొచ్చారు. కొట్టంలో నుండి గట్టిగా మాటలు వినపడుతున్నాయి. ఆగి చెవులొగ్గారు.

"ఏమని ఈ ముండాకొడుకును గన్నెదో... అప్పట్నుంచీ కట్టాలే దానికి. వాన్నెట్ట సాకిందని...! కడాకు కూడుబెట్టక సంపిండు ముండానా కొడుకు. నాకంటే సిన్నదే! వక్కపూట ఇంత తిండి పడేసినా ఇంగ పదేల్లు బతుకు. బతికుండగా వక్కపిడ్సెయ్య లేదుగానీ, అది సచ్చినాంక హరిశ్చంద్ర నాటకమంట. ఎవడికి తెల్దు ఈడెట్ట తల్లిని సాకింది. ఇట్టాట్నా కొడుకుల్ని పుట్టి భూమ్మీద పడ్తానే పీక పిసికి సంపాల," అంటూ చెన్నారెడ్డి ఎవరితోనో గట్టిగా తిడుతూ చెపుతున్నాడు.

భార్యాభర్తలిద్దరూ వకరి ముఖాలొకరు చూసుకున్నారు. చెన్నారెడ్డి మాటల హోరు ముందు మైకులో వస్తున్న మాటలు వినపడకుండా పోయాయి. ఇద్దరూ తలొంచుకొని అలికిడి చేయకుండా అక్కడి నుండి మెల్లగా జారుకున్నారు. ✱

గోడలు

మూలా సుబ్రహ్మణ్యం

రెండు శరీరాల మధ్యేకాదు ఒకే ఆత్మకూ రెండు దారుల మధ్య వంతెన అతి సున్నితమైనది.

- ఇక్బాల్‌చంద్

'May I have your attention please. This is the final call for passengers travelling on...' ఎనౌన్సర్ గొంతు మృదువుగా పలుకు తోంది. అప్పటివరకూ హైదరాబాద్ ఫ్లయిట్ గురించి అసహనంగా వెయిట్ చేస్తూ బలవంతంగా పుస్తకంలో తలదూర్చిన నేను ఒక్కసారి తలెత్తి చూశాను. ఎవరో అమ్మాయి గాభరాగా సెక్యూరిటీ చెక్‌వైపు పరుగెడు తోంది. నన్ను ఆకర్షించినవి ఆమె కళ్ళు. ఎక్కడో చూశాను అలాంటి కళ్ళను. ఏ విషయాన్నీ అంత తొందరగా మర్చిపోయే మనిషిని కాను నేను. యస్, గుర్తొస్తోంది. పదేళ్ళ క్రితం యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్‌లో జెన్‌బుద్ధిస్ట్ ఫిలాసఫీ మీద ప్రసంగిస్తూ సుప్రసిద్ధ కవయిత్రి సోనోమీ రాసిన అద్భుత కవిత ఏకాంత దీపం గురించి వివరిస్తుంటే ముందు వరుసలో కూర్చొని ఆసక్తిగా విని, లెక్చర్ అయిపోయాక కలిసి నాకు అర్థం కాలేదు అని మళ్ళీ చెప్పించుకుంది. చెప్పింది అర్థమయినప్పుడు ఆమె కళ్ళల్లో కనిపించిన కాంతిని నేనెప్పటికీ మరువలేను.

అరవై ఐదేళ్ళ నా జీవిత ప్రస్థానంలో ఇలాంటివి ఎన్నో అనుభవాలు. ఎయిర్‌పోర్ట్‌లు, రైల్వేస్టేషన్లు నా జీవితంలో అంతర్భాగమైపోయాయి. పేరు తెలియని స్టేషన్లలో డిసెంబర్ అర్ధరాత్రి చలిలో ఒంటరిగా వెచ్చని



టీ తాగడం, టాప్‌లేని రిక్షాలో ఊరంతా తిరుగుతూ ఫిలాసఫీ పుస్తకాలు చదవడం నాకు ఇష్టమైన పనులు. 'May I have your attention please...' ఎనౌన్సర్ చేస్తున్న ఎనౌన్స్‌మెంట్‌తో మళ్ళీ ఈ లోకంలోకి వచ్చాను. ఈసారి ఫ్లయిట్ నాది కావడంతో చదువుతున్న పుస్తకాన్ని బేగ్‌లో పెట్టి సెక్యూరిటీ చెక్‌వైపు నడిచాను. ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఫ్లయిట్ కావడంతో ఎయిర్ హోస్టెస్ చేస్తున్న మూకాభినయం చూస్తే నాకు మొదటిసారి ఫ్లయిట్ ఎక్కిన అనుభవం గుర్తొస్తోంది. ఇరవయ్యేనిమిదేళ్ళకి మొదటిసారి ఏదో కాన్ఫరెన్స్ కని విమానం ఎక్కాను. తర్వాత సెమినార్లకీ, కాన్ఫరెన్సులకీ ఎన్నో దేశాలు తిరిగాను. ఎందరో 'సోకాల్డ్ ఇంటలెక్చువల్స్'ని కలిసాను. చర్చించాను, తర్కించాను. జమీందారీ కుటుంబంలో ఆరుగురు సంతానంలో ఐదవ వాడిగా పుట్టాను. నిర్లక్ష్యంగా పెరిగాను. చిన్నప్పటి నుంచీ ముక్కుసూటిగా వ్యవహరించడం, నిష్కర్షగా తోచింది చెప్పడం వల్ల మిత్రులకన్నా శత్రువులే ఎక్కువ. అందరికీ నచ్చే విధంగా ఉండటం నాకు చేతకాదు. అద్దంలో చూసుకుంటే నా కళ్ళల్లో నాకు ఒక విధమైన ఆత్మవిశ్వాసం కనిపిస్తుంది. అందరూ దాన్ని పొగరన్నారు. ఎవరేమనుకున్నా పట్టించుకునే మనస్తత్వం కాదు నాది. ఏదేళ్ళుగా రాకపోకలు లేవని అమ్మ బాధపడుతుంటే చిన్నప్పుడు ఒకసారి మావయ్య వాళ్ళింటికి వెళ్ళాను. ఇంట్లోకి వెళ్ళగానే దారితప్పి వచ్చావేంట్రా అని అడిగారు. అంతే ఇక ఆ తర్వాత ఏ బంధువుల ఇంటికీ వెళ్ళలేదు.

మేఘాల్ని చీల్చుకుంటూ ఫ్లయిట్ ముందుకు పోతుంటే నా జ్ఞాపకాల్ని తవ్వుకుంటూ నేను వెనక్కి వెళుతున్నాను. ఎన్నో జ్ఞాపకాలు. ఇరవైనాలుగేళ్ళకే ఇండియన్ రైల్వేస్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీర్‌గా చేరడం, మరో రెండేళ్ళకే ఆ ఉద్యోగానికి నాకూ పొసగక రాజీనామా చేసెయ్యడం రాజీపడని నా మనస్తత్వానికి ఉదాహరణ. తర్కించే అలవాటు ఎక్కువ కావడం వల్ల ప్రతీదాన్నీ ఖండించాను. ప్రతి విషయంపైనా ప్రశ్నార్థకాల ధనస్సు ఎక్కుపెట్టాను. హేతుమూలమైన పాశ్చాత్య తత్వశాస్త్రం ఆ దశలో నన్ను ఎక్కువగా ఆకర్షించింది.

'నేనాలోచిస్తున్నాను కాబట్టే నేనున్నాను' అన్న రెరె డెకార్టేని అమితం గా అభిమానించాను. ఆ ప్రభావంలో హిందూ తత్వశాస్త్రాన్ని ఉట్టి ట్రాష్‌గా కొట్టిపారేశాను. ఐతే క్రమంగా ఆలోచనా, హేతువూ మనల్ని ఎంతో దూరం తీసుకెళ్ళలేవని గ్రహించాను. ఆ దశలో చదివిన హక్స్‌లీ గేయం నాకు కడదాకా గుర్తుండిపోతుంది.

"దైవసమానమైన హేతు రాహిత్యం నువ్వు
ఆకుల నడుమ అక్కసు లేక పాడుకుంటావు... నీవు
నేర్పిన జ్ఞానానికి ఉప్పొంగిపోతాను నేను!" అంటూ ఒక తుమ్మెద మీద ఆయన రాసిన ఈ గేయం, జ్ఞానం అనేది బుద్ధి, తర్కం, హేతువు వీటన్నిటికీ అతీతమైనదని ఎంతో కవితాత్మకంగా చెప్పడం అప్పటిలో నన్ను ఎంతో అబ్బురపరచింది. ఆ దశలోనే జెన్ బుద్ధిజం, అన్నిటికన్నా ఉత్కృష్టమైన హిందూ తత్వశాస్త్రాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశాను. జెన్ బుద్ధిజంలోని, హిందూ తత్వశాస్త్రంలోని సిమిలారిటీస్ మీద రీసెర్చి చేసి కాశీ హిందూ విశ్వవిద్యాలయం నుండి డాక్టరేట్ పొందాను. Zen Buddhism - An Indian's View అని నేను రాసిన పుస్తకానికి ఎన్నో అవార్డులు వచ్చాయి. ఆ తర్వాత అదే విశ్వవిద్యాలయంలో ఫిలాసఫీ ప్రొఫెసర్‌గా ముప్ఫై యేళ్ళు పనిచేసి రిటైర య్యాను. ఎదుటివాళ్ళకి ఏమీ తెలియదన్న assumptionతో చేసిన teaching profession నాకు సంతృప్తినిచ్చింది. అది నా అహం సంతృప్తి చెందడం వల్ల కావచ్చు. అందరూ గౌరవిస్తే నాకు వింత సంతృప్తి కలిగేది. ఆ గౌరవం కోసం చిన్న చిన్న ఆనందాలకి నేను దూరమయ్యానేమో అని అప్పుడప్పుడు అనిపిస్తుంది.

"ఎక్స్‌క్యూజ్‌మి సర్...," పక్కన కూర్చున్న అమ్మాయి పిలుపుతో నా గతానుభవాల నెమరువేతకి తెర పడింది. తలతిప్పి ఆ అమ్మాయివైపు చూశాను. పద్దెనిమిదేళ్ళు ఉంటాయి. ఇంకా కౌమారపు అమాయకత్వం ముఖంలోంచి పోలేదు. ఆసక్తితో కూడిన కళ్ళు ఏదో తెలుసు కోవాలనుకునే ఆ అమ్మాయి ఉబలాటాన్ని బహిర్గతం చేస్తున్నాయి. ఇన్నిసార్లు ప్రయాణించినా పక్కవాళ్ళతో మాట్లాడిన సందర్భాలు చాలా తక్కువ. వాళ్ళు స్వయంగా మాట్లాడితే గాని నేను ఎప్పుడూ చొరవ తీసుకొని మాట్లాడింది లేదు. అదీ ఫ్లయిట్‌లో ఐతే ఎవరి లోకంలో వాళ్ళు మునిగి ఉంటారు. కానీ ఈ అమ్మాయి...

"మీరు చదువుతున్న పుస్తకం..." అంటూ నీళ్ళు నములుతోంది.

నేను నవ్వి, "నీకు అర్థం కాదమ్మా. ఇది చాలా కష్టమైన పుస్తకం," అన్నాను.

"మా డాడీ కూడా ఎప్పుడూ ఇంతే సార్. ఏ పుస్తకం గురించి అడిగినా ఇలాగే చెప్తారు. నిజంగా ఆ ఫిలాసఫీ అంత కష్టమా సార్."

'కష్టం కాదమ్మా... ఫిలాసఫీ ఏమాత్రం కష్టం కాదు... ఫిలాసఫీ అంటే మనిషి మనిషిగా బ్రతకడం. అదీ మెల్లగా తెలుసుకుంటున్నాను కాబట్టే మూడు వారాల ట్రిప్‌ని కేన్సిల్ చేసుకొని, శారద దగ్గరికి వెళ్ళి పోతున్నాను...' నా అంతర్మాత నాకు చెబుతున్న మాటలు ఆ అమ్మాయికి వినిపిస్తే బావుణ్ణు.

జమీందారీ కుటుంబంలో ఆరుగురు సంతానంలో ఐదవ వాడిగా పుట్టాను. నిర్లక్ష్యంగా పెరిగాను. చిన్నప్పటి నుంచీ ముక్కుసూటిగా వ్యవహరించడం, నిష్కర్షగా తోచింది చెప్పడం వల్ల మిత్రులకన్నా శత్రువులే ఎక్కువ. అందరికీ నచ్చే విధంగా ఉండటం నాకు చేతకాదు.

శారద... పిహెచ్.డి. చేస్తున్న కాలంలో ఇంట్లో అమ్మ పోరు భరించలేక ఆమెను పెళ్ళి చేసుకున్నాను. సెకండ్‌ఫారం వరకు చదివిన పల్లెటూరి అమ్మాయి శారద. అమాయకత్వంతో కూడిన అందం ఆమెది. అమాయకత్వం, ఓర్పు, అనంతమైన సహనం కలిస్తే శారద రూపుదిద్దుకుందేమో అనిపించేది. ఏదీ తర్కించడం ఆమెకు చేతకాదు. ఎవరేం చెప్పినా నమ్మేసేది. వాదించడం వల్ల ఒరిగేదేదీ లేదని ఆమె నమ్మకం.

పెళ్ళయిన కొత్తల్లో నా పాండిత్యాన్ని ప్రదర్శించేందుకు ఆమెతో వాదించడానికి ప్రయత్నిస్తే తనకి ఏమీ తెలియదని హుందాగా ఒప్పుకోవడం నన్ను నివ్వెర పరిచింది. ఎక్కడో యాక్సిడెంట్లో పదిమంది పిల్లలు చనిపోయారని తెలిసి ఇక్కడ ఈమె విలవిలలాడి పోయేది. ఆమె అమాయకత్వానికి నాకు నవ్వొచ్చేది. ఐతే అప్పుడప్పుడు మాత్రం నేను పగలు రాత్రి అధ్య యనం చేసి తెలుసుకున్న విషయాలు ఆమె చిన్నచిన్న పదాల్లో చెప్పేస్తుంటే నాకు ఆశ్చర్యం కలిగేది. పాండిత్యం కన్నా జ్ఞానం ముఖ్యమన్న మాటకి సరైన అర్థంలా ఆమె నాకు కనిపించినా, ఆమె గొప్పతనాన్ని ఏమాత్రం అంగీకరించని ఆత్మవిశ్వాసం నాది. ఐతే అది ఆత్మవిశ్వాసం కాదు అహంకారం అని తెలుసు కోవడానికి నాకు అట్టే సమయం పట్టలేదు. అయినా ఆ విషయాన్ని కూడా ఆమె దగ్గర ఏనాడూ ఒప్పుకోలేదు.

ఒకసారి కోపంతో ఎవరినో తిడుతుంటే, 'ఎందుకండీ అందరినీ తిట్టడం? వాళ్ళని ఇలా తిట్టడం వల్ల మీకు ఒరిగేదేమిటి? వాళ్ళ బలహీనత లతో పాటు వాళ్ళని ప్రేమించలేరా?' అని అడిగింది. సూఫీ కవుల తత్వాన్ని ఒక్కమాటలో చెప్పేసిన ఆమె నా దృష్టిలో సంస్కార శిఖరాలపైకి ఒక్కో మెట్టూ ఎక్కుతూ వెళ్ళిపోతుంటే, నేను సంకుచిత మనస్తత్వాల అగాధాల్లోకి కూరుకుపోతున్నట్లు అనిపించేది. ఈ మానసిక సంఘర్షణలో అకారణంగా ఆమెను కోప్పడినా ఓర్పుతో భరించిన ఆమె చిరునవ్వు నన్ను నిలువునా కోసేసేది. అయినా పగలని పాషాణాభ్యంతరాలు నావి. ముప్పై ఎనిమిదేళ్ళ దాంపత్యంలో ఏనాడూ ఆమెకు ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వలేదు. ఒక్కసారి కూడా మనస్ఫూర్తిగా ఆమెను మెచ్చుకోని గర్వం నాది.

ఐతే కాలం ఎప్పుడూ ఒక్కలా ఉండదు. చాలా యేళ్ళుగా నన్ను మెల్లమెల్లగా దహించేస్తున్న ఈ అపరాధ భావం ఈమధ్య మరింత తీవ్ర మైంది. రోజురోజుకీ దిగజారుతున్న శారద ఆరోగ్యం అగ్నికి ఆజ్యం పోస్తోంది... ఏ లెక్చర్ ఇద్దామన్నా ఏదో మహాసర్పం వెంటాడుతున్న భ్రాంతి. ఒక మహానేత్రం మందలిస్తున్న భ్రాంతి. ఒక ప్రసంగం ఇవ్వడానికి చచ్చి బ్రతకాల్సి వస్తోంది. శ్రీలంకలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో హైకూ కవి బషో కవితా తత్వంపై ఇవ్వాల్సిన లెక్చర్ సిరీస్‌ని అర్ధాంతరంగా ముగించు కుని, రిటైరయ్యాక సెటిల్ అయిన విజయవాడ వెళ్ళిపోతున్నాను. ఆమెతో నేను నేనుగా మాట్లాడాలని అనిపిస్తోంది. కొన్ని విషయాలు తర్కానికి ఎప్పటికీ అందవేమో!

"సార్... ఏంటి సార్ చిన్న ప్రశ్నకి ఇంతలా ఆలోచిస్తున్నారు? అంత కష్టమైతే చెప్పొద్దులెండి. అయినా కాసేపట్లో ఫ్లయిట్ హైదరాబాద్‌లో లాండ్ అవబోతోంది" అని ఆ అమ్మాయి అనేదాకా నేను ఫ్లయిట్‌లో ఉన్నట్లే మర్చిపోయాను. ఆ అమ్మాయికి బై చెప్పేసి ఎయిర్‌పోర్ట్ నుంచి బయట పడ్డాను.

యుగయుగాలుగా మృత్యువు జీవాన్ని చూసి నవ్వుతున్న చిరునవ్వు. నా హృదయపు రాతిగోడల్ని బ్రద్దలు చెయ్యాలని జీవితాంతం ప్రయత్నించిన చిరునవ్వు. నా లైబ్రరీలోని తత్వశాస్త్ర గ్రంథాలన్నింటినీ త్రాసులో ఒక పక్కనపెడితే అలవోకగా తేల్చెయ్యగల నిర్మలమైన చిరునవ్వు.

హైదరాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ నుంచి రైల్వే స్టేషన్‌కి టాక్సీ శరవేగంతో దూసుకుపోతోంది. ఒక్క సిగ్నల్ పడినా అసహనం పెరిగిపోతోంది. టాక్సీలో కూర్చొని ఆమెతో ఏం మాట్లాడాలా అని ఆలోచిస్తు న్నాను. నా జీవితంలో ఎన్నో పరిశోధనా వ్యాసాలు, పుస్తకాలు రాసి ఎన్నో లెక్చర్లిచ్చిన నేను, శారదతో సంభాషణ ఎలా ప్రారంభించాలని ఇంతలా ఆలో చించడం...!

రైల్వేస్టేషన్ నుండి ఇంటికి ఫోన్ చేశాను. మంగమ్మ ఫోన్ ఎత్తి, 'అయ్యగారూ అమ్మగారికి ఆరోగ్యం ఏమీ బాగలేదు,' అని చెప్పింది. మరి ఈ విషయం నాకు వెంటనే ఎందుకు తెలియజెయ్య లేదంటే, 'అమ్మగారే చెప్పొద్దన్నారు,' అంది. 'సరే నేను వెంటనే వస్తున్నాను,' అని చెప్పి ఫోన్ పెట్టేశాను. నా శారదకు ఏమీ కాకూడదు... ట్రైన్‌లో అంతా ఇదే ఆలోచన. నేను హాస్పిటల్‌కి వెళ్ళేసరికి స్నేహితులు అంతా మూగి ఉన్నారు. మంచంపైన శారద ఏవో తెలియని శక్తుల పెనుగులాటలో మూసుకు పోతున్న కళ్ళని బలవంతంగా తెరుచుకుని ఉంది.

నా గురించే మృత్యువుని సైతం ఆపిందేమో అన్నట్టు నావైపు చూసి జీవం లేని చిరునవ్వొకటి నవ్వింది. అదే ఆమె ఆఖరి చిరునవ్వు.

యుగయుగాలుగా మృత్యువు జీవాన్ని చూసి నవ్వుతున్న చిరునవ్వు. నా హృదయపు రాతిగోడల్ని బ్రద్దలు చెయ్యాలని జీవితాంతం ప్రయ త్నించిన చిరునవ్వు. నా లైబ్రరీలోని తత్వశాస్త్ర గ్రంథాలన్నింటినీ త్రాసులో ఒక పక్కనపెడితే అలవోకగా తేల్చెయ్యగల నిర్మలమైన చిరునవ్వు.

ఒక్కసారి ఆమె బ్రతికితే ఆమె ఒడిలో తల పెట్టుకుని నా అల్ప త్వాన్ని అంగీకరించి గుండెలు పగిలేలా ఏడుద్దామని ఉంది. చివరికి నాకు ఆ అవకాశం కూడా ఇవ్వలేదు... చావులో సైతం ఆమె నన్ను జయించింది. ఏడుస్తున్నాను. కన్నీరు మున్నీరుగా ఏడుస్తున్నాను. ఆ కన్నీటి ప్రవాహంలో ఇన్నేళ్ళ అహంకారం, పాండిత్యం అన్నీ కొట్టుకుపోతున్నాయి. అనంతమైన శూన్యంలో నిరాకారంగా కనిపిస్తున్న అంతరంగం ఎదుట నిస్సహాయంగా నేను మిగిలిపోయాను.

సరదాగా...

ఒక పావులాటి ఉద్యోగి కుర్చీలో కాళ్ళు రెండూ పైన పెట్టుకు కూర్చుని దీక్షగా ఒక పక్కన పెట్టిన కాగితాలను చింపి పోస్తున్నాడడు. ఒక పత్రికా కార్యాలయానికి ప్రముఖ కవి, రచయిత ఆరుద్ర వెళ్ళేసరికి కంటబడిన దృశ్యం ఇది. ఆరుద్ర కాసేపు ఆయన వంక ఎగాదిగా చూసి పక్కనే ఉన్న మిత్రుడిని ఎవరీ 'చింపా'జీ అని అడిగారు.

... ఆ తరువాత నీ ఇష్టం

నచికి



"... కనీసం మేము ఆఫీస్‌కి వెళ్ళే టైమ్ కైనా లేవకపోతే ఎలా? టైమ్ చూడు... తొమ్మిది ముప్పావు! నిన్నేమైనా ఆరింటికి లేవమన్నామా? లే... లే!" అమ్మ గొంతు.

'లేస్తాడులే... ఎప్పుడు పడుకున్నాడో? నాకు లంచ్‌బాక్స్‌లో స్పూన్ పెట్టమంటే... మధ్య వాడు లేవకపోతే ఏం? బయలుదేరు, టైమవు తోంది..." నాన్న గొంతు హాల్లోంచి వినిపిస్తోంది.

"పడుకునేసరికే ఐదయింది... ఇవాళ క్లాసులు కూడా లేవు. లేస్తాలే, మీరు వెళ్ళండి!" గొణుగుతూ ఇటు తిరిగి పడుకున్నాను, సగం తెరిచిన కళ్ళతో. ప్రక్కనే నా రూమ్మేట్. అప్పుడు గానీ ఇండియా నుంచి యు.ఎస్.కి రాలేదు నేను!

బెడ్‌రూమ్ ఇంకా చీకటిగానే ఉంది. టైమ్ చూసాను. ఇంకా తొమ్మిదిన్నరే! (అయినా అలా తొందరపెట్టడం అమ్మకి అలవాటే, నేను ఇండియాలో ఉంటే!) ఇవాళ క్లాసులు లేవు, నిజమే... కానీ రీసెర్చ్ చెయ్యక తప్పుతుందా? కళ్ళు మండుతూ ఉన్నా లేచి కూర్చున్నాను. మొన్న మొదలుపెట్టిన పాలిమరైజేషన్ ఎక్స్‌పరిమెంట్ ఇంకో నాలుగైదు గంటల దాకా పూర్తికాదు, అంత లోపు ఏం చెయ్యాలా అనుకుంటూంటే గత కొన్నాళ్ళుగా మనసులోనే కదులుతూ బయటికి రాక తన్నుకుంటున్న దేమిటో... పేపరు, పెన్నూ తీసుకుని బలవంతంగా కూర్చుంటేగానీ లాభం లేదనిపించింది... శిలువ వేసిన వ్యక్తి చిత్రం కళ్ళ ముందు మెదలుతోంది. కానీ, మాట బయటికి రాదు, నాలుగైదు రోజుల నుంచీ ఇంతే! ఫ్రెష్ అయ్యి వచ్చాక ఆలోచించవచ్చని లేచి తయారయ్యి పుస్తకాల అర దగ్గర నిలబడి పుస్తకాలు చూస్తున్నాను. లోపల కొట్టుకుంటూన్న ఐడియా ఏమైనా చదివితే బయటికొస్తుందేమో అని ఆశ.

"...ఏమన్నా పనేన? అన్నన్ని పుస్తకాలు! క్లాస్‌బుక్స్ అయినా కాదు, అమెరికాకి మోసుకుపోతాను అంటావు పైగా, ఇక్కడే టైమ్‌వేస్ట్ అనుకుంటే! ఖర్చు తక్కువా అంటే పదిహేను వందలు ఒక్కసారి బుక్‌షాప్‌కి వెళితే! అసలు అవన్నీ చదువుతావా? అట్ట కూడా నలిగినట్టు లేదు కొన్ని పుస్తకాల కైతే!" నాన్న గొంతు గతంలోంచి మోగుతోంది. చెయ్యి అప్రయత్నంగా అభిజ్ఞాన శాకుంతలం దగ్గరకు వెళ్ళింది. నిజమే, అట్ట కూడా నలగలేదు. పూర్తిగా చదివేంత సంస్కృతం రావాలిగా ముందు. ఇంటర్మీడియెట్‌లో ఉండగా కొత్త భాష అని ఫ్రెంచ్ తీసుకున్నాను, అక్కడికేదో సంస్కృతం పాత భాష అయినట్టు! ప్రక్కనే ఉన్న బైబిల్ మీద నేనే అతికించిన 'శిలువ పై క్రీస్తు!'... శిలువ... లాభం లేదని మళ్ళీ పేపర్ ముందు కూర్చున్నాను.

"ఇప్పటి నుంచీ నీకు ఇదేం పిచ్చిరా? నా వయసుకు ఏం తోచక నేను రాస్తున్నానంటే అదో రకం!" కొన్నిసార్లయినా అచ్చులో తన పేరు చూసుకున్న మా తాతగారి గొంతు.

"ఇదేం రామకోటి కాదుగా, వయసుడిగిపోయాక గానీ వ్రాయక పోవటానికి!" ఇండియాలో ఉండగా నేను ఇవ్వని సమాధానం ఇప్పుడు బయటికొచ్చింది.

"...అయినా సాహిత్యం కూడు పెడుతుందా? ఆ పిహెచ్.డి ఏదో పూర్తి చెయ్యి ముందు... ఆ తరువాత నీ ఇష్టం నువ్వేం చేస్తావో!" ఎవరి గొంతు అయితేనేం, ఈ చివరి వాక్యం మాత్రం నేను పదవ తరగతి నుంచి వింటూన్నదే. 'నువ్వు ముందు ఇది పూర్తి చెయ్యి... తరువాత నీ ఇష్టం!' సాహిత్యం కూడు పెడుతుందా?... శిలువ మీది మనిషికి కాళ్ళ క్రింద ఆధారం లేదు!

మనసును ఒకవైపుకు లాగేస్తున్నాయి ఇవాళ (ఇవాళ అనే ఏమిటి?!) భారతదేశం గురించిన ఆలోచనలు... పాలిమరైజేషన్ సరిగ్గా అవుతుందో లేదో... అది కాస్తా చెడిందో, భేతాళుడి కోసం మళ్ళీ చెట్టెక్కాలి. మళ్ళీ మూడు రోజులు, మూడు వందల డాలర్లు (డబ్బు నాది కాదు కనుక కొంత ఫరవాలేదు, కానీ చాకిరీ నాదేగా!)... శిలువపై చేతులు చెరోవైపూ లాగేస్తూ బందీ అయిన మనిషి... అచేతన...

బొమ్మకు మెల్లిగా రూపం వస్తోంది... ఆ శిలువపై మనిషి మొహంలో పోలికలు తెలుస్తున్నాయి... బాగా పరిచయమైన మొహం - రోజూ అద్దంలో కనిపించే మొహం - నిర్వికారంగా, నిస్త్రాణగా!

✤

కాన్వొకేషన్ జరుగుతోంది. తలపైన క్యాప్ అప్పుడప్పుడు గుచ్చు కుంటోంది... మనసెక్కడో ఉంది. మైక్‌లో నా పేరు వినపడగానే గాలిలో తేలుతూ డయాస్ ఎక్కాను. కుడిచెయ్యి డిగ్రీ సర్టిఫికెట్ అందుకుంది, తరువాత అందరితో కరచాలనం చేస్తోంది. మరో చెయ్యి తన వంతు ఎప్పుడో, దేనికో తెలియక కదలకుండా చూస్తోంది...

"... ఈరోజు కోసమే కన్నా, ఇన్ని కష్టాలు పడ్డాము... నిన్ను కష్టపెట్టాము!" అమ్మ గొంతు వణికింది. "ఇంక నువ్వు కవితలే రాస్తావో, కథలే సృష్టిస్తావో నీ ఇష్టం!" అంతకు ముందు సాహిత్యసృష్టి చేసిన ఆమె గొంతులో ప్రేమ, గర్వం, సంతోషం, తృప్తి... టెలిఫోన్ రిసీవర్ చుట్టూ ఎడమచెయ్యి ఆప్యాయంగా బిగుసుకుంది... కాళ్ళు బలంగా భూమి మీద ఆనాయి... ఒక్కక్షణం... "ఇంక నీ ఎడ్యుకేషన్ లోన్ తీర్చేస్తే మన కష్టాలన్నీ గట్టెక్కినట్టే!" ... శిలువ కింద ఎవరో... చేతిలో ఏదో పాడుగ్గా, చివర్లో మెరుస్తూ... "పోస్ట్‌డాక్ ఏదో అన్నావే... ఎంత... ఒక సంవత్సరమే... నీకూ ఎక్స్‌పీరియన్స్ వచ్చినట్టుంటుంది... కదూ!"

రిసీవర్ కుడిచేతిలోకి మార్చుకున్నాను. ఎడమచెయ్యి ప్యాంట్ జేబులో దాక్కుంది. కాళ్ళ క్రింద భూమి జారిపోతోంది...

సరదాగా...

సముద్రపు ఒడ్డున ఒక మగ పీత ఆడ పీతని కలిసి, పెళ్ళి ప్రసక్తి తీసుకువచ్చింది. పెళ్ళికొడుకు సాటి పీతల్లా అడ్డంగా కాకుండా నిలువుగా ఫిమేల్ పీత గమనించింది. ఆ స్పెషల్ క్వాలిటీకి ముచ్చటపడి, 'సరే,' అంది. పెళ్ళితంతు పూర్తి అయింది. బంధుమిత్రులు ఇసక జల్లి దీవించారు కొత్త జంటని. హడావిడి సద్దుమణిగాక చూస్తే మొగుడు పీత అన్ని పీతల్లాగే అడ్డంగా నడుస్తోంది.

"అదేంటి నిన్న నిలువుగా నడిచావు కదా, ఇప్పుడేమైంది," అని నిలదీసింది ఆడపీత.

"ఇది మరీ చోద్యంగా ఉంది. రోజూ అంతంత తాగాలంటే కష్టం. పైగా ఆరోగ్యానికి కూడా మంచిది కాదు," అన్నాడు మగపీతడు అడ్డంగా నడిచి వెళ్తూ.

ఎ టిపికల్ టీనేజర్

జొన్నవిత్తుల శ్రీనాథ్



"డా"డ్," అన్నాడు క్రిస్ గట్టిగా, "I'm bored already." పదిహేడేళ్ళుంటాయి మా సుపుత్రరత్నానికి. ఇప్పుడే హైస్కూలుకొచ్చాడు. మొన్ననే డ్రైవర్స్ లైసెన్సు కూడా వచ్చింది. వేసవి సెలవలు మొదలుబెట్టి నప్పటి నుంచీ రోజూ కారు తీసుకుని ఎక్కడికో షికార్లకెడుతూ ఉంటాడు. ఒక్కడే ఏం వెళ్ళడు, వాడికున్న ఇద్దరు స్నేహితులు, జాన్ అనే కుర్రవాడు, జూలియా అనే అమ్మాయితో కలిసి వెళతాడు (నాకు తెలిసినంతవరకూ). వీళ్ళు ముగ్గురుకలిసి ఊరుమీద పడి రోజంతా ఎక్కడుంటారో, ఏం చేస్తారో తెలీదు.

మా పుత్రరత్నానికి తెలుగు ఒక్క ముక్కైనా రాదు. కృష్ణా అని ముద్దుగా పేరు పెడితే దాన్ని ముచ్చటగా క్రిస్ చేసుకున్నాడు. వాడి తిండి కూడా అంతా అమెరికన్ తిండే. చిన్నప్పటి నుంచీ అలవాటైపోయింది మరి. ఇప్పుడనుకుని ఏం లాభం? చిన్నప్పుడు సంగీతం మీదా, తెలుగు సినిమాల మీదా కొంచెమైనా ధ్యాస ఉండేది, ఇప్పుడది కూడా లేదు. పగటి పూట వాడి గదిలోకి వెళితే, రాక్ మ్యూజిక్ గట్టిగా వినబడుతూ ఉంటుంది. రాత్రైతే కొంచం కనికరించి హెడ్‌ఫోను పెట్టుకుంటాడే గానీ ఆ పిచ్చి మ్యూజిక్ మానడు.

మొత్తానికి చెప్పాలంటే ఒక టిపికల్ టీనేజర్.

ఇక లాభంలేదు, ఈసారైనా సెలవల్లో, మా ఊరొకసారి వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. వీడు మరీ చేయి జారిపోకముందే ఒకసారి మన ఊరు చూపించాలి, అక్కడి వాతావరణం ఒకసారి వాడు

అనుభవించాలి అనుకున్నాను. మా ఆవిడకు లీవు దొరకలేదు... అయినా సరే, వెళ్ళాలని పట్టుబట్టాను.

అరిచి గోలచేశాడు. ప్రాజెక్ట్ వర్క్ అన్నాడు, బేస్‌బాల్ ప్రాక్టీస్ అన్నాడు. దేనికీ నేను ఒప్పుకోలేదు. ఇక తప్పక నాతోబాటు ఫ్లయిటెక్కాడు. కానీ, ఎక్కినప్పటి నుంచీ ఒకటే గొడవ...

"Tell me again, Dad, why do we need to go to India now?"

ఏమి చెప్పాలో తోచక, తాతయ్య, మామ్మ నిన్ను చూడాలని చాలా అనుకుంటున్నారని చెప్పాను.

గంటల తరబడి ప్రయాణం... నిద్రాహారాలు సరిగ్గా లేకుండా, రెండుసార్లు ప్లేనులు మారి చివరికి జెట్‌లాగ్‌తో హైదరాబాదు చేరాము. ఆ రాత్రికక్కడ హోటల్లో పడుకొని మర్నాడు మా ఊరుకు బయల్దేరాము. రాత్రంతా ఇద్దరికీ సరిగ్గా నిద్రపట్టలేదు. రైలు బయల్దేరగానే ఇద్దరికీ కునుకు మొదలైంది... చాలాసేపే పడుకున్నాం. కళ్ళు తెరిచేసరికి సాయంత్రం కావస్తున్నది. కిటికీలోంచి బయటకు చూశాను. పచ్చని పొలాలు, ఎటు చూసినా చిరుగాలికి ఊగుతూ వరిపైరు. చాలా ప్రశాంతంగా ఉంది. ఏదో స్టేషన్ వస్తున్నట్టుంది, ట్రైను నెమ్మదిగా వెడుతోంది. అందుకేనేమో నాకు మెలకువ వచ్చింది. కృష్ణ కూడా నెమ్మదిగా కళ్ళు తెరుస్తున్నాడు.

"Dad, can we get some coffee?" అన్నాడు.

ఇక్కడ ట్రైన్లో అటువంటివి దొరకవు. ఇదిగో స్టేషనేదో వస్తున్నట్టుగా ఉంది, అక్కడ తెప్పిద్దాం అని సర్ది చెప్పాను.

స్టేషన్‌లో కాఫీ వాడికి నచ్చలేదు. అసలు వాళ్ళ కప్పులు చూడడానికే అసహ్యంగా ఉన్నాయి. నాకేదో అలవాటు కాబట్టి తాగేశాను. వాడు మాత్రం కోక్ తెచ్చుకుని తాగడం మొదలుబెట్టాడు.

"Howmuch longer, dad?" అని అడిగాడు.

పాపం అప్పటికే రెండురోజుల నుంచి ప్రయాణం... ఇంకో గంటన్న రుంటుందని చెప్పాను.

చివరికి మా ఊరు వచ్చింది. మా అక్కయ్య లతా, బావగారు మోహనూ మాకోసం స్టేషనుకొచ్చారు. ట్రైను మళ్ళీ బయల్దేరేలోగా గబగబా మా పెట్టెలు దింపించాడు వాళ్ళ డ్రైవరు. చాలా సంవత్సరాల తరువాత వీళ్ళని చూస్తున్నాం కాబట్టి అందరూ చాలా ఎక్సైటెడ్‌గా ఉన్నారు. లత కృష్ణ దగ్గరికి వచ్చి పలకరించింది. "ఏరా ఎలా ఉన్నావు?! క్రిందటిసారి చూసినప్పుడు ఇంత చిన్నగా ముద్దొస్తూ ఉండేవాడివి, ఎంత ఎదిగిపోయావ్! మీ అమెరికాలో నీకు బాగా సరిపోయినట్టుందే!"

పాపం వాడికి ఒక్క మాట కూడా అర్థం కాలేదని వాడి మొహం చూసిన లతకి అర్థమయింది.

How are you doing, Krishna, you look so big now!" అన్నది.

"I'm fine, aunty! But can you please not call me that, aunty, please call me Krish," అన్నాడు.

"ఇంత మంచి పేరు పెట్టుకుని ఇదేం ఖర్మరా నీకు!" అంది. కానీ, అప్పట్నుంచీ లత వాడిని అలాగే పిలవడం మొదలుపెట్టింది. అందరం వాళ్ళ కారులో ఎక్కి ఇంటికి బయలుదేరాం.

మరీ అంత చిన్నదేమీ కాదు మా ఊరు. ఊరవతలంతా పొలాలు ఉన్నా ఊరిలో కొంచెం మోడర్న్‌గా షాపులు, సినిమా థియేటర్లు అవీ ఉన్నాయి. ఒక మంచి జూనియర్ కాలేజీ, హాస్పిటల్ కూడా ఉన్నాయి. మా ఇల్లు ఊరికి చివరిగా ఉండటం వల్ల, ఊరంతా దాటి వెళ్ళాల్సి వచ్చింది. నేను పుట్టిన పెరిగిన ఊరైనా, చాలా మార్పులు రావడం వల్ల కొన్నికొన్ని చోట్ల అసలు గుర్తే పట్టలేకపోయాను. నేను వెళ్ళిన స్కూలు, కాలేజి ఇవన్నీ కృష్ణకి చూపిస్తూ వచ్చాను. వాడికి కొంచెం విసుగెత్తినా పాపం ఓపిగ్గా నా సోదంతా విన్నాడు. చాలా మంచి కుర్రాడే, పాపం... అనిపించింది.

"Dad, can I call Julia now?" అన్నాడు, సెల్‌ఫోను తీస్తూ. ఏర్పోర్ట్ చేరిన వెంటనే అద్దెకి తీసుకున్నాడు ఈ ఫోను. లత ఆశ్చర్యంతో చూసింది, కానీ నా మొహంలో చిరాకు చూసి ఏమీ అనలేదు. ఇప్పుడు కారులోంచి ఎందుకు, ఇంటికెళ్ళాక తీరికగా చేసుకుందువుగానని నచ్చచెప్తే, సరేనన్నాడు.

ఒక అరగంట ప్రయాణం తరువాత చివరికి మా ఇంటికి చేరాం. మా అమ్మా, నాన్నగారు బయట వరండాలో కూర్చుని మాకోసం ఎదురు చూస్తున్నారు కాబోలు, కారు గేటు దగ్గరికి రాగానే ఇద్దరూ బయటికి వచ్చి స్వాగతం పలికారు. అమ్మ నన్ను పలకరించి కృష్ణని గట్టిగా కౌగలించుకొంది.

కృష్ణ చిన్నప్పుడు, వీళ్ళోసారి అమెరికా వచ్చి మాతో ఒక ఆరునెలలు గడిపారు. అప్పుడు వీడు రోజంతా మామ్మా మామ్మా అంటూ మా అమ్మ వెంటే తిరిగేవాడు. దానితో ఆమెకు కూడా వాడితో చాలా చనువు. రోజంతా వాడి బాగోగులన్నీ చూసేది. రోజూ వాడికి మామ్మ దోసె తింటేగానీ తెల్లారేది కాదు. తరువాత వాడితో కూర్చుని వాడికి చిన్నచిన్న పాటలు, పద్యాలు అవీ నేర్పేది. స్నానం చేయించడం, భోజనం పెట్టడం, నిద్రపుచ్చడం... అన్నీ చాలావరకు తనే చేసేది. పాపం, ఆ తరువాత ఆరోగ్యం అంత బాగుండకపోవడం చేత మళ్ళీ వాళ్ళు అమెరికా రాలేకపోయారు. మేము కూడా మా ఉద్యోగాల గొడవల్లో పడి వీలు కుదరక ఇండియా రావడం తగ్గించేశాం. పదేళ్ళ తరువాత ఇదే మళ్ళీ వీడిని మా అమ్మ చూడడం.

"రారా కృష్ణా, నీకోసం దోసెపిండి తయారుగా అట్టేపెట్టాను. మామ్మ దోసె వేసిస్తానా," అని లాక్కుపోయింది వాడిని. ఆవిడ భాష వాడికి అర్థమయినట్టు లేదు కాని ఆవిడ మమకారం మాత్రం అర్థమయి ఉంటుంది, తీయబోతున్న సెల్‌ఫోను లోపల పెట్టేసి వెనకాలే వెళ్ళాడు. ఏదో అతి కష్టం మీద ఆవిడ వేసిన దోసె పూర్తిచేసి, రెండో దోసె వద్దని లేవబోయాడు.

"అమెరికా బావకి దోసె నచ్చినట్లు లేదే మామ్మా!" అని వినిపించింది తలుపు దగ్గర నుంచి. అందరం తిరిగి చూశాం. తరువాత తల్చుకుంటే నాకే నవ్వు వచ్చింది. అచ్చం తెలుగు సినిమాల్లో హీరోయిన్ ఎంట్రన్స్‌లా ఉంది ఆ సంఘటన. ఆకుపచ్చని పరికిణీ, ఎర్రటి ఓణీ వేసుకుని తెలుగుదనం ఒలకపోస్తూ, ఒక పదహారేళ్ళ ఊర్వశి అక్కడ నిల్చుని ఒక చిరునవ్వుతో కృష్ణని చూస్తోంది. ఎవరీ ఊర్వశి? మా అమ్మను బామ్మ అని పిలిచిందేమిటి! కొంపతీసి ఇది... 'ఓ, వచ్చావా తల్లీ! దా, నీకు కూడా వేసి ఇస్తాను మామ్మ దోస!" అని ముద్దుగా పిలిచి కూచోబెట్టి, నా వంక తిరిగి, "మన లక్ష్మిరా, గుర్తుపట్టలేదా?" అంది మా అమ్మ.

లక్ష్మి! అంటే మా అక్కయ్య లత కూతురు! ఎప్పుడో చిన్నప్పుడు ఒకసారి వాళ్ళు హైదరాబాదు తీసుకొస్తే చూశాం. కృష్ణయితే అసలు చూడలేదు. అప్పటికి ఆ అమ్మాయికి ఓ పదేళ్ళుండి ఉంటాయేమో... పొట్టిగా, కొంచెం లావుగా, కళ్ళకి సోడాబుడ్డి అద్దాలేసుకుని ఉండేది. ఇప్పుడు చూస్తే మాత్రం ఈ రంభెవరా అనిపించేలా తయారయింది!

నా సంగతి సరే, ఆ మాట విని గబుక్కున పైకి చూసిన కృష్ణ మంత్రముగ్ధుడిలా చూస్తూనే ఉండిపోయాడు. లేవబోతున్న వాడు కాస్తా

మళ్ళీ కూర్చున్నాడు. "mamma, can I have another one too?" అని అడిగాడు.

అమ్మ ఆశ్చర్యపోయి వాడి వంక ఒకసారి చూసి, "తప్పకుండారా నాన్నా, కూర్చో. లక్ష్మికి ఇది వేశాక నీకొకటేస్తాను," అని చెప్తే, కృష్ణ తలూపాడు.

లక్ష్మి ముసిముసిగా నవ్వుకుంటోంది. మామ్మవైపు తిరిగి అది కూడా అడిగింది, అమెరికన్ ఆక్సెంటు తెప్పించుకొని, "mamma, can I have one."

"ఛీ ఊర్కోవే పెంకిపిల్లా. అలా ఎగతాళి చెయ్యకూడదు బావని!" అని చివాట్లు పెట్టింది అమ్మ. చిత్రమేమిటంటే, మావాడికేదో కోపం వస్తుందని నేను తిరిగి చూస్తే, వాడేమో సిగ్గుపడుతున్నాడు. కొంపదీసి వీడికి లవ్వు కాదుగదా! ఇప్పటికే వీడికి నలుగురో, అయిదుగురో గర్ల్ ఫ్రెండ్స్ న్నారు. పాపం ఈ పిచ్చి పల్లెటూరి పిల్లకి ఏమైనా ఆశపెట్టి వదిలేస్తే అది తట్టుకోలేదు. అమెరికా పద్ధతులు ఇక్కడ పనికిరావని వాడికి గట్టిగా చెప్పాలని నిర్ణయించుకున్నాను.

లక్ష్మి మామ్మని కోపంగా చూసి నోరు మూసుకుంది. కానీ పాపం ఎక్కువసేపు మాట్లాడకుండా ఉండలేదు కాబోలు. "ఈ రాత్రికి దోసేనా బామ్మా, లేక భోజనమేమైనా పెడతావా?" అన్నది.

"కృష్ణకి మామ్మ దోసె అంటే చాలా ఇష్టంలే, అందుకే వాడికోసం దోసె వేశాను. అందరూ చేతులూ, కాళ్ళు కడుక్కొని వస్తే హాయిగా భోజనం కూడా చేద్దాం!" అని చెప్పింది మా అమ్మ. వెంటనే అందరం తయారై వచ్చి కూర్చున్నాం.

ఎన్నాళ్ళకి అమ్మ వంట మళ్ళీ రుచి చూడగలిగాను! దేశదేశాలలో gourmet 5 star restaurants లో భోజనం చేసినా, అమ్మ వంటని ఆరగించిన తృప్తి రాదే! ఆలుగడ్డ వేపుడూ, తీయగా పుల్లగా పులుసూ, కారం ఉట్టిపడేలా ఆవకాయ, కడుపు చల్లార్చడానికి కమ్మని పెరుగు... పల్లెటూరి భోజనమైనా విందు భోజనంలా అనిపించింది నాకు మాత్రం. ఇక్కడి వాళ్ళయితే అదృష్టవంతులు. రోజూ తినేవే కాబట్టి మరేమీ ఆలోచించకుండా తినేస్తున్నారు. కాని నేను మాత్రం ఒక్కొక్క మెతుకు జాగ్రత్తగా నమిలి దానిలో రుచి ఏ మాత్రం వృధా కాకుండా అనుభవిస్తూ తిన్నాను.

భోజనాలు అయిపోయాక లక్ష్మి, లత, మోహన్ సెలవు తీసుకుని వాళ్ళ ఇంటికి వెళ్ళడానికి సిద్ధమయ్యారు. ఇక పట్టలేక అడిగాడు మావాడు, "will we see you again tomorrow?" అని, లక్ష్మి వంక చూస్తూ.

"అవునే, రేపు ఆదివారం సెలవేగా, బావని సినిమాకి తీసుకెళ్ళు!" అంది అమ్మ. వేరే ఏమైనా చేద్దామనుకుందేమో సెలవు రోజున, కొంచెం చిరాకొచ్చింది లక్ష్మి ముఖంలో. కానీ ఒప్పుకుంది. మర్నాడు పదకొండు గంటలకు వస్తానని చెప్పింది. వాళ్ళందరూ బయలుదేరారు.

✤

"Dad, can you teach me telugu," అన్నాడు మర్నాడు సాయంత్రం మావాడు. ఔరా! ఇన్నేళ్ళ నుంచీ మేమెన్ని విధాలుగా పోరుతున్నా ససేమిరా నేర్చుకోనన్నావు! ఇప్పుడేం ముంచుకొచ్చింది, అని అనుకుంటూ, "ఎందుకురా మామ్మకి నీ ఇంగ్లీషు అర్థమౌతోంది గదా," అని అడిగాను.

"Not her, dad, she's cool! But..." కొంచెం గుచ్చిగుచ్చి అడిగితే పూర్తి కథ బయటపడింది. లక్ష్మికి కాలేజీలో రవి అనే ఒక స్నేహితుడున్నాడుట. అతను కూడా వీళ్ళతో లంచ్‌కి వచ్చాడట. ఆ తరువాత వీళ్ళు ముగ్గురూ కలిసి సినిమాకెళ్ళారట. లక్ష్మి మధ్యలో కూర్చుంటే, ఇద్దరు మొగాళ్ళు ఇరువైపులా కూర్చున్నారట. రవితో లక్ష్మి తెలుగులో ఏం మాట్లాడుతోందో తెలుసుకోవాలని వీడికి చాలా ఉబలాటంగా ఉందట.

తెలుగు మాట్లాడటం, అర్థమవ్వడం అంత తేలికగా రావురా అని చెప్పి, సరే నేర్చుకుందువుగాని అని నచ్చజెప్పాను. ఇదే సమయం అని కొంచెం మొదలుపెట్టాను. "ఒరేయ్! మరి మీ జూలియాకి కాల్ చేశావా?" అని అడిగాను.

"No, dad, I don't feel like it," అన్నాడు. దాన్ని తెలుగులో చెప్పించాను వాడిచేత. వాడి మొదటి తెలుగు పాఠం అన్నమాట. "లేదు నాన్న, నాకు చెయ్యాలనిపిచ్చట్లేదు."

అప్పుడు నా లెక్చరు మొదలుపెట్టాను. లక్ష్మి ఒక పల్లెటూరి పిల్ల, నువ్వు ఇంకో వారంరోజుల్లో అమెరికా వెళ్ళిపోయేవాడివి, నువ్వు దానితో ఏమీ పిచ్చివేషాలు వెయ్యకు, అది దాని స్నేహితులతో ఏం మాట్లాడుకుంటే నీకెందుకు, వాళ్ళ గొడవ వాళ్ళను చూసుకోని అని చెప్పాను. ఏదో కొంచెం దుఃఖం వచ్చింది వాడి ముఖంలోకి. కానీ ఏమీ జవాబు చెప్పకుండా నే చెప్పిందంతా విన్నాడు.

మా క్రిస్‌ది మొండిపట్టే. మర్నాడు లేచినప్పటి నుంచి టివి దగ్గర కూర్చుని తెలుగు ప్రోగ్రాములు పెట్టుకొని చూడడం మొదలుపెట్టాడు. మా అమ్మని పట్టుకున్నాడు మాటలకి అర్థాలు చెప్పమని. వాడి తెలుగంతా మామీద ప్రయోగం చేయడం మొదలుపెట్టాడు. మేమంతా ఏదో నవ్వాపుకుని వాడితో మాట్లాడటానికి ప్రయత్నం చేసినా మా ఇంట్లో పనివాళ్ళకీ, పక్కింటి పిల్లలకీ ఇదంతా చాలా వింతగా ఉండేది. పాపం వాడ్ని చూసి నవ్వడం, వాడిని వెక్కిరించటం కూడా మొదలుపెట్టాను. అయినా ఏమీ పట్టించుకోకుండా వాడి కృషి కొనసాగిస్తూ ఉన్నాడు.

ఓ రెండురోజుల తరువాత ఓ సాయంత్రం లక్ష్మి మళ్ళీ మా ఇంటి కొచ్చింది. వీడు అప్పుడు దీక్షగా ఓ తెలుగు సీరియల్ చూస్తున్నాడు. "హలో, క్రిస్," అని పలకరించింది.

చాలా సీరియస్‌గా తల పైకెత్తి, "లక్ష్మీ, నన్ను ఇక నుంచీ కృష్ణా అని పిలుస్తావా?" అన్నాడు.

లక్ష్మి ఆశ్చర్యంతో వాడివంక చూసింది. "Did you really learn Telugu or did you just memorise that!?" అంది. ఇదంతా వింతగా అనిపించింది నాకు. వీడు తెలుగులో మాట్లాడుతుంటే లక్ష్మి వీడితో ఇంగ్లీషులో మాట్లాడటం.

"కాదే లక్ష్మీ, నిజంగానే నేర్చుకుంటున్నాడు, పాపం రోజంతా కష్ట పడుతున్నాడు!" అన్నది అమ్మ.

"అబ్బో, అమెరికా బావని మన తెలుగు మీద ఇంత ఇష్టం ఎప్పుడు పుట్టుకొచ్చిందో!" అన్నది లక్ష్మి. ఇది విన్న కృష్ణ ఆడపిల్లలా కొంచెం సిగ్గు పడుతూ ఏదో జోక్ చేస్తున్నట్లు, "నీకోసమే," అన్నాడు.

వాడు జోకుగా చెబుదామనుకున్నా లక్ష్మి ఏమీ నవ్వలేదు, వాడిని వెక్కిరించలేదు. ఒకసారి వాడివంక చూసి ఏదో ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయింది.

కాలేజీలో చాలా పనుంది కాబోలు, ఆ తరువాత మళ్ళీ మూడు నాలుగురోజులు లక్ష్మి కనపడలేదు. మేమంతా చుట్టుపక్కల ప్రదేశాలు చూడడానికి వెళ్ళాము. పెద్దగా చూడదగినవేవీ లేకపోయినా, ఊరుదాటి

బయటికి ఎటు వెళ్ళినా పచ్చని పొలాలతో చాలా ప్రశాంతంగా ఉంటుంది. పక్కన కొండ మీదున్న అమ్మవారి ఆలయానికి, కొత్తగా కనుగొనబడిన గుహలకీ, అలా షికారు వెళ్ళాం. కృష్ణ పెద్దగా ఏమీ సంతోషంగా లేడు. ఏదో మాతోబాటు వస్తున్నాడేగాని వాడి మనసంతా ఇంకెక్కడో ఉందని తెలుస్తూనే ఉంది.

ఓ రెండురోజులుండి, ఇక ఉండబట్టలేక మామ్మ నడిగాడు, లక్ష్మి మళ్ళీ ఎప్పుడొస్తుందని. పాపం చిన్నపిల్లాడు, మనతో వీడికేం తోస్తుంది, అంటూ ఇంటి కెళ్ళగానే లతకి ఫోన్ చేసింది అమ్మ. సెకండ్ సాటర్‌డే గదా, లక్ష్మిని తీసుకురావే, రెండ్రోజులు సరదాగా కృష్ణతో గడపచ్చు అని చెప్పింది. లత సరేనంది. సాటర్‌డే పొద్దున్నే వీడు స్నానం చేసి తయారై కూర్చున్నాడు. వాళ్ళొచ్చేసరికి ఏ పదకొండో అయ్యింది. లక్ష్మి మాత్రం ఏదో చిరాకుగా ఉందనిపించింది. భోజనం చేస్తుంటే బయటపడింది. ఆరోజు వాళ్ళ కాలేజీవాళ్ళు సరదాగా క్రికెట్ మ్యాచ్ పెట్టుకున్నారట, అందులో రవి కూడా ఆడుతున్నాడు కాబట్టి లక్ష్మికి చూడాలని ఉందట. దాందేముంది, కృష్ణని కూడా తీసుకు వెళ్ళవే, అన్నది అమ్మ. భోజనమవ్వగానే ఇద్దరూ బయల్దేరారు.

వాళ్ళిద్దరూ తిరిగి వచ్చేటప్పటికి రాత్రయ్యింది. మేమందరం భోజనాలయి కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నాం. పిల్లలొచ్చారు. క్రికెట్ మ్యాచ్ అయ్యాక ముగ్గురూ కలిసి హోటలికి భోజనానికి వెళ్ళారట. కాసేపు కూర్చుని ఇక ఇంటికి బయల్దేరింది లక్ష్మి. మళ్ళీ రేపొస్తావు గదా, అని అడిగాడు కృష్ణ. కొంచెం చిరాకుగా, "మళ్ళీ రేపెందుకు, ఇవాళంతా కలిసే ఉన్నాంగదా," అంది.

మా అమ్మేమీ ఊరుకోలేదు. "అదేమిటే, ఇంకో నాలుగురోజుల్లో మళ్ళీ అమెరికా వెళ్ళిపోతాడుగదే, కాస్సేపు కలిసి ఉండండే," అని మందలించింది. ఇక తప్పదని లక్ష్మి ఒప్పుకుంది.

ఇదంతా చూస్తుంటే నాకు కాస్త జాలేసింది వాడి మీద. అమెరికాలో ఉన్నంతకాలం ఆడపిల్లలంతా వీడివెంట పడేవాళ్ళు. ఇక్కడికొచ్చి వీడి పరిస్థితి ఇలా అయిపోయింది! అందరూ ఇక పడుకోవడానికి వెళ్ళిపోయాక కాసేపు వాడితో మాట్లాడుతూ కూర్చున్నాను. క్రికెట్ మ్యాచ్‌లో రవి జట్టు గెలిచిందట. రవి ఒక్కడే 50 పరుగులు చేసి గెలిపించాడట. లక్ష్మికి క్రికెట్ అంటే చాలా ఇష్టం కాబట్టి రవిని తెగ పొగిడేస్తుంటే, కృష్ణకి చాలా బాధగా అనిపించిందట. మర్నాడు లక్ష్మి వచ్చేటప్పటికి పన్నెండున్నరయ్యింది. పెద్దగా ఏమీ మాట్లాడకుండా భోజనానికి కూర్చుని, బోజనం అవ్వగానే బయల్దేరతానన్నది. కానీ ఆ సాయంత్రం మమ్మల్ని చూడడానికి మా తమ్ముడు వాళ్ళు వస్తున్నామని ఫోన్ చేస్తే, అమ్మ వెంటనే లతకి కూడా ఫోన్ చేసి మోహన్‌తో సహా రమ్మంది. అందుకని లక్ష్మి కూడా ఉండిపోవాల్సి వచ్చింది. మూడయ్యేసరికి అందరూ ఇంటికొచ్చారు. చాలా యేళ్ళ తరువాత చూడడం కాబట్టి చాలా కబుర్లు దొర్లాయి. మా తమ్ముడు శేఖరికి చిన్నప్పటి నుండి క్రికెట్ పిచ్చి చాలా ఎక్కువ. అందరిని బయటికి లాక్కెళ్ళి ఒక మాచ్ మొదలెట్టాడు. లక్ష్మి కూడా చాలా సరదాపడి ఆడతాననడం చూసి కృష్ణ కూడా ఒప్పుకున్నాడు. ఒకపక్కకి లాగి అడిగాను, నీకేమొచ్చురా క్రికెట్ ఆడడం అని. ఫరవాలేదు నాన్న, కొంచెం బేస్‌బాల్ లాగానే ఉంటుంది, అన్నాడు చిరునవ్వుతో.

నేను, లక్ష్మి, కృష్ణ ఒక టీమ్ అయితే, శేఖరు, మోహను, లతా ఒక టీమ్. అమ్మా, నాన్న ఫీల్డింగ్ చేస్తాం గానీ మిగతావేమీ చేయలేమన్నారు. వాళ్ళ సత్తానో మరి మేము వేసే బాల్స్ అంత బాగా ఉన్నాయో తెలియదు కానీ, మోహనూ, శేఖరు ఇద్దరూ చాలా బాగా బ్యాటింగ్ చేశారు. ఎలాగైతేనే, చివరికి కృష్ణ బ్యాటింగ్‌కి వచ్చేసరికి మేమిక ఓడిపోయామనే అనుకున్నాం. ఇరవై పరుగులు కావాలి గెలవడానికి. చాలా ధైర్యంగా వచ్చాడు క్రీజ్ దగ్గరికి. క్రికెట్‌బాట్ పట్టుకోవడం సరిగ్గా చేతగాలేదు. వాడికి అలవాటైనట్లు బేస్‌బాల్ బ్యాట్‌లాగా పైకి ఎత్తి పట్టుకుంటే అందరూ నవ్వడం మొదలుపెట్టారు. మోహన్ అతి వేగంగా వచ్చే ఒక ఫుల్ టాస్ వేశాడు. నేనూ, లక్ష్మి ఇక అంతా అయిపోయిందనుకున్నాం.

ఎలా కొట్టాడో తెలీదుగాని, ఆ బాల్ తిన్నగా పైకి వెళ్ళి దూరంగా చెట్ల దగ్గర పడింది. హోమ్ రన్ అని అరిచాడు ఉత్సాహంగా. లక్ష్మి గబుక్కున వాడి వంక చూసి సంతోషంతో చప్పట్లు కొట్టింది.

దాంతో కృష్ణకి వీరోత్సాహం పుట్టుకొచ్చింది. ఓవర్లో మిగిలిన నాలుగు బాల్స్‌లో మూడు సిక్సర్లు కొట్టి మ్యాచ్ పూర్తి చేసేశాడు.

✤

మేం మళ్ళీ అమెరికా తిరిగి వెళ్ళే ప్రయాణం ఇంక మూడురోజుల్లోకి వచ్చింది. కృష్ణగాడి ముఖంలో కాస్త దిగులు కనిపిస్తోంది. ఈమధ్య వాడు రోజూ లక్ష్మితో చాలాసేపే కలిసి తిరుగుతున్నాడు. వాడి జూలియాకి కాల్ చేసి కూడా చాలా రోజులే అయినట్లుంది. వాడి భాషలో కూడా మార్పొచ్చే సింది. చాలామటుకు తెలుగులో మాట్లాడడం మొదలుపెట్టేశాడు.

"నాన్నా, మనం ఇంకొన్ని రోజులు ఉండచ్చా?" అని అడిగాడు నెమ్మదిగా. అసలు రానని గొడవ చేసినవాడు ఇంకా ఉంటాననడం విని నాకు చాలా సంతోషం కలిగించింది. కానీ ఏం చేద్దాం, ఇక్కడే ఉండిపోవ డానికి మా బాస్ ఒప్పుకోడే. వాడితో చెప్పడానికి ప్రయత్నం చేశాను.

"ఫరవాలేదు నాన్న, నువ్వు వెళ్ళిపోవచ్చు. నేనొక్కడ్నీ ఉండగలను. మామ్మ ఉందిగా, మామ్మతో ఉంటాను. ప్లీజ్ నాన్నా, స్కూలు మొదలయ్యే దాకా నేనుండవచ్చుగా!" అని దీనంగా అడిగాడు. ఏదో మ్యూజిక్ డైరెక్టరు పెట్టినట్టు అప్పుడే వెనకాల రేడియోలో ప్రేమకోసమై వలలో పడెనే పాపం పసివాడు అనే పాట మొదలయ్యింది. పక్కనే ఉన్న మా అమ్మ మా సంభాషణంతా వింటూనే ఉంది. ఆ పాట వచ్చేసరికి చిరునవ్వుతో,

"అవున్రా, ఫరవాలేదు, ఉండనివ్వరా ఇంకొన్నాళ్ళు. సెలవలవ్వగానే మేం వాడ్ని ఫ్లయిటెక్కిస్తాంలే. నువ్వేమీ భయపడనవసరం లేదు," అని వాడ్ని వెనకేసుకొచ్చింది.

వాడిని వదిలి నేనెప్పుడూ రెండు రోజులకన్నా ఉండలేదు. అయినా పెద్దవాడవుతున్నాడు. వయసులోనే కాదు, బుద్ధిలో కూడా. మన ఊరొచ్చి మన తెలుగు పడుచుని చూసి ఆమె కోసం భాష నేర్చుకుని ఇక్కడ ఇంకొన్ని రోజులు ఉంటానంటే నేనేమనగలను? "సరేరా, నీ ఇష్టం! అలాగే ఉండి రా!" అని గట్టిగా కౌగలించుకున్నాను.

✤

"Dad, are we there yet!?" అని గట్టిగా వినిపించింది. ఉలిక్కిపడి లేచాను. ఏదో స్టేషన్ వస్తున్నట్టుంది, ట్రైన్ నెమ్మదిగా వెడుతోంది. అందుకేనేమో, మెలకువ వచ్చింది మా ఇద్దరికీ. అంతా కలేనా? ఎంత తియ్యని కల!

✻

కార్టూన్లు
బండి శ్రీకాంత్





("CONVERT A BUG INTO A FEATURE BY DOCUMENTING IT")

GET AN IDEA FROM THESE SOFTWARE GUYS. WE WILL CONVERT THIS GRIEL INTO A PUBLIC POLICY BY ANNOUNCING IT.









చిత్రం: కాళి రాజయ్య

ప్రశంస

తానా-కథాసాహితి
బహుమతి కథలు



Let us help you find the key to your dream home

WE CAN HANDLE ANY TASK
BUYING, SELLING, OR INVESTING IN REAL ESTATE

Free email updates everyday

Free CMA for your home

Free Schools information

Free Neighborhood info

Free credit Report

Free financial advisors

Call us for Buyer / Sellers Incentives

Prasanna Yalamanchili
Cell: 703-554-9961
Prasanna@mris.com

Subbarayudu Jakkampudi
Cell: 301-919-2416
subbarayuduj@mris.com

Sun Properties, Inc
7425 Needwood Rd, Rockville, MD 20855
877-349-8956, 301-258-9094



We know what is hot in Real Estate

ప్రశంస

తానా - కథాసాహితి 2005 బహుమతి కథలు

1. విముక్తుడు - జొన్నలగడ్డ రామలక్ష్మి ... 293
2. రాతి తయారీ - కె.ఎ. మునిసురేష్ పిళ్ళై ... 297
3. రచనల సమీక్ష ... 301



2005 తానా - కథాసాహితి కథ-నవలల పోటీ ఫలితాలు

డిట్రాయిట్ నగరంలో, జులై 1, 2, 3 తేదీలలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం ***(తానా)*** 15వ సమావేశం జరుపుకో బోతోంది. ఈ సందర్భంగా, తానా ప్రచురణల కమిటీ, కథా సాహితి (హైదరాబాద్) సహకారంతో తెలుగు కథ-నవలల పోటీని నిర్వహించింది.

ప్రపంచస్థాయిలో నిలబడదగ్గ తెలుగు సాహిత్యాన్ని సృష్టించ డాన్ని, గణనీయమైన బహుమతులు ఇవ్వడం ద్వారా, ప్రోత్సహిం చాలనే ఉద్దేశంతో 1997లో లాస్ ఏంజెల్స్‌లో జరిగిన 11వ ఉత్తర అమెరికా తెలుగు మహాసభల సందర్భంగా, **తానా** మొదటి నవలల పోటీని నిర్వహించి, శ్రీమతి చంద్రలత రాసిన రేగడివిత్తులు నవలకు ఒక లక్ష ఇరవై వేల రూపాయలు బహుక రించింది. 1999లో నవలల పోటీకి 25 వేల రూపాయల బహుమతితో కథల పోటీని జోడించి, రెండేళ్ళకొకసారి ఉత్తర అమెరికా తెలుగు ***(తానా)*** మహాసభల సందర్భంగా ఈ పోటీలను **తానా** ప్రచురణల కమిటీ నిర్వ హిస్తుంది. 1999లో తపన నవలకు శ్రీ కాశీభట్ల వేణుగోపాల్ లక్ష రూపాయల బహుమతి, 2001లో టైటానిక్ కథకు శ్రీ సురేష్, అస్తిత్వానికి అటూ ఇటూ కథకు శ్రీ మధురాంతకం నరేంద్ర చెరి 15 వేల రూపాయల బహుమతి గెలుచుకొన్నారు. ఇప్పటివరకు బహుమతి పొందిన నవలలు, కథలు విపుల ప్రాచుర్యాన్ని పొంది, విస్తృతంగా చర్చించబడ్డాయి. 2001 నుండి హైదరాబాద్ కథా సాహితి సంస్థవారు ఈ పోటీలు నిర్వహించటానికి సహకరిస్తు న్నారు.

2005 కథల పోటీకి శ్రీమతి ఓల్గా, శ్రీ శ్రీరమణ, నవలల పోటీకి శ్రీయుతులు అంపశయ్య నవీన్, ఎ.కె. ప్రభాకర్ ఇండియా లో న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. శ్రీయుతులు ఆరి సీతా రామయ్య, కన్నెగంటి రామారావు, జంపాల చౌదరి, పారనంది లక్ష్మీనరసింహం, మద్దిపాటి కృష్ణారావు, మాచవరం మాధవ్ అమెరికాలో రెండు పోటీలకూ న్యాయ నిర్ణేతలుగా వ్యవహ రించారు. పోటీ నిబంధనల ప్రకారం, అంతిమ నిర్ణయం వరకు రచయితల వివరాలు గుప్తంగా ఉంచబడ్డాయి.

2005 కథల పోటీ

ఈ సంవత్సరం 424 కథలు పోటీకి వచ్చాయి. మొదటి వడపోత తర్వాత, 408 కథలు ద్వితీయ పరిశీలనకు ఎంపిక కాగా, వాటిలో 58 కథలను మూడవ దశలో ఇండియాలో న్యాయ నిర్ణేతలు పరిశీలించారు. వారు ఎంపిక చేసిన 13 కథలను అంతిమ దశలో **తానా** నిర్ణేతల బృందం పరిశీలించింది.

ఆఖరి పరిశీలనకు వచ్చిన కథలలో 25,000 రూపాయల బహుమతికి ఉద్దేశించిన ప్రమాణాలను అందుకున్న కథ ఏదీ లేదని న్యాయ నిర్ణేతల ఏకాభిప్రాయం. ఈ కథలన్నీ సహజత్వానికి దగ్గరగా ఉండి సమకాలీన సామాజిక సమస్యలను చర్చించినా, వస్తువు, అవగాహన, స్పష్టత, సహజత, పాత్రపోషణ, శిల్పాలలో ఉన్న హెచ్చుతగ్గులు ఈ కథల్ని మంచి కథల స్థాయి నుంచి గొప్ప కథల స్థాయికి చేరకుండా ఆపేశాయి. పోటీకి వచ్చిన కథలలో ఉత్తమమైనవిగా పరిగణించబడిన రెండు కథలకు రూ. 6,000 చొప్పున బహుమతుల నివ్వాలని న్యాయనిర్ణేతల నిర్ణయం.

విముక్తుడు - జొన్నలగడ్డ రామలక్ష్మి

రాతి తయారి - మునిసురేష్ పిళ్ళై

బహుమతి పొందిన కథలు తెలుగు పలుకు 15వ సంచిక (2005 తానా సమావేశపు సావనీర్), ఈ మాట ఎలక్ట్రానిక్ పత్రిక జులై సంచిక (www.eemaata.com), నవ్య వారపత్రికలలో ప్రచురింపబడతాయి.

2005 నవలల పోటీ

ఈ సంవత్సరం 66 నవలలు పోటీకి వచ్చాయి. మొదటి వడపోత తర్వాత, 15 నవలలను ఇండియాలో న్యాయనిర్ణేతలు పరిశీలించారు. వారు ఎంపిక చేసిన 4 నవలలను అంతిమ దశలో తానా న్యాయ నిర్ణేతల బృందం పరిశీలించింది.

ఆఖరి పరిశీలనకు వచ్చిన నవలలో, లక్ష రూపాయల బహుమతికి ఉద్దేశించిన ప్రమాణాలను అందుకున్న నవల ఏదీ లేదని న్యాయనిర్ణేతల ఏకాభిప్రాయం. అంతిమస్థాయి వరకు వచ్చిన నవలలలో ఉత్తమంగా ఉన్న రెండు నవలలకు చెరి 10,000 రూపాయల ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలని న్యాయనిర్ణేతల నిర్ణయం.

నీరు, నేల, మనిషి - సుంకోజి దేవేంద్రాచారి

సింగిల్ డైరి - వెల్చేరు చంద్రశేఖర్

ఈ పోటీలు ఉద్దేశించిన స్థాయిలో కథలు, నవలలు లేకపోవడం **తానా** ప్రచురణల కమిటీని తీవ్ర ఆందోళనకు గురి చేస్తూంది. మంచి కథకు, నవలకు ఉండవలసిన లక్షణాలు - సహజత్వం, పాత్రపోషణ, సన్నివేశ చిత్రణ, పక్వత, రససిద్ధి - గత మూడు పోటీలకు అంతిమదశ వరకూ వచ్చిన అనేక కథల్లోనూ, నవలలలోనూ లోపించడం గమనార్హం. ఈ పోటీల నిర్వహణను గురించి **తానా** ప్రచురణల కమిటీ పునస్సమీక్షించుకోవాల్సిన అవసరం ఉంది.

కృతజ్ఞతలు

ఈ పోటీ వివరాలను విశేషంగా ప్రచారం చేసేందుకు సహకరించిన పాత్రికేయులకు, సంపాదకులకు, ఇండియాలో న్యాయనిర్ణేతలు శ్రీమతి ఓల్గా, శ్రీయుతులు శ్రీరమణ, అంపశయ్య నవీన్, ఎ.కె. ప్రభాకర్ గార్లకు, ప్రాథమిక పరిశీలకులుగా వ్యవహరించిన అనేకమంది మిత్రులకు, అమెరికా న్యాయనిర్ణేతలకు, శ్రీమతి అరుణా చౌదరికి **తానా** ప్రచురణల కమిటి కృతజ్ఞతలు. కథాసాహితి (హైదరాబాద్), వాసిరెడ్డి నవీన్‌ల సహకారం ఈ పోటీలకు అమూల్యం. తానా అధ్యక్షులు శ్రీ గొర్రెపాటి నవనీతకృష్ణ, ప్రెసిడెంట్-ఎలెక్ట్ శ్రీ బండ్ల హనుమయ్య, డిట్రాయిట్ **తానా** సమావేశపు నిర్వాహకులు శ్రీయుతులు కొడాలి శ్రీనివాస్, కె.సి. ప్రసాద్‌గార్లు ఈ పోటీ నిర్వహణను ప్రోత్సహించారు. వీరందరికీ నా వ్యక్తిపూర్వక కృతజ్ఞతలు.

మే 30, 2005

వాడ్స్‌వర్త్, ఇల్లినాయ్

జంపాల చౌదరి

అధ్యక్షుడు, తానా ప్రచురణల కమిటీ

విముక్తుడు

జొన్నలగడ్డ రామలక్ష్మి



మనిషికి అసాధ్యమైనవి ఏమీ లేదంటారు కానీ ఫలితముండదని నమ్మకంగా తెలిసినా అసాధ్యాల వెంటబడేవారు కొందరుంటారు. సాధ్యాసాధ్యాలను తమ ఆశయాలకు అనుగుణంగా నిర్ణయించుకునే స్వేచ్ఛ వారికి లేకపోవడం చిత్రమైన విధి నడకల్లో ఒకటనిపిస్తుంది - నరసింహారావు, సుదర్శన్‌లను తలచినప్పుడల్లా!

ఆరోజు పొద్దుటే నేను పేపరు చదువుతుండగా, "నరసింహారావుగారి భార్య సావిత్రిగారు పోయారుట. పక్కింటి రత్నంగారు చెప్పారు," అంది నా భార్య కాఫీ అందిస్తూ.

"అలాగా! ఎప్పుడుటా?" అన్నాను పేపర్లోంచి మొహం తిప్పకుండా కాఫీ కప్పు కోసం చేయి సాచి.

"రాత్రి పదకొండుగంటల ప్రాంతాల ప్రాణం పోతే మరో అరగంటకి వీళ్ళకి ఫోనుచేసి చెప్పారుట. అప్పటికే మనం లైట్లార్పేసి పడుకున్నాం కదా! అందుకని వాళ్ళిక మనల్ని లేపకుండా రాత్రికి రాత్రి చూడ్డానికి వెళ్ళి తెల్లారకట్టే తిరిగొచ్చారు. ఇప్పుడు మళ్ళీ వెడతారుట. పదయ్యేసరికి బాడీ తీసుకెళ్ళిపోతారుట మరి," అని ఆగి నా రియాక్షన్ కోసం చూసిందామె.

నేను "ఆహా, ఊహు," అంటున్నాను పేపర్లోంచి తల తీయకుండానే.

మామూలుగా పేపర్ని అంతగా పట్టించుకోని నేను ఈమధ్య రోజూ పేపరు చూస్తున్నాను, ఐఐటి ఎంట్రెన్సు పరీక్షా ఫలితాల కోసం.

ఇంతకీ పరీక్ష రాసింది మా పిల్లలు కాదు. ఓసారి ఐఐటి ఎంట్రెన్సులో తప్పి రెండో ప్రయత్నం కోసం ఏడాది చదువును త్యాగం చేసి మా

పెద్దబ్బాయి రఘుకి క్లాసుమేటుగా మారిపోయిన సుదర్శన్ గురించే నా ఆతృత. వాడు నా స్నేహితుడు వెంకట్రావు కొడుకు.

చదువు విషయంలో నా అభిప్రాయాలు సమకాలీకులతో కలవ్వు. బ్రతుకు కోసం చదువు తప్పితే చదువు కోసం బ్రతుకు కాదని నమ్మే నా థియరీ మంచిదేనన డానికి చాలా నిదర్శనాలున్నాయి. చిన్నప్పట్నించీ బ్రిలియంటు అనిపించుకున్న నేను మంచి గవర్నమెంటు ఉద్యోగం సంపాదించి పెద్ద హోదాలో జీవిస్తున్నాను. ఐతే మొద్దులనిపించుకున్న నా హైస్కూలు క్లాసుమేట్సులో చాలామంది వివిధ రంగాల్లో రాణించి నాకంటే మెరుగైన ఆర్థిక ప్రగతిని సాధించారు. ఇప్పుడు ఐఐటిలకు ఎగబడుతున్న వారిలో ఎక్కువ శాతం ఆర్థికప్రగతి కోసమే. అందుకు వారు చెల్లిస్తున్న మూల్యం బాల్యం. మా పిల్లల విషయంలో అలా జరక్కుండా జాగ్రత్త పడ్డాను. అందువల్ల వాళ్ళకు ఆటలు, సంగీతం, నాట్యం వగైరా హాబీలకు తగిన తీరుబడి ఉండేది. కానీ అందుకు వెంకట్రావు నన్ను తప్పుపడుతూ, 'ఇది పోటీ యుగం. దీనికి ఎదురీదుతున్నావు. పెద్దయ్యాక నీ పిల్లలు నిన్ను తప్పు పడతారు,' అని హెచ్చరించే వాడు. వాడి పుత్రరత్నం సుదర్శన్ నిజంగా రత్నమే. తండ్రి ఆశయం బలవంతంగా తన మీద రుద్దబడడం వల్ల పుడుతూనే వాడి జీవితం ఐఐటి సీటుకు అంకితమైపోయింది. చదువు, చదువు, చదువు... అదే వాడి జీవితం. అందువల్ల వాడు మొదట్లో కొంతకాలం ఇబ్బందికి గురైనా క్రమంగా అలవాటుపడ్డాడు. నాకు వాడంటే ఏమూలో విపరీతమైన జాలి. ఈసారి కూడా వాడి శ్రమకు ఫలితం దక్కకపోతే వాడు మావాడిలాగే ఎంసెట్ ఫలితాల మీద ఆధారపడాలి. అదే జరిగితే వాడి సంగతేమో కానీ నేనే తట్టుకోలేననిపించి, రోజూ పేపరు చూస్తున్నాను, సుదర్శన్ నాకంటే ముందుగా ఇంటర్నెట్లో ఫలితాలు చూస్తాడని తెలిసినా.

ఏ కారణం చేతనైతేనేం పేపరు తీస్తే చాలు అది నన్ను డిటెక్టివ్ నవల్లా ఆకర్షిస్తుంది. అందుకని భార్య తెలిసినవారి మరణవార్త చెప్పినా అదింకా నా హృదయాన్ని తాకలేదు. కాబట్టి ఆహా, ఊహూలే తప్ప నాలో స్పందన లేదు

ఆ విషయం గ్రహించిందేమో, "ఒకసారి మనిద్దరం వెళ్ళొద్దాం పదండి," అనేసి నేను బదులిచ్చేలోగానే, "ఈరోజెలాగూ ఆదివారమే. ఆఫీసు గొడవలేదు. బాడీ వెళ్ళేదాకా ఉండి వచ్చేద్దాం. తొందరగా బట్టలు మార్చుకోండి. ఈలోగా నేను పిల్లలకు చెప్పివస్తాను," అంటూ నిర్ణయం కూడా తీసేసుకుని లోపలకు వెళ్ళింది నా భార్య.

పబ్లిక్ రిలేషన్స్‌లో ఆడవాళ్ళు తమకు తెలియకుండానే నిస్వార్థంగా పోషించే పాత్రకు తగిన గుర్తింపు ఉండదు. నిజానికి నేను ఇలాంటి విషయాల్లో అట్టే చొరవ చూపించను. ఐనా నా భార్య కారణంగా బంధు మిత్ర వర్గంలో, ప్రత్యేకించి ఇలాంటి విషయాల్లో చాలా ప్రాంప్ట్ అని నాకు మంచి పేరుంది. పాపం ఆ పేరులో నా భార్యకు ఏమాత్రమూ వాటా లేదు.

నేను పేపరు మూసాను. అప్పటికి నరసింహారావు భార్య సావిత్రి పోయిందన్న వార్త నా హృదయాన్ని తాకింది. ఐనా నాకు బాధనిపించలేదు.

పబ్లిక్ రిలేషన్స్‌లో ఆడవాళ్ళు తమకు తెలియకుండానే నిస్వార్థంగా పోషించే పాత్రకు తగిన గుర్తింపు ఉండదు. నిజానికి నేను ఇలాంటి విషయాల్లో అట్టే చొరవ చూపించను. ఐనా నా భార్య కారణంగా బంధు మిత్ర వర్గంలో, ప్రత్యేకించి ఇలాంటి విషయాల్లో చాలా ప్రాంప్ట్ అని నాకు మంచి పేరుంది.

ఇంకా చెప్పాలంటే అది సంతోషించాల్సిన విషయంగా భావించే అనేక మందిలో నేనూ ఒకణ్ణి. ఆమె గత నాలుగు సంవత్సరాలుగా కాన్సరుతో నేడే రేపో అన్నట్లు బ్రతుకీడుస్తుంది.

సావిత్రికి ఇద్దరు పిల్లలు. కూతురికి పెళ్ళైపోయింది. కొడుక్కి చదువై పోయి ఉద్యోగం చేస్తున్నాడు. ఇద్దరూ విదేశాల్లోనే ఉంటున్నారు. రెండేళ్ళ క్రితందాకా వాళ్ళు మా పక్కింట్లోనే ఉండేవారు. అప్పటికే కాన్సరుతో ఆమె అనుభవిస్తున్న నరకం మాకు హృదయవిదారకరంగా తోచేది. ఆమె కోసం ఆయన పడే కష్టనష్టాలు సామాన్యులకు అనూహ్యం. ఐనా ఆ దంపతుల్లో ఏదో ఆకర్షణ ఉండేది. వారిని చూసి ఇతరులు చలించాలి తప్ప వారెప్పుడూ భావి జీవితం గురించి బంగారు కలలు కంటున్నట్లే అనిపించేది. అదీ ఇరుగుపొరుగులతో అంటీముట్టనట్లుండే నాక్కూడా.

రిటైర్మెంట్ మూడేళ్ళు ఉన్నదనగా నరసింహారావుకు మొదటి డైలమా వచ్చింది. భార్య అనారోగ్యం వల్ల ఊరు కదలడం లేదు కానీ ఆయనకు విదేశాల్లో మంచి ఉద్యోగాలకు ఆఫర్లున్నాయి. ఆమె జీవితం నేడే రేపో అన్నది చేదు నిజం. అలాంటప్పుడు సావిత్రి ఆ ఊళ్ళో స్వంతిల్లు కావాలనేది. అదీ తమ స్థోమతుకు తగినట్లుగా చాలా పెద్దదిగా ఉండా లనేది. ఉంటుందో ఉండదో తెలియని ఆమె కోసం తానుంటాడో ఉండడో తెలియకుండా ఇంటిమీద ఎక్కువ మొత్తం పెట్టుబడి పెట్టడానికి సంకోచి స్తున్నాడాయన.

"చివరి బంతి ఆడేవరకూ ఒకరోజు క్రికెట్ ఫలితం చెప్పలేము. నా జీవితమూ అంతే," అంటూండే సావిత్రి కోరికలో దూరదృష్టి ఉన్నదని తెలుసుకుందుకాయనకు ఎంతోకాలం పట్టలేదు.

ఉన్నట్లుండి ఇంటివాళ్ళు కుంటిసాకులు చెప్పి ఇల్లు ఖాళీ చేయమన్నారు వాళ్ళని.

"ఇలా జరుగుతుందని నాకు ముందే తెలుసు. అందుకే మనదంటూ స్వంతిల్లు ఉండాలి. మీరేమో మనమిద్దరమే అనుకుంటారు కానీ మనకు రెండువైపులా బోలెడు బలగం వస్తూ పోతుండే జనాన్ని తట్టుకుందుకు కాస్త పెద్దిల్లే కావాలి," అంది సావిత్రి ఆయనతో.

ఆ సమయంలో రుక్మిణి వాళ్ళను ఆదుకొంది. రుక్మిణ నరసింహారావు చెల్లెలు. ఆమెకా ఊళ్ళో చాలా పెద్దిల్లుంది. రుక్మిణి, భర్త ఢిల్లీలో ఉన్న కొడుకు దగ్గరకు వెళ్ళిపోతూ ఆ ఇంటి బాధ్యతను నరసింహారావుకు అప్పజెప్పారు. "ఆఫీసు మీకిచ్చే అలవెన్సు మాకు అద్దెగా ఇచ్చుకుంటే ఉత్తినే ఉంటున్నామన్న సంకోచం మీకుండదు. ఇల్లు అయినవాళ్ళ చేతిలో ఉంటే మాకు సంతోషం. వదినకు స్వంతిల్లు మనసూ తీరుతుంది. ఒకవేళ మా ఇల్లు పరాయిదని వదిన అనుకుంటే అప్పుడే అది తన పేరున రిజిస్ట్రేషన్ చేయించి వెళ్ళిపోతాం. ఆ తర్వాత మీరు వీలు చూసుకుని మరో ఇల్లు కట్టించి మాకు ఇవ్వండి. లేదూ మా ఇల్లు మాకిచ్చేసి మీ ఇంట్లోకి మీరు మారిపోనూవచ్చు. ఆలోచించుకుందుకు మీకు బోలెడు టైము," అంది రుక్మిణి వాళ్ళతో.

రుక్మిణి భర్త ఉద్యోగమేమిటో నాకు తెలియదు కానీ బయటెక్కడా ఆయన నోరు విప్పిన దాఖలాలు లేవు. ఆయన పేరు మీద జరిగే వ్యవహారాలన్నీ రుక్మిణి నోటి మీదుగానే జరుగుతాయి. మాబోటివారికీ ఆమె నోటి మీదుగానే తెలుస్తాయి. ఇప్పుడూ అదే జరిగింది.

నరసింహారావు దంపతులు మా పక్కింటి నుంచి మాకు రెండు వీధుల దూరంలో ఉన్న రుక్మిణి ఇంటికి మారిపోయారు. ఆ తర్వాత ఈ రెండేళ్ళలోనూ వాళ్లింటికి మేము రెండుమూడు సార్లు వెళ్ళామేమో. అప్పుడైనా మీరు బాగున్నారా అంటే మీరు బాగున్నారా అని ప్రశ్నలు. మేము బాగున్నామంటే మేము బాగున్నామని జవాబులు. మరి మా పక్కింటి రత్న, ఆమె భర్త రంగారావు వారానికి రెండుసార్లయినా వాళ్ళింటికి వెళ్ళొస్తుంటారు. వన్‌డే క్రికెట్లో ద్రవిడ్‌కి దొరకని పరుగులు సెహ్వాగ్‌కి దొరికినట్లు వీళ్ళు సేకరించే సమాచారం అంతా ఇంతా కాదు.

మా పక్కింటి రత్న మహా చొరవైన మనిషి. ఎంత చొరవంటే ఆమె మా ఇరుగుపొరుగుల సమాచారాన్ని సేకరించి ప్రసారంచేసే విధానానికి నా భార్య సంతోషించదు, అసూయ పడుతుంది. ఆ అసూయకు కారణం రత్నకు అన్నివిధాలా సహకరించే భర్త ఉండడం కాకపోతే అది నా గుర్తింపును పొందేది కాదు.

ఏదేమైతేనేం రత్న, రంగారావుల ద్వారానే మేము సావిత్రి దంపతుల విశేషాలు తెలుసుకోగలిగే వాళ్ళం. ఇప్పుడు సావిత్రి మరణవార్తా వారి నుంచే మమ్మల్ని చేరింది.

ఆలోచిస్తూనే బట్టలు మార్చుకున్నాను. అంతలో నా భార్య పిల్లలకు అప్పగింతలు పూర్తిచేసుకుని వచ్చింది. వెళ్ళే చోటును బట్టి వేషధారణ ఉండాలి కాబట్టి ఆమె చాలా తొందరగా తయారై వచ్చింది.

ఏడడుగుల బంధం శాశ్వతమంటారు. పూర్వం దంపతులు పెళ్ళిలో ఏడడుగులే నడిచినా ఆ తర్వాత కలిసి ఎన్నో అడుగులు నడిచేవారట. మరిప్పుడు స్కూటర్లు వచ్చేక పక్కింటికి కూడా వాహనయోగం తప్పనిసరి అవుతున్న ఈ రోజుల్లో దంపతులది శాశ్వతంగా ఏడడుగుల బంధ మౌతోంది. ఈరోజు మాత్రం మేము మా దాంపత్యబంధానికి మరికొన్ని అడుగులు జతపర్చాల్సి ఉన్నదేమో నా భార్య నడిచే వెడదామంది.

ఇద్దరం కలిసి నడుస్తున్నాం, "పాపం ఆమె చాలా బాధపడ్డదండీ. కానీ కాన్సరు థర్డుస్టేజి తర్వాత కూడా నాలుగైదేళ్ళు బ్రతకడం చాలా పెద్ద విశేషం కదండీ!" అంది నా భార్య.

"అవును. కానీ ఆమె అలా నాలుగైదేళ్ళు బ్రతికిందంటే కారణం నరసింహారావే. సావిత్రి పేరు ఆమెక్కాదు. ఆయనకు పెట్టాలి. సావిత్రి యముడితో ఓరోజు పోరాడితే ఆమె కాన్సరుతో ఆయన నాలుగేళ్ళు పోరాడారు," అన్నాను.

నరసింహారావు చేసిన పోరాటం అసామాన్యం. ఆయన ఎందరో డాక్టర్లను సంప్రదించాడు. ఎన్నో ఊళ్ళు తిరిగాడు. డబ్బు మంచినీళ్ళలా ఖర్చుపెట్టాడు. శారీరక శ్రమనూ, మానసిక ఒత్తిడినీ ఆర్థికవ్యయాన్నీ ఓర్చుకుంటూ, తట్టుకుంటూ భరిస్తుండే ఆయన ముఖంలో చిరునవ్వు మాత్రం ఎప్పుడూ చెదరలేదు.

"అవునండీ! ఎంత కష్టపడ్డా ఆయన ఆమెను నరక బాధ నుంచి తప్పించాడనుకోను. ఐనా అలాంటి భర్త లభించడం వల్ల ఆమె అదృష్ట వంతురాలే అనిపిస్తుంది నాకు," అంది నా భార్య.

స్త్రీవాదులన్నారనుకోవడం కాదు కానీ నరసింహారావులాంటి భర్త మన దేశంలో చాలామంది ఆడవాళ్ళకు గగనకుసుమం. నా భార్య మాటల్లో ఇప్పుడు నేనది గుర్తించినా రియాక్టవడానికి సమయం కాదని, "నువ్వాయన ప్రేమ గురించి చెబుతున్నావు. కానీ నేనాలోచిస్తున్నది వేరు. సావిత్రి యముడితో పోరాడి సత్య వంతుణ్ణి దక్కించుకుంది. కానీ నరసింహారావు తన పోరాటంలో ఓడిపోయిన రోజిది. ఈ రోజాయాన మనోభావాలెలా ఉంటాయంటావు?" అన్నాను మాట మార్చడానికి.

దశాబ్దాల దాంపత్యజీవితం. అపురూపమైన ప్రేమ. ఆమె లేక తను జీవించలేడనే కదా ఆయన సర్వశక్తులూ ధారపోసి ఆమెను రక్షించుకునే ప్రయత్నం చేశాడు. ఇప్పుడామె లేదు. ఏమౌతాడాయన?

నా భార్యకు సమాధానం స్ఫురించినట్లే ఉంది. దాని ప్రభావం ఆమె గొంతు మీద పడినట్లే ఉంది. "ఆయన్ను తల్చుకుంటే కడుపు తరుక్కుపోతోందండీ," అన్న ఆమె మాటలు అతి కష్టంమీద గొంతు పెగుల్చుకుని వచ్చినట్లు గుర్తించి ఆమెవైపు చూస్తే ఆ కళ్ళలో నీళ్ళు.

"ఛా! ఏమిటిదీ?" అన్నాను.

ఆమె పైటకొంగుతో కన్నీళ్ళొత్తుకుని, "బాడీ చూద్దామని వెడుతున్నాం. కానీ ఆయన్నెలాగండీ చూడ్డం?" అంది ఏడుపు గొంతుతో.

"అదీ నిజమే! ఇప్పుడు మనం నరసింహారావును చూసి ఉద్ధరించే దేమీ లేదు. పోనీ వెంకట్రావు ఇంటికి వెళ్ళొద్దామా. ఈవేళ సుదర్శన్ రిజల్ట్ రావాలని గుర్తు. వాడు మహా టెన్షన్లో ఉన్నాడు," అన్నాను.

"అయ్యో మీకు చెప్పనే లేదుకదూ! మీరు బాత్రూంలో ఉన్నప్పుడాయన ఫోను చేశారు. సుదర్శన్‌కు ఐఐటిలో రాలేదుట. మనవాడెక్కడ చేరితే వాడూ అక్కడేనని కాస్త నిరుత్సాహంగానే చెప్పారాయన," అందామె.

షాక్ తిన్నాను. సావిత్రికి గతమే తప్ప భవిష్యత్తు లేదు. ఆమె పోతే ఆమె భర్త ఏమైపోతాడా అని బెంగపెట్టుకున్నాం. మరి భవిష్యత్తులో ఐఐటి కోసం తన జీవితాన్నే ధారపోసిన సుదర్శన్ అది రాకపోతే ఇప్పుడేమై పోతాడు?

నేను చాలాసార్లు సుదర్శన్‌తో మాట్లాడాను. వాడికి జీవితంలో చాలా సరదాలున్నాయి. ఐఐటి సీటు సాధించి తండ్రి ఆశయం నెరవేర్చాక వాడు తెలుగు సాహిత్యం మీద దృష్టి సారిస్తాట్ట. జానపద గేయాలు నేర్చుకుంటాట్ట. వాటి గురించి మాట్లాడుతుంటే వాడి కళ్ళు మెరిసేవి. మరి ఇప్పుడా మెరుపేమౌతుందో!

రఘు నాతో, "నీకు చెప్పడు కానీ వాడికింకా బోలెడు సరదాలున్నాయి. వాటిలో చాలావరకు వాళ్ళ నాన్న కిష్టం లేనివే. అసలు వాడికైతే స్వతహాగా ఐఐటి మీద మోజు లేదు. ఐఐటిలో సీటు తెచ్చుకుంటే వాడి ఇష్టాలేమీ కాదననని మాటిచ్చాట్ట వాళ్ళ నాన్న. అందుకని ప్రాణం పెట్టి మరీ చదువుతున్నాడు," అన్నాడు. అటు తండ్రి ఆశా నెరవేరలేదు. ఇటు వాడి ఆశ నెరవేరే అవకాశమూ పోయింది. తట్టుకోగలడా సుదర్శన్?

ఐఐటి సీటు రాకపోతే జీవితానికి ధ్యేయం పోయినట్లు భావించే కుర్రాళ్ళు నాకు స్వయంగా తెలుసు. ఆత్మహత్యకు తలపడేవారూ ఉన్నారని విన్నాను. రోటిలో తలదూర్చినవారు రోకటిపోటుకు సిద్ధపడాలని వాళ్ళకు తెలియదు.

దశాబ్దాల దాంపత్యజీవితం. అపురూపమైన ప్రేమ. ఆమె లేక తను జీవించలేడనే కదా ఆయన సర్వశక్తులూ ధారపోసి ఆమెను రక్షించుకునే ప్రయత్నం చేశాడు. ఇప్పుడామె లేదు. ఏమౌతాడాయన?

ఏది ఏమైనా ఇప్పుడు సుదర్శన్ని చూడ్డం కంటే నరసింహారావుని చూడ్డమే నయం. ఈ విషయంలో మా ఇద్దరిదీ ఏకాభిప్రాయం కావడంతో నిముషాల మీద గమ్యం చేరుకున్నాం.

అక్కడ చాలా జనం ఉన్నారు. వారిలో పరిచితులూ ఎక్కువే కానీ ఈరోజు వారి ముఖాల్లోని భావాలు కాస్త అపరిచితం అనిపించడంతో కాసేపు మౌనంగా నిలబడ్డాం ఇద్దరం. అంతలో నా భార్యకు కాస్త దూరంలో సావిత్రి చెల్లెలు పద్మ కనపడడంతో వెళ్ళి పలకరించి మాట కలిపింది. ఆ మాటలు వినడానికి నేనూ కాస్త దగ్గరగా వెళ్ళాను.

దు:ఖిస్తూనే పద్మ చాలా విశేషాలు చెప్పింది. సావిత్రి ఆరోగ్యం దిగజారిందని వారంరోజుల క్రితమే కొడుకూ, కూతురూ వచ్చి చూశారు. ఇంకా కొన్నాళ్ళదాకా ఫరవాలేదని వెనక్కు వెళ్ళిపోదామనుకుంటుండగా ఉన్నట్టుండి ఆమె ప్రాణం పోయింది.

"మీ అక్కది గొప్పదృష్టం. సమయానికి అంతా దగ్గరున్నారు," అంటూ నా భార్య స్టాకు డైలాగు వాడింది.

పద్మ వెంటనే, "అవునండీ, మా అక్కది నిజంగా అదృష్టమే! లేకుంటే మా బావలాంటి భర్త దొరకడు. ఇంత చాకిరీ చేయాల్సి వచ్చినా దాని ఎదురుగా కానీ, వెనకగానీ ఒక్కరోజు కూడా విసుక్కోలేదు. ఇంకా చెప్పాలంటే అక్కకే చిరాకు. చిన్నప్పట్నించీ అది మమ్మల్నీ, అమ్మానాన్నల్నీ తెగ విసుక్కునేది. పెళ్ళయ్యాక ఆ విసుగు భర్త మీదకు మళ్ళింది. మహాను భావుడు ఎప్పుడూ దాన్ని పల్లెత్తు మాట అనలేదు. కాన్సరొచ్చాక దాని చిరాకు ఎంత పెరిగిందంటే సాయానికి రావాలంటే మేమే కాదు, కన్న కూతురే భయపడేది. బావ మహా ఓర్పుగా దాన్ని కంటికి రెప్పలా చూసుకున్నాడు," అంది.

నా ఆలోచనలు వేరే పోతున్నాయి.

సాధారణంగా ఇలాంటిచోట్ల పోయినవారి గురించిన ప్రశంసలు వింటాం. కానీ పద్మ బ్రతికున్న బావను పొగుడుతూ ఆ సందర్భంలో అక్కను కాస్త చిన్నబుచ్చుతోందంటే అందుక్కారణం అపురూపమైన నరసింహారావు వ్యక్తిత్వం. అతడి ఓర్పునామె మెచ్చుకుంటోంది కానీ అది ఓర్పు కాదనీ చరిత్ర గుర్తుంచుకోదగ్గ ప్రేమ అనీ నాకు అనిపించింది.

వాతావరణం నిండా విషాదం. మధ్యమధ్య ఏడుపులు. కొందరు సావిత్రి కళ్ళు చారడేసి అంటున్నా, ఎక్కువమంది నరసింహారావు కళ్ళే చారడేసి అంటున్నారు. ఎవర్ని పలకరిద్దామన్నా ప్రపంచంలోని విషాద మంతా తమదేనన్నట్లు ముఖాలు పెడుతున్నారు. నాలో స్పందన తక్కువో, లేక నటించడం నాకు చేతకాదో కానీ నేను చాలా మామూలుగా ఉన్నాను. ఒక జీవికి నరకయాతన నుంచి విముక్తి కలిగితే అది సంతోషించాల్సిన విషయంగా ఒప్పుకునే నిజాయితీని మన సంప్రదాయం హర్షించదు కాబట్టి నా ముఖంతో నేను నరసింహారావును కలిసి పలకరించడానికి తటపటా యిస్తున్నాను.

అంతలో అలా వచ్చాడు రంగారావు. నన్ను చూసి, "ఆయన్ను పలకరించారా?" అనడిగాడు. నేను తల అడ్డంగా ఊపగానే, "అయ్యో, బాడీ కదిలేలోగా ఓసారి పలకరించండి," అంటూ నన్ను జవాబివ్వనివ్వ కుండా నరసింహారావు దగ్గరకు లాక్కెళ్ళాడాయన.

మృతదేహాన్ని తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. నరసింహారావు కొడుకు భోరున ఏడుస్తున్నాడు. అతడి భుజాలు నిమురుతున్నారు దగ్గరి బంధువులు. పక్కనే నిలబడి చూస్తున్నాడు నరసింహారావు శూన్యంలోకి.

ఆ దృశ్యం చూడగానే నాకు అప్రయత్నంగా ఏడుపొచ్చేసింది. కళ్ళు తుడుచుకున్నాను. బాగుండదని వెక్కడాన్ని అదుపు చేసుకున్నాను. తమాయించుకుందుకు కొన్ని నిముషాలు పట్టింది.

"అమ్మ లేకపోవడం నీకూ పెద్దలోటే అయినా ఇప్పుడు నీకంటూ నీ జీవితముంది. కానీ మీ నాన్న సంగతి చూడు. భార్యే జీవితం అనుకునే వయసులో పోయిందావిడ. నువ్వు ఆయన్ను చూసుకోవాలి," అంటున్నా డొకాయన.

అందుకు నరసింహారావు స్పందిస్తూ, "ఒంటరిపక్షిని. కాలం వెళ్ళ బుచ్చడానికి నన్ను ఇంకెవరో చూసుకోవాలా?" అన్నాడు.

ఉలిక్కిపడ్డాను. ఆ గొంతులో గాద్గద్యం లేదు. మరోసారి కళ్ళు తుడుచుకుని ఆయనవైపు చూస్తే ఆ కళ్ళలో తడి లేదు. అక్కడ వేరెవ్వరి లోనూ కనిపించని ఓ కొత్త అనుభూతి ఆయన ముఖంలో గోచరించింది నాకు. అదే ఆయనతో నా పలకరింపును చూపులకు పరిమితం చేసింది.

ఏమిటా అనుభూతి? నిత్యజీవిత సత్యమా, వేదాంతమా, సందేశమా, అనుభవమా?

నాకది అప్పుడు అందలేదు.

అక్కడి తంతు పూర్తయ్యాక నేనూ, నా భార్య అక్కణ్ణించి కదిలాం. అలాంటి చోట్నించి వెళ్ళేటప్పుడు వెళ్ళొస్తామనకూడదట. అసలు వెడుతున్న సంగతే చెప్పకుండా చల్లగా జారుకోవాలిట.

దారిలో, "వెంకట్రావు ఇంటికి వెడదామా?" అన్నాను.

"అయ్యో, ఇక్కణ్ణించి తిన్నగా ఇంటికే వెళ్ళాలి," అంటూ సంప్ర దాయం చెప్పింది నా భార్య. ఇల్లు చేరాక నాకిక సుదర్శన్ని పలకరించే మూడ్ పోయింది. ఒకేరోజున రెండు పరామర్శలెందుకులే అనిపించింది మరి.

అయితే మరి కాసేపటికే సుదర్శన్ తనే మా ఇంటికి వచ్చాడు.

నేను సూటిగా వాడి ముఖంలోకి చూడలేక తలవంచుకునే, "విషయం తెలిసింది. ఏం చేద్దామనుకుంటున్నావు?" అనడిగాను.

"ఇక నేను ఐఐటి ఎంట్రెన్సు పరీక్షలు రాయక్కర్లేదు అంకుల్," అన్నాడు సుదర్శన్.

అది నిరాశతో అన్న మాట అని నేనూహించగలను. అందుకే, "ఏం చేయవని కాదు. ఏం చేస్తావని అడుగుతున్నాను," అన్నాను జాలిని ఆప్యా యతగా మార్చే ప్రయత్నం చేస్తూ.

"సామర్థ్యమున్న మనిషి తన కృషి వృధా కావడాన్ని భరించలేడు. అందుకే ఖచ్చితంగా సాధించగలనని నమ్మకమున్న వాటికోసమే ప్రయ త్నించడం నాకిష్టం. ఇక మీదట అదే చేస్తాను," అన్నాడు సుదర్శన్.

ఉలిక్కిపడ్డాను. ఆ గొంతులో విషాదం, నీరసం లేవు - సరికదా ఉత్సాహం ధ్వనిస్తోంది. తలెత్తి చూస్తే తండ్రి ఆశయం నుంచి విముక్తి లభించినందుకు రిలీఫ్, తన ఆశయం కోసం కృషి చేయబోతున్నందుకు ఉత్సాహం కలగలిసిన ఓ వింత అనుభూతి అతడి ముఖంలో కనపడింది నాకు.

అప్పుడు నాకు స్ఫురించింది - కాసేపటి క్రితం నరసింహారావు ముఖంలో నేను గుర్తించిన అనుభూతి అదే!

*

రాతి తయారి

కె.ఎ. మునిసురేష్ పిళ్ళై

"హలో!"

"హలోల్లేవ్! హరీఅప్, హరీఅప్. నిద్దర్లేచావా? రాత్రి ఇల్లు చేరేటప్పటికి ఒంటిగంట దాటినట్లుంది కద! ఉరుకు ఉరుకు! అవతల రైతు బిడ్డొకడు ఆత్మహత్య చేసుకున్నాట్ట. బిడ్డంటే మరీ పసివాడేం కాదులే. ఇరవయ్యోళ్ళుండొచ్చట. అప్పులు మరీ లక్షల్లో కాదుగానీ, కుటుంబం బాగా చితికిపోయిందట. పురుగుల మందు తాగి... కలెక్టరాఫీసు మెట్ల మీద రాత్రి..."

"అరనిమిషం గ్యాపిస్తావా..."

"ఎందుకూ?"

"చిటికెలో వస్తా."

ఆ మిష మీద నేను కదల్లేదు గానీ, అవతల ప్రవాహం ఆగింది. కాసేపట్లో మళ్ళీ నేనే అన్నా...

"ఆఁ! కానీ..."

"అదే చెప్తున్నా కద! కలెక్టరాఫీసు మెట్ల మీద రాత్రి ఏ వేళలోనో పురుగుల మందు తాగి పడిపోయాట్ట. ఇంకా బాడీ అలాగే ఉందిట. పోలీసులు వచ్చి తీసేసేలోగా మనం అక్కడుండాలి. విజువల్స్ అదిరిపోవాలి.



ఎదురుగా ఏదైనా పెద్ద బిల్డింగుంటే మనవాణ్ణి ఎక్కించి ఏరియల్ వ్యూ తీయించు. పురుగుల మందు తాగాడు కద... నోట్లో నురగలు, ఈగలు ముసరడాలు అన్నీ క్లోజప్‌లో క్లియర్‌గా ఉండాలి... విజువల్స్ వెంటనే రావాలి. ఇప్పుడు క్యాప్సూల్‌లోనే వేసేస్తాం... వింటున్నావా... హ...లో...''

"హల్లోల్లేవన్నావుగా...''

"సో, వింటున్నావన్నమాట. అర్థమైందా మీ కెమెరామెన్‌ను వెంటనే పట్టుకెళ్ళు. హరీఅప్. మత్తొదిలిందా... లేదా...?''

"అరగంటలో విజువల్స్ వస్తాయ్. నీకు తెల్సిన సమాచారం రాసేస్కుని చూపించెయ్. వివరంగా మధ్యాహ్నానికి ఇస్తా...''

"ఓకే. మరీ...''

"అరక్షణంలో నువ్వు సెల్ కట్టెయకపోతే, సెల్‌లోంచి కాష్మోరా ప్రయోగిస్తా... చచ్చూరుకుంటావ్...''

"అంతొద్దులే,'' పదం పూర్తి కాకుండానే కట్ అయిపోయింది. నేను మాత్రం సెల్ అలాగే పట్టుకుని అన్నాను.

"విజువల్స్ ఎలా కావాలో విన్నావ్‌గా.''

"ఆఁ! ఆఁ! వెంటనే వెళ్ళాలా. ఇప్పుడే లేచాగా. ఇంకా...''

"ఏడిశావ్‌లే! ఏదో పెళ్ళిచూపుల కెళ్తున్నట్టు. నిద్రలో ఏ అవతారంలో ఉన్నావోగానీ త్వరగా ఉరుకు. విజువల్స్ వెంటనే పంపేయ్. సద్దుమణిగాక, కాల్ చేశావంటే పరిస్థితి బట్టి స్పాట్‌కో, లేదా వాడి సొంత ఇంటి దగ్గరకో వచ్చి జాయినైతా.''

"ఓ.కె.''

"కదులిక!''

✤

'చిటికెలో వస్తా'నంటూ అవతలివాణ్ణి లైన్లో పెట్టి, నేను చేసిన పని అదీ. మా కెమెరామెన్‌ను సెల్ కాన్ఫరెన్స్‌లోకి తీసుకున్నాను. అవతలివాడి ఉపదేశం మొత్తం వినిపించేశాను. మళ్ళీ మనకు కంఠశోష లేకుండా. చివరగా ఆ ప్రకారం అన్నీ చేసెయ్‌మని పురమాయించేయడమే మన పని.

ఎలక్ట్రానిక్ మీడియాలో రిపోర్టింగ్ చచ్చేంత చావు. పేపర్లలో పన్చేసినంత కాలం ఓ మోస్తరు సంఘటన ఏది జరిగినా రాత్రి పది గంటల్లోగా వివరాలు ఫోన్ల మీద తెలుసుకుని వార్త రాయడం అలవాటైపోయింది. టీవీల్లో, అది కూడా నిరంతరాయ వార్తా ప్రసారాలు వచ్చేసిన తర్వాత - 'ఎవ్రీ సెకండ్ కౌంట్స్,' అంటాడు మా బాస్. హైదరాబాదు డెస్కులో ఓ టోల్ ఫ్రీ నెంబరు ఫోను ఏర్పాటు చేశాక మరీ... మా దుంప తెగుతోంది. రాష్ట్రంలో ప్రతివాడూ ఏ చిన్న సంఘటన వాడి కంటబడినా వెంటనే ఫోన్చేసి చెప్పేస్తున్నాడు. ఇక మొదలవుతుంది హైరానా. మీ ఊళ్ళో ఫలానా ఘోరం జరిగింది, ఇంకా తెలుసుకోకపోతే ఎలా? వెళ్ళు, వెళ్ళి విజువల్స్ త్వరగా పంపు... అంటూ అడుసుకయ్యలో కదలని కాడెద్దును ములుగ్రతో అదిలించినట్లుగా వెంటబడుతూనే... ఉంటారు. ఒక్కోసారి ప్రాణం ఎంత

"ఏడిశావ్‌లే! ఏదో పెళ్ళిచూపుల కెళ్తున్నట్టు. నిద్రలో ఏ అవతారంలో ఉన్నావోగానీ త్వరగా ఉరుకు. విజువల్స్ వెంటనే పంపేయ్. సద్దుమణిగాక, కాల్ చేశావంటే పరిస్థితి బట్టి స్పాట్‌కో, లేదా వాడి సొంత ఇంటి దగ్గరకో వచ్చి జాయినైతా."

విసిగిపోతుందంటే... ఈ వెంటబడే వాళ్ళ ఫోన్లన్నీ మాట్లాడేలోగా పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది.

నా పరిస్థితి కొంత మెరుగు. పని చేయడం మర్చిపోయి, ఫోన్ల మీద పని చెప్పడమే పనిగా హైదరాబాదు ఆఫీసు పదవిలో ఉన్నవాడు నా పాత మిత్రుడే. పైగా, ఆ చనువుకు అదనంగా నేను అపార అనుభవమూ గడించేశాను. ఎంతగా అంటే మిన్ను విరిగి మీద పడ్డా... విజువల్స్ నిమిషాల్లో హైదరాబాద్ చేరేలా కిందివాళ్ళను తరుముతూ... నేను మటుకు నింపాదిగా రిపోర్టింగు చేయడం అలవడిపోయింది. ఆ అలవాటుకొద్దీ ఇప్పుడు కూడా రమేష్‌ను స్పాట్‌కు పంపేసి, ఎటూ నిద్ర చెడింది కనుక ఓసారి పడుకున్న భంగిమలోనే బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాను.

రిమోట్ అందుకుని టీవీ ఆన్ చేశాను. బ్రేకింగ్ న్యూస్ వస్తోంది. 'ఒంగోలు కలెక్టరు కార్యాలయం మెట్ల మీద యువరైతు ఆత్మహత్య!' వెంటనే మా పోటీ ఛానల్ కెళ్ళాను. ఏదో చర్చ నడుస్తోంది. చర్చ కోసం కాదుగానీ, అలాగే ఓ పదినిమిషాలు ఆ చానల్ చూస్తూ గడిపాను. అదే చర్చ! థాంక్ గాడ్ వీడింకా వేయలేదు. దీనికంటే బెటరనుకుని కాసేపు ఎఫ్ టీవీ ట్యూన్ చేశాను. పొద్దున్నే మత్తు వదలడానికి బెడ్‌కాఫీ కంటే మంచి రిఫ్రెష్‌మెంట్ అయిపోయింది ఇది నాకు. మళ్ళీ పోటీ ఛానల్‌లోకి వెళ్ళేసరికి వాడు కూడా బ్రేకింగ్ న్యూస్ ఇచ్చేశాడు. ఎలక్ట్రానిక్ మీడియాలో ఇదో తలనొప్పి. సమాచారం వరకూ యథేచ్ఛగా కాపీ జరిగిపోతుంది. అడిగే దిక్కులేదు. మళ్ళీ మా ఛానల్‌లో కెళ్ళాను. వార్తలు మొదలై, మొట్టమొదటే రైతు శవం విజువల్ వేసేశారు. 'వెల్‌డన్ రమేశ్,'' మనసులో అభినందించేశాను.

ఇక పర్లేదు. ఓ కునుకు తీసి కదలొచ్చు. టీవీ కట్టేసి కళ్ళు మూసుకున్నాను. కునుకుకు స్పీడ్ బ్రేకర్‌లాగా మళ్ళీ సెల్ మోగింది.

"అన్నా, బాడీ క్లియర్ చేసేశారు. పోస్టుమార్టం తర్వాత వాళ్ళ పల్లెకు తీసుకెళ్ళిపోతారు. నువ్వు హడావుడి పడొద్దు. మనం భోంచేసి అక్కడికెళ్తే చాలు.''

వీడికి నామీద ఎంత నమ్మకమో!

"సర్లే. నువ్వు ఇంటికెళ్ళి, భోంచేశాక ఇటొచ్చెయ్! వస్తూ ఓ బిర్యానీ పార్సిల్ పట్రా.''

ఇక పూర్తి కునుకే తీయొచ్చు. సమాచారం తెలిసి మనసు నెమ్మదించగానే సెల్ స్విచ్చాఫ్ అయిపోయింది! కళ్ళు మూతలు పడిపోయాయి.

✤

"రేయ్ నీకు బుద్ధుందా! ఇంత దూరం, చెత్తరోడ్డు అని తెలిస్తే కారు తెచ్చుకుని బిల్లు పెట్టేవాళ్ళం కదా!'' కోప్పడ్డాను.

"ఈ ఒక్కసారికి సర్దుకో అన్నా. ఈసారెపుడైనా మన పక్కింటివాణ్ణే ఆత్మహత్య చేసుకోమని చెబ్దాం. దూరం వెళ్ళే శ్రమ లేకుండా...''

నాకూ నవ్వొచ్చింది. "ఎందుకూ? నువ్వే ఆత్మహత్య చేసుకో! విజువల్స్ కోసం నా పాట్లేవో నే పడ్తా...'' మెత్తగా అంటించాను.

వాడూరుకోలేదు. "ఆ పరిస్థితి తెప్పిస్తావని నాకు తెలుసు," ఒకింత శ్లేషగా అంటించాడు.

మాటల్లోనే ఆ ఊరొచ్చేసింది.

ఇల్లు కనుక్కోవడం కష్టం కానే కాదు. ఏడ్చే వాళ్ళుంటే కళ్ళు తుడవడానికి మనలో చాలామంది దయాత్ములు ఉంటారు. అలాంటి గుంపు కనపడిన చోట ఆగాం. అందరూ తలో రకంగా సానుభూతి కురిపిస్తున్నారు. అదొక చిన్న చుట్టు గుడిసె. ముందర తాటాకు కప్పిన చిన్న పందిరి ఉంది. ఇంటి గడప దగ్గరే నలుగురు ఆడవాళ్ళు కూర్చుని ఉన్నారు. వారిలో మరీ వయసు మీరని ఓ ముసలమ్మ, ఎండిపోయిన ఒళ్ళు. శిథిలమైపోయిన గుడిలాగా ఉంది. అప్పటికే అలసిపోయినట్లుంది. స్పృహ తప్పిందేమో! మరో మహిళ పాదివి పట్టుకుని ఉంది. నిశ్శబ్దంలో క్రమం తప్పకుండా ఏడ్పు తాలూకు వెక్కిళ్ళు. అప్పుడప్పుడూ 'నా బిడ్డ నా బిడ్డ,' అంటూ గొణగడం... వినిపిస్తున్నాయి.

"ఎప్పెని అడిగా. ఇంకా గంట పడుతుందిట."

అందుకే నాకు రమేశ్ అంటే ప్రేమ. మన సమయం వృథా కానివ్వడు. సమాచారం మోసుకొచ్చేస్తుంటాడు. మిగిలిన ఛానల్స్ వాళ్ళింకా రాలేదు. అక్కడి గుంపులో జొరబడి నలుగురిని మైక్ ముందు మాట్లాడిస్తే సరి. పెద్ద స్టోరీ అయిపోతుంది. ఇవాళ్టికి అది చాలు. రేపు మళ్ళీ ఫాలో అప్‌కు కొంత దాచుకోవాలి. దానికోసం అరగంట చాలు.

"సరే, పద!" పాలం వైపు నడిచాను. లైటర్ ఉందో లేదోనని జేబు తడుముకుంటూ.

✤

ఎప్పె నోట్లో ఎప్పుడూ నిజం రాదు. శవం వచ్చేసరికి రెండు మూడు గంటలు దాటింది. మా సిగరెట్టు ప్రేమ కూడా కొంత లాభం తెచ్చింది. తెలియకుండానే అయినా మేం వెళ్ళింది ఆ చచ్చిన రైతు పాలంలోకే.

బీళ్ళు పడ్డ పొలాలు. ఎండిన చెట్లు... సారీ, మొక్కలు... ఛ... ఏమందాం... నారు. ఓకే. ఎండిన వరి నారు.

అద్దిరింది. 'రోజూ తమ దరికి వచ్చి ఆశగా చూసి, ఆకాశాని కేసి చూసి కాసేపు గడిపి వెళ్ళే నేస్తం... దిగంతాలకు వెళ్ళిపోయాడని ఈ ఎండిన వరికి, గుండె పగిలిన పొలానికి ఏం తెలుసు పాపం...' అంటూ వాయిస్ ఓవర్ వేసి ఈ విజువల్స్ చూపించామంటే పేలిపోతుంది. కానివ్వమంటూ అన్నీ షూట్ చేయించాను.

తిరిగి ఊళ్ళోకి వచ్చి అందరితో మాట్లాడాం. వినీ వినీ అరిగిపోయిన పాత రికార్డులాగా... అన్నీ మామూలు బాధలే. కరువు, అప్పులు, ఆకలి గట్రా గట్రా... కొత్తగా ప్రెజంట్ చేయడానికి మంచి పాయింటేం దొరకలేదు. అంతా పూర్తయి గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నప్పుడు... వచ్చింది పోలీసు జీపు. అందులోంచి అన్ని ఛానెళ్ళ వాళ్ళూ బిలబిలమంటూ దండులా దిగి ఉరికారు. మా రమేశ్‌కు కొత్తగా నేర్పక్కర్లేదు.

దాని వెనుకే అంబులెన్సు.

పొద్దు గుంకడానికి ఇంకా కొంత వేళే ఉంది. ఆ లోగిలి మాత్రం వీడియోలైట్లతో మధ్యాహ్నంలా వెలుగుతోంది.

ఊళ్ళో వాళ్ళు ఒకరిద్దరు చేయందిస్తే పోలీసులు బాడీ తీసుకెళ్ళి పందిట్లో పడుకోబెట్టారు.

"అమ్మా బిడ్డొచ్చినాడు..."

ఆ ముసలమ్మను పాదివి పట్టుకుని ఉన్న ఇంకో తల్లి మెల్లగా గొణిగింది.

అంతసేపూ స్పృహలో లేనట్లుగా శవంలా పడి ఉన్న ఆ ముసలామె దిగ్గున లేచింది. తను పడి ఉన్న గడపకీ, పందిట్లో శవానికీ నాలుగంగలే! అయినా, ప్రవాహంలా ఉరికింది. దిక్కులు బెదిరిపోయేట్టు, 'నాయినా నా బిడ్డా...' అని బొంగురుపోయిన గొంతుతో బిగ్గరగా అరిచింది. దబ్బున కుప్పకూలిపోయింది. శోకం ఆమెను ఆకులా ఊపేస్తోంది.

గుడ్డలో చుట్టి ఉన్న కొడుకును పాదాల దగ్గర్నుంచి తల వరకు తడిమి తడిమి చూసుకుంటోంది. పొగిలి పొగిలి ఏడుస్తోంది. బుగ్గలు పుణికి పుణికి ముద్దు పెట్టుకుంటోంది.

"నేనేనమ్మా నా బిడ్డను సంపేసిందీ... నేనేనమ్మా! దొంతికుండ నిండుకుందని నా నోటితో నేనే జెప్పినానమ్మా... సంపేస్తినే...! నాలుగ్గింజలు అడక్కొచ్చయినా కాసింత గంజి గాసి పోస్తా నాయినా... లెయ్ నాయినా... కొంపలో బియ్యం లేవని ఇంకెప్పుడూ చెప్పనే చెప్పన్నాయినా... ఇంక చెప్పనే చెప్పను... లేసి రా నాయినా..." ఏడుపులో కలిసిపోయి ఆ అరుపులు గరగరమని వినిపిస్తున్నాయి.

మనవాళ్ళంతా జూమ్ లెన్సుల్లోంచి ఏడుపు అద్భుతంగా ఉండేలా విజువల్స్‌ను బంధిస్తున్నారు. డిటిఎస్ వంటి ఎఫెక్టుల కోసం కొందరు కాలర్ మైకులు కూడా తెచ్చారు. కానీ, ఆవిడకు దాన్ని అమర్చేంత వ్యవధి వారికి చిక్కనట్టుంది పాపం! మామూలు మైకులు పట్టుకుని కుస్తీలు మొదలెడుతున్నారు.

మావాళ్ళ పని కత్తి మీద సాము. నిజానికి ఆ మైకు పట్టుకుని అడిగే పని నాదే! కానీ మావాడు సమర్థుడు కాబట్టి, ఓ గ్రామస్తుడి చేతికి మైక్ ఇచ్చి ఆ గుంపులోకి నెట్టాడు. ఓవైపు ఆవిడ పొర్లిపొర్లి ఏడుస్తోంటే... రాష్ట్ర ప్రజానీకానికంతటికీ మెరుగైన సమాచారాన్ని అందించడం కోసం ఇంత కష్టపడాల్సి రావడం మాకు కత్తి మీద సాము కాక మరేంటి. ఒక్కొక్కరూ వరపరంపరగా ప్రశ్నలు గుప్పిస్తున్నారు.

"అమ్మా! చెప్పండి, మీ కొడుకు ఆత్మహత్యకు కారణం ఏమనుకుంటున్నారు?"

"ప్రభుత్వం ఉచిత విద్యుత్తు, రుణాలు ప్రకటించినా ఆత్మహత్య చేసుకున్నాడంటే ఆ హామీలు రైతులకు సంతృప్తిగా లేనట్లేనా అమ్మా?"

"మీ కుటుంబం దీనస్థితిలో ఉందని సాయం అడిగితే, ప్రభుత్వ పరంగా ఆదుకోవడానికి మీ ఎమ్మెల్యే తిరస్కరించాడా...?"

"గత ప్రభుత్వ నిర్వాకాల వల్లే మీ కుటుంబం ఆర్థికంగా చితికి పోయి, ఇప్పుడు ఆత్మహత్యకు దారి తీసిందా..."

"ఈ పల్లెలో భూస్వాములు, పెత్తందార్లు మీబోటి పేద రైతులు బతకనీయకుండా దోచుకు తినేస్తున్నారా... చెప్పమ్మా, చెప్పు?" ఒకడి గొంతులో ఆవేశం వెల్లువెత్తేస్తోంది.

మావాళ్ళు... ఎవడికి ఎలాంటి సమాధానం కావాలో, దానికి తగ్గట్టుగా ప్రశ్నల్ని తయారుచేసుకుని ఆ తల్లి మీదికి వదులుతున్నారు.

ఆమెకు మాత్రం ఈ లోకం పట్టినట్లు లేదు. ఏడ్చి ఏడ్చి అలాగే ఊపిరి వదిలేయాలన్నట్లుగా, ఊపిరి వదిలేసే వరకూ అలాగే ఏడుస్తూ ఉండాలన్నట్లుగా... శృతి పెంచుతూ, తగ్గిస్తూ ఏడుస్తోంది.

నేను టౌనుకు వెళ్ళగానే ఎలాంటి స్టోరీలు ఇవ్వాలో అప్పటికే ప్లాన్ చేసేసుకుంటున్నాను. ఇక ఇక్కడేం మిగల్లేదు. ఏదైనా జరుగుతుందేమోనని వేచి ఉన్నాం అంతే! అంటే, రైతు తరపున ఎవరైనా ఆవేశంగా దేన్నయినా ప్రభుత్వ ఆస్తుల్ని తగలబెట్టడం వంటివి, కనీసం ఎమ్మార్వో వస్తే జీపును అడ్డగించి కొంత గొడవ చేసినా చాలు. అలాంటివి జరిగితేనే మజా! వేచి ఉండక తప్పదు మరి! కాస్త దూరంగా వెళ్ళి మళ్ళీ సిగరెట్ అంటించాను. లైటర్ ఆపేలోగా పెదవుల మధ్యనున్న సిగరెట్ ఒక్క ఉదుటున జారి కింద పడిపోయింది. నివ్వెరపోయి అటు పరుగెత్తాను.

ఆమె బిడ్డ మీద పడి ఏడుస్తోంటే మనవాళ్ళ మైకులన్నీ తేనెతుట్టలా మొహాన్ని కప్పేసి ఉన్నాయి. అంతవరకే నేను సిగరెట్‌కు వెళ్లేముందు చూసింది. అప్పటివరకు ఎంతో బలహీనంగా... ఇప్పుడే చనిపోతుందేమో అనిపించేలా ఉన్న ఆమె ఒక్కసారిగా పూనకం వచ్చినదానిలా లేచి నిల్చుంది. ఎప్పుడో జారిపోయిన పైటను లాగి భుజం మీద నుంచి బిగదీసి బొడ్లో దోపింది. చెమటకారి జిడ్డోడుతున్న మొహానికి అతుక్కుపోయి ఉన్న జుట్టు పాయల్ని కొంచెం వెనక్కి నెట్టింది. ఎడమచేత్తో బర్రున ముక్కు చీది కొంగుకు పూసింది. పక్కన మనుషులెవరైనా ఉన్నారేమో కూడా చూసుకోకుండా, బలాన్నంతా కూడగట్టుకుంటున్నట్లు గట్టిగా కాండ్రించి ఉమ్మింది. కుడిరెక్క కాస్త పైకి లేపి, చెమటతో అట్టలు కట్టి ఉన్న రైకకే మూతీ మొహం తుడుచుకుంది. వంగి చేతుల్తో రెండు గుప్పిళ్ళ నిండా మట్టి జవురుకుంది.

మంచి సీన్ నడుస్తోందంటూ మనవాళ్ళు కెమెరా యాంగిల్స్ సరి చూసుకుంటూ మరింత చురుగ్గా పని కానిస్తున్నారు.

విరబోసి ఉన్న జుట్టు... ఏడ్చి ఏడ్చి నిప్పుకణికల్లా కళ్ళు... ఆవేశమో, బాధో, మైకమో ఊగిపోతున్న బక్క పలచటి శరీరం...

సంజె వెలుగు మెరుపు కమ్మిందో... కడుపుమంట ఎరుపు ఎగ జిమ్మిందో... మండే నిప్పుల కొలిమిలాగా ఉన్న మొహం...

నాకు మాత్రం కాళిక కనిపిస్తోంది.

"ముండమోపి ఎదవల్లారా...!"

ఒక్కసారిగా చేతుల్నిండా జవురుకున్న మట్టిని మైకులు పట్టుకున్న వాళ్ళ మీదికి విసిరికొట్టింది.

"నా బిడ్డరా... సచ్చిపాయినాడు రా. మీయమ్మా కడుపులు మాడ. నా బిడ్డ సచ్చిపాయినాడురా... నన్ను ఏడవనియ్యండి రా! నా సావు నన్ను సావనియ్యండి రా! మీకేం పాయ్యేకాలం వొచ్చిందిరా మాదత్యోదుల్లారా... ఈ గొట్టాలన్నీ నా నోట్లో తెచ్చి పెడ్తారేందిరా... కనీసం నా బిడ్డ మీద ఈ కడపటి రోజైనా కళ్ళనిండా కడవడు నీళ్ళు గార్చి ఏడవనియ్యరేందిరా ముదనష్టపు ఎదవల్లారా... మీ పెళ్ళాలు ముండమొయ్యా..."

అరుస్తూ... అరుస్తూ... అరుస్తూ... అలాగే ఒరిగిపోయింది.

స్పృహ లేదు.

ఒకామె పరుగున వెళ్ళి దోసిలితో నీళ్ళు తెచ్చి మొహాన కొట్టింది.

ఆమె బిడ్డ మీద పడి ఏడుస్తోంటే మనవాళ్ళ మైకులన్నీ తేనెతుట్టలా మొహాన్ని కప్పేసి ఉన్నాయి. అంతవరకే నేను సిగరెట్‌కు వెళ్లేముందు చూసింది. అప్పటివరకు ఎంతో బలహీనంగా... ఇప్పుడే చనిపోతుందేమో అనిపించేలా ఉన్న ఆమె ఒక్కసారిగా పూనకం వచ్చినదానిలా లేచి నిల్చుంది.

"బిడ్డా, బిడ్డా..." అని గొణుగుతోంది.

మావాళ్ళ చేతుల్లో మైకులు జారిపోయాయి. ఎవరో ఒక పెద్దమనిషి వచ్చి కసురుకున్నాడు. కెమెరాల కళ్ళన్నీ పక్కకు మళ్ళాయి. కొన్ని రెప్పలు మూశాయి.

తిడితే తిట్టారు గానీ ఒకింత తీరిక దొరికింది లెమ్మని మనవాళ్ళు ఎడంగా వచ్చి సేద తీరుతూ కెమెరాలు వేళ్ళాడేసుకుని భుజం గూళ్ళు ఒత్తుకుంటున్నారు.

అంతలో ఒక్కసారిగా మళ్ళీ కలకలం.

ఓ గుంపు కుర్రాళ్ళు మా వాళ్ళ వెంబడి తరుముతున్నారు. రాళ్ళుచ్చుకు కొడుతున్నారు. అంతా పరుగులు. రమేశ్ కోసం కళ్ళు వెదికాయి. కనపళ్ళేదు. పారిపోయాడా? అయిపోయాడా? దూరంగా ఉండడం మూలాన నేను కూడా తరమాల్సిన మనిషినేనని వాళ్ళు గుర్తించలేదు.

"సంపుతాం కొడకల్లారా," ఏదో ఒక గొంతు గుంపును మరింత రెచ్చగొడుతోంది. అంతలో గుంపులోకి ఎవ్వో జొరబడ్డాడు. "ఇంకేం లేదు లెండి సార్. అంతా అయిపోయింది కదా సార్. పదండి సార్..." సర్దుతూ, తీస్కొచ్చి అందర్నీ హడావుడిగా జీపెక్కించేశాడు బలవంతంగా.

జీపు కదిలింది. తానాగిపోయాడు.

నేనూ ఆగిపోయాను. రమేశ్ కనపడక, చాలాసేపటివరకూ!

✤

"అవునా?" స్వరంలో దిగ్భ్రమ, భయం గమనించేశాడు. మోటారు సైకిలు నడుపుతూనే...

"అవుననన్నా! మరి కుర్రాళ్ళకు అంత కోపమూ ఎందుకొచ్చిందను కున్నావ్? నేను కొంచెం ముందే పసిగట్టా! అందుకే పరుగున వెళ్ళి పక్కనున్న మేడ ఎక్కేశా! మనకేం, మంచి పవర్‌ఫుల్ జూమ్ ఉందిగా!"

ఏం చెప్తున్నాడో వినబడట్లేదు. కళ్ళ ముందు శూన్యంగా ఉంది. గుండె అంతా చీక్‌టైపోయింది. అది మామూల్ది కాదు. క్షణంలో తేరుకుంది. సెల్ అందుకున్నాను. చేరవేయడానికి.

"అయ్యయ్యో..."

"ఇంకా నీలో ఇలాంటివి మిగిలే ఉన్నాయేంట్రా...' ' వెటకార మాడాను.

"సర్లే చెప్పు," గొంతులో తేడా వచ్చింది.

"ముందు బ్రేకింగ్ న్యూస్‌లో ఇచ్చేయ్. వేరే ఛానల్స్ వాళ్ళెవరూ లేరు. చెప్పాగా అందర్నీ తరిమేశారు. విజువల్స్ మనకే స్కోరు. ఇంకెవరికీ దొరకవ్ కూడా! ఇంకో అయిదు నిమిషాల్లో అక్కడుంటాయ్."

"సరే, సరే..." ముక్తసరిగా అంటున్నాడు.

"న్యూస్ బ్రేక్ వరకు ఆగకుండా రాగానే వేసేయ్! రాష్ట్రమంతటా ఇవాళ మన ఘనకార్యంతో అట్టుడికి పోవాలి...

"రాస్కో - 'కొడుకు వెనకే తల్లి... తరగని శోకంతో తిరిగిరాని లోకాలకు...' అని వేశామే అనుకో..."

2005 తానా - కథాసాహితి కథ-నవలల పోటీ
బహుమతి పొందిన రచనలపై సమీక్ష

కథా సమీక్ష

విముక్తుడు
రచయిత: జొన్నలగడ్డ రామలక్ష్మి

ఓ చేయి తిరిగిన రచయిత చదివించే గుణంతో ఓ చిన్న విషయం గురించి రాసిన కథ. కేన్సరుతో బాధపడుతున్న భార్యకు మనసా వాచా తోడుగా ఉండి సేవలు చేసే నరసింహారావూ, కేవలం తండ్రి ఆజ్ఞానుసారం తనకు ఇష్టం లేకున్నా ఐఐటి ఎంట్రెన్స్ కోసం చదువుతున్న సుదర్శనం - వీరిద్దరి గురించి ఈ కథ. భార్యను పోగొట్టుకుని ఆయనా, పరీక్ష తప్పి ఈ కుర్రాడూ, సాధ్యాసాధ్యాలను తమ ఆశయాలకు అనుగుణంగా నిర్ణయించుకోలేకపోవడం నుంచి విముక్తిని పొందుతారు. కథనం సాఫీగా సాగడం, సందర్భోచితంగా పోషింపబడ్డ పాత్రలూ, ముగింపు అస్పష్టంగానే ఉన్నా ఆలోచింపచేసేదిగా ఉండడం, శిల్పరీత్యా ఇది రచయిత నైపుణ్యానికి సూచనలు. ప్రథమపురుషలో మనకు ఈ కథ చెపుతున్న పాత్ర తన చుట్టూ ఉన్నవారిపై చేసే పరిశీలనలూ, అంతర్గత ఆలోచనాధోరణి ఎంతో లోతున్నట్లుగా భ్రమింపజేస్తుంటాయి. సుదర్శనం, నర్సింహారావుల విముక్తుల్ని ఒకే రాటన కట్టడం కృతకంగా ఉంది. మొదట్నించీ ప్రతిదీ సుదీర్ఘంగా విశదీకరించిన నేను పాత్ర చివర్లో చాలా క్లుప్తంగా ముగింపును తేల్చివేసినట్లు అనిపించింది. ఉపోద్ఘాత ధోరణితో మొదలుకావడం, అక్కడక్కడా సంభాషణల్లో అసహజత్వం ఈ కథలో లోట్లు.

రాతితయారి
రచయిత: మునిసురేష్ పిళ్ళై

మన సమాజాన్ని వెల్లువలా ముంచెత్తుతున్న ఎలక్ట్రానిక్ మీడియా అహర్నిశలూ అందించే వార్తాకథనాల వెనుక ఉన్న మీడియా పాత్రికేయుల గురించిన కథ ఇది. ఆకలిచావును కూడా సంచలనాత్మకంగా మార్చి 'ఇప్పుడే అందిన వార్త'లందించే పాత్రికేయుల మనసు ఎలా పాషాణంగా మారిపోయుంటుందో చెప్పే కథ. కథ చెప్పిన తీరు చాలా చక్కగా ఉంది. మాటల పొదుపు తెలిసిన రచయిత. చీకటైపోయిన గుండె మామూల్ది కాదు, క్షణంలో తేరుకోవడమే కాకుండా సాటిగుండెను వెటకారమాడగల్గేంత రాయిగా తయారైపోయిన గుండె అది, అంటూ 'ప్రొఫెషనల్ మెంటాలిటీ' గురించి నాలుగు వాక్యాల్లో ఇమిడ్చిన నాలుగు పేరాగ్రాపుల సారాంశం. ఇంత చక్కగా చెప్పిన ఈ కథకున్న పెద్ద లోపాలు - వస్తువు లేకపోవడం, ఆలోచనాత్మక విశ్లేషణకు తావు నివ్వకపోవడం ద్వారా కథ చదివిన తర్వాత గుర్తుండేదిగా లేకపోవడం, ఒకటే కోణం నుంచి చూపించిన సన్నివేశంలా ఉండడంతో కథలో వెలితి ఏర్పడింది.

నవలా సమీక్ష

నీరు, నేల, మనిషి
రచయిత: సుంకోజి దేవేంద్రాచారి

జనవరి ఒకటి, 2004 నుంచి అదేరోజు 2005 దాకా ఒక్క సంవత్సరంలో ఒక రైతు కుటుంబం గురించి ఈ నవల. తీర్చలేని అప్పులు, ఎదిగిన పిల్లలనూ చూస్తూ గుండె చెరువైపోయిన రైతు రామచంద్ర. పేరుకే పెద్ద రైతు,

కుటుంబమంతా కూలీలతో పాటు పనిచేయాల్సిందే. రెండు మూడు రకాల పంటలేసినా, ఏదో ఒక కారణంగా అవి లాభాలనివ్వకపోవడం, పెరిగిపోతున్న అప్పుల బాధ, గాయపడ్డ ఆత్మాభిమానం, పరువుపోతుందన్న బెంగా, రామచంద్ర చచ్చిపోవడానికి కారణాలు. పరువు కోసం జీవితంలో ఓటమి అంగీకరించడానికి సిద్ధపడ్డ రామచంద్రతో మొదలైన నవల, దూరతీరాల్లో ఎండమావుల కోసం పరిగెత్తి చతికిలబడ్డ కొడుకు బాలకృష్ణ మీదుగా నడిచి, ఆటుపోట్లకు జడవకుండా కష్టాలకు ఎదురొడ్డి నిలిచి జీవితంతో పోరాడి గెలవడానికే నిశ్చయించుకున్న రామచంద్ర భార్య రమణమ్మతో ముగుస్తుంది.

తీసుకున్న వస్తువు కొత్తది కాదు. రైతులు, వారి కుటుంబాలు పడుతున్న వెతలపై చాలా రచనలే వచ్చినై. అయితే, ఒక నిర్ణీత కాలపరిధిని ఎంచుకోవడం, కేవలం కష్టాల చిట్టాపద్దు ఏకరువు పెట్టకుండా, కొంత సహజత్వంతో చేసిన రైతు జీవిత చిత్రణ, గ్రామీణ జీవనంలో ఆర్ద్రమైన మానవ సంబంధాలు ఈ రచనలో చెప్పుకోదగ్గ అంశాలు. అనవసరమైన నిడివి, సుదీర్ఘమైన సంభాషణలూ, చెప్పదల్చుకున్న విషయానికి ఏమాత్రమూ తోడ్పడని సంఘటనలు, సన్నివేశాలు, ఏఒక్క సమస్యనీ లోతుగా చర్చించలేకపోవడం, నవలాంశంపై పాఠకులకు ఒక కొత్త దృక్కోణాన్ని ఇవ్వలేక పోవడం ఈ నవలని బలహీనపర్చాయి. రచయిత నిజాయితీగా పడ్డ శ్రమ, చూపిన శ్రద్ధ మనకి కనిపిస్తూనే ఉంటాయి.

సింగిల్ డైరి

రచయిత: వెల్చేరు చంద్రశేఖర్

చిన్నతనంలోనే పెంపుడుకు వెళ్ళిన ఒక మధ్యతరగతి మనిషి తన జీవనాన్ని విశ్లేషించుకుంటూ చెప్పిన ఆత్మకథ. ఆత్మకథల్లా సాగే నవల రాయడంలో ఓ ఆకర్షణ ఉంటుంది. బహుశా రచయితకి నవలాంశతో ఉండే ప్రత్యేకమైన పరిచయంవల్ల కావచ్చు. ఈ ఆత్మకథ చెప్పే పద్ధతుల్లో, మనకు ప్రధానంగా రెండు రకాల 'నేను'లు కనిపిస్తాయి. ఒక 'నేను' తామరాకుపై నీటిబొట్టులా ఉండి, గోడ మీది నుంచి తదేకంగా గమనించే బల్లిలా తన జీవితాన్ని నిర్విచారంగా దూరం నుంచే ఆవిష్కరిస్తుంది. రెండో 'నేను' తన చుట్టూ ఉన్న సమాజం, వ్యక్తులూ, పరిసరాల ప్రభావాల వల్ల నిత్య రూపాంతరం చెందుతున్న తన జీవన పరిణామాన్ని ఆ పరిధిలో నుంచే మన ముందు నిలుపుతుంది. ఈ నవల్లో రచయిత రెండో నేను కోసం ప్రయత్నించినా, ఒకటో నేనును మాత్రమే సాధించినట్లు అనిపిస్తుంది.

సన్నివేశాలు వాస్తవానికి చాలా దగ్గరగా నిజంగా, నిశితంగా మనసుకు తాకేట్టు ఉన్నై. కొన్ని సన్నివేశాలు మనసును కదిలించేవైతే, మరికొన్ని ఆలోచనను ప్రేరేపించేవి. మచ్చుకి, తల్లి చచ్చిపోవడం, కూతురి పుస్తకాల్లో ప్రేమలేఖ దొరకడం లాంటివి చక్కగా రాయబడిన సన్నివేశాలు. వెంట వెంటనే జరిగిపోయే సన్నివేశాల పరంపర మనల్ని చివరిదాకా చదివించేలా చేస్తుంది. కాకపోతే, అన్ని సన్నివేశాలకు సమానమైన ప్రాముఖ్యత నివ్వడం ఈ నవలలో పెద్ద లోపం. కొన్ని సంఘటనలు ఎందుకు చోటు చేసుకున్నయో, ఆ సంఘటనలు ప్రధానపాత్రపై ఏ ప్రభావాన్ని చూపించినయ్యో, చాలాసార్లు మనకు అర్థం కాదు. ఇలా ఈ నవలలో పాఠకుల్ని పక్కదారి పట్టించే సంగతులే ఎక్కువ. ఉదాహరణకి, ఆఖరి ఇరవై ఐదు పేజీల్లో విస్తరించిన మిత్రుడి కథ ఈ నవలకు పెద్దగా దోహదం చేసినట్లు లేదు. కథకు ఏమాత్రమూ సంబంధంలేని ఆడంబరం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఆల్బర్ట్ కామూ, సిడ్నీ పోటియే లాంటి పేర్లు జొరవిడవడం దీనికో ఉదాహరణ. రచయిత ఎంచుకున్న భాషాశైలి ఈ నవలకు చాలా హాని చేసిందనే చెప్పొచ్చు.

వాస్తవికతకి అతి దగ్గరగా ఉన్న సన్నివేశాలూ, సంఘటనలూ, నిజజీవితంలోంచి వచ్చినట్లున్న పాత్రలూ ఉండి ఒక అద్భుతమైన నవల కావడానికి ఆస్కారం ఉండి కూడా, రచనలో లోపాల వల్ల, ఏమీ కాలేకపోయిన నవలలు ఈ రెండూ కూడా. ఇప్పుడొస్తున్న అనేకానేక రచనల్లానే వీటికి కూడా రచయితకు ఉండవలసిన సంయమనం, సవరింపూ, కుదింపూ లేకపోవడం, ప్రస్ఫుటంగా ఈ నవలల్లో కనిపించిన లోపాలు.

మే 30, 2005
వాడ్స్‌వర్త్, ఇల్లినాయ్

తానా న్యాయనిర్ణేతల కమిటీ



రచయితల వివరాలు

చిత్రం: పద్మాది సాహసయ్య



PSYCHIATRIC SERVICES

Neelakantam Jolepalem, M.D.
Chief of Staff

Henry Woodworth, M.D.
Medical Director

Havenwyck Hospital is a 182-bed JCAHO-approved and licensed psychiatric and substance abuse facility overlooking Lake Galloway in central Oakland County. Havenwyck offers a full continuum of care with specialized psychiatric programs:

- Adult Inpatient Psychiatric Program
- Child & Adolescent Psychiatric Program
- Residential Treatment Center
- Impulse Disorder Program
- Partial Day Hospital Program
- Geriatric Inpatient Psychiatric Program

For assessments & admissions 24-hour a day, call the Intake Center at **800-401-2727.**

Havenwyck Hospital

POH Medical Center

GERIATRIC INPATIENT PSYCHIATRIC PROGRAM

A licensed, short-term psychiatric facility managed & operated by Havenwyck Hospital.

Srinivasa Kodali, M.D.
Medical Director

Hours of Operation
24 hours a day/ 7 days a week

Phone
(248) 338-5588



Description
Geriatric Psychiatry services adults 55 years of age and older with psychiatric issues. The unit has a bed capacity for 20 patients. Provides quality assessment, diagnosis, and treatment. Special attention is given to the rights and needs of this special population, with a focus on assisting the patient in attaining maximized life functioning, while reducing symptoms and dysfunction in a caring and supportive environment.

చిరునామా

ఈ సంచికలోని రచయితల వివరాలు

అట్లూరి శ్రీనివాస్

పుట్టింది, పెరిగింది, చదివింది హైదరాబాదులో. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం. ప్రస్తుతం నివాసం పిట్స్‌బర్గ్‌లో. సినిమాల గురించి రెగ్యులర్‌గా రాసేది తెలుగుసినిమా.కామ్‌లో.

పేజి నెం.: 79



అఫ్సర్

అఫ్సర్ 1980 నుంచి కథకుడిగాను, ఆ తర్వాత కవిగానూ సాహిత్య వ్యాసంగంలో ఉన్నారు. రక్తస్పర్శ, ఇవాళ, వలస అనే కవితా సంపుటాలు ప్రచురించారు. మూడు కవితా సంపుటాలు, ఆధునికత-అత్యాధునికత అనే విమర్శ సంపుటి ప్రచురించారు. ప్రస్తుతం మేడిసన్‌లోని యూనివర్సిటి ఆఫ్ విస్కాన్సిన్ లో పరిశోధన చేస్తున్నారు.

పేజి నెం.: 118

అర్నాద్

యాభై కథలు, నాలుగు నవలలు రాసిన అర్నాద్ పుట్టింది, పెరిగింది విశాఖ పట్నంలో. ప్రస్తుత నివాసం కూడా అక్కడే.

పేజి నెం.: 258



ఆరి ఉష

స్వస్థలం హైదరాబాదు. పెన్సిల్వేనియా, మిషిగన్ యూనివర్సిటీలలో చదువుకున్నారు. మానసిక రుగ్మతలతో బాధపడే వారి మెరుగుదలకై సమాజసేవలో శ్రమిస్తున్న వీరు భర్త సీతారామయ్యతో కలిసి బ్లూమ్‌ఫీల్డ్, మిషిగన్‌లో నివసిస్తున్నారు.

పేజి నెం.: 55



ఆశారాజు

పుట్టింది, పెరిగింది హైదరాబాదులో. కవిత్వం రాస్తున్నదీ హైదరాబాదు గురించే. ఇప్పటికి ఆరు కవితా సంపుటాలు ప్రచురించారు. అనేక పురస్కారాలు పొందారు. హైదరాబాదు ఏజి ఆఫీసులో ఉద్యోగం.

పేజి నెం.: 161



ఉపాధ్యాయుల సూర్యకుమారి

పుట్టింది, పెరిగింది తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో అయితే, ప్రస్తుతం ఉంటున్నది కెనడాలోని అట్టావా నగరం. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో ఉద్యోగం. సినిమాలూ, సంగీతం అంటే తగని మక్కువ. రాజకీయలు అంటే ఆసక్తి. చెప్పే కబుర్లని రాతలుగా మార్చమని ప్రోత్సహించి వెన్నుదట్టి నిలిచిన తల్లి సరళకుమారి అంటే ప్రాణం.

పేజి నెం.: 235



కట్టా గోపాలకృష్ణ మూర్తి

యూనివర్సిటి ఆఫ్ మిషిగన్, ఆన్ ఆర్బర్, ఇండస్ట్రియల్ అండ్ ఆపరేషన్స్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్‌లో అధ్యాపకులు. మానవ జనాభా, టెక్నాలజీల వల్ల పర్యావరణానికి కలిగే నష్టాలను నివారించడానికి దోహదపడే పద్ధతుల మీద వ్యాసాలురాస్తూ, పర్యావరణ పరిరక్షణ చేస్తుంటారు.

పేజి నెం.: 272



కల్పనా రెంటాల

స్వస్థలం కృష్ణా జిల్లా, విజయవాడ. చదువు అంతా విజయవాడలోనే. పాత్రికేయురాలిగా పనిచేశారు. భర్త అఫ్సర్‌తో ప్రస్తుతం విస్కాన్సిన్‌లోని మేడిసన్ పట్టణంలో నివాసం. కథలూ, వ్యాసాలు వ్రాస్తుంటారు.

పేజి నెం.: 132



కాజ లక్ష్మి(మండవ ప్రజాసామ్య లక్ష్మి)

పెదప్రోలు గ్రామం, కృష్ణాజిల్లా వీరి స్వస్థలం. వైద్యవృత్తిలో ఉన్న వీరు కళాకారిణి, రచయిత్రి, ఇద్దరు బిడ్డల తల్లి కూడా. తను, తెలుగు అమెరికన్ లేదా అమెరికన్ తెలుగుయో కాదని, మాతృభూమి కోసం ప్రేమతో తపించే ఒక అమెరికన్‌నని అంటారు. మిషిగన్‌లోని ఫ్రాంక్లిన్ గ్రామంలో నివాసం.

పేజి నెం.: 174



కాట్రగడ్డ దయానంద్

పుట్టింది, పెరిగింది ప్రకాశం జిల్లాలో. ప్రస్తుతం ఉద్యోగం పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో ఒంగోలులో. పండుటాకు కథల సంపుటి, మెతుకు కవితా సంపుటి ప్రచురించారు. గ్రామీణ జీవితాన్ని కథల్లో చూపించడం సిద్ధహస్తులు.

పేజి నెం.: 98



కాత్యాయనీ విద్మహే
అటు ప్రాచీన సాహిత్యాన్ని, ఇటు ఆధునిక సాహిత్యాన్ని అధ్యయనం చేసి, నేటి పరిస్థితులకు అన్వయిస్తూ విమర్శనా గ్రంథాలు ప్రచురించారు. బుచ్చిబాబు సాహిత్యంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.
పేజి నెం.: 138



కొచ్చెర్లకోట బాపారావు
జన్మస్థలం పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరు. పెరిగింది హైదరాబాద్‌లో. ఉన్నతవిద్య చెన్నై, హ్యూస్టన్, లాస్ యాంజెలిస్‌లలో. వ్యాపారం కంప్యూటర్ సైన్స్. వ్యాపకాలు - సాహిత్యం, తెలుగుబోధన, ప్రవాస భారతీయ సంస్కృతి.
పేజి నెం.: 128



కొత్త (మండవ) ఝాన్సీలక్ష్మి
స్వస్థలమైన కృష్ణాజిల్లాలోని పెదప్రోలు గ్రామంలోనే పెరిగారు. ప్రస్తుతం మిషిగన్‌లోని రోజ్‌విల్‌లో నివాసం. సాహిత్యమన్నా విపరీతమైన అభిమానమూ, ఆసక్తి.
పేజి నెం.: 155



కందుకూరి శ్రీరాములు
మెదక్ జిల్లాలో పుట్టి పెరిగిన వీరు ప్రస్తుతం హైదరాబాదులో నివాసం. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. నాలుగు కవితా సంపుటాలు ప్రచురించారు. అనేక పురస్కారాలు పొందారు.
పేజి నెం.: 172



కందాళ శ్రీనివాసాచార్యులు
అన్నామలై విశ్వవిద్యాలయం నుంచి భాషాశాస్త్రంలో ఎం.ఏ., మైసూర్ విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి. పట్టభద్రులు. ద్రావిడ విజ్ఞాన సర్వస్వం మూడు సంపుటాలు, తెలుగు మాండలిక సర్వేలకు తెలుగు సంపాదకునిగానూ, ఈనాడు, తెలుగుపత్రికలకు ఉపసంపాదకులుగాను పనిచేశారు. బహుళ భాషా నిఘంటువు సంపాదక బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం మిషిగన్ విశ్వవిద్యాలయంలో తెలుగు ఉపన్యాసకులుగా పనిచేస్తున్నారు.
పేజి నెం.: 133



కె. శివారెడ్డి
కవిత్వం నాకు సర్వస్వమయింది. నన్ను నడిపించే శక్తి అయింది. నాకు ప్రాణమయింది. నన్ను మనిషిని చేసిందీ అదే! అంటూ తన కవితా దృక్పథాన్ని ప్రకటించిన కె. శివారెడ్డి ఇప్పటికి 14 కవితా సంపుటాలు ప్రచురించారు. అనేక ఇతర భాషా కవితల్ని తెలుగులోకి అనువాదం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం పొందారు. తెనాలిలో పుట్టి పెరిగిన వీరు 40 ఏళ్ళుగా హైదరాబాద్‌లో నివాసం.
పేజి నెం.: 150

కె.కె. రంగనాథాచార్యులు
సాహిత్యం వివిధ దశల్లోని ప్రగతిశీలతను గుర్తిస్తూ, సమర్థిస్తూ ముందుకు సాగే వారిలో రంగనాథాచార్యులు ముఖ్యులు. సాహిత్యానికి సంబంధించిన అనేక అంశాలపై వ్యాసాలు రాశారు, పుస్తకాలు ప్రచురించారు. ఆంధ్ర సారస్వత పరిషత్తు వ్యాస పరంపరకు సంపాదకులుగా పనిచేశారు. హైదరాబాదు కేంద్ర విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేశారు.
పేజి నెం.: 70

కె.ఎ. మునిసురేష్ పిళ్ళె
శ్రీకాళహస్తిలో పుట్టి పెరిగి, ఈనాడు సీనియర్ సబ్ ఎడిటర్‌గా ఉద్యోగం చేస్తున్న వీరు ఇటీవలే కథలు రాయడం ప్రారంభించారు.
పేజి నెం.: 297

కె.యస్. రమణ
కథ, కవిత్వం, విమర్శ - ఈ మూడు ప్రక్రియల్లోను సమర్థుడు. చిత్తూరు జిల్లాలో పుట్టి పెరిగిన వీరు హైదరాబాద్ ఓపెన్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా ఉద్యోగం. కథాసంపుటి, కవితా సంపుటి ప్రచురించారు.
పేజి నెం.: 154



కె.వి. గిరిధరరావు
స్వస్థలం వలపర్ల గ్రామం, ప్రకాశం జిల్లా. భీమవరం, బరోడాలలో విద్యాభ్యాసం. ఒరాకిల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. కాలిఫోర్నియాలోని ప్లెజంటన్‌లో నివాసం. కథలు, కవితలు వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి.
పేజి నెం.: 194



గొడవర్తి హిమబిందు
పుట్టింది, పెరిగింది, చదువుకున్నది హైదరాబాదులోనే. ఎం.సి.ఎ. చేశారు. సంగీతం వినడం, కవిత్వం రాయడం వీరి అభిరుచులు. కథలు, కవితలు వివిధ పత్రికల్లో అచ్చయ్యాయి.
పేజి నెం.: 141



గొర్తి సాయిబ్రహ్మానందం
పుట్టింది, పెరిగింది కోనసీమ, అమలాపురంలో. చదువు ఆంధ్ర విశ్వవిద్యాలయం. భార్య లలిత, బిడ్డలు హర్ష, సుజయ్‌లతో కుపర్టినో, కాలిఫోర్నియాలో నివాసం. ఆటలు, సినిమాలు, వార్తాపత్రికలు వీరి ఇష్టమైన వ్యాపకాలు. సాహిత్యం, నృత్యం, సంగీతం అంటే ప్రేమ. పాతికకు పైగా కథలు, నాటకాలు రాశారు.
పేజి నెం.: 265

గొడవర్తి సుబ్రహ్మణ్యం
పేజి నెం.: 169



గంటి రామ్‌నరేష్
భార్యతో వర్జీనియాలో ఉంటున్నారు. పుస్తకాలు చదవటం ముఖ్య వ్యాపకం. ముఖ్యంగా చలం, రంగనాయకమ్మ, శ్రీపాద మొదలైనవారి రచనలు ఇష్టం.
పేజి నెం.: 199



చాకలకొండ రమాకాంతరావు
వృత్తి కంప్యూటర్ ప్రోగ్రామర్. ప్రవృత్తి శ్రీ వేంకటేవ్వర పాద సంసేవన. ఆ దేవునిపై ఇప్పటికి 2,500 పాటలు రాశారు. పదివేల పాటలు రాయడం జీవితాశయం. శ్రీ వేంకట రమణీయం అన్న పేరుతో విడుదల చేసిన పుస్తకమూ, ఆడియో సిడిలు పిట్స్‌బర్గ్ దేవాలయంలో లభిస్తాయి.
పేజి నెం.: 164



చంద్రుపట్ల తిరుపతిరెడ్డి

రోవన్ యూనివర్సిటి, గ్లస్‌బోరో, న్యూజెర్సి, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగ వ్యవస్థాపకులు, అందులో ప్రస్తుతం ఆచార్యులు కూడా. సాంకేతిక శాస్త్రంలో విద్యార్థులకు మూడు పాఠ్యగ్రంథాలు రాసిన వీరు, మనోగతం అన్న కవితా సంకలనాన్ని వెలువరించారు. డిట్రాయిట్‌లో తెలుగు సమితి సాహిత్య పురస్కారం, వంశీ ఇంటర్నేషనల్ వారి దాశరథి పురస్కార గ్రహీతలు.

పేజి నెం.: 170



జాతశ్రీ

ఖమ్మం జిల్లాలో పుట్టి పెరిగిన వీరు అనేక నవలలు, కథలు రాశారు. గత తానా కథల పోటీలో వీరి కథ చలివేంద్రం కి బహుమతి లభించింది. ప్రస్తుతం కొత్తగూడెంలో నివాసం.

పేజి నెం.: 187



జెజ్జాల కృష్ణమోహన్‌రావు

నెల్లూరులో జన్మించారు. మాతృభాష కన్నడం. మద్రాసు, తిరుపతి, బెంగుళూర్లలో చదువు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ నుండి డాక్టరేట్ చేశారు. తెలుగు, ఇంగ్లీషులలో పద్యరచన, కంప్యూటర్ ఆధారంతో ఛందస్సుపై శాస్త్రీయ విశ్లేషణలు వీరికి ఇష్టమైన వ్యాపకాలు. ఫ్రెడరిక్, మేరీల్యాండ్‌లో నివాసం.

పేజి నెం.: 122, 151

జొన్నవిత్తుల యు.బి.వి. ప్రసాద్

కాకినాడలో జననం. విశాఖపట్నం, హైదరాబాదులలో విద్యా భ్యాసం. సిలికాన్‌వేలీలో సాఫ్ట్‌వేర్ కంపెనీకి టెక్నికల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. చదవటం, వ్రాయటం, నృత్యం, సంగీతం వీరి అభిరుచులు. వీటిని పిల్లలకు నేర్పించడానికి కృషి చేస్తుంటారు. భార్య, ఇద్దరు పిల్లలతో కుపర్టినో, కాలిఫోర్నియాలో నివాసం. వీరికి గురజాడ, చలం, శ్రీపాద, రంగనాయకమ్మ రచనలు ఇష్టం.

పేజి నెం.: 222



జొన్నవిత్తుల శ్రీనాథ్

శ్రీనాథ్ నివాసం, భార్య సుహాసిని, కొడుకు సంజయ్‌లతో, న్యూయార్క్‌లోని లాంగ్ ఐలాండ్‌లో. వృత్తిరీత్యా కంప్యుటేషనల్ ఫ్లూయిడ్ డైనమెక్స్‌లో పనిచేస్తున్నారు. తెలుగు సినిమాలు చూడటం, తెలుగు పాటలు వినటం ఇష్టం తెలుగు లిటరరీ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యక్రమాలకు పనిచేస్తూనే, ఘంటశాల.ఇన్‌ఫో మరియు ఓల్డ్ తెలుగుసాంగ్స్.కామ్ వెబ్‌సైట్లు నడపటం వీరి అభిరుచులకు నిదర్శనాలు.

పేజి నెం.: 286

జొన్నలగడ్డ రామలక్ష్మి

వసుంధర, జొన్నలగడ్డ రామలక్ష్మి జంట రచయితలుగా ఆంధ్రదేశానికి సుపరిచితులు. కొన్ని వందల కథలు రాశారు. వీరి భర్త రాజగోపాలరావుగారు భువనేశ్వర్‌లో అనేక సంవత్సరాలు ఉద్యోగం చేసి, పదవీ విరమణ అనంతరం హైదరాబాద్‌లో స్థిరనివాసం ఏర్పరచుకున్నారు.

పేజి నెం.: 293



జంపాల చౌదరి

జననం చాటపర్రు గ్రామం, గుంటూరు జిల్లా. చదువు తెలుగుదేశంలో అనేక పట్టణాల నుంచి, షికాగో విశ్వవిద్యాలయం దాకా, షికాగో వైద్య కళాశాల మానసికశాస్త్ర విభాగంలో ఆచార్యుడిగాను, నార్త్ షికాగో వి.ఎ. మెడికల్ సెంటర్ అధ్యక్షుడిగాను పదవులు నిర్వహిస్తున్నారు. పుస్తకాలు, సినిమాలు వీరి వ్యాపకాలు. భార్య అరుణ, పిల్లలు వేమన, నన్నయలతో వాడ్స్‌వర్త్, ఇల్లినాయ్‌లో నివాసం.

పేజి నెం.: 79

జి. వెంకటకృష్ణ

కర్నూలు జిల్లాలో పుట్టి పెరిగిన వీరు ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. యాభై కథల వరకు రాశారు. ఇటీవలే కథల సంపుటి ప్రచురించారు.

పేజి నెం.: 252



దర్భశయనం శ్రీనివాసాచార్య

వరంగల్ జిల్లాలో పుట్టి పెరిగిన వీరు ప్రస్తుతం కరీంనగర్ ఆంధ్రాబ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్నారు. 4 కవితా సంపుటాలు ప్రచురించారు. అనేక కవితా పురస్కారాలు అందుకున్నారు.

పేజి నెం.: 156



దేవిప్రియ

గత ముప్పై ఏళ్ళు విరామం లేకుండా కవిత్వం రాస్తున్న దేవిప్రియ పుట్టి పెరిగింది గుంటూరు జిల్లాలో. ఆంధ్రదేశంలోని దాదాపు అన్ని పత్రికల్లోను పనిచేసి ప్రస్తుతం మీడియా కన్సల్టెంట్‌గా ఉన్నారు. ఆరు కవితా సంపుటాలు ప్రచురించారు. అనేక కవితా పురస్కారాలు అందుకున్నారు.

పేజి నెం.: 168



నల్లాన్‌చక్రవర్తుల కిరణ్ (నచకి)

నచకి అన్న పొడి అక్షరాల కలం పేరుతో రాసిన కవితలు, ఛందోబద్ధ పద్యాలు, గీతాలు, కథలు, వ్యాసాలు గతంలో ఇంటర్‌నెట్‌లో వివిధ వెబ్‌సైట్‌లలోనూ, ఎలక్ట్రానిక్ మ్యాగజైన్లలోనూ ప్రచురించబడ్డాయి. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన పోటీల్లో ప్రథమ బహుమతి, (2003), ప్రశంసా పత్రం (2004) పొందారు.

పేజి నెం.: 158, 284

నవోదయ రామ్మోహన్‌రావు

కృష్ణా జిల్లాలో పుట్టి పెరిగిన వీరు గత యాభై ఏళ్ళుగా ప్రచురణ రంగంలో తనదైన ముద్రతో విశిష్ట స్థానం పొందారు. 1960ల్లో నవోదయ ప్రచురణ సంస్థను స్థాపించి అనేక పుస్తకాలు ప్రచురించారు. విజయవాడ పుస్తక మహోత్సవ కమిటీ ప్రారంభకుల్లో ఒకరు.

పేజి నెం.: 91



నాగులపల్లి శ్రీనివాస్

హైద్రాబాదులో పుట్టి, జెఎన్‌టియు, యూనివర్సిటి ఆఫ్ మేరీల్యాండ్‌లలో చదివి, ఓర్లాండో, ఫ్లోరిడాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. అక్కడే నివసిస్తున్నారు. సంగీత సాహిత్యాలంటే ఇష్టము, ప్రేమ కూడా. కంప్యూటర్లో సాఫ్ట్‌వేర్ రచన చేయడం వృత్తి. రచనలు చేయడం ప్రవృత్తి.

పేజి నెం.: 153

నారాయణస్వామి

మెదక్‌జిల్లాలో పుట్టి పెరిగి, హైదరాబాద్‌లో చదువుకొని అమెరికాలో న్యూజెర్సీలో ఉంటున్నారు. రెండు కవితా సంకలనాలు ప్రచురించారు.

పేజి నెం.: 160



నందివాడ ఉదయభాస్కర్

1960లో బెంగుళూరులో పుట్టిన ఉదయభాస్కర్ 1985 నుండి కవితలు, వ్యాసాలు రాస్తున్నారు. అక్షరం సార్థకమవు తుంది పేరుతో ఒక కవితా సంకలనాన్ని ప్రచురించారు. వివిధ పత్రికల్లోనూ, ఇంటర్నెట్ పత్రికల్లోను వీరి రచనలు ప్రచురించబడ్డాయి. ప్లేనో, టెక్సాస్‌లో నివాసం.

పేజి నెం.: 87, 167



పప్పు సూర్యకాంతం

తానా జీవితకాలపు సభ్యురాలుగా తానా ప్రత్యేక సంచికలకు తరచూ తమ రచనలనందించారు. ఆక్స్‌ఫర్డ్, ఒహాయోలో జరిగిన రెండవ తానా యువ సమ్మేళనానికి కార్యదర్శిగాను, సిన్సినాటి తానా ఉత్సవాల్లో స్త్రీమండలి సభ్యురాలిగాను బాధ్యతలు నిర్వహించారు.

పేజి నెం.: 136

పరిగి మదన్‌మోహన్

జననం అనంతపూర్‌లో. ఖరగ్‌పూర్ ఐఐటిలో ఎంటెక్, ఆపై జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటి నుండి ఎంబిఎ చేసి ప్రస్తుతం అక్కడే డైరెక్టర్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజిగా పనిచేస్తున్నారు. భార్య మీనా, పిల్లలు మధురిమ, మకరంద్‌లతో ఉడ్‌స్టాక్, మేరీల్యాండ్‌లో నివాసం. తెలుపు.కామ్ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తూ ఒక తెలుగు బడిని కూడా నడుపుతున్నారు.

పేజి నెం.: 156



పాణిని అరుణ

యూనివర్సిటి ఆఫ్ సిన్సినాటి నుంచి ఎం.ఎస్., కొలరాడో నుండి ఎం.డి డిగ్రీలతో పట్టభద్రులు. పిల్లల పెంపకపు బాధ్యతలు తగ్గిన తరువాత, టెనెస్సీలో గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య సంరక్షణా శాఖలో పనిచేస్తున్నారు. కుటుంబాన్ని, కుటుంబాల్లో ఉండే అనుబంధాల్ని నిర్వచించే ప్రయత్నాల ద్వారా కుటుంబ జీవనాన్ని కాపాడటానికి శ్రమిస్తున్నారు.

పేజి నెం.: 60



పాపినేని శివశంకర్

పుట్టి పెరిగింది, ఉద్యోగం చేస్తున్నదీ గుంటూరు జిల్లాలోనే. కవిగా, కథకుడిగా, విమర్శకుడిగా లబ్ధప్రతిష్ఠులు. నాలుగు కవితా సంపుటాలు, ఒక కథా సంపుటం, ఒక విమర్శనా గ్రంథాన్ని ప్రచురించారు. అనేక కథా, కవితా సంకలనాలకు సంపాదకులు. కథాసాహితికి సహ సంపాదకులు.

పేజి నెం.: 152



పారనంది లక్ష్మీనరసింహం

పాలన - పారనంది లక్ష్మీనరసింహం. పుట్టడం, పెరగడం, కాలేజీ వరకుచదువు పర్లాకిమిడిలో. బరంపురం, ఆంధ్ర విశ్వవిద్యాలయాల్లో పోస్టుగ్రాడ్యుయేట్ చదువు. పాతికేళ్ళ క్రితం టొలిడొ యూనివర్సిటిలో పిహెచ్.డి. ప్రస్తుతం ఒహాయో స్టేట్ యూనివర్సిటిలో మెడిసిన్ డిపార్ట్‌మెంట్‌లో బయో కెమిస్ట్రీలో ప్రొఫెసర్. ఊపిరితిత్తుల వ్యాధులపై పరిశోధన. తెలుగుభాష, సాహిత్యం, అసలు తెలుగు అంటే వల్లమాలిన ప్రేమ.

పేజి నెం.: 147

పుట్టా విప్లవ్

నివసించేది ఓక్లహోమా రాష్ట్రం, హోమ్ ఆఫ్ ఫైవ్ సివిలైజ్డ్ ట్రైబ్స్. రచనలు పెద్దగా సమాజాన్ని మారుస్తాయని కాదు కానీ ప్రపంచాన్ని, అందులో జరుగుతున్న ఇంకా జరిగే విషయాలను అంతో ఇంతో రికార్డు చేయడం ఒక రచయిత బాధ్యత అని నమ్మేవాళ్ళలో ఒకరు.

పేజి నెం.: 248



పుచ్చా అన్నపూర్ణ

పుట్టింది తెనాలి, పెరిగింది కృష్ణా, గుంటూరు జిల్లాల్లో. ఆంధ్రా యూనివర్సిటి నుండి ఇంగ్లీష్ లిటరేచర్‌లో డిగ్రీ. దాదాపు ఇరవైనాలుగేళ్ళుగా లాస్ ఏంజలిస్ దగ్గర్లో నివాసం. పుస్తకాలు, పత్రికలు చదవడం ఇష్టం, హాబీ కూడా. అప్పుడప్పుడు కథలు, గేయాలు రాస్తుంటారు.

పేజి నెం.: 211



పెన్నా శివరామకృష్ణ

ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న వీరి నివాసం హైదరాబాద్. కవిత్వం, విమర్శన ప్రక్రియల్లో పుస్తకాలు ప్రచురించారు. గజల్ వీరి ప్రత్యేక అభిమానం. గజల్ మీద వ్యాసాలు, పుస్తకాలు ప్రచురించారు.

పేజి నెం.: 171



పెద్దింటి అశోక్‌కుమార్

పుట్టింది, పెరిగింది, టీచర్‌గా ఉద్యోగం చేస్తున్నదీ కరీంనగర్ జిల్లాలోని గంభీరావు పేట మండలంలోని మారుమూల కుగ్రామం. తెలంగాణ జనజీవితాన్ని చక్కటి మాండలికంతో తన రచనలోకి అనువదిస్తున్న వీరు ఇప్పటికి రెండు కథా సంపుటాలు ప్రచురించారు.

పేజి నెం.: 229



ప్రతిమ

స్వస్థలం నెల్లూరు జిల్లా నాయుడుపేట. నివాసమూ అక్కడే. యాభై పైగా కథలు రాసిన వీరు షష్టి అనే పేరుతో కథల సంపుటి వెలువరించారు. గత సంవత్సరం తానా కథల పోటీలో బహుమతి లభించింది.

పేజి నెం.: 215



బచ్చేటి శ్రీధర్‌రావు

స్వస్థలం ఏలూరు.చదువు ఏలూరు, విశాఖపట్నం, బెంగుళూరులలో. అమెరికా ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ గుణ పరిశోధనా విభాగంలో ఉద్యోగం. మేరీల్యాండ్‌లో నివాసం. కవితలూ, ఛందోబద్ధ పద్యాలు వ్రాయడం, ఎప్పుడన్నా నాటికల్లో నటించటం వీరి అభిరుచులు.

పేజి నెం.: 104, 157

బిజివేముల రమణారెడ్డి
పేజి నెం.: 275



భద్రిరాజు కృష్ణమూర్తి
ద్రవిడ భాషల మీద పరిశోధన చేసి అంతర్జాతీయ ఖ్యాతిని పొందిన భాషా శాస్త్రవేత్త. కేంద్ర సాహిత్య అకాడమి ఫెలోషిప్ ఇచ్చి వీరిని గౌరవించింది. తెలుగులో వృత్తిపద కోశాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్‌గా పదవీ విరమణ చేశారు.
పేజి నెం.: 66

బండ్ల మాధవరావు
గుంటూరు జిల్లాలో పుట్టి పెరిగిన వీరు, ఖమ్మంలో హైస్కూల్ నిర్వహిస్తున్నారు. ఒక కవితా సంపుటిని ప్రచురించారు.
పేజి నెం.: 164



బండి శ్రీకాంత్
లండన్ నివాసం అయిన వీరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా, ప్రత్యేకించి కంప్యూటర్ గ్రాఫిక్స్ పై పని చేస్తుంటారు. చరిత్ర, ఆర్థిక శాస్త్రాలు చదవడం, బొమ్మలూ, కార్టూనులు గీయడం వీరికి ఇష్టమైన వ్యాపకాలు.
పేజి నెం.: 290



బి. మురళీధర్
ఆదిలాబాద్‌లో పుట్టి పెరిగిన వీరు అక్కడే ఎల్ఐసిలో ఉద్యోగం చేస్తున్నారు. అనేక కథలకి, ఒక నవలకి బహుమతులు లభించాయి. నిరుడు కురిసిన కల అనే తన రచనల సంపుటిని ప్రచురించారు.
పేజి నెం.: 241



ముదిగంటి సుజాతారెడ్డి
హైదరాబాద్‌లోని రెడ్డి కాలేజీలో తెలుగు ప్రొఫెసర్‌గా పదవీ విరమణ చేసిన వీరు ప్రాచీన సాహిత్యం మీద విశేష పరిశోధన చేశారు. మరుగున పడిన తెలంగాణ కథాసాహిత్యాన్ని ప్రచురించే ప్రయత్నంలో నిమగ్నమై ఉన్నారు. తొలితరం తెలంగాణ కతలుకి సంపాదకులు.
పేజి నెం.: 102

మూలా సుబ్రహ్మణ్యం
స్వస్థలం విజయనగరం. పెరిగింది విశాఖపట్నంలో. ప్రస్తుతం బెంగుళూరులో నివాసం. ఇంటెల్‌లో డిజైన్ ఇంజనీరుగా వృత్తి బాధ్యతలు నిర్వర్తిస్తుంటారు. కవితలు, కథలు రాయడం ప్రవృత్తులు.
పేజి నెం.: 221



మెట్టుపల్లి జయదేవ్‌రెడ్డి
కడప జిల్లా, ప్రొద్దుటూరు దగ్గరున్న చిన్నశెట్టిపల్లెలో జననం. సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీలో పనిచేస్తున్నారు. భార్య శారద, కొడుకు శ్రావణ్‌తో చికాగో దగ్గర ఆరోరాలో ప్రస్తుత నివాసం. రెండు మూడు కవితలు అచ్చు అయ్యాయి. రెండు నాటికలు వ్రాసి ప్రదర్శన ఇచ్చారు. కథా రచనలో ఇదే తొలి ప్రయత్నం.
పేజి నెం.: 256



మొనీషా సి. నాయర్
సౌత్‌ఫీల్డ్, మిషిగన్‌లో క్లినికల్ సైకాలజిస్టుగా పిల్లలకు, పెద్దలకు, కుటుంబాలకు సహకరిస్తుంటారు. స్త్రీల సమస్యలు మరియు సాంస్కృతిక సమస్యలను పరిష్కరించటం వీరి ప్రత్యేకత.
పేజి నెం.: 58



మంచికంటి వెంకటేశ్వరరెడ్డి
ప్రకాశం జిల్లాలో పుట్టి పెరిగి అక్కడే టీచర్‌గా ఉద్యోగం చేస్తున్న వీరు ఇటీవలే కథలు రాయడం ప్రారంభించారు. అప్పుడప్పుడు కవితలు రాస్తుంటారు. వీరి కథ మిత్తవకి గత సంవత్సరం తానా బహుమతి లభించింది.
పేజి నెం.: 176



మందపాటి సత్యం
ఆంధ్రా యూనివర్సిటి నుంచి ఎం.ఇ. పట్టభద్రులు. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్‌లో కొంతకాలం పనిచేసి, ప్రస్తుతం వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ మార్కెటింగ్‌గా ఉద్యోగ నిర్వహణ చేస్తున్న వీరు ఆస్టిన్, టెక్సాస్‌లో నివసిస్తున్నారు. వీరు వ్రాసిన 250కి పైగా కథలు, నవలలు, నాటికలు రాశారు. ఇప్పటివరకు ఏడు పుస్తకాలను ప్రచురించారు.
పేజి నెం.: 239



ఎమ్వీ రామిరెడ్డి
గుంటూరు జిల్లాలో పుట్టిన వీరు హైదరాబాద్‌లో ఈనాడు పత్రికలో సబ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. కొన్ని కథలు రాశారు. ఒక కవితా సంపుటి ప్రచురించారు. వీరి పూనికతో ఇటీవల రైతు కవిత వెలువడింది.
పేజి నెం.: 162



యెర్నేని లైల
వారి సొంత మాటల్లోనే 'ఇండియాలో తెలుగు ఆడపిల్లగా పుట్టి పెరిగి, చదివి, ఆపైన అమెరికాలోనూ చదివి, పాతికేళ్ళు డాక్టరుగా పనిచేసి, ఇప్పుడు సుందరమైన సౌత్ వెస్ట్ ఫ్లోరిడాలో సముద్రపుటొడ్డున, నేపుల్స్ నగరిలో పుస్తకాలు చదువులూ, సినిమాలు చూస్తూ, అడపాదడపా రాస్తూ, కాన్వాసుల మీద రంగులేస్తూ, విశ్రాంతి తీసుకుంటున్నా.''
పేజి నెం.: 166, 154

యల్.కె. సుధాకర్
గోదావరి జిల్లాలో ఎస్.టి. కార్పొరేషన్‌లో ప్రాజెక్టు ఆఫీసర్‌గా ఉద్యోగం చేస్తున్న వీరు ఇటీవలే కథలు రాయడం ప్రారంభించారు.
పేజి నెం.: 205



రామిశెట్టి ఎమ్. ఉమామహేశ్వరరావు

నెల్లూరు జిల్లాలో జన్మించిన వీరు తిరుపతిలో ఆంధ్రజ్యోతి ఇన్‌ఛార్జిగా పనిచేస్తున్నారు. అనేక వార్తాకథనాలు, పదిహేను దాకా కథలు ప్రచురించారు. హస్తకళలపై మక్కువ, అభిమానం.

పేజి నెం.: 126



వాసిరెడ్డి సీతాదేవి

తెలుగులో సుప్రసిద్ధ రచయితగా అగ్రశ్రేణిలో భాసిల్లే వీరు 60 పుస్తకాలు ప్రచురించారు. అందులో దాదాపు 40 నవలలే. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో డైరెక్టర్ హోదాలో పదవీ విరమణ చేశారు. కొంతకాలం సెన్సార్‌బోర్డు సభ్యురాలుగా ఉన్నారు. సాహిత్య అకాడమీ బహుమతి అందుకున్నారు. వీరి మట్టిమనిషి ఐతిహాసిక నవలగా పేర్కొంటారు. గుంటూరు జిల్లాలో పుట్టి పెరిగిన వీరి నివాసం హైదరాబాద్.

పేజి నెం.: 75



విఠల జానకీరామశాస్త్రి

పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలి గ్రామం వీరి స్వస్థలం. వేద పండితుల కుటుంబంలో పుట్టిన వీరు వేదాలు, ఉపని షత్తులు, సంస్కారాలు నేర్చుకున్నారు. ప్రస్తుతం ట్రాయ్‌లోని భారతీయ దేవాల యంలో ముఖ్యార్చకులుగా విధి నిర్వహణ. తెలుగు సంస్కృతాల్లో కవిత్వమూ, నాటకాలు రచించారు.

పేజి నెం.: 111



విన్నకోట రవిశంకర్

పుట్టుక అమలాపురంలో,చదువుకాకినాడ, వరంగల్‌లలోనూ. సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌గా ఉద్యోగం. పుస్తకాలు చదవటం, కవితలు, వ్యాసాలు రాయడం వీరి వ్యాపకాలు. కుండీలో మర్రిచెట్టు వీరి ప్రచురింపబడిన కవితా సంకలనం. భార్య శ్రీకళ, పుత్రిక హిమబిందులతో కొలంబియా, సౌత్ కరోలినాలో నివాసం.

పేజి నెం.: 155

వెలగా వెంకటప్పయ్య

గ్రంథాలయ ఉద్యమం నిర్వాహకుల్లో ప్రప్రథములుగా నిలిచే వీరు ఉద్యమ పునర్నిర్మాణానికి విశేషంగా కృషి చేస్తున్నారు. అనేక జానపద గాథల్ని, పిల్లల పాటల్ని సేకరించారు, రచించారు. గ్రంథాలయ సంస్థలో పనిచేసి పదవీ విరమణ చేశారు.

పేజి నెం.: 106



దశగి వేణు (వేద)

అట్లాంటాలోని సదర్న్ పాలిటెక్నిక్ స్టేట్ యూనివర్సిటిలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యక్షాచార్యులు. సాహిత్యావ లోకనం, ముఖ్యంగా ఛందస్సు చదవటం, వ్రాయటం, ఇతర భాషల సాహిత్యాన్ని తెలుగులోకి అనువదించటం ఇష్టం. ఆటా సమావేశపు ప్రత్యేక సంచిక ముఖ్య సంపాదకునిగా, అట్లాంటా తెలుగు సంఘానికి సాహిత్య సంధానకర్తగా పనిచేశారు.

పేజి నెం.: 159, 173



వేమూరి వెంకటేశ్వరరావు

విశాఖపట్నం జిల్లా చోడవరం వీరి స్వగ్రామం. తుని, మచిలీ పట్నాలలో ప్రాథమిక విద్య, డిట్రాయిట్, లాస్ ఏంజలిస్‌లో ఉన్నతవిద్య అభ్యసించారు. ప్రస్తుతం యూనివర్సిటి ఆఫ్ కాలిఫోర్నియా, డేవిస్‌లో ఆచార్య పదవిలో ఉన్నారు. జీవనది, తెలుగు విజ్ఞానశాస్త్ర పద నిఘంటువు వీరి పుస్తకాలు. ప్లెజంటన్, కాలిఫోర్నియాలో నివాసం.

పేజి నెం.: 84



వి. రాజారామమోహనరావు

గోదావరి జిల్లాలో పుట్టిన వీరు హైదరాబాద్‌లో రైల్వేలో ఉద్యోగం చేసి పదవి విరమణ చేశారు. దాదాపు 200 పైగా కథలు, నాలుగు నవలలు రాశారు. రెండు కథల పుస్తకాలు ప్రచురించారు. వివిధ పోటీల్లో బహుమతులు పొందారు.

పేజి నెం.: 197



శంకగిరి నారాయణస్వామి

నాళీ అన్నపేరుతో సుపరిచితులు. కృష్ణా జిల్లా విజయవాడలో జన్మించారు. వరంగల్, కాన్పూర్, ఫిలడెల్ఫియాలలో చదువు. ఫేనుక్ రోబోటిక్స్‌లో మెకానికల్ ఇంజనీర్‌గా ఉద్యోగం. రెండున్నరేళ్ళు మాతృదేశానికి సేవచేసి డిట్రాయిట్ శీతా కాలాన్ని, మిత్రుల్ని విడిచి ఉండలేక ఈమధ్యనే తిరిగి డిట్రాయిట్ నివాసిగా మారారు. సాహిత్యం, సంగీతం, నాట్యం, ప్రకృతి ఆరాధన ప్రవృత్తులు.

పేజి నెం.: 181

సడ్లపల్లె చిదంబరరెడ్డి

దాదాపు పది సంవత్సరాలుగా కథలు రాస్తున్న వీరి నివాసం అనంతపురం జిల్లా హిందుపురం. ఒక కథా సంపుటి ప్రచురించారు.

పేజి నెం.: 269



సాలూరి సుజన

మంచి సాహిత్యాభిరుచి కలిగిన విద్యావేత్తల కుటుంబంలో, ముగ్గురు ఆడపిల్లలలో మధ్యగా పుట్టి, చిన్నప్పటి నుంచి వక్తృత్వం, వ్యాస, గేయ రచనలలో రాష్ట్ర, జాతీయ స్థాయి బహుమతులెన్నో గెలుచుకున్నారు. ఇండియాలో పాలిటెక్నిక్ లెక్చరర్‌గా పనిచేసి, తరువాత భర్త ఉద్యోగరీత్యా 2000లో అమెరికా వచ్చారు. భర్త రామారావు, పిల్లలు మౌక్తిక, ఇతిహాస్‌లతో కలిసి గ్రాండ్ రాపిడ్స్, మిషిగన్‌లో నివాసం.

పేజి నెం.: 165

డా॥ యస్.వి. రామారావు

భారతదేశంలో ప్రముఖ చిత్రకారుడుగా గుర్తింపు పొందిన వీరు గత ముప్పై ఏళ్ళుగా అమెరికాలోని షికాగోలో నివాస ముంటున్నారు. ఇటీవలే భారత ప్రభుత్వం వీరిని పద్మశ్రీతో సత్కరించింది. అనేక విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్ లతో గౌరవించాయి. అప్పుడప్పుడు కవిత్వం రాస్తుంటారు. చిత్రకళ మీద సాధికారికమైన వ్యాసాలు రచించారు.

పేజి నెం.: 163



LanceSoft Inc

pointing towards successful solutions

Technology Expertise

- Application Development
- Application Services
- Business Intelligence
- Configuration Management
- Data Warehousing
- Database
- ERP
- Internet
- Legacy
- Middleware
- Supply Chain Tools
- System Administration
- Testing Tools
- UNIX Administration

Lance Health

Medical Transcription Services

Lance Health offers complete and comprehensive Dictation and Medical Transcription services.

Pick up the phone and dial in, or use a handheld recorder, or dictate on micro-cassette tapes from desktop or handheld recorder, and we will deliver professionally Transcribed documents for your patient charts.

LanceHealth can enhance your Business through its quality service

Differentiators

- Highly Trained Consultants and professionals recruited on a regular basis who are committed to client success.
- Strong adherence to ethics and honesty.
- Transparency and on-time delivery of services.
- Immediate response to customer inquiries.
- Tremendous cost/benefit value.
- Reputation for offering innovative and creative solutions.
- Highly-efficient back-end systems for excellent customer service.

LanceSoft is always reaching out to get the best deal done

For Enquiries Contact :
LanceSoft Inc
11180 Sunrise Valley Dr, # 206
Reston, VA 20191
Email : info@lancesoft.com
Phone: 703-563-1300
Fax: 703-391-7480
www.lancesoft.com

Please mention "T2005" during Enquiries

Ramsoft Systems Inc

Information Technology Projects & Staffing

www.ramsoft.net

Ph: 248-354-0100, E-Mail: info@ramsof.net, Fax: 248-354-3626

Ramsoft Systems, Inc. (RSI) is a 13 years established, full-service (Staffing & Projects) IT Solutions (RightSourcing: onsite, offsite, offshore) Provider. RSI specializes in: ERP, CRM, SCM, EAI, BI/DW, eBusiness, Multimedia, eLearning, HealthCare-IT & Security solutions.

RAMSOFT ADVANTAGES

- Dedicated Immigration & Legal Dept
- Within **24 Hour H1-B** processing
- **PERM / GC** processing
- Established Clientele & Partnerships
- Nationwide Marketing reach
- Career Enhancement: Training/Coaching/Counseling
- Experienced AM, Recruiters, HR
- Good / Proven Business Practices
- State-of-the-Art Staffing System

Full service / End-To-End, Cost-Effective Partner for IT needs

RAMSOFT SERVICE OFFERINGS

- IT Outsourcing-Rightsourcing Onsite/Offsite/Offshore
- Staffing / Staff Augmentation
- Strategic planning & Systems Integration
- On-Demand eLearning solutions
- eBusiness solutions
- EAI /CRM / ERP/ SCM Implementations
- B I / Data Warehousing
- Legacy Systems Transformation
- IT Security consulting / Solutions

*** USA * CANADA * INDIA ***

RSI - IT SECURITY SOLUTIONS

Secure Enterprise Authentication (www.SEAcurity.net)

- Two Factor/Dual Authentication
- Tokens: Smart Card, IButton, Biometric
- Single Sign On Solution (SSO)
- E-Mail & Directory Level Authentication,
- Track Web Apps, websites, Printing
- Monitor & Control Access to Secured Areas



- Fully Integrated, Complete Healthcare Solutions for Healthcare practices & Clinics
- Front Office, Back Office, Practice Management, Electronic Medical Records (EMR)
- HL7 and ASTM connectivity to major laboratories and lab equipment
- HIPAA compliant EDI : Claims, Eligibility Verification, Inquiry & E-Remittance
- Simplified processes for: Physicians, Patients & Staff from Check in to Check out
- Accessible from any location/ Internet with Smart card and two factor Security

WWW.RAMSOFT.NET